
నార్ల వెంకటేశ్వరరావు సమగ్ర సాహిత్యం

(డిసెంబర్ 1, 1908 – 16 ఫిబ్రవరి)

భాగం – 6



నార్ల రచనలు - భాగము 6

ఆంధ్రప్రభ (1942-59), ఆంధ్రజ్యోతి (1960-75) దినపత్రికల కొన్ని సంపాదకీయాలు,

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక (1977), ఆంధ్రజ్యోతి.మాసపత్రిక(1946-47) ల కొన్ని వ్యాసాలు

రచన: నార్ల వెంకటేశ్వరరావు (వి.ఆర్. నార్ల)



ఎడిటర్: డాక్టర్ వెలగా వెంకటప్పయ్య


ప్రచురణ: నార్ల కుటుంబం

.

విషయ సూచి

మూడు దశాబ్దాలు

నార్ల వెంకటేశ్వరరావు




కృతజ్ఞతా సూచకంగా

శ్రీ మూట్నూరి కృష్ణారావు,

శ్రీ ఖాసా సుబ్బారావు ల

ఉత్తేజకర స్మృతికి

మూడు దశాబ్దాలు గ్రంథానికి నార్ల పీఠిక



ఆంధ్రప్రభ దినపత్రిక ఎడిటర్‌గా
శ్రీ నార్ల (1958)

ఎన్ని సంపాదకీయాలను ఇప్పటికి నేను వ్రాసి ఉండాలి? ఖచ్చితంగా లెక్క చెప్పలేను గాని, కనీసం ఆరేడు వేలకుపైగా, వీటిని అచ్చువేస్తే, హీన పక్షం పదిహేను వేల పేజీలకు విస్తరిస్తాయి. ప్రత్యేక వ్యాసాలు, గ్రంథ సమీక్షలు, ఇతర రచనలను కలుపుకొంటే, మరొక అయిదు వేల పేజీలకు దేకవచ్చు.

నా సంపాదకీయాలలో అత్యధిక భాగం దినపత్రికలలో వెలువడినట్టివే. వాటిని వ్రాసింది దైనందిన సంఘటనలపై, తాత్కాలిక సన్నివేశాలపై, తక్షణ సమస్యలపై. అందువల్ల వాటిలో నూటికి తొంభై వంతులైనా పునర్ముద్రణకు నిశ్చయంగా తగవు.

"పోనీ, ఆ మిగిలిన పది వంతులనైనా సంకలనం చేసి, పుస్తక రూపంలో ప్రచురించరాదా?" అని నా పాఠకమిత్రులలో కొందరు కొన్నేళ్లుగా నాకు పదే పదే సూచిస్తున్నారు. వీరిలో ఒకరు "మీరు అనుమతిస్తే సంకలన, ప్రచురణ బాధ్యతలను నేను స్వీకరిస్తాను" అని ముందుకు వచ్చారు. మరొకరేమో "ఆసక్తి కలదుగాని, నాకు శక్తి లేదు. నేను పెద్దవాణ్ణి అయిపోయాను; మీ సంపాదకీయాల సంకలనాన్ని చూడాలని ముచ్చట పడుతున్నాను. నిన్ననే పంట అమ్మగా, ఈ పైకం వచ్చింది. దీన్ని వినియోగించి, నా ముచ్చట తీర్చండి" అంటూ వందరూపాయల నోట్లను కొన్నింటిని (ఎన్నో నాకు తెలియదు) నా చేతిలో పెట్టబోయారు.

"నా పట్ల మీ ప్రేమాభిమానాలకు కృతజ్ఞుడను. కాని, మీ సాలుసరి ఆదాయంకంటె నాదే పెద్దది. నా సంపాదకీయాలలో పునర్ముద్రణకు తగినవి ఏవైనా ఉన్నాయని తోస్తే, వాటిని ఏ నాటికో ఒకనాటికి నేను ప్రచురిస్తానులెండి" అని చెప్పి, ఆయన నూరు రూపాయల నోట్లను ఆయన చేతిలోనే తిరిగి పెట్టి, నిండుమనస్సుతో నమస్కరించి పంపించాను.

ఈ సంఘటనలు జరిగింది ఏడెనిమిదేళ్ల క్రితం. అయినా, నా సంపాదకీయాల సంకలనం విషయమై, వాటి ప్రచురణ విషయమై ఒక నిర్ణయానికి నేను తేలికగా రాలేకపోయాను. అప్పుడే వండి, వార్చి, వడ్డించిన అన్నం వంటిది దినపత్రికలోని సంపాదకీయం. వంట చేతకాక, దాన్ని సరిగా యిగర నివ్వకపోయినా, తోప చేసినా, మాడ్చినా, అది గొంతు దిగదనుకోండి. కాని, నేర్పుగా వండితే, మెతుకు మెతుకు ఒక మంచి ముత్తెంలా మిలమిల మెరుస్తుంది; ఆవిరులు కక్కుతూ నోరూరిస్తుంది. కాని, అదే మర్నాటి పొద్దుటికి చద్దివాసన.

ఈ చద్దివాసన ప్రమాదాన్ని తప్పించుకొనగల సంపాదకీయాలు నేను వ్రాసినవాటిలో ఎన్ని ఉన్నవో నిర్ణయించుకొనడానికి వాటిని నేను భద్రపరచుకోలేదు. కొత్తగా వాటిని సంపాదించాలంటే, 1959వ సంవత్సరానికి పూర్వపు "ఆంధ్రప్రభ" ఫైల్స్ దాని ఆఫీసులోనే కానరావడం లేదని (కొందరు మిత్రుల ద్వారా వాకబుచేయగా తెలిసింది.

ఆంధ్రప్రదేశ్లోని,. చెన్నపురిలోని ముఖ్యమైన లైబ్రరీలవారిని విచారించగా, ఒక్క వేటపాలెంలోని "సారస్వత నికేతనం"లో మాత్రమే అవి ఉన్నట్టు తెలిసింది. అయితే, వేటపాలెంలోనైనా 1947 ప్రారంభం నుంచి మాత్రమే వాటిని పదిలంచేశారు. లండన్లోని ఒక స్నేహితునికి వ్రాయగా, బ్రిటిష్ మ్యూజియంలో గాని, ఇండియా హౌస్ లైబ్రరీలో గాని, ఏ తెలుగు దినపత్రికల ఫైల్స్ లేవని జవాబు వచ్చింది. వాషింగ్టన్లో విచారించగా, కాంగ్రెస్ లైబ్రరీలో ఆది నుంచీ కాక, 1946 నుంచి మాత్రమే "ఆంధ్రప్రభ" సంపుటాలకు మైక్రోఫిల్ము కాపీలున్నట్టు తెలియజేశారు. నా సంపాదకీయాల మాట విడిచి పుచ్చండి; వాటికి ఏపాటి విలువ కలదన్నమాట విడిచిపుచ్చండి; ఇలాగే అన్యుల సంపాదకీయాలను గురించి పట్టించుకొనబోకండి. అయినా, కడచిన నూరు, నూటయాభై సంవత్సరాల తెలుగుదేశ చరిత్రను వ్రాయాలంటే, తెలుగు దినపత్రికల, ఇతర పత్రికల ఫైల్స్ విధిగా కావాలన్న సంగతిని మరచిపోబోకండి. పందొమ్మిదవ శతాబ్దానికి సంబంధించినంతవరకు ఇవి దాదాపు పూర్తిగా అదృశ్యమై పోయాయి. తెలుగులో మొట్టమొదటి పత్రిక ఏదో కూడా ఇప్పుడు మనకు తెలియదు; "సత్యదూత", "వృత్తాంతిని", "వర్తమాన తరంగిణి", "సంవాద కౌముది", "దినవర్తమాని", "హితవాది", "శ్రీయక్షిణి", "సుజనరంజని", "ఆంధ్ర భాషా సంజీవని", "పురుషార్థ ప్రదాయిని" మొదలైనవి ఈనాడు లభ్యం కావు; లభ్యమైతే, కొన్ని చిల్లరమల్లర సంచికలు మాత్రమే. పోతే, వీటి తర్వాత వచ్చిన "వివేకవర్ధని" ఫైల్సుక్కూడా ప్రస్తుతం దొరకవు. హితకారిణి సమాజంలో ఒక ప్రముఖ సభ్యుడు తొమ్మిది నెలల క్రితం నాకు చెప్పిన మాట ప్రకారం, కందుకూరి వీరేశలింగం సంస్థాపకుడుగా, సంపాదకుడుగా చరిత్రను సృష్టించిన ఈ సుప్రసిద్ధపత్రిక చెదురుమదురు సంచికలు పదికిలోపుగానే ఈనాడు రాజమహేంద్రవరంలో ఉన్నాయి. అక్కడనే దాని సంపుటాలు లేకపోతే, మరొకచోట అవి ఉన్నాయని ఎలా అనుకోగలము?

"వివేకవర్ధని" తర్వాత పుట్టి, కొంతకాలంపాటు జేగీయమానంగా నడిచి, అటుపిమ్మట నిలిచిపోయిన "కాంగ్రెస్", "ప్రజామిత్ర", "ప్రజాబంధు", "హితబోధిని", "తెనుగుపత్రిక", "సాధన పత్రిక" మొదలైనవాటి సంగతి చూడబోతే, ఏవో కొన్ని సంచికలు, లేదా ఒకటి, రెండు సంపుటాలు వినా, అవి సయితం నష్టమైపోయినట్టే అని ఈ మధ్య విన్నాను. ఇట్టి వార్తలు వినగా, వినగా కలిగిన బాధతోనే ఇప్పుడు మిగిలి ఉన్న తెలుగు పత్రికల సంపుటాలకైనా మైక్రోఫిల్ము కాపీలు తీయించకపోతే, ఆధునికాంధ్ర చరిత్ర రచనకు కావలసిన "ఒరిజినల్ సోర్సెస్" జీర్ణించి పోగలవని ముఖ్యమంత్రి జలగం వెంగళరావుగారి పేర కొన్నాళ్ల క్రితం ఒక లేఖ వ్రాశాను. ఈ విషయంలో తక్షణ చర్యకు

ఉత్తరువు చేసినట్టు ఆయననుంచి వెంటనే ప్రత్యుత్తరం వచ్చింది. ఎంత త్వరగా, ఎంత క్షుణ్ణంగా ఈ ఉత్తరువు అమలు జరగనున్నదో వేచిచూడాలి. ఈ మాటలను వ్రాస్తుండగా విద్యాశాఖలో డిప్యూటీ సెక్రటరీ శ్రీ బి. రామచంద్రారెడ్డి నుంచి వచ్చిన లేఖనుబట్టి, ఈ కృషి ఈసరికే చురుకుగా ప్రారంభమైనట్టు తెలుస్తున్నది. ఇందుకు ముఖ్యమంత్రికి నా ధన్యవాదాలు.

నా సంపాదకీయాల సంకలనం నుంచి చాలా దూరం వచ్చినట్టున్నాను. అయితే, వాటి సంకలనం కంటె మన తెలుగు పత్రికల సంపుటాలను భావితరాల వారి వినియోగార్థం భద్రపరచడం ఎంతో ముఖ్యం. అందువల్లనే ఈ విషయమై ఇంతగా ప్రస్తావించాను. ఎవరివద్ద మన పాత తెలుగు పత్రికల సంచికలు, లేదా సంపుటాలు ఏమి ఉన్నా, ఎన్ని ఉన్నా, వాటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యాశాఖకు చెందిన ఆర్కైవ్స్ డిపార్టుమెంటుకు పంపించడం సముచితం కాగలదు. మైక్రోఫిల్మ్ కాపీలను యెత్తిన పిమ్మట ఆ డిపార్టుమెంటువారు వాటిని భద్రంగా తిప్పి పంపించగలరని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు.

ఇప్పుడు జ్ఞాపకం తెచ్చుకొనగా, 1945 నాటికే 1944వ సంవత్సరానికి పూర్వపు “ఆంధ్రప్రభ” ఫైల్స్ లుప్తమైపోయినట్టు తోస్తున్నది. ఇటీవలనే కీర్తి శేషుడైన నా మిత్రుడు చక్రపాణి పట్టుదలపై 1945 ప్రారంభంలో నాటి వరకునేను చేసిన విభిన్న రచనలలో కొన్నింటిని “కదంబం” అనే పేరుతో ఒక సంకలనంగా ప్రచురించాను. దానిలో నేను చేర్చినవి 1944లోను, 1945 జనవరి, మార్చి నెలల మధ్య కాలంలోను నేను వ్రాసినవాటిలో తొమ్మిది సంపాదకీయాలను మాత్రమే. ఆ పత్రిక సంస్థాపన 1938 ఆగస్టులో, దానికి ఎడిటర్గా నా నియామకం 1942 మధ్య భాగంలో. అయినా 1942లో గాని, 1943లో గాని నేను వ్రాసిన సంపాదకీయాలలో ఒక్కటైనా నాటి “కదంబం”లో చోటు చేసుకొనక పోవడానికి కారణం అంతకుముందు సంవత్సరాలకు సంబంధించిన “ఆంధ్రప్రభ” ఫైల్స్ గల్లంతు కావడమే అయి ఉండాలి. ఈ ఊహ నిజం కాకపోతే, నాకంటె సంతసించగలవారుండరు.

1944 నుంచి మాత్రమే నా సంపాదకీయాలు లభ్యమైనందున, 1944 1974 సంవత్సరాలమధ్య వ్రాసిన వాటిలో నుంచి కొన్నింటిని ప్రస్తుత సంకలనంలో చేర్చి, దీనికి “మూడు దశాబ్దాలు” అని పేరు పెట్టాను. అంతమాత్రం చేత దీన్ని ఈ మూడు దశాబ్దాల చరిత్రగా భావించరాదు. చారిత్రక దృష్టినుంచి కాక, కొన్ని జీవితపు విలువల దృష్టి నుంచి ఈ సంకలనానికి నా సంపాదకీయాలను ఎన్నిక చేశాను. చారిత్రక విషయాల ప్రసక్తి దీనిలో అసలే లేదని నా తాత్పర్యం కాదు. నడుస్తున్న చరిత్రకే మరొక పేరు జర్నలిజం. అందువల్ల ఈ సంకలనంలోని ప్రతి పుటనుంచి ఏదో ఒక రూపంలో సమకాలిక చరిత్ర తొంగిచూస్తూనే ఉంటుంది. అయితే, ఒక క్రమంలో కాదు, ఒక పద్ధతిలోనైనా కాదు, ఒక తీరూ తెన్నూలేని మెరపుతీగ ధోరణిలో.

భారతీయ సంపాదకులలో నన్ను విశేషంగా ప్రభావితుని చేసినవారు ముట్నూరి కృష్ణారావు (1879-1945) ఖాసా సుబ్బారావు (1896-1961) బ్రిటిష్ సంపాదకులలో నాకు మార్గదర్శకులైనవారు థామస్ బార్న్జ్ (1785-1841), జె.ఎ. స్పెండర్ (1862-1942), డబ్లియు. హెచ్. మ్యాసింగమ్ (1860-1924), సి.పి. స్కాట్ (1846-1932). వీరందరు ఒక వృత్తిగా కాక, జీవిత సాఫల్యానికి ఒక సాధనగా జర్నలిజంలో ప్రవేశించినవారే. వీరందరికి ఏవో కొన్ని స్పష్టమైన, స్థిరమైన, శిష్టమైన జీవితపు విలువలు ఉండేవి. నా శక్తికొలది నేను సయితం ఇట్టి కొన్ని విలువలను

పెట్టుకొనడానికే, వాటిని పాటించడానికే ప్రయత్నించాను. ఈ ప్రయత్నంలో నా వైఫల్యాలు నాకు తెలిసినంతగా ఇతరులకు తెలియవు. త్వరలో డెబ్బై సంవత్సరాలు నిండనున్నా, యౌవనదశలో నేను పెట్టుకొన్న నా జీవితపు విలువల పట్ల నా భక్తి విశ్వాసాలు చలించలేదు, క్షీణించనూ లేదు. ఇదే మాటను, ఇంత గట్టిగా చెబుతూ కన్ను మూయగలిగితే, నా జీవితం వ్యర్థం కాలేదనే భావిస్తాను.

సంపాదకీయాలకు ఓంప్రథమంగా గౌరవ ప్రతిష్ఠలను కూర్చినవాడు బార్జ్. తన ముప్పైరెండవ యేట 1817లో లండన్ "టైమ్స్" ఎడిటర్ పదవిని స్వీకరించిన వెంటనే ఆయన నాలుగు ముఖ్య నిర్ణయాలను చేసుకొన్నాడు:

1 ప్రతికల కర్తవ్యం ప్రభుత్వ భజన కాదు, మంత్రుల పాదసేవ మొదలే కాదు.

2 ప్రజాభిప్రాయాన్ని పత్రికలు వ్యక్తం చేయాలి, ప్రజల యోగక్షేమాలను కాపాడాలి.

3 అవసరమైతే సంపాదకీయాలలో తీవ్రపదజాలాన్ని వాడడానికి సంకోచించరాదు. ("సంపాదకీయం బెల్లంపానకం కాదు, సిసలైన బ్రాంది" అనేది ఆయన సూక్తి);

4 పరిస్థితులు మారినప్పుడు అతఃపూర్వం తాను వెల్లడించిన అభిప్రాయాలకు విరుద్ధమైనవాటిని సంపాదకుడు వెల్లడించవచ్చు.

ఇది చంచలచిత్తంకాదు, అవకాశవాదం కాదు. ఏనాటి పరిస్థితిని ఆనాడు చిత్తశుద్ధితో సంపాదకుడు పరిశీలించాలి; నిలకడ లేనివాడన్న నిందకు భయపడకుండా న్యాయమైనదిగా తాను నమ్ముతున్న దాన్ని నిర్భీకంగా వ్రాయాలి. ఈ సూత్రాలను పూర్తిగా పాటించినందువల్లనే బాంగ్జీ హయాంలో "టైమ్స్" ప్రచారం కొన్ని రెట్లు పెరగగా, దాని సంపాదకీయాల ప్రతిష్ఠ ఎన్నో రెట్లు పెరిగింది.

బ్రిటిష్ జర్నలిజంలో బార్జ్ తర్వాత ప్రథమశ్రేణి సంపాదకీయ రచయితలుగా ఎన్నదగువారు నాకు మార్గదర్శకులుగా నేను పేర్కొన్న వారిలో స్పెండర్, మ్యాసింగమ్, స్కాట్ లతో పాటు జె.ఎల్. గార్విన్ (1868–1947). ఈ నలుగురిలో ప్రత్యేకించి చెప్పుకొనదగినవాడు స్పెండర్. 1895 నుంచి 1921 వరకు 26 సంవత్సరాలకు పైగా ఆయన "వెస్ట్ మినిస్టర్ గెజెట్" ఎడిటర్. ఈ పత్రికలో ఆయన రాసిన మొత్తం సంపాదకీయాలు ఇంచుమించుగా 11,000. నూటికో కోటికో తప్ప ఏదీ 1200 మాటలకు మించేది కాదు, అంతకు తగ్గేదీ కాదు. మధ్య విఘ్నాలు రాకపోతే, దాన్ని ఆయన 75 నిమిషాలలో ముగించేవాడు. దీన్ని రాయడానికి ఆయనకు గరుకు కాగితాలు, సన్నగా ములికి చెక్కిన మూడు మెత్తని పెన్సిల్స్ కావలసివచ్చేవి. దాని స్థానం లోపలి పేజీలలో కాదు, మొట్టమొదటి పుటలో. వార్తల విషయమై, ప్రత్యేక వ్యాసాల విషయమై, గ్రంథ సమీక్షల విషయమై స్పెండర్ స్వయంగా శ్రద్ధ పుచ్చుకొనేవాడు, ఇతర ఆకర్షణలను సైతం కూర్చడానికి యత్నించేవాడు. అయినా "వెస్ట్ మినిస్టర్" ఎన్నడు 17,000 ప్రతులను మించి అమ్మలేదు.

1914వ సంవత్సరానికి పూర్వం దానికి సాలీనా నష్టం పది, పద్నాలుగు వేల పౌనుల మధ్య; అటుతర్వాత నష్టం రెట్టింపుకు పైగా పెరిగిపోయింది. అయినా రాజకీయ, సారస్వత, సాంస్కృతిక రంగాలలో దాని ప్రతిష్ఠ అంతంత కాదు. దాన్ని ముఖ్యంగా దాని సంపాదకీయాన్ని చదవని వ్యక్తి సంస్కారాన్ని శంకించేవారు. “సంస్కారుల మధ్య వున్నామన్న భావంతో మనం చదవగలిగిన పత్రిక వెస్ట్ మినిస్టర్ మాత్రమే!” అని ఒక సందర్భంలో బెర్నార్డ్ షా అన్నాడు.

బాంర్జ్వలె స్పెండర్ కూడా తన ధర్మనిర్వహణకు స్థూలంగా కొన్ని సూత్రాలను పెట్టుకొన్నాడు. వాటిలో ముఖ్యమైనవివి:

1 భాషా వైదుష్యాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నించరాదు; సహజధోరణిలో, సులభశైలిలో, స్పష్టతనే సర్వదా లక్షిస్తూ రాయాలి.

2 “కాని”, “అయినా”, “బహుశా” వగైరాలను ఆసరా చేసుకొంటూపోతే, మీరు చెప్పగోరేదాన్ని సూటిగా చెప్పలేరు. నీళ్ళునమిలే సంపాదకుని రాతలు నీళ్ళు కారుతూనే ఉంటాయి, నిర్జీవంగానే ఉంటాయి.

3 చేదుకషాయాన్ని ఒకేసారి గొంతులో పోయడంకంటే, అంత చేదుకాని మందును నాలుగైదు మోతాదులుగా మధ్యమధ్య కొన్ని రోజుల విరామంతో వాడకం చేయడం మంచిది.

4 భావాలలో తీవ్రత ఎంత పెరిగితే, భాషలో తీవ్రత అంత తగ్గాలి. (మన తెలుగు నుడికారం ప్రకారం, చెప్పుదెబ్బలు కొట్టవలసివస్తే, మెత్తని చెప్పుతోనే కొట్టాలి)

5 మొక్కుబడి తీర్చుకొన్నట్టు కాక, ఏమి రాసినా ధర్మాభినివేశంతో రాయాలి. ఒక్క చిత్తశుద్దిలో తప్ప తక్కిన అన్నింటిలో స్పెండర్, గార్విన్లకు పొద్దెదురు. ఆయన లిబరల్ కాగా ఈయన కన్సర్వేటివ్. ఆయన ఆలోచనాపరుడు కాగా, ఈయన ఆవేశపరుడు. ఆయన నచ్చజెప్పడానికి తపన పడగా, ఈయన రెచ్చగొట్టడానికి ఉత్సహించేవాడు. ఆయన పదాడంబరాన్ని కంటగించుకొనగా, ఈయన రచనకు అదే జీవనాడి. ఎ.జి. గార్డినర్ అన్నట్టు, "వెలుతురు లేని వేడి, గమ్యంలేని గమనం, లక్ష్యంలేని ఉద్విగ్నత” గార్విన్ దౌర్బల్యాలు. అయితే, విలియం కాబెట వలె (1763-1835) గార్విన్ "ఫైటింగ్ ఎడిటర్”.

స్పెండర్ రాసినంత విస్తృతంగా మ్యాసింగమ్, స్కాట్లు సంపాదకీయాలు రాయలేదు. కాని, రాసినప్పుడు మాత్రం సమంజసంగా రాసేవారు, సమర్థంగా రాసేవారు, ధర్మాభినివేశంతో రాసేవారు; శక్తిమంతంగా రాసేవారు. మ్యాసింగమ్, స్పెండర్ వలె 75 నిమిషాలలో కాక, అరగంటలో తన సంపాదకీయాన్ని ముగించేవాడు. తన పత్రికల యజమానులకంటే ఎల్లప్పుడు ఆయన రెండడుగులు ముందు నడిచేవాడు. అందువల్ల పత్రిక తర్వాత పత్రిక నుంచి ఆయన తప్పుకోవలసివచ్చింది. స్కాట్ తన “మాంచెస్టర్ గార్డియన్"కు తానే యజమాని కనుక, ఆయనకు అట్టి ప్రమాదం రాలేదు. వార్తలకంటే సంపాదకీయాలకు ఆయన అధికప్రాధాన్యమిచ్చేవాడు. “గార్డియన్" ప్రచారం

పెరిగితే, అది దాని సంపాదకీయాల మహిమగా ఆయన భావించేవాడట; దాని ప్రచారం తగ్గితే, వార్తావిభాగంలో ఏదో లోపం జరుగుతున్నట్టు విసుగుదల కనబరిచేవాడట.

తాత్కాలికమైన ఉద్రేకంవల్లనో, ఇట్టి మరొక కారణం వల్లనో ప్రజాబాహుళ్యం అపమార్గాన పోతున్నట్టు తాము నమ్మినప్పుడు ఆ మాట చెప్పడానికి మ్యాసింగమ్ కాని, స్కాట్ కాని, ఎన్నడూ వెనుకాడలేదు. బోయర్ యుద్ధాన్ని బ్రిటీష్ ప్రభుత్వం వలె, ప్రజల వలె తాను సమర్థించలేకపోయినందునే మ్యాసింగమ్ "డెయిలీ క్రానికల్" ఎడిటర్ పదవికి రాజీనామా పంపించాడు. అదే యుద్ధాన్ని వ్యతిరేకించినందుకు తనను, తన పత్రికను పెక్కుమంది ఖండించినా, దూషించినా, బహిష్కరించినా, స్కాట్ ఎంతమాత్రం లక్ష్య పెట్టలేదు. స్కాట్ సూక్తులలో అతి ముఖ్యమైనట్టిది Comment is free, but facts are sacred. దీన్ని ఆయన అక్షరాలా పాటించాడు.

ఈ బ్రిటిష్ పత్రికా సంపాదకులలో ఒక్కరినైనా నేను చూడలేదు. వారి సంపాదకీయాలను అంతగా చదవనైనా లేదు. వారి సంపాదకీయాలు కాక, వారి జీవితచరిత్రలు నన్ను ప్రభావితుని చేశాయి. కాగా, నాకు శ్రీ ఖాసా సుబ్బారావు, శ్రీ ముట్నూరి కృష్ణారావు సన్నిహితంగా తెలిసినవారు; వారి మనఃప్రవృత్తులు, వారి రచనాపద్ధతులు నేను ప్రత్యక్షంగా గమనించాను. బాంర్జ్ వలె స్వవచన వ్యాఘాతనింద తనపై తరచు రాగా, ఆయన చెప్పిన సమాధానాన్నే ఖాసా కూడా చెబుతూ ఉండేవాడు.

స్పెండర్ కంటే కూడా తన సంపాదకీయ రచనకు ఖాసా ఎక్కువ సమయం తీసుకొనేవాడు. స్పెండర్కు కావలసినవి గరుకు కాగితాలు కాగా, ఈయనకు కావలసినవి నునుపు కాగితాలు. అవి ఫూల్ స్కేప్ సైజులో అర తావులై ఉండాలి. వాటిని పెట్టుకొనడానికి ఒక కొయ్యపలక కావాలి. టేబుల్ వద్ద కుర్చీలో కూర్చున్నా, ఒక కాలు మడిచి, దానిపై కొయ్యపలక ఆన్చి, మెత్తగా వ్రాసే ఫౌన్టెన్ పెన్తో అక్షరాలను చెక్కుతున్న ధోరణిలో వ్రాయాలి. ప్రతి అక్షరం ఆణిముత్తెంవలె ఉండాలి. పంక్తులు సమానాంతర రేఖలవలె సాగాలి. ఆయన భాషలో పదాడంబరం లేకపోయినా, సరళత తక్కువ. అయితే ఆయన చిత్తశుద్ధి, ఆయన నిర్భీకత ఆయన సంపాదకీయాలకు నిశితత్వాన్ని కూర్చేవి. అభిప్రాయ స్వేచ్ఛకై, అన్యాయ ప్రతిఘటనకై ఆయన ఎన్ని సార్లు రాజీనామా చేశాడో లెక్కలేదు. ఆయన జేబులో దమ్మిడీలేని రోజులున్నా, రాజీనామా లేఖలేని రోజు లేదేమో! శ్రీ ఖాసా సుబ్బారావు దినపత్రిక నుంచి వారపత్రికకు, వార పత్రిక నుంచి దినపత్రికకు మారిన సందర్భాలనేకం; శ్రీ ముట్నూరి కృష్ణారావు జర్నలిజం "కృష్ణాపత్రిక"తో ప్రారంభమై, దానితోనే ముగిసింది. సోమవారం నుంచి, గురువారం వరకు ఆయన ఏమి చదివినా, ఏమి చింతన చేసినా, ఏమి చర్చించినా, ఒకే ఒక విషయంపై ఆయన దృష్టి లగ్నమై ఉండేది. అది - ఆ వారపు "కృష్ణాపత్రిక" ప్రధాన సంపాదకీయం. నిజానికి అరుదుగా తప్ప ఒకే వారంలో రెండు విషయాలపై ఆయన సంపాదకీయాలను వ్రాసేవాడు కాదు. నాలుగు రోజుల తపస్సు తర్వాత అయిదవ రోజున శుక్రవారం ఉదయాన - సంపాదకీయ రచనకు కూర్చున్నప్పుడు జెట్ విమానం వేగంతో అది నడిచేది. చివరి రోజులలో టేబుల్ వద్ద కాక, పడకకుర్చీలో ఆయన కూర్చునేవాడు. కరక్కాయ సిరాబుడ్డి ఆ కుర్చీదాపులో ఒక నాలుగు కాళ్ల కొయ్యపీటపై ఉండేది. ఇత్తడి పాళీ కలాన్ని సిరాబుడ్డిలో ముంచుతూ, ఎక్కువ సిరా పాళీకి అంటుకొంటే, దాన్ని తన కాళ్ల వద్ద పరచిన పాత న్యూస్ పేపరుపై విదిలిస్తూ, తల యెత్తకుండా, దిక్కులకు చూడకుండా, నడుమ నడుమ ఆగకుండా ఆయన వ్రాస్తూ పోయేవాడు. ముగింపుకు వచ్చేసరికి కాళ్ల దగ్గరి పాత న్యూస్ పేపర్ కరక్కాయ సిరా మరకలతో నిండిపోయి,

అమావాస్య చీకటి కంటె కారునల్లగా కనబడేది. వ్రాతకు కూర్చున్నప్పుడు ఎక్కడ ప్రారంభించాలో తెలిసినా, ఎక్కడ ఆగిపోవలెనో ఆయనకు బహుశా తెలిసేది కాదనుకుంటాను. అసాధారణమైనది ఆయన భావనాపటిమ. ఎక్కడెక్కడికో అది ఆయనను తీసుకువెళ్లేది; దృశ్యం తర్వాత దృశ్యాన్ని కళ్లకు కట్టినట్టు ఆయనకు చూపించేది;

వ్యక్తుల, సమస్యల అంతరాంతరాలను ఆయనకు విశదపరిచేది; అన్నిటినీ మించి, ఆయన రచనకు అద్భుతమైన ప్రావాహిక గుణాన్ని కల్పించేది. అది సాధారణ ప్రవాహమైనా కాదు, నయగరా జలపాతం. ఎంత మేరకు అది దూసుకుపోతుందో తెలియనందున "కృష్ణాపత్రిక"లోని మధ్యనాలుగు పేజీలను దానికోసం ఖాళీగా ఉంచేవారు. ఒక్కొక్క వారం ఆ నాలుగు పేజీలకు అది పూర్తిగా విస్తరించేది; తక్కిన వారాలలో అది మిగిల్చిన చోటును నింపడానికి ఏవో కొన్ని ఇతర వ్యాసాలను సిద్ధంగా ఉంచుకొనవలసి వచ్చేది. ఈ వివిధ సంపాదకుల విభిన్న ప్రభావాలు నా సంపాదకీయాలను, వాటి శైలిని ఏ విధంగా రూపొందించినవో నేను చెప్పదగు మాట కాదు. పోతే, నేను చెప్పదగిన మాట లివి : నా సంపాదకీయం సగటు నిడివి ఏడెనిమిది వందల మాటలు; దాన్ని వ్రాయడానికి నాకు ముప్పావుగంట కావాలి. దానిలో పావు గంట కృత్యాద్యవస్థతో గడిచిపోతుంది. దాని నుంచి బయటపడేసరికి వేస్ట్ పేపర్ బేస్కెట్ సగమైనా నేను చించిపారవేసిన కాగితపు ముక్కలతో నిండుతుంది. ఒకసారి దారిని పడితే, వ్రాత చకచక ముందుకు సాగిపోతుంది. సంపాదకీయ రచనకు ప్రత్యేకించిన సమయంలో నాకు ఏకాంతం కావాలి, ఏకాగ్రత కావాలి. వ్రాతకు పెన్సిల్, ఫౌన్టన్ పెన్, బాల్పాయింట్ పెన్, ఏదైనా ఇబ్బంది లేదు. అయితే, ఇంచుమించు ఎనిమిది అంగుళాల పొడవు, అయిదున్నర అంగుళాల వెడల్పు న్యూస్ ప్రింట్ ప్యాడ్స్ కావాలి. వ్రాసేవి ఏడెనిమిది వందల మాటలైనా అందుకు వాడేవి (చింపి పారవేసేవాటితో సహా) వందపేజీలకు పైగా నేను వ్రాసినదాన్ని కంపోజ్ చేయడానికి ఒక రిద్దరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చుకోవాలి. ఒక్కొక్కసారి నేను వ్రాసింది నాకే అయోమయంగా ఉంటుంది. వ్రాస్తున్నది వ్రాస్తున్నట్టుగా కంపోజ్ అయిపోతుంది. ప్రూఫులలో చేర్పులు మార్పులు అరుదుగా తప్ప జరగవు. గడియారంతో పరుగుపందెం వేస్తూ చేయవలసిన డెయిలీ న్యూస్ పేపర్ ఆఫీసులో అందుకు విరామం లభించదు.

కాగా, ఈ సంకలనంలో చేర్చిన సంపాదకీయాలను గురించి కూడా కొంత చెప్పాలి. కొన్ని సందర్భాలలో పాత శీర్షికలను మార్చవలసిన అవసరం కనబడినందున, ఆ పని చేశాను.

పునరుక్తి దోషాన్ని తొలగించడానికి అక్కడక్కడ కొన్ని వాక్యాలను, లేదా పేరాలను తగ్గించాను. స్పష్టతకోసం కొన్ని భాగాలను స్వల్పంగా సవరించాను. ఉచితమని తోచినచోట్ల నుడికారాన్ని కూడా సవరించాను. అయితే, ఒక్క పనిమాత్రం చేయలేదు.

కడచిన మూడు దశాబ్దాలలో నా అభిప్రాయాలలో కొన్ని నిశ్చయంగా మార్పు చెందాయి, విశేషంగా మార్పు చెందాయి. ఆ మార్పుదృష్ట్యా నా పాతరచనలను సవరించడం అనుచితం కాబట్టి, దాన్ని ఎంతమాత్రం చేయలేదు.

భాష, సాహిత్యం, కళలపై నేను వ్రాసిన సంపాదకీయాలు, ఇతర వ్యాసాలు పదులసంఖ్యలో ఉన్నాయి, వ్యక్తులను గురించి వ్రాసినవి వందల సంఖ్యలో ఉన్నాయి. ఆరోగ్యం మరింత క్షీణించక పోతే, వాటిని మూడు, నాలుగు విడివిడి సంపుటాలుగా ప్రచురించాలని అనుకొంటున్నాను.

సంపాదకీయాలకు నా ముందుతరంలో గల ప్రాధాన్యం నా తరంలోనే తగ్గింది. ఇప్పుడు మరింత క్షీణించింది. ఇది కేవలం మన దేశానికి పరిమితమైన పరిణామం కాదు; దేశదేశాలలో ఇంతే జరుగుతున్నది. ఇందుకు స్పెండర్ వంటి సంపాదకులు అరుదుకావడం ఒక కారణం కాగా, "వెస్ట్ మినిస్టర్" వరసగా పదహారు సంవత్సరాలు తనను నష్టపరిచినా, అందుకు వెనుదీయని సర్ జార్జి న్యూన్స్ వంటి (1851-1910) పత్రికా వ్యవస్థాపకులు కరవు కావడం ఇంకొక కారణం; "మాంచెస్టర్ గార్డియన్" తనదైనా, దానినుంచి సాలుకు 2500 పౌనుల జీతం మాత్రం పుచ్చుకొని, తక్కిన లాభాలను పత్రికాభివృద్ధికై వినియోగించిన సి.పి. స్కాట్ వంటి ఎడిటర్ - ప్రొప్రయిటర్లు మిగలకపోవడం మరొక కారణం. కారణాలేవైనా, నేటి సంఘంలో సంపాదకునికి, అతడి సంపాదకీయాలకు పూర్వపు గౌరవ ప్రతిష్ఠలు లేవు. నా జీవిత కాలంలో సంపాదకుని ప్రతిపత్తి ఇంతగా దిగజారిపోవడం నాకు మరింత బాధాకరం. ఈ శోచనీయ పరిణామానికి నా స్వల్పపరిధిలో నా బాధ్యత ఏపాటి దన్న ఆత్మ సంశోధన ఇటీవల నన్ను ఎక్కువగా కృంగదీస్తున్నది.

సంపాదకునికి లేని గౌరవం అతడి సంపాదకీయాలకు రాదు. విశ్వమానవ దృష్టి, శీలసంపద, ధర్మాభినివేశం లేనివాడు, ఏమైనా కావచ్చుగాని, ఉత్తమశ్రేణి సంపాదకుడు కాలేదు.

నార్ల వెంకటేశ్వరరావు

"లుంబిని", బంజారా హిల్స్,

హైదరాబాదు, 7-7-1976.

భారత స్వతంత్ర సమరం : స్వాతంత్ర్య సాధన

1857



(తొలి స్వాతంత్ర్య సమరం (సిపాయి మ్యూటినీ) జరిగి నూరేళ్ళయిన సందర్భంలో రాసినది)

నూరేళ్ళ క్రితం సరిగా ఈనాడు మే 10వ తేదీని మనదేశంలో ఒక మహావిప్లవం ప్రారంభమైంది. నిజానికి అది ఈ తేదీనాడు ప్రారంభం కావలసింది కాదు. మరొకనాటికి - మే 31వ తేదీకి - అందుకు ముహూర్తం పెట్టబడింది. ఆనాటి వరకు ఆగితే, ఆ విప్లవం బహుశా జయప్రదమై వుండేదే! కాని, మీరట్లోని సిపాయిలు తొందరపడ్డారు. వారి తొందరపాటుకు తగు కారణం లేకపోలేదు. కాని, తాత్కాలికావేశాన్ని చంపుకొని, నిగ్రహంతో వారు మే 31వ తేదీవరకు వేచివుంటే, దేశం మొత్తం మీద విభిన్న ప్రాంతాలలో ఒకేసారి విప్లవం ప్రారంభమై ఉండేది. ఆ పరిస్థితిలో బ్రిటీష్ వారు గుక్కతిప్పుకొనడం బహుశా అసాధ్యమై ఉండేది.

నాటి విప్లవ వైఫల్యానికి ఇదొక్కటే కారణం కాదనుకోండి. శిఖులు బ్రిటీష్వారి పక్షాన నిలవడం, కాశ్మీర్, నేపాల్, బరోడా, గ్వాలియర్, హైదరాబాదు మొదలైన సంస్థానాలు విప్లవం పట్ల వ్యతిరేకత చూపడం మొదలైన ఇతర కారణాలు కూడా ఉన్నాయి. దాని వైఫల్య కారణాలేవైనా, కొందరు బ్రిటీష్ చరిత్రకారులు రాసినట్టు, అది కేవలం సిపాయిల పితూరీ కాదు! ఒక భారతీయ చరిత్రకారుడు (డాక్టర్ ఆర్.సి. మజుందార్) తాను కొత్తగా ప్రచురించిన పుస్తకంలో నిరూపించడానికి ప్రయత్నించినట్టు, అది ఒక వ్యూహం ప్రకారం నడిచిన జాతీయ విప్లవం కాదనడానికి సైతం వీలులేదు.

ఎక్కడైనా - ఎప్పుడైనా ఓటమి పొందిన తిరుగుబాటును "పితూరి" అనడం సహజమే. ఎక్కడైనా ఎప్పుడైనా గెలుపొందిన పితూరీని “విప్లవం” అనడం కూడా సహజమే. 1942 నాటి “క్విట్ ఇండియా” మహోద్యమ ప్రత్యక్ష ఫలితంగా మనకు స్వాతంత్ర్యం లభించి ఉండకపోతే, దాన్ని చులకన చెయ్యడానికి ఎంతమంది ముందుకు వచ్చి ఉండేవారో!

ఎవరు కాదన్నా, 1857లో మన దేశంలో చెలరేగినట్టిది నిస్సందేహంగా జాతీయ విప్లవం. ఆవు కొవ్వుతోను, పంది కొవ్వుతోను తయారుచేసిన తూటాలను తమ మత విశ్వాసాలకు విరుద్ధంగా ఉపయోగించవలసిందిగా నిర్బంధిస్తున్నందుకు కినిసిన హిందూ, ముస్లిం సిపాయిలు ప్రధానపాత్ర వహించినా, నాటి విప్లవం కేవలం వారికే పరిమితం కాలేదు. సంస్థానాధిపతులు పెక్కుమంది దానిలో చేరారు. వారికి నాటి కుంఫిణీ ప్రభుత్వంపై విడివిడిగా ఏవో కోపకారణా లున్నమాట నిజం. ఉదాహరణకు, ఝాన్సీ లక్ష్మీబాయికి తన దత్తపుత్రుని రాజ్యాధికారాన్ని గుర్తించనందుకు ఆగ్రహం కలిగింది. తనను పీష్వా బాజీరావు దత్తత చేసుకొన్నా 1851లో ఆయన నిర్యాణానంతరం అప్పటివరకు ఆయనకు చెల్లిస్తున్న పింఛను తనకు నిరాకరించడం నానాసాహెబు కినుక తెప్పించింది. ఏవో కుంటిసాకులు వెదకి, స్వదేశ సంస్థానా లన్నింటిని.

కైవసం చేసుకొనడమే పనిగా పెట్టుకున్న డల్హౌసీ విధానం ఫలితంగా తన రాజ్యాన్ని కోల్పోయిన రాణా కున్వర్సింగ్కు ఏమి కోపకారణం కలదో ప్రత్యేకించి వివరించ నక్కరలేదు. ఈ విధంగా వీరందరికి వ్యక్తిగత కోపాలున్నా, కక్షలున్నా, కేవలం వాటిని తీర్చుకొనడానికే వీరు విప్లవంలో చేరలేదనడానికి ఒక నిదర్శనం - వీరందరు చేరి విప్లవ నాయకత్వాన్ని నాటి ఢిల్లీ పాదుషా బహదూర్ షాకు అప్పగించడమే.

సిపాయిలు, సంస్థానాధిపతులు మాత్రమే కాక, పెక్కుచోట్ల సామాన్య ప్రజలు సైతం 1857 నాటి పోరాటంలో పాల్గొన్నారు. ఈ విషయాన్ని "ఆక్స్ఫర్డ్ హిస్టరీ ఆఫ్ ఇండియా" సైతం అంగీకరిస్తుంది. దానిలోని వాక్యాలివి: "అది ప్రధానంగా బెంగాల్ సైన్యం విద్రోహ మైనప్పటికీ, కొవ్వుపూసిన తూటాలే అది చెలరేగడానికి తక్షణ కారణ మైనప్పటికీ, అది కేవలం సైనికులకే పరిమితం కాలేదు. ప్రజా బాహుళ్యంలో కూడా అశాంతి అప్పటిలో ఎంతగానో పెచ్చు పెరిగింది. కారణానే పెక్కుచోట్ల సైనికులకంటే ముందుగా ప్రజలే తిరుగుబాటు చేశారు". నాటి తిరుగుబాటులో ప్రజలే ఇంతగా ముందడుగు వేయడంలో అబ్బురం లేదు. నిజానికి కుంఫిణి పరిపాలన వల్ల ఎక్కువగా కష్టనష్టాలకు లోనైంది వారే. కుంఫిణీవారి దోపిడితో వారు చప్పగా చితికిపోయారు. కూడుగుడ్డలకైనా నోచుకొనని దుర్భర దారిద్ర్యస్థితిలో వారు పడిపోయారు. పూర్వపు తమ వృత్తులన్నీ క్రమక్రమంగా నశించిపోగా, బికారులై వారు నిలవవలసి వచ్చింది. అయినప్పుడు విప్లవరంగంలో వారే అనేక ప్రదేశాలలో పురోగాములు కావడం ఆశ్చర్యకరమైన విషయం కాదుగదా?

ప్రజలు సయితం ఈ విధంగా ముందుకు వచ్చిన తర్వాత 1857 నాటి పోరాటాన్ని కేవల మొక సిపాయి పితూరీగా చిత్రించడానికి ప్రయత్నించడం తగునా? దేశంలో దాదాపు సగం ప్రాంతంలో చెలరేగిన ఆ పోరాటం హిందువులతోపాటు, మహమ్మదీయులు, సంస్థానాధిపతులతోబాటు వివిధ రాష్ట్రాల ప్రజలు పట్టుదలతో పాల్గొనగా పెక్కు నెలలపాటు అతితీవ్రంగా కొనసాగిన ఆ పోరాటం - ఒక వ్యూహ మేదో లేకుండా జరిగిందని పేర్కొనడం భావ్యమా?

పరాజయం చెందినందునే నాటి విప్లవ ప్రాముఖ్యాన్ని తగ్గించడం (ఆదిలోనే మేము వివరించినట్టు) జరిగింది. అయితే, ఒక దృష్టినుంచి చూచినప్పుడు ఆ పోరాటం నిరర్థకమైందని అనడానికి వీలులేదు. దాని ఫలితంగానే గుడ్డిలో మెల్లగా కుంఫిణీ ప్రభుత్వంపోయి, బ్రిటిష్ పార్లమెంట్ పరిపాలన వచ్చింది.

నూరేళ్ల క్రితం సరిగా ఈనాడు ప్రారంభమైన ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్రవహించిన నానాసాహెబ్, తాంతియా తోపే, కున్వర్ సింగ్, అమర్ సింగ్, ఝాన్సీ లక్ష్మీబాయి, బహదూర్ షా ప్రభృతులకే కాక నాటి అసంఖ్యాక అజ్ఞాతవీరులకు సయితం స్వతంత్ర భారత పౌరులమైన మనం ఈనాడు భక్తిశ్రద్ధలతో చేయెత్తి నమస్కరించాలి. (ఆంధ్రప్రభ 10-5-1957)

నిత్య సమరం

మన స్వాతంత్ర్య సమరం ఇంకను ముగిసిపోలేదు" ఇది అఖిల భారత విద్యార్థి మహాసభలో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చేసిన మహోపన్యాస సారాంశం.

"మనం స్వాతంత్ర్య సౌధ ప్రాంగణంలోకి వచ్చాము. కాని, ఆ సౌధంలో ఇంకా ప్రవేశించలేదు. కోట గోడలవద్దకు చేరడం కోటలో అడుగు పెట్టడం కానేరదు. కోటగోడలను చేరిన పిమ్మటనే, కోటను పట్టుకోడానికి అతి తీవ్ర సమరం అవసరం కావచ్చు" అని కూడా ఈ ఉపన్యాసంలో పండిట్ నెహ్రూ హెచ్చరించాడు.

ఈ హెచ్చరిక భారత విద్యార్థిలోకమే కాకుండా సమస్త భారత ప్రజానీకం గుర్తించదగినట్టిది. బ్రిటిషు వారు ఇండియా నుంచి వైదొలగి పోతామని అన్నారే గాని, వైదొలగి పోలేదు. భారత ప్రజాభిమతానికి విరుద్ధంగా భారతదేశాన్ని మరి పరిపాలించ లేమని వారికి స్పష్టంగా తెలుసు. కాని, తాము వైదొలగి పోవడంలో వీలైనంత విలంబన చేయడానికి వారు ప్రయత్నిస్తున్నారు. విజాతీయ పరిపాలకుల ఉనికి తమ మనుగడకు అవసరమని భావించే భారతీయులను నీచ స్వార్థపరులైన భారతీయులను తమకు అండగా వారు సమీకరిస్తున్నారు కూడా. ఇండియాలో బ్రిటన్ ఆడుతున్న ఈ కపటనాటకాన్నే ఇండో - చైనాలో ఫ్రాన్సు ఆడుతున్నది

ఇండొనీసియాలో హాలెండ్ ఆడుతున్నది. ఇందువల్ల మన దేశంలోనే కాకుండా, ఇండో-చైనా, ఇండొనీసియాలలో కూడా స్వాతంత్ర్య సమరం ఇంకను ముగిసిపోలేదని చెప్పవచ్చు.

వాస్తవానికి స్వాతంత్ర్య సమరం ఎక్కడైనా - ఎప్పటికైనా - ముగిసేది కాదు. అప్రమత్తత స్వాతంత్ర్యానుభూతికి మానవుడు చెల్లించవలసిన నిత్య మూల్యం. స్వాతంత్ర్యాన్ని కోల్పోడానికి విదేశీ దండయాత్ర సాగనక్కర లేదు; విదేశీయ పరిపాలన కొనసాగ నవసరం లేదు. హిట్లర్, ముసోలినీలు విదేశీయ విజేతలు కారు. కాని, వారి పరిపాలనాకాలంలో జర్మనులు, ఇటాలియనులు స్వాతంత్ర్యాన్ని అనుభవించినారని ఎవ రనగలరు? స్పెయిన్పై నేడు విదేశీయ పరిపాలన కొనసాగడం లేదు. కాని, శ్పానిష్ ప్రజలు నేడు అనుభవిస్తున్నది దాస్యబాధే కాదా!

స్వాతంత్ర్యానికి "రాజకీయ స్వాతంత్ర్యం" అని సంకుచితమైన అర్థాన్ని చెప్పుకొనడం పొరపాటు. సాంఘిక, ఆర్థికాది విషయాలలో లోపంలేకుండా చేయని రాజకీయ స్వాతంత్ర్యం శుష్కమైనట్టిదే. క్షుధార్తునికి ఓటు వల్ల ప్రయోజనమేమిటి? దాన్ని ఎన్నికల సమయంలో ఎక్కువ పాట పెట్టగల వానికి అమ్ముకొని, ఆ పూట గడుపుకొనడం తప్ప విద్యావిహీనునికి ఓటు వల్ల ప్రయోజనమేమిటి? ఆకర్షణీయమైన నినాదాలతో ఎవరు తనను ఎక్కువ మోసగించగలరో వారికి దాన్ని వేయడం తప్ప! సంఘదురాచారాలచే, మత మౌఢ్యాలచే అంధప్రాయుడైనవానికి ఓటువల్ల ప్రయోజనమేమిటి? తన దురాచారాలను, తన మౌఢ్యాలను బలపరచగలవారి పక్షాన దాన్ని నమోదు చేయడం తప్ప! అందువల్ల రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా, విద్యా విషయకంగా సర్వతోముఖాభివృద్ధిని చెంది, ప్రతిమానవుడు తన వ్యక్తిత్వాన్ని సంపూర్తిగా వికసింప జేసుకొనడానికి సమస్తావకాశా లిచ్చేదే వాస్తవికమైన స్వాతంత్ర్యం.

ఇట్టి స్వాతంత్ర్య సంరక్షణకోసం రాజకీయ స్వాతంత్ర్యం అనుభవిస్తున్న దేశాలలో సయితం ప్రతి పౌరుడు అప్రమత్తతను నిత్యమూల్యంగా చెల్లిస్తుండ వలసిందే. అయితే, రాజకీయ స్వాతంత్ర్యం లేని ఇండియా, ఇండో - చైనా, ఇండొనీసియా మొదలైన దేశస్థులు చెల్లించవలసిన మూల్యం, రాజకీయ స్వాతంత్ర్యం వున్న దేశస్థులు చెల్లించవలసినదానికంటే మరింత అధికమైనది; మరింత కఠోరమైనది. దీన్ని ప్రతి భారతపౌరుడు గుర్తించాలి; రాజకీయ స్వాతంత్ర్యాన్ని పొందదానికి, దాన్ని సర్వతోముఖమైన వాస్తవిక స్వాతంత్ర్యం కింద పరిణమింప జేసుకొనడానికి తగు మూల్యం చెల్లింపుకు సంసిద్ధుడు కావాలి.

(ఆంధ్రప్రభ 2-1-1947)

అరుణోదయం

(మనకు స్వతంత్రం త్వరగా రావాలనీ, స్వతంత్ర దేశ ఫలాలను అందుకోడానికి మనం సిద్ధంగా ఉండాలని చేసిన హితవు.)

ఎన్నేళ్లుగా ఎదురుచూస్తున్నాము : ఎంతకాలంగా కలలు కంటున్నాము! ఎంతగా తహతహలాడుతున్నాము? ఎప్పుడెప్పుడని ఎంత ఉవ్విళ్లూరుతున్నాము?

మనం దాస్యంలో నున్నామని గమనించ నంతవరకు బాధ లేకపోయింది. దాస్యం సిగ్గుచేటని గుర్తించనంతవరకు ఆవేదనే లేకపోయింది. కాని, ఆ తర్వాత ప్రతినిత్యం బాధే గదా? అనుక్షణం ఆవేదనే గదా?

ఈ దారిద్ర్యం, ఈ దైన్యం మనకు దేనికి? మన దేశ దాస్యం వల్లనే.

ఈ అవిద్య, ఈ అజ్ఞానం మనకు దేనికి? మన జాతి పారతంత్ర్యం వల్లనే.

ఈ అగచాట్లు, ఈ అవమానాలు మనకు దేనికి? మన సంఘ బానిసత్వం వల్లనే. బ్రతుకే మనకు భారమైపోవడం దేనికి? మనకు స్వాతంత్ర్యం లేకపోబట్టే :

ఈ ప్రశ్నలు, ఈ ప్రత్యుత్తరాలు మనకు స్ఫురించని దినం లేదు; ఘడియ లేదు. అడుగడుగున ఇవి మనలను కలతపెట్టినవి, కల్లోల పరచినవి, ఆగ్రహపరిచినవి, ఆవేశ పూరితుల్ని చేసినవి, సిగ్గిలజేసినవి, చింతాక్రాంతుల్ని చేసినవి, ఉన్మత్తుల్ని చేసినవి.

మనకు సైన్యం లేదు, సైన్యాధికారులు లేరు, ఆయుధాలు లేవు, ఆర్థికబలమైనా లేదు. ఒక మహా సామ్రాజ్యశక్తిని మనం ఏ విధంగా ప్రతిఘటిస్తాము? స్వాతంత్ర్యాన్ని ఏ విధంగా సాధిస్తాము? ఉత్తచేతులతో పోరాడగలమా? ఉరికంబాల నెక్కగలమా? ఇందుకు ఎంత లక్ష్యశుద్ధి కావాలి? దృఢ సంకల్పం కావాలి? ధైర్య సాహసాలు కావాలి? దాస్యం వల్ల శారీరకంగానే కాకుండా, మానసికంగానే కాకుండా, నైతికంగా కూడా పతనం చెందిన జాతినుంచి ఇంతటిని ఆశించగలమా?

ఈ విధంగా ఎంత సంకోచం? ఎన్ని సందేహాలు? ఎంతగా డోలాందోళన?

కాని; మన నైరాశ్యంనుంచే ఒక నాధుడు ఉద్భవించాడు, మన నిస్పృహనుంచే ఒక నాయకుడు అవతరించాడు. మన బాధలు ఆయనను కంపింప జేసినవి. మన అవమానాలకు ఆయన నేత్రయుగ్మం నుంచి విస్ఫులింగాలు రాలినవి. మన ఆశలు ఆయనలో జ్వాలాశిఖలైనవి. మన అనిర్దిష్టావేదన ఆయనలో అగ్నిపర్వతమైంది. మట్టిముద్దల నుంచి ఆయన మహాపౌరుల్ని సృష్టించాడు. ఒక ప్రజాసంస్థను సమకూర్చుకున్నాడు. ఒక శాంతి సైన్యాన్ని సన్నద్ధం చేసుకున్నాడు. తను ముందుకు నడిచాడు, ఒక జాతికి జాతినే ముందుకు నడిపించాడు. ఆత్మార్పణ చేయమన్నాడు; ఆశయసిద్ధిని పొందమన్నాడు.

అపూర్వమైనవాడు ఈ నాయకుడు! అపూర్వమైనవి ఆయన పద్ధతులు.

కొందరు నవ్వారు; కొందరు వెక్కిరించారు; కొందరు ఎగతాళి చేశారు, కొందరు పెదవి విరిచారు; కొందరు నొసలు ఎగరవేశారు.

ఈ నిరసనను లక్ష్యపెట్టనట్టే; ప్రతిఘటననుకూడా లక్ష్యపెట్టకుండా ఆయన మాత్రం ముందుకు నడిచాడు; తన వెంట ఒక జాతికి జాతినే నడిపించాడు.

ఈ నడకలో ఆయన అప్పుడప్పుడు ఆగక పోలేదు. అయితే, ఆ ఆగడం తాను అలసిపోయినందు వల్ల కాదు; తాను చలించిపోయినందువల్ల కాదు. తన వెంట నడుస్తున్నవారు సేద తీర్చుకోడానికే. దారి తప్పుతున్నవారిని కూడగట్టుకు రావడానికే! మరొక మజిలీతో గమ్యస్థానానికి మరింత దగ్గరగా రావడానికే!

ఇక, చివరి మజిలీని చేరవలసి ఉన్నదని తోచినంతనే “క్విట్ -ఇండియా” అని శంఖారావాన్ని చేశాడు. "కరో యా మరో” అని సమర నినాదాన్ని చేశాడు.

అది 'శుష్కనినాదమని అన్నవారున్నారు. ఇది వ్యర్థ యత్నమని అన్నవారున్నారు. ఇది వృథాశ్రమేనని అన్నవారున్నారు. కాని, ఆయన మాత్రం ముందుకు నడిచాడు. ఒక జాతికి జాతినే తన వెంట ముందుకు నడిపించాడు.

ఆ నడకకు భూమ్యాకాశాలు దద్దరిల్లినవి; బ్రిటిష్ సామ్రాజ్య మహాసౌధపు పునాదులు కదిలినవి. అయినా, ఎన్నో పోటీలు పెట్టారు; పుట్టకీళ్లు కట్టారు. తామేమిచేసినా, ఇక ఇండియాలో తమ సామ్రాజ్య సౌధం నిలవబోదని తెలిసిపోయినందున, ఈ నాటికి 1948 జూన్లోగా మీ దారి మీదే; మా దారి మాదే" అని బయటపెట్టారు.

దాదాపు రెండు శతాబ్దాలనుంచి దాన్ని అనుభవిస్తున్నాము. ఇంకొక్క పదహారునెలలలో మనకు ఈ దాస్యబాధ తొలగిపోతుంది; మనం స్వతంత్రుల మౌతాము; మన బాధలు పోతాయి; మనం సుఖపడతాము; నలుగురిలో తలయెత్తుకు తిరగ గలుగుతాము; లోకంచేత ఔనిపించుకుంటాము.

అయితే, ఈ లోపుగా మనం ఎంతో విజ్ఞత, ఎంతో సామరస్యం, ఎంతో దూరదృష్టి మనం ప్రదర్శించాలి. మనలను ఇంతవరకు నడిపించుకు వచ్చిన మన నాయకుడు తూర్పుబెంగాల్ కుగ్రామాలలో - నవ ఖాలీ క్రౌర్యాలమధ్య - ఏకాంతంగా నివసిస్తూ, మనకు చూపించగోరుతున్న సౌభ్రాతృత్వమార్గం వెంట నడవాలి; సమైక్యతాపథాల్ని మెట్టాలి.

ఇన్నేళ్ళుగా మన రక్తమాంసాల్ని పిండుతున్న బ్రిటిష్ జాతి - ఇంత కాలంగా మనల్ని దోచుకుతింటున్న బ్రిటిష్ జాతి - ఇప్పటికీ తన ఆశను పూర్తిగా చంపుకోలేదు; తన పట్టును పూర్తిగా వదలలేదు. ఏదో ఒక పేచీ పెట్టాలని, ఏదో ఒక మెలిక వెయ్యాలని, తాను తొలగినా, తనకు కొంత పలుకుబడి కావాలని ప్రయత్నించక మానదు.

తాము వైదొలగిపోతూ, “1948 జూన్ నెలలోగా భారతీయులకు సంపూర్ణ ప్రాతినిధ్యం వహించగల ప్రజా పరిషత్తు అట్టి రాజ్యాంగ విధానాన్ని నిర్మించజాలని పక్షంలో ఇప్పుడు మేము పెడుతున్న ఈ గడువునాటికి బ్రిటిష్ ఇండియాలో కేంద్ర ప్రభుత్వాధికారాన్ని ఎవరికి అప్పగించాలనే సమస్యను బ్రిటిష్ ప్రభుత్వం పరిశీలించ వలసి ఉంటుంది. బ్రిటిష్ ఇండియాపై గల అధికారాలను ఏదో ఒక రూపంలోనున్న కేంద్ర ప్రభుత్వానికే మొత్తంగా అప్పగించడమా, లేక కొన్ని ప్రాంతాలలో అక్కడ అధికారంలోవున్న రాష్ట్రీయ

ప్రభుత్వాలకు ఈ అధికారాలను అప్పగించడమా, లేక అతిసమంజసమైనదని, భారత ప్రజల యోగక్షేమాలకు అనుగుణమైనదని తోచిన మరొక పద్ధతిని అప్పగించడమా అని ఈ సందర్భంలో బ్రిటిష్ ప్రభుత్వం ఆలోచించి ఒక నిర్ణయానికి రావలసి ఉంటుంది" అని ప్రధాని అట్లీ చేసిన ప్రకటనలో ఏదో పేచీ - ఏదో మెలిక లేకపోలేదు.

కాని, ఈ పేచీ లేమి, ఈ మెలిక లేమి మనం మత మౌఢ్యాలను, పాక్షిక ప్రయోజనాలను, వర్గస్వార్థాలను, వ్యక్తిగత అహంకారాలను మన దేశ క్షేమం కోసం, మన జాతి భవితవ్యం కోసం తాత్కాలికంగానైనా విస్మరించగలిగితే, మనలను బాధపెట్టలేవు. 1948 జూన్ వరకు కూడా ఆగకుండా ఈ లోపుగానే మనకు స్వరాజ్యం, మనకు స్వాతంత్రం. భావి మనదైనట్టే ఇప్పుడిక బాధ్యత మనది; కలలపంట మనదై నట్టే ఇప్పుడిక కర్తవ్య పరిపాలన మనది.

సమయానికి తగిన సామరస్య శక్తులను మనం సమీకరించుకో గలమా? ఫలానికి తగిన పరిణత ప్రజ్ఞను మనం ప్రదర్శిస్తామా? ఇదే నేడు ముఖ్యమైన ప్రశ్న. ఈ ప్రశ్ననుబట్టే భావి చరిత్రకారుడు మీకు మాకు - మనలో ప్రతి ఒక్కరికి విలువ కడతాడు.

(ఆంధ్రప్రభ 22-2-1947)

స్వాతంత్ర్య భానూదయ వేళ (ఆగష్టు 15, 1947)

(భారతదేశం స్వతంత్ర దేశంగా మారుతున్న శుభ తరుణంలో - అందుకు తొమ్మిది రోజుల ముందునుంచి స్వాతంత్ర్య దినోత్సవం ఆగష్టు 15 వరకు సాగిన సంపాదకీయ పరంపర స్వాతంత్ర్య పోరాటం, స్వతంత్ర భారతంలో పౌరుల కర్తవ్యం ఇందు ఉద్ఘాటన జరిగింది.)



మరి తొమ్మిది పగళ్లు, తొమ్మిది రాత్రులు గడిస్తే చాలు భారత స్వాతంత్ర్య భానూదయం జరుగుతుంది.

మన స్వాతంత్ర్యానికి తొలిఘాత 1757 ప్లాసీ యుద్ధభూమిలో తగిలింది. కాని, దీన్ని నాడు మన జాతి గుర్తించలేదు.

ప్లాసీ యుద్ధానంతరం రాజు తర్వాత రాజు రాష్ట్రం తర్వాత రాష్ట్రం - బ్రిటిష్ వారి దాస్యంకిందికి పోతున్నా, స్వాతంత్ర్య వంచితులమై పోతున్నామనే ఆవేదన మనలో పుట్టలేదు.

ఈ ఆవేదన ఓంప్రథమంగా రేకెత్తడం 1857 ప్రాంతాల దీని ప్రత్యక్ష ఫలితమే - 1857లో ప్రజ్వలించిన ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం. ఈ సంగ్రామంలో పరాజయం పొందినపిమ్మట జాతిలో నైరాశ్యం, నిస్పృహ జనించాయి.

ఇది కొంత తొలగి, తిరిగి మన జాతి స్వాతంత్ర్యాన్ని గురించి కలలుగనడం 1880 ప్రాంతాలలో. ఈ కలలు ఒక నిర్దుష్టరూపాన్ని ధరించడం, దేశదాస్యాన్ని లజ్జాకరమైనదిగా మనం పరిగణించడం 1905 నాటి నుంచి. ఇక, బానిసత్వపు బ్రతుకు దుస్సహమనే భావం మనలో ప్రబలింది 1917 ల నుంచి.

కడచిన ముప్పయి సంవత్సరాలలో స్వాతంత్ర్య భానూదయం ఎప్పుడెప్పుడని మనం ఎదురుచూడని రోజు లేదు. మరి తొమ్మిది పగళ్ళు, తొమ్మిది రాత్రులు గడిస్తే చాలు, శుభసమయం వస్తుంది. అయినా, ఈ తొమ్మిది పగళ్లు, ఈ తొమ్మిది రాత్రులు మనకు పద్దెనిమిది యుగాలవలె తోస్తున్నవి.

దాదాపు రెండు శతాబ్దాలు దాస్యబాధతో కుమిలినవారికి తొమ్మిది పగళ్లు, తొమ్మిది రాత్రులు ఇంత దుస్సహంగా పరిణమించడం వింతగా తోచవచ్చు. కాని, నిజానికి దీనిలో వింత లేదు. ప్రియాగమనానికై అనేకాబ్దాలు వేచివున్న వానికి తుది కొలది గడియలే అతి దుర్భరం; యావజ్జీవ కారాగారవాస శిక్షపడినవానికి బంధవిముక్తి పూర్వపు కొలది క్షణాలే అత్యంత దుస్సహం.

జాతీయ స్వాతంత్ర్యం ఎట్టిదో మనకు తెలియదు. మన తండ్రులకు తెలియదు. మన తాతలకు తెలియదు. అంతకు పూర్వపువారికి అది కొంత వరకు తెలుసునేమో! మనకు తెలిసింది కేవలం పారతంత్ర్య బాధే!

ఈ బాధ విరగడై పోవడమేమి, మనకు స్వాతంత్ర్యం సిద్ధించడమేమి, ఒక వినూత్నానుభూతి కాబోతున్నది, ఒక విశిష్టానుభవం కాబోతున్నది. ఇది ప్రస్తుతం మనం ఊహించుకొన వలసినట్టిదే! ఇది మనకు అనుభవైకవేద్యం కావడం ఆగష్టు 15వ తేదీని స్వాతంత్ర్య భానూదయమైన వెనుకనే.

ఈ వినూత్నానుభూతికోసం, ఈ విశిష్టానుభవం కోసం మన హృదయం ఆరాటపడుతున్నది. కాని, ఇదే సమయంలో విభిన్న, విరుద్ధ భావాలు మన హృదయాన్ని కలిచి వేస్తున్నాయి కూడా. జాతీయ స్వాతంత్ర్యం సిద్ధిస్తున్నా భరతవర్షం అఖండత్వం భగ్నమై పోయిందని ఒక వైపున అధినివేశ ప్రతిపత్తితో ప్రారంభమౌతున్న మన రాజకీయ స్వాతంత్ర్యం ఎంత శీఘ్రంగా, సమగ్రంగా సంపూర్ణ స్వాతంత్ర్యంగా పరిణమించగలదనే వేగిరపాటు మరొకవైపున, స్వాతంత్ర్య సముపార్జనకై తమ జీవితాలను అంకితం చేసినవారిలో అనేకులు దాన్ని అనుభవించడానికి నేడు లేరుగదా అని ఆవేదన వేరొక వైపున. పరప్రభుత్వం తొలగడంతోపాటు మన దారిద్రబాధ కూడా తొలగి శాంతిసుభిక్షాలు నెలకొనగలవా అన్న సంకోచం ఇంకొక వైపున.

ఈ విభిన్న విరుద్ధ భావాల కారణంగా మన హృదయాన్ని నేడు సంతోష సంభ్రమోద్వేగాలతోపాటు భయ సంశయ విచారాలు కూడా రాజ్యం చేస్తున్నాయి. భవిష్యత్తును గురించి మన విశ్వాసం దృఢమైనదే, ధ్రువమైనదే. ఆత్మశక్తిలో మన విశ్వాసం నిస్తులమైనదే, నిశ్చలమైనదే. అయితే, మహోజ్వల భవిష్యత్తుదిశలో మన పురోగమనానికి ఎన్ని ప్రతిబంధకాలు కలవో, ఎంతటి ప్రతిబంధకాలు కలవో - మనకు తెలుసు. అందువల్లనే ఆనందోత్సవానికి సన్నద్ధపడుతూనే మనం ఆత్మపరీక్ష చేసుకొంటున్నాము.

స్వాతంత్ర్య భానూదయంతో నవశకం ప్రారంభం కానున్న ఈ శుభసమయంలో ఇట్టి ఆత్మపరీక్ష మన భవితవ్యాన్ని పదిలపరచుకొనడానికి ముఖ్యావసరం. (ఆంధ్రప్రభ 6-8-1947)

2

జాతీయ స్వాతంత్ర్యం అకారణంగా పోదు, అవలీలగా రాదు, అప్రయత్నంగా నిలవదు. మనం జాతీయ స్వాతంత్ర్యాన్ని కోల్పోతే, దానికి ప్రబలమైన కారణాలు అనేకం లేకపోలేదు. యూరోపియనులు మన దేశానికి వచ్చినప్పుడు దీన్ని జయించవలెనన్న ఉద్దేశం వారికి లేదు. దీన్ని తాము జయించగలమని వారు కలలోనైనా అనుకోలేదు కూడా. వారిక్కడికి కేవలం వర్తక వ్యాపారాల కోసం వచ్చారు. ఆ రావడంకూడా అతి భయభక్తులతో, వినయ విధేయతలతో వచ్చారు. వాణిజ్య సౌకర్యాలను కల్పించవలసిందిగా, వర్తక కేంద్రాలను నిర్మించుకొనడానికి అనుమతించవలసిందిగా వినతులతో వచ్చారు, విజ్ఞాపనలతో వచ్చారు, సలాములు పెడుతూ వచ్చారు, సాష్టాంగపడుతూ వచ్చారు.

అప్పటికి ఉత్తరాన మొగల్ సామ్రాజ్యం మహోచ్ఛస్థితిలో ఉన్నది. దక్షిణాన విజయనగర సామ్రాజ్యం శక్తిమంతంగా ఉన్నది. దేశంలోని తక్కిన భాగాలలో కూడా మొగల్ పాదుషాకు సామంతులుగానో, స్వతంత్రరాజులుగానో వివిధ పరిపాలకులు ధీరతతో రాజ్యచక్రాన్ని తిప్పుతున్నారు. అందువల్ల ఆనాడు యూరోపియన్ దేశస్థులెవరైనా భారతదేశ జైత్రయాత్రను తలపెడితే, అది కేవలం పిచ్చివాని పగటి కలవలెనే తోచివుండేది.

అయితే నాటి భారతదేశ దీప్తి, దాని పాటవం పైమెరుగులే! అసూయలు, అంతఃకలహాలు, ప్రజాపీడన, పాపపూరిత జీవితం - ఇట్టి దుష్టగుణాలతో, దుర్మార్గ వర్తనతోనాటి భారతదేశ పరిపాలకులు కేవలం "మేడిపండు" వలె ఉన్నారు. దీన్ని యూరోపియన్లు గ్రహించడానికి కొంతకాలం పట్టింది. పైగా, ఒక్కసారిగా కాకుండా క్రమక్రమంగా వారు ఈ విషయాన్ని గుర్తించగలిగారు.

భారతదేశం శత్రుభీకరంగా పైకి కనబడినా, ఒక గట్టి ఊపు ఊపితే పండిన పండువలె అది తమ ఒడిలో రాలగలదని గుర్తించినందునే, యూరోపియనులు దాన్ని జయించడానికి తమలో తాము గట్టిగా పోటీ పడ్డారు. ఈ పోటీలో డచ్వారు, పరాసువారు, పోర్చుగీసువారు ఓడిపోగా విజయమేమి, దాని భోగమేమి బ్రిటీష్ వారికి దక్కింది.

మన విశాల దేశాన్ని జయించడానికి బ్రిటీష్ వారు తమ సైన్యాలను గాని, తమ ధనాన్నిగాని దాదాపు వినియోగించలేదు. వారు మన దేశాన్ని జయించింది మన సిపాయిలతోనే, మన డబ్బుతోనే. జయించినదాన్ని ఇంత కాలంగా వారు భుక్తపరచుకొన్నది కూడా మన సహాయంతోనే.

మన దేశంలో బ్రిటీష్ సామ్రాజ్యానికి పునాదులు వేసిన క్లైవ్, వాటిని నేలమట్టం పైకి లేపిన వారన్ హేస్టింగ్స్, వాటిపై గోడలను కట్టిన ఇతరులు సేనాధిపతులు కారు, రాజ్యాంగవేత్తలు కారు, వ్యవహారదక్షులైనా కారు. సమకాలిక బ్రిటీష్ సంఘంలో వారు వ్యర్థులుగా భావించబడినట్టివారు, త్రాష్టులుగా పరిగణించబడినట్టివారు. అట్టివారే మన దేశంలో బ్రిటీష్ పతాకను ప్రతిష్ఠించ గలిగినారంటే, నాడు శారీరకంగా, మానసికంగా, నైతికంగా మన ప్రజ లేమి, మన పరిపాలకులేమి ఎంత అధోగతిలో ఉన్నారో మనం సులభంగా ఊహించుకోవచ్చు. మేజర్ బి.డి. వసు రాసిన "ది రైజ్ ఆఫ్ ది క్రిస్టియన్ పవర్ ఇన్ ఇండియా" అనే చారిత్రక గ్రంథాన్ని ఆసాంతంగా చదివితే, బ్రిటీష్వారి బలదర్పాలుగాని, వారి శక్తిసామర్థ్యాలుగాని, వారికి మన దేశాన్ని కట్టబెట్టలేదని, ఇందుకు కారణాలు మనవారి ధనలోభం, అధికార వ్యామోహం, స్వామిద్రోహం, కపటవర్తన మొదలైనవే అని ఎవ్వరికైనా స్పష్టంగా తెలుస్తుంది. ఇండో-బ్రిటీష్ చరిత్రలో ఏ ముఖ్య యుద్ధాన్ని చూచినా, దానిలో ఎవరో ఒకరు, ఎంతో కొంత స్వామి ద్రోహం చేయబట్టే, బ్రిటీష్ వారు విజయం సాధించినట్టు కానవస్తుందనడంలో అత్యుక్తి ఎంతమాత్రం లేదు.

జాతిక్షేమాన్ని కానక, వ్యక్తిగత ప్రయోజనాలను కాంక్షించడం, జాతీయ గౌరవ రక్షణను లక్షించక, ఏదో స్వార్థం కోసం శరీరాన్ని, ఆత్మను అమ్ముకొనడం - ఇంతహీనంగా, ఇంత హేయంగా మన రాజులేమి, ప్రజలేమి వర్తించినందుననే మనం స్వాతంత్ర్యాన్ని కోల్పోయాము. ఈ హీనబుద్ధి నుంచి, హేయవర్తన నుంచి కొంతవరకు బయటపడబట్టే ఈనాడు “మరి ఎనిమిది పగళ్ళు, ఎనిమిది రాత్రులు గడిస్తే, స్వాతంత్ర్య భానూదయం జరుగుతుంది" అని మనం ఆగష్టు 15వ తేదీకి ఎదురు చూడగలుగుతున్నాం. ఈ హీనబుద్ధి నుంచి, ఈ హేయవర్తన నుంచి పూర్తిగా బయటపడితేనే కలకాలం వరకు ఆగష్టు 15వ తేదీ మనకు స్వాతంత్ర్య దినోత్సవం కావడం!

(ఆంధ్రప్రభ 7-8-1947)

3

బ్రిటీష్ వారు మన దేశాన్ని జయించడానికి మన జాతి నైతికపతనం ప్రధాన కారణమైనట్టే, బ్రిటీష్ దాస్యం నుంచి మనం విముక్తి పొందడానికి నైతికంగా సులభమో, నైతిక పునరుజ్జీవనం అంత కష్ట సాధ్యం. మొదటిది కొండ దిగడమైతే, రెండవది కొండపై కెక్కడం! స్వల్ప నైతిక పతనం నుంచి తప్పించుకొనడమే అతికష్టం. ఇక, ఆ పతనం అధఃపాతాళానికే అయినప్పుడు, దానినుంచి బయల్పడ్డం ఎంత కష్టమో వేరుగా చెప్ప నవసరం లేదు. మనపై బ్రిటీష్వారి ఆధిపత్యం నెలకొన్న నాటికి మనం నైతికంగా అధఃపాతాళంలోనే ఉన్నాం.

నాటికి మనకు మిగిలినవి మత విశ్వాసాలు కావు, మతమౌఢ్యాలు! నాటికి మనం అనుసరిస్తున్నవి సాంఘికాచారాలు కావు, సాంఘిక దురాచారాలు! నాటికి మన కున్నవి విశాల లక్ష్యాలు కావు, నీచ స్వార్థాలు! ఈ ఘోరదుస్థితికి ఆనాటి ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులు కారణమై ఉండవచ్చు.

ఇస్లాం ఆదిలో ఒక మహా ఝంఝామారుతం వలె భారతదేశంపై విరుచుకుపడి, తన మార్గంలో నిలిచిన ప్రతిదాన్నీ కూకటి వేళ్లతో పెకలించి వేయడానికి ప్రయత్నించింది. ఇట్టి ప్రయత్నం ఎంత తీవ్రంగా జరిగితే, దాన్ని ప్రతిరోధించే కృషి అంత తీవ్రంగానూ జరగడం సహజం. ఈ సహజ పరిణామ ఫలితంగానే హిందూ సంఘం విభిన్న సిద్ధాంతాలను, సంప్రదాయాలను, సంస్కృతులను అంతర్లీనం చేసుకొనగల తన శక్తిని కోల్పోయింది; కాలగతిని బట్టి పరివర్తనం చెందగల తన ప్రజ్ఞను పోగొట్టుకొనింది; దురాచారాలని తెలిసినా, పరదా, బాల్యవివాహాలు మొదలైనవాటిని అనుసరించింది. ఆత్మరక్షణ నిమిత్తం హిందూ సంఘం తన చుట్టూ పెద్ద పెద్ద గోడలను కట్టుకొనగా, వాటిని పడగొట్టివేయాలన్న నిష్ఫల యత్నంలో ముస్లింలు తమ తొలి శక్తినీ, పాటవాన్నీ కోల్పోయారు. పైగా, బానిస యజమాని సైతం క్రమంగా బానిస అంతస్తుకు దిగజారడం కద్దు. రాచరికాన్ని అనుసరించివుండే భోగలాలసత నైతిక పతనానికి దారితీయడం సైతం సహజమే. ఈ అన్ని కారణాల వల్లనే బాబర్, హుమయూన్, అక్బర్లను పోలిన ధీరులుద్భవించిన మొగల్ వంశంలోనే అలంగీర్ పాదుషా తదనంతరం నిర్వీర్యులైనవారు, నిస్తేజులైనవారు జనించారు.

బ్రిటీష్ ఆధిపత్యం మన దేశంపై నెలకొన నారంభించిన నాటికి హిందువుల వలె ముస్లిములు కూడా నైతికంగా అధఃపాతాళంలో ఉన్నారనడానికి ఇండో బ్రిటీష్ చరిత్రే ప్రత్యక్ష తార్కాణం. బ్రిటీష్ వారు పరిపాలకులుగా మన దేశంలో కాలూనడానికి తొలి అవకాశాన్ని కలిగించినవాడు ఆర్కాట్ నవాబు. ఈ అవకాశాన్ని విస్తరింపజేసుకొనడానికి తోడ్పడినాడు ఖురాన్పై ప్రమాణం చేసిన తర్వాత కూడా సురాజుదౌలా పట్ల స్వామి ద్రోహానికి పాల్పడిన మీర్ జాఫర్. అయితే, బ్రిటీష్ దాస్యంలో మనం పడిపోవడానికి

ముస్లిములే కారణం అనడం కంటే మహాపచారం లేదు. ఈ విషయంలో హిందువులూ అధికంగా దోషులు. హిందూదేశాన్ని బ్రిటీష్ వారికి జయించిపెట్టిన సైనికులలో అధిక సంఖ్యాకులు హిందువులే.

దేశదాస్యాన్ని అనివార్యం చేసిన ఈ నైతిక పతనం నుంచి మన జాతి బయల్పడ్డానికి దాదాపు ఒక శతాబ్దిపాటు ఎందరో మహాపురుషులు విభిన్న రంగాలలో అహర్నిశలు అశేష కృషిని చేయవలసి వచ్చింది.

మన దేశం స్వాతంత్ర్యం పొందడానికి మన రాజకీయ సమరాలే కారణమనిగాని, మన రాజకీయ నాయకులే కారకులనిగాని భావించడంకంటె పొరపాటులేదు. ఇది స్థూలదృష్టికి బహు వింతగా తోచవచ్చునేమోగాని, నిజానికి మన రాజకీయ స్వాతంత్ర్యానికి పునాదులను వేసినవారు రాజా రామమోహన్ రాయ్, దయానంద సరస్వతి, కేశవచంద్ర సేన్, వివేకానంద మొదలైన మత సంస్కర్తలు; ఈశ్వరచంద్ర విద్యాసాగర్, మహదేవ్ గోవింద రణడే, సర్ సయ్యద్ అహమ్మదాఖాన్, కందుకూరి వీరేశలింగం పంతులు మొదలైన సంఘ సంస్కర్తలు; బంకించంద్ర ఛటర్జీ, రవీంద్రనాధ్ టాగోర్, సర్ మహమ్మద్ ఇక్బల్ మొదలైన కవులు, రచయితలు.

ఇందరు, ఇన్ని రంగాలలో, ఇంతగా కృషిచేయడంవల్ల క్రమక్రమంగా మన జాతి నైతిక పునరుజ్జీవనాన్ని పొందిన మీదటనే ఒక తిలక్, ఒక గాంధి, ఒక జిన్నా, ఒక నెహ్రూ మన రాజకీయరంగంలో తలయెత్తడం సంభవమైంది.

అయితే, ఈ రాజకీయ నాయకులలో గాంధి స్థానం విశిష్టమైనదే కాక విభిన్నమైనదికూడా. ఆయన మన జాతి నైతికపునరుజ్జీవనం కారణంగా తలయెత్తినవాడు మాత్రమే కాదు; నైతిక పునరుజ్జీవనోద్యమానికి స్వయంగా నాయకత్వం వహించి, దాన్ని రాజకీయాలకు ప్రాతిపదికగా చేసి, దానికి విప్లవదీప్తి కూర్చి స్వాతంత్ర్య సముపార్జనరూపంలో దాన్ని ఒక పరిణతికి తెచ్చినవాడు. భారత నైతిక విప్లవకారులలో గాంధి అసామాన్యుడు గనుకనే, భారత స్వాతంత్ర్య నిర్మాతలలో ఆయన స్థానం అసామాన్యమైనట్టిది.

గాంధి ప్రారంభించిన ఈ నైతికవిప్లవం పరిపూర్తి చెందితేనే, మనకు మరి ఏడు రోజులలో సంక్రమించనున్న స్వాతంత్ర్యం సార్థకం కావడమైనా, సుస్థిరత్వాన్ని పొందడమైనా. (ఆంధ్రప్రభ 8-8-1947)

4

నైతికపతనమే మనం స్వాతంత్ర్య వంచితులమై పోవడానికి మూలహేతువని ఆమోదిస్తే, నైతిక పునరుజ్జీవనమే తిరిగి మనం స్వాతంత్ర్యం పొందడానికి ప్రధానకారణ మౌతున్నదని అంగీకరిస్తే, మన స్వాతంత్ర్యరక్షణకు ముఖ్యావసరం నైతికబలమే అని వేరుగా చెప్పవలసిన పనిలేదుగదా? మన దేశపు సరిహద్దుల వెలుపలనుంచి దండయాత్ర ప్రమాదం సంభవిస్తే, దాని నుంచి కాపాడుకొనడానికి నైతికబలం ఎంత అవసరమో, మన దేశం సరిహద్దుల లోపల ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు విరుద్ధంగా దుష్టశక్తులు ప్రబలితే, వాటినుంచి మన స్వేచ్ఛను కాపాడుకోడానికి కూడా అంత నైతికశక్తి అవసరం.

స్వాతంత్ర్య సంరక్షణకు ప్రధానావశ్యకత నిత్యజాగరూకత. తన ఆస్తిపాస్తుల విషయంలో, తన యోగక్షేమాలవిషయంలో, తన బంధుమిత్రుల విషయంలో సర్వసాధారణంగా ప్రతి వ్యక్తి జాగరూకుడయ్యే ఉంటాడు. కాని, స్వాతంత్ర్య రక్షణకు కావలసింది ఇంతకంటే విస్తృతమైన జాగరూకత; ఇంత కంటే విశిష్టమైన జాగరూకత.

సంఘం పదిలంగా ఉన్నప్పుడే పౌరులు పదిలం. జాతి పురోభివృద్ధి చెందితేనే వ్యక్తులకు పురోభివృద్ధి. పౌరులతో కూడినదే సంఘమనడం నిజం. వ్యక్తులు లేనినాడు జాతి లేదనడం కూడా నిజమే. అయితే, ప్రాధాన్యం పౌరులకు, వ్యక్తులకు కారాదు; సంఘానికే, జాతికే కావాలి.

ప్రతి పౌరుని, ప్రతి వ్యక్తిని కాపాడ్డమే, అతనికి కలిమిని, బలిమిని చేకూర్చడమే సంఘలక్ష్యం కావాలి; అదే జాతికి ఆశయం కావాలి. అయితే సంఘాభివృద్ధికి, జాతిక్షేమానికి ప్రతిబంధకంగా నిలిచే ఏ వ్యక్తినీ, ఏ పౌరునీ సహించరాదు; క్షమించరాదు.

అట్టి దృక్పథం అలవడ్డానికి ఎంతో నైతికబలం కావాలి. ఈ నైతికబలం కొరవడినందునే పెక్కు దేశాలలో స్వాతంత్ర్యం నామమాత్రంగా - కాదు, అపహాస్యంగా పరిణమిస్తున్నది. ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామంలో పరాజయానికి పూర్వం జర్మనీ, ఇటలీ, జపానులపై ఏ విదేశానికీ ఆధిపత్యం లేదు. కాని, వాటిని స్వతంత్ర రాజ్యాలనడం ఆ పదాన్నే అపభ్రంశం చేయడమై ఉండేదికాదా? ఈ దేశాల పౌరులు కేవలం స్వీయక్షేమాన్నే అతి ప్రధానంగ ఎంచుకొన్నారు. దీని ఫలితంగానే ఫాసిస్టు ప్రాబల్యంలోకి రావడమైనా, అందరి క్షేమానికి భంగం కలగడమైనా! ఉదాహరణకు, జర్మనీలో హిట్లర్ పదవిలోకి వచ్చిన కొత్తలో యూదీయులను నాజీలు ఏమి బాధలు పెడితే తమకేమని తక్కినవారు మిన్నకున్నందునే, యూదీయుల దుస్థితికి అనతికాలంలో తక్కిన వారందరు దిగజారి పోయారు. ఈ నగ్నసత్యాన్ని దృష్టిలో పెట్టుకొని మన జాతి ఇతోధిక నైతిక బలాన్ని సంపాదించుకొనకపోతే,

మరి ఆరు రోజులలో మనం పొందనున్న స్వాతంత్ర్యం నిలవదు; నిలిస్తే నామమాత్రంగానే! (ఆంధ్రప్రభ 9-8-1947)

5

ఇంకొక అయిదు రోజులలో బానిసత్వం పోనున్నది; స్వాతంత్ర్యం రానున్నది. ఇది అందరికి ఆనందోత్సవానికి సమానకారణమే అయినా, స్వాతంత్ర్యం విషయమై వివిధ వ్యక్తులకు - విభిన్న వర్గాలకు విరుద్ధాభిప్రాయా లుండక తప్పదని మనం గుర్తించాలి. పరజాతి పరిపాలన తొలగిపోవడమే స్వాతంత్ర్యమైతే, స్వాతంత్ర్యాన్ని గురించి ద్వివిధాభిప్రాయాలకు తావే లేదు. కాని, స్వాతంత్ర్యం అంత పరిమితార్థం గలది కాదు; అంత పరిమిత ప్రయోజనం కలదికూడా కాదు. పైగా, పరజాతి పరిపాలన నిశ్చయంగా బానిసత్వమైనప్పటికీ, స్వజాతిపరిపాలన అన్ని సమయాలలో విధిగా స్వాతంత్ర్యం కాదు కూడా. కొన్ని కొన్ని ఘట్టాలలో స్వజాతిపరిపాలన పరజాతిపరిపాలనకంటె దుస్సహ బానిసత్వంగా పరిణమించవచ్చు కూడా! కనుక స్వాతంత్ర్యానికి మనం పరజాతి పరిపాలనకు స్వస్తిని మించిన విశేషార్థాన్ని, అంతకంటె విశిష్టమైన నిర్వచనాన్ని చెప్పుకోవాలి.

మనం కోరదగిన - మనం కోరవలసిన స్వాతంత్ర్య స్వరూపాన్ని నిర్ణయించుకొనే సందర్భంలో మన దేశ పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలి. మనది పేదదేశం - అతి పేద దేశం. ప్రపంచం మొత్తంపై మన దేశాన్ని మించి దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నది మరి లేదు. ఈ దుర్భర దారిద్ర్యంవల్లనే మన దేశంలో ఆయుఃప్రమాణం అతి స్వల్పం, మరణసంఖ్య అత్యధికం. శిశుమరణాల రూపంలో గర్భశోకం మన దేశంలో ఉన్నంతగా మరి దేనిలోనూ లేదు.

తిన తిండికి, కట్టగుడ్డకు, నిలవనీడకు, తాగడానికి నీళ్ళకు కూడా మనకు కరవే! అయినప్పుడు మనకు ఆరోగ్య మెక్కడిది, ఆనంద మెక్కడిది? నిజానికి మనది జీవితం కాదు, మనుగడ. మనం బ్రతకడం లేదు; దాన్ని ఎలాగో వెళ్లమార్చు కొంటున్నాము.

అశేష ప్రజానీకం ఇంతటి ఘోర దీనావస్థలో ఉండగా, కొద్దిమంది - బహుకొద్దిమంది - రాజాధిరాజులలో సయితం అసూయను రేకెత్తించగలపాటి ఐశ్వర్యంతో కులుకుతున్నారు. దుర్భర దారిద్ర్యం వలెనే భోగభాగ్యాలు కూడా మన దేశంలో కానవచ్చినంతగా మరెక్కడ కానరావు. ఈ వైపరీత్యాన్ని తొలగించ లేనిది స్వాతంత్ర్యం కాగలదా?

బ్రిటిష్ వారితోపాటుగా కొన్ని వర్గాలవారు మన ప్రజలను ఇంత కాలంగా యథేచ్ఛగా దోచుకొన్నారు. ఈ దోపిడిని అరికట్టగలిగినప్పుడే, దీనితోపాటు మొత్తం జాతీయ సంపత్తిని దశగుణంగా - కాదు, సహస్రాధికంగా - అభివృద్ధి చేసి, దానిలో ప్రతిపౌరుని భాగస్వామిగా చేసినప్పుడే, మనకు వాస్తవంగా స్వాతంత్ర్యం సిద్ధించినట్టు!

ఆకలిగొన్న వానికి భగవంతుడు సాక్షాత్కరించవలసింది అన్నం రూపంలోనే అని ఒక సందర్భంలో గాంధీజీ పలికివున్నాడు. మన జాతికి జాతి ఆకలిగొని ఉన్నది. దానికి స్వాతంత్ర్యం సాక్షాత్కరించవలసింది అన్నం రూపంలోనే. మనది వెలితి బ్రతుకు. మనకు స్వాతంత్ర్యం ప్రసన్నంకావలసింది సుభిక్షం, సమృద్ధి రూపాలలోనే!

పెట్టుబడిదారులకు మరింతగా లాభాలు, చదువుకొన్నవారికి మరికొన్ని ఉద్యోగాలు, పదవీ వ్యామోహంగల వారికి దాని పరితృప్తికై బహుళావకాశాలు ఇంతే కానుంటే, ఆగష్టు 15 న జరగనున్నది స్వాతంత్ర్య భానూదయం కాదు. (ఆంధ్రప్రభ 10-8-1947)

6

అన్ని రోజు లెట్టివో, పండుగ రోజు లెట్టివో, ఒకటి పండుగరోజు కావడానికి దానికి మనం ఆపాదించుకొనే ప్రత్యేకతే కారణం, మనం సమకూర్చుకొనే వైశిష్ట్యమే కారణం.

ఇదే శకాలకు కూడా వర్తిస్తుంది. ఒకటి పాత శకం కావడం, మరొకటి కొత్తది కావడం,

ఒకటి అంధకారభరితమైనది కావడం, మరొకటి మహోజ్జ్వలమైనది కావడం కాలగతిపై ఆధారపడి ఉండదు. శకాల స్వరూపాన్నీ, స్వభావాన్నీ నిర్ణయించేది కేవలం మానవ ప్రయత్నమే. మానవుడు మార్పు చెందనంతవరకు అది పాత శకం, మార్పు చెందితే అది నవశకం. అతడు అభ్యున్నతి పథాల మెట్టితే, అది మహాశకం, అధోగతిపాలైతే అది హీనశకం. మరి నాలుగు రోజులలో ఒక పాత శకం అంతరించి, ఒక కొత్త శకం ప్రవేశిస్తున్నదని విశేషానంద సంభ్రమోద్వేగాలను చెందుతున్న మనం ఈ విషయాన్ని ఎంతమాత్రం విస్మరించరాదు. అప్రయత్నంగా మనకు రాజకీయ స్వాతంత్ర్యం లభించనట్టే, అప్రయత్నంగా నవశకం ప్రవేశించబోదు. బానిసబ్రతుకుకు, స్వాతంత్ర్యజీవితానికి ఎంతో అంతరం ఉన్నది. స్వాతంత్ర్యం వల్ల కొన్ని హక్కులు సిద్ధించడంతోపాటు ఎన్నో బాధ్యతలు సంక్రమిస్తాయి. వాటిని గుర్తెరిగి, తదనుగుణ్యంగా వర్తించగలిగితేనే మనకు వాస్తవంగా స్వాతంత్ర్యం లభించినట్టు, అప్పుడే వాస్తవంగా నవశకం ప్రవేశించినట్టు! స్వాతంత్ర్యసిద్ధితో మనలో ముఖ్యంగా మానసిక విప్లవం రావాలి. పూర్వపద్ధతులపై ఆలోచించడం మానినప్పుడే, పూర్వసద్ధతులలో ప్రవర్తించడాన్ని మానివేయగలము. ఒకడు ఎక్కువ, మరొకడు తక్కువ; ఒకడు యజమాని, మరొకడు బానిస - ఇట్టి భావాలు మనలో లోతుగా వేళ్లు తన్ని ఉన్నాయి. వీటిని పూర్తిగా పెకలించివేస్తేనే కాని, మనకు అభివృద్ధి లేదు, అభ్యుదయం లేదు.

మనలో పాతభావాల ప్రాబల్యానికి మనం నిత్యంచేసే అనేక పదప్రయోగాలే తార్కాణం."శ్రీ జిల్లా కలెక్టర్ గారు", "శ్రీశ్రీశ్రీ జమీందారువారు", "చిత్తగించండి", "దివ్యచిత్తానికి తేవాలి", ఫలానావారు "విచ్చేశారు", "చేసుకునే మనవి ఏ మనగా" మర్యాద అనుకొని, ఈ విధంగా ఒకరికి లేనిపోని ఆధిక్యత నివ్వడం, మనకు లేనిపోని న్యూనత ఆపాదించుకొనడం ఇది మనకు పరిపాటి అయిపోయింది. దీని నుంచి బయటపడకపోతే సర్వజనులకు సమాన స్వత్వాలతో, సమస్తపౌరులకు సమానావకాశాలతో సముజ్జ్వలమైన నూతన సాంఘికవ్యవస్థ అవతరించదు!

"పెట్టి పుట్టినవాడు", "పూర్వజన్మ సుకృతం" మొదలైన భావాలు కూడా ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు విరుద్ధమైనవే. స్వతంత్రదేశంలో - ప్రజాస్వామ్యరాజ్యంలో - ప్రతి ఒక్కరు పెట్టిపుట్టినవాడే కావాలి; ప్రతి ఒక్కడు పూర్వ జన్మలో సుకృతం చేసుకొన్నవాడే కావాలి. ఒకనికి భోగభాగ్యాలు, మరొకనికి దుర్భర దారిద్ర్యం లలాట లిఖితాలని నమ్మేదికాని - చెప్పేదికాని - స్వతంత్ర దేశం కాదు, ప్రజాస్వామ్య సంఘం కాదు.

ఈ అన్ని విషయాలను గుర్తించినపక్షంలో మనలో ఆగష్టు 15వ తేదీతో ఎంతటి తీవ్ర మానసిక విప్లవం ప్రారంభం కావలెనో తెలుస్తుంది. (ఆంధ్రప్రభ 11-8-1947)

7

స్వాతంత్ర్యానుభూతికి ప్రధమార్హత ఆత్మ విశ్వాసం. ఆత్మవిశ్వాసం లేనివాడు స్వతంత్రుడై నప్పటికీ బానిసతో సమానుడే. ఆత్మవిశ్వాసం అహంకారంగా పరిణమించగల ప్రమాదం లేక పోలేదు. నిజానికి ఆ రెండింటికి భేదం తరతమాలలోనే. అహంకారి ఆత్మవిధ్వంసనాన్ని కోరి తెచ్చుకొంటాడు. అయితే అహంకారిగా సర్వవిధ్వంసనం సయితం ఆత్మ విశ్వాసరహితమైన నిస్తేజ నిర్వీర్య నీరస జీవితంకంటే ఎంతైనా వాంఛనీయం.

ఆత్మవిశ్వాసాన్ని - దానితోపాటు సహజంగా ఆత్మగౌరవాన్ని - కోల్పోయినందున మన జాతి బానిసత్వానికి లోనుగావలసివచ్చింది. ఆత్మవిశ్వాస ప్రదీప్తివల్లనే అది మరి రెండు రోజులలో స్వాతంత్ర్యాన్ని పొందబోతున్నది. ఈ స్వాతంత్ర్యం పదికాలాలపాటు నిలవడం మనలో నేడు కానవస్తున్న ఆత్మ విశ్వాసం ద్విగుణీకృతమైనప్పుడే.

హనుమంతుడు సర్వశక్తి సంపన్నుడేకాని, అతడికి ఆత్మవిశ్వాసం లేదట. ఎవరో ఒకరు ప్రోత్సహించనిదే ఏ పనికీ అతడు పూనుకోలేదట. ఇందు వల్లనే తన బలసంపత్తి కారణంగా వానరరాజు కావలసిన హనుమంతుడు తన కంటే ఎంతో హీనబలుడైన సుగ్రీవునికి బంటు కావలసివచ్చిందట. ఇండియా హనుమంతుడని, ఇంగ్లాండు సుగ్రీవుడని అనుకొన్నపక్షంలో గడిచిన రెండు శతాబ్దాలలో భారతదేశపు బానిసత్వకారణం ఇట్టే తెలిసిపోతుంది.

మనకు ఇంతటి అంగబలం కలదని, అంతటి అర్థబలం కలదని గొప్పలు చెప్పుకొంటే ప్రయోజనం శూన్యమే! ఆత్మవిశ్వాస సమేతమైతేనే ఈ అంగబలం, ఈ అర్థబలం జాతీయసంపత్తిగా మారడమైనా, దాన్ని మనం భోగించడమైనా.

ఒకనాడు మన దేశస్థులు తెరచాప పడవలపై మహాసముద్రాలను దాటి వెళ్ళారు. తమ ఢాకా మల్లీలను, తమ కలంకారీ అద్దకాలను మాత్రమే కాకుండా, తమ గాజు పెంకులను కూడా దేశదేశాలలో అమ్ముకువచ్చారు. ఆనాటి మన వ్యాపారంలో ఇతరులను

దోచుకొనడం ఒక భాగమైతే, ఆ దోపిడిని వర్జించాలి. కాని, ఆనాటి ఆత్మవిశ్వాసం తిరిగి మన సొత్తు కావాలి. లేకపోతే, మన దేశం నుంచి అవిద్య తొలగదు, అజ్ఞానం తొలగదు, దారిద్ర్యం తొలగదు, దైన్యం తొలగదు.

ఎవరికి వారిచ్చుకొనగల విలువలకంటె అన్యులు ఎక్కువ విలువ నివ్వబోరు. అంతేకాదు. తాను చేతకానివాడినని భావించుకొనేవాడు ఏ పనీ చేయలేడు.

ఆత్మనిందను, మరొక దృష్టితో చూచి, ఆత్మవంచన కూడా అనవచ్చు. స్వోత్కర్ష చేసుకొనేవ్యక్తి, ఎల్లప్పుడు కాకపోతే, కనీసం కొన్ని సందర్భాలలోనైనా తనను గురించి తాను చెప్పుకొనే మాటలలో కొన్నింటికైనా తాను అర్హుడనని నిరూపించుకోవలసివుంటుంది. ఇక, ఆత్మనింద చేసుకొనే వ్యక్తి పడిపోగల అగాధానికి అంతు లేదు.

"ప్రపంచంలో ఏ జాతికీ మనం తీసిపోము. అన్యులకు సాధ్యమైంది మనకు అసాధ్యం కాబోదు. నా కృషికి, నా విజయానికి అవధి నేను నిర్ణయించు కొనవలసినట్టిదే" - ఇంతటి ఆత్మవిశ్వాసం మనలో ప్రదీప్తం కాకపోతే, ఆగష్టు 15వ తేదీనాడు మనం వెలిగించుకొనేవి చిరుగాలికైనా ఆరిపోగల మట్టి ప్రమిదెల దీపాలే! (ఆంధ్రప్రభ 13-8-1947)

14 AUGUST 1947

మరి ఒక పగలు, ఒక రాత్రి గడిస్తే చాలు - కేవలం 24 గంటలు నడిస్తే చాలు - స్వాతంత్ర్య భానూదయం జరుగుతుంది.

దాదాపు రెండు శతాబ్దాలపాటు పారతంత్ర్యం గాఢాంధకారంలో గడిపిన పిమ్మట మరి 24 గంటలలోపల స్వాతంత్ర్య కాంతిపుంజాలను చూడగలమని విశ్వసించడం కష్టమైన పనే! అయినా, చీకటినుంచి వెలుగులోకి మనం అడుగిడుతున్న మాట నిజం. చీకటికి అలవాటుపడిన కళ్లకు వెలుగును చూడ్డం ఆదిలో కష్టమే కావచ్చు. కాని, బానిసత్వపు చీకటి దాదాపు ఒక శతాబ్దినుంచి మనకు బాధాకరమైనందున, గత అర్ధశతాబ్దిలో అది అహరహం మనకు దుస్సహమైనదిగా పరిణమించినందున, స్వాతంత్ర్య భానూదయం మనకు మహాపర్వం కాగల దనడం నిస్సందేహం.

ఈ పర్వదినాన్ని సభలతో, సమావేశాలతో, ఉత్సవాలతో, ఊరేగింపులతో, జరుపుకొనడం చాలదు. ఒక విషయాన్ని - ఒక అతిముఖ్య విషయాన్ని - రేపు మనం మన హృదయాలపై హత్తించుకొనడానికి ప్రయత్నించాలి.

నేటివరకు దేశం మనది, ప్రభుత్వం మరొకరిది. నేటివరకు ప్రజలము మనము, ప్రభువులు మరొకరు. రేపటి నుంచి దేశం మనదే, ప్రభుత్వం మనదే! రేపటి నుంచి ప్రజలము మనము, ప్రభువులము మనమే!

మనకు కూడు తక్కువైనా, గుడ్డ కరవైనా, మనం చదువుకు నోచుకొనక పోయినా, ముందుకు చిక్కుపడినా - ఒక్క మాటలో - మనకు ఏది లోపమైనా ఈనాటి వరకు మనం పరప్రభుత్వాన్ని నిందిస్తూ వచ్చాము. మన దేశ పరిపాలనాబాధ్యత పరప్రభుత్వానిది కనుక, జీవితావశ్యకాలకు లోపం లేకుండా చేయడం ఏ ప్రభుత్వానికైనా ప్రథమ బాధ్యత కనుక, మన కష్టాలన్నింటికీ మన క్లేశాలన్నింటికీ నేటి వరకు మనం ప్రభుత్వాన్ని నిందించివుండడంలో ఏమీ తప్పులేదు కూడా.

కాని, రేపటి నుంచి ప్రజలమైనా, ప్రభుత్వమైనా మనం ఒక్కరమే కాబట్టి, ప్రభుత్వనింద ఆత్మనిందగానే పరిణమిస్తుంది. రేపటి నుంచి ఏమి తప్పు జరిగినా, అది మన తప్పేకాగలదు. కాబట్టి, ఎట్టి లోపం లేకుండా అన్నింటినీ చక్కబెట్టుకొనడం మనలో ప్రతి ఒక్కరి బాధ్యత.

నేటి వరకు ప్రభుత్వమన్నా, దానితో సంబంధమన్నా అది చెడ్డ పీడగా తోచింది. ప్రభుత్వోద్యోగి, అతడెవడైనా సరే, మనకు పీడాకరుడుగానే తోచాడు. ఈ భావనను రేపటినుంచి మనం మన మనోఫలకంపైనుంచి పూర్తిగా చెరిపివేసుకోవాలి. ఇక మీదట ప్రభుత్వోద్యోగులు ఒక విజాతీయ, నిరంకుశ ప్రభుత్వపు ఏజెంట్లు కారు; వారు మన భృత్యులు. వారి విధి మనకు సేవ చేయడం, మన కర్తవ్యం వారిచే సేవ చేయించుకోవడం.

విదేశీయ ప్రభుత్వానికి ఏజెంట్లు అయినందువల్లనే కాక, మన చేతలవల్ల కూడా మన దేశంలో ప్రభుత్వోద్యోగులలో పెక్కుమంది హృదయంలేని అవినీతిపరులైపోయారు. స్వలాభాన్ని కోరి, వారి ప్రాపకాన్ని సంపాదించుకొనడంకోసం వారిని ఆశ్రయించడం, ముఖస్తుతి చెయ్యడం, ముడుపులు చెల్లించుకొనడం మొదలైన పాడుపనులను మనం మానివెయ్యాలి. వారిని తృణీకరించడం, ధిక్కరించడం తగదుగాని, వారికి లేనిపోని ఆధిక్యత నివ్వరాదు. తమకు లేని అధికారాన్ని చెలాయించగోరితే, దాన్ని సహించరాదు. ఇదే సమయంలో ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణలో వారితో పూర్తి సహకారాన్ని నెరపాలి. ఇకముందు కూడా భారతీయ ప్రభుత్వోద్యోగులు అసమర్థతకు, అవినీతికి, నిరంకుశత్వానికి పెట్టింది పేరుగా నిలిస్తే, అది మనకే కళంకం. ఈ విషయాలన్నింటిని పూర్తిగా గుర్తించి, ఇందుకు అనుగుణంగా మనం వర్తిస్తేనే, మన దేశపరిపాలన సరిగా సాగడమైనా, మన సమస్యలు సవ్యంగా పరిష్కారం కావడమైనా, మన స్వాతంత్ర్యం సార్థకత గాంచడమైనా!! (ఆంధ్రప్రభ 14-8-1947)

9 15 August 1947



దాస్యాంధకారం తొలగింది; స్వాతంత్ర్య భానూదయం జరిగింది. మన పారతంత్ర్యం శృంఖలాలు ఘుల్లుమని తెగిపోయాయి; తిరిగి మనం స్వతంత్ర్య ప్రజలమైనాము.

ఘోర జాతీయ కళంకం తొలగింది. ఇక, మనం దివ్యప్రభలతో వెలుగొందవచ్చు.

పంజరం తలుపు తెరచుకొన్నది. ఇక, దివ్యాంబర పథాలలోకి ఎగసిపోయి, స్వేచ్ఛావిహారం చెయ్యకపోతే, తప్పు మనదే. ఎంత శుభదిన మిది! ఎంత సంతోషదిన మిది! ఎంత పర్వదిన మిది! ఎంతటి చారిత్రాత్మక దినమిది!

మన దేశ చరిత్రలోనే కాదు, ప్రపంచ చరిత్రలోనే ఇది చారిత్రాత్మక దినం!

నలభైకోట్ల ప్రజ మానవజాతిలో అయిదవవంతు - నేడు స్వాతంత్ర్యాన్ని పొందింది; ఇక ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగు మహత్తర దినం కాకపోతే, మరి ఏది కాగలదు?

ఈ దినాన్ని చూడగలగడం మన అదృష్టం! ఇట్టి అదృష్టం అందరికీ పట్టదు!! ఈ పుణ్యదినాన్ని చూడాలని ఎందరు ఆతురత చెందలేదు? ఎందరు ఆవేదన పొందలేదు?

దాదాభాయ్ నౌరోజీ, సురేంద్రనాథ్ బెనర్జీ, ఫెరోజే మెహతా, డి.ఇ. వాచా, ఆనందాచార్యులు, గోపాలకృష్ణ గోఖలే, జి. సుబ్రహ్మణ్య అయ్యర్, బదురుద్దీన్ త్యాబ్జీ, కృష్ణనాథ్ త్రింబక్ తెలాంగ్, డబ్లియు.సి. బెనర్జీ, న్యాపతి సుబ్బారావు, మోచర్ల రామచంద్రరావు మొదలైన కాంగ్రెసు పితామహులు నేడు సజీవులై ఉంటే ఆనందబాష్పాలతో వారి కన్ను చెమ్మగిలివుండేదికాదా? బాలగంగాధర తిలక్, లాలాలజపత్ రాయ్, చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూ, అన్సారీ, అజ్మల్ ఖాన్, సేన్ గుప్త, మదనమోహన మాలవ్యా ప్రభృతులు కాలధర్మం చెందివుండకపోతే, నేడు సంతోషాతిరేకంచేత వారు పులకాంకితులై ఉండేవారు కారా?

ఖుదీరామ్ బోస్, సత్యేంద్రనాథ్ బోస్, అమీర్ చంద్, విష్ణు గణేశ పింగళే, రాంప్రసాద్ బిస్మిల్, భగత్సింగ్, అవధ్ బిహారీ మొదలైన అశేష విప్లవవర్గ నాయకులు ఉరికంబానికి బలికాకుండా వుంటే, నేడు ఎంత పొంగిపోయి ఉండేవారో!

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం, శ్రీనివాస అయ్యంగార్, సత్యమూర్తి మొదలగువారు నేడు మనమధ్య ఉంటే, ఎంతగా సంతోషోద్విగ్నులై ఉండేవారో!

వీరే కాదు; మరి ఎందరో - వారు కీర్తి ప్రతిష్ఠలు పొంది ఉండవచ్చు, లేదా, విస్మృతిలో అణగిపోయి ఉండవచ్చు - స్వాతంత్ర్య సమరరంగంలో తమ అసువులను కోల్పోయారు. జీవితకాలంలోవలె మరణసమయంలో కూడా దేశ దాస్యవిముక్తి ఒక్కటే వారి హృదయాన్ని తీవ్రంగా సంక్షుభిత పరచింది. వీరందరు ఏ రోజును చూడ్డానికై జీవించారో, దేన్ని చూడ లేకుండానే మరణించారో, దాన్ని చూడగల మహద్భాగ్యం మన కబ్బింది. ఇది సామాన్యమైన అదృష్టమా?

అదృష్టం అబ్బడంకంటెకూడా, అది అబ్బినట్టు గుర్తించడం ముఖ్యం. అదృష్టం అబ్బినట్టు గుర్తించడమైనా చాలదు; అది ప్రాతిపదికగా కొత్త సీమలకు, కొత్త దిశ్చక్రాలకు విస్తరించాలి; కొత్త శిఖరాలను అందుకోవాలి. అప్పుడే నేటి ఈ స్వాతంత్ర్యానికి తగు పరిణతి; అప్పుడే దీని సాధనలో ప్రాణ త్యాగంచేసినవారందరికీ ఆత్మశాంతి!

సమస్త ప్రపంచం నేడు మనవంక దృష్టిని సాగిస్తున్నది. ముఖ్యంగా ప్రాచ్యజాతి మనపై కొండంత ఆశ పెట్టుకొన్నది. మన స్వాతంత్ర్యం తమ దాస్యవిముక్తికి నాంది కాబోతున్నట్టు సింహళం, బర్మా, మలయా, వియత్నామ్, ఇండొనీసియా, కొరియా మొదలైన ఆసియన్ రాజ్యాలెన్నో ఆశిస్తున్నాయి. వాటి ఆశను నిరాశ చేస్తే, మన పురోభివృద్ధికి తీవ్రప్రతిబంధకాలు తప్పవు.

ఈ చారిత్రాత్మక సమయంలో మనం చారిత్రాత్మకంగా వర్తించాలి. మన చిక్కులను మనం తీర్చుకోవాలి; మన ఇల్లు మనం చక్కబెట్టు కోవాలి; బలిమిని, కలిమిని మనం సంపాదించుకోవాలి; శక్తిని, దీప్తిని మనం సాధించాలి. ఇదే సమయంలో ప్రతి పరతంత్రదేశానికి, ప్రతి స్వాతంత్ర్యవంచిత సంఘానికి మనం తోడునీడగా నిలవాలి.

కేవలం ఆసియాప్రజలే కాదు; ఆఫ్రికావాసులు, అమెరికన్ నీగ్రోలు శ్వేతేతరజాతులకు చెందిన అన్యులు మన నాయకత్వంకోసం, మన నైతిక సహాయంకోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయంలో వారికి ఆశాభంగాన్ని కలిగిస్తే, అది పీడిత ప్రజాకోటిపట్ల మహాద్రోహమే కాగలదు.

నేడు మనకు అబ్బుతున్న భాగ్యం ఎంత అధికమైనదో, అంతకంటే కూడా నేటినుంచి మనపై పడనున్న బాధ్యత అధికమైంది. అందుచేత ఇదివరలో కంటే ఇకముందే మనం ఎక్కువ దీక్ష చూపాలి, ఎక్కువ త్యాగం చెయ్యాలి, ఎక్కువ ధైర్యసాహసాలు ప్రదర్శించాలి, ఎక్కువ విజ్ఞతతో ప్రవర్తించాలి.
ఇతోధిక కృషికే కాని విశ్రాంతికి ఇది సమయం కాదు.

ద్విగుణీకృత ధీరతకే కాని విరామానికి ఇది తరుణం కాదు.
ప్రపంచ ప్రధానరాజ్యాల శ్రేణిలో నిలిచినప్పుడే - కాదు, ఆ శ్రేణిని అధిగమించినప్పుడే - మనకు విరామం, అప్పుడే మనకు విశ్రాంతి!
"వందేమాతరం!"
"జైహింద్!!"

"ఇన్ క్విలాబ్ జిందాబాద్!!" (ఆంధ్రప్రభ 15-8-1947)

15 August 1948

తిరిగి ఆగష్టు 15 వ తేది వచ్చింది (1948)

ఒక ఏడాదినాడేనా మనకు జాతీయస్వాతంత్ర్యం లభ్యమైంది? లాల్ ఖిల్లాపై నుంచి యూనియన్ జాకు దించివేసి, త్రివర్ణపతాకను ఎక్కించడం పన్నెండు నెలల క్రితమేనా జరిగింది? అయినా, ఇది పన్నెండేళ్లనాటి సంఘటన వలె మనకు తోస్తున్నదేమి?

నేడు అప్రయత్నంగా స్ఫురిస్తున్న ప్రశ్న ఇదొక్కటే కాదు. ఇది శుభదినం గదా! అయినా, గత సంవత్సరంలో వలె శోభాయమానంగా కానరాదేమి? ఇది ఆనందోత్సవ సమయం కాదా? అయినా, వికసిత వదనాలపై విషాదచ్ఛాయలు కూడా ద్యోతకమౌతున్నవేమి? ఇది మనకు చారిత్రాత్మక దినం కాదా? అయినప్పటికీ హృదయం ఉప్పొంగ దేమి? లజ్జాభారమేదో మనలను క్రుంగదీస్తున్న దేమి?

ఈ ప్రశ్నలన్నింటికి ఒక్కటే ప్రత్యుత్తరం. అది ఈ సంవత్సర కాలంలో జరిగిన హత్యాకాండ. పంజాబ్ రాష్ట్రంలో హత్యలు; ఢిల్లీలోను, దాని పరిసరాలలోను హత్యలు; యు.పి.లోను, ఇతర ప్రాంతాలలోను హత్యలు. పైగా, ఇవి మతంపేరిట జరిగిన హత్యలు, దేవుని పేరిట జరిగిన హత్యలు.

తిరిగి ఆగష్టు 15వ తేది వచ్చింది

వీటిని మించి అమానుషత్వం లేదని తోచవచ్చు. ఇంతకుమించి మానవుడు అధమాధముడు కాలేదని కూడా తోచవచ్చు. కాని, మరింత ఘోరం సయితం జరిగింది. అది గాంధి హత్య. -

నరహత్యలతో పాటు ఇతర హత్యలు సయితం జరుగుతున్నాయి. అవి జీవితపు విలువలు హత్యలు!

- నీతినిజాయితీల హత్య, దయాధర్మాల హత్య, ప్రేమ కారుణ్యాల హత్య - అబ్బబ్బ! హత్యాకాండకు అంతూ పంతూ లేదు.

ఎవని బాగు వానిది, ఎవని బలుపు వానిది. తన బాగుకోసం, తన బలుపుకోసం, ఎవరి కడుపు కొట్టవలసివచ్చినా తగ్గదు!

ఎవని క్షేమం వానిది, ఎవని స్వార్థం వానిది. తన క్షేమంకోసం, తన స్వార్థం కోసం ఎందరి కొంప తియ్యవలసివచ్చినా తడబడదు!

తాను కొనవలసిన ప్రతి వస్తువు ధర మండిపోతున్నదని రైతు వాపోతాడు. కాని, తాను పండించిన ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్టుకు పట్టిస్తాడు.

తను తినదగు ప్రతివస్తువు ధర మండిపోతున్నదని రైతు వాపోతాడు. కాని, తాను పండించిన ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్టుకు పట్టిస్తాడు.

తను తినదగు ప్రతివస్తువు ధర విపరీతమైపోయిందని వర్తకుడు విలపిస్తాడు. కాని, తను బ్లాక్ మార్కెట్ రేట్లపైనేగాని వ్యాపారం సాగించడు.

ప్రతివర్గ మింతే; ప్రతిసంఘ మింతే. ఇందువల్లనే పేదలు నిరుపేదలౌతున్నారు; భాగ్యవంతులు మహాభాగ్యవంతు లౌతున్నారు. అన్నాతురులు మరింత క్షుత్పిడితు లౌతున్నారు; భోగపరాయణులు మరింత భోగలాలసు లౌతున్నారు.

నీతి నియమాలు - కాదు, మానవత్వమే - విలుప్తమై పోయినట్టు కానవస్తున్న ఈ సమయంలో పరిస్థితులను చక్కబరచడానికి ఏమి చర్య జరిపినా అది ప్రయోజనశూన్యమే అయిపోతున్నది. కంట్రోల్స్ నిలిపితే కొంత దోపిడి, వాటిని తొలగిస్తే మరింత దోపిడి!

ప్రభుత్వోద్యోగులను నమ్మితే, వారు తమ జేబులు నింపుకోవడం; ప్రజలపై భారం పెడితే, వారు పాతకక్షలు సాధించుకోవడం!

ఎంత శోచనీయం ఈ పరిస్థితులు! ఎంత సిగ్గుచేటు ఈ స్థితిగతులు!!

కాని, నిరాశ చెందరాదు, నిస్పృహను ఆవరించనివ్వరాదు.

రెండు శతాబ్దాలకు పైగా మన దేశం బానిసత్వంలో నిలిచింది. అప్పుడు మనం బ్రతికింది అబద్ధపు బ్రతుకు.

ఈ రెండువందల సంవత్సరాలలో మన జాతీయ జీవితంలో కొండలాదిగా పేరుకొన్న కశ్మలం, విప్లవంద్వారా మనకు స్వాతంత్ర్యం సిద్ధించివుంటే, దాని జ్వాలాశిఖలలో భస్మీపటలమై పోయివుండేదేమో! అట్లు జరగనందునే నేడు ఒక్కుమ్మడిగా అవినీతి వెల్లువలై పారుతున్నదేమో! ఏమైనా, ప్రస్తుత పరిణామాన్ని చూచి, భవిష్యత్తు విషయమై నిరాశచెందడమేమి, నిస్పృహను జనించనివ్వడమేమి ధీరలక్షణం కాదు.

ఇంతే కాక, అనేక సంతాపకర సంఘటనలమధ్య మరుగున పడిపోతున్నా, తక్షణమే వాటి ఫలితాలు తెల్లం కాకపోతున్నా, భావి పురోభివృద్ధికి కొన్ని పునాదులు పడుతున్నాయి. ఈ పునాదులు కొన్ని సరిగా త్రవ్వినవి కాకపోవచ్చు; కొన్నింటికి ఉపయోగించిన ఇటుక, సున్నం సరియైనవి కాకపోవచ్చు; మరి కొన్ని వంకరటింకరగా పడివుండవచ్చు. అయినా, వాటిలో కొన్ని తిన్ననివి ఉన్నాయి; గట్టివి ఉన్నాయి.

కాగా, ఒక జాతి జీవితంలో ఒక సంవత్సరం మహాసముద్రంలో ఒక నీటిబిందువుతో సమానం. పరిమితమైన మానవజీవితంలోనే ఈ సంవత్సరంలో జరిగిన పొరపాట్లను మరు సంవత్సరంలో దిద్దుకొనడానికి అవకాశం ఉంటుంది. అయినప్పుడు, ఒక జాతిగా మనం గతసంవత్సరంలో జరిగిన ప్రమాదాలను సవరించుకొనలేమా?

ఇందుకు కావలసింది ఒక్కటే. అది - వ్యష్టిదృష్టిని మాని, సమష్టి క్షేమాన్ని లక్షించడం. సమష్టిక్షేమానికి ప్రాధాన్యం రావడం సామాన్యప్రజలు సమైక్యంగా వర్తించినప్పుడే.

క్షుద్బాధాపీడితులు విడివిడిగా నిస్సహాయులే. కాని, ఏకమైనప్పుడు వారిని ఏ శక్తీ అడ్డగించలేదు. సంఘవంచితులు విడివిడిగా బలహీనులే. కాని, కలిసి నడిచినప్పుడు వారిని ఎంతటివారైనా ఆటంకపరచలేరు.

కడచిన సంవత్సరంలో మనం ఎదుర్కొన్న తుపానులు తక్కువ కావు. వాటినుంచి ప్రాణాలతో బయల్పడ్డంలో మనం చూపిన పాటవం సామాన్యమైనది కాదు. కాని, ముమ్ముందు మరింత తీవ్రమైన తుఫానులు మనకు తప్పక పోవచ్చు.

వీటిని అధిగమించాలంటే, మనకు ముఖ్యావసరమైనది ధీర, సత్య, త్యాగ, సంకల్పబలాలతో కూడిన సమైక్యతే.

స్వాతంత్ర్య సాధనకు అవసరమైన దానికి శతాధికమైన సమైక్యత మన కిప్పుడు కావాలి.

ఇట్టి సమైక్యతను మన ప్రజాసామాన్యం ప్రదర్శించినప్పుడు నిజాం సమస్య ఒక సమస్యగా మిగలదు; కాశ్మీర్ నుంచి పాకిస్థాన్ పరుగుతీయగలదు; లంచగొండి, బ్లాక్ మార్కెటీర్ మొదలైన సంఘ విద్రోహులు రూపుమాసిపోగలరు.

ధీర, సత్య, త్యాగ, సంకల్పబలాలతో కూడిన సమైక్యతాసాధన - ఇదే నేడు భారత ప్రజాసామాన్యం పట్టవలసిన దీక్ష!

(ఆంధ్రప్రభ 15-8-1948)

విభిన్న ప్రభావాలు (ఆగష్టు 15, 1949)

బొంబాయిలో లోకమాన్య తిలక్ స్మారక సభ, సిమ్లాలో లాలాలజపత్ రాయ్ శిలావిగ్రహ ప్రతిష్ఠాపనకై తీర్మానం, గురుదేవ్ టాగోర్ శాంతి నికేతనంలో ప్రపంచ శాంతివాదుల సభకు ఏర్పాట్లు, ఢిల్లీలో పండిట్ నెహ్రూ ప్రసంగం, గాంధీ జీవితచన యత్న సందర్భంలో ఇండియాకు లూయీ ఫిషర్ ఆగమనం నేటి వార్తలలో కానవచ్చిన ఈ వివిధాంశాలే ఈనాటి మా సంపాదకీయానికి ప్రేరణ.

నౌరోజీ, గోఖలే, మాలవ్యా, లజపత్ రాయ్, గాంధీ, తిలక్, టాగోర్, ఇక్బల్, నెహ్రూ ప్రభృతులందరు దేశభక్తులే.

దేశ స్వాతంత్ర్య వాంఛలో, దేశాభ్యుదయకాంక్షలో వీరు ఒకరి కొకరు తీసిపోనివారే, లేదా ఒకరి నొకరు మించిపోగలవారే.

ఐతే, సమాన లక్ష్యసాధనలో వీరి వైఖరులు భిన్నం; విధానాలు భిన్నం. ఇందుకు వీరి విభిన్న ప్రవృత్తులే కాకుండా, వీరి జీవితాలపై ప్రసరించిన విభిన్న ప్రభావాలు కూడా కారణం. ఉదాహరణకు, దాదాభాయి నౌరోజీ, గోపాలకృష్ణ గోఖలేలు బ్రిటీష్ లిబరలిజం ప్రభావంచే సమ్మోహితులైనవారు. లాక్, బెంథామ్, బ్రయిట్, మిల్, మోర్లేలు వీరికి గురువరేణ్యులు. స్వేచ్ఛ, విజ్ఞానం : ఇవి రెండే సకల సంఘారిష్టాలకు దివ్యౌషధాలని బ్రిటీష్ లిబరలిజం ప్రతిపాదించింది. సమానావకాశా లిచ్చినప్పుడు సమస్త మానవులు సమానాభ్యున్నతిని సాధించగలరని కూడా అది ఉద్ఘోషించింది.

మానవుడు వక్రంగా ఎందుకు ప్రవర్తిస్తాడు? వక్రంగా ఆలోస్తాడు గనుకనే. అతనికి విద్య చెప్పండి; విజ్ఞానం గరపండి; అతనితో వాదించండి; అతని జ్ఞాననేత్రం తెరవండి. అంతటితో అతడు ఉత్తమపౌరుడౌతాడు. పౌరులు ఉత్తము లైనంతనే సంఘం కూడా ఉత్తమమైనదే కాగలదు - ఇదే బ్రిటీష్ లిబరలిజం సిద్ధాంతాల సారాంశమని చెప్పవచ్చు.

ఈ సిద్ధాంతాలను పూర్తిగా ఆస్వాదించినవారైనందువల్లనే నౌరోజీ, గోఖలేలు ఇండియాపట్ల బ్రిటీష్వారి వైఖరికి వారి అజ్ఞానమే కారణమని భావించారు. దాన్ని మన వాదబలంతో తొలగిస్తే, స్వరాజ్య సంసిద్ధి తథ్యమని విశ్వసించారు.

నౌరోజీ, గోఖలేలవర్గానికి చెందినవారే ఫెరోజే మెహతా, భూపేంద్రనాధ్ వసు, డబ్లియు.సి. బెనర్జీ మొదలైనవారందరు.

బాలగంగాధర్ తిలక్, లజపత్ రాయ్, మదనమోహన మాలవ్యాలు వేరొక వర్గంవారు. వీరిలో అధికంగా కానవచ్చేది హిందూ సంస్కృతి ప్రభావమే.

హిందూ సంస్కృతి బహుముఖమైనది. అందువల్ల హిందూసంస్కృతి ప్రభావం వీరిపై సమానంగా పడినా, దాని ఫలితం వేర్వేరుగా పరిణమించింది.

1 హిందూ సంస్కృతిలోని క్షాత్రం ఆర్యసమాజంద్వారా వ్యక్తమైనట్టి క్షాత్రం - లజపత్ రాయ్ ను వశీకృతుని చేసుకొన్నది. స్వీయ సంస్కృతిపట్ల ప్రేమతోపాటు, అన్య సంస్కృతులపట్ల కొంత అసహనం, కొంతవరకు విద్వేషం దీనిలో భాగాలే. జాతీయతా భావప్రాబల్యంవల్ల నేమి, ఆధునిక ప్రపంచ పరిణామాల పరిజ్ఞానం వల్లనేమి, లజపత్ రాయ్ ఆర్య సమాజంద్వారా వ్యక్తమైన హిందూక్షాత్రధర్మంలోని అసహనాన్ని, విద్వేషాన్ని జయించడానికి ప్రయత్నించకపోలేదు. ఈ ప్రయత్నంలో కొంతవరకు కృతకృత్యుడైనా, తన జీవితంపై బాల్యంలోనే పడిన ఆర్యసమాజ ప్రభావానికి ఆయన పూర్తిగా అతీతుడు కాలేకపోయాడు.

హిందూ సంస్కృతిలోని క్షాత్రభాగ ప్రభావమే తిలక్ పై కూడా పడింది. అయితే, అది ఆర్యసమాజ ప్రేరితం కాదు. మహారాష్ట్ర చరిత్ర ప్రేరితం; వేదసంస్కృతి ప్రేరితం కాదు, భగవద్గీత బోధనల ప్రేరితం. అందువల్ల దానిలో కార్యాసక్తి కానవస్తుంది; సమదృష్టి ప్రస్ఫుటమౌతుంది; స్థితప్రజ్ఞ 'ద్యోతకమౌతుంది.

హిందూ క్షాత్రానికి తిలక్ ఒక ప్రతినిధి అయినప్పటికీ, ముస్లిముల విశ్వాసానికి ఆయన పాత్రుడు కాగలడానికి కారణ మిదే. ప్రత్యక్ష సంఘర్షణ కేమి, వీలుపడితే బలప్రయోగానికేమి సిద్ధాంతరీత్యా విముఖుడు కాకపోయినా, కార్యసాధనకు ప్రాధాన్య మిచ్చి, సమయానుకూలంగా వర్తించడానికి (రెస్పాన్సివ్ కోపరేషన్కు) ఆయన సంసిద్ధుడు కావడానికి కూడా కారణ మిదే. ఇక, పండిట్ మాలవ్యా విషయంలో హిందూ సంస్కృతిలోని క్షాత్రభాగం కంటె, ఆ సంస్కృతి ఎన్ని శతాబ్దాలలో ఎన్ని దెబ్బలు తిన్నా, చెక్కుచెదరకుండా నిలవడానికి తోడ్పడిన దాని పునాదుల (ఆచారాలు, సంప్రదాయాలు మొదలైనవని మా తాత్పర్యం) ప్రభావం అధికం. కనుక ఆయన పురోగామి కావడంతోపాటు పూర్వాచారపరాయణుడు; సంస్కరణాభిలాషి కావడంతోపాటు సంప్రదాయాలకు వ్యతిరేకంగా పోలేనివాడు.

పోతే, తిలక్వలె గాంధికూడా భగవద్గీతలపట్ల భక్తి కలవాడే; దాన్నే తన జీవితానికి ఆలంబనగా పరిగణిస్తున్నానని చెప్పినవాడే. అయితే, స్థితప్రజ్ఞ విషయంలో తప్ప గాంధి జీవితంపై భగవద్గీత ప్రభావం తక్కువ. ఆయనకు హిందూ సంస్కృతిలో కంటె బౌద్ధ, జైన,

క్రైస్తవ మతసిద్ధాంతాలతో సన్నిహితత్వం అధికం. తనకు గురుతుల్యులలో రస్కిన్, కార్పెంటర్, టాల్స్టాయ్‌ను గాంధి పేర్కొన్నాడు. వీరు క్రైస్తవ మతప్రబోధితులుగాని, హిందూ సంస్కృతివల్ల రూపొందినవారు కారు. దీన్ని బట్టి కూడా అది స్థితప్రజ్ఞ కిచ్చిన ప్రాధాన్యంవల్లనే భగవద్గీత గాంధిని ఆకర్షించినట్టు భావించవచ్చు. అన్య విధాల అది తనను ఆకర్షించలేక పోయినందునే భగవద్గీత అహింసను ప్రబోధిస్తున్నదని దానికి విపరీత వ్యాఖ్యానాన్ని ఆయన చేయడం తటస్థించింది కూడా. నిజానికి గాంధి ఏ ఒక మతానికి, ఏ ఒక సంస్కృతికి చెందనివాడేమో! అన్ని మతాల, అన్ని సంస్కృతుల సమన్వయాన్నే ఆయన లక్షించినట్టు కనబడుతుంది. ఈ సమన్వయ యత్నంలో ప్రేమకు, కారుణ్యానికి, నిరాడంబరత్వానికి, నిష్కామానికి ఆయన ప్రాధాన్య మిచ్చాడు.

రవీంద్రనాథ్ టాగోర్ కూడా వివిధ మతాల, విభిన్న సంస్కృతుల సమన్వయాన్ని లక్షించినవాడే. ఆయన అట్టి సమన్వయాన్ని లక్షించిన బ్రహ్మ సమాజంలో పుట్టి పెరిగినవాడు. అయితే, అన్యవిధాల గాంధి దృష్టినుంచి ఆయన వైఖరి పూర్తిగా భిన్నం. గాంధివలె ఆయన యంత్రయుగానికి విరోధి కాడు. గాంధివలె ఆయన దృష్టిలో విద్వేషించవలసిన ఒక రుగ్మత కాదు, మానవ పరిణామంలో మరొక మెట్టు. ఉపవాసాలద్వారా, బ్రహ్మచర్యంద్వారా ఇంద్రియాలను జయించాలని ఆయన చెప్పడు.

ఇంద్రియనిగ్రహ యత్నం ఎవరో కొందరు మహాత్ముల విషయంలో తప్ప, సాధారణంగా వెర్రితలలు వేయడం కద్దు. కనుక విశృంఖలంగా వర్తించకుండా, జీవితాన్ని పూర్తిగా అనుభవించాలనే ఆయన బోధిస్తాడు. ఆయన నిర్దేశించినట్టిది భోగానికీ, త్యాగానికీ మధ్యమమార్గం.

టాగోర్ వలె ఇక్బల్ కూడా సౌందర్యోపాసి. ఆయనవలె ఈయన కూడా విశ్వప్రేమను కీర్తించినవాడే. కాని, క్రమంగా ఇక్బల్లో జాతీయభావం నశించింది, మతదురభిమానం ప్రబలింది. సూఫీ తత్వబోధకుడుగా ఆయన జీవితాన్ని ప్రారంభించాడు; పోనుపోను ముస్లిం లీగ్ మూలస్తంభాలలో ఒకడుగా పరివర్తన చెందాడు.

పోతే, నెహ్రూపై వివిధ మతాల ప్రభావం ఎంత స్వల్పమో, వివిధ సంస్కృతుల ప్రభావం అంత ఘనం. ఆయనకు ఒక మతం వుంటే, అది సోషలిజం. అయితే, విశ్వాసాలవల్ల సోషలిస్టు అయినా, గాంధి ప్రభావానికి పూర్తిగా లోనైనవాడు. మానసిక విశ్వాసాలు ఒక వైపుకు, గాంధిపట్ల భక్తిప్రేమలు మరొక వైపుకు లాగగా, ఏదో ఒక రాజీ చేసుకోవడం ఆయన ప్రవృత్తిలో ఒక భాగమైపోయింది.

ఈ విధంగా వివిధ ప్రభావాలకులోనై విభిన్న మార్గాల మన దేశస్వాతంత్ర్య సాధనకై కృషిచేసిన అనేకమంది నాయకులు తమద్వారా మనపై ప్రసరింపజేసిన ప్రభావాలకు ఈనాడు మన దేశం క్రీడారంగం. ఏక సమయంలో విభిన్న దిశలలో నడవడానికి మనం ప్రయత్నం చేస్తున్నామనే అభిప్రాయం కలగడానికి కారణ మిదే. కాని, ఈ నాయకులందరి లక్ష్యం ఒక్కటే అని, అది దేశ సౌభాగ్యమే అని గుర్తిస్తే, ఎన్ని దిశలలో నడిచినా, మనం ఒక గమ్యం చేరగలుగుతాము. (ఆంధ్రప్రభ 15-8-1949)

ఆగష్టు 15, 1960

ఈనాడొక పండుగ, పెద్ద పండుగ, ప్రజల పండుగ. ఔను! ఇది ప్రజల పండుగ; ప్రజావిజయాన్ని కీర్తించే పండుగ; ప్రజాస్వాతంత్ర్యాన్ని సంస్తవించే పండుగ; ప్రజాస్వామ్యానికి నీరాజనా లెత్తే పండుగ.

తక్కిన మన పండుగలు వైకుంఠాధిపతినో, కైలాసవాసినో అయోధ్యాప్రభువునో, ద్వారకాపురీశ్వరునో సంస్మరించేవి, సంస్తుతించేవికాగా, ఇది దేవుళ్ల పండుగ కాదు, దేవతల పండుగ కాదు, రాజుల పండుగ కాదు, రాణుల పండుగ కాదు. ఇది ఒక కొత్త పండుగ;

ప్రజల పండుగ; తమ మధ్య పుట్టి, తమతో పెరిగి, తమకు నాయకుడై, తమ కష్టసుఖాలను పంచుకొంటూ, తన సేవకై సమస్తాన్నీ అర్పించి, తమను ముందుకు నడిపి, తమకు విజయాన్ని చేకూర్చిన గాంధి తమకు ప్రసాదించిన జాతీయ స్వాతంత్ర్య మహా వరప్రసాదాన్ని నలభైకోట్ల మంది తమ కళ్లకు అద్దుకొనడానికై పదమూడేళ్లనాడు ప్రారంభమైన పండుగ. ఈనాడు మన స్వాతంత్ర్య ప్రదాతను సంస్మరించడమే చాలదు; ఆయనకు భక్త్యంజలిని ఘటించడమే చాలదు; ఆయన నాయకత్వాన గెలుచుకొన్న స్వాతంత్ర్యాన్ని కలకాలానికీ నిలుపుకొనడానికి నేడు తిరిగి కంకణధారణ చెయ్యాలి. నిత్యజాగరూకత, స్వాతంత్ర్య రక్షణకు చెల్లించవలసిన మూల్యం. ప్రతితరం, ప్రతి పౌరుడు ఈ మూల్యాన్ని సముత్సాహంతో చెల్లించినప్పుడే స్వాతంత్ర్యానికి పరిరక్షణ. ఇది లేనప్పుడు ఏ రాజ్యాంగ విధానమైనా, ఏ సాయుధదళాలైనా, ఏ మిత్రరాజ్య సహాయమైనా జాతీయస్వాతంత్ర్యాన్ని పరిరక్షించలేవు. స్వాతంత్ర్యం ఒకరిచ్చేది, మరొకరు పుచ్చుకొనేది కాదు; ఒకరు కాపాడగా, మరొకరు నిలుపుకొనేదీ కాదు. అది ఎవరికి వారు తమ అంతరంగంలో ఒక అదృశ్యశక్తిగా - ఒక అద్భుత ఉత్తేజనంగా

ఒక అకలంకదీప్తిగా పదిలపరచుకొనవలసిన నైతికపు విలువ. ఆ విలువ అంతరంగంనుంచి విలుప్తమైనప్పుడు ఏ సాయుధబలాలు, ఏ బాహ్యాశక్తులు స్వతంత్రప్రజగా ఎవ్వరినీ నిలపలేవు. దీన్నే మరొక విధంగా కూడా చెప్పవచ్చు. దాస్యమైనా, స్వాతంత్ర్యమైనా ప్రధానంగా ఒక మనఃప్రవృత్తి మాత్రమే! దాస్య మనఃప్రవృత్తిగలవారిని దేవుడైనా స్వతంత్రులను చేయలేడు; స్వతంత్ర మనఃప్రవృత్తి గల వారిని హిట్లరు, ముసోలినీలను పోలినవారైనా బానిసలను చేయలేరు.

మనకు రాజకీయంగా స్వాతంత్ర్యం లభించినా, స్వతంత్ర మనఃప్రవృత్తి ప్రబల లేదు. అది ప్రబలుతున్న సూచనలైనా లేవు. నిజంగా స్వతంత్రులైనవారి తలపులలో, పలుకులలో, నడకలో, నడవడిలో ఒక విధమైన నవ్యత కనబడాలి. ఎంతో ఉదాత్తంగా వారు వ్యవహరించాలి, సృజనాత్మకశక్తితో తమ జీవితరంగాన్ని జ్యోతిర్మయం చేసుకోవాలి.

ఇది నేడు కానవస్తున్నదా? అప్రియవచనమైనా "లేదు" అనే ఇందుకు సమాధానం. దాస్యయుగంనాటి, అంధయుగంనాటి ఆలోచనలు, అభిరుచులు, అభిమానాలు, ఆచార వ్యవహారాలు ఈనాటికీ మన జీవితంలో అడుగడుగుకు ద్యోతకమౌతున్నాయి. ఈ విషయమై ఆత్మసంశోధన చేసుకొనడానికి ఈ స్వాతంత్ర్య దినోత్సవ మహాపర్వదినాన్ని మనం వినియోగించు కొనకపోతే, తక్కిన కొన్ని పర్వదినాలవలె ఇది కూడా అర్థరహితమైన ఆచార మౌతుంది, వ్యర్థవినోదంగా పరిణమిస్తుంది!

ఇంకను శైశవావస్థలోనున్న మన జాతీయస్వాతంత్ర్యానికి ఆంతరంగిక, బాహ్యశక్తులనుంచి ప్రమాదం స్పష్టంగా కనబడుతున్నది. వీటిలో మొదటిదానికి అస్సాంలో సంఘటనలను, రెండవదానికి ఉత్తర సరిహద్దులలోని పరిస్థితులను తార్కాణాలుగా పేర్కొనవచ్చు. ఈ ప్రమాదాలను తొలగించుకొనడానికి, అన్ని విరోధశక్తుల నుంచి మన స్వాతంత్ర్యాన్ని అన్ని.

విధాల పదిలపరచుకొనడానికి ఈనాడు ప్రతి పౌరుడు ఏ మేరకు కృతనిశ్చయుడు కాగలడో, ఆ మేరకే నేటి పర్వదినానికి అందమైనా, అర్థమైనా, అమృతత్వమైనా! (ఆంధ్రప్రభ 15-8-1960)

ఈనాడు (ఆగష్టు 15, 1964)

"సుజలామ్, సుఫలామ్, మలయజ శీతలామ్" అని మనం కీర్తించుకునే ఇండియా నేటిదో, నిన్నటిదో కాదు. దీని సరిహద్దులు కొన్ని సందర్భాలలో విస్తరించాయి; మరికొన్ని సందర్భాలలో కుచించుకుపోయాయి. కాబూల్ ఒకనాడు దీనిలో భాగం; ఈనాడు కరాచీ సయితం పరరాజ్యంలో ఉన్నది. ఒకప్పుడు బర్మా దీనిలో భాగం; ఈనాడు కాదు. సరిహద్దులలో ఈ విధమైన చిన్న, పెద్ద మార్పులతో నిమిత్తం లేకుండా కనీసం అయిదారు వేల సంవత్సరాలుగా ఇది ఒక ప్రత్యేక దేశంగా, ఒక విశిష్ట వ్యక్తిత్వంతో మనుతున్నది.

ఒకనాడిది హరప్పా, మొహంజొదారోల ఇండియా. తర్వాత వేదవేదాంగాల ఇండియా. పిమ్మట అయోధ్య, ఇంద్రప్రస్థాల ఇండియా, ఆ తర్వాత మగధ, పాటలీ పుత్రాల ఇండియా, అటు పిమ్మట శ్రీకాకుళం, ధాన్యకటకాల ఇండియా. ఆ వెనుక ఉజ్జయిని, కనూజ్ల ఇండియా. క్రీస్తుశకంలో తొలి సహస్రాబ్దాల తర్వాత కొంత కాలంపాటు ఓరుగల్లు, హంపి విజయనగరాల ఇండియా. తర్వాత మొగల్ పాదుషాల పరిపాలన కాలంలో ఢిల్లీ, ఆగ్రా, లాహోర్ ఇండియా. బ్రిటిషు వారు రాజ్యం చేస్తుండగా కలకత్తా, ఢిల్లీల ఇండియా, ఏమైనా - ఎప్పుడైనా - అది మాత్రం తన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని కోల్పోని ఇండియా.

చరిత్ర చూపుకు స్పష్టంగా అందని కాలంలో అది నాగ, ద్రవిడ, కిరాత, నిషాదాది జాతుల ఇండియా. తర్వాత ఆర్యులు వచ్చారు; యవనులు వచ్చారు; శకులు వచ్చారు; హూణులు వచ్చారు; తురుష్కులు వచ్చారు; ఇతర జాతులవారు వచ్చారు. క్రైస్తవులు, యూదీయులు, పార్శీలు, మహమ్మదీయులు మొదలైన వారెందరో వివిధ మతాలకు చెందిన వారు వచ్చారు. కొందరు దాన్ని జయించడానికి రాగా, మరి కొందరు దాన్ని దోచుకుపోవడానికై వచ్చారు. కొందరు స్వీయమత రక్షణకై రాగా, మరి కొందరు స్వీయ మతప్రచారానికై వచ్చారు. వివిధ కాలాలలో, విభిన్న ప్రేరణలతో వచ్చిన వారందరికి అది నీడనిచ్చి నిలకడ నిచ్చి, తన కన్న బిడ్డలను చేసుకొన్నది.

నేడు - ఆగష్టు 15వ తేదీని - స్వాతంత్ర్యోత్సవం జరుపుకునే సందర్భంలో వాడ వాడలో, వీధి వీధిలో, ఇంటింటిపై త్రివర్ణ పతాక మెత్తి, దానికి భక్తి శ్రద్ధలతో నమస్కరించే సందర్భంలో - మనది అధునాతన దేశమే కాక, అనాది దేశమని జ్ఞాపకం చేసుకోవాలి. ఏదో ఒక జాతికి, ఒక మతానికి, ఒక కులానికి, ఒక వర్గానికి చెందిన దేశం కాక, అందరినీ సమానంగా ఆదరించిన దేశమని జ్ఞాపకం చేసుకోవాలి. చరిత్ర దృష్టికి అందని కాలం నుంచీ ఎన్నో సంస్కృతులకు, నాగరికతలకు సంగమ స్థానమైన దేశమని జ్ఞాపకం చేసుకోవాలి. కొన్ని శకాలలో మహోచ్ఛస్థితిని, మరికొన్నింట మహాదీనస్థితిని అనుభవించిన దేశమని జ్ఞాపకం పెట్టుకోవాలి. బ్రిటిష్ పరిపాలనా కాలంలో కొన్ని రంగాలలో ముందుకు సాగినా, పెక్కింటిలో పూర్తిగా శిథిలావస్థకు దిగజారిపోయి, తిరిగి తన స్థితిగతులను చక్కబెట్టుకొనడానికి ఈ మధ్యనే ప్రయత్నం చేస్తున్న దేశమని జ్ఞాపకం పెట్టుకోవాలి.

అవ్యవస్థలో ఉన్న దేశానికి గౌతమ బుద్ధ బింబిసారులు, చాణక్య చంద్రగుప్తులు, సమర్థ రామదాస శివాజీలు ఇంతకు పూర్వపు కాలాలలో దిక్కు అయినట్టుగానే, ఈ కాలంలో దానికి బాసటగా నిలిచినవారు గాంధి నెహ్రూలు. వారి ప్రవృత్తులు భిన్నం; వారి ప్రేరణలు భిన్నం; వారి జీవిత దృక్పథాలు భిన్నం; అయినా, ఏక లక్ష్యాలకై - నిద్రాణమైవున్న దేశాన్ని జాగరితం చేయడానికై, దాస్య శృంఖలాబద్ధులైవున్న ప్రజలను స్వతంత్రులను చేయడానికై, శిథిలమైపోయివున్న జాతీయ జీవిత వ్యవస్థను నవశక్తి విలసితం చేయడానికై - విరతి లేకుండా, విశ్రాంతి లేకుండా దివారాత్రాలు వారు కృషి చేశారు; ఆ కృషికే ఆహుతి అయిపోయారు. ఈ నవభారత నాయకులిద్దరిలో గాంధీజీని మనం 1948 జనవరి 30వ తేదీని కోల్పోగా, నెహ్రూను ఈ సంవత్సరం మే 27వ తేదీని కోల్పోయాము.

ఇంతకు పూర్వం మన దేశంలో తలయెత్తిన మహామహుల బోధనను పాటించి, వాటికి అనుగుణంగా మన జీవితాలను తీర్చిదిద్దుకొనడానికి శక్తివంచన లేని కృషి చేస్తూ వచ్చినందునే అక్కడియన్, అస్సీరియన్, బాబిలోనియన్, హిటైట్, ఫొనీషియన్, ఈజిప్షియన్, మైనోన్, గ్రీక్, రోమన్ మొదలైన నాగరికత లెన్నో కాలగర్భంలో విలీనమైపోయినా, హరప్పా, మొహెంజొదారోల కాలం నుంచి ఈ మధ్యనే రాజస్తాన్లో పురాతత్వశాస్త్ర శాఖవారు కొనసాగించిన త్రవ్వకాల' ఫలితాలను బట్టి, అంతకు ముందుకాలం నుంచీ కూడా భారతీయ నాగరికత ఒక అవిచ్ఛిన్న స్రవంతి వలె, ఒక మహాజీవనది వలె ప్రవహిస్తూ వస్తున్నది. ఇదేవిధంగా ఇక ముందు కూడా అది ప్రవహించాలంటే, గాంధి, నెహ్రూలు కలలుగన్న రీతిలో దేశాన్ని రూపొందించడానికి, సంఘాన్ని పునర్నిర్మించడానికి మనం చిత్తశుద్ధితో, అకుంఠిత దీక్షతో కృషి చేయాలి.

నెహ్రూ మన మధ్య లేకుండా మనం జరుపుకుంటున్న ప్రథమ స్వాతంత్ర్య దినోత్సవ మిదే. నేడు ఆయన లాలిల్లా బురుజులపై తన శాంత గంభీరమూర్తితో నిలబడరు; లక్షలాది ప్రజల సమక్షంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, దానికి "సెల్యూట్ చేయరు; కర్తవ్య బోధ చేస్తూ, తన సహజ గంభీర ధోరణిలో ప్రసంగం చేయరు. ఈ కారణాన మనం ఆయన బోధనలను మరింత శ్రద్ధగా మననం చేసుకోవాలి; ఆయన నిర్దేశించిన మార్గాలలో మరింత దీక్షగా నడవాలి; ఆయన లక్షించిన నవభారతాన్ని అవతరింప జేయడానికి మరింత చిత్తశుద్ధితో కంకణధారణ చేయాలి.

అంధ విశ్వాసాలకు, మూఢాచారాలకు, అన్య సంకుచితత్వాలకు తావులేని నవ భారత దేశాన్ని నెహ్రూ లక్షించారు. రాజకీయ స్వాతంత్ర్యంతోపాటు ఆర్థిక సమతకు, సాంఘిక న్యాయానికి ప్రాధాన్య మిచ్చే సంఘ నిర్మాణాన్ని ఆయన కాంక్షించారు. ప్రాచీన సభ్యతలో, సంస్కృతిలో ఉత్తమమైనదాన్ని పరిగ్రహిస్తూ, తక్కినదాన్ని త్రోసిపుచ్చుతూ, నవసభ్యతను, సంస్కృతిని పెంపొందించుకోవాలని ఆయన అభిలషించారు. అవిద్య, అజ్ఞానం, దారిద్ర్యం, దైన్యం: ఇవి తాండవిస్తున్న దేశాన్ని సముద్ధరించగలిగినవి సైన్స్, టెక్నాలజీలే అని ఆయన ప్రబోధించారు. జాతి విద్వేషాలకు, యుద్ధ భయాలకు స్థానం లేని ప్రపంచంలోనే మానవాళి పురోగమించగలదని ఆయన ఉద్ఘోషించారు.

ఈనాడు ఆయనను మనం చూడలేము; ఆయన వాణిని వినలేము. అంతమాత్రంచేత ఆయన బోధనలను పెడచెవిని పెడితే ఆయనకు మనం ద్రోహం చేయడమే కాక, మనకు మనమే ద్రోహం చేసుకుంటాము; మన భవిష్యత్తుకు ద్రోహం చేసుకుంటాము.

(ఆంధ్రజ్యోతి 15-8-1964)

ఆగష్టు 15, 1972

ఏ సంవత్సరంలోనైనా ఆగష్టు 15 మనకు పర్వదినం. ఈ సంవత్సరం అది మహాపర్వదినం. రెండున్నర దశాబ్దాలుగా ప్రతి సంవత్సరంలో వలె, ఇది మన స్వరాజ్యానికి జన్మదినం మాత్రమేకాక, రజతోత్సవదినం కూడా.

ఇక్కడ అనావృష్టి, అక్కడేమో అతివృష్టి, అన్నిచోట్ల దుర్భిక్ష సూచనలు - ఈ పరిస్థితులలో ఏమి పర్వదినం?

పెరిగిపోతున్న ధరలు, కరవైపోతున్న నిత్య జీవితావశ్యక వస్తువులు, కరకుకోతగా పరిణమిస్తున్న బ్రతుకులు - ఈ పరిస్థితులలో ఏమి పర్వదినం?

ఎంత చదువుకొన్నా నిరుద్యోగం, ఏమి చదువుకొన్నా నిరుద్యోగం - ఈ పరిస్థితులలో ఏమి పర్వదినం?

ఎటు చూచినా అధికారదుర్వినియోగం, ఆశ్రితపక్షపాతం, అన్యవిధాల అవినీతి - ఈ పరిస్థితులలో ఏమి పర్వదినం?

కోటానుకోట్ల హృదయాలను ఈ విధమైన ప్రశ్నలు ఈనాడు వేధించవచ్చు. అయినా, ఇది ప్రతి భారతీయునికి ఒక మహాపర్వదినమే! కొత్త తరం వారికి తెలియకపోవచ్చుగాని, స్వరాజ్యంకోసం పోరాటం కొనసాగుతున్న సమయంలో మన జాతీయనాయకులు "సురాజ్యం స్వరాజ్యానికి ప్రత్యామ్నాయం కాదు" అని ఉద్ఘాటిస్తూ ఉండేవారు. ఇది నిజానికి ఒక బ్రిటిష్ ప్రధాని సూక్తి. ఆయన పేరు సర్ హెన్రీ కాంబెల్ - బెన్నర్మన్. బోయర్ల విషయంలో ఆయన "గుడ్ గవర్నమెంట్ ఈజ్ నో సబ్స్టిట్యూట్ ఫర్ సెల్ఫ్ - గవర్మెంట్" అని చెప్పాడు. ఆ బ్రిటిష్ ప్రధాని మాటనే నాటి మన బ్రిటిష్ పరిపాలకులకు మన నాయకులు అప్పజెబుతూ ఉండేవారు.

ఇదివరలోనే కాదు, ఇప్పుడైనా, ఎప్పుడైనా "సురాజ్యం స్వరాజ్యానికి ప్రత్యామ్నాయం కాదు." స్వరాజ్య వ్యవస్థలో ఎన్ని దొసగులైన ఉండవచ్చు, అవి ఎన్ని కష్టనష్టాలనైనా కలిగించవచ్చు, కొన్ని కొన్ని సందర్భాలలో కడగండ్లకు దారితీయవచ్చు అయినా, స్వరాజ్యానికి అదే సాటి. దాస్యంలో స్వర్గ సుఖాలకంటే స్వరాజ్యంలో నరకయాతనలూ ఒక లక్ష రెట్లు వాంఛనీయం. ఈ విశ్వాసంతోనే ఎందరెందరో లాఠీ దెబ్బలు తిన్నారు, జైలు శిక్షలు అనుభవించారు, ఉరికంబాల నెక్కడానికి సయితం వెనుదీయలేదు. ఈ విశ్వాసంతోనే ఎన్ని కష్టాలు పడవలసివచ్చినా, ఎన్ని త్యాగాలు చేయవలసివచ్చినా, అందుకు ఎందరెందరో సంతోషంగా సన్నద్ధులైనారు. స్వరాజ్యంతో మన సమస్యలన్నీ తీరనిమాట నిజమే. అయితే, అంత మాత్రం చేత స్వరాజ్య సముపార్జన తర్వాత దేశం అసలే పురోగమించ లేదనడం కంటే పొరపాటు లేదు. ఎన్ని రంగాలలోనో, ఎన్ని విధాలుగానో ఈ రెండున్నర దశాబ్దాలుగా దేశం ముందుకు నడిచింది. ఈ నడక మరింత త్వరగా జరిగి ఉండవచ్చు, మరింత సాఫీగా జరిగి ఉండవచ్చు. కాని, 17వ, 18వ శతాబ్దాలలో మన జాతీయ జీవితం బహుముఖాలుగా క్షీణించింది. అటుపైన దాదాపు మరి రెండు శతాబ్దాలపాటు బ్రిటిష్ దాస్యంలో మ్రగ్గిన తర్వాతనే మనం స్వరాజ్యం పొందినామన్న విషయాన్ని మరచిపోరాదు. ఈ నాలుగు వందల సంవత్సరాలలో కొండలాదిగా పేరుకు పోయిన పీడలన్నీ, కీడులన్నీ ఇరవై అయిదేళ్ళలో తొలగగలవా?

పైగా, మనది జనాభాకు సంబంధించినంతవరకు ప్రపంచం మొత్తం మీద రెండవ రాజ్యం. ఒకప్పుడు నాటి ప్రధాని నెహ్రూను "మీ కెన్ని సమస్యలున్నాయి?" అని ప్రశ్నించగా, "నలభై కోట్ల సమస్య"లని ఆయన సమాధానం చెప్పాడు. ఇప్పుడు మన జనాభా 55 కోట్లు కాబట్టి, ఇప్పుడైతే ఆయన సమాధానం "55 కోట్ల సమస్యలు" అయివుండేది.

ఇన్ని సమస్యలు ఒక్క నాటిలో తీరవు. ఒక్క తరంలోనైనా తీరవు. అందుకు కొన్ని తరాలపాటు కృషి జరగాలి. ముఖ్యంగా ఈ తరంలో దీక్షాయుతమైన కృషి జరగాలి; ఈ కృషి సందర్భంలో కష్టాలకు, త్యాగాలకు సన్నద్ధపడాలి. అప్పుడుగాని మరింత పురోభివృద్ధి సాధ్యపడదు, అప్పుడుగాని మన భవిష్యత్తు పదిలపడదు.

ఇప్పటి కొత్త తరంవారికి దాస్యబాధ తెలియదు, దానిలోగల అవమానాలు తెలియవు, ఆవేదనలు తెలియవు. ఈ కారణాన స్వాతంత్ర్యాన్ని, దాని విలువలను వారు పూర్తిగా అర్థం చేసుకోలేక పోవచ్చు, గౌరవించక పోవచ్చు. అందువల్ల ఇదివరలో స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నవారు ఈ తరంవారికి చెప్పవలసిన మాట "తాత్కాలికంగా మీకు ఎన్ని చిక్కులున్నా, చికాకు లున్నా స్వాతంత్ర్యాన్ని మించిన మహద్భాగ్యంలే"దని! "మేము పడిన కష్టాలను మించి, చేసిన త్యాగాలనుమించి మీరు కష్టాలు పడకపోతే, త్యాగాలు చేయకపోతే, మేము సంపాదించిన స్వాతంత్ర్యాన్ని మీరు కాపాడుకోలే"రని!!

స్వాతంత్ర్య సమరాలలో పాల్గొన్నవారు కొన్ని వేలమంది ఈనాడు మన మధ్య ఉన్నారు. మన స్వరాజ్యం స్వర్ణోత్సవం జరిగేనాటికి వీరిలో బహు కొద్దిమంది తప్ప మిగలకపోవచ్చు. అందువల్ల పూర్వపు స్వాతంత్ర్య యోధులు స్వాతంత్ర్యం ఎంతటి మహద్భాగ్యమో ఈనాడు ముక్తకంఠంతో ఘోషించడం ముఖ్యావసరం.

పాత తరంవారితోపాటు కొత్త తరంవారు సయితం మన స్వరాజ్యాన్ని, మన స్వాతంత్ర్యాన్ని సుదృఢం చేసుకోగలమని, సుస్థిరం చేసుకోగలమని ఈనాడు ప్రతిన పూనాలి. పునఃకంకణధారణ చేయాలి. (ఆంధ్రజ్యోతి 15-8-1972)

"శుభస్య శీఘ్రం"

(నిజాం సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడాన్ని హర్షిస్తూ రాసిన మొదటి సంపాదకీయాలు, రెండవ సంపాదకీయంలో విలీనానికి అంగీకారం తెలిపిన శుభవార్త ఉన్నాయి.)

ముక్కుకు త్రాడు పోయనిదే పోట్లగిత్త మాట వింటుందా? పాత చెప్పు చేత పుచ్చుకొననిదే కాట్ల కుక్కకు బుద్ధివస్తుందా? పనిచెప్పనిదే దయ్యం తోక ముడుస్తుందా?

చీపురుకట్టకు మూలనున్న ముసలమ్మను అడిగినా, ఆమె చెప్పేదింతే. అయినా, ఇందుకు వ్యతిరేకంగా మనం నడుచుకున్నాము. దీని ఫలితం, - నిజాం సమస్య అంతకంతకు విషమించడం.

బ్రిటిష్ వారి హయాంలో నిజాం సంస్థానం కుక్కిన పేనువలె పడివుండలేదా? అట్టిదానికే ఈనాడు ఇంతగా కాళ్లు వచ్చాయన్నా-ఇంతగా నోరు చేస్తున్నదన్నా - ఆ తప్పు మనదేకదా? ఒక్క నిజాం సంస్థానం నొష్టనే పొద్దుపొడిచిందా? ఇతర సంస్థానం దేనితోను

చేసుకొననట్టి యధారీతి ఒడంబడికను దానితోనే ఎందుకు చేసుకోవలసి వచ్చింది? అనవసరంగా ఈ ఆధిక్యత ఏనాడు చూపబడిందో - అకారణంగా ఈ ప్రాధాన్యం ఏనాడు కట్టబెట్టబడిందో - ఆనాడే మన అభిమతాల ధిక్కరణను మనం అనివార్యం చేసుకోలేదా?

మొట్టవలసినప్పుడు మొట్టక - నొక్క వలసినప్పుడు నొక్కక - మంచితనంగా పోవాలని మనం తాపత్రయపడి ఉండకపోతే, పరిస్థితులు ఇంతగా శ్రుతిమించి పోయేవా? "తిరిగి పానిపట్టు యుద్ధం తప్పదు" అని కాశిం రజ్వీ ప్రగల్భాలు పలక గలిగేవాడా?

సౌమ్యంగా వ్యవహారాన్ని పరిష్కరించుకోవాలని రాయబారాలతో మనం పొద్దుపుచ్చుతుంటే, నిజాం సంస్థానం మిన్నకుండలేదుగదా? ఈ లోపున అది ఆయుధాలను సేకరించుకున్నది. సైన్యాలను సమకూర్చుకున్నది. సంస్థానంలోపల నేమి, సరిహద్దులపై నేమి ప్రజాబాహుళ్యాన్ని భీతావహం చేసింది. పాకిస్థాన్కు అప్పుపేరుతో లంచమిచ్చి, దాని మద్దతు సంపాదించుకున్నది; బ్రిటిష్ కన్సర్వేటివ్లతోను అమెరికన్ కేపిటలిస్టులతోను చేయవలసిన కుట్రలన్నీ చేసింది. ఏదైనా ఒక ఓడరేవును చేజిక్కించుకోవాలని గోవాలోని బుడుతకీచులతో బేరాలు చేసింది.

ఈ చర్యలలో ప్రతి ఒక్కటీ విద్రోహంగా పరిగణించదగినట్టిదే.

అయినా, మనం చూస్తూ ఊరుకున్నాము. ఇంతేకాదు. మనవారి ఖూనీ జరిగినా, మన ఊళ్ళ దోపిడి జరిగినా, మన రైళ్ళపై ముట్టడులు సాగినా మిన్నకున్నాము. అందువల్లనే ఈనాడు తన నిరంకుశాధికారానికి ఏ విధంగా భంగం కలగడానికీ నిజాం సమ్మతించడంలేదు. బాధ్యతాయుత పరిపాలన స్థాపించడం, స్థాపించకపోవడం తన ఇష్టానుసారం జరగవలసిందేనని పేర్కొంటున్నాడు. ఇండియన్ యూనియన్లో చేరడమనే ప్రశ్నే రాగూడదంటున్నాడు. ఈ ప్రశ్న విషయమై ఒక నిర్ణయం జరగక తప్పదంటే, ప్లెబిసైట్ ద్వారానే అది తేలవలెనంటున్నాడు.

ప్లెబిసైట్ వెంటనే సాధ్యంకాదని నిజాముకు తెలుసు. దానికి ఏర్పాటులు జరగవలెనన్న సాకుతో కనీసం మరొక సంవత్సరం కాలయాపన చేయవచ్చుననికూడా తెలుసు. ఈ విధంగా ఇంకొక సంవత్సరం విరామం లభిస్తే, సంస్థానంలోని ప్రజోద్యమాన్ని అణచివేయడంలో మరింత తీవ్రత చూపవచ్చు; తన సైన్యాలలో చేరడానికి పఠానులను మరింతగా రప్పించుకోవచ్చు; రజాకార్ల దళాలను మరి కొన్నింటిని నిర్మించుకోవచ్చు; విదేశాలనుంచి దొంగతనంగా మరింతగా యుద్ధసామగ్రిని తెప్పించుకోవచ్చు. వర్తక, వాణిజ్యాల పేరుతో, పారిశ్రామికాభివృద్ధి సాకుతో ఆంగ్లో-అమెరికన్ కేపిటలిస్టులను ఆహ్వానించి, మరింతగా వారి సహాయ సహకారాలను పొందవచ్చు. ఇప్పటికంటె తీవ్రంగా, బాహాటంగా, నిర్భయంగా ఇండియాను ధిక్కరించవచ్చు. పైగా, ఇప్పటికే రజాకార్లది రాజ్యంగా ఉన్నది. మరికొంతకాలం పోతే, వారికి ఎదురే ఉండదు. గ్రామగ్రామంలో రజాకార్లను పెట్టి, ప్లెబిసైట్ జరిపితే, “ఇండియన్ యూనియన్లో చేరవలసిందే” అని ఎంత గుండెలు గలవాడైనా వోటు చేయగలడా?

ఏదో ఒక వంకతో ఎంత కాలయాపన చేస్తే, అంత మంచిది. అందుకే పాముచావకుండా, బడితే విరగకుండా ఎప్పటి కప్పుడు రాయబారాలు; అందుకే “ప్లెబిసైట్ జరపడం మీకు అభ్యంతరకరం కాదు గదా?” అని ప్రజాభిప్రాయంపట్ల ఎంతో భక్తి ఉన్నట్టు నటించడం!

ఇండో-నిజాం రాయబారాలు విఫలమైపోయినట్టు స్పష్టంగా కానవస్తున్నా, "రాయబారాలు విఫలమైపోయినట్టు ఇప్పటికీ భావించరాదు" అని నిజాం ప్రధాని మీర్ లాయక్ ఆలీ నిన్న ప్రకటించడంలో ఆంతర్యం రాజీ బేరాలతో ఇంకను జాగుచేయగోరడమే! ఎలాగైనా మరికొంత విరామాన్ని సాధించి, మరింతగా బలాన్ని సంపాదించుకొనగోరడమే.

ఈ ఎత్తును ఇండియన్ యూనియన్ ప్రభుత్వం ఇక పారనివ్వదనే సూచన ఈ మోసాన్ని ఇక సాగనివ్వదనే ధోరణి - నిన్న ఢిల్లీ నుంచి వెలువడిన ప్రకటనలో కానరావడం ముదావహం. ఏ యే షరతులపై నిజాంతో ఒడంబడిక సంభవమో ఈ ప్రకటన తెగవేసి చెప్పింది. ఇంతేకాదు; నిజాం సరిహద్దులలో శాంతి భద్రతల రక్షణకై అవసరం కాగల ఏ తీవ్ర చర్య గైకొనడానికైనా ఇక సంకోచం చూపబడదని స్పష్టం చేసింది. ఇది కేవలం బెదిరింపుకాదని నిరూపించడానికి.

నిజాం సరిహద్దుపైగా ముట్టడులను సాగిస్తున్న దుండగీండ్రను హతమార్చడానికి నిజాం సరిహద్దులలో ప్రవేశించమని ఇండియన్ యూనియన్ సైన్యాలకు ఉత్తరువు జారీ చేయబడిందికూడా.

ఈ ఉత్తరువులపై వ్యాఖ్యానం చేస్తూనే. "ఇలా బెదరించి ఊరుకోరనీ, దీన్ని అమలుజరపగలరనీ నేను ఆశిస్తున్నాను" అని కాశిం రజ్వీ ప్రకటించాడు.

యుద్ధం కావాలని రజాకార్ల నాయకుడు కోరుతున్నాడనే దీని తాత్పర్యం? అతని ముచ్చట తీర్చడంలో మనం ఎందుకు జాగుచెయ్యాలి? ఇట్టి మదోన్మత్తులు నిజాంలో విశృంఖలంగా సంచరిస్తున్నంతవరకు నిజాం సమస్య పరిష్కారం కానేకాదుగదా? యుద్ధం వినా వీరిని నిర్మూలించడానికి వీలులేకపోతే అట్టి యుద్ధం ఎంత త్వరగా జరిపితే అంత మంచిదికాదా?

శుభవార్త

"ఫ్లాష్ ఫ్లాష్ ఫ్లాష్" అంటూ నేటి మధ్యాహ్నం సరిగా 12 గంటల 35 నిమిషాలకు "టెలిప్రింటర్"పై ఒక న్యూఢిల్లీ వార్త వచ్చింది. మరి మూడు నిమిషాలకు "ఫ్లాష్, ఫ్లాష్, ఫ్లాష్" అంటూ ఇదే వార్త పునశ్చరణ చేయబడింది. నిజమే! ఈ వార్త మెరుపును పోలినదే!!

నిజాం సంస్థానానికి ఎంతకాలం విజ్ఞప్తులు? ఎంతకాలం దానితో రాయబారాలు? ఎంతకాలం దాని దుశ్చర్యలను సహించడం? ఔదార్యానికైనా ఒక హద్దులేదా? సహనానికైనా ఒక పరిమితి లేదా? - ఇట్టి అసంతృప్తి క్రమంగా నిరుత్సాహంగా మారింది; నిరుత్సాహం నిస్పృహ రూపాన్ని ధరించ నారంభించింది కూడా.

ఇప్పుడిప్పుడే స్వల్ప స్వల్పంగా క్రమ్ముకొన నారంభించిన ఈ నిస్పృహాంధకారంలో నేటి వార్త నిజంగా ఒక మెరపును పోలినదే.

యధారీతి ఒడంబడికను చేసుకుని దాన్ని పదేపదే ఉల్లంఘించినందుకు, నిజాం సంస్థానంపై తగు చర్యను గైకొనడానికి ఇండియన్ యూనియన్ ప్రభుత్వం నిర్ణయించినట్టు ఈ వార్త తెలియజేస్తున్నది.

ఎట్టి చర్య గైకొనదగునో కొన్ని రోజులుగా తీవ్రాలోచన చేయబడుతున్నదట. త్వరలోనే అతి త్వరలోనే - ఈ విషయమై ఒక నిర్ణయం జరగగలదట కూడా.

"మీ నిర్ణయం ఎప్పుడు జరగగలదు?" అని ఒక సభ్యుడు వేసిన ప్రశ్నకు “మీ సహనం అంతరించక మునుపే” అని సర్దార్ పటేల్ ప్రత్యుత్తర మిచ్చాడు కూడా. ఛలోక్తిగా ఆయన ఈ ప్రత్యుత్తరాన్ని ఉద్దేశించినా, దీన్నిబట్టి కొద్దిరోజుల లోపలనే తగు నిర్ణయం జరగగలదని విశ్వసించవచ్చు.

అయితే, “ఇప్పటికే మా సహనం దాదాపు పూర్తిగా సమసిపోయిందని మీకు తెలుసునా?” అని మరొక సభ్యుడు హెచ్చరించగా, సర్దార్ పటేల్ “లేదు” అని సమాధాన మివ్వడం తటస్థించింది కూడా.

- కేవలం ఛలోక్తిగా కాక, నిజంగానే ఆయన ఇట్టి సమాధానం చెప్పివుంటే నిజాం సమస్యకు సంబంధించి నంతవరకు ఇండియన్ యూనియన్ పౌరుల సహనం ముఖ్యంగా నిజాం సరిహద్దులలోని ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్ర జాతుల సహనం దాదాపు పూర్తిగా కాక, పూర్తిగానే అంతరించి పోతుందని సర్దార్ పటేల్ తెలుసుకొనడం ముఖ్యావసరం. -

స్వశక్తిపై పరిపూర్ణ విశ్వాసమున్నప్పుడే "పాపం పండనీ! తొందర దేనికి?" అనే ధోరణి సహజంగా వ్యక్తం కాగలదనడం నిజమే. అట్టి సందర్భంలోనే సర్దార్ పటేల్ నేడు పలికినట్టు ఛలోక్తులు పలకడం సాధ్యపడగలదనడం కూడా నిజమే.

స్వశక్తిపై విశ్వాసం లేనివాడు శాంత గాంభీర్యాలతో మాట్లాడలేడు; కోపావేశాలను ప్రదర్శిస్తాడు. అట్టివాడు హాస్యోక్తులాడలేడు; ప్రగల్భాలు పలుకుతాడు. ఇందుకు తార్కాణం - కాశిం రజ్వీలాయక్ ఆలీ మొదలైనవారు పరిపాటిగా ప్రదర్శించే కోపావేశాలే; వారు పదేపదే పలికే ప్రగల్భాలే.

తగు చర్యకు పూనుకోవాలేగాని, నిజాం సమస్యను తేల్చివెయ్యడం ఒక పెద్దపని కాదని ప్రతి భారతీయపౌరునికి తెలిసిన విషయమే కాగా, “ఆ చర్య వెంటనే ప్రారంభం కావలెనా? లేక, మరికొంత ఓపిక పట్టవచ్చునా?” అనే విషయంలోనే దేశనాయకులతో అతని భేదాభిప్రాయం.

ఇక మీదట ఈ భేదాభిప్రాయానికి సయితం తావు లేదనడమే సర్దార్ పటేల్ ప్రకటన తాత్పర్యమైతే, నేడు చేరిన వార్త ఇటీవల వచ్చినవాటిలో అతి ముఖ్యమైనదని వేరుగా చెప్పనవసరం లేదు. అయితే, నిజాం సంస్థానంపై వెంటనే చర్య ప్రారంభించడమైనా చాలదు; అది తీవ్రచర్య సయితం కావాలి.

ఇంతవరకు మనం చూపిన ఔదార్యం ఎంత గొప్పదో, ఇక మనం గైకొనగల చర్య అంత గట్టిది కావాలి.

ఇంతవరకు మనం ప్రదర్శించిన సహనం ఎంత మహోదాత్తమైనదో ఇక మీదట మన ప్రతీకారం అంత సునిశితమైనది కావాలి.

ప్రస్తుతం జరుగుతున్న ఆలోచన సైనిక చర్యలకు సంబంధించినట్టిదని పండిట్ నెహ్రూ సూచించడం ముదావహమే. అయితే, మన సైనిక చర్యల లక్ష్యం నిజాం సంస్థానంతో మనం కోరిన ఒడంబడికపై సంతకం చేయించడం కారాదు; దాన్ని నామరూప రహితం చేయడమే కావాలి.

ఈనాడేకాక, పుట్టుకనుంచి కూడా ఈ సంస్థానం దేశ ద్రోహకరంగా ప్రవర్తిస్తున్నది. దీన్ని మించి హేయ చరిత్రగల సంస్థానం మన దేశంలోనే కాదు ఏ దేశంలో లేదు. అందువల్ల దీన్ని మన మ్యాప్ నుంచి పూర్తిగా చెరిపివెయ్యవలసిందే. - (ఆంధ్రప్రభ 1-9-1948).

ఆత్మ పరీక్ష

(స్వతంత్ర భారతంలో పరిమితుల వివరణ, పునర్నిర్మాణంపై స్పష్టీకరణ)

దాస్యశృంఖలావిచ్ఛేదం అనుదినం జరగదు; స్వాతంత్ర్య భానూదయ దర్శన భాగ్యం ప్రతివారికీ అబ్బదు.

ఈ మేరకు ఆగష్టు 15వ తేదీ ప్రాధాన్యాన్ని భారతజాతి పూర్తిగా గుర్తించింది; ఆనందోత్సవాన్ని జరుపుకున్నది.

అయితే, ఈ ఆనందోత్సవంతో పాటు సర్వదా ఆత్మపరీక్ష కూడా జరుగుతున్నది. “మనకు స్వాతంత్ర్యం సిద్ధించిన మాట నిజమే. కాని, దాని పరిమితులెవ్వి?”

“కొన్ని ప్రత్యేక” పరిస్థితులను బట్టి దేశ విభజన ప్రస్తుతానికి అనివార్యమై ఉండవచ్చు. కాని, శాశ్వతంగా ఈ కృత్రిమ విభజనను గుర్తించవలసిందేనా?”

“రాజకీయ స్వాతంత్ర్యం మనకు లభించి ఉండవచ్చు. కాని, ఆర్థిక, సాంఘిక వ్యవస్థల పునర్నిర్మాణం జరగకపోతే, ఆ రాజకీయ స్వాతంత్ర్యపు విలువ నామమాత్రం కాదా?”

"నేటిది మన ప్రభుత్వమే కావచ్చు. కాని, ప్రజలకు కూడు గుడ్డలకు కడగండ్లు తప్పనంతవరకు ఏ ప్రభుత్వమైనా ఒక్కటే కాదా?"

ఈ విధమైన ఆత్మపరీక్ష నేడు యావద్భారతంలో జరుగుతున్నది.

అది ప్రధాని పండిట్ నెహ్రూ ప్రసంగం కావచ్చు; పల్లెటూరిలోని ప్రజానాయకుని ప్రసంగం కావచ్చు. ఏదైనా, దానిలో ఇట్టి ప్రశ్నలే వినవస్తున్నాయి.

ఇది మన అభివృద్ధికీ, మన అభ్యుదయానికీ, మన భవితవ్యానికీ మహా శుభసూచన. నేటి స్వాతంత్ర్యంతో మనం సంతృప్తిచెందడం లేదనడానికి ఇది నిదర్శనం.

స్వాతంత్ర్యం నేడు మనకు లభ్యమైనదానికంటే విస్తృతమైనదని వినిర్మలమైనదని - మనం గుర్తిస్తున్నామనడానికి ఇది తార్కాణం. - విశిష్టమైనదని -

సాధించినదానితో సంతృప్తి చెందక, కొత్తసీమలకు చేరుకోవాలని, కొత్త శిఖరాలను అందుకోవాలని, కొత్త శకానికి తగు కొత్త జీవితాన్ని ప్రారంభించాలని మనం ఎంతగా తహతహ లాడుతున్నామో తెలపడానికి ఇది సాక్షీభూతం.

ఆనందోత్సవం మధ్య కూడా నేడు విస్పష్టంగా కానవస్తున్న ఈ ఆందోళన - ఈ అసంతృప్తి - ఈ ఆత్మపరీక్ష - ఎంత నిశితమైనవైతే ఎంత నిశ్చలమైనవైతే - మన భవిష్యత్తు అంత మహోజ్జ్వలం.

అయితే, "ఇదేనా స్వాతంత్ర్యం?" అని పెదవి విరవడం చాలదు. లభించినదాన్ని అధికం చేసుకొనడానికి అనవరత కృషి జరపాలి. అధికతరం - అధికతమం.

ఈ కృషి జరపవలసిన బాధ్యత మన మంత్రులదే కాదు; మన ఉద్యోగులదే కాదు; మనలో ప్రతి ఒక్కరిదీ!

మనం సాధించ గలిగిన మేరకే మనకు స్వాతంత్ర్యం; మనం నిలుపుకున్న మేరకే మనకు స్వేచ్ఛ; మనం కష్టించిన మేరకే మన అనుభూతి; మనం కైవశం చేసుకున్న మేరకే మనకు శాంతి సౌఖ్యాలు; మన అర్హత మేరకే మనదేశంలో నూతన వ్యవస్థ సంస్థాపన.

ఈ నగ్నసత్యాన్ని మనం గుర్తించకపోతే, పరాయిప్రభుత్వం కిందవలె సొంత ప్రభుత్వంకింద కూడా మనకు కష్టాలు తప్పవు; క్లేశాలు తప్పవు; దారిద్ర్యం తప్పదు; దుఃఖం తప్పదు. (ఆంధ్రప్రభ 19-8-1947)

కాంగ్రెసే ప్రభుత్వం

(స్వతంత్ర భారత దేశంలో నిరాశ మిగుల్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను వివలించారు.)

కాంగ్రెసు - కాంగ్రెసు ప్రభుత్వం కూడ నేడు అధిక విమర్శకు ఆలవాలమైంది. స్వాతంత్ర్యంతో తమ కష్టాలు గట్టెక్కునని ఆశపెట్టుకున్న ప్రజల ఆశలు నిరాశలగుచున్నవి. వారే కాంగ్రెసు చోదకులు, కాంగ్రెసు పాలకులు అగుటవల్ల మరింత విమర్శకు గురి అయ్యారు. వారి ద్వంద్వ నాయకత్వం వల్ల కాంగ్రెసుకు అపఖ్యాతి ఆపాదింపబడుతున్నది. కాంగ్రెసు ప్రజా సంస్థగా గాక ప్రభుత్వ యంత్రాంగంగా మారిపోయింది.

మన దేశంలో మాత్రమే కాదు, ఇతర దేశాలలో కూడ ఇట్టి ద్వయిదీ విధానంవల్లనే మహాసంస్థల ప్రతిష్ఠ మంట కలిసింది. ఈజిప్టులోని వాపడ్ పార్టీ, చైనాలోని క్యుమిట్యాంగ్ పక్షం, ఇండోనేషియాలోని రిపబ్లిక్ పార్టీ, ఇండో చైనాలోని వియత్నాంపార్టీ ఇట్లే పతనమై పోయాయి. అదేమి చిత్రమో అస్వతంత్రులై యున్ననాడు దేశభక్తి, ప్రజాసేవ ఆదిగాగల సద్గుణాలు స్వతంత్రులైన మరుక్షణాన అదృశ్యం కావడం అంటే.

మేము ఆలోచించగలిగినంతవరకు ఈ ప్రశ్నకు మాకు తోస్తున్న సమాధానమిది : ఈనాడు దేశంలో ఏ వర్గంలోను తన భవిష్యత్తును గురించి ఆశాభావం

తగినంత గట్టిగాలేదు. ఇదివరలో లేనివారు ఈనాటికికూడా లేనివారుగానే మిగిలి ఉన్నారు. ప్రభుత్వం అంచనాల ప్రకారమే ఈనాటి మన జనాభాలో దాదాపు సగం దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్నది. పైగా, కడచిన ఇరవై అయిదేళ్ళలో కలిమిలేముల మధ్య వ్యత్యాసం తగ్గడానికి మారుగా మరింత పెరిగింది.

ఇటీవల ప్రభుత్వ నాయకులు చేస్తున్న వాగ్దానాల కారణంగా, వారు చేస్తున్న శాసనాల కారణంగా తమకు మంచి రోజులు రావచ్చునన్న ఆశ నిర్ధన వర్గాలలో పొడ చూపుతున్నా, గతానుభవం దృష్ట్యా వారి సందేహాలు వారికి మిగిలేవున్నాయి.

జనవరి 26, 1950

పోతే, మధ్య తరగతి వారి బ్రతుకులు నానాటికి పెరిగిపోతున్న ధరల కారణంగా, నిరుద్యోగ కారణంగా మరింత దుర్భర మౌతున్నాయి. అందువల్ల నిర్ధన వర్గాల వారికంటె వీరే నేడు మరింతగా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ఇక, ధనిక వర్గాలలో తాము పూర్తిగా చితికిపోవడం తప్పదన్న భయం ప్రబలింది. సాంఘిక న్యాయ సంస్థాపనకోసం ప్రభుత్వం చేస్తున్న ప్రతి శాసనం, అమలు జరుపుతున్న ప్రతిచర్య తమను హతమార్చడానికే అని వారు నమ్ముతున్నారు. ఇది నిరాధారమైన నమ్మకం కాదుకూడా. తమ వద్ద పెద్దగా ధనం లేకపోయినా, పెద్ద రైతులైనవారు భూస్వామ్య సంస్కరణల తర్వాత తమ స్థితిగతులు ఏమి కానున్నవని ఆందోళన చెందుతున్నారు. వీరిలో కొందరు చితికిపోగల ప్రమాదం నిజంగానే ఉన్నది.

ఈ విధంగా ప్రతి వర్గానికి ఏదో ఒక అసంతృప్తి కారణం ఉన్నది. ఏదో ఒక భయకారణం ఉన్నది. అయితే, అందరిని అన్ని విధాలా సంతృప్తి పరచడం ఏ ప్రభుత్వానికి సాధ్యం కాదు; కాని, అన్ని వర్గాలను సమానంగా అసంతృప్తి పరచడం, అన్నిటిని సమానంగా భయానికి లోనుజేయడం ఇవైనా దేశానికి క్షేమకరం కాబోవు. అందువల్ల, అన్ని వర్గాలను కాక పోయినా, బహుజనహితాన్ని, బహుజన శ్రేయస్సును సాధించడానికి ఇప్పటి కంటె దీక్షగా, ఇప్పటికంటె చిత్తశుద్ధితో ప్రభుత్వం ప్రయత్నం చేయాలి. మాటలకు చేతలకు మధ్యదూరాన్ని తగ్గించాలి. నీతిని, నిజాయితీని రాజకీయ పరిపాలనా వ్యవస్థలలో వీలైనంత హెచ్చుగా తిరిగి పాదుకొలపాలి.

(ఆంధ్రజ్యోతి 17-8-1972)

జనవరి 26, 1950 — నేటి నుంచి ఇండియా రిపబ్లికన్ రాజ్యం

నేటినుంచే నవరాజ్యాంగం ప్రకారం దేశపరిపాలన.

ఇండియా రిపబ్లికన్ ప్రతిపత్తిని శంకిస్తున్న వారున్నారని మాకు తెలుసు; దాని నవరాజ్యాంగ విశిష్టతను ప్రశ్నిస్తున్నవా రున్నారని కూడా మాకు తెలుసు.

నిజంగా రిపబ్లికన్ రాజ్యమైతే ఇండియాకు కామన్వెల్త్ సభ్యత్వం దేనికి? కామన్వెల్త్ వ్యవహారాలకు సంబంధించినంతవరకు బ్రిటీష్ రాజు పెద్దరికాన్ని అది గుర్తించడం దేనికి? ఇది ఒక విమర్శ.

ఈ విమర్శకు బెర్నార్డ్షాను పోలిన ప్రపంచ ప్రముఖుడే సమాధానం చెప్పిన మీదట మరెవ్వరు ఆ ప్రయత్నాన్ని చెయ్యనవసరం లేదు.

కామన్వెల్త్లో నిలిచినా, దాని నుంచి చీలిపోయినా రిపబ్లికన్ రాజ్యం రిపబ్లికన్ రాజ్యమే కాగలదని షా ఉద్ఘాటిస్తున్నాడు. కామన్వెల్త్ నుంచి చీలిపోయినంత మాత్రం చేతనే అట్లాంటిక్ తీరంలోని ఒక జానెడు, బెత్తెడు లంకలో బ్రతుకుతున్న ముప్పై, నలభై లక్షలమంది ఐరిష్ వారు రిపబ్లికన్ దేశస్థులు కాగా, కామన్వెల్త్లో నిలిచినంత మాత్రం చేత ఒక ఖండాన్ని పోలిన మహాదేశానికి చెందిన ముప్పై నలభై కోట్ల మంది భారతీయులు - ప్రపంచ ప్రధాన రాజ్యాలలో ఒకదాన్నిగా పరిగణించవలసినదానికి చెందిన భారతీయులు - రిపబ్లికన్ ప్రజలు కాకపోతారా అని ఆయన ప్రశ్నిస్తున్నాడు.

కామన్వెల్త్లో ఇండియాకు పొత్తు లేకపోవడమే మా అభిమతమైనప్పటికీ, ఆ పొత్తువల్ల మన దేశ గౌరవ ప్రతిష్ఠలకు భంగం వాటిల్లదనే మా విశ్వాసం. గౌరవ ప్రతిష్ఠలకు భంగం వాటిల్లగల పరిస్థితిలో ఇండియా కామన్వెల్త్ నుంచి వెంటనే తప్పుకొనగలదని కూడా మా నమ్మకం.

పోతే, నవ రాజ్యాంగాన్ని గురించి జరుగుతున్న విమర్శలు ప్రధానంగా కమ్యూనిస్టులు, సోషలిస్టులు, రాయిస్టులు చేస్తున్నవే.

"ఇది బానిస రాజ్యాంగం" అని కమ్యూనిస్టులు అంటున్నారు.

"ఇది నిరంకుశ రాజ్యాంగ విధానం" అని సోషలిస్టులు అంటున్నారు.

“అన్నిచోట్ల విఫలమైన పార్లమెంటరీ డెమోక్రసీ ఈ రాజ్యాంగ విధానానికి ప్రాతిపదిక” అని రాయిస్టులు అంటున్నారు.

ఈ మూడువర్గాల విమర్శలలో మొదటిదాన్ని పరిగణించవలసిన పనేలేదు. మనది బానిస రాజ్యాంగమే అయితే, దాన్ని బహిరంగంగా విమర్శించగల స్వాతంత్ర్యం కమ్యూనిస్టులకు మిగిలి ఉండేదా?

ఇక, తక్కిన రెండు వర్గాల విమర్శల విపుల పరిశీలన కిది సమయం కాదు. నవభారత రాజ్యాంగంలో ఏవో కొన్ని లోపాలు లేకపోలేదు గాని, ఈ కింది ముఖ్యాంశాలనే ప్రతి భారతీయ పౌరుడు ఈనాడు ప్రధానంగా గుర్తించాలి.

1 మన దేశం ఈనాడు ఏక కేంద్ర ప్రభుత్వాధిపత్యం కిందికి వచ్చినంతగా దాని చరిత్రలో ఆది ఏనాడు రాలేదు.

2 గ్రామ ప్రజాస్వామ్యాలు మనదేశానికి కొత్త కాకపోయినా, దేశం మొత్తంపై ప్రజాస్వామ్య ప్రభుత్వం నెలకొనడం ఇదే ప్రథమం.

3 ప్రతి వయోజనుడు - తన మతంతో కాని, కులంతో కాని, విద్యార్హతతోకాని, ఆస్తిపాస్తులతో కాని నిమిత్తం లేకుండా వోటింగ్ హక్కును పొందడం సైతం మన దేశ చరిత్రలో ఇదే ఓంప్రథమం.

ఈ మూడు ప్రధానాంశాల దృష్ట్యా నేడు మన దేశంలో ఒక నవరాజ్యాంగ వ్యవస్థ ప్రతిష్టాపన జరిగినదనడం నిర్వివాదం.

ఈ వ్యవస్థను కాపాడుకొనడమేమి, దీనిలో లోపాలు కానవస్తే, వాటిని సవరించుకొనడమేమి, దేశాన్ని శక్తివంతం చేసుకొని, శాంతి సుభిక్షాలను, సౌఖ్యానందాలను సాధించుకొనడమేమి ప్రజల ధర్మం.ఈ ధర్మ నిర్వహణలో వారు అప్రమత్తులై ఉంటే, వారి పురోగతిని అడ్డగల శక్తి లేదు. దీనిలో వారు ఏమరితే, వారిని కాపాడగల నాధుడూ లేదు. (ఆంధ్రప్రభ 26-1-1950)

రిపబ్లిక్ డే

కొత్తగా స్వతంత్రమైన ఏ దేశానికైనా కొన్నాళ్ళపాటు బాలారిష్టాలు తప్పవు. ఇండియన్ రిపబ్లిక్ ఎన్నో బాలారిష్టాలను గడచి ఇరవైయవ సంవత్సరంలో ప్రవేశించింది.

ఒక మూడు నాలుగేళ్ళుగా ఆర్థిక వ్యవస్థను పట్టి పీడించిన మాంద్యస్థితి తగ్గు ముఖం పట్టింది. వ్యావసాయిక రంగం కూడా మొత్తంపై ఆశాజనకంగా ఉంది. అనావృష్టి తొలగిపోవడం ఇందుకు ముఖ్య కారణం కాగా, వ్యవసాయంలో ప్రవేశపెడుతున్న కొత్త పద్ధతులు మరొక ప్రధాన కారణం. ఎక్కువ దిగుబడి నిచ్చే విత్తనాల వాడకం, రసాయనికపు ఎరువులు విరివిగా వ్యాప్తిలోనికి రావడం. నీటి పారుదల సౌకర్యాలు నానాటికి హెచ్చు కావడం మొదలైన అనేక దోహదాలవల్ల మన వ్యవసాయ రంగం పురోగమన దశలో పడింది.

అయితే, మరి పెక్కు సమస్యలు మన దేశాన్ని పీడించకపోవడం లేదు. ముఖ్యమైనది జాతీయ సమైక్య భావాన్ని ఎదుర్కొంటున్న ప్రమాదం. స్వాతంత్ర్యం సిద్ధించి ఇన్ని సంవత్సరాలైన తర్వాత కూడ మనది ఒకేజాతి, ఒకే సంస్కృతి, ఒకే చారిత్రక వారసత్వం అనే భావన ప్రజలలో సుస్థిరంగా పాదుకొనలేదు.

ప్రాంతీయ, భాషా దురభిమానాలు, విద్వేషాలు తగ్గకపోగా పూర్వం కంటే హెచ్చుతున్నాయి. నదీజలాల పంపకాన్ని గురించిన వివరాలు ఇందుకొక ఉదాహరణ. మైసూరు, మహారాష్ట్రల మధ్య కొన్ని కొన్ని పట్టణాల కోసం నడుస్తున్న వివాదాలు మరొక ఉదాహరణ.

అధికార భాష గురించిన వివాదం అన్నిటికంటే ప్రమాదకరంగా తోస్తుంది. హిందీ పట్ల తమిళనాడులో బయలుదేరిన తీవ్ర వ్యతిరేకతను ఏదో విధంగా సమయింపజేయకపోతే ఏనాటికైనా అది మన జాతీయ సమైక్యానికి గొడ్డలి పెట్టు కాగలదు. ఈ సమస్యను విశాల దృష్టితో, దూరదృష్టితో పరిష్కరించవలసిన బాధ్యత జాతీయ నాయకులపైనే ఉంది.

ఇది ఇలా ఉండగా భాషా ప్రయుక్త రాష్ట్రాల స్థాపనకు మార్గదర్శకమైన ఆంధ్రప్రదేశ్లోనే అందుకు వ్యతిరేక ధోరణులు ఈనాడు పొడచూపడం అతిశోచనీయం. ఆంధ్ర, తెలంగాణా విభేదాలు బయలుదేరి చికాకు కలిగిస్తున్నాయి. వీటిని సమయస్ఫూర్తితో, సంయమనంతో పరిష్కరించడానికి అన్ని రాజకీయ పక్షాలు ఏకోన్ముఖంగా పనిచేయడం అవసరం. ఏమైనా ఈనాడు అన్నిటి కంటే ఆందోళన పడదగిన దేదైనా ఉంటే అది సరియైన రాజకీయ నాయకత్వం లోపించడమే. సుమారొక అర్ధ శతాబ్దిపాటు నడిచిన భారత స్వాతంత్ర్య సమరం యోధానుయోధులైన మహా నాయకులనేకులను సృష్టించింది. ఆ రోజులలో వారి వాక్కును వేద వాక్కుగా దేశం శిరసావహించేది. దానికి కారణం వారు స్వయంగా విశుద్ధ వర్తనులు, త్యాగశీలురు, ప్రజాహిత చింతకులు కావడం. ఈనాడు అట్టి నాయకులు మనకులేరు. అట్టి నాయకత్వం నెహ్రూ శకంతోనే చెల్లిపోయింది. దాని స్థానంలో మనకు రెండవ మూడవ తరగతుల నాయకత్వం ప్రాప్తించింది. ఏ ఆదర్శాలతోను, సిద్ధాంతాలతోను తానే ఉత్తేజితం కాని ఈ నాయకత్వం ప్రజానీకాన్ని ఏమి ఉత్తేజితం చేస్తుంది.

నిజానికి, స్వాతంత్ర్య సమరం కంటే తీవ్రమైన పోరాటం మధ్యలో మన మీనాడు ఉన్నాం. అది ఆకలిపై, దారిద్ర్యంపై పోరాటం; అవిద్యపై, అజ్ఞానంపై పోరాటం; దేశ సర్వతోముఖాభివృద్ధికై పోరాటం. దీనితో పోల్చితే వెనుకటి దేశ విమోచనోద్యమం స్వల్పమైనది కనుకనే. నాటికంటే మహోన్నతులైన, మేధావులైన, సచ్ఛీలురైన మహానాయకులు ఈనాడు మన రిపబ్లిక్కు కావాలి.

(ఆంధ్రజ్యోతి 26-1-1970)

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం

భాషా ప్రయుక్త రాష్ట్రాలు

భాషాప్రయుక్త రాష్ట్ర విభజన ఆవశ్యకతను కాంగ్రెసు గుర్తించింది. ఇంతేకాదు, కాంగ్రెసు వ్యవస్థకు సంబంధించినంత వరకు భాషాప్రయుక్త సిద్ధాంతాన్ని పూర్తిగా అనుసరించింది కూడా. అయినా, ప్రభుత్వ వ్యవస్థలో ఈ శిష్ట సిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టడం విషయంలో కాంగ్రెసు అగ్రనాయకులు కొంత ఔదాసీన్యాన్ని ప్రదర్శించారు.

ఇదివరలో ఏమి జరిగినా, ఇప్పుడు భాషాప్రయుక్త రాష్ట్ర విభజనను కొనసాగించడానికి మన రాజ్యాంగ పరిషత్తు తగు సన్నాహం ప్రారంభించడం ముదావహం.

మరికొన్ని ప్రభుత్వోద్యోగాల కోసమో, మరికొన్ని మంత్రి పదవుల కోసమో అట్టి సంకుచిత లక్ష్యాలతోనే ప్రారంభమైనదైతే, ఈ ఉద్యమం సమర్థనీయమైనది కాబోదు సరిగదా, గర్హనీయమైనది కాగలదు కూడా.

ఏక భాష, ఏక సారస్వతం, ఏక సంస్కృతి - ఇవి జాతి, మత, వర్ణ, వర్గ, కుల విభేదాలను అధిగమించి, ఒక ప్రజలో సన్నిహితత్వాన్ని కూర్చగల అమోఘశక్తులు. ఈ శక్తులను ఛిన్నాభిన్నం చేసివేయడానికే ఏక భాషా ప్రాంతాన్ని బ్రిటీష్ వారు విభిన్న రాష్ట్రాలలో చేర్చగా, లేదా, విభిన్న భాషా ప్రాంతాలను ఏక రాష్ట్రంగా చెయ్యగా, ఈ శక్తులను సమీకరించి, జాతీయ సమైక్యతకు దోహద మివ్వడానికే భాషాప్రయుక్త రాష్ట్ర విభజనోద్యమాన్ని ప్రారంభించాం.

భాషాప్రయుక్త రాష్ట్ర విభజనను మనం కోరడానికి మరొక బలీయమైన కారణం కూడా లేకపోలేదు.

విజ్ఞాన సముపార్జనకు విద్య దోహద మివ్వగలదనడం నిస్సందేహం. కాని, విద్య నేర్చిన ప్రతివాడు విధిగా వివేకి కాడు. వ్యవహార దక్షతకు విద్య ప్రోది చేస్తుందనడం నిర్వివాదం. అయితే, ప్రతి విద్యావంతుడు వ్యవహార దక్షుడు కాడు. కాని, ప్రస్తుతం మన దేశంలోని కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా వివేకం కలవారైనా, కాకపోయినా, వ్యవహార దక్షత ఉన్నవారైనా, లేని వారైనా విద్య నేర్చినవారికి - ముఖ్యంగా ఆంగ్లేయభాషను అభ్యసించిన వారికి - సంఘనాయకత్వం సంక్రమించింది. ఇదే నేటి మన జాతీయ జీవితంలో కానవచ్చే లోపాలలో, నూరింటి 90 వంతులకు ముఖ్యకారణం.

నేటి మన పరభాషావిద్య ప్రజాసామాన్యం నుంచి మనలను వేరుచేసి వేస్తుంది. అంతేకాదు. మన సంస్కృతి నుంచి, సంప్రదాయాల నుంచి, మన సమస్యల నుంచి, సాధక బాధకాల నుంచి మన దృష్టిని అది మరల్చివేస్తుంది.

ఈ దుస్థితి తొలగిపోవాలంటే, కొత్త నాయకులు రావాలి; వారు ప్రజా బాహుళ్యం నుంచి ముఖ్యంగా గ్రామసీమ నుంచి రావాలి. మన జాతీయ జీవితం నుంచి మనలను వేరుచేసే పరభాషలో కాకుండా, మన ప్రాంతీయ భాషలోనే మన వ్యవహారాల నిర్వహణ కొనసాగాలి. ఇంగ్లీషులో నూటికి 35 మార్కులు సంపాదించినవారు కాక, చూచి రమ్మంటే కాల్చిరాగలవారికి సంఘ నాయకత్వం సంక్రమించాలి.

మాతృభాషలోనే విద్యాభ్యాసం, మాతృభాషలోనే దేశ వ్యవహారాల నిర్వహణ ఈ సదుపాయాలు లేకపోతే, ఉదాహరణకు, మిస్టర్ బెవిన్ ఈనాడు బ్రిటన్కు విదేశాంగ మంత్రి అయివుండేవాడా? ఏమో, సందేహమే!

అనతికాలంలో ఆంధ్ర, తమిళ, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు అవతరించగలవని, భారత జాతీయ సౌధానికి అవి మూలస్తంభాలు జాతిని సమైక్యపరచగల శక్తులను సమీకరించి, జాతికి కొత్త నాయకులను సమకూర్చడమే భాషాప్రయుక్త రాష్ట్ర విభజనోద్యమ లక్ష్యం.

సరిహద్దుల నిర్ణయం విషయంలో అనేక వాదోపవాదాలు తప్పకపోయినా కాగలవని ఆశిస్తున్నాం. (ఆంధ్రప్రభ 13-6-1947)

ఆంధ్ర రాష్ట్రం

ఆంధ్రరాష్ట్ర నిర్మాణం విషయమై పండిట్ జవహర్లాల్ నెహ్రూ వైఖరిని మేము ముందెన్నడు హర్షించలేదు; ఇప్పుడు దాన్ని హర్షించడం మాకు మరింత కష్టం. భాషారాష్ట్రాల అవతరణకు తాను విముఖుడైనా, ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం మాత్రం తనకు ఆమోదకరమే అని జవహర్లాల్ ప్రకటిస్తున్నాడు. కాని, ఈ ఆమోదం ఆమోదంగానే మిగులుతున్నదే తప్ప, ఆచరణకు రావడం లేదు.

భాషారాష్ట్రాల నిర్మాణం జరగాలంటే వివాదగ్రస్తమైన ముఖ్య విషయాలపై ప్రధాన పక్షాల మధ్య స్థూలంగానైనా ఒడంబడిక కుదరవలెనన్న సూత్రం సమర్థనీయం కాదు. ప్రతి పెద్ద సమస్యాపరిష్కారానికి దీన్ని ఒక షరతుగా పెడితే మనదేశ సమస్యలన్నీ అపరిష్కృతంగా మిగిలిఉండవలసిందే.

ఏమైనా, నెహ్రూ స్వయంగా అంగీకరిస్తున్నట్టు, ఆంధ్ర రాష్ట్ర సమస్యకు సంబంధించినంత వరకు ముఖ్య సమస్యలపై సైతం ఇప్పటికే చాలావరకు ఏకాభిప్రాయం ఉంది.

విభిన్నాభిప్రాయాలు ఏవైనా కొన్ని చెదురుగా వినవస్తుంటే అవి చెన్నపురి, రాయలసీమలను గురించి. ఇవి ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి ప్రతిబంధకాలుగా నిలవదగినట్టివి కావు. “సమస్యకు సంబంధించిన ప్రధాన పక్షాలన్నింటి మధ్య ఏకాభిప్రాయం" అనగానే ఈ "ప్రధాన పక్షాలేవి?” అనే ప్రశ్న వెంటనే వస్తుంది. ముందు పటేల్ నెహ్రూ - పట్టాభి కమిటీవారేమి, అటుతర్వాత నెహ్రూ విడిగానేమి ఇందుకు చెప్పిన సమాధానం. "ఆంధ్ర, తమిళ, కన్నడ ప్రదేశ్ కాంగ్రెస్లు, మద్రాసు ప్రభుత్వం" అని. -

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చెన్నపురిని గురించి, రాయలసీమను గురించి తన అభిప్రాయాన్ని అసందిగ్ధంగానే ప్రకటించింది. ఈ సంగతి పండిట్ నెహ్రూకు తెలియనిది కాదనే అనుకొంటాం. ఆంధ్ర కాంగ్రెసు నాయకుల రాయబారానికి నెహ్రూ చెప్పిన సలహాను అనుసరించే, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ మొన్నటి ఎన్నికలకు ముందు నెల్లూరులో సమావేశమై విభజన సంఘం నిర్ణయాల ప్రాతిపదికపై ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి తాను సమ్మతిస్తున్నట్టు తీర్మానించింది.

విభజన సంఘం నిర్ణయాలను మొత్తంపై ఆమోదిస్తూ కన్నడ ప్రదేశ్ కాంగ్రెస్ సైతం అప్పుడే ఒక తీర్మానాన్ని చేసింది. ఇట్టి తీర్మాన లాంఛనాన్ని ఇంకా పాలించకపోయినా, తమిళప్రదేశ్ కాంగ్రెసు కేమి, మద్రాసు ప్రభుత్వానికేమి విభజన సంఘం నిర్ణయాలు ఆమోదకరమైన వనడం జగద్విదితం. నిజానికి వాటి అభిమతాలనే ఆ నిర్ణయాలు అధికంగా ప్రతిఫలిస్తున్నాయి. అయినప్పుడు ప్రధాన పక్షాల మధ్య చెన్నపురి, రాయలసీమలను గురించి ఏకాభిప్రాయం పొసగవలసి ఉన్నదనడం సమంజసం కాగలదా?

విభజన సంఘం నిర్ణయాలను ఆమోదిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ సంఘం తీర్మానించినప్పుడు, రాయలసీమకు, నెల్లూరుకు చెందిన కొందరు సభ్యులు దాన్ని ఖండిస్తూ ఒక ప్రకటన చేశారనుకోండి. కాని, నెహ్రూ చెప్పిన సలహాలో “ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్

ఆమోదం" అని మాత్రమే కలదుగాని, దాని "ఏకగ్రీవామోదం" అని లేదుగదా? మెజారిటీ అభిప్రాయాన్ని మైనారిటీ మన్నించాలనడం ప్రజాస్వామ్యానికి కీలకం. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రజాస్వామ్య సంస్థ. అందువల్ల మైనారిటీ అభిమతం ఏదైనా మెజారిటీ తీర్మానాన్ని గౌరవించి తీరాలి. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాయలసీమ ప్రముఖుడైనందున ఆ తీర్మానాన్ని మరింతగా గౌరవించాలి.

అయినా, చెన్నపురిని, రాయలసీమను ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి ఇంకను అభ్యంతరాలుగానే పేర్కొనడం "ప్రకాశంగారు అభ్యంతరం చెప్పి ఉండకపోతే, ఆంధ్రరాష్ట్రం ఎప్పుడో వచ్చివుండేది" అనడం వలెనే ఉన్నది. విభజన సంఘం నిర్ణయాలకు అభ్యంతరం చెప్పినవారు ఆ సంఘ సభ్యులలో ప్రకాశంగా రొక్కరే. తక్కిన సంఘసభ్యుల - ఇంతేకాక, సంఘంలోని తక్కిన ఆంధ్ర సభ్యుల - ఏకగ్రీవాభిప్రాయాన్ని త్రోసిపుచ్చి, ఒక్కరి అభ్యంతరానికే విలువనిచ్చినామనడం ఏ ప్రజాస్వామ్య సిద్ధాంతం ప్రకారమో దురూహ్యం. ఇదే విధంగా ప్రతి ఒక్కరి సమ్మతి లభించిన తర్వాతనే ఆంధ్ర రాష్ట్ర నిర్మాణమంటే, అది బ్రహ్మకల్పం వరకు వేచివుండవలసిందే!

అయితే, ఇంకొక విషయాన్ని కూడా ఇక్కడ మేము స్పష్టపరచాలి. ఆంధ్రరాష్ట్ర నిర్మాణం విషయంలో నెహ్రూ వైఖరిని ఎంతగా విమర్శించినా, స్వామి సీతారాం ప్రారంభించిన సత్యాగ్రహాన్ని మేము సమర్థించలేము. ఏ దృష్టి నుంచి చూచినా, సత్యాగ్రహానికి ఇది సమయం కాదు. కాంగ్రెసువారు దీన్ని ఖండిస్తున్నారు. కమ్యూనిస్టులు కూడా దీన్ని వాయిదా వేయవలసిందిగానే చెప్పారు. ఆంధ్ర రాష్ట్ర స్థాపక సంఘంలోనే దీన్ని గురించి ఏకాభిప్రాయం లేదని వింటున్నాం. అయినా, స్వామి సీతారాం సత్యాగ్రహాన్ని ప్రారంభించడం పరాజయాన్ని ఆహ్వానించడమే,పరిహాసాన్ని ఆహ్వానించడమే; అట్టి పరాజయం వల్ల, పరిహాసం వల్ల, ఆంధ్ర రాష్ట్రోద్యమానికే గట్టి దెబ్బ తగలవచ్చు.

(ఆంధ్రప్రభ 1-3-1952)

తెలుగువాడా!

ఎన్నాళ్ళ నుంచి కలలు కంటున్నావు "రాష్ట్రం, రాష్ట్రం" అంటూ! ఎన్నాళ్ళ నుంచి ఎదురుతెన్నులు కాస్తున్నావు నీ ప్రత్యేక రాష్ట్రం కోసం! నీ కలలు పండినట్టే సంబరపడి, మళ్ళీ అంతలోనే ఎన్నిసార్లు నీవు ఆశాభంగంలో కుంగిపోలేదు! "ఇదిగో - వచ్చింది రాష్ట్రం" అనుకొని సంతోషంగా ఎదురు వెళ్ళి, హతాశుడవై నీవు ఎన్నిసార్లు కుప్పగా కూలిపోలేదు? చివరికి నీకు ప్రత్యేక రాష్ట్రం కోసం నీ ప్రియసోదరుడొకడు కఠోరదీక్ష పూని, ప్రాణత్యాగం చేయవలసి వచ్చింది! అట్టి నీకు ఇప్పుడే, తక్షణమే రాష్ట్రం కావలెనా? తగవులు లేకుండా రాష్ట్రం కావలెనా? అయితే, దాన్ని తీసుకో! నెహ్రూ దాన్ని నీకు ఇస్తానంటున్నాడు. దాన్ని తీసుకొంటావా? లేక, నోటివద్ద మృష్టాన్నాన్ని మట్టి కలుపుకొంటావా?

మాకు గట్టిగా తెలుసు - తక్షణమే రాష్ట్రం కావాలని నీకున్నదని! మాకు తెలుసు - తెగేవరకు తిరిగి లాగకుండా ఈసారైనా రాష్ట్ర లబ్ధిని పొందడమే నీ అభిలాష అని!! మరి ఆలస్యం తగదని మొన్నటి కృష్ణ ఆనకట్ట ప్రమాదం నివేదిక నీకు వేయి నోళ్ళతో చెబుతుంది. ఈ అవకాశాన్ని కూడా జారవిడుచుకొంటే, నీ సంతానానికి కూడా ప్రతి రెండు, మూడు సంవత్సరాలకు దుర్భిక్షం తప్పకపోవచ్చునని భోస్లా కమిటీ నివేదిక నీ చెవిని ఇల్లు కట్టుకొని పోరుతుంది.

కాని, తగవును చంపడాన్ని కాక, దాన్ని పెంచడానికి చూచే చౌకబారు ప్లీడరు ప్రవృత్తిగల మన రాజకీయ ప్రముఖులు కొందరు నిన్ను తప్పుదారిని పెట్టడానికి చూస్తున్నారు. పౌరుషాలకు పెనగులాడే ప్రజానాయకులు కొందరు తమ ప్రతిష్ఠ నిలుపుకొనడం కోసం నిన్ను

రెచ్చగొట్టడానికి కుతంత్రాలు పన్నుతున్నారు. వీరి కుతంత్రాలను కానలేకపోతే నీవు స్వరాష్ట్రం లేని వ్యక్తిత్వం లేని, పురోభివృద్ధిలేని - క్షణికోద్రేకి ఆంధ్రుడవుగానే మిగిలిపోతావు. -

వ్యవహార దక్షతకు పేరొందిన యుగంధరుడు, తిమ్మరుసు నీ వారని జ్ఞాపకం పెట్టుకో! నీ రాష్ట్రాన్ని పుచ్చుకొనడానికి ముందుకు రా! నీకు అడ్డుగా నిలుస్తున్న వారిని నెట్టివేస్తూ ముందుకు రా! రావయ్యా, రా! ముందుకు రా!! (ఆంధ్రప్రభ 2-12-1952)

ఫలసిద్ధి (ఆంధ్ర రాష్ట్రావతరణ)

బాపట్ల నుంచి కర్నూలుకు ఎన్ని మైళ్ళో తెలియదుకాని యేళ్ళు మాత్రం నిండుగా నలభై. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలనే తీర్మానం 1913లో బాపట్లలో ప్రథమాంధ్ర మహాసభలో జరిగింది. ఆ తీర్మానం 1953లో

కర్నూలులో ఫలసిద్ధిని పొందుతుంది. నాడు సమధికోత్సాహంతో బాపట్ల మహాసభలో పాల్గొన్న వారిలో పెక్కుమంది నేడు కర్నూలు మహోత్సవాన్ని సంతృప్తితో తిలకించగలిగింది స్వర్గధామం నుంచి మాత్రమే! మన అదృష్టం వల్ల నాటి మహాసభలో పాల్గొన్నవారు నేటికీ కొందరు మనమధ్య మిగిలివున్నారు కాని, నాడు వారు యౌవనులు కాగా, నేడు వయోవృద్ధులు. ఉద్యమ ప్రారంభం ఒక తరంలో, దాని లక్ష్యపరిపూర్తి మరొక తరంలో!

తిలక్, బెసెంట్, మాలవ్యా, గాంధీ ప్రభృతుల సమేతంగా పెద్దలందరు ఆమోదించారు. ఆశీర్వదించారు; అయినా, ఆంధ్రోద్యమ ప్రారంభం తర్వాత నలభై సంవత్సరాల పిమ్మటగాని, ఆంధ్ర రాష్ట్రావతరణ జరగడం లేదు. విశిష్టమైన ఒక ప్రజాకాంక్ష, వివాదాస్పదం కాని ఒక మహత్తరాదర్శం, విభిన్న వర్గాల సహాయ సహకారాలను పొందిన మహోద్యమం విజయప్రాప్తి నందడానికి ఇంతకాలం పట్టడం ప్రపంచ చరిత్రలోనే అరుదైన సంఘటన!

ఇంతటి దీర్ఘకాలం తర్వాత, ఇంతటి గొప్ప త్యాగం తర్వాత ఆంధ్ర రాష్ట్రావతరణ జరుగుతుంది కాబట్టే, నేడు యావదాంధ్ర జాతికి ఒక మహాపర్వదినం. ఇంతేకాదు, ఆంధ్రజాతి చరిత్రలోనే ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగు మహిమాన్విత పుణ్యదినం.

ఐతే నేడు ఆనందంతో ఆత్మావేదన కూడా పెనవైచుకొని ఉంది. ఆంధ్రభీష్మ న్యాపతి సుబ్బారావు పంతులు, సర్ బి.యన్. శర్మ, దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు, దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మొదలైన పెద్దలు ఆంధ్రరాష్ట్రాన్ని కళ్ళారా చూచుకొనడానికి లేకపోయినారు గదా అనే విచారం ఈనాడు ఏ ఆంధ్రునికి ఉండదు? ప్రత్యేక రాష్ట్రాన్ని పొందగలిగినా, పొట్టి శ్రీరాములను పోగొట్టుకొన్నామే అన్న బాధ ఈనాడు ఏ ఆంధ్రుని పీడించదు?

నేటి సంతోష సంరంభాల మధ్యనే ఒక పెద్ద అసంతృప్తి ప్రతి ఆంధ్రుని హృదయంలో దాగివుండగలదు కూడా! నేడు అవతరిస్తుంది సమగ్రాంధ్ర రాష్ట్రం కాదు. తెలంగాణా దాని వెలుపలనే ఇంకా మిగిలివుంది. గంజాం, కోరాపుట్టి జిల్లాలు, బస్తర్, చాందాలు దాని అక్కున చేరనేలేదు. సేలం, చెంగల్పట్టు, ఉత్తర ఆర్కాటు జిల్లాలలోని తెలుగు ప్రాంతాలు దానినుంచి వేరైవున్నాయి. కోలారు, తుముకూరు జిల్లాలు దానిలో అంతర్భాగాలు కాలేదు. మన బళ్ళారి మనకు కాకుండా పోయింది. ఒక మాటలో నేడు ఏర్పడుతున్నది, ఆంధ్రరాష్ట్రమే కాని, విశాలాంధ్ర కాదు. విశాలాంధ్ర నిర్మాణం జరగనంతవరకు ఆంధ్రోద్యమ విజయం అసంపూర్ణమైనట్టిదే!

ఏక భాష, ఏక సంస్కృతి - ఇదే ఆంధ్రోద్యమానికి ప్రాతిపదిక. అయినప్పుడు, ఆంధ్రమే మాతృభాషగా గలవారు లక్షలాదిగా ఆంధ్రరాష్ట్రం సరిహద్దుల వెలుపల మిగిలివుండగా, ఆంధ్రోద్యమం పూర్తి విజయాన్ని పొందినట్టు ఏ విధంగా సంతృప్తి చెందగలము? ఇంతేకాక,

విశాలాంధ్ర లేనిదే ఆంధ్రజాతి సర్వతోముఖాభివృద్ధి సులభసాధ్యం కాగలదా? సందేహం లేదు - ఆంధ్రుల సర్వతోముఖాభివృద్ధికి విశాలాంధ్ర అత్యవసరం, కాదు, ప్రాణావసరం. అయితే, ఆ విశాల లక్ష్యాన్ని మనం చేరుకొనగలగడం ఆంధ్ర రాష్ట్రాన్ని త్వరలో - అతి త్వరలో - ఒక స్థాయికి తెచ్చుకో గలిగితేనే! పోయిన నలభై సంవత్సరాల కృషి తర్వాత నేటికి ఒక రాష్ట్రాన్ని తెచ్చుకొనడం ఒక ఎత్తుకాగా, వచ్చే నాలుగు సంవత్సరాలలో కాలు నిలదొక్కుకొనడంలో పడవలసిన శ్రమ ఒక్కటీ ఒక ఎత్తు. నేడు కర్నూలులో జరగవలసింది కంకణ విసర్జన కాదు; పునఃకంకణధారణ. ఆంధ్ర రాష్ట్రాభ్యుదయ సాధనకు, విశాలాంధ్ర నిర్మాణానికి నేడు ప్రతి ఆంధ్రుడు తిరిగి కంకణం కట్టుకోవాలి.

ఆంధ్ర రాష్ట్రం సరిహద్దుల వెలుపల మిగిలిన సోదరాంధ్రుల పట్లనే కాక కన్నడ, కేరళ, మహారాష్ట్ర ప్రజలపట్ల కూడా తమకు గురుతర బాధ్యత కలదని ఆంధ్ర పౌరులు ఒక్క క్షణమైనా విస్మరించరాదు. భాషారాష్ట్రాల మహోద్యమాన్ని ప్రారంభించినవారు ఆంధ్రులు. దాన్ని పెంచి, పెద్ద చేసిన వారు ఆంధ్రులు. ఆ మహోద్యమానికి తమ నాయకత్వాన్ని నిలుపుకోవాలంటే, భాషాప్రయుక్తంగా దేశవిభజన పూర్తిగా కొనసాగడానికి వారు సంపూర్ణ దోహద మివ్వాలి. నేటి పరిస్థితులలో వారివ్వగల దోహదం, దేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత ప్రప్రథమంగా ఏర్పడుతున్న తమ భాషారాష్ట్రాన్ని విజయవంతం చేసుకొనడం! లేకపోతే, మరొక భాషారాష్ట్రం అవతరించడమే అనుమానం!

ఔను! నేడు తిరిగి కంకణం ధారణ చేయాలి; విజిగీషతో ముందుకు - ముందుకు పురోగమించాలి; ఆంధ్ర రాష్ట్రావతరణను సార్థకం చేసుకొని, విశాలాంధ్రను సాధించాలి!! ఈ కృషిలో నాయకులు, అనుచరులు అనే భేదం తగదు. ఇది అందరికీ పరీక్షా సమయం; ఇది అందరిపైగల బాధ్యత. అభ్యుదయపథంలో నేడు మనం పెడుతుంది మొదటి అడుగు మాత్రమే!

(ఆంధ్రప్రభ 1-10-1953)

విశాలాంధ్ర

ఆంధ్రరాష్ట్రావతరణ మహోత్సవ సందర్భంలో ఒకే ఒక అపశ్రుతి వినవచ్చింది అది, - విశాలాంధ్ర సమస్యపై కర్నూలులో పత్రికా విలేకరుల గోష్ఠిలో భారత ప్రధాని చేసిన ప్రకటన. "నేడు శుభదినం. ఒక నూతన రాష్ట్రం నేడు అవతరిస్తుంది" అంటూ ఆంధ్రరాష్ట్రానికి ప్రారంభోత్సవం చేసినప్పటికీ, భాషారాష్ట్రోద్యమం ఆశయాలను పండిట్ నెహ్రూ ఇప్పటికీ సరిగా అర్థం చేసుకోలేదని - సరిగా అర్థం చేసుకొనడానికి కనీసం ప్రయత్నమైనా చేయడం లేదని - విశాలాంధ్ర సమస్యపై ఆయన చేసిన ప్రకటననుబట్టి అనుకోవలసి వస్తుంది.

ప్రజాస్వామ్యానికి సామర్థ్యం ప్రజల సహాయసహకారాలతో ప్రభుత్వం కొనసాగినప్పుడే. అంధప్రాయంగా కాక, విచక్షణతో, వివేకంగా ఈ సహాయ సహకారాలు లభ్యం కావడం ప్రజల భాషలో పరిపాలన కొనసాగినప్పుడే. మన దేశంలో ఒకే భాష ప్రచారంలో ఉండివుంటే, భాషారాష్ట్రాల ప్రశ్న వచ్చి ఉండేదికాదు. సువిశాలమై, దాదాపు ఒక ఖండాన్ని పోలిన మన దేశంలో (జాతీయభాషగా

హిందీ గుర్తించబడిన పిమ్మట కూడా) వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరు భాషలు విధిగా ప్రచారంలో ఉండకతప్పదు. ఇది కాదనరాని సత్యం కాబట్టి, హిందీని జాతీయభాషగా నిర్ణయిస్తూనే భారత రాజ్యాంగం ప్రధానమైన దేశభాషలుగా మరి కొన్నింటిని గుర్తించింది. అయినప్పుడు, ఈ ప్రధాన భాషలవారు తమ ప్రాంతాల ప్రభుత్వాలు తమ భాషలలోనే కొనసాగాలని కోరడం ఏ విధంగా తప్పు కాగలదు? వారి కోర్కెను తిరస్కరించి, ప్రజా బాహుళ్యానికి తెలియని భాషలో రాష్ట్ర ప్రభుత్వాలను కొనసాగిస్తే, ప్రజాస్వామ్యమే ప్రాతిపదికగా గల భారత రాజ్యాంగం ఏ విధంగా లక్ష్యసంపూర్తిని పొందగలదు?

భాషారాష్ట్రాలు వినా భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ వేరుదన్నడానికే వీలులేదు. అయినా, భారత జాతీయతకు భాషారాష్ట్రాల వల్ల విఘాతం కలగగలదని కొందరు పెద్దలే అనుమానించడం శోచనీయం. భాషాప్రయుక్తంగా కాంగ్రెసు సంస్థ వ్యవస్థీకరణ జరిగిన పిమ్మటనే అది వాస్తవికమైన ప్రజాసంస్థగా రాణించగలిగింది. అయినా, భాషారాష్ట్రాల నిర్మాణం పట్ల వైముఖ్యాన్ని ప్రదర్శించడం శోచనీయమేకాక, ఆశ్చర్యం కాదా?

మరొక విషయం! భాషాప్రయుక్త రాష్ట్ర విభజన సూత్రాన్ని కొత్తగా మనమే అమలుపరచబోవడం లేదు. సోవియెట్ రష్యా ఏనాడో దాన్ని పూర్తిగా ఆచరణలో పెట్టింది. అందువల్ల అది ఎంతమాత్రం బలహీనపడలేదనడానికి నిదర్శనం - ప్రపంచ చరిత్రలోనే కని, విని యెరుగని విధంగా హిట్లర్ ముట్టడి జరిపినప్పటికీ రష్యన్ జాతీయతాభావం చెక్కుచెదరకుండా నిలవడమే! ప్రజాస్వామ్య సార్థక్యానికి ప్రజాభాషలలో పరిపాలన కొనసాగడం ముఖ్యావసరమని గుర్తించిన పిమ్మట ఎంత త్వరలో భాషా రాష్ట్రాలను నిర్మిస్తే, దేశానికి అంత క్షేమం, ప్రజలకు అంత పురోగతి. భారత ప్రధాని నేడు చెన్నపురిలో వివరించినట్టు, ప్రజలకు అన్నవస్త్రాల లోపాన్ని తీర్చడం, వారి జీవన ప్రమాణాన్ని పెంచడం మొదలైనవి ముఖ్య సమస్యలే. కాని, ఈ శారీరకావసరాలను తీర్చడంతోపాటు, "ఈ ప్రభుత్వం నాది" అనే మానసిక సంతృప్తిని కలిగించడం కూడా అతిముఖ్యమే. మానసికమైన ఈ సంతృప్తి లేకపోతే జాతీయపునర్నిర్మాణ కార్యక్రమం కుంటుపడిపోవడం తథ్యం.

నిన్న అవతరించినట్టిది అసమగ్రమైన ఆంధ్ర రాష్ట్రమైనా అది ఎంతటి ఉత్సాహాతిశయాలను రేకెత్తించిందో భారత ప్రధాని కర్నూలులో ప్రత్యక్షంగా చూచివున్నాడు. “నా రాజ్యం ఇక నాది" అనే భావం వెల్లువలా పెల్లుబుకడాన్ని నిన్న స్వయంగా చూచిన పిమ్మట కూడా మన “విశాలాంధ్ర” నినాదం వెనుక దురాక్రమణోద్దేశ ప్రేరితమైన సామ్రాజ్యతత్త్వం గర్భితమై ఉన్నదని ఆయన పలకడం చాలా వింతగా ఉంది. ఆంధ్రోద్యమానికి పరాకాష్ఠ విశాలాంధ్ర. మహోద్యమం న్యాయమైనదని గుర్తించి, ఆంధ్ర రాష్ట్రాన్ని నిర్మించిన మరుక్షణంలోనే విశాలాంధ్రను ఖండించడం చాలా మృదువుగా చెప్పాలంటే - బహుచిత్రంగా ఉంది.

ఏమైనా, ఆంధ్రరాష్ట్రాన్ని సాధించిన లక్ష్యశుద్ధే, ఆ త్యాగనిరతే విశాలాంధ్రను కూడా త్వరలో నిజం చేయగలదన్న విశ్వాసం మాకు పరిపూర్ణంగా ఉంది. (ఆంధ్రప్రభ 3-10-1953)

మహా తెలంగాణా

"తుంగభద్రా నదీ భంగమ్ములిరు క్రేవలొరసి పారుచురుచులరయుచుండ"గా, "కృష్ణవేణీ తరంగిణి నాలుకలు సాచి, దరుల రెండిట 'మజా' లరయుచుండ"గా, "గోదావరీ వీచికా దివ్యహస్తమ్ము లిరుకెలంకులదరు లొరయు చుండ"గా, "బోటి కిన్నెరసాని మాటి మాటికి పొంగి, రెండు క్రేవల దరులండ" గొనుచుండగా, "ఇటు నటును తెల్గు నేల లారటముజెంది కలసి పోజూచుచున్న యట్టులనె" తనకు తోచునని చెప్ప గలగడం ఒక కవికే చెల్లింది. "కలిపి వేయుము నా తెలంగాణ తల్లి! మూడు కోటుల నొక్కటే ముడిబిగించి" అని ప్రార్థించడం కూడా ఒక కవికే చెల్లింది. ఈ సంప్రార్థనంలో "నా తెలంగాణ తల్లి" అనే సంబోధనాన్ని బట్టి ఈయన తెలంగాణాకు చెందిన కవియని స్పష్టం. కలమెత్తగానే - కాదు, గళం విప్పగానే - ఏ తెలుగు నదులు తమ నిండు రూపంతో, పొంగు గుండెలతో తనకు సాక్షాత్కరించినవో, ఆ నదుల నిండుదనాన్నే కాక, వాటి పొంగులను సయితం తన మాటలతో స్ఫురింప జేయడాన్ని బట్టి ఈ కవి శ్రీ దాశరథి అని కూడా స్పష్టమే.

"నా తెలంగాణ కోటిరత్నాల వీణ" అని ఉదోషించిన ఈ యువ కవి "హాటకావనీ మహా ఖండ మీ రమణీయ భూమి, నా తెలంగాణ లేమ, సౌందర్య సీమ" అని ఉప్పొంగిన ఈ నవకవి - "నా తెలంగాణ దిగ్దిగంతములదాక పరచినట్టి జ్యోత్స్నా మయ ప్రభలలోన పోతకవి నుండి, నాదాక పొంగిపొరలె కావ్యవారాశి; కనుము, లోకమ్ము నందు" అని ఉగ్రూత లూగిస్తున్న ఈ ప్రముఖ కవి - "నాకు కావలె మహాంధ్రోర్వర" అని గొంతెత్తి చాటుతున్నాడు.

"రండి అన్నల్లార! తూరుపు దారి కెదురుగ ద్వారబంధము" అని ఆహ్వానిస్తున్నాడు. "ఈనాడు మహాంధ్రోదయ మైనది; కోట్లాది జనము తెలుగు లక్ష్మి పాదాలకు వెలుగుల పారాణ నిడిరి" అని రేపటి నవోదయానికి ఇప్పుడే నీరాజన మెత్తుతున్నాడు!

ఈ తెలంగాణా కవి కలలు గంటున్నట్టు, "కోటి తమ్ము"లు "రెండు కోట్ల తెల్గు టన్నల"ను చేరనున్నారా? మూడుకోటుల నొక్కటే ముడి బిగించి" తరతరాలకు తెలుగు కవులు "మహాంధ్ర సౌభాగ్య గీతి"ని పాడుకొననున్నారా? ఈ ప్రశ్నలకు ప్రత్యుత్తరం రావలసింది - మేము ఆది నుంచీ మనవి చేస్తున్నట్టు తెలంగాణా నుంచే.

ముక్కోటి తెలుగువారిని "ఒక్క ముడిలోకి" తీసుకురావడానికి జరగవలసిన కృషిలో ప్రథమ ఘట్టంగానే ఆంధ్రరాష్ట్రోద్యమం నడిచింది. అందువల్ల ఆంధ్రరాష్ట్రంలోని రెండుకోట్ల మంది అభిమతాన్ని నేడు ప్రత్యేకించి వివరించనక్కరలేదు. తాత్కాలిక రాజధాని, హైకోర్టుకు తాత్కాలిక కేంద్రం - ఈ విధంగా తాత్కాలిక నిర్ణయాలను పెక్కింటిని చేసుకొనడం ద్వారానే మహాంధ్రపట్ల తమ శ్రద్ధాసక్తులను వారు మొదటి నుంచీ ప్రదర్శిస్తున్నారు. దీని తాత్పర్యం అవసరమైతే ఒక రాజధానిని వారు నిర్మించుకొనలేరనీ కాదు; హైకోర్టుకు శాశ్వత కేంద్ర మొకటి వారికి లభ్యం కాబోదనీ కాదు. కర్నూలులో రెండేళ్ళనుంచి కొనసాగుతున్న ప్రభుత్వాన్ని అక్కడినుంచే ఇక ముందు కూడా కొనసాగించడంలో అధిగమించరాని ప్రతిబంధకా లేవీ లేవు; గుంటూరులో హైకోర్టు ఇప్పటికే కొంత కుదురుకున్నది. ఇక, లోటు బడ్జెట్టులు అంటారా? ఈనాడు మిగులు బడ్జెట్టులున్న రాష్ట్రాలెన్ని ఉన్నాయి? ప్రభుత్వం బడ్జెట్టు పూడడం, పూడక పోవడం - ఇవి ముఖ్య విషయాలు కానే కావు; అభివృద్ధికి ఎంతవరకు అవకాశం కలదనేదే ముఖ్యం. అట్టి అవకాశం ఆంధ్ర రాష్ట్రానికి విశేషంగా కలదని గడచిన రెండు సంవత్సరాలలో అది సాధించిన పురోభివృద్ధే వేనోళ్ళ చాటుతున్నది. అయినా, ఆంధ్రరాష్ట్రంలోని రెండుకోట్ల మంది తెలుగువారు మహాంధ్రను - లేదా, మహా తెలంగాణాను మనసారా కోరడం

చిరకాలంగా తమను ఆకర్షిస్తున్న ఒక లక్ష్యానికి పరిపూర్ణ ఫలసిద్ధి "మూడు కోటుల నొక్కటే ముడి బిగించి" నప్పుడన్న నమ్మకంతోనే; సమగ్రమైన మహా తెలంగాణా అవతరించనిదే యావదాంధ్ర జాతికి సముజ్జ్వల భవిష్యత్తు లేదన్న విశ్వాసంతోనే.

ఈ విశ్వాసంలో భాగస్వాములైన వారికి అనుమానాలేవీ ఉండవు; వారికి హామీ లేవీ అక్కరలేదు. అయినా, ఒకే లక్ష్యంలో అందరికీ సమానమైన విశ్వాసం ఉండకపోవచ్చు. కనుకనే తమ అనుమానాల నివర్తికి హామీలను కోరినవారికి వాటినివ్వడానికి ఆంధ్రరాష్ట్రానికి చెందినవారు తమ సంసిద్ధతను వెలిబుచ్చుతూనే ఉన్నారు. ఈ సంసిద్ధతకు సరికొత్త నిదర్శనమే మొన్న విజయవాడలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు, యునైటెడ్ లెజిస్లేచర్ కాంగ్రెసు పార్టీల సంయుక్త సమావేశం చేసిన తీర్మానం.

నిజానికి నేడు కావలసినవి "హామీ"లు కావు; గుండెలు హత్తుకొనడం మాత్రమే. ఇది జరగడం "కోటితమ్ముల కడ రెండుకోట్ల తెల్గుటన్నలను గూర్చి వృత్తాంత మంద"జేయగలవారు తెలంగాణాలో ఊరూర, వాడవాడ తలయెత్తినప్పుడే. ఇట్టివారి కందరికి తలమానికంగా నిలిచిన శ్రీ బూర్గుల రామకృష్ణరావు గారికి యావదాంధ్రజాతి నేడు జోహారులర్పిస్తున్నది. "తిరిగి అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేసే సంకల్పం నాకు లేదని ఇదివరలోనే స్పష్టం చేశాను. ఎట్టి స్వార్థం లేకుండానే మహాంధ్రోదయాన్ని నేను కాంక్షిస్తున్నాను" అని నిన్న చేసిన ప్రకటనతో ఆయన అంతస్తు మరింత పెరిగింది. నిన్న హైదరాబాద్లో జరిగిన ఆంధ్రతెలంగాణా సమైక్యతా సమ్మేళనంలో వ్యక్తమైన అభిప్రాయమే త్వరలో తెలంగాణా ఏకగ్రీవాభిప్రాయమై, శ్రీ దాశరథి సమేతంగా పెక్కుమంది కలలు గంటున్న మహాంధ్ర అనతి కాలంలోనే అవతరించగలదని ఆశిస్తున్నాము. (ఆంధ్రప్రభ 4-11-1955)

ఆంధ్రప్రదేశ్ అవతరణ

అమరజీవి తపస్సు ఫలించింది; ఆంధ్రజాతి అదృష్టరేఖ బయటబడింది; ఆంధ్రప్రదేశ్ అవతరిస్తున్నది; ఆంధ్రావని అమితోత్సాహంతో - అఖండ సంరంభంతో ఆనందోత్సవాన్ని జరుపుకొంటున్నది.

ముక్కోటి ఆంధ్రులను ఒక ముడికి తెస్తున్న ఈ మహత్తర సంఘటన మన చరిత్రలోనే అపూర్వమైనదనడం అతిశయోక్తి కాదేమో! శాతవాహన కాలమే మన చరిత్రలో స్వర్ణయుగం. శాతవాహన సామ్రాజ్యం (దాని మహోచ్ఛస్థితిలో ఇప్పటి మన ఆంధ్రప్రదేశ్ కంటె బహు విస్తృతమైంది. అయితే, ఆంధ్రప్రదేశ్లో నేడు అంతర్భాగాలుగానున్న ప్రాంతాలన్నింటికీ అది విస్తరించలేదు. శ్రీకాకుళం, కళింగపట్నం శాతవాహన సామ్రాజ్యం సరిహద్దులకు వెలుపలనే వుండేవి. అటుతర్వాత ఇంచుమించు వెయ్యేండ్లకు తలయెత్తిన కాకతీయ సామ్రాజ్యం ఉత్తరపు సరిహద్దులు పిఠాపురాన్ని దాటిపోలేదు. కాగా, విజయనగర సామ్రాజ్యం కటకం వరకు విస్తరించినా, తెలంగాణాలోని కొన్ని భాగాలు దాని వెలుపలనే వుండేవి. ఇప్పటి ఆంధ్రప్రదేశ్లోనైనా అన్ని తెలుగు తాలూకాలు లేవు; బరంపురమేమి, దాని పరిసరాలలోని ఆంధ్ర ప్రాంతాలేమి దానిలో చేరలేదు. అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్ సరిహద్దులలోకి వచ్చినంత తెలుగు మాగాణి ఇంతకు మున్నెన్నడూ ఆంధ్ర సామ్రాజ్యం కిందికి రాలేదనడం మాత్రం చారిత్రక సత్యం.

అపూర్వమైన ఈ మహత్తర సంఘటనకు ఆనందోత్సవాన్ని జరుపుకొనవలసిందే. అయితే, అంతటితో మన బాధ్యత తీరిపోదు. భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్విభజనోద్యమాన్ని ప్రారంభించింది మనమే. దాన్ని మహోద్యమంగా - ప్రజోద్యమంగా - మార్చిందీ మనమే. దాని సాఫల్యంకోసం ఆత్మ బలిదానం చేసిన అమరకీర్తి కూడా మన ఆంధ్రులలోనే ఒక అకలంక చరిత్రునికి దక్కింది. అసమగ్రమైన ఆంధ్రరాష్ట్రం ఈనాడు సమగ్రమైన ఆంధ్రప్రదేశ్ మారుతున్నా, భాషా ప్రయుక్త రాష్ట్రాల కింద దక్షిణాపథ

పునర్వ్యవస్థీకరణ ఈనాడు జరుగుతున్నా, ఇదంతా ఈ శతాబ్దారంభంలో ప్రథమ ఆంధ్రమహాసభ రూపంలో బాపట్లతో ప్రారంభమైన భాషోద్యమ సత్ఫలితంగానే. కాబట్టి, భాషారాష్ట్రాలు ఆయా భాషాప్రాంతాల పురోగతికే కాక, దేశం సర్వతోముఖాభివృద్ధికి దోహద మివ్వగలవని నిరూపించవలసిన బాధ్యత ప్రధానంగా మనపైనే వున్నది.

జాతీయతకు భాషా రాష్ట్రాలు విఘాతం కలిగించవు సరిగదా, దానికి పెట్టని కోటలు కాగలవని మన మిప్పుడు నిరూపించాలి. ప్రజలకు తెలిసిన భాషలలో పరిపాలన కొనసాగినప్పుడే ప్రజాస్వామ్య ప్రభుత్వం నిజమైన ప్రజా ప్రభుత్వంగా విలసిల్ల గలదని మన మిప్పుడు నిరూపించాలి. భాషా రాష్ట్రాలు ప్రాంతీయ భాషాభివృద్ధికి, ప్రాంతీయ సాహిత్య వికాసానికి తోడ్పడి, భారతీయ సంస్కృతికి వైవిధ్యాలతోపాటు విలక్షణత్వాన్ని, పుష్టితోపాటు దీప్తిని సమకూర్చ గలవని మన మిప్పుడు నిరూపించాలి. భాషా, సాహిత్య రంగాలలోనే కాక, ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో శీఘ్ర పురోగతిని, తద్వారా శాంతి, సుభిక్షాలను సాధించడానికి భాషారాష్ట్రాలు పట్టుకొమ్మలని మన మిప్పుడు నిరూపించాలి. ఈ గురుతర బాధ్యత మనపై కలదని గుర్తించినప్పుడే,

దీన్ని నిర్వహించడానికి దీక్షా కంకణబద్ధుల మైనప్పుడే మనం చరితార్థుల మౌతాము.

భారతజాతి. కుల తెలుగు కులం. జాతి విభేదాలను మనం మరచిపోవాలి. మనది ఒక్కటే జాతి, అది విభేదాలను మనం విస్మరించాలి. మనది ఒక్కటే కులం, అది ప్రాంతీయాభిమానాలకు మనం స్వస్తి చెప్పాలి. మనది ఒక్కటే ప్రాంతం, అది - ఆంధ్రప్రాంతం; దానికే మరొక పేరు “ఆంధ్రప్రదేశ్”. వ్యక్తి ప్రయోజనాలను మనం వెనుకకు నెట్టాలి. సమష్టి క్షేమంలోనే వ్యష్టి భద్రత యిమిడి వుంటుంది. పదవీ వ్యామోహాలకు మనం రాజకీయవేత్తలని మా తాత్పర్యం - అతీతులం కావాలి. ప్రజాసేవ చేయడానికి పదవి లేకపోవడం ప్రతిబంధకం కాదు. వీటిని శ్రీరంగనీతులుగా కొట్టివేయడం సులభమే. కాని, ఆ పని చేసినప్పుడు ఆంధ్రప్రదేశ్కు జరిగిన ప్రజాందోళనతోపాటు, ఆ సందర్భంలో జరిగిన అశేష త్యాగాలు కూడా బూడిదలో పోసిన పన్నీరే కాగలవు. మన

నేటి ఆనందోత్సవాల మధ్య అనంతర కర్తవ్యాన్ని మరచిపోవలదని తిరిగి మా మనవి. అభివృద్ధి సాధనకు, అభ్యున్నతి సాధనకు దీక్షాకంకణ ధారణ చేయవలసిందిగా మరొకసారి మా విజ్ఞప్తి. (ఆంధ్రప్రభ 1-11-1956)

జాతికే ముప్పు

"మీకు కోర్కెగా వుంటే, మమ్ములను పదవీభ్రష్టులను చేయడానికి మీ శక్తికొలదీ ప్రయత్నించండి. కాని, దయచేసి ఆంధ్ర - తెలంగాణా విభేదాలను రెచ్చగొట్టకండి" - ఇది నిండుమనస్సుతో జరిగిన వినతి, గుండెలను చీల్చుకు వచ్చిన విజ్ఞాపన. ముక్కోటి ఆంధ్రులను ఒక ముడికి తేవాలని తరతరాలుగా ఆంధ్ర నాయకులు పడిన ఆతురత ఈ విజ్ఞాపనకు బలమిస్తుంది. కృష్ణ, గోదావరి, తుంగభద్ర నదులకు ఈవలావల రెండుగా, రెండు ప్రభుత్వాల క్రింద చీలివున్న తెలుగునేల ఎట్టకేలకు ఏకఖండమై పట్టుమని రెండు సంవత్సరాలైనా కాకముందే ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టడానికి పట్టుదలతో కొందరు చేస్తున్న ప్రయత్నాన్ని చూడగా సహజంగా కలిగే ఆవేదన ఈ విజ్ఞాపనలో పెల్లుబుకుతుంది.

నిన్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి చేసిన ఈ విజ్ఞాపన కేవలం ఆయన పరంగా జరిగింది కాదు; ఇది ఆంధ్రజాతి పరంగా జరిగింది, ఆ జాతి యోగక్షేమాల పరంగా జరిగింది, దాని భవిష్యత్తు పరంగా జరిగింది. శ్రీ సంజీవరెడ్డి నేడు

ముఖ్యమంత్రి కావచ్చు. రేపు కాకపోవచ్చు. వ్యక్తులు స్థిరం కారు, వ్యక్తుల పదవులైనా స్థిరం కావు. స్థిరంగా నిలిచేదీ - నిలవవలసిందీ జాతి మాత్రమే. ప్రాంతీయ విద్వేషాల విషం రక్తనాళాలలో ప్రవేశిస్తే, ఏ జాతికైనా స్థిరత్వం లేదు, భవిష్యత్తు అంతకంటే లేదు. ఈ సత్యాన్ని హృద్గతం చేసుకోబట్టే శ్రీ సంజీవరెడ్డి "కోర్కెగావుంటే మమ్ములను పదవీభ్రష్టులను చేయండి. కాని, దయచేసి ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టకండి" అని పుట్టెడు ఆవేదనతో అభ్యర్థించాడు. కొన్ని శతాబ్దాల ఎడబాటు తర్వాత పదహారు నెలల క్రితమే ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలు తిరిగి ఏకమైనాయి. విడివిడిగా ఉన్న ఈ సుదీర్ఘకాలంలో వాటి ప్రభుత్వ వ్యవస్థలు వేరు; పరిపాలనా విధానాలు వేరు. ఈ వ్యవస్థలను మిళితం చేయడం, ఈ విధానాలను సమన్వయ పరచడం, పరస్పర విశ్వాసం ఉన్నప్పటికీ, సుహృద్భావం ఉన్నప్పటికీ, సులభసాధ్యం కాదు. ఇక అట్టి విశ్వాసమే, అట్టి సుహృద్భావమే కొరవడితే, అది అసాధ్యవిషయ మౌతుంది. ఈ సత్యాన్ని గుర్తించిన పక్షంలో గోరంతలు కొండంతలు చేసి, ఆవేశాలను పెంచుకొనడంకాని, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టే ఆందోళన కొనసాగించడం కాని జరుగదు.

ఒకవేళ నిజంగానే ప్రస్తుతపు నూతన వ్యవస్థలో తెలంగాణా ప్రాంతానికి అన్యాయాలు జరుగుతూవుంటే, వాటిని నివారించడానికి మార్గం నిరసన సభలను జరపడమూ కాదు, “నియంత ప్రభుత్వ” మంటూ నినాదాలు చేయడమూ కాదు. నియంత ప్రభుత్వంలో నిరసన సభలకు, నిందాపూర్వక నినాదాలకు అవకాశమే ఉండదు; ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఇది సాధ్యం.

ఏమైనా, తెలంగాణాను ప్రభుత్వం నిజంగానే చిన్నచూపు చూస్తుంటే న్యాయసాధనకు సముచితమైన అనేక మార్గాలున్నాయి, సాధనలున్నాయి. సభలను జరపడానికి ముందు ఖండన తీర్మానాలు చేయడానికి ముందు, “ఇదుగో! మాకు ఈ అన్యాయం జరిగింది” అని మొత్తం ప్రభుత్వానికి తెలియజెప్పాలి. అప్పటికీ అన్యాయం తొలగకపోతే, ప్రత్యేకించి తెలంగాణా మంత్రులను శ్రద్ధ పుచ్చుకోవలసిందిగా కోరాలి. అందువల్ల కూడా ఫలితం శూన్యమైతే, పార్టీ సమావేశంలో ప్రసంగించాలి. అప్పటికీ ప్రయోజనం లేకపోతే, అప్పుడు శాసనసభకు తెలియజెప్పాలి. ఈ అన్ని సందర్భాలలోను అనుమానాలను వెల్లడించడం చాలదు, అన్యాయ మేమి జరిగిందో సహేతుకంగా నిరూపించాలి. అయినా, లాభం లేకపోతే, అప్పుడు మాత్రమే ప్రజాందోళన ప్రారంభించాలి.

ఇందుకు భిన్నంగా ప్రస్తుతం కొందరు వ్యవహరించడం ఎంతైనా శోచనీయం. వీరికి ఇప్పటి మంత్రివర్గంపై, దాని నాయకునిపై, అసంతృప్తి వుంటే, ఆ మంత్రివర్గాన్ని పడగొట్టవచ్చు; దాని నాయకుని తొలగించనూవచ్చు. కాని, తెలంగాణాకు ఏవేవో అన్యాయాలన్న పేరుతో ప్రాంతీయ విద్వేషాలకు ప్రాణం పోయడం మాత్రం ఆంధ్రజాతి భవిష్యత్తుకే ప్రమాదకరం.

ఆంధ్ర ప్రాంతమన్నా, తెలంగాణా ప్రాంతమన్నా, మనది ఒక్కటే తెలుగుగడ్డ. దీనిలో ఏ ప్రాంతం వెనుకబడివున్నా, మొత్తం రాష్ట్రం వెనుకబడి ఉన్నట్టే! ఏ ప్రాంతానికి అన్యాయం జరిగినా, మొత్తం జాతికి అన్యాయం జరిగినట్టే! ఈ విషయాన్ని ప్రస్తుత మంత్రివర్గం, దాని సభ్యులు, విశ్లేషించి దాని నాయకుడు పదేపదే ఉద్ఘాటిస్తున్నా, దాన్ని కాదని, లేనిపోని ఆందోళనను లేవదీయడం మొత్తం జాతికే ముప్పు, సమష్టి క్షేమానికే గొడ్డలిపెట్టు! (ఆంధ్రప్రభ 16-3-1958)

కలం కన్నీటిలో ముంచి...

కేవలం మానసికాందోళనతోనే కాక, హృదయావేదనతో నేటి మా సంపాదకీయాన్ని ప్రారంభిస్తున్నాం. కలాన్ని సిరాలోకాక, కన్నీటిలో ముంచి, దీన్ని వ్రాస్తున్నాం. నిజంగానే హృదయం సంక్షుభితం కావలసిన సందర్భమిది, కన్నుల నుంచి నీరు కాల్వలు కట్టవలసిన సన్నివేశ మిది.

మనది ఒకే భాష, ఒకే చరిత్ర, ఒకే సంస్కృతి, ఒకే వారసత్వం. ప్రాంతీయ విభేదాలకు అతీతంగా నిలవదగినట్టిది మన రక్తబాంధవ్యం. నన్నయ్య రాజమహేంద్రవరం వాడైనా, పోతన ఓరుగంటివాడైనా, ఉభయులు ఒకే తెలుగులో రాశారు. తాను కాకతీయుడైనా, తిక్కన ప్రార్థనపై మనుమసిద్ధి రక్షణ నిమిత్తం గణపతిదేవుడు తన సైన్యాలను పంపించాడు. అన్నపానీయాలు మొదలుకొని ఆచార వ్యవహారాల వరకు, జోలపాటలు మొదలుకొని వీరగాథల వరకు మనది ఒకే సంస్కృతి; అవి అమరావతి శిల్పాలైనా, ఓరుగల్లు విజయతోరణాలైనా మనది ఒకటే వారసత్వం.

అయినా, మనలో ప్రాంతీయ విభేదాలు పెరగవలసిందేనా? కలతలు ప్రబలవలసిందేనా? సంఘర్షణలు చెలరేగ వలసిందేనా? ఈ విషాద పరిణామానికి కారణాలను ఇప్పుడు మనం వెతకనక్కరలేదు. ఇందుకు ఎవరు బాధ్యులన్న పరిశీలన చేయనక్కరలేదు. ఈనాడు ఒకే ఒక ప్రశ్న మనం ప్రధానంగా వేసుకోవాలి.

రెండు, మూడు వేల సంవత్సరాలకు విస్తరిస్తున్న మన తెలుగుజాతి చరిత్రలో రాజకీయంగా మనం పూర్తిగా ఏకం కాగలిగింది ఆంధ్రప్రదేశ్ నిర్మాణం తర్వాతనే. ఇది శాతవాహనుల కాలంలో జరగలేదు. చాళుక్యుల కాలంలో జరగలేదు. కాకతీయుల కాలంలో జరగలేదు, రెడ్డిరాజుల కాలంలో జరగలేదు. విజయనగర సామ్రాజ్యకాలంలోనైనా జరగలేదు. మున్నెన్నడు కనివిని యెరుగని సమైక్యాన్ని ఆంధ్రప్రదేశ్ నిర్మాణంతో సంపాదించుకున్న తర్వాత, దానికి చేజేతుల విఘాతం కల్పించుకొనడం మనకు తగునా?

ఎన్నెన్నో కష్టాలు పడకుండా, త్యాగాలు చేయకుండా ఆంధ్రప్రదేశ్ సిద్ధించలేదు. ఆంధ్రరాష్ట్ర నిర్మాణమే బీహార్, ఒరిస్సాల నిర్మాణానికి ఏడు వెనకలుగా జరిగింది. అటుపిమ్మట ఆంధ్రప్రదేశ్ అవతరణకు మరికొంత కాలం పట్టింది. మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, టంగుటూరి ప్రకాశం, అయ్యదేవర కాళేశ్వరరావు ప్రభృతులు ఏళ్లతరబడి, పూళ్ళ తరబడి కనిన కలల పంటగానే ఆంధ్రప్రదేశ్ నిర్మాణం జరిగింది.

దీని శాంతికి, దీని సౌభాగ్యానికి, దీని అస్తిత్వానికి, దీని భవిష్యత్తుకు ఎవరిద్వారా, ఏ దిక్కునుంచి ప్రమాదం సంఘటించినా, అది హృదయావేదన కలిగించగల శోచనీయ పరిణామమే, కన్నీరు తెప్పించగల విషాద సన్నివేశమే! (ఆంధ్రజ్యోతి 30-1-1969)

ఎక్కడికి పోతున్నాము?

ఎందరు రాష్ట్ర విభజన కోరుతున్నారు? "నూటికి 90 మంది" అని శ్రీ బి.వి. సుబ్బారెడ్డి అనవచ్చు. "కాదు, నూటికి 95 మంది" అని శ్రీ తెన్నేటి విశ్వనాథం పలకవచ్చు. "చాల్చాలు! ప్రజల సంగతి మీకేమి తెలుసు? నూటికి 99 మంది" అని శ్రీ గౌతు లచ్చన్న హుంకరించవచ్చు. కేవలం వాదం కోసం శ్రీ లచ్చన్న హుంకరింపు ప్రకారం నూటికి 99 మంది రాష్ట్ర విభజన కోరుతున్నారనే అనుకోండి. అయినా, ప్రతి నూర్గురిలో రాష్ట్ర సమైక్యతను కోరుతున్న ఒక్క వ్యక్తికి తన వైఖరిని ప్రకటించడానికి స్వేచ్ఛ ఉండాలి, తన వాదాన్ని, ప్రచారం చేసుకొనడానికి స్వాతంత్ర్యం ఉండాలి. ఈ స్వేచ్ఛ లేనట్టిది, ఈ స్వాతంత్ర్యం మృగ్యమైనట్టిది ఫాసిస్టు నియంతృత్వం కావచ్చుగాని, ప్రజాస్వామ్య వ్యవస్థ కాదు, కానేరదు.

అయినా, సమైక్యతావాదుల నోరు నొక్కడానికే, వారి సభలను చెదరగొట్టడానికే, వారి పౌరసత్వాలను కబళించడానికే విభజనవాదులు ఈనాటికి కూడా ఉద్యమిస్తున్నారు. రెండు, మూడు రోజులనాడు విశాఖపట్నం సమైక్యతావాదుల సభపై వారు బాంబులు వేశారు; వారం, పది రోజుల నాడు గుడివాడలో ఈ పనినే చేశారు; మరికొన్ని చోట్ల కూడా ఇంతే చేశారు, చేస్తున్నారు.

విభజనవాదుల కోర్కె ఫలిస్తే, ప్రత్యేకాంధ్ర రాష్ట్రం నెలకొంటే, దానిలో మైనారిటీ గొంతును మెజారిటీ నొక్కివేయడమే జరగబోతున్నట్టు దీన్నిబట్టి తీర్మానించుకొనవలెనా? దానిలో భావస్వాతంత్ర్యం, వాక్ స్వాతంత్ర్యం, సభా స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం మటుమాయం కానున్నవని నిర్ధారించుకొనవలెనా? దానిలో పౌరసత్వాలు పూజ్యం కాగలవన్న సారాంశాన్ని తేల్చుకొనవలెనా? గుడివాడ, విశాఖపట్నం సంఘటనలను పోలినవాటిని విభజనోద్యమ నాయకులు ఖండించక పోవడాన్ని బట్టి ఇంతే జరగనున్నట్టు నిర్ణయించుకొనక తప్పదేమో! అది చిన్ని కోర్కె కానివ్వండి, విస్తృతవాంఛ కానివ్వండి; అది ఎంత స్వల్ప విషయమైనా కానివ్వండి, ఘనసమస్య కానివ్వండి; అది ఏదైనా, ఎట్టిదైనా, ఈనాడు మన దేశం మొత్తం మీద జరుగుతున్న పని ప్రజాస్వామ్యం విలువలను తూర్పారబట్టడమే, ప్రజాస్వామ్య సంప్రదాయాలను మంటగలపడమే. ఇంతేకాక, ఆంధ్రప్రదేశ్ విభజనోద్యమాల సందర్భంలో సంస్కృతికి, సభ్యతకు తిలోదకా లివ్వడం సైతం జరిగింది, జరుగుతుంది. 1969-70లో తెలంగాణాలో వలె, 1972-73లో ఆంధ్రప్రాంతంలో కూడా బండబూతులతో ఎన్ని గోడలు ఖరాబు కాలేదు? జంట నగరాల గోడలను 1969-70లో చూచిన నాటి మైసూరు ముఖ్యమంత్రి "తెలుగువారి సంస్కృతి, వారి సభ్యత ఇంత హీనమైనవా, ఇంతగా హేయమైనవా!" అని ముక్కుపై వేలు వేసుకొన్నాడట. వాటిని చూస్తే ఆయనకే కాదు, ఏ శిష్ట వ్యక్తికైనా, ఇదే విధమైన ఆశ్చర్యం కలుగుతుంది, ఆవేదన కలుగుతుంది.

దేశం మొత్తం మీద తర, తమ భేదాలతో ఈ విధమైన విపరిణామాలు ప్రబలుతున్నప్పుడు, మనం ఎక్కడికి పోతున్నామన్న ప్రశ్న సహజంగానే ఉదయిస్తుంది. ఆ ప్రశ్న ప్రతి ప్రజాస్వామ్యవాది మనస్సును నేడు వికలం చేస్తుంది. ప్రతి శిష్టమానవుని హృదయాన్ని సంక్షుభితం చేస్తున్నది! (ఆంధ్రజ్యోతి 12-4-1973)

రావలసిన విప్లవాలు

1 ప్రశాంత విప్లవం
2 భావ విప్లవం
3 ప్రేమపూర్వక విప్లవం
4. సృజనాత్మక విప్లవం
5 జాతీయ విప్లవం
6 భావ స్వాతంత్ర్యం

ప్రశాంత విప్లవం

(భారతదేశంలో రిపబ్లిక్ గా అవతరించాక రావాలని ప్రశాంత, భావ, ప్రేమపూర్వక, సృజనాత్మక, జాతీయ విప్లవాల గురించి విశ్లేషణ. భావ స్వాతంత్ర్య అవసరాన్ని గురించి వివరణ)

విద్యుద్వేగంతో జరిగేదే విప్లవం కాదు; విధ్వంసాత్మకమైనదే విప్లవం కాదు; రక్తపాతంతో కూడిందే విప్లవం కాదు. సర్వసాధారణంగా విద్యుద్వేగంతోనే, విధ్వంసాత్మకంగానే, రక్తపాత సమేతంగానే విప్లవాలు కొనసాగుతాయి. అయితే, అంతమాత్రంచేత సరిగా ఈ ఒరవడి ప్రకారం జరగనిది విప్లవం కాదనడం మెరుపులతోను, ఉరుములతోను సామాన్యంగా వర్షం ప్రారంభమౌతుంది కాబట్టి, అవి లేకుండా కురిసే దాన్ని వర్షం కాదనడమే!

ఆర్థిక, సాంఘిక, రాజకీయాది వ్యవస్థలను ప్రాతిపదికల వద్ద నుంచీ పూర్తిగా మార్చగలిగేదే విప్లవం. పై వాక్యంలో "పూర్తి మార్పు" అనేదానికంటే, "ప్రాతిపదికల వద్ద నుంచీ" అనేది ఎక్కువ ముఖ్యం. "సంస్కరణ" ద్వారా కూడా మార్పును సాధించవచ్చు; తీవ్ర సంస్కరణల ద్వారా పూర్తి మార్పును సైతం సాధించవచ్చు. కాని, సంస్కరణల ద్వారా ఏ వ్యవస్థ ప్రాతిపదికలూ చెక్కు చెదరవు. వీటిని కదిలించగల శక్తి ఒక విప్లవానికే ఉంది. ఇదే సంస్కరణకు, విప్లవానికీ ప్రధాన భేదం.

"పునాదుల నుంచీ జరిగే పూర్తి మార్పే విప్లవం" అనే ఈ నిర్వచనాన్ని ఆమోదించినప్పుడు - జిజ్ఞాసువు లందరు దీన్ని నిరాటంకంగా ఆమోదిస్తారు - విద్యుద్వేగంతోనే కాక, క్రమానుగతంగా

కూడా, విధ్వంసాత్మకంగానేకాక, నిర్మాణాత్మకంగా కూడా, హింసా సమేతంగానే కాక, అహింసా విధానాల ద్వారా కూడా విప్లవాన్ని సాగించడం సాధ్యమేనని తప్పక ఆమోదించాలి. ఇంతకంటే ముఖ్యమైన విషయమిది : క్రమానుగతంగా, నిర్మాణాత్మకంగా, అహింసా విధానాల ద్వారా కొనసాగే విప్లవాల ఫలితాలే ఎక్కువ విస్తృతమైనవి; వీటికే శాశ్వతత్వం ఉంటుంది కూడా. కారుచీకట్లను చీల్చుకొంటూ, కన్నులు మిరిమిట్లు గొల్పుతూ, తారాజువ్వ ఎంత వేగంతో ఆకాశంలోకి వెదుతుందో దాదాపు అంత వేగంతోనూ

వెలవెలబోతూ నేల కొరుగుతుంది. విద్యుద్వేగంతో జరిగే విప్లవాల అంతిమ పర్యవసానం ఇంతే అయిపోయిన సందర్భాలు ప్రపంచ చరిత్రలో ఎన్నో ఉన్నాయి. ఇందుకు ప్రసిద్ధమైన ఒక ఉదాహరణ, 1789లో జరిగిన ఫ్రెంచి విప్లవమే! "స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాత్రం" నినాదాలుగా ప్రారంభమైన ఈ విప్లవం నెపోలియన్ నియంతృత్వంగా మారిపోవడానికి ఎంతో కాలం పట్టలేదు!

విప్లవం విధ్వంసాత్మకంగా జరిగినప్పుడు పునాదులు కదిలింపు ఎక్కువగా జరిగే మాట నిజమైనా, సౌధం మొత్తం ఒక్కసారిగా నెత్తిపై కూలగల ప్రమాదం ఉంది; ఇది తప్పితే, ఆవశ్యకమైన మేరను సయితం మించి, ఛిన్నాభిన్నం చేసి వేయబడిన సౌధ శిథిలాలను తొలగించి, కొత్త పునాదులను వేసుకొనడానికి కనీసం ఒక తరానికి తరాన్నే వృథా వ్యయ ప్రయాసలకు, కష్ట నష్టాలకు పాల్పడజేయవలసిన ప్రమాదం ఉంది. ఇందుకు ఒక తార్కాణంగా రష్యా, చైనాలనే పేర్కొనవచ్చు. 1917 నాటి బోల్షివిక్ విప్లవంలో పూర్తిగా శిథిలం చేయబడిన ఆర్థిక వ్యవస్థకు కొత్త పునాదులను వేయగల ప్రథమ పంచవర్ష ప్రణాళిక అమలుకు 1928 వరకు రష్యా వేచి ఉండవలసి వచ్చింది. రష్యాలోని బోల్షివిక్ విప్లవంలో జరిగినంతటి విధ్వంసం లేకపోబట్టే. 1949లో అధికారానికి వచ్చిన చైనీస్ కమ్యూనిస్టు ప్రభుత్వం అప్పుడే జాతీయ పునర్నిర్మాణ పథకాలను నిర్వహించగలుగుతుంది.

కాగా, హింసాత్మక విప్లవ రక్షణకు హింసే సాధనంగా చేసుకొనక తప్పదు. ఇంతకుముందు కూడా ఒక సంపాదకీయంలో మేము వివరించినట్టు, ఎవరైనా సరే కత్తితో తినగలిగింది. నెత్తురు కూటిని మాత్రమే! రక్షణకు హింస ఆవశ్యకమైన విప్లవ వ్యవస్థ త్వరలోను - తేలికగాను కేవల మొక "పోలీసు రాజ్యం"గా మారుతుంది. అట్టి రాజ్యంలో అసలు విప్లవ లక్ష్యాలే అడుగంటి పోవచ్చు.

ఈ అన్ని విషయాలనుబట్టి, క్రమానుగతంగా, నిర్మాణాత్మకంగా, అహింసాయుత సాధనాలతో కొనసాగే విప్లవమే తద్భిన్నమైన దానికంటే విశిష్టమైన, సుస్థిరమైన ఫలితాల నివ్వగలదనడం సువిదితమే! సరిగా ఇట్టి విప్లవమే గాంధీజీ నాయకత్వాన అది నేటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతుంది. ఇంచుమించు రెండు శతాబ్దాల బ్రిటీష్ పరిపాలన తొలగడం, ప్రజాస్వామ్యం ప్రాతిపదికగా, శ్రేయోరాజ్య స్థాపన పరమ లక్ష్యంగా నూతన భారత రాజ్యాంగ రచన జరగడం, రిపబ్లిక్గా ఇండియా అవతరించడం, స్వదేశ సంస్థానాల లీనీకరణ రక్తపాత రహితంగా కొనసాగడం, జమిందారీలు కల్లోలాలు లేకుండా అంతరించడం, మరణ సుంకాల శాసనం అమలు జరగడం, పంచవర్ష ప్రణాళిక జయప్రదంగా కొనసాగుతూ ఉండడం, అన్నవస్త్రాల విషయంలో భారతదేశం స్వయం సంపూర్ణతను సాధించడం, పారిశ్రామికోత్పత్తులలో సర్వతోముఖాభివృద్ధి కానరావడం, విద్య వ్యాపించడం, వైద్య సౌకర్యాలు పెరగడం - ఇవన్నీ గాంధీజీ ప్రారంభించగా, నెహ్రూ ముందుకు తీసుకుపోతున్న అపూర్వ విప్లవంలో (దీన్నే "ప్రశాంత విప్లవం" అని కూడా అనవచ్చు) వివిధ ఘట్టాలే. దీనిలో మరొక ఘట్టమే "సాంఘిక న్యాయాన్ని ప్రసాదించగల నవభారత సమాజానికి సోషలిజం ప్రాతిపదిక కావాలి" అంటూ ఆవడి కాంగ్రెసు మహాసభలో ప్రతిపాదించడం కోసం విషయ నిర్ణయసభ నేడు ఆమోదించిన తీర్మానం. ఇది తమ "బ్రాండ్" విప్లవం కాదు కాబట్టి, ఇది అసలు విప్లవమే కాదని నేటికీ తమ మాతృదేశాన్ని బానిస దేశంగా పరిగణిస్తున్న బానిస మనఃప్రవృత్తి గలవారు అనవచ్చు. అంతమాత్రం చేత ఈ ప్రశాంత విప్లవం విశిష్టమైన విప్లవం కాకనూ పోదు; ఇది సాంఘిక న్యాయాన్నీ, సుభిక్షాన్నీ, శాంతి సౌఖ్యాలను ప్రసాదించగల నవ సమాజాన్ని నిర్మించకనూ పోదు. (ఆంధ్రప్రభ 20-1-1955)

భావ విప్లవం

హింసా కలుషితమైనదైనా, లేక అహింసాత్మకమైనదైనా, విప్లవం వ్యక్తం కావలసింది కర్మక్షేత్రంలోనే, వ్యక్తీకరణతో పాటు విప్లవ పురోభివృద్ధి, దాని ఫలసిద్ధి సైతం కర్మక్షేత్రంలోనే. అయినప్పటికీ, దాని ఆవిర్భావం మాత్రం హృదంతరంలో, పునాదుల నుంచీ పూర్తి మార్పుకోసం - విప్లవాన్ని ఇట్టి మార్పుగానే నిన్నటి సంపాదకీయంలో నిర్వచించాము - ఉద్యమించడానికి ముందు అట్టి మార్పు అవసరమనే విశ్వాసం కుదురుకోవాలి. ఇది కేవలం మానసికమైన విశ్వాసం మాత్రమే కారాదు; హృదంతరాన్నే ఉద్దీపింపజేసి, కర్తవ్య నిర్దేశాన్ని చేయగల సజీవ విశ్వాసం కావాలి; అణువణువులో జితించి, నిరంతరాయంగా పురోగమింపజేయగల శక్తిమంతమైన విశ్వాసం కావాలి.

హృదంతరంలోను, అణువణువులోను ముమ్మొందుగా జరగవలసిన ఈ విప్లవాన్ని భావ విప్లవం అనవచ్చు. అన్ని విప్లవాలకు మాతృస్థానం దీనిదే. ఎట్టి అవరోధాలనైనా సరకుగొనని, ఎంతటి ప్రాతికూల్యములైనా లెక్కచేయని, ఎంతటి త్యాగానికైనా సిద్ధపరచి, అవసరమైతే సమస్త ప్రపంచాన్నే ధిక్కరించి ఒంటరిగా నిలబడగల ధీరోదాత్తతను ప్రసాదించి, మానవుని విప్లవపథం వెంట నడపగలిగింది ఈ భావ విప్లవమే! ఇది కొరవడిననాడు అన్నీ సంశయాలే; అంతా జడత్వమే!

ఇందుకు ఒక ఉదాహరణగా అర్జునుని విషాదయోగాన్ని పేర్కొనవచ్చు. అతడు మహా పరాక్రమశాలి; అమోఘమైన అస్త్రశస్త్రాలు కలవాడు; ఎన్నో యుద్ధాలలో కాకలు తీరినవాడు; ఉత్తర గోగ్రహణ సందర్భంలో కౌరవ వీరు లందరినీ ఒంటరిగా ఎదుర్కొన్నవాడు. అట్టి వ్యక్తికే కురు, పాండవ సేనా వాహినుల మధ్య శ్రీకృష్ణుడు తన రథాన్ని నిలిపిన క్షణంలో చిత్త వైకల్యం కల్గింది. వెంటనే అంతటి ధీరునికీ శరీరం కంపించింది; ముచ్చెమటలు పోసినవి; చేతిలోని గాండీవం జారిపోయింది; పూర్తిగా కర్తవ్య విమూఢుడై పోయాడు. స్వధర్మ పరిపాలన కోసం తిరిగి అతనిచే గాండీవం పట్టించడానికి ముందు అతడిలో భావ విప్లవాన్ని తీసుకురావలసి వచ్చింది. ఆ విప్లవాన్ని సాధించినట్టిదే భగవద్గీత!

అర్జునుని విషాదయోగానికి, కర్తవ్య విమూఢత్వానికి సంబంధించిన ఈ ఘట్ట మొక్కటే చాలు భావ విప్లవం ఎంత ముఖ్యమైందో తెలపడానికి, దీన్ని సాధించగలిగిననాడు గెలవలేని కురుక్షేత్ర సంగ్రామాలూ లేవు; సాధించలేని మహత్తర లక్ష్యాలూ లేవు.

పునాదుల వద్ద నుంచీ పూర్తి మార్పులతో నవసమాజ నిర్మాణాన్ని లక్షించే విప్లవ నాయకులందరు తమ కృషికి ప్రాతిపదికగా భావ విప్లవాన్ని సాధించడానికి విధిగా - విశేషంగా - ప్రయత్నిస్తారు. అయితే, కొందరు వీలైనంత హెచ్చుగా భావ విప్లవానికి ప్రయత్నించి, దాన్ని సాధించేవరకు కర్మక్షేత్రంలో విప్లవాన్ని ప్రవేశ పెట్టడానికి వేచివుంటారు. అట్టివారు విప్లవ నిర్వహణకు హింసాత్మక పద్ధతులను అనుసరించవలసిన అగత్యం ఏర్పడదు. పోగా, మరికొందరు ఏ.

ప్రేమపూర్వక విప్లవం 91

కొద్దిమందిలోనో భావ విప్లవాన్ని సాధించినంతనే కర్మక్షేత్రంలో నిలబడతారు. అట్టివారు విధిగా హింసా కలుషితమైన క్రూర పద్ధతుల ద్వారానే తమ లక్ష్యాన్ని సాధించవలసి ఉంటుంది. గాంధేయ విప్లవానికీ, కమ్యూనిస్టు విప్లవానికి ఒక ముఖ్య భేదం ఇక్కడే ఉంది. గాంధేయ విప్లవం మెజారిటీ విప్లవం; కమ్యూనిస్టు విప్లవం మైనారిటీ విప్లవం. దీన్నే మరొక విధంగా చెప్పాలంటే మొదటిది వర్గ విప్లవం; రెండవది జాతీయ విప్లవం. ఏదో ఒక వర్గంలో కాక, జాతిలోనే భావ విప్లవాన్ని సాధించగలవరకు వేచి ఉంటుంది కాబట్టి, గాంధేయ విప్లవం హింసా పద్ధతులను అవలంబించనక్కర లేదు; వర్గ నియంతృత్వాన్ని స్థాపింప నక్కరలేదు; అహింస ద్వారానే, ప్రజాస్వామ్యం ద్వారానే అది తన లక్ష్యాన్ని సాధించగలదు. హింసాత్మకమైన వర్గ విప్లవం వలె శీఘ్ర పురోగతిని సాధించలేదనుకొనడం సరికాదు. హింస ప్రతిహింసను రేకెత్తిస్తుంది. అందువల్ల హింసతో సాధించిన ప్రతిఫలితాన్ని హింసతోనే సంరక్షించుకోవలసి వస్తుంది. ఇందువల్ల కర్మక్షేత్రంలో విప్లవాన్ని ప్రవేశ పెట్టడంలో తొందరపాటు, అంతిమ లక్ష్యాన్ని చేరడంలో ఆలస్యాన్ని అనివార్యం చేస్తుంది. ఈర డి వర్గవిప్లవంపై కాక, జాతీయ విప్లవంపై ఆధారపడేది కాబట్టే, నెహ్రూ నాయకత్వాన కాంగ్రెసు

అన్ని వర్గాలలోను భావ విప్లవానికి ప్రయత్నిస్తుంది. ఆ ప్రయత్నంలో దాని సాఫల్యానికి ఒక కొత్త నిదర్శనం - సోషలిజం ప్రాతిపదికపై నవభారత సమాజ నిర్మాణ సూత్రానికి ఆవడి కాంగ్రెసు మహాసభ విషయ నిర్ణయసభ ఆమోదించడమే తార్కాణం.

కమ్యూనిస్టుల ఆరోపణ ప్రకారం కాంగ్రెసు నేడు కేవలం పెట్టుబడిదారులకు అధికంగా స్థానమిస్తున్న సంస్థ. ఇదే నిజమైతే అట్టివారిలోనే కాంగ్రెసు భావ విప్లవాన్ని సాధించగలిగినదనడానికి నిన్నటి తీర్మానాన్ని మించి రుజువు కావలెనా?

(ఆంధ్రప్రభ 21-1-1955)

ప్రేమపూర్వక విప్లవం

దారిద్ర్యం అతి ఘోరమైనదీ, హేయమైనదీ! అది ఆత్మవిశ్వాసాన్ని కుంటుపడజేయగలదు; ఆత్మగౌరవాన్ని చంపగలదు; అసూయా విద్వేషాలను రేకెత్తించగలదు; ఎట్టి నైచ్యానికైనా ఒడిగట్టించగలదు. బ్రతుకుపైనే రోతపుట్టించ గలదు. మానవతకే అది మచ్చ; సభ్యతా వికాసానికి అది ప్రతిబంధకం. దాన్ని రూపుమాపని ప్రపంచంలో వాస్తవికమైన శాంతి, సౌఖ్యాలు నెలకొనవు.

దారిద్ర్యంలో గర్భితమై ఉన్నట్టు మేము పైన పేర్కొన్న అవగుణాలన్నీ - అనర్థకాలన్నీ ఉన్నా, వాటికి అతీతులుగా గర్భదరిద్రులైన వారిలోనే పెక్కుమంది ఉన్నారంటే, అందుకు కారణం ప్రతికూల పరిస్థితులను, విరోధ శక్తులను జయించి, తన స్వచ్ఛతను కాపాడుకొనగల మహాశక్తి మానవాత్మకు కలదు కాబట్టే! సకల సంపత్తులతో తులతూగుతున్న వారికంటే కూడ పొయ్యిలోని పిల్లి లేచే దారికనబడని వారిలోనే ఒక్కొక్కప్పుడు ఎక్కువ నీతి, ధైర్యం, ఉదాత్తత, శాంతి. నైర్మల్యం కానరావడానికి ఈ ఆత్మబలమే మూలం.

ఏమైనా, ఆత్మబలం ప్రాశస్త్యాన్ని కీర్తిస్తూ, దారిద్ర్యాన్ని వహించడం మాత్రం క్షంతవ్యం కాదు. దారిద్ర్యం నిస్సందేహంగా ఒక దుష్టశక్తి. దాన్ని పరిహరించడానికి మానవుడు అనాదినుంచీ ప్రయత్నిస్తున్నాడు. దాన్ని ప్రపంచం నుంచి బహిష్కరించగలిగిననాడే మానవతకు పరిపూర్ణ వికాసం!

దారిద్ర్యం ఎంత దుష్టమైనదైనా, స్వచ్ఛందంగా దాన్ని వరించేవారిపై దాని దుష్ట ప్రభావం అణుమాత్రమైనా పడదు సరిగదా, వారి ఆత్మబలాన్ని అది (స్వచ్ఛంద దారిద్ర్యం) మరింత

ప్రోత్సహిస్తుంది. అది పూర్తిగా అపకారం చేసేది - తనను మనసారా అసహ్యించుకొంటున్నా. తనతో చెలిమి తప్పని వారికే. ఇందుకు తార్కాణాలు - గాంధీజీ, కార్ల్ మార్క్స్ జీవితాలే. గాంధీజీ అన్న వస్త్రాలకు లోపంలేని కుటుంబంలో పుట్టాడు. సిరిసంపత్తులలో ఓలలాడక పోయినా, భుక్తికి లేక పస్తుండవలసిన గతి ఆయనకు పట్టలేదు. అయితే, ఆయన ఇంకా దక్షిణాఫ్రికాలో ఉంటూ ఉండగానే స్వచ్ఛందంగా పేదరికాన్ని వరించాడు. ఆయన ఆత్మబలం పెరగడానికి ఆ నిర్ణయంతో చేకూరిన దోహదం ఇంతింత కాదు.

గాంధీజీ స్వచ్ఛందంగా పేదరికాన్ని వరించగా, తన విశ్వాసాల కారణంగానేమి, సిద్ధాంతాల కారణంగా నేమి అయిష్టంగా దారిద్ర్య బాధకు కార్ల్ మార్క్స్ లోనుగావలసి వచ్చింది. కావాలని కాక, కొన్ని ఇతర కారణాల వల్ల అనివార్యమైన పరిస్థితిలో మార్క్స్ దారిద్ర్యానికి లోనైనందున, పెక్కు ఉత్తమగుణాలు కలవాడైనా, మొత్తం మీద ఆయన జీవితదృక్పథం దారిద్ర్య బాధా కలుషితం కాక తప్పందికాదు.

కార్ల్ మార్క్స్ జీవిత దృక్పథంపై దారిద్ర్య బాధ దారిద్ర్యం వల్లనే గర్భశోకాన్ని సైతం భరించవలసి వచ్చినప్పటికీ, తన సిద్ధాంతాలకు స్వస్తి చెప్పి, ధనార్జనకు ప్రయత్నించని కార్ల్ ్మార్క్, ధీరోదాత్తకు జోహారు లర్పించకుండా ఉండలేము. అయినా, దారిద్ర్య బాధ ఆయనలో రేకెత్తించిన అసహన, విద్వేషాలే ఆయన సిద్ధాంతాలకు అసహనాన్ని, విద్వేషాన్ని ప్రాతిపదికలుగా చేసిన వనడం నిర్వివాదం. దారిద్ర్యాన్ని అసహ్యించుకొన్నప్పటికీ దాని నిర్మూలనకే జీవితాన్ని ధారవోసినప్పటికీ, తనను దరిద్ర నారాయణుని ప్రతినిధిగా వర్ణించుకున్నప్పటికీ, దారిద్ర్య పీడితులైన వారికి సేవ చేయాలంటే, తాను దారిద్ర్యాన్ని వర్ణించాలని స్వచ్ఛందంగా దాన్ని వరించినవాడు కాబట్టి, గాంధీజీ దృక్పథం మరొక విధంగా రూపొందింది. విద్వేషం కాక, ప్రేమ దానికి ఆయువుపట్టు; హింస కాక, అహింస దానికి జీవగఱ్ఱ.

గాంధీ, మార్క్స్ దృక్పథాలలోగల ఈ వైరుధ్యమే గాంధీయన్, మార్క్సిస్ట్ విప్లవాలలో కానవస్తుంది. మొదటిది ప్రేమను, అహింసను సాధనాలుగా చేసుకొని దారిద్ర్యంపై యుద్ధాన్ని ప్రకటించేది రెండవది ఇందుకు విద్వేషాన్ని హింసను సాధనాలుగా చేసుకొంటుంది. కాగా, హింసా విద్వేషాలు కాక, అహింసా ప్రేమలే భారత జాతీయతకు పంచప్రాణాలు కాబట్టి, గాంధేయ విప్లవ పద్ధతులే, భారతజాతికి అనుసరణీయం. ఆ విప్లవంలో ఒక కొత్త ఘట్టానికి నేడు ఆవడిలో తన 60వ మహాసభను ప్రారంభించిన ఇండియన్ నేషనల్ కాంగ్రెసు రూపులను దిద్దుతుంది. (ఆంధ్రప్రభ 22-1-1955).

సృజనాత్మక విప్లవం

స్వధర్మ, యుగధర్మాలను సమన్వయ పరచగలిగిన నాడే సృజనాత్మక విప్లవాన్ని జయప్రదంగా కొనసాగించడం సాధ్యపడుతుంది. ఇట్టి సమన్వయం లేనట్టిది కేవలం విధ్వంసాత్మక విప్లవమే కాదు.

స్వధర్మం జాతి నుండి జాతిని విభేదించడం కద్దు. జాతీయ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, మతాలు, విశ్వాసాలు, సారస్వతం, కళలు - ఒక్క మాటలో - జాతీయ జీవితాత్మే స్వధర్మ స్వరూపాన్ని నిర్ణయిస్తుంది. ఇందువల్ల అన్ని జాతులు ఒకే స్వధర్మాన్ని కలిగి ఉండలేవు.

కాగా, యుగధర్మం మాత్రం మానవాళికే విస్తృతం. తంతి, తపాలా, రైల్వేలు, స్టీమ్ షిప్పులు, మోటారు కార్లు, విమానాలు, రేడియో, టెలివిజన్ మొదలైనవి దేశాల మధ్య - ఖండాల మధ్య - దూరాన్ని విలుప్తం చేయని కాలంలోనే మొత్తం ప్రపంచానికే యుగధర్మం ఇంచుమించు ఒక్కటిగా ఉంటూ వచ్చింది. ఒక శతాబ్దమో, అరశతాబ్దమో, లేదా కొన్ని కొన్ని సందర్భాలలో రెండు, మూడు దశాబ్దాల్లో హెచ్చు తగ్గులుగా ప్రపంచం మొత్తం పైన ఒకే విధమైన యుగధర్మం ప్రవర్తిల్లినట్లు మానవ చరిత్రను పరిశీలిస్తే స్పష్టపడుతుంది.

స్వధర్మ, యుగధర్మాలలో మొదటిది జాతికి పరిమితమైంది కాగా, రెండవది ప్రపంచ వ్యాప్తమైనదైనా ఈ రెండింటి మధ్య ప్రకృతి సిద్ధమైన వైరుధ్య మేమీ లేదు. వీటిలో మొదటిది మానవ సభ్యతకు విభిన్నత నివ్వగా, రెండవది ఆ విభిన్నతలో ఏకత్వాన్ని నెలకొల్పుతుంది. మొదటిదాన్ని మల్లి, మొల్ల, సన్నజాజి, సంపెంగ, రోజా ఇత్యాది వివిధ జాతి పుష్పాలతోను, రెండవ దాన్ని ఆ పుష్పాలను ఒక మాలగా సమీకరించే దారంతోను పోల్చవచ్చు. రెండింటికి వైరుధ్యమే ఉంటే, వాటి సమన్వయ మేమి, ఆ సమన్వయం ద్వారా సృజనాత్మక విప్లవ మేమి సాధ్యం కానేకావు.

కాంగ్రెసు జాతీయ విప్లవ లక్ష్యం - సరిగా ఈ స్వధర్మ, యుగధర్మాల సమన్వయమే. అందువల్లనే అది స్వధర్మానికి విరుద్ధం కాని విధంగాను, యుగధర్మమైన సోషలిజానికి అనుగుణంగాను నవ సమాజాన్ని నిర్మించడానికి నిన్న ఆవడి మహాసభలో కంకణధారణ చేసింది. యుగధర్మాన్ని పరిపాలించగోరుతున్నా, స్వధర్మ మొకటి కలదని గుర్తించనేరని కమ్యూనిస్టులకు కాంగ్రెసు తీర్మానం కేవల మొక కపట నాటకంగా కనబడవచ్చు. ఈ ధోరణిలో వారు అప్పుడే ప్రచారాన్ని ప్రారంభించారు కూడా. ఈ ప్రచారాన్ని బట్టే స్వధర్మానికి వారెంతటి విరోధులో గ్రహించవచ్చు.

మాతృదేశాన్ని ఏ రష్యాకో, ఏ చైనాకో కేవల మొక పసలేని "కాపీ"గా తయారు చేయాలని కమ్యూనిస్టుల ఆశయం. అందువల్లనే మాతృదేశాన్ని మించి, ఈ విదేశాల పట్ల వారికి ఎక్కువ ప్రేమాభిమానాలు. ఇందువల్లనే ఆదేశాలనుంచి అరువు తెచ్చుకున్న కొన్ని నినాదాలను పంజరంలోని చిలుకలవలె వారు మనకు అప్పగించడం!

స్వధర్మంతో యుగధర్మాన్ని సమన్వయం చేసి సృజనాత్మక విప్లవాన్ని కొనసాగించి, భారతజాతిని సముద్ధరించడానికీ, దానికి సమకాలిక ప్రపంచంలో సముచిత స్థానాన్ని సంపాదించడానికీ ఏకైక మార్గం - నిన్నటి తీర్మానంతో తన చరిత్రలో ఒక కొత్త ఘట్టాన్ని ప్రారంభించిన కాంగ్రెసు నాయకత్వాన్ని అనుసరించడమే! (ఆంధ్రప్రభ 23-1-1955)

జాతీయ విప్లవం

భావ విప్లవాన్ని సాధించనిదే కర్మక్షేత్రంలో విప్లవం అసాధ్యమని గత శుక్రవారం నాటి సంపాదకీయంలో వివరించాము. ఏదో ఒక వర్గంలోకాక, అన్ని వర్గాలలోను భావ విప్లవాన్ని సాధించి, మొత్తం జాతినే విప్లవ పథం వెంట నడిపించడమే కాంగ్రెసు లక్ష్యం కాబట్టి, వర్గవిప్లవానికి కాక, జాతీయ విప్లవానికి అది నాయకత్వం వహిస్తుందని కూడా విశదీకరించాము. ఏదో ఒక వర్గంలోనే కాక, అన్ని వర్గాలలో భావ విప్లవాన్ని సాధించడానికి ఎక్కువ కాలం పట్టగలదని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. ఏదో ఒక వర్గాన్ని కాక, అన్ని వర్గాలను విప్లవ పథం వెంట నడిపించడం ఎక్కువ ప్రయాసతో కూడిన పని కాబట్టి, అట్టి సందర్భంలో పురోగతి కొంత మందంగా కొనసాగక తప్పదని రాయవలసిన అగత్యం సైతం లేదు. అయితే, అన్య వర్గాలను హతమార్చనిదే వర్గ విప్లవం కొనసాగదు కాబట్టి, హింసతోతప్ప, రక్తపాతంతో తప్ప, విధ్వంసకాండతో తప్ప అది కొనసాగదు. ఇంతేకాదు, వర్గ నియంతృత్వం లేనిదే ఆ విప్లవానికి రక్షణ లేదు. హింసతో అది కర్మక్షేత్రంలోకి వస్తుంది; హింసాత్మక విధానాలలో అణుమాత్రంగానైనా చలిస్తుందో అప్పుడే అది పతనోన్ముఖమౌతుంది.

ఏదో ఒక వర్గం తోడ్పాటుతో కాక, అన్ని వర్గాల సహాయంతో - లేదా, వీలైనన్ని వర్గాల సహాయంతోను, తక్కిన వాటి తాటస్థ్యంతోను - పురోగమిస్తుంది కాబట్టి, జాతీయ విప్లవాన్ని కొనసాగించడానికి హింస, రక్తపాతం మొదలైన సాధనాలు అవసరం కావు. ఆ విప్లవ రక్షణకు నియంతృత్వం స్థాపించనక్కరలేదు. అహింస ద్వారా దాన్ని కొనసాగించవచ్చు; ప్రజాస్వామ్యం ద్వారా దాన్ని కొనసాగించవచ్చు; ప్రజాస్వామ్యం ద్వారా దాన్ని రక్షించవచ్చు. అట్టి విప్లవ నాయకుల కేమి, దానిలో పాల్గొనే జాతి కేమి, ఎటుచూచినా కుట్రలే కనబడవు; ఎటుచూచినా గూఢచారులే ఎదురుపడరు; "ఇదుగో పులి" అంటే, "అదుగో తోక" అనే ధోరణిలో వారు కలతనిద్ర చెందరు.

చీకటిలో దొంగపోటుగా కాక, పట్టపగలు రాజవీధి వెంట ప్రయాణంవలె జాతీయ విప్లవం సాగుతుంది. విద్వేషాన్ని, రక్తపిపాసను పురికొల్పడం ద్వారా కాక, సంకుచిత బుద్ధిగలవారిలో కూడా, స్వార్థం కరుడు కట్టినవారిలో కూడా, దురాశాపరులైన వారిలో కూడా నిద్రాణమై ఉండే ఉత్తమ గుణాలను జాగరితం చేయడం ద్వారా జాతీయ విప్లవం పురోగమిస్తుంది. ఒక దుష్టుని వధించినప్పుడు అతడి దుష్టత్వంతో పాటు సక్రమ పద్ధతులలో ప్రయత్నం చేస్తే, అతనిలో బహుశా సుప్తమైవుండే శిష్టత్వం కూడా నశిస్తుంది. దుష్టత్వం అణువణువులో జీతించిపోయిన వ్యక్తి విషయంలోనైనా అతడి నైతిక పునరుజ్జీవనాన్ని గురించి ఒక బుద్ధుడు, ఒక క్రీస్తు, ఒక గాంధీ నిస్పృహ చెందరు. వీరి అంతస్తుకు రావడం సామాన్య మానవులకు అసాధ్యమైనా, అసలు నైతిక పునరుజ్జీవన కృషి నిరర్థకమని భావించడం మానవ ప్రవృత్తిని సరిగా అర్థం చేసుకొనలేక పోవడమే. ప్రతిభా విహీనులైన నాటక కర్తలు, మానవ స్వభావాన్ని సరిగా అర్థం చేసుకొనలేక, ఒక బొక్కెన సున్నాన్ని, మరొక బొక్కెన తారును సిద్ధపరచుకొని, కొన్ని పాత్రలను సున్నంలోను, మరి కొన్నింటిని తారులోను ముంచెత్తుతారని బెర్నార్డ్ రాశాడు. నైతిక పునరుజ్జీవన సూత్రం పట్ల ఎంతమాత్రం నమ్మకంలేని వర్గ విప్లవకారులను బెర్నార్డ పేర్కొన్న ఈ నాటక కర్తలతో పోల్చవచ్చు.

వర్గ విప్లవం కాక, జాతీయ విప్లవమే ఆది నుంచి కాంగ్రెసు లక్ష్యం కాబట్టి, కొందరు ముందడుగు వేసినా, మరికొందరు కొంత వెనకబడినా, అందరినీ కూడగట్టుకొంటూ అహింసే సాధనంగా అది అప్రతిహత పురోగమనాన్ని సాధించగలుగుతున్నది. ఈ పురోగతిలో ఒక నవ ఘట్టం మొన్నటితో జయప్రదంగా ముగిసిన ఆవడి మహాసభతో ప్రారంభమైంది. సోషలిజం ప్రాతిపదికగా గల

నవభారత సమాజ స్థాపన కృషిలో భాగస్వాములు కావలసిందిగా అన్ని వర్గాలను ఈ మహాసభ ఆహ్వానించింది. రాజకీయ స్వరాజ్యం తర్వాత భారతజాతి చేరవలసిన గమ్యం ఆర్థిక స్వరాజ్యమని అన్ని వర్గాలను ప్రబోధించింది.

సోషలిజం తమ ప్రస్తుత ప్రతిపత్తిని విలుప్తం చేసి వేయగల వర్గాలవారు ఆవడి ఆహ్వానాన్ని ఎలా అంగీకరించగలరని, దాని ప్రబోధాన్ని ఎలా హర్షించగలరని ప్రశ్నించే వర్గ విప్లవకారులకు ఇటీవలి భారత చరిత్రే ప్రత్యుత్తరం. ఇండియాలో లీనీకరణకు సంస్థానాధిపతులు సమ్మతించడం తమ ప్రభుతకు తామై స్వస్తి చెప్పుకొనడం అయినా, అందుకు వారు సమ్మతించలేదా? ఇలాగే జమీందారులు కూడా తమ జమీందారీల రద్దుకు అంగీకరించ లేదా? “అయితే భరణాలకింద, నష్టపరిహారాల కింద వీరికి చెల్లిస్తున్న కోట్ల రూపాయల మాటేమిటి?" అనే ప్రశ్న కొందరినుంచి వెంటనే వస్తుందని మాకు తెలుసు. కాని ఆవడి కాంగ్రెసు మహాసభ వేదికపై నుంచి పండిట్ నెహ్రూ వివరించినట్టు, అన్య మార్గాలను అనుసరించడం ద్వారా హింసరూపంలోను, రక్తపాత రూపంలోను, కల్లోల రూపంలోను చెల్లించవలసివచ్చే మూల్యం కంటే ఇది తక్కువైంది. ఇంతేకాదు, కలవారికీ లేనివారికీ అంతరాన్ని నామమాత్రం చేయలేనిది సోషలిజం ప్రాతిపదికగా గల నవసమాజం కానేరదు. ఈ అంతరాన్ని తగ్గించడానికి ఇప్పటికే మరణ సుంకాలు మొదలైన శాసనాలు అనేకం జరిగాయి; ముమ్ముందు ఇట్టివి మరెన్నో జరగగలవు. అందువల్ల శాంతియుతమైన జాతీయ విప్లవానికి చెల్లించబడే మూల్యం ఇప్పుడు ఒక వేళ నిజంగా భారమైనదైనా, మరొక పదేళ్ళకు భారంగా అది మిగలబోదు.

బలప్రయోగంతో కాక, సమ్మతిపై - విధ్వంసన ద్వారా కాక, ప్రతికక్షుల నైతిక పునరుజ్జీవన ద్వారా - పశుత్వంతో కాక, ప్రజాభిప్రాయ ప్రాబల్యంతో - కొనసాగే జాతీయ విప్లవాన్ని ఒక నూతన ఘట్టంలో ప్రవేశపెట్టింది కాబట్టి, ఆవడి కాంగ్రెసు మహాసభ (పండిట్ నెహ్రూ ఉద్ఘాటించినట్టు) "చిరస్మరణీయమైనట్టిది" కాగలదు. (ఆంధ్రప్రభ 25-1-1955)

భావ స్వాతంత్ర్యం

"ఒక వర్గం కాని, పక్షం కాని, లేదా వ్యాపార సంస్థ కాని, ప్రచార వ్యవస్థకాని వ్యక్తిని మరుగుజ్జుగా చేసివేయని సంఘంలోనే - వీటిలో ఏదీ వ్యక్తిపై ప్రాబల్యం వహించి, అతనిని ఒక పక్కకు నెట్టివేయని సంఘంలోనే - కళలు వర్ధిల్లగలవు" - ఇది మహామేధావిగా, ప్రముఖ తత్త్వవేత్తగా ఖండఖండాంతరాలలో సైతం గౌరవించబడుతున్న ఇండియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాధాకృష్ణన్గారు ఇటీవలనే చేసిన హెచ్చరిక. "మానవాత్మ స్వాతంత్ర్యం క్లిష్టం, సునిశితం; దానికి సంరక్షణ లేకపోతే ఉత్తమ కళావిర్భావం దుస్సాధ్యం" అని కూడా ఆయన ఇదే సందర్భంలో హెచ్చరించారు.

ఈ హెచ్చరిక చేసింది ఒక్క డాక్టర్ రాధాకృష్ణన్గారే కాదు; ఇట్టిది జరగడం ఇదే ప్రథమం కూడా కాదు. కళా స్వరూపాన్ని సాక్షాత్కరింపజేసుకొన్న వారందరు, ప్రపంచ వాఙ్మయ చరిత్రను సంశోధించిన వారందరు, మానవ సభ్యతావికాస రీతులతో సుపరిచితులైన వారందరు, ఒక్క మాటలో, ద్రష్టలైన వారందరు, యుగయుగాలలో ఈ హెచ్చరిక చేశారు; చేస్తున్నారు. ఎన్నిసార్లు ఎందరు చేసినా, ఎప్పటికప్పుడు అత్యవసరమైనదే. "నిత్య జాగరూకత స్వాతంత్ర్య రక్షణకు చెల్లించవలసిన మూల్యం". భావస్వాతంత్ర్యం విషయంలో ఈ జాగరూకత మరింత ముఖ్యావసరం. తక్కిన స్వాతంత్ర్యాలన్నీ ఒక ఎత్తుకాగా, భావ స్వాతంత్ర్యం ఒక్కటే ఒక ఎత్తు. అది లేనినాడు ఏ స్వాతంత్ర్యమూ లేదన్నప్పటికీ అది అతిశయోక్తి కాదు. తక్కిన స్వాతంత్ర్యాల విలువను తెలుసుకొనగలగడం భావ స్వాతంత్ర్యం కలిగివున్న నాడే. ఇంతేకాదు, భావదాస్యంలో

పడినవారు తక్కిన స్వాతంత్ర్యాలు విలుప్తమైన సంగతినైనా కానలేని ఘోర నిర్లిప్తతలో పడిపోగలరు. భావ స్వాతంత్ర్యం అన్ని స్వాతంత్ర్యాలలో అగ్రగణ్యమైనదైనా, వర్గ ప్రయోజనాలనో, జాతీయావసరాలనో, ప్రపంచ దిగ్విజయాన్నో, ఇతరములైన సాకులనో ప్రలోభంగా చూపి, దాన్ని (భావ స్వాతంత్ర్యాన్ని) హరించడానికి దేశదేశంలో, యుగయుగంలో ప్రయత్నం జరుగుతుంది. ఇందువల్లనే ఎన్నిసార్లు, ఎందరి ద్వారా జరిగినా, భావ స్వాతంత్ర్య సంరక్షణావశ్యకతను గురించిన హెచ్చరిక అత్యంతోచితమైందే! అత్యవసరమైందే! ఆధునిక ప్రపంచంలోని రాజకీయ వ్యవస్థలలో భావ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించగలిగింది. ప్రజాస్వామ్యం. కాగా, దాన్ని పరిహరించేది నియంతృత్వం. ఫాసిస్టు నియంతృత్వమైనా, లేక కమ్యూనిస్టు నియంతృత్వమైనా దానికి తొలి బలి భావ స్వాతంత్ర్యమే! అయితే, ఫాసిజం 1.

భావ స్వాతంత్ర్యం

కంటే, కమ్యూనిజం రెండు ఆకులు ఎక్కువ చదివింది కాబట్టి, భావ స్వాతంత్ర్యాన్ని అపహరించడంలో మొరటుతనం కంటే చాతుర్యాన్ని అధికంగా చూపుతుంది. భావ స్వాతంత్ర్యాన్ని కోరే వ్యక్తులలో ధనంతో, గౌరవాలతో కొనివేయగల వారిని అది కొనివేస్తుంది. తన నియంతృత్వాన్ని సమర్థించడమే అభ్యుదయమని, అదే ప్రగతి కాగలదని నిరంతర ప్రచారం చేస్తూ, తాను సులభంగా కొనివేయలేని రచయితలు, కళాకారులు స్వతంత్రాలోచన శక్తినే అది శిథిలం చేస్తుంది. అప్పటికి కూడా తనకు స్తోత్ర పాఠకులు కాని వారిని ఖైదు చేస్తుంది; లేదా మటుమాయం చేస్తుంది.

కమ్యూనిస్టు నియంతృత్వ దేశాలలో కళా సారస్వతాల రూపాన్ని పార్టీయే నిర్ణయిస్తుంది. అయితే, దీన్ని ఏ కమ్యూనిస్టు ఒప్పుకోదు. దీనికి అతడు పెట్టిన పేరు -"సమష్టి చర్చ". నిరంకుశ పరిపాలకునికి, అతడి రాజ్యంలోని బానిసకు "సమష్టి చర్చ" ఎంత సాధ్యమో, కమ్యూనిస్టు పార్టీకీ, దాని ఆదేశాలను మన్నించవలసిన రచయితలకు, కళాకారులకు అంతే సాధ్యం. "సమష్టి చర్చలు" అనే కాక,

పార్టీ ఆదేశాలకు మరొక పేరు కూడా ఉంది. అది, "మార్గ దర్శకత్వం". దీన్ని గురించి "సోవియెట్ లిటరేచర్" అనే పేరుతో మాస్కో నుంచి వెలువడుతున్న పత్రిక 1954 నవంబరు (11) సంచికలో 147 పేజీలో వున్న ఒక వాక్యమిది:

"సోవియెట్ సారస్వతానికి పార్టీ నుంచి అనుదినం మార్గదర్శకత్వం లభించే మహాభాగ్యం ఉంది". "సోవియెట్ రచయితల రెండవ కాంగ్రెస్" అనే శీర్షిక కింద ప్రచురింపబడిన ఈ వ్యాసంలో "సోవియెట్ సారస్వతం దాని స్వభావాన్ని బట్టి పాక్షికమైన" దని, "అది కొన్ని నిర్దిష్ట వర్గాల ప్రయోజనాల కోసమే" ఉద్దేశింపబడినదని స్పష్టంగా పేర్కొనబడింది కూడా! విశ్వజనీనత సారస్వతానికి ఏకైక లక్ష్యం. అయినప్పుడు పాక్షిక దృష్టి గలదీ, కొన్ని వర్గాల ప్రయోజనాలను మాత్రమే లక్షించేదీ "సారస్వతం" అనే పేరుకైనా ఎలా తగుతుందో దురూహ్యం!

మరొక విషయం, సంఘానికీ, ప్రపంచానికి మార్గదర్శకుడు కావలసినట్టివాడు కవీ, కళాకారుడూ. అట్టివాడు పార్టీ నుంచి "మార్గదర్శకత్వానికి" అనుదినం వేచివుండడం కవిగా, కళాకారుడుగా తన ధర్మానికి తిలోదకాలిచ్చుకొనడమే కాదా?

ప్రజాస్వామ్య వ్యవస్థ మాత్రమే భావ స్వాతంత్ర్యాన్ని కాపాడ గలదని, దానిలోనే సారస్వతం, కళలు పరిఢవిల్లగలవని ప్రగాఢంగా విశ్వసిస్తుండడంబట్టే దాదాపు 160 మంది తెలుగు రచయితలు, కళాకారులు నియంతృత్వ వ్యవస్థను తాము వ్యతిరేకిస్తున్నామని, ప్రజాస్వామ్య శక్తుల పరిరక్షణ ప్రతి భారత పౌరుని ధర్మమని నేడు ఒక ప్రకటన చేశారు. నిర్ద్వంద్వంగా రచయితల, కళాకారుల లక్ష్యాన్ని ప్రకటించిన వీరందరికీ మా ధన్యవాదాలు. వీరు తమ ప్రకటనలో కోరినట్టు ప్రజాస్వామ్య రక్షణ తన కర్తవ్యంగా ప్రతి భారతీయ పౌరుడు - ముఖ్యంగా ప్రతి ఆంధ్రుడు - భావించి, నియంతృత్వ శక్తుల నిరోధానికి కంకణం కట్టుకోగలడనే విశ్వసిస్తున్నాము. (ఆంధ్రప్రభ 8-2-1955)

ఎన్నికలు

(1955లో జరిగిన సాధారణ ఎన్నికలు జరిగే సందర్భంలో కమ్యూనిస్టులు అభ్యుదయ నిరోధకుల హితో పరిఢవిల్లే కమ్యూనిస్టు వ్యవస్థను వరించడం, భారతదేశంపై ప్రపంచం పెట్టుకున్న ఆకలప్పటినీ వమ్ముచేయడమేగాక, గాంధీజీ పవిత్రాత్మకు, భారతీయతకు ఘోరాపచారం చేయడమే కాగలదు అంటారు. నార్ల తొమ్మిదో సంపాదకీయం చివరలో. 5-11-1956 నుండి ఈ వ్యాస పరంపర ఆంధ్రప్రభలో ప్రారంభమైంది. ఈ తొమ్మిది సంపాదకీయాలను చెన్నైలోని సంస్కృతి ప్రచురణల వారు 1956లో పునర్ముద్రించారు.)

ప్రగతి

కృత, త్రేతా, ద్వాపరయుగాలు ఎన్నడో గతించి పోయినవని, ఇప్పుడు కలి నడుస్తున్నదని, పోనుపోను మరింతగా అధర్మమేమి, అరిష్టాలేమి తప్పవని శుద్ధ ఛాందసులు తప్ప మరెవ్వరు ఈనాడు నమ్మరు. మన దేశంలోనేకాక, అన్ని దేశాలలోను ఆధునిక కాలంలో జరిగిన మహత్తర భావవిప్లవమిదే! స్వర్ణయుగాన్ని చేరాలంటే, ముందుకు కాక, వెనకకు నడవాలనే వాని మానసిక స్వాస్థ్యాన్ని, లేదా, అతని చిత్తశుద్ధిని శంకించకుండా ఉండడం ఈ రోజులలో కష్టం. సృష్టి పరిణామాన్ని గురించి డార్విన్ అత్యంత ప్రతిభావంతంగా రూపొందించిన సిద్ధాంతాల ప్రత్యక్ష ఫలితమే ఆధునిక కాలంలో కానవచ్చే ఈ భావవిప్లవం. ధర్మం నాలుగు పాదాలతో నడిచిన యుగం నుంచి పోనుపోను మానవుడు హీనస్థితికి దిగజారిపోవడంలేదు సరిగదా, కాలం గడిచినకొద్దీ అతడు మరింత వికాసాన్ని పొందుతున్నట్టు డార్విన్ ఎన్నెన్నో సాక్ష్యాధారాలతో నిరూపించాడు. సత్యాన్ని చూడలేనివారు తప్ప మిగిలిన వారందరు ఆయన సిద్ధాంతాలను నేడు పూర్తిగా ఆమోదిస్తున్నారు.

ప్రకృతి - దానితోపాటు మానవ సంఘం కూడా - ప్రగతి శీలా బద్ధమైనవనే ఈ సూత్రాన్ని అంగీకరించింది కేవలం కమ్యూనిస్టులే కాకపోయినా, ప్రగతిని తామే గుత్తగైకొన్నట్టు వారు నిరంతర ప్రచారాన్ని కొనసాగిస్తుంటారు. వారి ప్రచారం ప్రకారం కమ్యూనిజాన్ని వ్యతిరేకించే ప్రతివ్యక్తి అభివృద్ధి నిరోధకుడే! డార్విన్ తెచ్చిన భావ విప్లవ కారణంగా "అభివృద్ధి నిరోధకుడు" అనే దూషణ, దానికి పాల్పడ చేయబడిన వ్యక్తిపై ఎంతటి వైముఖ్యాన్ని ప్రజలలో అవ్యక్తంగానే కూడా- పుట్టించగలదో కమ్యూనిస్టులకు బాగా తెలుసు. అందువల్లనే తమతో ఏకీభవించలేక పోయిన వారందరిపై ఆ బ్రహ్మాస్త్రాన్ని వారు సంధిస్తారు.

ప్రగతికి కమ్యూనిజం ఒక్కటే మార్గమైనవాడు కమ్యూనిజాన్ని వ్యతిరేకించడం ప్రగతిని నిరోధించడమే కాగల దనండలో సందేహం లేదు. కాని ప్రగతికి ఎన్నో మార్గాలున్నాయి. ప్రతికక్షుల హృదయ పరివర్తనకు, అట్టి పరివర్తనద్వారా నవ సమాజ నిర్మాణ లక్ష్య సాధనకు ఆత్మార్పణ ప్రాతిపదికపై ఆధారపడే గాంధీయిజం అందుకొక మార్గం. పార్లమెంటరీ డెమోక్రసీ ద్వారా రక్తపాతంతో కూడిన విప్లవం లేకుండా సోషలిస్టు వ్యవస్థ సంస్థాపన యత్నం అందుకు మరొక మార్గం. అయినప్పుడు కమ్యూనిజానికీ, ప్రగతికీ అవినాభావ సంబంధం కలదనడం కేవలం కమ్యూనిస్టులకు మాత్రమే తగు ప్రచారం కాదా?

ప్రగతికి కమ్యూనిజం ఏకైక మార్గం కాదు సరిగదా, వాస్తవికమైన ప్రగతి దాని ద్వారా సాధ్యమా అనే ప్రశ్న కూడా ఉన్నది. జాతి, మత, కుల వర్గ విభేదాలకు అతీతమైన వ్యవస్థ సంస్థాపించాలనే దాని లక్ష్యం సంస్తవనీయమైందే. ఆర్థిక న్యాయాన్ని కలుగజేయాలనే దాని ఆదర్శం శిరోధార్యమైందే. నిజానికి గాంధీజీ ఈ లక్ష్యాలకోసమే మరణించాడు; నెహ్రూ వీటికోసమే జీవిస్తున్నాడు. అయితే కమ్యూనిజం వ్యక్తిని భౌతికంగా సముద్ధరిస్తూ, నైతికంగా అతడిపై దెబ్బతీస్తుంది.

ఉత్తమమైన లక్ష్యసాధనకు కమ్యూనిజం వినియోగించే అధమ పద్ధతుల వల్లనే ఈ దుష్ఫలితం తప్పదు. ప్రేమకు మారుగా విద్వేషాన్ని నమ్ముకున్నది కాబట్టే, కమ్యూనిజం వర్గ సామరస్యానికి మారుగా “వర్గయుద్ధాన్ని" (క్లాస్ వార్) ప్రోత్సహిస్తుంది. అహింసకు మారుగా

హింసను నమ్ముకున్నది కాబట్టే, శాంతియుత విప్లవానికి మారుగా రక్తపాతానికి కమ్యూనిజం ప్రోద్బలం చేస్తుంది. మానవ ప్రవృత్తి స్వతః విశిష్టమైనదని కాక, అధమాధమమైనదని కమ్యూనిజం నమ్ముతుంది కాబట్టే, వ్యక్తిస్వాతంత్ర్యాన్ని ప్రోత్సహించడానికి మారుగా, మొత్తం దేశాన్నే అది ఒక జెయిలుగా మార్చుతుంది. ఇందువల్లనే ప్రగతి కాములైనవారు కూడా కమ్యూనిజాన్ని వ్యతిరేకించడం. ఇట్టివారిలో మన దేశానికి సంబంధించినంతవరకు అగ్రగణ్యులు గాంధీ, నెహ్రూలు. వీరిద్దరు అభివృద్ధి నిరోధకులైతే, వీరిపై కమ్యూనిస్టులు విసిరే రాళ్ళు ఇతరులకు తగిలినా అందుకు వారు విచారించ నక్కరలేదు; సిగ్గిల వలసిన అవసరం అసలే లేదు.

(5-11-1955)

2

ఒక నిజంతో ఒక అబద్ధాన్ని జోడించడంద్వారా అబద్ధాన్నే నిజంగా నమ్మించడం కొంతవరకు సుకరమౌతుంది. నిప్పులేనిదే పొగరాదనడం కాదనరాని సత్యం. ఇంతగాలిని మూటకట్టి నిరాధార నిందారోపణ చేయగోరేవాడు తన మాటపై నమ్మకం పుట్టించడానికి "నిప్పులేనిదే పొగ ఎలా వస్తుంది?" అని ప్రశ్నించేసరికి, నిప్పులేనిదే పొగరాదు కాబట్టి, అతడిమాటలు కూడా నిజమేమోనన్న అభిప్రాయం కలగడం సహజం.

సరిగా ఈ సూత్రాన్నే కమ్యూనిస్టులు తమ ప్రచారంలో అనుసరిస్తున్నారు. కమ్యూనిజాన్ని వ్యతిరేకించడం ప్రగతిని వ్యతిరేకించడమేనన్న భావాన్ని వ్యాపింపజేయడం కోసం రాజా రామమోహన్ రాయ్, శ్రీ వీరేశలింగం మున్నగు సంఘ సంస్కర్తలను, శ్రీ గిడుగు రామమూర్తి, శ్రీ గురజాడ అప్పారావు మొదలైన భాషా సంస్కర్తలను వెనకటికాలం ఛాందసులు వ్యతిరేకించలేదా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఔను! పైన పేర్కొన్న సంస్కర్తలను కొందరు వ్యతిరేకించిన మాట నిజమే; ఆ వ్యతిరేకించినవారు ఛాందసులైన మాటకూడా నిజమే! కాని, అంత మాత్రంచేతనే ఎవరు, ఎప్పుడు దేన్ని వ్యతిరేకించినా, అది ప్రగతి శీలమైన మార్పును యెదిరించడమే కానక్కరలేదు గదా?

మరొకవిషయం : సహగమనాలను నిరోధించడమేమి, నిర్బంధ వైధవ్యాన్ని నిర్మూలించడమేమి ఉత్తమ సంస్కరణలు కాబట్టి, ప్రభుత్వయంత్రంలో వ్యక్తిని కేవలమొక చీలగా మార్చే ఒక నవ సంఘ నిర్మాణయత్నం ఉత్తమ కృషికావాలని ఎక్కడ ఉన్నది? భాష క్రమవికాసానికి అడ్డుతగలరాదనడం నిర్వివాద విషయం కాబట్టి, హింసా విద్వేషాలే ప్రధాన సాధనాలుగా విప్లవసాధన కృషి సమర్థనీయం కానక్కరలేదు గదా?

లేనిపోని ఈ సామ్యాలను తీసుకురావడంలో మరొక దురభిప్రాయాన్ని కలిగించగలమని కమ్యూనిస్టుల ఆశ. రాజా రామమోహన్ రాయ్, శ్రీ వీరేశలింగం ప్రభృతులు నేడు సజీవులైవుంటే, వారు తప్పక ఎర్రజెండాను చేతబట్టి ఉండేవారని స్పష్టంగా అనక పోయినా, అట్టి అభిప్రాయం వచ్చేవిధంగా వారు వ్రాస్తున్నారు. కాని, ఈ మహనీయులు ఏకేశ్వరోపాసకులుకాగా, నిరీశ్వరవాదం కమ్యూనిజానికి ప్రాతిపదిక, అసలు కమ్యూనిస్టు తత్త్వశాస్త్రం పేరే "డైలెక్టికల్ మెటీరియలిజం." కమ్యూనిస్టు రాజ్యాలలో ఆస్తికత్వం సహించబడుతున్నమాట నిజమైనా, నాస్తిక ప్రచారమే ప్రతి కమ్యూనిస్టు ప్రభుత్వవిధానం. ఆ ప్రచారం తీవ్రత తగ్గిపోయినప్పుడు కమ్యూనిస్టు వ్యవస్థ పునాదులే బలహీన పడుతున్నవని మార్షల్ స్టాలిన్ హెచ్చరించిన సందర్భా లున్నాయి. ఇంతగా నాస్తికత్వంపై ఆధారపడే సాంఘిక వ్యవస్థను రాజా రామమోహన్ రాయ్, శ్రీ వీరేశలింగం పంతులు సమర్థించే వారుకారు సరిగదా, దాని సంస్థాపన యత్నాలను ప్రతిఘటించడానికి తమ ప్రాణాలను సయితం వొడ్డేవారు.

ఆస్తిక, నాస్తిక వాదాల మంచి చెడ్డలలోకి మనం వెళ్ళనక్కరలేదు. కాని, భారతీయ చరిత్రకు, సంస్కృతికి, మనస్తత్వానికి విరుద్ధమైన పచ్చి భౌతికవాదం కమ్యూనిజానికి పంచప్రాణాలనేదే ఇక్కడ గమనించవలసిన విషయం. అందువల్లనే కమ్యూనిస్టు వ్యవస్థ భారతజాతి క్రమవికాసానికీ, భారతీయ సంస్కృతి సహజ పరిణామానికీ తోడ్పడదని చెప్పడం. కమ్యూనిజం భారత జాతీయతకు అనుగుణమైనదైతే, శ్రీరామ, శ్రీకృష్ణులపై లేని గౌరవం కమ్యూనిస్టులకు లెనిన్, స్టాలిన్లపై ఎందుకుండాలి? కాశీ, ప్రయాగలపై లేని మక్కువ మాస్కో, లెనిన్ గ్రాడ్లపై ఎందుకుండాలి? ఉపనిషత్తులపై, భగవద్గీతపై లేని గురి మార్క్స్, లెనిన్ రచనలపై ఎందుకుండాలి?

బౌద్ధం ఒకవేళ నాస్తికమతమని అనుకొన్నప్పటికీ, ఆస్తికత్వంలో అంతర్భూతమైవుండే ప్రేమ, కారుణ్యం, హింసపట్ల వైముఖ్యం మొదలైన గుణ గణాలన్నీ తథాగతుడు స్థాపించిన మతంలో తొణికిసలాడుతూ ఉంటాయి. కాగా, కమ్యూనిస్టు వ్యవస్థ వర్ధిల్లేది విద్వేషంపైనే; కాఠిన్యంపైనే; హింసాకాండపైనే! ఇందువల్లనే ఏ దృష్టినుండి చూచినా, కమ్యూనిస్టు వ్యవస్థ భారతీయతకే విరుద్ధం. ఈ కారణానే భారతదేశంలో కమ్యూనిస్టు వ్యవస్థ సంస్థాపన యత్నం ప్రగతి శీలంతో కూడింది కాదు; కానేరదు. (6-11-1955)

ప్రగతి - 3

సంపత్తి మధ్యనే దారిద్ర్యం, స్వాతంత్ర్యంలోనే అసమానత్వం- వీటిని నిర్మూలించకపోతే ప్రగతి లేదనడం నిర్వివాదం. అయితే, కమ్యూనిస్టుపార్టీ ప్రచారం చేసుకొంటున్నట్టు, సాంఘిక న్యాయం కలగజేయగలిగిందే వాస్తవిక రాజకీయ స్వాతంత్ర్య మనేది కేవలం ఆ పార్టీ నమ్మకం మాత్రమే కాదు. అందువల్లనే ప్రగతి శీలాన్ని కమ్యూనిస్టులు గుత్తగొనలేదని మే మనడం. "ఆకలి గొన్నవానికి అఖిలేశ్వరుడు అన్నం రూపంలోనే సాక్షాత్కరిస్తాడు" అని గాంధీజీ ఒక సందర్భంలో ఉద్ఘాటించాడు. సోవియట్ విజ్ఞాన సర్వస్వంలోని ముక్కలనే చిలుక పలుకులవలె అప్పగించి, బాపూజీ కపటసన్యాసానికి ఇది మేలిముసుగు మాత్రమేయని ఈ ఉద్ఘాటనను కమ్యూనిస్టులు కొట్టి పారవేయవచ్చు. కాని, దరిద్ర నారాయణునికి పూర్తిగా ప్రాతినిధ్యం వహించగలిగింది గాంధీజీయో, లేక ఆయనను పెట్టుబడిదారుల ఏజంటుగా చిత్రించగోరే ఈ కమ్యూనిస్టులో గుర్తించ లేనంతటి మౌఢ్యంలో ఆంధ్ర ప్రజానీకం పడలేదు. సాంఘికన్యాయం కలుగ జేయలేని రాజకీయ స్వాతంత్ర్యం అసలు స్వాతంత్ర్యమనే పేరుకైనా తగదు కాబట్టే, సోషలిజమే నవభారత సమాజానికి ప్రాతిపదిక కావాలని పండిట్ నెహ్రూ ఉద్ఘోషిస్తున్నాడు; అందుకనే " శ్రేయోరాజ్య" సంస్థాపనను భారత రాజ్యాంగం తన ప్రధానలక్ష్యంగా చేసుకొన్నది; అందుకనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోగల ఆస్తులకు నష్టపరిహారం చెల్లింపుకు సంబంధించిన రాజ్యాంగ నియమావళి సవరణకు నెహ్రూ ప్రభుత్వం నిర్ణయించింది. సాంఘిక న్యాయ సంస్థాపన కృషి సాగదగునంతటి చురుకుగా కొనసాగడం లేదనే విమర్శచేస్తే, అది నిర్హేతుకమైనది కాదని అంగీకరించవచ్చు. భూస్వామ్య సంస్కరణలు, విద్యావిధాన సంస్కరణలు మొదలైనవి మరింత త్వరితంగా జరగాలని ఆందోళన చేయడంలో సబబు వున్నది. అయితే, ఒక విషయాన్ని ఈ సందర్భంలో విస్మరించరాదు. హింస ద్వారా నియంతృత్వం ద్వారా సంఘంలో మార్పులు జరిగినంత త్వరగా హింసారహితమైన ప్రజాస్వామ్యం ద్వారా జరగవు. ఏమైనా, కమ్యూనిస్టుల వివాదం సాంఘిక న్యాయసంస్థాపన కృషి గమనవేగాన్ని గురించికాదు; అసలు భారత సంఘం పునాదులను గురించే.

వ్యక్తి స్వాతంత్ర్య సమేతమైన వాస్తవిక ప్రజాస్వామ్యం ప్రాతిపదికగా సాంఘిక న్యాయసంస్థాపన నెహ్రూ ప్రభుత్వ లక్ష్యంకాగా, వ్యక్తి స్వాతంత్ర్య విరహితమైన బూటకపు ప్రజాస్వామ్యం పునాదిగా ఆ సాంఘిక న్యాయసాధన కమ్యూనిస్టుల ఆదర్శం. అందువల్లనే సాంఘిక న్యాయానికి కూడినదైనా, ప్రజాస్వామ్యానికి సంబంధించినంత వరకు, కమ్యూనిజం ప్రగతిశీలంతో కూడినదైనా, ప్రజాస్వామ్యానికి సంబంధించినంత వరకు అది అభివృద్ధి నిరోధకమైంది.

వాస్తవికమైన ప్రజాస్వామ్యానికి ఒక్కటే గీటురాయి. తూటాద్వారా కాక, వోటుద్వారా ప్రభుత్వాన్ని మార్చడానికి వీలున్నదా? లేదా? ఇదే ఆ గీటురాయి, కమ్యూనిస్టు వ్యవస్థలో ఎన్నికలు లాంఛనప్రాయంగా జరగక పోవు కాని, వోటుద్వారా ప్రభుత్వాన్ని పడగొట్టడానికి అవకాశం మాత్రం పూజ్యం, వోటుద్వారా కమ్యూనిస్టులను గద్దె ఎక్కించవచ్చు; కాని, వోటుద్వారా వారిని ఆ గద్దె నుంచి దించగోరితే మాత్రం తూటాలకు ఎర కావలసి వస్తుంది.

నేటి మన వ్యవస్థకు, రేపు కమ్యూనిస్టులు స్థాపించగోరుతున్న దానికి వ్యక్తి, పత్రికాది స్వాతంత్రాలకు సంబంధించినంతవరకు ఎంతటి భేదం వుంటుందో ఒక ఉదాహరణ ద్వారా మరింత స్పష్టంగా చెప్పవచ్చు. అఖిల భారతాన్ని కాంగ్రెసు నేడు పరిపాలిస్తున్నా, కాంగ్రెసును, కాంగ్రెసు నాయకులను నోటికి వచ్చినట్లు కమ్యూనిస్టులు తమ ఉపన్యాసాలలో, తమ పత్రికలలో పడతిట్టగలుగుతున్నారు. కమ్యూనిస్టు ప్రభుత్వమే అధికారంలోవుంటే, ఆ పార్టీకి విరుద్ధంగా చిన్నమెత్తు మాట అన్నప్పటికీ, ఆ ఘోరపాపాన్ని చేసిన వ్యక్తికి ఉరి తప్పదు; పత్రికకు జప్తు తప్పదు.

ఏ రాజకీయ, ఏ వ్యక్తిగత స్వాతంత్ర్యాలకోసం దాదాపు నూరు సంవత్సరాలు భారతజాతి పోరాడిందో, ఆ స్వాతంత్రాలను పరిరక్షిస్తూనే సాంఘిక న్యాయసాధనవైపు పురోగమించడానికి ప్రయత్నిస్తున్నది కాబట్టే, గాంధీజీని గురుదేవునిగా భావించుకునే నెహ్రూ నాయకత్వాన నడుస్తున్న కాంగ్రెసు (స్థానిక నాయకత్వంలో ఎన్ని లోపాలున్నా) వాస్తవికమైన ప్రగతిశీలంతో కూడిన సంస్థ. కాగా సాంఘిక న్యాయాన్ని వాగ్దానంచేస్తూ, స్వాతంత్ర్యాన్ని ఆహరించే కమ్యూనిస్టుపార్టీ పేరుకు మాత్రమే ప్రగతిశీల సంస్థ.

(8-11-1955)

4

రాజా రామమోహన్ రాయ్, శ్రీ వీరేశలింగం పంతులు, శ్రీ గురజాడ అప్పారావు ప్రభృతులేకాక, సాక్షాత్తు ఆ శ్రీకృష్ణుడే, ఆ గౌతమబుద్ధుడే కమ్యూనిస్టులన్న ధోరణిలో మన తెలుగు కమ్యూనిస్టు సోదరులు ప్రచారం చేస్తున్నారు. గాంధీజీ మరీ ఇటీవలివాడై పోయాడు గాని, లేకపోతే ఆయనకూడా తమ "గోత్రీకుడే"నని ప్రచారం సాగించడానికి వీరు బహుశా వెనుదీసేవారు కారు!

ఏమైనా, శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా లోకానికి అందజేసిన సందేశానికి మూలకందం, ఒకే లక్ష్యాన్ని చేరడానికి వివిధ మార్గాలు కలవనే సూత్రం. ఈ సూత్రాన్ని రాజకీయాలకు వర్తింపజేస్తే, సాంఘిక న్యాయ సంస్థాపనకు కమ్యూనిజం ఏకైక మార్గం కానక్కరలేదని అంగీకరించాలి. అయినా, సాంఘిక న్యాయ సాధనకు అన్యమార్గాలు కూడా కలవని కమ్యూనిస్టులు అంగీకరించరు. అసలు కమ్యూనిజమే ఈ విషయాన్ని అంగీకరించదు. అందువల్లనే కమ్యూనిస్టులది "ఒంటిపట్టా మెదడు" (సింగిల్ ట్రాక్ మైండ్"). అసహనానికీ, ఆవేశానికి కమ్యూనిస్టులు సాటిలేనివారు కావడానికి "విస్సన్న చెప్పిందే వేదం" అనే వారి మనః ప్రవృత్తే కారణం.

"వేర్వేరు మార్గాలద్వారా ఒకే గమ్యాన్ని చేరవచ్చు" ఈ సూత్రం భగవద్గీతకే కాక, భారతీయ సంస్కృతికే మూలకందమైనా, దీనికి సమ్మతిస్తే, తమ వాదం పంచప్రాణాలలో కనీసం నాలుగు ఎగిరిపోతాయి కాబట్టి, ఈ పనిచెయ్యక, మందమతులైన వారు అనవసరంగా తికమక పడుతున్నారు గాని, అసలు భగవద్గీత బోధించింది కమ్యూనిజమే అని చెప్పడానికి కమ్యూనిస్టులు సంకోచించడం లేదు. "కర్మయోగం" అని భగవద్గీత పేర్కొన్నట్టిది తమ కమ్యూనిస్టు సిద్ధాంతానికి ప్రాతిపదికగా వున్న భౌతికవాదానికి నామాంతరమే నన్నట్టు చిత్రించడానికి వారు ప్రయత్నిస్తున్నారు. అయితే, మరి భగద్గీత పేర్కొన్న భక్తి, జ్ఞానయోగాల

మా టేమిటి? కమ్యూనిస్టు నియంతపట్ల భక్తే "భక్తి యోగ" మా? మార్క్స్, లెనిన్ గ్రంథాల పుటల వెలుపల అజ్ఞానం తప్ప మరేమి లేదనడమే "జ్ఞాన యోగ" మా ?

మరొక విషయం: "కర్మ"కు, "కర్మ యోగా"నికీ భేదం లేదా? పరమాత్మతో సంయోగాన్ని పొందుతూ చేసే కర్మనే "కర్మ యోగ" మని మన తత్త్వ శాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు. అయినప్పుడు అసలు పరమాత్మనే గుర్తించని కమ్యూనిజానికి "కర్మయోగం" ప్రసక్తి తీసుకురావటానికైనా హక్కు వున్నదా?

ఆత్మ పరమాత్మల ప్రస్తావన కాని, ఆ స్తిక, నాస్తిక వాదాల ప్రస్తావనకాని "ప్రగతికి కమ్యూనిజం ఒక్కటే మార్గమా?" అనే ఈ చర్చ సందర్భంలో నిజానికి అనవసరం. ఆస్తిక నాస్తిక వాదాల గుణ దోషాలతో నిమిత్తం లేకుండానే, రాజా రామమోహన్ రాయ్కు, శ్రీ వీరేశలింగం పంతులుగారికి తామే వారసులైనట్టు కమ్యూనిస్టులు కొనసాగిస్తున్న ప్రచారానికి జవాబుగా నాస్తికత్వానికి పరమ విరోధులైన ఆ మహామహా లిద్దరు నాస్తికత్వమే ప్రాతిపదిక గాగల కమ్యూనిజం ప్రతిఘటనకు తమ ప్రాణాలను సయితం వొడ్డేవారని మాత్రమే మేము వ్రాశాము. మరొక విషయం: ఆస్తిక, నాస్తికాల గుణదోషా లెట్టివైనా, ఆస్తికతలో విశ్వాసం ఒక విధమైన చిత్త సంస్కారాన్ని కల్పించగా, భౌతిక వాదం మరొక విధమైన మనస్తత్వాన్ని ప్రోది చేస్తుంది. సృష్టికి అధినాథు డెవడో మరొకడు కలడని నమ్మే ఆస్తికవాది తన ప్రతిచర్య ఆ సృష్టి కర్త ఇచ్ఛానుసారంగా వుండాలన్న ప్రయత్నం చేస్తాడు. కాగా, భౌతిక వాది తనకుతానే శాసనకర్త. ఇందువల్ల మొదటి వ్యక్తిలో కానరాని అహంకారం రెండవ వానిలో మూర్తీభవిస్తుంది. అహంకారం నుంచి హింసా ద్వేషాలకు ఒకే ఒక అడుగు చాలు.

దేవునిపేర, మతంపేర ప్రపంచ చరిత్రలో ఎన్నో క్రౌర్యాలు జరిగిన మాట నిజం; ఎన్నో రక్తస్రవంతులు ప్రవహించిన మాట కూడా నిజం. అయినా, ఆస్తికత్వం ప్రోదిచేసే మనస్తత్వమేఅహంకార రహితమైన మనస్తత్త్వమే - విద్వేషానికి కాక ప్రేమకు, క్రౌర్యానికి కాక, కారుణ్యానికి, హింసకు కాక, అహింసకు ప్రాధాన్య మిచ్చే మనస్తత్త్వమే - భారతీయ సంస్కృతికి నిశ్చయంగా ప్రాతిపదిక. అందువల్లనే ఒక బుద్ధుడు, ఒక అశోకుడు, ఒక గాంధీజీ మన దేశంలో తలయెత్తి, ప్రపంచానికి వెలుగు దారులను చూపించారు. బౌద్ధం ఆస్తికత్వానికి ప్రాధాన్యమివ్వని మతమైనా, అది భౌతికవాదం కాదు సరిగదా, బుద్ధుడు కారుణ్యమూర్తి. భారతీయ సంస్కృతికి మూలకందాలైన ప్రేమ, కారుణ్య, అహింసలను ప్రాతిపదికగా చేసుకొన్నది కాబట్టే, బౌద్ధం (ఆస్తిక, నాస్తికత్వాల ప్రసక్తిని విడిచి పెట్టినప్పటికీ భారతీయ సంస్కృతికి అనుగుణమైనట్టిది. కాగా, విద్వేషాన్ని బోధించే, క్రౌర్యాన్ని ప్రోత్సహించే, హింసను సాధనంగా చేసుకొనే కమ్యూనిజం భారతీయ సంస్కృతికి పూర్తిగా విరుద్ధం.

విద్వేషం, కాఠిన్యం కాక, సర్వమానవ ప్రేమే, లోక కల్యాణమే కమ్యూనిజం లక్ష్యాలని కమ్యూనిస్టులు ఉదోషించవచ్చు. సిద్ధార్థుని హృదయావేదనే తమ మహోద్యమానికి జీవగర్ర అనవచ్చు. కాని, "క్లాస్ వార్" ("వర్గాల మధ్య యుద్ధం") నినాదాన్ని "సర్వమానవ ప్రేమ"తో ఎలా ముడి పెట్టగలరో వారికే తెలియాలి. అహింస బౌద్ధానికి ఒక విశిష్టగుణం కాగా, హింసద్వారా "క్లాస్ వార్" కొనసాగించడానికి సంకోచించని కమ్యూనిస్టులు బుద్ధుడు తమ పార్టీ సభ్యుడైనట్లుగా ఎలా మాట్లాడగలరో కూడా వారికే తెలియాలి.

కమ్యూనిజం భారతీయ సంస్కృతికి పూర్తిగా విరుద్ధమైంది కాబట్టే, భారతీయతకు విరుద్ధమైన తక్కిన అవగుణాలతో పాటు, పరుషత్వం కూడా కమ్యూనిస్టులకు పూర్తిగా అలవడింది. వ్యక్తిగత దూషణలేకుండా వాదం కొనసాగించడం వారికి చేతకాని పని. తాము చెప్పుకొంటున్నట్టు, నిజంగా గౌతమబుద్ధుని బోధనలే తమ మహోద్యమానికి ప్రాతిపదికలైతే, ఆయన జీవితంలోని ఈ క్రింది కథలో గల గుణపాఠాన్ని వారు ఎంత త్వరగా నేర్చుకుంటే అంత మంచిది;బౌద్ధాన్ని సహించలేకపోయిన వ్యక్తి ఒకనాడు బుద్ధుని

వద్దకు వచ్చి, ఆయనను విపరీతంగా దూషించాడు. తిట్టితిట్టి, పూర్తిగా అతడు అలసిపోయేవరకు చిరునవ్వుతో మిన్నకుండి, ఆ పైన "నాయనా! మరి నీ బూతుల పురాణం ముగిసిందా?" అని బుద్ధుడు ప్రశ్నించాడు. తాను ఎంతగానో తిట్టిన తర్వాత తనను "నాయనా?" అని బుద్ధుడు సంబోధించేసరికి అతడు తెల్లబోయాడు. అంతట శాక్యముని సరేకాని, నేనొక ప్రశ్న వేస్తాను శాంతంగా విని, జవాబు చెప్పు. నీవు ఎవరికైనా ఒక కాన్క పంపించా వనుకో ! ఆ కాన్కను వారు స్వీకరించలేదనుకో! అప్పుడు ఆ కాన్క ఏమౌతుంది, నాయనా!" అని అడిగాడు. మరింత తెల్లబోయి, అప్పటికే సగం చచ్చివున్న ఆ వ్యక్తి "ఏమౌతుంది? నా కాన్క నాకే తిరిగి వస్తుంది" అని నసుగుతూ జవాబు చెప్పాడు . "అయితే మరి నీ దూషణ కాన్కను నేను స్వీకరించడం లేదు" అంటూ బుద్ధుడు మరొకసారి చిరునవ్వు నవ్వాడు. (9-1-1955)

5

వ్యక్తిస్వాతంత్ర్య లక్ష్యాన్ని అవహేళన చేయడానికి కమ్యూనిస్టులు తమ ఎన్నికల ప్రచారంలో కొన్ని ప్రశ్నలు వేస్తున్నారు.

"జమీందారు రైతులను దోచుకొనడం వ్యక్తి స్వాతంత్ర్యమా?" అని వీరి మొదటి ప్రశ్న. ఇది వ్యక్తి స్వాతంత్ర్యమని ఎవరన్నారు? రైతును జమీందారు దోచు కొనరాదనే కదా, జమిందారీల రద్దుకు కాంగ్రెసు శాసనం చేసింది? స్వాధీనం చేసికొనబడిన జమీందారీలకు నష్టపరిహారం చెల్లించవచ్చునా, కూడదా అనే ప్రశ్న పై అభిప్రాయ భేదాలకు తావు వుండవచ్చు. అసలు చెల్లింపు తగదని, చెల్లించినా, నామమాత్రంగానే చెల్లించాలని కాంగ్రెసు వాదులలో పెక్కుమంది నిశ్చితాభిప్రాయం. తక్కిన రాష్ట్రాలలోకంటే అవిభక్త మద్రాసు రాష్ట్రంలో జమీందారీలకు తక్కువ నష్టపరిహారం చెల్లించబడినా, అదికూడా ఎక్కువేనని వ్యక్తి స్వాతంత్ర్యం ఒక ప్రాథమిక స్వత్వమనే కాక, అది లేనినాడు జీవితం దుర్భరం కాగలదని నమ్మే తెలుగు పత్రికలు ఆందోళన చేశాయి. అయినప్పుడు వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కోరడం జమీందారులకు దోపిడిచేసే హక్కును కట్టబెట్టవలసిందిగా కోరడమేనని కమ్యూనిస్టులు ఎలా అనగలరో వారికే తెలియాలి. "భూమిని కష్టపడి పండించి, తిన తిండిలేకుండా మాడడం వ్యక్తి స్వాతంత్ర్యమా ?" అని వారి రెండవ ప్రశ్న. ఇదే వ్యక్తి స్వాతంత్ర్యమని ఎవరన్నారు? కష్టం ఒకరిది కాగా, ఫలితం మరొకరిది కారాదనే కాదా భూస్వామ్య సంస్కరణల కోసం నెహ్రూ ప్రభుత్వం తాపత్రయ పడుతున్నది? ఈ విషయంలో మరి విలంబన తగదని ఈ మధ్యనే ప్లానింగ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించిందికూడా ! ఇప్పటి వరకు ఈ సంస్కరణ విషయంలో ఆలస్యం జరగడం నిస్సందేహంగా శోచనీయం. అయితే, కమ్యూనిస్టు రాజ్యంలోవలె తలలను ఉత్తరించడానికి సంసిద్ధపడకపోతే, ఇట్టి సంస్కరణలను అమలుపరచడంలో కొంత ఆలస్యం తప్పదు. ఏమైనా, అసలు సంస్కరణనే వ్యతిరేకిస్తున్నారనడానికీ, సంస్కరణను తీసుకురావడంలో ఆలస్యం చేస్తున్నారనడానికీ భేదం లేదా? భూస్వామ్య సంస్కరణనే కాదు; దానికంటే కూడా విస్తృతమైన వాటిని వాస్తవికమైన ప్రజాస్వామ్యం ద్వారా సాధించవచ్చు. ఇందుకోసం వ్యక్తిస్వాతంత్ర్యాన్ని ఆహరించే కమ్యూనిస్టు వ్యవస్థే విధిగా ఏర్పడ నక్కర లేదు. "ఆకలికి తాళలేక ఈ కాంగ్రెసు రాజ్యంలో ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. ఇది వ్యక్తి స్వాతంత్ర్యానికి చిహ్నమా?" అని కమ్యూనిస్టుల మూడవ ప్రశ్న. ఇదే వ్యక్తి స్వాతంత్ర్యమని ఎవరంటున్నారో కూడా ఈ ప్రశ్న వేస్తున్నవారికే తెలియాలి. కూడు గుడ్డలకు ఎవ్వరికీ లోపం లేని -చదువు సంధ్యలకు ఎవ్వరూ దూరం కాని మంచి ఇంటికీ, చక్కని ఆరోగ్యానికీ ఎవ్వరూ పరాయివారు కాని-సాంఘిక వ్యవస్థను నెలకొల్పడం కోసమే నెహ్రూ ప్రభుత్వం కృషి చేస్తున్నది. ఇట్టి శ్రేయోరాజ్య స్థాపనే భారత రాజ్యాంగ లక్ష్యం; ఇందుకోసమే పంచవర్ష ప్రణాళికలు; ఇందుకోసమే సోషలిజం నవభారత సమాజానికి పునాది కావాలని ఈ మధ్యనే పార్లమెంటు చేసిన తీర్మానం. అయినా, క్షుధార్తిని బాపడానికి కమ్యూనిజం ఒక్కటే మార్గం కానక్కర లేదు గదా? మరొక విషయం: అక్కడక్కడ బహు చెదురుగా మనదేశంలో క్షుధార్తి ఆత్మహత్యలకు దారి తీసిన మాట నిజమే కావచ్చు. కాని వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కోల్పోయిన ఫలితంగా- ప్రభుత్వ యంత్రంలో ఒక చీలగా బ్రతకవలసి వచ్చినందున- నియంతృత్వ వ్యవస్థలో స్వతంత్రంగా ఆలోచించే స్వతంత్రంగా మాట్లాడే, స్వతంత్రంగా వ్రాసే,

స్వతంత్రంగా వ్యవహరించే హక్కును వదులుకొనవలసి వచ్చినందున - జీవితం పై అసహ్యాభావం కలిగి ఆత్మహత్య చేసుకొన్నవారు కమ్యూనిస్టు రాజ్యాలలో ఎందరు లేరు?

ఇలా ఆత్మహత్యలు చేసుకొన్నవారు ఇతరుల దోపిడికి తమకు అవకాశాలు లేకుండా పోయినవని బ్రతుకును రోసిన వారు కారు; విశృంఖలంగా, నీతి బాహ్యంగా, సంఘ విద్రోహులుగా సంచరించడానికి తమకు మరి వీలు లేదని జీవితం పై విసుగుపుట్టినవారు కూడా కారు. ఇదే భాష అనీ, ఇదే సాహిత్యమనీ, ఇదే చిత్రకళ అనీ, ఇదే సంగీతమనీ, ఇందుకు భిన్నంగా వెళ్ళడం బూర్జువా మనస్తత్వమనీ, విప్లవానికే విరుద్ధమనీ నియంతృత్వ ప్రభుత్వం అనుదినం ఆదేశాలనిస్తుండగా - పైగా, భాషా స్వరూపాన్ని గురించి కాని, కళాహృదయాన్ని గురించి కాని అభిప్రాయాలను వెలిబుచ్చడానికి ఎట్టి అర్హత లేని వారిలో కూడిన నియంతృత్వం ఆదేశాలిస్తుండగా - ఇట్టి వ్యవస్థలో జీవితం కంటె మరణమే మేలని నమ్మినవారెందరో (ప్రపంచ సంస్కృతీ వికాసానికే తాము చేయ గల సేవ ఎంతో వుండగాకూడా తమ చేతులతోనే తమ నిండు ప్రాణాలను తీసుకున్నారు! పేగు లెండినందువల్ల ఆత్మహత్యలు తప్పని సంఘం ఎంతో ఘోరమైంది కాగా, ఎడద లెండిపోయినందున ఆత్మహత్యలు తప్పని వ్యవస్థ ఘోరమైందేకాక,మహా నికృష్టమైంది కూడా!

వ్యక్తి స్వాతంత్ర్యం ఒక ప్రాథమిక స్వత్వమైనా, అది కొన్ని పరిమితులకు లోబడినట్టిదే ! సమష్టి క్షేమానికీ, శ్రేయో రాజ్య సంస్థాపన కృషికీ భంగం కలగనివ్వనంత వరకే వ్యక్తి స్వాతంత్ర్యం ప్రాథమిక స్వత్వం. ఈ పరిమితులకు లోబడిన వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కూడా సమష్టి క్షేమం పేరుతో, శ్రేయో రాజ్యస్థాపన పేరుతో కమ్యూనిస్టు వ్యవస్థ హరించి వేస్తుంది. అందువల్లనే కమ్యూనిజం వాస్తవికమైన ప్రగతి శీలంతో కూడింది కాదు. సాంఘిక న్యాయాన్ని సాధించడానికి నియంతృత్వం ఒక్కటే మార్గంకాదు; సమష్టి క్షేమంకోసం వ్యక్తి స్వాతంత్ర్యాన్ని బలిపెట్ట నక్కరలేదు. ఈ సత్యాలను కమ్యూనిస్టులు గుర్తించరు కాని, వాస్తవికమైన ప్రగతి శీలురందరు తప్పక గుర్తిస్తారు.

(11-11-1955)

6

వాక్స్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వాతంత్ర్యాన్ని, సమావేశ స్వాతంత్ర్యాన్ని పేరు పేరున చెప్పడం దేనికి? - సర్వ స్వాతంత్ర్యాలకు కమ్యూనిస్టు రాజ్యాంగం గ్యారంటీ చేస్తుందని ఆ పార్టీ వారు ఉద్ఘాటిస్తున్నారు. కమ్యూనిస్టు దేశాల రాజ్యాంగ ప్రణాళికలనుంచి ఏవో కొన్ని భాగాలను తమ వాదాన్ని బలపరచుకొనడానికి ఉదాహరిస్తున్నారు కూడా.

ఆ నిజమే ! కమ్యూనిస్టు రాజ్యాంగంలో అన్ని స్వాతంత్ర్యాలు గ్యారంటీ చేయబడతాయి. అయితే కేవలం కమ్యూనిస్టులకు మాత్రమే! వారిలోనూ అధికారంలో గల వర్గానికి మాత్రమే! వర్గమే ప్రసంగాలను చేస్తుంది; అదే పత్రికలను నడుపుతుంది; అదే సభలను, సమావేశాలను ఏర్పాటు చేస్తుంది. ఇందుకు తగు సర్వస్వాతంత్ర్యాలను - నిజమే- అధికారవర్గం పూర్తిగా కలిగివుంటుంది. పోతే, ప్రతిపక్షం ఈ స్వాతంత్ర్యాలలో దేన్ని కోరినా, అది దేశ ద్రోహ మౌతుంది; ప్రజాద్రోహ మౌతుంది; విప్లవానికి వెన్నుపోటు అవుతుంది!

తాము ప్రయోగించే ప్రతి పదాన్ని కమ్యూనిస్టులు ఒక పరిమితార్థంలోనే ఒక ప్రత్యేకార్థంలోనే -ప్రయోగిస్తారు. "ప్రజలు" అన్నప్పుడు వారు ఉద్దేశించేది కేవలం తమ పార్టీ సభ్యులను, దాని సానుభూతిపరులను మాత్రమే! “విప్లవం" అన్నప్పుడు కేవలం కమ్యూనిస్టు విప్లవాన్ని మాత్రమే. “ప్రగతి” అన్నప్పుడు కేవలం కమ్యూనిస్టు నియంతృత్వ దిశలో పురోగతిని మాత్రమే.

ఇదే విధంగా "స్వతంత్రం" అనేది కూడా కమ్యూనిస్టులకు, వారి సానుభూతిపరులకు స్వతంత్రం మాత్రమే!

తమకే అన్ని స్వాతంత్ర్యాలు ఎందుకు పరిమితం కావాలనే ప్రశ్నకు కమ్యూనిస్టులు చెప్పే సమాధానం ఒక్కటే! తక్కిన వారెవరు? కమ్యూనిస్టు వ్యవస్థను, లేదా, అధికారంలోనున్న కమ్యూనిస్టు వర్గాన్ని, వ్యతిరేకించేవారే కారా? ఆ ప్రజాద్రోహులకు, ఆ దేశద్రోహులకు, విప్లవాన్ని వెన్నులో పొడిచే ఆ రాక్షసులకు స్వాతంత్ర్యం ఎందుకివ్వాలి?

అయితే, వాస్తవికమైన ప్రజాస్వామిక వాదులు "స్వతంత్రం" అనేదానికి చెప్పుకునే అర్థం ఇంతటి సంకుచితమైనదీకాదు; ఇంతగా అసహనప్రేరితమైందీ కాదు. "నీ అభిప్రాయాలను నేను ఆమోదించలేను. కాని, వాటి ప్రకటనకు నీకు గల హక్కును రక్షించడానికి నా ప్రాణాలొడ్డుతా" ననేది వాల్టేర్ దృక్పథం. వాస్తవికమైన ప్రజాస్వామ్యానికి తగు దృక్పథ మిదే! వాస్తవికమైన ప్రజాస్వామ్య సిద్ధాంతాలపై నిర్మించబడింది కాబట్టి, నెహ్రూ ప్రభుత్వ దృక్పథం కూడా ఇదే. ఇందువల్లనే కమ్యూనిస్టులు నెహ్రూ నాయకత్వానికి, ఆయన ప్రభుత్వానికి విరుద్ధంగా యధేచ్ఛగా ప్రచారం కొనసాగించ గలుగుతున్నారు! పరిస్థితులు తలక్రిందులై, కమ్యూనిస్టు ప్రభుత్వమే అధికారంలోకి వస్తే, దానికి విరుద్ధంగా బాహాటంగా ప్రచారం కొనసాగనీయడం మాట అటుంచి, చాటుమాటుగానైనా అసంతృప్తిని వెల్లడించ నిస్తారా? కమ్యూనిస్టు వ్యవస్థలో గోడలకే చెవులు మొలుస్తాయి ! ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిద్రలో కలవరించినా, కాన్సెన్షన్ క్యాంపుకు గెంటడం తప్పదు !

రష్యా, చైనా ప్రజలు తమ కమ్యూనిస్టు వ్యవస్థలను హర్షిస్తే, అది వారికి సంబంధించిన విషయం. ఆ కారణాన వారిపై మనకు విరోధభావం కూడదు; కమ్యూనిజంపై ధర్మయుద్ధం జరపాలనడం అసలే కూడదు. కాని, కమ్యూనిస్టు వ్యవస్థ మన దేశానికి తగునా, తగదా అనే ప్రశ్న వచ్చినప్పుడు రష్యా, చైనాల ప్రసక్తి తీసుకురావడం ఒక్కొక్కసారి తప్పదు. ఆ దేశాలు భూతల స్వర్గాలని, మన దేశం కమ్యూనిస్టులు అహోరాత్రాలు కొనసాగిస్తున్న ప్రచారంవల్ల కూడా వాటి ప్రసక్తి అనివార్యమౌతూ వుంటుంది. అనివార్యమైన ఇట్టి పరిస్థితులలోనే రష్యా, చైనాలలోగల పత్రికా స్వాతంత్ర్యాన్ని గురించి నేడు కొంత ప్రస్తావించక తప్పదు.

రష్యాలో పత్రికా స్వాతంత్ర్యం లేదనడం "పచ్చి అబద్ధ" మనీ, (కమ్యూనిస్టుల మాటలన్నీ ఇలా 'పచ్చి పచ్చి' గానే వుంటాయి. ఆ దేశంలో "ప్రవదా" పత్రికకు ఎవరైనా సరే పరిపాలన విషయమై తమ కేవైనా ఫిర్యాదులుంటే, లేఖలు వ్రాసుకోవచ్చుననీ, ఇక్కడి కమ్యూనిస్టులు అంటున్నారు. దీన్నిబట్టి పత్రికా స్వాతంత్ర్యం అంటే, పార్టీ తరఫునో, ప్రభుత్వం తరఫునో వెలువడే పత్రికను సంపాదకుని పేర లేఖలను వ్రాసుకునే హక్కు మాత్రమే అనుకోవలెనా? ఔను ! అనుకోవలసిందీ ఇంతే; వాస్తవ పరిస్థితి కూడా ఇంతే! నేటి భారత ప్రభుత్వస్థానంలో తమ ప్రభుత్వ స్థాపనకోసం ఆందోళన కొనసాగించడానికి ఇక్కడి కమ్యూనిస్టులు పత్రికలను ప్రారంభించి నడుపుతున్నట్టుగాఅప్పుడే అక్కడ నిజంగా పత్రికా స్వాతంత్ర్యం వున్నట్టు! కాని, అదే పూజ్యం! సిడ్నీ, బియాట్రిస్ వెబ్ు సోవియట్ రష్యాపట్ల సుహృద్భావం కలవారు. ఈ బ్రిటిష్ ఫేబియన్ సోషలిస్టులు సోవియెట్ రష్యాపై తాము వ్రాసిన విపుల గ్రంథానికి "సోవియెట్ కమ్యూనిజం - ఒక కొత్త నాగరికత" అని పెట్టిన పేరునుబట్టే, వీరికి ఆ దేశంపై గల సుహృద్భావం వెల్లడి కాగలదు. ఇట్టివారే తమ పుస్తకంలో పరిపాలనలో లోపాల విమర్శను రష్యాలో నిరోధించరు సరిగదా, దాన్ని ప్రోత్సహిస్తారని, అయితే, ప్రాథమిక, సాంఘిక సమస్యలను గురించి కాని, సాంఘిక వ్యవస్థా నిర్మాణానికి కమ్యూనిస్టు విధానాలే కాక, అన్య విధానాలు కూడా కలవనే విషయాన్ని గురించికాని, స్వతంత్రాలోచనకు ఎంతమాత్రం అవకాశ మియరని స్పష్టంగా వ్రాశారు! స్వతంత్రంగా కొత్త ఆలోచనలు చేయగల హక్కుపైనే, అత్యాశ్చర్యకరమైన కొత్త సిద్ధాంతాలను సయితం ప్రతిపాదించగల హక్కుపైనే మానవజాతి ప్రగతి ఆధారపడి వుంటుందని కూడా వారిద్దరు హెచ్చరించారు.

రష్యాలో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పత్రికలను నడపనిస్తే, అయినా, కమ్యూనిస్టు వ్యవస్థలో ఈ హక్కు మృగ్యం. ముందు కొంతకాలం కమ్యూనిజానికి పూర్తిగా వ్యామోహపడి, నెమ్మదిమీద నిజాన్ని తెలుసుకున్న విఖ్యాత ఫ్రెంచి రచయిత ఆంద్రీ జీడ్ పలుకులలో "సోవియెట్ యూనియన్లో అన్ని విషయాలపై అది ఎట్టివిషయమైనా సరేఏకాభిప్రాయానికే తప్ప, ద్వివిధాభిప్రాయానికి తావే లేదు. ప్రతి ఉదయం ప్రవదా పత్రిక ప్రజలకు వారు ఏమి తెలుసుకోవాలో, ఏమి నమ్మాలో, ఏమి ఆలోచించాలో చెబుతుంది." పోతే, ప్రవదా ఏమి నమ్మాలో, ఏమి వ్రాయాలో క్రెమ్లిన్లోని మూలవిరాట్టులు తెలియ జేస్తుంటారు. స్పెయిన్లోని అంతర్యుద్ధాన్ని గురించి ప్రభుత్వంనుంచి ఆదేశాలు వచ్చేవరకు ప్రవదా ఒక్కముక్క కూడా వ్రాయలేదని జీడ్ పేర్కొన్నారు.

ఇక, చైనాలో పత్రికా స్వాతంత్ర్యం సంగతి: ఈ మధ్య తాను ఆ దేశంలో పర్యటన చేసినప్పుడు బాహ్య ప్రపంచంలో ఏమి జరుగుతున్నదీ తాను అక్కడి మన రాయబారి కార్యాలయం ద్వారా తెలుసుకొనవలసి వచ్చిందని ఆ పర్యటన నుంచి తిరిగి రాగానే ఒక ప్రసంగంలో భారత ప్రధాని చెప్పారు.

ఇదే కమ్యూనిస్టు వ్యవస్థలోని పత్రికా స్వాతంత్ర్యం! ఇదే దానిలోని ప్రగతి శీలం! సిడ్నీ, బియాట్రిస్ వెబ్ పలుకులలో స్వతంత్రాలోచనకు అవకాశం లేనిచోట మానవజాతికి ప్రగతి లేనేలేదు. అయినా, కమ్యూనిస్టు వ్యవస్థలో స్వతంత్రాలోచన "ప్రజాద్రోహం". అయితే, ప్రజలెవరని అడిగితే మాత్రం మళ్ళీ మొదటికి రావలసివస్తుంది. (12-11-1955)

7

పడిపోయిన ప్రకాశంగారి మంత్రివర్గం స్థానంలో సుందరయ్య గారి మంత్రివర్గాన్ని నెలకొల్పడం మాత్రమే -ఇదివరలో కూడా ఒకసారి మేము పేర్కొన్నట్టు - కమ్యూనిస్టుపార్టీ వారి లక్ష్యం కాదు. ఆంధ్రదేశం పై అరుణతార ఉదయించ బోతున్నదనీ, త్వరలోనే అఖిలభారతంపై అది తన అరుణకిరణాలను ప్రసరింపజేయగలదనీ కమ్యూనిస్టులు తమ ఎన్నికల ప్రచారంలో అంటున్నారు. తాము పదవిలోకి వస్తే అసలు చరిత్రగతే మారిపోగలదని అంటున్నారు. దీన్ని బట్టి ఆంధ్రరాష్ట్రంలో ప్రభుత్వాధికార సాధనను యావద్భారతంలో కమ్యూనిస్టు వ్యవస్థ సంస్థాపనకు వినియోగించడమే ఆ పార్టీ వారి లక్ష్యమనడం సుస్పష్టమే!

ఒక మంత్రివర్గానికి బదులుగా మరొకదాన్ని స్థాపించడం కాక, ఒక సాంఘిక వ్యవస్థకు మారుగా మరొకదాన్ని-ముందు ఆంధ్రరాష్ట్రంలోను, అందుమూలంగా సిద్ధించగల బలంతో తర్వాత దేశం మొత్తంమీదను-నెలకొల్పడమే కమ్యూనిస్టుల లక్ష్యం కాబట్టి, ఈ ఎన్నికలలో నిర్ణయం కావలసిన ఏకైక సమస్య "కమ్యూనిస్టు వ్యవస్థ తగునా? తగదా?" అనేది మాత్రమే! దీనికే ఇతరులు ప్రాధాన్యమిస్తుండగా, కావాలని ఇతర విషయాలపైకి చర్చను మరల్చడానికి కమ్యూనిస్టులు ప్రయత్నం చేస్తున్నారు.

తక్కిన సమస్యలు ఎంత ముఖ్యమైనా, "మనకు కమ్యూనిస్టు వ్యవస్థ తగునా? తగదా?" అనేదాని పాటిగా అవి ముఖ్యమైనవి కావు; కాజాలవు. అందువల్లనే ఆ వ్యవస్థ గుణ దోషాలను గురించి చర్చించడానికి మేము ప్రయత్నిస్తున్నాము. సాంఘిక న్యాయసాధనను లక్షించిన మేరకు (ఇదివరలోనే మేము వివరించినట్టు) కమ్యూనిజం వాస్తవంగా ప్రగతి శీలమైందే! అయితే, ఆ లక్ష్యం కేవలం కమ్యూనిజానికి పరిమితం కానూ లేదు; దాన్ని సాధించడానికి కమ్యూనిజం ఒక్కటే మార్గం కానూ కాదు. సాంఘిక న్యాయ సాధనకు కమ్యూనిజం నిర్దేశించే మార్గం కారుణ్యరహితమై నట్టిది; హింసాపూరితమైనట్టిది. రక్తరంజితమైనట్టిది; వ్యక్తి స్వాతంత్ర్యాన్ని బలిగొను నట్టిది; వాస్తవికమైన ప్రజాస్వాతంత్ర్యానికి ప్రాణాంతకమైనట్టిది. సాంఘిక న్యాయం కోసం ఈ మార్గాన్ని అనుసరించడంవల్ల గమ్యాన్ని చేరగలిసినా, గాంధీజీ పవిత్రాత్మకు మహాపచారం చేసిన మీదటనే; భారతీయతకే తిలోదకాలిచ్చినమీదటనే!

సాంఘిక న్యాయ సంస్థాపనా కాంక్షను కమ్యూనిస్టులే గుత్త గొనలేదు మొత్తం భారతజాతినే ఆ ప్రబలాకాంక్ష ఒక మహాశక్తివలె నేడు ముందుకు నడిపిస్తున్నది. ఆవిర్భవించినట్టిదే గాంధీ, నెహ్రూలు నాయకత్వం. ఆ శక్తి నుంచి

సాంఘిక న్యాయసాధనకే కాక, నవప్రపంచ నిర్మాణానికి గాంధీయిజం ఒక కొత్త మార్గాన్ని చూపిస్తున్నది. విద్వేషాన్ని కాక ప్రేమను, క్రౌర్యాన్ని కాక కారుణ్యాన్ని, హింసనుకాక అహింసను ఆలంబనంగా చేసుకుని ముందుకు నడవాలని గాంధీయిజం ప్రబోధిస్తున్నది. హింస ఒక సమస్యను పరిష్కరిస్తూనే దాని స్థానంలో రెండు కొత్త సమస్యలను కల్పిస్తుందని ఈ సిద్ధాంతం హెచ్చరిస్తున్నది. క్రౌర్యానికి ప్రతికక్షితోపాటు స్వీయమానవతకూడా వివరిస్తున్నది. వెలుగును నీడవలె, హింసను ప్రతిహింస సదా వెన్నంటి విశదపరుస్తున్నది ! ఒక్క మాటలో, నికృష్టసాధనాలతో ఉత్తమ ఫలితాలను పొందలే మనడమే గాంధేయ తత్త్వానికి పంచప్రాణాలు! నశించగలదని ఇది వుంటుందని ఇది ఒక గాంధికాని, గాంధేయ తత్త్వంకాని భారతదేశంలోనే తలయెత్తడానికి భారతీయ హృదయంలో, చరిత్రలో, సంస్కృతిలో, సంప్రదాయాలలో నిగూఢమైవున్న శక్తులే కారణం. ఇతర చోట్ల ఇట్టి శక్తులు అసలే లేవని దీని తాత్పర్యం కాదు. దేశాలను వేరు చేసే సరిహద్దులే మానవతను కూడా వేరు చేస్తున్నాయనే మూఢుడు తప్ప ఆ మాట అనడు. కాని, ఇతరచోట్ల అందుకోలేని పరిణతిని ఈ శక్తులు మన దేశంలో అందుకున్నాయి. అందువల్లనే గాంధీజీని పోలిన ఒక విశిష్ట వ్యక్తికి, గాంధీయిజాన్ని పోలిన ఒక విశిష్టతత్త్వానికి మన దేశమే జన్మస్థానమైంది! ప్రపంచ ప్రగతిలో ఒక్కొక్క దేశం - లేదా ఒక్కొక్క జాతి - ఒక్కొక్క ఘట్టంలో ఎవరో ఒక మహాపురుషుని ద్వారా ఒక విశిష్ట సందేశ మిచ్చి, మానవజాతినే ముందుకు నడిపిస్తూ వుంటుంది. అట్టిదే గాంధీజీ సందేశమని మనం నమ్మడమే కాదు; ఇతర దేశాలలోని మహామహులే పెక్కుమంది నమ్ముతున్నారు. విశ్వ విఖ్యాత రచయిత రోమా రోలా ఈ నమ్మకంలో భాగస్వామి. సర్ ఐజాక్ న్యూటన్ తర్వాత తిరిగి అంతటి మహా విజ్ఞాన వేత్తగా ప్రపంచం మన్ననలను పొందుతున్న ఐన్‌స్టీన్ ఈ నమ్మకంలో భాగస్వామి. ఇంత ప్రసిద్ధ పురుషుడు కాకపోయినా, బ్రిటిష్ నవలా రచయిత ఆల్డెస్ హక్స్లీ ఈ నమ్మకంలో భాగస్థుడు. ఇలాగే మరెందరో కూడా వున్నారు. వీరిలో ప్రత్యేకించి పేర్కొనదగిన మహాపురుషుడు రష్యన్ రచయితలకు శిరోభూషణంవంటి వాడైన టాల్‌స్టాయ్. తన సిద్ధాంతాన్ని ఎక్కడో దూరదేశాన (దక్షిణాఫ్రికాలో), బహుపరిమిత రంగంలో (దక్షిణాఫ్రికా భారతీయుల సత్యాగ్రహంలో) గాంధీజీ అమలు పరుస్తున్న రోజులలోనే, ప్రపంచాన్ని ఆవరించివున్న నిబిడాంధకారాన్ని చీల్చుకుని వస్తున్న కిరణంవలె గాంధీజీ కృషి తనను ఆక్షరిస్తున్నదని ఆ ద్రష్ట అన్నాడు. ఆనాడు టాల్‌స్టాయ్కి ఆశాకిరణ లేశంగా తోచింది. ఈనాడు ప్రపంచానికే ఆశామహాజ్యోతి కాదా? హింసా మనస్తత్త్వం మానవజాతికే - మానవ సభ్యతకే - సర్వవినాశనాన్ని సంఘటింపజేయగల హైడ్రోజన్, కోబాల్ట్ బాంబులో ఈనాడు పరాకాష్ట చెందలేదా? హింసా విద్వేషాల మార్గాల వెంట పురోగమిస్తూ, నేటి సర్వ విధ్వంసక ప్రమాద ఘట్టాన్ని చేరిన తర్వాతనైనా, అహింసా ప్రేమలే ప్రాతిపదికగా గల గాంధీయిజం ప్రపంచసమస్యా పరిష్కారానికేమి, మానవాళి సముద్ధరణ కేమి ఎంతవరకు ఉపకరించగలదో కనీసం పరిశీలించవలసిన సమయం రాలేదా?

ఇట్టి పరిశీలన సమయం నిశ్చయంగా వచ్చింది. ఇంత కంటే ముఖ్య విషయం - ఈ పరిశీలనను జరపవలసిందీ, జరపగలిగిందీ మనమే! గాంధీజీ చూపిన మార్గంవెంట పురోగమించి మనం జాతీయ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నాము. ఆ మార్గాన్నే నడిచి సాంఘిక న్యాయాన్ని సంస్థాపించుకొనలేమా? గాంధి మార్గాన్ని అనుసరించాలంటే, భయాన్ని వర్జించాలి; స్వార్థాన్ని చంపుకోవాలి; కష్టసహిష్ణుతను అలవరచుకోవాలి; అధమాధమ మానవునిలోకూడా ఎక్కడో లోపల - లోలోపల - ధార్మిక శక్తులు సుప్తమై వుండకపోవని, వాటిని జాగరితం చేయగలిగిననాడు రాక్షసుడైనా దేవతాసముడు కాగలడని విశ్వసించాలి; ఇతరులను పునీతం చేయాలంటే ముందు.

మన అంతరంగాన్ని పునీతం చేసుకోవాలని గుర్తించాలి; ఎట్టి పరిస్థితులలోనైనా ప్రతిపక్షి సంహారణకంటె ఆత్మబలిదానమే వాంఛనీయమని గ్రహించి తదనుగుణంగా సంచరించాలి. ఈ అంతస్తుకు రాగల నైతికబలం మనలో బహు కొద్దిమందికే కలదనడం నిర్వివాదం. గాంధీజీ పేర, గాంధీయిజం పేర కొందరు కొన్ని అపచారాలు చేస్తున్న మాట నిజమే కావచ్చు కూడా. అయినా, మన లోపాలను సవరించుకొని, గాంధీజీ మార్గం వెంట పురోగమించడానికి ప్రయత్నమైనా చేయక గాంధీయిజానికే స్వస్తి చెప్పడం తగునా? అది గాంధీజీ పవిత్రాత్మకు మహాపచారాన్ని చేయడమేకాక, మన అధఃపతనాన్ని లోకానికి చాటుకొనడమే కాదా? సాంఘిక న్యాయసాధన సమాన లక్ష్యాన్ని విడిచి పుచ్చితే, తక్కిన అన్ని విషయాలలోనే కమ్యూనిజం గాంధీయిజానికి పూర్తిగా విరుద్ధం. కాబట్టి కమ్యూనిజాన్ని వరించడం, గాంధీయిజాన్ని కాలదన్నడం తప్ప వేరుకాదు. నిజమైన, స్థిరమైన ప్రగతికి మార్గం (మనరాష్ట్రానికి, మన దేశానికి మాత్రమే కాక, మొత్తం ప్రపంచానికే) గాంధీయిజ మొక్కటే. అది మన దేశంలో, మన జాతిని నడుపుతున్న శక్తులనుంచి ఆవిర్భవించిన సిద్ధాంతం కాగా, కమ్యూనిజం విజాతీయ సిద్ధాంతం. రేపు మన వోటు ఈ రెండు మార్గాలలో దేనికో ఒకదానికే అని మరచిపోరాదు. (13-11-1955)

8

కొత్త, పాతల మేలు కలయిక లేనిదే ప్రగతి లేదనడం నిర్వివాదం. అయితే, కొత్తపాతల మధ్య వైషమ్యం లేనప్పుడే వాటి మేలు కలయిక సాధ్యపడుతుంది. లేకపోతే; వాటి కలయిక నుంచి ఉద్భూత మయ్యేది హాలాహలం మాత్రమే!

కమ్యూనిస్టు సిద్ధాంతం, కమ్యూనిస్టులు నిర్మించ గోరుతున్న నూతన సాంఘిక వ్యవస్థ మొదలైనవన్నీ కూడా నిశ్చయంగా కొత్తవే. అయితే వాటితో వచ్చిన చిక్కు మన చిత్త సంస్కారంతో, మన చరిత్రగతితో, మన సంస్కృతీ సంప్రదాయాలతో మేళవించడానికి వీలులేనంతటి వైరుధ్యం వాటిలో ఉండడమే! పైగా, పునాదులనుంచీ పెకలించి వేయకపోతే, నూతననిర్మాణం సాధ్యం కాదని కమ్యూనిస్టుల నమ్మకం. అందువల్లనే హింసాత్మకమైన విప్లవంలో వారికి అంతటి విశ్వాసం! సమన్వయ సాధనలోగాని, క్రమానుగత వికాసంలోగాని, శాంతయుత పురోగతిలో గాని వారికి లేశమైనా నమ్మకం లేదు కాబట్టే, గాంధీజీ వారి కంటికి విప్లవకారిగా కాక, అభివృద్ధి నిరోధకుడుగా కన్పించడం!

భారతీయ సంస్కృతికి శిరోభూషణం వంటివాడైన గాంధీజీ అభివృద్ధి నిరోధకుడుగా కమ్యూనిస్టుల కంటికి కనబడ్డానికి కారణం కమ్యూనిజం భారతీయ సంస్కృతికి పూర్తిగా విరుద్ధమైంది కావడమే! సహనం భారతీయ సంస్కృతి విశిష్ట లక్షణాలలో ప్రప్రథమంగా పేర్కొన దగినట్టిది. అన్య మతాల సహనం, అన్య విశ్వాసాల సహనం, లక్ష్యసాధనలో అన్య మార్గాల సహనం, అన్య సాంఘిక వ్యవస్థల సహనం - దీనినుంచి ఆవిర్భవించినట్టిదే భారతీయ సంస్కృతి. అందువల్లనే

భిన్నత్వంలో ఏకత్వాన్ని భారతీయత గుర్తిస్తుంది; హర్షిస్తుంది; పూజిస్తుంది. కాగా అసహనమే కమ్యూనిజానికి బలం; అదే దాని బలహీనత కూడా, మార్క్స్ చెప్పిందే వేదం; లెనిన్ చూపిందే విప్లవానికి దారి; స్టాలిన్ నిర్మించిందే ఆదర్శరాజ్యం; రష్యాలో నిర్వహించబడేవే సిసలైన పంచవర్ష ప్రణాళికలు; 'ప్రవదా' వ్రాసిందే నిజం; తమదే అనుసరించవలసిన నాయకత్వం; తక్కినదంతా పచ్చి మోసం; తక్కిన వారందరు నరరూప రాక్షసులు— ఇదే కాదా కమ్యూనిస్టుల వైఖరి? అసహనం వీరిలో ఇంతగా పరాకాష్టకు చేరినప్పుడు సహనం ఒక విశిష్ట లక్షణంగా గల భారతీయ సంస్కృతీ వికాసానికి వీరు ఏవిధంగా తోడ్పడగలుగు తారు?

సహనంవలె సమన్వయం భారతీయ సంస్కృతిలో గల మరొక వైశిష్ట్యం. అందువల్లనే అసిరియన్, బాబిలోనియన్, ఈజిప్షియన్, గ్రీక్, రోమన్ మొదలైన ప్రాచీన సంస్కృతులు కాలగర్భంలోకి ఇంకిపోగా, భారతీయ సంస్కృతి నేటికీ జీవనదివలె మిగిలివున్నది. ఒకదాన్ని మించి సత్యాలు, ఒకదాన్ని మించి లక్ష్యాలు, ఒకదాన్ని మించి మార్గాలు - ఇట్టివి కలవని నమ్మినప్పుడే వాటిని సమన్వయ పరచడానికి ప్రయత్నించడమైనా; అట్టి సమన్వయ ఫలితంగా కొత్త సత్యాలను, కొత్త లక్ష్యాలను, కొత్త మార్గాలను రూపొందించుకొనడమైనా. కాని, కమ్యూనిస్టులకు కమ్యూనిజాన్ని విడిచిపుచ్చితే సత్యమూ లేదు; లక్ష్యమూ లేదు; మార్గమూ లేదు. అందువల్ల వారు సాధించగల సమన్వయం పూజ్యం.

సహనం లేకపోతే, సమన్వయం లేదు? సమన్వయం లేనప్పుడు కొత్తపాతల మేలుకలయిక లేదు. అది లేనప్పుడు ప్రగతి సయితం లేదు. (14-11-1955)

9

స్వస్వరూపజ్ఞానం లేని వ్యక్తికి కాని, జాతికి కాని ప్రగతి లేదు. వ్యక్తిపరంగాను, జాతిపరంగాను స్వస్వరూపం తెలుసుకొనడానికి పండిట్ నెహ్రూ తన కారాగారాన్నే తపో భూమిగా మార్చుకొన్నాడు. ఆ తపః ఫలితమే వ్యక్తిపరంగా ఆయన ఆత్మ కథ; జాతిపరంగా "డిస్కవరీ ఆఫ్ ఇండియా". ఈ మహద్గ్రంథాలు రెండింటినీ దేశ, విదేశాలలోని సాహితీపరులు, కళారాధకులు, విజ్ఞానవేత్తలు, తత్త్వజ్ఞులు, పత్రికా సంపాదకులు, రాజనీతి విశారదులు, ప్రభుత్వాధిపతులు, అన్య రంగాలలో ఉద్దండులైన ఇతరులు శ్రద్ధాసక్తులతోనే కాక, ప్రేమ గౌరవాలతో పఠించారు; పఠిస్తున్నారు. వీటిని పఠించిన వారందరికీ ఇండియాకు ప్రగతి కలదనీ, ప్రపంచానికే అది అందించగల మహత్తర సందేశం కలదనీ దృఢ విశ్వాసం కుదురుకొంటున్నది.

ఇండియా ప్రపంచాని కివ్వగల సందేశం విషయమై విశ్వాసం లేనిది ఒక్క ఇండియన్ కమ్యూనిస్టులకే! దీనికి కారణం - వ్యక్తిపరంగా గాని, జాతిపరంగా గాని స్వస్వరూపజ్ఞానం వారికి కించిత్తుగానైనా లేకపోవడమే. వారి ఆత్మలు వారివి కావు; వారి దేశం వారిది కాదు. అందువల్లనే భారతీయతను పట్టుగొమ్మగా పరిగణించదగు "గాంధీయిజం" వారికి విషతుల్యం; హింసా విద్వేషాలే ప్రాతిపదికగా గల ఒక విజాతీయ సిద్ధాంతం వారికి తారకమంత్రం. అందువల్లనే బాపూజీ కాక, లెనిన్ వారికి గురుదేవుడు. అందువల్లనే మహాత్ముని నాయకత్వాన ప్రపంచ చరిత్రలోనే అపూర్వమైన అహింసాత్మక విప్లవం ద్వారా సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సముపార్జించుకొన్న భారతదేశం వారి దృష్టిలో ఇప్పటికీ పరతంత్ర రాజ్యం. అందువల్లనే ఆగష్టు 15వ తేదీని జాతీయ పర్వదినంగా పరిగణించడానికి వారి ప్రాతికూల్యం. అందువల్లనే త్రివర్ణ పతాక కాక, ఎర్రజెండా వారి ధ్వజం.

కమ్యూనిస్టుల జెండా ఎరుపు. వివిధ వర్ణ సుశోభితమైన తారకలలో వారికి ఎరుపు తప్ప మరొక రంగు కనబడదు. తాము అధికారంలోకి వచ్చిన చోట వారిది ఎర్ర సైన్యం; ఎర్ర నౌకాదళం; ఎర్ర వైమానిక దళం, ఓజస్సును, తేజస్సును రక్తవర్ణంలో తప్ప వారు చూడలేరని దీనినుంచి స్పష్టం. భారతీయ సంప్రదాయాల ప్రకారం - భారతీయ తత్త్వశాస్త్రాల ప్రకారం రజోగుణ ప్రధానమైనట్టిది ఎరుపు రంగు. రాగ ద్వేషాలు ప్రధానంగా కలదే రజోగుణం. ఆ రజోగుణంలో ఆవిర్భవించింది కాబట్టే, కమ్యూనిస్టు పార్టీలో రాగ విద్వేషాలు తొణికిస లాడుతూ ఉంటాయి; రజోగుణం కంటే అన్ని విధాల ఉదాత్తమైన సత్వగుణాన్ని అంతర్భూతం చేసుకున్న గాంధీయిజాన్ని వారు హర్షించనూ లేరు : ఆ గుణానికే నివ్వాళిపట్టే భారతీయ సంస్కృతిని వారు పూజించనూ లేరు. స్వచ్ఛమైన ధావళ్యంలో భావ దాస్యానికి లోనుగాని భారతీయులకు వలె మహోన్నత హిమగిరులు, ఆ గిరి సానువుల నుంచి అప్సరాంగనవలె భూతలానికి అవతరించే గంగాదేవి, ఆ దేవిని శిరస్సున ధరించే పరమశివుడు, ఆ శివునివలె హాలాహలాన్ని తాను

స్వీకరించి, అమృతాన్ని లోకానికి ప్రసాదించిన గాంధీజీ - ఈ మహోదాత్త చిత్రాలలో ఏదీ కమ్యూనిస్టులకు స్ఫురించదు. స్వచ్ఛమైన ధావళ్యం రజోగుణ ప్రధానమైన వారి మానసిక నేత్రాలకు కేవలం ప్రేత కళగా గోచరిస్తుంది.

"ప్రగతి" శీర్షిక కింద ఈ సంపాదకీయాల సమాప్తికి పూర్వం ఇంతవరకు మేము మా పాఠకులకు నివేదించిన విషయాలను క్రింది వాక్యాలలో క్రోడీకరించవచ్చు :

- 1 సాంఘిక న్యాయాన్ని సంస్థాపించగోరిన మేరకు కమ్యూనిజం ప్రగతి శీలంతో కూడిందే. అయితే, సాంఘిక న్యాయసాధనాకాంక్ష కేవలం కమ్యూనిజానికే పరిమితం కాదు.
- 2 లక్ష్యం ఉత్తమమైనదైనా, దాని సాధనకు కమ్యూనిజం అధమాధమ సాధనాలను వినియోగిస్తుంది. అందువల్ల ఒక సత్ఫలిత సాధన యంత్రంలో అది నూరు దుష్టఫలితాలను అనివార్యం చేస్తుంది.
- 3 సాంఘిక న్యాయసాధనకు వ్యక్తి స్వాతంత్ర్యాన్ని బలిపెట్ట నక్కరలేదు. వ్యష్టి బాహుళ్యమే సమష్టి, కాబట్టి వ్యష్టికి, సమష్టికి మధ్య అధిగమించరాని అగాధం లేదు. సమష్టి క్షేమానికి భంగకరం కాని విధంగా వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కాపాడనూ వచ్చు; వ్యక్తి స్వాతంత్ర్యాన్ని చంపకుండా సమష్టి క్షేమాన్ని సాధించనూ వచ్చు. సోషలిజం ప్రాతిపదికగా గల ప్రజాసామ్యంలోనే ఇది సుసాధ్యం; నియంతృత్వంతో కూడిన కమ్యూనిస్టు వ్యవస్థలో అసాధ్యం.
- 4 ప్రతి దేశం, ప్రతి జాతి తన చరిత్రలో, తన చిత్త సంస్కారంలో, తన సంస్కృతిలో, తన సంప్రదాయాలలో - దీన్నే ఒక్క మాటలో చెప్పాలంటే - తన జాతీయతలో అంతర్లీనమై ఉన్న మహచ్ఛక్తుల క్రమానుగత వికాసానికి అనుగుణంగా నడవాలి. అప్పుడే దానికి ప్రగతి. కమ్యూనిజం వర దేశాలలో, పర వాతావరణంలో, పర సంస్కృతీ సంప్రదాయాలనుంచి ప్రభవించిన సిద్ధాంతం. అన్ని విధాల విజాతీయమైన ఆ సిద్ధాంతాన్ని అనుసరించడం ద్వారా భారత జాతి పురోగతిని సాధించలేదు.
- 5 సత్యం, అహింస, సహనం, సమన్వయం, ప్రేమ, కారుణ్యం - ఇట్టి ఉత్తమ గుణాలే భారతీయతకు ప్రాతిపదికలు. వీటికి కమ్యూనిజం అపరిచితమైనట్టిది. అందువల్లనే భారతీయ సంస్కృతిని తనలో మూర్తీభవింప జేసుకున్న గాంధీజీ, కమ్యూనిస్టుల కంటికి అభివృద్ధిని నిరోధించే కపట సన్యాసిగా, ఇంపీరియలిస్టులను సమర్థించే ప్రజాద్రోహిగా కనబడతాడు.
- 6 కొత్తపాతల మేలు కలయిక లేనిదే ప్రగతి లేదు. అయితే, కొత్త పాతల మధ్య విపరీత వైరుధ్యం ఉన్నప్పుడు వాటి కలయిక వల్ల హాలాహలమే ఉద్భవిస్తుంది. భారతీయ సంస్కృతికీ, కమ్యూనిస్టు సాంఘిక వ్యవస్థకు ఇట్టి వైరుధ్యమే ఉన్నది. ఇంతే కాక, ఒకదాన్ని మించి సత్యాలు కాని, లక్ష్యాలు కాని, వాటిని చేరడానికి మార్గాలు కాని కలవనే విషయాన్ని అంగీకరించని కమ్యూనిస్టులు సాధించగల సమన్వయమే లేదు.
- 7 తాము చాటుకొనే విధంగా ప్రగతిని కమ్యూనిస్టు పార్టీయే గుత్తకొనలేదు సరిగదా, దేశ భక్తికి దూరమై, భావదాస్యానికి లోనైన ఆ పార్టీని నమ్ముకుంటే ప్రగతి లేదు.
- 8 హైడ్రోజన్, కోబాల్ట్ బాంబులలో పరాకాష్ట చెందిన హింసాతత్త్వం నుంచి ప్రపంచ సముద్ధరణకు గాంధీజీ బోధించిన అహింసా మార్గమే శరణ్యం! ఇది జిజ్ఞాసువులైన ప్రపంచ ప్రముఖులందరి నమ్మకం. హింసతో పరిఢవిల్లే కమ్యూనిస్టు వ్యవస్థను వరించడం భారత దేశంపై ప్రపంచం పెట్టుకున్న ఆశ లన్నింటినీ వమ్ము చేయడమే కాక, గాంధీజీ పవిత్రాత్మకు, భారతీయతకు ఘోరాపచారాన్ని చేయడమే!
- పోతే, కట్టకడపటి మాటగా నేడు చెప్పవలసిన దిది : నెహ్రూ ఆంధ్రరాష్ట్రంలో గడచిన రెండు రోజులలోను తన పర్యటనలో నిరూపించినట్టు, "మన దేశంలో ఎందరెందరో అభివృద్ధి నిరోధకులున్నారు. వారిలో అగ్రేసరులు ఇండియన్ కమ్యూనిస్టులే!" (16-11-1955).

ఆశాభంగం

(రాష్ట్రశాసనసభకు 1952 సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ పరాజయం గురించి విశ్లేషణ)

మొన్నటి ఎన్నికలలో ఆంధ్రదేశంలో కాంగ్రెస్ పొందిన పరాజయానికి అన్నింటికంటే పెద్ద కారణం కాంగ్రెస్కు ప్రజలతో సన్నిహితత్వం తగ్గడమని చిత్తూరులో జరిగిన ప్రదేశ్ కాంగ్రెస్ సమావేశంలో ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి సమేతంగా పలువురు హెచ్చరించారు. మా అభిప్రాయం కూడా కాంగ్రెస్ పరాజయానికి మూలకారణ మిదేనని.

కాని, ప్రజలతో కాంగ్రెస్కు సన్నిహితత్వం ఎందువల్ల తగ్గిపోయిందనే పరిశీలన మాత్రం సరిగా జరగడం లేదని మాకు తోస్తున్నది.

కాంగ్రెస్ పూర్వంవలె సభలను, సమావేశాలను హెచ్చుగా జరపక పోవడంవల్లనే ఈ సన్నిహితత్వం తగ్గలేదు. పత్రికలను, కరపత్రాలను కాంగ్రెస్ హెచ్చుగా ప్రచురించకపోవడం వల్లనే ఈ సన్నిహితత్వం తగ్గలేదు. జీతభత్యాలపై కాంగ్రెస్ ప్రచారకులను నియమించక పోవడంవల్లనే ఈ సన్నిహితత్వం తగ్గలేదు. ఆంధ్రకాంగ్రెస్ నాయకులలో ప్రబలిన అంతఃకలహాల వల్ల ప్రజల మధ్యకు వెళ్ళడానికి వారికి విరామం మిగలలేదనడం నిజమైనా, ఇది కూడా ప్రజలతో కాంగ్రెసు సన్నిహితత్వం తగ్గడానికిగల కారణాన్ని పూర్తిగా వివరించలేదు.

కాంగ్రెస్ ప్రజలకు దూరమైపోవడానికి అసలు కారణం కాంగ్రెస్ పేరు చెబితేనే ప్రజాహృదయం ఉప్పొంగిపోయే రోజులు వెనకపడడమే. దీన్నె ఇంగ్లీషులో “ఇమోషనల్ ఎలీజియన్స్” కోల్పోవడమని అంటారు.

“కాంగ్రెస్” అనే మూడక్షరాల మాట ప్రజాహృదయాన్ని ఉప్పొంగజేయగల మహామంత్రమైంది. ఒక గొప్ప లక్ష్యసాధనంకోసం ఎంతటి త్యాగానికైనా సంసిద్ధపడగలవారికి కాంగ్రెస్ కేంద్రం కావడంవల్లనే.

వెనుకటి ఈ మంత్రం ఈనాడు పారకపోవడానికి కారణం వెనకటివలె ఇప్పుడు కాంగ్రెస్ త్యాగమే ధనంగాగల సంస్థ కాకపోవడం.

ఏ స్వరాజ్య సాధనకోసం కాంగ్రెస్ సంస్థాపించబడిందో, ఆ స్వరాజ్యం సిద్ధించినంతనే వెనకటి త్యాగనిరతి సన్నగిల్లడమేకాక, వెనకటి త్యాగాలకు ప్రతిఫలం పొందడం నిమిత్తం కాంగ్రెస్వదులలో పోటీలు ప్రారంభమైనాయి.

వెనకటి త్యాగాలకు ప్రతిఫలాన్ని కొందరు పదవులరూపంలో కోరగా, మరికొందరు పర్మిట్ల రూపంలో కోరారు; కొందరు బంధుప్రీతి రూపంలో కోరగా, మరికొందరు భూముల మంజూరు రూపంలో కోరారు. రూపం ఏమైతేనేమి "దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవడం" అనే సూత్రాన్ని ఎవరికివారే పట్టుదలతో అమలు జరపడం ప్రారంభమైంది!

ప్రజలకు కాంగ్రెస్ దూరంకావడానికి మూలకారణం ఇదేనని అంగీకరించిన పక్షంలో - నిష్పాక్షికులైనవారు దీన్ని అంగీకరించితీరాలి - ప్రజలకు తిరిగి సన్నిహితం కావడానికి జరపవలసిన తొలిచర్య వెనకటి త్యాగాలకు ప్రతిఫలం పొందడం కాంగ్రెస్వాదుల ఇచ్ఛకాదని నిరూపించడం; మలిచర్య తిరిగి త్యాగనిరతిని ప్రదర్శించడం.

కాంగ్రెస్ చరిత్రలో ఇట్టి నవఘట్టం ప్రారంభమైందని ప్రజా హృదయానికి హత్తుకోగల విధంగా చెప్పడానికి ఉపకరించగలదన్న విశ్వాసంతోనే. కూడుగుడ్డలకు లోపంలేని కాంగ్రెస్ వారందరు రాజకీయ బాధితులుగా తాము పుచ్చుకున్న భూములను విడిచిపెట్టాలని మేము పదేపదే సూచిస్తున్నాము. అయినా, చిత్తూరు సమావేశంలో ఇట్టి తీర్మానమేదీ జరగలేదు సరిగదా, మచ్చుకు ఒకరైనా ముందుకువచ్చి, "నాకు మంజూరైన భూమిని నేను విడిచిపెడుతున్నాను" అని చెప్పిన పాపాన పోలేదు!

పదవులను పట్టుకుని ప్రాకులాడే ఉద్దేశం తమకులేదని నిరూపించడానికేమి, కాంగ్రెస్ పునరుజ్జీవనాన్ని లక్షిస్తున్నామని చాటడానికేమి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు (అధ్యక్షుడు మినహాగా) రాజీనామాలు చేశారనుకోండి; అధ్యక్షుడు సయితం రాజీనామాకు ఏ క్షణమైన తాను సంసిద్ధమని ప్రకటించినాడనుకోండి; కాని, ఇటీవల శోచనీయ పరిణామాలనుంచి బయటపడి, కాంగ్రెస్ ఒక కొత్త అవతారమెత్తిందని నచ్చజెప్పడానికి ఇది చాలదు.

కాంగ్రెస్ వాదులలో ఇంతో, అంతో స్థితిమంతులైన వారందరు తాము పుచ్చుకొన్న భూములను విడిచిపెట్టడంచేతనే కాంగ్రెస్ పునరుజ్జీవనం సాధ్యం కాగలదన్న భ్రమ మాకులేదు. కాని, అది నిస్సంశయంగా కాంగ్రెస్ వాదుల చిత్తవృత్తిలో పెద్దమార్పుకు సూచన ప్రాయమైవుండేది. ఇట్టి అవకాశాన్ని చిత్తూరు సమావేశంలో కాంగ్రెస్ వాదులు కోల్పోవడం మాకు ఆశాభంగాన్ని కలిగించిందని చెప్పక తప్పదు. (ఆంధ్రప్రభ 29-2-1952)

ఎన్నికల పాఠాలు

(1952లో రాష్ట్రశాసనసభకు జరిగిన సాధారణ ఎన్నికల ఆధారంగా రాజకీయ పార్టీలు, ప్రజలు నేర్చుకోవలసిన ఎన్నికల పాఠాల వివరణ.)

ఎన్నికల ఫలితాల ప్రకటన దాదాపు ముగిసింది కాబట్టి, ఇక మన మద్రాసు రాష్ట్రానికి, విశేషించి ఆంధ్ర ప్రాంతానికి, సంబంధించినంతవరకు ఎన్నికల పాఠాలేవో తెలుసుకొనడానికి మనం ప్రయత్నించవచ్చు.

శని, ఆదివారాలలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ న్యూఢిల్లీలో జరిపిన సమావేశాల ప్రధానోద్దేశం ఎన్నికల గుణపాఠాల పరిశీలనే. ఈ సమావేశాలకు మన రాష్ట్రప్రతినిధులు సమర్పించిన నివేదికలు ఏ ధోరణిలో కలవో, వాటిపై చర్చ ఏ సరళిలో నడిచిందో మనకు తెలియదు. కాంగ్రెస్ కార్యక్రమాన్ని ద్విగుణీకృతోత్సాహంతో కొనసాగించడం, ప్రజాబాహుళ్యంతో ఇతోధిక సన్నిహిత సంబంధాన్ని కాంగ్రెస్ కూర్చుకొనడం ఇంతకుమించి వర్కింగ్ కమిటీ ఏమి నిర్ణయాలను జరిపిందో కూడా మనకు రూఢిగా తెలియదు. అయినా, మన రాష్ట్ర పరిస్థితులు మనకు తెలియనివికావు కాబట్టి, న్యూఢిల్లీ చర్చల, నిర్ణయాల ప్రసక్తిలేకుండానే ఎన్నికల ఫలితాలపై స్థూలంగానైనా కొన్ని ముఖ్యమైన తీర్మానాలకు నిర్వివాదమైన నిర్ణయాలకు మనం రావడానికి వీలున్నది.

ఎన్నికల ఫలితాలను చూచీ చూడనంతనే ఎంతటి మందమతికైనా వెంటనే స్ఫురించే విషయం కాంగ్రెసుపట్ల ప్రజలకు విశ్వాసం సడలిందని.

పూర్తిగా ఎన్నికల ఫలితాలు వచ్చిన తమిళ జిల్లాలలో కాంగ్రెస్ 185 అసెంబ్లీ స్థానాలకు పోటీచేయగా, అది గెలిచింది 96 స్థానాలను మాత్రం. దీని తాత్పర్యం దాని విజయం నూటికి 52 వంతులకు లోపుగానే అని.

ఆంధ్రప్రాంతంలోను, మలబార్లోను కాంగ్రెసు విజయం ఇంతకంటే కూడా తక్కువ. ఇంకను తెలియవలసిన ఆరు ఫలితాలను విడిచిపుచ్చి, వెలువడిన ఫలితాలపైనే అంచనాకడితే, ఆంధ్రప్రాంతంలో కాంగ్రెస్ విజయం నూటికి 30 వంతులు మాత్రం. ఇది మలబార్లో మరింత తక్కువ. అక్కడ కాంగ్రెస్ గెలుపు నూటికి పద్నాలుగు వంతులైనా కాదు.

పోతే, ఒక్క దక్షిణ కెనరాలోనే కాంగ్రెస్ వెనుకటి రోజులలోవలె పూర్తి విజయాన్ని పొంద గలిగింది. అది ఇక్కడ 11 స్థానాలకు పోటీ చేసి తొమ్మిదింటిని గెలుచుకొన్నది. దీన్ని బట్టి అక్కడ కాంగ్రెస్ విజయం ఇంచుమించుగా నూటికి 82 వంతులు.

కాంగ్రెస్ పేరుచెప్పి, చివరకు పూచికపుల్లను నిలబెట్టినా, అది గెలిచిన రోజులతో పోల్చుకొంటే, ఇప్పటి ఈ ఫలితాలు కాంగ్రెస్, సంస్థపట్ల ఈనాటికీ అచంచల విశ్వాసంకలవారిని సయితం అమితంగా కలవర పెట్టగలపాటి వనడం నిస్సందేహం. దేశం మొత్తంపై ఫలితాలకు ఇవి విరుద్ధమైనవి కావడం సయితం ఈ సందర్భంలో ప్రత్యేకించి గమనార్హమే!

మన దేశం మొత్తానికి ప్రస్తుతం 22 లెజిస్లేటివ్ అసెంబ్లీలు ఉన్నాయి. వాటిలో 14 అసెంబ్లీల్లో - బొంబాయి, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, అస్సాం, హైదరాబాద్, మైసూర్, సౌరాష్ట్ర, మధ్యభారత్, హిమాచలప్రదేశ్, అజ్మీర్, భోపాల్, కూర్గ్, ఢిల్లీ, అసెంబ్లీలో తక్కిన అన్ని పార్టీలపై కాంగ్రెస్కు మెజారిటీ వచ్చింది. పంజాబులో కూడా ఇంతే జరగనున్నట్టు అక్కడి ఎన్నికల ఫలితాలు ఈ సరికే సూచిస్తున్నాయి. యు.పి.లో కూడా బహుశా ఇందుకు భిన్నం కాబోదని అనుకోవచ్చు. మధ్యప్రదేశ్ గురించి ఇంతలోనే ఏమీ చెప్పలేము. పెప్సూ, రాజస్థాన్లలో మాత్రం కాంగ్రెస్ విజయం అనుమానాస్పదం. కాగా, కచ్చితంగా కాంగ్రెసుకు మెజారిటీ లేనట్లు తేలింది తిరువాన్కూర్ - కొచ్చిన్ యూనియన్, మద్రాసు రాష్ట్రం, ఒరిస్సాలలో మాత్రమే.

కాంగ్రెస్కు విజయం సందేహాస్పదమైన తక్కిన ప్రాంతాలలో ముఖ్యంగా ఒరిస్సా, రాజస్థాన్, పెప్సూలలో - మాజీ సంస్థానాధిపతులు, జాగీర్దారులు మొదలైనవారు ఎక్కువగా గెలవగా,. చెన్న రాష్ట్రంలోను, తిరువాన్కూర్ - కొచ్చిన్ యూనియన్లోను, కాంగ్రెస్ తర్వాత ఎన్నదగువర్గంగా కమ్యూనిస్టులు గెలిచారు. దీన్నిబట్టి ఈ రెండు ప్రాంతాలు కమ్యూనిజంవైపుకు మొగ్గుచూపడం ప్రారంభించినట్టు అనుకోవచ్చునా?

ఈ మాటను కమ్యూనిస్టులే అనడం లేదు. తమకు సిద్ధించిన విజయాలలో నాల్గవవంతైనా లభించగలవన్న ఆశతో వారు ఎన్నికల రంగంలోకి దిగలేదు. నిజానికి, కమ్యూనిస్టు విజయానికి ఎక్కువగా ఆశ్చర్యపడుతున్నవారు కమ్యూనిస్టులే! ఎన్నికల పర్యవసానాన్ని ముందుగా ఏ మాత్రంగానైనా వారు ఊహించగలిగి ఉంటే, మరెన్నో స్థానాలకు వారు తప్పక పోటీ చేసి ఉండేవారే! ఏమైనా, కమ్యూనిజంపట్ల ప్రజలలో కొత్తగా పుట్టుకువచ్చిన సుహృద్భావంకాక కాంగ్రెస్పట్ల ఏర్పడిన విముఖత్వమే తమ విజయానికి ప్రధాన కారణమని ఒక ఆంధ్ర కమ్యూనిస్టు ప్రముఖుడు స్వయంగా చెప్పివున్నాడు. ఈ కారణాన ప్రస్తుత సమీక్షలో మనం పరిశీలించవలసింది కమ్యూనిస్టు పార్టీకి ప్రాబల్యం ఎందువల్ల సిద్ధించినదని కాక, కాంగ్రెస్ పలుకుబడి ఎందుకు సన్నగిల్లింది అని మాత్రమే.

ముఖ్యంగా ఆంధ్రదేశానికి సంబంధించినంతవరకు కాంగ్రెస్ పలుకుబడి ఎంతగానో పలచబడివుండక పోతే, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు, దాని ఉపాధ్యక్షు లిద్దరు, దాని ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శు లిద్దరు, మొత్తం ఏడుగురు పార్లమెంటరీ బోర్డు సభ్యులు, వారు తమ రహస్యమంతనాల సందర్భంలో సలహాకు పిలిచిన ప్రముఖులు మరిద్దరు, ఒక రిద్దరు మినహాగా ఎన్నికలలో పోటీ చేసిన అందరు రాష్ట్రకాంగ్రెస్ కార్యవర్గసభ్యులు - ఒక్క మాటలో ప్రదేశ్ కాంగ్రెస్ సంఘానికి సంఘమే ఎన్నికలలో పరాజయం చెందడం సంభవించేదా? ఇంతగా తెలుగునాట కాంగ్రెస్ పలుకుబడి తగ్గిపోవడానికి కారణా లేవో పరిశీలించడానికి వరసగా కొన్ని సంపాదకీయాలు అవసరం. (5-2-1952)

2

కాంగ్రెస్ బలహీనతలలో మొట్టమొదటిగా పేర్కొనవలసింది దానిలోని విభేదాలు. ఏ పెద్ద సంస్థలోనూ అన్ని సమస్యలపై, అన్ని సందర్భాలలో, అందరిమధ్య ఏకాభిప్రాయం వాంఛనీయమైనా కాదు. అది "విస్సన్న చెప్పింది వేదం" అనే మనస్తత్వానికి నిదర్శనం, వ్యక్తిగతాభిప్రాయాలు పూజ్య మనడానికి తార్కాణం. కాని, సంస్థలో వచ్చే భేదాభిప్రాయాలు సిద్ధాంతాలకు సంబంధించినవి కావాలి; ఇందుకు మారుగా అవి వ్యక్తులపై కేంద్రీకృతమైపోతే సంస్థ దెబ్బతింటుంది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ విషయంలో ఇంతే జరిగింది. దానిలో వ్యక్తిగత విభేదాలు మితిమీరి, వె(ర్రితలలు వేసి, పరస్పర నిందారోపణల వరకు చివరికి పరస్పర అవి వెళ్ళిపోయాయి. ఇందువల్ల మొత్తం సంస్థే ప్రజలదృష్టిలో దూషణల వరకు కూడా - చులకనకావడం తటస్థించింది.

ఎన్నికల పాఠాలు 2

వ్యక్తిగతమైన విభేదాలు కాంగ్రెస్ సంస్థలో రాష్ట్రసంఘం నుంచి, గ్రామ సంఘం వరకు పెచ్చు పెరిగిపోవడంతో పూర్వపు సేవాధర్మం మరుగునపడిపోయింది; కాంగ్రెస్ సంఘాల కార్యకలాపాలు వాటి కార్యకర్తల ఎన్నికల సమయానికి పరిమితమైపోయాయి. ఇది ఆంధ్రప్రాంతంలో కాంగ్రెస్కు ఏర్పడిన రెండవ బలహీనత.

ప్రజాసేవానురక్తి మందగించిన, స్వార్థదృష్టి ప్రబలకపోతే, అది గుడ్డిలో మెల్లగానైనా వుండేది. కాని, దురదృష్టవశాన కాంగ్రెస్ సంస్థతో తమ సంబంధాన్ని, దానిలో తమ స్థానాన్ని "ఇంతకుముందు మేము చేసిన స్వప్రయోజనాలకు వినియోగించుకొనడం పెరిగింది. అశేషత్యాగాలకు మేము ఏ కొద్దిగానో ప్రతిఫలం కోరడం దోషమా?" అని కొందరు బాహాటంగానే వాదించ నారంభించారు. కాంగ్రెస్ బలహీనతలలో ఇది మూడవది.

ఈ సందర్భంలో రాజకీయబాధితులకు భూదానం ప్రత్యేకంగా పేర్కొనదగింది. దేశ సేవకు జీవితాన్ని అంకితంచేసి, కూడుగుడ్డలకు ముఖం వాచి, పోరులో దూకినవారికి కొద్ది భూవసతిని చూపించి, జీవనాధారం కల్పించడం నిరాక్షేపణీయమే. కాని వారివారి ఆర్థిక స్థితిగతులతో ఎంత మాత్రం నిమిత్తం లేకుండా, కాంగ్రెస్ పక్షాన కారాగారవాసం చేయడాన్నే భూదానానికి అర్హతగా చేయడమేమి, ఆర్థికస్తోమత నిజంగాలేనివారిని మొత్తంపై అశ్రద్ధచేసి, కాంగ్రెస్ సంస్థలో పలుకుబడిగలవారికి విలువైన భూములను కట్టబెట్టడమేమి, కొందరికి భూదానం పేరుతో మునిసిపల్ సరిహద్దులలో ఇళ్ల స్థలాలుగా మారగల భూములను కేటాయించడమేమి ఈ విధానంపట్ల సర్వేసర్వత్రా ఏహ్యభావాన్ని పుట్టించింది.

ఇంతే కాదు. పెక్కు చోట్ల ఇది పాటకపుజనాన్ని కాంగ్రెస్కు బద్ధవిరోధులను చేసిందికూడా. సైన్యంలో పనిచేసివచ్చినామని, లేదా అధికోత్పత్తిని సాధించగలమని బంజరుల సాగుకు అర్జీలు పెట్టుకొని, ఎంతో కష్టపడి వాటిని బాగుజేసుకొని, రెండు, మూడు, పంటలను పండించుకొన్నవారిని తొలగించి, ఆ భూములను కాంగ్రెసువాదులకు అప్పగిస్తే, కాంగ్రెస్పైనే కడుపుమంట పుట్టుకు రావడం సహజమే కాదా?

మరొక విధంగా కూడా ఇందువల్ల అపకారమే జరిగింది. కాంగ్రెసు సమర్థించినవారికి కాంగ్రెస్ ప్రభుత్వం భూములివ్వడాన్ని కళ్ళారా చూచినవారు “ఇప్పుడు మమ్ము బలపరిస్తే, మా ప్రభుత్వం వస్తే, మీకు భూములు” అని కమ్యూనిస్టులు చెప్పిన మాటలను నమ్మడం సహజంగానే జరిగింది.

గత యుద్ధ సమయంలో చర్చిల్ బ్రిటిష్ ప్రజలకు చేసిన వాగ్దానాన్ని మించినదాన్ని - “రక్తం, స్వేదం, అశ్రువులు” వాగ్దానాన్ని మించినదాన్ని ఎన్నడు చేయకపోయినా, “కో” అనగానే “కోకో” అంటూ కోటానుకోట్లు మారు పలికిన కాంగ్రెస్కు ఈనాటి ఎన్నికలలో తన తరఫున ప్రచారం చేయడానికి మనిషికి రోజుకు రెండు రూపాయల చొప్పున కూలి ఇవ్వవలసిన దుర్గతి అక్కడక్కడ పట్టడం ఎంతటి మచ్చ! (6-2-1952).

3

కాంగ్రెస్ పరాజయానికి కారణభూతమైన ప్రభుత్వ విధానాలలో ప్రథమగణ్యమైంది మద్యనిషేధం. ఈ నిషేధం గాంధికి ప్రియతమమైనదే కావచ్చు. గాంధి నాయకత్వం వహించిననాటి నుంచీ దీనికి కాంగ్రెస్ నిర్మాణ కార్యక్రమంలో స్థానం కలదనడం నిజమే కావచ్చు. దీన్ని అమలు పరచడంలో సామాన్య ప్రజల యోగక్షేమాలనే ప్రభుత్వం కోరినదనడం నిర్వివాదం కావచ్చు. అయినప్పటికీ ఈ సంస్కరణ ఏమీ సత్ఫలితాల నివ్వలేకపోయింది.

శాసనం ప్రకారం మద్యనిషేధం క్షుణ్ణంగా అమలు జరిగితే, దానిలో ఎందరికి ఎంతగా కోపతాపాలు కలిగినా, క్రమక్రమంగా ప్రభుత్వచర్య ప్రజామోదాన్ని పొందగలిగేదేమో! కాని నిషేధం సక్రమంగా అమలు జరగనందున ప్రభుత్వ విధానం తమ మేలుకోసమే ఉద్దేశించ బడినట్టు పాటకపుజనం గుర్తించ గల పరిస్థితులు రాలేదు. నెరిదిగా త్రాగేవారు చాటుగా త్రాగడం, సిసలైన సరుకుకు బదులుగా కల్తీది దొరకడం, అణా ఖర్చుచేయవలసినచోట రెండణాలు చెల్లించవలసిరావడం పాటకపుజనానికి కనబడిన మద్యనిషేధ ఫలితాలు ఇవి మాత్రమే. -

పైగా, పెక్కుచోట్ల దొంగతనంగా కల్లు, సారాయిలను అమ్ముతున్న వారిని విడిచిపెట్టి, వాటిని తాగినవారిని పట్టుకొని శిక్షించడం కూడా జరిగింది. ఈ దొంగ వ్యాపారం చేసేవారు సాధారణంగా కలవారు కాగా, శిక్షలు పడినవారు లేనివారు. ఇందుమూలంగా కలవారిదే రాజ్యమన్న అభిప్రాయం ప్రబలింది కూడా.

ఇంతే కాక వర్షాలు లేనిచోట్ల పైర్లు దెబ్బతినడంవల్ల తిండిగింజలకు కటకట తప్పకపోగా, పండినచోట కనీసపు అవసరాలకైనా తగినంత మిగల్చకుండా ఊడ్చుకుపోవడం వల్ల కటకట యేర్పడింది. రేషన్ బియ్యం పరిమితి అంతకంతకు తగ్గింది. కొద్దిపాటి రేషన్ బియ్యంలో కూడా ఇన్ని రాళ్లూ, అన్ని రప్పలూ! ఏ చచ్చు గింజలో, పుచ్చుగింజలో, అవైనా కొన్ని కొన్ని చోట్ల వేళకు దొరకవు. ఈ కష్టాలన్నీ మరీ హెచ్చుగా వెళ్ళబోసినవారు తిరిగి పాటకపు జనులే. ఇందువల్ల కష్టనష్టాలను సర్వజనులు సమానంగా పంచుకొనడం లేదన్న నమ్మకం వారిలో ప్రబలింది.

ఇక, రైతు లందరికి ధాన్యం ధరల విషయమై కొంత అసంతృప్తి కలగగా, వారిలో సన్నకారువారికి విచక్షణలేని ధాన్య సేకరణ విధానం దుస్సహమైంది. రైతులకు గిట్టుబాటు ధరలు ముట్టడం లేదని మన రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తూనే వచ్చినా, వాటిని పెంచడానికి కేంద్రాన్ని తగినంతగా ఒత్తిడి పెట్టలేక పోయింది. చాలా ఆలస్యంగా హెచ్చింపును సాధించినా, అది బహుకొద్దిగా మాత్రమే.

వస్త్రసమస్య విషయంలో కూడా (బాధ్యత చాలావరకు కేంద్ర ప్రభుత్వానిదే కావచ్చు గాని, అవకతవకలు అనేకం జరిగాయి. చేనేత పరిశ్రమకు నూలు సరఫరాను ఎంతమాత్రం సరిగా సాగించనందున ఆ పారిశ్రామికు లందరు కాంగ్రెస్ ప్రతిపక్షాలను బలపరచడం తటస్థించింది. (7-2-1952)

ఎన్నికల పాఠాలు - 4

కాంగ్రెస్ ఆ తప్పు చేసిందని, ఈ తప్పు చేసిందని వ్రాస్తుంటే "అది చేసిన ఒప్పులే లేవా?" అన్న ప్రశ్న ఉదయించడం సహజం. కాని, మన రాష్ట్రంలో కాంగ్రెస్ పొందిన అతిఘోరపరాజయం తర్వాత కావలసింది అది సాధించిన విజయాల సమీక్ష కాదు. అట్టి సమీక్ష ప్రస్తుత ఘట్టంలో ఎంత మాత్రం కూడని ఆత్మసంతృప్తికి దారి తీస్తుంది. ఆత్మ సంతృప్తికి మారుగా ప్రస్తుతం కావలసింది ఆత్మ సంశోధన. "మనపట్ల ప్రజావిశ్వాసం ఎందువల్ల సడలింది?" అని కాంగ్రెస్వాదులు ఇప్పుడు ప్రశ్నించుకొనలేకపోతే కాంగ్రెస్ సంస్థకు మరి భవితవ్యమే లేదు. ఎప్పుడో ఒకప్పుడు ఏవో కొన్ని తప్పులను చేయని రాజకీయ పక్షం ఉండదు. కమ్యూనిస్టు పార్టీనే చూడండి. పోయిన పదేళ్ళలోనే అది ఎన్నెన్నో తప్పులను చేసింది. వాటిలో చిట్టచివరిదీ, అతి ఘోరమైనదీ హత్యాకాండకు ఉద్యమించడం. ఈ దుష్టవిధానాన్ని ఆ పార్టీ అనుసరించిన ఘట్టంలో అది ఇంతింతనరాని ప్రజానిందకు లోనైంది. ఇంత ఘోరమైన తప్పిదాన్ని చేసినపిమ్మట కమ్యూనిస్టు పార్టీ ఈ ఎన్నికలలో సోదెలోకైనా రాకుండా పోవలసింది. కాని ప్రతిపక్షులు చేసిన తప్పిదాన్ని తనకు అనుకూలంగా మార్చుకోగల రాజకీయవిజ్ఞతను కాంగ్రెసు చూపలేక పోయినందున, కలగవలసిన ప్రయోజనం దానికి కలగకపోగా, నష్టం ఎదురైంది.

"కాంగ్రెసుకే మీ వోటు" అని ప్రచారం చేయడానికి తూర్పు కృష్ణాజిల్లాలో కొన్ని గ్రామాలకు వెళ్ళినప్పుడు "వోటు వేస్తాము. కాని, గుడ్డలు కట్టుకువచ్చి వెయ్యమంటారా, లేక, విడిచివచ్చి వెయ్యమంటారా?" అని గ్రామస్థులు వేసిన ప్రశ్నలద్వారా ఈ నష్టమేమిటో తెలుస్తుంది. అతి బాధాకరమైన విషయమైనందున దీన్ని గురించి ఇంతకంటె నేడు మేము వ్రాయగోరడం లేదు. శాంతిభద్రతల పరిరక్షణకై తగు తీవ్రమైన చర్యలను గైకొనలేని ప్రభుత్వం ప్రభుత్వమే కాదు. కాని, శాంతి భద్రతల పరిరక్షణపేర విచక్షణా రహితమైన నిర్బంధాలకు నేరస్థులతోపాటు అమాయకులను సయితం గురిచేయడం పాడికాదు. కమ్యూనిస్టు దౌర్జన్యాల ప్రతిఘటనలో ఇంతే జరిగింది. కనుకనే వారు చేసిన తప్పులు పూర్తిగా మరుగునపడిపోయి, కాంగ్రెసు నిందపాలు కావలసివచ్చింది.

ఏమైనా, మేము ఈ శీర్షికలోని తొలి సంపాదకీయంలోనే చెప్పినట్లు, కాంగ్రెసుకు వ్యతిరేకంగా వోటుచేసినవారు కమ్యూనిజంపై అభిమానంకొద్దీ ఆ పని చేయలేదు; కాంగ్రెసుపై తాత్కాలికంగా కలిగిన అసంతృప్తివల్లనే ఆగ్రహంవల్లనే. వీటిని తొలగించగలిగితే, తిరిగి ఎన్నికలు వచ్చే నాటికి కాంగ్రెసు పతాకచ్ఛాయకిందికి ప్రజాబాహుళ్యం మరల చేరుతుంది.

పూర్తి ప్రజా విశ్వాసానికి పూర్వంవలెనే పాత్రం కావడానికి కాంగ్రెసు అవలంబించదగు సమగ్రకార్యక్రమాన్ని సూచించడం సులభంకాదు గాని, ఇకముందు కాంగ్రెసు ఏ దిక్కుగా నడవాలో స్థూలంగా నిర్దేశించవచ్చు.

సిద్ధాంతాలపై విభేదాలు లేకపోయినా, అన్యకారణాలవల్ల కాంగ్రెసు సంస్థ నుంచి ఇటీవల వైదొలగినవారి నందరినీ తిరిగి కూడగట్టుకొని రావడానికి గట్టి ప్రయత్నం జరగాలి.

తాము కాంగ్రెసుకు చెందివుండికూడా ఈ ఎన్నికలలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కాంగ్రెసుకు వ్యతిరేకంగా ప్రచారం చేసినవారి నందరినీ సంస్థ నుంచి చెదపురుగులవలె ఏరివెయ్యాలి. కాంగ్రెసులో తమ కున్న పలుకుబడిని ధనార్జననిమిత్తం దుర్వినియోగం చేసినవారిని వెలివెయ్యాలి. కాంగ్రెసువాదులు - ముఖ్యంగా కార్యకర్తలు - పర్మిట్లు, కోటాలు వగైరాలను పుచ్చుకొనడాన్ని నిషేధించాలి. బంధుమిత్రుల పేరు ఈ పని చాటుమాటుగా జరుగకుండా తగు జాగ్రత్తలను తీసుకోవాలి. రాజకీయ రంగంలోనివారు నీతిపరులు కావడం మాత్రమే చాలదని, నీతిపరులని ప్రజలు చెప్పుకోగల స్థితిలో మెలగాలని గుర్తుపెట్టుకోవాలి.

రాజకీయబాధితులుగా భూములను పుచ్చుకొన్న కాంగ్రెసు వాదులలో కూడు, గుడ్డలకు లోపంలేనివా రందరు ఆ భూములను విడిచిపెట్టాలి. ప్రజల కష్టనిష్ఠురాలలో కాంగ్రెసువారు భాగంపంచుకోవాలి. తాము పతితజనోద్ధరణ చేస్తున్నామన్న మనస్తత్వం పోవాలి; దాని స్థానంలో వాస్తవమైన సౌభ్రాత్రం నెలకొనాలి.

ఆదర్శాలకై అగ్రులను జాచే యువతీయువకులను కాంగ్రెసు సంస్థలోకి ఆకర్షించగలగాలి. ఈనాటి కాంగ్రెసు సభ్యులలో నూటికి ఇద్దరు ముగ్గురు చొప్పునైనా పాతిక సంవత్సరాలలోపు వయస్సువారు లేకపోవడంలో కాంగ్రెసు సంస్థకున్న ఘోరప్రమాదాన్ని ఇప్పటికైనా తెలుసుకొనాలి. "శ్రేయోరాజ్యం" లక్ష్యాన్ని మన రాజ్యాంగవిధానం పుటలకు పరిమితం చేయక, దాని అవతరణకు అనవరతకృషి ప్రభుత్వంద్వారానే కాకుండా, కాంగ్రెసు సంస్థద్వారా కూడా జరపాలి. ఇవన్నీ జరగకపోతే ఎన్నికల పాఠాలను కాంగ్రెసు నేర్చుకొననట్టే!! (8-2-1952)

5

కాంగ్రెసువలె తక్కిన పార్టీలుకూడా అన్ని అసెంబ్లీ సీట్లకు పోటీ చేస్తే, వాటి గెలుపును గురించిన సగటు అంచనాలు ఇప్పటి వాటికంటే తక్కువై ఉండేవి. ఉదాహరణకు, కమ్యూనిస్టు పార్టీనే చూడండి. చెన్నపురి మినహాగా తక్కిన తెలుగు ప్రాంతాలలో కాంగ్రెసువలె కమ్యూనిస్టు పార్టీ కూడా మొత్తం 140 స్థానాలు అభ్యర్థులను పెట్టివుంటే, ఇప్పటి 39తో పాటు మరొక 39 స్థానాలకు దానికి లభించేవని ఒక వేళ అనుకొన్నా, దాని గెలుపు మొత్తంలో నూటికి 56 వంతుల లోపు మాత్రమే అయివుండేది. కాని, అది 61 స్థానాలకు మాత్రమే పోటీచేయడంవల్ల దాని గెలుపు సగటు అంచనా నూటికి యించు మించు 66 వంతులుగా కనబడుతున్నది.

కొన్ని స్థానాలకే పోటీ చెయ్యడం వల్ల గెలుపు సగటు అంచనా పెద్దదిగా కనబడగల అవకాశం పైన చూపిన విధంగా ఉన్నప్పటికీ, కిసాన్ మద్దూర్ ప్రజాపార్టీ, కృషికార్ లోక్పార్టీల గెలుపు సగటు అంచనాలు కాంగ్రెసు దానికంటే తక్కువైనవే.

ఎన్నికల పాఠాలు - 6

ప్రజాపార్టీ 78 స్థానాలకు మాత్రమే అభ్యర్థులను నిలిపింది. వీరిలో గెలిచినవారు 20 మంది. దాని తాత్పర్యం ఈ పార్టీ గెలుపు నూటికి దాదాపు 26 వంతులు మాత్రమే అని. ఇక కృషికార్ లోక్ పార్టీ 58 స్థానాలకు పోటీచేసి, 15 చోట్ల మాత్రమే గెలిచింది. ఈ గెలుపు కూడా ఇంచుమించుగా నూటికి 26 వంతులే.

కాంగ్రెసుకు సంబంధించినంతవరకు ఈ అంచనా నూటికి 30 వంతులు కాబట్టి, కాంగ్రెసుతో పోల్చినపుడు ఈ రెండు పార్టీలు దానికంటే కూడా తక్కువ విజయాన్నే సాధించగలిగినవని చెప్పవలసి వుంటుంది.

ఈ మాట చెప్పినట్టే మరొకదాన్ని కూడా చెప్పవచ్చు. కాంగ్రెసువారు గాను, మాజీ కాంగ్రెసువారుగాను కాకుండా, ఏకోన్ముఖులై వీరందరు ప్రజా సమ్ముఖంలో నిలబడివుంటే మాత్రం కేవలం నూటికి 30 వంతులు, లేదా 26 వంతులు గెలుపును కాక, ఇందుకు తేలికగా రెట్టింపునైనా వీరు పొందగలిగి ఉండేవారే.

ఏ కారణాలవల్లనైతేనేమి, పోయిన అయిదు సంవత్సరాలలో ఆంధ్ర కాంగ్రెసువాదులలో వచ్చిన విభేదాల వల్ల కాంగ్రెసువలె కాంగ్రెసు నుంచి చీలిన వారు కూడా నష్టపడినట్టు ఈ అంచనాలనుబట్టి అనుకోవచ్చు.

పోయిన అయిదేండ్లలో వచ్చిన ఈ చీలికలకు విధానాలలోని వైరుధ్యం కాక, మనస్తత్వాలలోని వైరుధ్యమే ప్రధాన కారణం కాబట్టి, కొంత చిత్తశుద్ధిని, ఔదార్యాన్ని పరస్పరం ప్రదర్శించుకొనగలిగితే కాంగ్రెసు, మాజీ కాంగ్రెసు వాదులమధ్య విభేదాలను తొలగించుకోడానికి ఇప్పటికైనా అవకాశం కలదేమో!

ఈవాటి ఎన్నికల ఫలితాలవల్ల మరొక విషయంకూడా స్పష్టపడుతున్నది. అది స్వతంత్రులకు సంబంధించినట్టిది.

మద్రాసు అసెంబ్లీలో నేడు స్వతంత్రుల సంఖ్య 63. కాంగ్రెసువారి సంఖ్య తర్వాత ఇదే పెద్దది కాబట్టి, ఇది ఘనమైనదిగానే కనబడవచ్చు. కాని, రాష్ట్రం మొత్తంపై స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికలలో పోటీచేసినవారు 304 మంది. వీరిలో గెలిచినవారు 63 మంది. దీన్నిబట్టి వీరి గెలుపు నూటికి 21 వంతులు మాత్రం. రాష్ట్రం మొత్తానికి కాక ఆంధ్రప్రాంతాలకు మాత్రమే అంచనా కడితే, స్వతంత్రుల విజయం నూటికి 16 వంతులే.

స్వతంత్రులుగా నిలిచినవారిలో కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరుల సంఖ్య స్వల్పమైంది కాదు. ఇప్పటి 63 మంది స్వతంత్రులలో పదిహేడుగురు తమ వారే అని కమ్యూనిస్టు వర్గాలవారు పేర్కొంటున్నారు. ఈ పదిహేడుగురిని కూడా తగ్గిస్తే, రాష్ట్రం మొత్తం మీద స్వతంత్రులుగా గెలిచినవారు నూటికి 21 వంతులమంది కాక, 16 వంతుల మంది మాత్రమే. ఇంతే కాదు. ధరావత్తులు పోయినవారిలో స్వతంత్ర అభ్యర్థులసంఖ్యే హెచ్చు.

దీన్ని బట్టి స్వతంత్రంగా నిలబడేవారికి ఎన్నికలలో అవకాశం తక్కువని విదితమౌతున్నది. దీనికితోడు ఏదో ఒక పార్టీకి తగినంత పెద్ద మెజారిటీ రానిపక్షంలో సుస్థిర ప్రభుత్వస్థాపన సమస్య క్లిష్టతరం కాగలదని కూడా ఈనాడు మనకు ప్రత్యక్షంగా కనబడుతూనే ఉన్నది. ఇది కూడా ఈ ఎన్నికల ఫలితాలనుంచి మనం నేర్చుకోవలసిన ఒక ముఖ్య గుణపాఠమే. (9-2-1952)

7

చచ్చు లేకుండా కుండ బద్దలు గొట్టినట్టు - నడివీధిలో నిలబెట్టి తెలుగునాడు మొన్నటి ఎన్నికలలో ఒకమాట చెప్పింది.

ఏ సందేహాలకు తావులేకుండా - ఎట్టి సంకోచాలకు ఆస్కారాన్ని మిగల్చకుండా- అప్పీలుకు వెళ్ళడానికి రవ్వంతైనా అవకాశమివ్వకుండా - ఆంధ్ర దేశం మొన్నటి ఎన్నికలలో ఒక తీర్పు నిచ్చింది.

- ఈ మాట, లేదా ఈ తీర్పు - ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు నాయకత్వంలో తనకు అణుమాత్రమైనా విశ్వాసంలేదని.

చేపల వేటకు బయల్దేరిన “అనగనగ... ఒక రాజు” కొడుకులవలె ఆంధ్ర పార్లమెంటరీబోర్డులో ఏడుగురు సభ్యు లుంటే, వారు వెళ్ళిన ఏడు రేవులలో చివరికి చితుకుచేపకూడా వారికి చిక్కలేదు.

"ఎన్నికలు ఒక గాలిపాటు ఏ క్షణానికి ఏ దిక్కుకు అది మళ్ళుతుందో, ఎన్ని సుళ్ళు తిరుగుతుందో" అని ఈ ఫలితాన్ని చులకనచేస్తే, అది ఆత్మవంచన కాగలదు. "వోటు వెర్రివాడి చేతిరాయి" అని పెదవి విరిస్తే అది ప్రజాస్వామ్యానికే ద్రోహం కాగలదు. "ప్రజలు ఏమి తీర్పు చెబితే మనకేమి? మన సంస్థకు మనపట్ల విశ్వాసం నేటికీ ఉన్నదికదా?" అని సరిపెట్టుకొంటే, ప్రజా సంస్థగా కాంగ్రెసుకు మరి మంగళహారతి పాడవచ్చు.

కాంగ్రెసు పుట్టింది ప్రజలకోసమని, పెరిగింది ప్రజలమధ్యనే అని, మన గలిగింది. ప్రజల ప్రేమవిశ్వాసాలకు అది పూర్తిగా పాత్రంకాగలవరకే అని కాంగ్రెసు నాయకులైనవారు ఆంధ్రదేశంలో చాలవరకు మరచిపోబట్టే ప్రజానీకం మధ్యకు వెళ్ళి ఎన్నికలసభలను జరపలేని దుస్థితి కొన్ని తావులలో వారికి పట్టింది. (10-2-1952)

ధన్యవాదాలు

ఇప్పటికి - దీన్ని వ్రాస్తున్నది శుక్రవారం సాయంత్రం మూడున్నర గంటలకు - నేటి పోలింగు పూర్తికాలేదు. అయినా, ఇప్పటివరకు చేరిన వార్తలే చాలు ఈ మూడవ ఘట్టంలో కూడా ఆంధ్ర ప్రజానీకం ప్రజాస్వామ్యానికే పట్టాభిషేకం చేస్తున్నదని నిస్సందేహంగా తీర్మానించు కొనడానికి.

నిజానికి 11వ తేదీని తొలిసారిగా పోలింగు జరిగిననాడే గాంధీయిజం, కమ్యూనిజం సిద్ధాంతాలలో - జాతీయ, విజాతీయ నాయకత్వాలలో - ప్రజాస్వామ్య, నియంతృత్వ వ్యవస్థలలోతాము దేన్ని ఎంచుకొననున్నదీ ఆంధ్రులు స్పష్టంగా సూచించారు. నాటి ఈ సూచననే నేడు ధ్రువపరుస్తున్నారు; దీన్నే ఈ నెల 23వ తేదీన, తిరిగి 27వ తేదీన ధ్రువపరచగలరు కూడా! స్వతంత్ర భారతవర్షపు స్వతంత్ర పౌరులైనందున తమకు ఎట్టి సాంఘిక వ్యవస్థ కావాలో, దాని పరిపాలనా బాధ్యతను ఏ రాజకీయ పక్షానికి అప్పగించాలో స్వేచ్ఛగానే ఆంధ్ర ప్రజలు నిర్ణయిస్తున్నారు. అయినా ఈ ఎన్నికలు స్వేచ్ఛగా జరగడం లేదన్న ఆరోపణలను కమ్యూనిస్టులు ప్రారంభించారు. స్వతంత్ర భారత పౌరులు ఇప్పటికీ బానిసలేనని ఉద్ఘాటించడానికి సంకోచించనివారు, ఎన్నికలలో పాల్గొనడానికి ఓటరులకు స్వేచ్ఛ లేదని వాదించడంలో అబ్బురం లేదు! కాని, ఎన్నికలలో "మొదటి అంచనాలకన్నా ఎక్కువ సీట్లు వస్తాయి" అని ఒకవైపున ఉదోషిస్తూనే, మరొకవైపున "ఓటర్లను స్వేచ్ఛగా ఓటు చేసుకోకుండా నిర్బంధిస్తున్నారనే దృష్ట్యా స్వేచ్ఛలేదనే భావిస్తున్నా"మనీ, "ఎక్కడైతే మాకు నిర్మాణబలం లేదో అక్కడ పోలీసు అధికారులు పక్షపాతంగా వ్యవహరించటమే కాకుండా భూస్వాములతో లాలూచి అయ్యా"రనీ, వాదించడాన్ని బట్టి, తథ్యమైపోయిన తమ పరాజయానికి ఇప్పటి నుంచీ కమ్యూనిస్టు నాయకులు సాకులను ఆలోచిస్తున్నారనడం సువిదితమే!

ఈ సందర్భంలో గమనించదగు ముఖ్య విషయం మరొకటి ఉన్నది. "ప్రభుత్వం నిష్పక్షపాతంగా ప్రవర్తిస్తుందని మమ్ము నమ్మమంటున్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ప్రభుత్వంలో ఉన్నది కాంగ్రెసు పార్టీ. ఆ పార్టీ ఆధ్వర్యంలో పరిపాలనా యంత్రం పనిచేస్తుంది. ఆ పార్టీ నేడు ఎన్నికలలో పాల్గొంటూంది. కాగా, ఆ పరిపాలనాయంత్రం నిష్పక్షపాతంగా ఉంటుందని మేము ఎలా నమ్మగలం?" అని కమ్యూనిస్టు పార్టీ వారు ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. పరిపాలనా యంత్రం నిష్పక్షపాతంగా ఉండడం దాని స్వభావానికే విరుద్ధమని ఇంత గట్టిగా నమ్మినవారు ఎన్నికల ద్వారా రాజ్యాధికారాన్ని చేపట్టగలమనే విశ్వాసంతో ఎన్నికల రంగంలోకి ఎలా దిగినారో! దీన్నిమించి, తమ వాదం ప్రకారం నిష్పాక్షికంగా జరగడానికే వీలులేని ఎన్నికల ద్వారా తామే కర్నూలు కోటలో పాగా వేయనున్నామని ఎలా ప్రకటించ గలుగుతున్నారో! ఏమైనా, గెలుపు ఎవరిదో తెలిసిపోవడానికి మరెంతో వ్యవధి లేదు. ఇంకొక పదిరోజుల

నాటికే ఎన్నికల ఫలితాల ప్రకటన ప్రారంభమౌతుంది. వెంటనే వోట్ల లెక్కింపు కావాలని కమ్యూనిస్టులు కోరుతున్నారు కాబట్టి, 23వ తేదీని తిరిగి పోలింగు ప్రారంభం కాగల లోగా కొన్ని నియోజక వర్గాలలోనైనా లెక్కింపుకు వీలుంటే, ఈలోపుగానే కొన్ని ఫలితాలను ప్రకటించవచ్చు. మిగిలిన ఎన్నికల కార్యక్రమానికి విఘాతం కలగని పక్షంలో ఇందుకు తగు ఏర్పాటులను ఎన్నికోద్యోగులు తప్పక చేయాలని మేము మరొకసారి కోరుతున్నాం.

ఈ సంపాదకీయాన్ని ప్రారంభించిన తర్వాత ప్రజాస్వామ్య పక్షాల విజయపరంపరను గురించి మరికొన్ని వార్తలు చేరాయి. నియంతృత్వానికి విరుద్ధంగా ఇంత నిర్ద్వంద్వంగా తీర్పు చెబుతున్న ఆంధ్ర సోదర సోదరీమణులకు మా ధన్యవాదాలు.

(ఆంధ్రప్రభ 2-12-1955)

ధన్యవాదాలు

విజయ దుందుభి

(1955లో రాష్ట్ర శాసన సభలో కాంగ్రెస్ వారు సాధించిన విజయ పరంపరకు విశ్లేషణ. వివిధ దశలో జరిగిన ఎన్నికల విజయాలు. మూడు సంపాదకీయాలు,)

మాకు తెలుసు, - ఆంధ్రులు విజ్ఞులని, విదేశాల నుంచి దిగుమతి చేయబడిన నినాదాలకు మోసపోరని!

మాకు తెలుసు, - ఆంధ్రులు దేశభక్తులనీ, గాంధీజీ, నెహ్రూల సమేతంగా దేశనాయకుల నందరినీ నిందించే వారిని క్షమించబోరని!

మాకు తెలుసు - ఆంధ్రులు ప్రజాస్వామ్యాభిమానులనీ, నియంతృత్వ సంస్థాపనే లక్ష్యంగా గల వారిని పరాభూతులను చేయగలరనీ!

మాకు తెలుసు - ఆంధ్రులు పౌరుషవంతులనీ, నిన్న దివి సీమలో జరిగిన దౌర్జన్య కాండను పోలిన దాని ద్వారా తమ వోటును సంపాదించగల మనుకొన్న వారికి జన్మ జన్మాలకు మరపురాని గుణపాఠం నేర్పగలరని!

- ఈ అన్ని విషయాలలో ఆంధ్రజాతి ఎంత విశిష్టమైనదో అప్పుడే నిరూపణ ప్రారంభమైంది. మేము ఈ సంపాదకీయాన్ని వ్రాస్తున్నది శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల తర్వాత. ఇప్పటికి వివిధ నియోజకవర్గాలనుంచి చేరిన వార్తలనుబట్టే దేశ భక్తికే జాతీయతకే - ప్రజాస్వామ్యానికే అన్ని నియోజక వర్గాలలోను అఖండ విజయం తప్పదని నమ్మడానికి వీలున్నది. మధ్యాహ్నం పన్నెండు గంటలకే మొత్తం వోటర్లలో నూటికి 50 వంతులు మొదలు 55 వంతుల వరకు వోటర్లు తమ వోట్లను నమోదు చేశారట. ఇతరులకంటె మిన్నగా మధ్యమ తరగతివారు - ముఖ్యంగా ఆ తరగతి వారిలో మహిళామణులు - మహోత్సాహంతో పోలింగులో పాల్గొన్నారట. ప్రజాస్వామ్య సైనికులవలె తమంతట తాముగా బారులు తీరి నిలబడి, క్రమశిక్షణతో వోటు చేస్తున్నారట.

కాగా, ప్రస్తుతానికి చేరిన వార్తల సరళి ఇది : "ఇక్కడ పోటీ చేస్తున్న కమ్యూనిస్టు సెంట్రల్ కమిటీ సభ్యునికి పరాజయం తప్పదు" అని ఒక నియోజక వర్గం నుంచి వార్త. "మధ్యాహ్నం నుంచి పోలుకాగల వోట్లన్నీ కమ్యూనిస్టు పార్టీకే పడినప్పటికీ, ప్రజాస్వామ్య పక్షాల

అభ్యర్థికి విజయం ముమ్మాటికీ తథ్యం" అని మరొక నియోజకవర్గం నుంచి వార్త. "ఇక్కడి కమ్యూనిస్టు అభ్యర్థి సోదెలోకైనా రాబోడు" అని వేరొక చోట నుంచి వార్త! "ఇక్కడి కమ్యూనిస్టు నాయకునిపై డెమొక్రాటిక్ నాయకునిపై డెమొక్రాటిక్ ఫ్రంట్ అభ్యర్థికి కనీసం 20 వేల మెజారిటీ రాగలదు" అని ఈ క్షణంలో చేరిన ఇంకొక వార్త తెలుపుతున్నది.

ప్రజాస్వామ్య విజయ దుందుభి భూనభోంతరాళాలు దద్దరిల్లేటట్టు అప్పుడే మ్రోగడం ప్రారంభించిందని ఈ వార్తలను బట్టి సుస్పష్టమే! ఇందుకు ప్రజాస్వామ్య సైనికునిగా తనను భావించుకున్న ప్రతి వోటరుకు మేము మా ధన్యవాదాలర్పిస్తున్నాము. ఐతే, ప్రజాస్వామ్యం పక్షాన సాగుతున్న ఈ "ఎన్నికల యుద్ధం"లో ఇది తొలిరోజు మాత్రం. మరి నాలుగుసార్లు దీనిలో పాల్గొన వలసి ఉన్నది; నేడు సాధించిన విజయాన్ని మించిన వాటిని సంపాదించి, "భళిరా!" అని అఖిలభారతం చేతనే కాక, స్వాతంత్ర్య ప్రియమైన సమస్య ప్రపంచంచేత అనిపించుకోవలసి ఉన్నది.

ఇప్పుడు ఆంధ్ర జాతి పెట్టుకోవలసిన లక్ష్యం - ప్రజాస్వామ్యానికి ఎంతో కొంత మెజారిటీ కాదు; పూర్తి మెజారిటీ; ప్రజాస్వామ్యాన్ని తెలుగు గడ్డపై కమ్యూనిజం తిరిగి ఎన్నటికీ సవాల్ చేయలేని మెజారిటీ!

ఇట్టి అఖండ విజయం సిద్ధించాలంటే, మున్ముందు ఇతోధికమైన ఉత్సాహాన్ని, పట్టుదలను చూపించాలి. కమ్యూనిస్టు అభ్యర్థుల డిపాజిట్లను గల్లంతు చేయించిన ఘనతకోసం నియోజక వర్గాల మధ్య పోటీ ప్రారంభం కావాలి.

"విజయీభవ! దిగ్విజయీ భవ!"

జోహారులు

(ఆంధ్రప్రభ 2-12-1955)

8

ఆంధ్ర ప్రజ ఎంతో చైతన్యవంతమైంది. కాబట్టే మొన్నటితో ముగిసిన ఎన్నికలలో కొన్ని కొన్ని నియోజక వర్గాలలో నూటికి 80 వంతుల వరకు కూడా వోట్లు పోలైనవి.

ఆంధ్రజాతి ఎంతో జిజ్ఞాస కలిగినట్టిది. అందువల్లనే ఈ ఎన్నికలలో పోటీ విరుద్ధ సిద్ధాంతాల మధ్యకాని, విభిన్న వ్యక్తుల మధ్య కాదని గుర్తించింది. కొందరు అభ్యర్థులపట్ల తనకు వైముఖ్యం వున్నా, దాన్ని సైతం పాటించక, సిద్ధాంతాలపైనే తీర్పు నివ్వడానికి ముందుకు వచ్చింది. ఆంధ్రుడు స్వాతంత్ర్య ప్రియుడు. కనుకనే నియంతృత్వ శక్తులు ప్రజాస్వామ్యాన్ని సవాలు చేయడం తనను సవాలు చేయడంగానే భావించి, ఆ దుష్ట శక్తులను నిర్జించడానికి సమధికోత్సాహంతో రంగంలో నిలిచాడు.

జాతీయాభిమానంలో ఆంధ్రునికి ఆంధ్రుడే సాటి. ఈ కారణానే స్వదేశాన్ని, దాని నాయకులను నిరసిస్తూ, విదేశాలకు, వాటి అధినేతలకు నివ్వాళిపట్టేవారి పరాజయ సాధనమే తన విద్యుక్త ధర్మంగా అతడు ఎంచుకొన్నాడు.

ఆంధ్రజాతిలోని ప్రతి సుగుణానికి, ప్రతి విశిష్టతకు పరాకాష్ఠగా జోహారు లర్పించదగినట్టిది - ఆంధ్ర నారీమణి. అంచేతనే తెలుగు గడ్డపై ఉదాత్తతను, కారుణ్యాన్ని, సహనాన్ని, సామరస్యాన్ని, అహింసను, విశ్వజనీనతను - ఒక్కమాటలో, మానవతను - చెక్కుచెదరకుండా కాపాడ్డానికి జరిగిన కృషిలో ఆమెదే ముందంజ.

"అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ" అనేది తెలుగునాడుకు వర్తించినంతగా మరే రాష్ట్రానికీ వర్తించదేమో! కాకపోతే, బాలబాలికలు సైతం ఈ ఎన్నికలలో వీరోచితమైన పాత్రను నిర్వహించి ఉండేవారా?

ఇవి అతిశయోక్తులు కావనే నిరూపణకు మరెంతో కాలం వేచివుండ నక్కరలేదు. మరికొన్ని గంటలలో ఎన్నికల ఫలితాల ప్రకటన ప్రారంభం కాగలదు. దానితోపాటే ప్రజాస్వామ్య విజయ దుందుభుల మేఘగర్జన ప్రారంభం కాగలదు కూడా!

(ఆంధ్రప్రభ 1-3-1955)

పౌరుల విధి

తమలో పెక్కుమందికి చదువు సంధ్యలు లేవు; ఏ పూట పని మానుకొంటే, ఆ పూట తమ పొయ్యిలోనుంచి పిల్లి లేవదు. అయినా "లోకసభకు ఎవరు ఎన్నికైతే మన కేమి?" అనుకోకుండా మొదటిరోజు పోలింగ్ నూటికి యాభైమందికి పైగా వోటర్లు పాల్గొన్నారు. కొన్ని చోట్ల నూటికి 85 మంది కూడా పాల్గొన్నారు. పోటీ చేస్తున్న వారిలో తమకు నచ్చినవారు, తాము చేయెత్తి నమస్కారం పెట్టదగువారు తమ నియోజకవర్గంలో మచ్చుకైనా లేరన్న నమ్మకంవల్లనే, లేదా పోలింగ్ స్టేషన్కు వెళ్లడానికి ఏవో ఇబ్బందులు, సబ్బందులు కలిగినందువల్లనే తక్కినవారు తమ వోటింగ్ హక్కును వినియోగించుకొన లేదని అనుకోవడం పొరపాటు కాదేమో!

ఏమైనా, మొదటి రోజు పోలింగ్ లో నూటికి 50 మొదలు 85 వంతుల వరకు వోటర్లు పాల్గొనడం గొప్ప విశేషమే! బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీ, అమెరికా వంటి దేశాలలో సయితం నూటికి నూరుపాళ్లు వోటుచేయరు. అయితే, నిన్నటి పోలింగ్ సందర్భంలో కొన్ని చోట్ల

దౌర్జన్యాలు జరగడం, ఇద్దరు చనిపోవడం శోచనీయం. ఎన్నికల సందర్భంలో పట్టుదలలు హెచ్చడం, ఆవేశకావేషాలు పెరగడం సహజమే. ముఖ్యంగా ఇప్పటి ఎన్నికలలో ప్రజాస్వామ్య వ్యవస్థ చావు బ్రతుకులను తేల్చనున్న ఎన్నికలలో - అవి మరింత సహజం. అయినా, దౌర్జన్యాలవరకు, హత్యలవరకు, వాటిని పోనివ్వడం విజ్ఞత కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థకే ఒక పెద్ద మచ్చ, ఒక గట్టి దెబ్బ. మన అది మన

మొదటి రోజు పోలింగ్ ముగిసీముగియక ముందే కొందరు రాజకీయ ప్రముఖులు "గెలుపు మాదే!" అనే ధోరణిలో ప్రకటనలు చేశారు. బుకాయింపు తెలియనివారికి ఏనాటి రాజకీయాలలోనైనా స్థానం లేదు; ఈనాటి రాజకీయాలలో బుకాయింపుతోపాటు బొల్లులు, మాయలు, మోసాలు, తలల మార్పిడులు వగైరాలు అవసరమన్నట్టు కనబడుతున్నది. అందువల్ల, ఓడిపోతున్నట్టు తెలిసినా, “గెలుపు మాదే!” అని వారు చెప్పరా? గట్టిగా ఆ మాట చెప్పకపోతే, బల్లగుద్ది ఆ మాట చెప్పకపోతే, ఈనాటి పాటిగానైనా రేపు తమకు వోట్లుపడక పోవచ్చునని వారికి తెలియదా? కాబట్టి ఈ విధమైన ప్రకటనలకు, ప్రగల్భాలకు ప్రజలు ఎంతమాత్రం విలువ నివ్వనక్కరలేదు.

కాగా, తాము చేయవలసింది ఏదో ఒక వ్యక్తిగతమైన, సంకుచితమైన, పాక్షికమైన, తాత్కాలికమైన ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొనక, ప్రజాహితానికి, దేశం భవిష్యత్తుకు ప్రాధాన్యమిచ్చి, అందుకు అనుగుణంగా వోటు చేయడమే! ఇదివరలో జరిగిన ఎన్నికలను పోలినవి కావివి, ఇప్పుడు.

మేము, మా పరాజయం

వోటర్లు చేసే నిర్ణయంపై రానున్న అయిదేళ్ళలో ఎవరు మన దేశాన్ని పాలించనున్నారన్న విషయం మాత్రమే కాక, ఒక ప్రజగా, ఒక జాతిగా మన భవిష్యత్తు ఆధారపడబోతున్నది. చర్చిల్ సామాన్యుడా, డిగోల్ సామాన్యుడా? వారిద్దరూ తమ దేశాలను ఘోరవిపత్కాలంలో రక్షించిన మహానాయకులు. అయినా తమ స్వేచ్ఛకు, స్వాతంత్ర్యానికి, పురోగతికి వారి విధానాలు భంగకరం కాగలవని తోచినంతనే వారికి, వారి పార్టీలకు వ్యతిరేకంగా వోటు చేయడానికి బ్రిటిష్, ఫ్రెంచి పౌరులు అణుమాత్రమైనా సంకోచించలేదు. ఇదే విధమైన విజ్ఞతను ఇప్పుడు మనంకూడా ప్రదర్శించాలి. అప్పుడుగాని మన ప్రజాస్వామ్యం నిలవదు, అప్పుడుగాని మన భవిష్యత్తు పదిలం కాదు.

ఏ ఎన్నికలలోనైనా వ్యక్తులనుకాక, వారి పార్టీలను దృష్టిలో పెట్టుకుని వోటు చేయాలి; వాటి పాత రికార్డును దృష్టిలో పెట్టుకొని వోటు చేయాలి. ఈ ఎన్నికల సందర్భంలో ఇది మరింత ముఖ్యం. నియంతృత్వంవైపు మొగ్గుతున్న పార్టీల అభ్యర్థులలో ఒక్కరిని గెలిపించినా, అది నియంతృత్వానికి ఒక వోటు కాగలదన్న విషయాన్ని మరిచిపోరాదు. (మార్చి 3, 1971)

మేము, మా పరాజయం

(1971లో జరిగిన లోక్సభ ఎన్నికలలో ప్రజలలో ఇందిరా గాంధీపై వ్యతిరేకత ఉంది. కాంగ్రెస్ ఘన విజయాన్ని సాధించింది. తన పరాజయాన్ని నార్ల అంగీకరించారు.) లోకసభ ఎన్నికల ఫలితాల ప్రకటన పూర్తి కాకపోయినా, శ్రీమతి ఇందిరా గాంధి, ఆమె కాంగ్రెసు ఘనవిజయాన్ని - ఘనాతి ఘన విజయాన్ని సాధించినట్టు చెప్పవచ్చు. ఇంత కొద్దిపాటి మినహాయింపులలో ఐనా, ఇందిరా నిష్కర్షగా మరొక మాటకూడా చెప్పవచ్చు. మేము, మాతోపాటు భారతీయపత్రికలు ఘోరపరాజయాన్ని - ఘోరాతిఘోర

పరాజయాన్ని పొందాయి. తక్కిన పత్రికల పక్షాన మాట్లాడ్డానికి మాకు హక్కు లేదు గాని, మామట్టుకు మాకు మే మవలంబించిన సంపాదకీయ విధానానికి ఎంతమాత్రం చింతలేదు. పైపెచ్చు, అందుకు మేము గర్విస్తున్నాము. "గర్వం" దుర్గుణం కాని సందర్భాలు - అది గర్వనీయం కాని సన్నివేశాలు - చాలా కొద్దిగానే ఉంటాయి. అట్టి వాటిలో ఇదొకటి అని మేము నమ్ముతున్నాము. శ్రీమతి ఇందిరా గాంధి, ఆమె కాంగ్రెసు ఇంతగా విజయాన్ని సాధించనున్నట్టు మేము అనుకొనని మాట నిజమే. కాని, పరాజయం చెందనున్నట్టు కూడా భావించలేదు. అయినా, మేము ఆమెను, ఆమె కాంగ్రెసును పూర్తిగా వ్యతిరేకించడం అది మా పరమధర్మమని భావించి నందువల్లనే.

తన అభిప్రాయాలను ప్రజలు త్రోసిపుచ్చవచ్చునని తెలిసినా, కేవలం త్రోసిపుచ్చడమేకాక, కంటగించుకొనగలరని తెలిసినా, తాను ఏది సముచితమని, ఏది న్యాయమని, ఏది ప్రజాక్షేమానికి తోడ్పడగలదని, ఏది దేశవాతానికి ప్రోదిచేయగలదని, ఏది దూరదృష్టితో కూడినదని చిత్తశుద్ధితో హృదయపూర్వకంగా తాను విశ్వసిస్తాడో, దానినే పత్రికా సంపాదకుడైనవాడు సమర్థించాలి. ఇందుకు సంకోచించేవాడు, ఇందుకు భయపడేవాడు, పత్రికా సంపాదకుడనే పేరుకైనా తగడు.

ఇంతే కాదు, తన ఉద్యోగాన్ని అతడు మలినం చేస్తాడు, దానికి మచ్చ తెస్తాడు. సర్వజ్ఞుడు కాదు కనుక, పత్రికాసంపాదకుడు పొరపాటు వ్యాఖ్యలు చేయవచ్చు. అయితే, అవి దుశ్చింత ప్రేరేపించిన వ్యాఖ్యలు కాకపోతే, వాటికి అతడు సిగ్గు పడనక్కరలేదు. పత్రికా సంపాదకుడు మానవాతీతుడు కాదు కాబట్టి, అతడి వ్రాతలలో రాగవిద్వేషాలు ఉండవచ్చు. కాని, అవి స్వప్రయోజనం ప్రేరేపించిన వ్రాతలు కాకపోతే, వాటికి అతడు లజ్జపడ నక్కరలేదు. లాభదాయకమైనదిగా తోచిన పక్షంవైపు మొగ్గే వ్యక్తి అవకాశవాది కావచ్చుగాని, పత్రికా సంపాదకుడు కాడు. విజయం పొందుతున్న పక్షంలో చేరే వ్యక్తి రాజకీయవాది కావచ్చుగాని, పత్రికాసంపాదకుడు కాడు. పాఠకుల మెప్పును మాత్రమే కోరేవాడు చౌకబారు నవలారచయిత కావచ్చుగాని, పత్రికా సంపాదకుడు కాడు.

ఈ విలువలను పూర్తిగా పాటించడం కష్టం కావచ్చు; ఈ ప్రమాణాలను పూర్తిగా అందుకొనడం కష్టతరం కావచ్చు. అయినా, ప్రయత్నం ఉండాలి; ఆ ప్రయత్నం దీక్షాయుతమైనది కావాలి; ధర్మాభినివేశంతో కూడినది కావాలి.

కేవలం భుక్తికోసం కాక, వ్యక్తిగత ప్రాబల్య ప్రాభవాల కోసం కాక, కొన్ని విలువలకోసం, ఆ విలువల ద్వారా జీవిత సాఫల్యం కోసం పత్రికా సంపాదకత్వాన్ని చేపట్టినవారికి ఒక సి.పి.స్కాట్, ఒక హెచ్.డబ్లియు. మ్యాసింగ్హ్యామ్ చూపించిన కర్తవ్యపథమిదే.

1899-1902 నాటి బోయర్ యుద్ధ సందర్భంలో బ్రిటీష్ ప్రభుత్వాన్ని అది అధర్మ యుద్ధంలో దిగిందని తీవ్రంగా విమర్శించినందుకు తన "మాంచెస్టర్ గార్డియన్" పత్రికను పెక్కుమంది బహిష్కరించినా, తాను బోయర్ నాయకుడు కూగర్ నుంచి లంచం పుచ్చుకుంటున్నట్టు వ్యంగ్య చిత్రాన్ని ప్రచురించడం వరకు తన ప్రతికక్షులలో కొందరు వెళ్ళినా, స్కాట్ చలించలేదు. ఇదే యుద్ధ సందర్భంలో మ్యాసింగ్ హ్యామ్ "మార్నింగ్ న్యూస్" పత్రికా సంపాదకత్వానికి రాజీనామా పెట్టాడు తప్ప, ఆ పత్రికాధిపతుల అభిమతం ప్రకారం తాను అధర్మయుద్ధమని నమ్మినదాన్ని సమర్థించలేదు.

మన దేశంలోనైనా ఉత్తమశ్రేణి పత్రికా సంపాదకులు రాజా రామమోహన్ రాయ్ మొదలుకొని, రామానంద ఛటర్జీ వరకు ఇంతకు తక్కువ స్థాయిలో వ్యవహరించలేదు. వారి స్థాయిని

ఎంతమాత్రం క్షంతవ్యం కాదు. నేడు ఈ విషయాలన్నింటిని మేము పేర్కొనడం ఈ ఎన్నికల సందర్భంలో తక్కిన పత్రికలు పెక్కింటితో పాటు మేము ఘోరాతిఘోర పరాజయాన్ని చెందినా, అందుకు మేము అణుమాత్రమైనా చింతించడం లేదని నొక్కి చెప్పడం కోసమే. ఇంతేకాదు, ఇవే పరిస్థితులలో ఇదే విధంగా బహుళ ప్రజాభిప్రాయానికి భిన్నంగా వెళ్ళడానికి మేము సంకోచించబోము.

అందుకొనడం ఎంత కష్టమైనా, అందుకు ప్రయత్నలోపం.

ఎన్నికల ఫలితాలను పురస్కరించుకుని శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వం పట్ల మాకున్న భయ సందేహ వైఖరిని మార్చుకోలేము. ఆమెను ఈనాడు మేము అభినందించబోము కూడా. తాననుసరించగోరిన సద్విధానాలను, సర్వోత్తమ పథకాలను తమ సహచరులలోనే కొందరు వ్యతిరేకిస్తూ వచ్చినందున తాను సమర్థంగా వ్యవహరించలేక పోయానని ఆమె ఇంతవరకు చెబుతూ వచ్చారు. అట్టి ప్రతిబంధకాలు ఆమెకు మరి ఉండబోవు. ఈ కొత్త పరిస్థితిలో ఆమె తన పరిపాలనా సామర్థ్యాన్ని నిరూపించుకోవాలి; తన పథకాలు ప్రాథమిక స్వత్వాలకు, ఇతర స్వేచ్ఛలకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు భంగం కలిగించవని రుజువుచేయాలి; దేశాన్ని, ప్రజలను తాను ముందుకు తీసుకువెడుతున్నట్టు నమ్మకం కలిగించాలి. ఆనాడు మేము ఆమెను చిత్తశుద్ధితో అభినందించడమే కాక, మాకు చేతనైన సర్వవిధాల ఆమెను, ఆమె ప్రభుత్వాన్ని పూర్తిగా సమర్థిస్తాము. (ఆంధ్రజ్యోతి 12-3-1971)

ఓటర్ల కర్తవ్యం

రేపులేదు, ఎల్లుండే పోలింగ్ ప్రారంభం. నాడు కొన్ని కోట్లమంది తమ ప్రాథమిక స్వత్వాలలో అతి ముఖ్యమైనదాన్ని - తమ వోటింగ్ హక్కును స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా వినియోగించు కుంటారు.

తిరుగులేనిది వారి నిర్ణయం. అదే మరి ఐదేళ్ళవరకు రాష్ట్రాలలో, కేంద్రంలో భావి ప్రభుత్వ స్వరూప స్వభావాలను నిర్ణయిస్తుంది. అదే మరి ఐదేళ్ళవరకు మన జాతీయ, అంతర్జాతీయ విధానాలను నిర్ణయిస్తుంది. అదే మరి ఐదేళ్ళవరకు మన దేశం యోగక్షేమాలను నిర్ణయిస్తుంది.

ఇంత కీలకమైన నిర్ణయాన్ని తాము చేయనున్నందున రాగవిద్వేష రహితంగా దాన్ని చేయాలి. ప్రశాంతి, గాంభీర్యాలతో దాన్ని చేయాలి. విజ్ఞాన వివేకాలతో దాన్ని చేయాలి. ఈ విషయంలో కులతత్త్వాలకు, మత విద్వేషాలకు, ప్రాంతీయాభిమానాలకు, అన్య సంకుచిత భావాలకు లేదా స్వార్థచింతలకు - వీటిలో దేనికి లొంగిపోయినా అది తమకేకాక, తమ దేశానికే కీడు, తమకేకాక తమ సంతానానికి కూడా కీడు.

జాతీయ స్వాతంత్ర్య సాధన తర్వాత ఎన్నడు లేనంత క్లిష్ట పరిస్థితులలో ఈనాడు మన దేశం ఉన్నది. ఒక వైపున ఆహార సమస్య. ఇంకొక వైపు ఆర్థిక సంక్షోభం, ఒక ప్రక్క అన్ని వర్గాలలో అవినీతి, మరొక ప్రక్క అన్ని ప్రాంతాలలో అరాజక పరిస్థితి. ఒక చెంప పెరుగుతున్న జన సంఖ్య, మరొక చెంప తరగని దారిద్ర్యం. ఒక దిశలో పాకిస్తాన్ నుంచి ప్రమాదం, మరొక దిశలో చైనా నుంచి మహోపద్రవం. ఒక్కసారిగా ఇన్ని వైపుల నుంచి, ఇన్ని క్లిష్ట సమస్యలు ఒకే సమయంలో మనలను చుట్టుముట్టిన ఘట్టం పోయిన రెండు దశాబ్దాలలో ఎన్నడు లేదు. లేదు, ముమ్మాటికీ లేదు.

ఇందువల్ల ప్రస్తుతం వోటరుల తాజా నిర్ణయం సత్ప్రభావమైనా, దుష్ప్రభావమైనా తరతరాలకు విస్తరిస్తుంది. భిన్న ఘట్టంలో "ఈసారి తప్పు జరిగితే, మరి ఐదేళ్ళ తర్వాత దాన్ని సవరించుకొనడం మన చేతిలో పని!" అని సరిపుచ్చుకొనడానికి కొంత వీలు ఉండేది. ఇప్పుడు నిశ్చయంగా అది లేదు. ఇప్పుడు పొరపాటు జరిగితే, ఎన్నటికీ బహుశా సవరించుకొనడానికి వీలులేని పరిస్థితిలో మనం పడిపోవచ్చు. మనదేశం పడిపోవచ్చు. ఈ ప్రమాదాన్ని ప్రతి ఓటరు గుర్తించాలి; దీన్ని దృష్టిలో పెట్టుకుని తన వోటును వేయాలి.

* * *

"ఈనాడు ఒకేసారిగా ఇన్ని క్లిష్ట సమస్యలు తలయెత్తడానికి నిందించవలసింది. ఇరువదేళ్ళుగా దేశాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ పార్టీనే కాదా?" అనే ప్రశ్న ఎవరికైనా సహజంగానే స్ఫురిస్తుంది. కాస్త నెమ్మదిగా, కొంత ప్రశాంతంగా ఒకింత నిష్పాక్షికంగా ఆలోచన చేస్తే, ఈ ప్రశ్నకు "ఔను" అని సమాధానం చెప్పవలసి వస్తుంది. కాని, దానికి "కొంతవరకు" అని కలపవలసి వస్తుంది కూడా.

తన పరిపాలనా కాలంలో కాంగ్రెసు పార్టీ కొన్ని తప్పులను - పెద్ద తప్పులనే - చేసింది. వాటిలో కొన్ని తెలిసి చేసినవికాగా, మరికొన్ని తెలియక చేసినవి, కొన్ని అనుభవ లోపంవల్ల చేసినవి కాగా, వేరొక కొన్ని బుద్ధితక్కువవల్ల చేసినవి. కొన్ని ప్రభుత్వ యంత్రాంగంలోని లోపాలవల్ల చేసినవి కాగా, మరికొన్ని సమకాలిక సాంఘిక ప్రభావాలవల్ల చేసినవి.

ఐతే, ఈ సందర్భంలో కొన్ని ముఖ్య విషయాలను విస్మరించరాదు. దాదాపు రెండు శతాబ్దాల రాజకీయ దాస్యం తర్వాత మనం స్వాతంత్ర్యాన్ని పొందాము. ఆ పరదాస్యం మన సహజాభివృద్ధికి విఘాతాన్ని కల్పించింది. సమకాలిక ప్రపంచం ప్రగతి నుంచి మనను వేరుచేసింది. మనం బ్రిటీష్ దాస్యంలో పడివున్న కాలంలో యూరప్, అమెరికాలలో రాజకీయ, పారిశ్రామిక, వైజ్ఞానిక, సాంకేతిక విప్లవాలు జరిగాయి. ఈ నాలుగు విప్లవాలు మానవ సంఘాన్ని మార్చాయి. దాని దృక్పథాన్ని మార్చాయి. దాని సమస్యలను మార్చాయి. పదహారవ శతాబ్దికి పూర్వం మరణించిన వ్యక్తి ఈనాడు తిరిగి సజీవుడైతే, ఈ ప్రపంచాన్ని ముఖ్యంగా యూరప్, అమెరికాలను తనకు పరిచితమైన ప్రాంతాలుగా గుర్తించనైనాలేడు! ఇంతగా పాశ్చాత్య దేశాలు మార్పుచెందగా, మనలో మార్పు స్తంభించింది. ఇంతగా అవి ముందుకుపోగా, మనం ఏడువెనకల మిగిలిపోయాము.

ఈ పరిస్థితిలో మన ప్రస్తుత కృషి యూరప్, అమెరికాలకు దాదాపు మూడు వందల సంవత్సరాలలో సాధ్యపడిన పురోభివృద్ధిని ఒకటి రెండు తరాలలో సాధించాలని అయినప్పుడు ఏవో కొన్ని తప్పులు జరగడం, చిక్కులు తలయెత్తడం సహజం కాదా?

* * *

రెండు శతాబ్దాలపాటు పేరుకుపోయిన సమస్యలను రెండు దశాబ్దాలకు ఎవరు పరిష్కరించ గలరు? అందుకు చేసే ప్రయత్నంలో ఎవరు తప్పటడుగులు వేయరు?

పైగా కాంగ్రెసుపార్టీ వారు ఒక విడి తెగకు చెందినవారు కారు. వారుకూడా మన సంఘానికి చెందినవారే. అందువల్ల వ్యక్తిగతంగా వారిలో కానవచ్చే లోపాలు కేవలం వారివి మాత్రమే కావు. అవి సమకాలిక సంఘానికి చెందినవే. ఇందువల్ల వారు అసమర్థులైతే, ఆ లోపాన్ని మన సంఘం కూడా కొంత పంచుకోవాలి; వారు అవినీతిపరులైతే ఆ దోషాన్ని తిరిగి మన సంఘం కొంత పంచుకోవాలి.

ఇవి కాంగ్రెసుపట్ల ప్రత్యేకాభిమానంతో మేము వ్రాస్తున్న పలుకులు కావని గుండెపై చేయి వేసుకున్న పక్షంలో ఎవరైనా అంగీకరించక తప్పదనే మా విశ్వాసం.

* * *

మరొక విషయాన్ని కూడా ఇక్కడ మేము మనవి చేయగోరుతున్నాము. మానవ స్వభావం ఎక్కడైనా, ఎప్పుడైనా ఒక్కటే. వరుసగా రెండు దశాబ్దాలపాటు రాజ్యాధికారంలో ఉన్న వారిలో ఎక్కడైనా, ఎప్పుడైనా నైతిక ప్రమాణాలు తగ్గడం మానవ సహజం.

అయినప్పుడు కాంగ్రెసు పార్టీవారు కాక మరొకరు వరసగా ఇంతకాలం రాజ్యాధికారంలో ఉంటే, వారి నైతిక ప్రమాణాలు దెబ్బతినకుండా మిగిలివుండేవా?

"ఈ మాట నిజమే అందువల్లనే రాజ్యాధికారం వల్ల నైతికంగా దెబ్బతినని పార్టీకి ఈసారి అవకాశ మివ్వాలి" అని ఇప్పుడు చెప్పవచ్చు.

కాని, ఏ ప్రతిపక్షానికి రాజ్యాధికారాన్ని స్వీకరించడానికి ఈనాడు పూర్తి స్తోమత ఉన్నది? కాంగ్రెసు పార్టీని గద్దె దించాలని పట్టుదల చూపుతున్న రాజాజీ సైతం కేంద్రంలో విభిన్న పక్ష ప్రతినిధులతో కూడిన మంత్రివర్గ నిర్మాణంలో సామర్థ్యానికి ప్రాధాన్యమివ్వాలని సూచిస్తున్నారు. అంతే తప్ప తమ స్వతంత్ర పార్టీ కాని, మరొకటి కాని తనంత తానుగా దేశ పరిపాలనా భారాన్ని పూర్తిగా వహించగలదని ఆయనైనా చెప్పడం లేదు.

యుద్ధ సమయంలో దాన్ని పోలిన అత్యంత క్లిష్ట పరిస్థితులలో వివిధ పక్ష ప్రతినిధులతో కూడిన ప్రభుత్వాలు ఏర్పడిన సందర్భాలు విదేశాలలో కొన్ని ఉన్నాయి. సామర్థ్యానికే ప్రాధాన్య మిస్తూ మిశ్రమ మంత్రివర్గాన్ని ("మినిస్ట్రీ ఆఫ్ ఆల్ ది టాలెంట్స్") నిర్మించిన సన్నివేశాలు కొన్ని ఉన్నాయి.

కాని, ప్రపంచ రాజకీయ చరిత్ర క్షుణ్ణంగా తెలిసిన రాజాజీకి యుద్ధకాలంలోనైనా మిశ్రమ ప్రభుత్వాలు ఆంతరంగిక సంఘర్షణలు లేకుండా కొనసాగలేవన్న సంగతి తెలియదా? ప్రథమ, ద్వితీయ ప్రపంచ యుద్ధాల సందర్భాలలో లాయిడ్ జార్జి, విన్స్టన్ చర్చిల్ - వీరిద్దరి వ్యక్తిగత ప్రాబల్యమే, వీరి అసాధారణ ప్రజ్ఞాప్రాభవాలే నాటి జాతీయ ప్రభుత్వాలు విచ్ఛిన్నం కాకుండా కాపాడగలిగినవని తెలియదా? వారి వ్యక్తిత్వం, వారి ప్రాబల్యం లేని యాస్క్విత్ మొదటి ప్రపంచ యుద్ధ సందర్భంలో 1916లో నెలకొల్పిన మిశ్రమ ప్రభుత్వం ఆంతరంగిక విభేదాల.

కారణంగా అతి త్వరలో పతనం కావడం, లాయిడ్ జార్జి, ప్రధాని కావడం రాజాజీకి తెలియదా? ఈ సంగతి

కాగా, యుద్ధేతర సమయంలో ప్రపంచ వర్తక మాంద్యం కల్పించిన సమస్యల పరిష్కారానికి 1931లో రామ్సే మాక్డొనాల్డ్ వివిధపక్ష ప్రతినిధులతో స్థాపించిన జాతీయ ప్రభుత్వం ఎంతటి నగుబాట్ల పాలైపోయిందో రాజాజీకి తెలియదా? 1806లో బ్రిటన్లోనే ఏర్పడిన సమర్థుల మిశ్రమ మంత్రివర్గం (మినిస్ట్రీ ఆఫ్ ఆల్ ది టాలెంట్స్) ఎంత అసమర్థంగా వ్యవహరించిందో, ఎంతగా అపఖ్యాతి తెచ్చుకున్నదో ఆయనకు తెలియదా?

ఇన్నీ తెలిసి కూడా రాజాజీ కేవలం సామర్థ్యానికే ప్రాధాన్యమిస్తూ వివిధపక్ష ప్రతినిధులతో మిశ్రమ మంత్రివర్గాన్ని కేంద్రంలో నెలకొల్పాలని సూచిస్తున్నారంటే, అందుకు మూలం కేవలం కాంగ్రెసు పార్టీ పట్ల ఆయనలో రేకెత్తిన విద్వేషమే కాదా?

* * *

కాంగ్రెసు పార్టీ క్షేమాన్ని, దాని ప్రతిష్ఠను దాని భవిష్యత్తును పదిలపరచగోరే వారు ప్రస్తుతం దాని పరాజయాన్ని కోరాలి. వరసగా ఇంతకాలం రాజ్యాధికారంలో ఉన్నందున దానిలో చేరిన కశ్మలం క్షాళనం కావాలంటే కొంతకాలంపాటు అది అజ్ఞాతవాసం చేయాలి.

కాంగ్రెసుపార్టీ రాజ్యాధికారాన్ని కోల్పోవగానే దాని లక్ష్యాలలో, దాని విధానాలలో అణుమాత్రమైనా తమకు విశ్వాసం లేకపోయినా అధికారాన్ని కోరి దానికి బంధించిన పటాటోపాన్ని కోరి, స్వార్థాన్ని కోరి దానిలో చేరిన వారందరు దానినుంచి తప్పుకుంటారు. స్వప్రయోజనాన్ని కోరి, దాన్ని సమర్థిస్తున్న వారందరు కూడా నూతన ప్రభుత్వాన్ని నిర్మించగల రాజకీయ పక్షాన్ని, లేదా, పక్షాలను అభిమానిస్తారు. ఈ మార్పులతో కాంగ్రెసు సంఖ్యాబలం పూర్తిగా తగ్గుతుంది. కాని, ఇదే సమయంలో అది తన ప్రస్తుత దౌర్బల్యాలను, దౌర్భాగ్యాలను కోల్పోయి, తన పూర్వపు ప్రతిష్ఠను పవిత్రతను తిరిగి చాలావరకు సంతరించుకోగలుగుతుంది.

ఇందువల్ల కాంగ్రెసుపార్టీ దృష్టి నుంచి దాని హితచింతకులు ప్రస్తుతం దాని పరాజయాన్నే కోరుకోవాలి. కాని, దేశం దృష్టినుంచి మాత్రం ఈ కోర్కె ప్రమాదభరితమైంది కాదా? ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని నిర్మించగల స్తోమత ఏ ఒక్క పార్టీకి పూర్తిగా లేనప్పుడు కలగాపులగం మంత్రివర్గాలు దేశాన్ని మరింత చిక్కులపాలు చేయవా?

* * *

ఇవి ఓటరులు ఎవరికి వారే ఆలోచించుకో వలసిన ప్రశ్నలు; ఎవరికి వారే జవాబు చెప్పుకోవలసిన ప్రశ్నలు కాగా, వారు మరీ మరీ జ్ఞాపకం పెట్టుకోవలసిన విషయం తమ ప్రస్తుత నిర్ణయంపైనే తరతరాల వరకు మన భవిష్యత్తు, మన దేశం భవిష్యత్తు ఆధారపడి ఉన్నదని!

(ఆంధ్రజ్యోతి 14-2-1967)

ఓటర్ల ముందున్న కొన్ని ముఖ్య ప్రశ్నలు

ఎప్పుడెప్పుడని ఎదురు చూస్తున్న నాల్గవ జనరల్ ఎన్నికలు రానే వచ్చాయి. అంచెలవారీగా జరుగనున్న ఎన్నికలలో మొదటి ఘట్టం ఈనాడే. ఆంధ్రప్రదేశ్లో 18 పార్లమెంటరీ స్థానాలకు, 110 అసెంబ్లీ స్థానాలకు ఈనాడే పోలింగ్.

ఐదారు నెలలుగా దేశం జనరల్ ఎన్నికల సంరంభంలో ఉద్రిక్తమై ఉంది. వేర్వేరు రాజకీయ పక్షాలు తమతమ ప్రణాళికలను, అధికారానికి రావడానికి తమకుగల అర్హతలను ప్రజలకు నివేదించాయి. వీటికి తోడు వందలాది ఇండిపెండెంట్లు ప్రజలను ఓట్ల కోసం అభ్యర్థించారు. ప్రచారం ఉధ్రుతంగా జరిగింది. పెక్కు సందర్భాలలో ఉద్రేకపూరితంగా జరిగింది. మన ప్రజాస్వామ్యం పట్ల మనకే సందేహం కలిగే విధంగా కొన్నిచోట్ల అవాంఛనీయమైన సంఘటనలు జరిగాయి.

ఇన్ని పార్టీల మధ్య, ఇందరు ఇండిపెండెంట్ అభ్యర్థుల మధ్య, ఇంత గందరగోళంలో ఓటర్లు విభ్రాంతులుకాక తప్పదు. ఎవరికి ఓటు వేయడం, ఎవరిని గెలిపించడం అన్న ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పుకోలేక పోవడం తప్పదు. అయినా, ఈ విభ్రాంతి నుంచి తేరుకుని ఈనాడు వోటర్లు ఒక నిర్ణయానికి రావడం కూడా తప్పదు. వారు స్థిమిత మనస్కులై, విజ్ఞతా పూర్వకమైన ఒక నిర్ణయానికి రావడం మీదనే మన రాష్ట్రం భవిష్యత్తు, మన దేశం భవితవ్యం ఆధారపడి ఉంది.

ఈ సందర్భంలో ఓటర్లు తమకు తాము కొన్ని ప్రశ్నలు వేసుకోవడం మంచిదేమో.

దేశంలో సుస్థిర ప్రభుత్వాలను ఏర్పరచగలది తమ పార్టీ మాత్రమేనని, సుస్థిరత్వాన్ని కోరితే తమకే ఓటు చేయండని కాంగ్రెసు నాయకులు చెబుతున్నారు. ఇది కేవలం ఎన్నికలలో విజయం కోసం చేసే నినాదం మాత్రమేనా? లేక దీనిలో ఏ కొంతైనా నిజం ఉన్నదా?

కాంగ్రెసులో కొన్ని లోపాలున్నవని చెప్పడానికి పెద్దగా రాజకీయ పరిజ్ఞానం అక్కరలేదు; ఆర్థిక పాండిత్యం సైతం అవసరం లేదు. అది ప్రత్యక్షంగా కనబడుతున్న సత్యం. ఇరువదేళ్ళుగా కాంగ్రెసు దేశాన్ని పరిపాలించింది. పరిపాలించే హక్కు దానికే లభించింది. ఆరే నెలలు ఒక వ్యక్తితో స్నేహం చేస్తే ఏవో కొన్ని లోపాలు బయటపడక మానవు కాగా, విభిన్న మనస్తత్వాల వ్యక్తులతో కూడిన కాంగ్రెసు పరిపాలన ఇరువదేళ్ళుగా మనకు సుపరిచితమైనప్పుడు దానిలోని లోపాలు కొన్ని బహిర్గతం కాకుండా ఉంటాయా? ఏ ఇతర రాజకీయ పక్షం అధికారంలోవున్నా ఇంతే జరిగేది కాదా?

కాంగ్రెసు వాదులను నైతికంగా సమర్థించడానికి మేము ప్రయత్నం చేయడంలేదు. మన సమాజంలో కానవస్తున్న కొన్ని దౌర్బల్యాలే అధికారంలో ఉన్నందున కాంగ్రెసు పార్టీ వ్యక్తులలో ప్రస్ఫుటంగా మన ఎదుట కనబడుతూ ఉండవచ్చు. అందువల్ల నైతికంగా కాంగ్రెసును సమర్ధించడానికి ఎవ్వరు ప్రయత్నం చేయనక్కరలేదు. కాని అది ఒక్కటే నేటి ఎన్నికలలో ప్రధాన సమస్య కానవసరం లేదనే మేము మనవి చేయగోరుతున్నాము.

ప్రస్తుత దేశం ఒక సంక్షోభంలో ఉంది. ఎంతో దూరదృష్టితో భవిష్యత్తుకు ప్రాతిపదికగా మనం ప్రారంభించిన ఆర్థిక, సాంఘిక పునర్నిర్మాణ కార్యక్రమం అసంపూర్తిగా మిగిలివుంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ నిర్మాణ కార్యక్రమాన్ని కొంత నెమ్మదిగానో, మరింత వేగంగానో పూర్తిచేయవలసి ఉంటుంది. ఇక్కడ ఆలోచించవలసింది ఒక్కటే. కొన్ని మితవాద పక్షాలున్నాయి; మరికొన్ని అతివాద పక్షాలు. ప్రతి పార్టీ ప్రజలకు అరచేతిలో వైకుంఠాన్ని చూపుతూనే ఉన్నది. పార్టీల సిద్ధాంత ప్రణాళికలలోకి వెడితే అంతా గందరగోళమే. కనుక, వాటిని వదిలిపెట్టి ఆలోచించవలసింది ఒక్కటే. మనం ప్రారంభించిన ప్రగతి కృషిని కొనసాగించడానికి ఈనాడు ప్రధానంగా కావలసింది సుస్థిర ప్రభుత్వం దీనిలో ఎట్టి సందేహానికి తావులేదు. అయితే, సుస్థిర ప్రభుత్వ స్థాపనకు ఏ పార్టీ తగింది? ఏది అందుకు సిద్ధంగా ఉంది? ఇదే నేడు ఓటర్లు నిర్ణయించుకోవలసిన సమస్య.

తామర తంపరగా బయలుదేరిన ప్రతిపక్షాలు తమంతట తాము సుస్థిర ప్రభుత్వాలను ఏర్పరచగల స్తోమత తమకు లేదని స్వయంగానే చెబుతున్నాయి. అందువల్లనే సుస్థిర ప్రభుత్వాల సంగతిని అవి ఎత్తడం లేదు. కాంగ్రెసు ప్రభుత్వాలకు ప్రత్యామ్నాయాన్ని మాత్రమే అవి దేశానికి వాగ్దానం చేస్తున్నాయి. మిశ్రమ మంత్రి వర్గాలతోనే పరిపాలన జరుపుకోవచ్చునని భరోసా ఇస్తున్నాయి.

నిన్నటి మా సంపాదకీయంలో పేర్కొన్నట్టు మిశ్రమ మంత్రివర్గాలు నిజమైన ప్రత్యామ్నాయం ఎన్నటికి కాలేవు. ముఖ్యంగా మనదేశంలోని పార్టీలనే తీసుకోండి, లోహియా పార్టీ కమ్యూనిస్టులతో, కమ్యూనిస్టులు స్వతంత్ర పార్టీతో, స్వతంత్ర పార్టీ జనసంఘంతో, డి.ఎం.కె. స్వతంత్ర పార్టీతో కలగాపులగంగా, రకరకాలుగా ఎన్నికల పొత్తు కుదుర్చుకున్నాయి. కేవలం కాంగ్రెసును గద్దె దింపడం కోసమే ఈ పని చేశాయి. వాటిలో వేటి సిద్ధాంతాలు వాటివి; వేటి ప్రణాళికలు వాటివి ఒకటి భూసంస్కరణలు పనికిరావంటుంది. మరొకటి కావాలంటుంది. ఒకటి బ్యాంకులతో సహా మొత్తం ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం కూడదంటుంది. ఒకటి సనాతన ధర్మాన్ని పునరుద్ధరించాలంటుంది, మరొకటి పురాతన భావాలను నిర్మూలించా లంటుంది. ఒకటి ప్రజాస్వామ్యాన్ని కోరితే, మరొకటి నియంతృత్వాన్ని కోరుతుంది.

ఈ పార్టీలన్నీ కలిసి కాంగ్రెసును గద్దె నుంచి దించిన తర్వాత ఏర్పరచే మిశ్రమ మంత్రివర్గం ఏ విధంగా ఉంటుంది? అది బ్యాంకులను జాతీయం చేస్తుందా? చేయదా? భూసంస్కరణలను అమలు చేస్తుందా? చేయదా? సనాతన ధర్మాన్ని సంరక్షిస్తుందా? నిర్మూలిస్తుందా? ఈ విభేదాలతో అది ఎన్నాళ్ళు పనిచేస్తుంది? రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, ఫ్రాన్సులో.

ప్రజా ప్రభుత్వం - 1

డజన్ల కొద్ది బయలుదేరిన చిల్లర మల్లర పార్టీలలో దేనికీ ప్రభుత్వాన్ని ఏర్పరచే బలం లేక మిశ్రమ మంత్రివర్గం పట్టుమని పదినాళ్ళు నిలబడలేక పోయింది. రాజకీయంగా, ఆర్థికంగా దేశం అరాజకం పాలైంది. అదే అరాజకాన్ని మనం కోరి కోరి తెచ్చుకోబోతున్నామా?

ఇంతేకాదు, సాటి ఆసియా, ఆఫ్రికా దేశాలను పరికించినట్టయితే, అవి కొత్తగా స్వాతంత్ర్యం పొందిన తర్వాత, కొంచెం ముందు వెనుకలుగా నియంతృత్వ ప్రభుత్వాల కెందుకు లోబడి పోవలసి వచ్చింది? సుస్థిర ప్రభుత్వాలను ఏర్పర్చలేని రాజకీయ పక్షాల అసమర్థతవల్లనే కాదా? ఇదే విధంగా మనం సైతం ప్రజాస్వామ్యానికి తిలోదకా లివ్వబోతున్నామా?

మేము మొదట మనవి చేసినట్టు ఓటర్లు ఇవి ఎవరికివారు వేసుకుని, సమాధానం చెప్పుకోవలసిన ముఖ్య ప్రశ్నలు. సుస్థిర ప్రభుత్వాలను తాము ఏర్పరచలేమని మాత్రమే కాదు; వాటి అవసరం లేదని కూడా ప్రతిపక్షాలు చెబుతున్నాయి. దేశం ఏమైపోయినా సరే, కాంగ్రెసును ఓడించడం ముఖ్యమని చెబుతున్నాయి. కాంగ్రెసు స్థానంలో అవి అరాజకాన్ని, నేటి సంక్షోభం కంటే తీవ్రమైనదాన్ని ప్రతిపాదిస్తున్నాయి. తమ ఎన్నికల ప్రచారంలో తమ ప్రణాళికలను సైతం హెచ్చుగా ప్రస్తావించకుండా, కాంగ్రెసు పట్ల విద్వేషాన్నే ఒక ప్రణాళికగా అవి ప్రజలముందు ఉంచుతున్నాయి. ముందుగా కాంగ్రెస్ ను ఓడించితే, ఆ తర్వాత సంగతి ఆ తర్వాత చూసుకోవచ్చునని చెబుతున్నాయి. నేటి విషమ పరిస్థితిలో ఈ విద్వేష విధానం ఎంత ప్రమాదభరితమైనదో వేరే చెప్పనక్కరలేదు. అందువల్ల నిర్మాణాత్మకమైన విధంగా ఓటు చేయడమా, నిర్మూలనాత్మకంగా ఓటు వేయడమా? ఇదే నేడు ఓటర్ల ముందున్న ముఖ్య ప్రశ్న.

(ఆంధ్రజ్యోతి 15-2-1967)

ప్రజాస్వామ్యం

ప్రజా ప్రభుత్వం -1

(రాజకీయ విద్వేషంతో 1947లో ప్రకాశం ప్రభుత్వం వీగిపోయింది. ప్రజలచేత ఎన్నికైన ప్రభుత్వం కుప్పకూలిన సందర్భంలో స్పందించి రాసిన సంపాదకీయ పరంపర.)

ప్రధాని ప్రకాశంగారి ప్రభుత్వం నిలుస్తుందా? నిలవదా?

నిలవని పక్షంలో ఇప్పటి మంత్రివర్గంలో కొన్ని మార్పులు మాత్రమే జరుగుతవా? లేక, సరికొత్త మంత్రివర్గం ఏర్పడుతుందా?

సరికొత్త మంత్రివర్గమే ఏర్పడిన పక్షంలో ఎవరు ప్రధానమంత్రి? ఎవరెవరు ఇతర మంత్రులు? - ఇట్టి ప్రశ్నలు నేడు మన రాష్ట్రీయ రాజకీయ వర్గాలలో ప్రాముఖ్యం వహిస్తున్నాయి. కాని, ఈ ప్రశ్నకు ఈనాడు ప్రజాబాహుళ్యం మాత్రం ఏమంత ప్రాధాన్యమిస్తున్నట్టు తోచదు. అన్ని వైపుల నుంచి ప్రజలను చిక్కులే చుట్టుకుంటున్నాయి.

తిన తిండిలేక చిక్కు కట్టబట్టలేక చిక్కు వుండ కొంపలేక చిక్కు - వీటిలో ఏది చిన్న చిక్కు? చాలినా, చాలకపోయినా, కాచుకోడానికి ఇన్ని బియ్యం దొరికినా, వాటిని వండుకోడానికి కట్టెలు దొరకడం కష్టం. పచ్చిమెతుకులు తినలేక, కాస్త పప్పు వండుకుందామంటే, దాని ధర మండిపోతున్నది. ఏ ధరకైనా అన్నప్పుడెల్ల అది దొరకడం లేదు కూడా.

ఇక, కూరగాయల ధర చెప్పనవసరమే లేదు. చివరికి గోంగూరను కొనబోయినా, వీసె అర్ధరూపాయి! నూటికి 90 మంది కమ్మని కూడు కడుపునిండా తిని ఎన్ని ఏళ్ళూ పూళ్ళూ అయిందో.

కడుపుకు తిన్నా, తినకపోయినా, కాస్త మంచిగుడ్డ కట్టుకుందామంటే, అది దొరకదు. దొరికినా చాలీచాలని నాసిగుడ్డ. దానికైనా దిమ్మతిరిగేపాటి ఖరీదును గోళ్ళూడగొట్టి పుచ్చుకుంటున్నారు. ఇక, ఎండ కెండి, వానకు తడిసి, కొంప ఏ పక్కనైనా కూలితే, దాన్ని మరమ్మతు చేయించుకోడానికి ఇటుక దొరికితే, పెంకు దొరకదు; ఇవి రెండూ దొరికితే సున్నమో, సిమెంటో దొరకదు. వీటి నన్నింటిని ఏ పాట్లోపడి ఏర్పరుచుకుంటే, వెదురుబొంగులకు చిక్కు, టేకు బాదులకు చిక్కు ఇనప చువ్వలకు చిక్కు పడిపోయిన కొంపను బాగు జేయించుకోవడానికే ఇన్ని చిక్కులైతే, కొత్త కొంప కట్టుకోడానికి ఎన్ని చిక్కులో వేరే చెప్పవలసిన పనిలేదు.

కూటికి, గుడ్డకు, కొంపకు ఇలా కటకటలాడుతుండగా, పాడిగొడ్లకు పెట్టుకుందామంటే, తవుడు దొరకడం లేదు. ఎడ్ల జతలను మేపుకుందామంటే, ఉలవలు దొరకడం లేదు. పోనీ, ఇంత జనపకట్టను వాటి ముందు పడవేద్దామంటే, మొన్నను అదునులో రెండు రెట్లు, మూడు రెట్లు ధర పెట్టినా జనప విత్తులు దొరకనందున, దొరికినా, పసలేని పాడు విత్తనం దొరికినందున, జనుం సరిగా పెరగనేలేదు.

ఈ విధంగా రైతు నలిగినప్పుడు, రైతు గొడ్డుగోదలు నలిగినప్పుడు ఇక ఎవరు సుఖంగా బ్రతుకుతున్నట్టు?

ఈనాడు అసంతృప్తిలేని వర్గాలు ఏవైనా ఉంటే అవి రెండే.

లంచాల వీటిలో మొదటి వర్గం - దొంగ లాభాలను గడిస్తున్న వర్తకులు, రెండవ వర్గం గడ్డితింటున్న ఉద్యోగస్థులు.

వీరిలోనైనా అసంతృప్తి లేదా అంటే, కొంత లేకపోలేదు. కాని, ఆ అసంతృప్తి దొంగలాభాలతో గల్లా నిండడం లేదనో! లంచం గడ్డిని పొట్టపగిలేటట్టు మెక్కలేక పోతున్నామనో!

కూటికి, గుడ్డకు, కొంపకు చిక్కులేకుండా, చిన్నచిన్న వాటికి కూడా ఈనాడు మొహం 'వాచిపోవడం తప్పుతున్నదా? తలకు రాచుకోడానికి ఇంత కొబ్బరినూనె కరువౌతున్నదయ్యా!

ప్రజా ప్రభుత్వం - 2

పాలలోకి పంచదార లేకపోతే పాయె! - ఇంత బెల్లం ముక్క కూడా కరువేనయ్యే! కూర తిరగబోత పెట్టుకోవాలంటే ఇంత నూనెబొట్టుకు గిజగిజలాడాలయ్యే!

ఇంతగా - ఇన్ని విధాల - ప్రజలు అఘోరిస్తుంటే, వారికి ఏ మంత్రివర్గం ఉంటేనేమి? ఏది ఊడితేనేమి?

ఎటు చూచినా, వారికి కష్టాలే కానవస్తున్నాయి.

“ఈ పాడు యుద్ధం ఎప్పుడు పోతుందా? ఎప్పుడు మంచిరోజులు వస్తాయా?” అని వారు ఎదురు చూచారు? ఆరేళ్ళపాటు సాగిసాగి, యుద్ధమేమో పోయింది. ఆ వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వచ్చింది. ఇక, తమ కష్టాలు గడిచినట్టే అనుకుని, ప్రజలు ఒక్కసారి “అమ్మయ్య!” అనుకున్నారు.

కాని, ఈనాడు కానవస్తున్న దేమిటి? ఏ వస్తువు ధారాళంగా దొరకడం లేదు; దేని ధర తగ్గలేదు. పైగా, అవినీతి హెచ్చింది! లంచగొండితనం హెచ్చింది.

అయినప్పుడు ప్రజా బాహుళ్యంలో నేడు మన కష్టాలు మనకు తప్పనప్పుడు “ఎవరు గద్దె నెక్కితే నేమి? ఎవరు దిగితేనేమి?" అని ఔదాసీన్యం ప్రబలడంలో అబ్బురం కలదా?

"ఆకలిగొన్నవారికి సత్యం, దేవుడు మొదలైనవి అర్థంలేని మాటలు. వారికి కావలసింది కూడు. మనది కూటికి కరువు వాచిన దేశం. సత్యమని, దేవుడని, మరి ఏమేమో అని, పట్టెడు మెతుకులకై అలమటిస్తున్న కోటానుకోట్ల మందికి చెప్పబోవడం వారిని వెక్కిరించడమే. వారికి ముందు మన మింత కూడుపెట్టాలి. వారి కింత గుడ్డ, ఇంత కొంప ఏర్పరచాలి. వారికి కాస్త చదువు సంధ్యలు చెప్పించాలి; మందుమాకులు ఇవ్వాలి. ప్రతివానికి అతడికి అత్యవసరంగా కావలసిన జీవితావశ్యకాలను సమకూర్చాలి. ఇది చేసిన తర్వాత మనం దేవుడని, దెయ్యమని ఎన్ని కబుర్లయినా చెప్పవచ్చు".

పండిట్ నెహ్రూ ఇటీవల భారత వైజ్ఞానిక వేత్తల మహాసభలో చేసిన ఈ ఉద్బోధను దృష్టిలో పెట్టుకుంటే, ఈనాడు మన రాష్ట్ర ప్రజల మనస్తత్వం చక్కగా బోధపడుతుంది. ఆకలిగొన్నవాడు దేవుని గురించే ఆలోచించనప్పుడు, ప్రధాని ఎవడని ఎందుకు ఆలోచిస్తాడు?

మంత్రు లెవరని ఎందుకు వ్యసనపడతాడు? (ఆంధ్రప్రభ 12-2-1947)

ప్రజా ప్రభుత్వం - 2

ప్రపంచ యుద్ధం ప్రచండ సమస్యల్ని కల్పించి పోయింది. ఆ యుద్ధం ముగిసినంతనే ప్రతిష్ఠాపించ బడినందున ప్రజా ప్రభుత్వాలపై పగవానికైనా తగనంతటి భారం పడిన మాట నిజం.

కాని, ప్రజానాయకులే ప్రభుత్వ నిర్వాహకులైనప్పుడు వారి ప్రజ్ఞకు, వారి ప్రతిభకు, వారి దీప్తికి, వారి దక్షతకు అసాధ్యమైనదని ఉండబోదని ప్రజలు ఆశించారు. వారి ఈ ఆశ అతితోకూడినదే కావచ్చు. అయితే, వారి ఆశలో అతి కలదు గనకనే నేడు వీరి ఆశాభంగం కూడా అత్యంతమైనదే!

ప్రజాబాహుళ్యంలో నేడు కానవస్తున్న ఆశాభంగంలో అధిక భాగం - నిన్నటి సంపాదకీయంలో మేము సూచించినట్టు - ఆహార సమస్యకు సంబంధించినట్టిది.

చెన్న రాష్ట్రానికి క్షామ ప్రమాదం తప్పదేమోనని భయంతోచిన సమయంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. క్షామమే తప్పక పోయినట్లయితే, అది ఎంతైనా అప్రతిష్ఠకు పాల్పడి ఉండేదే. కాని, కాటక ప్రమాదం నుంచి కాపాడినందుకు పొందవలసినంతగా ప్రశంసను అది పొందలేక పోవడానికి కారణం, - ధాన్య సేకరణలో నేమి, ధాన్యం ధరల విషయంలో నేమి జరిగిన కొన్ని అనుచిత చర్యలే; అపసవ్య నిర్ణయాలే.

ధాన్య సేకరణకు ఉపకరించగలదనే ఉద్దేశంతో బస్తాకు రెండు రూపాయల చొప్పున బోనస్ ఇవ్వగలమని ప్రభుత్వం నిరుడు చేసిన ప్రకటన హర్షించదగినట్టిదే. ఒక గడువు పెట్టి, ఆ గడువు లోపల ధాన్యం విడుదల చేస్తేనే బోనస్ ముట్టగలదని, ఆ గడువుదాటిన తర్వాత ఇంకను ధాన్యం నిల్వచేస్తే, దాన్ని జప్తు చేయడమేమి, రైతు నష్టపోవడమేమి తప్పదని ఆ ప్రకటనలో పేర్కొనడం కూడా హర్షించ దగిందే!

కాని, ప్రభుత్వం తుట్టతుదివరకు ఈ ప్రకటనకు కట్టువడి వుండలేదు. తాను పెట్టిన గడువులోపల రెండు రూపాయల బోనస్ను ఆశించైనా ధాన్యాన్ని విడుదల చేయక, దొంగ లాభాలను తియ్యాలనే దురుద్దేశ్యంతో దాన్ని నిల్వచేసినవారిపై తగుచర్య జరపడానికి బదులుగా, బస్తాకు రెండింటికి మరి రెండు వేసి మొత్తం నాలుగు రూపాయల బోనస్ చెల్లించగల నన్నది. దీనితో రెండు రూపాయల బోనస్కే సంతోషపడి, ధాన్యాన్ని అమ్ముకున్న వారందరు తాము దద్దమ్మలమై పోయినామని నొచ్చుకున్నారు. ఇంతేకాదు. తమ ప్రభుత్వమని తాము విశ్వసించినట్టిది మాట తప్పి తమకు అన్యాయం చేసిందని కోపగించుకున్నారు.

“నాలుగు రూపాయల బోనస్ ఆశ చూపకపోతే, అధికంగా ధాన్యసేకరణ జరిగేదా? గడ్డు రోజులు గడిచేవా?” అని ఈ సందర్భంలో అనడానికి అవకాశం లేకపోలేదు. అయితే, ప్రభుత్వం లెక్కలలో నాలుగు రూపాయల బోనస్ కారణంగా ధాన్యసేకరణ అదనంగా

జరిగినట్టు ఏమి కనబడినా, అదనంగా వచ్చిన ధాన్యం కొద్దిపాటే! సన్నకారు రైతులందరు జమాబందీ రోజులలోనే భూమిశిస్తుకని తమకు పండిన కొద్ది పంటను అమ్మివేసుకున్నారు. పంట అమ్ముకో నవసరం లేకుండా శిస్తు కట్టగల్గినవారు గడువుదాటితే రెండు రూపాయల బోనస్ పోతుందని గడువు లోపలనే అమ్మివేసుకున్నారు. కాగా, ఇంకా నిల్వచేసినవారిలో పెక్కుమంది దొంగ.

ప్రజా ప్రభుత్వం - 3

వ్యాపారస్థులే. అంచేత నాలుగు రూపాయల బోనస్ చెల్లించడం దొంగ వ్యాపారస్థులను ప్రోత్సహించడమే అయింది. వారైనా, తమ దగ్గర నూరు బస్తాలు నిల్వ వుంటే, తప్పుడు లెక్కలు చూపించి, నాలుగు వందల బస్తాలకు నాలుగేసి రూపాయల చొప్పున పుచ్చుకున్నారు! ఈ లెక్కల గారడీతో యాభైవేలు మొదలు లక్ష రూపాయల వరకు ప్రభుత్వాన్ని దోచిన రైసు మిల్లు యజమానులు కొందరున్నారట! ప్రభుత్వ ప్రకటనను నమ్మి తాను మోసపోయినానని ప్రతి రైతు అనుకోడానికి ఇది తగినంత కారణం కాదా!

నిరుడు జరిగింది ఏదో జరిగిపోయిన దనుకుంటే, ఈ ఏడు ధాన్యం ధర మరీ అధ్వాన్నంగా నిర్ణయించారు. బియ్యం ధరను పెంచకుండా ధాన్యం ధరను బస్తాకు దాదాపు రెండు రూపాయలు పెంచడానికి వీలున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం వారు అనుమతించడం లేదనే కారణం పై, అందుకు సమ్మతించడం లేదు. తాను కొనుక్కోవలసిన ప్రతి వస్తువు ధర మండిపోతున్నప్పుడు, తన పంటకే తక్కువ ధర నిర్ణయించడం తగునా అని ప్రతి రైతు కడుపు రగులుకు పోతున్నది. ఆహార సమస్యను పరిష్కరించడంలో ఎప్పటి కప్పుడు ఏదో ఒక విధంగా గండం గడుపుకొని, గట్టెక్కడాన్నే మన ప్రభుత్వం లక్షిస్తున్నది గాని, దూరదృష్టిని ప్రదర్శించడం లేదు. ఆహార సమస్య మన రాష్ట్రానికేమి, మన దేశానికేమి, ఇప్పటిలో తీరేదికాదు. ఆహారం విషయంలో మనం స్వయం సంపూర్ణత్వాన్ని సాధించినప్పుడే ఈ సమస్య పరిష్కారమైనట్టు, దీన్ని దృష్టిలో పెట్టుకుంటే, కర్షకుని సర్వవిధాల ప్రోత్సహించడమే ప్రభుత్వ విధానమై తీరుతుంది. ఈ విధానం ప్రస్తుతం అమలు జరగనందున ప్రతి రైతు అతడు ధాన్యం పండించేవాడైనా వేరుశనగ పండించేవాడైనా, పొగాకు పండించేవాడైనా - అసంతృప్తి పడుతున్నాడు.

ఈ అసంతృప్తిని తొలగించడం మన ప్రజా ప్రభుత్వం - అది నేటివలె రేపు కూడా ప్రకాశంగారి ప్రభుత్వమే కావచ్చు; లేదా మరొక ప్రభుత్వం కావచ్చు - అది ఏదైనా, ఈ అసంతృప్తిని తొలగించడమే దాని ప్రధాన కర్తవ్యం.

(ఆంధ్రప్రభ 13-2-1947)

3

ఆహార సమస్య తర్వాత ముఖ్యమైనట్టిది వస్త్ర సమస్య.

ఈ సమస్య విషయమై కూడా ప్రజాప్రభుత్వంపై ప్రజాబాహుళ్యం కొండంత ఆశ పెట్టుకోగా దాని ఆశ అడియాసగానే పరిణమించింది.

బియ్యానికి రంగూన్పై వలె, మిల్లుగుడ్డకు బొంబాయి, అహమ్మదాబాద్, షోలాపూర్ మొదలైన వాటి మీద ఆధారపడవలసిన దుస్థితిలో చెన్న రాష్ట్రం పడిపోవడానికి బాధ్యత ప్రస్తుత ప్రజా ప్రభుత్వానిది కాదనడం నిజమే.

వస్త్ర కాటకంతో నేడు ప్రతి రాష్ట్రంలో ఇంతో అంతో బాధపడుతున్న మాట కూడా నిజమే.

కాని, యావద్భారత ప్రాతిపదికపై వస్త్ర సమస్య పరిష్కారానికి యత్నం జరుగుతున్నప్పటికీ తక్కిన రాష్ట్రాలలో సాలీనా సగటున తలకివ్వబడుతున్న కోటాను మన ప్రజా ప్రభుత్వం మన రాష్ట్ర వాసులకు సాధించలేకపోయింది. ఇంతేకాదు. ఆ తక్కువ కోటానైనా ఎప్పటికప్పుడు రప్పించలేకపోయింది. రప్పించిన దానినైనా దొంగ మార్కెట్లోకి పోకుండా కాపాడలేకపోయింది. పై పెచ్చు, కొందరు ప్రభుత్వోద్యోగులకు ఒకరిద్దరు మంత్రులకు సైతం - ప్రజలకిస్తున్న కోటాను మించి మిల్లు గుడ్డ కొనుక్కోడానికి స్పెషల్ పర్మిట్లు జారీ చేయబడినవనే ఆరోపణ సైతం జరగక పోలేదు! -

పేదసాదలతో కూడిన ప్రజా సామాన్యానికి కావలసింది చౌకగుడ్డ. చౌకగా దొరికేది మిల్లుగుడ్డ మాత్రమే. ఈ మిల్లుగుడ్డను సాలీనా సగటున తలకు పెద్దవారికైతే ఐదు గజాలకు మించి, పిల్లలకైతే రెండు గజాలకు మించి మన ప్రభుత్వం వాగ్దానం చేయలేక పోయింది. ఇక్కడ "వాగ్దానం" అని (ఈ కొద్దిపాటి కోటా కూడా సవ్యంగా అందరికీ అందడం అనుమానమే గనక) కావాలనే అంటున్నాం.

మిల్లు గుడ్డ కోటా మనకు ఎంత తక్కువైనా, మన చేనేత మగ్గాలకు నూలు పుష్కలంగా దొరికితే, చేనేత పనివారికి ఇప్పటివలె నెలకు ఏ వారం, పదిరోజులకే కాకుండా నెల పొడుగునా పని చూపి స్తే, చేనేత గుడ్డ పేదసాదలకు సయితం అందుబాటులోకి రావచ్చు. కాని, రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న నూలు అన్యరాష్ట్రాలకు ఎగుమతి కావడంవల్లనేమి, మనకు మిగిలిన దానిలో కొంతభాగం దొంగ మార్కెట్టుకు చేరుతున్నందువల్ల నేమి, తదితర కారణాలవల్లనేమి, ఇప్పుడు చేనేత గుడ్డ, ధర మండి పోతున్నది. కలవారు సయితం దాన్ని కొనుక్కోవాలంటే కొంత సంకోచించవలసి వస్తున్నది.

అటు మిల్లు గుడ్డను తగినంత తెప్పించలేక పోయినప్పుడు, ఇటు చేనేతగుడ్డను తగినంత

చౌకగా అమ్మించలేక పోయినప్పుడు ప్రజలలో అసంతృప్తి ప్రబలడం సహజమే గదా? మిల్లు గుడ్డ ఎక్కువగా రప్పించడానికేమి, మిల్లు నూలు ఇతర చోట్లకు ఎగుమతికాకుండా ఆపడానికేమి, మన రాష్ట్రీయ ప్రభుత్వానికి అధికారం లేదనడం వాస్తవమే. కాని, ప్రజాసామాన్యం "ఏవి రాష్ట్రీయ ప్రభుత్వాధికారాలు? ఏవి కేంద్రప్రభుత్వాధికారాలు" అని రాజ్యాంగ సూక్ష్మాల మీమాంస చెయ్యదు. "మీరు పరిపాలనకు రావడంతో మా కష్టాలు గడుస్తాయనుకున్నాం. కష్టాలు తీరడానికి మారుగా, మోపు అవుతున్నాయి". అని అసంతృప్తిని మాత్రమే చెందుతుంది. మన రాష్ట్రీయ ప్రభుత్వం వస్త్ర సమస్యను ప్రజా బాహుళ్యానికి సంతృప్తికరంగా పరిష్కరించలేక పోగా, భావి విషయమై ఆందోళన కూడా కలగజేసింది.

మనకు ప్రత్తి సమృద్ధిగా పండుతున్నది. తుంగభద్ర, రామపాద సాగరం మొదలైన ప్రాజెక్టులు పూర్తి అయినంతనే మనకు విద్యుచ్ఛక్తి కూడా సమృద్ధిగా లభిస్తుంది. ఆ ప్రత్తికి, ఈ విద్యుచ్ఛక్తికి జతకూర్చితే, సి.పి., యు.పి., బెంగాల్, బొంబాయి రాష్ట్రాలకు వస్త్ర యంత్రాగారాల విషయంలో.

ప్రజా ప్రభుత్వం - 4

ఏ విధంగాను తీసిపోని స్థితికి మనం రాగలము. అయినా, మన రాష్ట్రీయ ప్రభుత్వం కాలానికే ఎదురీద గోరి, మనకు మరకదుళ్ల అవసరం లేదన్నది. దీనితో వస్త్ర సమస్య విషయంలో అసంతృప్తి మరింత పెచ్చు పెరిగిపోయింది.

ఈ అసంతృప్తిని తొలగించడం మన ప్రజాప్రభుత్వం- అది నేటి వలె రేపుకూడా ప్రకాశంగారి ప్రభుత్వం కావచ్చు లేదా మరొక ప్రభుత్వం కావచ్చు అది ఏదైనా, ఈ అసంతృప్తిని తొలగించడమే దాని ప్రధాన కర్తవ్యం. (ఆంధ్రప్రభ 14-2-1947)

4

స్వాతంత్ర్యాన్ని స్వాతంత్ర్యం కోసమే ఆశించేవారు ఉన్నతాదర్శ ప్రియులైన కొద్దిమంది మాత్రమే. ఆత్మవికాసానికి ఒక ఆటంకంగా, ఆత్మగౌరవానికి ఒక అపవాదుగా వారు పారతంత్ర్యాన్ని పరిగణిస్తారు. అంచేత వారు స్వాతంత్ర్యాన్ని స్వాతంత్ర్యం కోసమే లక్షిస్తారు. ఇక, సామాన్య ప్రజలు స్వాతంత్ర్యాన్ని కోరడం సుఖజీవనం కోసం.

తమ దారిద్ర్యానికి, తమ దైన్యానికి, తమ కష్టాలకు, తమ నిష్ఠూరాలకు తమ పారతంత్రమే కారణమని వారు సులభంగా గుర్తించలేరు.

"సాంఘికంగా, ఆర్థికంగా, పారిశ్రామికంగా, వ్యావసాయకంగా, విద్యావిషయకంగా మీ హీనస్థితికి మీ పారతంత్ర్యమే కారణం! శారీరకంగా, మానసికంగా, నైతికంగా మీ పతనానికి మీ పారతంత్ర్యమే కారణం" అని ప్రచారం చేసిన తర్వాతగాని - ప్రబుద్ధుల్ని చేసిన తర్వాతగాని - తాము దాస్యశృంఖలా బద్ధులైవున్న సంగతిని సైతం సామాన్య ప్రజలు కానలేరు.

అన్ని అనర్థకాలకు తమ బానిసత్వమే కారణమని ప్రజా సామాన్యం గ్రహించడమే కష్టం గాని, ఒకసారి గ్రహించిన తర్వాత పారతంత్ర్యం పట్ల వారు ప్రదర్శించే ప్రాతికూల్యం అప్రతిహత మైనట్టిదే!

పారతంత్ర్య శక్తులను విచ్ఛేదం చేయడంలో, ప్రజా ప్రభుత్వాలను స్థాపింపజేయడంలో ఎన్నో త్యాగాలను చేసిన - ఎన్నెన్నో కష్టాలను సహించిన - సామాన్య ప్రజలు మన రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడినంతనే తమ జీవితం (వెంటనే కాకపోయినా, క్రమక్రమంగానైనా) సుఖప్రదం కాగలదని ఆశించారు.

ఆరేళ్ళ యుద్ధంలో కనివిని యెరగని కష్టాలకు పాల్పడినందున, ఆ యుద్ధం ముగిసిన వెంటనే ప్రజాప్రభుత్వం రావడం ప్రత్యేకంగా తమ అదృష్టమేనని వారు సంతోషపడ్డారు కూడా! కాని, నేడు జరుగుతున్న దేమిటి?

యుద్ధ సమయంలో కంటే ఇప్పుడే కావలసిన వస్తువు దొరకడం కష్టమైపోతున్నది. అప్పటికంటే ఇప్పుడే ప్రతి వస్తువు ధర మండిపోతున్నది. అప్పటికంటే ఇప్పుడే దైనందిన జీవితం మరింత దుర్భరమైపోయింది.

అప్పటివలె ఇప్పుడు కూడా దొంగలాభాలు తీసేవారు వాటిని తీస్తూనే ఉన్నారు. అప్పటివలె ఇప్పుడు కూడా లంచాలు పట్టేవారు వాటిని పడుతూనే వున్నారు. అప్పటి వలె ఇప్పుడుకూడా కలవారికి మరింత పోగుపడుతుండగా, లేనివారు మరింత నీళ్ళు కారిపోతున్నారు.

“మా బలమున్నది; మా ప్రభుత్వ బలమున్నది. సంఘ విద్రోహులకు ఇక శాస్తి చేస్తాము" అని ఆశించిన సామాన్య ప్రజలకు ప్రస్తుత పరిస్థితులు అసంతృప్తి కలిగించడం అత్యంత సహజం కాదా?

ధరలను కంట్రోల్ చెయ్యడానికి, వాటిని ప్రజలకు లభ్యం చేయడానికి మన ప్రభుత్వం ప్రయత్నం చేయకపోలేదు. కాని, ఆ ప్రయత్నాల ఫలితాలు మాత్రం ఆశించిన వాటికి పూర్తిగా భిన్నమైనట్టిది.

కొబ్బరికాయ, కొబ్బరినూనె ధరలపై పెట్టబడిన కంట్రోల్ ఇందుకొక ప్రత్యక్ష నిదర్శనం. ఈ కంట్రోల్ లేనప్పుడు వీసెకు మూడు రూపాయలు చెల్లించవలసి వచ్చినా, కొబ్బరినూనె దొరికేది. కంట్రోల్ రాగానే, దాని ధర వీసె ఎనిమిది రూపాయలకుపైగా పెరిగిపోవడమే కాకుండా, ఆ ధరకైనా అది అందరికీ దొరకడం లేదు.

తలమాస్తే తనువే మాసినట్టుగా భావించే మన స్త్రీలకు ఇది ఎంత బాధాకరం!

కొబ్బరినూనె కరువు కావడంపై ఈనాడు ఏ ఇంటిలో చూచినా ఈసడింపులే! కొబ్బరినూనె కరువైన తర్వాత తిరుపతి మొక్కులు ఎక్కువైనవని ఏ హాస్య చతురుడోగాని చమత్కరించాడు కూడా!

కంట్రోల్న పెట్టినప్పుడు దాన్ని అమలుపరచడంలో ప్రస్తుతం తగినంత పట్టుదల కానరావడం లేదు సరిగదా, అసలు కంట్రోల్ ప్రకటించడంలోనే కొన్ని అవకతవకలు జరుగుతున్నాయి కూడా. జనప విత్తులపై, ఎవరివద్ద ఎంతెంత సరుకు నిల్వ ఉన్నదో లెక్కలు తీసుకోకుండా, కంట్రోల్ పెట్టడం జరిగింది. ఇంతేకాదు. కంట్రోల్ ధర ఆకస్మికంగా - అకారణంగా - పెంచివేయబడింది కూడా? ఈ చర్యలవల్ల పశుగ్రాసం లేక రైతు ఈ యేడు పడవలసినపాట్లు ఇన్ని కావు.

ప్రజాప్రభుత్వం సక్రమంగా పరిపాలన సాగించడం ప్రజలతో అది సన్నిహిత దైనందిన సంబంధాన్ని పెట్టుకున్నప్పుడే. ఇది నేడు అంతగా జరగడం లేదు. ప్రభుత్వ విధానాలను గురించి, నిర్ణయాలను గురించి ప్రచారం కూడా నామమాత్రమే! ఏవేవో పెద్దపెద్ద ప్రణాళికలను ప్రకటించడమే కనబడుతుంది గాని, దేనికీ సమగ్ర స్వరూపం లేదు. అధ్వాన్నంగా వున్న పరిస్థితులను ఇది కేవలం అయోమయం చేస్తుంది. ప్రజా సామాన్యంలోని నేటి అసంతృప్తికి కారణం.

ఈ అసంతృప్తిని తొలగించడం మన ప్రజా ప్రభుత్వం - అది నేటి వలె రేపుకూడా ప్రకాశంగారి ప్రభుత్వమే కావచ్చు; లేదా మరొక ప్రభుత్వం కావచ్చు - అది ఏదైనా, ఈ అసంతృప్తిని ఈ తొలగించడమే దాని ప్రధాన కర్తవ్యం.

(ఆంధ్రప్రభ 15-2-1947)

ప్రజా ప్రభుత్వం - 5

కాంగ్రెసుకు ప్రజాదృష్టిలో, ప్రజాభావనలో, ప్రజా హృదయంలో విశిష్ట స్థానముంది. అంచేత కాంగ్రెసువారి నుంచి, కాంగ్రెసు ప్రభుత్వాల నుంచి వారు విశిష్టత్వాన్ని ఆశిస్తారు. ఆడినమాటను తప్పడం ఎవని విషయంలోనైనా తప్పే. కాని, కాంగ్రెసువాని విషయంలో దాన్ని తప్పున్నరగా భావిస్తారు.

కూడని పని చేయడం ఎవని విషయంలోనైనా దూష్యమే. కాని, కాంగ్రెసువాని విషయంలో దాన్ని దూష్యమైనదిగా మాత్రమే కాకుండా, దుస్సహమైనదిగా కూడా భావిస్తారు.

సరిగా ఇదే కాంగ్రెస్ ప్రభుత్వాలకు కూడా వర్తిస్తుంది.

ఏవో జస్టిస్ పార్టీవారి పరిపాలనలో ఏవైనా అనుచిత కృత్యాలు జరిగితే, ఆ పార్టీ లక్ష్యాలు కొన్ని కులాలకు పరిమితమైనవి గనక, ఆ అనుచితాలు విపరీతమైనవిగా తోచవు.

అడ్వయిజర్ల ప్రభుత్వంలో అన్యాయాలు ఏవైనా జరిగితే, విదేశీయ పరిపాలకుల కనుసన్నలలో మెలగవలసిన వారినుంచి అన్యాన్ని ఆశించలేము గదా అని తోస్తుంది.

ఇక, అది ఏ ముస్లింలీగ్, లేదా, ఏ హిందూ మహాసభ మంత్రివర్గమో అయిన పక్షంలో, అన్యమత విద్వేషం ఎట్టి అసహ్య చర్యలకైనా పురికొల్పడం సహజమేనని సరిపెట్టుకుంటారు. కాగా, కాంగ్రెసు ప్రభుత్వం ఎంత చిన్న తప్పు చేసినా, వీసం వాసిగానైనా న్యాయమార్గం నుంచి బెడిసినా, అది మహాపరాధం వలెనే గోచరిస్తుంది.

ఇది కాంగ్రెసుకు చెందినవారు చింతించవలసిన విషయం కాదు! గర్వించవలసిన విషయం.

తక్కినవారి విషయంలో క్షంతవ్యమైనది కాంగ్రెసువారి విషయంలో కాకపోవడం ప్రజాదృష్టిలో కాంగ్రెసు సంపాదించుకున్న ఉన్నత స్థానానికి, ఉదాత్త ప్రవృత్తికి, ఉత్తమ ప్రతిపత్తికి నిదర్శనం. తక్కిన ప్రభుత్వాల విషయంలో సహ్యమైనది కాంగ్రెసు ప్రభుత్వం విషయంలో దుస్సహం కావడం కూడా ప్రజాహృదయంలో కాంగ్రెసుకుగల స్థానానికే తార్కాణం.

దీన్ని దృష్టిలో పెట్టుకుంటే, మన రాష్ట్రీయ ప్రభుత్వం జరిపిన కొన్ని చర్యలేమి, ప్రకటించిన కొన్ని విధానాలేమి ఈ రాష్ట్ర ప్రజలకు అత్యధికమైన అసంతృప్తి ఎందుకు కలిగించినవో సువిదితం కాగలదు.

ఏదో అడవిని ఎవరో ఆశ్రితునికి చౌకగా అమ్మివేశారనో, దొంగ లాభాలను తీస్తున్నారని పేరొందిన వారికి నూనె ఎగుమతి లైసెన్సులను జారీ చేశారనో, కార్లు, బస్సులు పర్మిట్ల విషయంలో కొందరి చేయి తడి అవుతున్నదనో, ప్రభుత్వోద్యోగుల విషయంలో బంధుజన పక్షపాతం ప్రదర్శించబడుతున్నదనో, ఏవేవో ఆరోపణలు - ఇవి కేవలం నిరాధారమైనవే జరిగితే, అవి అధికమైన, విపరీతమైన అసంతృప్తి కలిగించడం తప్పదు సరిగదా, కాంగ్రెస్ ప్రతిష్ఠకే, ప్రతిపత్తికే ప్రమాదకరం.

"ప్రజా ప్రభుత్వం" అనే శీర్షిక క్రింద (నేటిదానితో సహా) మేము అయిదు సంపాదకీయాలు వ్రాయడంలో మా ఏకైక లక్ష్యం కాంగ్రెసు ప్రతిష్ఠకేమి, ప్రతిపత్తికేమి అణుమాత్రమైనా భంగం రాగూడదనడమే.

నేటి మద్రాసు కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీలో ఏ వర్గం పట్ల మాకు అభిమానం లేదు; దేనిపట్ల దురభిమానం లేదు. మంత్రి పదవికి ఎవరు వచ్చినా, దాని నుంచి ఎవరు పోయినా, అది ముఖ్యం కాదు. ఈ కష్టకాలంలో ప్రజలను ఆదుకోవాలి. వారికి తినతిండికి, కట్ట గుడ్డకు, నిలవ నీడకు ఒక దారీ దిక్కూ చూపించాలి. "కాంగ్రెసువారే నేడు పదవులలో ఉండి ఉండకపోతే మన గతి ఏమైపోయివుండేదో!" అనేది జనవాక్యం కావాలి. అప్పుడే ఏదైనా నిజంగా ప్రజా ప్రభుత్వం కావడం! (ఆంధ్రప్రభ 16-2-1947)

విపత్కర ధోరణులు

(ప్రజాస్వామ్య ప్రభుత్వ ప్రాధాన్యాన్ని ప్రజల బాధ్యతలను గుర్తు చేస్తూ రాసింది.)

ప్రజాస్వామ్యానికి మనం తగమని బ్రిటీష్ వారు అనేవారు. ఈ మాట పచ్చి అబద్ధమని మనవారు అనేవారు. తమ వాదాన్ని బలపరచుకొనడంకోసం మనవారు పాత చరిత్రను తవ్విపోసేవారు. శాక్యులకు ప్రజాస్వామ్యవ్యవస్థ వుండేదికాదా ? లిచ్ఛవులకు వుండేది కాదా? వృష్ణివంశీయులకు వుండేది కాదా? ఈ విధంగా మనవారు ప్రశ్నించేవారు. ఈ విషయమై మనవారు పెద్ద పెద్ద పుస్తకాలను వ్రాసి, బ్రిటీష్ వారికి నాగరికతావాసనలైనా అబ్బని రోజులలోనే మన దేశంలో ప్రజాస్వామ్యవ్యవస్థలు వర్ధిల్లినవని నిరూపించడానికి ప్రయత్నించేవారు.

నిజమే! మన పూర్వీకులు చాలా గొప్పవారు; వారికి ప్రజాస్వామ్య వ్యవస్థ అపరిచితమైంది. కాదు; బౌద్ధభిక్షు సంఘనిర్మాణం జరిగింది ప్రజాస్వామ్య సూత్రాలపైనే; రాచరికం నెలకొన్న తర్వాతకూడా, ప్రజారంజకంగా పాలించలేని రాజును చంపివేసే హక్కు ప్రజల కున్నట్టు మన ధర్మశాస్త్రాలలో కొన్ని ఉదోషించాయి. ఈ విషయాలన్నీ వాస్తవమైనవే కావచ్చుగాని, ఇది "మా తాతలు ముంతలతో నేతులు తాగేవా" రని చెప్పుకొనడమే కాదా? పొట్టకూటికి గతిలేక పడరానిపాట్లు పడుతున్నవాని ఆకలిని అతని తాతముత్తాతల గొప్పతనం తీర్చుతుందా?

కొన్ని నెలలుగా ముఖ్యంగా కొన్ని వారాలుగా విశేషించి కొన్ని రోజులుగా దేశంలో జరుగుతున్న అనేక శోచనీయ సంఘటనలు మనం ప్రజాస్వామ్యానికి ఎంతవరకు తగుదుమన్న ప్రశ్నను అనివార్యం చేస్తున్నాయి. ఇదివరలో బ్రిటీష్ వారు చెబుతూవచ్చిన మాటను పూర్తిగా త్రోసివేయగలమా అనే సంశయాన్ని కలిగిస్తున్నాయి.

మనతోపాటు దాస్యవిముక్తిని పొందిన ఆసియన్, ఆఫ్రికన్ దేశాలు పెక్కింటిలో ప్రజాస్వామ్య వ్యవస్థ విలుప్తమై పోయినా, ఏవేవో మారువేషాలతో అక్కడ నియంతృత్వ ప్రభుత్వాలు నెలకొన్నా, మన దేశం ప్రజాస్వామ్యంగానే నిలిచివున్నట్టు ఇటీవలివరకు మనం చాలా ప్రగల్భాలకు పోయాము! మన దేశంలో ప్రస్తుతం జరిగిన జరుగుతున్న - సంఘటనల తర్వాత ఈ గొప్పలకు మరి పోగలమా ?

ప్రజాస్వామ్యం అంటే కేవలం రాజు లేకపోవడం కాదు, నియంత లేకపోవడం కాదు; ఒక నిర్ణీతవ్యవధిలో పార్లమెంటుకు, శాసనసభలకు ఎన్నికలు జరగడమైనా కాదు. ఇవి ప్రజాస్వామ్యానికి కేవలం బాహ్యలక్షణాలు. వీటితో పాటు కొన్ని ఆంతరంగిక లక్షణాలున్నది తప్ప ప్రజాస్వామ్యం కాదు. కానేరదు.

ఈ ఆంతరంగిక లక్షణాలలో అతిముఖ్యమైనట్టిది ఆత్మసంయమనం. "ఆత్మసంయమనం" అంటే అదేదో ఆధ్యాత్మికసాధన కాదు; ఎవరికి వారు తమంత తాము కొంత అదుపులో పెట్టుకొనడం మాత్రమే, కొన్ని అవధులను దాటకపోవడమే. ఒకరు నెత్తిపై మొట్టగా అదుపులో వుండడం, అవధులను దాటకపోవడం రాచరికవ్యవస్థకు తగిపోతుంది. అందువల్లనే మన దేశంలో రాజనీతికి మరొకపేరు "దండనీతి". "దండం" ముందు పుట్టగా, ఆ తర్వాత రాజు పుట్టినట్టు చెప్పేకొన్ని ధర్మశాస్త్రాలు మనకున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలోనైనా "దండం" (శిక్షాస్మృతి) తప్పదుగాని, అన్ని జాతులలో, అన్ని కాలాలలో వుండే కొద్దిమంది సంఘవిద్రోహులను విడిచిపుచ్చగా, మిగిలిన వారందరు "దండం" తో నిమిత్తం లేకుండా, దండించేవారితో నిమిత్తం లేకుండా, తమ తమ పౌరధర్మాలను తాము నిర్వహిస్తూ వుండాలి. దీన్నే మరొక విధంగా చెప్పాలంటే, అన్ని వేళలలో, అన్ని పరిస్థితులలో పౌరులు తమను తామే అదుపులో పెట్టుకోవాలి, తమకు తామై కొన్ని అవధులను అతిక్రమించరాదు.

ప్రజాస్వామ్యానికి కావలసిన మరొక ఆంతరంగిక లక్షణం మన శాసనాల పట్ల గౌరవం. ప్రజాస్వామ్యంలోని శాసనాలు పైనుంచి ఎవరో విధించేవి కావు; ప్రజలు తమ ప్రతినిధులద్వారా స్వయంగా చేసుకొనేవి మాత్రమే! ఏ శాసనాలైనా తమకు మనస్కరించకపోతే, అవి తమకు బాధాకరమైతే, వాటిని మార్చవలసిందిగా ఆ ప్రజలే తమ ప్రతినిధులను కోరవచ్చు. వారు తమ మాట వినకపోతే, ఆ ప్రతినిధుల స్థానంలో కొత్తవారిని ఎన్నుకోవచ్చు. అంతే తప్ప, శాసనాల ధిక్కారానికి ఉద్యమించరాదు. ఒక అన్యాయ శాసనంపట్ల అసహనంతో దాన్ని ధిక్కరించినపుడు, ముఖ్యంగా ఈ పని తరచు జరిగినప్పుడు, అసలు శాసనాలపట్లనే గౌరవం సన్నగిల్లుతుంది. అయితే, ఇదివరలో శాసనోల్లంఘనం రూపంలోనే మన జాతీయోద్యమం కొనసాగలేదా అని ఈ సందర్భంలో ప్రశ్నించవచ్చు. కాని, అప్పటి శాసనాలు మనం చేసుకొన్నట్టివి కావు, మనపై విజాతీయ ప్రభువులు విధించినట్టివి. ఇందువల్ల వాటి విషయంలో సమర్థనీయమైన పద్ధతి మనకై మనం చేసుకొన్న శాసనాలవిషయంలో సమర్థనీయం కాబోదు. తమకు బాధాకరమైన ప్రతి శాసనానికి విరుద్ధంగా ఆందోళన జరపడానికి ప్రజాస్వామంలో పౌరులకు పూర్తి హక్కు వుంటుంది. ఇది లేనిది ప్రజాస్వామ్యమే కాదు. కాని ప్రజాస్వామ్యంలోని ఆందోళనాపద్ధతులు రాచరికంలోని వాటికి, నియంతృత్వవ్యవస్థలోనివాటికి భిన్నమైనవిగా వుండాలి.

ఇదే విధంగా ప్రజాస్వామ్యానికి కావలసిన ఆంతరంగిక లక్షణాలన్నిటిని గురించి చర్చించడం ఇక్కడ సాధ్యంకాదు గనుక, ఆ పని చేయబోము. కాని, కొన్నాళ్లుగా మన దేశంలో ప్రస్ఫుటమౌతున్న ధోరణులు మనం ప్రజాస్వామ్యానికి ఎంతవరకు తగుదుమని గట్టిగా ప్రశ్నించుకొనవలసిన పరిస్థితిని కల్గిస్తున్నాయనడంలో సందేహం లేదు. ఈ విపరీతధోరణులకు సరికొత్త నిదర్శనమే నిన్న ఢిల్లీలో చెలరేగిన అల్లకల్లోలం.

ప్రస్తుత ప్రభుత్వంపట్ల, దాని విధానాలపట్ల మరి సహించలేనంతటి విద్వేషమైనా నిన్నటి చర్యలకు - ముఖ్యంగా, ప్రభుత్వం ఆస్తిపాస్తుల విధ్వంసక చర్యలకు సమర్థనీయమైన కారణం కాజాలదు. రైల్వే ఆస్తులను నష్టపరిచితే, ఆ నష్టం ప్రజలకే కాని, ఎస్.కె.పాటిల్కు కాదు. తంతి, తపాలా సౌకర్యాలకు చెరుపు చేస్తే, ఆ చెరుపు ప్రజలకే కాని, సత్యనారాయణ సిన్హాకు కాదు. రేడియో స్టేషన్లకు చిచ్చుపెడితే,ఆ చిచ్చు తిరిగి ప్రజాక్షేమానికే కాని, రాజబహదూర్కు కాదు.

ఈ మంత్రులపట్ల, వారు ఏ ప్రభుత్వంలో సభ్యులో ఆ ప్రభుత్వ విధానాల పట్ల అసంతృప్తిని వెల్లడించడానికి ఉత్తమోత్తమమైన మార్గం వారిని, వారి ప్రభుత్వాన్ని పదవీభ్రష్టులను చేసి, మరొక ప్రభుత్వాన్ని ఎన్నుకొనడం మాత్రమే. ముందెన్నడో కాక, మరి నాలుగు నెలల లోపలనే ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరితే త్రోసివేయడానికి జనరల్ ఎన్నికలు జరగబోవడం లేదా? అయినప్పుడు, తమ వేలితో తమ కంటినే పొడుచుకొన్న చందాన వ్యవహరించడం తగునా?

ప్రస్తుతం ప్రభుత్వాన్ని వెనక వేసుకు రావడానికి మేము ప్రయత్నించడం లేదు. శాంతిభద్రతలను సంరక్షించడం ఏ ప్రభుత్వానికైనా ప్రథమ బాధ్యత. దానినైనా ఇది సరిగా నిర్వహించలేక పోతున్నప్పుడు దీన్ని వెనుక వేసుకు రావడానికి మే మెందుకు తాపత్రయపడాలి? కాని, ఈ ప్రభుత్వ స్థానంలో మరొకటి వచ్చినా, మన శాసనాలను ఇప్పటివలె మనమే గౌరవించకపోతే, ఇప్పటివలె చీటికీమాటికీ విధ్వంసక చర్యలు కొనసాగిస్తే, ఇప్పటివలె సంఘ విద్రోహక శక్తులు చెలరేగడానికి అవకాశాలను కల్పిస్తూపోతే, ప్రజాస్వామ్య వ్యవస్థ మాట అటుండగా, మన దేశానికి స్వతంత్ర ప్రతిపత్తి సైతం మిగలబోదు!

చైనా, మన సరిహద్దులపై దండెత్తిననాటి కంటే నేడు నిశ్చయంగా మన దేశం మరింత విపత్కర పరిస్థితిలో ఉంది. ఇది ప్రతి ఆలోచనాపరుని ఖిన్నునిచేసే ఘట్టం; ప్రతి జాతీయవాదిని కలవరపరచే సందర్భం; ప్రతి ప్రజాస్వామ్యవాది కంటికి నిద్రను దూరం చేసే సన్నివేశం! (ఆంధ్రజ్యోతి 9-10-1966).

లోకం పోకడ

లోకం పోకడ

(వర్తమాన రాజకీయాలపై సమీక్షా వ్యాసాలు)

"పేరు కమలాక్షి, చూపులు కాకి చూపులు".

"పేరు గంగాభవాని, తాగబోతే నీటి చుక్క లేదు".

"పేరు జీలకర్ర, చూడబోతే కర్రలేదు".

ఈ సామెతలు మనకు ఉత్తినే పుట్టలేదు. ఈ సామెతలే కావు, ఏ సామెతలైనా ఉత్తినే పుట్టవు. వాటి వెనక విశేష పరిశీలన ఉంటుంది, విస్తృత జీవితానుభవం ఉంటుంది. ఒక విపుల సత్యాన్ని వీలైనన్ని తక్కువ మాటలలో కుదించగల ప్రజ్ఞ ఉంటుంది. ఏ జాతిలోనైనా అది సత్యాన్వేషకులు, అజ్ఞాత రుషులు దాని సామెతలను అప్రయత్నంగా కూర్చినవారే!

మన సామెతలు హెచ్చరిస్తున్నట్టు ఒక వ్యక్తి పేరుకు, ఆ వ్యక్తి స్వభావానికి సామ్యం తక్కువ కావచ్చు, వాటి మధ్య పూర్తి వైరుధ్యమే కానరావచ్చు. ఇందుకు కొన్ని ముఖ్య కారణాలు లేకపోలేదు. పూవు పుట్టగానే దాని పరిమళం తెలిసినట్టు, పాప పుట్టగానే దాని స్వభావం తెలియదు. పైగా, శిశువు స్వభావం తెలుసుకున్న మీదటనే ఆ స్వభావానికి తగు పేరు పెట్టవచ్చునని అంతవరకు ఏ తల్లిదండ్రులూ ఆగరు. ఏ దేవతకో మొక్కుకొన్నామని ఆ దేవత పేరును ఈ లోపుగానే పెట్టడం కద్దు. లేదా ఏ తాత పేరునో, అవ్వ పేరునో, ఏ మామ పేరునో, అత్త పేరునో తగిలించడం కద్దు. దీన్ని పాత పద్ధతిగా కొట్టిపారవేసే వారు తమకు ప్రేమ గౌరవాలున్న ఏ మహానాయకుని పేరునో, నాయకురాలి పేరునో తమ బిడ్డకు అంటకట్టడం కద్దు. ఈ చివరిది ఎంతో అనాలోచితమైన పని. గాంధీ, టాగోర్, నెహ్రూ, బోస్, ఝాన్సీలక్ష్మీ మొదలైన పేర్లను బిడ్డలకు పెట్టడం పుట్టుకతోనే వారి మెడకు ఒక గుదిబండను కట్టడమే! లెనిన్, స్టాలిన్, మావో మొదలైన పేర్లను పెట్టడం మరింత నిర్దయను చూపించడం!

ఏమైనా, ఒక వ్యక్తి నామధేయానికి, ఆ వ్యక్తి స్వభావానికి సామ్యం కంటే వైరుధ్యమే మనకు తరచు కనబడుతూ ఉంటుంది. మనకు తెలిసిన వారిలోనే నోటి వెంట పొరపాటుగానైనా నిజం రాని సత్యమూర్తు లెందరు లేరు? అందవికారానికి మారుపేరుగా చెప్పదగు సుందరమ్మ లెందరు లేరు? ప్రసాదగుణం వారిలో కలికానికైనా లేకపోగా, కడుపులో పుట్టెడు చేదు విషాన్ని దాచిపెట్టుకొంటూ, చెంతచేరిన వారి గొంతు తడిగుడ్డతో కోసే ప్రసాద్ నామధేయు లెంతమంది లేరు? ఆత్మ పరీక్ష చేసుకొనగల శక్తి కొరవడినప్పుడు మనకు తెలియక పోవచ్చుగాని, మన పేర్లకు, మన స్వభావాలకు మధ్య ఇట్టి వైరుధ్యం పుష్కలంగానే ఉండవచ్చు.

ఒక మనిషి స్వభావాన్ని అతడి పేరు వ్యక్తం చేయవచ్చు, చేయకపోవచ్చు. స్వభావాన్ని దానిపేరు వీలైనంత స్పష్టంగా సూచించగలగాలి. రచన చేయగల శక్తి ఉన్న ఏమంత కష్టమైన పని కాదని అనిపించవచ్చు. అయితే, వ్యక్తికి దానికి నామకరణం చేయడం ఇది అన్ని సందర్భాలలో నిజం కాదు. ఒక్కొక్కప్పుడు ముందుగానే ఒక పేరు స్ఫురించడం, రచనకు వలసి ఊహాబలాన్ని, ఆ బలానికి వలసి ఆవేగాన్ని అదే కలిగించడం సంభవించవచ్చు. అయితే, ఇట్టి సన్నివేశాలు బహుస్వల్పం. సర్వసాధారణంగా రచనను పూర్తిచేసిన పిదపనే దానికి తగు పేరుకోసం పెనగులాట ప్రారంభమౌతుంది. ఎంత పెనగులాడినా సరైన పేరు కుదరకపోతే ఏదో ఒక పాత పేరునే ఎన్నుకొనడం అప్పుడప్పుడు జరుగుతుంది. షేక్స్పియర్ అత్యద్భుత ప్రజ్ఞా ప్రాభవాలున్న కవి, నాటకకర్త. అట్టి షేక్స్పియర్ సైతం తన నాటకాలలో ఒక దానికి ఏమి పేరు పెట్టదగునో తేల్చుకొనలేక పోయినందునే "యాజ్ యు లైక్ ఇట్" అనే ఉండాలి. దీని తాత్పర్యం "ఎంత తన్నుకొన్నా దీనికి తగుపేరు నాకు తట్టలేదు. అందువల్ల ఎవరికి నచ్చిన పేరుతో వారు దీన్ని పిలవవచ్చు" అని చెప్పడమే కదా?

నా మిత్రుడు, అప్పుడు విద్వాన్ విశ్వం "మా పత్రికకు మీకు తోచిన వారం వారం ఒక వ్యాసాన్ని రాస్తూ ఉండండి" అని కోరినప్పుడు అందుకు సంతోషంగా సమ్మతించాను. ఆ శీర్షికను ఆయనే సూచించి ఉంటే, నా పని తేలికపడి ఉండేది. ఆ నిర్ణయాన్ని ఆయన నాకే విడిచిపుచ్చినందున వారం, పది రోజులపాటు ఎంతో మథనపడవలసి వచ్చింది. ఇదివరలో "మాటా మంతీ", "పిచ్చాపాటీ", "కొత్తా-పాతా" అనే శీర్షికల కింద వ్యాసపరంపరలను వ్రాశాను, వ్యాసాల సంపుటాలను ప్రచురించాను. వాటిలో ఏదో ఒక దాన్ని తిరిగి ఎన్నుకొనడం సబబుగా తోచలేదు. ఇప్పటి నా వయస్సు వెనుకటిది కాదు, దృక్పథం వెనుకటిది కాదు, విశ్వాసాలైనా వెనుకటివి కావు. ఇటీవల కొందరు "ఒక్కొక్క ఏడు పైబడిన కొద్దీ నార్ల మరింత వెర్రివాడౌతున్నాడు" అని నన్ను చాటుమాటుగా ఆక్షేపణ చేస్తున్నట్టు, అవహేళన చేస్తున్నట్టు నాకు తెలుసు. నాలో నానాటికి పెరుగుతున్నది వెట్టితనమో, విప్లవతత్వమో దాన్ని కాలమే నిర్ణయించాలి. ఏమైనా, ఇప్పటి నా దృక్పథాన్ని, నా విశ్వాసాలను నా కొత్త వ్యాస పరంపరలో వెల్లడించాలంటే, అందుకు ఏదో ఒక కొత్త శీర్షికను ఎన్నుకొనక తప్పదు. కాని, దేన్ని ఎన్నుకొనడం? ఆలోచిస్తూపోగా స్ఫురించిన శీర్షిక లన్నింటిలో "లోకం పోకడ" నేను వ్రాయబోతున్న వ్యాస పరంపరకు సముచితమైంది కావచ్చునని తోచింది. "లోకం" అనే మాటకు మనకు వెంటనే తోచే అర్థం "భూలోకం" అని మాత్రమే. కాని, "సూర్యరాయాంధ్ర నిఘంటువు"లో కేవలం మన భూలోకంతోనే సరిపుచ్చక ఏడు ఊర్ధ్వ లోకాలను (భూలోకం, భువర్లోకం, సువర్లోకం, మహర్లోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకం) మరి ఏడు అధోలోకాలు (అతలం, వితలం, సుతలం, రసాతలం, తలాతలం, మహాతలం, పాతాళం) మొత్తం పధ్నాలుగు లోకాలను పేర్కొన్నారు. ఇంతేకాక, ఆ నిఘంటు కర్తల మతం ప్రకారం "లోకం" అంటే ప్రజ కావచ్చు, పాలితవర్గం కావచ్చు, సమూహం కావచ్చు, రాష్ట్రం కావచ్చు, సామాన్య మానవ జీవితం కావచ్చు.

సంస్కృత పదాలకున్న నానార్థాలలో ఒక్కొక్క దేశ భాషా ప్రాంతంలో ఏదో ఒకటి రూఢార్థం కావడం కద్దు. మన తెలుగుకు సంబంధించినంత వరకు "లోకం" అనే దానికి రూఢార్థం "జగత్తు" కాగా, హిందీ ప్రాంతంలో "ప్రజ" అని. అందువల్లనే కేంద్రంలోని మన ప్రజా సభను "లోకసభ" అని పిలుస్తున్నారు. "లోకం" అనే మాటను "ప్రజ" అనే అర్థంలో మనం వాడుతున్నది నాకు తెలిసినంతవరకు "లోకులు కాకులు" అనే సామెతలోనే.

"పోకడ" సంస్కృత పదం కాదు, అచ్చ తెలుగు మాట. అయినా, దానికీ విభిన్నార్థాలున్నాయి. తిరిగి "సూర్యరాయాంధ్ర నిఘంటు" కర్తల మతం ప్రకారం "పోకడ" అంటే గమనం, చేష్ట, నడత, నీతి, మర్యాద, చావు, నాశం, భంగం వగైరా, వగైరా. ఇందువల్ల "లోకం పోకడ" అనే శీర్షిక కింద ప్రపంచ రాజకీయాలు మొదలుకొని పంచాయతీలలో జుట్టుపట్టుల వరకు దేన్ని గురించైనా రాయవచ్చు. అయితే, ఒక నియమాన్ని మాత్రం నేను పాటించబోతున్నాను. నాకు తెలియని విషయాల జోలికీ, తెలియడానికి వీలులేని విషయాల జోలికి నేను వెళ్ళబోను. ఉదాహరణకు, మన ప్రాచీనులు పేర్కొన్న పధ్నాలుగు లోకాలలో ఒకదాన్ని గురించి మాత్రమే నాకు తెలుసు. అది మన భూలోకం. అందువల్ల తక్కిన పదమూడు లోకాలను గురించి నేను పట్టించుకోను. అన్నట్టు, ఊర్ధ్వ లోకాలలో భూలోకంతోపాటు జనలోకాన్ని మన ప్రాచీనులు పేర్కొన్నారు. ఈ రెండింటికి మధ్య వారికి ఏమి భేదం కనబడిందో నాకు తెలియదు, తెలుసుకొనవలెనన్న కుతూహలమైనా లేదు.

ప్రాచీనుల పట్ల (వారు మనదేశం వారైనా, పరదేశాల వారైనా) నాకు గౌరవం లేకపోలేదు గాని, వారి విజ్ఞాన పరిధులు బహు సంకుచితమైనట్టివి. ఒక జనక మహారాజును, ఒక యాజ్ఞవల్క్యుని, ఒక పెరికెజ్ను, ఒక ప్లేటోను ప్రాచీనులకు ప్రతినిధులుగా తీసుకొంటే, వారి విజ్ఞానం కంటే ఈనాడు ఒక బి.ఎస్సి. విజ్ఞానం నూరు రెట్లు హెచ్చు, వెయ్యి రెట్లు హెచ్చు. ఈ మాట అన్నందుకు కొందరు నాపై విరుచుకు పడతారని నాకు తెలుసు. అయినా, ఇది ముమ్మాటికీ నిజం. ప్రాచీన మేధావులతో పోల్చుకున్నప్పుడు

వ్యక్తులుగా మనం వాలఖిల్యులమే కావచ్చు. అయితే, మనం వారి భుజాలపై నిలబడి ఉన్నాం. అందువల్ల వారు చూడలేకపోయిన దూరాలకు మనం దృష్టిని సారించ గలుగుతున్నాం, వారికి అంతుబట్టని సత్యాలను కనుగొన గలుగుతున్నాం.

వారం వారం నేను వ్రాయబోతున్న వ్యాసాలకు "లోకం పోకడ" అనే శీర్షికను నేను ఎందుకు ఎన్నుకొన్నానో, నా వ్యాసాల ధోరణి ఏమి కానున్నదో ఈ సరికి మీకు స్పష్టపడి ఉండాలి. అయినా, మరొక్కమాట, కొత్త ధోరణిలో ఆలోచించడానికి నేను సతతం ప్రయత్నం చేస్తాను, నా పాఠకులలో కొత్త ధోరణి ఆలోచనలను రేకెత్తించడానికి కృషి చేస్తాను. ఈ వ్యాస పరంపరలో సైతం ఇదే నా ప్రధాన లక్ష్యం కాబోతుంది.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో వ్యాసం 18-5-1977).

ఎమర్జెన్సీ ఇరవై నెలలలో

పంచుకొన్నప్పుడు సుఖం పెరుగుతుంది. చెప్పుకొన్నప్పుడు బాధ తగ్గుతుంది. ఎమర్జెన్సీ ఇరవై నెలలలో నేను పడింది యమబాధ అయినా, దాన్ని చెప్పుకొనబోతే వినేవారు చెదురుగాతప్ప తటస్థ పడేవారుకాదు. వారైనా ఒకటి, రెండు నిమిషాలలోనే అన్యప్రసక్తిని తీసుకురావడానికి ప్రయత్నించేవారు. ఇందిరా గాంధీ నిరంకుశత్వాన్ని, లేదా ఆమె సుపుత్రుడు సంజయ్ గాంధీ నికృష్టత్వాన్నీ నేను కాస్త విమర్శించేసరికి "అప్పుడే ఎండలు ముదిరిపోయాయి" అనే వారు, "ఆదివారాలనాడు యాబిట్స్లో మీ పుస్తకాల వేట ఎలా సాగుతుంది?" అనేవారు, "ఈ ఏడు పంట రాలుబడి మరీ తక్కువ, రైతులకు ఖర్చులైనా మళ్ళవు" అనేవారు, ఇట్టి అప్రస్తుతపు ప్రసక్తిని మరిదేనికైనా తెచ్చేవారు. దాన్ని పట్టించుకొనక, నా ధోరణిలో నేను మాట్లాడుతూ పోతే, ఏదో సాకు చెప్పి చల్లగా జారుకొనేవారు.

అయినా, ఇందుకు వారిని నేను తప్పుపట్టను. నాలో ఒక పెద్ద లోపం ఉంది. పెద్ద పెద్ద కేకలు వేయకుండా కోపాన్ని వెల్లడించవచ్చు; పెడబొబ్బలు పెట్టకుండా బాధను వ్యక్తం చేయవచ్చు. అయితే, అది నాకు మొదటి నుంచీ చేతకాని పని. పైగా, రాను రాను చెవుడు హెచ్చుతున్నందున ఏమి మాట్లాడినా గొంతు చించుకొంటున్నట్లు మాట్లాడ్డం పరిపాటి అయిపోతుంది. అయినప్పుడు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఇంటి పెంకులు ఎగిరిపోయేటట్టు నేను మాట్లాడుతూపోతే ఎవరు వింటారు, ఎందుకు వింటారు? అన్నింటికీ నేను తెగిస్తే తెగించవచ్చు; నా కారణాన తాము కష్టనష్టాలలో ఎందుకు చిక్కుకోవాలి, కడగండ్లను ఎందుకు కొనితెచ్చుకోవాలి?

బ్రిటీష్ వారి హయాంలోనైనా ఇంతటి భయం ఉండేది కాదు. గాంధీ మనకు, మన జాతికి చేసిన సేవలన్నింటిలో అతి గొప్పది మనలో భయాన్ని తొలగించడమే. నిదానంగా ఆలోచిస్తే, గాంధీ జీవిత సందేశం సత్యవ్రతం కాదు, అహింసా ధర్మ పరిపాలన కాదు, త్యాగనిరతికాదు, కష్ట సహిష్ణుతకాదు, ప్రజాసేవానురక్తి కాదు, భయ రాహిత్యం మాత్రమే. ఎవరిలోనైనా దౌర్బల్యాలన్నింటికి బీజం భయమే, వికారాలన్నింటికి మూలం తిరిగి భయమే. భయస్తుడు సూటిగా చూడలేడు, ధాటిగా మాట్లాడలేడు, నిటారుగా నిలబడనైనా లేడు. అతడికి చేతనైంది వంగి వంగి సాములు చేయడమే, వందిమాగదుల కంటే హీనంగా స్తోత్రపాఠాలు చదవడమే. భయస్థుడు నిజానికి బయటికి మాత్రమే మనిషి, లోపల కీటకం. బయటా, లోపలా మనిషి కాగలవాడు భయాన్ని జయించినవాడే. ఈ రహస్యాన్ని గాంధీ ఆకళింపు చేసుకుంది దక్షిణాఫ్రికాలో. ఆ దేశానికి ఆయన వెళ్ళింది సగం మనిషిగా, అక్కడి నుంచి ఆయన తిరిగి వచ్చింది పూర్ణ పురుషుడుగా. ఇంత మార్పు ఆయనలో వచ్చింది దక్షిణాఫ్రికాలో ఉండగా ఆయన భయాన్ని జయించినందునే.

గాంధీకి వలె భయాన్ని పూర్తిగా జయించడం మనకు సాధ్యం కాకపోవచ్చు. కాని, మన నీడను చూచి మనమే భయపడ నక్కరలేదు; గోడలకు చెవులుంటాయని మన ఇంటిలోనైనా మనసు విప్పి మాట్లాడ్డానికి బెదిరిపో నక్కరలేదు; అధికారులకు ఎదురాడితే వారెక్కడ మన పుట్టి ముంచుతారో అని వారి అడుగులకు మడుగులొత్త నక్కరలేదు; రాజకీయ పదవులలో ఉన్న వారి భజన చేయడమే పనిగా పెట్టుకొన నక్కరలేదు. అయినా, ఎమర్జెన్సీ ఇరవై నెలల్లో దాదాపు రోజుకు ఇరవై నాలుగు గంటలు జరిగిన పనులివే! ఎమర్జెన్సీ సమయంలో అధికార పక్షానికి చెందిన మన ఛోటా పొలిటీషియన్స్ సంగతి విడిచిపుచ్చండి. వారిలో నూటికి తొంబై తొమ్మిది మంది నీతి నిజాయితీలను మంటగలిపారు; ఆత్మాభిమానాన్ని విడిచిపెట్టారు; అవకాశవాదాన్ని ఒంటపట్టించుకొన్నారు; పదవిలేకపోతే బ్రతుకే లేదన్న నమ్మకం పెంచుకొన్నారు; ఒకసారి చేజిక్కిన పదవిని నిలుపుకొనడానికై ఏ గడ్డినైనా నొల్లడం నేర్చుకొన్నారు; మూడు నెలలు పదవిలో ఉన్నా మూడు తరాలకు సరిపడగల ముల్లెను మూటగట్టడంలో ఆరితేరారు. ఇట్టి వారు ఏమి చేసినా మనం ఆశ్చర్యపడనక్కర లేదు, ఆవేదన చెందనవసరం లేదు. ఇట్టి వారిలో ఒక వ్యక్తి సంజయ్ గాంధి చెప్పులు మోశాడు; "నీ ముత్తాతకు గులాం గిరి చేశాను, నీ తాతకు చేశాను, నీ తల్లికి చేస్తున్నాను, రేపు నీకూ చేస్తాను" అని సభాముఖంగా విన్నవించుకొన్నాడు. నెహ్రూ కుటుంబం గులాం గిరి మొదలు పెట్టడానికి ముందు ఇతడు బ్రిటిష్ వారి గులాం. అందువల్ల ఇతడు ఏ పదవికి ప్రాకినా, ఎంతటి పదవికి ప్రాకినా, తన రక్తంలో జీతించిపోయిన బానిస బుద్ధిని మార్చుకొనలేక పోతున్నాడు.

ఇంతటి హీనస్థితికి దిగజారకపోయినా, ఇతడిని పోలిన తక్కిన పొలిటీషియన్స్ ఎమర్జెన్సీ కాలంలో ఏమి చేశారన్నది ప్రశ్న కానే కాదు. మన లాయర్లు, ప్రొఫెసర్లు, జర్నలిస్టులు ఏమి చేశారన్నదే ప్రశ్న. మన కవులు, పండితులు, ఇతర మేధావులు ఏమి చేశారన్నదే ప్రశ్న. వీరిలో బహు కొద్ది మందిని విడిచిపుచ్చితే తక్కినవారు ఎమర్జెన్సీని సమర్థించారు. అలహాబాద్ హైకోర్టు శ్రీమతి ఇందిరా గాంధికి వ్యతిరేకంగా తీర్పు చెప్పినంతలో దేశంలో ఆత్యయిక పరిస్థితి (ఎమర్జెన్సీ) ఏర్పడినట్లు ప్రకటన జరగడం వీరికి వింతగా తోచలేదు. ప్రతిపక్షాలకు చెందిన వారితోపాటు స్వపక్షానికి చెందిన కొందరు ప్రముఖులను సయితం అర్ధరాత్రి వేళ అరెస్టు చేయడం, మొత్తం అరెస్టుల సంఖ్య లక్షన్నర దాటిపోవడం వీరికి విడ్డూరంగా అనిపించలేదు. వాక్స్వాతంత్ర్యం, సభా స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం, వృత్తి స్వాతంత్ర్యం, నివాస స్వాతంత్ర్యం, ప్రయాణ స్వాతంత్ర్యం మొదలైన సమస్త ప్రాథమిక స్వత్వాలను ఒక్క కలంపోటుతో రద్దు చేయడం వీరికి విపరీతంగా కన్పించలేదు. పార్లమెంట్ ఆధిక్యాన్ని కాపాడుతున్నామన్న వంకతో న్యాయస్థానాల హక్కులను సంకుచిత పరచడం వీరిలో వైముఖ్యాన్ని పురికొల్పలేదు. ఆరోపణలు లేకుండా, విచారణ లేకుండా, తీర్పు లేకుండా జెయిళ్ళలోకి నెట్టిన వారిని నానాహింసలు పెట్టడం, వారిలో కొందరిని చిత్రవధ చేయడం - ఇదైనా వీరికి ఆగ్రహావేశాలను తెప్పించలేదు. పైపెచ్చు, అరాచక శక్తుల నుంచి దేశాన్ని కాపాడినందుకు శ్రీమతి ఇందిరకు జోహారు లర్పించారు. ఆమెకు బాసటగా నిలిచిన కుమారుని 'ఉదయ భాస్కరుడు'గా ప్రస్తుతించారు. దేశచరిత్రలో "అనుశాసన పర్వం" ప్రారంభమైనట్టు సంతోషాన్ని ప్రకటించారు. అమ్మ ఇరవై సూత్రాలతో, కుమారుని అయిదు సూత్రాలతో నవ సంఘ నిర్మాణం మరి నిరాటంకంగా కొనసాగగలదని ఉద్ఘాటించారు. ఎమర్జెన్సీ ప్రకటన జరిగిన తేదీని - 1975 జూన్ 25వ తేదీని - అమెరికన్, ఫ్రెంచి, రష్యన్, చైనీస్ విప్లవాలను మించిపోగల ఒక మహా విప్లవం ప్రజ్వలించిన తేదీగా పరిగణించాలని ఉద్ఘోషించారు. ఇందిరా గాంధి చలవ వల్ల కాంగ్రెసు గద్దె ఎక్కగలిగిన ఒక బడుద్ధాయి "ఇందిర ఈజ్ ఇండియా; ఇండియా ఈజ్ ఇందిర" అనేసరికి దాన్నే ఒక మహా మంత్రంగా జపించారు. వ్యక్తులు వ్యక్తికి, ఒక దేశానికి అభేదాన్ని కూర్చడం కంటే ఆ దేశం పట్ల మహాపచారం ఉంటుందా? ఇందుకు ఒడిగట్టిన ప్రబుద్ధుడు అస్సామీస్ భాషలో కవిత్వాన్ని గిలుకుతున్నవాడట!

ఒక్క అతనన్న మాటేమిటి? మన కవులలో పెక్కు మంది నికృష్టంగా ప్రవర్తించడంలో ఇతడికి తీసిపోలేదు. శ్రీమతి ఇందిరను మెచ్చుకోవడంలో ఒకరితో ఒకరు పోటీపడి పద్యాలు వ్రాశారు, పాటలు వ్రాశారు, సహస్రనామాలు వ్రాశారు, దండకాలు వ్రాశారు, వాళ్ళ పాడె వ్రాశారు; సభలను, సమ్మేళనాలను జరిపారు; ఒకనాటి భోగం మేళాల స్థానాన్ని ఇప్పుడు కవుల మేళాలు

ఆక్రమిస్తున్నాయన్న అభిప్రాయాన్ని కలిగించారు. ప్రభుత్వంతో సహకరించకపోతే, ఏమి విపత్తు రాగలదో అని భయపడి వీరు కాలికి గజ్జె కట్టి ఉంటే, సిగ్గు బిడియాలు విడిచి తైతక్కలాడి ఉంటే, వీరిని హర్షించినా, హర్షించ లేకపోయినా "ప్రాణాలపై ప్రీతితో పోనీలే ఏమో చేశా" రని కొంత వరకైనా సరిపెట్టుకోవచ్చు. కాని, వీరిలో హెచ్చుమంది పద్మశ్రీ కోసం, పద్మభూషణ్ కోసం, డాక్టరేట్ కోసం, ఇట్టి మరొక గౌరవం కోసం ఇంతకు మించిన అవకాశం మరొకటి తమకు లభించక పోవచ్చునని తాపత్రయ పడినవారే! ఆత్మగౌరవాన్ని మూల్యంగా చెల్లించి ఎవరైనా కొనగలిగింది ఆ గౌరవాన్నే, ఆ ప్రతిష్ఠనే!

ఇరవై నెలలకు పైగా లోలోపల అణచి పెట్టుకున్న బాధను వెళ్ళగక్కడంలో నేను తీవ్ర పదజాలాన్ని ప్రయోగిస్తున్నట్టు నాకు తెలుసు. అయితే, మరింత తీవ్ర పదజాలమైనా నేను పడిన బాధను పూర్తిగా వ్యక్తం చేయలేదు. కనీసం ఇప్పుడైనా ఈ విధంగా నేను వ్రాయగలుగుతున్నందుకు నేను చేయెత్తి సమస్కరించ వలసింది మన సామాన్య ప్రజలకే. నిన్నటి ఘన పరిపాలకులేమి, వారి వందిమాగధులేమి ఈ ప్రజలకు కావలసినవి అన్నవస్త్రాలని, ప్రాథమిక స్వత్వాలు కావని చెబుతూ వచ్చారు. నోటి దురద ఉన్నవారికే సభా స్వాతంత్ర్యం లేకపోవడం బాధాకరమని, చేతి దురద ఉన్న వారికే పత్రికా స్వాతంత్ర్యం లేకపోవడం దుస్సహమని చెబుతూ వచ్చారు. ఎన్నటికీ మరపురాని విధంగా వీరికి గట్టిగా బుద్ధి చెప్పిన మన సామాన్య ప్రజలకు ఒక్కసారి కాదు, వేయిసార్లు చేయెత్తి నమస్కరించాలి. (ఆంధ్రప్రభ వారపత్రికలో వ్యాసం 25-5-1977)

"వంశ పారంపర్య ప్రజాస్వామ్యం"

ఒకనాటి తిట్టు మరొకనాటి బిరుదు కావచ్చు. ఎన్నడోకాదు, చాలేళ్ళనాడు "సోషలిస్టు" అంటే తిట్టు; "బద్మాష్" కంటె అది పెద్ద తిట్టు. కాని, ఈనాడు సోషలిస్టులు కాని వారెవరు? చివరికి హిట్లర్ కూడా సోషలిస్టుగా చెలామణి కావడానికి ప్రయత్నించాడు. తాను సోషలిజానికి బద్ధ విరోధి. సోషలిజంతో పేరులోనైనా పొత్తు కలపకపోతే అది ప్రజాదరణ పొందలేదని దాన్ని అతడు "నేషనల్ సోషలిజం" అన్నాడు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉన్నదో నేషనల్ సోషలిజంలో సోషలిజం అంత ఉన్నది.

మరి కాస్త వెనుకకు మనం వెళ్ళితే, "రిపబ్లికన్" అంటే తిట్టు; "జాకోబిన్" అంటే మరింత చెడ్డ తిట్టు. ఫ్రెంచి విప్లవకాలంలో నేమి, అంతకు పూర్వమేమి ఈ తిట్టు పడిన వారు మరెవ్వరోకాదు, రాజులు, రాజరికాలు పోవాలన్నవారే, ప్రజాస్వామ్య వ్యవస్థ నెలకొనవలెనన్న వారే!

రాజులు, రాజరికాలు ప్రాబల్యం వహించడానికి పూర్వం ప్రజాసభ లుండేవి, ప్రజాసమితులుండేవి, వాటి ద్వారా ప్రజలు తమను తామే పరిపాలించుకొనేవారు. తమ ప్రతినిధులను వారు "ఛందము" (ఓటు) ద్వారా ఎన్నుకొనేవారు. క్రీస్తుకు పూర్వం రెండున్నర వేల సంవత్సరాల వరకు కూడా మన దేశంలో అక్కడక్కడ ప్రజాస్వామ్యాలు ఉండేవి. ఉదాహరణకు, గౌతమబుద్ధుడు ప్రభవించింది శాక్య ప్రజాస్వామ్యంలో మహావీరుడు పరిఢవిల్లింది లిచ్ఛవీ ప్రజాస్వామ్యంలో.

ఒకనాటి ప్రజాస్వామ్యాలను అణచివేసి, రాజులు, రారాజులు పైకి వచ్చినంతనే రాజు లేకపోతే, రాజరికం లేకపోతే, ప్రపంచం తలక్రిందులు కాగలదన్న ప్రచారం బహు రూపాలలో బహుళంగా జరిగింది. ఈ ప్రచారం ఎంతవరకు వెళ్ళిందో మన రామాయణ, భారతాలను, మన పురాణాలను చూస్తే తెలుస్తుంది; కౌటిల్యుని అర్థశాస్త్రం", "శుక్రనీతి సారం", "కామందకీయ నీతి శాస్త్రం" మొదలైన రాజనీతి గ్రంథాలను చూస్తే తెలుస్తుంది; మను, వసిష్ఠ, నారద, ఆపస్తంబాది ధర్మశాస్త్రాలను చూచినా తెలుస్తుంది. ఇందుకు మచ్చుతునకలుగా వాల్మీకి రామాయణం (అయోధ్యాకాండ, 67వ వర్గ) లోని కింది హెచ్చరికలను గమనించండి : రాజులేని దేశంలో

వానలు కురవవట; పంటలు పండవట; తోటలు పెరగవట; వర్తక వ్యాపారాలు సాగవట; యజ్ఞయాగాదులు జరగవట. తండ్రి మాటను కొడుకు వినడట. ఖాతరు చేయదట. రాజులేని దేశం నీరులేని ఏటివలె, పచ్చికలేని విపినంవలె, కాపరిలేని పశువులవలె కళావిహీనం కాగలదట. దానిలో నాస్తికులకు పట్టపగ్గాలుండవట, సత్యం దాని నుంచి పారిపోగలదట. రాజే ప్రజలకు తల్లి, అతడే తండ్రి, అతడే హితుడు, అతడే సర్వం కాబట్టి, అతడు లేకపోతే లోకం చీకటిలో మునిగిపోతుందట! ఇంతకు మరింత దూరం వెళ్ళి, భూసురులకు ఒక మెట్టు కిందగా, ఇతరులకు చాలా మెట్లు పైగా, మన ధర్మశాస్త్రాలు రాజులను, రాజాధిరాజులను కూర్చోబెట్టాయి; దైవాంశ సంభూతులుగా వారిని ప్రస్తుతించాయి.

ఇప్పుడేమో కాలం మారింది, విశ్వాసాలు మారాయి, ఆర్థిక, సాంఘిక వ్యవస్థలు మారాయి, జీవిత విధానంలోనే మార్పు వచ్చింది. అందువల్ల ఈనాటి ప్రపంచంలో మిగిలిన రాజులు, చక్రవర్తులు బహు కొద్ది మంది మాత్రమే. వారైనా పాత ప్రతిపత్తితో కాదు, పూర్వాధికారాలతో కాదు. పైగా, రాజరికం మిగిలిన వాటిని మధ్యయుగం నుంచి పూర్తిగా బయటపడని దేశాల క్రింద జమపడుతున్నారు. అయినా, కొన్ని దేశాలు రాజుల కోసం, వారి పటోటాపం కోసం కొంత హెచ్చుగానే ఖర్చు పెట్టడం, టూరిస్టులను ఆకర్షించడం ద్వారా వారు తమపై పెట్టుబడికి మించిన ఆదాయాన్ని సంపాదించి పెట్టగలుగుతున్నారన్న ఆలోచనతోనే కావచ్చు!

జర్మనీ కెయిజర్, ఆస్ట్రియా ఎంపరర్, రష్యా జార్, టర్కీ సుల్తాన్ మున్నగువారు తొలగిపోవడంతో మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత రాజుల సంఖ్య, రారాజుల సంఖ్య సగానికి పైగా తగ్గింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ముప్పాతికకు పైగా తగ్గింది. మూడవ ప్రపంచ యుద్ధంతో నిమిత్తం లేకుండానే నలుగురు రాజులుమాత్రమే - ఇస్పేటురాజు, ఆఠీనురాజు, కళావరు రాజు, డైమాను రాజు మాత్రమే మిగిలినా మిగలవచ్చు.

రాజుల స్థానంలో పెక్కు మంది నియంతలు ఈ శతాబ్దంలో తలయెత్తక పోలేదు. అయినా, వారు సయితం దీన్ని ప్రజాస్వామ్య శతాబ్దంగా గుర్తించక తప్పడం లేదు. గత్యంతరం లేకపోయినందునే ఎంతటి పచ్చి నియంతలైనా తమ నియంతృత్వ వ్యవస్థకు ప్రజాస్వామ్యంతో ఏదో బాదరాయణ సంబంధం ఉన్నట్టు చూపించడానికి తాపత్రయపడుతున్నారు.

రాజులేనిది రిపబ్లికన్ వ్యవస్థకాని, ప్రజాస్వామ్య వ్యవస్థ కాదు. పోతే, పార్లమెంట్ ఉన్నతికి, విధిగా ప్రజాస్వామ్య వ్యవస్థ కానక్కరలేదు. బుల్లెట్ ద్వారా కాక, బ్యాలెట్ ద్వారా ప్రభుత్వాన్ని మార్చడానికి పూర్తి స్వేచ్ఛను కల్పించేదే సిసలైన ప్రజాస్వామ్య వ్యవస్థ. ఆ స్వేచ్ఛ లేనప్పుడు ఒక పార్లమెంట్ ఉన్నా, వానికి నాలుగైదు సంవత్సరాలకొకసారి జనరల్ ఎన్నికలు జరిగినా, అది పేరుకు మాత్రమే ప్రజాస్వామ్య వ్యవస్థ. హిట్లర్, ముసోలీని, ఫ్రాంకో, సాల్జార్లు తమ దేశాలలో అప్పుడప్పుడు ఎన్నికలు జరిపించేవారు. అయితే "ఒకే పార్టీ, ఒకే పతాక, ఒకే నాయకుడు" అనే ప్రాతిపదికపై అవి జరిగేవి. ఏ మాటకు ఆ మాట చెప్పాలి కాబట్టి, ఈ నలుగురు నియంతలు తాము ప్రజాస్వామ్య వ్యవస్థను పరిపోషిస్తున్నట్టు నటన చేసేవారు కాదు. పైపెచ్చు, ప్రజాస్వామ్యాన్ని వీరు నిరసించే వారు, పరిహసించే వారు. ఈ నియంతల ప్రభుతకు తమది భిన్నమైనదని చెప్పడం కోసమే కావచ్చు. సోవియట్ యూనియన్ తన రాజ్యాంగ వ్యవస్థను "పీపుల్స్ డెమొక్రసీ"గా పేర్కొంటున్నది. తూర్పు, మధ్య, దక్షిణ యూరప్ లోని కమ్యూనిస్టు రాజ్యాలు ఈ విషయంలో (తక్కిన పెక్కింటిలో వలె) రష్యాను అనుకరిస్తున్నాయి. నాజీ జర్మనీలోవలె, ఇతర ఫాసిస్ట్ రాజ్యాలలో వలె, ఈ కమ్యూనిస్టు దేశాలలో సయితం ప్రతిపక్షాలకు తావు లేదు. అందువల్ల ఒకే పార్టీ, ఒక్కొక్క నియోజక వర్గంలో ఒక్కొక్కడు మాత్రమే అభ్యర్థి - ఈ ప్రాతిపదికపైనే వీటిలో ఎన్నికలు జరుపుతున్నారు.

మరింత నిష్కర్షగా అయినప్పుడు ఇవి లాంఛనప్రాయమైన ఎన్నికలు మాత్రమే కావా?

చెప్పాలంటే, ఇవి కేవలం ఒక నాటకం, ఒక బూటకం మాత్రమే కావా? కాస్త కుడి ఎడంగా ఇట్టి నాటకాన్ని ఆడటానికే, ఇట్టి బూటకాన్ని జరపడానికే ఇండోనీషియాలో యత్నించిన సుకర్ణో తన వ్యక్తిగత నియంతృత్వ వ్యవస్థను "గైడెడ్ డెమొక్రసీ" అన్నాడు; పాకిస్తాన్లో అయూబ్ తన సైనిక నియంతృత్వాన్ని "బేసిక్ డెమొక్రసీ" అన్నాడు; నేపాల్లో త్రిభువన్ తన రాజరికం నియంతృత్వాన్ని "పంచాయతీ డెమొక్రసీ" అన్నాడు. కాగా, మావో తన నియంతృత్వానికి తానై ఒక పేరు పెట్టలేదు; ఆ పనిని ఆయన మిత్రుడు ఎడ్గార్ స్నో చేశాడు. మావో నియంతృత్వానికి స్నో పెట్టిన పేరును గురించి వ్రాయడానికి ముందు స్నో విషయమై నాలుగు ముక్కలు చెప్పాలి. అతడు పుట్టింది, పెరిగింది అమెరికాలో; ఎక్కువగా తిరిగిందీ, పనిచేసిందీ ఆసియాలో. కొన్ని అమెరికన్ పత్రికలకు, మరికొన్ని బ్రిటిష్ పత్రికలకు ప్రత్యేక విలేకరిగా అనేక సంవత్సరాల పాటు అతడు చైనాలో ఉన్నాడు. అక్కడనే కొంతకాలంపాటు యూనివర్సిటీ ప్రొఫెసర్గా కూడా పనిచేశాడు. "లాంగ్ మార్చ్" తర్వాత ఎనాన్ రాజధానిగా షెన్సీ రాష్ట్రంలోనే దాని పరిసరాలలో తన ప్రభుత్వాన్ని నెలకొల్పిన మావోను 1936లో మొట్టమొదటగా కలుసుకొనగలిగిన పాశ్చాత్య పత్రికా విలేకరి, మావోను ప్రపంచానికి ప్రప్రథమంగా పరిచయం చేసిన రచయిత అతడే. కేవలం మావోను గురించి మాత్రమే కాక, ఆయన విప్లవ భావాలను గురించి, ఆయన విప్లవ విధానాలను గురించి, విశ్లేషించి, ఆయన గెరిల్లా యుద్ధ పద్ధతులను గురించి 1937లో తాను ప్రచురించిన "రెడ్ స్టార్ ఓవర్ చైనా" అనే గ్రంథంలో స్నో విపులంగా వ్రాశాడు. ఈ కారణాన ఇండియా, బర్మా, మలయాలలో జాతీయ విప్లవకారులు దాన్ని గెరిల్లా యుద్ధానికి ఒక పాఠ్య గ్రంథంగా వినియోగించుకొన్నారు. ఈ సంగతిని తెలుసుకున్న బ్రిటిష్ సామ్రాజ్యాధిపతులు దాన్ని నిషేధించారు. ఈ నిషేధం ఆకర్షణను పెంచుతుంది. అందువల్ల "రెడ్ స్టార్" పై నిషేధం తర్వాత దాని పాఠకుల సంఖ్య మరింతగా పెరిగింది.

"రెడ్ స్టార్ ఓవర్ చైనా" ద్వారా తనను ప్రపంచం దృష్టికి తెచ్చిన ఎడ్గార్ స్నోను తన అతిథిగా చైనాలో పర్యటించవలసిందిగా 1960లో మావో ఆహ్వానించాడు. ఆనాటికి జెనీవాలో స్థిరపడిన స్నో తిరిగి చైనాకు వెళ్ళి, పద్నాలుగు రాష్ట్రాలలో పర్యటించి, పందొమ్మిది ప్రధాన నగరాలను సందర్శించి, ప్రభుత్వ నాయకులతోనేకాక, సామాన్య పౌరులతో సుదీర్ఘ సంభాషణలు జరిపి, "ది అదర్ సైడ్ ఆఫ్ ది రివర్" అనే పేరుతో ఒక పెద్ద పుస్తకాన్ని వ్రాశాడు. అతడు రచించిన పది, పన్నెండు గ్రంథాలలో "రెడ్ స్టార్" తర్వాత ఇదే విశేష ప్రశంసలను అందుకొన్నది. స్నో తనను గురించి వ్రాసిన మొదటి పుస్తకం కంటే ఈ రెండవది మావోను మరింత

సంతోషపరచి ఉండాలి. అందువల్లనే కావచ్చు, స్నోకు పెద్ద జబ్బు చేసినట్టు వినగానే మావో తన సొంత డాక్టర్లను బెమీకు పంపించాడు. అయితే, వారు అతడిని కాపాడలేకపోయారు.

స్నో పుట్టింది 1905లో; అతడు చనిపోయింది (నా జ్ఞాపకం ప్రకారం) రెండు. మూడేళ్ళ క్రితం.

అసలు విషయానికి తిరిగి వచ్చి ఇప్పుడిక చెప్పవలసిన మాట చైనాలో మావో నియంతృత్వానికి ఎడ్గార్ స్నో పెట్టిన పేరు "డెమొక్రాటిక్ డిక్టేటర్షిప్" అని. ప్రజాస్వామ్యానికీ, నియంతృత్వానికి పొద్దెదురు. అయినా, చైనాలోని రాజ్యాంగ వ్యవస్థను ప్రజాస్వామ్య బద్ధమైన నియంతృత్వంగా స్నో చెప్పడం మావోపట్ల వల్లమాలిన ప్రేమాభిమానాల వల్ల కావాలి, లేదా ప్రజాస్వామ్యం స్వరూప స్వభావాలను అవగతం చేసుకొనగల విజ్ఞత కోల్పోయినందువల్ల కావాలి. మావో చైనాలో "డెమొక్రాటిక్ డిక్టేటర్షిప్" నెలకొల్పగా తన ఇండియాలో 'డైనాస్టిక్ డిక్టేటర్ షిప్' (వంశపారంపర్య ప్రజాస్వామ్యం) ఎందుకు సంస్థాపించరాదన్న ఉబలాటంతో శ్రీమతి ఇందిర ప్రియదర్శిని నెహ్రూ గాంధి (ఓటర్ల లిస్టులో ఇది ఆమె పూర్తి పేరు) గట్టి ప్రయత్నం చేసింది. ఈ ప్రయత్నం 1971 నాటి మధ్యంతర ఎన్నికలలో ఆమె అఖండ విజయం పొందినప్పుడే ప్రారంభమైనట్లు చెప్పవచ్చు. మరింత వెనుకకు వెళ్ళి హోం, ఫైనాన్స్, డిఫెన్స్ మున్నగు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన గూఢచార విభాగాలను ఆమె తన అధీనంలో పెట్టుకొన్నప్పుడే ప్రారంభమైనట్టు చెప్పవచ్చునేమో కూడ. ఏమైనా, 1975 జూన్ 25వ తేదీ ఎమర్జెన్సీ ప్రకటన తర్వాత ఆమె పేరుకు మాత్రమే ప్రధాని. నిజానికి నియంత. నాటి నుంచి ఆమెను

మించి నియంతగా వ్యవహరించిన ఘనత ఆమె రెండవ కుమారునికి తగు సమయం చూచి, తాను పదవి నుంచి తప్పుకొని తన కుమారుని నియంతగా చేయడానికి తొలిచర్యగా ఆమె మొన్నటి జనరల్ ఎన్నికలను జరిపించి ఉండవచ్చు. ఏమైనా, మన రోజులు బాగున్నందున మన దేశంలో "డైనాస్టిక్ డెమొక్రసీ" నెలకొనగల ప్రమాదం కొద్దిలో తప్పింది. లేకపోతే, మన దేశం రెండవ తూరి భరతఖండమై ఉండేది. "ఎలా?" అని ప్రశ్నిస్తున్నారా? అయితే, నా సమాధానం వినండి : శ్రీమతి ఇందిర ప్రియదర్శిని నెహ్రూ గాంధీ కుటుంబంలో ఇప్పుడొక మేనక ఉండనే ఉన్నది. ఆమె ఒక శకుంతలను కని ఉండేది; ఆమె ఒక భరతుని కని ఉండేది; ఆ భరతుడు రాజ్యానికి వచ్చినంతనే మన దేశం రెండవ తూరి భరతఖండమై ఉండేది. ఏమైనా, "డైనాస్టిక్ డెమొక్రసీ" ప్రమాదం ఇప్పటికైనా పూర్తిగా తొలిగినట్టు చెప్పలేము. కాంగ్రెసులో తన స్థానాన్ని బలపరచుకొన్నందునే, ప్రభుత్వంలో తన పదవిని స్థిరపరచుకొన్నంతనే శ్రీమతి గాంధి పార్టీలో నేమి, ప్రభుత్వంలో నేమి తన సహచరులను ఎక్కువ చులకనగా చూచింది. ఆమె దృష్టిలో వారు సహచరులు కారు, అనుచరులైనా కారు, కేవలం బిళ్ళలేని బలవంతులే. అయినా, ఇప్పటికి కూడా వారిలో పెక్కు మంది ఆమె చేతి కీలుబొమ్మలుగానే మెలగుతున్నారు. "ఇందిరా గాంధి ప్రభుత్వంలో మగరాయడు ఆమె మాత్రమే!" అని ఎవరో ఛలోక్తిగా అన్నారు. అది ఎంతో నిజం? మరింతగా అనుకోవలసి వస్తున్నది.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో వ్యాసం 1-6-1977)

హాస్యం - నియంతల పాలిట గరళం

"లోభివాని జంప లోకంబు లోపల మందు వేరువలదు, మతముగలదు" అని వేమన్న చెప్పాడు. "అదేమిటో సెలవివ్వండి, స్వామీ!" అని విన్నపం చేసుకొనగా "పైక మడుగ నతడు భగ్గురుమని చచ్చు" అని వివరించాడు. నియంతలను చంపడానికి ఇట్టి సులభోపాయం మరొకటి ఉన్నది. ప్రత్యేక విన్నపం కోసం వేచి ఉండక దాన్ని నేను వెంటనే వివరించబోతున్నాను. హాస్యమాడితే, ఎంతటి నియంతలైనా అవలీలగా చస్తారు.

మన అలంకార శాస్త్రజ్ఞులు నవరసాలలో హాస్యానికి స్థానం కల్పించక పోలేదు. అయితే, దాన్ని వారు శృంగార, వీర, కరుణ, అద్భుత రసాల తర్వాత అయిదవ స్థానంలో పెట్టడం నా కెంతమాత్రం నచ్చని విషయం. శాంతరసాన్ని వారు మరింత కిందికి త్రోసివేశారనుకోండి. దానికి వారు చిట్టచివర స్థానమిచ్చారనుకోండి. అయినా, ఇందుకు వారిని ఆక్షేపించలేము. శాంతం జీవితంలో ఉత్తమ గుణం కావచ్చు. ఉదాత్త లక్షణం కావచ్చు. సాహిత్యంలో మాత్రం కాదు. సాహిత్యం పుట్టేది స్తబ్దతనుంచి కాదు, సంఘర్షణ నుంచి; నిర్లిప్తత నుంచి కాదు, నిర్వేదం నుంచి. క్షీర సముద్ర మథనం నుంచి అమృతం పుట్టినట్టు జీవిత మధనం తర్వాత శాంతం ప్రభవించవచ్చు. ఇందువల్ల శాంతాన్ని సాహిత్యంలో ప్రవేశపెట్టవలసింది కావ్యాంతంలోనే; కావ్యారంభంలో కాదు, దాని మధ్యలోనైనా కాదు. మన అలంకార శాస్త్రజ్ఞులు దాన్ని నవరసాలలో చిట్టచివర నిలపడం ఈ సత్యాన్ని గుర్తించినందువల్లనే కావచ్చు.

శృంగార, వీర, కరుణ రసాలను చక్కగా పోషించిన మన ప్రాచీన కవులు హాస్యరసం వద్దకు వచ్చేసరికి ఎన్నదగు ప్రజ్ఞా ప్రాభవాలను చూపలేకపోయారు. హాస్యానికి విదూషకుని ప్రతినిధిగా ఎన్నుకోవడమే ఇందుకు ఒక ముఖ్య కారణం కావచ్చు. ఈనాటి మన సర్కస్ లోని బఫూన్కు మన పాత సాహిత్యంలోని విదూషకుడు దగ్గరి జ్ఞాతి. ఉభయుల హాస్యంలో కొంత మోటుతనం ఉంటుంది, మొరటుతనం సయితం ఉంటుంది. బఫూన్వలె విదూషకుడు కోతి చేష్టలు చేయకపోవచ్చు. కొక్కిరాయి వేషాలు వేయకపోవచ్చు. వాక్చాతుర్యంతో మనను నవ్వించడానికి అతడు ప్రయత్నించవచ్చు. కాని, మొత్తంపై చూస్తే అతడి హాస్యంలో లాలిత్యం తక్కువ, కొన్ని కొన్ని సందర్భాలలో సభ్యతా సంస్కృతులు సయితం తక్కువే.

ఉదాహరణకు వ్యక్తుల మధ్యవలె గుణాల మధ్య సయితం జ్ఞాతి సంబంధం ఉంటుంది. వెక్కిరింతకు వెటకారం దగ్గరి జ్ఞాతి; ఎద్దేవకు ఎత్తిపొడుపు దగ్గరి జ్ఞాతి. ఇదేరీతిగా హాస్యానికి పరిహాసం దగ్గరి జ్ఞాతి. ఈ జ్ఞాతుల వర్గంలో ప్రథమ స్థానమైనా, విశిష్టస్థానమైనా హాస్యానిదే, ముఖ్యంగా లలితమైన హాస్యానిదే.

మెత్తని కత్తివంటిది లలిత హాస్యం. గాయపరచినా, అది రక్తం తెప్పించదు, బాధ పుట్టించదు, గాయపరిచిన వ్యక్తివలె గాయపడిన వ్యక్తి సయితం లలిత హాస్యానికి కిలకిల నవ్వగలడు. అయితే, గాయపడిన వ్యక్తిలో ఎంతో కొంత హాస్యప్రియత్వం స్వభావ సిద్ధంగా ఉండాలి.

అహంకారులకు, గర్విష్ఠులకు, డాంబికులకు హాస్యం చేదు కషాయం; నియంతలకైతే అది పచ్చి గరళం.

హాస్యానికున్న అపార శక్తి తెలిసినవాడు కాబట్టే గురజాడ అప్పారావు తన నోట్బుక్లో ఒకచోట “ఐ విల్ బి టెరిబుల్ యాజ్ ఐ వజ్ హ్యూమరస్" అని వ్రాసుకోగలిగాడు; దానికున్న అమోఘ శక్తి తెలిసినవారు కాబట్టే, నియంతలు మరి దేనినైనా సహించవచ్చుగాని, హాస్యాన్ని సహించలేరు; క్షమించలేరు. హిట్లర్ హయాంలో నాజీ పరిపాలకులను, వారి పరిపాలనను ఎవరు ఏ మాత్రం హాస్యం చేసినా, వారిని గోబెల్స్ తుదముట్టించేవాడు.

అయినా, నియంతలను గురించి ప్రజలు ఏవేవో హాస్య కథలను అల్లుతునే ఉంటారు. చిత్రహింసలకు సిద్ధపడితే తప్ప, ప్రాణాలకు తెగిస్తే తప్ప, నియంతలను బాహాటంగా విమర్శించడానికి వీలు లేదు. అందువల్ల చాటుమాటుగా వారిని ప్రజలు హాస్యం చేస్తారు, చడీచప్పుడు లేకుండా వారిని గురించిన హాస్య కథలను, గాథలను ప్రచారం చేస్తారు. ఈ మాత్రమైనా చేయకపోతే నియంతృత్వంలో అసలే ఊపిరి సలపదు.

వాటి ప్రచారాన్ని నిరోధించాలని గోబెల్స్ ఏమి చేసినా ఎంత చేసినా నాజీ నాయకుల విషయమై నాజీ జర్మనీలో ఎన్నెన్నో హాస్య కథలు ప్రచారంలోకి వచ్చాయి. మచ్చుకు హిట్లరుకు సంబంధించిన ఈ కథ వినండి:

అంగరక్షకులు గాని, అన్యులుగాని వెంటరాకుండా తనొక్కడు వెళ్ళి సినిమా చూడాలని హిట్లర్ ఒకనాడు మనసుపడ్డాడు. హాలులోని లైట్లన్ని ఆఫ్ చేసి, షో మొదలుపెట్టిన తర్వాత బాల్కనీలోకి చల్లగా వెళ్ళి, తక్కిన ప్రేక్షకులతోపాటు తానొక ప్రేక్షకుడుగా అతడు కూర్చున్నాడు. తర్వాత కొద్ది నిమిషాలకే ఒక న్యూసల్లో హిట్లర్ తెరపై ప్రత్యక్షమయ్యాడు. వెంటనే మొత్తం ప్రేక్షకులు తమ సీట్లలోనుంచి లేచి సెల్యూట్ చేస్తూ నిలబడ్డారు; లేచి నిలబడనిది హిట్లర్ మాత్రమే. అతడి వెనుక వరసలో నిలబడిన ఒక వ్యక్తి అతడి భుజాన్ని మెల్లగా తట్టి “వాడు పరమ రాక్షసుడే! కాని, మన మేమి చేయగలమయ్యా! లేచి నిలబడు! లేకపోతే నీ ప్రాణానికే మోసం రావచ్చు!” అని హెచ్చరించాడు!

ఈ విధమైన హాస్యకథలు, గాథలు ముసోలీనీ విషయమై ఇటలీలో, స్టాలిన్, కృశ్చేవ్ ప్రభృతుల విషయమై సోవియట్ యూనియన్లో ప్రచారంలో ఉండేవి. ఆ దేశాలలోనే అన్న మాటేమిటి? నియంతలు ఎక్కడ, ఎప్పుడు తలయెత్తినా ఇంతే జరిగి తీరుతుంది. ఎమర్జన్సీ కొనసాగిన ఇరవై నెలలలో మన దేశంలో శ్రీమతి ఇందిరా గాంధీని గురించి, శ్రీ సంజయ్ గాంధీని గురించి ఎన్ని హాస్య కథలు, గాథలు ప్రచారం కాలేదు. వాటిలో నేను విన్నవాటిని కొన్నింటిని అందిస్తున్నాను:

మొదటి కథ :

ఒరిస్సాలో వరదపాలైన ప్రాంతాలను పరిశీలించడానికై ఆనాటి ప్రధానమంత్రి ఇందిర విమానంపై బయల్దేరి వెళ్ళింది. ఆ విమానాన్ని ఆమె పెద్ద కుమారుడు రాజీవ్ నడపగా, రెండవ కుమారుడు.

సంజయ్ ఆమె వెంట ఉన్నాడు. కొంపాగోడూ పోయి, చెట్టు కొకరు, పుట్ట కొకరు చొప్పున చెల్లాచెదురై అష్ట కష్టాలు పడుతున్న లక్షలాది గ్రామస్థులను చూచి, "పాపం! తిండి తిప్పలూ లేక ఎన్నాళ్ళుగా వీళ్ళు నకనకలాడుతున్నారో! పది రూపాయలు కరెన్సీ నోట్లను కిందకు విసిరివేస్తే, వీళ్ళకు కొంత ఉపకారం జరుగుతుంది" అని శ్రీమతి ఇందిర జాలిపడుతూ పలికింది. ఆమె తన మాటలను ముగించకముందే సంజయ్ అందుకొని, "విదేశీ రూపాయల నోట్లు విసిరితే కొద్దిమందికే ఉపకారం జరుగుతుంది. రూపాయి నోట్లను విసరడం మంచిది కాదా?" అని సూచించాడు. అంతట రాజీవ్ అందుకొని "మిమ్ములనిద్దరిని కిందకి విసిరితే ఈ దీనులకే కాక, దేశానికే మహోపకారం జరుగుతుంది" అన్నాడట!

రెండవ కథ:

అన్ని బస్తీలలో వలె ఇంద్రుని అమరావతిలో కూడా పేట లున్నాయి. సత్యవ్రతులకు ఒక పేట, దానశీలురకు ఒక పేట, యుద్ధ రంగంలో వీర మరణం పొందిన వారికి ఒక పేట, ఇదే ఫక్కీలో తక్కినవారికి తక్కిన పేటలు. తమ సత్యవ్రతుల పేటకు భారతదేశం నుంచి పుష్పక విమానం ఎవరినో తెస్తున్నట్టు ఒకనాడు విని, ఎవరో చూద్దామన్న కౌతుకంతో గాంధి మహాత్ముడు పనికట్టుకొని వెళ్ళాడు. విమానంలోనుంచి ఇందిర దిగడాన్ని చూచి, ఒకప్పుడు తాను ముద్దు చేసిన నెహ్రూ కుమార్తెను తిరిగి కలుసుకొనబోతున్నందుకు సంతోషపడినా, ఆయన ముఖంలో కొంత విస్మయం కూడా ద్యోతకమైంది. దీన్ని గమనించిన దేవదూత "ఈమె ఒకే ఒక రోజున ఒకే ఒక నిజం పలికింది. అందువల్ల ఒక్క రోజుపాటు ఇక్కడుంచి, తర్వాత పంపించవలసిన లోకానికి పంపిస్తా" మన్నాడు.

మూడవ కథ :

"దొరక్క దొరక్క సంజయ్ గాంధి కంపెనీకి 'మారుతీ' "అతడి తల్లి తన చిన్నతనంలో స్థాపించిన బాలల స్వచ్ఛంద సైన్యానికి 'వానర సేన' అని పేరు పెట్టింది. ఈ ముక్క ఆ తాసులోదే కాదా?

అనే పేరు ఎందుకు దొరికిందో?"

పోతే, నాల్గవ కథ కూడా సంభాషణ రూపంలో సాగినట్టిదే. దాన్ని మాత్రం చెప్పి అంతటితో సరిపెడతాను.

హేమకాంత బారువా : "సంజయ్ గాంధి ఆదిశంకరాచార్యునికి సాటి. వివేకానంద స్వామికి మేటి."

సిద్ధాంత శంకర్ రే : "నాకు తెలియక అడుగుతున్నా - అతడిని నువ్వు ప్రశంసిస్తున్నావా, శపిస్తున్నావా?"

బారువా : "శాపమన్న సందేహం నీ కెందుకు కలిగింది?"

రే: "ఆఁ! మరేమీ లేదు. శంకరాచార్యులు ముప్పైదాటగానే వెళ్ళిపోయాడు, వివేకానందస్వామి నలభైవరకైనా దేకలేదు.

కేవలం నియంతల విషయంలోనే కాదు, అందరి విషయంలో హాస్యం అమోఘమైనదే. మనలో స్వాతిశయం బలిసిపోకుండా అది కాపాడుతుంది; మన ప్రగల్భాలకు విరుగుడుగా అది పనిచేస్తుంది; మన పటాటోపం తెరలను అది చీల్చుతుంది; మనలో కపటాన్ని, ఇతర కల్మషాలను అది కాల్చివేస్తుంది. నిజానికి, ఎవని సౌజన్యానికైనా, సంస్కృతికైనా ఒక గీటురాయి తనను మరొకరు తెలివిగా హాస్యం చేస్తే, తాను ఎంత అప్రయత్నంగా ఎంత నిర్మలంగా నవ్వగల దన్నదే!

జర్మనులతో పోల్చినప్పుడు బ్రిటిష్ వారి ఆధిక్యం వారి హాస్యప్రియత్వంలోనే ప్రత్యేకించి ఉన్నది. బ్రిటీష్ వారిలో హాస్య ప్రియత్వానికి స్కాటిష్ వారికి పెద్ద పీట వేయాలి. స్కాటిష్వారి పిసినిగొట్టుతనాన్ని గురించి కొన్ని వందల కథలున్నాయి. చిత్ర మేమంటే, ఈ కథలలో అత్యధిక భాగం స్కాటిష్ వారు తమను గురించి తాము కల్పించుకొన్నట్టివే!

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో వ్యాసం 8-6-1977)

రాజకీయ రంగంలో నీతి నిజాయితీలు

"కాంగ్రెస్ వారిలో త్యాగ గుణం తగ్గిపోయిందని ఇటీవల కొన్నేళ్లుగా ఒక విమర్శ వినవస్తున్నది. ఈ విమర్శలో ఎంతమాత్రం నిజం లేదు. దీనిలో నిజం లేదంటూ డొంక తిరుగుడుగా మాట్లాడనక్కరలేదు. ఇది అబద్ధం. మరింత నొక్కి చెప్పాలంటే ఇది పచ్చి అబద్ధం. ఇదివరలో కంటే కాంగ్రెస్ వారిలో ఇప్పుడే త్యాగగుణం హెచ్చుగా ఉన్నది. పదింతలు హెచ్చుగా ఉన్నది. నూరింతలు హెచ్చుగా ఉన్నది. అయితే ఇదివరకటికి - ఇప్పటికి ఒక స్వల్పభేదం కలదనుకోండి. అదేమంటే, ఇదివరలో కాంగ్రెస్ వారు దేశం కోసం "తమను త్యాగం చేసుకునే వారు, ఇప్పుడు తమకోసం దేశాన్ని త్యాగం చేస్తున్నారు" - ఒక ఏలూరు సభలో నేను చేసిన ప్రసంగంలోని తొలి వాక్యాలివి. ఆ వెనువెంటనే నేను పలికిన వాక్యాలలో "దేశంకోసం తమను త్యాగం చేసుకుంటున్న కాంగ్రెస్ వారు ఇప్పుడసలే లేరని నా తాత్పర్యం కాదు. అయితే, అట్టి వారు ప్రస్తుతం సకృత్తుగా తప్ప కానరావడం లేదు" అని చెప్పక పోలేదు.

అయినా, వేదికపై గల పెద్దల ముఖాలలో చికాకు తగ్గలేదు. ఆ పెద్దలలో మంత్రులున్నారు. మాజీ మంత్రులున్నారు. మంత్రి పదవిపై కళ్లు పెట్టుకొని బ్రతుకుతున్న వారున్నారు. రేపో, మాపో మంత్రి పదవి తమను వరించబోతున్నట్టు సంబర పడుతున్నవారున్నారు. సాక్షాత్తు ఒక మాజీ ముఖ్యమంత్రి సయితం ఉన్నాడు. వీరిలో ఒక మంత్రి సభా ముఖంగానే నాపై ఒకటి, రెండు విసుర్లు విసరగా, సభానంతరం తమ విడిదిలో మాజీ ముఖ్యమంత్రి - "రాను రాను నార్ల నోటి దురుసుతనం పెరుగుతున్నది" అంటూ నన్ను దుయ్యబట్టినట్లు విన్నాను.

నా ఏలూరు ప్రసంగం ఎమర్జెన్సీ ప్రకటన జరిగిన కొత్తలో అయినా, నన్ను 'మీసా" క్రింద అరెస్టు చేయకపోవడం నాపట్ల జాలివల్లనో, గౌరవం వల్లనో - ఆ వైనం నాకు తెలియదు. ఏమైనా అప్పటిలో కటువుగా వినపడిన నా మాటలు ఎంత నిజమైనవో కాంగ్రెస్ వారైనా ఇప్పుడు గుర్తించక తప్పదు. కొన్ని వారాలుగా ఏ పత్రికను విప్పినా - "ఇక్కడ ఈ దోపిడి, అక్కడ ఆ దురాగతం" అనే కనపడుతున్నది. అయితే ఎమర్జెన్సీ కాలంలోనే కాదు; ఇందిరా గాంధి పరిపాలన సాగిన పదకొండేళ్లలోనే కాదు, అంతకు చాలా ముందుగానే ఏవో నీచ స్వార్థాలకోసం, నికృష్ట ప్రయోజనాల కోసం మంత్రి పదవులను దుర్వినియోగం చేయడం మన దేశంలో ప్రారంభమైంది. ఎమర్జెన్సీ ఇరవై నెలలలో ఈ దుష్కృత్యం మరింత విస్తృతంగా జరిగింది. బాహాటంగా జరిగింది. అవును మరి. పట్ట పగలు నిలువు

దోపిడి జరిగినా, నోరెత్తరాదయ్యె! నోరెత్తితే, నిట్ట నిలువున చీల్చి వేస్తారయ్యె! అయినప్పుడు "సవ్యసాచులు" మరింతగా విజృంభించడం సహజమే కాదా? ఈ సందర్భంలో "సవ్యసాచు" లంటే నా ఉద్దేశంలో రెండు చేతులతో దండిగా దోచుకొనగల ఘనులని.

పోనీ, కేవలం మంత్రులే దోపిడీ చేస్తే, చావుతప్పి కన్ను లొట్టపోయిన స్థితిలోనైనా మిగల వచ్చు. కాని, నేనొక పద్యంలో కొన్నేళ్ల క్రితం చెప్పినట్టు -

మంత్రి దారి జూప, మంత్రి పెండ్లము దోయు, మంత్రి కొడుకుదోయు, మామ దోయు,

మంత్రి బావమరది మరియింత దోయురా!

ఇంతటితోనైనా ఈ దోపిడి నిలిచిపోదు. మంత్రి అనుచరులు, సహచరులు, భజనపరులు మున్నగువారు సయితం దోపిడి చేస్తారు. నిజానికి మంత్రి పేరుచెప్పి అతడి మిత్రులే ఎక్కువ మూట కట్టడం కద్దు. ఇంకొక పద్యంలో నే నన్నట్టు -

మంత్రి మిత్రుడైన మనకు " పర్మిటు" లిచ్చు "సీటు లిచ్చు, " బస్సురూటు" లిచ్చు, మంత్రి మిత్రుడైన మంత్రిత్వ మేలరా?

ఇటీవల జరిగిన మరొక విడ్డూరం - మన మాజీ ప్రధాని ముక్కు ముఖాలైనా తమకు తెలియక పోయినా ఆమె రెండవ కుమారుని ప్రాపకంతో కొందరు ఏడాది, రెండేళ్లలో లక్షాధికారులు కావడం, కోటీశ్వరులే కావడం! దీనికి దీటురాగల విడ్డూరం మరొక దేశ చరిత్రలో కానరాదేమో! పైగా, ఇటీవల కొందరు వెల్లడిస్తున్న విషయాలను చదవగా ఎమర్జెన్సీ కాలంలో మనలను పాలించింది ఇందిరా గాంధి కాదని, ఆమె రెండవ కొడుకని అనుకోవలసి వస్తున్నది.

అన్యాయార్జనకు, అన్య స్వార్థ ప్రయోజనాల సాధనకు మంత్రి పదవిని దుర్వినియోగం చేయడం మన దేశానికే పరిమితం కాదు. దేశ దేశాలలో ఈ జాడ్యం ఉన్నది కాని, ఇంతగా లేదు. ప్రజాస్వామ్య దేశాలలో - ఫ్రాన్స్లో ఇది హెచ్చు. ఇటలీలో హెచ్చు, వాటిలో కంటే యునైటెడ్ స్టేట్స్ లో మరింత హెచ్చు. ఐతే, మన దేశంతో పోల్చితే అక్కడైన అవినీతి అర కావచ్చు, వీసం కావచ్చు. ఈ మాట అంటే ఒకప్పుడు ఆయన కుమార్తెకు, మనుమడికి కోపం రావచ్చు. అయినా ఇది నిజం.

బ్రిటిష్ వారి దాస్యం నుంచి మనం విముక్తి పొందింది మూడు దశాబ్దాల క్రితం. ఈ మూడు దశాబ్దాలలో ఒకటిన్నర సంవత్సరాలను మినహాయిస్తే తక్కిన కాలంలో మన దేశాన్ని పరిపాలించినట్టిది నెహ్రూ కుటుంబమే. అందువల్ల దీన్ని నెహ్రూశకం అనవచ్చు. ఈ శకంలో మన రాజకీయ జీవితపు నైతిక స్థాయి బ్రిటిష్ వారి రాజకీయపు జీవితంలో సర్ రాబర్ట్ వాల్పోల్ (1676-1745) కాలంనాటి స్థాయికి చేరువగా ఉన్నట్టు చెప్పవచ్చు. ఆయన కాలంనాటికి బ్రిటిష్ రాజ్యాంగంలో 'ప్రైమ్ మినిస్టర్' (ప్రధాన మంత్రి పదవి లేదు. ఆయన కాలంనాటికే కాదు, అటుతర్వాత ఎంతోకాలం వరకు అదిలేదు. 1878 నాటి బెర్లిన్ సంధి పత్రంపై అప్పటి బ్రిటిష్ ప్రభుత్వ నాయకుడు బెంజ్మన్ డిజ్రి (1804-1881) "ఫస్ట్ లార్డ్ ఆఫ్ ది ట్రెజరీ అండ్ ప్రైమ్ మినిస్టర్"గా సంతకం పెట్టాడు. అటు తర్వాత ఆయనను ఉబ్బివేయడానికి ఆయన అనుచరులలో కొందరు డిజ్రిని "ది మినిస్టర్" అనే వారు తప్ప "ప్రైమ్ మినిస్టర్" అనేవారు కారు. అప్పటిలో "ఫస్ట్ లార్డ్ ఆఫ్ ది ట్రెజరీ" (కోశాగారమంత్రి) ప్రభుత్వ నాయకుడు. "ప్రైమ్ మినిస్టర్" అనే మాటను

అధికార రీత్యా మొట్టమొదటగా వాడింది ఏడవ ఎడ్వర్డ్ రాజు; ఆయన దీన్ని వాడింది 1905లో. అయితే, వాల్పోల్ను ఆయన పరోక్షంలో "ప్రైమ్

మినిస్టర్" అని వెటకారంగా అంటూ ఉండేవారు. తోటి మంత్రులను (ఇటీవలి కాలంలో మన ఇందిరా గాంధి చేసినట్టు) తోటకూరకాడ పురుగుల వలె ఆయన చూడమే ఇందుకు కారణం. పోర్టుఫోలియోలలోనే కాక, వేతనాలలో కూడా ఆయన తనకు అగ్రప్రాధాన్యమిచ్చుకునే వాడు. ఇక్కడ "వేతనాలు" అనే బహువచన ప్రయోగాన్ని నేను నిర్నిమిత్తంగా చేయలేదు. ఒకప్పుడు బ్రిటన్లో ఒక్కొక్క పోర్టుఫోలియోకు ఒక్కొక్క వేతనం ఉండేది. అన్నింటికంటే పెద్ద వేతనం ట్రెజరీ పోర్టుఫోలియోకు. ఇది సాలుకు 5 వేల పౌనులు. అందువల్ల దీనికి మరొక పోర్టుపోలియో కలుపుకొని వాల్పేల్ సాలుకు మొత్తం 7,400 పౌనులు పుచ్చుకునేవాడు. ఆయన కంటే ముందు, ఆయన తర్వాత ఈ పద్ధతిని అనుసరించిన వారు పెక్కుమంది ఉన్నారు. ఉదాహరణకు, విలియం పిట్ (1759-1806) మూడు పోర్టుఫోలియోలను కలుపుకొని సాలుకు మొత్తం 10,532 పౌనులు పుచ్చుకొనేవాడు. వాటిలో ఒకటి సింక్ పోర్ట్స్ అనే ఐదు యుద్ధ నౌకా స్థావరాలకు లార్డెన్ పదవి. పోర్టుఫోలియోకు వేతనం 3,080 పౌనులు. ట్రెజరీ పోర్టుఫోలియో వేతనం తర్వాత దీని వేతనమే పెద్దది. అందువల్ల ఈ లాభసాటి పోర్టుఫోలియోను లార్డ్ నార్త్, లార్డ్ లివర్ పూల్ మొదలైన ప్రధాన మంత్రులు కూడా తమ ఆధీనంలో పెట్టుకున్నారు. బలవంతపు బ్రాహ్మణార్థంగా ఇది మారింది 1827లో దీన్ని వేతనంలేని పోర్టుఫోలియోగా చేసిన పిమ్మటనే!

వేతనం లేదా వేతనాల రూపంలో ఎక్కువగా పుచ్చుకొనడం అదొక దారి. కాని, వాల్పోల్ అంతటితో సరిపుచ్చక తన ముగ్గురు కుమారులకు మూడు "ఖుషీ" ఉద్యోగాలను కట్టబెట్టాడు. సాలు మొత్తంలో పట్టుమని వారం రోజులైనా గట్టిగా పనిచేయవలసిన అగత్యంలేని ఉద్యోగా లివి. వీటి పేరుతో వాల్పేల్ తన కుమారులకు సాలుకు 14 వేల పౌనులు ముట్టచెప్పేవాడు.

అప్పటిలో బ్రిటిష్ రాజకీయ రంగంలో ఇంతకంటే కూడా నికృష్టపు పనులు కొన్ని జరుగుతూ ఉండేవి. లార్డ్ ఛాన్సలర్ (న్యాయశాఖామంత్రి పదవికి జీతం తక్కువైనా, ఫీజులు కోకొల్లలు. అందువల్ల ఈ పదవిలో ఉన్నవారు ఇట్టె మీట వేసేవారు. పోతే, పటాలాలకు జీతాలను బట్వాడా చేసే మంత్రి పదవి (ది ఆఫీస్ ఆఫ్ ది పే మాస్టర్ - జనరల్) దొరికితే, రొట్టె విరిగి నేతిలో పడినట్టే! జీతాలకింద బట్వాడా చేయవలసిన మొత్తాన్ని ఏడాది మొగలోనే మంత్రికి అప్పగించేవారు. అతడు దాన్ని తన పేరుతో బాంకిలో వేసుకోవచ్చు. దానిపై వడ్డీని తానే తినవచ్చు. అసలుతోనే కావాలంటే ఏదైనా వ్యాపారాన్ని చేయవచ్చు. జూదంపై మక్కువ ఉంటే, దానితో షేర్ మార్కెట్టులో జూదం ఆడవచ్చు. ఈ పాడు పనులలో దేన్నీ చేయని వారిలో మొట్టమొదటి మంత్రి హెన్రీ పెల్హ్యామ్ (1695-1745) కాగా, రెండవ మంత్రి లార్డ్ చాథమ్ (1708-1778). లార్డ్ కాకముందు ఈయన పేరు విలియం పిట్. ఈయనవలె ప్రధాన మంత్రి పదవికి వచ్చిన ఈయన కుమారుని పేరు కూడా సరిగా యిదే! అందువల్ల వారిని విడివిడిగా పోల్చుకొనడానికి పిట్ ది ఎల్డర్, పిట్ ది ఎంగర్ అంటారు. వీరిలో ఎల్డర్ పిట్ మన మద్రాసులో గవర్నరుగా పనిచేసి, మన ప్రాంతం నుంచి ఒక పెద్ద వజ్రాన్ని (దీని ప్రసిద్ధ నామం "పిట్ డైమండ్") సంపాదించుకు వెళ్లిన థామస్ పిట్ కుమారుడు కాగా, లాంగర్ పిట్ ఆయన మనుమడు.

పెల్ హ్యామ్, పిట్ ఎల్డర్ మంచి దారిని చూపించి దాని వెంట నడిచినా, బ్రిటిష్ ప్రధాన మంత్రులు, ఇతర మంత్రులు దానివెంట నడవడం ప్రారంభించింది గడిచిన నూరేళ్ళలోనే అని చెప్పవచ్చునేమో! వాల్పోల్ కాలం నాటికంటే అటుతర్వాత పరిస్థితులలో వినదగు మార్పు రాకపోలేదు. అయినా, ఎన్ని పోర్టుఫోలియోలను తన ఆధీనంలో పెట్టుకున్నా, ఫస్ట్ లార్డ్ ఆఫ్ ది ట్రెజరీ జీతం సాలుకు 7,500 పౌనులను మించరాదన్న నియమం 1873లో అమలులోకి వచ్చిన పిమ్మటనే బ్రిటిష్ రాజకీయాలలో నీతినిజాయితీలు బాగా పెరిగాయి.

ప్రధానిగా తనకు వస్తున్న జీతం డెజ్లి సొంత ఖర్చులకు సరిపోయేది కాదు. అందువల్ల తన బడ్జెట్ లోటును పూడ్చుకొనడానికి ఆయన తన నవలలపై తనకు వచ్చే రాయల్టీలపైన, తన భార్య (ఆమె సంపన్నురాలు) తోడ్పాటుపైన ఆధారపడుతూ ఉండేవాడు. ఆరేళ్ళు మంత్రిగా, ఎనిమిదేళ్ళు ప్రధాన మంత్రిగా పనిచేసిన తర్వాత అంతకుముందు కంటే హెచ్.హెచ్. యాస్క్విత్ (1852-1928) సంపద పెరగలేదు. అదే తరిగింది. ప్రధాన మంత్రిగా జనరల్ ఎన్నికలు ప్రచారానికై ఒక ఘట్టంలో మొత్తం దేశం పర్యటన చేసిన క్లెమెంట్ అట్లీ వాడింది ఆఫీసు కారు కాదు, తన సొంత కారు. దాన్ని నడిపింది ఆఫీసు డ్రైవర్ కాదు తన భార్య.

మంత్రిగా, ప్రధానిగా విన్స్టన్ చర్చిల్ సంపాదించిన వేతనం కంటే రచయితగా ఆయన ఆర్జించిన రాయల్టీలే హెచ్చు. పెద్దతనంతో జరుగుబాటుకు తగినంతగా రాబడి లేనందున చర్చిల్ భార్య ఆయన స్వయంగా రచించిన కొన్ని తైలవర్ణ చిత్రాలను వేలం ద్వారా అమ్ముకొన్నట్టు ఈ మధ్యనే వార్త వచ్చింది.

బ్రిటన్ కు సంబంధించినంతవరకు మంత్రి పదవికి అతి ప్రాథమికమైన అర్హత (ది మోస్ట్ ఎలిమెంటరీ క్వాలిఫికేషన్) రుజువర్తన అని సర్ ఐవర్ జెన్నింగ్స్ వ్రాశాడు. ప్రలోభాలకు అతీతంగా నిలవడమని వ్రాశాడు. జడ్జివలె మంత్రి కూడా నీతిమంతుడుగా మెలగడం చాలదన్నాడు. నీతిమంతుని వలె మెలగుతున్నట్టు లోకానికి కనబడ్డం కూడా ముఖ్యావసర మన్నాడు. వాణిజ్య మంత్రిత్వశాఖలో పార్లమెంటరీ సెక్రటరీగా ఉంటూ, లైసెన్సులు మంజూరు సందర్భంలో వైన్, విస్కీ సీసాలను పోలిన కొద్దిపాటి బహుమానాలను పుచ్చుకున్నందుకు జాన్ బెల్చర్ తన పార్లమెంట్ సభ్యత్వానికి సయితం రాజీనామా చేయవలసి వచ్చిందని వివరించాడు. కాగా, నెహ్రూ శకంలో మన దేశంలో మంత్రి పదవిని లక్షలను గడించడానికి లైసెన్సుగా భావించనట్టివారు నూటికి పదిమంది వరకైనా ఉన్నట్టు గట్టిగా చెప్పలేము. లంచ పంచాలకు కక్కుర్తి పడుతున్నట్టు మంత్రులపై ఆరోపణలు వస్తే, అవి నిరాధారమైనవన్న నమ్మకం కొంతవరకున్నా సరే, విచారణ జరిపించి తీరాలని 1740 లోనే లార్డ్ చాథమ్ (ఎల్డర్ పిట్) తెగవేసి చెప్పాడు. ఈ సూత్రాన్ని జవహర్ లాల్ నెహ్రూ 1947 లో నైనా అన్ని సందర్భాలలో పాటించలేదు. వాటిని అర కొరగానే, ఆలస్యాన్ని విశేషంగా చేసిన మీ పంజాబ్ ముఖ్యమంత్రి ప్రతాప్సింగ్ పై వచ్చిన ఆరోపణల విషయమై ఎట్టకేలకు విచారణ జరిపించి ఆయన భార్య, ఆయన కుమారులు కొన్ని లక్షలు వాడుకున్నట్టు తేలింది. ఇదేవిధంగా కాశ్మీర్ ప్రధాని బక్షీ గులాం మహమ్మద్ విషయంలో ఆయన, ఆయన కుటుంబ సభ్యులు కోటిన్నర రూపాయల ఆస్తిపాస్తులను ఆరగించినట్టు తేలింది. బంధుమిత్రుల పట్ల ప్రేమాదరణ హర్షించదగినవే. కాని, నెహ్రూ వాటిని వెళ్ళరాని దూరాలకు వెళ్ళనిచ్చేవాడు. అందువల్లనే ఆయన పరిపాలనా కాలంలో మన రాజకీయాలలో నీతి నిజాయితీలు యీ స్థితికి దిగజారాయి. పోతే, ఆయన కుమార్తె హయాంలో అవి రొచ్చుగుంటకంటే అనిష్టమై పోయాయి. కొన్ని వారాల క్రితం నేను ఈమాట లంటే, కొందరు కోపంతో తిరస్కరించి ఉండేవారే! ఇట్టి వారు ఇప్పుడు దీన్ని కాదనలేరు.

ఈ హీనస్థితి నుంచి, ఈ హేయస్థితి నుంచి నేడు రాజకీయాలను సముద్ధరించడానికి మురార్జీ దేశాయి నాయకత్వాన మన కొత్త జనతా ప్రభుత్వం గట్టిగా పనిచేస్తున్నది.

ఈ కృషిలో అది విజయాన్ని సాధించాలి. ప్రజల మనస్తత్వంలోనే మార్పు రావాలి. నాలుగు డబ్బులను కూడబెట్టడానికి కాకపోతే, మంత్రిపదవిలో పటాటోపం లేకపోతే మంత్రి పదవి దేనికి? ఈ విధమైన దురభిప్రాయాలు ప్రస్తుతం మనలో పాతుకుపోయాయి! వీటిని మనం తొలగించుకోవాలి. ఈ రాజకీయ రంగంలోనే కాదు, ఏ జీవిత రంగంలో నీతి అవినీతికి, అక్రమాలకు, అత్యాచారాలకు పాల్పడేవారిగా చీడపురుగును చూచినట్టు చూడాలి. ఈ స్థితికి అందరం వచ్చినప్పుడే మన జాతీయ జీవితంలో నీతి నిజాయితీ ఎన్నదగు మేరకు నెలకొంటాయి.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో వ్యాసం 26-6-1977)

ఒక పుష్కరంపాటు రాజ్యసభలో

రాజ్యసభ జూన్ నాల్గవ వారం ప్రారంభంలో రజతోత్సవాలను జరుపుకొన్నది. దాని 232 మంది సభ్యులలో ఒక పుష్కరం పాటు (1958-1970 సంవత్సరాల మధ్య) నే నొకడిని. పాత సభ్యులందరికీ వచ్చినట్టే నాకు కూడా రజతోత్సవాలలో పాల్గొనవలసిందిగా ఆహ్వాన పత్రిక వచ్చింది. అయితే, "మీ ఖర్చులతో మీరే రావాలి; మీ బసకోసం, మీ భోజనం కోసం మీరే ఏర్పాట్లు చేసుకోవా" లన్న హెచ్చరిక దానిలో ఉన్నది. బస, భోజనం - ఇవి నాకు సమస్యలు కావనుకోండి. ఈ నాటికీ ఢిల్లీలో నాకు అనేక మిత్రులున్నారు. వారిలో ఎవరైనా ప్రేమాదరాలతో నాకు ఆతిథ్యమిచ్చేవారు. పోతే, రైలు, లేదా విమానం ప్రయాణం ఖర్చుల విషయంలో పేచీ. రైలుకైతే అయిదారు వందలైనా పెట్టాలి; విమానానికైతే వెయ్యివరకు పెట్టాలి. ఇందుకు తాహతులేనందున, ఢిల్లీకి వెళ్ళకుండానే, రాజ్యసభ రజతోత్సవాలలో పాల్గొన్న మహదానందాన్ని నేను పుష్కలంగా పొందగలిగాను.

చూచేది మన కన్ను కాదు, మనస్సు. అందువల్లనే మనస్సు వేరెక్కడనో ఉంటే కంటి ముందు ఉన్నదైనా కనబడదు. వినేది మన చెవి కాదు, మనస్సు. అందువల్లనే మనస్సు వేరెక్కడనో ఉంటే పక్కవారి మాటలైనా వినబడవు. ఆఘ్రాణం, స్పర్శ, రుచి మొదలైన వాటికి కూడా సరిగా ఇదే సూత్రం వర్తిస్తుంది. నేను హైదరాబాదులో ఉన్నా, రాజ్యసభ రజతోత్సవాల సందర్భంలో నా మనస్సు న్యూఢిల్లీలో ఉన్నందున, ఆ మహోత్సవాలలో పాల్గొంటున్నట్టుగానే నాకు అనిపించింది.

పక్కపై నడుం వాల్చి, 1958 నాటికి నా మనస్సును ఒకసారి వెనుకకు వెళ్ళనిచ్చేసరికి, నా స్థానం ఎక్కడున్నదో అడిగి తెలుసుకోవడం, దానిలో కూర్చున్న మరుక్షణంలో ఆజానుబాహుడైన వ్యక్తి వేదికపైకి వచ్చి, "మాననీయ సభాసదో! మాననీయ సభాపతి!" అని ఉచ్చస్వరంతో పలకడం, తక్కిన సభ్యులందరు వెంటనే లేచి నిలబడ్డాన్ని చూసి నేను సయితంవారితో పాటు లేవడం, తెల్లని తలపాగాతో, మోకాళ్ళ కిందికి దిగిన లాంగ్ కోటుతో, మల్లు పంచెతో, రాజఠీవి ఉట్టిపడుతుండగా సభాధ్యక్షుడు రాధాకృష్ణన్ ప్రవేశించడం, ఆసనాన్ని అధిష్ఠించినంతనే "స్వేరింగ్ ఇన్ ఆఫ్ ది న్యూ మెంబర్స్" అని మేఘ గంభీర స్వరంతో ఆయన పలకడం ఇవన్నీ ఒక్కసారిగా నాకు గుర్తుకు వచ్చాయి.

నాడు ప్రమాణస్వీకారం చేసిన వారిలో నేను మొదటివాడిని కాను. అక్షర క్రమంలో నా వంతు చాలా వెనుకగా వచ్చింది. రాజ్యసభ సెక్రటరీ టేబుల్ వద్ద నిలబడి ప్రమాణం చేసిన తర్వాత వేదిక పైకి వెళ్ళి, కరచాలనం రూపంలో సభాధ్యక్షుని అభినందనలను అందుకొని, ఆయన ఆసనాన్ని చుట్టివచ్చి, సెక్రటరీ టేబుల్పై తెరిచి పెట్టి ఉంచిన మెంబర్ల రిజిస్టర్లో సంతకం చేయాలి. పెక్కుమంది ఈ "కర్మకాండ" ను పాటించడాన్ని గమనించిన మీదట కూడా నా వంతువచ్చేసరికి నేను పప్పులో కాలు వేశాను. అధ్యక్షునితో కరచాలనం తర్వాత ఆయన ఆసనం వెనుక నుంచి కాక, సరాసరి సెక్రటరీ టేబుల్ వద్దకు వెళ్ళబోయాను. రెండు మూడడుగులు వేసి వేయక ముందే నా తప్పును నేనే దిద్దుకొన్నా, ఎందువల్లనో ఆనాడు నన్ను అది మితిమీరి కలవర పరిచింది.

ఇంత వివరంగా మరొక వంద, వందన్నర సంఘటనలు నాకు జూన్ 22 వ తేదీని జ్ఞప్తికి వచ్చాయి. అయితే, వీటినన్నింటిని మీకు చెప్పబోవడం లేదు. కాగా, కొన్ని ముఖ్య విశేషాలను మాత్రం మీకు నివేదిస్తాను.

రాజ్యసభకు మొట్టమొదటి ఛైర్మన్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. సభకు ఇప్పుడున్న గౌరవ ప్రతిష్ఠలతో అత్యధిక భాగం ఆయన సమకూర్చినట్టివే. అప్పటిలో శ్రీరాజ్నారాయణ్ రాజ్యసభ సభ్యుడు కాదు. ఆయనను కంట్రోల్ చేయడం రాధాకృష్ణన్కైనా ఏ మేరకు సాధ్యపడేదో నా మట్టుకు నాకు సందేహమే! కాని, అప్పుడైనా సభ్యులలో గడసరులు కొందరుండేవారు, పెంకె ఘటాలుగా చెప్పదగు

వారు సయితం కొందరుండేవారు. అయినా, సభా కార్యక్రమాలను అతి సమర్థంగా, మహోదాత్తంగా రాధాకృష్ణన్ నడిపిస్తూ ఉండేవారు. అందరిని గౌరవించడం ఆయనకు తెలుసు. అందువల్లనే అందరి గౌరవాన్ని ఆయన పొందుతూ ఉండేవారు. ఎవరేమి చెప్పినా, ఆయన శ్రద్ధగా వినేవారు; అందువల్లనే ఆయన చెప్పినదాన్ని కేవలం శ్రద్ధతోనే కాక, ప్రేమ గౌరవాలతో అందరు వింటూ ఉండేవారు; ఇంతకు మించి ఆయనలో ఒక గొప్ప విశేషం - ఒకసారి చూచిన ముఖాన్ని ఎన్నటికీ మరచిపోకపోవడం; ఒకసారి విన్న పేరును ఎంతకాలం వరకైనా గుర్తు పెట్టుకొనడం. ఎవరి అభ్యాసాలేవో, దురభ్యాసాలేవో ఇవి కూడా ఆయనకు జ్ఞాపకమే. ఆ రోజులలో నేను హెచ్చుగా సిగరెట్లు కాల్చుతూ ఉండేవాడిని. అందువల్ల, ఆయనను చూడ్డానికి వెళ్ళినప్పుడు మా ఆవిడ నా వెంట ఉంటే, సిగరెట్టు పొగను లోపలికి పీల్చడాన్ని అభినయిస్తూ, "ఏమమ్మా! దీన్ని కాసైనా తగ్గించరా?" అని ప్రశ్నిస్తూ ఉండేవారు. అందరివలె రాధాకృష్ణన్కు కూడా రెండు కళ్ళు, రెండు చెవులే. అయితే, రాజ్యసభ అధ్యక్ష స్థానంలో కూర్చున్నప్పుడు ఆయనకు 232 జతల కళ్ళు, మరి 232 జతల చెవులు ఉన్నట్టుగా అనిపించేది. సభలో ఏ మూల ఏమి జరిగినా, దాన్ని ఆయన గమనిస్తూనే ఉండేవారు. సభలో ఎక్కడ ఏమాత్రం సవ్వడి జరిగినా, దాన్ని ఆయన ఆలకిస్తూనే ఉండేవారు. కొన్ని దశాబ్దాలపాటు ఆచార్యత్వం వహించిన కారణంగా, కొన్ని వేల మంది విద్యార్థులను అదుపాజ్ఞలలో పెట్టిన కారణంగా ఆయనలో ఈ అద్భుత శక్తులు పెంపొంది ఉండాలి. రాజ్యసభ 232 మంది సభ్యులలో నేను అప్రధాన వర్గానికి - బ్యాక్ బెంచెర్స్ కు చెందిన వాడిని అయినా, నన్ను సయితం ఆయన ఒక కంట కనిపెట్టి చూస్తూనే ఉండేవారు. ప్రశ్నోత్తరాలు ముగిసినంత ఒకనాడు నేను సభ నుంచి వెళ్ళిపోయాను. ఆ మర్నాడు ఆయనను చూడ్డానికై ఆయన నివాస భవనానికి వెళ్ళడం జరిగింది. కుశల ప్రశ్నల తర్వాత ఆయన నాతో అన్నమాట "ప్రశ్నోత్తరాలు ముగిసినంతనే నిన్న వెళ్ళిపోయారేమి? అటు తర్వాత ఆసక్తి దాయకమైన విషయాలు చర్చకు వచ్చాయి" అని. ఆ మాట విన్నంతనే "ఈయన కెన్ని కళ్ళు!" అని నేను విస్తుపోవలసి వచ్చింది. వారి ప్రవృత్తి గభీరం, వారి వాక్కు గభీరం. ఇందువల్ల తత్త్వవేత్తలు, వారికి సాటి రాగల అన్యమహనీయులు సర్వవేళలలో, సర్వావస్థలలో గభీరముద్ర ధరించి ఉంటారనికొందరు భావించడం కద్దు. ఇది పూర్తిగా పొరపాటు. తక్కిన వారిలోకంటె నిజానికి వారిలోనే హాస్య ప్రవృత్తి విశేషంగా ఉంటుంది. వారే తరచు నవ్వగలరు, నవ్వించగలరు. ఏసుక్రీస్తు, మహమ్మద్ ప్రవృత్తి ఈ విషయంలో ఎట్టిదో వారిని గురించి నేను చదివిన పుస్తకాలలో నాకు తగలలేదు. కాగా, గౌతమ బుద్ధుడు హాస్యోక్తులలో చతురుడు; సోక్రటీస్ అంతకంటె చతురుడు. ఇక, మన గాంధీ సంగతి చెప్పనే అక్కరలేదు. "నా హాస్య ప్రవృత్తి నన్ను కాపాడుతున్నది. లేకపోతే, ఎన్నడో ఆత్మహత్య చేసుకోవలసి వచ్చే" దని ఒక సందర్భంలో ఆయన పేర్కొన్నారు. రాధాకృష్ణన్ సయితం నవ్వడంలో, నవ్వించడంలో దిట్ట, అందువల్లనే అధ్యక్షస్థానంలో ఆయన కూర్చుంటే, సభలో కిలకిల నవ్వులు చెలరేగుతూ ఉండేవి. మొత్తం సభ కళకళలాడుతూ ఉండేది. ఆయన రాజ్యసభ ఛైర్మన్ గా పనిచేసిన పదేళ్ళలో నాలుగేళ్ళపాటు దానిలో నేను సభ్యుడను కావడం నాకు ఒక మధురానుభూతి.

డాక్టర్ జాకీర్ హుస్సేన్ కూడా హాస్య చతురుడే; ఇతర విధాల కూడా ఆయన సమర్థుడే. అయితే, రాధాకృష్ణన్లోని లోకజ్ఞత, ఆయనలోని ప్రాగల్భ్యం ఈయనలో తక్కువ. పైగా, ఈయన ఛైర్మన్ పదవికి వచ్చిన తర్వాత కొద్ది కాలానికే - బహుశా రెండేళ్ళ తర్వాత కావచ్చు - శ్రీ రాజ్ నారాయణ్ రాజ్యసభ సభ్యుడు కావడం, ఆయన రోజుకొక సుడిగాలిని, రోజుకొక తుపానును రెచ్చగొట్టడం ప్రారంభమైంది. అతి సున్నితమైన ప్రవృత్తి గలవాడు కాబట్టి, ఇది హుస్సేను ఎంతో బాధ కలిగిస్తూ ఉండేది. అసలే గుండె జబ్బు మనిషి, శ్రీ రాజ్ నారాయణ్ సభా మర్యాద లన్నింటిని అతిక్రమించి, వీర విహారం చేస్తూవుంటే, ఆయనకు సభలోనే ఎక్కడ తిరిగి గుండెపోటు రాగలదో అని మాకు బెదురుపుడుతూ ఉండేది.

రాధాకృష్ణన్ వలె తరచుగా కాకపోయినా, అంత చాకచక్యంతో కాకపోయినా, జాకీర్ హుస్సేన్ సైతం అప్పుడప్పుడు సభ్యులను నవ్విస్తూనే ఉండేవాడు. అప్పటిలో శ్రీ ఐ.కె. గుజరాల్ రాజ్యసభ సభ్యుడు. ప్రశ్న ఎవరిదైనా, ఉపప్రశ్నలైనా వేయకపోతే, ఆయనకు బహుశా ఆ రోజు తిండి అరుగుదల తగ్గేది! ఎందువల్లనో ఒకనాడు ఉపప్రశ్నతో శ్రీ గుజరాల్ లేవలేదు. అందుమీదట డాక్టర్ హుస్సేన్

చిలిపి చిరునవ్వుతో "గుజరాల్ వేయగల ఉపప్రశ్న లేనట్లేనా?" అన్నారు. ఆ మాటకు సభ్యులందరు గొల్లుమనగా, వారి నవ్వులో శ్రీ గుజరాల్ తన నవ్వును కలపక తప్పలేదు.

నా రాజ్యసభ సభ్యత్వం పన్నెండేళ్ళలో చివరి ఏడాది, లేదా ఏటిపై ఆరేదు నెలలపాటు శ్రీ వి.వి. గిరి దాని ఛైర్మన్. ప్రథమ, ద్వితీయ సభాధ్యక్షుల ప్రవృత్తికి ఈయన చిత్తవృత్తి పూర్తిగా భిన్నం. వారిద్దరు విద్యారంగం నుంచి రాజ్యసభకు రాగా, ఈయన కార్మికోద్యమ రంగం నుంచి వచ్చారు. అందువల్ల ట్రేడ్ యూనియన్ కాంగ్రెసును నడిపిన ధోరణిలో ఈయన రాజ్యసభను నడిపిస్తూ ఉండేవారని చెప్పవచ్చు. మరి కూర్చోమనగానే ఏ సభ్యుడైనా కూర్చొనకపోతే, "సిట్ డౌన్" అని ఈయన గర్జించేవారు. అయినా, కూర్చోకుండా మాట్లాడుతూ పోతే, "ఆర్డర్, ఆర్డర్!!" అంటూ ఉడెన్ హ్యామర్ తో టేబులు బాదేవారు. ఈ బాదుదుకు టేబుల్పై గల గాజు పలక ఒకసారి బ్రద్దలైపోయినట్లు నాకు జ్ఞాపకం. అయితే, గిరిగారికి ముక్కుపై కోపం; ఎంత త్వరలో వచ్చేదో, అంత త్వరలో అది మాయమైపోయేది. పైకి కనబడదు గాని, శ్రీ రాజ్నారాయణ్ మహాలౌక్యుడు. మరి ప్రసంగాన్ని విరమించవలసిందిగా శ్రీ గిరి ఆదేశించిన తర్వాత కూడా దాన్ని సాగించగోరితే, "భారతదేశంలో కార్మికోద్యమ సంస్థాపకు లెవరు? మీరు కారా? నేడు ఉన్నత పదవులలో ఉన్నవారిలో పాటక జనం కష్టాలను గురించి ఎక్కువగా వ్యథపడుతున్న వారెవరు? మీరు కారా? అంటూ సందర్భ శుద్ధి లేకపోయినా, ఒక దండకం చదివేవాడు. దేవతలే దండకాలకు లొంగిపోగా, శ్రీ గిరి లొంగడం ఒక లెక్క కాదుగదా!

తోసుకు వెళ్ళి, అందరితో పరిచయం కలిగించుకొనడం, ఎప్పుడు ఎవరితో ఏమి పని పడగలదో అని "ఆహా! ఓహో!" అనడం, లేని స్నేహాన్ని నటించడం, హీనబుద్ధి గలవారిపట్ల నా ఏహ్యభావాన్ని దాచిపెట్టుకొనడం - ఇట్టివి నాకు సుతరామూ చేతకాని విద్యలు. ఇందువల్లనే నన్ను కఠిన చిత్తునిగా కొందరు భావిస్తారు, అహంకారిగా అంతకంటే హెచ్చుమంది భావిస్తారు. ఇది కొత్త నిందలు కావు. నా యౌవనంలోనే ఇవి ప్రారంభమైనాయి. అప్పటిలానే నా ప్రవృత్తిని మార్చుకొనలేకపోయిన నేను ఇప్పుడు దాన్ని ఎలా మార్చుకోగలను? ఏమైనా, రాజ్యసభ సభ్యులు 232 మందిలో దాదాపు సగం మందిని నేనెప్పుడు పలకరించనైనా లేదు. మిగిలిన వారితో తర తమ భేదాలతో నాకు స్నేహం ఉండేది. ముఖ్యంగా "యంగ్ టర్క్స్" అంటే నాకు స్నేహంతోపాటు ప్రేమ గౌరవాలుండేవి. అప్పటిలో వీరిని "ఎ.బి.సి.డి." అని కూడా అంటూ ఉండేవారు. "ఎ" అంటే శ్రీ అర్జున్ అరోరా; "బి" అంటే ఎమ్.పి. భార్గవా; "సి" అంటే చంద్రశేఖర్; "డి" అంటే మోహన్ ధారియా. వీరికి తోడుగా శ్రీ కృష్ణకాంత్ కూడా ఉండేవాడు. ఇప్పుడు నేను వీరికి జ్ఞాపకం ఉన్నానో, లేదో చెప్పలేనుగాని, అప్పటిలో మా మధ్య స్నేహ సుహృద్భావాలుండేవి. రెండు, మూడు నెలలపాటు శ్రీ చంద్రశేఖర్ సీటు, నా సీటు పక్కపక్కనే. ఈ దురన్యాయంపై, ఆ దురాగతంపై ఆయన నిప్పులు చెరుగుతూ ఉంటే, మధ్య మధ్య నేను "భేష్" అంటూ హుషార్ చేస్తూ ఉండేవాడిని. '

నా బసవలె శ్రీ ధారియా బస కూడా నార్త్ ఎవెన్యూలోనే. చలికాలమైతే "ఇంత చలిలో ఎక్కడ నడవగలనులే!" అని, వేసవికాలమైతే "అబ్బో! ఈ ఎండకు తట్టుకోగలనా?" అని టాక్సీ కోసం టెలిఫోన్ చేసేవాడిని. పైగా, టాక్సీకి తడవకు ఒక రూపాయి మాత్రమే చెల్లించవలసి ఉండేది. కాబట్టి, నడవడానికి మరింత బద్ధకించేవాడిని. శ్రీ ధారియా మాత్రం అన్ని కాలాలలో ఉదయం పార్లమెంటుకు నడిచి వెళ్ళేవారు. సాయంత్రం తిరిగి నడిచే వచ్చేవాడు. శ్రీ చంద్రశేఖర్ వలె శ్రీ ధారియా సైతం నిప్పులాంటి మనిషి.

ఒక పుష్కరంపాటు రాజ్యసభలో

రాజకీయవేత్తల కంటే కవులతో, నాటక కర్తలతో చరిత్రకారులతో, ప్రొఫెసర్లతో నాకు ఎక్కువగా పరిచయా లుండేవి, స్నేహాలుండేవి. అయితే, వీరిలోనైనా అందరితో కాదు, కొందరితోనే. కవులలో శ్రీ గోపాల్ సింగ్, నాటక కర్తలలో శ్రీ మామా వరేర్కర్, చరిత్రకారులలో డాక్టర్ నిహార్ రంజన్ రే, శ్రీ ఆనంద్ చంద్ (బిలాస్పూర్ మాజీ సంస్థానాధిపతి), పత్రికా రచయితలలో జోకిం శ్రీయుతులు ఆల్వా, పాటిల్ పుట్టప్ప, కె. దామోదరం, డాక్టర్ అనుప్ సింగ్, ప్రొఫెసర్లలో శ్రీ ఎమ్. రత్నస్వామి నాకు ప్రత్యేకించి సన్నిహితులు. కేరళ కవి శంకర్ కురుప్, హిందీ కవి రామరి దినకర్ రాజ్యసభలో నా సమకాలికులైనా, వారితో నాకు పరిచయమైనా ఏర్పడలేదు. రాజ్యసభ పుట్టిన నాటి నుంచి, ఈనాటివరకు దానిలో సభ్యుడైన శ్రీ భూపేశుప్త మహావక్త; ప్రతిపక్ష నాయకుడుగా సాటిలేని వాడు. ఒకసారి నన్ను, నా ప్రసంగాన్ని నిశితంగా విమర్శించినా, నా ప్రసంగాలను - నేను ప్రసంగించింది పన్నెండు సంవత్సరాలలో పన్నెండు సార్లు కూడా పూర్తిగా కాదేమో ఆయన ఆసక్తితోనే వినేవారు. ఇతర సభ్యులు కొందరు ఆక్షేపించిన నా ప్రసంగాలలో ఒకదాన్ని ఒక నెల తర్వాత ఏదో సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన హర్షించారు, సమర్థించారు.

సభలో ఆయన మాట్లాడగా నే నెన్నడు వినలేదుగాని, శ్రీ మామా వరేర్కర్ సంభాషణలో గడసరి. ఆయన మొత్తం మహారాష్ట్రానికి “మామ”. నూరింటికి పైగా ఆయన నాటకాలను వ్రాశాడట; బెంగాలీ నవలలను మరొక నూరింటికి పైగా అనువదించారట. ఎవరో ఒకనాడు “ఎక్కడ మీ బస?” అని ప్రశ్నించగా, “నా బసను పట్టుకొనడం బహు సులభం. నెహ్రూ నివసిస్తున్నది నా బసకు ఎదురుగానే” అని మామాజీ సమాధాన మిచ్చారు.

మరొక మహారాష్ట్ర ప్రముఖునితో (నా ప్రవృత్తికి విరుద్ధంగా) నేనే పరిచయం కలిగించుకున్నాను. ఆయన ఆధునిక రుషిగా చెప్పదగు శ్రీ సి.వి. కాణే. సంస్కృతంలో ఆయన మహా పండితుడు. హిందూ ధర్మశాస్త్రాలను గురించి ప్రామాణికమైన గ్రంథాన్ని ఆయన రచించారు. బొంబాయి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ మొదలుకొని, “భారతరత్న" వరకు ఆయన పొందని గౌరవం లేదు. అయితే, ఆయన నిగర్వి. వైస్ ఛాన్సలర్గా ఆయన ట్రామ్లో యూనివర్సిటీకి వెడుతూ ఉండేవారు. హిందూ ధర్మశాస్త్రాల చరిత్ర చివరి సంపుటం ప్రూఫులను లాబీలో కూర్చుని ఆయన స్వయంగా దిద్దుకునేవారు. "ఇంత పెద్ద వయస్సులో ఈ శ్రమ మీకు దేనికి?” అని ఒకనాడు నే ననగా, “ఏ వయస్సులోనైనా ఎవరి గ్రంథాలను గురించి వారే శ్రద్ధ పుచ్చుకోవాలి గదా!” అని ఆయనన్నాడు.

రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ శ్రీమతి వై. ఆల్వాకు నా పట్ల ప్రత్యేక ఆదరాభిమానాలుండేవి. పార్టీ విప్ కాదన్నా, చర్చలో పాల్గొనడానికి నేను కోరిన ప్రతిసారీ ఆమె నాకు అవకాశమిచ్చింది. ఒకనాడు వైస్ ఛైర్మన్గా శ్రీ అగ్బర్ ఆలీఖాన్ సైతం నాకు అవకాశమిచ్చారు.

అప్పటిలో చాలాకాలం పాటు రాజ్యసభలో కాంగ్రెసు పార్టీ చీఫ్ శ్రీ ఆర్. ఎస్. దూగర్. పొద్దస్తమానం ఆయన తమలపాకులు నములుతూ ఉండేవారు. మాకు పరిచయం తక్కువైన రోజులో నే నెప్పుడు కోరినా చర్చలలో పాల్గొనడానికి ఆయన నాకు అవకాశమివ్వలేదు. తర్వాత ఇద్దరికీ ఒకే వారంలో గుండెనొప్పి రావడం, ఒకే ఆసుపత్రిలో, ఒకే డాక్టర్ వద్ద ఇద్దరూ చికిత్స పొందడం సంభవించింది. ఈ కారణాన మా మధ్య స్నేహభావం పెరిగింది; పరస్పర గౌరవం కూడా పెరిగింది. అటుతర్వాత ఒకనాడు సభలో నేను ప్రసంగించగోరగా, "నీ ప్రసంగం కంటే నాకు నీ ఆరోగ్యం ముఖ్యం. నీవు మాట్లాడవచ్చునని డాక్టర్ కరోలీ నుంచి సర్టిఫికెట్ తెస్తే తప్ప సమ్మతించను "అని తెగవేసి చెప్పాదు. అన్నట్టు, ఒకసారి నేను మాట్లాడి కూర్చోగానే, శ్రీ కె. సంతానం నా వద్దకు వచ్చి, “మీరెవరో

నాకు తెలియదు గాని, అప్రియ సత్యాలను పలికేవారు ఈ సభలో తక్కువ. వాటిని పలికినందుకు నా అభినందనలు" అన్నారు. మరొకసారి నేను, ఒక సభ్యుడు ఒకరి తర్వాత ఒకరు ప్రసంగించడం జరిగింది. తన ప్రసంగం తరువాత ఆయన నాతో "మీరెవరో తెలుసుకోవచ్చునా?" అన్నారు. "మీ రెవరో నాకు తెలియదు గానీ, మీది న్యాయవాద వృత్తి" అని నేనన్నాను. "నిజమే! మీరెలా ఊహించగలిగారు?" ఆయన ఆశ్చర్యాన్ని వెల్లడించగా, "మీరు మాట్లాడిన పది నిమిషాలు, ఆ పది నిమిషాలలో 'ఐ సబ్మిట్' అని పాతికసార్లు అన్నారు. అందువల్ల మీరు లాయర్" అన్నాను. నా మాటకు ఆయన ఫక్కున నవ్వారు. ఈ విధంగా చెప్పుకుపోతే ఈ జ్ఞాపకాలకు అంతం లేదు. ఆదిలో అయిష్టంగానే రాజ్యసభకు వెళ్ళినా దాని నుంచి పన్నెండేళ్ళ తర్వాత మరలి వచ్చింది చిగురించిన దృక్పథంతో, వృద్ధిచెందిన లోకానుభవంతో వెయ్యి పుటలకు విస్తరింపజేసినా తరగని వైవిధ్య భావాలతో...

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో వ్యాసం 10-7-1977)

మనం, మన దాస్యబుద్ధి

మనదేశం నుంచి బ్రిటీష్ వారు మూడు దశాబ్దాల నాడు వైదొలగినా, మనలోనుంచి మన దాస్యబుద్ధి వైదొలగినట్టు లేదు. లేకపోతే ఒక మహాతల్లి మన దేశాన్ని మన పాలిట ఒక పెద్ద చెరసాలగా మార్చగలిగి ఉండేదా? ఆమె ద్వితీయ పుత్రరత్నం తల్లిని మించి మనను గడగడలాడించి ఉండగలిగే వాడా?

బ్రిటీష్ వారి రోజుల్లో భులాభాయ్ దేశాయ్ చేసిన ఒక ప్రసంగం చాలా కటువుగా లేకపోలేదు. అయితే, నిజం ఎప్పుడు, ఎవరి నోటి నుంచి వచ్చినా ఎంతో కొంత కటువుగానే ఉంటుంది. లాయర్గా సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో కాంగ్రెసు పార్టీ నాయకుడుగా పేరొందిన ఈ దేశాయ్ మహావక్త. ఒకానొక సందర్భంలో లక్నో యూనివర్సిటీ విద్యార్థుల సభలో ప్రసంగిస్తూ ఆయనన్న మాటల సారాంశమిది : మన దేశాన్ని పాలిస్తున్న బ్రిటీష్ వారి సంఖ్య నాలుగైదు లక్షలైనాకాదు. పోతే, మన సంఖ్య 33 కోట్లకు పైగా. ఇన్ని గొర్రెలను మళ్ళేయడానికైనా నాలుగైదు లక్షలమంది గొర్ల కాపరులు చాలరు!!

భులాభాయ్ ఈ ప్రసంగం చేసినప్పుడు ఇప్పటి బంగ్లాదేశ్, పాకిస్తాన్ సమేతంగా మన ఉపఖండం జనాభా 33 కోట్ల చిల్లర. ఇప్పుడు ఆ రెండు కొత్త రాజ్యాలను విడిచిపుచ్చగా, మన జనాభా దాదాపు 60 కోట్లు. అయినా ఈ 60 కోట్ల మందిని ఒక తల్లి, ఒక కొడుకు ఇరవై నెలలపాటు సునాయాసంగా మళ్ళవేశారు.

వారిలో దాస్యబుద్ధి ఎంతగానో జితించిపోయినందునే ఈ పని (జగ్జీవన్ రాం పలుకులలో) "ఒకటిన్నర మనుష్యులకు" సాధ్యపడింది. పైగా, ఒక్క నెలకాదు, రెండు నెలలు కాదు - ఇరవై నెలలపాటు తల్లీకొడుకులు ఆడింది ఆటగా, పాడింది పాటగా చెల్లింది. ఒక్క కలం పోటుతో పత్రికల నోళ్ళను వారిద్దరు మూయించారు. సభలను, సమావేశాలను, నిషేధించారు. సంస్థలను బహిష్కరించారు. న్యాయస్థానాల హక్కులను సంకుచిత పరిచారు. అన్ని పౌరసత్వాలను అపహరించారు. కదిలితే కారాగానికి పంపించారు, మెదిలితే మక్కెలు విరగ బొడిపించారు. చంపినా చెప్పుకోడానికి దిక్కూ మొక్కూ లేకుండా చేశారు.

ఇంత క్రూరంగా, ఇంత ఘోరంగా బ్రిటీష్ వారైన ప్రవర్తించలేదు. ఎంత చెడినా వారిది స్వాతంత్ర్యపు విలువలున్న దేశం, సత్సంప్రదాయాలున్న దేశం. అందువల్ల వారు ఏదైనా తప్పుచేస్తే లోలోపల సిగ్గుపడుతూనే, లోకనింద తమకు తప్పదన్న బిడియంతోనే. కాగా, సిగ్గు బిడియాలు ఎంతమాత్రం లేకుండా సాగినంతవరకు తమ పలుకే శాసనంగా చెల్లించుకొన్నవారు దేశాన్ని

తమ కుటుంబం జాగీర్గా ఎంచుకున్నవారు మన పెద్దమ్మగారే, ఆమె కుమారులుంగారే. ఈ మాటలను ఎమర్జెన్సీ రోజులో ఎందుకు రాయలేదని నన్ను కొందరు నిగ్గదీస్తున్నారు. అప్పుడు కనీసం ఎడిటర్ పదవినైనా ఎందుకు విడిచిపెట్టలేదని గుచ్చి గుచ్చి అడుగుతున్నారు. ఏయే పరిస్థితుల ప్రాబల్యం అప్పటిలో నేను మౌనం వహించానో వాటిని వివరించడానికి ఇది సమయం కాదు, సందర్భమైనా కాదు. పోతే నేను చెప్పవలసింది - చెప్పగలిగింది - ఇతర పత్రికా సంపాదకులు పెక్కుమందివలె కాక, నేను కనీసం మౌనం పాటించానని. మహాతల్లి ప్రశంస పొరపాటుగానైనా నేను చేయలేదు. ఆమె పుత్రరత్నం భజన అసలే చేయలేదు. ఇంతేకాదు, ఎమర్జెన్సీ కొనసాగిన కాలంలో రాజకీయేతర విషయాలు పైనైనా నేను సంపాదకీయాలు రాయలేదు. ఇది గర్వపడవలసిన విషయం కాదని నాకు తెలుసు. అయినా ఉత్తమ జీవితపు విలువలన్నింటిని మంటగలిపిన తల్లీ కొడుకుల అడుగులకు మడుగు లొత్తినవారి నీచ ప్రవర్తనతో పోల్చినప్పుడు నాది తల కొట్టివేసుకొనవలసిన పాటి పాడు నడతకాదు. ఏమైనా, ఎమర్జెన్సీ కాలంలో ఒక ముఖ్యమంత్రితో మహాతల్లి - “ఈ విషయమై సంజయ్ చర్చించండి” అని చెప్పిందట. అందుమీదట కుమారరత్నం వద్దకు ఆయన భయభక్తులతో వెళ్ళి, వినమ్రత పూర్వకంగా - “ఈ విషయాన్ని గురించి మాతాజీ తమతో చర్చించవలసిందిగా సూచించింది” అని మనవి చేసుకొనగా, “అలాగా! చర్చ కోరితే, మాతాజీ వద్దకే తమరు వెళ్ళవచ్చు. నిర్ణయాన్ని కోరితే నా వద్దకు రండి” అని కసరు కొన్నాడట. మరొక ముఖ్యమంత్రి తనతో ఏదో విన్నవించుకొనబోగా “ఆప్ బుద్ధు హై!" (తమరు మూర్ఖులు) అని జవాబిచ్చాడట. “చిత్తం” అంటూ దాన్ని ఆ ముఖ్యమంత్రి అందుకొన్నాడట! తనకోసం బాత్రూం తలుపుతీసి తన చేతికి సబ్బును, తువ్వాలును అందించిన వేరొక ముఖ్యమంత్రిని - "మర్యాద మన్ననలకు నీకు నీవే సాటి" అన్నట్టుగా ముసిముసి నవ్వులతో సత్కరించాడట. ఇంత హీనస్థితికి మన ముఖ్యమంత్రులే దిగజారిపోయిన తర్వాత దాస్యబుద్ధి మన జాతి రక్తంలో జీర్ణించుకుపోయిందా అని సందేహించవలసిన అగత్యం నిజంగా కనబడుతుంది.

అయితే, నా తాత్పర్యం స్వాతంత్ర్య ప్రియత్వాన్ని ప్రదర్శించినవారు, నిరంకుశత్వాన్ని ధిక్కరించినవారు నియంతృత్వంపై పోరులో ప్రాణాలు సయితం త్యాగం చేసినవారు కొందరు లేరనికాదు. అట్టివారు కనీసం ఒకటి రెండు లక్షల సంఖ్యలో ఉండబట్టే మొన్నటి మార్చిలో తల్లి, కొడుకుల పీడ మనకు వదిలింది. తిరిగి మనం స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోగలుగుతున్నాము. ఆదమరిచి నిద్రపోగలుగుతున్నాం.

కాని, ఒక మాటమాత్రం మనం మరచిపోరాదు. మహాతల్లి నిరంకుశ పాలనగాని, ఆమె సుపుత్రుని విశృంఖల వర్తనగాని ఆకస్మిక సంఘటన కాదు. గడచిన మూడు దశాబ్దాల మనదేశ చరిత్రను ఒకసారి సింహావలోకనం చేస్తే, “ఇండియా స్వతంత్ర రాజ్యం కాదు” అని 1947లో స్టాలిన్ చెప్పినమాట త్రోసి వేయదగింది కాదని అంగీకరించక తప్పదు. పోతే ఆయన ఉద్దేశించింది ఒకటికాగా, నిజం మరొకటి. బ్రిటీష్ వారు ఇండియా నుంచి పేరుకు మాత్రమే వైదొలగినారని, ఇక మీదట పరోక్షంగా ఇండియాపై వారు ప్రాబల్యం వహించగలరని స్టాలిన్ భావించాడు. ఇది పొరపాటు. స్టాలిన్ తదనంతరం సోవియెట్ నాయకులు దీన్ని పొరపాటుగా గుర్తించారు కూడా. పోతే వాస్తవమిది: బ్రిటీష్ దాస్యం 1947లో మనకు వదలినా, తరతరాలుగా మనలను క్రుంగదీస్తున్న మన మానసిక దాస్యం మాత్రం మనకు వదలలేదు. మనకు సంబంధించినంత వరకు ఈ దాస్యం నాలుగు విధాలు. ఒకటి మతమౌఢ్యాల దాస్యం. రెండు కులవ్యవస్థ దాస్యం. మూడు - పూర్వాచారాల, సంప్రదాయాల దాస్యం. నాలుగు ఫ్యూడల్ చిత్తవృత్తి దాస్యం. ఇట్టి వాటిని తమదేశం విషయంలో నాల్గింటిని పేర్కొని, వీటిని మావో “ఫోర్ ఓల్డ్స్” అన్నాడు. తమ “ఫోర్ ఓల్డ్స్” నుంచి తమ దేశం బయటపడాలన్న తాపత్రయంతోనే మావో తమ దేశంలో సాంస్కృతిక విప్లవాన్ని ప్రారంభించాడు. ఆ విప్లవం కొన్ని వెర్రితలలు వేయకపోలేదు. అయినా దానివల్ల చైనాకు ఎన్నదగు మేలు జరిగింది. మన దేశంలో సైతం ఇట్టి సాంస్కృతిక విప్లవం ప్రారంభం కావాలి : అప్పుడుగాని మన దాస్యం బుద్ధి నిజంగా తొలగదు. అప్పుడుగాని మనదేశం ఆధునిక యుగంలో పాదం పెట్టదు.

ఆధునిక యుగంవైపుకు మనం పురోగమించాలని మన దేశంలో ఓం ప్రథమంగా గుర్తించిన వాడు రాజా రామమోహన్ రాయ్. అయితే, ఆయనేమి, ఆయన తర్వాత సంఘ నాయకులైన వారేమి మతానికిచ్చిన ప్రాధాన్యాన్ని వైజ్ఞానిక శక్తుల కివ్వలేదు. దీన్నే మరొక విధంగా చెప్పాలంటే, విశ్వాసాని కిచ్చిన ప్రాధాన్యాన్ని ప్రశ్న కివ్వలేదు. మతానికి బీజం విశ్వాసం. సైన్సుకు పునాది ప్రశ్న.

ఏమైనా, ఒక శోచనీయ విషయమిది: గత శతాబ్దిలోని భావస్వాతంత్ర్యంలో సగమైనా ఈనాడు మనలో కానరాదు. ఇందుకు గాంధీ, జిన్నాలు కారణం. ఇది అంబేద్కర్ మాట. నాది కాదు. ప్రజానాయకుల వలె కాక, మత ప్రవక్తలవలె వారిద్దరు సంచరించారని అంబేద్కర్ వాదం.

"నేను చెప్పినదాన్ని గురించి ఆలోచించండి" అని వారు కోరలేదని, "మేము చూపుతున్న దారివెంట నడవండి" అని మాత్రమే ఆదేశించారని అంబేద్కర్ వాదం. నా మట్టుకు నేను ఆయన వాదాన్ని త్రోసివేయలేను. అయితే, అంబేద్కర్ కూడా గాంధీ, జిన్నాల ధోరణిని కొంతవరకు ప్రదర్శించాడన్న అనుమానం నాకు లేకపోలేదు.

గాంధీ, జిన్నా, అంబేద్కర్ల దృక్పథానికి జవహర్ లాల్ నెహ్రూ దృక్పథానికి అనేక విషయాలలో తూర్పు, పడమరల ఆంతర్యం ఉంది. అయినా వారి ముగ్గురిని మించి, తాను దేశాన్ని పరిపాలించిన కాలంలో నెహ్రూ మన దాస్యబుద్ధిని పెంచాడు. నియంతల పట్ల వైముఖ్యం ఉండేది ఆయనకు. అలానే ప్రవృత్తిలో అంతర్భాగమైన నియంతృత్వ లక్షణాలు కొన్ని ఉండేవి. ఈ సంగతిని "మోడరన్ రెవ్యూ" పత్రికలో మారుపేరుతో తాను రాసిన ఒక వ్యాసంలో ఒకప్పుడు ఆయన స్వయంగా అచ్చుకొన్నాడు. గాంధీ హత్య తర్వాత పటేల్ నిర్యాణం తర్వాత, దేశ నాయకత్వంలో తనకు ఎదురాడ గలవారు మరి మిగలకపోవడంతో ఆయనలోని నియంతృత్వ లక్షణాలు క్రమంగా పైకి పొటకరించాయి. ఈ పరిణామానికి మన బాధ్యత కూడా విశేషంగా ఉన్నది. ఒకటి రెండు సందర్భాలలో అలానే ప్రధాని పదవి నుంచి తప్పుకొన గోరగా ఎంత దిట్టంగా ఈ కోర్కె ఆయనకు కలిగిందో చెప్పలేము - "అమ్మయ్యో. తమరు తప్పుకుంటే మా గతి ఏమికాను?" అంటూ మనం రొమ్ము బాదుకొన్నంత పని చేశాము. ఇంతేకాదు. "నెహ్రూ తదనంతరం దేశ నాయకుడెవడు?" అనే ప్రశ్నను గురించి డజనుల పుస్తకాలు వచ్చాయి. కొన్ని వందల వ్యాసాలు వెలువడినాయి. -

నెహ్రూ ఎంత గొప్పవాడైనా, మానవాతీతుడు కాదు. ఆయన తప్ప మన దేశానికి నాధుడు లేడన్న వైఖరిని మనం ప్రదర్శిస్తే, ఇతరుల సూచనలను పాటించని, విమర్శలను సహించని స్థితికి ఆయన వెళ్ళడం అబ్బురమా? ఎవరో కొందరు సాహసించి, ఆయనకు ఎదురాడగా వారికి మంత్రి వర్గం నుంచి కొంచెం ముందు వెనుకలుగా ఉద్వాసనం జరిగింది. ఇప్పుడు కొందరంటున్న మాట ప్రకారం రాష్ట్రాలలో కేంద్రంలో పెక్కుమంది మంత్రుల పదవీ విరమణకు మూలకారణమైన "కామరాజు పథకం" అంటే ఏమిటని కామరాజు స్వయంగా విస్తుపోయిన సమయమొకటి కలదని ఈ మాట నిజమైనా, కాకపోయినా, కొన్ని నియంతృత్వపు పోకడలు ప్రజాస్వామ్యం మేలి ముసుగు కింద నెహ్రూ ప్రభుత్వంలో ప్రవేశించాయి. అప్పటిలో ఆ ప్రమాదాన్ని మన దృష్టికి తెచ్చిన వారిలో ఎమ్.ఎన్.రాయ్ ఉన్నాడు. ఆచార్య కృపలానీ ఉన్నాడు. జయప్రకాశ్ నారాయణ్ ఉన్నాడు. అయితే, నెహ్రూ పట్ల మనకున్న అపార గౌరవాలవల్ల వారి మాటలకు మనం తగుపాటి విలువ నివ్వలేదు. దీని ఫలితమే మేలి ముసుగును తొలగించి తన వికృత రూపాన్ని మనకు చూపించిన ఇందిర నియంతృత్వం. తండ్రి కున్న విద్యా సంస్కారాలు ఆమెకు లేవు. ఆయన కున్న ప్రజ్ఞా ప్రాభవాలూ లేవు. అందువల్ల కుటుంబ గౌరవాన్ని వినియోగించుకున్నా, తండ్రి వలె తన నియంతృత్వాన్ని ఎంతో కాలంపాటు ప్రజాస్వామ్యం మేలి ముసుగులో ఆమె దాచలేకపోయింది.

నెహ్రూను విడిచిపెట్టండి, ఇందిరను విడిచిపెట్టండి. రాష్ట్రాలలోని మన చోటా మోటా మంత్రుల మాటేమిటి! వారిలో విద్యకు, సంస్కారానికి మనం మెచ్చుకొనదగువారెందరు! నీతినిజాయితీలకు మనం గౌరవించదగు వారెందరు. పరిపాలనా దక్షతకు, ఇతర ప్రతిభలకు మనం హర్షించదగు వారెందరు. నూటికి పదిమంది వరకైనా ఇట్టి వారున్నారా? అయినా ఏ అనామకుడో, ఏ అప్రయోజకుడో, అవినీతిపరుడో మంత్రి పదవికి రాగానే అతనికి ఎన్ని సన్మానాలు, ఎంతగా ప్రశంసలు! ఇంతకంటే మనలోని దాస్యబుద్ధికి బలమైన నిదర్శనం మరి ఏదికావాలి? బ్రిటన్లో, ఫ్రాన్సులో, జర్మనీలో శ్కాండినేవియన్ దేశాలలో నిజమైన స్వేచ్ఛా ప్రవృత్తి ఉన్న ఇతర ఏ దేశాలలో మంత్రిని ఆకాశాన్నుంచి ఊడిపడిన మహనీయునిగా చూడరు. అతడు అవాకులు చవాకులు పేలితే "ఆహా ఓహో" అనరు. అతడు తన కారులోకి తమను ఎక్కనిస్తే అంతటితో తమ జన్మసార్థకమైనట్టు భావించరు. కోరిన వరాలివ్వగల ఇలవేల్పుగా అతడిని పూజించరు. నెహ్రూ కుటుంబం ప్రభుత్వం పోయి, జనత ప్రభుత్వం వచ్చినంత మాత్రాన మన దేశంలో, మన జీవితంలో ఎన్నదగు మార్పురాదు. ఆ మార్పు రావడం మన దాస్యబుద్ధి మారినప్పుడే. స్వేచ్ఛగా మనం ఆలోచించగలిగినప్పుడే. స్వతంత్రంగా మనం వ్యవహరించ గలిగినప్పుడే.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో వ్యాసం 18-7-1977)

సంపూర్ణ విప్లవం

జయప్రకాశ్ నారాయణ్ సంపూర్ణ విప్లవాన్ని కోరుతున్న వారిలో మొదటివాడు కాదు. ఆయన కంటే ముందుగా మోహన్దాస్ కరంచంద్ గాంధీ కోరింది సంపూర్ణ విప్లవాన్నే. గాంధీకంటే మరింత ముందుగా మహదేవ్ గోవింద్ రణడే కూడా సంపూర్ణ విప్లవాన్నే ఉపలక్షించాడు. రణడేకు ముందు ఈశ్వరచంద్ర విద్యాసాగర్, రాజా రామమోహన్ రామ్లు సైతం సంపూర్ణ విప్లవాన్ని కాంక్షించినవారే. స్థూలదృష్టికి రామమోహన్ రాయ్కి వీరికి సామ్యాలకంటే వైరుధ్యాలు అధికమన్నట్లు చెప్పవచ్చు. ఇదేవిధంగా విద్యాసాగర్కు, జయప్రకాశ్కు ఉత్తర, దక్షిణ ధ్రువాల ఆంతర్యం ఉన్నట్టు చెప్పవచ్చు. రామమోహన్, విద్యాసాగర్, రణడేలు భారతదేశంపై బ్రిటీష్ పరిపాలనను హర్షించారు. గుర్తించారు. అంతటితోనైనా వారు ఆగలేదు. ఈశ్వరానుగ్రహం వల్లనే మన దేశంలో బ్రిటీష్ పాలన నెలకొన్నట్టు వారు ప్రగాఢంగా విశ్వసించారు. బ్రిటీష్ వారు శాశ్వతంగా ఇక్కడ తిష్ఠ వేయాలని వారు కోరుకోలేదు. కాని, మన సర్వతోముఖాభివృద్ధికే వారు కృషి చేస్తున్నారని, వారి కృషి ఫలించగలవరకు వారి సుపరిపాలన అవిచ్ఛిన్నంగా కొనసాగాలని వారు అనేక సందర్భాలలో ఉద్ఘాటించారు. పోతే, మన ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక పతనానికి బ్రిటీష్ వారి పరిపాలన మూల కారణమని గాంధీ ఉదోషించాడు; అన్యవిధాల సాధ్యం కాకపోతే, సాయుధ విప్లవం ద్వారా బ్రిటీష్ వారిని మన దేశం నుంచి తరిమివేయాలని జయప్రకాశ్ ప్రబోధించాడు.

ఇంతేకాదు, ఈ ఐదుగురిలో మొదటి ముగ్గురు కొంత, సంఘ సంస్కరణలకు తమ జీవితాలను అంకితం చేసినట్టివారు. కాగా, మిగిలిన వారిద్దరు మత, సంఘ సంస్కరణలను వ్యతిరేకించలేదు. గాని, రాజకీయ స్వాతంత్ర్య సాధనకు వారు అగ్ర ప్రాధాన్యమిచ్చారు. దాన్ని సాధించడం కోసం తాపత్రయ పడ్డారు, తహతహలాడారు, తపన చెందారు.

వ్యక్తులుగా వీరి ప్రవృత్తులలో సైతం కొన్ని వైరుధ్యాలు లేకపోలేదు. రామమోహన్ రాయ్ డబ్బు గడించాడు; దాన్ని మడత వడ్డీకి తిప్పాడు; అసలు ఫాయిదాలతో బాకీలను తీర్చలేకపోయినవారి ఆస్తులను కోర్టు ద్వారా స్వాధీనపరచుకొన్నాడు. జమీందారు అయ్యాడు. పోతే, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ఇతరులకు సహాయం చేయడానికై అప్పులు చేశాడు. వాటిని తీర్చడానికై తన ఆస్తిపాస్తులను కొన్ని సందర్భాలలో అమ్మివేశాడు. మైకేల్ మధుసూదన్ దత్ (బెంగాలీలో ఈయన మొట్టమొదటి ఆధునిక కవి)

"లావొక్కింతయు లేదు..." అనే ధోరణిలో పారిస్ నుంచి, లండన్ నుంచి మాత్రమేకాక, ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత కూడా కవితలు రాయగా, ఆయన కోసం విద్యాసాగర్ చేసిన రుణం పదివేల రూపాయలకు పైగా, ఈ మొత్తం నుంచి చిల్లిగవ్వ కూడా ఆయనకు తిరిగి రానేలేదు. విద్యాసాగర్ పట్ల ప్రేమ గౌరవాలకొద్దీ ఒక జమీందారు తన కొక గ్రామాన్ని దానం చేయగోరగా, "రెక్కలు విరుచుకొన్నా డొక్కలు నిండని రైతుల వద్ద నుంచి శిస్తుల వసూళ్ళు చేయడం నా వల్ల కాదు. మీ గ్రామం నాకు వద్దు" అని దాన్ని నిష్కర్షగా నిరాకరించాడు. రణడే ఇతరులకు సహాయం చేయడంకోసం అప్పులు చేసి ఉండకపోవచ్చుగాని, తన సంపాదనను ప్రజాహిత కార్యాలకు వినియోగించినవాడే. పోతే, గాంధీవలె జయప్రకాశ్ నారాయణ్ అంగవస్త్రాన్ని కట్టకపోవచ్చు, చప్పిడి కూడు తినకపోవచ్చు. కాని, ఆయన ప్రజాసేవకై జీవన దానం చేసినట్టివాడు, నిస్స్వార్థంగా, నిరాడంబరంగా బ్రతుకుతున్నట్టివాడు.

ప్రవృత్తులలో, వైఖరులలో రాయ్, విద్యాసాగర్, రణడే, గాంధీ, జయప్రకాశ్ల మధ్య ఇన్ని విభేదాలతోపాటు కొన్ని వైరుధ్యాలు సైతం గోచరిస్తున్నప్పుడు వీరు మొత్తంపై ఒకే కోవకు చెందినవారని చెప్పడం తగునా? వీరిది ఏక లక్ష్యమని వాదించడం భావ్యమా? "ఔను" అనేదే ఈ రెండు ప్రశ్నలకు సమష్టి సమాధానం. ఒకానొక సందర్భంలో రామమోహన్ రాయ్ తెలియదానికి వాలఖిల్యుడని ("పిగ్మీ" అని) గాంధీ చులకనగా మాట్లాడి ఉండవచ్చు. ఇది రవీంద్రనాథ్ టాగోరు పట్టరాని కోపాన్ని తెప్పించి ఉండవచ్చు. కాని, ఒక రాయ్ లేకపోతే, ఒక గాంధీ లేకపోయేవాడేమో! కాస్త నిదానిస్తే, నా పలుకులలోని సత్యాన్ని మీరు గుర్తించగలుగుతారు. రామమోహన్ రాయ్ సంస్థాపించిన బ్రహ్మ సమాజంలో దేవేంద్రనాథ్ టాగోరు వలె, కేశవ చంద్రసేన్ వలె, శివనాథశాస్త్రి వలె ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ఒక సభ్యుడు కాదు. అయినా, రాయ్ ప్రభావం ఆయనపై విశేషంగా పడింది. రాయ్ ప్రారంభించిన కృషిని ఆయనకు శిష్యవర్గం కంటే విద్యాసాగర్ ఎక్కువ ముందుకు తీసుకువెళ్ళినట్టు చెప్పవచ్చు. రాయ్ ఆస్తికుడు కాగా, విద్యాసాగర్ అజ్ఞేయతావాది ("యాగ్నాస్టిక్"). ఆయన వలె ఈయన భక్తిగీతాలను రాయలేదు, ఏకేశ్వరోపాసన చేయలేదు. ఇదమిత్థంగా మనకు తెలియని వీలులేని - విషయాలను నిర్లక్ష్యం చేయడం ఉత్తమమన్న సూత్రాన్ని విద్యాసాగర్ పాటించాడు. పోతే, రాయ్వలె విద్యాసాగర్ సైతం ఇంగ్లీషు భాషా వ్యాప్తిని అభిలషించాడు. కలకత్తాలోని సంస్కృత కళాశాలకు తాను ప్రిన్సిపల్గా పనిచేసినప్పుడు రెండవ భాషగా ఆంగ్లేయాన్ని విద్యార్థులందరు అభ్యసించి తీరాలనెడి నిబంధనను ఆయన ప్రవేశ పెట్టించాడు. రాయ్ వలె ఆయన సైతం ఆధునిక వైజ్ఞానిక శాస్త్రాలను యూరప్ నుంచి మనం స్వీకరించకపోతే మనకు పురోగతి లేదని స్పష్టంగా చెప్పాడు. సతీ సహగమనాన్ని నిలుపుదల చేయించడానికి రాయ్ పాటుపడగా, వితంతు వివాహాలపై నిషేధం రద్దును విద్యాసాగర్ సాధించాడు. తమ లక్ష్యాల సాధనకై, తమ ఉద్యమాల సాఫల్యానికై సంప్రదాయవాదులను, ఇతర ఛాందసులను ఉభయులు సమానంగా ధిక్కరించవలసి వచ్చింది; వారి నుంచి ప్రాణాపాయం తప్పించుకొనడానికై ఉభయులు అంగరక్షకులను నియమించుకొనవలసి వచ్చింది.

విద్యాసాగర్కు శిష్యుడుగా, రామమోహన్ రాయ్కి ప్రశిష్యుడుగా పేర్కొనదగువాడు మహదేవ్ గోవింద్ రణడే. మత సంస్కరణతో పాటు సంఘ సంస్కరణకు ఆయన కృషి చేశాడు. గురువు లిద్దరివలె బ్రిటీష్ పరిపాలకుల సదాశయాలలో విశ్వాసం ఉన్నవాడైనా, క్రమానుగతంగా స్వపరిపాలనాధికారాన్ని భారతీయులకు సంక్రమింపజేయవలసిన సమయం వచ్చినట్టు ఆయన భావించాడు. హైకోర్టు జడ్జి పదవిలో ఉన్నందున రాజకీయాలతో, ఒకేఒకసారి తప్ప తాను ప్రత్యక్షంగా సంబంధం పెట్టుకొనలేకపోయినా, ఇండియన్ నేషనల్ కాంగ్రెసును కొన్నేళ్ళపాటు దాని వెనుక నిలబడి, నడిపించింది ఆయనే. తన శిష్యుడు గోపాలకృష్ణ గోఖలే ద్వారా ఆయన కాంగ్రెసును కొంతకాలం పాటు పూర్తిగా కంట్రోల్ చేశాడు.

రణడేను గాంధీ కంటితో చూడనైనా లేదు. అయినా, తన రాజకీయ గురువుకు (గోఖలేకు) గురువుగా రణడేపట్ల గాంధీకి భక్తి గౌరవాలుండేవి. దక్షిణాఫ్రికాలో బారిస్టర్గా ప్రాక్టీస్ చేస్తున్న రోజులలో గాంధీ ఆఫీసులో రణడే ఫోటో ఉండేది. రాజకీయాలలో నైతికపు విలువలకు స్థానం కల్పించాలన్న విశ్వాసం గాంధీలో నెలకొన్నది గోఖలే ద్వారా తనపై పడిన రణడే ప్రభావం వల్లనే.

గాంధీపై రణడే, గోఖలేల ప్రభావం కంటే జయప్రకాశ్పై గాంధీ ప్రభావం మరింత హెచ్చు. అందువల్ల రామమోహన్ రాయ్ శిష్య ప్రశిష్య పరంపరకు చెందిన వ్యక్తిగా జయప్రకాశ్ను పేర్కొనడం సమంజసమే. దీని తాత్పర్యం - అన్ని విషయాలలో వీరి దృక్పథం ఒక్కటే అని కాదు, వీరి విశ్వాసాలు ఒక్కటే అనికాదు, వీరి విధానాలు ఒక్కటే అని కూడా కాదు. అయితే, వీరందరు తరతమ భేదాలతో సంపూర్ణ విప్లవాన్ని కోరినవారే, అందుకోసం పాటుపడినవారే.

అస్పృశ్యతా నిషేధం, గోవధ నిషేధం, మద్యపాన నిషేధం, వరశుల్క నిషేధం, బహుభార్యాత్వ నిషేధం సంపూర్ణ విప్లవ మనగా ఇట్టి నిషేధాలు మాత్రమే కావు. అవినీతిని, ఆశ్రిత పక్షపాతాన్ని, అన్యాయార్జనను, అన్యవిధాల అధికార దుర్వినియోగాన్ని ప్రభుత్వం నుంచి తొలగించడమైనా సంపూర్ణ విప్లవం కాదు. రాజకీయ స్వాతంత్ర్యం, ఆర్థిక న్యాయం, సాంఘిక సమతల సంస్థాపన మాత్రమైన సంపూర్ణ విప్లవం కాదు. మానవ జీవితంలో మానవత్వపు విలువలను సుప్రతిష్ఠం చేయడమే సంపూర్ణ విప్లవం. ఆ విప్లవం మనస్సులో ప్రారంభం కావాలి, హృదయానికి విస్తరించాలి, రక్తంలో జీతించాలి, జీవిత సరళినే పూర్తిగా మార్చివేయాలి. ఒక్కమాటలో, ఈ విప్లవ ఫలితంగా నవ మానవుడు రూపొందాలి.

ఇది ఒక్క తరంలో జరిగే పనికాదు, ఒకరిద్దరు నాయకుల ద్వారా జరగగల పని సైతం కాదు. క్రైస్తవుల నమ్మకం ప్రకారం మానవుడు పతనం చెందిన దేవత. హిందువుల విశ్వాసం ప్రకారం అతడు దైవాంశ సంభూతుడు. ఆ నమ్మకం వలె ఈ విశ్వాసం సైతం త్రోసిపుచ్చవలసి నట్టిదే. జంతుజాలం నుంచి కొన్ని కోట్ల సంవత్సరాలుగా క్రమపరిమణాన్ని చెంది, ఇప్పటి స్థితికి మానవుడు వచ్చాడు. అయితే, ఈ నాటికి కూడా అతడిలో పాశవిక ప్రవృత్తి చావలేదు. అందువల్లనే అనేక సందర్భాలలో పశువువలె అతడు ప్రవర్తిస్తాడు. ఇంతేకాదు, తనతో పోల్చినందుకు పశువు సిగ్గుపడవలసిన విధంగా ప్రవర్తిస్తాడు. అన్నం పెట్టిన చేతినే అతడు కరుస్తాడు, నమ్మిన వారినే గోతిలో దించుతాడు. ప్రేమించిన వారినే బుగ్గిలో కలుపుతాడు, పదవికి తెచ్చిన వారికే పంగనామాలు పెడ్తాడు. ఒక్కమాటలో ఏ ఘోరానికైనా, ఎంతటి నైచ్యానికైనా అతడు ఒడికడతాడు. నాగరికతా పథంపై మానవుడు ఆరేడు వేల సంవత్సరాల నాడు పాదం పెట్టినా, విద్యలు పెరిగినా, విజ్ఞానం పెరిగినా, సంపత్తి పెరిగినా, సౌకర్యాలు పెరిగినా ప్రపంచం నుంచి దారిద్ర్యం తొలగకపోవడం, దైన్యం తొలగకపోవడం, విద్వేషాలు తొలగకపోవడం, మారణ హోమాలు తొలగకపోవడం తన హీనబుద్ధిని, తన హేయవర్తనను మానవుడు మార్చుకొనలేక పోతున్నందునే. ఎంతో దూరం పోవడం దేనికి? మన దేశంలోనే గడిచిన కొద్ది సంవత్సరాలలో ఆహారాన్ని, ఔషధాన్ని కూడా అన్యాయార్జనకై కల్తీ చేసినవారు ఎందరు లేరు? పదవిని, పదవి కూర్చిన ప్రాబల్యాన్ని స్వీయ ప్రయోజనాలకై దుర్వినియోగం చేసినవారు మరెందరు లేరు? ముఖ్యంగా 1975 జూన్ 26వ తేదీ తర్వాత నరరూప రాక్షసుల వలె ప్రవర్తించిన వారెందరు లేరు? అట్టి రాక్షసుల నుంచి ఏదో స్వల్ప ప్రయోజనాన్ని కోరి, ఏదో నీచ స్వార్థాన్ని కాంక్షించి, వారి పాద పూజ చేసిన పరమ నీచులెందరు లేరు? లజ్జాకరమైన, జుగుప్సాకరమైన ఈ స్థితి నుంచి మనను సముద్ధరించ గలిగింది సంపూర్ణ విప్లవమే.

మానవుడు కిందికి దిగజారితే మానవాధముడు అవుతాడు; పైకి వెళ్ళగలిగితే మానవోత్తముడు అవుతాడు; అంతే తప్ప, అతడు దేవతామూర్తి కావడం కల్ల, దైవాంశలో లీనం కావడం మరింత కల్ల. మానవుని ఎప్పటికైనా మానవోత్తమునిగా మార్చగలిగింది సంపూర్ణ విప్లవమే. ఇది మన దేశంలోనే కాదు, దేశ దేశాలలో రావాలి.

రాజకీయ స్వాతంత్ర్య సముపార్జనతో మన విప్లవం సమాప్తి చెందినట్టు మనం భ్రమించాము. దీని దుష్ఫలితాలను మనం అనుదినం చూస్తూనే ఉన్నాం. గత మూడు దశాబ్దాల కాంగ్రెసు పరిపాలనలో ఆర్థిక, సాంఘిక, పారిశ్రామిక రంగాలలో మనం కొంత పురోగమించినా, నైతికపు విలువలకు సంబంధించినంతవరకు మనం హీనాతిహీన స్థితికి పతనం చెందాం. ఏ గడ్డి కరచినా, ఏదో ఒక పదవిని సంపాదించలేని వాడు ఇప్పుడు పరమ శుంఠ; ఏ అబద్ధపు కూళ్ళు కుడిచినా, ఎన్నో కొన్ని లక్షలను మూటకట్టలేని వాడు

ఇప్పుడు మూర్ధశిఖామణి. ఈ చెడ్డ పోకడలు 1947 నాటికే దేశంలో కొంత వరకు పొటమరించాయి. అందువల్లనే దేశ ప్రజలు స్వాతంత్ర్య దినోత్సవాన్ని వైభవోపేతంగా జరుపుకొన్న ఆగష్టు 15వ తేదీని గాంధీజీ పస్తు పడుకొన్నాడు; అందువల్లనే భారత ప్రభుత్వంలో మంత్రి పదవిని జయప్రకాశ్ నారాయణ్ నిరాకరించాడు.

రాజా రామమోహన్ రాయ్ మొదలుకొని, జయప్రకాశ్ నారాయణ్ వరకు ప్రతి ద్రష్ట కేవలం రాజకీయ విప్లవం చాలదన్నారు. సంపూర్ణ విప్లవాన్నే మనం లక్షించాలన్నారు. అట్టి విప్లవాన్ని తాను సైతం కోరినందున గోపాలకృష్ణ గోఖలే "సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ"ని సంస్థాపించాడు. లజపతిరాయ్ "సర్వెంట్స్ ఆఫ్ పీపుల్స్ సొసైటీ"ని నెలకొల్పాడు. తమకు, తమ కుటుంబానికి నిత్యజీవితావసరాలకు వలసిన కనీస వేతనంతో సంపూర్ణ విప్లవ సాధనకు అవిరళ కృషి చేయగలవారికే ఈ సంఘాలలో సభ్యత్వం. నిధులు తగినంతగా లేనందున వీటి సభ్యుల సంఖ్య బహు పరిమితం. కాని, వీరు సత్యనిష్ఠకు, త్యాగనిరతికి, సేవాధర్మానికి మన్నన పొందుతున్నట్టి వారు. రైట్ ఆనరబ్బుల్ శ్రీనివాసశాస్త్రి, పండిట్ హృదయనాథ్ కుంజ్రూ, ఠక్కర్ బాబా మున్నగువారు "సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ" సభ్యులు. పురుషోత్తమదాస్ టాండన్, లాల్బహదూర్ శాస్త్రి ప్రభృతులు "సర్వెంట్స్ ఆఫ్ ది పీపుల్స్ సొసైటీ" సభ్యులు. ఒకప్పుడు గాంధీ సైతం "సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ"లో చేరడానికి దరఖాస్తు పెట్టుకొన్నాడు. అయితే, ఆయన తమ సంఘంలో ఇమడక పోవచ్చునన్న సందేహంతో ఆయన దరఖాస్తును త్రోసిపుచ్చడం సంభవించింది.

అన్నట్టు, గాంధీ తరం తర్వాత ప్రజానాయకులైన వారిలో జయప్రకాశ్ నారాయణోపాటు ఎమ్.ఎన్.రాయ్, రామమనోహర్ లోహియాలు సైతం సంపూర్ణ విప్లవాన్ని కోరిన వారే. ఎప్పటికైనా ఆ విప్లవం రావాలి. లేకపోతే ప్రభుత్వాలు మారినా; ప్రభుత్వాధినేతలు మారినా, మానవుడు పెరగడు, మానవతకు పట్టాభిషేకం జరగదు.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 27-7-1977).

తెలుగువారిలో చేవ చచ్చిందా?

"వందేమాతరమ్" ఉద్యమం సందర్భంలోనే 1908లో బ్రిటిష్ వారి నిరంకుశత్వాన్ని తీవ్రంగా నిరసించి, కఠినశిక్ష పడిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు తెలుగు వాడేనా? "నాన్ - కోఆపరేషన్" రోజులలో పల్నాటి ప్రజలను ఎంతటి త్యాగాలకైనా ఉత్తేజపరచిన కొండా వెంకటప్పయ్య తెలుగు వాడేనా?

చీరాలకు,పేరాలకు జాతీయోద్యమ చరిత్రలో స్థానం సంపాదించిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య తెలుగువాడేనా?

నాగపూర్ వరకు వెళ్ళి, "జెండా సత్యాగ్రహం" నడిపించిన బులుసు సాంబమూర్తి తెలుగు వాడేనా?

సైమన్ కమిషన్ బహిష్కరణోద్యమ సందర్భంలో "ప్రజల పై కాల్పులను జరపడానికి ముందు నన్నుకాల్చండి" అంటూ మద్రాసులో బ్రిటిష్ పోలీసు సార్జెంటుకు ఛాతీ చూపించిన టంగుటూరి ప్రకాశం తెలుగు వాడేనా?

పరిపాలకుల పై పిడుగులను రాల్చే రచనలతో తన వారపత్రికను నడిపి, ఎన్నోసార్లు జైలుకు వెళ్లిన ముద్దూరి అన్నపూర్ణయ్య తెలుగు వాడేనా?

కోయదొరల తోడ్పాటుతో తెల్లదొరతనంపై పితూరీ సాగించిన అల్లూరి సీతారామరాజు తెలుగు వాడేనా?

ఒక లక్ష్యం కోసం ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములు తెలుగు వాడేనా?

సందేహం లేదు! వీరందరు తెలుగువారే. అయితే, ఇటీవల ఒక ప్రజగా మన ప్రవృత్తిని, మన ప్రవర్తనను ఒకసారి పర్యాలోకనం చేసుకుంటే వీరందరు తెలుగువారిలో తప్ప బుట్టిన వారేమో అని సందేహించవలసి వస్తుంది. పోనీ, మూడు నెలల క్రితం, ఆరునెలల క్రితం, ఏడాది క్రితం, రెండేళ్ళ క్రితం ఏమి జరిగినా, ఇప్పటికైనా మనలో ఆత్మాభిమానం కానరాదు, స్వేచ్ఛానురక్తి కానరాదు. పోతే, ధర్మాభినివేశం మాట ఎత్తవలసిన పని - రామరామ! అసలేలేదు!

మొన్నటి మార్చిలో జరిగిన జనరల్ ఎన్నికలలో ఒకే ఒక మినహాయింపుతో మనం గెలిపించింది కాంగ్రెసునే! అది తిలక్ కాంగ్రెసు కాదు, గాంధీ కాంగ్రెసు కాదు, కనీసం నెహ్రూ కాంగ్రెసు సైతం కాదు. మనం గెలిపించినట్టిది ఇందిరా గాంధీ అడుగులకు మడుగులొత్తుతున్న కాంగ్రెసు: ఆమె సుపుత్రుడు సంజయ్ గాంధీ కాంగ్రెసు!

పోనీ, మొన్నటి మార్చిలో తెలియక మనం పొరపాటు పడినామంటే, ఇప్పటికైనా మన వోటును దుర్వినియోగం చేశామని సిగ్గుతో తలవంచుకోవలదా? ఇప్పటికైనా కాంగ్రెసు నుంచి మూక ఉమ్మడిగా తప్పుకోవలదా?

సన్న తుంపర రాలుతున్నట్టుగా జరుగుతుంది. పైపెచ్చు ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరంలో ఇందిరా గాంధీ పార్కును మరింతగా పెంచాలని, దానిపై మరింత ఖర్చు పెట్టాలని తాపత్రయం కనబడుతుంది. ఇందిరా గాంధీని, ఆమె పుత్రరత్నాన్ని దుర్బుద్ధితో అల్లరిపాలు చేయడం తమకు దుర్భర విషాదాన్ని కలిగిస్తున్నట్లు కొందరు శాసన సభ్యులు రొమ్ము బాదుకోవడం వినిపిస్తుంది. ఇంతకంటే హైన్యాన్ని ఊహించడమైనా నాకు కష్టం.

ఈనాడే కాదు, ఆది నుంచీ ఇందిరా గాంధీ పట్ల నాకు రవ్వంతగానైనా గౌరవం లేదు. 1958లో కాంగ్రెసు పక్షాన రాజ్యసభకు ఎన్నికైన నేను 1966లో నాటి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు నాయకుల ఆదేశానుసారం ఇందిరాగాంధీ నాయకత్వానికి అనుకూలంగా వోటుచేయక తప్పలేదు. అయితే, విసుగుదలతో వేశాను, విచారిస్తూ వేశాను.

ఆనాడు ఆమెకు వోటు వేసినప్పుడు నా చేతికి అంటుకున్న మాలిన్యం ఈనాటికైనా తొలగినట్టు నేను భావించడం లేదు. నా చర్యవల్ల నా హస్తానికే కాక, నా జీవితానికి సైతం మాలిన్యం అంటుకున్నట్టు నేను విచారిస్తున్నాను.

ఈ తీవ్ర ధోరణిలో కావాలనే నేను వ్రాస్తున్నాను. కర్కశంగా నేను వ్రాస్తున్నానని, పరుషంగా వ్రాస్తున్నానని మీ రంటే, అందుకు నేను అభ్యంతరం చెప్పను. ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా రాజకీయాలలో నీతినిజాయితీలు తక్కువ. కాని, ఇందిరా గాంధీ మన దేశ రాజకీయాల నుంచి నీతిని ఊడ్చివేసింది, నిజాయితీని తుడిచిపెట్టింది. ఆమెకు కావలసింది తనకు పదవి, తనకు ఘనత, తనకు కీర్తి ప్రతిష్ఠలు. కాగా, ఇటీవల ఆమెకు మరొక దురాకాంక్ష కూడా పుట్టింది. అది ఏవిధంగానైనా సరే, తన సుపుత్రునికి భారత రాజ్య నేతృత్వాన్ని కట్టబెట్టడం. ఇందిరా గాంధీ నుంచి, ఆమె పుత్రరత్నం నుంచి నేను ఏ వరాలనూ కోరలేదు; వాటిని వారు తిరస్కరించనూ లేదు. అయినా, వారిద్దరంటే నాకు చెప్పనలవికాని జుగుప్సకు కారణం మన దేశ రాజకీయాలను రొచ్చుగుంటగా మార్చినారని, మన దేశ ప్రజలను కాల్చుకుతిన్నారని. ఎంత చెడినా, బ్రిటీష్ వారికి కుడి ఎడమ లుండేవి, మంచిచెడ్డ లుండేవి. ఇందిరకు, ఆమె పుత్ర

రత్నానికి ఇవి ఎంతమాత్రం లేవు. అందువల్ల అబద్ధాలలో ఒకరిని మరొకరు మించిపోతారు, అత్యాచారాలలో ఒకరితో మరొకరు పోటీపడతారు. రెచ్చిపోయి, ఇవి నేను వ్రాస్తున్న పచ్చి వ్రాతలు కావు. పిచ్చి పిచ్చి రాతలు మొదలే కావు. ఇందిరా గాంధీపతనాన్ని గురించి అయిదారు గ్రంథాలు ఈ మధ్యనే వెలువడినాయి. వీటిని కొని చదవడం నాకైనా సాధ్యం కాలేదు; అందువల్ల ఎరువు తెచ్చుకుని చదివాను. అవసరమైతే, మీరు కూడా ఇంతే చేయవచ్చు. అప్పుడు మీకే తెలుస్తుంది. నేను ఎంతగా నా ఆవేశాన్ని తగ్గించుకొంటూ వ్రాస్తున్నానో, ఎంతగా నా అగ్రహాన్ని అణచిపెట్టుకొంటూ నా కలాన్ని నడిపిస్తున్నానో!

తెలుగువారిలో చేవ చచ్చిందా?ఈనాటికైనా హిందీ రాష్ట్రాలలో బహు కొద్దిమంది, తెలుగువారిలో చాలా హెచ్చుమంది ఇందిరా గాంధీ నిజ స్వభావాన్ని గుర్తించలేదు గాని, 1934లోనే ఆమె తండ్రి గుర్తించాడు. జవహర్లాల్ నెహ్రూ ఆ సంవత్సరం జూన్ నెలలో - అప్పటికి ఇందిర వయస్సు పదిహేడు సంవత్సరాలు - జైలు నుంచి తన సోదరి విజయలక్ష్మి పండిట్ పేర ఒక లేఖ వ్రాస్తూ, ఈదురోమంటూ కూర్చునేవారిని చూస్తే తనకు కోపమన్నాడు; తన కుమార్తె ఆ కోవకు చెందిన పిల్లగా పెరుగుతున్న దన్నాడు; అందరినీ చులకనగా చూస్తున్నదన్నాడు; తన బాగు తప్ప ఎదుటివారి బాగు కోరడం లేదన్నాడు; తన మాటే నెగ్గాలన్న పంతానికి పోతున్నదన్నాడు. ఇంతేకాదు, తనను చూడ్డానికై జైలుకు వస్తే, తప్పనిసరిగా వస్తున్నదన్న అభిప్రాయాన్ని తనకు కలిగిస్తున్నదన్నాడు; మూడు, నాలుగు మాసాల కొకసారి మాత్రమే తనకు మొక్కుబడిగా ఒక జాబు వ్రాస్తున్నదన్నాడు; అప్పుడైనా, ముక్తసరిగా మూడు ముక్కలే గిలుకుతున్నదన్నాడు.

నెహ్రూ లేఖకు నేను చేసింది స్వేచ్ఛానువాదం. మూలంలోని తీవ్రతను, బాధను తెలుగులో పూర్తిగా పెట్టడం నాకు చేతకాలేదు. ఇంగ్లీషులోని మూలపాఠాన్ని చదువుకొనగోరేవారు ప్రమీల కల్హన్ రాసిన "బ్లాక్ వెన్డ్" అనే పుస్తకాన్ని చూడవచ్చు.

1934లోనే ఇందిర స్వభావాన్ని గురించి ఆమె తండ్రి వ్రాసింది ఎంత నిజమో 1966-1977 సంవత్సరాల మధ్య రుజువు కాలేదా? ఆమెలో కసి ఎక్కువని కూడా అప్పటిలోనే నెహ్రూ గ్రహించాడు. ఆమెకు తన మేనత్తల పొడ ఎంత మాత్రం కిట్టదు; ముఖ్యంగా పెద్ద మేనత్త పేరు చెప్పినా ఆమెకు అరికాలి మంట నెత్తికి వెడుతుంది. 1934 జూన్ 1వ తేదీని తన రెండవ సోదరి కృష్ణ హతీసింగ్ పేర వ్రాసిన లేఖలో "నీకు అందించవలసిందిగా ఇందిరతో వర్తమానం పంపించాను. కాని, తన పరిపాటి ప్రకారం దాన్ని నీకు అందజేయలేదని అనుకోవలసి వస్తుంది" అంటూ తన బాధను వ్యక్తం చేశాడు. అప్పటికే ఆమెలో కార్పణ్యం ఎంతగా పేరుకుపోయిందో, కాఠిన్యం ఎంతగా వ్రేళ్ళు తన్నిందో ఇది సూచించడం లేదా?

నాలుగు దశాబ్దాల క్రితం తన కుమార్తె విషయమై నెహ్రూ వ్రాసిన ఈ మాటలు ఎంత నిజమో 1966-1977 సంవత్సరాల మధ్య మనకు పూర్తిగా అవగతమైంది. ఎమర్జెన్సీ ఇరవై నెలలలో కుమార్తె స్వభావంలోని అవలక్షణాలను తండ్రి తక్కువగా అంచనా వేసినట్టు మనం అనుకోవలసి వచ్చింది.

ఇందిరా గాంధీ అవలక్షణాలలో తండ్రి విడమర్చి చెప్పనట్టిది మరొకటి ఉన్నది. అది జంకూ కొంకూ లేకుండా ఎన్ని అబద్ధాలైనా పలకడం! ఆమె ఒక దేశానికి అప్పటిలో ప్రధాన మంత్రి. పైగా బోనులో సాక్షిగా నిలిచింది. నిజం తప్ప, పూర్తి నిజం తప్ప, అబద్ధం చెప్పనని ప్రమాణం చేసింది. ఈ ప్రమాణానికి విరుద్ధంగా అలహాబాదు హైకోర్టులో తన ఎలక్షన్ కేసు విచారణ సందర్భంలో ఆమె చేసిన పని 27 (అక్షరాలా ఇరవై ఏడు) అబద్ధాలు చెప్పడం! దీనిపై జయప్రకాశ్ నారాయణ్ వ్యాఖ్య - ప్రతి పదిహేడు నిమిషాలకు ఆమె ఒక అబద్ధం చొప్పున పలికిందని!!



డి.ఆర్. సుంకేకర్, ఆయన భార్య కమల "డిక్లయిన్ అండ్ ఫాల్ ఆఫ్ ఇందిరా గాంధీ" అనే పేరుతో బాధ్యతాయుతమైన ధోరణిలో, సంయమనంతో కూడిన శైలిలో వ్రాసిన గ్రంథంలో ఈ విషయం ఉంది.

(విజన్ బుక్స్, కానాట్ ప్లేస్, న్యూఢిల్లీ 110001. వెల : రూ. 30-00లు)

దాన్ని ఒకసారి చదివితే, ఇందిరా గాంధీ అబద్ధాలకే కాదు, అకృత్యాలకే కాదు, అత్యాచారాలకే కాదు, దేనికైనా వెనుదీయని వ్యక్తిగా మీరు గుర్తించగలుగుతారు. అవగుణాలలో తల్లిని మరిపించగలవాడు ఆమె ద్వితీయ పుత్రరత్నం సంజయ్ గాంధి. అతడిపై ప్రస్తుతం ఫిర్యాదుపై ఫిర్యాదు జరుగుతుంది. దర్యాప్తు వెనక దర్యాప్తు జరుగుతుంది. కేసు తర్వాత కేసు నమోదు అవుతుంది. 1964 లో నేను లండన్ వెళ్ళినప్పుడు అక్కడి మన హైకమీషన్ ప్రధాన కార్యక్రమం ఇతడు చేస్తున్న అల్లరి చిల్లరి పనులు పత్రికలలోకి ఎక్కకుండా చూడమే అని విన్నాను. పోను పోను ఇతడి తుంటరితనం పెరిగిందే తప్ప తరగలేదు. ఎమర్జెన్సీ ఇరవై నెలల్లో మనను, మన దేశాన్ని పాలించింది ఈ అప్రాచ్యుడే, ఇతడి అనుయాయులే! చిన్నతనంలో ఇతడితో చేరి, ఆకతాయిలవలె వ్యవహరించినవారు ఇతడి సరసకు తిరిగిచేరడంలో అబ్బురం లేదు. అయితే, వీరుకాక మరి నలుగురు కూడా ఇతడితో చేతులు కలిపారు. వారు బన్సీలాల్, కె. ఎల్. ధవన్, ఓం మెహతా, విద్యాచరణ్ శుక్లా. ఈ దుష్టచతుష్టయం సహకారంతో సంజయ్ గాంధీ చేయని - చేయించని దౌష్ట్యం లేదు, దౌర్జన్యం లేదు. వాటిలో అతిక్రూరమైనట్టిది, మహాఘోరమైనట్టిది జలియన్ వాలాబాగ్ దురంతాన్ని జ్ఞాపకం చేయగల తుర్క్మన్ గేటు పరిసర ప్రాంతాల విధ్వంసన, అక్కడి చిత్రహింస!! అన్యవిధాల కూడా ఇతడు ఎంత నీచంగా, నికృష్టంగా, నింద్యంగా సంచరించాడో తెలుసుకోవాలంటే, ప్రమీల కల్హన్ పుస్తకంతో పాటు, సుంకేకర్ దంపతుల పుస్తకంతో పాటు, "ది జడ్జ్ మెంట్" అనే పేరుతో కులదీప నయ్యర్ వ్రాసిన దాన్ని చదవండి; "ఎండ్ ఆఫ్ యాన్ ఈరా" అనే పేరుతో సి.ఎన్.పండిట్ వ్రాసిన దాన్ని చదవండి; వారానికి ఒకటి, రెండు చొప్పున వరసగా ఈ మధ్య వస్తున్న ఇతర పుస్తకాలను చదవండి.

తక్కిన వాటిలో లేని ఒక మాట " ది నగర్వాలా మిస్టరీ" అనే పేరుతో ధర్మయశోదేవ్ వ్రాసిన చిరుపొత్తంలో ఉంది. నగర్వాలా స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియా నుంచి పుచ్చుకున్న అరవై లక్షల రూపాయలు సంజయ్ గాంధీకి అందించడం కోసమట! సరిగా ఆనాడే (ఆ మొత్తాన్ని దేశం నుంచి తరలించుకు పోవడానికి కాబోలు) సంజయ్ గాంధీ మారిషస్కు విమాన ప్రయాణం పెట్టుకొన్నాడట. అనుకొన్న ఏర్పాటులలో ఏదో, ఎక్కడో లోపం జరిగినందునే నగర్వాలా తికమకపడిపోయి, పోలీసులకు దొరికిపోయాడట!

ఏమైనా, ఈడు చూడబోతే వడసారం ముప్పై నిండనివాడు; బుద్ధులు చూడబోతే అన్నీ పాడుబుద్ధులే! అయినా, కాంగ్రెసువారు సంజయ్ గాంధీని ఎంత ఆర్భాటంతో అందల మెక్కించారు! వందిమాగధుల కంటే హీనంగా ఎన్ని స్తోత్రపాఠాలు చేశారు!! అతడి పట్ల విశ్వాసాన్ని ప్రకటించడంలో, వినయ విధేయతలను ప్రదర్శించడంలో కాంగ్రెసు ముఖ్యమంత్రులు ఎంతగా పోటీ పడినారో ఇదివరలో ఒక వ్యాసంలో రాశాను. ఇప్పుడు కులదీప నయ్యర్ పుస్తకాన్ని చూడగా మరొక సంఘటన తెలిసింది. విమానంలోకి ఎక్కుతున్న సంజయ్ గాంధీ కాలి చెప్పులలో ఒకటి జారి నేలపై పడగా, దాన్ని అతడి కాలికి తొడగగల గౌరవం కోసం వెంటనే ప్రారంభమైన పరుగు పందెంలో నెగ్గిన ఘనుడు అప్పటి పంజాబ్ ముఖ్యమంత్రి జెయిల్ సింగ్! ఇంతగా ముఖ్యమంత్రులే సంజయ్ గాంధి పాదసేవకు సన్నద్ధపడగా, అతడి కండ కావరం పెరగదా, అతడి కళ్ళు నెత్తికిపోవా? నేను విన్నంత వరకు అతడికి సరిగా బుద్ధిచెప్పిన ముఖ్యమంత్రి షేక్ అబ్దుల్లా మాత్రమే. కొందరు ముఖ్యమంత్రులు, ఇతర కాంగ్రెసు నాయకులు జరుపుతున్న సమావేశంలోకి సంజయ్ గాంధి వచ్చాడట. అప్పుడు వెంటనే లేచి, అతి వినమ్రంగా అతడికి నమస్కరించనివాడు అబ్దుల్లా ఒక్కడేనట. తాను వేంచేసినంతనే లేచి నిలబడని అబ్దుల్లా వద్దకు చరచర వెళ్ళి, "నీవెవరివి?" అంటూ సంజయ్ గాంధి మండిపడ్డాడట! "నీవు కుర్రసన్నాసివి! నేనెవరినో నీకు తెలియకపోతే, నీ అమ్మ నడిగి తెలుసుకో" అంటూ కాశ్మీర్ కేసరి అతడి నోరు మూయించాడట!

అయితే, కేవలం కాంగ్రెసు ముఖ్యమంత్రులనే ఈ విషయంలో మనం తప్పుపట్టనక్కరలేదు; అన్యులు ఇంతకు తక్కువగా ప్రవర్తించలేదు. ముఖ్యంగా పత్రికా సంపాదకులు, పత్రికాధిపతులు అతి హేయంగా ప్రవర్తించారు. సంజయ్ గాంధీని, అతడి సరసన నిలిచిన ఆకతాయి విద్యాచరణ్ శుక్లాను ధిక్కరించి, పత్రికా ప్రపంచం గౌరవం కాపాడినవారు దేశం మొత్తం మీద పట్టుమనిఒక్క వంద మంది కూడా లేరు. ఈ కొద్ది మందిలో ప్రత్యేకించి మెచ్చుకొనదగు పత్రికాధిపతి రామనాథ్ గోయెంకా. ఎన్ని కష్టాలను పెట్టినా, ఎన్ని కడగండ్ల పాల్జెసినా, ధీరునివలె ఆయన నిశ్చలంగా నిలిచాడు. "క్విట్ ఇండియా" ఉద్యమ కాలంలో బ్రిటీష్ వారిని ధిక్కరించడంలో చూపిన స్వేచ్ఛానురక్తినే ఎమర్జెన్సీ సమయంలో తిరిగి ఆయన ప్రదర్శించాడు. "ఇండియన్ ఎక్స్ప్రెస్ గ్రూప్" పత్రికలకు సంబంధించిన డైరెక్టర్ల బోర్డుకు ప్రభుత్వం పట్టుదల పై ఒక ఘట్టంలో ఛెయిర్మన్ గా నియుక్తుడైన కె. కె. బిర్లా ఒకనాడు విద్యాచరణ్ శుక్లా కార్యాలయంలో అనుచితంగా ప్రసంగించగా, మూడు భాషలలో (ఇంగ్లీషులో, హిందీలో, తమిళంలో) బిర్లాను గోయెంకా దుమ్ము దులిపి వేశాడట. ఈ విషయం సుంకేకర్ దంపతుల పుస్తకంలో ఉన్నది. తెలుగు వారిలో చేవచచ్చిందని తీర్మానించుకోవాలా ? ఇందిరా గాంధికి, ఆమె సుపుత్రునికి తిరిగి దాసానుదాసులు కావడానికే తెలుగువారు తాపత్రయపడుతున్నారని తీర్మానించుకోవాలా? ఇట్టి తీర్మానాలకు రానక్కరలేదంటే, జరగవలసిన పని (ఉత్తరాదిలో చేసినట్టు) ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెసును ఏడు నిలువుల లోతున పాతి పెట్టడం! ఇందుకు మరి ఆరేడు నెలలలోనే అవకాశం రాబోతున్నది. దాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి. అప్పుడు గాని "తెలుగు వారిలో చేవచావలేదు, చావలే" దని మనం లోకానికి చాటిచెప్పుకొనలేము!

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలోని వ్యాసం 10-8-1977)

మన "అమీనా"

రెండు వారాల క్రితం శ్రీమతి ఇందిరా గాంధిని గురించి నేను వ్రాసిన వ్యాసంలో నాలుగు పుస్తకాల ప్రసక్తి తెచ్చాను. అప్పటికి వాటి పుటలను నేను త్వరత్వరగా తిరగవేయడమే జరిగింది. ఇప్పటికి వాటిని ఆదినుంచి అంతంవరకు క్షుణ్ణంగా చదవ గలిగాను.

శ్రీమతి గాంధీ, ప్రవర్తనను గురించి, ఎవరేమి చెప్పినా, వ్రాసినా 'షాక్' కాని స్థితికి ఎన్నడో చేరుకొన్నట్టుగా అనుకొంటున్న నన్నే ఈ గ్రంథాలలోని కొన్ని కొన్ని భాగాలు విశేషంగా "షాక్" చేశాయి. 1975 ఉత్తరార్ధంలో బ్రిటన్, ఫ్రాన్సులకు, యునైటెడ్ స్టేట్స్, కెనడాలకు మూడు నెలలపాటు నేను వెళ్ళి వచ్చిన కొత్తలో నన్ను చూడ్డానికై వచ్చిన ఒక ఆంధ్ర రాజకీయ ప్రముఖుడు "మన ప్రధానమంత్రిని గురించి విదేశాలలో ఏమి అనుకొంటున్నా" రని ప్రశ్నించాడు. "ఆ ! ఏమీ లేదు. ఉగండాను ఒక అమీనా ఏలుతూ ఉండగా, ఇండియాను ఒక అమీనా ఏలుతున్నట్టు అనుకొంటున్నా"రని సమాధానం చెప్పాను. ఇందుకు ఆయన "ఇంత నీచంగా మన దేశ నాయకురాలిని నిందిస్తున్నారా?" అంటూ మండిపడ్డాడు. అయితే, ఒకప్పుడు ఆమెను ఇంతకంటే తక్కువగా ఆయన నిందించలేదు; ఆమె తండ్రిపై కూడా ఆయన ఎంతగానో దుమ్మెత్తి పోశాడు. అయితే మాత్రమేమి? పార్లమెంట్ సభ్యత్వం లేకపోతే బ్రతకలేని దౌర్భాగ్యస్థితికి ఆయన దిగజారాడు. దాన్ని ఒక వరంగా తనకు ప్రసాదించగలిగింది ఇందిరమ్మ మాత్రమే. అందువల్ల ఇందిరమ్మ భజన ప్రారంభించాడు. వరసగా రెండు, మూడుసార్లు ఆశాభంగం తప్పకపోయినా, ఎట్టకేలకు ఆ వరాన్ని ఆమెనుంచి ఈమధ్యనే తాను పొందగలిగినందున, మరింతగా ఇందిరమ్మ భజన ఆయన చేయవచ్చు; లేదా, తన పరిపాటి ప్రకారం హఠాత్తుగా మరొకసారి పార్టీ ఫిరాయింపు చేసి, తన చంచలత్వం వెనుక ఏదో ఒక స్థిర ధర్మసూత్రం దాగి ఉన్నదని చెప్పనూ వచ్చు.

ఏమైనా, ఉగాండాలో అమీనా దుశ్చర్యలకు, అతడి దౌష్ట్యాలకు తక్కువైనవి. మన ఇండియాలో అమీనా హయాంలో జరగలేదు. పోతే, వారిద్దరికి ఒకే ఒక భేదం ఉన్నది. అతడు మోటుగా కనబడతాడు, మొరటుగా మెలగుతాడు; ఈమె నాజూకుగా కనబడుతుంది, నవ్వుతూ మాడు పగలగొడుతుంది.

నేను క్షుణ్ణంగా చదివిన నాలుగు పుస్తకాలలో

"ఎండ్ ఆఫ్ యాన్ ఈరా" అనేదాన్ని వ్రాసింది శ్రీ చంద్రశేఖర్ పండిట్

(ఎలైడ్ పబ్లిషర్స్, అసఫాలీ రోడ్డు, న్యూఢిల్లీ - 110002.

వెల : 30 రూపాయలు)

చివరి చివరిలో వక్రమార్గాన నడిచి ఉండకపోతే, మన ప్రధానమంత్రులలో అగ్రశ్రేణిలో శ్రీమతి గాంధికి స్థానం లభించి ఉండేదని ఈయన నిశ్చితాభిప్రాయం. 1972 నాటి ఇండో-పాక్ యుద్ధంలో మనం గర్వపడవలసిన విధంగా ఆమె వ్యవహరించిందని, అటు పిమ్మటనే ఆమె పతానావస్థ ప్రారంభమైనదని ఈయన దృఢవిశ్వాసం. ఈయన పలుకులను పూర్తిగా త్రోసివేయలేముగాని, 1972 వ సంవత్సరానికి పూర్వమే ఎన్ని సందర్భాలలో ఆమె నికృష్టంగా ప్రవర్తించలేదు? శ్రీ కామరాజు తనను ఒక కుమార్తెవలె చూచుకొన్నాడు. 1966లో మొదటిసారి, 1967లో రెండవసారి తాను ప్రధానమంత్రి పదవికి రావడానికి ఆయన తోడ్పడ్డాడు. నిజానికి ఆయన చలవ లేకపోతే, ఆ పదవి దరిదాపులకైనా తాను చేరగలిగేదికాదు. అయినా, 1967 నాటి జనరల్ ఎన్నికలలో ఆయన వోడిపోగానే, ఆయన మనస్సును తాను ఎంతగా గాయపరచలేదు? ఎన్నికలలో వోడిపోయిన వ్యక్తి కాంగ్రెసు అధ్యక్ష పదవిలో కొనసాగడం తగదని రహస్యంగా ఎంతటి విషప్రచారం చేయలేదు? శ్రీ నిజలింగప్పకు ఏవో మాయమాటలు చెప్పి, శ్రీ కామరాజు స్థానంలో ఆయనను కాంగ్రెసు అధ్యక్షుడుగా ప్రకటించిన సందర్భంలో ఎంత కుటిలంగా వ్యవహరించలేదు?

కాగా, ఈనాటి రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి తనకు చేసిన అపకారం ఏదీ లేదు. ప్రధాని పదవికి 1966లో శ్రీ మొరార్జీ దేశాయ్ పై జరిగిన పోటీలో తాను గెలవడానికి ఆయన సహాయం కొంత లేకపోలేదు. ఆయన గట్టిగా చెప్పబట్టే నాటి పార్లమెంట్ సభ్యులలో నాబోటి ఆంధ్రులు పెక్కుమంది (అయిష్టంగానే కావచ్చుగాని) తనకు ఓటు వేయడం జరిగింది. అయినా, 1967లో ఆయన లోక్సభ స్పీకర్ కాకుండా చివరి క్షణంలో అడ్డుపుల్లలు వేయడానికి తాను యత్నించింది. 1969లో రాష్ట్రపతి పదవికి ఆయన నామినేషన్ పత్రాన్ని తాను స్వయంగా దాఖలుచేసి, అటుపిమ్మట ఆయనను వోడించడానికి తాను చేయగల సమస్తాన్నీ అతి నీచంగా చేసింది. పైగా, తన నీచకృత్యా లన్నింటిని "ఆత్మప్రబోధం" అనే మేలి ముసుగును తగిలించింది.

ఏదో ఒక విధంగా మొరార్జీ దేశాయ్ని దెబ్బతీయపోతే, ఆయన ప్రబలుడు కావచ్చు, తన పదవికి ప్రమాదం సంఘటించవచ్చు. ఈ భయంతోనే ఆయనపై శ్రీమతి గాంధి కక్ష పట్టింది. ఆయన ఉపప్రధాని కావడానికి ఒక ఘట్టంలో (గత్యంతరం లేక) సమ్మతించినా, ఆత్మగౌరవాన్ని కాపాడుకొనాలంటే ఆ పదవికి ఆయన రాజీనామా పెట్టవలసిన పరిస్థితిని కల్పించింది. శ్రీ చవాన్ పట్ల కూడా తనకు ఇట్టి భయసందేహా లున్నాయి. అందువల్లనే ఎప్పటి కప్పుడు ఆయనను మరింత దిగదీయడానికి ప్రయత్నించింది.

ఈ విషయాలన్నింటిని శ్రీ చంద్రశేఖర్ పండిట్ తన గ్రంథంలో స్వయంగానే పేర్కొన్నాడు. అయినప్పుడు, శ్రీమతి ఇందిరా గాంధి ఏదో ఒక యుద్ధాన్ని గెలిచిందని, ఆమెకు లేనిపోని ఘనతను ఆపాదించడం ఎంతవరకు భావ్యం? చైనా, అమెరికాలు ఏవో కొన్ని బెదిరింపులను అప్పటిలో చేయకపోలేదు గాని, సోవియెట్ యూనియన్ మన పక్షాన నిలిచిన మీదట పాకిస్తాను తోడ్పాటుగా అవి రణరంగంలో నిజంగా దూకి ఉండేవా? మొత్తం బంగ్లాదేశ్ ప్రజలు మనతో కలిసి పోరాడారు. అందువల్ల బంగ్లాదేశ్లోని పాక్ సాయుధ బలాల శరణాగతిని సాధించడానికి - నన్నడిగితే రెండు వారాలు పట్టవలసింది కాదు; వారం లోపలనే అది జరగవలసింది. పైగా, అప్పటి విజయ సాధనలో అప్పటి రక్షణ మంత్రి శ్రీ జగ్జీవన్ రామ్ పాత్ర ఏమీ లేదా? ఆయన పాత్రను గురించి శ్రీమతి గాంధి పొరపాటుగానైనా ఒక్క మంచిమాట ఎన్నడు పలకలేదేమో!

పోతే, 1972 తర్వాత తనకు సలహా లిచ్చిన వారిలో, తనను సమర్థించిన వారిలో, అన్యవిధాల తనకు సహాయపడినవారిలో ఎందరెందరినో శ్రీమతి గాంధి వారితో పని తీరగానే - కాలదన్నిందో చంద్రశేఖర్ పండిట్ స్వయంగానే వివరించారు. ద్వారకా ప్రసాద్ మిశ్రా, పరమేశ్వర్ నారాయణ్, హక్సర్, దినేశ్సంగ్, అశోక మెహతా, ఉమాశంకర్ దీక్షిత్, ఐ.కె. గుజరాల్, నందిని సత్పతి, చంద్రశేఖర్, మోహన్ ధారియా, అర్జున్ అరోరా, హెచ్.ఎన్. బహుగుణ, రజనీ పటేల్ మాత్రమే కాక, ఆమెతో దెబ్బలను తినవలసి వచ్చినవారు మరెందరు ఎవరు, ఎక్కడ, ఏమాత్రం బలపడుతున్నట్టు తోచినా, వారిపై ఏదో నింద వేయాలి. ఎవరినో కొందరిని ఉసికొల్పాలి, చేతనైన అన్ని చిక్కులు కల్పించాలి, పార్టీలోగాని, ప్రభుత్వంలోగాని ఎట్టి కీలక స్థానంలో మిగలకుండా కట్టుదిట్టాలు చేయాలి. శ్రీ హెచ్. ఎన్. బహుగుణ విషయంలో శ్రీమతి గాంధి సరిగా ఇంతే చేసింది. శ్రీరాజ్నారాయణ్ తనపై పెట్టుకొన్నఎన్నికల పిటిషన్లో తనకు వ్యతిరేకంగా అలహాబాద్ హైకోర్టు తీర్పు చెప్పినప్పుడు తన స్థానంలో బహుగుణ ప్రధాని కాగలిగితే, ఇండియాతో తమ మైత్రి యథాప్రకారం కొనసాగగలదని సోవియెట్ నాయకుడు భావించారట. ఈ మాట తన చెవిని పడినంతనే బహుగుణను కాలరాచి వేయడానికి ఆమె తీర్మానించుకొన్నదట. పోనీ లోలోపల ఏమి జరిగిందో మనకు స్పష్టంగా తెలియదనుకున్నా మనకు నిస్సందేహంగా తెలిసిన విషయం - శ్రీ గోవిందవల్లభ్పంత్ తర్వాత తిరిగి దాదాపు అంత సమర్థంగా ఉత్తర ప్రదేశ్ను పరిపాలిస్తున్నట్టుగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకొంటున్న బహుగుణ ఆకస్మికంగా తన పదవిని కోల్పోవడం ! బహుగుణ మాట విడిచిపెట్టండి. ఆయన రాజకీయవాది. రాజకీయాలలో ఏదైనా సాధ్యమే. కాని, హక్సర్ మాటేమిటి? రాజకీయ సంబంధమైన ఆశలు ఏ కోశానా లేవు. తనకు ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ, అనేక క్లిష్టఘట్టాలలో ఆయన తనను ఆదుకొన్నాడు. 1969 లో నాటి కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ నిజలింగప్పకు అర్ధరాత్రి వేళ తన పేరుతో వెళ్ళిన లేఖలు హక్సర్ వ్రాసినట్టివే. తన నాయకత్వాన్ని ఆమె స్థిరపరచు కొనాలంటే స్వీయ ప్రాబల్యంకోసం కాక, కొన్ని సిద్ధాంతాలకోసం, అంతకంటే ముఖ్యంగా సామాన్య ప్రజల క్షేమంకోసం తాను పోరాడుతున్నట్టు దేశానికి, ప్రపంచానికి విశ్వాసం కలిగించాలని తనకు సలహాచెప్పింది ఆయనే. ప్రధాన కార్యదర్శి పదవి నుంచి యుద్ధానికి ముందు తాను కోరగా తన ప్రత్యేక రాయబారిగా పనిచేయడానికి ఆయన సమ్మతించాడు. ఆ యుద్ధానంతరం నిక్సన్ పేర వెళ్ళిన గొప్ప ఉత్తరం పారం హక్సర్ కూర్చినట్టిదే. భుట్టోతో సిమ్లా రాయబారాలు జయప్రదం కావడానికి తనకు ఎక్కువగా తోడ్పడింది తిరిగి ఆయనే. ఇన్ని విధాల తనకు బాసటగా నిలిస్తే మాత్రమేమి? హక్సర్ ఒక పెద్దనేరం చేశాడు. అది పట్టపగ్గాలు లేనట్టు సంజయ్ గాంధీని సంచరించ నివ్వడం తగదని హెచ్చరించడం. కాగా, ఆయన భార్య మరింత పెద్ద నేరాన్ని చేసింది.

అది - శ్రీమతి ఇందిరలో నియంతృత్వపు పోకడ పెరుగుతున్నట్టు ఎక్కడో, ఎవరితోనో నోరు జారి అనడం! నెహ్రూల వలె హక్సర్లు ఆదిలో కాశ్మీర్కు చెందిన వారే. పైగా, ఉభయులకు దగ్గరబంధుత్వం ఉన్నది. కనీసం ఆ బంధుత్వాన్ని పురస్కరించుకొని, హక్సర్ పట్ల శ్రీమతి గాంధి కారుణ్యం వహించవలసింది కాదు. అయితే ఆమె పుత్రరత్నం సంజయ్ గాంధి ప్రవృత్తిలో అది ప్రధాన భాగం. అందువల్ల వారిద్దరు హక్సర్ నివాసం పై ఆదాయం పన్ను వారిచేత దాడులు జరిపించారు. హక్సర్ పెదతండ్రినో, పినతండ్రినో ఎనభై

ఏళ్ళముదుసలినిఏదో కుంటి సాకుపై అరెస్టు చేయించి, న్యూఢిల్లీ వీధుల వెంట నడిపించారు. దీన్నిబట్టే తెలుసుకోవచ్చు - తల్లీ కొడుకులు ఎంతటి కృతఘ్నంగా సంచరించగలరో, ఎంత క్రూరంగా వ్యవహరించగలరో!

తక్కిన రచయితల వలె దృష్టిని ప్రధానంగా ఎమర్జెన్సీకి పరిమితం చేయక శ్రీమతిగాంధి శకాన్ని చంద్రశేఖర్ పండిట్ సమీక్ష చేశాడు. ఇది ఆయన గ్రంథానికి సమగ్రత కూర్చింది. పైగా, ఆయన రచనలో ఆగ్రహం కంటె ఆవేదన అధికంగా ప్రస్ఫుట మవుతున్నది. శ్రీమతి గాంధి పాలించిన పదకొండు సంవత్సరాలలో దేశానికి, దేశ ప్రజలకు పట్టిన దుర్గతికి ఆవేదన చెందాలి కాని, ఆమె పతనం చెందినందుకు కాదు. ఆమె పతనం మనకే కాదు, ముందు తరాల వారికి సయితం ఆనందదాయకమైన సంఘటన.

పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 1934 లో డెహరాడూన్ జెయిల్ నుంచి శ్రీమతి విజయలక్ష్మి పండిటు వ్రాసిన లేఖలో నాటికే ఇందిర స్వభావంలో ద్యోతకమవుతున్న దుర్లక్షణాల పట్ల తన ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రమిలా కల్హాన్ తన పుస్తకం "బ్లాక్ వెన్స్ డే"లో (స్టర్లింగ్ పబ్లిషర్స్, న్యూఢిల్లీ-16.వెల: 25 రూపాయలు,)

ఈ లేఖ పాఠాన్ని మొట్టమొదటి సారిగా బయట పెట్టింది. దీని సారాంశాన్ని రెండువారాల నాటి నా వ్యాసంలో మీకు నివేదించాను. కాగా, దాదాపు ఇంత ప్రధానమైన మరొక విషయం కూడా ఆమె గ్రంథంలో ఉన్నది. శ్రీమతి గాంధి విందుకు పిలవగా వెళ్ళిన ఒక మిత్రుని సమక్షంలో సంజయ్ గాంధి తల్లిని ఆరుసార్లు చెంపపెట్లు పెట్టగా, గుడ్లలో నీళ్ళు గుడ్లలో కుక్కుకొని, ఆమె మిన్నకున్నదట.

"వాషింగ్టన్ పోస్ట్" విలేకరి లూయిస్ ఎమ్. సైమన్స్ ఎమర్జెన్సీ రోజులలో ఈ సంగతిని వ్రాశాడు.

శ్రీకులదీప నయ్యర్ "ది జడ్జిమెంట్" అనే పుస్తకంలో దీన్ని పేర్కొన్నాడు. (వికాస్ పబ్లిషింగ్ హౌస్, న్యూఢిల్లీ-110002, వెల: 30 రూపాయలు). ఇందుకు నయ్యర్ను, ఆయన పుస్తకాన్ని చులకనచేస్తూ, తల్లి అంటే సంజయ్ గాంధికి అంతులేని ప్రేమ, గౌరవాలని, ఆమె సమ్ముఖంలో అతడు గొంతెత్తి మాటాడనైనా మాటాడడని శ్రీమతి మేనకా గాంధి వ్రాసింది. అత్తను గురించి, భర్తను గురించి మేనక వ్రాసిన ఈ మాటల కంటే శ్రీమతి అంబికాసోనీ సాక్ష్యానికే మనం ఎక్కువ విలువ నివ్వాలి. ఎమర్జెన్సీ రోజులలో ఈమె యువజన కాంగ్రెస్కు అధ్యక్షురాలు. తరచు ఇందిరా గాంధిని, సంజయ్ంధిని వారి ఇంటిలో ఈమె కలుసుకొంటూ ఉండేది.

ప్రమిలా కల్హాన్తో మాట్లాడుతూ, తల్లి పట్ల సంజయ్ గాంధీ దురుసుగా ప్రవర్తించేవాడని ఈమె చెప్పింది. ఇంతేకాదు, "ఏవో కొన్ని సంఘటనలు, తల్లికి ప్రత్యక్ష సంబంధం ఉన్న ఏవో సంఘటనలు సంజయ్ గాంధీకి తెలుసు కనుకనే అతడామెను గడగడలాడించే వాడేమో!" అని ఈమె చెప్పింది. ఆదినుంచీ తల్లీ కొడుకుల విషయమై సరిగా ఇట్టి అనుమానమే నాకున్నది. పదవీ వ్యామోహం, రాజ్యాధికార వాంఛ బహు చెడ్డవి.

ఎంతటి నీచకార్యాలనైనా, ఎంతటి ఘోర కృత్యాలనైనా అవి చేయించగలవు. మన దేశ చరిత్రలోనే ప్రాచీన కాలానికి వెడితే, కోసల రాజు ప్రసేనజిత్, మగధచక్రవర్తి బింబిసారుడు తమ కుమారుల ద్రోహానికి, క్రౌర్యానికి బలి అయిపోయారు! పోతే, మధ్య యుగంలో అగ్బర్ పై జహంగీర్ తిరుగుబాటు చేశాడు. జహంగీర్ పై షాజహాన్ ధ్వజమెత్తాడు; షాజహాన్ను ఆగ్రా కోటలో బంధించి, అన్నదమ్ములు ముగ్గురినీ, వారి కుటుంబాలను చిత్రవధ చేసి, ఔరంగజేబ్ మొగల్ సింహాసనం అధిష్ఠించాడు. అందువల్ల సంజయ్ గాంధి తల్లిని ఏదో బలం చూచుకొని గడగడలాడించే వాడని నా నమ్మకం కూడా. కేవలం పుత్రవాత్సల్యం వల్లనే సంజయ్ గాంధి

ఏమి చేసినా శ్రీమతి గాంధి చూస్తూ పోయిందని, పుత్రవాత్సల్యం వల్లనే అతడిని ఈ నాటికీ వెనక వేసుకు వస్తున్నదని నేననుకోను. "ఏవో కొన్ని సంఘటనలు, తల్లికి ప్రత్యక్ష సంబంధం ఉన్న సంఘటనలు" కుమారునికి తెలిసి ఉండాలి. అన్నట్టు, మరొక విషయాన్ని కూడా ప్రమీలా కల్హన్ బయట పెట్టింది. తిలక్ మార్గ్ సంజయ్ గాంధికి ఒక "విలాసగృహం" ఉండేదట. ఈ మధ్యనే దాన్ని అతడు అమ్మివేసినట్టుగా తనకు రుక్సానా సుల్తానా చెప్పిందట. ఈ సుల్తానా దృష్టిలో నేటికీ సంజయ్ గాంధి ఒక గొప్ప "హీరో." అంబికాసోనికి, రుక్సానా సుల్తానాకు సగమెరుక; వారిద్దరి మధ్య పచ్చ గడ్డివేస్తే భగ్గుమంటుంది. ఒక గ్రంథంగా ప్రమాల రచనలో వివిధ భాగాల మధ్య సమన్వయం తక్కువ. కాని, మనం తెలుసు కొనదగు విశేషాలు దానిలో కోకొల్లలుగా ఉన్నాయి.

కాగా, రెండు వారాల క్రితం నేను సూచించినట్టు, శ్రీ డి.ఆర్. మంకేకర్, శ్రీమతి కమలా మంకేకర్లు కలిసి వ్రాసిన

"ది డిక్లయిన్ అండ్ ఫాల్ ఆఫ్ ఇందిరా గాంధి"

విజన్ బుక్స్, కానాట్ ప్లేస్, న్యూఢిల్లీ-32,

వెల: 30 రూపాయలు.

విధిగా చదవదగు గ్రంథం. ఎమర్జెన్సీ పేరుతో ఇందిరా గాంధి మన దేశాన్ని ఎట్టి నరకకూపంగా మార్చిందో ఇది కళ్ళకు కట్టినట్టుగా చూపిస్తున్నది. అమీనా దౌష్ట్యాలకు, దురాగతాలకు ఎమర్జెన్సీ రోజులలో మన దేశంలో జరిగినట్టివి ఎంతమాత్రం తీసిపోవని నేను భావించగా, ఇవి వాటిని మించిపోయినట్టుగా ఈ దంపతులు భావిస్తున్నారు. 1975 జూన్ 26 వ తేదీని ఎమర్జెన్సీ ప్రకటన జరిగిన తర్వాత మన దేశాన్ని పరిపాలించింది ఇందిర కాదు, ఆమె కుమారుడు సంజయ్ గాంధీ, అతడి ఛత్రచ్ఛాయలో చేరిన దుష్టబృందం. ఆ బృందంలో మొదటి వాడు బన్సీలాల్, రెండవ వాడు విద్యాచరన్ శుక్లా, మూడవ వాడు ఓం మెహతా, నాల్గవ వాడు ఆర్. కె. ధవన్, అయిదవ వాడు కె.కె బిర్లా, ఆరవ వాడు నవీన్ చౌలా, ఏడవవాడు బి.ఆర్. తమా, ఎనిమిదవవాడు జగ్మోహన్ ఈ పట్టికను మరెంతగానైనా సాగదీయవచ్చు. వీరు కాక రుక్సానా సుల్తానా, అంబికా సోనీ మొదలయిన అంగనామణులు ఉండనే ఉన్నారు. పోతే "నీకు గులాంగిరి చేస్తా" మని పోటీ పడుతూ ముందుకు తీసుకువచ్చిన ముఖ్యమంత్రులున్నారు; అన్య మంత్రిపుంగవులున్నారు. అయినప్పుడు అతడికి కళ్ళు మూసుకు పోవా ? నోటికి ఎంతవస్తే అంత అనడా? లోక్ సభకు మొన్నటి జనరల్ ఎన్నికల సందర్భంలోని దిశలో (మధ్యప్రదేశ్) ప్రసంగిస్తూ, "జనతా పార్టీని అభిమానించే వారందరు దేశద్రోహులు, అట్టి ద్రోహులు ఈ సభలో ఎందరున్నారో చేతులెత్తండి" అన్నాడట. అంతట సభలోని వారందరూ చేతు లెత్తారట. ఏమి చేసినా, మరి లాభం లేదని సభ నుంచి అతడు పారిపోయేవరకు ఒక్కరైనా ఎత్తిన చేతిని దించనే లేదట! తల్లీ కొడుకుల పీడ మనకు, మన దేశానికి వదిలించినందుకు ఇంటదీపం పెట్టుకోగానే మనం చేయెత్తి నమస్కరించవలసింది ఈ సామాన్య ప్రజలకే!

విదిశ సభలోనే కాదు, ఏ సభలనైనా ఏమి మాటాడవచ్చునో, ఏమి మాటాడరాదో సంజయ్ గాంధికి తెలియదు. మధ్యప్రదేశ్లోనే అడవులమధ్య ఆదివాసుల సభలో ప్రసంగిస్తూ, మొక్కలను నాటవలసిందిగా వాటిని పెంచవలసిందిగా అతడు ప్రబోధించాడట! తన పంచసూత్ర ప్రణాళికలోని ఒక సూత్రాన్ని సందర్భశుద్ధి లేకపోయినా, అతడు వల్లించాడన్న మాట! ఉదయభాస్కరుడని, యువజన నాయకుడని, భారత ప్రజల భావిపరిపాలకుడని మన ఆంధ్ర కాంగ్రెసు వాదులలో హెచ్చు మంది ప్రస్తుతించింది ఈయననే. ఇతనినే వారు తిరుపతిలో ఊరేగించారు, ఇతడికే గుంటూరులో హారతులు పట్టారు, ఇతడికే కొత్తగూడెంలో పాద పూజ చేశారు! ఇతడికి గుణం లేదు సరిగదా, మెదడైనా లేదు.

కాగా, బన్సీలాల్ విషయమై మంకేకర్ దంపతులు ఒక కొత్త విషయాన్ని మనకు తెలియ జేస్తున్నారు. తాను త్వరలో సంపాదించిన రాజకీయ ప్రాబల్య రహస్యాన్ని వివరిస్తూ, అతడు తన స్తోత్రాయణంతో పలికిన కొన్ని పలుకులు ఇవి: "కాంగ్రెసు ఎన్నికల గుర్తు ఆవూ -దూడా కావా? దూడను నేను నా చెంత కట్టి వేసుకొన్నాను. దూడ నా చెంత ఉన్నప్పుడు ఆవు నాకు దూరంగా ఉండగలదా ?"

త్వరత్వరగా తమ గ్రంథాన్ని వ్రాయవలసి వచ్చినా, చేయి తిరిగిన రచయితలు కాబట్టి, మంకేకర్ దంపతులు ఉత్తమ ధోరణిలో దాన్ని వ్రాశారు. కాగా, ఎమర్జెన్సీని గురించి ఇంతవరకు వచ్చిన పుస్తకాలలో విశేష ప్రచారాన్ని పొందిన - పొందుతున్న - కులదీప నయ్యర్ రచన విషయమై తిరిగి కొత్తగా చెప్పదగింది లేదు. అయితే, కొందరు విమర్శిస్తున్నట్టు, అది బాధ్యతా రహిత రచన కాదు, సులభంగా కీర్తితోపాటు ధనాన్ని ఆర్జించుకొనడానికి చేసిన రచన సయితం కాదు. అలహాబాద్ హైకోర్టు జడ్జి శ్రీ జగ్మాహన్లాల్ సిన్హాను ప్రలోభపరచడానికి శ్రీమతిగాంధి పక్షాన కొంత ప్రయత్నం చేసినట్లు నయ్యర్ వ్రాశాడు .

"అభాండాలకైనా, అభూత కల్పనలకైనా కొంత హద్దు ఉండాలి. ఈ ప్రయత్నం సంగతి నయమని ఎవరు చెప్పారు? ఇది జరిగినట్టు అతడు నిరూపించగలడా ? పైగా, ఇదిమన న్యాయ వ్యవస్థనే కించపరచడం కాదా ?" ఈ ధోరణిలోకొంత ఆయనపై విరుచుకుపడ్డారు. కాని, జడ్జి సిన్హా, జడ్జి డి.ఎన్. మాధుర్ తో కేంద్ర ప్రభుత్వంలో గల కొత్త హోమ్ మంత్రి శ్రీ చరని సింగ్ జరిపిన ప్రత్యుత్తరాల ప్రచురణ ద్వారా నయ్యర్ మాట ఎంత నిజమో స్పష్టపడింది. ఇందిరకు అనుగుణంగా తీర్పు చెబితే, శ్రీ సిన్హా సుప్రీం కోర్టు జడ్జిగా నియమించ గలమని మాధుర్ ద్వారా ఒక సూచన. నిజంగానే వెంటనే అయినా, నయ్యర్ను అబద్ధాలకోరుగా తిట్టడానికి శ్రీమతి గాంధి రెండవ కోడలు జంకలేదు!

ఇదివరలో ఏమి జరిగినా, ఇప్పుడు మాత్రం రాష్ట్రాల కాంగ్రెసువాదులు శ్రీమతి ఇందిర నాయకత్వానికి ఉద్వాసన చెప్పకపోతే తమకుగాని, తమ సంస్థకుగానీ భవిష్యత్తు లేదని గుర్తిస్తున్నారు. ఇట్టి గుర్తింపు తెలుగు కాంగ్రెసు వాదులలో ముఖ్యంగా రాష్ట్ర స్థాయిలో నామమాత్రంగా కానరావడం లేదు. మన ముఖ్యమంత్రి వర్యులు న్యూఢిల్లీకి వెళ్ళినా ఒక పవిత్ర విధిని పరిపాలించే ధోరణిలో శ్రీమతి గాంధీ దర్శనం చేసుకొని వస్తున్నాడు! " మా నంద్యాల నుంచి ఉప ఎన్నికలో మీరు పోటి చేస్తే మేము తరిస్తాము; మా స్థితి మరచి మీరు పోటీ చేస్తే మేము తరిస్తాము అంటూ మన కాంగ్రెసు వాదులు కొందరు విజ్ఞాపనలు పంపిస్తున్నారు. రాజకీయాలను తాత్కాలికంగా విరమించనున్నట్టు శ్రీమతి గాంధి చెప్పి పట్టుమని నాల్గు నెలలైనా కాలేదు. ఆమె అప్పుడే రాజకీయాలలో తిరిగి ప్రవేశించిన రాజపురోహితుడు వినోబా ఆశీస్సులకోసం ఆశ్రమానికి ఆమె యాత్ర చేసి వచ్చింది. ఆ సందర్భంలోనే ఒక సభలో ప్రసంగిస్తూ కోరితే తిరిగి నాయకత్వం స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు చెప్పింది. ఏ ప్రజలనడగ కుండానే కాంగ్రెసును తన గుప్పిటిలో నిలపడానికి కొన్నాళ్ళుగా ఆమె కుతంత్రాలు, కుట్రలు చేస్తూనే ఉన్నది. ఆమె కుతంత్రాలు ఫలించి, ఆమె కుట్రలు నెగ్గి, తిరిగి ఆమె నాయకత్వానికి వస్తే, కాంగ్రెసు తప్పక మారి పోతుంది. మొత్తం దేశానికే అందువల్ల నష్టం జరుగుతుంది. ఈ విషయమై సందేహాలున్న వారు నా వ్యాసంలో సంగ్రహంగా నేను సూచించిన పుస్తకాలను చదవండి. ఆ పని నాలుగు శ్రీమతి ఇందిరా గాంధిని, ఆమె పుత్రరత్నాన్ని త్వరగా కాంగ్రెసు నుంచి తరిమివేస్తే హెచ్చుగా తమకు, తమ సంస్థకు మేలు జరిగి, ఏమాత్రం వివేకం ఉన్న కాంగ్రెసు వారైనా మారగలుగుతారు.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో వ్యాసం 24-8-1977)

అసలు గోబెల్స్

ఇదివరలో ఇంద్రకుమార్ గుజరాలు, ఇటీవల విద్యాచరణ్ శుక్లాను జోసెఫ్ గోబెల్స్తో కొందరు పోర్చారు. కాని, అతడెక్కడ, వీ రెక్కడ! అతడితో వీరికి పోలిక పెట్టడం అతడిని దిగ దీయడమే, కించపరచడమే. ప్రచార సాధనాల వినియోగంలో కాదు, వాటి దుర్వినియోగంలో "నభూతో నభవిష్యతి"గా పేర్కొనదగు ఘనత గడించిన వాడు డాక్టర్ గోబెల్స్. ద్వితీయ ప్రపంచ యుద్ధంలో మొదటి మూడు, నాలుగు సంవత్సరాలలో హిట్లర్ సాధించిన విజయపరంపరకు అతడి "లుఫ్ట్ వాఫే"కు (విమాన బలానికి) అతడి "పాంజర్ డివిజన్స్"కు (కవచ దళాలకు) దాదాపు సరిసమానంగా గోబెల్స్ ప్రచార పద్ధతులు తోడ్పడినాయనడంలో అతిశయోక్తి కించిత్తు గానైనా లేదు.

ఈ తరం వారికి తెలిసినంతగా కొత్త తరం వారికి గోబెల్స్ తెలియడానికి వీలులేదు. మేము గోబెల్స్ను చూచి ఉండకపోవచ్చు. అతడినే కాదు, హిట్లర్, గోరింగ్, హిమ్లర్ మొదలైన నాజీ నాయకులను సయితం మేము చూడలేదు. అయితే, ఒకటిన్నర దశాబ్దాలకు పైగా వారికి సంబంధించిన ఏదో న్యూస్ రీల్ భాగాన్ని మేము చూడనివారం కాదు. వారిలో కొందరి ప్రసంగాలను (జర్మన్ భాష తెలిసిన వారు మాలో తక్కువైనా) రేడియో ద్వారా మేము విన్నాము. వారి జీవిత చరిత్రలను చదివాము. వారిని గురించిన ఇతర రచనలను చదివాము. అందువల్ల మనస్సులో మూడు దశాబ్దాల పాటు కనబడతారు. కొత్త తరం వారికి మహా అయితే వారంటే ఏవో కొన్ని పేర్లు మాత్రమే. మాకేమో వారు కళ్ళను మిరమిట్లు గొలుపుతూ ఆకసంలోకి తారాజువ్వల వలె ఎగసి, ధరాతలానికి తిరిగి రాలిపోయిన వ్యక్తులు ! -

శిష్టత్వంలో వలె దుష్టత్వంలో సయితం పరాకాష్ఠకు చేరుకొనడానికి అసమాన ప్రజ్ఞా ప్రాభవాలు కావాలి. వాటిని అపూర్వంగా వినియోగించడంలో దీక్షాదక్షతలు కావాలి. దుష్టత్వానికి సంబంధించి ఇంతవరకు అగ్రశ్రేణికి చెందిన నాజీ నాయకు లందరు ఇట్టి వారే! తక్కిన వారిని విడిచిపుచ్చి, ఒక్క గోబెల్స్ జీవిత చరిత్రను స్థూలంగా పరిశీలించినా, ఈ సంగతి స్పష్టపడుతుంది.

గోబెల్స్ పుట్టింది ఒక కార్మికుని కుటుంబంలో. ఆ పుట్టడమైనా పొట్టిగా, పీలగా. కాగా, ముఖకవళికలు సరేసరి! పల్చటి, పొడుగుపాటి ముక్కు పైకి పొడుచుకువచ్చిన చెక్కిళ్ళ ఎముకలు, ముదురు ఊదారంగు కళ్ళు, వెడల్పు నోరు. ఇందుకు తోడు ఏడవ ఏట జబ్బుపడగా, ఎడమకాలు ఈసుకుపోయింది. ఆపరేషన్ చేయిస్తే, కాలు తిన్నగా రాకపోగా, కుడి కాలుకంటే నాలుగు అంగుళాలు కురచ అయిపోయింది. ఆ దెబ్బనుంచి శారీరకంగా గాని, మానసికంగా గాని గోబెల్స్ జీవితాంతం వరకు కోలుకోనే లేదు. బడికివెడితే తోటిపిల్లలు వెక్కిరింతలు, ఆటలలో చేరబోతే తిరిగి వారి వేళా కోళాలు! అయితే అతడి బుర్ర చాలా పెద్దది, దానిలోని సరుకు చాలా గట్టిది. అందువల్ల "పొట్టివానికి పుట్టెడు బుద్ధులు" అనే సామెత అతడి విషయంలో నూటికి నూరుపాళ్ళు నిజం (అతడి ఎత్తు అయిదడుగులపై అంగుళమో, అరంగుళమో!). బుద్ధి సూక్ష్మతకుతోడు అతడిది గంభీరకంఠం. అది కోరిన శ్రుతిలో కోరిన స్వరాన్ని పలికేది. గంభీరకంఠంతో పాటు అతడిది చంచలజిహ్వ. అది నదురు బెదురు లేకుండా ఎట్టి అనృతాన్నైనా సునాయాసంగా పలికేది.

గోబెల్స్ జీవిత ప్రారంభంలో అన్నీ విఘ్నాలే, అన్నీ విఘాతాలే. ఉన్నత విద్యకై ఎన్నో అగచాట్లను పడవలసివచ్చింది. తరువాత డాక్టరేట్ సంపాదించుకొనడానికి యూనివర్సిటీ నుంచి యూనివర్సిటీకి కొంతవరకు తన బుద్ధి చాంచల్యం వల్ల, కొంతవరకు అన్యపరిస్థితుల ప్రాబల్యం వల్ల - మారవలసి వచ్చింది. తీరా డాక్టరేట్ తెచ్చుకున్న తరువాత తనకు దొరికిన ఉద్యోగాలు బ్యాంకులో గుమాస్తా ఉద్యోగస్థాయికి చెందినట్టివే. తన ఆశలేమో రచయితగా రాణించాలని. కాని, నవలలు వ్రాయగా, వాటిని ప్రచురించిన వారు లేరు. నాటకాలు వ్రాయగా, వాటిని ప్రదర్శించిన వారు లేరు. వ్యాసాలు వ్రాయగా వాటిని ముద్రించిన వారు లేరు. పత్రికలేమి, ఇతర

ప్రచురణ సంస్థలేమి పూర్తిగా యూదీయులు గుప్పిటిలో ఉన్నందునే తన రచనలు వెలుగు ముఖం చూడ్డం లేదన్న తీర్మానానికి అతి త్వరలో అతడు వచ్చాడు. దానితో యూదీయుల పట్ల అతడికి ఈర్ష్యా విద్వేషాలు పెరిగాయి. వాటితో పోటాపోటీగా అన్యజాత్యహంకారం అతడిలో పెరిగింది. నిజానికి స్వచ్ఛమైన జాతి (ఆర్యజాతి, ద్రావిడజాతి, నిషాదజాతి, లేదా మరొకజాతి) ప్రపంచంలో ఈనాడు ఎంతవరకు కలదన్న సందేహాస్పద విషయం. గోబెల్స్ విషయంలో ఇది సందేహ స్థాయిని దాటి సత్యస్థాయికి చేరుకున్నట్టు చెప్పవచ్చు. అతడి పూర్వీకులలో జావాలో నివసించిన వారున్నారు. అందువల్ల అతడిలోని ఆర్య రక్తంతో (అట్టిది వాస్తవంగా ఉంటే) జావనీస్ రక్తం కొంత మిళితమైంది. గోబెల్స్ విషయమై ఈ వివరాలలోకి వెళ్ళడం పైకి రావడానికి ఎన్ని ప్రతిబంధకాలున్నా, వాటినన్నింటిని ఒక పక్కకు నెట్టి, అతడు హిట్లర్కు అంతేవాసి కాగలిగినాడని చెప్పడం కోసమే. తన బుద్ధి బలాన్ని, ఊహాపటిమను, కల్పనాచాతుర్యాన్ని, వాక్ ప్రాగల్భ్యాన్ని వినియోగించి, హిట్లర్ ఒక కారణ జన్ముడన్న నమ్మకాన్ని జర్మన్ ప్రజా బాహుళ్యానికి అతడు కలిగించాడు. హిట్లర్ను కోటాను కోట్లకు ఆరాధ్యదైవంగా మార్చాడు. "హైల్ హిట్లర్" అనే నినాదంతో మొత్తం దేశాన్ని ప్రతిధ్వనింప జేశాడు.

ప్రచారం విషయంలో హిట్లరైనా సామాన్య, ప్రతిభావంతుడుకాడు. ప్రథమ ప్రపంచయుద్ధంలో జర్మనీ పరాజయానికి ఒక ప్రధాన కారణం దాని శత్రుదేశాలు - లార్డ్ నార్త్ క్లిప్ నాయకత్వాన ముఖ్యంగా బ్రిటన్ - కొనసాగించిన దుష్ప్రచారమని అతడి గట్టి నమ్మకం. అందువల్ల ప్రచారాన్ని గురించి అతడు విశేషంగా ఆలోచించాడు. అందుకు ప్రత్యేక పద్ధతులను కొన్నింటిని రూపొందించాడు. ఇందుకు అత డిచ్చిన ప్రాధాన్యానికి ఒక ప్రత్యక్ష నిదర్శనం నాజీల దృష్టిలో బైబిల్గా చెల్లిన తన ఆత్మకథలో పెక్కు పుటలను ప్రచార సమస్యలకు, పద్ధతులకు ప్రత్యేకించడం. దేశ దేశాలలో కొన్ని కోట్లమంది భక్తి విశ్వాసాలను సహస్రాబ్దాలకు పైగా కాతలిక్ చర్చి అవిచ్ఛిన్నంగా నిలుపుకొన గలుగుతున్నది. ఏయే పద్ధతులను ఏయే రీతులలో అనుసరించడం ద్వారా ఇది దానికి సాధ్యపడిందో హిట్లర్ పరిశీలించాడు. మతరంగంలోని ఆ పద్ధతులను రాజకీయరంగంలో ప్రవేశపెట్టాడు. బ్రౌన్ షర్టు, కుడిచేతిని సగంవరకెత్తి సెల్యూట్, "హైల్ హిట్లర్ " అంటూ వందన ప్రత్యభివందనాలు, ఊరేగింపులు, ఉత్సవాలు, సభలు, సమావేశాలు, “ఆలోచన విషతుల్యం, విశ్వాసమే శరణ్యం" అని ప్రబోధం, పార్టీని, పార్టీ నాయకుని నమ్ముకొంటే నవయుగంలో నవజీవన వాగ్దానం - ఇవి కాతలిక్ క్రిస్టియన్ మతంనుంచి హిట్లర్ నేర్చుకొన్న ప్రచార పద్ధతులు కూడా చాలావరకు కాతలిక్ చర్చి నుంచి (కొన్ని చేర్పులతో, మార్పులతో) పరిగ్రహించినట్టివే. కేవలం ప్రచార పద్ధతులలోనే కాక, తమ తమ పార్టీల వ్యవస్థీకరణలో సయితం నాజీలు, ఇతర ఫాసిష్టులు, కమ్యూనిష్టులు కాతలిక్ చర్చికి అనేక విధాలుగా అధికస్థాయిలో రుణపడి ఉన్నారని చెప్పవచ్చు.

ప్రచార ప్రావీణ్యంలో గోబెల్స్ తన తర్వాతనే అని ఒక సందర్భంలో హిట్లర్ వాక్రుచ్చాడు. ఇది ప్రగల్భం కాదు. గోబెల్స్ మేధావి, హిట్లర్ కాడు. గోబెల్స్ వివిధ విషయ పరిజ్ఞాని, హిట్లర్ కాడు. అయితే, గోబెల్స్ లేని ఏదో వశీకరణ విద్య, ఏదో సమ్మోహన శక్తి హిట్లర్లో ఉండేది. అతడు పళ్ళునూరుతూ, కళ్ళు ఉరుముతూ, చేతులు విసురుతూ, గొంతు చించుకొంటూ, ఇతర వికార చేష్టలు చేస్తూనో దాదాపు ఒక ఉన్మత్తుని వలె ఉపన్యసించే వాడు. ఉపన్యసిస్తూ ఉండగా మూర్ఛరోగికి వచ్చినట్టు నోటనురుగులు వచ్చేవి. కాని, చిత్రం ఏమంటే, అతడి సభాసదులు అతడి ప్రసంగం ముగిసేసరికి అతడిని మించిన ఉన్మత్తులై పోయేవారు! ఏదో వశీకరణ విద్య, ఏదో సమ్మోహన శక్తి అతడిలో నిశ్చయంగా ఉండేది. ఈ శక్తిని (ఆంగ్లేయ భాషలో) ప్రస్తుతం “ఛారిస్మా" అంటున్నారు. గోబెల్స్లో బుద్ధికుశలత ఉండేది తప్ప, “ఛారిస్మా” ఉండేది కాదు. హిట్లర్ స్వయంగా వివరించినట్లు, “కేవలం బుద్ధి కుశలతతో ఈనాడు గడించుకున్న పలుకుబడి రేపటికి తగ్గవచ్చు లేదా పూర్తిగా లుప్తమై పోవచ్చు. కాని, “ఛారిస్మా” ద్వారా ప్రజానీకంపై ప్రసరింపజేసిన ప్రభావం స్థిరంగా నిలుస్తుంది.”

ప్రచారానికి సంబంధించినంతవరకు హిట్లరువి చాలావరకు మొదటి ప్రపంచ యుద్ధం నాటి భావాలు. అప్పటికి రేడియో వాడకంలోకి రాలేదు. (రెండవ ప్రపంచ యుద్ధకాలంలో టెలివిజన్ లేదు.) అందువల్ల ఉపన్యాస వేదిక, పత్రికలు, పోస్టర్లు - ఇవే హిట్లర్కు బాగా తెలిసిన ప్రచార సాధనాలు. అతడి ఆత్మకథలో వీటి ప్రసక్తి మాత్రమే ఉన్నది. ముఖ్యంగా పోస్టర్లకు అతడు ప్రత్యేక ప్రాధాన్యమిచ్చాడు. ఇందుకు కారణం అతడు ఆర్టిస్టు కావడమే కావచ్చు. ఆర్టిస్టుగా అతడు ఎంతమాత్రం రాణించలేదనుకోండి. అతడి ఆర్ట్ ఇళ్ళకు రంగులను వేయడాన్ని దాటలేదని అనేవారు కొందరున్నా రనుకోండి. అయినా, అతడు ఆర్టిస్టుగా కొంత శిక్షణ పొందినాడనడం నిర్వివాద విషయం. అందువల్ల ప్రచార సాధనాలుగా పోస్టర్లకున్న శక్తిని గురించి హిట్లర్ తరుచు నొక్కి చెబుతూ ఉండేవాడు. నినాదాలను (స్లోగన్స్ అన్న) పోస్టర్ల మీదికి ఎక్కిస్తే, బహుజనుల దృష్టిని ఆకర్షించవచ్చు. హిట్లర్ సూచనపై గోబెల్స్ పెక్కు నినాదాలను సృష్టించినాడు. 'మేలుకో! జర్మనీ! మేలుకో!" "యూదీయు లెవరు? జర్మనీకి పట్టిన పిశాచాలు!" "మనకు జనాభా ఉన్నది - లేనిది జాగాయే!" "నలుగడల మనకు వైరులే! తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త!" "రక్తం అర్పించనిదే రమ వరించదు" - గోబెల్స్ నినాదాలలో కొన్నింటికి ఇవి నా చప్పిడి అనువాదాలు. అన్నట్టు, ఇట్టి నినాదాలతో కూడిన పోస్టర్లను ముద్రించడంలో అతడు ఒక కిటుకు చేసేవాడు. దూరం నుంచి చూస్తే, పెద్ద పెద్ద అక్షరాలతో ఉన్న పదాలు దృష్టిని ఆకర్షించినా, "ఏమిటి చెప్మా?" అనే ప్రశ్నను అవి రేకెత్తించేవి.

దగ్గరికి వెళ్ళి, చిన్న అక్షరాలలో గల పదాలను కూడా కలిపి చదువుకొంటే తప్ప మొత్తం పోస్టరు అర్థం అయ్యేది కాదు. పోతే, తన కాలం నాటికి బహుళ ప్రచారంలోకి వచ్చిన రేడియో ఎంతటి శక్తివంతమైన ప్రచార సాధనమో గోబెల్స్ పూర్తిగా వినియోగించాడు. సభా వేదికలు కదలవు, పత్రికలు, పోస్టర్లు కదులుతాయి. కాని, దేశాల సరిహద్దులను దాటి తేలికగా వెళ్ళవు. వెళ్ళినా, పరిమితంగానే. కాగా, రేడియోకు ఏ సరిహద్దులూ లేవు. దేశ దేశాలలోకే కాదు, గృహ గృహంలోకీ అది సునాయాసంగా ప్రవేశిస్తుంది. రేడియోకున్న ఈ ప్రత్యేక సౌలభ్యాన్ని గోబెల్స్ వేయి విధాలుగా వినియోగించాడు.

కేవలం రేడియోనే నమ్ముకుంటే ప్రజా సముదాయం ఆలోచనా స్రవంతిని పూర్తిగా కంట్రోలు చేయడం సాధ్యపడదు. అందువల్ల గోబెల్స్ స్కూలును, ప్లేగ్రౌండ్ ను స్టేజిని, సినిమాను కంట్రోలు చేశాడు. తమకు, తమ పార్టీకి ప్రతికూలమైనవిగా తోచిన అన్ని పాత పుస్తకాలను భాండాగారాలలో నుంచి తొలగించి, తగలబెట్టించాడు. అట్టి కొత్తపుస్తకాల ప్రచురణ జరగకుండా కట్టుదిట్టాలు చేయించాడు. దాదాపు రెండు వందల సంవత్సరాలుగా నడుస్తున్నాయన్న సంకోచమైన లేకుండా సుప్రసిద్ధమైన పత్రికలను కొన్నింటిని మూయించి వేయించాడు. అవి చేసిన పాపాలు రెండే. మొదటిది - వాటి ఖామందులు యూదీయులు కావడం. రెండవదిఅవి ప్రజాస్వామ్య జీవితపు విలువలను సమర్థించడం. ఇంతేకాక, ఏ యూదీయుడు పత్రికను నడపరాదని, పత్రికా రచయితగా పని చేయరాదని శాసనం ద్వారా ఆంక్ష విధించాడు. జర్మన్ జాతీయునికైనా, యూదీయ జాతి భార్య ఉంటే ఈ ఆంక్ష వర్తిస్తుందని ప్రకటించాడు. పత్రికా రచయితకు స్వీయాభిప్రాయాలు, స్వతంత్ర విశ్వాసాలు ఎంత మాత్రం తగవన్నాడు. పత్రికా రచయితకు, ప్రభుత్వోద్యోగికి ఈ విషయంలో ఎట్టి భేదం లేదు పొమ్మన్నాడు. నాజీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నాలుగు సంవత్సరాలలోనే జర్మనీలోని దినపత్రికల సంఖ్య 3607 నుంచి 2671 వరకు పడిపోయింది!

గోబెల్స్ ప్రచార పద్ధతులకు ఒక ఉదాహరణగా నాజీ ప్రభుత్వం ఏర్పడక ముందే బెర్లిన్లో అతడి కార్యకలాపాలను పేర్కొనవచ్చు. నాటికి జర్మన్ రాజధాని నగరంలో కమ్యూనిస్టులదే పైచేయి. అక్కడికి నాజీ పార్టీ కార్యకర్తగా గోబెల్స్ను హిట్లర్ పంపించాడు. నగరాన్ని చేరగానే గోబెల్స్ చేసిన పని - కమ్యూనిస్టులకు కంచుకోటగా పేరొందిన పేటలో తమ పార్టీ మీటింగును పెట్టడం. దానికి సంబంధించిన పోస్టర్ను "మనకు, మనదేశానికి ఇది విపత్కర సమయం. కార్మికులారా, మీరు సంఘటితం కావాలి" అనే ధోరణిలో వేయించాడు. అది అచ్చంగా కమ్యూనిస్ట్ పోస్టర్ వలె కనబడింది. మీటింగుకు కమ్యూనిస్టులు విశేషంగా వచ్చారు. సభాసదుల మధ్య అక్కడక్కడ కూర్చోవడానికి తమ పార్టీ రౌడీలను (స్టారమ్ ట్రూపర్స్ను) అయిదారు వందలమందిని గోబెల్స్ కూర్చోబెట్టించాడు.

ఉపన్యాసాలు ప్రారంభం కాగానే తాను కోరుకున్నట్టు కమ్యూనిస్టులు ఆక్షేపణలు చేస్తూ అల్లరికి లేచారు. అంతట సభావేదికపై నుంచి గోబెల్స్ సహచరుడు ఒక గ్లాసును విసిరాడు. అది తగిలి, పగిలి, దాని ముక్కలు గుచ్చుకొనగా, ఒక కమ్యూనిస్టు తల చిట్లి, నెత్తురు కారింది. దానితో పెద్దగా కొట్లాట మొదలైంది. రెండు పార్టీల వారికీ గాయాలు తగిలాయి. కమ్యూనిస్టులు గాయపడిన తమ పార్టీ సభ్యులను ఆస్పత్రికి తరలించుకు పోగా, గోబెల్స్ తమ వారిని వెంటనే పంపలేదు. అంతకుముందుగానే జాగ్రత్త పరచిన స్ట్రెచర్స్ పై పదేసి నిమిషాలకు ఒకరిని చొప్పున, క్షతగాత్రులను వీధిలోకి తెప్పించాడు. సభాస్థలి వద్ద మూగిన జనసందోహానికి వారిని చూపిస్తూ, "చూచారా ! కమ్యూనిస్టుల కిరాతకత్వం! గమనించారా వారి రాక్షసత్వం!!" అనే ధోరణిలో వరసగా ఉపన్యాసాలు చేస్తూ పోయాడు. దీని ఫలితం -మూడురోజులు లోపల నాజీ పార్టీలో 26 వేల మంది కొత్త సభ్యులు చేరడం!

పోతే, ద్వితీయ ప్రపంచ యుద్ధం సందర్భంలో నాజీ ప్రభుత్వంలో ప్రజాచైతన్య- ప్రచార శాఖల మంత్రిగా గోబెల్స్ ప్రచార పద్ధతికి ఒక ఉదాహరణగా ఈ కింది విషయాన్ని ఎంచుకొనవచ్చు. ఫ్రాంకో-జర్మన్ సరిహద్దులోని తమ రక్షణ శ్రేణిలో ("మేజినో లైన్" లో) మోహరించివున్న ఫ్రెంచి సైనిక దళాల పై ఒకనాడు గోబెల్స్ ఫోటోగ్రాఫుల వర్షం కురిపించాడు. అవి ఫ్రెంచి గృహిణులతో బ్రిటిష్ సైనికుల ప్రణయకలాపాల ఫోటోలు. "దేశ భక్తులవలె ఇక్కడ మీరు మీ కర్తవ్యాన్ని పరిపాలిస్తున్నారు. కాని, మీ గృహాలలో ఏమి జరుగుతున్నదో చూడండి! అయినా, బ్రిటిషు వారు మీకు ఆప్తమిత్రులా? మేము పరమ శత్రువులమా?" ఈ ధోరణిలో ఆ ఫోటోగ్రాఫుల కింద వ్రాసి వున్నది. అసలు విషయం : అవి పూర్తిగా ఫోర్జరీ ఫోటోలు ! "ఏదైనా దేశాన్ని సులభంగా జయించాలంటే, ఆ దేశ ప్రజల మనోనిబ్బరంపై ముందుగా గట్టిగా దెబ్బతీయాలి " అనే హిట్లర్ సూత్రాన్ని పాటించి ఈ నికృష్టమైన ఫోర్జరీకి గోబెల్స్ పాల్పడ్డాడు.

అయితే, హిట్లర్ కేమి, గోబెల్స్ కేమి, ఇతర నాజీ నాయకులకేమి ఫలితం ముఖ్యం. దాన్ని పొందడానికై వినియోగించే సాధనాలు ముఖ్యం కావు. అందువల్లనే ప్రచారానికి సంబంధించినంత వరకు హిట్లర్ ఈ రెండే రెండు ముఖ్యసూత్రాలను ప్రవచించాడు.

(1) ఆడగా, ఆడగా, ఆడగా అబద్ధమైనా నిజమై కూర్చుంటుంది.

(2) ఎంత పెద్ద అబద్ధాన్ని ఆడితే, దాన్ని నిజమని ప్రజలు అంత తేలికగా నమ్ముతారు. ఈ రెండు సూత్రాలను వ్యర్ధ సూత్రాలని లేదా వెర్రి సూత్రాలని తేలికగా త్రోసిపుచ్చలేము. ఇవి ప్రయోజనకరమైన సూత్రాలని హిట్లర్ నిరూపించాడు, అతనికంటే మిన్నగా గోబెల్స్ నిరూపించాడు. అయితే, ఆ ప్రయోజనం తాత్కాలికమైనదే లేదా పరిమితమైనదే. అబ్రహాం లింకన్ చెప్పినట్టు, "కొందరిని ఎల్లకాలం మోసగించవచ్చు. ఎల్లరినీ కొంతకాలం మోసగించవచ్చు. కాని ఎల్లరినీ ఎల్లకాలం మోసగించడం సాధ్యపడదు."

ఈ వారం అసలు గోబెల్స్ విషయమై వ్రాశాను. వచ్చేవారం మన నకిలీ గోబెల్స్ విషయమై ప్రస్తావిస్తాను.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 7-2-1977).

గమనిక: *లోకం పోకడ వ్యాస పరంపర నార్లవారి విశిష్ట రచన. భావంలో, భాషలో, నిబద్ధతలో పరిణతి నొందిన రచన. విశేషంగా పాఠకుల అభిమానం పొందిన రచన. 18-5-1977 నుంచి 16 వారాలపాటు ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురణ జరిగాక అర్థాంతరంగా 24-8-1977 సంచికతో ఆపేయడం జరిగింది. దీనిపై నార్లవారు శ్రీ హరిహరప్రియకు 17-1-1978న రాసిన ఉత్తరంలో ఇలా వివరిస్తారు.*

"My feature in Andhra Prabha Illustrated Weekly was stopped as a result of the pressure brought on its proprietors by the same guttersnipe who converted into his personal estate the institution

of Andhra Jyoti which I founded. I am not surprised that you did not receive any reply from the Andhra Prabha people. There is much truth in the assertion once made by Jawaharlal Nehru that the freedom of the Press is becoming in practice the freedom of its proprietors".

1: నార్లవారి ఉత్తరాలు. సంకలనకర్త: హరిహరప్రియ. బెంగుళూరు: బయలుసీమె ప్రకాశన.ఉగాది.1986.పు.31

2 : లోకం పోకడ శీర్షికలో వెలువడిన జీవిత పరిచయాల కోసం 7వ సంపుటం.

మరికొన్ని అంశాలు

1 రాజీ రాజీ రాజీ
2 ఉప్పు, మిరియం
3 లోక్ పార్టీ
4 కాంగ్రెస్ విప్లవ స్వరూపం
5 కమ్యూనిస్టుల 'సోషలిజం'
6 సోషలిజం నిర్వచనం
7 ఆత్మ పరిశీలన
8 యువజన కాంగ్రెసు
9 స్వామీజీ దీక్ష
10 స్థానిక స్వపరిపాలన
11 విష వృక్షం
12 విజిగీష
13 బంగారంపై విధి నిషేధాలు
14 మానవాళికి ప్రథమ శత్రువు
15 విషాద సంఘటనలు
16 మౌసల పర్వం
17 పిరికి మందు
18 బిర్లా భవన్
19 అంతరాత్మ ప్రసక్తి
20 విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ
21 పాత, కొత్త కాంగ్రెస్లు
22 పోచంపాడు ప్రాజెక్టు
23 చిచ్చర పిడుగు
24 నేటికి ఇంతే
25 - - - - - -
26 ఘోర సంఘటన
27 మంచి సంస్కరణ
28 కాంగ్రెస్ సంస్థ
29 అలీన విధానం (4)
30 నవ సమాజ లక్ష్యం
31 దేశభక్తికి గీటురాళ్ళు
32 జాతీయత
33 ఈనాడు ఏమి కావాలి?
34 నందికొండ
35 జలమార్గాలు
36 వంశధార ప్రాజెక్టు
37 నియంతలు, నియంతృత్వం
38 విదేశాలకు వెళ్ళినప్పుడు
39 విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత
40 నారీ ధర్మం
41 స్త్రీ స్వాతంత్ర్యం
42 భారత నారి
43 బంగారం తూటాల

మరికొన్ని అంశాలు

కాంగ్రెస్ నుంచి నిర్గమనానికి సోషలిస్టులు తీర్మానించారు. 15/4లోగా రాజీనామా పెట్టాలని నాసిక్ మహాసభ ఆదేశం కార్యదర్శి - జయప్రకాష్ నారాయణ్. స్వాతంత్ర్య సిద్ధి తర్వాత ప్రజానీకానికంతకు ప్రాతినిధ్యం వహించేదిగా లేదు. దాని కర్తవ్యం తీరిపోయింది.

నేటి మన ప్రభుత్వవిధానాలకు రాష్ట్రాలలో నేమి, కేంద్రంలో నేమి ఒక్కటే కీలకం. అదిరాజీ. అది చిన్న సమస్య కావచ్చు. లేదా పెద్ద సమస్య కావచ్చు. అయినా, దాని పరిష్కారానికి అనుసరించబడుతున్న విధానానికి కీలకం రాజీయే. అది తక్షణ సమస్య కావచ్చు, లేదా అంత తక్షణ సమస్య కాకపోవచ్చు. అయినా, దాని పరిష్కారానికి అనుసరించబడుతున్న విధానానికి కిటుకు మరల రాజీయే. అది జాతీయసమస్య కావచ్చు, లేదా, అంతర్జాతీయ సమస్య కావచ్చు. అయినా దాని పరిష్కారానికి అనుసరించబడుతున్న విధానానికి తిరిగి మర్మం రాజీయే.

ఏమైనా సరే రాజీదారినే తొక్కాలంటే, జాగు తప్పదు. విభిన్న దృక్పథాలను - పూర్తిగా కాకపోయినా, కొంతవరకైనా - సంతృప్తిపరిచినప్పుడే రాజీ కుదురడం. అందుచేత ఏదో ఒక రాజీనే కోరితే, ఏ పనిలోనైనా జాగు జరిగి తీరుతుంది. రాజీ కొన్ని సందర్భాలలో మంచిదే కావచ్చు; తొందరపాటు అన్ని సందర్భాలలోనూ తగనిదే కావచ్చు. కాని, ఏదో రాజీ లేకుండా - ఎంతో కొంత జాగు లేకుండా ఏ పనీ జరగరాదనడం తగునా? ఉదాహరణకు, అన్యాయంతో, అక్రమంతో, అసత్యంతో, అధర్మంతో రాజీ తగునా? లేక జాతిక్షేమానికి, సంఘ శ్రేయస్సుకు, ప్రజావృద్ధికి ప్రాణాంతకమైన శక్తులతో రాజీ తగునా?

బ్రిటిష్ వారితో, ముస్లింలీగ్ తో రాజీపడి మనం దేశస్వాతంత్ర్యాన్ని సంపాదించుకొన్నాము. ఆ రాజీకి రక్తంతో, అశ్రువులతో, బాధతో, దైన్యంతో, అవమానాలతో, కళంకాలతో మూల్యాన్ని చెల్లించాము.

ఔను! ఖూనీలు, దోపిడీలు ఈ రాజీకి మనం చెల్లించిన మూల్యమే కాదా? గృహదహనాలు, స్త్రీల మానభంగాలు ఇందుకు మనం చెల్లించిన మూల్యమే కాదా? గాంధిని కోల్పోవడం సయితం ఇందుకు మనం చెల్లించిన మూల్యమే కాదా?

రాజీతో ప్రారంభమైన మన స్వతంత్ర జాతీయజీవితం రాజీ ద్వారానే నేటికీ కొనసాగుతున్నది. సంస్థానాలను అన్నింటినీ బ్రిటిష్ ఇంపీరియలిస్టులు సృష్టించి ఉండకపోవచ్చు. కాని, వాటిని కాపాడినవారు ఆ ఇంపీరియలిస్టులే. లేనిచో, యూరప్ లో ఫ్యూడల్ స్టేట్స్ విలుప్తమైపోయినట్టే, మనదేశంలో కూడా ఈ సంస్థానాలు ఏనాడో మటుమాయమై పోయి ఉండేవి. ఇంతవరకు స్వాతంత్ర్య సముపార్జనకు ప్రతిబంధకంగా నిలిచినట్టే, ఇక మీదట జాతీయ సమైక్యతకు ఈ సంస్థానాలు అడ్డుగా నిలవడం తథ్యం. అయినపుడు వీటిని పూర్తిగా మన మ్యాప్పై నుంచి చెరిపివేయకుండా కొన్నింటిని నిలపడం దేనికి? వాటితో రాజీ బేరాలు దేనికి? ప్రజల నిలువుదోపిడిలో జమీందారులు బ్రిటిష్ ఇంపీరియలిస్టు ఏజెంట్లు. ఇది అందరికీ తెలిసిన విషయం. అందుచేత వారిని తొలగించడం మంచిదే. కాని, శతాబ్దికిపైగా వారు సాగించిన దోపిడి చాలదన్నట్లు ఏ పాటి నష్టపరిహారం చెల్లించుకోవాలని వారితో రాజీ గొడవ దేనికి? తినడానికి తిండి లేదు; కట్టడానికి బట్ట లేదు; కాపురం చేయ్యడానికి కొంప లేదు; మూడవ కంటిని పోలిన చదువు లేదు, అన్ని భాగ్యాలను మించిన ఆరోగ్యం అసలే లేదు. ఈ దౌర్భాగ్యస్థితి నుంచి మన జాతి బయటపడాలంటే, జాతీయ పునరుజ్జీవన కార్యక్రమాలకు కొన్ని వేల కోట్ల రూపాయలను వెచ్చించాలి. పన్నుల ద్వారా ఇంత మొత్తాన్ని కూర్చగల తాహతు ప్రజలకు లేదు.

ఇప్పటికే వారు నడుం విరిగివున్నారు. అందువల్ల దాదాపు అన్ని ముఖ్య పరిశ్రమలను జాతీయం చేయడమే శరణ్యం. అయినా, అడుగడుగునా పెట్టుబడి దారులతో రాజీ మాటలు దేనికి?

మన గడ్డపై బ్రిటీష్వారి పరిపాలన ఎంత అన్యాయమైనదో, దానిపై ఫ్రెంచి, పోర్చుగీస్ పతాకాలు ఎగరడం అంత అసహజమైనదని వేరుగా చెప్ప వలసిన పనిలేదు. అయినా ఫ్రెంచి, పోర్చుగీస్ ప్రభుత్వాలతో రాజీకి దేవులాట దేనికి? ప్రతి విషయంలో ఇదే దేవులాట తప్పకపోతే, మన స్వాతంత్ర్యం నామమాత్రం కాదా? మన ప్రజలలో అసంతృప్తి ప్రబలిపోదా? మన ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ, కాంగ్రెస్ నుంచి చీలిపోతున్న సోషలిస్టులనే కాకుండా, స్వాతంత్ర్య సంసిద్ధితో నవశకం జాజ్వల్యమానంగా ప్రారంభం కాగలదని ఆశించిన ప్రతి భారతజాతీయవాదిని ఏదో అసంతుష్టి ఏదో ఆందోళన ఏదో నిరాశ ఏదో నిస్పృహ, - - - నేడు ఎంతో కొంతగా ఆవహించలేదా? దీని ఫలితంగా ఒక్క పెట్టున మన దేశాన్ని మహోన్నత శిఖరాలకు తీసుకుపోవలసిన తీసుకుపోగల - - ప్రజాశక్తులు నీరసించి పోవడంలేదా? స్వాతంత్ర్య సముపార్జన రేకెత్తించిన సంతోష సంరంభాలతో మనం వెంటనే సాధించలేకపోతున్న పురోభివృద్ధిని, ఇవి చల్లారిన పిదప, ఒక అర్ధశతాబ్దిలోనైనా సాధించగలమా? రాజీ తగని - జాగు కూడని ఘట్టాలు ప్రతి దేశచరిత్రలో కొన్ని కానరావా? అట్టి ఘట్టంలో నేడు మన దేశం లేదా? (23-3-1948)

ఉప్పు : మిరియం

కిజూర్ తీర్మానం చారిత్రాత్మకమైనదనడం లాంఛన ప్రాయమైన మాటకాదు. ఇండియా నడిగడ్డపై మిగిలిన విదేశ స్థావరాలలో మరికొన్ని మాతృదేశంలో చేరిపోవడమన్న దృష్టి నుంచి మాత్రమే చూస్తే, నేటి తీర్మానం "చారిత్రాత్మక" మనే విశేషణానికి పాత్రం కాకపోవచ్చు. మొత్తం ఇండియాపై నుంచి బ్రిటిష్ సామ్రాజ్యాధిపత్యమే తుడిచి పెట్టుకు పోయిన తర్వాత స్వల్పమాత్రపు ఈ విదేశ స్థావరాలు నిలవగలవా? కాబట్టి, కిజూర్ నిర్ణయంతో ఫ్రెంచి స్థావరాలకు స్వస్తి జరగనుండడం పెద్ద విశేషం కానే కాదు. కాని, ఈ స్వస్తి ప్రపంచ చరిత్రలో ఒక బృహత్పరివర్తనకు ఒక విప్లవాత్మక పరిణామానికి మరొక చిహ్నమనే సంగతిని మనం మరచిపోరాదు. నాలుగున్నర శతాబ్దాల క్రితం పాశ్చాత్య ఖండంనుంచి ఓం ప్రథమంగా సముద్ర మార్గాన నాల్గు నౌకలు భారతతీరం చేరినప్పుడు ప్రారంభమైన శకం - "ఆసియా అండ్ వెస్టర్న్ డామినెన్స్" అనే ఉద్గ్రంథాన్ని కొత్తగా ప్రచురించిన సర్దార్ పణిక్కర్ పలుకులలో ఇది "వాస్కోడిగామా శకం" చరమదశను చేరుకొంటున్నది. ఇదే సమయాన మొత్తం ఆసియా చరిత్ర లోనే నవశకం ప్రారంభమౌతున్నది. ఇందుకు మరొక చిహ్నం కాబట్టే, కిజూర్ నిర్ణయం నిస్సందేహంగా చారిత్రాత్మకమైంది.

సర్దార్ పణిక్కర్ తన నూతన గ్రంథంలో ప్రతిభా పూర్వకంగా వివరించినట్లు, మిరియాల పొడికోసం తాపత్రయంతో వాస్కోడిగామా శకం ప్రారంభమైంది. ఆదిలో మిరియం ముఖ మెరుగని వారైనా క్రీస్తుశకం పదవ శతాబ్దం ప్రాంతాల మిరియం లేనిదే ముద్దగొంతు దిగని స్థితికి యూరోపియనులు వచ్చారు. కాని, అది తమ దేశాలలో పండదు కాబట్టి, ఇండియా, ఇండొనీసియాల నుంచి విధిగా దాన్ని దిగుమతి చేసుకోవలసి వచ్చింది. ఈ దేశాలతో తమకు సరాసరి సంబంధం లేనందున అరబ్ రాజ్యాల గుండా దాన్ని తెప్పించుకోవలసిన అగత్య మేర్పడింది. ఈ పరిస్థితిలో అరబ్బులు అడిగిందే ధరగా చెల్లింది. దానితో మిరియం గింజలు ఇంచుమించు వజ్రాలతోను, వైడూర్యాలతోను సరితూగ నారంభించాయి. ఇస్లాంతో క్రైస్తవ ప్రపంచం జరిపిన యుద్ధాలకు ఒక బలీయమైన ప్రేరేపణ మిరియాలు, లవంగాలు, యాలకులు మొదలైన సుగంధద్రవ్యాల వ్యాపారంపై అరబ్బులకున్న తిరుగులేని ప్రాబల్యాన్ని భగ్నపరచాలన్న క్రైస్తవులు పట్టుదలే! యుద్ధాలద్వారా ఇది పూర్తిగా సాధ్యంకాలేదు కనుకే ఇండియా తీరాలకు నౌకా ప్రయాణాలకు తగు మార్గాన్ని కనిపెట్టవలెనన్న ప్రయత్నం ప్రారంభమైంది. డెబ్బై సంవత్సరాలు నిర్విరామకృషి తర్వాత కాని, ఈ ప్రయత్నం సఫలం కాలేదు. చివరి కిది సఫలమై 1498 మే 27వ తేదీని కాలికట్ రేవుకు పోర్చుగల్ నుంచి వాస్కోడిగామా చేరిననాడే ఆసియాపై

పాశ్చాత్య ప్రాబల్యానికి పునాది రాయిపడింది. వర్తకం కోసం ఇండియాకు చేరిన పాశ్చాత్యులు క్రమంగా ఆసియా ఖండానికి అధిపతులైన గాథ సుదీర్ఘమైంది కాబట్టి, దాన్ని గురించి ఇక్కడ ప్రస్తావించలేము. కాని, ఇక్కడ గమనించవలసిన విషయం మిరియంకోసం తాపత్రయంతో ప్రారంభమైన పాశ్చాత్య ప్రాబల్యశకం ఉప్పుకై పోరాటంతో పునాదులనుంచీ కదిలిందని మాత్రమే. 1947 వరకు జాతీయ స్వాతంత్ర్యం కోసం ఇండియా వేచి ఉండవలసి వచ్చినా, 1930 నాటి ఉప్పు సత్యాగ్రహమే ఇండియాపై బ్రిటిష్ సార్వభౌమత్వం అనతికాలంలో గతించక తప్పదనే పరిస్థితిని మొట్టమొదటి సారిగా కల్పించింది. ఆసియా పతనం ఇండియాపై పాశ్చాత్యుల ప్రాబల్యంతో ప్రారంభమైనట్టే, ఆసియా విముక్తి ఇండియాకు స్వాతంత్ర్య సిద్ధితో ప్రారంభమైంది. దీన్ని బట్టి మిరియంతో మొదలైన వాస్కోడిగామా శకం ఉప్పుతో తుదముట్టుతున్నదని చెప్పవచ్చు. నాలుగున్నర శతాబ్దాల ఈ చరిత్రను ఒకసారి జ్ఞాపకం తెచ్చుకుంటే, కిజూర్ నిర్ణయం చారిత్రాత్మకమైందని మాతో ఎల్లరు ఏకీభవించక తప్పదు. (ఆంధ్రప్రభ 19-10-1954)

లోక్ పార్టీ

(కాంగ్రెస్ పార్టీలో విలీనానికి లోక్ పార్టీ సిద్ధమైనపుడు స్పందించి రాసింది.)

కాంగ్రెసులో విలీనీకరణకు వ్యతిరేకంగా కృషీకార్ లోక్ పార్టీ కార్యవర్గం తీర్మానించు కొనడం శోచనీయం. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి వలె మేముకూడా ఇది అంతిమ నిర్ణయం కాదని, దీని పునః పరిశీలనకు ఇప్పటికైనా అవకాశం కలదని ఆశిస్తున్నాము.

లోక్పార్టీ కాంగ్రెసులో చేరగల అవకాశం లేకపోలేదని తోచినంతనే "తెలుగు జనానికి మన మొహమెలా చూపడం, గురూ? కళ్ళకు గంతలు కట్టుకు వెళ్ళవోయి. డింగరీ" అంటూ తమ నాయకుడైన ఆచార్య రంగాపై హేళనతో కూడిన పాటలను అల్లడానికి కమ్యూనిస్టులు సంకోంచించలేదు. అయినా, "కమ్యూనిస్టులతో చేతులు కలుపుతారా?" అనే ప్రశ్నకు "ఎవరితోనైనా సరే!" అని శ్రీ గౌతు లచ్చన్న ఎలా సమాధాన మివ్వగలిగారో తెలియదు!

అయితే, "కమ్యూనిస్టులు కోరినట్టు ఇప్పుడు చేసుకునే ఒప్పందం సంకీర్ణ మంత్రి వర్గంలో కలిసి పనిచేయడానికి కాదు. మేమే అధికసంఖ్యాక స్థానాలు సంపాదించగలమనే విశ్వాసం మాకు ఉన్నది. అలాంటప్పుడు కమ్యూనిస్టులు మాకు ఆహ్వానమివ్వడమేమిటి? మేమే ఇతరులకు ఆహ్వానమిచ్చే స్థితిలో ఉంటాము" అని శ్రీ లచ్చన్న అన్నారనుకోండి. ఈ మధ్యనే గుంటూరు జిల్లా దుగ్గిరాల నియోజక వర్గంలో లోక్పార్టీ అభ్యర్థి సాధించిన "పూర్ణ విజయం" తర్వాత ఏ అంచనాపై ఎన్నికలలో తామే అధిక సంఖ్యాక స్థానాలను సంపాదించగలమని శ్రీ లచ్చన్న అంటున్నారో అది వారికే తెలియాలి. కాని, కమ్యూనిస్టులతో ఎన్నికల పొత్తు పెట్టుకున్న తర్వాత, మంత్రివర్గంలో చేరవలసిందిగా వీరు వారిని పిలిచినా, వారే వీరిని పిలిచినా, ఆ విషయమై ఇప్పుడే ఒప్పందానికి తాము ఎందుకు విముఖులో లచ్చన్నగారు వివరించలేదు. కమ్యూనిస్టుల చలవవల్ల పదవీ భ్రష్టుడైన హంగరీ ప్రధాని డాక్టర్ నగీని వెంట పెట్టుకుని ఈ మధ్యనే ఊరేగిన కారణాన "ప్రజాస్వామ్య సూత్రాలలో కమ్యూనిస్టులకు విశ్వాసం కలదనే నమ్మకం శుద్ధ అవివేక" మని, "ప్రజలను తప్పుదారిలో నడిపించడం ద్వారా తమ నియంతృత్వ పరిపాలనను స్థాపించుకొనడానికే ప్రజాస్వామికాన్ని గురించి వారు మాట్లాడతా"రని ఆయన చేసిన హెచ్చరికలు ఇంకా చెవులలో గింగురుమంటున్న కారణాన, సంకీర్ణ ప్రభుత్వ స్థాపన విషయంలో కమ్యూనిస్టులతో పొత్తును గురించి ఇప్పుడే ఒక నిర్ధారణకు రావడానికి శ్రీ లచ్చన్న తటపటాయిస్తున్నారు కాబోలు! ఏమైనా, సంకీర్ణ ప్రభుత్వ స్థాపన విషయంలో కమ్యూనిస్టులను నమ్మలేని లచ్చన్నగారు ఎన్నికల పొత్తు విషయంలో మాత్రం

ఎలా నమ్మగలరో? కమ్యూనిస్టులను తెగనాడడం కోసమే తనను తెలుగు దేశంలో ఊరేగించిన లచ్చన్నగారే కమ్యూనిస్టులతో ఎన్నికల పొత్తు కుదుర్చుకొన్నట్టు వింటే, డాక్టర్ నగీ ఏమనుకుంటారో లచ్చన్నగారు ఆలోచించుకున్నారా? "మూడవ శక్తి" ని దేనినో తాము ఆంధ్ర రాష్ట్రంలో ఆవిర్భవింప జేయనున్నామని శ్రీ లచ్చన్న విశ్వసిస్తున్నట్టున్నారు. నిజంగా ఇందుకు ఏమాత్రం అవకాశం ఉన్నా, కమ్యూనిస్టులు పరోక్షంగానైనా సరే ఈ ఫలిత సాధనకు తమకు తోడ్పడగలరని లచ్చన్నగారు ఎలా అనుకొంటున్నారో దురూహ్యం! "తృతీయ శక్తి"గా రూపొందాలని ప్రయత్నిస్తున్న ప్రజా సోషలిస్టు పార్టీకి కమ్యూనిస్టు పార్టీ సహకారం ఎంతవరకు లభించిందో ఆ పార్టీతో శ్రీ గజపతిరాజు జరిపిన రాయబారాల వైఫల్యం తర్వాతనైనా లచ్చన్నగారు కానలేరా? కాంగ్రెసుతో కొన్ని విషయాలపై తమకు విభేదాలున్నా, అవి (కమ్యూనిస్టు పార్టీతో వలె) ప్రాథమిక సూత్రాలకే, ప్రజాస్వామిక సిద్ధాంతాలకే సంబంధించినవి కావు. కాబట్టి కాంగ్రెసులో చేరడమే తమకు క్షేమమని, విడి పార్టీగా ఎన్నికలలో పోటీ చెయ్యడంవల్ల నాన్ - కమ్యూనిస్టు అభ్యర్థులు గెలుపొందగల అవకాశాలను పెంచడం తప్ప మరేమీ జరగదని శ్రీ లచ్చన్న ఇప్పటికైనా గుర్తించ గలరనే ఆశిస్తున్నాము.

(ఆంధ్రప్రభ 11-12-1954)

కాంగ్రెసు విప్లవ స్వరూపం

(స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ పార్టీలో వచ్చిన మార్పులను నిరసిస్తూ రాసింది.)

గాంధీ నాయకత్వం కింద భారతీయ జాతీయ విప్లవంలో పాల్గొన్నవారు ప్రధానంగా మధ్యవర్గాలవారే. బానిసత్వం వారికి అతిహేయంగా తోచింది; స్వాతంత్ర్య విహీనమైన జీవితం వారికి దుస్సహం అనిపించింది. అయితే, వారిని జాతీయసమర సైనికులుగా ప్రేరేపించిన శక్తులు కేవలం ఇవి మాత్రమే కావు. బానిసదేశంలో పరిపూర్ణ వికాసానికి వారికి తగు మార్గాలు కానరాలేదు. తమకు విద్యాబుద్ధులున్నాయి, శక్తి సామర్థ్యాలున్నాయి, ప్రజ్ఞాప్రాభవాలున్నాయి. కాని, వాటి వినియోగానికి, వికాసానికి అవకాశాలే శూన్యం. ఒకవేళ ఏదైనా అవకాశం లభించినా, పరిమితంగానే, సంకుచితంగానే. తాము ఉత్తరువులు పుచ్చుకోవలసిన వారే కాని, వాటి నివ్వగలవారు కాదు; నిర్ణయాలను పాలించవలసినవారే కాని, వాటిని చేయగలవారు కాదు, కూడుగుడ్డలకు లోపం లేకుండా తమ బ్రతుకు వెళ్లమారితే, అక్కడికి అదే పదివేలని సంతోషించవలసినవారే కాని, జీవితభోగాల ననుభవించగలవారు కాదు. ఒక్కమాటలో, తాము ఏ సుఖానికీ, ఏ భోగానికీ, ఏ తృప్తికీ అవకాశంలేని నిస్సారపు బ్రతుకు బ్రతకవలసినవారే.

దీని నుంచి విముక్తి సాధనకు ఒక్కటే మార్గం. అది - స్వరాజ్యం. అందు వల్లనే పెక్కుమంది మధ్యవర్గాలవారి భావనలో స్వరాజ్యం సుఖజీవనానికి పర్యాయపదమై పోయింది. మధ్యవర్గాలు సర్వదా తమకు గమ్యంగా పరిగణించే వర్గ మొక్కటే. అది - తమకు ఒక మెట్టు పైగా నిలిచిన వర్గం. ఆ వర్గంలో చేరడానికి తమకు తోడ్పడేవి రెండే సాధనాలు. వీటిలో మొదటిది - పదవి; రెండవది - సంపత్తి.

గాంధి నాయకత్వంకింద మన జాతీయవిప్లవంలో విశేషంగా పాల్గొన్న వారు మధ్యవర్గాల వారేనని, తమకు ఒక మెట్టు పైగా నిలిచిన వర్గమే వారికి సర్వదా గమ్యమని, అందుకు పదవీసంపత్తులే సాధనాలని అంగీకరించిన పక్షంలో 1947 ఆగష్టు 15 తర్వాత కాంగ్రెసువారిలో ప్రబలంగా కానవస్తున్న చిత్తవృత్తి, అది ఎంత శోచనీయమైనదైనా, దురూహ్యమైనది మాత్రం కాదా?

ఏ విప్లవ- ఫలితాలైనా, ఆ విప్లవంలో పాల్గొన్నవర్గం స్వభావంపై ఆధార పడి ఉంటాయి. బ్రిటన్లో క్రామ్వెలియన్ విప్లవం మధ్యవర్గ విప్లవం, ఫ్రెంచి మహావిప్లవం కూడా మధ్యవర్గానిదే. ఈ రెండు విప్లవాలతర్వాత అధికారం, ఐశ్వర్యం మధ్యవర్గాల వారిదే అయింది. బ్రిటన్, ఫ్రాన్సులలోవలె అమెరికాలో (జార్జి వాషింగ్టన్ నాయకత్వాన) జరిగిన విప్లవం సయితం మధ్యవర్గ విప్లవమైనప్పటికీ, అప్పటికి యునైటెడ్ స్టేట్సు జనసంకీర్ణత బహు స్వల్పమైన దేశమై నందున - పోగుజేసుకోగల వారికి పోగుజేసుకోగలిగినంతటి సంపత్తికి అది అవకాశ మిచ్చినందున - ఒక్క మధ్యవర్గం వారు మాత్రమే దానివల్ల బాగుపడలేదు. అయినా, ఎక్కువ బాగుపడినవారు మాత్రం ముఖ్యంగా మధ్యవర్గంవారే.

ఈ చారిత్రక సంఘటనల దృష్ట్యాకూడా మన దేశంలోని పరిస్థితులు దురూహ్యమైనవి కావు. మన జాతీయ విప్లవం మధ్యవర్గంవారి విప్లవం, దాని విజయం వారి విజయం. అందువల్ల దానినుంచి అధిక ప్రయోజనం పొందడానికి వారే ప్రయత్నిస్తున్నారు, వారే దాన్ని పొందుతున్నారు. (ఆంధ్రప్రభ 27-5-1949)

కమ్యూనిస్టుల "సోషలిజం"

సోషలిజం కార్ల్ మార్క్స్ తోనే పుట్టలేదు. "సోషలిజం", "సోషలిస్టు" అనే మాటలు బ్రిటన్, ఫ్రాన్సులలో 1825 తర్వాతనే మొట్టమొదటగా ప్రచారంలోకి వచ్చినా, సోషలిస్టు దృక్పథం చాలా పురాతనమైనదే. క్రీస్తు శకానికి పూర్వపు వాడైన గ్రీక్ తత్త్వవేత్త ప్లేటో రచనలలో సోషలిజం భావాంకురాలు ఉన్నాయి. ప్లేటో కాలానికి ముందు నుంచి కూడా భారత జాతిని అలరిస్తున్న "రామరాజ్యం" లక్ష్యంలో సయితం ఈ భావాంకురాలకు స్థానం లేకపోలేదు. అయితే, ప్రాచీన కాలపు మానవ చరిత్రలో కానవచ్చేది సోషలిస్టు దృక్పథం, లేదా సోషలిస్టు భావాంకురాలే తప్ప, "సోషలిజం" కాదు. ఈ పలుకులు "ఆదర్శ రాజ్యం" విషయమై కలలు కన్న సర్ థామస్ మోర్, టి. కాంపనెల్లా ప్రభృతులకు కూడా వర్తిస్తాయి. థామస్ మోర్ తన "యూటోపియా" గ్రంథాన్ని 1516లో ప్రచురించినాడు; కాంపనెల్లా తన "సిటీ ఆఫ్ ది సన్" గ్రంథాన్ని 1623లో ప్రకటించాడు!

సోషలిజం ఓం ప్రథమంగా ఒక నిర్దిష్టరూపాన్ని ధరించింది ఫ్రెంచి విప్లవ కాలానికి చెందిన బాబియఫ్ రచనలలో. 1797లో ఆయన ప్రచురించిన గ్రంథంతో ఆధునికపు సోషలిస్టు ఉద్యమం ప్రారంభమైనట్టు పెక్కుమంది అభిప్రాయం. అప్పటికి కార్ల్ మార్క్స్ ఇంకా జన్మించనైనా లేదు. సోషలిజం తొలి నిర్మాతలలో బాబియఫ్ తర్వాత ప్రత్యేకంగా యెన్నదగినవాడు రాబర్ట్ ఓవెన్. ఆయనకు, ఆయన అనుచరులకు ఒక ప్రత్యేకపు పేరుగానే "సోషలిస్ట్" అనే మాట బ్రిటన్లో మొట్టమొదటగా వాడుకలోకి వచ్చింది. ఓవెన్, ఆయన అనుచరులు ఈ పేరుతోనే తాము ఇక మీదట వ్యవహరించాలని తమ పార్టీ తరఫున 1841లో ఒక తీర్మానం చేసుకున్నారు.

సోషలిజం పుట్టుపూర్వోత్తరాలను చర్చించడం ఇక్కడ మా అభిమతం కాదు. అందుకు ఒక పెద్ద గ్రంథాన్ని వ్రాయవలసి వస్తుంది. ఇక్కడ మేము చెప్పగోరుతున్నది మార్క్స్, ఎంజెల్సు 1848లో తమ కమ్యూనిస్టు "మ్యానిఫెస్టో"ను ప్రచురించక ముందే సోషలిస్టు మహోద్యమం జననమంది, పరిఢవిల్లుతున్నదని మాత్రమే!

అద్వైతం, ద్వైతం, విశిష్టాద్వైతం మొదలైన రూపాలతో శాఖోపశాఖలై భారతీయ తత్త్వశాస్త్రం పరిఢవిల్లినట్టే, సోషలిజం కూడా కాలక్రమాన అనేక రూపాల విస్తరిల్లింది. క్రిస్టియన్ సోషలిజం, గిల్డ్ సోషలిజం, ఫేబియన్ సోషలిజం, మార్ఫిజం ఇలాంటి శాఖోపశాఖ లెన్నో, వీటిలో - చిట్ట చివరిదే కార్ల్ మార్క్స్ ప్రవచించినట్టిదీ; కమ్యూనిస్టులు ఆమోదిస్తున్నట్టిదీ!

రాజ్యాధికార సాధనకు జరిగిన వర్గ సంఘర్షణలుగా మొత్తం మానవ చరితకు (భౌతిక దృష్టి నుంచి) భాష్యం చెప్పి, రానున్నది కార్మిక యుగమనీ, వర్గ సంఘర్షణ ద్వారా, నియంతృత్వం ద్వారా కార్మికులు ఆ యుగాన్ని ప్రవేశ పెట్టాలని ప్రబోధించేది మార్క్సిజం. రసాయనిక శాస్త్రజ్ఞులు "హెచ్ 2 ఓ" అనే సూత్రం ద్వారా నీటి స్వరూపాన్ని తిరుగులేకుండా ఏ విధంగా చెప్పగలరో, ఇంత వరకు జరిగిన చరిత్ర పరిణామాలను గురించి, ఇక ముందు జరగగల పరిణామాలను గురించి అంత తిరుగులేకుండా మార్క్సిజం చెప్పగలదని దాన్ని ఆమోదించే వారందరి ప్రగాఢ విశ్వాసం. అందువల్లనే వారు "సైంటిఫిక్ సోషలిజం" అనే పదాన్ని "మార్క్సిజం" అనే దానికి పర్యాయపదంగా వాడతారు!

అయితే, ఈ "సైంటిఫిక్ సోషలిజం" తు.చ. తప్పరానిదైతే మానవ చరిత్రలో ఒక సోక్రటీస్కు, ఒక గౌతమ బుద్ధునికి, ఒక ఏసుక్రీస్తుకు, ఒక గాంధీజీకి స్థానమే లేదు! ఏమైనా, మార్క్సిజాన్ని తప్ప మరి దేన్నీ అసలు సోషలిజంగా మార్క్స్ అనుచరులు - అంటే, కమ్యూనిస్టులు - గుర్తించరు. అందువల్లనే సోషలిస్టు సామాజిక వ్యవస్థ తన లక్ష్యమని ఆవడి కాంగ్రెసు చేసిన తీర్మానం కేవలం వోట్ల కోసం ప్రజలను మోసగించడానికి కాంగ్రెసు ఆడుతున్న కపట నాటకమని వీరు ప్రచారం ప్రారంభించారు. వీరశైవ, వీరవైష్ణవ మతాలకు చెందిన వారిలో కానవచ్చే అసహనం ఈ కమ్యూనిస్టులలో కానవస్తుంది. అట్టి అసహనంలో, అది రేకెత్తించే విద్వేషంలో ఏయే దోషాలున్నాయో అవన్నీ కమ్యూనిజంలోనూ ఉన్నాయి. కమ్యూనిస్టులు ఏమి ప్రచారం చేసినా, సోషలిజం కేవలం మార్క్సిజానికి పరిమితం కాదు. సోషలిస్టు సమాజ స్థాపనకు వర్గకలహ మొక్కటే మార్గమూ కాదు. ఇక, నాటకాలు, బూటకాలు, అబద్ధాలు, మోసాలు, గులాములు, తొత్తులు మొదలైన దూషణ తిరస్కార ప్రయోగాలను ఎవ్వరూ పాటించనక్కరలేదు. ఆ భాషలో తప్ప ప్రసంగించడం కమ్యూనిస్టులకు చేతకాని పని. (ఆంధ్రప్రభ 29-1-1953)

సోషలిజం నిర్వచనం

(కాంగ్రెసు పార్టీ సోషలిజం వైపు మొగ్గు చూపనపుడు సోషలిజాన్ని అవగాహన చేసుకోవాలని కాంగ్రెసు పెద్దలకు హితబోధ.)

ఎనిమిదేళ్లనాడే - ఆవడిలో శ్రీ యు.ఎన్. ధేబర్ అధ్యక్షతన 1955లో జరిగిన 60వ కాంగ్రెసు మహాసభలోనే - సోషలిజం ప్రాతిపదికగాగల నవసమాజ నిర్మాణం కాంగ్రెసు లక్ష్యంగా తీర్మానం జరిగింది. అయినా, ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఎ.ఐ.సి.సి. జయపూర్ సమావేశంలో సోషలిజం నిర్వచనకై తర్జనభర్జనలు జరగడమా? దీని తాత్పర్యం - సోషలిజం అంటే ఏమిటో స్పష్టంగా తెలియకుండానే, లేదా తేల్చుకొనకుండానే కేవల మొక నినాదంగా కాంగ్రెసు దాన్ని కడచిన ఎనిమిదేళ్లలో వినియోగిస్తూ వచ్చిందని కాదా? ఎవరైనా ఈ విధంగా కాంగ్రెసును విమర్శించవచ్చు; నిజానికి ఈ పనిని కొన్ని పత్రికలు చేయకపోలేదుకూడా!

ఎవరికైనా చాలా కాని, సోషలిజాన్ని నిర్వచించడం ఒక్క కాంగ్రెసు నాయకులకే కాదు. కష్టమైన పని. లోకంలో ఎన్ని భిన్నమతాలు, మతవర్గాలు కలవో, అన్ని సోషలిస్టు భావాలు, భావభేదాలు ఉన్నాయనడం అత్యుక్తి కాదు. క్రిస్టియన్ సోషలిజం, గిల్డ్ సోషలిజం, ఫేబియన్ సోషలిజం, డెమొక్రాటిక్ సోషలిజం, నేషనల్ సోషలిజం, సైంటిఫిక్ సోషలిజం - ఈ విధంగా వీటికి అంతుపొంతులు లేవు. యాభై, అరవై సంవత్సరాలనాడు ఒక బ్రిటిష్ లిబరల్ నాయకుడు వెటకారంగా "ఇప్పుడు మనమందరం సోషలిస్టులమే!" అన్నాడట. నాడు ఆయన వెటకారంగా పలికిన పలుకు ఈనాడు అక్షరాలా నిజం. తరతమభేదాలతో ఈనాడు సోషలిస్టులు కానివారు లేరనే

చెప్పవచ్చు. చివరికి ఫాసిస్ట్ నియంతలుకూడా తాము స్థాపించిన నిరంకుశ వ్యవస్థలపై "నేషనల్ సోషలిజం" ముద్ర వేయవలసి వచ్చింది.

తక్కినవారు ప్రతిపాదించేది అవకతవక సోషలిజం కాగా, తాము లక్షిస్తున్నది మాత్రమే శాస్త్రీయమైనదని కమ్యూనిస్టులు ఉద్ఘాటిస్తారు. దానికి వారి పేరు "మార్క్సిజం", లేదా, "సైంటిఫిక్ సోషలిజం". అయితే వారు శాస్త్రబద్ధమైనదిగా చెప్పుకొనే సోషలిజం విషయమై కూడా కమ్యూనిస్టు నాయకులమధ్య ఏకాభిప్రాయం కానరాదు. ఇందుకు తార్కాణానికై స్టాలిన్, ట్రాట్స్కీలవరకు వెళ్లనక్కరలేదు; కృశ్చేవ్, మావోలమధ్య ప్రస్తుతం చెలరేగుతున్న తీవ్ర వాద, ప్రతివాదాలను పేర్కొంటే సరిపోతుంది. కెమిస్ట్రీ, ఫిజిక్స్ మొదలైన శాస్త్రాలవలె సోషలిజం ఒక శాస్త్రం కానేరదని, దీని విషయంలో స్థిరమైన, శాశ్వతమైన సూత్రాలు ఉండడానికి వీలులేదని కృశ్చేవ్, మావోలు కొనసాగిస్తున్న చర్చలు మరొకసారి రుజువు చేస్తున్నాయి.

వైజ్ఞానిక శాస్త్రాలవలె సోషలిజం ఒక శాస్త్రం కానందున ప్రతి దేశం, ప్రతి జాతి, ప్రతి పార్టీ దాన్ని తనకు తానుగా నిర్వచనం చేసుకోవాలి. ఏ నిర్వచనమైనా మార్పులకు వీలులేకుండా ఒకేసారి జరగరాదు. పరిస్థితుల పరిణామాలను బట్టి, ఆ పరిణామాలద్వారా సిద్ధించిన అనుభవాలనుబట్టి ఎప్పటి కప్పుడు కొత్త నిర్వచనాన్ని చేసుకోవాలి. ఏ ఘట్టంలో జరిగిన నిర్వచనమైనా చేర్పులకు, మార్పులకు అవకాశం మిగల్చాలి. అంతమాత్రంచేత నిర్వచనాన్ని పూర్తిగా అస్పష్టంగా సందిగ్ధంగా మిగల్చరాదు కూడా. అంతే చేస్తే ఎంతో చెరుపు కలుగుతుంది. మానవ స్వాతంత్ర్యాన్ని, సమతను, సాంఘిక న్యాయాన్ని లక్షిస్తున్న మహనీయులను చిరకాలంగా స్పష్టంగానో, అస్పష్టంగానో, స్పష్టాస్పష్టంగానో ఉత్తేజపరుస్తున్నా, ఒక రాజకీయ, సాంఘిక వ్యవస్థగా సోషలిజం ప్రపంచానికి చాలా కొత్త. "మార్క్సిజం" రూపంలో అది కమ్యూనిస్టు దేశాలలో అమలులో ఉన్నా, దేశానికి దేశానికి మధ్య దానిలో చిన్న పెద్ద వ్యత్యాసాలు అనేకం కానవస్తున్నాయి. కమ్యూనిస్టు ప్రపంచంలో ఈనాడు కృశ్చేవ్ కమ్యూనిజం, మావో కమ్యూనిజం, టిటో కమ్యూనిజం, గోముల్కా కమ్యూనిజం, కాస్ట్రో కమ్యూనిజం - స్థూలంగా ఇన్ని విభేదాలు కానవస్తున్నాయి. కాగా, నాన్ కమ్యూనిస్టు రాజ్యాలలో సోషలిజం తమ లక్ష్యంగా పెట్టుకొన్నవాటిలో ఇంతకంటే తక్కువ విభేదాలు లేవనే చెప్పాలి.

సోషలిజం, నెహ్రూ సోషలిజం ఒక్కటే అనగలమా? సిరిమావో సోషలిజం, నెవిన్ సోషలిజం ఒక్కటే అనగలమా?

సోషలిజం విషయమై ప్రపంచం మొత్తంపైనే భావాలు త్వరితగతిని పరివర్తన చెందుతున్నాయి. పందొమ్మిదవ శతాబ్దం మధ్యభాగంలో మార్క్స్ ప్రతిపాదించిన సోషలిస్టు భావాలు ఇరవయ్యో శతాబ్ది ప్రథమపాదంనాటికే పాతగిలి పోయినట్లు సిద్ధాంతీకరిస్తున్న మేధావు లెందరో ఉన్నారు. మార్క్స్ భావాలు "స్టీమ్" యుగానికి చెందినవి కాగా, ఈ శతాబ్ది ప్రారంభానికి "ఆయిల్" యుగం స్థిరంగా నెలకొన్నది. "ఆయిల్" యుగాన్ని వెనుకకు నెట్టి, ఇప్పుడు "అణుయుగం" పాదం పెట్టింది. విప్లవాత్మకమైన ఈ పరివర్తనవల్ల, ఈ పురోగతి వల్ల దేశదేశాలలో సోషలిజానికి కొత్త నిర్వచనాన్ని చెప్పుకొనవలసి వస్తున్నది. బ్రిటిష్ లేబర్ పార్టీనే చూడండి. ప్రధాన పరిశ్రమలను జాతీయం చేయడమే అట్లీ దృష్టిలో సోషలిజం; గెయిట్స్కెల్ విశ్వాసం సయితం ఇందుకు అంతగా భిన్నమైంది కాదు. కాని, గెయిట్స్కెల్ నిర్యాణం తర్వాత లేబర్ పార్టీ నాయకుడుగా ఎన్నికైన హెరాల్డ్ విల్సన్ అణుయుగాన్ని, దాన్ని ప్రవేశపెట్టిన సాంకేతిక శాస్త్రపురోగతిని అంచనాలోకి తీసుకొననట్టిది సోషలిజం కానేరదని ఉద్ఘాటిస్తున్నాడు.

ఈ విషయాలన్నింటిని దృష్టిలో పెట్టుకొన్న పక్షంలో "ఆవడి కాంగ్రెసు పిమ్మట ఎనిమిదేళ్లకు సోషలిజం నిర్వచనకై ఈనాడు ప్రయత్నమా?" అనే వెక్కిరింత ఎంత అర్థరహితమైందో స్పష్టపడుతుంది. ఆవడి పిమ్మట ఎనిమిదేళ్ళ తర్వాతనే కాదు, ఎనిమిది ఎనిమిదేళ్ళ తర్వాతకూడా సోషలిజం నిర్వచనకై ప్రయత్నం జరగవలసిందే. సంఘానికి, జీవితానికి సంబంధించినట్టిది సోషలిజం.

అందువల్ల వాటివలె అదికూడా నిత్యం మార్పుచెందాలి, నిత్యం పెరుగుతూ ఉండాలి. ఇట్టి సహజపరిణామానికి దూరమైనప్పుడు, అది ఒక నిర్జీవ సిద్ధాంతమైపోయి, కాలికి గుదిబండగా, మెడకు ఉచ్చుగా పరిణమిస్తుంది.

జయపూర్ ఎ.ఐ.సి.సి. సమావేశంలో సోషలిజం స్వరూపంపై ఏ ఇద్దరు ముఖ్యనాయకులు ఏకీభవించలేకపోవడం అబ్బురపడవలసిన విషయం కాదు. సోషలిజం అంటేనే కప్పల తక్కెడ అని పెదవి విరవవలసిన విషయం సయితం కాదు; కడచిన ఎనిమిదేళ్ల అనుభవాన్ని, నేటి దేశపరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, మనం అనుసరించగోరుతున్న సోషలిజం స్వరూపాన్ని నిర్ణయించుకొనడానికి ప్రయత్నిస్తున్నామనే దాని తాత్పర్యం.

కమ్యూనిస్టు దేశాలవలె ప్రజాస్వామ్యానికి స్వస్తి చెప్పికాక, దాన్ని మన్నిస్తూనే, దాని ప్రాతిపదికపైనే సోషలిస్టు సమాజాన్ని స్థాపించాలని కాంగ్రెసు లక్షిస్తున్నది. అందువల్లనే దాన్ని 'డెమొక్రాటిక్ సోషలిజం" అంటున్నాము. వ్యక్తి స్వేచ్ఛపై విధి నిషేధాలు అంతగా పెట్టనిది ప్రజాస్వామ్యం; సమష్టి క్షేమానికై వ్యక్తి స్వేచ్ఛను అవసరమైనంతవరకు అరికట్టడం తప్పదనేది సోషలిజం. వీటిలోని ఈ పరస్పర వైరుధ్యాన్ని అధిగమించడం సాధ్యమా? ఇది నేడు పుట్టిన ప్రశ్న కాదు; మానవుడు సంఘజీవిగా రూపొందిననాడే ఈ ప్రశ్న పుట్టింది.

వ్యష్టికి, సమష్టికి మధ్య, స్వేచ్ఛకు, నియతికి (ఫ్రీడమ్ అండ్ కంట్రోల్) మధ్య అనివార్యమైన నిత్య సంఘర్షణలో ఒకటి మరొకదాన్ని కబళించకుండా కాపాడుకొనగలిగిన ఘట్టాలలోనే సంఘం పురోగతిని సాధించగలిగింది. అందువల్ల "డెమొక్రాటిక్ సోషలిజం" అనే సమాసంలో విశేషణానికి, నామవాచకానికి ఎంతమాత్రం పొత్తు కుదరదని అనుకోనక్కరలేదు.

అయితే "డెమొక్రాటిక్ సోషలిజం" అనేదాన్ని పూర్తిగా, జయప్రదంగా అమలుపరచిన దేశం ఈనాటికి ఒక్కటైనా లేదు. ఈ కృషిని ఒక మహాదేశంలో విస్తృతంగా ప్రారంభంచేసింది మనమే. అందువల్ల ఈ లక్ష్యసాధనలో మన పురోగతికి వలసిన మార్గాలను మనమే నిర్మించుకోవాలి. గ్రీక్ జాతికి తమ ఏథెన్సు నగరం ప్రజాస్వామ్య పద్ధతులకు శిక్షణాలయమని పెరిక్లిజ్ సగర్వంగా చెప్పుకొన్నాడు. గర్వానికి పోకుండా డెమొక్రాటిక్ సోషలిస్టు వ్యవస్థ విషయంలో ప్రపంచానికే ఒక శిక్షణాలయంగా మన దేశాన్ని మనం రూపొందించుకోవాలి. ఇది జరగడం కేవలం ప్రజానాయకులే కాక, ప్రజలు సయితం సోషలిజం, స్వరూప స్వభావాలను గురించి ఆలోచించినప్పుడే, అందుకు సంబంధించిన చర్చలలో పాల్గొన్నప్పుడే. ఏదో ఒక తీర్మానాన్ని త్వరపడి చేయక, సోషలిజం స్వరూప స్వభావాలను గురించి ఒక ప్రకటనను మాత్రం సిద్ధంచేసి, దాన్ని చర్చించవలసిందిగా ప్రజలను ఆహ్వానించడంలో ఏ.ఐ.సి.సి. జయపూర్ సమావేశం హర్షించదగు పద్ధతిని అనుసరించింది. నగరాలలోనే కాక, గ్రామాలలో కూడా, సభలలోనే కాక, కుటుంబాలలో కూడా ఈ చర్చ సాగాలని, మేము కోరుతున్నాము. సాగుతుందనీ నమ్ముతున్నాము.

(ఆంధ్రజ్యోతి 6-11-1963)

ఆత్మ పరిశీలన

(కాంగ్రెస్ పార్టీవారు ఆత్మపరిశీలన చేసుకోవాలని హెచ్చరిస్తూ)

కాంగ్రెసు జీవితంలో ఆత్మపరిశీలన చేసుకొన్న ఘట్టాలు, కాంగ్రెసు పుట్టిన దాదిగా, ముఖ్యంగా మహాత్ముడు కాంగ్రెసులో అడుగు పెట్టినదాదిగా అనేకం కలిగాయి. మహాత్ముని జీవితకాలంలో, ప్రతి ఒక్క ఘట్టం, మహాత్ముని ఉజ్జ్వల వైయక్తిక ఆత్మపరిశోధన కలాపంలో ముడిపడ్డ ప్రారబ్ధ విశేషం వల్లనూ, కాంగ్రెసు పరీక్షలో విజయవంతంగా బైలుపడుతూ వచ్చింది. ప్రభుత్వ అధికారమూ, కాంగ్రెసు పక్షమూ, ప్రజల దృష్టిలో, ఒకే ఒకటిగా కనిపించకపోవటం కూడా చాలామటుకు రక్షగా పనిచేసింది. ప్రభుత్వంలోని లోపాలన్నీ కాంగ్రెసుపక్ష లోపాలుగా, ప్రజా దృష్టిలో ఏకత్వం అందుకోక పోవటం, ఈనాటికన్నా ఆనాటి సువిశేషం.

కొన్నాళ్ళుగా కాంగ్రెస్ పార్లమెంటరీ పక్షం తీవ్ర ఆత్మ పరిశోధనలో నిమగ్నమైంది. ముఖ్యంగా ఈ సంవత్సరమే కాంగ్రెసు రాజకీయ అస్తిత్వంలో తీవ్రమైన కదలికలు తెచ్చే ఘట్టాలు, దేశం ఉత్తర దక్షిణాలలో తీవ్రంగానూ, ప్రాక్పశ్చిమతటాలలో, కొంత మధ్యమస్థాయిలోనూ ఏర్పడ్డాయి. ఎటువచ్చీ, ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ సంజీవ రెడ్డి సంతృప్తి వెలువరించినట్లు, దేశ మధ్యభాగమే, అధమం బాహ్యంగానైనా ప్రశాంతంగా ఉండగల్గింది.

"కాంగ్రెసు జీవితంలో పెద్దలు వేరుపడిపోయిన ఘట్టాలు అనేకం ఉన్నాయి. ప్రతి మాటూ కాంగ్రెస్ పటిష్టం అవుతూనే బైటపడిరాగలిగింది." అని ప్రధాని శ్రీ నెహ్రూ కాంగ్రెస్ పరిస్థితిపై ఆత్మ విశ్వాసం వెల్లడించారు. కాంగ్రెస్ పైవర్గాల విభేదాలపట్ల కన్నా, అట్టడుగున ఉన్న స్వచ్ఛంద సభ్యత్వ దళంపై విశ్వాసమే ఆయననీ నమ్మకానికి పురికొల్పిందని ఆయన వాక్యాలే స్పష్టమొనర్చాయి.

ఈ చర్చలోనే కాంగ్రెసు పావులా సభ్యత్వాన్ని రద్దుచేసి స్వేచ్ఛగా సభ్యులను చేర్చుకొనాలని ఒకరు చేసిన సూచన, ఆయాచితంగా కాంగ్రెసులో పెరిగిన ఒక కాంగ్రెసు సిద్ధాంత ఆదర్శ వ్యతిరేక సూక్ష్మాంశాన్ని గుర్తుకు తెస్తోంది.

పావులా సభ్యత్వం, కాంగ్రెసు అవలంబింపవలసిన ఆర్థిక నీతికి, మహాత్ముడు ప్రతిష్ఠించిన ఒక మూలస్తంభమనీ, ఆధునిక ప్రపంచంలో, ఆర్థిక తత్వంవల్ల రాజకీయ పక్షాలకు పట్టే ఒక సమాజ ఛిద్ర పరిణామానికి, దోవతీయకుండా మహాత్ముడు నియంత్రించిన రక్ష అనీ, స్ఫురణకు రాక తప్పదు.

ధనంతోనే స్వరాజ్యం వచ్చేటట్లయితే, ఏనాడో తేలికగా సాధించగలిగే వాడిననీ ప్రతి వ్యక్తీ భారత స్వాతంత్ర్యంలో రుజువైన భాగస్వామిగా ఉండాలంటే, దీక్షకూ, త్యాగానికీ, ఈ పావులా రుజువైన చిహ్నం కాగలదనీ, మహాత్ముడానాడు వెలువరించాడు. అంటే, ఆ రూపంలో సేకరితమైన ధనమే రుజువైన కాంగ్రెసు మూలధనంగానూ అంతకు పైగా సేకరించగల్గిన అపార ధనరాసులన్నీ ఉద్యమ నిర్వహణకైన పైపై ధనంగానూ ఆనాడు భావింపబడ్డాయి. పావులా సభ్యత్వం ఈ ఆదర్శాన్ని నిత్యం జ్ఞప్తికి తేగల చిహ్నం.

“రాజకీయ పక్షానికి వెన్నుదన్ని ఉన్న ధనిక వర్గాలేవో పరిశీలించు. ఆ పక్షం ప్రవచించే ఆదర్శాలు, ఆచరణలో ఎలా మార్తాయో ఇట్టే సూచితమౌతుంది” అని అమెరికన్ రచయిత అప్టన్ సింక్లేర్ అన్నాడు. ఈ సూత్రానికి గురి కాకుండా, స్వాతంత్ర్య సమరదీక్ష కాంగ్రెసు నానాడు రక్షించింది. ఈనాడు ప్రధాని నెహ్రూ మరల అటు దృష్టి మరలిస్తేనే, ఆయన కోరుకొన్న పటిష్ఠత ఏర్పడి ఆత్మ విశ్వాసంతో కాంగ్రెస్ ముందుకు సాగగల్గుతుందని ఆశించవచ్చును. (ఆంధ్రప్రభ 16-8-1959)

యువజన కాంగ్రెస్

(యువకులలో సేవా ధర్మం ఉండాలని ప్రబోధిస్తూ)

కాంగ్రెసు సంస్థకు భవిష్యత్తు ఉన్నదా? లేదా? ఈ ప్రశ్నకు "లేదు" అని సమాధానం చెప్పేవారు తమ జవాబును సమర్థించుకొనడానికి సర్వ సాధారణంగా చెప్పే కారణా లివి:

1 కాంగ్రెసులో వర్గాలు ప్రబలినవి.

2 కాంగ్రెసులో కులతత్వం ప్రాధాన్యం వహిస్తున్నది.

3 కాంగ్రెసుకు ప్రజా బాహుళ్యంతో సన్నిహిత సంబంధం అంతకంతకు తగ్గిపోతున్నది.

4 ఎన్నికల సమయంలో తప్ప కాంగ్రెసు చురుకుగా పని చెయ్యడం లేదు.

ఈ విధంగా చెప్పబడే కారణాలలో నిజం ఉన్నా పూర్తిగా కాకపోయినా, వీటిలో కొంత వరకు నిజం లేకపోలేదు - కాంగ్రెసుతో దేశానికి ఇంకా అవసరం కలదని, అది చేసిన ప్రజా సేవకంటె చేయవలసిందే మరెంతో కలదని విశ్వసించే వారిని ఇవి అంతగా కలత పెట్టనక్కరలేదు. ఈ లోపాలన్నీ ఆత్మ పరీక్షవల్ల, లక్ష్యశుద్ధివల్ల, క్రమశిక్షణ వల్ల ఏమంత కష్టం లేకుండా తొలగించుకోడానికి వీలైనట్టివే. పోతే, కాంగ్రెసు సంస్థకు చెందిన వారేమి, దానిపట్ల భక్తివిశ్వాసాలున్న ఇతరు లేమి నిజంగా ఆందోళన చెందవలసిన విషయం యువకులైనవారు - రేపు దేశానికి నాయకులు కావలసిన కొత్త తరంవారు - కాంగ్రెసుకు మొత్తంపై దూరంగా నిలవడమే!

కాంగ్రెసులో ఈనాడు యువకులు లేనే లేరని మా తాత్పర్యం కాదు. కాని, తక్కిన పార్టీలు ఆకర్షిస్తున్నంత హెచ్చుగా యువకులను కాంగ్రెసు ప్రస్తుతం ఆకర్షించలేకపోతున్నది. వేర్వేరు పార్టీల సభ్యుల పట్టికలను ఒకసారి పరిశీలిస్తే, మొత్తం సంఖ్యలో యువకుల నిష్పత్తి కాంగ్రెసు సంస్థ విషయంలోనే చాలా తక్కువన్న సంగతి స్పష్టపడుతుంది. ఈ శోచనీయ పరిస్థితికి కారణమేమిటి? కాలానుగుణంగా కాంగ్రెసు తన లక్ష్యాలను విస్తరించుకొనడం లేదని అనడానికి వీలులేదు. రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించిన పిమ్మట అంతకంటే విస్తృతమైన, విశిష్టమైన మరొక లక్ష్యాన్ని అది పెట్టుకున్నది. సోషలిస్టు సామాజిక వ్యవస్థను సంస్థాపించడమే ఆ నవలక్ష్యం. కులమత విభేదాలకు స్థానమివ్వనిది ఆ వ్యవస్థ. వర్గ ప్రయోజనాలకు స్వస్తి చెప్పి, ప్రజా బాహుళ్యం సంక్షేమాన్ని సాధించగలిగేది ఆ వ్యవస్థ. మానవునికి, మానవునికి మధ్య కృత్రిమ విభేదాలన్నింటినీ తొలగించ గలిగేది ఆ వ్యవస్థ. ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా జీవిస్తూ, పరిపూర్ణ వికాసాన్ని పొందడానికి సమస్తావకాశాలను కల్పించ గలిగేది ఆ వ్యస్థ. అట్టి మహత్తర సామాజిక వ్యవస్థ సంస్థాపనను లక్ష్యంగా పెట్టు కొన్నప్పటికీ, యువజనులను ఇదివరలోవలె కాంగ్రెసు విశేషంగా ఆకర్షించలేకపోవడం ఎందువల్ల?

కాంగ్రెసు నూతన లక్ష్యాన్ని యువజనులకు సరిగా వివరించి చెప్పకపోవడం తప్ప ఇందుకు మరొక ప్రధాన కారణం కనబడదు. కాంగ్రెసు లక్ష్యం ఉన్నతమైంది కాబట్టి, తాము ప్రత్యేకించి యువజనుల మధ్యకు వెళ్లకపోయినా, అదే వారిని ఆకర్షించగలదని కాంగ్రెసు నాయకులు భావిస్తుంటే, అంతకంటే పొరపాటు ఉండబోదు. జాతీయ స్వాతంత్ర్య సాధన లక్ష్యం ఉన్నతమైందే.

అంతమాత్రంచేత యువజనుల మధ్యకు వెళ్ళకుండా, వారి సభలను, సమావేశాలను జరిపించకుండా, వారికి కర్తవ్య బోధను చేయకుండా, తమంతట తాముగా వారు కాంగ్రెసు సత్యాగ్రహ సమరాలలోకి వేలాదిగా దూకినారా?

రాజకీయ స్వాతంత్ర్యాన్ని ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలకు విస్తరింప జేయాలన్న కాంగ్రెసు నవలక్ష్యాన్ని గురించి పూర్వపు పట్టుదలతో ఇప్పుడు తిరిగి ప్రచారాన్ని కొనసాగిస్తే, తిరిగి కాంగ్రెసు సంస్థలో యువజనులు విశేషంగా చేరకనూ పోరు; కాంగ్రెసు భవిష్యత్తును పదిలపరచకనూ పోరు.

ఆలస్యంగానైనా ఇట్టి ప్రచారం ప్రారంభంకావడం ముదావహం. యువజనుల మధ్యకు కాంగ్రెసు తిరిగి వెదుతున్న దనడానికి యువజన కాంగ్రెసు సంస్థాపనే నిదర్శనం. నిరుడు ఈ యువజన కాంగ్రెసు వార్షిక మహాసభ హైదరాబాద్లో జరగగా, ఈ సంవత్సరం లక్నోలో జరుగుతున్నది. నిరుడు ఈ మహాసభలో కాంగ్రెసు అగ్రనాయకులలో ఒక్క శ్రీ దేబర్ మాత్రం పాల్గొనగా, ఈ సంవత్సరం శ్రీ దేబర్ తోపాటు పండిట్ నెహ్రూ కూడా పాల్గొంటున్నారు. ఇది కాంగ్రెసు సంస్థ భవిష్యత్తు దృష్టి నుంచి మాత్రమే కాక, దేశక్షేమం దృష్టి నుంచి కూడా ఎంతో శుభ పరిణామం. లక్నో మహాసభలో పాల్గొంటున్న వేలాది యువకులు గ్రామ గ్రామానికి కాంగ్రెసు నవ సందేశాన్ని తీసుకు వెళ్ల గలరనీ, సోషలిస్టు సామాజిక వ్యవస్థను స్థాపించడానికి కాంగ్రెసు కొనసాగిస్తున్న కృషిని జయప్రదం చేయడానికి తోడ్పడగలరనీ ఆశిస్తున్నాము. నిజానికి ఈ కృషిలో యువకుల తోడ్పాటు మాత్రమే చాలదు! దీనికి వారే నాయకత్వం వహించాలి. ఈ నవసమాజ నిర్మాణం వారికోసం. దీనికి రూపురేఖలను దిద్దుకొనడంలో ప్రధాన బాధ్యత వారిదే. అందువల్లనే పండిట్ నెహ్రూ "నేను మీకు ఒక గొప్ప బహుమానమిస్తున్నాను. ఈనాటి భారతదేశమే ఆ బహుమానం. దాన్ని తీసుకోండి. మీ అభిమతానుసారం దాన్ని రూపొందించండి" అని చెప్పాడు. "రేపు" తమదే అయిన యువకులు రేపటి భారత వర్షానికి నాయకత్వం వహించడానికి అర్హతలను సేవాధర్మం ద్వారా ఈనాటి నుంచీ సంపాదించుకోగలరని ఆశిస్తున్నాము. (ఆంధ్రప్రభ 29-11-1957)

స్వామీజీ దీక్ష

పెద్ద వయస్సు; వెనక చేసిన దీర్ఘోపవాసాల వల్ల శరీరం శుష్కించి వున్నది. అయినా, సంకోచించక తాము నమ్మిన ఒక లక్ష్యానికి భిన్నం జరగరాదన్న పట్టుదలతో స్వామి సీతారాం ప్రాయోపవేశ నిర్ణయం చేశారు. దీక్షాప్రవేశం చేసిన అయిదారు రోజులకే స్వామీజీకి వికారం, ఎక్కిళ్ళు వగైరా ప్రారంభమైనాయి. నిన్నటికి-నిరశనవ్రతంలో ఎనిమిదవ నాటికి పక్షవాతం కనబడినట్టు, అపస్మారకంలో స్వామీజీ పడిపోయినట్టు వార్తచేరింది. దీన్ని విని ఆంధ్రదేశం సహజంగా కలత పడుతున్నది.

ఈ ప్రాయోపవేశం ప్రారంభం కాకముందే రెండు, మూడుసార్లు స్వామీజీకి మేము సవినయంగా విజ్ఞప్తి చేసినట్టు, ప్రభుత్వ విధానాల నిర్ణయానికి ప్రాయోపవేశం ఒక సాధనం కారాదు. ప్రజాభిప్రాయం ప్రకారం ప్రభుత్వ విధానాలను నిర్ణయించి, ప్రజానురంజకంగా పరిపాలన కొనసాగించడానికే ప్రజాస్వామ్యంలో మనం ప్రజాప్రతినిధులను ఎన్నుకొంటాము. ఇందుకు భిన్నంగా మన ప్రతినిధులు సంచరిస్తే, వారినీ, వారి ప్రభుత్వాన్నీ కొత్త ఎన్నికల సందర్భంలో మనం త్రోసివేస్తాము. బహుళ జనాభిప్రాయం ప్రకారం- తమను పరిపాలకుల స్థానంలో కూర్చోబెట్టిన బహుళ ప్రజాభిప్రాయం ప్రకారం- ప్రజా ప్రతినిధులైనవారు వ్యవహరించాలి. ఇందుకు భిన్నంగా వ్యవహరించాలని ప్రాయోపవేశాలద్వారా వారిపై వొత్తిడి తీసుకురావడం వారిని ప్రజాస్వామ్య ధర్మచ్యుతులను చేయడం తప్ప వేరుకాదు.

పైగా, ఇంచుమించు సర్వామోదకరమైన విషయంలో తప్ప ప్రాయోపవేశాన్ని పోలిన తీవ్ర చర్య కూడదు. ఏదైనా ఒక విషయం మంచి చెడ్డలను గురించి, దాని లాభనష్టాలను గురించి, ప్రజాభిప్రాయం సమానంగా విభాజితమై వున్నప్పుడు ఒకరు ఇలా జరగాలని ప్రాయోపవేశం ప్రారంభిస్తే, మరొకరు అలా జరగాలని అట్టి పనే చేయవచ్చుగదా? ఈ పరిస్థితిలో ప్రభుత్వం ఎటు మొగ్గు చూపాలి? ఎవరిని కాపాడుకోడానికి చూడాలి?

మరొక విషయం: హృదయ పరివర్తనద్వారా లక్ష్య సాధనే ప్రాయోపవేశాన్ని పోలిన కఠోర దీక్షలకు ప్రాతిపదిక కావాలి. లేక పోతే, అట్టి దీక్షలకు నైతిక బలమే వుండదు. మద్యనిషేధానికి సంబంధించినంత వరకు నేటి ఆంధ్ర మంత్రి వర్గ సభ్యుల విషయంలో సాధించవలసిన హృదయ పరివర్తన కానరాదు. చెన్న రాష్ట్రం మొత్తం పై మద్యనిషేధాన్ని ప్రవేశ పెట్టిన ప్రకాశం పంతులుగారు ఆ మంత్రివర్గానికి నాయకులు, ఉమ్మడి రాష్ట్రంలో మద్యనిషేధ శాఖకు మంత్రిగా పనిచేసిన శ్రీ సంజీవరెడ్డి ఉపనాయకులు. తక్కిన వారిలో మరి ముగ్గురు "మద్యనిషేధం కొనసాగించవలసిందే" అని తీర్మానం చేసిన కాంగ్రెస్ సంస్థ ప్రతినిధులు. ఈ విధంగా దాదాపు వారందరు మద్యనిషేధానికి అనుకూలురైనప్పుడు, ఇక వీరిలో సాధించవలసిన హృదయ పరివర్తన ఏమీ లేదుగదా? వీరేకాదు; ఇతర ప్రజానాయకులు కూడా, ప్రజాభిప్రాయాన్ని వ్యక్తీకరించగల ఇతరులుకూడా, మద్యనిషేధ లక్ష్యాన్నే కాదనడం లేదు. మద్యనిషేధ విధానం ఆచరణలో విఫలమై పోయినట్టు స్పష్టపడిపోయిన వెనక, దాన్ని జయప్రదంగా చేయడానికి కఠినతర శిక్షలు తప్ప, వేరొక సూచన జరగని పరిస్థితిలో, కఠినతర శిక్షలవల్లనైనా, విధానం జయప్రదం కాగలదన్న నమ్మకం కొరవడినప్పుడు, విధానాన్ని అమలు పరుస్తున్నామనే నటన తగునా, అనేదే ఇప్పుడు అందరినీ ఎదుర్కొంటున్న ధర్మసందేహం.

అసలింతకూ మద్యపాననిషేధం తొలగించాలన్న నిర్ణయాన్ని ఆంధ్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేయనేలేదు. రామమూర్తి కమిటీ వారైనా, మద్యనిషేధ లక్ష్యాన్ని ఖండించలేదు; దాన్నే అంతిమ లక్ష్యంగా పెట్టుకొని; ఈ లోపున మద్యపానాన్ని నిషేధం అనే తెరమరుగున మరింతగా పెచ్చుపెరిగి పోతున్న మద్యపానాన్ని కంట్రోల్ చెయ్యటానికి కొన్ని సవరణలను మాత్రమే వారు సూచించారు. ఆ సూచనల్నే ఇంకా ప్రభుత్వం పరిశీలనైనా తగదనడం స్వామీజీ ఉద్దేశం కానేరదు. తాము నియమించిన ఒక విచారణసంఘం సూచనలను పరిశీలించనైనా పరిశీలించక పోతే, ఆ సంఘంపట్ల, ప్రజల పట్ల అంతకంటే ప్రభుత్వం చేయగల అపచారం వుండబోదని స్వామీజీకి నిశ్చయంగా తెలుసు.

ఈ విధంగా ఏ దృష్టినుంచి చూచినా, స్వామీజీ ప్రారంభించిన కఠోరదీక్ష, మద్యపాన దుర్వ్యసనంపట్ల ఆయన విద్వేష తీవ్రతనే తెలుపుతున్నది కాని, ఆ దీక్ష అవసరాన్ని తెలపడంలేదు. కాబట్టి ఆయనకు మా ప్రార్థన! తమ దీక్షను విరమించవలసిందని, మద్యనిషేధం జయప్రదం కావాలంటే స్వామీజీని పోలిన ప్రముఖ నిర్మాణ కార్యకర్తల సేవ ఆంధ్రదేశానికి కావాలి. ప్రభుత్వం ప్రాతికూల్యంవల్ల మద్యనిషేధం విఫలం కావడంలేదు; ప్రజల ఔదాసీన్యం వల్లనే. అందువల్ల ప్రజలలో తీవ్రప్రచారం చేయగల పెద్దలు కావాలి. అట్టివారే కరవై పోతే, మద్యనిషేధం అమలుకే నిర్ణయం జరిగినా, అది ఇప్పటి వలె ఒక నాటకమో, బూటకమో కాగలదు. కాబట్టి, తమ లక్ష్య పరిపూర్తిని కోరే స్వామీజీ ఆత్మార్పణ చేయడంకంటె శతాయువులై వర్ధిల్లడం ముఖ్యావసరం.

(ఆంధ్రప్రభ 14-3-1954)

స్థానిక స్వపరిపాలన

ఇండియాలో స్థానిక స్వపరిపాలన ప్రారంభమై దశాబ్దాలు గడిచినప్పటికీ స్వపరిపాలనా సంస్థలు తగినంత అభివృద్ధిచెందినవని గానీ, ప్రజలకు వాటివల్ల కలగవలసినంత ప్రయోజనం కలిగినట్టుగాగాని చెప్పవీలులేదు.

ఇంగ్లండు, అమెరికా మొదలైన పాశ్చాత్య దేశాలతో పోల్చిచూచేట్టయితే ఇండియాలో స్థానిక సంస్థలు ఇంకా ప్రాథమిక స్థితిలోనే ఉన్నవనీ, ప్రజలింతవరకు వాటి ప్రాముఖ్యతను గుర్తించలేకున్నారనీ స్పష్టం అవుతుంది.

నిన్నా మొన్నటివరకు ఇండియా పరప్రభుత్వం కింద ఉండడం ఇందు కొక కారణం కావచ్చు. విదేశ పాలకులు నామమాత్రాధికారం ఈ సంస్థలను నెలకొల్పి ప్రజల కండ్ల నీళ్ళు తుడవడానికి ప్రయత్నించారని చెప్పినా చెప్పవచ్చు.

పరిమితమైన అధికారాలు, అవకాశాలు కలిగినప్పటికి కూడా, కూడినంతలోనైనా మన దేశంలో స్థానిక స్వపరిపాలన సౌష్టవంగా గాని, తృప్తికరంగాగాని కొనసాగలేదు.

రాజేంద్రప్రసాద్, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, చిత్తరంజన్ దాస్, సుభాష్ చంద్రబోస్ మొదలైన మహానాయకులు, దేశ భక్తులు కొందరు స్థానిక పురపాలక సంస్థలతో ప్రత్యక్ష సంబంధం కలగజేసుకొని నిస్వార్థమైన సేవలను చేసిన విషయం మేము విస్మరించడం లేదు.

కాని, ఆదర్శప్రాయులైన ఇలాంటి వ్యక్తులనుగాని, వారి ఉదాహరణలనుగాని వేళ్ళమీద మాత్రమే లెక్కించవచ్చు. అసంఖ్యాకమైన చిన్న పెద్ద స్వపరిపాలనా సంస్థలనూ, దేశం మొత్తం మీద వాటి నిర్వహణకు మాత్రమే పాటుబడవలసిన స్థానిక సంస్థలు పార్టీ రాజకీయాలకు, ముఠాతత్వాలకు రంగస్థలాలుగా మారినవి. రానురాను ఈ సంస్థల ప్రధానోద్దేశమే మృగ్యమౌతూ వచ్చింది. చివరకు, పదవీ వ్యామోహం కలవారికీ, స్వప్రయోజన పరులకే తప్ప స్వార్థరహితమైన.

ప్రజాసేవ చేయదలచిన వారికి ఈ సంస్థలలో తావులేదేమోనని ప్రజలు సంశయించే స్థితికూడా దాపురించింది.

పరిపాలన స్థానిక స్వపరిపాలనా సిద్ధాంతం సర్వవిధాలా మహోత్కృష్ట మనడానికి సందేహం లేదు. స్థానిక సంస్థలు దేశ స్వపరిపాలనకు మూలస్థంభాలనడంకూడా అతిశయోక్తి కాదు. అంతరించడంతో స్థానిక స్వపరిపాలన సమగ్రంగా వికసించడానికి గల అంతరాయం తొలగిపోయిందని కూడా అంగీకరించవచ్చు.

కాని, స్థానిక పురపాలక సంస్థలలో ప్రవేశించేవారికి స్వార్థరహితమైన ప్రజాసేవ లక్ష్యమైతేనే తప్ప ఈ సంస్థలవల్ల ప్రజలకు ఉపకారం కలగబోదు.

తన నిర్యాణానికి రెండు రోజుల ముందు ఢిల్లీలో సమావేశమైన అఖిలభారత స్థానిక సంస్థల మహాసభకు సర్దార్ వల్లభాయ్ పటేల్ అంపిన సందేశం ఈ నీతినే ప్రబోధిస్తున్నది. అహమదాబాదు కార్పొరేషనుకు అధ్యక్షుడుగా ఉండి ఏ లక్ష్యంతో తాను తన విధులను

నిర్వర్తించిందీ, అందువల్ల అనుదినం తన కెంత ఆనందం చేకూరిందీ అందులో పేర్కొన్నారు. స్థానిక సంస్థలలో పాల్గొనేవారిలో అలాంటి ఉదారాశయులు కొందరున్నప్పటికీ ఆ సంస్థలు పునీతం కాగలవు.

స్థానికసంస్థలు సక్రమంగా అభివృద్ధిచెందడానికి ధనాభావం, తగిన అధికారంలేని లోపం, ప్రభుత్వంవారి అనవసరజోక్యం ఈ మొదలైనవి కొన్ని ప్రధాన అంతరాయాలు. స్థానిక స్వపరిపాలన శ్రేయస్కరమని గుర్తించిన పిమ్మట స్థానిక సంస్థల పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపడం ఎంత మాత్రం సమంజసం కాదు. స్థానికమైన కొంత ఆదాయాన్ని స్థానిక సంస్థలకు వదలడం వల్లా, ప్రజోపయోగకరమైన కార్య విధానాలకు విరాళాలను, ఋణాలను అధికంగా ఇవ్వడంవల్లా ప్రభుత్వం స్థానిక పరిపాలనను ప్రోత్సహించవచ్చు.

అంతేకాదు; కేవలం పరిపాలన స్థంభించిపోవడమో, దుస్సహమైన ఇతర పరిస్థితు లేర్పడడమో ఇలాంటి కారణాలేవైనా ఉంటేనే తప్పచీటికి మాటికి స్థానిక సంఘాల జోలికి పోవడంగాని, వాటి స్వాతంత్ర్యాన్ని అణచివేయడంగాని కూడని పని. ఇందువల్ల ఆత్మగౌరవం కలవా రెవ్వరూ ఆ సంస్థలలో అడుగు పెట్టడానికి సంశయిస్తారు. సేవాభిలాష కలిగి, నిజంగా సమర్థులైన వారి ఉత్సాహం కుంగిపోతుంది.

విద్య, ఆహారం, ఆరోగ్యం గృహ నిర్మాణం ఈ మొదలైన అనేక సమస్యలలో స్థానిక సంస్థలు నిర్వర్తించదగిన విధులు, సేవావకాశాలు అనంతరంగా ఉన్నవి. సమర్థులైనవారికి పరిపాలనానుభవాన్ని, వ్యవహార పరిజ్ఞానాన్ని చేకూర్చేటందుకు అవి అమూల్యమైన ఉపకరణాలుగా ఉపకరించుతవి. వాటిని సద్వినియోగం చేసుకొని ప్రజాభ్యుదయానికి సాయపడవలసిన భారం ప్రజలమీదా, ప్రభుత్వం మీదా సమంగా ఉంది. (ఆంధ్రప్రభ 20-12-1950)

విషవృక్షం

ద్రవిడ మున్నేట్ర కజగం దుస్సహ విధానాలను ఎందుకు అనుసరిస్తున్నదని ఆశ్చర్యపడనక్కరలేదు. దాని లక్ష్యాలు దుష్టమైనవి. దుష్ట లక్ష్యాలను పెట్టుకొన్నప్పుడు దుస్సహ విధానాలను అనుసరించడం సహజంగానే జరుగుతుంది.

మతం ప్రాతిపదికగా మిస్టర్ జిన్నా ఒకసారి దేశాన్ని చీలదీయగలిగాడు. జాతి ప్రాతిపదికగా మరొకసారి దేశాన్ని చీలదీయడం కోసం ద్రవిడ మున్నేట్ర కజగం ఇప్పుడు ప్రయత్నిస్తున్నది. వింధ్యకు ఉత్తరదిశలో నున్నవారందరు ఆర్యజాతివారని, దక్షిణదిశలో గలవా రందరు ద్రవిడజాతివారని దీని వాదం. క్రీస్తుకు పూర్వం, బుద్ధునికి పూర్వం ఇది కొంతవరకు నిజమైనా, ఈనాడున్నది ఒకే ఒక జాతి, అది భారతజాతి. ఆర్య, ద్రవిడ, కిరాతాది విభిన్న జాతుల పునాదిపై ఈనాడు రాజకీయ పక్షాలను నిర్మించడమేమి, ఆ జాతుల ప్రాతిపదికపై స్వతంత్ర రాజ్యాల నిర్మాణానికై ఆందోళన చేయడమేమి మూర్ఖత్వమే కాగలదు.

తక్కినవారు ఏ మాత్రం దూరదృష్టిని చూపినా, విజ్ఞతా పూర్వకంగా వ్యవహరించినా, పుబ్బలో పుట్టి మఖలో మాడినట్టుగా ద్రవిడ మున్నేట్ర కజగం ఈ సరికి అంతరించి పోయేదే! కాని, కె.యం. మున్షీ, సేర్ గోవింద్ దాస్, సి. రాజగోపాలాచారిగార్లను పోలినవారు ఈ సంస్థకు జీవం పోస్తున్నారు; ఇది విజృంభించడానికి తోడ్పడుతున్నారు. శ్రీ మునీనే చూడండి. మొత్తం భారతీయ చరిత్రకే

"ఆర్యనైజేషన్ ఆఫ్ ఇండియా" అని ఆయన వక్రభాష్యాన్ని చెబుతున్నాడు. ఈయన కంటె ఘనుడు సేఠ్ గోవిందాస్. హిందీని వెంటనే అధికార భాషగా ప్రవేశపెట్టవలెనన్న తాపత్రయంలో నాన్-హిందీ రాష్ట్రా లన్నింటిలో ఎంతగా అసంతృప్తిని తాము రేకెత్తిస్తున్నదీ ఈయన కానడం లేదు. పోతే, సి. రాజగోపాలాచారిగారు ఎలాగైనా సరే కాంగ్రెసును పడగొట్టవలెనన్న పట్టుదలకొద్దీ ద్రవిడ మున్నేట్ర కజగంతో మొన్నటి జనరల్ ఎన్నికల సందర్భంలో ఎన్నికల పొత్తుకై ప్రయత్నించడం వరకు వెళ్ళారు. ఈ ముగ్గురి పేర్లను మాత్రమే ఇక్కడ తీసుకురావడం ఈ సందర్భంలో వీరు మాత్రమే దోషులని చెప్పడం కోసం కాదు. ద్రవిడ మున్నేట్ర కజగాన్ని పోలిన సంస్థలు బలపడ్డానికి తోడ్పడుతున్న విభిన్నశక్తులలో ముఖ్యమైన కొన్నింటికి వీరు ప్రాతినిధ్యం వహిస్తున్నందునే ప్రత్యేకించి వీరిని పేర్కొనడం జరిగింది.

భారత ప్రభుత్వం కూడా ఈ విషయంలో కొంత బాధ్యతను పంచుకొనవలసి వుంటుంది. అభివృద్ధి కార్యకలాపాల విషయంలో దక్షిణ భారతాన్ని కొంత నిర్లక్ష్యం చేస్తున్నారన్న భావం ఇక్కడి ప్రజలలో ప్రబలుతున్నది. ఇందుకు ఒక ప్రత్యక్ష తార్కాణం, - ఆంధ్రప్రదేశ్లో బడ్జెట్టుపై జరుగుతున్న చర్చల సందర్భంలో పార్టీ విభేదాలు లేకుండా సభ్యులు చేస్తున్న విమర్శలే! కావాలని దక్షిణ భారతాన్ని నిర్లక్ష్యం చేయకపోవచ్చు గాని, పంచవర్ష ప్రణాళికల ఫలితంగా వింధ్య పర్వతాలకు ఉత్తర, దక్షిణ దిశలలో పారిశ్రామిక రంగానికి సంబంధించి నంతవరకున్న అంతరం మరింత పెరిగిందే తప్ప తగ్గలేదు. అందువల్ల కనీసం ఇకముందైనా ఈ విధమైన విమర్శకు అవకాశం రానీయకుండా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలను తీసుకోవాలి.

మద్రాసుకు ఇరుగు పొరుగు నున్న దక్షిణ రాష్ట్రాల ప్రజలు కూడా ద్రవిడ మున్నేట్ర కజగం బలపడ్డానికి కొంత తోడ్పడినారని చెప్పక తప్పదు. కజగం నాయకులు స్వతంత్ర రాజ్య ప్రతిపత్తిని కోరుతున్నది తమ మద్రాసు రాష్ట్రానికే కాదు; మొత్తం దక్షిణ భారతానికే, "మా పక్షాన మాట్లాడటానికి మీ రెవరు? మీ విపరీతపు కోర్కెను మేము హర్షించలేము సరిగదా, దాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తాము" అని ఆంధ్రప్రదేశ్, మైసూరు, కేరళ ప్రజలు కజగం నాయకులకు ఎన్నడో స్పష్టంగా చెప్పవలసింది. ఇక మీదటనైనా ఈ విషయంలో ఔదాసీన్యం తగదు.

కారణాలేవైనా, పురిటిలోనే సంధి కొట్టవలసిన ద్రవిడ మున్నేట్ర కజగం పెరిగి పెద్దదైంది. మొన్నటి జనరల్ ఎన్నికలలో సాధించగలిగిన విజయాల కారణంగా మద్రాసు అసెంబ్లీలో అది ప్రధాన ప్రతిపక్షం కాగలిగింది. మద్రాసు పురపాలక సంఘంలో తిష్ఠవేయ గలిగింది. కూడా. ఇక తనను పట్టపగ్గాలు లేవన్న ధీమాతోనే ధరలను అదుపులో పెట్టలేక పోతున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనలన్న పేరుతో నిన్న మొత్తం మద్రాసు రాష్ట్రంలో దౌర్జన్యాలకు అది దిగింది. ఈ దౌర్జన్యాలను అరికట్టడానికి అవసరమైన చర్యలను సమర్ధవంతంగా తీసుకున్న ప్రభుత్వాన్ని, విశేషించి, ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్ నాడార్ గారిని, మేము అభినందిస్తున్నాము. నిన్న జరిగిన 6500 అరెస్టులు పూర్తిగా సమర్థనీయమైనవే. అందుకు సందేహం లేకపోయినా, కేవలం అరెస్టుల ద్వారానే ద్రవిడ మున్నేట్ర కజగాన్ని అణచివేయడం సాధ్యం కాబోదు. కనీసం కొన్ని వర్గాలను కజగం ప్రచారం ఎందుకు ఆకర్షించ గలుగుతున్నదో తెలుసుకొని, ఆ కారణా లన్నింటిని పూర్తిగా తొలగించడానికి గట్టి ప్రయత్నం చెయ్యాలి. దేశ క్షేమాన్ని, జాతీయ సమైక్యాన్ని కోరి, ద్రవిడ మున్నేట్ర కజగంపై ప్రతి భారతీయ పౌరుడు యుద్ధం ప్రకటించవలసిన సమయం వచ్చింది.

(ఆంధ్రజ్యోతి 21-7-1962)

విజిగీష

బ్రతుకే ఒక సవాలు. వ్యక్తికే కాదు	జాతికి సయితం బ్రతుకొక సవాలు. పదివేల సంవత్సరాలకు విస్తరించిన మానవ

సభ్యతా చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించిన ప్రఖ్యాత చరిత్రకారుడు ఆర్నాల్డ్ జె. టాయనీ - సవాలుకు ఎప్పటికప్పుడు సరైన జవాబు చెప్పగలిగిన జాతులే తమ సభ్య తను, తమ సంస్కృతిని కాపాడుకొనగలిగినవని, వాటి చరిత్రే అవిచ్ఛిన్న మైనదని, తక్కినవి సన్నగిలి, నీరసించి, కాలగర్భంలో కలిసిపోయినవని నిరూపించాడు.

మన జాతికి ఈనాడు చైనా నుంచి ఒక సవాలు వచ్చింది. దానికి సరైన జవాబు చెప్పడానికి మనం నిర్ణయించుకొన్నాము. మన సమగ్రతను, మన స్వాతంత్ర్యాన్ని, మన సభ్యతను, మన సంస్కృతిని మన జీవిత విధానాన్ని మన గౌరవ ప్రతిష్ఠలను కాపాడుకొనడానికి మనం చేసుకొన వలసిన నిర్ణయమిదే! ఇది కేవలం మన ప్రధాని నిర్ణయం కాదు, మన ప్రభుత్వ నిర్ణయం కాదు; ఇది మన నిర్ణయం. ఇది ప్రతి పట్టణం, ప్రతి పల్లె ఘోషిస్తున్న నిర్ణయం. ఇది స్త్రీలు, పురుషులు ఘోషిస్తున్న నిర్ణయం. ఇది పెద్దలు, పిన్నలు ఘోషిస్తున్న నిర్ణయం.

అయితే, ఒక నిర్ణయానికి రావడం కంటే, దాన్ని ముక్తకంఠంతో ఘోషించడం కంటే, దాన్ని పరిపాలించడంలో దీక్ష ముఖ్యం, దక్షత ముఖ్యం. నిన్న మన ప్రధాని లోకసభలో హెచ్చరించినట్టు, చైనా సవాలుకు జవాబు చెప్పడం ఒక రోజులో జరిగే పని కాదు; ఒక వారంలోనో, ఒక నెలలోనో జరిగే పని కాదు, అందుకు యేళ్ళూ పూళ్ళూ పట్టవచ్చు. క్షణికావేశాలు, తాత్కాలి కోద్రేకాలు ప్రయోజనశూన్యం. ఊరేగింపులు, నినాదాలు ప్రయోజనశూన్యం. ఇప్పుడు కావలసింది, - నిశ్చలచిత్తం, కార్యదీక్ష, త్యాగనిరతి మాత్రమే.

నేడు మనమెదుర్కొంటున్న సవాలును పోలినదే తమ దేశంలో 1940లో యెదుర్కొనవలసి వచ్చినప్పుడు నాటి బ్రిటిష్ ప్రధాని విన్స్టన్ చర్చిల్ కామన్సుసభలో మే 13వ తేదీన ప్రసంగిస్తూ, "రక్తం, శ్రమ, అశ్రువులు, స్వేదం- ఇవి తప్ప నేను మీకు వాగ్దానం చేయగలిగినవి లేవు" అని హెచ్చరించాడు. సరిగా ఈ పదజాలాన్ని వాడకపోయినా, నిన్న లోకసభలో ప్రసంగిస్తూ మన ప్రధాని మనకు వాగ్దానం చేసినవి కూడా రక్తం, శ్రమ, అశ్రువులు, స్వేదం మాత్రమే!

మన శత్రువు ఆసియా ఖండంలో అన్నింటికంటే పెద్ద దేశం; ప్రపంచం మొత్తంపై హెచ్చు జనాభాతో కూడిన దేశం. లండన్ "టైమ్స్" పత్రిక సైనిక వ్యవహారాల నిపుణుని అంచనా ప్రకారం 25 లక్షల మంది సైనికులను పోషిస్తున్న దేశం. ప్రత్యేక సమీకరణ లేకుండా 120 కాల్బల దళాలను, బహుశా ఆరు కవచ దళాలను రణ రంగంలో నిలపగల దేశం. అవసరమైతే, యుద్ధభూమికి పంపించడానికి మరొక 12 కోట్ల మందికి ప్రాథమిక సైనిక శిక్షణ నిచ్చిన దేశం; మరొక 18 కోట్ల మందిని కొంతవరకు సుశిక్షితులను చేసిన దేశం. ఈ విలేకరి అంచనా ప్రకారం చైనా రిజర్వుసైనికుల సంఖ్య 20 కోట్లు కావచ్చు. ఇంతకంటే కూడా ముఖ్యంగా మనం గుర్తించవలసిన

విషయమిది: నీతీ నిజాయితీ లేనివాడు ఈనాడు చైనాను పరిపాలిస్తున్నాడు. దయాధర్మాలకు వారు అపరిచితులు. దురాశ వారిని పీడిస్తున్నది. ఆసియాపై ఆధిపత్యాన్ని వారు ఆకాంక్షిస్తున్నారు. అణ్వస్త్ర యుద్ధాన్ని ఆహ్వానిస్తున్నారు. యాటం, హైడ్రోజన్ బాంబుల యుద్ధం ప్రారంభమైనా చైనా 60 కోట్ల జనాభాలో కనీసం 30 కోట్లు మిగలగలదని, ఆ పరిస్థితిలో ప్రపంచాధిపత్యం చైనాదే కాగలదని చెప్పడానికి సంకోచించని రాక్షస ప్రవృత్తి వారిది!

ఇట్టి శత్రువుతో పోరాటానికి చెల్లించవలసిన మూల్యం-ఔను!-రక్తం, శ్రమ, స్వేదం, అశ్రువులే. ఈ మూల్యాన్ని అవిరళంగా, అత్యుత్సాహంతో చెల్లించడానికి మనం సంసిద్ధపడాలి. ఇంతే తప్ప సులభంగా, శీఘ్రంగా మనకు విజయం లభించనున్నదనే భ్రమలకు పోరాదు. న్యాయం మన పక్షాన వున్నది; ప్రపంచ ప్రజాభిప్రాయం మన పక్షాన వున్నది. వీటిని మించి చైనా సవాలుకు జవాబు చెప్ప వలెనన్న మన దృఢ నిర్ణయం వున్నది. అయితే, ఈ నిర్ణయాన్ని మనం పరిపాలించగలిగింది - చైనాకు బుద్ధి చెప్పగలిగింది - రక్తం రూపంలో, శ్రమ రూపంలో, అశ్రువుల రూపంలో, స్వేదం రూపంలో అవసరమైన ఎట్టి త్యాగాలనైనా చేయగల విజిగీషను చూపగలిగినప్పుడే!

(ఆంధ్రజ్యోతి 10-11-1962)

బంగారం పై విధి నిషేధాలు



ఉద్బోధలు, విజ్ఞప్తులు, హెచ్చరికలు-ఎన్ని చెయ్యాలో అన్నింటినీ శ్రీ మురార్జీ చేశారు. కొన్ని ఆకర్షణలను కూడా కల్పించారు. అయినా, బంగారం బాండులను విరివిగా కొన్నవారే లేరు. కనీసం దొంగ బంగారమైనా బయటికి రాలేదు. ఎంతో లెక్కవేసి చెప్పలేము గాని మొత్తం పై విశేషంగానే బంగారం దొంగచాటుగా దేశంలోకి దిగుమతి అవుతున్నది. అన్యాయార్జిత విత్తాన్ని కప్పిపుచ్చడానికి మరొక దారిలేక దాన్ని బంగారం రూపంలో మార్చడం కూడా జరుగుతున్నది. కనీసం ఈ దొంగబంగారమైనా బయటికి రావచ్చు నన్న ఆశతోనే బాండ్లను కొనేవారిని "ఈ బంగారం మీ కెక్కడి నుంచి వచ్చింది?" అని ప్రశ్నించబోమన్నారు. ఆస్తి పన్ను నుంచి ఆ బాండ్లను మినహాయిస్తామన్నారు. "కేపిటల్ గెయిన్స్" పన్ను నుంచి కూడా వాటిని మినహాయిస్తామన్నారు. ఇంతేకాక సాలుకు నూటికి ఆరున్నర రూపాయల చొప్పున వడ్డీ చెల్లిస్తామన్నారు. ఇన్ని ఆకర్షణలను కల్పించినా స్వల్పంగా తప్ప - చెదురుగా తప్ప బంగారం బాండ్లను కొన్నవారేలేరు.

బంగారానికి ప్రభుత్వం చెల్లిస్తామన్న ధర అంతర్జాతీయపు ధరకంటే తక్కువకావచ్చు. కాని, పదిహేనేళ్ళ తర్వాత ఈ బాండ్లను ప్రభుత్వం తిరిగి తీసుకొని, అసలు ఫాయిదాలను చెల్లించేనాటికి (ఇప్పటి మార్కెట్టు రేటు ప్రకారం) తులానికి పది రూపాయలు మాత్రమే తక్కువగా చేతికి వస్తుంది. పదహేనేళ్ళ తర్వాత ఇప్పటి బంగారం ధర ఇప్పటివలెనే మిగులుతుందో, లేదో ఎవరు చెప్పగలరు? కొన్ని ప్రత్యేకపు కారణాలవల్ల ఈనాడు మనదేశంలో బంగారం ధర అంతర్జాతీయపు ధరకంటె హెచ్చుగా వున్నది. మరి కొన్నేళ్ళలోపలనే ఈ ప్రత్యేక కారణాలు తొలగవచ్చు; బంగారం ధర పడిపోవచ్చు. బంగారం విషయంలో భారత ప్రభుత్వం ఏదైనా చర్యగైకొన వచ్చునన్న భావం ప్రబలేసరికి ఆ మధ్య దాని ధర తగ్గలేదు? అందువల్ల తులానికి 62.50 రూపాయల చొప్పున అంతర్జాతీయపు రేటునే బంగారపు బాండ్ల సందర్భంలో ప్రభుత్వం నిర్ణయించినదని సంకోచించవలసింది కాదు.

బంగారాన్ని బంగారంగా దాచుకొనడంవల్ల దానిపై నయాపైసా కూడా ఆదాయం రాదు; దాన్ని పెట్టి బాండ్లను కొంటే నూటికి సాలుకు ఆరున్నర రూపాయల చొప్పున వడ్డీ వస్తుంది. అందువల్ల ప్రభుత్వం నిర్ణయించిన ధర సందర్భంలో ఈ వడ్డీని లెక్కలోకి తీసుకొనకుండా, మార్కెట్టు రేటు కంటే తక్కువ ధరను చెల్లిస్తామన్నారనడం సమంజసం కాబోదు.

కావాలన్నా, అంతర్జాతీయపు ధరను మించి భారత ప్రభుత్వం చెల్లించడానికి వీలులేదు. ప్రభుత్వ బంగారాన్ని ఖరీదు చేసే సందర్భంలో అంతర్జాతీయపు రేటు ప్రకారమే ఖరీదు చేయాలనే నియమం వున్నది. దీన్ని అతిక్రమించడం బంగారం వ్యాపారం విషయంలో అంతర్జాతీయపు ఒడంబడికలను అతిక్రమించడమే కాగలదు. దీన్ని దృష్టిలో పెట్టుకొనే బంగారం బాండ్లకు ఆరున్నర వడ్డీని నిర్ణయించడం జరిగింది.

మేము ఇంతకు ముందు కూడా పేర్కొన్నట్టు, ఇంత చేసినా బంగారం బాండ్లను కొనడానికి తూగినవారు చాలా తక్కువ. ఆభరణాల రూపంలో దేశంలో గల బంగా ంగారాన్ని విడిచిపెట్టినా, దొంగ బంగారం కనీసం 1,800 కోట్ల రూపాయల విలువకు నేడున్నదని కొందరి అంచనా. మరికొందరైతే 2,500 కోట్ల రూపాయల వరకు ఈ అంచనాలను పెంచుతున్నారు. ఏమైనా, దీనిలో నూటికి ఒక వంతు కూడా బయటికి రాలేదు!

పంచవర్ష ప్రణాళికల సందర్భంలోనే ఈ దొంగ బంగారాన్ని బయటికి లాగడానికి భారత ప్రభుత్వం ఎట్టి యత్నం చేయలేదని ఆరోపించినవారున్నారు. ఉదాహరణకు, ఒక అమెరికన్ రచయిత (రాబర్ట్ సి. రువార్క్) వ్రాసిన ఈ వాక్యాలనే చూడండి: "ప్రపంచంలో బంగారం కొరత కనబడుతున్నది. ఫోర్ట్ నాక్స్లో మన బంగారం నిల్వలు అంతకంతకు తగ్గిపోతున్నాయి మన దేశంనుంచి బంగారం బయటకు పోతున్నదని మన ప్రెసిడెంట్ ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితులలో బంగారానికి సంబంధించినంత వరకు అగ్రస్థానం ఇండియాకు కలదని వినడానికి సామాన్య పాఠకుడు ఆశ్చర్యపడవచ్చు! బంగారాన్ని జాతీయం చేయాలన్న సంకల్పం వుంటే, భిక్షాపాత్రను చేతబుచ్చుకొని బయల్దేరవలసిన అవసరం లేకుండా భారతీయులు ఒక పది పంచవర్ష ప్రణాళికలకు కావలసిన పెట్టుబడిని తమంత తామే సేకరించుకోగలరు."

ఇతడు మన పట్ల, మన దేశం పట్ల అక్కసం వెళ్ళ బోసే రచయిత కావచ్చు; ఇతడు వ్రాసినదానిలో అత్యుక్తి విశేషంగా వుండవచ్చు. అయినా, బంగారం విషయంలో మనలను గురించి విదేశీయులలో కొందరికి ఏ విధమైన అభిప్రాయాలు కలవో తెలుసు కొనడానికి ఇతని రచన తోడ్పడుతుంది. పంచవర్ష ప్రణాళికలకే మన బంగారాన్ని మనం వినియోగించుకొనడం లేదని ఇదివరలో ఇంతగా విమర్శరాగా, ఇప్పుడు చైనా పెనుభూతం నుంచి దేశాన్ని రక్షించుకొనడానికైనా అది వినియోగానికి రాకపోతే ప్రపంచం మనలను పూర్తిగా అసహ్యించుకొనదా?

బ్రిటన్, యునైటెడ్ స్టేట్స్ సమేతంగా పెక్కు విదేశాలలో పౌరులు ఒక స్వల్ప పరిమితిని మించి బంగారం తమవద్ద వుంచుకొనడానికి వీలులేదు. లోహరూపంలోనే కాదు, ఆభరణాల రూపంలో నైనా దాన్ని వుంచుకొనరాదు. ఇందుకు భిన్నంగా సంచరిస్తే, కఠినంగా శిక్షిస్తారు. ఆభరణాల కైనా స్వచ్ఛమైన బంగారాన్ని వాడకం చేయరాదని ఆ దేశాలలో మరొక నియమం వున్నది. పద్నాలుగు క్యారెట్ల, అంతకంటే కూడా తక్కువ క్యారెట్ల బంగారంతోనే నగలు చేయించుకొనడానికి అక్కడ సమ్మతిస్తారు.

ఈ విధమైన చర్యలను మన దేశంలో అమలు జరపకపోతే, మన దేశానికి ఆర్థిక పురోగతి లేదు సరిగదా; అంతకంటె తక్షణ సమస్యగా రక్షణ సయితం లేదు. ఈ ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొనే బంగారం విషయంలో కొన్ని విధి నిషేధాలను నిన్న శ్రీమొరార్జీ ప్రకటించారు. దొంగ బంగారాన్ని బయటికి తీసుకు రావడానికి, బంగారం పట్ల మోజును తగ్గించడానికి ఇవి యెంతవరకు తోడ్పడగలవో కొంతకాలం పాటు వేచిచూస్తే తప్ప తెలియదు.

(ఆంధ్రజ్యోతి 12-1-1963)

మానవాళికి ప్రథమ శత్రువు

వొకసారి చర్చించినా, మరి పదిసార్లు చర్చించినా, రష్యా, చైనాల సిద్ధాంత విభేదాలు, వాటి సస్తు వైఖరిలలో పెద్ద మార్పువస్తే తప్ప, పరిష్కారం కాబోవు. ఉభయ దేశాలు అనుసరిస్తున్నది. కమ్యూనిజమే కావచ్చు; ఉభయ పక్షాలు ఆరాధిస్తున్నది మార్క్స్-లెనిన్ ద్వయాన్నే కావచ్చు. అయినా, ఏది కమ్యూనిజం? ఏది మార్క్స్, లెనిన్లు నిర్దేశించిన మార్గం? ఈ విషయమై ఒకరి అభిప్రాయంతో మరొక దానికి సంబంధం దాదాపు పూజ్యం.

మార్క్స్ వలె కృశ్చేవ్ ఒక మహాతత్త్వవేత్త కాకపోవచ్చు. లెనిన్వలె మహామేధావి కాకపోవచ్చు. అయినా, ఇది మార్క్స్, లెనిన్ల కాలంకాదని ఆయన గుర్తిస్తున్నాడు. వారిద్దరి లక్ష్యాలను గౌరవిస్తూనే వాటి సాధనకు కాలానుగుణమైన కొత్త పద్ధతులను అవలంబించాలని ఆయన సూచిస్తున్నాడు. మార్క్స్ కాలం నాటికి ప్రపంచం ఇంకా "ఆవిరియుగం"లోనే వున్నది; లెనిన్ కాలంనాటికి ఇంకా "విద్యుచ్ఛక్తియుగం"లోనే వున్నది. ఇప్పుడిది "అణుశక్తి" యుగం. దానికి తగినట్టు పాత పద్ధతులను మార్చుకొనక పోవడం మౌఢ్యం కాదా?

ఇది అణుశక్తి యుగమని మావో గుర్తించ లేకపోతున్నాడో, లేక అతనిలో మానవత మందుకైనాలేదో తెలియదు. ఏమైనా, ప్రపంచ యుద్ధంవల్ల మానవాళి దాదాపు నాశనమై పోయినా, మిగిలే కొద్దిమందితోనే ఆదర్శప్రాయమైన సోషలిస్టు సమాజాన్ని స్థాపించవచ్చునని అతడు వాదిస్తున్నాడు.

కృశ్చేవ్ గతవారంలో మాస్కోలో ప్రసంగిస్తూ చెప్పినట్టు, అణ్వస్త్రాలతో మిలిగిన వారు చనిపోయినవారిని చూచి అసూయపడవలసి నంతటి ఘోరాతి ఘోర పరిస్థితు లేర్పడగలవు. అణుయుద్ధం తర్వాత మిగిలేవారు కురూపాలతో మిగులుతారు; కుష్ఠుకంటె వేయిరెట్లు అసహ్యమైన రుగ్మతలతో మిగులుతారు; రోజురోజుకు మందగించి పోగల రక్త ప్రవాహంతో, నానాటికి కుళ్ళిపోగల యెముకలతో మిగులుతారు. వారి బ్రతుకులు సహజమైనవిగా మిగలవు; బిడ్డలంటూ కలిగితే, దయ్యపు బిడ్డలే వారికి కలుగుతారు.

అణ్వస్త్ర యుద్ధ ఫలితాలను గురించి కృశ్చేవ్ పదేపదే హెచ్చరించినా, ఆయనకు మావో భీరత్వాన్ని ఆపాదించడం, కమ్యూనిజానికే ఆయన ద్రోహం తలపెట్టినట్లుగా ఆరోపించడం అజ్ఞానంవల్ల కాక, అమానుషత్వం వల్లనే కావచ్చు. అతనికి కావలసింది ప్రపంచ నాయకత్వం; అది బూది పోగుల ప్రపంచమైనా సరే! మరొక పరిస్థితిలో పిచ్చి ఆసుపత్రిలో పెట్టవలసినవాడు మావో. కాని ఈనాడు అతడు 70 కోట్ల ప్రజలలో తన పలుకే శాసనంగా చెల్లుతున్న నియంత. ఈనాటి ప్రపంచం దౌర్భాగ్యాలన్నిటిలో అతి ఘోరమైనదిదే!

ప్రపంచాధిపత్య సాధనకు తొలిమెట్టుగా కృశ్చేవ్ను సోవియెట్ నాయకత్వం నుంచి తొలగించడం ముఖ్యావసరమని మావో భావిస్తున్నాడు. అందుకే ఆయనపై ఆరోపణలు చేయడం, అభాండాలను.

విషాద సంఘటనలు

వేయడం, అబద్ధాలను ప్రచారం చేయడం! మున్ముందు ఈ విషప్రచారం మరింత తీవ్రంగా కొనసాగవచ్చు. ప్రజాశత్రువులలో కెనెడీ, నెహ్రూల తర్వాత కృశ్చేవ్క ప్రస్తుతం మూడవ స్థాన మిస్తున్న మావో త్వరలోనే సోవియెట్ ప్రధానిని ప్రథమ స్థానానికే ప్రమోట్ చేయవచ్చు. ఏమైనా, మొత్తం మానవాళికే ఈనాడు ప్రథమ శత్రు వొకడుంటే, అతడు నిశ్చయంగా మావో!

విషాద సంఘటనలు (ఆంధ్రజ్యోతి 23-7-1963)

అయిదుగురు సైనికాధికారులు ప్రయాణం చేస్తున్న హెలికాప్టర్ ఎత్తయిన కొండల మధ్య ఒక టెలిఫోన్ కేబులు డీకొని కూలిపోయినట్టు కొన్ని వార్తలు సూచిస్తున్నవి. ఈ వార్త లెంతవరకు నిజమోతెలియదు. పైలట్ తోసహా మొత్తం ఆరుగురి దుర్మరణానికి దారితీసిన ఈ దుస్సంఘటనపై సమగ్ర విచారణ జరిగే వరకు ప్రమాదకారణాలు బయటపడవు.

ఎయిర్ వైస్ మార్షల్ రాజారాం అధ్యక్షతన రక్షణ శాఖ ఒక దర్యాప్తు సంఘాన్ని నియమించింది. ఈ సంఘం ప్రమాదం జరిగిన పూంచ్ ప్రాంతానికి వెళ్ళి తన దర్యాప్తును వెంటనే ప్రారంభించింది. సంఘంలోని సభ్యులందరు సైనిక, సాంకేతిక విషయాలలో నిపుణులు కనుక వారి దర్యాప్తులో అసలు కారణాలు వెల్లడి కాగలవు. అవి వెల్లడి ఆయ్యేవరకు ఈ సంఘటనను గురించి దేశంలో పరిపరి విధాలుగా ఆందోళనకరమైన ఊహాగానాలు జరగడానికి అవకాశంవుంది.

84 అయిదుగురు ఉన్నతాధికారులలో ఏ ఒక్కరు చనిపోయినా మన సైన్యానికి, దేశ రక్షణకు నష్టం వాటిల్లేదే. ఇక, అయిదుగురు ఒక్కసారే, అందులో కేవలం సామాన్య ప్రమాదంలో విషాద మరణం చెందడం దేశానికి తీరని నష్టమని చెప్పాలి. చనిపోయిన జనరల్స్ ముగ్గురు గత ప్రపంచ యుద్ధకాలంలో పెక్కు రంగాలలో పోరాడి, పేరెన్నికగన్నవారు. బ్రిగేడియర్ ఓయ్ రంగంలో పోరాడి అనుభవం సంపాదించినవారు. ఎయిర్ వైస్ మార్షల్ పింటో గోవాపై చర్య సమయంలో ప్రధానపాత్ర విమానదళాన్ని ఆధునికం చేయడంలో విశేష కృషి చేసినవారు. పైలట్ సోంధీ లడఖ్ రంగంలో గొప్ప సాహసం ప్రదర్శించిన వ్యక్తి.

ఇంతటి అనుభవం, సామర్థ్యం కలిగిన అధికారులను ఒకే సారిగా కోల్పోవడం దురదృష్టమే. వీరయిదుగురు ఒక విమానంలోనే ప్రయాణం చేయడం జరగకూడని పని అయినా, అది బహుశా తలవని తలంపుగా సంభవించి వుంటుంది. ముందు దౌలత్సింగ్, నానాపతి వారిని కలియడం, వీరు నలుగురిని ఓబ్రాయ్ పూంచ్లో కలుసుకొనడం జరిగింది. పూంచ్ సమీపంలో మన అగ్రసైనిక శ్రేణులలో ఏర్పాట్లను తనిఖీ చేయడానికి వీరు బయలు దేరారు. ప్రత్యక్ష యుద్ధంలో కాకపోయినా, విధి నిర్వహణలోనే వీరు పొందిన మరణం వీరోచితమైనది. కనుకనే యావద్భారతం నేడు వారికి జోహార్లర్పిస్తున్నది. (ఆంధ్రజ్యోతి 26-11-1963)

మౌసలపర్వం

ఇండియన్ కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలు మౌసలపర్వంలో ప్రవేశించాయి, ఆంధ్ర కమ్యూనిస్టుపార్టీ ప్రముఖ నాయకులు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య నిన్న హైదరాబాదులో రణభేరీ మ్రోగించారు; "యుద్ధం ప్రారంభమైంది"

(ది బ్యాటిల్ ఈజ్ ఆన్) అని ప్రకటించారు. దాదాపు ఇదే నినాదాన్ని న్యూ ఢిల్లీలో శ్రీ బసవ పున్నయ్య, శ్రీ రామమూర్తి చేశారు. భారత రాజకీయాలలో ఇది విచిత్రమైన పరిణామం. కమ్యూనిస్టు పార్టీలో తీవ్రమైన అభిప్రాయభేదాలు రగులుకొంటున్నట్లు కొంతకాలంగా తెలిసిన విషయమే. రష్యాలో స్టాలి నిజం పతనంతో, కృశ్చేవ్ అనుసరిస్తున్న నూతన విధానాలతో కమ్యూనిస్టు ఉద్యమం అంతర్జాతీయంగానే రెండుగా చీలిపోయింది. ప్రతిదేశంలోని ప్రతి కమ్యూనిస్టు పార్టీలోను, పెత్తనం దేనిదైనా మాస్కో అనుకూలవర్గం ఒకటి, పెకింగ్ మార్గాన్ని అనుసరించేది మరొకటి తయారైనాయి. ఈ పరిణామ ప్రభావం ఇండియన్ పార్టీపై కూడా పడడంలో ఆశ్చర్యం లేదు. తమ పార్టీలో "రివిజనిస్టులకు" (మితవాదులు) "మార్క్సిస్టులకు" (అతివాదులు) మధ్య అభిప్రాయ భేదాలు పదేళ్ళుగా వున్నాయని శ్రీ సుందరయ్య చెబుతున్నా అవి ఒకటి రెండేళ్ళుగానే ప్రస్ఫుటంగా పైకిపొక్కుతున్న వనేది నిర్వివాదం. ముఖ్యంగా ఇండియాపై చైనా దురాక్రమణ చేసినప్పటినుంచి, ఈ వివాదంపై ఎట్టి వైఖరి నవలంబించాలనే విషయమై పార్టీలో చీలిక లేర్పడ్డాయి.

అయితే, ఇంత త్వరలో ఇంత విచిత్రంగా పార్టీలోని అంతఃకలహాలు బయటపడగల వని ఎవరూ ఊహించి వుండకపోవచ్చు. ఏ దేశంలోనైనా కమ్యూనిస్టు పార్టీ మనుగడకు, పలుకుబడికి ప్రాతిపదిక దాని సభ్యుల క్రమశిక్షణ. అది లేనిదే ఆ పార్టీయే లేదు. కాగా ఇండియన్ పార్టీలో ఒక వర్గం ఈ క్రమశిక్షణకు వ్యతిరేకంగా ప్రవర్తించడం, పార్టీ నాయకత్వాన్నే ధిక్కరించడం ఆశ్చర్యకరమే.

ప్రస్తుతం ఇండియన్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం మితవాదులని వ్యవహరింపబడుతున్న శ్రీ డాంగే అనుయాయుల చేతిలో వున్నది. ఈ వర్గాన్ని తొలగించి నాయకత్వాన్ని చేజిక్కించు కొనడానికి అతివాదవర్గం ప్రయత్నాలు చేస్తున్నది. ఈ ప్రయత్నాలలో ఒక భాగమే ఇటీవల శ్రీ డాంగేపై వెలువడిన ఆరోపణలు ఎన్నడో నలభై సంవత్సరాలనాడు శ్రీ డాంగే జైలులో వుండగా, తనను విడుదలచేస్తే సహకరించగలనని బ్రిటిష్ ప్రభుత్వానికి లేఖలు వ్రాసినట్లు అతివాదులు ఆరోపించగా, అవి దొంగ ఉత్తరాలని పార్టీ సెక్రెటేరియట్ సమాధానం. ఏది నిజమో తెలియదుగాని, ఈ లేఖల ఉదంతాన్ని బట్టి ఒకటే కారణం స్పష్టపడుతున్నది. పార్టీ అధ్యక్షపదవి నుంచి శ్రీ డాంగేను తొలగించడానికి, ఆయనపై సభ్యులలో వైముఖ్యం కలిగించడానికి ఈ లేఖలను ఒక వర్గం వినియోగించు కొంటున్నది. ఇండియా, చైనా వివాదంలో శ్రీ డాంగే వర్గం అవలంబించిన వైఖరికి ప్రతీకారంగా, ఆయన ఈనాడే కాక మొదటినుంచి ప్రభుత్వంతో సహకరిస్తూనే వున్నారని నిరూపించడానికి ప్రయత్నం జరుగుతున్నది. స్టాలిన్ అనుసరించిన పద్ధతులలో "క్యారెక్టర్ అసాసినేషన్" కూడా ఒకటి గదా!

ముందేమి జరుగనున్నది? అంతర్జాతీయంగా రష్యా, చైనాల మధ్య పునస్సమాధానానికి జరుగుతున్న యత్నాలన్నీ విఫలమవుతున్నాయి. బహుశా ఇదే వైఫల్యం ఇండియన్ పార్టీలో సయితం ప్రతిబింబించవచ్చు. ఒక ఒరలో రెండు కత్తు లిమడవనే సామెత కమ్యూనిస్టు పార్టీకి అక్షరాలా వర్తిస్తుంది. సిద్ధాంత రీత్యా సంభవించే విభేదాలలో పరస్పర సహనం, సహజీవనం, సామరస్యం అనే పదాలకు కమ్యూనిస్టు నిఘంటువులో తావు లేనేలేదు.

ఇప్పటిలో కమ్యూనిస్టుపార్టీ రెండుగా చీలిపోవడం జరిగినా, మానినా ఒకటి మాత్రం స్పష్టం. అది తిరిగి ఎన్నటికి పూర్వపు ఆత్మవిశ్వాసంతో, అహమహమికతో వ్యవహరించలేదు. ఇక ఎన్నటికీ సంపాదించుకోలేని దాన్ని దేన్నో అది కోల్పోయింది.

(ఆంధ్రజ్యోతి 29-3-1964)

పిరికి మందు

శ్రీ జయప్రకాశ్ జీవితంలో జయం కానరాదు; ప్రకాశం అంతకంటే కానరాదు. తాను తానుగానే వుంటే తన ఉన్నత విద్యతో, తన సేవా తత్పరతతో, తన త్యాగ నిరతితో ఆయన తనకెంతో మేలు చేసుకునేవారు, దేశానికెంతో మేలుచేసేవారు. కాని, ఆయనకు కొన్ని సందర్భాలలో గాంధిని కావాలని అనిపిస్తుంది; మరికొన్ని వేళలో నెహ్రూను కావాలని అనిపిస్తుంది. వేరొక కొన్ని క్షణాలలో వారిద్దరి వైశిష్ట్యాలను అంతర్భూతం చేసుకోగల వ్యక్తిత్వంతో ప్రభాసించాలని అనిపిస్తుంది. ఫలితం-కనీసం తాను తానుగా నైనా మిగలక పోవడం.

ఈ పలుకులు కఠినమైనవిగా ధ్వనిస్తున్నవా? అయితే, వీటిని ప్రేరేపిస్తున్నది ఎందరికో, ఎన్నెన్నో ఆశలను గొలుపుతూ ప్రారంభమైన రాజకీయ జీవితం శుష్క ధర్మోపన్యాసాలతో వెళ్ళమారిపోతున్నదే అన్నబాధే!

శ్రీ జయప్రకాశ్ కొత్త ధర్మోపన్యాసం-మూడు రంగాలలో ఏకకాలంలో మనం పోరాడలేమని! జాతీయ విప్లవం పట్ల, ఇంతవరకు దాని ద్వారా మనం సాధించగలిగిన విజయాల పట్ల, మన భవిష్యత్తుపట్ల మనకు విశ్వాసం వుంటే మూడు రంగాల కర్మమేమిటి? - ముప్పై రంగాలలోనైనా మనం ఏకకాలంలో పోరాడవచ్చు. అట్టి విశ్వాసం కొరవడనందునే కాదా, గాంధీజీ ఏకకాలంలో మత, సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికాది విభిన్న రంగాలలో ఏకకాలంలోనే పోరాడగలిగారు.

తమ విప్లవ ప్రభుత్వం నెలకొన్న కొత్తలో లెనిన్ మాత్రం ఎన్ని రంగాలలో ఏకకాలంలో పోరాడలేదు? మాకు జ్ఞాపకం వున్నంతవరకు, పద్దెనిమిది రంగాలలో ఆయన పోరు కొనసాగించవలసి వచ్చింది. పైగా, ఆ పద్దెనిమిదింటిలో ప్రతిదీ ఒక సాయుధ యుద్ధ రంగం!

స్వతంత్ర భారతవర్షం దారిద్ర్యంపై ఒక వైపున యుద్ధం సాగిస్తూ, రెండవ వైపున పాకిస్తాన్ తోను, మూడవ వైపున చైనాతోను తన ప్రాదేశిక సమగ్రత రక్షణకై పోరాడలేదని శ్రీ జయప్రకాశ్ నారాయణ్ అనడం మన జాతీయ విప్లవం పట్ల, ఒక జాతిగా మన భవిష్యత్తు పట్ల ఆయనకు విశ్వాసం సన్నగిలినందువల్లనే కాదా? ఏమైనా, మనం ముందుగా పరిష్కరించుకొనవలసిన జాతీయ దారిద్ర్య సమస్య దృష్ట్యా పాకిస్తాన్, చైనాలతో రాజీకి రావలెననడం శ్రీ జయప్రకాశ్ను పోలిన ప్రముఖ దేశభక్తునికి తగు సూచన కాదు.

ఇచ్చి పుచ్చుకొనే పద్ధతిలోనే తాను రాజీని సూచిస్తున్నానని ఆయన వాదించవచ్చు. కాని, దేనికైనా సమయాసమయా లుంటాయి. పైగా, మన మిచ్చేది హెచ్చు, పుచ్చుకొనేది తక్కువ కాక తప్పని పరిస్థితిలో ఇచ్చి పుచ్చుకొనడం ఎంతమాత్రం తగదు. ఇచ్చే దానికంటె పుచ్చుకొనేదే అధికమైనా, జాతీయ గౌరవ ప్రతిష్ఠలను కాపాడుకొనడంకోసం ఎంతమాత్రం సందు పెట్టని వైఖరినే అవలంబించడం కొన్ని సందర్భాలలో సముచితం కావచ్చు కూడా!

అక్సాయిచిన్ విషయంలో చైనాకు కొన్ని ప్రత్యేకావసరాలున్నందున చైనాతో వివాదం చంపుకొనడానికై ఆ ప్రాంతాన్నిదానికి కౌలు కివ్వవచ్చునని శ్రీ జయప్రకాశ్ సూచిస్తున్నారు. ఇది కొత్త సూచన కాదు. భూటాన్, సిక్కింరాజ్యాల మధ్యకు చొచ్చుకు వచ్చిన చైనీస్ ప్రాంతాన్ని మనకు కౌలు కివ్వవచ్చునవి చౌఎన్-లై క్రితంసారి రాయబారాలకై ఢిల్లీ వచ్చినప్పుడు శ్రీ కృష్ణమీనన్ ఒక సూచన చేయడం, శ్రీ గోవిందవల్లభ పంత్ తీవ్రంగా ప్రతిఘటించడంవల్ల దాన్ని అంతటితో విడిచిపెట్టడం జరిగింది. ఏమైనా, ఒకసారి ఈ సూచన వచ్చిన పిమ్మట చైనా మన సరిహద్దులను ముట్టడించి వుండకపోతే, ఏమి జరిగేదో చెప్పలేము. సాయుధ బలంతో తన పట్టుదలను నెగ్గించుకొనడానికి అది ప్రయత్నం చేసిన తర్వాత ఈ పాత సూచనను తిరిగి తలపెట్టడానికైనా వీలులేదు!

పాకిస్తాన్కు సంబంధించినంతవరకు ప్రస్తుతపు యుద్ధ విరమణ రేఖ ప్రాతిపదిక పై రాజీని సూచించడం, దాన్ని అది పదేపదే తిరస్కరించడం జరిగింది. అయినా, దానితో మరేమి రాజీబేరాలు చేయాలో అది శ్రీ జయప్రకాశ్కి తెలియాలి!

చైనా, పాకిస్తాన్ లతో వివాదాల పరిష్కారాన్ని మనం కోరకపోవడం లేదు. కాని, ఏ ప్రయత్నమైనా మన జాతీయ గౌరవానికి, ప్రతిష్ఠకు భంగం కాని ప్రాతిపదికపైనే కొనసాగాలి. ఇంతేకాదు. మూడు రంగాలలో ఏక సమయంలో మనం పోరాడలేమన్న సంకోచంతో పరిష్కార సాధనకు పూనుకొనడం భీరుత్వమే కాగలదు!

(ఆంధ్రజ్యోతి 25-8-1964)

బిర్లా భవన్



మన దేశంలో ఎంత స్వల్ప విషయమైనా ఒక మహా సమస్యగా ఎందుకు మారుతుందో తెలియదు. పెద్ద విషయాల నుంచి చిన్న విషయాల వరకు ప్రభుత్వం అనిశ్చిత వైఖరితో కాలం గడిపివేస్తుంది. ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి ఏ సాకు దొరుకుతుందా అని ఎదురు చూస్తుంటాయి. చివరికి రాజకీయాలతో ఏ సంబంధం లేని సమస్య కూడా రాజకీయ సమస్యగా పరిణమిస్తుంది.

లేకపోతే, బిర్లా భవన్ను గాంధీ స్మారక మందిరంగా స్వాధీనపరచుకొనాలన్న విషయంపై చెలరేగవలసిందా? ఆ భవనాన్ని స్వాధీనపరచుకొనే విషయమై కాంగ్రెసు అగ్రనాయకత్వం, కేంద్ర ప్రభుత్వం ఎందుకో వైముఖ్యం వహిస్తున్నాయి. కాంగ్రెసు పార్టీకి చెందిన ఒక పార్లమెంటు సభ్యుడు శ్రీ శశిభూషణ్ బిర్లా భవనాన్ని ప్రభుత్వం స్వాధీనపరచు కోవలసిందేనని భీష్మించి నిరాహారదీక్ష చేస్తున్నారు.

గాంధీజీ సిద్ధాంతాలలో అనేకం, ముఖ్యంగా ఆయన నైతిక సిద్ధాంతాలలో అధిక భాగం, ఆయనతోనే మన రాజకీయ జీవితం నుంచి నిష్క్రమించాయి. అయినా, ఆయన తన నైతిక జీవితంలో ఒక ప్రధానాంశంగా చేసుకున్న నిరశన దీక్షలు మాత్రం మిగిలాయి. గాంధీజీ వంటి మహోన్నత వ్యక్తికే చెల్లిన నిరశన దీక్షాయుధం ప్రతివారి చేతిలో పడి అపభ్రంశంగా తయారైంది. ప్రతి స్వల్ప విషయానికి నిరశన దీక్ష పట్టడం ఆ దీక్షా పావిత్ర్యాన్నే మలినపరుస్తున్నది. బిర్లా భవన్ సమస్యపై నిరశన దీక్షకు ఒకరు ఉపక్రమించడం ఈ కోవకు చెందినదే.

ఈ దీక్షను ప్రతిపక్షాలు, అందులోను వామవాదానికి చెందినవి సమర్థించడం మరీ వింతగా ఉన్నది. ఎస్.ఎస్.పి., పి.ఎస్.పి., కమ్యూనిస్టు అతి, మితవాద పక్షాలు నిరశన దీక్షను సమర్థించడం చూస్తే దీని నొక రాజకీయ సమస్యగా మార్చి, ప్రభుత్వంపై దెబ్బతీయడమే వాటి లక్ష్యమైనట్టు కనబడుతుంది. దీన్నిబట్టి గాంధీజీ పట్ల కాంగ్రెసు సంస్థ కంటే ఈ వామపక్షాలకే అధిక భక్తిశ్రద్ధలున్నవని అర్థం చేసుకోవాలా?

కేంద్ర ప్రభుత్వమైనా ఈ స్వల్ప విషయాన్ని ఇంత సమస్యగా ఎందుకు రూపొందనివ్వాలో తెలియదు. గాంధీజీకి స్మారక చిహ్నాలు ఏర్పాటుచేయడం పట్ల కాంగ్రెసుకు గాని, ప్రభుత్వానికి గాని విశ్వాసం లేకపోలేదు గదా? దేశమంతటా గాంధీ స్మారక మందిరాల, స్తూపాల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్నారు. శతజయంతి కార్యక్రమాలను అట్టహాసంగా ఏర్పాటు చేస్తున్నారు. ఢిల్లీ వచ్చే ప్రతి విదేశీయాతిథి కార్యక్రమంలోను రాజఘాట్ సందర్శనను ఒక అంశంగా చేరుస్తున్నారు. అయినప్పుడు బిర్లా భవనన్ను స్వాధీనం చేసుకునే విషయమై, కాంగ్రెసు సంస్థలో సైతం పలువురు ఆందోళన చేస్తున్నప్పటికీ, వెనుకాడవలసిన అవసరం ఏమున్నదో తెలియడం లేదు.

అది బిర్లా భవన్లో ఒక చోట 1948 జనవరి 30వ తేదీన గాంధీజీ నిర్యాణం చెందారు. సాధారణ నిర్యాణం కాదు. నూటికి, కోటికి ఏ ఒకరికో లభ్యమయ్యే వీరోచిత మరణం. ఆయన జీవితానికి ఎంత ప్రాధాన్యం ఉన్నదో ఆయన మరణానికి అంతే ఉన్నది. అందుచేత ఆయన మరణ స్థలాన్ని జాతీయ స్మారక ప్రదేశంగా, భావితరాలకు జాతి జనకుని జ్ఞాపకాన్ని పదిలపరచేదిగా తీర్చిదిద్దడంలో అసంభావ్యమేమీ లేదు. కొందరు కోరుతున్నట్టు ఆ భవనంలో గాంధీజీ జీవితానికి, దినచర్యకు సంబంధించిన వస్తువులను భద్రపరచిన మ్యూజియం. ఆయన రచనలకు, ఆయనపై రచనలకు సంబంధించిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయవచ్చు. ఢిల్లీ యాత్రికులకు చూడదగిన ఒక చారిత్రక తీర్థ క్షేత్రంగా దాన్ని రూపొందించవచ్చు.

ఇప్పుడే వచ్చిన ఒక వార్త ప్రకారం బిర్లా భవన్లో గాంధీజీ హత్య జరిగిన స్థలాన్ని మాత్రం స్వాధీనం చేసుకొనాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు మంత్రి శ్రీ జగన్నాథరావు లోక్సభలో ప్రకటించారు. ఇది సంతోషించదగిందే గాని, మొత్తం భవనాన్ని బిర్లాలకు తగిన పరిహారమిచ్చి స్వాధీనం చేసుకొనడానికి ప్రభుత్వం ఎందుకు సంకోచిస్తున్నదో తెలియదు. బిర్లాభవన్ బిర్లాల సొంత ఆస్తి అయినమాట నిజమే. కాని, జాతీయ ప్రయోజనాల కోసం అనేకుల సొంత ఆస్తులను ప్రభుత్వం పరిహారమిచ్చి స్వాధీనం చేసుకోవడం లేదా? అలాగే బిర్లా భవనన్ను మొత్తంగా స్వాధీనం చేసుకోవచ్చుగదా? భవనంలో కొంతభాగాన్ని స్వాధీనం చేసుకొనడం తప్పు కానప్పుడు మొత్తాన్ని స్వాధీనం చేసుకొనడంలో తప్పు ఏమున్నది? నిజానికి ఈ సమస్య ఇంతగా పెరిగిపోకముందే, ఒకప్పుడు గాంధీజీకి అత్యంత సన్నిహితులుగా మెలగిన బిర్లాలు ఆయన నివాసంచే పునీతమైన తమ భవనాన్ని ఏనాడో స్వచ్ఛందంగా, పరిహార ప్రశ్న లేకుండా, భారతజాతికి బహూకరించి ఉండవలసింది. ఇప్పటికైనా వారు ఆ పని ఎట్టి మానసిక, తదితర సంకోచాలు లేకుండా చేయగలిగితే దేశం సంతోషిస్తుంది. (ఆంధ్రజ్యోతి 18-12-1968)

అంతరాత్మ ప్రసక్తి

స్వాతంత్ర్యానంతరం ఒక రాజకీయ సంస్థగా కాంగ్రెసును రద్దుచేయడం మంచిదని గాంధీజీ సూచించారు. ఆయన సూచన అమలు జరగలేదు గాని, శ్రీమతి ఇందిరా గాంధీజీ కాంగ్రెసును రెండుగా చీల్చడానికి ఉపక్రమించారు.

బెంగుళూరు ఎ.ఐ.సి.సి. నాటి నుంచే ఇది ప్రారంభమైంది. ఇప్పుడది కాంగ్రెసు విచ్ఛిత్తి తప్పదేమోననిపించే తీవ్రస్థాయిని చేరుకున్నది.

శ్రీమతి ఇందిరా గాంధీ ఆర్థిక విధానాలను కాంగ్రెసులో కొందరు వ్యతిరేకించడం వల్లనే సంస్థను విచ్ఛిత్తి ప్రమాదం ఎదుర్కొంటున్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. నిజానికి ఆమె ఆర్థిక విధానాలను బెంగుళూరు ఎ.ఐ.సి.సి. ఆమోదించింది. బ్యాంకుల జాతీయకరణ విషయంలో కూడా ఓర్పుతో, రాజనీతిజ్ఞతతో వ్యవహరించి ఉంటే దానికి ఆమె కాంగ్రెసులోని వివిధ వర్గాల వారిని ఒప్పించ గలిగేవారే. అందుచేత ఆమె ఆర్థిక విధానాలను కొందరు అంగీకరించకపోవడం వల్లనే కాంగ్రెసుకు విచ్ఛిత్తి ప్రమాదం ఏర్పడిందనేమాట నిజంకాదు.

నిజమైన కారణం వ్యక్తిగత స్పర్ధలకు, సంస్థలో ప్రాబల్య సంపాదనకు సంబంధించినట్టిదే. ఈ కారణానికే శ్రీమతి ఇందిరాగాంధి అభిమానులు ఆర్థిక సిద్ధాంతపు రంగు పూస్తున్నారు.

శ్రీ అశోకమెహతా సోషలిస్టు కారని ఎవ్వరు అనలేరు. సోషలిస్టుపార్టీ సంస్థాపకులలో ఆయనొకరు. ఆయన సైతం ప్రస్తుతం కాంగ్రెసు నెదుర్కొంటున్న విచ్ఛిత్తి ప్రమాదానికి శ్రీమతి ఇందిరా ఆర్థిక విధానాలు కారణం కావని అభిప్రాయపడ్డారు. నిజానికి శ్రీమతి ఇందిర అడుగడుగున తొందరపడరాదని నిగ్రహించినందువల్లనే బ్యాంకుల జాతీయకరణం ఇంత ఆలస్యమైందని ఆయన బయటపెట్టారు.

అందుచేత కాంగ్రెసులో ఈనాడు స్పష్టంగా వెల్లడి అయిన చీలికలకు శ్రీమతి ఇందిరాగాంధి ఆర్థిక విధానాలు కారణం కానేకావు. అసలు కారణం రాష్ట్రపతి ఎన్నికకు కాంగ్రెసు అభ్యర్థిగా శ్రీ సంజీవరెడ్డిని పార్లమెంటరీ బోర్డు నిర్ణయించడమే. ఈ నిర్ణయానికి ప్రతిక్రియగా తన ప్రత్యర్థులను దెబ్బతీయడానికి, పార్టీలో తన స్థానాన్ని సుస్థిరపరచుకొనడానికి బ్యాంకుల జాతీయకరణను ఒక ఆయుధంగా, ఒక సాధనంగా ఆమె వినియోగించుకున్నారు. ఆమె ఎత్తుగడ ఫలించింది కూడా. పార్టీలోని తీవ్రవాదులందరి సమర్థన ఆమెకు లభించింది.

ఇంతటితో ఆగక శ్రీమతి ఇందిరా గాంధి అనుయాయులు, అభిమానులు కాంగ్రెసును రెండుగా చీల్చడానికి చేయవలసినదంతా చేస్తున్నట్టు కనిపిస్తున్నది. శ్రీ అర్జున్ అరోరా తాను ఎవరికి ఓటు చేయదలచింది బహిరంగంగానే ప్రకటించారు. అంత బహిరంగంగా ప్రకటించే ధైర్యం లేక శ్రీ జగ్జీవన్‌రాం, శ్రీ ఫక్రుద్దీన్ కాంగ్రెసు సభ్యులకు అంతరాత్మ సాక్షిగా, స్వేచ్ఛగా వోటు చేయనివ్వాలని కాంగ్రెసు అధ్యక్షుని కోరారు. కాంగ్రెసు అభ్యర్థికి వోటు చేయాలని విప్ జారీ చేయవలసిందిగా శ్రీ నిజలింగప్ప చేసిన విజ్ఞప్తికి సమాధానంగా ప్రధాని కూడా వోటింగ్ స్వేచ్ఛ ప్రసక్తి తెచ్చారు.

కాంగ్రెసు అభ్యర్థి నిర్ణయం జరిగిన ఇన్నాళ్ళకు వీరు అంతరాత్మ ప్రసక్తి తేవడం ఎందుకు జరిగింది? రాష్ట్రపతి పదవికి ఇంతవరకు నాలుగుసార్లు ఎన్నికలు జరిగాయి. వాటిలో ఎన్నడు జ్ఞాపకం రాని అంతరాత్మ ప్రసక్తి ఇప్పుడు ఎందుకు వచ్చింది? శ్రీమతి ఇందిరాగాంధి కోరినట్టు కాంగ్రెసు అభ్యర్థిగా శ్రీ జగ్జీవన్ రాంను నిర్ణయించివుంటే అప్పుడు అంతరాత్మ ప్రసక్తి వచ్చివుండేదా?

దీన్నిబట్టి, కాంగ్రెసు అధికార అభ్యర్థికి వోటు చేయడం ఇష్టం లేకనే శ్రీమతి గాంధి అనుయాయులు అంతరాత్మ ప్రసక్తిని తెచ్చినట్టు స్పష్టం కావడంలేదా?

తాను పార్లమెంటరీ బోర్డు నిర్ణయానికే కట్టుబడి ఉండగలనని శ్రీమతి గాంధి ఇటీవలే విశదం చేశారు. అయితే, పార్టీ లీడర్ సభ్యులకు విప్ జారీ చేయవలసింది పోయి, ఇప్పుడామె పార్లమెంటులోని, శాసనసభలలోని కాంగ్రెసు సభ్యులకు వోటింగ్ స్వేచ్ఛ ఇవ్వాలని కోరడంలో ఆంతర్యం ఏమిటి? కాంగ్రెసు అభ్యర్థికి కాక మరొకరికి వోటు చేసే స్వేచ్ఛ తనకు కూడా ఉండాలన్న అర్థం ధ్వనించడం లేదా? ఇది కొద్దినాళ్ళ క్రిందటే ఆమె చెప్పినదానికి - పార్లమెంటరీ బోర్డు నిర్ణయానికి కట్టుబడి ఉండగలనన్నదానికి - విరుద్ధం కాదా?

ఇంతే విడ్డూరమైన మరొక విషయం ఉన్నది. కాంగ్రెసు అభ్యర్థిని సమర్థించాలని కోరుతూ పార్టీలు శ్రీ నిజలింగప్ప స్వతంత్ర పార్టీ, జనసంఘ్ సభ్యులతో సంప్రతింపులు జరిపారట. ఆ బ్యాంకుల జాతీయకరణను వ్యతిరేకించినందున వాటితో సంప్రతింపులు జరపడం అనుచితం కాదా అని శ్రీ జగ్జీవన్ రాం, శ్రీ ఫక్రుద్దీన్ కాంగ్రెస్ అధ్యక్షుని సంజాయిషీ కోరారు. రాష్ట్రపతి పదవి పార్టీలకు అతీతమైనదని అంటూ, వోటింగ్ స్వేచ్ఛ ఉండాలంటూ మరొక వంక కొన్ని పార్టీలతో సంప్రతించరాదని అనడంలో అర్థం ఏమిటి? శ్రీమతి తారకేశ్వరీ సిన్హా చెప్పినట్టు పార్లమెంటరీ బోర్డు నిర్ణయానికి ముందు ప్రధాని శ్రీమతి గాంధి జనసంఘ్, స్వతంత్ర పార్టీలతో ఏకాభిప్రాయ సాధన కోసం సంప్రతించలేదా? బ్యాంకుల జాతీయకరణకు ఆ పార్టీలు ఇప్పుడే కాదు, అప్పుడు కూడా వ్యతిరేకమే కదా? కాగా, అప్పుడు వాటితో సంప్రతించడం తప్పు కానప్పుడు ఇప్పుడు సంప్రతించడం ఏవిధంగా తప్పు అవుతుంది? శ్రీ జగ్జీవన్ రాంనో, శ్రీమతి గాంధీకి ఇష్టులైన మరొకరినో అభ్యర్థిగా నిర్ణయించివుంటే శ్రీ నిజలింగప్ప చర్యకు ఇదేవిధమైన అభ్యంతరం వచ్చి ఉండేదా? అభ్యర్థి నిర్ణయం ప్రధాని అభీష్టానికి వ్యతిరేకంగా వెళ్ళినందువల్ల అక్కసుతోనే ఒక వర్గం ఈ అభ్యంతరాలన్నీ లేవనెత్తుతున్నట్టు స్పష్టం కావడం లేదా? రాష్ట్రపతిగా శ్రీ సంజీవరెడ్డి ఎన్నిక అవుతారా, శ్రీ గిరి ఎన్నిక అవుతారా అన్నది ఇప్పుడు దాదాపు అప్రధానాంశమై పోయింది. ఎవరు ఎన్నికైనా ఫలితం ఒకటేనని కూడా స్పష్టమైపోయింది. కాంగ్రెసు రెండుగా చీలిపోయే ప్రమాదం ఆసన్నమైంది. పరిస్థితిని ఇంతవరకు తెచ్చిన బాధ్యతను ప్రధానంగా శ్రీమతి ఇందిరాగాంధీ వహించక తప్పదు.

(ఆంధ్రజ్యోతి 14-8-1969)

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై ప్రకటనలు వస్తున్నాయి గాని, విశాఖ పట్నానికి ఉక్కు ఫ్యాక్టరీ మాత్రం రావడం లేదు. అసలు వస్తుందో రాదో కూడా తెలియడం లేదు.

ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి అసెంబ్లీలో ఒక ప్రకటన చేస్తూ, విశాఖపట్నానికి ఉక్కు ఫ్యాక్టరీ రాగలదన్న ఆశాభావం వెల్లడించారు. ఈ విషయమై పదిహేను రోజులలో, లేదా నెల రోజులలో ఒక ప్రకటన కేంద్రం నుంచి వెలువడగల దన్నారు.

పదిహేను రోజుల క్రిందట కూడా ఆయన ఇదే విధమైన ఆశాభావం వెల్లడించారు. ఇలా ఆయన విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీ గురించి ఇప్పటి కెన్ని సార్లు ఆశాభావం వెల్లడించారో లెక్కలేదు. అందుచేత నిన్న శాసన సభలో ఆయన చేసిన ప్రకటనకు ఏపాటి విలువ ఇవ్వవలెనో తెలియడం లేదు. ఈ ఉక్కు ఫ్యాక్టరీ విషయం ఒక పెద్ద సమస్య అయిపోయింది. అయిదవ ఉక్కు ఫ్యాక్టరీ తమకు

రావాలంటే తమకు కావాలని అయిదారు రాష్ట్రాలు ఒత్తిడి చేస్తున్నాయి. అన్నిటిలోకి ఏది అనువైన స్థలమో నిర్ణయించ వలసిందిగా కేంద్ర ప్రభుత్వం కోరగా, ఆంగ్లోఅమెరికన్ నిపుణుల బృందం విశాఖ పట్నాన్ని సూచించింది.

ఇది జరిగి నాలుగైదేళ్ళయినా కేంద్ర ప్రభుత్వం ఈనాటికీ ఒక నిర్ణయానికి రాలేదు. ఇదిగో అదిగో అంటూ నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నది. చతుర్థ ప్రణాళిక ఖరారు కానందున ఇన్నాళ్ళుగా దాన్ని వాయిదా వేసి ఉండవచ్చు. కాని, ఇప్పుడు చతుర్థ ప్రణాళిక తుదిరూపాన్ని జాతీయాభివృద్ధి మండలి ఆమోదించింది. ఇక అది పార్లమెంటు ఆమోదం పొందడమే తరువాయి.

అయినప్పటికి, అయిదవ ఉక్కు ఫ్యాక్టరీ విషయం ఇంకా నిర్ణయం కాలేదు. ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంలో దాన్ని నిర్మించాలని కోరుతున్నది. మైసూరువారు దాన్ని కోరుతున్నారు. తమిళనాడువారు సేలంలో ప్రత్యేకపు ఉక్కు ఫ్యాక్టరీ కావాలంటున్నారు. కేరళ మరొకదాన్ని కోరుతున్నది. ఎవరి కోరికను కేంద్రం తీర్చనున్నది? అందరి కోరికలు తీర్చనున్నదా? లేక అందరికీ ఎగనామం పెట్టనున్నదా? తెలియడం లేదు.

విశాఖకు ఉక్కు ఫ్యాక్టరీ రాకతప్పదని శ్రీ బ్రహ్మానందరెడ్డి గట్టిగా ఆశాభావం వెల్లడిస్తుండగా, తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధి తాము సేలం విషయమై ఇంకా ఆశవదలు కోలేదని చెబుతున్నారు. సేలం ఉక్కు ఫ్యాక్టరీని మంజూరు చేయకపోతే తాము ఆందోళన ప్రారంభించ గలమని ఆయన కేంద్రాన్ని హెచ్చరిస్తున్నారు కూడా. ఈ లోగా విశాఖ, సేలం, హొస్పేటలు మూడింటిలోను మూడు ఉక్కు కర్మాగారాలు రావచ్చునని ఢిల్లీ నుంచి ఊహాగానాలు వస్తున్నాయి. మరొక వంక కేరళ పరిశ్రమల మంత్రి తమ రాష్ట్రంలో ఉక్కు ఫ్యాక్టరీ విషయాన్ని కూడా సానుభూతితో పరిశీలించగలనని కేంద్రం తెలిపినట్టు ప్రకటించారు.

ఇంతకూ, నాల్గవ ప్రణాళికలో ఎన్ని ఉక్కు కర్మాగారాలను ప్రారంభిస్తారో, ఎక్కడెక్కడ ప్రారంభిస్తారో తెలియదు. చతుర్థ ప్రణాళికలో ఉక్కు అదనపు ఉత్పత్తి కార్యక్రమాలకు కేటాయించిన మొత్తం 110 కోట్ల రూపాయలు మాత్రమే. ఈ ధనాన్ని కూడా కొత్త కర్మాగారాల నిర్మాణానికి వినియోగిస్తారా, లేక ఇప్పటికే ఉన్న కర్మాగారాల విస్తరణకు వినియోగిస్తారా, తెలియడంలేదు.

నాల్గవ ప్రణాళికలో ఉక్కు మొత్తం ఉత్పత్తి శక్తిని 90 లక్షల నుంచి 120 లక్షల టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భిలాయి ఫ్యాక్టరీ విస్తరణ, బొకారో మొదటి దశ మొదలైనవి ఉన్నాయి. వీటికి పోగా కొత్త కర్మాగారాలను స్థాపించడానికి ఇప్పుడు కేటాయించిన మొత్తంలో ధనం మిగులుతుందా?

ఇన్ని సందేహాల మధ్య విశాఖపట్నానికి ఉక్కు ఫ్యాక్టరీ రావడం తథ్యమని ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ఎలా ఆశిస్తున్నారో తెలియదు. ఏమైనా ఈ విషయమై ఇన్ని రాష్ట్రాలలో ఇంతగా ఆందోళన, అనుమానాలు పెరుగుతుండగా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఊరుకోవడం శోచనీయం.

ఏ సమస్య తల ఎత్తినా నిర్ణయాన్ని వాయిదా వేయడమే కేంద్రం పద్ధతి. దానికి అనుగుణంగానే ఉన్నది అయిదవ ఉక్కు ఫ్యాక్టరీ స్థాపనపై కేంద్రం వైఖరి. (ఆంధ్రజ్యోతి 26-3-1970)

పాత, కొత్త కాంగ్రెసులు

శ్రీ నిజలింగప్ప అధ్యక్షతనగల ఎ.ఐ.సి.సి. ఢిల్లీలో సమావేశమై ఒక తీర్మానం చేసింది. దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడినందున, దాని పరిరక్షణకు తాను ఇతర ప్రజాస్వామిక రాజకీయ పక్షాలతో సంఘటితం కాగోరుతున్నాననడమే ఈ తీర్మానపు సారాంశం.

ఏయే రాజకీయ పక్షాలతో తాను సంఘటితం కాగోరుతున్నదీ పాత కాంగ్రెసు పేరు పేరునా పేర్కొనలేదు. జాతీయవాదం, ప్రజాస్వామ్యం, సోషలిజం - ఈ మూడు ఆదర్శాలలో విశ్వాసం కలిగిన పార్టీలతో తాను చేరగలనని మాత్రమే అది ఉద్ఘాటించింది. ఆ పార్టీలను పేర్కొనకపోయినా, శ్రీమతి గాంధి ఆధ్వర్యానగల కాంగ్రెసు విధానాలను, ఆమె ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీలపై ఆధార పడడాన్ని పాత కాంగ్రెసు తీవ్రంగా విమర్శిస్తున్నది కనుక, అది చేరగోరుతున్న పార్టీలలో స్వతంత్ర, జనసంఘ్ మొదలైనవి ఉండగలవనే భావించవచ్చు.

దీన్నే కొత్త కాంగ్రెసు నాయకులు, ప్రస్తుతం వారిని సమర్థిస్తున్న మరికొన్ని ప్రతిపక్షాల నాయకులు విమర్శిస్తున్నారు. పాత కాంగ్రెసు ఒక వంక మితవాదులతో, మరొక వంక మతవాదులతో చేతులు కలప గోరుతున్నదని, దాని అభ్యుదయ నిరోధక తత్త్వానికి అదే నిదర్శనమని వారి విమర్శ.

ఈ విమర్శ ఇతరుల నుంచి వస్తే రావచ్చుగాని, కొత్త కాంగ్రెసు నుంచి రారాదు. శ్రీమతి గాంధి ప్రభుత్వం ఒక వైపు కమ్యూనిస్టు పార్టీలపై, మరొకవైపు కమ్యూనల్ పార్టీలపై ఆధారపడే ప్రస్తుతం కొనసాగడం లేదా?

- శ్రీమతి గాంధి ఆధ్వర్యాన గల కాంగ్రెసు తన ధ్యేయాలు ప్రజాస్వామ్యం, సోషలిజం అని ఇప్పటికీ చెప్పుకుంటున్నది. అయినా, అది కమ్యూనిస్టు పార్టీలతో ఏ విధంగా పొత్తు పెట్టుకున్నది? కమ్యూనిస్టు పార్టీలు - లెఫ్టు, రైటు కూడా ప్రజాస్వామ్యబద్ధమైన సోషలిజంను కోరుతున్నవా? అవి విశ్వసిస్తున్నది ప్రజాస్వామ్యాన్ని కాదు, ప్రజాస్వామ్యం మేలి ముసుగుతో నియంతృత్వాన్ని. తాము లక్షిస్తున్న వ్యవస్థను పీపుల్స్ డెమొక్రసీగా అవి అభివర్ణిస్తాయి. నేతి బీరకాయలో నేయి ఎంత ఉంటుందో పీపుల్స్ డెమొక్రసీలో డెమొక్రసీ అంతే ఉంటుంది.

అయినప్పుడు ప్రధాని శ్రీమతి గాంధి నియంతృత్వపు పార్టీలతో పొత్తు పెట్టుకొనడం ప్రజాస్వామ్యానికి బలాన్ని కూర్చగలదా? ఇటీవల తన మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరిస్తూ ఆమె మాజీ కమ్యూనిస్టులకు దానిలో స్థానమివ్వలేదా? ఇది ప్రజాస్వామ్య పరిపోషణకు తోడ్పడగలదా?

పోతే, కమ్యూనల్ పార్టీల సమస్య, ఆమె ప్రస్తుతం తన ప్రభుత్వపు మనుగడకు ఆధారపడుతున్న ద్రవిడ మున్నేట్ర కజగం, అకాలీ దళ్, ముస్లింలీగ్ కమ్యూనల్ పార్టీలు కావా?

ఇక మితవాదం వద్దకు వస్తే, ఆమె ఆధ్వర్యానగల కాంగ్రెసులోనే ఎందరు మితవాదులు లేరు? సోషలిజానికి, తమకు సగమెరుక అని చెప్పుకున్నవారు ఎందరు ఆమె కాంగ్రెసులో లేరు? ఆమెను సమర్థిస్తున్న వారిలో మాజీ మహారాజాలు ఎందరు లేరు?

అయినా, మొత్తంపై తనవి అభ్యుదయకర విధానాలని ఆమె చెప్పుకుంటున్నారు. ఆమె విధానాలలో అభ్యుదయం ఏమున్నదో దేశానికి ఇంత వరకు బోధపడలేదు. ఆమె పార్టీకే చెందిన యంగ్ర్క కైనా బోధపడినట్టు లేదు. కనుకనే ఆమెను వారు తరచుగా విమర్శించడం జరుగుతున్నది.

ఈ పరిస్థితులలో పాత కాంగ్రెసు ఒక వేళ జనసంఘ్, స్వతంత్ర పార్టీలతో సంఘటితం కాగోరితే అందులో తప్పు ఏమున్నది? అకాలీ, డి.ఎం.కె; ముస్లింలీగ్ కంటె జనసంఘ్ ఎక్కువ కమ్యూనల్ పార్టీ కాదు. స్వతంత్ర పార్టీ మితవాద పక్షమే కాని, దాన్ని పోలిన మితవాదులు శ్రీమతి గాంధి పార్టీలోనే ఎందరెందరో లేరా?

పాత కాంగ్రెసు జనసంఘ్, స్వతంత్ర పార్టీలతో ఒక ఫ్రంట్గా ఏర్పడడం జరిగితే అది దేశంలో "పోలరైజేషన్"కు దారితీయగలదని కొందరు వర్ణిస్తున్నారు. కావచ్చు గాని, అది సోషలిస్టు శక్తుల, సోషలిస్టు వ్యతిరేక శక్తుల "పోలరైజేషన్" కాబోదు. పాత కాంగ్రెసు సోషలిజాన్ని విశ్వసిస్తున్నది. కాగా, జనసంఘ్ు, స్వతంత్ర పార్టీకి సోషలిజం పట్ల విశ్వాసం లేక పోవచ్చు. అయితే, పాత కాంగ్రెసు వలెనే అవి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించగోరుతున్నాయి. పైగా అవి పూర్తిగా జాతీయవాద రాజకీయ పక్షాలు.

దేశంలోని ఈనాటి పరిస్థితులు భయాందోళనలు కలిగిస్తున్నాయి. రాష్ట్రాలలో రాజకీయమైన అస్థిరత్వం ఉన్నది. నక్సలైట్ అరాజక చర్యల వల్ల, ఇంకా ఇతర విధాలుగా శాంతి భద్రతలు నానాటికి క్షీణిస్తున్నాయి.

ఈ పరిస్థితిని ఎదుర్కొనడమనే పరిమిత లక్ష్యంతో - తన సోషలిస్టు సమాజ స్థాపన ధ్యేయాన్ని విడనాడకుండానే - పాత కాంగ్రెసు ప్రజాస్వామ్యంలో విశ్వాసం కలిగిన ఇతర పక్షాలతో సంఘటితం కాగోరడం తప్పుకాదు. ఇందుకు అది బిడియపడవలసిన అవసరం లేదు. (ఆంధ్రజ్యోతి 8-7-1970)

పోచంపాడు ప్రాజెక్టు



జల సమృద్ధమైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, రెండు పెద్ద నదులు - కృష్ణ, గోదావరి - దీని గుండా ప్రవహిస్తున్నాయి. వీటివల్ల ఆంధ్రప్రదేశ్ ఆహార ధాన్యాలలో స్వయం పోషకమే కాక, మిగులు రాష్ట్రమైంది.

అయినా, ఈ రెండు నదులను వినియోగించుకోవలసినంతగా మనం వినియోగించు కోవడం లేదు. పెక్కు జిల్లాలలో లక్షలాది ఎకరాలు ఇంకా చవిటిపర్రలుగానే మిగిలిపోయాయి. వాటికి నీటిని అందజేస్తే, అవి కూడా సాగులోనికి వచ్చి, ఇప్పటికీ దుర్భిక్షంతో

బాధపడుతూ, వెనుకబడి ఉన్న ప్రాంతాలెన్నో అభివృద్ధి కాగలవు. ఇప్పుడు నిర్మాణంలో ఉన్న నాగార్జునసాగర్, పోచంపాడు ప్రాజెక్టులు ఇందుకు దోహదం చేయగలిగినట్టివే.

నిజామాబాదు జిల్లాలో పోచంపాడు గ్రామం వద్ద గోదావరిపై నిర్మిస్తున్న ప్రాజెక్టు మొదట రూపొందించిన పథకం ప్రకారమైతే 20 లక్షల 45 వేల ఎకరాలను సాగు క్రిందికి తీసుకుని రాగలిగినంత పెద్దది. దానికి 117 కోట్ల వ్యయాన్ని అంచనా వేశారు.

దురదృష్టవశాత్తు, మహారాష్ట్ర ప్రభుత్వం చెప్పిన అభ్యంతరం కారణంగా అంత పెద్ద ప్రాజెక్టు నిర్మించడానికి వీలులేక పోయింది. మొదట అనుకున్నట్టు 257 శత కోటి ఘనపుటడుగుల నీటికి కాక, 66 శతకోటి ఘనపుటడుగుల నీటికే ప్రాజెక్టును కుదించవలసి వచ్చింది. ఇప్పుడు దీన్ని 5 లక్షల 70 వేల ఎకరాలకు మాత్రమే నీటిని అందజేసే విధంగా రూపొందించారు.

అయితే, నిర్మాణ వ్యయంలో పెద్దగా తేడా లేదు. భారీ ప్రాజెక్టుకు 117 కోట్ల వ్యయాన్ని అంచనా వేయగా, అంతకంటే ఎంతో చిన్నదైన ఇప్పటి దానికి 90 కోట్ల రూపాయల వరకు వ్యయం కానున్నది. ఈ చిన్న ప్రాజెక్టుకు మొదట వేసిన అంచనా 40 కోట్ల రూపాయలు మాత్రమే. అది రెట్టింపుకుపైగా పెరగడానికి కారణమేమిటో తెలియదు. ప్రాజెక్టు ఆలస్యమయిన కొద్దీ ధరల పెరుగుదల కారణంగా నిర్మాణ వ్యయం పెరుగుతుందనడానికి ఇది ఒక ఉదాహరణ కావచ్చు.

ఏమైనా, 1963 జూలైలో కీర్తిశేషుడు నెహ్రూ శంకుస్థాపన చేసిన పోచంపాడు ప్రాజెక్టు సరిగా ఏడేళ్ళ తరవాతనైనా ఒక కొలిక్కి రావడం ముదావహం. నేడు 40 వేల ఎకరాలకు నీటిని అందజేయగల స్థితికి ఈ ప్రాజెక్టు నిర్మాణ కార్యక్రమం చేరుకున్నది. ఈ సందర్భంలో నెహ్రూ ఆనాడు శంకుస్థాపన చేస్తూ చెప్పిన మాటలు జ్ఞాపకం రాకమానవు: "ఇంతవరకు మనం చేసిన దాన్ని గురించి నేడు ఆలోచించాలి" అని ఆయన అన్నారు.

నిజమే. పోచంపాడు ప్రాజెక్టు పని ఇంకా చాలా భాగం మిగిలే ఉన్నది. మొత్తం 123 మైళ్ళ పొడవున కాల్వ త్రవ్వాలి. 570 వేల ఎకరాల నీటి పారుదల సౌకర్యం కలిగించాలి. ఇంత భూమిని సాగుకు లాయకీగా అభివృద్ధి చేయాలి. తమ పొలాలకు లభిస్తున్న నీటిని రైతులు ఒక్క చుక్క వృథాపోకుండా సద్వినియోగం చేసుకోవాలి.

అప్పుడు నిజామాబాదు, కరీంనగర్ జిల్లాలు సస్యశ్యామలం కాగలవు. పోచంపాడు ప్రాజెక్టు క్రిందికి వచ్చే ప్రాంతంలో ఈనాడు 10 కోట్ల రూపాయల విలువగల 16వేల టన్నుల ఆహార ధాన్యాలు మాత్రమే పండుతున్నాయి. ప్రాజెక్టు పూర్తి అయి, పూర్తిగా వినియోగంలోనికి వచ్చిన నాడు 74 కోట్ల రూపాయల విలువ గల సుమారు 11 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు పండగలవు.

అందుచేత, ఈ ప్రాజెక్టు కేవలం ఆ రెండు జిల్లాలకేకాదు. ఆంధ్రప్రదేశ్కు మాత్రమే కాదు - దేశానికే అన్నదానం చేయనున్నది. ఏటేటా జనాభా పెరుగుదల దృష్ట్యా పెరిగిపోతున్న మన ఆహార ధాన్యావసరాలను తీర్చడానికి ఇటువంటి భారీ ప్రాజెక్టులు ఎంత ఆవశ్యకమో వేరుగా చెప్పనక్కర లేదు. ఇంతేకాక, పోచంపాడు ప్రాజెక్టు వద్ద 36 మెగావాట్ల విద్యుచ్ఛక్తి కూడా ఉత్పత్తి కానున్నది. కనుక, ఇటు ఆహారోత్పత్తికి, అటు పరిశ్రమాభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు తోడ్పడబోతున్నది. త్వరత్వరగా ప్రాజెక్టు నిర్మాణాన్ని కొనసాగించడం రాష్ట్ర ప్రభుత్వ కర్తవ్యం.

(ఆంధ్రజ్యోతి 25-7-1970)



చిచ్చర పిడుగు (గ్రంథ సమీక్ష)

ఇది విప్లవాల శతాబ్దం. రష్యాలో లెనిన్ విప్లవం, ఇండియాలో గాంధి విప్లవం, చైనాలో మావో విప్లవం, ఈజిప్టులో నాసర్ విప్లవం, ఇతర దేశాలలో ఇతర విప్లవాలు :

ఇవి విప్లవాలుగా ప్రారంభమైనా విప్లవాలుగా మిగలలేదని జాఁ ఫ్రాన్స్వా రివెల్ వాదం. ఈయన ఫిలాసఫీ (దార్శనిక శాస్త్రం), చదువు కున్నాడు. మెక్సికోలో, ఇటలీలో స్వదేశమైన ఫ్రాన్సులో ఫిలాసఫీని కొన్ని సంవత్సరాలపాటు బోధించాడు; ఫిలాసఫీపై కొన్ని పుస్తకాలు వ్రాశాడు కూడా. అయితే, ఇప్పుడేమో ఈయన జర్నలిస్టు. ఈనాటి ఫ్రెంచి జర్నలిస్టులలో గణనీయుడు. ఈయన పుస్తకాలలో సరికొత్తదానిపేరు "వితౌట్ మార్క్స్ ఆర్ జీసస్".

చిన్న పుస్తకమైనా, ఇదొక చిచ్చర పిడుగు. దీని ఫెళఫెళార్భటులు ఫ్రాన్సుకే పరిమితం కావడం లేదు. దేశదేశాలకు అవి వ్యాపిస్తున్నాయి. దేశదేశాల మేధావులను కొత్త ఆలోచనలకు కవ్విస్తున్నాయి.

"ఈ ఇరవయ్యో శతాబ్ది విప్లవం యునైటెడ్ స్టేట్స్లో జరుగుతుంది. అక్కడ మాత్రమే అది జరగగలదు. అక్కడ అది అప్పుడే ప్రారంభమైంది. అక్కడ నుంచి అది తక్కిన ప్రపంచానికి వ్యాపించడం, వ్యాపించకపోవడం ముందుగా అది అమెరికాలో జయప్రదం కాగలదా, లేదా అనేదానిపై ఆధారపడి ఉంటుంది." ఇవి రివెల్ పుస్తకంలో మొట్టమొదటి వాక్యాలు.

ఇవి ఆశ్చర్యకరమైన వాక్యాలని రివెల్ స్వయంగా అంగీకరిస్తున్నాడు. ఇవి పెక్కు మందిని "షాక్" చేయవచ్చునని కూడా అంగీకరిస్తున్నాడు.

నిజమే, ఇవి షాక్ చేయగల వాక్యాలే. బహుశా అమెరికన్లలోనే పెక్కు మందిని ఇవి షాక్ చేస్తాయి. పోతే, ఇతరులను మరింతగా షాక్ చేస్తాయి.

బహుజనాభిప్రాయం ప్రకారం అమెరికా ఇంపీరియలిస్టు రాజ్యం; గత శతాబ్దిలో యూరప్ సంస్థాపించిన కలోనియల్ ఇంపీరియలిజం స్థానంలో ఒక కొత్త ఇంపీరియలిజాన్ని - డాలర్ ఇంపీరియలిజాన్ని - నెల కొల్పడానికి ప్రయత్నిస్తున్న రాజ్యం.

క్యాపిటలిజానికి, క్యాపిటలిస్టులకు అది భూతల స్వర్గం. సోషలిజానికి, కమ్యూనిజానికి, ప్రగతిని లక్షించే ఇతర "ఇజాలకు" అది పూర్తిగా విరోధి. ప్రతీప శక్తులకు అది పెట్టనికోట.

బహుళ జనాభిప్రాయం ప్రకారం ఇట్టిదైన అమెరికా ఈ శతాబ్ది మహావిప్లవానికి జన్మస్థానం కానున్నదా? ఈ విప్లవం ఈ సరికే అక్కడ ప్రారంభమైందా? ఈ మాటలను ఎవరు నమ్మగలరు? ఎలా నమ్మగలరు?

నమ్మడం కష్టమైన ఈ విషయాన్ని గురించి నమ్మకం కలిగించడానికే రివెల్ తన కొత్త పుస్తకాన్ని వ్రాశాడు. దాని దృక్పథం కొత్తది. దాని కంఠం కొత్తది. దాని సందేశమే కొత్తది. అందువల్లనే అది అడుగడుగునా మనకు కవ్విస్తుంది; అడుగడుగునా మన పూర్వ విశ్వాసాలను, మన స్థిరాభిప్రాయాలను సవాలు చేస్తుంది; అడుగడుగునా మనలో కొత్త ఆలోచనలను రేకెత్తిస్తుంది.

ప్రతి మేధావి, ప్రతి భావుకుడు విధిగా చదవదగినట్టిది రివెల్ రచన. అలైడ్ పబ్లికేషన్స్ (అసఫాలీ రోడ్, న్యూఢిల్లీ - 1) దాన్ని ప్రచురించారు. ఇరవై అయిదు రూపాయలను పెట్టి, దాన్ని కొనలేనివారుంటే, ఎవరివద్ద నుంచైనా అడిగి పుచ్చుకుని, లేదా దొంగిలించి దాన్ని తప్పక చదవాలి.

రివెల్ దృష్టిలో ఈ శతాబ్దిలో తక్కిన దేశాలలో జరిగిన విప్లవాలు పైపై విప్లవాలే. అవి పై నుంచి కొందరు నాయకులు నడిపిన విప్లవాలు; అడుగునుంచి - ప్రజలలో నుంచి - పెల్లుబుకిన విప్లవాలు కావు. పైగా అవి వ్యక్తిని, వ్యక్తి స్వాతంత్ర్యాన్ని అణచివేశాయి. కొత్త నిరంకుశత్వాన్ని నెలకొల్పాయి. సోషలిజం పేర అవి కొత్త పాలక వర్గాలను సృష్టించాయి, ఆ పాలకవర్గాల నియంతృత్వాన్ని సంస్థాపించాయి.

వ్యక్తికి, వ్యక్తి పరిపూర్ణ వికాసానికి అవకాశమిచ్చేదే, ప్రస్తుతపు ఆర్థిక, సాంఘికాది వ్యవస్థలలోని అన్యాయాలను తొలగించగలిగిందే, జాత్యహంకారానికి స్వస్తి చెప్ప గలిగిందే, అంగబలాన్ని, అర్థబలాన్ని మానవాభ్యున్నతికి పూర్తిగా, సమర్థంగా వినియోగించ గలిగిందే, వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో మానవుడు సాధిస్తున్న అద్భుత విజయాలను అప మార్గాన్ని పట్టించనట్టిదే, తమకు సంబంధించిన అల్పానల్ప విషయాలన్నింటిలో పౌరులు స్వయంగా నిర్ణయాలను చేసుకొనడానికి అవకాశమివ్వగల రాజకీయ వ్యవస్థను నెలకొల్ప గలిగిందే, కొత్త సంస్కృతికి, కొత్త నైతికపు విలువలకు ప్రోదిచేయ గలిగిందే రివెల్ దృష్టిలో నిజమైన మహా విప్లవం. ఇట్టి విప్లవాన్ని అమెరికన్ స్త్రీలు, విద్యార్థులు, వర్ణజాతులవారు, మేధావులు, మైనారిటీ వర్గాలకు చెందిన మరికొందరు ప్రారంభించినట్టు, కొనసాగిస్తున్నట్టు రివెల్ నమ్ముతున్నాడు. తన నమ్మకాన్ని తన పాఠకులు పంచుకొనాలన్న దీక్షతో అనేక సాక్ష్యాధారాలను ఆయన చూపిస్తున్నాడు.

ఒక వైపున జీసస్ను, మరొక వైపున మార్క్సన్న త్రోసిపారవేసి, ఒక కొత్త మార్గం వెంట ఒక కొత్త విప్లవ సాధనకు అమెరికాలో కృషి జరుగుతున్నట్టు చెబుతున్న రివెల్ పుస్తకం నిజంగానే ఒక చిచ్చరపిడుగు. ఏమి చేసినా, ఏమి చేయకపోయినా, అది నిద్రపోతున్న వారిని వీపు తట్టి లేపుతుంది; కళ్లనులుముకుని, సమకాలిక ప్రపంచాన్ని ఒక కొత్త దృక్కోణం నుంచి పరిశీలించమంటుంది.

(ఆంధ్రజ్యోతి 6-8-1972)

నేటికి ఇంతే...

(ఆంధ్ర తెలంగాణాలు విడిపోవాలని సామూహిక నిరాహార దీక్షలు ఆందోళనలు రోజు రోజుకూ తీవ్రతరం అయ్యాయి. సి.ఆర్.పి. కాల్పులు జరిగాక 15 మంది పైగా మృతి చెందారు. ఇంకా వివిధ పట్టణాలలో కర్ఫ్యూ విధించారు. జనవరి 15వ తేదీన శ్రీ పి.వి. నరసింహారావు మంత్రివర్గం రాజీనామా చేశాక, జనవరి 18 నుండి రాష్ట్రపతి పాలన ఏర్పడింది. ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ కలిసి ఉండాలని నార్లవారు పలుసార్లు విజ్ఞప్తులు చేసినా ప్రయోజనం లేకపోయింది. దీనిపై నార్లవారు విసిగిపోయి సంపాదకీయ వ్యాఖ్యలు మానివేసి ఆ స్థలం ఖాళీగా ఉంచారు.)

ఇటు ప్రజలు, అటు ప్రభుత్వం తన హిత వచనాలను త్రోసిపుచ్చుతున్నప్పుడు ఏ పత్రికా సంపాదకుడైనా బాధతో విలవిల లాడడం తప్పు కన్నీటిని కురిపించడం తప్ప, మరి చేయగలిగింది ఏమి ఉంటుంది? ప్రస్తుతం ఈ పత్రికా సంపాదకుడు చేయగలుగుతున్నది ఇంతే.

నేటికి ఇంతకంటె మరి మేము వ్రాయగలిగింది లేదు. (ఆంధ్రజ్యోతి 21-1-1973)

(భారత రాష్ట్రపతి 26-6-1975 ఉ 7 గం నుంచి జాతీయ ఆత్యయిక పరిస్థితి (ఎమర్జన్సీ) ప్రకటించారు. ఆ తరువాత మూడు దినాలపాటు ఆంధ్రజ్యోతి దినపత్రికలో సంపాదకీయాలు రాలేదు. ఆ స్థలం క్రింది చూపిన రీతిలో ఖాళీగా ఉంచింది.)

ఘోర సంఘటన



ఢిల్లీ వద్ద గురువారం రాత్రి జరిగిన విమాన ప్రమాదం అతిఘోరమైనది, అతి విషాదకరమైనది. విమానంలో మొత్తం 65 మంది ప్రయాణికులుండగా, 48 మంది దుర్మరణం పాలైనారు. వారి మృతదేహాలు దాదాపు ఆనవాలు పట్టడానికైనా వీలులేకుండా కాలి పోయినాయి. మరణించినవారిలో దేశ రాజకీయాలలో, తదితర రంగాలలో ప్రముఖ పాత్ర వహిస్తున్న వారు పలువురున్నారు. ఒకరు కేంద్ర ప్రభుత్వంలో ఉక్కు, గనుల శాఖ మంత్రి శ్రీ మోహన్ కుమారమంగళం, మరొకరు పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ గుర్నాం సింగ్, వేరొకరు అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ సతీష్ లూంబా, ఇంకొకరు పార్లమెంటు సభ్యుడు శ్రీ బాలదండాయుధం, ఇలాగే మరికొందరు ప్రముఖులు ఏకకాలంలో అకాల మరణం చెందడం ఎంతైనా విషాదకరం.

శ్రీ మోహన్ కుమారమంగళం కమ్యూనిస్టు పార్టీ మేధావులలో ఒకరు; ఆలోచనలోను, ప్రవర్తనలోను సాహసి; రాజ్యాంగ సంబంధమైన విషయాలలో, న్యాయశాస్త్రానికి సంబంధించిన సమస్యలలో, ఆర్థిక విషయాలలో ఆయన కోవిదుడు. కొద్ది సంవత్సరాల క్రిందట ఆయన కమ్యూనిస్టు పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీకి మారినా, ఆయన లెఫ్టిస్టు భావాలలో మార్పురాలేదు. రెండేళ్ళ క్రిందట ఆయన కేంద్ర మంత్రివర్గంలో సభ్యుడుగా చేరినప్పటి నుంచి శ్రీమతి ఇందిరా గాంధి ప్రభుత్వం తలపెట్టిన అభ్యుదయ చర్యలలో

ఆయన ప్రముఖ పాత్ర వహిస్తూ వచ్చారు. కొన్ని కొన్ని సందర్భాలలో ఆయన నిర్వహించిన పాత్ర వివాదగ్రస్త మౌతూ వచ్చినప్పటికి, ఆయన నిజాయితీ, చిత్తశుద్ధి శంకించడానికి వీలులేనివి. ఆయన లేని లోటు శ్రీమతి గాంధి ప్రభుత్వానికి ఇంతలో తీరనిది.

ఇదే విధంగా, మరికొందరు ప్రముఖుల అకాల మరణానికి కారణమైన విమాన ప్రమాదం ఎలా జరిగిందనేది ఇంకా తెలియ రాలేదు. ఇటీవల దేశంలో ఇట్టి ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి; అందులో ఢిల్లీ వద్ద మరింత తరచుగా జరుగుతున్నాయి. గడచిన ఏడాదిన్నరలో అదే స్థలంలో జరిగిన విమాన ప్రమాదాలలో ఇది మూడవదట.

ఒకే ప్రాంతంలో ఇంత తరచుగా విమానాలు కూలిపోవడానికి కారణం ఏమిటి? గురువారం రాత్రి జరిగిన సంఘటనలో బోయింగ్ విమానం దేనినో ఢీ కొన్నట్టు అనిపించిందని, అది కూలిపోవడానికి ముందు రెండుగా చీలిపోయినట్టు అనిపించిందని చెబుతున్నారు. విమానం దేనినైనా ఢీ కొట్టి ఉంటుందా? లేక ఏదైనా యాంత్రికలోపం కారణమై ఉండవచ్చునా? చోదకుల అజాగ్రత్త వంటిది కారణం కావచ్చునా? ఇవి ఏవీకాక, ఇతర కారణాలేవైనా ఉన్నవా? ఈ విషాద సంఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు జరిపిన మీదటగాని ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించవు. ఇట్టి దర్యాప్తును వెంటనే ప్రారంభించడం, ఏ కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నవో కనుగొని, వాటిని తొలగించడం జరగాలి. ఇట్టి సంఘటనలు మున్ముందు జరగకుండా కట్టు దిట్టాలు చేయాలి.

శాస్త్ర విజ్ఞానం బహుముఖాలుగా వికసిస్తున్న కాలమిది; సాంకేతిక పరిజ్ఞానం విస్మయకర వేగంతో పురోగమిస్తున్న రోజులివి. మానవుడు చంద్రగోళానికి సురక్షితంగా వెడుతున్నాడు. సురక్షితంగా దిగి రాగలుగుతున్నాడు; రోదసిలోనికి ప్రయోగించిన వైజ్ఞానిక పరిశోధనాగారం చెడిపోతే, రోదసిలోనే దాన్ని సరిదిద్ద గలుగుతున్నాడు.

అయినా, నేటి యంత్ర నాగరికతలో సర్వ సాధారణమైపోయిన విమాన ప్రయాణాలను మాత్రం ఎల్లవేళల సురక్షితం చేయడంలో సాంకేతిక శాస్త్రవేత్తలు విఫలు లౌతున్నారు. ఏదో ఒక విమాన ప్రమాదం ఎక్కడో ఒక చోట జరగని రోజు సాధారణంగా ఉండడం లేదు. విమానయానాలను సురక్షితం చేయగల స్థాయికి సాంకేతిక శాస్త్రాలు చేరడం ఇప్పటిలో సాధ్యం కాదా?

(ఆంధ్రజ్యోతి 2-6-1973)

మంచి సంస్కరణ

నేరాలు చేసే ప్రవృత్తి ఎవరిలోనైనా ఉండవచ్చు. దానికి కులాలతో, మతాలతో, వర్గాలతో నిమిత్తం లేదు.

దురదృష్టవశాత్తు కొన్ని వర్గాలలో నేర ప్రవృత్తి వంశపారంపర్యంగా, లేదా సాంప్రదాయికంగా ఉండవచ్చు. అటువంటి వర్గాలను నేరస్థ జాతులుగా పరిగణించి సంఘానికి వెలిగా, దూరంగా, ప్రత్యేకమైన కాలనీలలో ఉంచేవారు. ఇటీవలి కాలంలో కొన్ని కులవర్గాలను ఈ విధంగా నేరస్థ జాతులుగా పరిగణించడం విరమించి, వారిపై ఆంక్షలను తొలగించినా, ఆ వర్గాలకు చెందిన వారిని శాశ్వత నేరస్థులుగానే పరిగణించడం ఇంకా జరుగుతున్నది.

అయితే, కాలం మారుతున్నది, విలువలు మారుతున్నాయి. నేరాలు చేసే వారిని కఠినంగా శిక్షించినంత మాత్రాన నేర ప్రవృత్తిని రూపు మాపలేమని, వారిని సంస్కరించి సంఘంలో సాధారణ పౌరులుగా, గౌరవంగా జీవించడానికి అవకాశాలు కల్పించాలని కొత్త భావాలు వ్యాప్తిలోనికి వస్తున్నాయి. హత్యలు చేసిన వారికి ఉరిశిక్ష విధించడం కంటే, వారిలో మానసిక పరివర్తనకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో కొన్ని దేశాలలో ప్రయోగాలు కూడా జరుగుతున్నాయి.

అందువల్ల, నేరాలకు అలవాటుపడిన వారిని శాశ్వతంగా నేరస్థులుగా పరిగణించడానికి బదులు వారు పరివర్తన చెందడానికి అవకాశం కల్పించడం హర్షించదగిన సాంఘిక సంస్కరణ కాగలదు. ఈ దృష్టితో చూస్తే, గుంటూరు జిల్లాలోని స్టూవరపురం కాలనీలోని ఎరుకలవారిని సంస్కరించి మంచి మార్గానికి తీసుకురావడానికి ప్రస్తుతం జరుగుతున్న ప్రయత్నాలు, ముఖ్యంగా ఈ విషయంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కృషి ఎంతైనా మెచ్చదగినవి.

ఈ కాలనీలోని వారిపై ఉన్న కొన్ని విధి నిషేధాలను సుమారు రెండు నెలల క్రిందట తొలగించారు. వారు స్వేచ్ఛగా తిరగడానికి అవకాశ మివ్వడం, ఎక్కడెక్కడ దొంగతనాలు జరిగినా నేరాన్ని అక్కడి వారిపై రుద్దకుండా, పోలీసులు వారిని బాధలకు గురిచేయకుండా చర్యలు గైకొనడం జరిగింది.

ఇదొక ప్రయోగాత్మక చర్య మాత్రమే. ఏ ప్రయోగం, లేదా సంఘ సంస్కరణ యత్నం వెంటనే సత్ఫలితా లివ్వకపోవడం పరిపాటే. మొదట కొన్ని వైఫల్యాలు తప్పవు. స్టూవర్టుపురం కాలనీలో కూడా ఇంతే జరుగుతున్నది. కాలనీవాసులలో కొందరిలో పాత అలవాట్లు తొలగకపోయి ఉండవచ్చు. మొన్న ఈ కాలనీకి చెందినవారే కొందరు ఒక గూడ్సు రైలును అటకాయించి, సరకును దోచుకున్నారు. పట్టుపడిన తర్వాత, వారు తాము నేరం చేసినట్టు అంగీకరించారు. ఇది పొరపాటునో, అలవాటునో జరిగిపోయిందని, ఇకపై నీతిగా జీవించగలమని, తమకు జీవనోపాధి సౌకర్యాలు కలిగించ వలసిందని కాలనీ వాసులు తమ్ము చూడవచ్చిన మంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావుతో చెప్పుకున్నారట. మొన్నటి సంఘటన నేరాలకు అలవాటుపడినవారిని సంస్కరించడం అసాధ్యమని, వారిని నేరస్థులుగానే పరిగణించి, వారి స్వేచ్ఛను అరికట్టడం అవసరమని భావించేవారి వాదాన్ని బలపరచవచ్చు. కాని, ఇది నిస్పృహతో కూడినవాదం. ఒక వర్గానికి వర్గాన్ని నేరస్థజాతిగా పరిగణించడం సమంజసం కాదు. ఏ సంస్కరణ ఒక్కనాటితో, లేదా కొన్ని నెలలలో ఫలించబోదు. దానికి కొంత వ్యవధి అవసరం. అందువల్ల, నేరాలకు అలవాటుపడినవారికి వారు నేరాలు చేయకుండానే గౌరవంగా జీవించడానికి తగు అవకాశాలు, సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలి. వారికి తగు జీవనోపాధి మార్గాలను చూపించడం ద్వారా వారిలో ప్రస్తుతం కానవస్తున్న పరివర్తన లక్షణాలను మరింతగా ప్రోత్సహించాలి. (ఆంధ్రజ్యోతి 30-1-1974)

కాంగ్రెస్ సంస్థ

"ఓడు, ఓడంటే కంచమంతా ఓడు"

అన్నట్టుగా ప్రస్తుతం కాంగ్రెసు సంస్థపై విమర్శలు వస్తున్నాయి. అది చచ్చిందని, కుళ్ళిందని, కంపు కొడుతున్నదని - ఒక్కటేమిటి? చాలా చాలా మాటలు వినవస్తున్నాయి.

పది, పదిహేనేళ్ళనాటివలెనే కాంగ్రెసు సంస్థ ఈనాడు కూడా వున్నదని కాంగ్రెసు వారైనా అనలేరు. అంటే, అది ఆత్మవంచన; లేదా, పరవంచనా ప్రయత్నం. ఈ పది, పదిహేనేళ్ళలో కాంగ్రెసువారిలో పదవీకాంక్ష పెరిగింది; పరస్పర ద్వేషాలు పెరిగాయి. అసూయలు పెరిగాయి; అంతఃకలహాలు పెరిగాయి. పదవి రానంతవరకు అది రాలేదని తాపత్రయం; వచ్చిన తర్వాత అది పోరాదని తాపత్రయం; పోతే, దాన్ని తిరిగి సంపాదించాలని తాపయం - దీనితో కాంగ్రెసు సంస్థ రెండు ప్రత్యర్థివర్గాల కింద విభక్తమై పోయింది! పదవినాక్రమిస్తున్న వారొక వర్గం కాగా, వారిని కూలత్రోయడానికి ప్రయత్నించేవారు మరోవర్గం. ఏ రెండు, మూడు రాష్ట్రాలనో విడిచిపుచ్చితే, తక్కిన అన్నిచోట్ల ఇదే కథ.

దీన్ని ఎవరు కాదనగలరు? కాంగ్రెసు అగ్రనాయకుడు నెహ్రూ సయితం పదవీ వ్యామోహంతో కాంగ్రెసు సంస్థ ఎంతో దుర్బలపడిందని - పడుతున్నదని - స్వయంగా ఉదోషిస్తున్నారు. నిన్నకాక మొన్ననే భోపాల్లో ఆయన ప్రసంగిస్తూ, అసూయలతో, అంతఃకలహాలతో, పదవీ వ్యామోహంతో, పరస్పర వైషమ్యాలతో కాంగ్రెసు ఇప్పటివలె కొనసాగడంకంటే, అది అంతరించిపోవడం మేలు కాగలదని హెచ్చరించారు.

పది, పదిహేనేళ్ళనాటి కాంగ్రెసు ఈనాటి కాంగ్రెసు కాదన్న విషయంలో సందేహం లేకపోయినా, "కంచమంతా ఓడు" స్థితికి మాత్రం అది రాలేదు. ఏ పదవినీ కోరక, ఏ ప్రతిఫలాన్నీ ఆశించక, కాంగ్రెసు సంస్థకు, కాంగ్రెసు సంస్థ ద్వారా దేశానికి చిత్తశుద్ధితో, త్యాగనిరతితో సేవచేస్తున్నవారు దానిలో ఈనాటికీ ఎంద రెందరో వున్నారు. అట్టివా రున్నారు కనుకనే, కాంగ్రెసుతో ఇప్పటికీ దేశానికి అవసరం కలదని నెహ్రూ నమ్మకం; అట్టివా రున్నారు. కనుకనే, కాంగ్రెసుతో తమకు అవసరం తీరిపోలేదని ప్రజల నమ్మకం.

కాంగ్రెసు ఈనాటిది కాదు; భారత జాతీయోద్యమంతో అది పుట్టింది; దానితో పెరిగింది. దాని దీర్ఘచరిత్రలో నిమ్నోన్నతాలు ఎన్నో వున్నాయి. అధఃపతనం చెందినట్టు కనబడినా, తిరిగి అది మిన్నందిన ఘట్టాలనేకం. ఇప్పుడది మరొకసారి దుర్భరస్థితిలో పడిపోతే, దానిలో దుర్లక్షణాలు కానవస్తే, అంతమాత్రం చేతనే దాన్ని త్రోసిపుచ్చవలె ననడం తగదు. వజ్రాయుధానికైనా కొన్ని కొన్ని సందర్భాలలో తుప్పుపట్టవచ్చు. అంతమాత్రం చేత దాన్ని పారవేయవచ్చునా? తిరిగి దానికి పదును పెట్టాలి; తళతళ మెరిసేటట్టు చేయాలి; తిరుగులేని ఆయుధంగా మరల మరల వినియోగించు కోవాలి. కాంగ్రెసు విషయంలో కూడా ప్రస్తుతం జరగవలసినదింతే!

జాతీయోద్యమంతో పుట్టి, జాతీయోద్యమంతో పెరిగి, జాతీయ స్వాతంత్ర్యాన్ని సాధించిన కాంగ్రెసు ఆ జాతీయ స్వాతంత్ర్యాన్ని అన్న వస్త్రాల రూపంలో, విద్యా విజ్ఞానాల రూపంలో, శాంతి సౌఖ్యాల రూపంలో సామాన్య ప్రజాయత్తం చేయడంలో ఈనాడుకూడా నిర్వహించవలసిన - నిర్వహించగల - ప్రధానపాత్ర కలదని మన ప్రధాని నెహ్రూ పరమ విశ్వాసం. ఆయన కాంగ్రెసులో విశ్వాసాన్ని

కోల్పోనంతవరకు ఆయననే తమ సారథిగా, తమ సచివునిగా, తమ ఆప్తునిగా, తమ మిత్రునిగా ఎన్నుకొన్న భారత ప్రజానీకంకూడా దానిపట్ల తన విశ్వాసాన్ని కోల్పోదు; ఇది ముమ్మాటికీ నిజం!

ఈ రహస్యం తెలిసినందుననే కాంగ్రెసును వ్యతిరేకిస్తున్న కొందరు ప్రముఖులు కాంగ్రెసు పై కంటె నెహ్రూ పై ఎక్కువగా కారాలు, మిరియాలు నూరుతున్నారు; నెహ్రూను తమ శత్రువుగా పేర్కొంటున్నారు. నెహ్రూ తనకు శత్రువనే వ్యక్తి భారత ప్రజాసామాన్యానికి శత్రువు; యుగధర్మానికి శత్రువు; సమతా సౌభ్రాత్రాలు ప్రాతిపదికలుగాగల నవసమాజ నిర్మాణ లక్ష్యానికి శత్రువు; ప్రగతికి శత్రువు; భవిష్యత్తుకే శత్రువు.

(ఆంధ్రజ్యోతి 8-9-1962)

అలీన విధానం

అనర్థాలన్నింటికి అలీన విధానమే మూలమని ఇటీవల మన దేశంలో ప్రచారం ప్రారంభమైంది. ప్రతి పక్షాలకు చెందినవారే కాక, కాంగ్రెసు వాదులలో కొందరు సయితం ఈ ప్రచారం చేస్తున్నారు. తక్కినవారివలె బహిరంగంగా కాకపోయినా, చాటుమాటుగా కాంగ్రెసు సభ్యులలో కొందరు ప్రముఖులే. ఈ విషయంలో ప్రతిపక్షాలవారిని బలపరచడం ఎంతైనా శోచనీయం.

నిన్న, మొన్నటివరకు అలీన విధానాన్ని పూర్తిగా సమర్థిస్తున్న వారిలోనే పెక్కు మంది ఈనాడు దాన్ని నిరసించడానికి కారణమేమిటి? చైనా మనపట్ల చేసిన మిత్రద్రోహమే ఇందుకు ప్రధాన కారణమని వీరు పైకి చెప్పవచ్చు. కాని, అంతకుముందు కూడా వీరికి అలీన విధానంలో విశ్వాసం లేదు. పాశ్చాత్య రాజ్యకూటంలో మనం చేరాలని, వారినుంచి దక్షిణ కొరియా, వియత్నామ్, థాయిలెండ్, పాకిస్తాన్, టర్కీ మొదలైన దేశాలవలె మనం కూడా సహాయం పొందాలని, కమ్యూనిజంపై ధర్మ యుద్ధానికి మనం ఆయత్త పడాలని వీరు లోలోపల చిరకాలంగా అభిలషిస్తున్నారు. తక్కిన పాశ్చాత్య దేశాలపట్ల కంటె అమెరికాపట్ల వీరికి భక్తి విశ్వాసాలు హెచ్చు. అమెరికా జీవిత విధానంపట్ల, ప్రత్యేకించి, అమెరికనులు అభిమానించే స్వేచ్ఛా వ్యాపార సిద్ధాంతంపట్ల వీరికి మమకారం అధికం.

అమెరికన్ జీవిత విధానాన్ని మనం అనుసరించడానికి అలీన విధానమే ప్రతిబంధకంగా నిలుస్తున్నదని వీరి నమ్మకం. అందువల్లనే చైనా మిత్రద్రోహాన్ని సాకుగా తీసుకుని, మనం పాశ్చాత్య రాజ్యకూటంలో చేరిపోవాలని వీరు ప్రస్తుతం తీవ్ర ప్రచారం కొనసాగిస్తున్నారు.

ఏమైనా, అలీన విధానాన్ని ఈనాడు అనుసరిస్తున్నది మనమే కాదు; పెక్కు ఆసియా, ఆఫ్రికా రాజ్యాలు దాన్ని పాటిస్తున్నాయి. చైనా మనపై దండయాత్ర చేసినట్లు ఒక అలీన రాజ్యమైన ఈజిప్టుపై బ్రిటన్, ఫ్రాన్సులు ఇదివరలో ముట్టడిని కొనసాగించాయి. అయినా, ఈజిప్టు తన విధానాన్ని మార్చుకోలేదు. పాశ్చాత్య రాజ్యకూటానికి చెందిన రెండు ముఖ్య రాజ్యాలు తనపై యెత్తి వచ్చినవి. అది సోవియెట్ కూటంలో చేరిపోలేదు. అప్పటిలో దానికి సోవియెట్ రష్యా సహాయ సహకారాలు విశేషంగా అవసరమైనాయి; విశేషంగా అవి లభించాయి కూడా. అయినా, ఈజిప్టు తన అలీన విధానాన్ని కాపాడుకొన్నది; దానితో పాటు తన పరిపూర్ణ స్వాతంత్ర్యాన్ని మాత్రమే కాక, అంతర్జాతీయ రంగంలో తన ప్రత్యేక ప్రతి పత్తిని సయితం సంరక్షించుకొన్నది.

ఈజిప్టు అనుసరించిన విధానానికి భిన్నమైనదాన్ని మనం ఎందుకు అనుసరించాలి? ఈజిప్టు కంటె మనది చాలా పెద్దదేశం కావచ్చు. కాని, అగ్రరాజ్యాల కూటాలకున్న అర్థబల మేమి,

ఆయుధ బలమేమి అగస్త్యభ్రాత స్థితికి దిగజారిపోమా? అది వాంఛనీయ స్థితి కాగలదా? నేడు కాకపోతే, మరొకతరానికి, లేదా, రెండు తరాలకు అగ్రరాజ్యం కాదగినట్టిది మన దేశం. ఆ మహోచ్ఛస్థితినే మనం లక్షించాలి. అయినప్పుడు ఏదో ఒక కూటం సరసను చేరడం, దాని పంచను బ్రతకడం మనకు తగునా?

ఈనాడు ప్రపంచం మొత్తం పైనే మహాశక్తిమంతమైన రాజ్యంగా చెల్లుతున్న యునైటెడ్ స్టేట్సు తన జాతీయ సంపదను అభివృద్ధి పరచుకొనడానికి ముందు, తన స్తోమతను పెంచుకొనడానికి ముందు, ఒక శతాబ్దానికి పైగా తాటస్య విధానాన్ని అనుసరించలేదా? ఆ దేశం మొట్టమొదటి ప్రెసిడెంట్ జార్జి వాషింగ్టన్, కొత్తగా స్వాతంత్ర్యం సంపాదించుకొన్న వారికి, ఆర్థిక స్తోమత లేనివారికి, ఆయుధ సంపత్తి పరిమితమైన వారికి తాటస్థ్య విధానమే ఉత్తమోత్తమమైనదని.

ఉద్ఘాటించలేదా? తాటస్థ్య విధానానికి భిన్నమైన దాన్ని, దానికంటే ఉత్తమమైన దాన్ని, ప్రస్తుత ప్రపంచ పరిస్థితులలో మనదేశం యోగక్షేమాలను, దాని గౌరవ ప్రతిష్ఠలను పదిల పరచడానికే కాక, ప్రపంచ శాంతి రక్షణకు దోహద మివ్వడానికి సయితం ఉపకరించగలదాన్ని "అలీన విధానం" అనే పేరుతో మనం అనుసరించడం జార్జి వాషింగ్టన్ హితబోధను పాటించడమే కాదా?

ఈ ప్రశ్నలు ప్రస్తుతం మన అలీన విధానాన్ని నిరసిస్తున్న ప్రబుద్ధులకు తోచనైనా తోచవు.

(ఆంధ్రజ్యోతి 25-12-1962)

2

అలీన విధానాన్ని సరిగా అర్థం చేసుకోలేక దాన్ని అన్యదేశాలు (ముఖ్యంగా అమెరికా) తీవ్రంగా నిరసించిన రోజులు లేక పోలేదు. ఆ రోజులు డల్లెస్ పరమపదించడంతో గడిచిపోయినవనే చెప్పవచ్చు. అలీన విధానాన్ని తటస్థ విధానానికి కేవలం మరొక పేరుగా ఆయన భావించేవారు. కాగా, ఆయన దృష్టిలో కమ్యూనిజం ఒక మహామారి. దేనిపట్లనైనా తటస్థవైఖరి తగును గాని, మహామారి పట్ల తగునా? తటస్థులైనవారిని దయతలచి మహామారి విడిచి పెడుతుందా? అందువల్ల కమ్యూనిజం పట్ల తాటస్థ్యాన్ని వహించడం అవివేకమని యునైటెడ్ స్టేట్సు విదేశాంగమంత్రిగా ఆయన భావిస్తూ వుండేవారు ఇది కేవలం అవివేకం కూడా అని ఆయన విశ్వసిస్తూ వుండేవారు.

డల్లెస్ ఈ చిత్తవృత్తి ప్రపంచ యుద్ధ ప్రమాదాన్ని రెండు మూడుసార్లు సన్నిహితం చేసింది. అయితే, కమ్యూనిజం నిర్మూలనకు ప్రపంచ యుద్ధానికైనా వెనుదీయరాదని డల్లెస్ విశ్వాసం. విదేశాంగమంత్రి కాకపూర్వం ఆయన వ్రాసిన "వార్ అండ్ పీస్" అనే గ్రంథాన్ని చూస్తే ఈ సంగతి స్పష్టపడుతుంది.

అమెరికా స్టేట్ డిపార్ట్మెంట్లో డల్లెస్ తిష్ఠవేసి వుండగా మన అలీన విధానాన్ని తాటస్థ్యంతో జతచేయడ మేమి, మన విధానాన్ని నిరసించడ మేమి విశేషంగా జరిగినా, ఆయన నిర్యాణం తర్వాత ఐసెన్వర్ ప్రభుత్వం సయితం పూర్వాభిప్రాయాన్ని చాలావరకు

మార్చుకొన్నది. నూతన ప్రపంచ యుద్ధ ప్రజ్వలన ప్రమాదాన్ని నివారించడానికి కొరియాలో నేమి, ఇండో-చైనాలో నేమి అలీన రాజ్యంగా ఇండియా చేయగలిగిన కృషి ఫలితంగానే అమెరికా ప్రభుత్వం వైఖరిలో చాలావరకు మార్పు వచ్చిందని చెప్పవచ్చు. ఏమైనా, తాటస్థ్యానికే మరొక పేరు అలీన విధానమని ఈనాడు విమర్శిస్తున్నవారు లేరు. ఏదైనా అలీన రాజ్యం పూర్తిగా అలీన వైఖరిని ప్రదర్శించక, ఏదో ఒక అగ్రరాజ్యకూటం వైపు మొగ్గుచూపుతున్నదని ఈనాడు నింద జరిగితే జరగవచ్చు కాని అలీన, తటస్థ విధానాలకు పేరులో తప్ప భేదం లేదనడానికి, ఈ నిందకు సంబంధం లేదుగదా!

ఒకనాటి అపోహల నుంచి బయటపడి, ఆఫ్రో-ఆసియన్ రాజ్యాలలో పెక్కింటికి శిరోధార్యమైన అలీన విధానాన్ని ఈనాడు మనం విడిచిపెడితే, అది ఆఫ్రికా, ఆసియా ఖండాల పట్లనే మహాపచారం కాబోదా?

చైనా మనపై జరిపిన దండయాత్ర తర్వాత అలీన విధానం మరి మనకు తగదని మన దేశంలో కొందరు ప్రచారం చేస్తున్నా, అమెరికాలో నేమి, తక్కిన పాశ్చాత్య రాజ్యాలలో నేమి ఈ అభిప్రాయం వ్యక్తం కావడం లేదు. పై పెచ్చు, చైనా, ప్రారంభించిన సరిహద్దు యుద్ధం ప్రపంచ యుద్ధంగా రూపొందగల ప్రమాద నివారణకై ఇండియా అలీన విధానాన్నే కొనసాగించడం ప్రస్తుతం మరింత ముఖ్యమనే అభిప్రాయాన్ని ఆ రాజ్యాలలోని విజ్ఞు లందరు వెల్లడిస్తున్నారు. పాశ్చాత్య ప్రభుత్వాలు సయితం చైనా దురాక్రమణ నిరోధానికి మనకు ఆయుధ సహాయం అందజేస్తున్న సందర్భంలో అలీన విధానాన్ని వదులుకోవాలని షరతుపెట్టడం లేదు. ఈ విషయంలో వాటికి లేని పట్టుదల మన దేశీయులలోనే కొందరికి దేనికో?

(ఆంధ్రజ్యోతి 26-12-1962)

3

ఎవరు కాదన్నా, ఎందరు కాదన్నా, మన అలీన విధానమే మన దేశానికి అగ్రరాజ్య కూటాల మైత్రిని సమానంగా సంపాదించగలిగిన దనడంలో సందేహం లేదు. ఇటీవల తాను చేసిన కొన్ని ప్రకటనలలో చైనావారిని తన “సోదరులు"గాను, మనను తన "మిత్రులు"గాను సోవియెట్ ప్రభుత్వం పేర్కొని వుండవచ్చు. ఇంత మాత్రంచేతనే ఎప్పటికైనా అది మన పుట్టి ముంచుతుందని తీర్మానించుకో నక్కరలేదు.

రష్యా, చైనాలు కమ్యూనిస్టు దేశాలు. వాటి మధ్య పరస్పర రక్షణ సంధులున్నాయి. ఈ పరిస్థితులలో అది చైనాపట్ల కొంత మొగ్గు చూపడంలో విడ్డూర మేమీ లేదు. మనకు సంబంధించినంత వరకు “ఈ మొగ్గును అది మన పట్ల వ్యతిరేక చర్యల వరకు పోనిస్తుందా?” అనేదే ముఖ్యమైన ప్రశ్న. ప్రపంచయుద్ధాన్ని పోలిన విపరీత పరిస్థితులలో ఏమి చేస్తుందో చెప్పలేముగాని, ప్రస్తుతానికి మాత్రం సోవియెట్ యూనియన్ మన యోగక్షేమాలకు ప్రమాదకరంగా ప్రవర్తిస్తుందని అనుకోడానికి ఆస్కారం కనబడదు.

కాశ్మీర్ వివాద సందర్భంలో బ్రిటన్, ఫ్రాన్సులు ఎన్నోసార్లు పాక్ ప్రభుత్వాన్ని వెనుక వేసుకు రావడంతో పోల్చినప్పుడు చైనా వారిని తన “సోదరులు"గా సోవియెట్ యూనియన్ పేర్కొనడం విడ్డూరం కాగలదా? ఏమైనా, చైనాతో తనకున్న పలుకుబడిని దురాక్రమణ నుంచి దాని నిరోధించడానికే రష్యా వినియోగించింది. మనపై దండయాత్రను విరమించి, చైనా సైన్యాలు వెనుకకు వెళ్ళడానికి రష్యా చేసిన హెచ్చరికే ప్రధాన కారణమని భావిస్తున్న వారు కొందరు ప్రస్తుతం లేకపోలేదు.

ఇండియాపై అది జరిపిన దురాక్రమణ విషయంలోనే కాక, ఇతర విషయాలు పెక్కింటిలో కూడా చైనాతో రష్యాకు ఇటీవల తీవ్రమైన అభిప్రాయ భేదాలు పొడసూపిన సూచనలు కానవస్తున్నాయి. అల్బేనియాను సాకుగా తీసుకొని రష్యా, యుగోస్లావియాను అడ్డం పెట్టుకొని చైనా కొంత కాలంగా పరస్పర విమర్శలు చేసుకొంటున్నాయి. క్యూబా నుంచి రష్యన్ రాకెట్ల ఉపసంహరణ తర్వాత, ఇండియాపై చైనా ముట్టడి తర్వాత అన్యాపదేశంగా కాక, బాహాటంగానే అవి పరస్పర విమర్శలను ప్రారంభించినట్టు చెప్పవచ్చు. సిద్ధాంత సంబంధమైన విభేదాలతో పాటు, కమ్యూనిస్టు ప్రపంచం నాయకత్వం విషయమై స్పర్ధలు సయితం ప్రస్తుత వివాదంలో గర్భితమైవున్నాయి.

ఈ సరికే ఈ వివాదం కొంతవరకు ముదురుపాకంలో పడింది. ఇటీవల జరిగిన కొన్ని తూర్పు యూరోపియన్ రాజ్యాల కమ్యూనిస్టు పార్టీల సమావేశాలలోనే కాక, ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ సమావేశంలో కూడా చైనాను దుయ్యబట్టడం జరిగింది. మున్ముందు ఏ విధంగా పరిణమించ గలదో అని ఈ వివాదాన్ని దేశ దేశాల ప్రభుత్వాల ఆసక్తితో గమనిస్తున్నాయి. సరిగ ఈ ఘట్టంలో మనం అలీన విధానాన్ని విడనాడాలని, పాశ్చాత్యకూటంలో కొందరు ప్రబుద్ధులు ఆందోళన చేస్తున్నారు. చైనా, రష్యాల మధ్య సన్నిహితత్వం ఎంత తగ్గితే అంతగా ప్రపంచానికి శాంతి, భద్రతలు లభిస్తాయి. ఇండియాను పోలిన ఒక పెద్ద దేశం అలీన విధానాన్ని విడిచిపెట్టడం చైనా, రష్యాలకు మరింత దగ్గరికి తీసుకు రావడానికే తోడ్పడుతుంది. ఆ విధానాన్ని ఇప్పుడు మన ప్రభుత్వం విడనాడాలని వాదిస్తున్నవారికి ప్రపంచ శాంతి భద్రతల విషయమై అంతగా పట్టుదల లేదనే అనుకోవాలి!

నిజానికి ఈ ప్రబుద్ధులు కమ్యూనిజంపై ధర్మయుద్ధాన్ని కోరుతున్నారు. మన సరిహద్దులలో దురాక్రమణ చర్యలకు దిగినట్టిది ఒక కమ్యూనిస్టు రాజ్యమే కాని, మొత్తం కమ్యూనిస్టు ప్రపంచం కాదు. అయినా, వీరు కమ్యూనిస్టు ప్రపంచంతోనే మనం విరోధం పెట్టుకోవాలని, దానిపై ధర్మయుద్ధానికి ఆయత్తపడాలని కోరుతున్నారు. కమ్యూనిజం పట్ల విద్వేషమే వీరిని ఇంతగా వివేక విహీనులను చేస్తున్నదని అనుకోవాలి. (ఆంధ్రజ్యోతి 27-12-1962)

4

అలీన విధానాన్ని వ్యతిరేకిస్తున్నవారి దృష్టిలో ఆ విధానం సగం కమ్యూనిజం ప్రచ్ఛన్నపు కమ్యూనిస్టుగా శ్రీ కృష్ణమీనన్ ను నిందిస్తూ, ఆయన పై వీరు కత్తికట్టడానికి ఒక ముఖ్య కారణం అలీన విధానాన్ని ఆయన మనస్ఫూర్తిగా బలపరచడమే!

ఇదివరలో కృష్ణమీనన్పై కక్ష వహించి, ఆయన పదవి నుంచి విరమించేవరకు విశ్రమించని వర్గాలవారే ప్రస్తుతం అలీన విధానానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధాని నెహ్రూను, ఆయన నాయకత్వాన్ని ముఖాముఖిగా ఢీకొనడానికి వీరికి దమ్ములు లేవు. అందువల్ల అలీన విధానంపై దెబ్బతీయడం ద్వారా నెహ్రూ పైనే దెబ్బతీయవచ్చువని వీరు భావిస్తున్నారు.

అది ఏ దేశమైనా దాని జాతీయ విధానాల స్వరూప స్వభావాలే దాని అంతర్జాతీయ విధానంలో ప్రస్ఫుటమౌతూ వుంటాయి. మన జాతీయ విధానాలకు మన మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ప్రాతిపదిక. అమెరికా వలె మనం పూర్తిగా కేపిటలిస్ట్ విధానాన్ని అనుసరించడం లేదు; రష్యావలె పూర్తిగా సోషలిస్టు విధానాలను అమలుపరచడం లేదు. సోషలిస్టు సమాజ సంస్థాపన మన పరమ లక్ష్యమైనా, ప్రయివేట్ పెట్టుబడికి మనం అవకాశ మివ్వడమే కాదు; దాన్ని ప్రోత్సహిస్తున్నాము. మన ఆర్థిక, పారిశ్రామిక వ్యవస్థలలో పబ్లిక్, ప్రయివేట్ రంగాలకు రెండింటికి స్థానం కల్పిస్తున్నాము.

మన మిశ్రమ ఆర్థిక వ్యవస్థకు అనుగుణమైనదే మన రాజకీయ వ్యవస్థ కూడా. స్వేచ్ఛావ్యాపార సిద్ధాంతాన్ని పూర్తిగా కంట్రోల్ చేస్తూ, స్వేచ్ఛావ్యాపారానికి ఎంత మాత్రం అవకాశ మివ్వని రష్యాలో రాజకీయాలలో ప్రజాస్వామ్యం దాదాపు పూజ్యం. మనది మిశ్రమ ఆర్థిక వ్యవస్థ కనుక, స్వేచ్ఛావ్యాపారం పై కొన్ని విధినిషేధాలతో పాటు, రాజకీయరంగంలో ప్రజాస్వామ్యానికి మనం పూర్తి అవకాశ మిస్తున్నాము.

మన అలీన విధానం స్వరూప స్వభావాలను మన జాతీయ విధానాలే నిర్ణయించాయి. అమెరికా, రష్యాల ఆర్థిక, రాజకీయ విధానాలలో దేన్నీ మనం పూర్తిగా విద్వేషించనట్టే, దేన్నీ పూర్తిగా అనుసరించడంలేదు; ఆ రెండు విధానాల నుంచి వాటిలోని ఉత్తమ లక్షణాలను తీసుకొనడానికి ప్రయత్నిస్తున్నాము. ఈ కారణాన అమెరికా, రష్యాలలో ఒక దానిపట్ల మనకు ప్రత్యేక విద్వేషం సయితం లేదు; ఆ రెండు మహారాజ్యాల మైత్రినే మనం ఆకాంక్షిస్తాము. అవి నాయకత్వం వహిస్తున్న రెండు కూటాలలో దేనిలోను చేరకుండా అలీన విధానాన్ని మనం అనుసరించడానికి మూలమిదే!

ఈ పరిస్థితిలో అలీన విధానాన్ని వ్యతిరేకించడం జాతీయ రంగంలో మన ప్రస్తుత ఆర్థిక, రాజకీయ విధానాల పట్ల వైముఖ్యాన్ని వెల్లడించడమే! మనం పాశ్చాత్య రాజ్య కూటంలో చేరిపోవాలని కోరుతున్నవారు, ఆమాటను ప్రస్తుతం పైకి అనకపోయినా, అమెరికా జీవిత విధానాన్ని మనం అనుసరించాలని, మన సోషలిజం లక్ష్యానికి స్వస్తిచెప్పాలని కోరుతున్నారు. ఇదే వీరి పరమ లక్ష్యం. దీన్ని బాహాటంగా వెల్లడించగల సాహసం లేకనే అలీన విధానాన్ని తమ దుష్ప్రచారానికి ఒక సాకుగా చేసుకొంటున్నారు.

ఈ వ్యాసావళిని ముగించడానికి ముందు అలీన విధానాన్ని బలపరచడం నెహ్రూ నాయకత్వా న్ని, ఆయన జాతీయ, అంతర్జాతీయ విధానాలను బలపరచడమని మేము విజ్ఞప్తి చేయ గోరుతున్నాము. చైనా ప్రమాదాన్ని యెదుర్కొనడానికి మార్గం అలీన విధానాన్ని విడిచి పెట్టడం కాదు; పాశ్చాత్య రాజ్యకూటంలో చేరడం కాదు; నెహ్రూ నాయకత్వాన్ని ఆయన జాతీయ, అంతర్జాతీయ విధానాలను మరింత దీక్షగా, మరింత పట్టుదలతో బలపరచడమే!

(ఆంధ్రజ్యోతి 28-12-1962)

నవ సమాజ లక్ష్యం

సోషలిజం ప్రాతిపదికగా నవ సమాజ నిర్మాణమే కాంగ్రెసు లక్ష్యమని ఆవడి కాంగ్రెసు లక్ష్యమని ఆవడి కాంగ్రెసు తీర్మానించిన నాడు మిన్నకున్న వారు సయితం ఈనాడు ఆ లక్ష్యాన్ని విమర్శిస్తున్నారు; ఆనాడే దాన్ని ఖండించినవారు ఇప్పుడు మరింత తీవ్రవైఖరిని ప్రదర్శిస్తున్నారు. ఈ విధంగా జరగడానికి కారణమేమిటి?

ఆవడి కాంగ్రెసు తీర్మానంలో కొంత అస్పష్టత వున్నమాట నిజం. అది "సోషలిస్టు సొసైటి" నిర్మాణమే తన లక్ష్యమని విస్పష్టంగా ప్రకటించడానికి బదులు "సోషలిస్టిక్" అనేమాట "సోషలిస్ట్"గా మార్చబడినా, ఇది కేవలం మాటలతో గారడీ మాత్రమే కాని మరేమీ కాదని, నవభారత సమాజం పేరుకు మాత్రమే సోషలిస్ట్ సమాజం కానున్నదని కొందరు భ్రమపడి వుండవచ్చు. అట్టివారికి నిజంగానే సోషలిస్ట్ సమాజ స్థాపనకు కాంగ్రెసు సంస్థ, కాంగ్రెసు ప్రభుత్వాలు గట్టి చర్యలను తీసుకొనడం భయాందోళనలను కలిగిస్తున్నవని

అనుకోవాలి. ఇది తప్ప ఆదిలో మిన్నకున్నవారు ఇప్పుడు ఖంగారు పడడానికి, ఆదిలో ఒక మాదిరిగా మాత్రమే ఆక్రోశించిన వారు ఇప్పుడు కొంపలు కూలిపోతున్నట్టు గగ్గోలు పెట్టడానికి వేరొక కారణం కనబడదు.

సోషలిజం స్వాతంత్ర్యాన్ని పరిమితం చేస్తుందని, ప్లానింగ్ ప్రజాస్వామ్యానికి ప్రాణాంతకమని ఇట్టి వారు ఎంతటి విషప్రచారాన్ని చేసినా, సోషలిజం లక్ష్యాన్ని దేశం త్రోసిపుచ్చడమేమి, ప్లానింగ్కు స్వస్తి చెప్పడమేమి జరగడం కల, సోషలిజం, ప్లానింగ్ - ఈ రెండు అభ్యుదయ పథాల వెనుక దేశం ఈ సరికే గణనీయమైన పురోగతిని సాధించింది. అప్రతిహతంగా ఈ పథాల వెంటనే అది ముందుకు సాగిపోతుందే తప్ప, వెనుకకు తిరగడం మరిలేదు. ఆవడి, అమృత్సర్, నాగపూర్ కాంగ్రెసులలో సోషలిజమ్ స్వతంత్ర భారత లక్ష్యమని తీర్మానం చేసినవారే ఆ తీర్మానాలను ఉపసంహరించు కొనగోరినా, ఇప్పటికే పూర్తిగా నాగరితమై, మిన్నందుతున్న సోషలిస్టు శక్తులను అరికట్టడం వారి తరమైనా కాదు.

సోషలిజం ఈనాడు కేవలం కాంగ్రెసు సంస్థ లక్ష్యం మాత్రమే కాదు; అది భారత ప్రజానీకం లక్ష్యం. దానిని ప్రతిఘటించాలని కోరడం జగన్నాథ రథచక్రాలకు అడ్డుగా నిలవడం తప్ప వేరు కాదు. మసానీలు, మునీలు ఒక కోటి మంది ప్రతిఘటించినా, అంతిమ లక్ష్యం చేరేవరకు ఆ మహారథం - ఆ ప్రజా రథం - ఆగబోదు.

సోషలిజం లక్ష్యం విషయమై మరి అస్పష్టత తగదని, అది అచంచలమైనదని, అప్రతిహతమైనదని గాంధీ వర్ధంతి సందర్భంలో నిన్న న్యూఢిల్లీలో ప్రసంగిస్తూ ప్రధాని నెహ్రూ చేసిన హెచ్చరిక కేవలం ఆయన హెచ్చరిక మాత్రమే కాదు; అది భారత ప్రజా సామాన్యపు హెచ్చరిక కూడా. సకాలంలో జరిగిన ఆ సముచితపు హెచ్చరికను నిర్లక్ష్యం చేయడం చేతులార ముప్పును కొనితెచ్చుకొనడమే కాగలదు. (ఆంధ్రప్రభ 1-2-1959)



సర్కారు బడులలో చదువులు మానడం, శాసనసభలను బహిష్కరించడం, చట్టాలను ఉల్లంఘించడం, చెరసాలల ప్రవేశం మొదలైనవి పది పన్నెండేళ్ల కిందట పరాధీనులైన భారత ప్రజల త్యాగానికి, దేశభక్తికి గీటురాళ్లు.

స్వాధీన భారతవర్షంలో దేశ భక్తునికి ఉండవలసిన లక్షణాలు వేరు. శాస్త్రీయ విధానాల ద్వారా ఒక్క ఎకరం భూమిలో రెండు ఎకరాల పంటను పండించే రైతు, పారిశ్రామికోత్పత్తిని పెంచి ప్రణాళికల నిర్వహణకు తోడ్పడే కార్మికుడు, సాంకేతిక విద్యల సభ్యసించి సత్వర దేశాభ్యుదయానికి సాయపడగల విద్యార్థి, అక్రమ లాభాలను ఆశించకుండా న్యాయమైన వెలకు సరకులు సరఫరా చేసే వర్తకుడు, అధికారి నన్న భావం వీడి ప్రజా సేవకునిగా పరిగణించుకునే ప్రభుత్వోద్యోగి... ఇట్టి వారే నేడు నిక్కమైన దేశభక్తులు.

పదేళ్ళక్రితం భారత ప్రజలు తమపై అధికారం చలాయించే విదేశ ప్రభుత్వంతో, దానికి అండగా నిల్చిన పెక్కు అభివృద్ధి నిరోధక శక్తులతో తలపడి పోరాడవలసివచ్చింది. స్వతంత్ర భారతంలో నేడు పోరు సాగించవలసింది ప్రభుత్వం పై కాదు; దారిద్ర్యం, అవిద్య,

అనారోగ్యం, స్వార్థం, సంకుచితం, మూఢ విశ్వాసం, లంచగొండితనం మొదలైన దుష్టశక్తుల పై వాస్తవంలో, స్వాతంత్ర్య సంపాదనకై గాంధిజీ రూపొందించిన ప్రణాళికలలో శాసనోల్లంఘనంతో పాటు ఖద్దరు, స్వదేశీ, అస్పృశ్యతా నివారణ మొదలైన నిర్మాణ కార్యక్రమానికి సమధిక ప్రాముఖ్యం వుండేది. నాటి నిర్మాణ కార్యక్రమ విస్తృత స్వరూపమే ఆర్థికాభ్యుదయ సాధనకు ఉద్దేశించబడిన నేటి పంచవర్ష ప్రణాళికలు.

అయితే అప్పటికి ఇప్పటికి ఒక ప్రధాన భేదం లేకపోలేదు. నాడు ప్రజలు వేరు, ప్రభుత్వం వేరు. కాంగ్రెస్ పతాకకింద నిర్మాణ కార్యక్రమాన్ని ప్రజలే నాడు స్వయం సహాయంతో కొనసాగించారు. నేడు ప్రజా ప్రభుత్వంలో పంచవర్ష ప్రణాళికల విజయం పాలక, పాలితుల పరస్పర సహకారంపై ఆధారపడగలదు. ఒక్కొక పంచవర్ష ప్రణాళిక విజయం భారత భావి భాగ్యోదయానికి సోపానం. అందుచేతనే, ఇండియా ప్రధాని పండిట్ నెహ్రూ నిన్న అంబాలా బహిరంగ సభలో ఉపన్యసిస్తూ దేశంలోని ప్రతి వ్యక్తికి తిండి, బట్ట, ఇల్లు, విద్య, ఆరోగ్యం, వృత్తి మొదలైన వానిని సమకూర్చే సంకల్పంతో 20 సంవత్సరాల ప్రణాళికలను అమలు జరపడానికి ప్రభుత్వం కృషిచేస్తున్నదనీ, రాగల ఆరేడు సంవత్సరాలలో (ద్వితీయ ప్రణాళిక అంత్యానికి) పొలాలలో, ఫ్యాక్టరీలలో ఉత్పత్తిని రెండింతలకు పెంచడానికి దేశీయులు దీక్షతో పాటుపడాలనీ ఉద్బోధించారు.

పై సందర్భంలోనే ప్రధాని నెహ్రూ పేర్కొన్నట్టు 38 ఏళ్ళకిందట సహాయ నిరాకరణోద్యమ కార్యక్రమం ద్వారా "గాంధీ యుగా"నికి కలశారాధన కావించిన నాగపూర్ కాంగ్రెసే తిరిగి నేడు ఇండియా సౌభాగ్య సాధనకై భారతజాతికి వినూత్నమైన, ఉత్తేజకరమైన కార్యక్రమాన్ని సమకూర్చింది.

కాంగ్రెస్ తీర్మానానుసారంగా భూసంస్కరణలు అమలు జరిగి, సహకార వ్యవసాయం ప్రవేశపెట్టబడిన పక్షంలో వ్యవసాయోత్పత్తి విశేషంగా పెరగడానికి, దేశంలోని ప్రతి గ్రామం సౌభాగ్యవంతం కావడానికి, అచిరకాలంలోనే దారిద్ర్యం, అవిద్య, అనారోగ్యాది పీడలు పరిహారం కావడానికి అవకాశం ఏర్పడగలదు. నాగపూర్ కాంగ్రెస్ తీర్మానాలు కాంగ్రెస్ వాదులలో మొత్తంమీద దేశప్రజలలో చైతన్యాన్ని జనింపచేసిన విధంగా, స్వార్థపరులైన కొద్ది మందికి ఆగ్రహం కల్గించి ఉండవచ్చు. కాంగ్రెస్ సంస్థ క్షీణదశలోవున్నదనీ, ప్రజలలో దాని పేరుప్రతిష్ఠలు సన్నగిలుతున్నాయనీ పై వర్గాలు చేసే విమర్శలకు అది కారణం కావచ్చు. అయితే, బలముడుగుతున్న కాంగ్రెస్ తీర్మానాలకు వారంతగా కలవరం చెందవలసిన పనేమో! ప్రజలలో కాంగ్రెస్ బలం తరగడానికి బదులు పెరుగుతున్న దనడానికి పై వర్గాల కలవరమే తార్కాణం. (ఆంధ్రప్రభ 18-1-1959)

జా తీ య త



యావద్భారతంలో నిన్న వైభవోపేతంగా జరిగిన రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో జాతీయ సమైక్యానికే ప్రాధాన్య మివ్వబడింది. బలమైనా, బలహీనతైనా మనకు మన దేశవిస్తృతిలోనే వున్నది; మన దేశ భాషల వైవిధ్యంలోనే వున్నది. యూరోపియన్ రష్యాను మినహాయిస్తే, మిగిలిన యూరప్ ఖండం వైశాల్యమెంతో, అవిభక్త భారతదేశపు విస్తీర్ణ మంత. విభక్తమైన తర్వాత మిగిలిన ఇండియా సయితం ప్రపంచ రాజ్యాలలో పెక్కింటికంటె చాలా పెద్దదే. దేశ విస్తీర్ణంతో పోల్చినప్పుడు మన దేశభాషల సంఖ్య ఏ మంత అధికమైంది కాదు. స్విట్జర్లాండ్ జానెడు, బెత్తెడు దేశమైనా, దానిలో నాలుగు భాషలున్నాయి. మొత్తం స్విస్ జనాభా కంటె ఒక్క తెలుగు మాట్లాడేవారి సంఖ్య ఇంచుమించు పదిరెట్లు. మన దేశవిస్తీర్ణంతో పోల్చినప్పుడు మన జాతీయ సంస్కృతికి వైవిధ్యమివ్వడానికి తగినట్టుగా మాత్రమే మనకు దేశభాషలున్నాయని దీని తాత్పర్యం.

వైశాల్యం రీత్యా ప్రపంచ రాజ్యాలలో బహుశా సప్తమ స్థానాన్ని ఆక్రమిస్తున్న మన దేశాన్ని సమైక్యంగా, శ్రద్ధాభక్తులతో సర్వతోముఖంగా అభివృద్ధి పరచుకుంటే, దానికి అగ్రరాజ్య ప్రతిపత్తి లభించడానికి అట్టే కాలం పట్టదు. ఇట్లా కాక, దేశంలోని పరప్రాంతాలవారు పరాయివారన్నట్టు వ్యవహరిస్తే అచిర కాలంలోనే మనకు తిరిగి అధఃపతనం తప్పదు కూడా. ఈ సూత్రమే మన దేశ భాషలకు సయితం వర్తిస్తుంది. పరస్పర సుహృద్భావంతో, సామరస్యంతో ప్రాంతీయ భాషలను, సారస్వతాలను అభివృద్ధి పరచుకుంటే, సర్వసమృద్ధమైన జాతీయ సంస్కృతికి మనం నోచుకోగలుగుతాము; లేకపోతే, సంస్కృతికే దూరమై, సర్వనాశనమైపోతాము.

అనైక్యంవల్ల అంతఃకలహాలవల్ల జాతీయ స్వాతంత్ర్యాన్ని కోల్పోయి, దాదాపు రెండు శతాబ్దాలపాటు పారతంత్ర్య బాధ ననుభవించి, ఇటీవలనే తిరిగి స్వాతంత్ర్య భాగ్యాన్ని పొందగలిగిన జాతికి నిజానికి ఇవి ప్రత్యేకించి చెప్పవలసిన విషయాలు కానే కావు. అయినా, భాషా రాష్ట్రోద్యమం వెర్రితలలు వేయడంతో పట్టపగ్గాలు లేకుండా ప్రాంతీయ దురభిమానం ఇటీవల కొన్ని వారాలలో పెచ్చు పెరిగి పోయింది. అది దాటని హద్దులు లేవు; చేయని దురాగతాలు లేవు. ఇందువల్లనే రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో ప్రసంగించిన ప్రతి దేశ నాయకుడు జాతీయ సమైక్యావశ్యకతను గురించి ప్రబోధించవలసి వచ్చింది.

స్వభాషా ప్రాంతమేదైనా పరరాష్ట్రంలో మిగిలినంత మాత్రాన అదే పరదేశ ప్రాంతం కాదని, రాష్ట్రాల సరిహద్దుల విషయమై జరిగే ఏ నిర్ణయమైనా సరే మరి సవరణకు వీలులేనిది కాదని, భాషకంటె జాతి గొప్పదని నిన్న యావద్భారతంలోనే మత, కుల, వర్గ, భాషా విభేదా లేవీ లేకుండా ప్రజలందరు జరుపుకొన్న మహోత్సవం తర్వాతనైనా సర్వత్రా గుర్తించ బడగలదని ఆశిస్తున్నాము.

(ఆంధ్రప్రభ 28-1-1956)

ఈనాడు ఏమి కావాలి?

మా నిన్నటి, మొన్నటి సంపాదకీయాలు రెండు విభిన్న విషయాలను గురించి. అయితే, మన ప్రగతిని గురించి, మన భవిష్యత్తును గురించి ఆందోళన! ప్రగతికి నిదర్శనాలు ఎక్కువ రోడ్లు, ఎక్కువ వంతెనలు, ఎక్కువ కార్లు, బస్సులు, లారీలు, ఎక్కువ రైళ్లు, విమానాలు, ఎక్కువ స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీలు - ఇట్టివి మాత్రమే కావు. మన భవిష్యత్తులు, మరింతగా జాతీయాదాయం మొదలైనవి మాత్రమే కావు. ఇవి ముఖ్యావసరాలే. కాని, ఇవి మాత్రమే చాలవు. వీటికంటే మిన్నగా మరొకటి కావాలి. అది మన దృక్పథంలో ప్రాథమికమైన మార్పు, విప్లవాత్మకమైన పరివర్తన.

మన సంస్కృతి, మన నాగరికత హరప్పా, మొహెంజొదారోల కాలం నుంచి దాదాపు క్రీస్తుశకం ఏడెనిమిది శతాబ్దాలవరకు వికాసాన్ని పొందుతూ వచ్చాయి. అటుతర్వాత అవి ఎందుకు క్షీణస్థితిలో పడిపోయాయి? మనలో మౌలికచింతన ఎందుకు నశించింది? వ్యాఖ్యానాల పై వ్యాఖ్యానాలు ఎందుకు ప్రారంభమైనాయి? అటు రోమ్మునుంచి, ఇటు ఫిలిప్పీన్స వరకు, ఆ పై వరకు కూడా నౌకావ్యాపారాన్ని చేస్తూవచ్చిన జాతి సముద్రయానాన్ని ఒక మహాపాపంగా పరిగణించే ఘోరస్థితికి ఎందుకు దిగజారింది? గణిత, ఖగోళ, రసాయనిక, వైద్య, ఖనిజాది అనేకశాస్త్రాలలో మానవవిజ్ఞానాన్ని సుసంపన్నం చేసిన జాతి ప్రతి అంధ విశ్వాసానికి, ప్రతి మూఢాచారానికి మారు పేరుగా ఎందుకు మారింది? శూద్రులకోసం, ఇతర పామరజనులకోసం సూతులు స్థాపించిన పౌరాణిక మతమే అన్నివర్గాల మతంగా ఎందుకు స్థిరపడింది? ఈ విధమైన ప్రశ్నలు వేసుకొనకపోతే, వీటికి నిజమైన సమాధానాలు నిష్కర్షగా తెలుసుకొనడానికి ప్రయత్నించక పోతే, మనకు ప్రగతి లేదు, భద్రతలేదు, భవిష్యత్తు లేదు. అయినా, ఈ ప్రశ్నలు వేసుకుంటున్నవారు కోటికి ఒక్కరైనా కానరావడం లేదు; వీటికి నిజమైన సమాధానాలను నిష్కర్షగా తెలుసుకొనడానికి ప్రయత్నం అంతకంటే కూడా అరుదుగా కానవస్తున్నది.

ఏ విప్లవమైనా అది మనస్సులో ప్రారంభం కావాలి. నవచింతనలేనిదే నవసమాజం లేదు, నవజీవనం లేదు. కడచిన నాలుగైదు శతాబ్దాలలో యూరపు మహోజ్వలస్థితికి తెచ్చినవారు ట్రెవిథిక్, జేమ్స్ వాట్, ఆర్కైట్, కార్ట్‌రైట్లను పోలిన "ఇన్వెంటర్స్" కాదు; ఫ్రాన్సిస్ బేకన్, న్యూటన్, లాక్, హ్యూమ్, బెంథమ్, వాల్టేర్, రూసోలను పోలిన మౌలిక భావుకులే. రెండవవర్గం వారే ప్రతిదాన్ని ప్రశ్నించడాన్ని - ప్రతిదాన్ని పరిశీలించడాన్ని - యూరపక్కు నేర్పారు; వీరే యూరప్ దృక్పథాన్ని మార్చారు; వీరే యూరప్లోనే కాక ప్రపంచం మొత్తంలోనే ఆధునిక యుగానికి మూలపురుషులైనారు.

వీరు తెచ్చిన భావవిప్లవాన్ని పోలిందే మన దేశంలోకూడా ప్రారంభం కావాలి. అప్పుడుగాని మతమౌఢ్యాల ప్రాబల్యం తగ్గదు, అప్పుడుగాని కులశాఖాది సంకుచిత్వాలు సడలవు, అప్పుడుగాని సాంఘిక దురాచారాలు సమసిపోవు, అప్పుడుగాని మనకు వెన్నెముక ఏర్పడదు, అప్పుడుగాని, వివేకానంద హెచ్చరించినట్టు మనం మగటిమి చూపలేము.

నిన్నటి మన జాతీయవిప్లవ సందర్భంలోగాని, ఇప్పటి సోషలిస్టు విప్లవ నినాదాల సందర్భంలోగాని దాదాపు కానరానిది ఈ భావవిప్లవమే. పాతబూజు మన మనస్సులనుంచి వదలడంలేదు; పాత పుంతలనుంచి మన ఆలోచనలు తప్పుకొనడం లేదు. పైగా, ఇతరదేశాలకు లేని ఏదో ఆధ్యాత్మిక సంపత్తి మనకున్న దన్న భ్రమ మనలను పీడిస్తున్నది. బియ్యంలో రాళ్ళు రప్పలను కలపడంలో, మందు మాకులను సయితం కల్తీచేయడంలో, దొంగనిల్వను చేసి, కరవు కాటకాలను కల్పించడంలో వున్నదేమో ఈ ఆధ్యాత్మిక సంపత్తి!

చదువు సంధ్యలు లేనివారు, సంస్కృతి లేనివారు, ఎంత అంధప్రాయంగా, ఎంత మూఢంగా ప్రవర్తించినా, దాన్ని కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. కాని, యూనివర్శిటీ డిగ్రీ లున్నవారిలోనే, సాంఘికంగానో, రాజకీయంగానో, మరొక విధంగానో సంఘానికి నాయకత్వం వహిస్తున్నవారిలోనే నూటికి తొంభై తొమ్మిదిమంది అతి సంకుచితంగా ఆలోచిస్తున్నారు. పరమమూఢులవలె సంచరిస్తున్నారు. అయినప్పుడు, మనం నిజమైన ప్రగతిని సాధించ గలమా, మన భవిష్యత్తును గురించి ధైర్యంగా వుండగలమా?

రెండు వందల సంవత్సరాల క్రితం రాజా రామమోహన్ రాయ్ మనకు వైజ్ఞానిక దృక్పథం కావాలన్నాడు. ఇటీవల సరిగా ఇదే మాటను జవహర్ లాల్ నెహ్రూ పదే పదే చెప్పాడు. ఈ విషయంలో నెహ్రూకంటే కూడా ఎమ్. ఎన్. రాయ్ ముందుకు వెళ్లాడు. అయినా, ఇంటి కొక అమ్మ, వీధికొక స్వామి, ఊరు కొక బాబా, నాడు కొక అవతార పురుషుడు వెలుస్తున్నారు; వారి అనుగ్రహంకోసం, వారి ఆశీస్సులకోసం వేలాదిగా, లక్షల కొలదిగా విద్యాధికులే పడిగాపులు కాస్తున్నారు! నానాటికి మనలో పెంపొందుతున్నది వైజ్ఞానిక దృక్పథం కాదు, మూఢాతిమూఢవిశ్వాసం! ఈ పరిస్థితి ఎప్పటికి మారుతుందో, అసలు మారుతుందో, లేదో తెలియదు. ఇది మారనంతవరకు మనకు నిజమైన ప్రగతి సున్న, మనకు ఉజ్వలమైన భవిష్యత్తు హుళక్కి !!

(ఆంధ్రజ్యోతి 3-9-1972)

నందికొండ

నందికొండ ప్రాజెక్టు నిర్మాణం విషయమై ఆంధ్ర, హైదరాబాద్ ప్రభుత్వాల మధ్య విభిన్నాభి ప్రాయాలు లేవు. కృష్ణా నదిపై కట్టవలసిన కొత్త ప్రాజెక్టులలో దాన్నే ముందుగా - ఇంతే కాదు, వెంటనే కూడా - ప్రారంభించాలని ఉభయ ప్రభుత్వాలు అంగీకరిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో ఒక నిర్ణయానికి తొందరపాటు చూపుతున్నది.

అయితే, నందికొండ ఆనకట్ట ఎత్తు విషయం మాత్రం ఇప్పటికీ ఖచ్చితంగా తేలలేదు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన తమ తొలి పథకంలో హైదరాబాద్ ప్రభుత్వంవారు ఆనకట్ట యెత్తు "ఎఫ్. ఆర్. ఎల్"కు పైన *(ఫుల్ రిజర్వాయర్ లెవెల్ కుపైన)* 540 అడుగులకు తగ్గరాదని భోస్లా కమిటీ అభిప్రాయపడింది. *(నివేదిక. 50 వ పేజీ)*

ప్రకారం - ఆనకట్ట యెత్తు పెరిగినకొద్దీ ప్రాజెక్టుకై ఖర్చు పెట్టవలసిన మొత్తం పెరగగలదనడం నిర్వివాదం. కాని, తగు ప్రతిఫలం లభించగల పరిస్థితిలో అదనపు వ్యయానికి సంకోచించ నక్కరలేదు. నందికొండ ఆనకట్టను 590 అడుగులు యెత్తుకు కట్టిన పక్షంలో - భోస్లా కమిటీ అంచనాల ఆ ప్రాజెక్టు కింద ఆంధ్రరాష్ట్రంలో కుడికాల్వ క్రింద సాగుకాగల భూమిదాదాపు 25 లక్షల ఎకరాలు. *(నివేదిక. 11 వ పేజీ)* పోతే, ఆనకట్ట యెత్తును 566 అడుగులకు పరిమితం చేస్తే, కొత్త ఆయకట్టు 15 లక్షల ఎకరాలకు మించదు. భోస్లా కమిటీ సూచించినట్టు 590 అడుగుల ఎత్తుకు కాక, 566 అడుగుల ఎత్తుకే ఆనకట్ట కట్టడం వల్ల కలిసివచ్చే ఖర్చు ఆరున్నరకోట్ల రూపాయలు మాత్రమే కాగలదట. ఖర్చులో ఆరున్నర కోట్ల తగ్గింపును చూచుకొని, పదిలక్షల యెకరాల కొత్త ఆయకట్టును వదులు కొనడం శ్రేయస్కరం కాబోదు. ఆరున్నరకోట్ల అదనపు ఖర్చు అంటే, అదనంగా చేరే ఆయకట్టుపై ఎకరానికి 65 రూపాయల చొప్పున మాత్రమే హెచ్చుఖర్చు. దానిలో ఎక్కువ భాగాన్ని రైతులవద్ద "బెటర్మెంట్" పన్నుగా తేలికగా పుచ్చుకోవచ్చు.

అయినా, మరి 24 అడుగుల యెత్తుకు ఆనకట్ట కట్టడానికి అదనంగా ఆరున్నర కోట్లు ఖర్చు పెట్టడంకంటె 566 అడుగుల యెత్తుకు సమ్మతించడమే మంచిదని ఆంధ్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తున్నది. నిజమైతే, ఇది శోచనీయం. నందికొండవద్ద ఆనకట్ట యెత్తు పెంచడంవల్ల ఎక్కువ ఖర్చుకాగల పక్షంలో ఆనకట్ట యెత్తు ఎంతై నప్పటికీ హైదరాబాద్ ప్రభుత్వానికి అభ్యంతరం వుండనక్కర లేదు. పైగా, సిద్ధేశ్వరం, పులిచింతల ప్రాజెక్టుల వల్ల హైదరాబాద్లో మునిగి పోయే సాగు లాయకు భూమి అధికం కావచ్చునేమోగాని, నందికొండవల్ల కలిగే ఈ ముంపు చాలా కొద్ది పైగా, హైదరాబాద్ వైపున నందికొండవల్ల మునిగే సాగులాయకు భూమి 29,472 ఎకరాలు మాత్రమని ఆ ప్రభుత్వం ప్లానింగ్ కమిషన్కు అందజేసిన మెమోరాండమే పేర్కొంటున్నది. నందికొండవల్ల మునిగే దానిలో ఎక్కువ భాగం కొండల, అడవుల ప్రాంతమని భోస్లా కమిటీ కూడా స్పష్టపరచింది. ఈ కారణాన కూడా అదనపు ఖర్చుకు మనం సిద్ధపడితే నందికొండ ఆనకట్ట యెత్తును పెంచడానికి హైదరాబాద్కు అభ్యంతరం ఏమీ వుండనక్కర లేదు.

అయినా తగినంత ఆర్థికస్తోమత లేదని కాని, మరొక కారణంవల్ల కాని, 566 అడుగులకే నందికొండ ఆనకట్ట యెత్తును పరిమితం చేయడానికి ఆంధ్ర ప్రభుత్వం నిర్ణయిస్తే, మున్ముందు దాని యెత్తును 590 అడుగులకు పెంచుకొనడానికి వీలుగా దానికి పునాదులు వగైరాలనైనా ఏర్పాటు చేయాలి.

కాగా, సిద్ధేశ్వరం, పులిచింతల ప్రాజెక్టుల సంగతి; వాటివల్ల తమ ప్రాంతాలు కొంత ఎక్కువగా ముంపుకు లోనైనప్పటికీ, సమష్టిక్షేమాన్ని కోరివాటి నిర్మాణానికి హైదరాబాద్ ప్రభుత్వం మున్ముందు తప్పక సమ్మతించగలదనే ఆశిస్తున్నాము.

తుంగభద్ర, నందికొండ ప్రాజెక్టుల నిర్మాణంలో కొనసాగుతున్న కొనసాగగల సహకారం సిద్ధేశ్వరం, పులిచింతల విషయంలో కొరవడితే, అది ఆంధ్రజాతి భవితవ్యానికే ముప్పు తేగలదని హైదరాబాద్ ప్రభుత్వం తప్పక గుర్తించగలదనే మా విశ్వాసం.

మరొక విషయం: నందికొండ ప్రాజెక్టువల్ల నాగార్జున కొండ శిల్పావశేషాలకు దెబ్బతగలదని భారత ప్రభుత్వ పురాతత్త్వశాఖవారు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంలో ఒక విచారణ సంఘాన్ని మొన్ననే వారు నాగార్జున కొండకు పంపించారు కూడా. చరిత్ర ప్రసిద్ధికెక్కిన నాగార్జునకొండ కళాక్షేత్రం పట్ల ప్రేమాభిమానాలలో ఆంధ్రులు ఎవ్వరికీ తీసిపోరు. కాని, ఏవో కొన్ని శిల్పావశేషాల పరిరక్షణకు లక్షోపలక్షల కర్షకుల భవితవ్యాన్ని పణంగా పెట్టడానికి వారు అంగీకరించరు. నాగార్జున కొండలో తవ్వకాలు చాలా వగకు ఇదివరకే పూర్తి అయినాయి. ఇంకా జరగవలసి వుంటే, వాటిని రెండు, మూడేళ్లలోపల ముగించి, దొరికిన శిల్పాలన్నింటిని వేరొక చోటుకు తరలించుకోవచ్చు. ఆంధ్రరాష్ట్రానికి ఇప్పుడొక మ్యూజియం లేదు. నాగార్జున శిల్పాల తరలింపు పేరుతో నైనా, అట్టిది త్వరలో ఏర్పడితే అంతకంటే సంతసించదగ్గ విషయం వుండదు. (ఆంధ్రప్రభ 10-2-1954)

జలమార్గాలు

సరుకుల రవాణాకేమి, తక్కువ దూరాలకు ప్రయాణీకుల రాకపోకలకేమి దేశంలోని జలమార్గాలను వృద్ధిపరచడం చాలా అవసరం.

కొంచెం నిదానంగా చేరినా, రైళ్లు, లారీలతో కంటె పడవలతో సరకులను ఎంతటి దూరప్రదేశాలకైనా కారు చౌకగా రవాణా చెయ్యవచ్చు. ఉదాహరణకు, కాకినాడ రేవు నుంచి రాజమండ్రికి రైలు మీదగాని, లారీల పైగానీ ఒక బస్తాబియ్యం రవాణా చెయ్యడానికి నాలుగణాలు ఖర్చు కాగా, అదే సరుకు పడవలో తెప్పించడానికి అర్ధణాకంటే ఎక్కువ వెచ్చించనక్కరలేదు. పారిశ్రామికంగా బాగా వృద్ధిపొంది, మిక్కిలి భాగ్యవంతమైన దేశాల మాట ఎలావున్నా, ఇప్పుడిప్పుడే పారిశ్రామిక సంపదను పెంపొందించుకుంటున్న ఇండియా వంటి పేద దేశంలో ఎక్కువ ఖర్చు చేయవలసిన అవసరం లేని రవాణా సదుపాయాలను వృద్ధిపరచుకొనడం చాలా ముఖ్యం.

అదృష్టవశంచే భారతదేశం ఉత్తరం నుంచి దక్షిణం వరకు పెక్కు జీవ నదులను, అనేక ఉపనదులను కలిగివుండడం వల్ల మొత్తం దేశంలోని జల మార్గాలను వృద్ధిచేసుకోడానికి విపులావకాశా లున్నాయి. దేశంలో రైలు మార్గాలు పడక పూర్వం, 19 వ శతాబ్దం పూర్వార్థం వరకు కూడా సమస్తమైన సరుకులు పడవల పైనే ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి రవాణా చెయ్యబడేవి.

రైలు వచ్చిన తర్వాత, అనేక కారణాలవల్ల దేశంలోని జలమార్గాలు చాలావరకు నిరుపయోగమై పోయినా, ఇండియా మొత్తంమీద ఇప్పటికీ ఆధునిక యంత్ర సహాయం గల పడవలు మొదలైన వానితో ప్రయాణం చెయ్యడానికి వీలైన జల మార్గం 5,000 మైళ్ల వరకు ఉండవచ్చునని ద్వితీయ పంచవర్ష ప్రణాళిక కర్తలు అంచనా వేశారు.

జలమార్గాల ప్రాముఖ్యాన్ని ప్లానింగ్ కమిషన్ గుర్తించినా, రెండవ పంచవర్ష ప్రణాళికలో వాటి అభివృద్ధికి సుమారు మూడున్నర కోట్ల రూపాయలు మాత్రమే ప్రత్యేకించబడినవి. అందుచేత, జల మార్గాలపై రవాణా సౌకర్యాల సమగ్ర పరిశీలనకై తుంగభద్రబోర్డు

అధ్యక్షుడైన శ్రీ బి.కె. గోఖలే అధ్యక్షత కింద, మరికొందరు నిపుణులతో భారత ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించడం హర్షించదగింది.

నదులు, కాల్వలద్వారా తూర్పు కోస్తాలో సరాసరి రవాణా సర్వీసును ఏర్పాటు చెయ్యడమే కాకుండా, ఉత్తరాన గల గంగానదిని దక్షిణపు కొనయందున్న కావేరీతో కలిపి ఉత్తర దక్షిణాలకు ముడిపెట్టే బృహత్ప్రణాళికను గురించి కూడా పై కమిటీ పరిశీలించగలదని మన న్యూఢిల్లీ ప్రత్యేక విలేకరి మొన్న తెలియచేశాడు.

అంతేకాదు. చిన్న చిన్న పడవల మీదుగా జరిగే రవాణా ఇప్పటికంటే విస్తృతంగా, సమర్థంగా జరిగేట్టు చెయ్యడానికి, సహకార పద్ధతుల పై వాటిని నిర్వహించడానికి, అవసరమున్న చోట్ల యంత్ర సహాయాన్ని కూడా వినియోగించుకోడానికి అవకాశాలన్నిటిని పై కమిటీ సమగ్రంగా పరిశీలించగలదని తెలుస్తున్నది. నిజానికి ప్రథమ పంచవర్ష ప్రణాళిక గడువు లోపలనే జరగవలసిన ఈ పనిని ఇంతటనైనా ప్రభుత్వం తలపెట్టడం ముదావహం. కృష్ణా, గోదావరి, తుంగభద్రాది మహానదులు గల ఆంధ్రప్రదేశ్కు పై కమిటీ సూచనలు విశేషంగా ఉపయోగపడగలవు. ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో కేటాయించబడిన 3 1/2 కోట్లలో 1 కోటి 15 లక్షల రూపాయలు బకింగ్హాం కాలువ అభివృద్ధికిగాను వెచ్చించడానికి ప్రభుత్వం నిశ్చయించిన మాట వాస్తవమే. బకింగ్ హాం కాల్వ మొత్తం పొడవు 258 మైళ్లలో దాదాపు 200 మైళ్లు ఆంధ్ర ప్రాంతంలోనిదే కావడంచే ఆ కాల్వ అభివృద్ధి తెనుగు జిల్లాలకు ఉపకరించే మాట కూడా నిజమే. కాని, కృష్ణా, గోదావరి, తుంగ భద్రానదులకు సంబంధించి మొత్తం ఆంధ్రదేశంలో 1,200 మైళ్లు పడవల ప్రయాణానికి అనువైన కాలువలున్నాయి. వీటిపై ఏడాదికి 11 నెలలు నిరాటంకంగా పడవలు రాకపోకలు సాగించవచ్చు. ప్రస్తుతం నెల్లూరు, గుంటూరు, కృష్ణ, ఉభయ గోదావరి జిల్లాలకు మాత్రమే కాల్వల ద్వారా సంబంధం ఏర్పడివున్నది. పై మూడు నదులకు తగు ప్రణాళికతో కాలువలను నిర్మించిన పక్షంలో మొత్తం ఆంధ్రప్రదేశానికి కాకపోయినా ఇంకా అనేక జిల్లాలకు జల మార్గాల సౌకర్యాన్ని అందజెయ్యవచ్చు.

ఇండియా మొత్తంమీద జల మార్గాల అభివృద్ధి నిమిత్తంగానీ, ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో చాలా వెనుకబడిన తెనుగుదేశం పురోభివృద్ధిని ఆశించే కాని ఇట్టి కార్యక్రమం ఎంత త్వరగా కొనసాగితే అంతమేలు. (ఆంధ్రప్రభ 23-2-1957)

వంశధార ప్రాజెక్టు

"వినాయకుని పెండ్లికి వెయ్యి విఘ్నాలు" అని సామెత. వెయ్యి కాకపోయినా, ఒక వంద విఘ్నాలైనా వంశధార ప్రాజెక్టుకు తప్పలేదు. ఏనాడో ఈ ప్రాజెక్టు అవసరం గుర్తించబడింది. దీని నిర్మాణానికి సంకల్పించబడింది కూడా. అయినా, ఎప్పటి కప్పుడు ఒరిస్సా ప్రభుత్వం కొన్ని సందేహాలను, కొన్ని సంకోచాలను వెలిబుచ్చింది. వీటిని తీర్చడానికి ఆంధ్రప్రభుత్వం తన కన్సల్టింగ్ ఇంజనీర్ శ్రీ వెంకట కృష్ణయ్యర్ను హుటాహుటిగా భువనేశ్వర్కు పంపించవలసి వచ్చింది.

అభిజ్ఞవర్గాల కథనం ప్రకారం ఒరిస్సా ప్రభుత్వానికి కలిగిన సందేహాలైనా, సంకోచాలైనా బహు స్వల్పమైనవట. ప్రాజెక్టుకింద ఎంత భూమి మునిగిపోతుంది? వరద కట్ట కట్టినప్పుడు దాని ఫలితాలేమి కాగలవు? - ఇట్టి ప్రశ్నలకు చివరి క్షణంలో ఒరిస్సాకు సమాధానాలు కావలసి వచ్చినవట.

చాలా కాలంగా ఈ విషయాలన్నీ చర్చలలో నలుగుతున్నవే! అయినా, అడ్డుపుల్ల వెయ్యగల తాహతువున్నవారు "బులావ్" అనకుండా వుంటారా? అంటే, పరుగులు పెట్టక తప్పుతుందా? మనకు ఎన్ని నదులున్నా వాటికి అత్తిల్లు మన ఆంధ్రప్రదేశ్ కాగా, పుట్టిల్లు అన్యరాష్ట్రాలు. అందు వల్లనే చిన్న పెద్ద ప్రాజెక్టులను దేనిని తలపెట్టినా ఇతర రాష్ట్రాలనుంచి మనకు అడుగడుగుకు చిక్కులు చికాకులు తప్పడం లేదు.

ఏమైనా, ఎట్టకేలకు వంశధార ప్రాజెక్టుకు ఆంధ్రముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య చల్లని చేతిపైగా నేడు శంకుస్థాపన జరిగింది కనుక, త్వరితంగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాగలదని, తరచు దుర్భిక్షానికి లోనౌతూ వుండే శ్రీ కాకుళం జిల్లా కడగండ్లు తీరగల కాలం ఎంతో దూరంలో లేదని ఆశించవచ్చు. జలధారల కొరత లేకపోయినా, అవి సద్వినియోగం కానందువల్ల శ్రీకాకుళం జిల్లా (రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలవలె) అనేక కష్ట నష్టాలకు గురి కావలసి వస్తున్నది. వంశధార ప్రాజెక్టుకు శంకుస్థాపన ఆ జిల్లా చరిత్రలో ఒక నవశకానికి సిరిసంపత్తులకు ఆలవాలం కాగల నవ శకానికి నాంది కావలెనని మనసారా మేము కోరుతున్నాము.

నీరడివద్ద ఆనకట్ట కట్టి, గొట్ట వద్ద రిజర్వాయర్ ఏర్పాటు చేస్తే, వంశధార ప్రాజెక్టు కింద దాదాపు మూడు లక్షల ఎకరాలకు పంటనీటి సౌకర్యం లభించగలదని ఇప్పటి అంచనా. ఆనకట్టకు, రిజర్వాయర్కు కాగల ఖర్చు పది కోట్లు. ఈ పది కోట్లకు మించి మరి ఒకటి, రెండు కోట్లు ఈ పది కోట్లకు మించి మరి ఒకటి, రెండు కోట్లు ఎక్కువ ఖర్చుపెట్ట వలసివచ్చినా, మూడవ పంచవర్ష ప్రణాళిక పూర్తి కాక ముందే ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి దీక్షతో కృషి జరగగలదనే విశ్వసిస్తున్నాము. (ఆంధ్రజ్యోతి 12-2-శార్వరి)

నియంతలు నియంతృత్వం

ప్రజాస్వామ్యంతో విసుగెత్తిన సందర్భాలలో కొందరు "దేశ పరిస్థితులను చక్కదిద్దడానికి కొంతకాలంపాటు సైనిక నియంతృత్వం నెలకొనా"లని కోరుకొనడంకద్దు. మన దేశంలో సయితం ఈ కోర్కెను కొందరు అక్కడక్కడ చెదురుగా వెల్లడిస్తున్నారు. ఇట్టివారు ఒక ముఖ్య విషయాన్ని మరచి పోతూవుంటారు. అది సైనిక నియంతృత్వమైనా, మరొక నియంతృత్వమైనా రమ్మనప్పుడు రావచ్చుగాని, పొమ్మన్నప్పుడు పోదు.

నియంతృత్వాన్ని నెలకొల్పిన వ్యక్తిని, అతడు బలహీనపడితే, మరొకడు తొలగించవచ్చు. అయితే, వచ్చే మార్పు ఒక నియంత స్థానాన్ని మరొకడు ఆక్రమించడమే! పాకిస్తాన్లో అయూబ్ పోతే, అతడి స్థానంలో యహ్యాఖాన్ బైఠాయించలేదా? నియంత ఎవరిని శాసించినా, మృత్యువును కాబట్టి అతడు కాలధర్మం చెందితే, అతడి స్థానాన్ని మరొక నియంత ఆక్రమించడం తరచు జరుగుతూ వుంటుంది. ఈజిప్టులో నాసర్ కాలధర్మం చెందగా, అతడి స్థానానికి రాలేదా?

స్వజన, పరజన భేదం లేదు. తమ పదవికి, తమ ప్రాబల్యానికి అడ్డుగా తోస్తే చాలు, ఎవరినైనావారు ఊచకోతకోస్తారు. స్త్రీలు, శిశువులు, వృద్ధులన్న వేంకోచమైనా లేకుండా, తూర్పు పాకిస్తాన్లో వేలమందిని, లక్షలమందిని యాహ్యాఖాన్ ఈనాడు దంపడం లేదా? జనపదాలపై టాంకులను, విమానాలను ప్రయోగించడం లేదా?

నాయకత్వం విషయంలో తమకు ప్రత్యర్థులు కాగలరని తోస్తే, తమ సహచరులను , కొన్ని సందర్భాలలో వారిని "సఫా" చేయించడానికి సయితం నియంతలు వేంకోచించరు; ఈజిప్టులో వారం, పదిరోజుల లోపల సాదత్ తన సహచరులలో ఎంతమందిని చదవీభ్రష్టులను చేయలేదు, ఎంత మందిని కారాగారబద్ధులను చేయలేదు?

హిట్లర్, ముసోలినీ, స్టాలిన్లతో నియంతలు ప్రారంభం కాలేదు; యాహ్యాఖాన్, సాదత్, మావోలతో యంతలు అంతం కాబోవడం లేదు. ప్రజాస్వామ్యంపట్ల, ప్రజాస్వామ్య జీవితవిధానంపట్ల, ఎప్పుడూ ప్రజల్లో పట్టుదల తగ్గుతుందో, ఎప్పుడు అనాలోచితంగా

వారు “కొంతకాలంపాటు మనకు మన దేశానికి నియంతృత్వకావా”లని కోరుకొనడం ప్రారంభిస్తారో, అప్పుడు నియంతలు తలయెత్తుతూవుంటారు. అందువల్ల స్వాతంత్రప్రియులు, ప్రజాస్వామ్యాభిలాషులు చివరికి కలలోనైనా కొంతకాలం పాటు నియంతృత్వం కావాలని కోరుకోరాదు.

వెనుకటి కాలంలోకంటే ఇప్పుడు నియంతలు నూరు రెట్లు, వెయ్యి రెట్లు ఎక్కువగా కావాలనడమేమి, కాల్చుకు తినడమేమి జరుగుతున్నది. ఇందుకువలసిన సాధన సంపత్తిని సైన్సు వారిచేతిలో పెడుతున్నది. ఇంచుమించుగా ఒక శతాబ్దంక్రితం నియంతలకు లేని టెలిఫోన్, రేడియో, టెలివిజన్, విమానాలు, టాంకులు మొదలైనవి ఈనాడు వారి కున్నాయి. వాటివల్ల ఒక జెంఘిస్ ఖాన్ కు, ఒక అటిల్లాకు, ఒక నెపోలియన్కు లేని శక్తి వారికి సిద్ధిస్తున్నది; సాధనాలను భయ పెట్టడానికివలె వ్యామోహ పెట్టడానికి సయితం వారు వినియోగించు కొన గలుగుతున్నారు. వ్యామోహపరచగల ఈ శక్తివల్లనే ఇదివరలో హిట్లర్, ముసోలీనీ, స్టాలిన్లు అతీతమానవులుగా, అపరదేవతలుగా చెల్లగలివారు; మావో ఇదే విధంగా ప్రస్తుతం చెల్లుతున్నాడు. ప్రజాస్వామ్యంలో ఎన్ని లోపాలున్నా, దానిలో ఎంత జాప్యం జరిగినా, కొంతవరకు అవినీతి, ఆశ్రితపక్షపాతం మున్నగు దుర్లక్షణాలు తప్పక పోయినా, మానవత్వపు విలువలలో నియంతృత్వంకంటే అది వందరెట్లు, వెయ్యిరెట్లు మెరుగు. ఈ సంగతిని గుర్తించలేనివారే “కొంత కాలంపాటు నియంతృత్వం కావా” లంటారు. (మే 17, 1971)

విదేశాలకు వెళ్ళినప్పుడు...

“ఆలోచన తక్కువ, ఆకలెక్కువ” కాబట్టే, “కాగల కార్యాన్ని గంధర్వులే తీర్చా”రని భీముడనగలిగాడు. కౌరవ పాండవుల మధ్య ఎన్ని విభేదాలున్నా, వారు అన్నదమ్ముల బిడ్డలు; గంధర్వులేమో పరాయివారు. వీలుపడితే రాయబారాల ద్వారా, వీలుకాకపోతే రణరంగం ద్వారా అన్నదమ్ముల మధ్య వచ్చే వ్యవహారాలన్నీ పరిష్కారం కావాలి. అంతే తప్ప, పరుల జోక్యాన్ని సహించరాదు. అన్నదమ్ములలో ఈనాడు ఒక పక్షాన్ని కాలరాచినవారు, రేపు రెండవ పక్షాన్ని కూడా ఇదేవిధంగా అణచివేయవచ్చునన్న ప్రమాదాన్ని ఆవేశపరుడైన భీముడు కానకపోయినా, ఆలోచనా పరుడైన ధర్మరాజు గుర్తించ గలిగాడు. అందువల్లనే ఆయన “మనలో మనకు కలహం వస్తే, వారు నూర్గురు; మనం ఐదుగురం" అని కలకాలానికీ శిరోధార్యమైన మహత్తర సూత్రాన్ని ప్రవచించాడు.

ఏనాడో ధర్మరాజు ప్రవచించిన ఈ సూత్రాన్ని ప్రత్యేకించి జ్ఞాపకం పెట్టుకోవలసిన వారు విదేశాల పర్యటనకు వెళ్ళే రాజకీయ నాయకులు. స్వదేశంలో ఉండగా వారిలో కొందరు కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కావచ్చు; మరికొందరు కమ్యూనిస్టు పార్టీ ప్రముఖులు కావచ్చు; వేరొక కొందరు ప్రజా-సోషలిస్టు అధినేతలు కావచ్చు; కాని, దేశం సరిహద్దులను దాటి, విదేశంలో పాదం

పెట్టినంతనే వారందరు భారతీయులే. ఆ క్షణం నుంచి పార్టీ విభేదాలకు అతీతంగా నిలిచి, భారతీయులవలె వారు ఆలోచించాలి; భారతీయులవలె మాట్లాడాలి; భారతీయులవలె వ్యవహరించాలి.

ఉత్తమమైన ఈ సూత్రాన్ని తాత్కాలికంగా విస్మరించినందువల్ల కాబోలు, సోవియెట్ కమ్యూనిస్టు కాంగ్రెసును చూచి రావడానికి ప్రత్యేకాహ్వానంపై వెడుతున్న కేరళ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ మొన్న తిరువేంద్రంలో పత్రికా విలేకరులతో ముచ్చటిస్తూ, సోవియెట్ నుంచి అంతకంతకు అధికంగా భారతదేశానికి లభిస్తున్న ఆర్థిక సహాయాన్ని కేరళ రాష్ట్రాభివృద్ధికి వినియోగించుకొనడానికి వీలున్నదో, లేదో సోవియట్ ప్రధాని శ్రీ కృశ్చెవ్తో చర్చించగలనని అన్నారు. ఐతే, ఈ నెల 15వ తేదీని తిరువేంద్రంలో చేసిన ఈ ప్రకటనను, 18వ తేదీని మద్రాసులో శ్రీ నంబూద్రిపాద్ తమకు తామై సవరించుకొన్నారు. తన ప్రకటనను తానే సవరించుకొనడం ప్రతిష్ఠకు భంగకరమని భావించక, ఉదాత్తమైన ఈ కొత్త ప్రకటన చేసిన కేరళ ముఖ్యమంత్రిని మేము అభినందిస్తున్నాం.

కేవలం కేరళ రాష్ట్రానికి కాక, మొత్తం భారతదేశానికి ఇతోధికంగా సహాయం జరగాలని తాము సోవియెట్ రష్యాను కోరగలమని శ్రీ నంబూద్రిపాద్ తమ కొత్త ప్రకటనలో వివరించారు. ఇంతేకాదు, సోవియెట్ రష్యా నుంచి ఏమి సహాయం జరిగినా, అది భారత ప్రభుత్వం ద్వారానే జరగాలని ఆయన స్పష్టపరిచారు. ఉదాత్తమైన ఈ వైఖరినే ఆయన తన మొత్తం విదేశ పర్యటనలో చిన్న పెద్ద విషయాలన్నింటిలోను అవలంబించగలరనే ఆశిస్తున్నాం. (ఆంధ్రప్రభ 21-1-1959)

విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత...

విదేశాలలో పర్యటన చేసి వచ్చిన తర్వాత అక్కడి ఆర్థిక, సాంఘిక, రాజకీయ వ్యవస్థలను నిరసిస్తూ - నిందిస్తూ కూడా కొందరు ప్రసంగాలు చేయడం కద్దు. ఈ మధ్యనే చైనాలో పర్యటించి వచ్చిన ప్రముఖులొకరు ఆ దేశం సరిహద్దులను దాటిన మరుక్షణం నుంచి దాన్ని దుయ్యబట్టడమే పనిగా పెట్టుకున్నారు. ఏ దృష్టి నుంచి చూచినా ఇది అత్యంత శోచనీయం. గాంధీజీ పుణ్యమా అని విదేశాలలో మనకు కొంత ప్రతిష్ఠ అబ్బింది. నెహ్రూ నాయకత్వం కారణంగా నానాటికి ఆ ప్రతిష్ఠ పెరుగుతున్నది. అది మరింతగా బలపడ్డానికి రాధాకృష్ణన్, కృష్ణమీనన్ ప్రభృతుల ప్రజ్ఞా ప్రాభవాలు తోడ్పడుతున్నాయి. మన దేశం సరిహద్దులను ఒకసారి దాటివెళ్ళితేనే తప్ప - విశేషించి, ఏదైనా ఒక అంతర్జాతీయ సమావేశంలో భారతీయ ప్రతినిధిగా పాల్గొనే అవకాశం లభిస్తేనే తప్ప ఈనాడు విదేశాలలో మన దేశానికి ఎంతటి పేరు ప్రతిష్ఠలున్నవో పూర్తిగా తెలిసిరాదు. అది చిన్న సమస్య కానివ్వండి, పెద్దది కానివ్వండి; ఆసియా, ఆఫ్రికాలకు పరిమితమైనది కానివ్వండి; అఖిల ప్రపంచానికి వ్యాప్తమైంది కానివ్వండి; ప్రతి దాన్ని గురించీ మన అభిప్రాయాన్ని వినడానికి, దాన్ని అర్థం చేసుకొనడానికి ఎంతో ఆసక్తిని ప్రదర్శిస్తారు. ఇక్కడ "మనం" అంటే, నెహ్రూ కానక్కరలేదు; రాధాకృష్ణన్ కానక్కరలేదు; కృష్ణమీనన్ కానక్కరలేదు; భారతీయ పౌరులెవరైనా సరే!

ఇంతగా విదేశాలలో ప్రస్తుతం మనకున్న జాతీయ ప్రతిష్ఠ కారణంగా విదేశ పర్యటన సందర్భంలోనే కాక, తిరిగి వచ్చిన పిమ్మట కూడా మనం ఎంతో జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. పొల్లుమాట ఒక్కటైనా నోట రానివ్వరాదు; చిల్లర మల్లర విమర్శలను ప్రారంభించరాదు; ప్రల్లదనానికి పోతున్నామని పరులతో అనిపించుకోరాదు.

విదేశాలలో మనం చూచే అన్ని విషయాలు మనకు నచ్చకపోవచ్చు; అన్నింటినీ మనం మెచ్చుకొనక పోవచ్చు; కొన్ని మనకు కంటగింపుగా తోచినా తోచవచ్చు; అంతమాత్రం చేత విదేశాలను మనం వ్రేలెత్తి చూపించనక్కరలేదు; వెక్కిరించ నవసరం లేదు. ఏ దేశానికి ఆ దేశం తనకు ఉత్తమమని తోచిన ఆర్థిక, సాంఘిక, రాజకీయ వ్యవస్థలను స్థాపించుకొన వచ్చునన్నదే "పంచశీల"కు ప్రధాన ప్రాతిపదిక. ఈ పంచశీల రూపొందడానికి పూర్తిగా దోహద మివ్వడమే విదేశాలలో నేడు మనకున్న ప్రతిష్ఠకు, పరపతికి మూలకారణం. కనీసం ఈ విషయాన్ని గుర్తించగల విజ్ఞతవున్నా, విదేశాలలో పర్యటించి వచ్చిన తర్వాత అక్కడి అంతరంగిక వ్యవస్థలను నిరసించడమేమి, నిందించడమేమి ఎంతమాత్రం తగదని తెలుసుకో గలుగుతారు.

విదేశాలలో పర్యటించి వచ్చిన వారందరు అక్కడి జీవిత వ్యవస్థను తెగనాడ్డమే పనిగా పెట్టుకుంటే, విదేశాలలో మనకు ప్రస్తుతం వున్న ప్రతిష్ఠ సన్నగిల్లుతుంది సరిగదా, పరపతి దెబ్బతింటుంది సరిగదా, మరొకసారి మన దేశం నుంచి యాత్రికులెవరు వెళ్ళినప్పటికీ వారిని అనుమానంగా చూడ్డం తటస్థిస్తుంది. ఐతే, దీని తాత్పార్యం విదేశాలలో చూచిన ప్రతిదాన్నీ ఆమోదించాలని కాదు; హర్షించాలనీ కాదు, నచ్చని విషయాలను గురించి రెచ్చి మాట్లాడ్డం మాత్రమే నిశ్చయంగా అనుచితం. తప్పులెన్నడం వ్యక్తుల విషయంలోనే తప్పు; దేశాల విషయంలో ఆ పనిచేయడం తప్పున్నర. (ఆంధ్రప్రభ 21-1-1959)

నారీ ధర్మం		నారి శక్తిస్వరూపిణి

"పగరకు వెన్నిచ్చినచో నగరే నిను మగతనంపు నాయకులెందున్" అని యుద్ధరంగం నుంచి పలాయితుడై వచ్చిన భర్తతో పరుష వాక్యాలాడిన ఖడ్గతిక్కన సతిలో మనం స్త్రీ శక్తిస్వరూపాన్ని చూడవచ్చు.

"నీ ద్వారా నా సందేశం ప్రపంచ పరివ్యాప్తం కావాలి" అని పరాత్పరుడు ఆదేశించగా, "ఈ మహత్కార్యానికి అల్ప మానవుడనైన నేను తగుదునా?" అనే భ్రమసంభ్రమాలతో స్వగృహాన్ని చేరిన మహమ్మద్ "సంకోచించవలదు. నేనే మీ ప్రథమ శిష్యురాలిని కాగలను. పరాత్పరుని సందేశాన్ని వ్యాపింపజేయడానికి బద్ధకంకణులు కండు" అని ఉద్బోధించిన మహమ్మద్ సతిలో మనం స్త్రీ శక్తిస్వరూపాన్ని తిలకించవచ్చు.

రాజ్యాన్ని రోసి, సర్వసంగ పరిత్యాగాన్ని చేసి, భిక్షాపాత్రికను చేబూనిన గౌతమబుద్ధుని అనుసరించిన యశోధరాదేవిలో నేమి, ఉపనిషత్తులచే, బుద్ధ భగవానునిచే, ఏసుక్రీస్తుచే ప్రతిపాదించబడిన అహింసా సిద్ధాంతాన్ని ఆధునిక రూపంలో హింసాప్రపూర్ణ ప్రపంచానికి అందజేయడం నిమిత్తం స్వచ్ఛందంగా దరిద్ర నారాయణుని సేవను స్వీకరించిన గాంధీజీకి నైతిక సంపత్తిని గూర్చిన కస్తూరీబాలో నేమి స్త్రీ, శక్తిస్వరూపాన్నే మనం కాంచవచ్చు.

ఇక, ఆమె ప్రేమ స్వరూపం, లేదా, ఆమె మాతృ స్వరూపం, నిత్య జీవితానికి సంబంధించిన ప్రతి స్వల్ప ఘట్టంలో సైతం మనకు ద్యోతకమౌతూనే ఉంటుంది.

శక్తి స్వరూపి హృదయం దార్యవిలసితమైతే, ప్రేమస్వరూపి హృదయం మార్దవ ప్రపూర్ణం. ఈ రెండింటికి పరస్పర వైరుధ్యం ఉండవచ్చు. కాని, సృష్టి మూలమే వైరుధ్యం కాదా? వెలుగు ననుసరించి చీకటి, జీవితాన్ని వెన్నంటి మృత్యువు, ప్రేమ గర్భంలోనే విద్వేషం, విద్వేష జ్వాలలపై నర్తిస్తూనే ప్రేమ - ఇవన్నీ పరస్పర విరుద్ధాలేకావా?

నిన్న ఉదయం ఆంధ్ర రాష్ట్ర స్త్రీ జన జాతీయవిద్యా మహాసభలోను, నిన్న సాయంత్రం చెన్నపురి ఆంధ్ర మహిళాసభ తృతీయ వార్షికోత్సవ సందర్భంలోను ఉపన్యసిస్తూ, శ్రీమతి సరోజినీదేవి స్త్రీ శక్తి స్వరూపాన్ని వివరించి, దాస్య బాధావిచలిత భారతదేశంలోనేమి, యుద్ధజ్వాలావలిత విశాల ప్రపంచంలోనేమి భారతనారి కర్తవ్యాలను గురించి చేసిన ఉద్బోధ ఎంతైనా సముచితం.

స్త్రీ ప్రేమ విశ్వవిశాలం - అందువల్ల ఆమె అంతర్జాతీయ దృష్టినలవరచుకోవాలని శ్రీమతి సరోజినీదేవి హెచ్చరించింది.

నిస్పృహ స్త్రీ శక్తిస్వరూపానికి విరుద్ధమైనది గనుక, నేటి భారత రాజకీయ రంగంలో వాస్తవంగా నిస్పృహ గర్భితమైవుంటే, కొత్త ఆశను రేకెత్తించడమేమి, నూతన విశ్వాసాన్ని ఉద్దీపితం చేయడమేమి భారతనారి కర్తవ్యమని శ్రీమతి సరోజినీదేవి ఉద్బోధించింది.

అధిక వైదుష్యంతో, అశేష ప్రతిభతో, అత్యుత్తమ త్యాగనిరతితో పెక్కు సంవత్సరాల నుంచి వివిధ రంగాలలో అపార సేవను చేసి, భారత మహిళా మండలిలో అగ్రస్థానాన్ని అందుకొనగలిగిన నారీరత్నమైనందుననే శ్రీమతి సరోజినీదేవి ఇంతటి మహిమాన్వితమైన సందేశాన్ని ఇవ్వగలిగిందని ప్రత్యేకంగా పేర్కొనవలెనా? (ఆంధ్రప్రభ 19-1-1945)

స్త్రీ స్వాతంత్ర్యం

భారతజాతి పెక్కుసార్లు స్వాతంత్ర్యాన్ని పూర్తిగా కోల్పోయింది గాని, సంస్కృతిని మాత్రం కోల్పోలేదు.

భారతీయ సంస్కృతి జీవనదివలె అవిచ్ఛిన్నంగా ప్రవహించడానికి కారణం భారతనారి విద్య నుంచి, విజ్ఞానం నుంచి, పౌరసత్వాల నుంచి, సంఘనాయకత్వం నుంచి పదేపదే వంచిత అయినప్పటికీ, గృహం సరిహద్దులుగా గల రాజ్యానికి రాజ్ఞి పదవి నుంచి భారతనారి ఎన్నడూ తొలగించబడలేదు. వ్యక్తిగతంగా ఎంత అధోగతికి పాల్పడినా, ఆమె భారతీయ ఆచార వ్యవహారాలను, భారతీయ సంప్రదాయాలను కాపాడుతూ వచ్చింది.

ఆమె ఈ రీతిని కాపాడిన భారతీయ ఆచార వ్యవహారాలలోనేమి, సంప్రదాయాలలోనేమి ఉత్తమోత్తమమైనవి ఎన్ని కలవో, అధమాధమమైనవి కూడా అన్ని లేకపోలేదు. అయితే, మంచిగాని, చెడ్డగాని వంశపారంపర్య పద్ధతులకు భిన్నంగా పోరాదని ఆమె చూపిన పట్టుదల కారణంగానే, మనదని చెప్పుకొనడానికి ఒక సంస్కృతి ఈనాటికీ మనకు మిగిలింది.

ఈ సంస్కృతి ఈనాడు ఇంతకంటే ఉత్తమంగా - ఉజ్జ్వలంగా - విశిష్టంగా - విరాజమానంగా లేదంటే, అందుకు కారణం భారత నారి స్వయంగా ఆలోచించుకొనడానికేమి, స్వతంత్రంగా నడచుకొనడానికేమి, సంఘంలో సముచిత స్థానం వహించడానికేమి, అవకాశాలు లేకుండా భారతీయ సంఘం చేయడమే!

గృహాంగణానికి పరిమితమైన సంకుచిత జీవితాన్ని జీవించడం పట్ల భారతనారి ప్రదర్శిస్తున్న అసంతృప్తి ప్రత్యక్ష ఫలితాలే నేడు దేశంలో అంతకంతకు ప్రబలమౌతున్న మహిళోద్యమమేమి, మహిళాసంఘాలేమి భారతనారి జీవితం నవచైతన్య విలసింతకానిదే భారతజాతికి పురోభివృద్ధి లేదని గుర్తించి, అందు నిమిత్తం కృషి ప్రారంభించినవారు రాజా రామమోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, రనడే, గోపాలకృష్ణ గోఖలే, వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు ప్రభృతులైనప్పటికీ, అఖిలభారత మహిళామండలి వార్షిక మహాసభకు నేడు చెన్నపురిలో అధ్యక్షత వహిస్తూ శ్రీమతి అనసూయాబాయి కాలే చెప్పినట్టు, మన దేశంలో స్త్రీ తాను కూడా మానవజాతికి చెందిన దానినని సంభావించుకొన నారంభించడం గాంధీజీ భారత రాజకీయ రంగానికి - తద్వారా భారత జాతీయ జీవితానికి - నాయకత్వం వహించిన పిమ్మటనే.

గాంధీ యుగంలో భారతనారీ లోకంలో వెల్లివిరిసిన జాగృతి దోహదమే కాకపోతే, స్వాతంత్ర్య సంసిద్ధిలో ఒక దశాబ్దమైనా విధిగా విలంబన జరిగివుండేదే!

అయితే, స్వాతంత్ర్య సముపార్జన కంటే స్వాతంత్ర్య సంరక్షణే ఎక్కువ కష్టం; అధిక ప్రయాస. జాతీయ స్వాతంత్ర్యం లభ్యమైనది గదా అని స్త్రీ స్వాతంత్ర్యాన్ని అలక్ష్యం చేస్తే, తిరిగి మనకు పారతంత్ర్యం తప్పదు.

స్త్రీజాతి విషయమై ఉన్నతాభిప్రాయాలు లేకపోయినా, విశాల లక్ష్యాలు లేకపోయినా, స్వీయ క్షేమాన్ని కాంక్షించే పురుషుడు స్త్రీ స్వాతంత్ర్య సాధనకై ప్రయత్నించి తీరాలి.

తనను పరివేష్టించి వుండే నైసర్గిక, మానసిక, ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులతో సమన్వయం కుదుర్చుకొననినాడు మానవ జీవితం దుస్తరం.

మానవుని జీవితంలో అధిక భాగం గడిచేది గృహంలోనే. అయినప్పుడు ఆ గృహంలోనే విద్యాగంధం లేకపోతే, విజ్ఞాన ప్రభలు లేకపోతే, స్వాతంత్ర్య వాయువులు లేకపోతే, సంస్కృతీ మధురిమ లేకపోతే, ఆ నిస్సార, నిస్తేజ, ఆ నిర్వీర్య పరిసరాల అంతస్తుకే మానవుడు దిగజారి పోతాడు.

స్త్రీకి స్వాతంత్ర్యం కూడా పోయిన తర్వాతనే దేశం పారతంత్ర్య బాధాగ్రసితం కావడాన్ని మనం పదే పదే ప్రపంచ చరిత్రలో చూడ్డానికి ఇదే కారణం.

అంచేత స్త్రీ జనాభివృద్ధి కేవలం స్త్రీలకు సంబంధించిన విషయమే కాదు; అది మొత్తం జాతికి సంబంధించిన విషయం.

ఈ పరమసత్యాన్ని గుర్తించిన పక్షంలో మహిళాభ్యుదయానికి శ్రీమతి కాలే నేడు తన అధ్యక్షోపన్యాసంలో సూచించిన వివిధ ముఖ్యాంశాలలో ఏ ఒక్కదాన్ని సాధించడంలో మన రాష్ట్రీయ ప్రభుత్వాలుగాని, కేంద్ర ప్రభుత్వంగాని సంకోచించలేదు; విలంబన చేయలేదు. (ఆంధ్రప్రభ 30-12-1947)

భారత నారి

ఒక జాతి పతనానికి ముందు దాని స్త్రీ జనపతనం చెందడం కద్దు. ఇందుకు మన దేశచరిత్రే తార్కాణం.

భారతనారికి స్వాతంత్ర్యాన్ని నిరాకరించిన తర్వాత భారత జాతీయ స్వాతంత్ర్యం ఎక్కువ కాలం నిలవలేదు. ఆమెకు చదువు కూడదన్న తర్వాత దేశంలో అజ్ఞానం ప్రబలడానికి ఎక్కువ కాలం పట్టలేదు. ఆమెను మూఢాచార పరాయణగా మార్చిన పిదప సంఘజీవితం ముకుళించుకు పోవడానికి ఎక్కువ కాలం అవసరం కాలేదు.

ఏ జాతిపతనమైనా దాని స్త్రీ జనపతనంతో అది ప్రారంభం కావడం వల్లనే కాబోలు, జాతీయ పునరుజ్జీవనోద్యమాలు సర్వసాధారణంగా సంఘ సంస్కరణ యత్నంతోనే మొదలౌతాయి. మన దేశంలో కూడా ఇంతే జరిగింది.

స్థూలదృష్టితో చూచినప్పుడు రాజా రామమోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, బి.ఎం. మలబారీ, మహాదేవగోవింద రణడే, కందుకూరి వీరేశలింగం ప్రభృతులు కేవలం సంఘసంస్కర్తలే. కాని, జిజ్ఞాసాదృష్టితో పరికించినప్పుడు భారత జాతీయ స్వాతంత్ర్యోద్యమానికి వీరే పితామహులు. వారు చల్లిన విత్తనాలే గాంధీ చేసిన విశేష దోహదంతో వేళ్ళు తన్ని, ఆకు తొడిగి, మొదలు కట్టి, కొమ్మలు వెళ్ళి, మొగ్గలు వేసి, పువ్వులు పూసి, చివరికి స్వాతంత్ర్య ఫలాన్ని అందించాయి. పెక్కుమంది ఆశించినదానికంటే సత్వరంగా భారత స్వాతంత్ర్య సంసిద్ధికి ప్రధాన కారణం - భారతనారి ఆత్మస్వరూపాన్ని గుర్తించడమే, ఆత్మశక్తిని గ్రహించడమే.

ఆత్మస్వరూపాన్ని గుర్తించిన భారతనారి - ఆత్మశక్తిని గ్రహించిన భారతనారి - గాంధీ పిలుపు విని, జాతీయరంగంలో పాదం పెట్టింది. నాటి నుండి నేటివరకు ఆమె చూపు ముందుకే పోతున్నది కాని, వెనుకకు మరలడం లేదు; ఆమె అడుగు ముందుకే పడుతున్నది కాని వెనుకకు తిరగడం లేదు.

కడచిన నూరేళ్ళలో పాశ్చాత్యంగన సాధించలేకపోయిన పురోగతిని గతించిన ముప్పై సంవత్సరాలలో భారతనారి సాధించగలిగింది. శీఘ్రగతినే కాకుండా నిరాటకంగా కూడా ఈ పురోగమనం కొనసాగింది.

ఓటింగ్ హక్కు కోసం పాశ్చాత్యంగన సత్యాగ్రహాన్ని చేయవలసి వచ్చింది. భారతనారికి అట్టి అగత్యం కలగలేదు. అన్ని పదవులకు అన్ని పాశ్చాత్యదేశాల స్త్రీలకు ఈనాటికీ అర్హత లేదు. కాని, భారత మహిళ పొందజాలని పదవి ఏదీ లేదు.

ఇంతకుమించి కూడా భారతనారి ముస్ముందు పురోగమించ గలదనడానికి నిన్న మన పార్లమెంటులో ఆమె హక్కులకు సంబంధించిన ఒక బిల్లు అయిదు నిమిషాలలో ఆమోదాన్ని పొందడమే ప్రత్యక్ష నిదర్శనం.

ఆర్థిక, రాజకీయ, పారిశ్రామికాది రంగాలలో జరగదగు పరివర్తనలు నేడు జరగకపోవచ్చు; జరిగినా, శీఘ్రంగా జరగకపోవచ్చు, సమగ్రంగా జరగకపోవచ్చు. అయినా, భారతనారి స్వత్వాలకేమి, ప్రతిపత్తికేమి సంబంధించిన విషయాలలో కానవస్తున్న శీఘ్రపురోగమనం తర్వాత మన భవితవ్యాన్ని గురించి నిరుత్సాహ పడవలసిన పనిలేదు.

స్త్రీ శక్తిస్వరూపిణి. ఆమె ప్రతిపత్తి పదిలపడిననాడు, ఆమె ప్రతిష్ఠ ఇనుమడించిన పిమ్మట, ఆమె పురోగమించ నారంభించిన తర్వాత, ప్రతి రంగం నూతన జీవచ్ఛక్తి విలసితం కాకతప్పదు. అందుమీదట ఎట్టి సంస్కరణలైనా సులభంగా జరుగుతాయి, ఎన్ని మార్పులైనా శీఘ్రంగా వస్తాయి. భారతనారితో పాటుగా పతనమైన భారతదేశం తిరిగి ఆమెతోపాటు తలయెత్తుతుంది. ఇది తథ్యం.

(ఆంధ్రప్రభ 13-2-1949)

బంగారం తూటాలు

ఆమె వీరపత్ని. సరిహద్దుల రక్షణకై వెళ్ళిన భర్త చైనా కిరాతులతో పోరాడుతూ వీరస్వర్గం అలంకరించినట్టు వార్త వచ్చింది. మానవ సహజం కనుక ఆమె వదనం మ్లానమైంది; ఆమె చెక్కిళ్ళ వెంట కన్నీరు కాల్వకట్టింది. అయినా, తన కర్తవ్యాన్ని ఆమె మరచిపోలేదు. దాన్ని మరచిపోవడం వీరుడైన తన భర్త పవిత్ర స్మృతిపట్ల మహాపచారం చేయడమే కాదా? పొరలి వస్తున్న దుఃఖాన్ని దిగమ్రింగుతూ ఆమె తన మెడలోని మంగళసూత్రాన్ని తీసింది. "ఈ బంగారాన్ని తుపాకిగుళ్ళ క్రింద మార్చండి. నా భర్త ప్రాణాలను పొట్టనబెట్టుకొన్నవారికి ఎన్నటికీ మరపురాని పాఠాన్ని చెప్పండి" అంటూ దాన్ని ఆమె భారత రక్షణ నిధికి పంపించింది ఇది వారం, పది రోజుల నాడు ఉత్తర భారతం నుంచి వచ్చిన ఒక వార్త.

మానవ సహజం కనుక - - ఆమె నూత్న వధువు. ఒక భారత సైనికుని ఆమె అప్పుడే పరిణయమాడింది. పెండ్లి పీటలపై నుంచి ఆ నవ దంపతులు దిగినారో, లేదో సరిహద్దుల రక్షణకై భర్తకు పిలుపు వచ్చింది. వీరగంధం పూసి, సంతోషంగా ఆమె తన భర్తను రణరంగానికి పంపించింది. ఆ యువ సైనికుడు పయనమై వెడుతుండగా ఆమె కన్నులు చెమ్మగిల్లకపోలేదు కాని, మరొకరు చూడకమునుపే కంటతడిని ఆమె తుడిచివేసుకొన్నది. "సుఖంగా వెళ్ళి జయంతో తిరిగి రండి!" అని భర్తకు వీడ్కోలిచ్చింది. కనుచూపుమేర దాటి భర్త వెళ్ళినంతనే మాంగల్యాన్ని ఒకసారి కళ్ళకు అద్దుకొన్నది. దాని సువర్ణకాంతులు ఆమెకు కర్తవ్య బోధను చేశాయి. వెంటనే ఆమె కళ్యాణ ప్రదమైన పసుపుబొందును మాత్రం మెడలో మిగుల్చుకొని, బంగారపు కుందులను, వాటిమధ్యనున్న జిగినీని దేశ రక్షణ నిధికి పంపించింది. "దేశ సరిహద్దులను రక్షించడానికై వెళ్ళిన తన భర్తను చైనా ముష్కరుల నుంచి కాపాడగల తుపాకి తూటాల కోసం ఈ బంగారం వినియోగపరచండి" అని ఆ వీరపత్ని కోరింది దక్షిణ భారతం నుంచి నాలుగైదు రోజులనాడు వచ్చినవార్త. ఇది జాతికి, దాని గౌరవానికి - "వీరగంధం తెచ్చినారము; వీరులెవ్వరో తెల్పుడీ!" అంటూ దేశానికి, దాని స్వాతంత్ర్యానికి - మనకు, మన ప్రతిష్ఠకు - ఎప్పుడు ప్రమాదం సంఘటించినా, ముందుకు వచ్చినట్టిదే భారత వీరనారి; ఉత్తమమైన ఈ సంప్రదాయానికి అనుగుణంగానే మన దేశచరిత్రలోని ప్రస్తుత ముఖ్యఘట్టంలో కూడా ఆమె వర్తిస్తున్న దనడానికి మేము పేర్కొన్న ఈ రెండు సంఘటనలే చాలు. ముక్కుపచ్చలారని పసిపాపలు సైతం తమ ముక్కుపుడకలను, చేతి గాజులను, వేలి ఉంగరాలను, మెడలో గొలుసులను స్వచ్ఛందంగా, సంతోషంగా, సమధికోత్సాహంతో దేశ రక్షణకు సమర్పిస్తున్న వేలాది సంఘటనలను ఈ సందర్భంలో విడివిడిగా పేర్కొన నక్కరలేదు.

తలచుకొంటేనే చాలు సంతోష సంరంభాలతో హృదయాన్ని ఉర్రూత లూగించగలిగింది ఈ త్యాగ నిరతి! కాని, ఇప్పటికి జరిగిన ఈ త్యాగం చాలదు. మరెంతగానో ఇది జరగాలి. అప్పుడు గాని చైనా కిరాతులను మన పవిత్ర భూమిపై నుంచి పూర్తిగా తరిమివేయలేము; అప్పుడుగాని మన జాతి గౌరవ ప్రతిష్ఠలను కాపాడుకొనలేము; అప్పుడుగాని మన జాతి భవిష్యత్తు పదిలపరచుకొనలేము.

చైనావారి దుష్టయత్నం మన సరిహద్దులలో మన భూభాగాలను కైవసం చేసుకొనడం మాత్రమే కాదు; మన పంచవర్ష ప్రణాళికలను భగ్నపరచడం కూడా మన ఆర్థికాభివృద్ధికి అవరోధాలను కల్పించడం కూడా. తమ ప్రస్తుత చర్యల ఫలితంగా తమ సరిహద్దులు విస్తరించడం చివరికి జరగకపోయినా, భారతదేశం ఆర్థిక పురోగతికి విఘాతం కలిగించగలిగినా, అదే తాము సాధించగలిగిన ఒక ఘన విజయమని వారు సంతోషించడం తథ్యం.

ఈ పరిస్థితిలో మన కర్తవ్యం - చైనావారిని తరిమి కొట్టడం మాత్రమే కాదు; ఇదే సమయంలో మన మూడవ పంచవర్ష ప్రణాళికలో ఏ ముఖ్య పథకానికి అవాంతరం రాకుండా దాన్ని కొనసాగించగలగాలి. ఇది సాధ్యం కావడం - నిన్నటి నుంచి భారత ప్రభుత్వం అమ్మకానికి పెట్టిన బంగారం బాండ్లను ప్రజలు విశేషంగా కొనినప్పుడే!

విదేశీ రాజకీయాలు

ఇండియా : జపాన్

సింహళంలో భారత, సింహళ ప్రధానుల సమావేశం కావడం శుభప్రదం.

సింహళం వలె జపాన్ ఇండియాకు కేవలం ఇరుగు పొరుగుదేశం కాకపోవచ్చు. భారత -సింహళం సమస్యల స్వభావానికీ, ఇండియా, జపాన్ల మధ్యగల సంబంధానికీ కొంత అంతరం ఉండవచ్చు. అయినా, ఇండియా, జపాన్లు ఇదివరలోకంటె ఎక్కువ మైత్రిని, వాణిజ్య, పారిశ్రామిక, సాంస్కృతికాది వివిధ రంగాలలో ఇతోధిక సహకారాన్ని పెంపొందించు కొనదగు అవకాశాలున్నాయి.

ఇండియా, జపాన్లు రెండూ ఆసియా ఖండదేశాలు, జాపనీస్ ప్రధాని కిషి నిన్న న్యూఢిల్లీ పత్రికావిలేకరుల గోష్ఠిలో పేర్కొన్నట్టు రెండు జాతులకు కూడా అత్యంత ప్రాచీన చరిత్రలు, సంస్కృతులు, సంప్రదాయాలు కలవు. బౌద్ధమతం తొలుత ఇండియా నుంచి చైనాకు వ్యాపించి క్రీస్తుశకం 552 లో కొరియా ద్వారా జపాన్లో ప్రవేశించింది. 1936 లో జపాన్ ప్రజలలో బౌద్ధమతావలంబకుల సంఖ్య 4 కోట్ల 60 లక్షలు.

జపాన్ జనాభాలో సగంమందికి పైగా బౌద్ధ మతస్థులు కావడ మొక్కటే కాదు. వే సంవత్సరాలకు పైబడి జపాన్ దేశపు సాహిత్యమేమి, లలితకళలేమి, భారతీయ సంస్కృతీ ప్రభావానికి లోనైనాయి.

పాశ్చాత్యుల సామ్రాజ్యాధికారానికి లోబడి ఆసియా ఖండమంతా పరాధీనతలో మునిగివుండగా ప్రాచ్యజాతులకు చెందిన జపాన్ ఆధునిక విజ్ఞానం ద్వారా పారిశ్రామికాభ్యుదయం సాధించి, భౌతిక సంపదలో నేమి, బాహుబలంలో నేమి అచిరకాలంలోనే పాశ్చాత్యజాతులతో తులతూగగల స్థితినందుకున్నది.

ఆధునిక ప్రపంచ రాజ్యాలలో జపాన్ ప్రముఖ స్థానాన్ని ఆక్రమించడం ఆసియా ఖండ వాసులకు గర్వకారణమే అయినా, బౌద్ధమతానికి మూలసూత్రమైన అహింసా సిద్ధాంతానికి అది తిలోదకాలిచ్చింది. సామ్రాజ్య కాంక్షను పెంచుకున్నది. సైనికశక్తిని ఆరాధించింది. నియంతల పోకడల నలవరచుకున్నది.

చైనా, కొరియాలపై జపాన్ సల్పిన అత్యాచారాలు, ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో ఇటలీ, జర్మనీలతో చేతులు కలిపి ఆసియా రాజ్యాలపై అది చేసిన దురాగతాలు సమస్త సభ్య ప్రపంచానికి వెగటు కల్పించాయనడానికి సందేహం లేదు.

అయితే, ద్వితీయ సంగ్రామంలో పరాభవం వాటిల్లిన తరువాత జపాన్ ప్రజల దృక్పథంలో అభ్యుదయకరమైన పరివర్తన ఏర్పడడం ముదావహం. ఇండియా రాకకు ముందు జపాన్ ప్రధాని శ్రీ కిషి రంగూన్లో ప్రసంగిస్తూ ద్వితీయ ప్రపంచ సంగ్రామ సందర్భంగా జపాన వల్ల బర్మా దేశానికి అపచారానికి పశ్చాత్తాపం వెలిబుచ్చడమే కాక, ఇక మీదట కూడా జపాన్ బర్మాకు నష్టపరిహారం చెల్లించగలదని వాగ్దానం చేశాడు.

అంతేకాదు; న్యూఢిల్లీ పత్రికా విలేకరులతో ముచ్చటిస్తూ భారతీయులతో పాటు నేడు జపాన్ ప్రజలు సయితం స్వాతంత్ర్యాన్ని ప్రజాస్వామ్య లక్ష్యాలను కాపాడడానికి కృతనిశ్చయులై వున్నారని కిషి స్పష్టం చేశాడు.

ఇండియా, జపాన్ మధ్య వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలు బలపడేందుకే కాక, అణ్వాయుధాల పాటవ పరీక్షల వల్ల, ముఖ్యంగా ప్రాచ్య దేశాల ప్రజలకు వాటివల్ల గల ప్రమాదాలను వారించడానికేమి, దూరప్రాచ్య సమస్యల సమరస పరిష్కారానికేమి ఇండియా, జపాన్ ప్రధానుల సంప్రదింపులు తోడ్పడ గలవని ఆశించవచ్చు. (ఆంధ్రప్రభ 25-1-1957)

ఇండో	చైనా

ఇండో-చైనాలో పదింట తొమ్మిది వంతులు ఇప్పుడు వియత్మిన్ సైన్యం అధీనంలో కలదని రెడ్ ఆర్మీ పత్రిక "రెడ్ స్టార్" వ్రాస్తున్నది. ఇండో-చైనా మొత్తం జనాభా రెండుకోట్లు కాగా, 180 లక్షల మంది ప్రస్తుతం హోచిమిన్ ప్రభుత్వాధి కారం కిందికి వచ్చారని కూడా ఈ పత్రిక వ్రాస్తున్నది.

అత్యుక్తులని "రెడ్ స్టార్" వ్రాతలకు విలువ నివ్వకపోయినా, ఇండో-చైనాలోని ఫ్రెంచి బలాలు కొన్ని రోజులుగా పరాజయం తర్వాత పరాజయాన్ని పొందుతున్న వనడం కాదనరాని విషయం. స్వయంగా ఫ్రెంచివారే తాము పెక్కుచోట్ల వెనుకంజవేయక తప్పలేదని చెప్పుకొంటున్నారు. చైనా సరిహద్దులో గల అయిదు కోటలను ఈ మధ్యనే ఫ్రెంచివారు ఖాళీచేసి వేశారు. కేవలం ఈ అయిదు కోటలనే కాక, వాటి పరిసరాలలోని 60 మైళ్ళు నిడివి ప్రాంతాన్నే వారు ఖాళీచేశారు. ఒక ఫ్రెంచి సైనిక ప్రతినిధి ప్రకటన ప్రకారం అసలు చైనా, ఇండో-చైనా, సరిహద్దు ప్రాంతం మొత్తమే ఈనాడు హోచి- మిన్ కైవసమైపోయింది.

ఉత్తర టానికిన్ పరగణా మొత్తంలో ఫ్రెంచివారి చేతిలో ఇంకను మిగిలివున్న ఒక్క ప్రధాన సైనిక స్థావరం లాంగ్సన్ పై ముట్టడికి వియత్నమిన్ బలాలు కేంద్రీకరించబడుతున్నవని నేడు వచ్చిన వార్తలు తెలుపుతున్నవి. ఈ స్థావరం హానోయ్ నగరానికి కేవలం 80 మైళ్లలో వున్నదట. దీన్ని తాము రక్షించుకొనడం దుస్తరమని కాబోలు హానోయ్కు మరింత పరిసర ప్రాంతాలలోనే, ఒక చోట కేవలం 20 మైళ్ళలోనే, ఫ్రెంచివారు రక్షణ శ్రేణులను హుటాహుటిగా నిర్మించుకొంటున్నారట.

ఇండో-చైనాలో సాగుతున్న యుద్ధగతికి సంబంధించిన ఇతర వివరాలను మన మిక్కడ తరచనక్కర లేదు. ఇప్పటికి వ్రాసినదాన్ని బట్టే, ఇండో-చైనాలోని ఫ్రెంచి బలాలు సంకటస్థితిలో పడినవనడం సుస్పష్టం.

చైనాలో కమ్యూనిస్టులు విజయం పొందడాన్ని కొత్త ప్రభుత్వాన్ని స్థాపించడాన్ని చూచినంతనే తాము మరి విలంబనచేస్తే, హోచి-మిన్కు పెకింగ్ సహాయం లభించగలదని భయపడి, వీలైనంత త్వరలో సైనిక విజయాన్ని సాధించాలని ఫ్రెంచివారు తొందరపడ్డారు. అక్కడి తమ సైనికుల సంఖ్యను ఒక లక్ష 66 వేల వరకు పెంచారు; తమ చేతి కీలుబొమ్మ వియత్నామ్ ప్రభుత్వ సైనికుల సంఖ్యను ఒక లక్ష ఇరవై ఆరు వేల వరకు పెంచారు. ఇంతగా వృద్ధిచేయబడిన ఈ సైనిక బలంతోనే కొన్ని ప్రదేశాలను ఆక్రమించుకున్నారు.

ఇదివరలో ఫ్రెంచివారు ఈ విధంగా తొందరపడగా, ఇప్పుడు హోచి-మిన్ తొందరపడుతున్నాడు. కొరియాలో యుద్ధం సమాప్తి కావస్తున్నది. ఇందువల్ల ఇక అమెరికా దృష్టి ఇండో-చైనా పైకి పూర్తిగా మరలవచ్చు. నిజానికి అది ఇప్పుడూ కొంత వరకు మరలింది. ఫ్రెంచివారికి సహాయంగా అప్పుడే కొన్ని అమెరికన్ విమానాలు పంపబడుతున్నవి. ఫ్రాన్సు ఆయుధ పునరుద్ధరణ కార్యక్రమాన్ని ఇతోధికంగా కొనసాగించడానికి 20 కోట్ల డాలర్లను అమెరికా కొత్తగా మంజూరుచేసింది. ఇంతకంటే పెద్ద మొత్తాలను రానున్న కొలది మాసాలలో మంజూరు చేయగల నంటున్నది.

ఫ్రాన్సుకు ఈ విధంగా ఆర్థిక సహాయాన్ని, ఆయుధ సహాయాన్ని చేయడమే కాకుండా; కొరియా యుద్ధం ముగిసిన తర్వాత అక్కడి అమెరికన్ బలాలలో కొన్ని ఇండో-చైనాకు మరలించబడినా విస్తుపోనక్కరలేదు. జనరల్ మెకార్థర్తో ఇండో-చైనా సమస్యను గురించి

తాను చర్చించినట్టు ప్రెసిడెంట్ ట్రూమన్ బయట పెట్టాడు. "పనిలో పని ఇండో-చైనా సంగతి కూడా ఇప్పుడే తేల్చి వేద్దాము" అని సలహా చెప్పగల మేటి ఘనుడే మెకార్థర్!

ఎవరి తొందర పాటువల్ల నైతే నేమి, ఇకముందు ఇండో-చైనా విశేషంగా ప్రపంచదృష్టిని ఆకర్షించ బోతున్నది. ఇంతేకాక, కొరియాలో అమెరికా జోక్యంకంటె, ఇండో-చైనా వ్యవహారంలో అది వేలు పెట్టటం ఆసియా ప్రజలకు అసంతృప్తిని కలిగించనున్నది కూడా.

కొరియాలో వచ్చిన యుద్ధం రెండు కొరియన్ ప్రభుత్వాల మధ్య కాగా, ఇండో-చైనాలోనిది ఒక జాతీయ ప్రభుత్వం, మరొక విజాతీయ ప్రభుత్వం మధ్య కొరియాలో అమెరికా ఒక నిరంకుశ ప్రభుత్వాన్ని నిలబెట్టడానికి పూనిక చూపగా, ఇండో-చైనాలో దాని సహాయం నిరంకుశమైన ఇంపీరియలిస్ట్ ప్రభుత్వానికి.

పేరుకు ఇండో-చైనాలో ఒక జాతీయ ప్రభుత్వం బావోడై ప్రభుత్వం - లేకపోలేదు. అది కీలు బొమ్మ ప్రభుత్వమని మన కందరికీ తెలుసు. ఆ సంగతిని ఆ ప్రభుత్వ నాధులే స్వయంగా బయట పెడుతున్నారు కూడా. దాని ప్రధాని తమ ప్రభుత్వ వ్యవహారాలన్నింటిలో ఫ్రెంచివారు వేలు పెడుతున్నారని, "మాకు వద్దు, మొర్రో!" అంటున్నా ఫ్రెంచి సలహాదారులను తమ నెత్తినెక్కిస్తున్నారని, మొన్ననే పట్టలేక అనివేశాడు. ఆ ప్రభుత్వాధిపతి బావోడై తమ సైన్యంపై తమకే పూర్తి అధికారమివ్వనిదే విజయం దుర్లభమని చెప్పివేశాడు. ఇంతగా ఇది ఫ్రెంచి వారి పిడికిలిలోని ప్రభుత్వమైనా, దీనికి సరాసరిగా సహాయం పంపుతున్నా నన్న నటననైనా, అమెరికా చెయ్యడం లేదు. దాని సహాయం ఫ్రెంచి ఇంపీరియలిస్ట్ ప్రభుత్వానికే అందుతున్నది.

ఇంపీరియలిజం ఎంత క్రూరమైందో ఆసియాకు స్వానుభవపూర్వకంగా తెలుసు. అయినప్పుడు ఇండో-చైనాలో ఫ్రెంచి ఇంపీరియలిజం సంరక్షణకు అమెరికా ఉద్యమించడాన్ని ఆసియా ఏ విధంగా హర్షించగలదు? ఇండో-చైనాలో తన జోక్యానికి కారణం ప్రపంచ శాంతి రక్షణ తప్ప అన్యం కాదని అమెరికా పలికే ధర్మ పన్నాలను ఏ విధంగా దిగమ్రింగగలదు?

అసలు అమెరికాలోనే కొందరు తమ ప్రభుత్వం పూనికను విమర్శించ నారంభించారు. హోచి-మిన్ ప్రభుత్వం కమ్యూనిజంపట్ల మొగ్గ చూపేదైనా ఇండో-చైనాలో ఫ్రాన్సును సమర్థించడం ఇంపీరియలిజం వెన్ను కాయడమేనని "వాషింగ్టన్" పత్రిక వ్రాసి, ఆసియా ఈ చర్యను సమర్థించబోదని మనం చెప్పవలసిన మాటను తానే చెప్పింది.

(ఆంధ్రప్రభ 21-10-1950)

ఇండియా	రష్యా	పాకిస్తాన్

ఇండియా, పాకిస్తాన్ల మధ్య సంబంధాల పట్ల ఆసక్తి కనబరుస్తున్న ప్రపంచ రాజనీతిజ్ఞులలో రష్యా ప్రధాని కోసిగిన్ ఒకరు.

ఇండో-పాక్ యుద్ధ తరుణంలో ఉభయ దేశాలకు అనుసంధానం చేయడానికి ఆయన యత్నించారు. ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిని, ప్రెసిడెంట్ అయూబాన్ను తాష్కెంట్లో సమావేశపరచి, ఒక ఒప్పందానికి వచ్చేట్టు చేశారు. ఆ తరువాత కాలంలో ఉభయ దేశ ప్రభుత్వాధినేతలతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తూ తాష్కెంట్ ఒప్పందం అమలు కావలసిన ఆవశ్యకత గురించి జ్ఞాపకం చేస్తూ వచ్చారు.

ఇందువల్ల పాకిస్తాన్ ప్రస్తుతాధినేత యాహ్యాఖాన్తో కోసిగిన్ శుక్రవారం నాడు చర్చలు జరపడానికి రావల్పిండి వెళ్ళడం ఇండియాకు ఆసక్తి కలిగించే సంఘటన. ప్రత్యేకించి పాకిస్తాన్ సందర్శన కార్యక్రమాన్ని పెట్టుకొనకపోయినా, ఆఫ్ఘనిస్థాన్ సందర్శన పూర్తి అయిన తర్వాత కోసిగిన్ పాకిస్తాన్ కూడా వెళ్ళి 22 గంటల సేపు అక్కడ గడపడం, యాహ్యాఖాన్తో చర్చలు జరపడం గమనించదగింది.

ఈ సమావేశంలో అంతర్జాతీయ సమస్యలు, రష్యా, పాకిస్తాన్ల సంబంధాలు, ముఖ్యంగా పాకిస్తాన్ రష్యా నుంచి కోరుతున్న సహాయం మున్నగు విషయాలతో పాటు ఇండో-పాక్ సంబంధాల సమస్య కూడా సహజంగా చర్చకు వచ్చింది.

సుమారు ఒక ఏడాది నుంచి పాకిస్తాన్ ఆంతరంగిక సమస్యలతో సతమతమైపోతున్నది. విద్యార్థులలో, తదితర వర్గాలలో ప్రారంభమై, రాజకీయ పక్షాల చేతులలోకి వెళ్ళి, భుట్టో వంటి తీవ్రవాదుల నాయకత్వాన ఉధృతరూపం దాల్చిన ఆందోళనోద్యమం చివరకు ఆయూబ్ ఖాన్ పదవీ విరమణకు దారి తీసింది. ఇందుచేతనే కావచ్చు. ఇటీవల పాకిస్తాన్లో అంతగా ఇండియా వ్యతిరేక ప్రచారం, కవ్వింపు చర్యలు కనబడడంలేదు. కొంత సర్దుమణిగినట్టే కనిపిస్తున్నది.

అయినా, ఇంత మాత్రాన ఇండియా పట్ల పాకిస్తాన్ విద్వేష వైఖరిలో మార్పు వచ్చిందని భావించడానికి వీలులేదు. కాశ్మీర్ సమస్యను పాకిస్తాన్ విడనాడలేదు, ఇంతటిలో విడనాడే సూచన కూడా లేదు. తన సైనిక బలాన్ని పెంచుకొనడమే ఇప్పటికీ దాని లక్ష్యం. ఆయుధాలను వీలైనన్ని చోట్ల నుంచి సేకరించడమే దాని ఆశయం. ఇందుకు అది తన ప్రయత్నాలను తీవ్రంగా కొనసాగిస్తూనే ఉన్నది.

ఇందువల్లనే తాత్కాలికంగా కొంత ఉపశమిస్తున్నట్టుగా తోచినా ఇండియా, పాకిస్తాన్ల మధ్య ఉద్రిక్తత యథాతథంగానే ఉన్నది. ఉభయదేశాలు సఖ్యతతో మెలగడమే తమ అభిమతమని రష్యా ప్రధాని ఇటీవల ఇండియా వచ్చినప్పుడేమి; ఇప్పుడు పాకిస్తాన్ సందర్శన సందర్భంలోనేమి ఉద్ఘాటించారు. ఆయన అభిమతంతో ఇండియా పూర్తిగా ఏకీభవిస్తున్నది.

ఇండియా, పాకిస్తాన్ల మధ్య ఆయుధాల పోటీ తొలగిపోవడం ప్రథమావసరం. ఇట్టి పోటీ వల్ల ఉభయ దేశాలలో ఉద్రిక్తత పెరగడమే కాదు, వాటి ఆర్థిక వ్యవస్థలపై విపరీతమైన భారం పడుతున్నది. పాకిస్తాన్ కంటే కొన్ని రెట్లు పెద్దదైన భారతదేశం రక్షణావసరాలు వేరు, పాకిస్తాన్ రక్షణావసరాలు వేరు. పాకిస్తాన్ తన రక్షణావసరాలను మించి ఆయుధ సేకరణ చేస్తున్నది. ఇది ఇండియాలో భయ సందేహాలకు కారణమౌతున్నది. అంతేకాక రష్యా నుంచి కూడా అది ఆయుధ సేకరణకు యత్నించడం, రష్యా అందుకు సమ్మతించడం ఇండియాకు ఆందోళనకరమైన విషయం.

ఈ సమస్య లన్నిటిని దృష్టిలో పెట్టుకుని ఉభయ దేశాల సంబంధాలను తాష్కెంట్ ఒప్పందపు సూత్రాలకు అనుగుణంగా పెంపొందించడంలో కోసిగిన్ ఏ కొంత వరకైనా కృతకృత్యులైతే అంతకంటే కావలసింది లేదు. (ఆంధ్రజ్యోతి 1-6-1969)

బెర్లిన్ గోడ

క్రిస్మస్ సెలవులలో తూర్పు, పశ్చిమ బెర్లిన్ పౌరులు ఒకరి నొకరు కలుసుకొనడానికి తూర్పు జర్మన్ ప్రభుత్వం ఇటీవల అనుమతించడం ఎంతైనా హర్షించదగిన చర్య. ప్రచ్ఛన్న యుద్ధాన్ని అంతం చేయడానికి జరుగుతున్న యత్నాలలో అణ్వస్త్ర పరీక్షలపై పాక్షిక నిషేధం జరిగిన తర్వాత చెప్పుకోదగిన ముఖ్య సంఘటన ఇదే.

బెర్లిన్ నగరంలో పాశ్చాత్య రాజ్యాల అధీనంలో వున్న ప్రాంతాన్ని సోవియెట్ అధీనంలోని ప్రాంతాన్ని విడదీస్తూ మధ్యగా గోడ నిర్మించి రెండేళ్ళు దాటింది. తూర్పు బెర్లిన్ నుంచి పశ్చిమ బెర్లిన్కు కాందిశీకుల యాత్రను నిరోధించడానికిగాను తూర్పు జర్మన్ ప్రభుత్వం ఈ గోడను నిర్మించింది. తమ పౌరులలో అసంతృప్తిని, విద్రోహ చర్యలను రేకెత్తించడానికి పాశ్చాత్యులు యత్నిస్తున్నారని అది సాకు చెప్పినప్పటికి, తన ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేయడమే దాని ఉద్దేశం.

బెర్లిన్లో నిర్మించిన ఈ గోడ అది వరకు జనసమ్మర్దంతో కిక్కిరిసి వుండిన ప్రధానవీథుల గుండా పోతుంది. స్నేహితులను, బంధువులను, ఒకే కుటుంబానికి చెందిన వారిని, కొన్ని చోట్ల ఒకే యింటికి మధ్యగా పోతూ అది వేరు చేసింది. అత్యంత సుందరమైన బెర్లిన్ నగరానికి అది వికార స్వరూపాన్ని చేకూర్చింది. ఒకే కుటుంబంగా మెలగవలసిన మానవ జాతిని దేశాలుగా, జాతులుగా, సంకుచితత్వంతో, స్వార్థ ప్రయోజనాలతో, సిద్ధాంతాలతో వేరు చేస్తున్న అనంతకోటి వైరుధ్యాలకు ఆ గోడ ఒక సంకేతం వంటిది.

గడచిన రెండేళ్ళ నాలుగు నెలలలో దాన్ని దాటడానికి, పగులగొట్టడానికి ఎన్నో యత్నాలు రెండు వైపులనుంచి సొరంగాలు త్రవ్వడానికి కూడా చాలా ప్రయత్నాలు జరిగాయి. వీటిలో కొందరు కృతకృత్యులైనా ఎందరో ప్రాణాలు కోల్పోవలసివచ్చింది. గోడపొడుగునా రాత్రిం బగళ్ళు దూరదర్శినులతో గస్తీ తిరిగే తూర్పు జర్మన్ పోలీసుల కన్ను గప్పి గోడను దాటడం దాదాపు అసాధ్యంగా పరిణమించింది.

ఇప్పుడు తూర్పు జర్మన్ అధికారులే స్వయంగా బెర్లిన్ గోడలో ఒక రంధ్రం చేయించారు. పశ్చిమ బెర్లిన్ పౌరులు తూర్పు బెర్లిన్లోకి రావడానికి అనుమతించారు. ఒక్క రోజులో దాదాపు లక్ష మందికి అనుమతి పత్రాలిచ్చారట. అప్పుడే ఉభయ నగర భాగాల మధ్య రాకపోకలు ప్రారంభమైనాయట.

ఈ రాకపోకలు క్రిస్మస్ సెలవులకే పరిమితమైనవి కావచ్చు, మూణ్ణాళ్ళ వేడుకే కావచ్చు, అయినా, తూర్పు జర్మన్ అధికారులీ విధంగా నిర్బంధాలను సడలించడం అలక్ష్యం చేయదగిన చిన్న సంఘటన కాదు ఇది రాజకీయ విభేదాలపై, సంకుచితత్వంపై, అసహనంపై, పరస్పరం పొందిన విజయం. తాత్కాలికంగానైనా ఇట్టి చర్యను గైకొన్నందుకు తూర్పు జర్మన్ అధికారులు అభినందనీయులే.

ఇది ఎంత అభినందించదగిన చర్య అయినా, బెర్లిన్ సమస్య, దానితోపాటు జర్మన్ సమస్య ఇంకా అపరిష్కృతంగా వున్నవనే విషయాన్ని సయితం ఈ సమయంలో విస్మరించడానికి వీలులేదు. యూరప్లోనే కాక, మొత్తం ప్రపంచానికే హృదయ శల్యం వంటిది

జర్మన్ సమస్య. రెండు ప్రపంచ వినాశానికి కారణం కాగల ప్రమాదం ఇంకా తొలగిపోలేదు. జర్మనీ తిరిగి శాంతి యుతంగా ఏక దేశంగా రూపొందడమో, లేక యథాతథ స్థితికి ఎట్టి సంకోచాలు లేకుండా ఒడంబడడమో జరిగినప్పుడే ఆ ప్రమాదం శాంతికి ప్రధాన బాధ్యత వహిస్తున్న అగ్రరాజ్యాల కృషి ఈ ఆశయసాధనకు ఉన్ముఖం కావాలి. (ఆంధ్రజ్యోతి 22-12-1963)

దక్షిణాఫ్రికా

అన్యాయాన్ని సహించడం ఒక విధంగా అన్యాయాన్ని సమర్థించడమే! అయినా, అన్యాయానికి పర్యాయపదంగా చెల్లుతున్న దక్షిణాఫ్రికాను కామన్వెల్త్‌లో ఎలాగైనా నిలపాలన్న తాపత్రయం బ్రిటిష్ ప్రధానికి దేనికో?

ఈ విషయమై ఆయన బహిరంగ ప్రకటనను దేనినీ ఇంతవరకు చేయలేదనుకోండి. కాని, కామన్వెల్త్ లో దక్షిణాఫ్రికాకు స్థానం లేనినాడు అక్కడి ప్రభుత్వం జాతివిభేద విధానాన్ని అనుసరించడంలో మరింత హద్దుమీరి పోవచ్చునని మాక్మిలన్ తక్కిన కామన్వెల్త్ ప్రధానులను హెచ్చరిస్తున్నారట. సభ్యత హద్దుల నన్నింటిని ఆ ప్రభుత్వం ఇదివరకే మీరి పోయింది; మానవతకే శాశ్వతమైన మచ్చను కూర్చగల విధంగా ఇదివరకే అది సంచరించింది. క్రౌర్యంలో, కాఠిన్యంలో, కఠోరత్వంలో పరాకాష్ఠను చేరిన ఆ ప్రభుత్వం, కామన్వెల్త్‌లో నిలిచినా, వైదొలగినా, మరింత ఘోరంగా కావాలన్నా సంచరించగలదా?

పోనీ, తక్కిన కామన్వెల్త్ ప్రధానులవలె మాక్మిలన్ దక్షిణాఫ్రికా జాతివిభేద విధానాన్ని అసహ్యించుకొనలేక పోతున్నారంటే, ఆయన ప్రస్తుత వైఖరిని హర్షించినా, హర్షించలేకపోయినా, కనీసం అర్థంచేసుకోవచ్చు. కాని, దక్షిణాఫ్రికా విధానాన్ని దక్షిణాఫ్రికా పార్లమెంటులోనే నిరసించగల నైతికబలాన్ని ఆయన చూపించారు. నిరుడు (ఫిబ్రవరి 3వ తేదీని) కేప్ టౌన్లో దక్షిణాఫ్రికా పార్లమెంటు ఉభయ సభలలో ప్రసంగిస్తూ, ఒక జాతిపై మరొక జాతికి ప్రకృతి సిద్ధమైన ఆధిక్యం ఏదో కలదన్న భావాన్ని బ్రిటిష్ ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని ఆయన స్పష్టపరిచారు.

"కామన్వెల్త్ దక్షిణాఫ్రికా సభ్యరాజ్యం. అందు వల్ల దక్షిణాఫ్రికాకు పూర్తి ప్రోత్సాహమివ్వాలనే, పూర్తిగా దానికి సహాయపడాలనే మా ఆకాంక్ష, కాని, మీ విధానాలలోని కొన్ని భాగాలను సమర్థించడం స్వతంత్ర ప్రజలరాజకీయ భవిష్యత్తును గురించి మాకున్న ప్రగాఢవిశ్వాసాలకు, ఆ విశ్వాసాల ననుసరించి మా సరిహద్దుల లోపల మేము అనుసరించడానికి యత్నిస్తున్న విధానాలకు, ఘోరాపచారం చేయడమే కాగలదు. ఇంత నిష్కర్షగా ఈ మాట చెప్పినందుకు మీరు అన్యథా భావించరనే నమ్ముతున్నాను" అని నాటి ప్రసంగంలో ఆయన తెగవేసి చెప్పారు.

దక్షిణాఫ్రికా ప్రభుత్వ విధానాలను గురించి మాక్మిలన్ ఈ మాటలను చెప్పివచ్చిన తర్వాత ఒక నెలకే జలియన్ వాలాబాగ్ దురంతాలను మించినవి ఎన్నెన్నో ఆ దేశంలో జరిగాయి. అయినా, కామన్వెల్త్ దక్షిణాఫ్రికాను మిగల్చడానికి ప్రయత్నం చేయడం, మాక్మిలన్ పలుకులలోనే, బ్రిటిష్ వారి ప్రగాఢ విశ్వాసాలపట్ల ఘోరాపచారం కాబోదా?

కనీసం ఈ సంవత్సరమైనా "జాతి విభేద విధానాలను అనుసరించే దేశానికి కామన్వెల్త్ స్థానం లేదు" అనే నిర్ణయానికి కామన్వెల్త్ +

ప్రధానుల సభ రాగలదని ఆశించడం మితిమీరిన ఆశకు పోవడం కాగలదా? (ఆంధ్రజ్యోతి 16-3 శార్వరి)

కల్లోల ప్రపంచం

*(విశ్వ వ్యాప్తంగా జరిగే రాజకీయ పరిణామాల గురించి శ్రీ చక్రపాణి సంపాదకత్వంలో చెన్నయ్ నుంచి ప్రచురించిన ఆంధ్రజ్యోతి మాసపత్రికలో **1947-48** ప్రాంతాల ప్రతిమాసం నార్ల రాసేవారు.)*

"ఆ సంధి దోపిడీదారులకు సంతృప్తి నివ్వగలిగినట్టిది; అది ఇంపీరియలిస్టులను, మిలటరిస్టులను సంతోషపరచగలిగినట్టిది. యుద్ధసమాప్తి శాంతిని చేకూర్చగలదని అనుకున్నవారి ఆశలపై అది గొడ్డలిపెట్టు. అది శాంతిసంధికాదు; మరొక యుద్ధప్రకటన. అది ప్రజాస్వామికత్వం పట్ల ద్రోహం. అది ప్రధనభూమిలో ప్రాణాలను కోల్పోయినవారిపట్ల ద్రోహం. మిత్రరాజ్యాల వాస్తవిక యుద్ధాశయాలు ఏవో ఆ సంధి బట్టబయలు చేస్తుంది". ఈ విమర్శ 1914-18 నాటి ప్రపంచయుద్ధం తర్వాత జరిగిన వర్సయిల్స్ సంధిని గురించి;

ఈ విమర్శచేసినవాడు వైకౌంట్ స్నోడన్.

దీనితర్వాత మరొక ప్రపంచయుద్ధం జరిగింది; మరొక శాంతి సంధి నిర్ణయం జరుగుతున్నది. మరొక విమర్శకుడు "అది శాంతిసంధికాదు; మరొక యుద్ధప్రకటన. అది ప్రజాస్వామికత్వం పట్ల ద్రోహం; అది ప్రధనభూమిలో ప్రాణాలను కోల్పోయినవారిపట్ల ద్రోహం" అని తిరిగి వ్రాయవలసి వస్తుందా?

పరాజిత యూరోపియన్ రాజ్యాలతో జరగదగు శాంతిసంధుల రూపాన్ని నిర్ణయించడం నిమిత్తం ఒకసారి పారిస్లో సమావేశమై ఒడంబడిక కుదరకపోగా, సభను వాయిదా వేసుకొని, మరల పారిస్ లోనే సమకూడి, ఇప్పటికీ ఏ ఒక్క ప్రధాన విషయంపై కూడా ఏకాభిప్రాయానికి రాలేకపోతున్న అగ్రరాజ్య చతుష్టయ విదేశాంగ మంత్రులను చూస్తేనే వర్సయిల్స్ సంధికి పాఠాంతరమో, రూపాంతరమో తప్పదని స్పష్టం కావడంలేదా?

ఈనాడు సంఘర్షిస్తున్న శక్తులు వర్సయిల్స్ సంధినాడు సంఘర్షించిన శక్తులనుంచి భిన్నమైన వనడం నిర్వివాదమే.

నాటి సంఘర్షణ భిన్న సామ్రాజ్యాలమధ్య.

ఓడిపోయిన జర్మనీ, ఆస్ట్రియా, టర్కీ సామ్రాజ్యాలను, గెలిచిన బ్రిటిష్, ఫ్రెంచి, ఇటలీ, జపాన్ సామ్రాజ్యాలు ఏయేవిధంగా ఎంతెంతవరకు కబళించవచ్చుననేదే నాటి వివాదాంశం.

పోతే, నేటి సంఘర్షణ సామ్రాజ్యశక్తుల మధ్య కాదు; కేపిటలిస్ట్, సోషలిస్ట్ శక్తుల మధ్య. ఈ సంఘర్షణలో కేపిటలిస్ట్ శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టివి బ్రిటన్, ఫ్రాన్సు, యునైటెడ్ స్టేట్సులు; సోషలిస్ట్ శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టిది సోవియెట్ రష్యా.

ఈ విధంగా నాటికీ, నేటికీ ఒక ప్రధాన భేదమున్నప్పటికీ, తక్కిన అన్ని విషయాల మధ్య సామ్యం కలదు.

నాటివలె నేడుకూడా విజేతల మధ్య పరస్పర విశ్వాసానికి మారుగా అవిశ్వాసం ద్యోతకమౌతున్నది. నాటివలె నేడుకూడా ప్రపంచ శాంతి రక్షణపట్ల కంటె స్వీయప్రాబల్య సాధనపట్ల అధిక శ్రద్ధ ప్రదర్శింపబడుతున్నది. నాటివలె నేడుకూడా “ముందు యుద్ధంలో మనం అనుకూల పరిస్థితులలో నుండగలమా? లేదా?" అనే ఆలోచించబడుతున్నది.

ఈ పరిస్థితులలో తుదకు ఏదో ఒక విధంగా ఏదో ఒక ఒడంబడిక కుదిరినా, అది శాంతి సంధికాక, యుద్ధవిరామపు ఒడంబడిక మాత్రమే కాగలదు గదా?

కేపిటలిస్ట్, సోషలిస్ట్ వ్యవస్థల స్వభావాలనుబట్టి వాటిమధ్య సంఘర్షణ అనివార్యం. ఉత్పత్తి లాభం కోసం - ఇది కేపిటలిజం. -

ఉత్పత్తి ఉపయోగంకోసం - ఇది సోషలిజం.

కూలివానికి కూలిడబ్బులు; మిగిలింది యావత్తు పెట్టుబడిదారునికే - ఇది కేపిటలిజం. ప్రతి వాని వద్ద నుంచి వాని శక్తి సామర్థ్యాలను బట్టి, ప్రతివానికి వాని జీవితావసరాలను బట్టి ఇది సోషలిజం.

సంఘానికంటె వ్యక్తికి ప్రాధాన్యం - ఇది కేపిటలిజం. వ్యక్తికంటె సంఘానికే ప్రాముఖ్యం - ఇది సోషలిజం. స్వంత లాభం కోసం పోటీ ఇది కేపిటలిజం. -

సమష్టి క్షేమం కోసం సహకారం - ఇది సోషలిజం.

ఈ విధంగా వీటి మధ్య విభేదాలు ఎన్నెన్నో. ఇవి రెండూ పూర్తిగా విభిన్నమైన రెండు జీవిత విధానాలు అయినప్పుడు వీటిమధ్య సంఘర్షణ అనివార్యమే గదా?

కేపిటలిజం విభిన్నావతారాలలో ఫాసిజం ఒకటి మాత్రమే.

తన మనుగడకే ప్రమాదం సంఘటించినప్పుడు, రాజకీయ రంగంలో ప్రజాస్వామికత్వం అనే నటనకు కేపిటలిజం స్వస్తి చెబుతుంది; బాహాటంగా నిరంకుశత్వాన్ని అనుసరిస్తుంది. అంతట అది ఫాసిజం అయిపోతుంది.

ఫాసిజం రూపాన్ని ధరించిన జర్మన్, ఇటాలియన్, జాపనీస్ కేపిటలిజం కారణంగా సోవియెట్ రష్యాకు ఉపద్రవం ఉప్పతిల్లిందో, బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికన్ కేపిటలిజముకు కూడా అంత ప్రమాదమే సంఘటించింది. అంచేతనే ఫాసిజంపై రష్యన్ సోషలిజంతోపాటు బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికన్ కేపిటలిజం కూడా సమానంగా భీషణ యుద్ధాన్ని కొనసాగించింది.

ఫాసిజం ద్వారా సంఘటించిన సమాన ప్రమాదం తొలగిపోవడమే తడవుగా, సోషలిస్టు, కేపిటలిస్టు దృక్పథాలమధ్య, జీవిత విధానాల మధ్య, రాజకీయ వ్యవస్థల మధ్య తిరిగి సంఘర్షణ ప్రారంభమైంది.

"భావి యుద్ధంలో మనం ప్రత్యర్థులము" అనే భావంతోనే కేపిటలిస్టు, సోషలిస్టు రాజ్యాలు నేడు ప్రతి అంతర్జాతీయ సమావేశంలో పాల్గొంటున్నాయని జ్ఞాపకం పెట్టుకుంటే, పారిస్ సమావేశంలో అగ్రరాజ్య విదేశాంగ చతుష్టయం మధ్య ప్రధానసమస్యపై ఇప్పటికీ ఎందుకు ఒడంబడిక కుదరడంలేదో తెలుస్తుంది.

నేటి (జూన్ 28వ తేదీ) ఉదయం వార్తలనుబట్టి పారిస్ సభలో ట్రియస్టు సమస్యపై ప్రతిష్టంభన ఏర్పడింది. *(దీనిని "ట్రీస్టీ" అని ఇదివరలో నేను పేర్కొని ఉన్నాను. కాని, బి.బి.సి. న్యూస్ బ్రాడ్ కాస్టులో గతరాత్రి దీన్ని ట్రియస్టు అనడం విన్నాను.)*

ట్రియస్టు రేవు పట్టణానికి, దాని పరిసరప్రాంతానికి - దీన్ని వెనీజియా జూలియా పరగణా అంటారు - యూగోస్లావియా గవర్నర్ ఆధ్వర్యంక్రింద, స్వపరిపాలనాధికార మివ్వడం; ఇందుకు అంగీకరించలేకపోతే, రాజీపద్ధతికింద, యూగోస్లావియా, ఇటలీలకు సమానమైన ఆధిపత్యమిచ్చి, ఉభయ రాజ్యాలను చెరిఒక గవర్నరు నియమించనివ్వడం - ఇది సోవియెట్ రష్యాపక్షాన దాని విదేశాంగమంత్రి ముష్యూర్ మెలటోవ్ పారిస్ సభలో నిన్న చేసిన ప్రతిపాదన.

ఈ ప్రతిపాదనకు బ్రిటన్గాని, యునైటెడ్ స్టేట్స్ ని ఆమోదించలేదు.

ఇటలీ, యూగోస్లావియాల మధ్య ఫ్రాన్సు సూచించిన సరిహద్దుకు ఆమోదించిన ట్రియస్టును ఇటలీ ఆధిపత్యం కిందనే ఉంచాలని బ్రిటన్ పక్షాన దాని విదేశాంగమంత్రి మిస్టర్ బెవిన్ ప్రతిపాదించాడు.

"మనలో మనకు ఒడంబడిక కుదరగల ఆశ కానరానందున, ఈ సమస్యను యూరోపియన్ యుద్ధరంగంలో పాల్గొన్న 21 రాజ్యాలసభ ముందు పెడదాము" అని యునైటెడ్ స్టేట్సు పక్షాన దాని విదేశాంగ మంత్రి మిస్టర్ బిర్నే ప్రతిపాదించాడు.

ఇటలీలో నేడు బ్రిటన్కు పలుకుబడి హెచ్చు; యూగోస్లావియాలో సోవియెట్ రష్యాకు పలుకుబడి హెచ్చు. అంచేత బెవిన్ ఇటలీపట్ల, మెలటోవ్ యూగోస్లావియాపట్ల పక్షపాతం ప్రదర్శిస్తున్నారు. ఈ పక్షపాతం వెనక బ్రిటన్, రష్యాల మధ్య చారిత్రాత్మకమైన స్పర్ధ, కారణం ఒకటి కలదు. అన్ని కాలాలలో ఉపయోగించగల ఓడరేవు రష్యాకు లేనే లేదు. దాని ఓడరేవులన్నీ కూడా శీతాకాలంలో మంచు కారణంగా ఉపకరించనట్టివే. అంచేత అన్ని కాలాలలో ఉపయోగించగల ఓడరేవు కోసం చిరకాలం నుంచి రష్యా యత్నిస్తున్నది. రష్యా-టర్కీల మధ్య జరిగిన పెక్కు యుద్ధాలకు మూలకారణం - శీతాకాలంలో మంచుగడ్డ పేరుకొనని మెడిటరేనియన్ సముద్రాన్ని చేరవలెనన్న రష్యన్ ఆకాంక్షే; నల్ల సముద్రాన్ని మెడిటరేనియన్ సముద్రంతో బాస్పరస్, డార్డ్ నెల్స్ జలసంధుల గుండా కలిపే మార్మోరా సముద్రంలో బాస్పరస్ జలసంధికి సమీపంగానున్న ఇస్తాంబూల్ (దీన్ని ఇదివరలో కాన్స్టాంటినోపుల్ అనేవారు) ఓడరేవును వశపరచుకోవలెనన్న రష్యన్ అభిలాషే!

తన ప్రపంచాధిపత్యానికి తన సముద్రాధిపత్యమే ప్రాతిపదిక అని భావించే బ్రిటన్, ఈ రష్యన్ వాంఛను సర్వదా ప్రతిఘటిస్తున్నది. ఈ ప్రతిఘటనకై రష్యాతో (టర్కీపక్షాన) 1854 నుంచి 1886 వరకు యుద్ధం చేసింది కూడా.

నల్ల సముద్రం నుంచి, మార్మోరా సముద్రం గుండా, మెడిటరేనియన్లోకి తనకు ప్రవేశం దొరకకపోతే, నల్లసముద్రం నుంచి, తనకు పలుకుబడిగల రుమేనియా, యూగోస్లావియాల గుండా, ఏడ్రియాటిక్ సముద్రాన్ని, దానిగుండా మెడిటరేనియన్ సముద్రాన్ని

చేరనగునని ఇప్పుడు రష్యా ఆలోచన; దీన్ని కొనసాగనివ్వరాదని బ్రిటన్ పట్టుదల. ఈ విషయంలో ఫ్రాన్సు, యునైటెడ్ స్టేట్సుల అభిమానం సహజంగా బ్రిటన్ పక్షానే కలదు.

మెడిటరేనియన్ చేరవలెనన్న రష్యన్ ఆకాంక్ష, దీన్ని ప్రతిఘటించవలెనన్న ఆంగ్లో-అమెరికన్ ఆకాంక్ష - ఇదే ట్రియస్ట్ సమస్యలో ప్రతిష్టంభన ఏర్పడ్డానికి కారణమైనప్పుడు, ఈ ప్రతిష్టంభన తొలగడం దాదాపు అసాధ్యమే కాదా? అందువల్లనే ఈ సమస్యను 21 రాజ్యాల సభముందు పెట్టనగునని మిస్టర్ బిర్నే ప్రతిపాదిస్తున్నాడు.

ఫ్రాంకో స్పెయిన్ విషయమై రష్యా, పోలెండ్, ఫ్రాన్సుల న్యాయసమ్మతమైన కోర్కెను భద్రతా సంఘంలో ఆంగ్లో - అమెరికన్ రాజ్యాలు త్రోసిపుచ్చగలిగినవి. భద్రతా సంఘంలోవలెనే 21 రాజ్యాల సభలో కూడా సంఖ్యాబలం ఆంగ్లో-అమెరికన్ రాజ్యాలదే కాగలదు గనుక, ట్రియస్టు సమస్యను ఆ సభముందు పెట్టనగునని మిస్టర్ బిర్నే ప్రతిపాదిస్తున్నాడు. స్పెయిన్ విషయంలో భద్రతా సంఘంలో ఏమిజరిగిందో తెలుసు గనుక, బిర్నే ప్రతిపాదనకు మోలబోవ్ సమ్మతించకపోవడం సహజమే.

ట్రియస్టు విషయమై అగ్రరాజ్య చతుష్టయం మధ్య విభేదాలు అతి తీవ్రమైనవని కనిపెట్టి, ఇటలీ, యూగోస్లావియాలు దేనికి అది తన పట్టుదల నెగ్గనిదే తాను సంధి ఒడంబడికపై సంతకం చేయనంటున్నది.

పారిస్ సభ నుద్దేశించి “మన చర్చలు హాస్యాస్పదంగా పరిణమించిన"వని మిస్టర్ బిర్నే అన్నాడు. హాస్యాస్పదం అనడం కంటె, నేటి ఈ విభేదాల ఫలితం మరొక ప్రపంచ యుద్ధమే కాబట్టి, సంతాపకరం అనడమే ఎక్కువ సమంజసమేమో!

కేపిటలిస్ట్, సోషలిస్ట్ వ్యవస్థల వైరుధ్యమే కాకుండా, తెల్లవాని జాత్యంహంకారం కూడ మరొక ప్రపంచ యుద్ధాన్ని తథ్యం చేస్తున్నది.

పాశ్చాత్యుల ఈ జాత్యంహంకారానికి ఒక నిదర్శనం - ఆసియాఖండ ప్రజలందరు హీనజాతి వారైనట్టు, దక్షిణాఫ్రికా ప్రభుత్వం చేసిన “మాలపల్లి" చట్టమే.

తమకు ప్రత్యేకించబడిన కొన్ని ప్రాంతాలలోనే ఏషియాటిక్ జాతులవారు నివసించాలని ఈ చట్టం శాసిస్తున్నది. ఆస్తుల క్రయ విక్రయాల విషయంలో ఏషియాటిక్ జాతుల హక్కులను ఇది పరిమితం చేస్తుంది.

అన్యాయమైన ఈ చట్టానికి విరుద్ధంగా దక్షిణాఫ్రికా భారతీయులు దర్బన్లో శాంతియుతంగా సత్యాగ్రహాన్ని కొనసాగిస్తుండగా, శ్వేతజాతి దుండగీండ్లు సత్యాగ్రహులైనవారిని, కానివారిని కూడా ఎంతగానో అవమానిస్తున్నారు. భారతీయ స్త్రీలను కొట్టడం, తన్నడం, దుర్భాషలాడడంఇట్టి నికృష్ట చర్యలను సయితం వీరు కొనసాగిస్తున్నారు.

ఈ దారుణ కృత్యాలు బాహాటంగా సాగడం కంటేకూడా, వీటిని జరుపుతున్న వారిపై దక్షిణాఫ్రికా ప్రభుత్వం ఇంతవరకు ఎట్టి చర్య జరపకపోవడమే మరింత గమనార్హం; మరింత గర్హనీయం. ఈ దక్షిణాఫ్రికా ప్రభుత్వ నాయకుడు ఫీల్డ్ మార్షల్ స్మట్స్ ప్రపంచ శాంతి రక్షణావశ్యకతను గురించి తరచు ధర్మోపన్యాసాలు చేస్తుంటాడు. ప్రపంచశాంతిని కాపాడవలెననడంలో, ఆంగ్లో-అమెరికన్ రాజ్యాల నాయకత్వం ఏర్పడవలెననడంలో ఈయన ప్రధానోద్దేశం ప్రస్తుత ప్రపంచ వ్యవస్థకు భంగం రాగూడ దనడమే.

శ్వేతజాతి ఆధిక్యం, శ్వేతజాతి సంపత్తి, శ్వేతజాతి సుఖం, శ్వేతజాతి ప్రతిభ - ఇదే ప్రస్తుత ప్రపంచ వ్యవస్థకు ప్రాతిపదిక.

కాని, ఈ ప్రాతిపదికను శ్వేతేతర జాతులవారు మరి ఎంతోకాలం సహించబోరు. వారిలో - ముఖ్యంగా ఆసియా ప్రజలలో - నవచైతన్యం కానవస్తున్నది. స్వాతంత్ర్య సాధనకోసం వారు తపిస్తున్నారు. దాన్ని వారు అనతికాలంలో సాధించగలరు కూడా.

స్వాతంత్ర్యం పొందిన తరువాత జాత్యంహంకారాన్ని ప్రదర్శించే పాశ్చాత్యులను ఏ విధంగా మర్యాద చేయవలెనో జపాను ఒకప్పుడు కార్యరూపంలో చెప్పనే చెప్పింది. ఫ్రాన్సులోని జపానువారు పోలీసు స్టేషనులకు వెళ్ళి, తమ వేలిముద్రల నివ్వవలెనని ఫ్రెంచి ప్రభుత్వం ఉత్తరువు చేయగా, జపానులోని ఫ్రెంచివారు తమ వేలిముద్రలనే కాక కాలిముద్రలను పృష్ఠముద్రలను కూడా ఇవ్వవలెనని జాపీనీస్ ప్రభుత్వం ఆదేశించింది. చైనాలో ఒకచోట (ఆ ఊరుపేరు ఇప్పుడు జ్ఞాపకం రావడంలేదు) జపానువారు ఇంగ్లీషువారిని నడివీధిలో దిగంబరులను చేసినారంటే, ఆ చర్య పాశ్చాత్యులు ప్రదర్శించే జాత్యహంకారంపట్ల ప్రతీకార వాంఛ ఫలితమే. -

దక్షిణాఫ్రికాలో నేడు పాశ్చాత్యజాతులు సాగిస్తున్న దౌష్ట్యాలను పోలినవి నిరాఘాటంగా కొనసాగితే, జాతి విద్వేషాలు పెరగడం తథ్యం; ప్రాచ్య, పాశ్చాత్య ప్రపంచాల మధ్య భయానక సమరం చెలరేగడం తథ్యం. (ఆంధ్రజ్యోతి మాస పత్రిక, ఆగష్టు 1946)

2

తిరిగి ప్రపంచ యుద్ధం సంభవమా?

ఈ ప్రశ్నకు ఇటీవల కొందరు ప్రముఖులు చెప్పిన ప్రత్యుత్తరాలివి:

"పెర్ల్ హార్బర్ నాటివలె నేడు కూడా మనం పెద్ద ముప్పులో ఉన్నాము" - ప్రెసిడెంట్ ట్రూమన్. "ఇది మీకు నా హెచ్చరిక; ఆలసిస్తే సమయం మించిపోవచ్చు. ముప్పుతప్పడానికి స్వల్ప సావకాశమిదే. యుద్ధం నిలిచిపోయింది. కాని, అపాయాలు నిలిచిపోలేదు" - మిస్టర్ చర్చిల్.

"పరిస్థితి తీవ్రతను చులకనచేయడం వెర్రితనమే కాగలదు. అది అత్యంత ఆందోళన కరం. వెంటనే యుద్ధ ప్రమాదం ఏర్పడబోతున్నదని నేననడంలేదు. తక్షణ ప్రమాదం అదికాదు. కాని, పారిస్ సమావేశ సరళిని గమనిస్తు వారికందరికి ఆ రోజు కారోజుకు ఉద్రేకాలేమి, విద్వేషాలేమి ఎలా పెరిగిపోతున్నవో సుస్పష్టమే" - మిస్టర్ ఆంథోనీ ఈడెన్.

"బ్రిటన్, రష్యాలలో ఏదీకూడా ప్రస్తుతం యుద్ధాన్ని కోరడంలేదు. కాని, అవి నేడు అవలంబిస్తున్న విధానాల పర్యవసానం ఎప్పటికైనా యుద్ధమే కాకతప్పదు" - మిస్టర్ హెన్రీవాలెస్. "యుద్ధ ప్రమాదం ఎంతమాత్రంలేదు; కలదనడం వొద్ది పుకారు" - మార్షల్ స్టాలిన్. "కనీసం ఒకతరం లోపల యుద్ధం రావడం దాదాపు అసంభవం" - ఫీల్డు మార్షల్ స్మట్స్.

ఈ అభిప్రాయాలను క్రింది విధంగా విభాగించవచ్చు:

1 తక్షణ యుద్ధప్రమాదం లేకపోలేదు.

2 యుద్ధప్రమాదం లేకపోలేదు గాని, ఇంతలో మాత్రం కాదు.

3 యుద్ధప్రమాదం అసలులేదు.

తక్షణ యుద్ధ ప్రమాదం కలదనడాన్ని నిస్సంకోచంగా త్రోసివెయ్యవచ్చు.

యునైటెడ్ స్టేట్సులో ప్రెసిడెంట్ పదవికి ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఆ ఎన్నికలలో పోటీ చేయడానికి మిస్టర్ ట్రూమన్ ఉద్దేశిస్తున్నాడు. "పెర్ల్ హార్బర్ నాటివలె నేడుకూడా మనం పెద్ద ముప్పులో నున్నా" మని ఆయిన అమెరికనులను బెదరగొట్టడం "ప్రెసిడెంట్గా పనిచేయడానికి నాకు మరొక అవకాశ మివ్వండి" అనే ఎన్నికల ప్రచారమే కావచ్చు. కాగా, మిస్టర్ చర్చిల్ మనస్తత్వమేమి, ఆయన అభిప్రాయాలేమి లోకానికి సుపరిచితమైనట్టివే! కమ్యూనిజముకు, కమ్యూనిస్టు రష్యాకు ఆయన బద్ధవిరోధి! రష్యాపై నాజీ దండయాత్ర ప్రారంభమైనట్టు విన్నంతనే, సోవియట్ మిత్రరాజ్యమని ఆయన ప్రకటించినా, నాజీ జర్మనీ పతనం చెందేవరకు సోవియెట్తో ఆయన స్నేహాన్ని నెరపినా అప్పటిలో బ్రిటన్ రక్షణకు గత్యంతరం లేనందువల్లనే. కాగా, ఇప్పుడు ఆయన రష్యాను తిరిగి

వెలిపెట్ట గోరుతున్నాడు. ఇందునిమిత్తం "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ యూరప్" సంస్థాపన జరగవలె నంటున్నాడు. ఈ "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ యూరప్"కు ప్రాతిపదికగా జర్మనీ, ఫ్రాన్సులు ఏకంకావలెనంటున్నాడు. నిన్న మొన్నటివరకు ఏ జర్మనీపై యుద్ధానికి బ్రిటిష్ ప్రధానిగా తాను నాయకత్వం వహించాడో, ఆ జర్మనీపట్ల ప్రస్తుతం ఎంతో ఆదరాభిమానాలను ప్రదర్శిస్తూ, జర్మనీని చిన్నాభిన్నం చేయరాదనీ, దాన్ని ఏకరాజ్యంగా - శక్తివంతమైన రాజ్యంగా - మననివ్వవలెననీ ప్రతిపాదిస్తున్నాడు. ఈ విధంగా జర్మనీని తిరిగి ప్రబల రాజ్యం కానివ్వమనడంలో, ఫ్రాన్సు, జర్మనీల నాయకత్వం కూడ "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ యూరప్" సంస్థాపన జరగాలనడంలో చర్చిల్ ఉద్దేశం - రాజకీయ పారిభాషిక పదాల మేలిముసుగును తొలగిస్తే - రష్యాకు విరుద్ధంగా పశ్చిమ యూరోపియన్ రాజ్యాల కూటమి ఏర్పడాలనడమే! "ఆలసిస్తే, సమయం మించిపోవచ్చు" అని ఆయనచేస్తున్న హెచ్చరిక తాత్పర్యం - ఆలసిస్తే పశ్చిమ యూరోపియన్ రాజ్యాల కూటమి ఏర్పడ్డానికి తరుణం మించి పోవచ్చునని, "ముప్పు తప్పడానికి స్వల్పసావకాశ మిదే" అని ఉద్బోధించడానికి కారణం - ఇప్పుడు విలంబనచేస్తే, సోవియెట్ రష్యా యూరప్లో బలపడిపోవచ్చునని. ఈ ఉద్బోధన తమకానికి ఆయనకు మరొక కారణంకూడా లేకపోలేదు. ప్రస్తుతం యాటంబాంబు రహస్యం రష్యాకు తెలియదు.

అయితే, ఈ రహస్యం కలకాలం దానికి తెలియకుండా ఉండబోదు. మరొక ఏడాదిలోనో, తప్పితే, రెండు మూడేళ్ళలోనో ఈ రహస్యం రష్యా తప్పక తెలుసుకుంటుంది. అంచేత రష్యాపై దెబ్బతీస్తే, ఈలోపుగానే తియ్యాలి. దీన్ని మనస్సులో పెట్టుకునే "యాటంబాంబు ఇంకను ఒక్క అమెరికా చేతిలోనే ఉన్నది" అని ఆయన హెచ్చరిస్తున్నాడు. తక్షణ యుద్ధప్రమాదం లేకపోలేదన్నట్టు ధ్వనించడానికి చర్చిల్, ట్రూమన్లకు ఈ కారణాలున్నవని అంగీకరిస్తే, ఈ విషయంలో వారి అభిప్రాయాలను అంతగా విలువనివ్వనక్కరలేదుగదా? పైగా, మనకు కానవచ్చినంతవరకు ప్రపంచ పరిస్థితులుకూడా తక్షణ యుద్ధ ప్రమాదం లేదనే నిరూపిస్తున్నవి. యుద్ధాన్ని ప్రకటించేది ప్రభుత్వాలైనా, యుద్ధం చేయవలసినవారు ప్రజలు.

అంచేత ప్రజలు యుద్ధవిముఖులై ఉన్నప్పుడు ఏ ప్రభుత్వం యుద్ధాన్ని ప్రకటించలేదు; ప్రకటిస్తే, అది అధికారంలో నిలవలేదు; నిలిస్తే, దానికి యుద్ధరంగంలో పరాజయం తప్పదు. యుద్ధపిపాసి హిట్లర్ సయితం యుద్ధసన్నాహా లన్నింటిని పూర్తిచేసుకున్న తర్వాత యుద్ధ ప్రకటనకు ఒక సాకుకోసం - ఒక తరుణంకోసం - పారితీరవలసిందేనని తన ప్రజలకు నచ్చజెప్పడంకోసం - కొన్ని నెలల పాటు ఆగిపోవలసి వచ్చింది. ప్రజాభిప్రాయాన్ని పాటించకుండా ముసోలినీ యుద్ధాన్ని ప్రకటించ లేదనడం స్పష్టమే. నేటి ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని పరికిస్తే, అది యుద్ధానికి పూర్తిగా విరుద్ధం. ఆరేళ్ళపాటు యుద్ధకారణంగా అష్టకష్టాలుపడి - చర్చిల్ పాకులలో - రక్తాన్ని, స్వేదాన్ని, అశ్రువుల్ని కురియించి, కురియించి, శాంతిసౌఖ్యాలకోసం ప్రపంచ ప్రజలు తహతహ లాడుతున్నారు. తిన తిండి, కట్ట బట్ట, నిలవ నీడ కావాలని నేడు దేశదేశంలో సమ్మెలరూపంలో నేమి, అన్య రూపాలలోనేమి నేడు జరుగుతున్న ఆందోళన ఈ తహతహ ఫలితమే. అంచేత ఇంతలో తిరిగి ప్రపంచ యుద్ధం రావడం అసంభవమే.

అయితే మార్షల్ స్టాలిన్ ధ్వనిస్తున్నట్టు తిరిగి ప్రపంచయుద్ధమే అసంభవమని ఒప్పుకోలేము. ఆయన అంటున్నట్టు ప్రపంచయుద్ధ ప్రమాద ప్రచారాన్ని కొనసాగిస్తున్నవారు స్వదేశ రాజకీయ రంగంలో ఏదో నీచస్వార్థాన్ని కాంక్షిస్తున్నవారే కావచ్చు; తమదేశాల యుద్ధపు బడ్జెట్టుల తగ్గింపును కొంతకాలంపాటు ఆపివుంచవలెనని కోరుతున్నవారే కావచ్చు; సైన్యాల తగ్గింపులో ఆలస్యంచేసి, నిరుద్యోగ సమస్య తీవ్రంకాకుండా చూడవలెనని అభిలాషిస్తున్నవారే కావచ్చు. అయినా, ప్రపంచయుద్ధ ప్రమాదం ఇక అసలెన్నటికీ లేదనలేము. చైనాలో, జపానులో, జర్మనీలో, గ్రీసులో, మధ్యప్రాచ్యంలో, పారిస్ శాంతి సమావేశంలో, ప్రపంచ భద్రతా సంఘంలో అడుగడుగుకు - అనుదినం - అగ్రరాజ్యాల మధ్య విభేదాలు తప్పనప్పుడు - విద్వేషాలు పెరుగుతున్నప్పుడు - ప్రపంచయుద్ధ ప్రమాదం ఇక లేనేలేదనడం నమ్మదగినమాట కాగలదా? ఈ విధంగా ట్రూమన్, చర్చిల్, స్టాలిన్ అభిప్రాయాలను త్రోసిపుచ్చితే,

మిగిలేవి ఈడెన్, వాలెస్, స్మట్స్ అభిప్రాయాలే. అయితే, స్మట్స్ భావిస్తున్నట్టు ఒకతరం వరకు ప్రపంచయుద్ధం ఆగకపోవచ్చు; మరొక పదేళ్లకే అది ప్రారంభం కావచ్చు.

మరొక పది సంవత్సరాలకే వచ్చినా, మరికొంచెం ఆలస్యంగానో, లేదా, మరికొంత తొందరగానో వచ్చినా, మరొక ప్రపంచయుద్ధం తథ్యమే! ఇదివరలో వచ్చిన యుద్ధాలకు “పవర్ పాలిటిక్స్” కారణం. ఈ “పవర్ పాలిటిక్స్” ఈనాడు మరింత విశృంఖల విహారం చేస్తుండగా, మరొక యుద్ధం అనివార్యమేగదా?

ఈ “పవర్ పాలిటిక్స్”లో బ్రిటన్, అమెరికాలు ఒకవైపు; సోవియట్ రష్యా మరొకవైపు రాగల సాయుధ సంఘర్షణకు సూచనలన్నట్టుగా, వీటికి నేడు ప్రతి అంతర్జాతీయ రంగంలో వైషమ్యాలు తప్పడం లేదు.

గ్రీసులో తన సైన్యాల నుంచి, వాటిని ప్రజాస్వామిక వాదులపై ప్రయోగించి అక్కడ రాజరికాన్ని బ్రిటన్ ఎలాగైతే తిరిగి నెలకొల్పింది. కాని, అక్కడ శాంతి నెలకొనలేదు; నెలకొనబోదు కూడా. నిజానికి అక్కడ అప్పుడే అంతర్యుద్ధం ప్రారంభమైన సూచనలు కానవస్తున్నాయి. విప్లవకారులకు యూగోస్లావియా, అల్బేనియా నుంచి ఆయుధాలు చేరుతున్నాయని బ్రిటీష్ వారు ఆరోపిస్తున్నారు. రష్యా సహాయం కూడా లేకపోలేదని సూచిస్తున్నారు. గ్రీసులో బ్రిటన్ బాహాటంగా ఒక పక్షాన జోక్యం కలిగించు కొంటున్నప్పుడు మరొక పక్షాన రష్యా జోక్యం కలిగించుకొనడం సహజం. ఇది సమర్థ సాయం కూడా.

పర్షా ఉత్తరదిశలో - ఆబర్ బైజాన్లో - విప్లవం చెలరేగడానికి కారణం రష్యా ప్రోద్బలమేనని బ్రిటీష్ వారు అన్నారు. ఇదివరలో టెహరాన్ ప్రభుత్వం తిరుగుబాటు చేస్తే, ఇప్పుడు దక్షిణభాగం తిరుగుబాటు చేస్తున్నది. ఈ తిరుగుబాటుకు బ్రిటన్ ప్రోద్బలమే కారణమని రష్యనులు అంటున్నారు!

మెడిటరీనియన్ సముద్రంలో ప్రవేశానికిగాను డార్డనెల్స్ జలసంధిపై తనకు కొంత కంట్రోల్ ఏకాధిపత్యం కిందికి తీసుకురావాలని మొదటి మూడు రాజ్యాలు ప్రతిపాదిస్తున్నవిగాని, నాల్గవది (రష్యా) సమ్మతించడం లేదు.

చైనాలో కోమింగ్టాంగ్ పక్షానికి (కమ్యూనిస్టులకు విరుద్ధంగా) అమెరికన్ సేనలు, సేనాధిపతులు సహాయం చేస్తున్నారు. దీన్నిచూస్తూ మిన్నకుండలేమని రష్యనులు హెచ్చరిస్తున్నారు.

ఇక, పారిస్ శాంతి సమావేశాన్ని చూడబోతే, దాదాపు రెండు నెలల నుంచి అది జరుగుతున్నా, ఒక్క దక్షిణటైరోల్ ప్రాంతాన్ని గురించి తప్పితే, మరి ఏ విషయంలోను ఒడంబడిక కుదరనేలేదు. ఇటలీ వలన రాజ్యాలను గురించి, ఇటలీతో జరగదగు సంధిని గురించి అగ్రరాజ్య చతుష్టయ (బ్రిటన్, ఫ్రాన్సు, రష్యా, అమెరికా విదేశాంగ మంత్రుల మధ్య కొంతవరకు ఏదో ఒక ఒడంబడిక కుదిరినదంటే, యూగోస్లావియా ఆ ఒడంబడికపై సంతకం చేయనని బెదిరిస్తున్నది. నేటి యూగోస్లావియాపట్ల బ్రిటన్, అమెరికాలకు అభిమానం ఎంత తక్కువో, రష్యాకు అంత ఎక్కువ. పోతే, ప్రపంచ భద్రతా సంఘంలో కూడా విభేదాలే. శత్రురాజ్యాలు కాని భూభాగాలపై (గ్రీసు, చైనా మొదలైనవాటి తప్పని తాత్పర్యం) బ్రిటన్, అమెరికా సైన్యాలు ఎన్నికలలో తెలపమని రష్యా అడగగా, చెప్పబోమన్నారు!

ఈ విభేదాల సందర్భంలో, ఈ వివాదాల సందర్భంలో ఎవరిది తప్పో, ఎవరిది ఒప్పో చెప్పడం కష్టం. ఒక రాజ్యం లేదా కొన్ని రాజ్యాలు “పవర్ పాలిటిక్స్”ను అనుసరిస్తున్నప్పుడు, ఆత్మరక్షణను కోరి, మిగిలిన రాజ్యాలు అదే మార్గం వెంట నడవక తప్పదు. ఈ మాటను

నిష్కర్షగా చెప్పినందుకే మిస్టర్ హెన్రీ వాలెస్ను యునైటెడ్ స్టేట్స్ ప్రభుత్వంలో వాణిజ్యమంత్రి పదవి నుంచి స్వస్తిచెప్పి, ప్రెసిడెంట్ ట్రూమన్ పంపించివేశాడు.

జపానుపై యుద్ధం ముగిసిన తర్వాత యుద్ధ నౌకాశాఖలకు మనం 1,300 కోట్ల డాలర్లు ఖర్చుపెట్టాము; బికినీ దీవివద్ద యాటంబాంబు పరిశోధనలను కొనసాగించాము; ఈ బాంబుల నిర్మాణ పద్ధతిని రష్యాకు తెలపడానికి నిరాకరించాము; వీటిని ఎడతెగకుండా ఉత్పత్తి చేస్తున్నాము; లాటిన్ అమెరికన్ దేశాలకు మన ఆయుధాలను ఎగుమతిచేసి, వాటిని సాయుధం చేస్తున్నాము; ప్రపంచం సగభాగంలో, తక్కిన సగభాగంపై కోరితే బాంబులు వేయడానికి వీలుగా, వైమానికాశ్రయాలను సంపాయించడానికి ప్రయత్నిస్తున్నాము; బ్రిటన్ పునర్నిర్మాణానికై దానికి రుణమిచ్చాముగాని, అవే పద్ధతులపై రష్యాకు రుణమివ్వడానికి నిరాకరించాము; ఈ అన్నింటిని చూచి రష్యా అనుమానపడితే, అది సహజం కాదా? ఈ పరిస్థితిలో ఆత్మరక్షణకై తనకుతోచిన - తనకు సాధ్యమైన - ప్రయత్నాలను అది చేసుకుంటే, అది న్యాయమేకాదా? - ఈ ధోరణిలో మిస్టర్ వాలెస్ నిష్కర్షగా మాట్లాడాడు. బ్రిటన్కు, దాని ఇంపీరియలిస్టు విధానాలకు అమెరికన్ విదేశాంగ నీతిని బలిపెట్టరాదన్నాడు. ఇందుకు మిస్టర్ వాలెస్ను డిస్మిస్ చేసి, మిస్టర్ బరన్స్ విధానంపట్ల తనకు పరిపూర్ణ విశ్వాసం కలదని ప్రెసిడెంట్ ట్రూమన్ ప్రకటించినందున, రష్యాకు వ్యతిరేకంగా ఆంగ్లో-అమెరికన్ కూటమి మరింత బలపడిందనే తీర్మానించుకోవాలి. ప్రపంచంలో ఈనాడు అతిశక్తివంతమైన మూడు అగ్రరాజ్యాలు ఈ విధంగా రెండు కూటాలైనప్పుడు ప్రపంచయుద్ధ ప్రమాదం ఉండనే ఉంటుందికాదా? అయితే, ఈ శోచనీయ పరిస్థితులలో ఆశారేఖ ఒకటి పోలేదు. అది ప్రాచ్య ఖండంలో కొనలువారుతున్న నవజీవనం. ఇండియా, బర్మాలలో తాత్కాలిక జాతీయ ప్రభుత్వాలు ఏర్పడినవి; స్వతంత్ర జాతీయ ప్రభుత్వాలుగా అవి త్వరలోనే పరిణమించగల సూచనలు కానవస్తున్నాయి. జావా, సుమత్రాలపై ఇండోనేషియన్ రిపబ్లికన్ ప్రభుత్వాన్ని గుర్తిస్తున్నామని చెప్పి, ఆ ప్రభుత్వంతో డచ్చారు రాయబారాలను ప్రారంభించక తప్పలేదు కూడా. ఇండో-చైనాతో ఫ్రాన్సు ఒక ఒడంబడికకు రావలసి వచ్చింది. ఇవి అన్నీ కూడా ప్రాచ్యఖండం దాస్యశృంఖలాల నుంచి విముక్తి పొందనున్నదనడానికి నిదర్శనాలే. స్వతంత్ర ప్రాచ్యఖండం తన నవశక్తితో, నూతన దీప్తితో ప్రపంచానికి శాంతి సౌఖ్యాలను కూర్చగలగవచ్చు.

(ఆంధ్రజ్యోతి మాస పత్రిక సెప్టెంబర్ 1946)

3

పారిస్ శాంతిసభ ముగిసింది; మిత్రరాజ్య సమితి సమావేశం ప్రారంభమైంది.

కాని, ప్రపంచ శాంతి మాత్రం ఎప్పటివలె అలభ్యమైనదిగానే వున్నది.

పారిస్ శాంతిసభ వివిధ రాజ్యాల మధ్య సామరస్యాన్ని పెంపొందించడానికి బదులుగా, వాటి అధికంగా తోడ్పడిందేమో!

మధ్యగల విభేదాలను స్పష్టీకరించడానికే 79 రోజుల పాటు వివిధ సమస్యలపై పారిస్లో జరిగిన దీర్ఘచర్చలలో స్పష్టపడిన ప్రధానాంశం ప్రపంచ శాంతిని ప్రతిదేశం అభిలషిస్తున్నా, ఆ శాంతి సంస్థాపనకు అవసరమైన ప్రపంచ సమైక్యత నేటికి శూన్యమనే.

పారిస్ సమావేశం నుంచి స్వదేశం చేరగానే యునైటెడ్ స్టేట్సు విదేశాంగ మంత్రి మిస్టర్ బరన్స్ "రష్యా, అమెరికాల మధ్య వైరుధ్యం నానాటికి అధికమౌతున్నది" అని ప్రకటించాడు. అయితే, ఈ అభిప్రాయంతో జనరలిజో స్టాలిన్ ఏకీభవించడం లేదు, రష్యా, అమెరికాల మధ్య వైరుధ్యం అధికమౌతున్నా, కాకపోయినా, అది తొలగలేదనడమేమి, అది తొలగడానికి పారిస్ సభ ఎంతమాత్రం ఉపకరించలేదనడం గాని సువిదితమే.

అది చిన్న సమస్య కానివ్వండి; పెద్ద సమస్య కానివ్వండి; ఏదైనా, దాన్ని గురించి రష్యా ఒకటంటే, బ్రిటన్, అమెరికాలు మరొకటి అంటున్నవి. ప్రపంచం ఈవిధంగా విభిన్నవర్గాల లేదా, కూటాలకింద చీలిపోవడం ప్రపంచశాంతికి ప్రమాదకరమని ప్రపంచ రాజకీయవేత్తలు అంగీకరిస్తున్నప్పటికీ నేడు జరుగుతున్నది వర్గాలుగా లేదా, కూటాలుగా చీలిపోవడమే!

సోవియెట్ రష్యా, దాని ఇరుగుపొరుగు రాజ్యాలు ఇవి నేడొకకూటం. ఇవి ప్రధానంగా స్లావాతికి చెందిన రాజ్యాలుగవున్న వాటిని "స్లావ్కూటం" అని పేర్కొంటున్నారు.

కాగా, బ్రిటన్, ఫ్రాన్సు, యునైటెడ్ స్టేట్స్, బెల్జియం, హాలెండ్, డెన్మార్క్ మొదలైన రాజ్యాలు, బ్రిటీష్ సామ్రాజ్యంలోని కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాలు - ఇవి నేడు మరొక కూటం. వీటిలో అధికభాగం యూరప్ పశ్చిమభాగంలోని రాజ్యాలు గనక వాటిని "పశ్చిమకూటం" అని అంటున్నారు.

పారిస్ శాంతిసభలో దాదాపు ప్రతి సమస్యపై కూడా "స్లావ్ కూటం" ఒక విధంగా ఓటుచేస్తే, "పశ్చిమకూటం" మరొకవిధంగా ఓటు చేసింది.

ప్రపంచం ఈ రీతిగా రెండు కూటాలుగా ఏర్పడినప్పుడు, ఈ రెండు కూటాల మధ్య వైరుధ్యం తప్పనప్పుడు ప్రపంచ శాంతి సంస్థాపన అసంభవం గదా?

మిత్రరాజ్య సమితి సమావేశం వల్లగాని, ప్రపంచ భద్రతాసంఘ సమావేశం వల్లగాని, ప్రస్తుత వైరుధ్యమేమి, విభేదాలేమి సమసిపోగా, అవి మరింత దృఢమైనవి కావచ్చునేమోకూడా!

మిత్రరాజ్య సమితిలోనేమి, ప్రపంచ భద్రతాసంఘంలోనేమి సంఖ్యాబలం ప్రస్తుతం "పశ్చిమకూటమి" కున్నది. అంచేత తనకు మనస్కరించని నిర్ణయాలు ఏవైనా జరగగలవని తోచినప్పుడు సోవియెట్ రష్యా తన వీటోను ప్రయోగిస్తున్నది. దాన్ని పురస్కరించుకుని, "ప్రతి చిన్న విషయంలో కూడా చీటికీ మాటికీ రష్యా తన వీటో అధికారాన్ని వినియోగిస్తున్నది. వీటో అధికారాన్ని నిర్ణయించినప్పుడు దాన్ని స్వల్ప విషయాలలో కూడా వినియోగించవచ్చునని ఉద్దేశింపబడనేలేదు", అని ఈ మధ్య కామన్సు సభలో ప్రధాని అట్లీ ఉద్ఘాటించాడు. ఇప్పుడు మిత్రరాజ్య సమితిలోనేమి, భద్రతా సంఘంలోనేమి వీటోను పరిమితం చేయడానికి బ్రిటన్,.

యునైటెడ్ స్టేట్సు ప్రయత్నించవచ్చు. కాని, సోవియెట్ రష్యా అందుకు ఎంతమాత్రం సమ్మతించబోదు. దీనితో ప్రస్తుత వైరుధ్యం - ప్రస్తుత విభేదాలు - మరింత పెంపొందగలవు. అంతర్జాతీయ రాజకీయ రంగంలోని ఈ విషాద పరిణామం తృతీయ ప్రపంచ మహాసంగ్రామాన్ని అనివార్యం చేస్తున్నది. ఈ యుద్ధం వెంటనే రాకపోవచ్చు. కాని, మరొక పది, పదిహేను సంవత్సరాలలో - ఈలోపుగా నూతన శక్తులు తలయెత్తకపోతే - తప్పక పోవచ్చు. ఐతే, ఈలోపున నూతన శక్తులు కొన్ని తలయెత్తగల సూచనలు కానరాకపోవడం లేదు.

ఈ నూతన శక్తుల అవతరణకు ఒక తార్కాణం - మొన్నను మిత్రరాజ్య సమితి సభాస్థలిలో ప్రతిధ్వనించిన భారత ప్రజావాణే!

"కేవలం ఫాసిజం వినాశనం చాలదు; ఇంపీరియలిజం కూడా నామరూప రహితమైపోవాలి. ఒక జాతిపై మరొక జాతి ఆధిక్యం, ఒక దేశంపై మరొక దేశం పరిపాలన, ఒక ప్రజపై మరో ప్రజ ప్రభుత్వం ఇది పోయిననాడే ప్రపంచశాంతి. అన్ని జాతులు సమానత్వం గుర్తించబడినప్పుడే, అన్ని దేశాల స్వాతంత్ర్యం గుర్తించబడినప్పుడే ప్రపంచశాంతి" - ఈ విధంగా దక్షణాఫ్రికా భారతీయుల సమస్యపై భారత ప్రజాప్రతినిధి వర్గం మిత్రరాజ్య సమితిలో ఉద్ఘాటించింది. ఈ ఉద్ఘాటనలోని సత్యాన్ని గుర్తించి, మిత్రరాజ్య సమితి దక్షిణాఫ్రికా ప్రభుత్వం కొనసాగిస్తున్న జాత్యహంకృత విధాన సమస్యను చర్చించడానికి అంగీకరించక తప్పిందికాదు.

ఫాసిజంకువలె ఇంపీరియలిజంకు కూడా జాత్యహంకారమే ప్రాతిపదిక. అంచేత చర్చిల్, స్మట్స్ మొదలైన ఇంపీరియలిస్టులు భావిని గురించి ఆందోళన చెందుతున్నారు. నల్లజాతుల వారు తమ పౌరతంత్ర్య స్థితిపై విప్లవం చేస్తున్నారని, వారికి సోవియెట్ రష్యా తోడ్పాడు (ఉదాహరణకు, దక్షిణాఫ్రికా భారతీయ సమస్యకు లభించినట్టు లభిస్తున్నదని వీరు వ్యధపడుతున్నారు. ఇంపీరియలిజం ప్రాతిపదికల రక్షణ నిమిత్తం పశ్చిమ యూరోపియన్ రాజ్యాల కూటమి (సామ్రాజ్యాలు గల బ్రిటన్, ఫ్రాన్సు, బెల్జియం, హాలెండుల కూటమి) ఏర్పడాలని బహిరంగంగా ఉదోషిస్తున్నారు.

కాగా, దక్షిణాఫ్రికాలోని భారతీయుల సమస్యలో భారతదేశానికి అనుకూలంగా మిత్రరాజ్య సమితి నిర్ణయం చేస్తే, తమ సరిహద్దులలోని నీగ్రోజాతి విషయంలో, రెడ్ ఇండియనుల విషయంలో చిక్కుతప్పదని అమెరికన్ రాజకీయవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

ఐతే, ఎవరు ఎంత ఆందోళన చెందినా, ఏ ఆటంకాలను కల్పించినా, ప్రబుద్ధ ప్రాచ్య ప్రపంచాన్ని ఇక అరికట్టలేరు; ప్రబుద్ధ శ్వేతేతర జాతులను ఇక ఆపలేరు. నేడు భారతదేశం మత కలహాలతో కల్లోలితమై ఉండవచ్చు; చైనా అంతర్యుద్ధంతో విచలితమై ఉండవచ్చు;

ఇండోనేషియా సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని పొందివుండక పోవచ్చు; తన మిలిటరిస్టులు తెచ్చిన వినాశనం నుంచి జపాను కోలుకొని ఉండకపోవచ్చు! ఆఫ్రికా అమెరికాలలోని నీగ్రోలు స్వశక్తిని పూర్తిగా గుర్తించి ఉండకపోవచ్చు. అయినా, ప్రాచ్య ప్రపంచంలో శ్వేతేతర జాతులలో - నవచైతన, నవోత్సాహం కనపరుస్తున్నాయి. ఈ నవశక్తుల వికాసంలోనే ప్రపంచ శాంతిరక్షణకు పెట్టనికోట కలదు.

(ఆంధ్రజ్యోతి మాసపత్రిక నవంబరు 1946)

4

1939 నాటి పరిస్థితులు తిరిగి ఏర్పడుతున్నాయి" - ఇది సర్ యస్ రాధాకృష్ణన్ హెచ్చరిక.

పారిస్ లో జరుగుతున్న "నవప్రపంచ విజ్ఞానపరిషత్తు" సమావేశంలో భారతదేశ ప్రతినిధివర్గ నాయకుడుగా సర్ రాధాకృష్ణన్ ఈ హెచ్చరిక చేశాడు. నిజమే! సర్ రాధాకృష్ణన్ హెచ్చరించినట్టు, 1939 నాటి ప్రపంచ పరిస్థితులే తిరిగి ఏర్పడుతున్నాయి.

నాటివలె నేడు కూడా ప్రపంచం రెండు కూటాలుగా విభాగితమై పోతున్నది.

నాటివలె నేడుకూడా అంతర్జాతీయ విభేదాలు అంతకంతకు తీవ్రతర మౌతున్నాయి. నాటివలె నేడుకూడా సైనిక సమీకరణ, ఆయుధ నిర్మాణం మొదలైనవి వేగంగా - విస్తృతంగా - కొనసాగుతున్నవి.

వీటి నన్నింటిని మించి, నాటివలె నేడు కూడా ప్రపంచ ప్రజాబాహుళ్యంలో నైరాశ్యం, నిస్పృహ ద్యోతకమౌతున్నది.

1939 నాటి పరిస్థితులు తిరిగి ఎన్నటికీ ఉత్పన్నం కారాదనే మానవజాతి అశేష రక్తబలిదానాన్ని చేసింది. అయినా, 1946 అంతిమభాగం 1939 అంతిమ భాగానికి ఏమంత భిన్నమైనదిగా కానరావడం లేదు.

ఇది అత్యుక్తి కాదనడానికి, ఈ కింది మూడు అంశాలే నిదర్శనం.

1 బ్రిటన్లో నిర్బంధ సైనిక సేవ ప్రవేశపెట్టబడనున్నది. శాంతి సమయంలో ఇట్టి చర్య బ్రిటన్ చరిత్రలోనే అపూర్వం.

2 రష్యన్ సాయుధ బలాలు అప్రమత్తంగా ఉండాలనీ, కొత్త కొత్త ఆయుధాలను సమకూర్చుకోవాలనీ మార్షల్ స్టాలిన్ హెచ్చరించాడు.

3 అమెరికన్ సైనిక, నౌకా, వైమానిక బలాలను తగ్గించుకొనరాదని జనరల్ ఐసెన్ హోవర్ ఉద్ఘాటించాడు.

తిరిగి యుద్ధం కూడదని అందరు అనకపోవడం లేదు, కాని యుద్ధ సన్నద్ధత విషయమై పట్టుదల కానవస్తున్నది.

శాంతి సంస్థాపన అత్యవసరమని అందరు ఉదోషించకపోవడం లేదు. కాని, ఆయుధ విసర్జనను ఎవ్వరు కొనసాగించడం లేదు.

ఎవ్వరినోట వినబోయినా, శాంతి సంస్థాపనకు యుద్ధసన్నద్ధత అత్యవసరమనే మాటే వినవస్తున్నది. ఆధునిక రాజకీయవేత్త ఈమాట అనినప్పుడు "యుద్ధం ఎంత త్వరలో ప్రారంభం కాగలదు?" అని ప్రశ్నించుకొనడం అనుచితం కానేరదు.

(మిత్రరాజ్యసమితికి ఒక శాఖగా "యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్, కల్చరల్ ఆర్గనైజేషన్" అనే సంస్థ స్థాపించబడింది. ఈ పేరును పొట్టిచేసి, "యూనెస్కో" అని అంటున్నారు. దీన్నే నేను "నవప్రపంచ విజ్ఞానపరిషత్తు" అని అనువదిస్తున్నాను.)

ఫాసిజానికి, కమ్యూనిజానికి బద్ధవిరోధం. అంచేత ఏదో ఒక రూపంలో ఫాసిజం మనినంత వరకు సోవియెట్ రష్యా "పవర్ పొలిటిక్స్" చదరంగం ఆడక తప్పదు; అంతర్జాతీయ సంస్థలపై కాకుండా ఆత్మీయ సాయుధబలాలపై ఆధారపడక తప్పదు; తన పలుకుబడిలోకి వీలైనన్ని రాజ్యాలను తెచ్చుకొని, వీలైనంత ప్రాబల్యాన్ని సాధించడానికి ప్రయత్నించక తప్పదు.

దీని ఫలితమే నేటి ఆంగ్లో - అమెరికన్, సోవియెట్ కూటాలు; దీని ఫలితమే నేటి అంతర్జాతీయ రంగంలో కానవచ్చే విభేదాలైనా, విద్వేషాలైనా, స్పర్ధలైనా, సంఘర్షణలైనా ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామం ఎంత త్వరలో ప్రారంభం కానున్నదనే ప్రశ్న ఉదయించడానికి కారణం, ఏ ఫాసిస్ట్ శక్తుల వినాశనం ద్వితీయ ప్రపంచయుద్ధంలో లక్షించబడిందో ఆ శక్తులు పూర్తిగా విధ్వంసం కాకపోవడమే.

ఫాసిజానికి రూపాంతరమే ఇంపీరియలిజం. నిన్న, మొన్నటి యుద్ధంలో జర్మన్, ఇటాలియన్, జపానీస్ ఫాసిస్టులు నాశనమైపోయినా, ఫ్రెంచి, బ్రిటీష్, అమెరికన్ ఇంపీరియలిజాలు విధ్వంసం కాలేదు.

జాత్యహంకారం ఫాసిజానికి ప్రధాన ప్రాతిపదిక. నిన్న, మొన్నటి యుద్ధంలో జాత్యహంకారం వినాశనమై పోలేదనడానికి ప్రాచ్య జాతులవారి పట్ల జనరల్ స్మట్స్ విధానాలే, నీగ్రోవారి పట్ల ప్రెసిడెంట్ ట్రూమన్ వైఖరే, మొత్తంపై శ్వేతర జాతులపట్ల దృక్పథమే తార్కాణం.

జాతీయతకు ప్రాధాన్యమివ్వడం, జాతీయ ప్రాబల్యాన్ని కాంక్షించడం, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రపంచ ప్రాధాన్యాన్ని సాధించ గోరడం, పశుబలంపై అత్యధికంగా ఆధారపడ్డం - ఇవన్నీ ఫాసిజం లక్షణాలు. వీటిలో ఒక్కటైనా నిన్న, మొన్నటి యుద్ధంలో అంతరించి పోలేదనడానికి నేటి అంతర్జాతీయ పరిస్థితులే సాక్ష్యం.

ఫాసిజం, యుద్ధం అవినాభావన సంబంధం కలిగినట్టివి. ఫాసిజం తొలగనప్పుడు యుద్ధ ప్రమాదం తొలగకపోవడం సహజమేగదా?

"యుద్ధోన్మాదం ఇంకను సమసిపోలేదు; శాంతి సంధులపై ఇంకను సంతకాలు జరగలేదు; మనం ఇంకను విషపూరిత వాతావరణంలోనే కృషి చేయవలసి వస్తున్నది" - ఇది మిత్రరాజ్య సమితి రాజకీయోప సంఘంలో మొన్నను (నవంబర్ 30వ తేదీని) ఫ్రెంచి ప్రతినిధి ముష్యూర్ అలెగ్జాండర్ పరోదీ పలికిన పలుకులు.

నేటి అంతర్జాతీయ పరిస్థితులను ఇవి చక్కగా వర్ణిస్తున్నవి.

ట్రియస్ట్ విషయమై, డాన్యూబ్ విషయమై, అల్బేనియా, బల్గేరియాలతో గ్రీసు సరిహద్దుల విషయమై అగ్రరాజ్యాల మధ్య ఇటీవల ఏకాభిప్రాయం కుదరకపోలేదు. ఇదేవిధంగా యుద్ధ నష్టపరిహారం, జర్మనీలో ఆర్థిక సమైక్యత మొదలైన ఇతర స్వల్ప సమస్య సందర్భంలో కూడా అవి ఏకాభిప్రాయానికి రావచ్చు. కాని, ప్రపంచ శాంతి సంస్థాపనతో ప్రత్యక్ష సంబంధం గల ముఖ్య సమస్య విషయంలో - ఆయుధ విసర్జన సమస్య విషయంలోనని నా ఉద్దేశం అన్నీ నా విభేదాలే.

పది, పదిహేను రోజుల నుంచి మిత్రరాజ్య సమితిలో ఆయుధ విసర్జన విషయమై చర్చ కొనసాగుతున్నది. ఈ చర్చను జాగ్రత్తగా పరిశీలిస్తే, అగ్రరాజ్యాలు ఆడుతున్న "పవర్ పాలిటిక్స్" చదరంగంలోని ఎత్తులు, ఎదురెత్తులు కొంతవరకు సుబోధం కాగలవు.

మిత్రరాజ్య సమితికి చెందిన ఏయే రాజ్యాల సైన్యాలు 1946 నవంబర్ 1వ తేదీ నాటికి మిత్రరాజ్య సమితికి చెందిన ఏయే ఇతర రాజ్యాలలో ఎంతెంత మేరకు కలవో ప్రపంచ భద్రతా సంఘానికి తెలపడం అవసరమని సోవియెట్ రష్యా ఒక ప్రతిపాదన తెచ్చింది.

ఈ ప్రతిపాదనను బ్రిటన్, అమెరికాలు ప్రతిఘటించలేదు. కాని, కేవలం మిత్రరాజ్య సమితికి చెందిన ఇతర రాజ్యాలలోనే కాకుండా, మాజీ శత్రురాజ్యాలలో కూడా ఎంతెంత మేరకు సేనలున్నవో కూడా తెలపాలని అవి ప్రతిపాదించినవి. ఇదే సమయంలో నవంబర్ 1వ తేదీనాటి వివరాలను కాకుండా జనవరి 1వ తేదీనాటి వివరాలను తెలుపడం సముచితమని కూడా ప్రతిపాదించినవి.

రష్యా చేసిన తొలి ప్రతిపాదనలోని ఆంతర్యమిది: - ఇండియా, ఇండోనీసియా ఇండోచైనా, ఈజిప్ట్, గ్రీసు, చైనా, జపాను మొదలైన పెక్కు దేశాలలో బ్రిటీష్, ఫ్రెంచి, అమెరికన్ సేనలున్నాయి. వాటి వివరాలను లోకానికి తెలపడం ద్వారా, ఆంగ్లో-అమెరికన్ కూటమి సైన్యాలు ప్రపంచంలో ఎంతవరకు విస్తరించివున్నవో తెలియజేయవచ్చునని రష్యా ఉద్దేశించింది.

కాగా, బ్రిటన్, అమెరికాల ఎదురు ప్రతిపాదన ఆంతర్యమిది: - మిత్రరాజ్య సమితికి చెందిన రాజ్యాలలో సోవియెట్ సేనలు లేకపోవచ్చు. కాని, మాజీ శత్రురాజ్యాలలో (ముఖ్యంగా తూర్పు యూరప్) సోవియెట్ బలాలున్నవి. అంచేత తాము వెల్లడించవలసిన వివరాలతోపాటు ఈ వివరాలను కూడా వెల్లడింపజేస్తే, తాము అంత అతిగా కనబడబోమని బ్రిటన్, అమెరికాల.

అంచనా. ఇక, 1947 జనవరి 1వ తేదీనాటి వివరాలను తెలుపనగునని బ్రిటన్ ప్రత్యేకంగా పేర్కొనడానికి కూడా ఒక ముఖ్యకారణం లేకపోలేదు. ఈజిప్టుతో 1936 నాటి సంధి సవరణ విషయమై ఒడంబడిక కుదరబోతున్నందువల్ల, ఇండోనీసియాతో డచ్వారు ఒక సంధిని చేసుకొనబోతున్నందువల్ల, ఈజిప్టు, ఇండోనీసియాల నుంచి బ్రిటీష్ సైన్యాలు తరలిపోనున్నవి. అంచేత 1946 నవంబర్ 1 తేదీనాటి వివరాలను తెలపడానికి ఇచ్చగింపక, 1947 జనవరి 1వ తేదీనాటి వివరాలని బ్రిటన్ ప్రతిపాదిస్తున్నది.

ఐతే, బ్రిటన్, అమెరికాల ఎదురెత్తు ఇంతమాత్రమే కాదు. విదేశాలలోగల సైన్యాల వివరాలనే కాకుండా స్వదేశాలలోగల సాయుధ బలాల వివరాలను కూడా తెలపాలని అవి ప్రతిపాదించినవి. సోవియెట్ రష్యాకు పెద్ద సైన్యం ఈనాటికే కలదనడం అందరికీ తెలిసిన విషయమే. రష్యా మహారాజ్యం, దాని సరిహద్దులో కొన్నివేల మైళ్ళ నిడివిగలవి. వాటి రక్షణకు దానికి పెద్ద సైన్యం సర్వదా అవసరం. అంచేత దాని సైన్యం పెద్దదై వుండక తప్పదు. దీన్ని పురస్కరించుకొని, విదేశాలలోని సైన్యాల వివరాలనే కాకుండా, స్వదేశాలలోని సైన్యాల వివరాలను సైతం తెలపాలని బ్రిటన్, అమెరికాలు ప్రతిపాదించినవి.

ఇంతటితో అవి ఆగలేదుకూడా. కేవలం సైనికదళాల వివరాలనే కాకుండా, అవసరం ఏర్పడినప్పుడు రిజర్వు దళాలుగా ఉపకరించగల వాటి వివరాలను కూడా తెలపాలనీ, సైనిక శిక్షణను పోలినదాన్ని పొందే వాలంటీర్ దళాలు మొదలైనవాటి వివరాలు సైతం తెలపాలనీ ఎన్ని ఫిరంగులున్నవో, ఎంత మందుగుండు కలదో చెప్పడం కూడా అవసరమనీ అవి అంటున్నవి. బ్రిటన్ ఇంతకంటే కూడా ఒక అడుగు ముందుకు వేస్తున్నది. కేవలం వివరాలను తెలపడం చాలదనీ, ఆ వివరాలు సరియైనవని ధ్రువపరచడానికి పరిశీలక సంఘాన్ని నియమించడం కూడా జరగాలనీ అది సూచిస్తున్నది.

ఇందుపై రష్యా “సరే! స్వదేశాలలోని సాయుధబలాల వివరాలను కూడా తెలపవలసిందే. కాని, అంతమాత్రం చాలదు. ఏయే రాజ్యానికి ఎక్కడెక్కడ ఏయే సైనిక, నౌకా, వైమానికాశ్రయా లున్నవో కూడా తెలపాలి. యాటంబాంబులకు సంబంధించిన అన్ని వివరాలను కూడా తెలపాలి. ఆయుధాలను నిర్మించడానికి ఉపకరించగల ముడిపదార్థాలు, కర్మాగారాలు మొదలైన సాధన సంపత్తిని గురించిన పూర్తి వివరాలను సైతం ప్రకటించాలి" అని అంటున్నది.

యాటంబాంబు మాటవచ్చేసరికి, దాన్ని గురించిన రహస్యాలను వెల్లడించడం అమెరికాకు మనస్కరించడం లేదు. కాని, ఆ మాట నిష్కర్షగా చెప్పక, రాకెట్ విమానాలు, రెక్కల బాంబులు, విషక్రిములు, విషవాయువులు మొదలైన అన్ని మారణాస్త్రాలను - ఇప్పుడున్న వాటినేమి, ఇకముందు కనిపెట్టబడగల వాటినేమి - అంతర్జాతీయ యాజమాన్యం కింద పెట్టవలసిందేనని బ్రిటన్, అమెరికాలు సూచిస్తున్నవి.

ఈ సూచనను రష్యా కాదనడంలేదుగాని, సాయుధబలాలనేమి, ఆయుధ సామగ్రినేమి పరిశీలించి, కంట్రోల్ చేయవలసిన సంఘం ప్రపంచ భద్రతా సంఘానికి లోబడివుండాలని పేర్కొంటున్నది. ప్రపంచ భద్రతా సంఘంలో అగ్రరాజ్యాలకు వీటో అధికారమున్నది. అంచేత ఆ సంఘంలో ఆంగ్లో - అమెరికన్ కూటమి తన వోట్ల బలంపై ఆధారపడి, తాను కోరిన నిర్ణయాన్ని చేయగోరితే, వెంటనే రష్యా తన వీటో అధికారాన్ని ప్రయోగిస్తుంది. అంచేత రష్యా ప్రతివాదనకు బ్రిటన్, అమెరికాలు సమ్మతించడం లేదు.

ఈవిధంగా ఆయుధ విసర్జన సమస్య సందర్భంలో ఎత్తులు, ఎదురెత్తులు పడుతున్నవి. కాగా, ఇప్పటికి జరిగిన తీర్మానం డిశెంబరు 15వ తేదీలోగా మిత్రరాజ్య సమితికి చెందిన ప్రతిరాజ్యం స్వదేశంలోను, విదేశాలలోను తనకుగల సైన్యాల వివరాలను తెలపాలని మాత్రమే.

శాంతి సంస్థాపన సందర్భంలో లేదా, ఆయుధ విసర్జన సందర్భంలో - నేడు అగ్రరాజ్యాల మధ్య ఎంతటి విభేదాలు కలవో ఈ విషయాలు స్పష్టపరచడం లేదా?

శాంతి సంస్థాపన విషయంలో అగ్రరాజ్యాలు ఏకవిధానాన్ని అనుసరించలేకపోతున్నా, భావియుద్ధ సన్నాహాల విషయంలో అవి ఏకవిధానాన్నే అనుసరిస్తున్నాయి.

ఇందుకొక తార్కాణం - కొత్త కొత్త మారణాస్త్రాలను కనిపెట్టడానికి నిర్విరామంగా జరుగుతున్న కృషే.

"ఒక రాజ్యం యాటంబాంబుతో బెదిరింపజూస్తే, మరొకటి ఆ యాటంబాంబుతోనో, దాన్ని మించిపోగలదానితోనో ఎదురు బెదిరించగలదు సుమీ!" అని ఈ మధ్యనే న్యూయార్క్ *(మిత్రరాజ్య సమితిలోనో, ప్రపంచ భద్రతా సంఘంలోనో సరిగా జ్ఞాపకం లేదు)* మూష్యూర్ మోలటాఫ్ ఉద్ఘాటించాడు.

యాటంబాంబును మించినదాన్ని కనిపెట్టడం సాధ్యమైనా కాకపోయినా, రష్యా యాటంబాంబును చేయడాన్ని తెలుసుకొన్నదనో, లేదా, రేపో, మాపో తెలుసుకోనున్నదనో నిశ్చయంగా అనుకోవచ్చు. పరమాణు విచ్ఛేదానికి ఒక రష్యన్ శాస్త్రవేత్త ఒక కొత్తపద్ధతిని కనిపెట్టగలిగినాడని "ప్రావడా" పత్రికలో సోవియెట్ వైజ్ఞానికశాస్త్ర పరిషత్తు అధ్యక్షుడు వ్రాశాడు. కొన్నికోట్ల వ్యయంతో యాటంబాంబుల నిర్మాణానికి సోవియెట్ రష్యాలో ఒక కర్మాగారం నిర్మించబడిందనే వార్త వచ్చింది కూడా.

నేడు అమెరికన్ యాటంబాంబు కర్మాగారాలు రాత్రింబగళ్ళు పనిచేస్తున్నవి. రేపటి నుంచి సోవియెట్ యాటంబాంబు కర్మాగారాలు సైతం రాత్రింబగళ్ళు పనిచేయగలవు. అటుపిమ్మట... ప్రస్తుత వివాదాలు సమసి, యుద్ధకారణాలు తొలగి, అంతర్జాతీయ సామరస్యం పెంపొందకపోతే, అటుపిమ్మట మానవజాతి సర్వ విధ్వంసమేనని, మానవ సంస్కృతి స్వరూప నాశనమేనని ప్రొఫెసర్ ఐన్స్టీన్ మొదలైన ప్రపంచ ప్రఖ్యాత వైజ్ఞానిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

వీరు ఒక ప్రటకన చేస్తూ, ఈ కింది విషయాలను స్పష్టపరిచారు :

1 యాటంబాంబును చేయడం నేడు ఒక అమెరికాకే తెలియవచ్చు. త్వరలో ఇతర దేశాలు కూడా దాన్ని తెలుసుకోగలవు.

2 యాటంబాంబు మారణశక్తిని ప్రతిఘటించ గలిగింది లేదు; దాన్ని కనిపెట్టజాలము కూడా.

3 యాటంబాంబు ప్రయోగం జరగకుండా జాగ్రత్తపడబోవడం వల్ల ప్రయోజనం శూన్యం. పైగా, ఇట్టి ప్రయత్నం చేస్తే, సాంఘిక వ్యవస్థ ప్రాతిపదికలకే భంగపాటు తప్పదు.

4 ఈసారి యుద్ధం వస్తే, యాటంబాంబులు విస్తృత ప్రయోగం తథ్యం, దానితో మానవ సంస్కృతి స్వరూప నాశనం తథ్యం.

5. ఈ ప్రమాదం నుంచి రక్షణమార్గం - పరమాణుశక్తిని అంతర్జాతీయాధికారం కింద పెట్టడమే; అసలు యుద్ధాలకు స్వస్తిచెప్పడమే.

కాని, నేడు జరుగుతున్న కృషి యుద్ధాలకు స్వస్తి చెప్పడానికి కాదు; వాటిని సమీపింప జేయడానికే.

ముందు రానున్నది బహుశా ప్రపంచ మొత్తాన్ని తుడిచిపెట్టగల పెద్ద యుద్ధమైతే, ఇప్పుడు అనేక చిన్న చిన్న యుద్ధాలు కొనసాగుతూనే ఉన్నాయి.

గ్రీసులో మాసిడోనియనులకు, ప్రభుత్వ పక్షం వారికి యుద్ధం.

పాలస్తీనాలో యూదులకు, బ్రిటీష్ వారికి యుద్ధం.

చైనాలో కోమింగంగ్కు, కమ్యూనిస్టు పార్టీకి యుద్ధం.

ఇండోచైనాలో ఫ్రెంచివారికి, వియత్నాం రిపబ్లిక్ వారికి యుద్ధం.

గ్రీసు, పాలస్తీనా, చైనాలలోని యుద్ధాలను గురించి ఇప్పుడిక్కడ నేను చర్చించబోవడం లేదుగాని, ఇండోచైనాలోని యుద్ధాన్ని గురించి ఒకముక్క చెప్పాలి.

ఇండోనీసియా నుంచి డచ్ ఇంపీరియలిస్టులు, ఇండియా నుంచి బ్రిటీష్ ఇంపీరియలిస్టులు పూర్తిగాగాని, త్వరగాగాని తొలగిపోనిచ్చగించనట్టే, ఇండో చైనా నుంచి ఫ్రెంచి ఇంపీరియలిస్టులు తొలగిపోనిచ్చగించక పోవడంవల్లనే, వియత్నాం రిపబ్లిక్ ఫ్రాన్సుకు ప్రస్తుతం యుద్ధం సాగుతున్నది.

తమ పరిపాలనలోగల ప్రాచ్య దేశాలకు విధిలేక స్వపరిపాలనాధికారాన్ని ఇస్తామంటున్నా, తమ ప్రాబల్యాన్ని ఏదో ఒక విధంగా వీలైనంతకాలం కాపాడుకోడానికి పాశ్చాత్య సామ్రాజ్యవాదులు చేస్తున్న ప్రయత్నాలకు ఇండియా, ఇండోనీసియాలలో కూడా ప్రత్యక్ష నిదర్శనాలను చూడవచ్చు.

బ్రిటీష్ వారికి ఎంతో కొంత ప్రమేయం లేకుండా ఇండియాలో ఇటీవలి మతకలహాలు జరిగివుండేవా?

కాగా, ఇండోనీసియా స్వాతంత్ర్యాన్ని గుర్తిస్తున్నామని పేర్కొంటూనే, జావా, సుమిత్రాల నుంచి, బోర్నియో, తూర్పు ఇండోనీసియాలను వేరుపరిచారు. ఈ కలగాపులగానికి "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండోనీసియా" అని పేరుపెట్టి, ఇది "నెదర్లాండ్స్ - ఇండోనీసియన్ యూనియన్" అనే దానిలో అంతర్భాగంగా డచ్ రాణి ఏకఛత్రాధిపత్యం కింద ఉండవలెనన్నాడు. ఈ ఏర్పాటు ఇండియా విషయంలో బ్రిటీష్ అమాత్యప్రణాళిక సూచిస్తున్న "ఇండియన్ యూనియన్"లోని ఎ.బి.సి. వర్గాలకు రక్తబంధువే!

ఎక్కడ చూచినా ఏదో ఒక రూపంలో కానవస్తున్న ఈ కల్లోల ప్రపంచానికి శాంతి లభ్యం కావాలంటే, అందుకు మార్గం ప్రపంచ ప్రజాబాహుళ్యంలో ఏమైనాసరే తిరిగి యుద్ధం రానీయబోమనే పట్టుదల రేకెత్తడమే. ఇందుకు మారుగా నేడు (1939లో వలె) నైరాశ్యం, నిస్పృహ గోచరిస్తున్నవి. ఇది ఎంతమాత్రం కూడదు. "తిరిగి యుద్ధం రారాదు" అని ప్రపంచ ప్రజలు ముక్తకంఠంతో ఘోషించగలిగితే, ఏ ప్రపంచ రాజకీయవేత్త యుద్ధ సన్నాహాలు చేయగలడు? యుద్ధప్రకటన చేయగలడు? అయితే జాతి, మత, వర్ణ, వర్గ విభేదాలకు సంబంధించిన మౌఢ్యాలనేమి, స్వార్థాలనేమి అధిగమించ గలిగిననాడే. ఈ ఉదోషణ ప్రపంచ ప్రజానీకం చేయగలదు. అంచేత ఎటుతిరిగినా, ఆత్మవికాసమే, ఆత్మ పరిపక్వమే, ఆత్మశాంతికివలె, అంతర్జాతీయ శాంతికి మూల మనే నిత్యసత్యానికి తిరిగిరాక తప్పదు.

జాత్యహంకారాలకు, జాతీయ స్వార్థాలకు స్వస్తిచెప్పి, మానవ స్వాతంత్ర్యాన్ని, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని గుర్తించినప్పుడే ప్రపంచ శాంతి సంస్థాపన సుసాధ్యమని సముచితరీతిని ఉద్బోధించ గలిగినప్పుడు, అట్టి కృషి పూర్తిగా నిష్ఫలంకాబో దనడానికి దక్షిణాఫ్రికాపై మిత్రరాజ్య సమితికి చెందిన రాజకీయ, న్యాయశాస్త్ర ఉపసంఘంలో ('పొలిటికల్ అండ్ లీగల్ కమిటీ'లో) ఇండియా సాధించగలిగిన విజయమే నిదర్శనం.

దక్షిణాఫ్రికాలో ఏషియాటిక్ జాతులపట్ల - ముఖ్యంగా భారతీయులపట్ల - ప్రదర్శించబడుతున్న జాత్యహంకార విధానాలను ఆంతరంగిక సమస్యగా పేర్కొని, ఇండియా ఫిర్యాదును అంతర్జాతీయ న్యాయస్థానానికి విచారణకు పంపించడానికి జనరల్ స్మట్స్ యత్నించాడు. ఈ యత్నాన్ని త్రోచిపుచ్చి, దక్షిణాఫ్రికా భారతీయుల సమస్యను తమలో తాము పరిష్కరించుకొనడానికి ఇండియా, దక్షిణాఫ్రికా ప్రభుత్వాలు రాయబారాలు కొనసాగించుకోవాలనీ, ఆ రాయబారాల ఫలితాన్ని మిత్ర రాజ్య సమితి తిరిగి సమావేశమైనప్పటికి నివేదించాలనీ రాజకీయ, న్యాయశాస్త్ర ఉపసంఘం నిర్ణయించింది.

ఐతే, ఈ నిర్ణయాన్ని మిత్రరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ (సర్వసభ్య సమావేశం) మూడింట రెండు వంతుల మెజారిటీతో ధ్రువపరచవలసి ఉన్నది. అది తన రాజకీయ, న్యాయశాస్త్ర ఉపసంఘం నిర్ణయాన్ని ధ్రువపరచకపోతే, తన ప్రాతిపదికలకే, తన మనుగడకే భంగం తెచ్చుకొనగల దనడం నిర్వివాదం.

ఏమైనా, మిత్రరాజ్య సమితి రాజకీయ, న్యాయశాస్త్ర ఉపసంఘంలో ఇండియాకు విరుద్ధంగా బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, బెల్జియం, హాలెండ్ యునైటెడ్ స్టేట్సులు మొదలైనవి ఓటు చేయడం గమనార్హమైన విషయం. వీటిలో అధిక భాగం కలోనియల్ ఇంపీరియలిజమునో, డాలర్ ఇంపీరియలిజమునో అనుకరిస్తున్న రాజ్యాలే. దక్షిణాఫ్రికాలో భారతీయుల పట్ల జనరల్ స్మట్స్ విధానాలను తాను ఖండిస్తే, అటుపిమ్మట తాను నీగ్రోలపట్ల అనుసరిస్తున్న విధానం సైతం విమర్శించబడగలదనే యునైటెడ్ స్టేట్సు చర్యకు కారణం. అగ్రరాజ్యాలలో కొన్ని నేటికీ ప్రదర్శిస్తున్న నీచజాత్యహంకారానికేమి, జాతీయ స్వార్థానికేమి ఇది ఒక తార్కాణం మాత్రమే. (ఆంధ్రజ్యోతి మాస పత్రిక డిశంబరు 1946)

5

"ప్రపంచ విముక్తికి మిత్రరాజ్యసమితి ఒక్కటే శరణ్యం"

ఇటీవలనే బ్రిటీష్ విదేశాంగ మంత్రి మిస్టర్ ఎర్నెస్ట్బెవిన్ చేసిన ఉద్ఘాటన.

న్యూయార్క్ లో జరిగిన మిత్ర రాజ్యసమితి సమావేశానంతరం ఆ సమావేశంలో జరిగిన కృషిని సమీక్షిస్తూ, అతడు ఈ ఉద్ఘాటనను చేశాడు.

ప్రపంచ రాజకీయవేత్తల మధ్య నేడు ఏ ఒక్క సమస్యపై కూడా ఏకాభిప్రాయం కానరాకపోవచ్చు. కాని, ప్రపంచ విముక్తికి - యుద్ధ ప్రమాదం నుంచి విముక్తికని తాత్పర్యం. మిత్రరాజ్య సమితి ఒక్కటే శరణ్యమనే విషయంలో మాత్రం వారిలో విభిన్నాభిప్రాయం లేనేలేదు.

ప్రథమ, ద్వితీయ ప్రపంచ మహా సంగ్రామాలకు మూలకారణాలైనవాటిలో ఒక్కటైనా ఈ నాటికీ తొలగిపోలేదు. అంచేత ప్రపంచయుద్ధ ప్రమాదం ఇదివరలో ఎంత కలదో, ఇప్పుడు కూడా అంతే కలదు. నిజానికి అంతకంటే మిన్నగాకూడా కలదేమో! ఒకదేశం కంటె మరో దేశ ఒక జాతికంటె మరొకజాతి - అత్యధిక శక్తిసంపన్నం కావడమే యుద్ధకారణాలలో ముఖ్యమైనట్టిది. తన

తోటి రాజ్యాల కంటే అత్యధిక శక్తి సంపదను కూర్చుకొనగలిగినట్టి దానికి, ఆ శక్తి సంపదతో తక్కిన రాజ్యాలను జయించాలనే దుష్టవాంఛ జనించవచ్చు. ఇట్టి వాంఛ వానికి లేకపోయినా, దాని శక్తి సంపదే తక్కిన రాజ్యాలలో భయసందేహాలను - లేదా, అసూయను - రేకెత్తించి, వాటినన్నింటిని ఏకం చేయడమేమి, వాటిని యుద్ధానికి పురికొల్పడమేమి సంభవించవచ్చు.

ఇందుకు చరిత్రలో నిదర్శనాలు అనేకం. నెపోలియన్ నాయకత్వం కింద ఫ్రాన్సు అతి శక్తిసంపన్నమైనది కావడమే. ఫ్రాన్సుకు విరుద్ధంగా యూరప్ ఏకం కావడానికి కారణం. తూర్పు, దక్షిణ యూరప్ లో రష్యా ప్రాబల్యం అంతకంతకు అధికం కావడమే, దానికి విరుద్ధంగా నిలిచి, బ్రిటన్, ఫ్రాన్సు, టర్కీలు క్రిమియన్ యుద్ధాలను జరపడానికి కారణం. మొదట కెయిజర్ నాయకత్వం కింద, తర్వాత హిట్లర్ నాయకత్వం కింద జర్మనీ అత్యధిక బలోపేతమైన రాజ్యం కావడమే ప్రథమ, ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామాలకు కారణం. యుద్ధానికి దారితీసే ఈ యుద్ధకారణం ఈనాడు మరింత బలీయంగా కానవస్తున్నది. మిస్టర్ బెవిన్ మొన్న తన సమీక్షలో పేర్కొన్నట్టు, ద్వితీయ ప్రపంచ మహా సంగ్రామ ఫలితంగా రెండు రాజ్యాలు ప్రపంచ మొత్తంపై అత్యంత శక్తిసంపన్నమైనవిగా పరిణమించినవి. వీటిలో మొదటిది, - యునైటెడ్ స్టేట్సు, రెండవది, - సోవియెట్ రష్యా. ఈ రెండు రాజ్యాల రాజకీయ విధానాలు విరుద్ధమైనవి; ఆర్థిక వ్యవస్థలు విరుద్ధమైనవి; సాంఘిక లక్ష్యాలు విరుద్ధమైనవి; జీవిత దృక్పథాలే విరుద్ధమైనవి. అందువల్ల ఇదివరలోకంటె ఇప్పుడే యుద్ధ ప్రమాదం వాస్తవానికి ఎంతైనా అధికమైనట్టిది.

ఈ యుద్ధ ప్రమాదాన్ని పూర్తిగాగాని, శాశ్వతంగా తొలగించగలిగినా, లేకపోయినా, కనీసం దీన్ని కొంతకాలం పాటైనా వారించ గలిగింది మిత్రరాజ్య సమితి మాత్రమే. అందువల్లనే ట్రూమన్, స్టాలిన్, అట్లీలేమి, బరన్స్, మోలటావ్, బెవిన్ మి "ప్రపంచ విముక్తికి మిత్రరాజ్యసమితి ఒక్కటే శరణ్యం" అని ఉద్ఘాటించడం సంభవిస్తున్నది.

ఇందరు ఇంతగా ఆశపెట్టుకున్న మిత్రరాజ్యసమితి కొంతవరకైనా ఆ ఆశను ఫలింప చేస్తుందా? ఈ ప్రశ్నకు "బహుశా" అని ప్రత్యుత్తరం చెప్పడానికి మిత్రరాజ్యసమితి న్యూయార్క్ సమావేశం కొంత అవకాశమిచ్చినదని చెప్పవచ్చు.

* * * * * *

మిత్రరాజ్య సమితి న్యూయార్క్ సమావేశం విషయమై ప్రస్తావించే సందర్భంలో నేటి రాజకీయ వ్యాస రచయితలే కాకుండా, భావిప్రపంచ చరిత్రకారుడు కూడా ఓంప్రథమంగా పేర్కొనేది, - దక్షిణాఫ్రికాపై భారతదేశం సాధించిన అఖండవిజయమే.

నిజానికి ఇది కేవలం భారతదేశ విజయం మాత్రమే కాదు; సమస్త ప్రాచ్య ప్రపంచ విజయం; సకలపీడిత ప్రజాకోటి విజయం.

ఈ విషయాన్ని జనరల్ స్మట్స్ సైతం గుర్తించాడు. అందువల్లనే ఆయన తమ పరాజయాన్ని గురించి ప్రస్తావిస్తూ, "ఇది కేవలం దక్షిణాఫ్రికా సమస్య మాత్రమే కాదు; అన్ని యూరోపియన్ జాతుల సమస్య" అని హెచ్చరించాడు.

దక్షిణాఫ్రికాలో పాతిక లక్షలమంది తెల్లవారుంటే, రెండున్నర లక్షల మంది నల్లవారున్నారు. ఈ కొద్దిమంది నల్లవారైనా తమంతట తాముగా దక్షిణాఫ్రికాకు వెళ్ళినవారుకారు. తమకు కూలీలు కావలసివచ్చినప్పుడు ఏవేవో చాలా ఆశలు పెట్టి, తెల్లవారు పిలవగా వెళ్ళినవారే. దక్షిణాఫ్రికా ఈనాడు సిరిసంపదలతో తులతూగుతుందంటే, అది ఈ నల్లవారుపడిన కష్టం ఫలితమే; ఓడ్చిన చెమట ఫలితమే; కురియించిన రక్తం ఫలితమే. అయినా, తమకు ఈనాడు వారితో అక్కర తీరినందున వీరిని ఎలాగైనా తమ దేశం నుంచి

తరిమివేయాలని దక్షిణాఫ్రికా తెల్లవారు ప్రయత్నిస్తున్నారు. ప్రపంచ చరిత్రలోనే దీన్నిమించిన అన్యాయకృత్యాలేమి, కృతఘ్న చర్యలేమి అతి స్వల్పం!

ఏషియాటిక్ జాతులకు విరుద్ధంగా - ముఖ్యంగా, భారతీయులకు ప్రతికూలంగా - దక్షిణాఫ్రికా శ్వేతముఖులు చేసిన "మాలపల్లి" చట్టానికి ప్రాతిపదికలు అన్యాయం, కృతఘ్నత మాత్రమే కావు; జాత్యహంకారం కూడా.

దక్షిణాఫ్రికా శ్వేతముఖులు ఎంత జాత్యహంకార పీడితులైనదీ తెలపడానికి మిత్రరాజ్య సమితిలో భారతదేశం విజయం పొందిన వెనక జనరల్ స్మట్స్ చేసిన ఒక ప్రకటనే చాలు. ఈ ప్రకటనలో శ్వేతజాతులవారే సర్వదా ప్రపంచాన్ని పరిపాలించాలనీ, నేడు కూడా వారే ప్రపంచ పరిపాలకులనీ ఆయన ఉద్ఘాటించాడు. ఈ ఉద్ఘాటన చారిత్రక సత్యాలకు పూర్తిగా విరుద్ధమైనట్టిది. శ్వేతజాతులు ప్రాబల్యం నాలుగైదు శతాబ్దాల నుంచి మాత్రమే. అంతకుముందు ఆసియాఖండం ముందు యూరప్ దివ్వెటీ ముందు దీపమే. అప్పటిలో శ్వేతజాతీయులు కేవలం ఆటవికుల స్థితిలో ఉండేవారు. ఆ రోజులలో ఏషియటిక్ జాతులవారు యూరపన్ను జయించి, కొన్ని కొన్ని ప్రాంతాలను కొన్ని శతాబ్దాలపాటు పరిపాలించి ఉన్నారు కూడా. అయినా, శ్వేతముఖులే సర్వదా ప్రపంచ పరిపాలకులనడం జనరల్ స్మట్స్ జాత్యహంకారానికే నిదర్శనం.

ఇటీవల కొన్ని శతాబ్దాల నుంచి ప్రపంచం మొత్తంలో శ్వేతముఖుల ప్రాబల్యానికి తిరుగులేకున్నా, మరి ఎంతోకాలం పాటు ఈ ప్రాబల్యం నిలవబోదని జనరల్ స్మట్సుకు తెలియకపోదు. అందువల్లనే తాను చేసిన ప్రకటనలో ఆయన "మరెంతకాలం ప్రపంచ పరిపాలనాధికారాన్ని యూరోపియన్ జాతులు కాపాడుకొనగలవో చెప్పలేను" అని అన్నాడు. ఈ సందేహం ఆయనకు తోచడానికి మిత్రరాజ్యసమితిలో ఏదో ఒక నూతనశక్తి గోచరించడమేనట. ఈ శక్తి ఏదో - ఎట్టిదో - ఎక్కడిదో - జనరల్ స్మట్సుకు సరిగా బోధపడనేలేదు. అందువల్ల "మిత్రరాజ్య సమితిలో శ్వేతజాతుల వారికంటె శ్వేతేతర జాతులవారికే ఎక్కువ వోట్లు కలవు" అని ఆయన వాపోయినాడు. జనరల్ స్మట్స్ సంభావిస్తున్నట్టు, ఇది కేవలం "ఎవరికి ఎక్కువ వోట్లు కలవు" అనే ప్రశ్న కానేకాదు. జాతి, మత, వర్ణ, కుల, వర్గ విభేదాలు ఎంత కృత్రిమమైనవో అంత నికృష్టమైనవని నేడు ప్రపంచ ప్రజాబాహుళ్యం గుర్తించింది. మానవుని స్వాతంత్ర్యాన్ని సర్వత్రా గుర్తించినప్పుడే, మానవునికి మధ్య సమానత్వ, సౌభ్రాతృత్వాలు పెంపొందినప్పుడే ప్రపంచానికి శాంతి, సౌఖ్య, సుభిక్షాలు లభించడమని కూడా గుర్తించింది. మిత్రరాజ్య సమితి సమావేశంలో జనరల్ స్మట్స్ సైతం గురించవలసి వచ్చిన నవశక్తి వాస్తవానికిదే. ఇక అన్యుల ప్రాబల్యాన్ని తాము సహించబోమని, తమ పరాధీన స్థితికి స్వస్తి చెప్పనున్నా మని ప్రాచ్య ప్రపంచం చాటుతున్నది. ప్రాచ్య ప్రపంచాన్ని బానిసత్వంలో పెట్టినంతవరకు తనకు స్వేచ్ఛా స్వాతంత్ర్యలేమి, శాంతి సౌఖ్యాలేమి దూరంకాక తప్పవని పాశ్చాత్యపు ప్రపంచం సైతం గుర్తిస్తున్నది. అందువల్లనే దక్షిణాఫ్రికా భారతీయుల సమస్య విషయంలో భారతదేశానికి

అనుకూలంగా దాదాపు ప్రతి ప్రాచ్యరాజ్యమే కాకుండా పెక్కు పాశ్చాత్యరాజ్యాలు సైతం మిత్రరాజ్య సమితి సమావేశంలో వోటు చేయడం సంభవించింది.

నిజానికి మొన్న మిత్రరాజ్య సమితి మూడింట రెండువంతుల మెజారిటీతో ఆమోదించిన తీర్మానం రెండు పాశ్చాత్య రాజ్యాలు (ఫ్రాన్సు, మెక్సికోలు) ప్రతిపాదించినట్టిదే. దక్షిణాఫ్రికాలోని భారతీయులపట్ల జనరల్ స్మట్స్ ప్రభుత్వం వర్తన ఇండియా, దక్షిణాఫ్రికాల మధ్య జరిగిన ఒడంబడికలకే కాకుండా, మిత్రరాజ్య సమితి ప్రణాళికలోని ప్రధాన సూత్రాలకు సైతం విరుద్ధంగా నున్నదని ఈ తీర్మానం పేర్కొన్నది. ఈ సమస్యను రాయబారాల ద్వారా పరిష్కరించుకొనడానికి ఉభయ దేశాలు ప్రయత్నించి, మిత్రరాజ్య సమితి ఈసారి సమావేశం కాగలనాటికి తమ ప్రయత్నాలు ఏ విధంగా పరిణమించిందీ ఇండియా, దక్షిణాఫ్రికాలు నివేదించాలని కూడా ఈ తీర్మానం కోరింది. ఇంతకంటే కూడా స్పష్టమైన తీర్మానాన్ని, ఇంతకంటె నిశితమైన తీర్మానాన్ని భారతదేశం అభిలషించి ఉండక పోలేదు. కాని, దక్షిణాఫ్రికా భారతీయుల సమస్య కేవలం ఆంతరంగిక మైనదని వాదించి, దాన్ని అంతర్జాతీయ

న్యాయస్థానం ముందు విచారణకు పెట్టించడంతో సరిపుచ్చడానికి జనరల్ స్మట్స్ చేసిన యత్నాన్ని విఫలం చేసివేసిన మేరకు ఫ్రాన్సు, మెక్సికోల తీర్మానం అభినుతించదగింది.

భారతీయుల సమస్య దక్షిణాఫ్రికా ఆంతరంగిక సమస్య మాత్రమే నని జనరల్ స్మట్స్ చేసిన కువాదాన్ని సిగ్గు బిడియాలు లేకుండా బ్రిటన్, యునైటెడ్ స్టేట్సులు సమర్థించినవి. దక్షిణాఫ్రికా సరిహద్దులలోని భారతీయుల విషయంలో మిత్రరాజ్య సమితి జోక్యం కలిగించుకొన వచ్చునని తా నంగీకరించిన పక్షంలో తన సరిహద్దులలోని నీగ్రోజాతివారి విషయంలో సైతం మిత్రరాజ్య సమితి జోక్యం తప్పదని యునైటెడ్ స్టేట్సు భావించినదనడం ఈ సందర్భంలో సుస్పష్టమే. అంచేత దానిచర్య ఒకవేళ కొంతవరకు క్షంతవ్యమైనా, బ్రిటన్ చర్య ఎంతమాత్రం క్షంతవ్యం కాదు. తన సామ్రాజ్యంలో అంతర్భాగాలుగా నున్న రెండు రాజ్యాల మధ్య వచ్చిన వివాదం సందర్భంలో బ్రిటన్ కనీసం తాటస్థ్యమైనా వహించకుండా, దక్షిణాఫ్రికా పక్షాన - లేదా, అన్యాయం పక్షాన, అహంకారం పక్షాన బాహాటంగా చేరింది!

బ్రిటన్, యునైటెడ్ స్టేట్సు లేమి, వాటి ఉపగ్రహ రాజ్యాలేమి, ఎంతకు యత్నం చేసినా, ఫ్రాన్సు, మెక్సికోల తీర్మానాన్ని పెద్ద మెజారిటీతో ఆమోదించడం ద్వారా భారతదేశంతోపాటు ప్రాచ్య ప్రపంచానికేమి, పీడిత ప్రజాకోటికేమి అఖండ విజయాన్ని చేకూర్చడమేకాకుండా, తన మనుగడను మిత్రరాజ్య సమితి కాపాడుకున్నది. ఈ తీర్మానాన్ని చేసివుండకపోతే, దాని ప్రతిష్ఠ బుగ్గి కలిసి పోయివుండేది. మంచూరియా, అబిసీనియాల విషయంలో తగు చర్యను జరపనేరక, అప్రతిష్ఠపాలైపోయి, తుదకు నామరూపరహితమై పోయిన నానాజాతి సమితికి పట్టిన దుర్గతికే తాను కూడా పాల్పడిపోయేది.

దక్షిణాఫ్రికా భారతీయుల విషయంలోనే కాకుండా, నైరృతి ఆఫ్రికా విషయాలలో కూడా భారతదేశం చేసిన వాదన న్యాయమైనదని అంగీకరించి, మిత్రరాజ్య సమితి సత్కీర్తి స్వీకరించుకున్నది.

ప్రథమ ప్రపంచ మహాసంగ్రామానంతరం జర్మనీనుంచి మాండేటరీ అధికారంచేత నైరృతి ఆఫ్రికా దక్షిణాఫ్రికాకు సంక్రమించింది. నాటినుంచి నేటివరకు ఎంతో నిరంకుశంగా నికృష్టంగా ఈ ప్రాంతాన్ని దక్షిణాఫ్రికా పరిపాలిస్తున్నది. మాండేటరీ అధికారం క్రింద ఏదైనా ఒక ప్రాంతాన్ని పరిపాలిస్తున్న రాజ్యం ఆ ప్రాంత ప్రజల పురోభివృద్ధికి దోహదమివ్వాలనీ, వారిని స్వపరిపాలన బాధ్యతా నిర్వహణకు సమాయత్తపరచాలనీ ఒక స్పష్ట నియమం కలదు. అయినా, గడిచిన పాతిక సంవత్సరాలలో నైరృతి ఆఫ్రికా వాసులకు (వారిది తెల్లచర్మం కానందున దక్షిణాఫ్రికా ఎట్టి పౌరసత్వాల నివ్వలేదు. వారికి తగు విద్యా సౌకర్యాలుగాని, వైద్య సహాయంగాని సమకూర్చలేదు. ఆర్థికంగానేమి, సాంఘికంగానేమి, రాచకీయంగానేమి, అన్యవిషయాలలోనేమి వారి వికాసానికి జరిపిన కృషి దాదాపు మృగ్యం. అయినప్పటికి నైరృతి ఆఫ్రికాపై మాండేటరీ అధికారానికి బదులు ట్రస్టీషిప్ అధికారం (ధర్మకర్తృత్వాధికారం) స్వీకరించడానికి అనువుగా ఒక ప్రణాళికను ఈసారి మిత్రరాజ్య సమితి సమావేశం జరిగేనాటికి దక్షిణాఫ్రికా ప్రభుత్వం సూచించాలనికూడా నిర్ణయించింది. నిజానికి నైరృతి ఆఫ్రికాను దక్షిణాఫ్రికా పరిపాలన నుంచి పూర్తిగా తప్పించివేయడం సముచితమై ఉండేది. ఇది జరగకపోయినా, ప్రస్తుత నిర్ణయం సైతం హర్షించబడింది.

నైరృతి ఆఫ్రికా విషయంలో చేసిన నిర్ణయానికి మిత్రరాజ్య సమితిని అభినందించినా, మాండేటరీ అధికారం కిందనున్న పీడిత ప్రజలకు అది పూర్తిన్యాయం చేసినదనలేము. బ్రిటన్, ఫ్రాన్సు, బెల్జియం, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లు తమ పరిపాలనకిందనున్న మాండేటరీ రాజ్యాల విషయంలో ఎనిమిది ధర్మకర్తృత్వాధికార ప్రణాళికలను ప్రతిపాదించినవి. ఈ ప్రణాళికలు పెక్కు విధాల అసంతృప్తికరమైనట్టివి. ధర్మకర్తృత్వాధికారం కింద మనవలసిన ప్రాంతాలకు ఎప్పటికి స్వపరిపాలనాధికారం లభించగలదో ఈ ప్రణాళికలు స్పష్టపరచడం లేదు. సైనిక లేక, వైమానికాశ్రమాలను నిర్మించుకొనడం ద్వారా ఈ ప్రాంతాలను వీటిని పరిశీలించే రాజ్యాలు స్వప్రయోజనాలకు వినియోగించుకొనడానికి ఈ ప్రణాళికలు అవకాశమిస్తున్నవి. ఇట్టి లోపా లన్నింటిని సవరింప

జేయడానికి ఇండియా, రష్యాలు ప్రయత్నించగా, వాటి కృషి విఫలమైపోయింది. భారతదేశం పక్షాన, సోవియెట్ రష్యా పక్షాన ప్రతిపాదించబడిన సవరణలలో ధర్మకర్తృత్వాధికారాన్ని పది సంవత్సరాలకు పరిమితం చేసి, ఆ గడువు ముగిసినంతనే స్వపరిపాలనాధికారాన్ని ప్రసాదించవలెననేది అతి ముఖ్యమైనది. న్యాయమైన ఈ సవరణను సైతం త్రోసిపుచ్చడంవల్ల పీడిత ప్రజాకోటికి మిత్రరాజ్య సమితి ఘోరాన్యాయాన్నే చేసింది.

స్పెయిన్ విషయమై మిత్రరాజ్య సమితి చేసిన నిర్ణయం సైతం అసంతృప్తికరమైనదే. ఫ్రాంకో ప్రభుత్వానికి, హిట్లర్, ముసోలిని ప్రభుత్వాలకు భేదం తరతమాలలోనే, వాటివలె ఇది కూడా ఫాసిస్ట్ ప్రభుత్వం, వాటివలె ఇది కూడా తుపాకిగుండుపై, ఉరికంబంపై, కిరాతకత్వంపై ఆధారపడేదే. వాటివలె ఇది కూడా పౌరస్వత్వాలను విలుప్తం చేసి, ప్రజాస్వామ్యానికి స్వస్తిచెప్పి, ప్రజాబాహుళ్యాన్ని ఘోర దురంతాలకు పాల్పడజేసేదే: నిజానికి వాటి సహాయం వల్లనే (నాజీ జర్మనీ, ఫాసిస్ట్ ఇటలీల సహాయం వల్లనే) ఇది ఏర్పడింది. అయినా, ఏ రాజ్యపు ఆంతరంగిక వ్యవహారాలలో మిత్రరాజ్య సమితి జోక్యం కలిగించుకొనరాదనే సాకుపై, స్పెయిన్లోని ఫ్రాంకో ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి తగు చర్యను గైకొనకపోవడం ఎంతైనా శోచనీయం. జర్మనీ, ఇటలీలలో జోక్యం కలిగించుకోరాదని, హిట్లర్, ముసోలినుల దుశ్చర్యలపట్ల ఔదాసీన్యాన్ని వహించబట్టే గదా, వారు ముందు స్వదేశంలో ప్రజాస్వామికత్వాన్ని మట్టుబెట్టి, ఆ తర్వాత అన్యదేశాలలో కూడా అట్టి దౌష్ట్యానికే పూనుకున్నారు? ప్రపంచంలో ఎక్కడ ప్రజాస్వామ్యానికి భంగం కలిగినా, అది ప్రపంచ మొత్తంలో ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని గుర్తించగల విజ్ఞతను ప్రదర్శించగలిగివుంటే, ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామం చెలరేగి ఉండేదా? దానిలో లక్షలు, కోట్లు నిండుప్రాణాలు పోయివుండేవా? ఫ్రాంకో ప్రభుత్వంపై కనీసం ఆర్థికపు ఆంక్షలనైనా ప్రకటించకుండా, కేవలం రాయబారులను వెనకకు రప్పించాలని మిత్రరాజ్యసమితి చేసిన తీర్మానం ఎంత నిష్ప్రయోజనకరమైనదో, అంత నింద్యార్హమైనది కూడా.

* * * * * *

ఆయుధ విసర్జన విషయమై దీర్ఘ-తీవ్ర-వాదప్రతివాదాల పిమ్మట మిత్రరాజ్య సమితి చేసిన తీర్మానం పూర్తిగా సముచితమైనది కాదు గాని, మొత్తం మీద సంతృప్తికరమైనది. ఈ తీర్మానంలో ఈ కింది నాలుగు ప్రధాన సూత్రాలు గర్భితమై ఉన్నాయి.

1 భద్రత హెచ్చిన కొలది ఆయుధ విసర్జన హెచ్చాలి. (ఈ సూత్రం ప్రకారం పూర్తి ఆయుధ విసర్జన పూర్తిగా భద్రత ఏర్పడినప్పుడే, లేదా, దురాక్రమణకు పాల్పడకుండా ప్రతి రాజ్యాన్ని మిత్రరాజ్య సమితి కాపాడగలదని పూర్తి నమ్మకం కుదిరినప్పుడే.

2 ఆయుధ విసర్జన కేవలం యాటంబాంబులకే కాకుండా రాకెట్లు, విషవాయువులు, విషక్రిములు మొదలైన అన్ని మారణాస్త్రాలకు వర్తించాలి. (ఈ సందర్భంలో ప్రెసిడెంట్ రూజ్వెల్ట్ ఒకప్పుడు హిట్లరుకు చేసిన ఆయుధ విసర్జన ప్రతిపాదన గమనార్హమైనట్టిది. సైనికుడు తన వీపుపై మోయగలిగిన ఆయుధాలు వీడి తక్కిన అన్నింటిని బహిష్కరించ దగునని ప్రెసిడెంట్ రూజ్వెల్ట్ ప్రతిపాదించాడు. ఈ ప్రతిపాదన సర్వామోదకరమైననాడే వాస్తవంగా ఆయుధ విసర్జన జరిగినట్టు).

3 మిత్రరాజ్య సమితి నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం ఆయుధ విసర్జన కొనసాగుతున్నదో, లేదో కనిపెట్టి చూడ్డానికి ఒక అంతర్జాతీయ పరిపాలక సంఘాన్ని నియమించాలి.

4 ఆయుధ విసర్జన పరిపాలక సంఘ కార్యకలాపాలను తన వీటో అధికార ప్రయోగం ద్వారా భగ్నపరచడానికి ఏ అగ్రరాజ్యానికి అవకాశ మివ్వరాదు. ఈ సంఘం మెజారిటీ ఓటు ప్రకారం పనిచెయ్యాలిగాని, అన్ని రాజ్యాలు ఏకగ్రీవంగా ఆమోదించిన నిర్ణయాలనే అమలుపరచుకొనడం కూడా కూడదు.

ఈ నాలుగు సూత్రాలను అమలుపరచడానికి తగు కార్యవిధాన నిర్ణయ బాధ్యతను మిత్రరాజ్య సమితి భద్రతా సంఘంపై (సెక్యూరిటీ కౌన్సిలుపై) పెట్టింది.

ఆయుధ విసర్జన ఏ విధంగా సాగుతున్నదో కనిపెట్టి చూడ్డానికి - కనిపెట్టిచూడ్డానికి మాత్రమే కాదు; దాన్ని కొనసాగింప జేయడానికి కూడా ఒక పరిపాలక సంఘాన్ని నియమించ వలెనన్న ప్రతిపాదనకు ఆదిలో రష్యా సమ్మతించలేదు. ఇందుకు ఇప్పుడది సమ్మతించినా, వీటో అధికారాన్ని విడిచిపుచ్చడానికి అది సుముఖంగాలేదు. మిత్రరాజ్య సమితిలో నేమి, భద్రతా సంఘంలో నేమి ఆంగ్లో - అమెరికన్ రాజ్యకూటానికి సంఖ్యా బలమున్నది. అంచేత "మెజారిటీ ఓటు" సూత్రానికి సమ్మతిస్తే, తనకు ప్రమాదం తప్పదని రష్యా భయపడుతున్నది. ఈ కారణాన "వీటో" ఈనాటికీ వివాదగ్రస్త సమస్యగానే ఉన్నది. మిత్రరాజ్య సమితి నియమించిన పరమాణుశక్తి ఉపసంఘ సమావేశంలో డిశెంబరు 30వ తేదీని వీటో అధికారాన్ని తొలగించడం మిత్రరాజ్యసమితి ప్రణాళికకు విరుద్ధమని సోవియెట్ ప్రతినిధి వాదించాడు. అయినా, ఆ ఉపసంఘం పరమాణుశక్తిని కంట్రోల్ చేయడం విషయంలో ఈ కింది పంచసూత్ర ప్రణాళికను తాత్కాలికంగా ఆమోదించింది.

1 పరమాణుశక్తి యుద్ధేతర కార్యకలాపాల నిమిత్తమే వినియోగింపబడే విధంగా కట్టుదిట్టాలను చేయడానికి ఒక అంతర్జాతీయ సంఘాన్ని నియమించాలి.

2 ఈ అంతర్జాతీయ సంఘానికి అగ్రరాజ్యాల వీటో అధికారం వర్తించరాదు.

3 వీటో అధికారం ద్వారాగాని, అన్యవిధాలగాని ఏ రాజ్యం కూడా అంతర్జాతీయ సంఘం కార్యకలాపాలకు (కంట్రోల్, పరిశీలన మొదలైనవాటికి) ఎట్టి అంతరాయం కలిగించరాదు.

4 ఇప్పుడు తయారై ఉన్న యాటంబాంబులను ఏమిచెయ్యాలో నిర్ణయించడానికి ఒక అంతర్జాతీయపు ఒడంబడిక జరగాలి. ఆ ఒడంబడిక పరిపాలింపబడుతున్నదో, లేదో కనిపెట్టడానికి తగు మార్గాలను నిర్ణయించాలి.

5 జరిగిన ఒడంబడికలను భగ్నపరచే దేశానికి వేయదగు శిక్షను నిర్ణయించాలి.

ఈ ప్రణాళిక భద్రతా సంఘంలో చర్చకురాగలదు. అక్కడ రష్యా తన వీటో అధికార ప్రయోగంతో దాన్ని త్రోసిపుచ్చవచ్చు. దానితో ఈ సమస్య తిరిగి మొదటికి వస్తుంది. అంచేత ఈనాటికీ ఆయుధ విసర్జన సమస్య పరిష్కారమైనదనలేము.

* * * * * *

ఆయుధ విసర్జన సమస్య పరిష్కారం కానప్పుడు ప్రపంచ శాంతి సంస్థాపన సమస్య పరిష్కారం కానేకాదని వేరుగా చెప్పనవసరం లేదు.

1 శాంతి సంస్థాపన నేటికీ జరగలేదు సరిగదా, పెక్కుచోట్ల చైనా, ఇండోచైనా, గ్రీసు, పాలస్తీనాలలో - భీషణ సమరాలు సాగుతున్నవి కూడా. అందువల్ల నేటిది కల్లోల ప్రపంచమే.

(ఆంధ్రజ్యోతి మాస పత్రిక జనవరి 1947)

6

ఎటుచూచినా అశాంతి; ఎక్కడచూచినా కల్లోలం - ఇదే నేటి ప్రాచ్య ప్రపంచ పరిస్థితి.

ఈ అశాంతి, ఈ కల్లోలం నిరసించదగిందికాదు; నిరుత్సాహం చెందవలసిందికాదు. పైపెచ్చు, ఇది ఆమోదించదగినట్టిది; ఆనందించ దగినట్టిది.

ఇదివరలో ప్రాచ్య ప్రపంచంలో శాంతివుంటే, అది శ్మశానవాటికలోని శాంతి, ఇదివరలో ప్రాచ్య ప్రపంచంలో భద్రత వుంటే, అది యజమాని రక్షణకింద బానిస అనుభవించే భద్రత. ఈ శ్మశానవాటి అశాంతి తొలగిపోవడం నవజీవన ప్రారంభానికి నాందికాదా? యజమాని బానిసకు కూర్చే ఈ భద్రత తొలగిపోవడం స్వాతంత్ర భానూదయానికి మంగళగీతం కాదా?

ఇండియాలోని అంతఃకలహాలను, చైనాలోని అంతర్యుద్ధాన్ని, బర్మాలోని వర్గకలహాలను, ఇండోచైనాలోని భీకరయుద్ధాన్ని, జపానుపై మిత్రరాజ్యాధిపత్యాన్ని, ఇండోనీసియా పైనుంచి పూర్తిగా తొలగని డచ్ ప్రాబల్యాన్ని వాటినన్నింటిని చూచినప్పుడు “ఏదీ నవజీవనం? ఎక్కడ స్వాతంత్ర్య భానూదయం?” అని సంకోచం పొడమడం సహజమే.

కాని, ఒక్క విషయాన్ని మాత్రం మరిచిపోరాదు.

విచ్చు కొనడానికి పూర్వమే చీకటితెరలు దట్టంగా ఉంటాయి.

తొలగిపోడానికి పూర్వమే కష్టాలు మరింతగా చుట్టుముట్టుకుంటాయి.

ఇక్కడ మరొక విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలి.

దుర్భర ప్రసవవేదన లేకుండా ఒక చిన్న శిశువైనా జనించదు. అయినప్పుడు, ఎన్నో కష్టాలకు గురికాకుండా, ఎంతో కల్లోలానికి పాల్పడకుండా ఒక మహాఖండం ఏవిధంగా పునర్జన్మ నెత్తగలదు?

క్రీస్తుశకం ఇరవయ్యో శతాబ్దంలో అయిదవ దశాబ్దాన్ని (1940-1950) గురించి వ్రాసే సందర్భంలో భావిప్రపంచ చరిత్రకారుడు తన ఆ ప్రకరణకు పెట్టగల శీర్షికను మనం ఊహించవచ్చు. "ప్రాచ్యఖండ పునరుజ్జీవనం" అని తప్ప అది మరొకటి కావడానికి వీలులేదు.

అనేక శతాబ్దాలపాటు అవిచ్ఛన్నంగా, అప్రతిహతంగా ప్రాచ్యఖండం పురోగమించింది. ఒక సంస్కృతిని, ఒక విశిష్ట సభ్యతను రూపొందించుకున్నది; భాగ్యాలతో, భోగాలతో, శాంతితో, సౌఖ్యంతో తులదూగింది; ప్రాచ్యఖండానికి చెందనివాడు “అప్రాచ్యుడు” (అనాగరికుడు) అని విర్రవీగగల మహోచ్ఛస్థితిని అందుకున్నది.

ప్రాచ్యఖండం ఆ మహోచ్ఛస్థితిలో ఉండగానే, దాని శక్తి మొక్కవోనట్టుగాని, దాని దీప్తి కళలు తగ్గనట్టుగాని పైకి కనబడనప్పుడే, నిత్యనూతన - నిత్యపురోగమన - జీవిత రహస్యాన్ని అది విస్మరించింది. తక్షణమే కానరాకపోయినా, అప్పుడే నిజానికి ప్రాచ్య ప్రపంచ పతనం ప్రారంభమైంది.

కొత్త భావాలను ఆపాదించడం, కొత్త విధానాలను అనుసరించడం, కొత్త ఉద్యమాలను ఆహ్వానించడం, కాలానుగుణంగా కొత్త మార్గాలలో నడవడం - ఒక్కమాటలో, నిత్యనూతన పరిణామాన్ని చెందడం - ఇదే ఒక జాతి నిత్య శక్తికైనా, నిత్య దీప్తికైనా ప్రధానావసరం; కాదు; ప్రథమావసరం.

ఈ విషయాన్ని ప్రాచ్యజాతి విస్మరించింది. చిరపరిశోధనల ఫలితంగా తాను ఏవో కొన్ని వర్ణాశ్రమ ధర్మాలను, ఏవో కొన్ని ఆచార వ్యవహారాలను, ఏవో కొన్ని సాంప్రదాయాలను ఏర్పరచుకొన గలిగినందున, అవి తన మహోచ్ఛస్థితికి తన చరిత్రలోని ఒక ఘట్టంలో తనకు అపారంగా ఉపకరించినందున, ఇక అవే శాశ్వతంగా తనకు అదేవిధంగా ఉపకరించగలవని భ్రమపడింది. దీనితో చూపు ముందుకుపోవడానికి మారుగా వెనకకు మళ్ళింది. అడుగు ముందుకు పడ్డానికి మారుగా ఆగిపోయింది. కొత్తభావాలు స్ఫురించడం ఆగిపోయి, కేవలం పాతవాటినే మననం చేయడం ప్రారంభమైంది. కొత్త సారస్వతం వెలువడ్డానికి బదులుగా పాతవాటినే మననం చేయడం ప్రారంభమైంది. కొత్త సారస్వతం వెలువడ్డానికి బదులుగా పాతవాటిపై భాష్యాలు ప్రబలినవి. కొత్త సాంఘిక, ఆర్థిక, పారిశ్రామిక వ్యవస్థలు రూపొందడానికి మారుగా పాతవి బలపడిపోయినవి; స్థిరపడిపోయినవి. సంఘం వ్యక్తి వికాసానికీ, అభ్యున్నతికీ తోడ్పడ్డానికి మారుగా అతడిని యంత్రంలో కేవలం ఒక సీలగా చేసివేసుకున్నది. దీనితో ప్రాచ్యఖండంలో జీవితవాహిని ప్రవాహం నిలిచిపోయింది. ప్రవాహం నిలిచిపోయినప్పుడు ఎంతటి స్వచ్ఛ జలమైనా మలినం కాక తప్పదు; దుర్గంధపూరితంకాక తప్పదు. ఇదే ప్రాచ్యఖండంలో కూడా జరిగింది. అంచేత దాని పతనం తన ఓడలలో, తన బైబుల్తో, తన తుపాకితో శ్వేతముఖుడు వచ్చినప్పుడు కాదు; అంతకు కొన్ని శతాబ్దాలకు పూర్వమే.

అయితే, ప్రాచ్యఖండ జీవితవాహిని నిలిచిపోయిందేగాని, ఇంకి పోలేదు. అందువల్లనే అది నేడు తిరిగి మహోద్ధతితో పరుగులెత్తబోతున్నది. అందువల్లనే నేడు ప్రాచ్య ప్రపంచంలో వినవస్తున్నవి హాహారవాలుకాదు; హుంకరింపులు! ఆర్తనాదాలు కాదు, సింహగర్జనలు! వేడికోళ్ళు కావు! విప్లవ ధ్వానాలు!

ప్రాచ్యజాతి నిద్రలేచింది; తిరిగి నడుస్తున్నది; దాని పదాఘాతానికి ప్రపంచం దద్దరిల్లుతున్నందునే ఈ అశాంతి; ఈ కల్లోలం.

వేర్వేరు సరిహద్దులైనా, విభిన్న మతాలైనా, వివిధ భాషలైనా, సంస్కృతులలో సైతం స్వల్పమైనస్థానికమైన విభేదాలున్నప్పటికీ, ప్రాచ్యజాతి ఒక్కటే; దాని సభ్యత ఒక్కటి. ఈ సమైక్యత కారణంగానే అన్ని ప్రాచ్య దేశాలకు ఉన్నతి ఒకే సమయంలో, పతనం ఒకే సమయంలో, పారతంత్ర్యం ఒకే సమయంలో, జాగృతి ఒకే సమయంలో, పునర్జన్మ ఒకే సమయంలో,

ఈ సమైక్యత ఈ సన్నిహితత్వమే వివిధ ప్రాచ్యదేశాల స్వాతంత్ర్య సమరాలను ఏక స్వాతంత్ర్య సమరపు భిన్నముఖాలుగా చేస్తున్నది.

ఒకప్పుడు సుఖంలో మనమొక్కటి; మధ్యలో కష్టంలో మనమొక్కటి; తిరిగి శుభంలో మనమందరం ఒక్కటే కాక తప్పదు - ఈ భావం నేడు ప్రాచ్యజాతి మొత్తంపై కానవస్తున్నది. ఈ భావం కారణంగానే నేడు ఇండియా, బర్మా, చైనా, ఇండోచైనా, ఇండొనీషియా మొదలైనవి ఒకదాని సరసను ఒకటి నిలుస్తున్నది.

ప్రాచ్యదేశాలు ప్రదర్శిస్తున్న ఈ సమైక్యత పాశ్చాత్య సామ్రాజ్య రాజ్యాలలో సయితం కానరాకపోవడం లేదు. తమ ప్రాబల్య రక్షణకై అవి చేసుకొంటున్న పరస్పర సహాయానికి అవి నెరపుకొంటున్న పరస్పర సహకారానికి -ఇండోచైనాలో ఫ్రాన్సుకు, ఇండొనీషియాలో హాలెండు బ్రిటన్ లు చేస్తున్న సహాయమే నిదర్శనం.

ఇంపీరియలిస్ట్ బ్రిటన్ ఇంపీరియలిస్ట్ ఫ్రాన్సుకుచేసిన సహాయంవల్లనే ఫ్రెంచి ఇంపీరియలిస్టులు నేడు వియత్నాం (ఇండో చైనా) రిపబ్లిక్ కుత్తుకను నులిమివేయడానికై క్రూర యుద్ధాన్ని కొనసాగించగలుగుతున్నారు.

ద్వితీయప్రపంచ మహాసంగ్రామంలో జపాను పరాజయంచెందిన మూడురోజులలోపల ఇండోచైనా మొత్తానికి ప్రజావిప్లవం వ్యాపించింది; వియత్నాం రిపబ్లిక్ ఆవిర్భవించింది; జాతీయ స్వాతంత్ర్య ప్రకటన జరిగింది. వెంటనే బ్రిటిష్ ఇంపీరియలిస్ట్ సేనలు ఇండోచైనాలో ప్రవేశించాయి. ఇందుకు బ్రిటిషు వారు చెప్పిన కారణం, తాము ఇండోచైనాలోని జపాను సేనలను నిరాయుధం చేయగోరుతున్నామని, కాని, ఇది కేవలం ఒక సాకుమాత్రమేనని తెలియడానికి ఎన్నోరోజులు పట్టలేదు. జపానువారిని నిరాయుధంచేయడానికి బదులుగా వియత్నాం రిపబ్లిక్పై బ్రిటిష్ సేనలు యుద్ధాన్ని ప్రారంభించాయి. ఈలోపున ఫ్రెంచి -.

ఇంపీరియలిస్ట్ బలాలుకూడా ఇండోచైనాకు చేరగలిగినవి. ఫ్రెంచిబలాలు తగినంతగా వచ్చి చేరినతర్వాతనేగాని, బ్రిటిష్ బలాలు జపానువారిని నిరాయుధులను చేయడం పూర్తికాలేదు! తాము వచ్చి చేరగలిగేవరకు వియత్నాం యుద్ధం జరపడం ద్వారా బ్రిటిష్ ఇంపీరియలిస్ట్ సేనలు తమకుచేసిన సహాయాన్ని పురస్కరించుకుని మరికొన్ని నెలలపాటు ఫ్రెంచివారు తీవ్రసంఘర్షణను కొనసాగించారుగాని, అది నిష్ఫలంకాగా, వియత్నాం రిపబ్లికన్ను గుర్తిస్తున్నామని వారు ప్రకటించక తప్పలేదు.

అయితే, ఫ్రెంచి సామ్రాజ్య సౌధానికి మూలస్తంభంవంటిది ఇండోచైనా. ఆ మూలస్తంభమే తొలగితే, మొత్తం సౌధానికి ప్రమాదం వాటిల్లుతుందిగదా; ప్రమాదాన్ని ఫ్రెంచి ఈ ఇంపీరియలిస్ట్ లేమి, మిలటరిస్ట్ లేమి సహించలేరుగదా! అంచేత ఒక వైపున వియత్నాం రిపబ్లికన్ను గుర్తిస్తున్నామని ప్రకటిస్తూనే, రెండవవైపున ఆ రిపబ్లిక్ పతనాన్ని సాధించడానికి వారు పన్నాగాలు ప్రారంభించారు. ఏవో రాయబారాలు అవి చెప్పి, తాము ఇండోచైనా నుంచి వైదొలగిపోవడంలో కొంత విలంబనను సాధించడం, ఈలోపున ఇండోచైనా వారిమధ్య విభేదాలను రగల్చడం, ఆ దేశానికి మరింతగా తమ సాయుధ బలాలను చేర్చడం - ఇవే ఫ్రెంచివారుపన్నిన పన్నాగాలు.

ఇండోచైనా జనాభా రెండుకోట్ల ముప్పైలక్షలు. ఈ జనాభాలో నూటికి 23 వంతులమంది అన్నామన్నారు. వీరిలోనే దేశభక్తి అధికం; వీరిదే జాతీయోద్యమంలో ముందడుగు; వీరే వియత్నాం రిపబ్లిక్ సంస్థాపకులలో అగ్రగణ్యులు.

అన్నామీన్వారి అన్నాం కాక, ఇండోచైనాలో కంబోడియా, లోస్, కొచ్చిన్ చైనా, టాంగ్కింగ్ పరగణాలున్నాయి. ఈ నాల్గింటిలో కొచ్చిన్ చైనా అతి విశాలమైనదే కాకుండా, ఆర్థికదృష్ట్యా అతి ప్రధానమైనది కూడా. అంచేత దీన్ని వియత్నాం రిపబ్లిక్లో చేరనివ్వకుండా, తమ సంరక్షణకింద పేరుకు స్వతంత్ర రాజ్యంగా నిలపవలెనని ఫ్రెంచి ఇంపీరియలిస్టులు ప్రయత్నిస్తున్నారు.

కొచ్చిన్ చైనా ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంటే, నూటికి 90 మంది వియత్నాం రిపబ్లిక్లో చేరడమే తమ అభిమతమని చెప్పగలరనడంలో సందేహంలేదు. ఈ విన్యాసంలోనే కొచ్చిన్ చైనా ప్రజాభిప్రాయాన్ని తెలుసుకొనవలసిందిగా వియత్నాం రిపబ్లికను ప్రభుత్వం పట్టుపట్టింది. ఇందుకు తమకు అభ్యంతరంలేదని ఫ్రెంచివారు అన్నారు గాని, ఇంతవరకు తమమాటను వారు నిలబెట్టుకోలేదు; నిలబెట్టుకోడానికి ప్రయత్నమైనా చేయడంలేదు.

వియత్నాం రాజధానీ నగరం టాంగ్ కింగ్ పరగణా ముఖ్యపట్టణమైన హానోయ్, టాన్కింగ్ పరగణా స్వాతంత్ర్య సమరంలో అన్నాం సరసను నిలుస్తున్నది. కాగా, లోస్, కాంబోడియాల జనాభా నలభై లక్షలుమాత్రం. అవి ఆర్థికంగా అంత ప్రధానమైనవికావుకూడా. అందువల్ల అన్నాం, టాన్కింగ్ నాయకత్వంకింద స్థాపించబడిన రిపబ్లిక్ లోస్, కంబోడియాలు చేరడానికి ఫ్రెంచి ఇంపీరియలిస్టు అభ్యంతరం చెప్పడంలేదు. వారి అభ్యంతరం కొచ్చిన్చైనా వియత్నాం రిపబ్లిక్లో చేరడంవిషయంలోనే, వైశాల్యానికి చిన్నదైనా కొచ్చిన్ చైనా వరిపంటకు ప్రపంచ ప్రసిద్ధిని పొందినట్టిది. అక్కడ ఫ్రెంచి ఇంపీరియలిస్టులు ఎక్కువగా పెట్టుబడులు పెట్టివున్నారు కూడా.

కొచ్చిన్ చైనాను ఏ విధంగానైనా వియత్నాం రిపబ్లిక్ నుంచి విడదీయాలని కొన్ని కొచ్చిన్ చైనీస్ వర్గాలను - సోదర ప్రజలను పీడించే వర్గాలను - చేరదీసి, వారిచే ఒక స్వతంత్ర ప్రభుత్వాన్ని స్థాపింపజేసి, దాన్ని ఫ్రెంచి ఇంపీరియలిస్టు సమర్థిస్తున్నారు.

కొచ్చిన్చైనా విషయమై రాయబారాల సాకుతో సాధించిన విలంబనలో కొత్త ఫ్రెంచి సైన్యాలు ఇండోచైనాకు చేర్చబడ్డాయి. విమానాలు, టాంకులు, విషవాయువులు కూడా చేర్చబడ్డాయి. వాటినన్నింటిని ఉపయోగించి, వీలుపడితే అసలు వియత్నాం రిపబ్లిక్నే స్వరూపం నాశనం చేయడానికి ఫ్రెంచి ఇంపీరియలిస్టులు ప్రయత్నిస్తున్నారు.

తక్కిన దేశం నుంచి కొచ్చిన్చైనాను విడదీసి, రెండు కోట్ల ముప్పయి లక్షల మొత్తం జనాభాలో దాదాపు రెండుకోట్లున్న తమ రాష్ట్రాలను (టాని కింగ్, అన్నాం, కొచ్చిన్చైనాలను) ఏకం కానివ్వకుండా, ఇండోచైనాలో ఫ్రెంచి ఇంపీరియలిస్టు, ఆడుతున్న కపట నాటకం ఇండోనీషియాలో డచ్వాని, ఇండియా, బర్మా, ఈజిప్టు, పాలస్తీనాలలో బ్రిటీష్ వారేమి ఆడుతున్నదానికి ప్రతిరూపం మాత్రమే!

* * * * * *

ఎక్కడైనా, ఎప్పుడైనా ఇంపీరియలిస్టులు తమ సామ్రాజ్య దేశాలపట్ల అనుసరించే నీతి ఒక్కటే. పాలిత ప్రజలు కన్ను తెరవనంతవరకు, స్వశక్తిని గుర్తించ లేనంతవరకు కేవలం తమ ఆయుధబలంపై - సాయుధబలంపై ఆధారపడి పరిపాలన కొనసాగిస్తున్నట్టు నటిస్తారు. పాలిత ప్రజలు జాగృతి నందినంతనే, వారిలో జాతీయత ప్రబలినంతనే, వారి (ఇంపీరియలిస్టుల) సాయుధబలం వారి పశుబలం - దాన్ని ఎంత క్రూరంగా ప్రయోగించినా, నిరర్థకమైనదిగా పరిణమిస్తుంది. అంతట పాలిత ప్రజలలో ఆది నుంచీ తాము కల్పించివున్న విభేదాలను మరింత అధికంచేసి, వాటిని పూర్తిగా వినియోగించుకుని, పాలిత ప్రజల జాతీయ రాజ్యాలను పూర్తిగా గుర్తించ నవసరంలేని ఏదో ఒక రాజీకి రావడానికి ప్రయత్నిస్తారు. ఇందుకు ఒక ఉత్తమ నిదర్శనం - మొన్నను బర్మాతో బ్రిటన్ చేసుకున్న ఒడంబడిక.

ఇండియాలోవలె బర్మాలో హిందూ, మహమ్మదీయ విభేదాలు లేకపోవచ్చు. కాని, ఇక్కడున్నట్టు అక్కడ కూడా కొన్ని విభేద కారణాలు లేకపోలేదు. జాతీయవాదులకు, కమ్యూనిస్టులకు సంఘర్షణలు తప్పడం లేదు. ఇందుకు తోడు జాతీయవాదులలో జాతీయవాదులకు, కమ్యూనిస్టులలో కమ్యూనిస్టులకు విభేదాలు కలవు కూడా. ఈ అన్ని విభేదాలను పురస్కరించుకుని, బర్మా ప్రజల సత్వర స్వాతంత్ర్య సంసిద్ధివాంఛనుగాని, సంపూర్ణ స్వయం నిర్ణయాధికారాన్ని గాని పూర్తిగా గుర్తించ నవసరం లేని ఒడంబడికను తమ రాయబారాల నిమిత్తం లండన్కు ఆహ్వానించిన బర్మా ప్రజా నాయకులతో బ్రిటన్ చేసుకోగలిగింది.

బర్మాజాతిని బర్మా ప్రజలే ప్రజాపరిషత్తు ద్వారా నిర్ణయించుకోవచ్చునని బర్మా నాయకులతో బ్రిటన్ చేసుకొన్న ఒడంబడికలో లేకపోలేదు. కాని, బర్మానుంచి వెంటనేగాని - కనీసం, త్వరలోగాని - బ్రిటన్ వైదొలగబోతున్నదని దీనిలో

స్పష్టంగా కానరాదు. పైపెచ్చు, బర్మా నుంచి ఇంతలో తాము కదలమన్నట్టు - కామన్సులో చర్చిల్ వేసిన ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ - బ్రిటీష్ ప్రధాని మిస్టర్ అట్లీ ధ్వనించాడుకూడా.

ఇంతేకాదు. ఆర్థిక విషయాలలో బర్మా సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని ఈ ఒడంబడిక సూత్రప్రాయంగానే గుర్తిస్తున్నది గాని, నిర్నిబంధంగా కాదు. దేశరక్షణ విదేశాంగ వ్యవహారాల విషయంలో బర్మాలో ఏర్పడగల తాత్కాలిక ప్రభుత్వానికి పరిమితాధికారాల నిస్తున్నదే గాని, పూర్తి అధికారాలను కాదు. కనీసం విదేశాలలో బర్మా రాయబారాలను సరాసరిగా నియమించుకొనడానికైనా వీలులేదట. వారిని అది నియమించుకొనడం బ్రిటన్ సిఫార్సుపైనే నట! కాగా, బర్మా ప్రభుత్వాధికారం కిందికివచ్చేవి బర్మీస్ సైన్యమేనట; బర్మాలోని బ్రిటీష్ సేనలు బ్రిటన్ అధికారం కిందనే ఉండగలవట. ఇంతేకాదు. మరి కొంతకాలం వరకు - బహుశా, మరి కొన్నేళ్ళపాటు వరకు - బర్మా సర్వసేనాని బర్మా గవర్నర్కు గాని, బర్మా ప్రభుత్వానికి గాని లోబడి ఉండక, ఆగ్నేయ ఆసియా సర్వసేనానికి లోబడి వుంటాడట? పోతే, బర్మా సరిహద్దు పరగణాలను బర్మాలో చేర్చడం ఆ పరగణాల ప్రజల అభిమతాలను తెలుసుకున్న మీదటనే నట! ఈ ఒడంబడికలో ఇన్ని మినహాయింపు లుండబట్టే, దానిపై సంతకం పెట్టడానికి బర్మా జాతీయ నాయక ప్రముఖులలో ఎన్నతగినవారైన యూసా, బాసేన్లు సంతకం చెయ్యడానికి ఒప్పుకోలేదు. బర్మా ప్రజలలో పెక్కుమంది కూడా ఈ విధంగానే ఈ ఒడంబడికను నిరసించవచ్చుకూడా.

* * * * * *

బర్మాలోని ఈ నాటకాన్నే ఈజిప్టులో కూడా స్వల్ప భేదాలతో బ్రిటన్ ఆడుతున్నది. అరబ్ రాజ్యాలలో కానవస్తున్న జాగృతి కారణంగానేమి, నవశక్తి కారణంగానేమి, ఈజిప్టు నుంచి తన సేనలను తరలించుకు పోవడానికి అంగీకరించక తప్పకపోయినా, సూడాన్లో ప్రజలకు స్వయం నిర్ణయాధికారాన్ని తాను గుర్తించడం భావ్యమనే, న్యాయమనే ధర్మపన్నాలతో తన సేనలుంచి, మధ్యప్రాచ్యంలో, ముఖ్యంగా సూయజ్ కాలువ సమీపంలో, తన ప్రాబల్యాన్ని కాపాడుకొనడానికి బ్రిటన్ ప్రయత్నిస్తున్నది.

సూడాను సంపూర్ణ స్వపరిపాలనాధికారాన్ని ఇవ్వడానికి ఈజిప్టుకు అభ్యంతరం లేదు. కాని, కోరితే, పూర్తిగా చీలిపోయి, స్వతంత్ర రాజ్యంగా (లేదా, బ్రిటన్ చేతిలో కీలుబొమ్మగా) సూడాన్ నిలవరాదనే ఈజిప్టు పట్టుదల. ఈజిప్టుకు ప్రాణప్రదమైన నైలునది సూడాన్ గుండా ప్రవహిస్తూ వస్తుంది. అంచేత సూడాన్ బ్రిటన్ చేతి కీలుబొమ్మ కావడం ఈజిప్టుకు ఎప్పటికైనా ప్రమాదమే. అందువల్లనే చీలిపోగల అధికారం సూడాన్కు ప్రసాదించరాదని ఈజిప్టు కోరడం. ఈ కోర్కెను బ్రిటన్ మన్నించడం లేదు సరిగదా, వియత్నాంతో సంబంధం లేకుండా స్వతంత్ర రాజ్యంగా ఏర్పడమని కొచ్చిన్ చైనాను ఫ్రాన్సు ప్రోత్సహిస్తున్నట్టు తాను సూడాన్ ను ప్రోత్సహిస్తున్నది. ఇందువల్లే 1936 నాటి ఆంగ్లో ఈజిప్షియన్ సంధి సవరణ

రాయబారాలను ఇక తాను సాగించబోనని, మిత్రరాజ్య సమితికితాను ఫిర్యాదు చేసుకోగలనని మొన్న ఈజిప్టు ప్రకటించింది.

ఈ విధంగా మొత్తం ప్రాచ్య ప్రపంచంలో ఈనాడు ఒక వైపున ఇంపీరియలిస్ట్ శక్తులకు, మరోవైపున జాతీయ శక్తులకు తీవ్రసంఘర్షణ - మహాయుద్ధం కొనసాగుతున్నది. దీనిలో ప్రాచ్య ప్రపంచానికే విజయం తథ్యం. ప్రాచ్యజాతి పునర్జన్మను; పురోగమనాన్ని ఇక ఏ శక్తీ అడ్డలేదు; ఆపలేదు. (ఆంధ్రజ్యోతి మాస పత్రిక ఫిబ్రవరి 1947)

* * * * * *

కల్లోల ప్రపంచం	7

ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామంలో జర్మనీ, ఇటలీ, జపానులు ఓడిపోయినమాట నిజం. కాని, బ్రిటన్, ఫ్రాన్సులు గెలిచినవనలేము.

ఆ సంగ్రామానికి పూర్వం ప్రపంచంలో ఏడు మహారాజ్యా లుండేవి. బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ, జపాను, సోవియెట్ రష్యా, యునైటెడ్ స్టేట్సులు - ఇవే ఆ ఏడు మహారాజ్యాలు.

ఇక, ఈనాడు మహారాజ్యాలుగా పరిగణించదగినవి కేవలం రెండే. వీటిలో మొదటిది యునైటెడ్ స్టేట్సు. రెండవది - సోవియెట్ రష్యా. దీన్నిబట్టే గత యుద్ధంలో బ్రిటన్, ఫ్రాన్సులు పేరుకు గెలిచినా, నిజానికి ఓడిపోయినవనే అనుకోవచ్చు.

ప్రపంచం మొత్తంపై పెద్ద సైన్యం, పెద్ద నౌకాదళం, పెద్ద వైమానికబలం నేడు యునైటెడ్ స్టేట్సుకు ఉన్నాయి. ప్రపంచం మొత్తంపై అధిక పారిశ్రామికశక్తి దానిదే; హెచ్చు గోల్డు రిజర్వు దానిదే. తన సరిహద్దుల వెలపల నేడు దానికున్నన్ని సైనిక, నౌకా, వైమానిక స్థావరాలు మరి దేనికీ లేవు. పసిఫిక్పై, అట్లాంటిక్పై ఈనాడు దాని ప్రాబల్యం అపూర్వం; అప్రతిహతం. దూరప్రాచ్యమేమి, దక్షిణ అమెరికా ఖండమేమి దాని ఆర్థిక ప్రాబల్యం కిందికి అధికంగా వచ్చినవి. పశ్చిమ యూరప్ ఖండం సైతం దాని ఆర్థిక ప్రాబల్యానికి లోనుకావలసి వస్తుంది. ఆఫ్రికా ఖండాన్ని, మధ్యప్రాచ్యాన్ని తన ఆర్థిక బలసంపత్తితో జయించడానికి అది ప్రయత్నిస్తున్నది కూడా.

నాజీ దండయాత్ర కారణంగా సోవియెట్ రష్యా అపార నష్టాలను పొందివుండవచ్చు. దాని పల్లెలెన్నో రూపుమాసి పోయినవి; పట్టణాలెన్నో అస్థిపంజరాలవలె మిగిలినవి; పారిశ్రామిక కేంద్రాలెన్నో శిథిలమైపోయినవి; దాని పంటలు, దాని పశువులు గట్టి దెబ్బతిన్నవి. ఈ ఆస్తి నష్టాన్ని కూడా మించినట్టిది దాని జననష్టం. ప్రథమ, ద్వితీయ పంచవర్ష ప్రణాళికల ద్వారా అది నిర్మించుకున్న ఆర్థిక సౌధం - పూర్తిగా కాకపోయినా - చాలావరకు కూలిపోయింది; ఆ ఆర్థిక సౌధంలో నివసించవలసిన కొత్తతరం వారిలో పెక్కుమంది దాని రక్షణకై ప్రాణ బలిదానాన్ని చేయవలసి వచ్చింది. అయితే, ఇంతగా సోవియెట్ రష్యా కష్టనష్టాలకు పాల్పడినా, యుద్ధాత్పూర్వం కంటే నేడు దానిశక్తి అధికం; సరిహద్దులు అధికం; పలుకుబడి అధికం; ప్రాబల్యం అధికం. బాల్టిక్ రాజ్యాలు నేడు సోవియెట్లో అంతర్భాగాలు: ఫిన్లాండ్, రుమేనియాల నుంచి కొన్ని భూభాగాలు దానికి సంక్రమించాయి; మొత్తం తూర్పు యూరప్ పై, కొంతవరకు దక్షిణ యూరప్ పై కూడా, దాని పలుకుబడి హెచ్చింది; దాని సరిహద్దులను ఆనివున్న అన్ని యూరోపియన్ రాజ్యాలలో దానిపట్ల భక్తి ప్రేమలను ప్రదర్శించగల ప్రభుత్వా లేర్పడినవి. నెపోలియన్, హిట్లర్ తమ మహోచ్ఛస్థితిలో కూడా సాధించివుండనంతటి ప్రాబల్యం నేడు సోవియెట్ రష్యాకు నిస్సందేహంగా కలదు.

కాగా, బ్రిటన్, ఫ్రాన్సులు యుద్ధాత్పూర్వపు పాటవంలో, ప్రాబల్యంలో శతాంశమైనా నేడు ప్రదర్శించక పోతున్నవి. ఫ్రాన్సు చరిత్రలో పెక్కు నిమ్నోన్నతాలు కానవస్తాయిగాని, బ్రిటన్ మాత్రం గడిచిన నాలుగు శతాబ్దాలలో అవిచ్ఛిన్న శక్తినే ప్రదర్శించింది; సంపత్తినే అనుభవించింది; బలదర్పాలనే ప్రదర్శించింది. ఈ శక్తివల్లనే, ఈ సంపత్తివల్లనే, ఈ బలదర్పాల వల్లనే ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామంలోని ఒక ఘట్టంలో మహోద్ధతితోనున్న చండ ప్రచండంగానున్న - హిట్లరుకు ప్రత్యర్థిగా బ్రిటన్ ఒంటిరిగా నిలబడగలిగింది. అయితే, ఈ పూనికతోనే - ఈ పరీక్షతోనే - బ్రిటన్ శక్తులన్నీ ఉడిగిపోయినట్టున్నాయి. యుద్ధానికి పూర్వం అది శ్రీమంతరాజ్యం; ప్రస్తుతం ఋణగ్రస్తరాజ్యం; యుద్ధానికి పూర్వం యూరప్లో దానిదే అగ్రస్థానం; నేడు ఆస్థానం సోవియెట్ రష్యాది; యుద్ధానికి పూర్వం ప్రపంచ సముద్రాధిపత్యం దానిదే; ఈనాడు ఆ పాటవం యునైటెడ్ స్టేట్సుది; యుద్ధానికి పూర్వం అంతర్జాతీయ రంగంలో దాని కనుసైగల కోసం ఎదురుచూచేవారే ఇప్పుడు దాని మొత్తుకోళ్ళను సైతం పెడచెవిని పెడుతున్నారు.

ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామంలో బ్రిటన్ కంటే పదిరెట్లు ఫ్రాన్సు దెబ్బతినిందని చెబితేచాలు - నేడు అదియెంత నీరసస్థితిలో కలదో తెలిసిపోతుంది.

పేరుకు గెలిచినా, నిజానికి యుద్ధంలో ఓడిపోయిన బ్రిటన్, ఫ్రాన్సులు తమ కొత్త స్థితికి - తమ నూతన ప్రతిపత్తికి అనుగుణంగా తమను సరిదిద్దుకొనడానికి విశేషంగా ప్రయత్నిస్తున్నాయి. తమ పూర్వ ప్రాబల్యంగాని, ప్రతిభగాని, వైభవంగాని ఇక తాము సాధించలేమని వాటికి తెలుసు. కాని, ఒక్కసారిగా సామాన్య రాజ్యాలుగా - శక్తిహీన రాజ్యాలుగా

దిగజారిపోవడం నేటికి మహా కంటకంగా ఉన్నది. అందువల్ల అసలే కిందిమెట్టుమీద కాక, రెండు, మూడు పైమెట్ల మీదనైనా నిలబడ్డానికి అవి పెనగులాడుతున్నాయి. పెనగులాటనే ఈనాడు మనం ఇండియాలో, బర్మాలో, ఇండోచైనాలో, ఈజిప్టులో, పాలస్తీనాలో చూస్తున్నాము.

ఇదివరలో వలె ఇక ఇండియాను తను పరిపాలించలేనని బ్రిటన్కు స్పష్టపడిపోయింది. ఇరవైయేళ్ళ నాడు ఒక బ్రిటీష్ టోరీ “మనం ఇండియాను కత్తితో జయించాము. కత్తితోనే పరిపాలించగలము" అని అన్నాడు. ఈ మాట శుద్ధాబద్ధం.

ఇండియాను బ్రిటీషువారు కత్తితో జయించలేదు. వర్తకం' కోసం వారిక్కడికి వచ్చారు. వర్తక సౌకర్యాలకోసం ఇక్కడి రాజులను, మహారాజులను, నవాబులను, పాదుషాలను ఆశ్రయించారు. "ఏలినవారు చిత్తగించాలి” అన్నారు; “దేవరవారు కటాక్షించాలి” అన్నారు; “ప్రభువులవారి సేవకులము” అన్నారు. “పాదుషావారికి గులాములము" అన్నారు. ఇంత వినయంతో వచ్చిన వారికి ఈ దేశ పరిపాలకుల మౌఢ్యమేమి, ఈ దేశప్రజల ఔదాసీన్యమేమి ఈ దేశాన్ని జయించడానికి ఒక మహదవకాశంగా కనబడింది.

మొగల్ సామ్రాజ్యం నామమాత్రావశిష్టంగా నిలిచిన రోజులవి. పేరుకు మొగల్ పాదుషా సార్వభౌమత్వాన్ని గుర్తిస్తున్నవారు కొందరు; ఆ లాంఛనాన్ని సైతం పాటించనివారు కొందరు. ప్రాంతాని కొకరు చొప్పున పరిపాలన సాగిస్తున్న రోజులవి. ఈ పరిపాలకులలో ఒకరిని చూస్తే ఒకరికి ఈర్ష్య; ఒకరిపై ఒకరికి పగ. వారు ఒండొరులతో యుద్ధాన్ని చేయని సమయంలో భోగ లాలసత్వంతో పొద్దుపుచ్చుతుండేవారు. వీరు తమను పెడుతున్న అష్టకష్టాల కారణంగా నాటి ప్రజాసామాన్యంలో ప్రభువు ఎవడైనా మనకు బాధలు తప్పనప్పుడు ప్రభువు ఎవడైతే మనకేమి అనే ఔదాసీన్యం పెచ్చుపెరిగి ఉన్నది కూడా.

అయితే, నాడు ఇట్టి పరిస్థితు లేర్పడడంలో వింతలేదు; విశేషం లేదు. ఒక మహాసామ్రాజ్యం శక్తివిహీనమైనప్పుడు, కేంద్రప్రభుత్వం బలహీనమై పోయినప్పుడు ఇట్టి పరిస్థితులు ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా ఏర్పడతాయి. ప్రపంచ చరిత్రను పరికిస్తే, ఏ సామ్రాజ్యం కూడా మూడు, నాలుగువందల సంవత్సరాలకు మించి అవిచ్ఛిన్నంగా నిలిచినట్టు కానరాదు; అవిచ్ఛిన్నంగా నిలిచినా, శక్తివంతంగా నిలిచినట్టు కానరాదు. మూడు, నాలుగువందల సంవత్సరాలే ఏ సామ్రాజ్యానికైనా ఆయుః పరిమాణమని భావిస్తే, మొగల్ సామ్రాజ్యం దాదాపు పూర్ణాయుర్దాయాన్ని అనుభవించిందనే చెప్పవచ్చు. అలంగీర్ పాదుషా అనంతరం అది వృద్ధాప్య చిహ్నాలను ప్రదర్శించ నారంభించింది. అట్టి సమయంలో రాజ్యాధికార వికేంద్రీకరణ జరగడమేమి, ప్రాంతానికొక పరిపాలకుడు తలయెత్తడమేమి, అశాంతి ప్రజ్వరిల్లడమేమి, అంతః కలహాలు పెచ్చు పెరగడమేమి, దేశం అల్లకల్లోలమై పోవడమేమి సహజమే. కాని, విదేశాల జోక్యం లేకపోతే, ఒక శతాబ్దం లోపల ఈ అశాంతి నుంచీ, ఈ అంతఃకలహాల నుంచీ ఒక నూతన సామ్రాజ్యం, ఒక కొత్త కేంద్రప్రభుత్వం అవతరించి తీరుతుంది. మొగల్ సామ్రాజ్య విచ్ఛిత్తి తర్వాత దాని స్థానంలో అట్టి సామ్రాజ్యం మరొకటి, అట్టి కేంద్ర ప్రభుత్వం మరొకటి,

మన దేశంలో కూడా రూపొంది ఉండేదే! వాస్తవానికి అట్టిదాన్ని మహారాష్ట్రులు సృష్టించ నారంభించారు కూడా. కాని, ఇంతలోనే బ్రిటీషువారు అతివినయంతో మనదేశంలో కాలుపెట్టారు. పరిపాలకుల మౌఢ్యాన్ని, ప్రజాసామాన్యం ఔదాసీన్యాన్ని వినియోగించుకుని, అతిసులభంగా తన సామ్రాజ్యాన్ని స్థాపించుకున్నారు. సరిగా సమయానికి బ్రిటీషువారు

వచ్చినందువల్ల త్రాసుతో వచ్చినవారికి రాచదండం లభించిందిగాని, ఒక శతాబ్దం ముందు వచ్చినా, ఒక శతాబ్దం వెనక వచ్చినా, వర్తకులుగా వచ్చినవారు వర్తకులుగా పోయేవారే! భారత చరిత్రలో యుగసంధిని పోలిన సమయంలో ఆగమనమే కాకుండా మరికొన్ని పరిస్థితులు కూడా బ్రిటీష్ వారికి అనుకూలించినవి. హానిబాల్, అలెగ్జాండర్, జూలియస్ సీజర్, జెంఘిస్ఇన్, నెపోలియన్ మొదలైన సేనానులు విదేశాలలోనేమి, బాబర్, శివాజీ మొదలైనవారు మన దేశంలోనేమి తమ బలాలకు రెట్టింపు, మూడురెట్లు శత్రుబలాలపై విజయాలను సాధించారు. వారి ఈ విజయాలకు కారణం వారు అవలంబించిన పద్ధతులే. కొందరు తమ శత్రువులకు లేని ఆయుధాలను వినియోగించారు. కొందరు తమ శత్రువులకు లేని వాహనాలను వినియోగించారు; కొందరు తమ శత్రువులకున్న ఆయుధాలనే, వాహనాలనే కొత్తపద్ధతులపై ఉపయోగించారు; కొందరు కొత్త సైనిక శిక్షణ పై, కొత్త సైనిక విధానాలపై ఆధారపడ్డారు. సైనికబలంలో లోపాన్ని వారు ఈ పద్ధతులలో ఏదో ఒకదాని ద్వారా, లేదా, వాటిలో కొన్నింటి ద్వారా తీర్చుకున్నారు. కొద్దిమంది బ్రిటీషువారు వారైనా సేనానులుగా పిలిపించుకొనడానికి అర్హతలేనివారు విశాల భారతదేశాన్ని జయించడానికి వారు అవలంబించిన యూరోపియన్ సైనిక శిక్షణ పద్ధతులే, యూరోపియన్ యుద్ధవ్యూహ రచనా విధానాలే ముఖ్యంగా కారణం. చతురంగ బలాలపై ఆధారపడిన యుద్ధపద్ధతులు పాతబడి పోయినవని మనదేశ పరిపాలకులలో పెక్కుమంది గుర్తించలేదు. గుర్తించిన కొద్దిమందీ కొత్త పద్ధతులను అనుసరించలేదు. అనుసరించిన కొద్దిమందీ యూరోపియన్ ఆఫీసర్లపై పూర్తిగా ఆధారపడినందున వారు నమ్మకద్రోహం చెయ్యడంలో నిస్సహాయులైనారు. మేజర్ బి.డి. వసు వ్రాసిన “ది రైజ్ ఆఫ్ ది క్రిస్టియన్ పవర్ ఇన్ ఇండియా” అనే చారిత్రక గ్రంథాన్ని చదివితే, బ్రిటీషువారు భారతదేశాన్ని జయించడంలో సాధించిన ప్రతి విజయానికి భారతీయుల పట్ల భారతీయుల భ్రాతృద్రోహం కారణం కాకపోతే, భారతీయులు నమ్ముకున్న యూరోపియన్ ఆఫీసర్ల స్వామిద్రోహం కారణమని స్పష్టపడుతుంది. "మీరు క్రైస్తవులు; మేము క్రైస్తవులము. మాకు వ్యతిరేకంగా మీరు పోరాడతారా?" అనే ప్రచారంతో అనేక ముఖ్య యుద్ధాల సందర్భంలో బ్రిటీషువారు ప్రచారం చేశారు. ఆ ప్రచారంతో భారతీయ పరిపాలకుల కొలువులోని యూరోపియన్ ఆఫీసర్లను తిరగదీసుకున్నారు. “మీదీ, మాదీ ఒకే క్రైస్తవమతం కాదా?" అనే ప్రచారం భారతదేశాన్ని జయించుకొనడంలో బ్రిటీష్వారికి ఇంతగా ఉపకరించినందువల్లనే మేజర్ బి.డి.వసు తన చారిత్రక గ్రంథానికి "భారతదేశంలో క్రైస్తవ రాజ్యసంస్థాపన" అని నామకరణం చేశాడు.

కొత్త యుద్ధపద్ధతులు, కొత్త స్వామిద్రోహ పద్ధతులు మాత్రమే కాకుండా మరొక ముఖ్య పరిస్థితి కూడా బ్రిటీష్ వారికి అనుకూలించింది. ఎక్కడో ఆరువేల మైళ్ళ దూరంలోగల చిన్ని చిన్ని దీవుల నుంచి బ్రిటీష్ వారు వర్తకం కోసం ఇండియా

వరకు ఏ విధంగా రాగలిగారు? కేవలం వారి నౌకాయాన పాటవం వల్లనేగదా ఇది సాధ్యమైంది? అయితే, తాము కూడా నౌకాదళాన్ని యుద్ధనౌకలనేమి, వాణిజ్య నౌకలనేమి ఎందుకు సమకూర్చుకొనగూడదు? ఈ విషయం ఒక మహారాష్ట్రులు తప్ప నాటి భారతదేశ పరిపాలకులలో ఎవ్వరు గుర్తించనేలేదు. మహారాష్ట్రులైనా ఈ విషయాన్ని గుర్తించేసరికే, కాలం మించిపోయింది; అప్పటి కప్పుడే బ్రిటీషువారు మనదేశంలో బాగా పాతుకుపోయారు.

ఇలాగే మరొక విషయంలో కూడా నాటి భారతదేశ పరిపాలకులు హ్రస్వదృష్టినే ప్రదర్శించారు. బ్రిటీషువారు పద్దెనిమిదవ శతాబ్దంలో మనదేశంలో కాలూనగలిగినా, పందొమ్మిదవ శతాబ్దంలో వారు మరింత త్వరితంగా పాదుకుపోవడానికి యంత్రయుగం అవతరణే కారణం. స్టీమ్ ఇంజన్ కనిపెట్టడంలో యూరప్ ఖండం మొత్తంపై ఆర్థిక, పారిశ్రామిక వ్యవస్థ ప్రాతిపదికలే మారిపోయినదనే విషయాన్ని గుర్తించగల విజ్ఞత మన వారికి లేకపోయింది.

అసలు బ్రిటీష్ వారు మనదేశానికి చేరే సమయానికి మనదేశంలో కులాలు ఘనీభవించి, ఆచార వ్యవహారాల ప్రాబల్యం అత్యధికమైపోయి, మొత్తం జాతికే ఒక కొత్తభావాన్ని అర్థం చేసుకోగల, ఒక కొత్త ఉద్యమాన్ని హర్షించగల శక్తి ఉడిగిపోయినట్లు కనబడుతుంది.

ఈ వివిధ మానసిక, నైతిక కారణాలను పురస్కరించుకుని, భారతీయ సైనికుల్ని వినియోగించుకుని, భారతీయ ధనాన్ని వ్యయపరచి బ్రిటన్ భారతదేశాన్ని జయించిందేగాని, తన కత్తిబలంతో కాదు.

కాగా, బ్రిటన్ భారతదేశాన్ని పరిపాలించడం కూడా కత్తిబలం వల్ల కానేకాదు. భారతీయుల మానసిక, నైతిక పతనాన్నే తమ సామ్రాజ్య రక్షణకు సాధనంగా చేసుకొని, ఒకప్పుడు హిందువుల పట్ల, మరొకప్పుడు మహ్మదీయులపట్ల, సర్వదా సంస్థానాధీశులపట్ల, పక్షపాతాన్ని చూపుతూ, భారతీయ సైనిక దళాలతో, భారతీయ ప్రభుత్వోద్యోగులతో భారతదేశాన్ని వారు పరిపాలించ గలిగారు.

భారత రాజకీయ రంగంలో గాంధీజీ ప్రవేశంతో భారతీయులు తమ నైతిక పతనాన్ని తాము తెలుసుకోగలిగారు. దానితో వారిలో దాస్యంపట్ల ఏహ్యభావం రేకెత్తింది; స్వాతంత్ర్యం కోసం తృష్ణ ప్రబలింది. ఇటీవల ఈ పరివర్తనం పెక్కుమంది భారత సైనికులలో, నావికులలో, వైమానికులలో ఉద్యోగులలో ద్యోతకం కాసాగింది కూడా. అంచేతనే బ్రిటీషువారు ఈనాటికి తామిక వైదొలగక తప్పదని గుర్తించారు; ఇండియా మంత్రి లార్డ్ పెథిక్ లారెన్స్ మొన్నను ప్రభువుల సభలో ప్రసంగిస్తూ, "1949 జూన్ తర్వాత మనం భారతదేశంలో మన ప్రభుత్వ వ్యవస్థను ఇప్పటివలె నిలుపుకొనలేము" అని చెప్పవలసివచ్చింది; భారతజాతీయ విప్లవశక్తులను ఇక మనం ప్రతిఘటించలేమని ఒప్పుకొనవలసి వచ్చింది.

ఇక తాము భారతీయుల అభిమతానికి భిన్నంగా భారతీయులను పరిపాలించలేమని నిజానికి 1942లోనే బ్రిటీష్ వారు గుర్తించారు. అందువల్లనే నాడు క్రిప్స్ ప్రణాళిక సందర్భంలో భారతదేశం పూర్ణస్వాతంత్ర్యాధికారాన్ని, భారతజాతి స్వయం నిర్ణయాధికారాన్ని తాము గుర్తిస్తున్నామని ప్రకటించారు. ఈ క్రిప్స్ ప్రణాళిక భారతీయులను సంతృప్తి పరచనందున 1946లో ఆ యుద్ధప్రణాళిక ప్రకటించబడింది. అది నెరవేరగల అవకాశం అంతగా కానరానందున తిరిగి 1947లో మొన్ననే 1948 జూన్లోపుగా భారతదేశం నుంచి బ్రిటన్ వైదొలగ నున్నదని అట్లీ ప్రధాని ప్రకటించవలసి వచ్చింది.

తన పరిపాలన ఇదివరకువలె ఇకమీదట కొనసాగబోదని తెలుసుకున్నప్పటికీ భారతదేశంపై తన ప్రాబల్యాన్ని - దానిపై తనకు పలుకుబడిని పూర్తిగా పోగొట్టుకొనడానికి బ్రిటన్ సంసిద్ధపడలేకున్నది. అందువల్లనే మొన్న చూపిన ప్రతిపాదనలో సైతం అది కొన్ని మెలికలు పెట్టింది.

“1948 జూన్ లోగా వైదొలగిపోయే సందర్భంలో రాజ్యాధికారాన్ని ఎవరికి అప్పగించి వెళ్ళడం?" అనే విషయంలో ఒక మెలిక ఉన్నది. సంస్థానాధీశుల విషయంలో మరొక మెలిక వుంది. ఈ రెండింటిని జాగ్రత్తగా పరిశీలించడం అవసరం.

1948 జూన్ లోగా భారతీయులలో భారతీయులకు ఒక ఒడంబడిక కుదరని పక్షంలో రాజ్యాధికారాన్ని ఏ ఏదో ఒక రూపంలో అప్పటికి ఉండగల కేంద్ర ప్రభుత్వానికి అప్పగించడమా, లేక, కొన్ని రాష్ట్రాలలో ఆ రాష్ట్రీయ ప్రభుత్వాలకు కూడా అప్పగించడమా అని ఆలోచించవలసి ఉంటుందని అట్లీ ప్రధాని ప్రకటించాడు. “కొన్ని కొన్ని చోట్ల రాష్ట్రాలకు రాజ్యాధికారాన్ని అప్పగిస్తా” మనడం పాకిస్తాన్ సంస్థాపనకు కొంత అవకాశాన్ని చూపించక పోవడం లేదు. పంజాబ్, సింధు, సరిహద్దు, బెంగాల్, అస్సాం రాష్ట్రాలు చేరగా, పాకిస్తాన్ ఏర్పడాలని ముస్లిం లీగ్ అభిమతం.

రాష్ట్రీయ ప్రభుత్వాలకు రాజ్యాధికారాన్ని అప్పగించిపోవడమే సంభవిస్తే, ముస్లిం లీగ్ు అది లభ్యమయ్యేది - పంజాబ్లోగాని, సరిహద్దు రాష్ట్రంలోగాని, అస్సాములోగాని ప్రస్తుతం దాని మంత్రివర్గాలు లేనందున - కేవలం, సింధు, బెంగాల్ రాష్ట్రాలలోనే, పైగా కొన్ని సందర్భాలలో రాజ్యాధికారాన్ని రాష్ట్రీయ ప్రభుత్వాలకు అప్పగించడమే కాకుండా, ఆయా ప్రాంతాల యోగక్షేమాల రక్షణ దృష్ట్యా వేరే ఏదైనా ఏర్పాటు చేయవలసి రావచ్చుననే సూచనకూడా ప్రధాని అట్లీ ప్రకటనలో కలదు. ఈ సూచన ఆంతర్య మిది : బెంగాల్లో రాజ్యాధికారాన్ని ముస్లిం లీగ్ ప్రభుత్వానికి అప్పగించవలసి వచ్చినా, హిందువులే అత్యధిక సంఖ్యాకులుగల పశ్చిమ బెంగాల్ను పోగొట్టడం అవసరం కావచ్చు. ఇదేవిధంగా ఒకవేళ పంజాబ్లో కూడా రాజ్యాధికారం ముస్లింలీగ్ కే అప్పగించబడినా, శిఖ్ఖులు, హిందువులు అత్యధిక సంఖ్యాకులుగా గల కొన్ని పరగణాలను దానినుంచి పోగొట్టవలసిన అగత్యం రావచ్చు. అంచేత ఏ విధంగా చూచినా ముస్లింలీగ్ కోరుతున్న పాకిస్తాను ముస్లింలీగ్ కోరుతున్న రూపంలోగాని, విస్తృతిలోగాని ఏర్పడబోదు. ఈ మేరకు ఆమాత్య ప్రణాళికలకంటె అట్లీ ప్రకటన ఉత్తమమైనదే. అయితే, ఏదో ఒకవిధంగా పంజాబ్, సరిహద్దు రాష్ట్రాలలోని ప్రస్తుత ప్రభుత్వాలను తొలగించి,

1948 జూన్లోగా తామే అధికారంలోకి రాగలిగితే, ఆ రెండు రాష్ట్రాలను సింధు, బెంగాల్ రాష్ట్రాలలో కలుపుకుని పాకిస్తాన్ స్వతంత్ర రాజ్య సంస్థాపనను సాధించవచ్చుననే ఆశను ముస్లింలీగ్ రేకెత్తించే అవకాశం సైతం అట్లీ ప్రకటనలో లేకపోలేదు. ఈ అనుమానాన్ని పంజాబ్, సరిహద్దు రాష్ట్రాలలో ముస్లింలీగ్ ప్రస్తుతం కొనసాగిస్తున్న ఆందోళన బలపరుస్తున్నది కూడా.

ఇండియా విభజనకు అవకాశమిచ్చే మేరకు అట్లీ ప్రకటన నిరసించదగిందే. అయితే, తాను ఎంతకాలం కాంగ్రెసుతో రాజీకి రాకుండా ఉంటుందో, అంతకాలం తమకు ఒక అండగా బ్రిటన్ ఇండియాలో నిలవగలదనే నమ్మకాన్ని ఆ ప్రకటన తొలగిస్తున్నందున, లీగ్ తన ప్రస్తుతపు కొరకరానికొయ్య ధోరణిని మార్చుకొనగలదనే ఆశకూడా లేకపోలేదు. ఢిల్లీ అసెంబ్లీలో 1947-48వ సంవత్సరపు బడ్జెట్టును ప్రవేశపెడుతూ ఉపోద్ఘాతంగా మిస్టర్ లియాకత్ అలీఖాన్ పలికిన పలుకులలో ద్యోతకమౌతున్న భావాలను ముస్లింలీగ్ ప్రస్తుత మనఃప్రవృత్తికి తార్కాణాలుగా ఎంచుకొనవచ్చునంటే, మనదేశ భవితవ్యం విషయమై కాంగ్రెస్ ముస్లింలీగ్లకు ఒక ఒడంబడిక అసాధ్యం కాకపోవచ్చు.

ఇదివరలో హిందువులపై మహమ్మదీయులను, మహమ్మదీయులపై హిందువులను పురికొల్పి, భారతజాతిని శక్తివిహీనంగా చెయ్యడమే బ్రిటన్ లక్ష్యంగా ఉండి ఉన్నప్పటికీ, ఇప్పుడు స్వార్థాన్ని కోరే అది భిన్న లక్ష్యాన్ని పెట్టుకుంటున్నదేమోనని ఆశించడానికి కొన్ని తార్కాణాలు కానవస్తున్నాయి కూడా.

అటు యునైటెడ్ స్టేట్సు ఆర్థిక ప్రాబల్యాన్ని, ఇటు సోవియెట్ రష్యా రాజకీయ తత్వ ప్రాబల్యాన్ని చూడగా, శక్తివంతమైన భారతదేశం తనతో మైత్రినెరపినప్పుడే తాను ప్రపంచంలో నిలబడగలనని బ్రిటన్ భావిస్తున్నట్లుంది. నిజానికి బ్రిటీష్ విదేశాంగ మంత్రి మిస్టర్ బెవిన్ ఈ విషయాన్ని ఈ మధ్య లండన్లో మిస్టర్ అసఫాలీ గౌరవార్థం (ఆయన ఇండియా రాయబారిగా యునైటెడ్ స్టేట్సుకు పోతున్న సందర్భంలో జరిగిన విందులో బయటపెట్టాడు కూడా. దీన్నిబట్టి ఇండియా విభజన బ్రిటన్కు నేడు అంతగా మనస్కరించదేమోననీ అనుకోవచ్చునేమో?

ఐతే, భావిప్రపంచంలో తన ప్రతిపత్తి రక్షణకే భారతదేశ స్వాతంత్ర్యాన్ని గుర్తించి, దాని స్నేహాన్ని సంపాదించడం బ్రిటన్ ఆశయమైతే, రష్యా, అమెరికాలకు విరుద్ధమైన విధానాలలోకి అవసరమైతే ఇండియాను ఈడ్వటానికి ఇండో - బ్రిటీష్ సంధిలో ఏ సైనిక, నావిక, వైమానిక దళాలకు సంబంధించిన షరతులలోనో కొంత అవకాశం పెట్టుకొనడానికి అది (బ్రిటన్) ప్రయత్నిస్తుంది.

ఈ ప్రమాదం తొలగడమేమి, ఇండియా నామమాత్రంగా కాకుండా, నిజంగా పూర్వస్వతంత్ర రాజ్యం కావడమేమి, భారతీయులు అట్లీ ప్రకటన కల్పిస్తున్న మహదవకాశాన్ని పురస్కరించుకొని, తమ విభేదాలను సమయింప చేసుకొని సమైక్యతను ప్రదర్శించగలిగినప్పుడే.

కాగా, ప్రాధాని అట్లీ ప్రకటన స్వదేశ సంస్థానాలు కోరితే ఒక్కొక్కటి ఒక్కొక స్వతంత్ర రాజ్యం కాగల అవకాశాన్ని చూపిస్తున్నది. ఈ వీలును చూసుకొని అప్పుడే ఒక హైదరాబాద్ ముస్లిం రాజకీయవేత్త నిజాం స్వతంత్ర రాజ్యం కాగలదని ప్రకటించాడు కూడా! స్వదేశ సంస్థానాలలో తాము యధాప్రకారం కాలూని నిలవడం ద్వారా ఇండియాపై తమ పలుకుబడి నిలుపుకొనడమే బ్రిటన్ ఉద్దేశమైతే, భారత ప్రజలు దాన్ని విఫలం చేయవలసి ఉన్నదికూడా.

* * * * * *

ఇండియాలోవలెనే పాలస్తీనాలోనేమి, ఈజిప్టులోనేమి తన పెత్తనం ఇక సాగబోదని తెలిసినందునే, ఆ దేశాల సమస్యలను కూడా ఏదో ఒక విధంగా పరిష్కరించాలని బ్రిటన్ ప్రస్తుతం తాపత్రయపడుతున్నది. ఆ దేశాలతో తనకిక నిమిత్తం లేదనుకుంటే అవి తమదారి తాము పోవచ్చుననుకుంటే, వాటి సమస్యల పరిష్కారం సులభమే. కాని, తన అధికారాన్ని నిలుపుకోవాలని - అదే సమయంలో దాన్ని కాపాడుకోలేని స్థితిలో బ్రిటన్ పడినందువల్లనే ఏ సమస్యా పరిష్కారం కావడంలేదు. పాలస్తీనా, ఈజిప్టు సమస్యలు త్వరలో మిత్రరాజ్య సమితిలో చర్చకు రాబోతున్నది. ఇండియా సమస్య కూడా బ్రిటన్ తగు విజ్ఞతను ప్రదర్శించలేకపోతే, మిత్రరాజ్య సమితికి పోవచ్చు.

* * * * * *

కాగా, ఫ్రాన్సు ఇండోచైనాలో తన పశుబలాన్ని ప్రయోగించి, రక్తస్రవంతుల్ని ప్రవహింపజేసి, తన అధికారాన్ని కొంతవరకైనా కాపాడుకోడానికి ప్రయత్నం చేస్తున్నది. ఈ ప్రయత్నం నేడు ఒకవేళ కొనసాగితే, రేపు స్వతంత్ర ప్రాచ్యజాతి ఇంతకింతగా ఇంపీరియలిస్ట్ ఫ్రాన్సుపై కక్ష సాధించి, బుద్ధి చెప్పకపోదు. (ఆంధ్రజ్యోతి మాస పత్రిక మార్చి 1947)

సాంఘిక సమస్యలు

ఉత్తమ సంస్కరణ

(1947లో మద్రాసు ప్రభుత్వం తొలుత మద్యపాన నిషేధం ప్రకటించినప్పుడు దీన్ని ఉత్తమ సంస్కరణగా అభివర్ణన)

ఆబ్కారీ కేసులలో - అంటే దొంగ సారాయి కాయడం, దొంగతనంగా నల్లమందు మొదలైన మత్తు పదార్థాలను విక్రయించడం. ఇతర క్రిమినల్ కేసులలోవలె గాకుండా ముద్దాయి దోషి అనే భావన. దోషిని కాదని ముద్దాయి రుజువు చేసుకోవలెను. ఈ విధంగా ఎందుకు శిక్షాస్మృతులలో విధించారంటే ఆబ్కారీ చట్టం ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే తరగతిలో చేరుతుందన్నారు.".

ఇప్పుడు 1947 అక్టోబరు 1వ తేదీ నుంచి మద్రాసు ప్రభుత్వం రాష్ట్రంలో మరి ఎనిమిది మండలాలలో మద్యనిషేధ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందంటే ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో మరి నాలుగు కోట్ల రూపాయల ఆదాయం తగ్గిపోతుందన్నమాట.

ఇదివరలో ఎనిమిది మండలాలలో మద్యనిషేధం అమలుపరచబడింది. ఇంకను మూడోవంతు రాష్ట్రంలో మాత్రం త్రాగుడు నిషేధించవలసి ఉన్నది. అది కూడా పూర్తి అయితే రాష్ట్రంలోని ప్రజలు ముఖ్యంగా బీదసాదలు సాంఘికంగాను, ఆర్థికంగాను అభివృద్ధి చెందడానికి ఎంతో దోహదంగా ఉంటుంది.

ప్రభుత్వం సునాయాసంగా వచ్చే 17 కోట్ల ఎక్సైజు ఆదాయాన్ని భంగపడి మద్యనిషేధ కార్యక్రమానికి పూనుకోవడానికి కారణమేమిటి? ఈ కార్యక్రమ ప్రాముఖ్యమేమిటి అనే అంశాలు కాంగ్రెసు వాదులకు ప్రత్యేకంగా వివరించి నచ్చజెప్ప నక్కరలేదు.

సంఘంలో చిరకాల వ్యాప్తంగా ఉన్న ఈ దోషాన్ని నేటికి ప్రజా ప్రభుత్వం నిర్మూలించగలిగిందంటే ప్రజలపట్ల, సంఘం పట్ల ప్రభుత్వం తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించిందన్న మాట. త్రాగుడు దురభ్యాసాన్ని మానినందువల్ల ఎన్ని సంసారాలో బాగుపడగలవు. ఎంత సంపాదించిన సాయంత్రానికి సారా దుకాణానికి దాన్ని అర్పణ చేయడంతో ఇంటిలో ఆలుబిడ్డలు తిండిలేక బాధ పడవలసిన స్థితి ఇప్పటికైనా తప్పిపోతుంది. సంసారాలు సుఖంగా శాంతంగా ఉండడాని కిది తారకమార్గం.

అయితే మద్యనిషేధం జయప్రదంగా జరగవలెనంటే ప్రజల సహకారం అవసరమనే అంశాన్ని గ్రహించాలి. ఈ కార్యక్రమం సానుకూలమవుతుందా, దొంగ సారాయి కాచేవాళ్ళు ఎక్కువవుతారు అని వాదం చేసేవారున్నారు. కాని మద్యనిషేధ చట్టాన్ని, ఇతర చట్టాలవలెనే, ఉల్లంఘించేవారిని పట్టియివ్వవలసిన బాధ్యత ప్రతి పౌరునిమీద కలదని గ్రహిస్తే, ఈ కార్యక్రమం జయప్రదం కాకపోదు. ఈ చట్టం క్రింద నేరాలు ఎక్కడైతే జరుగుతవో అక్కడ సాముదాయక జరిమానాలు విధించే విషయం కూడా ప్రభుత్వం ఆలోచనలో ఉన్నట్టు ప్రధానమంత్రి ప్రసంగంలో తెలియజేసిన దాన్నిబట్టి చూస్తే ఈ కార్యక్రమ విజయ బాధ్యత పౌరులందరిమీద వేయబడుతున్నదని స్పష్టమవుతుంది. ప్రభుత్వం మద్యవిక్రయం ద్వారా వచ్చే ఆదాయంతో దేశ సౌభాగ్యాన్ని నిర్మించదలచుకోలేదు. ప్రభుత్వం ఈ విధమైన ఆదాయం కంటే ప్రజా సౌఖ్యాన్నే ప్రధానంగా ఎంచి పనిజేయబూనింది. అందుచేత ఇందులో ప్రజా సహకారం కావలెనని అభిలషించడం, ప్రభుత్వ ధర్మం, ప్రజలు సహకరించడం విధి.

అయితే ఈ కార్యక్రమంలో మద్యనిషేధం ఆచరణలో ఉన్న ప్రాంతాల సరిహద్దులలో మద్యపానం ఆచరణలో ఉన్న సంస్థానాలుగాని ఇతర ప్రాంతాలుగాని ఉన్నప్పుడు అవి కూడా ఈ కార్యక్రమాన్ని అనుష్ఠిస్తే ఎంతో మేలు చేసినవి కాగలవు. లేదా నిషేధ కార్యక్రమం పట్ల సానుభూతి కలిగి దొంగతనంగా మద్యం రవాణా జరగకుండా చేయవలెను.

త్రాగుడు కలవాటు పడినవారు మానడమంటే కష్టమే. కాని అందువల్ల ఎంత డబ్బు ఆదా అవుతున్నదో గ్రహించి, ఆ డబ్బును ఇతర ఆహార ద్రవ్యాలు పుష్టికర పదార్థాలు కొని సేవించి ఆరోగ్యంగా ఉండవచ్చుననే జ్ఞానం కలిగితే ఆదిలో కష్టంగా ఉన్నా, సుఖంగా పరిణమిస్తుంది. కల్లు గీతగీయడం, సారా వండడం వృత్తిగా గలవారు తమ వృత్తులు పోయినవే అని బాధపడక ఇతర వృత్తులను అవలంబించడానికి ప్రభుత్వమే సహాయం చేయగలదు. ఒక వృత్తి నీతిబాహ్యమైందని గ్రహించినప్పుడు ఎవరికి వారు దాన్ని మాని మరొకదాన్ని అనుసరించ ప్రయత్నం చేయడం భావ్యం కాదా?

ఇదివరలో దొంగతనంగా సారాయి వండితే నేరమైనట్లే ఇప్పుడు కూడా అది నేరమే. అయితే ఇప్పుడు ప్రభుత్వం తన ఆదాయానికి భంగం కలుగుతున్నదని గాక ప్రజలు దొంగతనంగా త్రాగి చెడిపోతారే అనే భావంతో ఆ నేరాలను మన్నించజాలదు. ప్రభుత్వం తరుగుబోయే ఆదాయాన్ని ఇతర విధాల పూర్తి చేసుకొనక తప్పదు. అమ్మకం పన్ను ఇతర పన్నులను ఎక్కువ చేయడం, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావలసిన ఆదాయ భాగాన్ని ఎక్కువ కావలెనని కోరడం ఇందుకు సంబంధించినవే. న్యాయమైన ధర్మమైన మార్గాలను ప్రభుత్వాదాయం సమకూరుతుంది. ప్రజలను పీల్చి పిప్పిచేసే ఆదాయమార్గం పోతుంది. ఈ సంస్కరణతో ప్రజల నైతిక సంపద అధికం కాగలదు.

(ఆంధ్రప్రభ 4-10-1947)

మద్యనిషేధం

సంపూర్ణ మద్యనిషేధం గొప్ప ఆదర్శమే కావచ్చు. అయినా ఒక్క శాసనంతో, ఒక్క కలం గీటుతో, దాన్ని అమలుపరచడం సాధ్యమా! శ్రీ మొరార్జీ దేశాయి, డాక్టర్ సుశీలానయ్యర్ వంటివారు ఈ వాస్తవాన్ని ఎందుకు గుర్తించలేకపోతున్నారు?

వీరు మొత్తం దేశంలో మద్యనిషేధాన్ని విధించాలనే కాదు, దానికొక గడువును కూడా తక్షణం నిర్ణయించాలని కోరుతున్నారు. వీరి దృష్టిలో ఇందుకు తగిన గడువు గాంధీ శతజయంతి దినమైన 1969, అక్టోబరు రెండవ తేది గాంధీ తన జీవితకాలంలో అనేక సాంఘిక దురాచారాలను తీవ్రంగా ప్రతిఘటించిన వ్యక్తి. మద్యపాన వ్యసనాన్ని నిర్మూలించడానికి ఆయన ఎంతో దీక్షగా కృషిచేశాడు. ఆయన నాయకత్వాన కల్లుదుకాణాల పికెటింగ్ దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఒక ముఖ్య భాగమైంది. అందుచేత ఆయన శతజయంతి నాటికి సంపూర్ణ మద్యనిషేధాన్ని అమలుపరచడం ఎంతైనా సముచితం కాగలదని డాక్టర్ సుశీలానయ్యర్ వంటివారి భావన కావచ్చు; గాంధీ శతజయంతి పేరు తెచ్చిన మీదట కాంగ్రెసు సంస్థ తమ ప్రతిపాదనను మరి కాదనలేదని వారి ఆలోచన కావచ్చు.

మంచిదే! కాని, ప్రస్తుతం దేశంలో మద్యనిషేధం పాక్షికంగా అమలులోనే ఉంది. ఇరవైయేళ్ళకుపైగా దాదాపు అన్ని రాష్ట్రాలలో అమలులో ఉన్నది. అయినా, అది జయప్రదంగా అమలు జరిగిన ఎక్కడా దాఖలా లేదు. ఇంతేకాక, అది పూర్తిగా విఫలమైనట్టు ప్రత్యక్షంగా కనబడుతుంది. పాక్షిక నిషేధమే విఫలమైనప్పుడు సంపూర్ణ నిషేధం సఫలం కాగలదా?

మద్యనిషేధం విఫలం కావడానికి కారకులెవరు? కారణాలేమిటి? ఈ ప్రశ్నలకు సమాధానంకాంగ్రెసు ప్రభుత్వాలలో, వాటి అధికారులలో చిత్తశుద్ధి లోపించడమే. నిషేధాన్ని ప్రారంభించడం ఎంత చిత్తశుద్ధితోనైనా జరిగి ఉండవచ్చుగాని, కొద్దినాళ్ళలోనే ఆ చిత్తశుద్ధికి చెదలు పట్టింది. మద్యనిషేధం ఎక్సైజు సుంకం ద్వారా ప్రభుత్వాలకు వచ్చే రాబడిపోయింది. నిషేధపు చట్టాన్ని అమలు చేయడానికి ఏర్పడిన విస్తృత యంత్రాంగం కింద అపారమైన ఖర్చు అదనంగా తగిలింది. ఈ రెండు విధాలా ప్రభుత్వ కోశాగారాలు విశేషంగా నష్టపడ్డాయి.

ధననష్టం మాత్రమే అయితే, పోనీ అనుకోవచ్చు. మద్యనిషేధం కారణంగా సంభవించిన పరోక్ష దుష్ఫలితం ప్రభుత్వ శాసనాలపట్ల ప్రజలలో తృణీకార ప్రభావం పెరగడం, తమ శాసనాన్ని అమలు చేయవలెనన్న చిత్తశుద్ధి ప్రభుత్వాలకే లేనప్పుడు ప్రజల కెక్కడినుంచి వస్తుంది? ఈ ఒక్క చట్టం ద్వారా మొత్తం చట్టాలనే ధిక్కరించే మనస్తత్వం ప్రజలలో పెచ్చు పెరిగింది.

మద్య నిషేధశాఖలు అవినీతికి నిలయాలుగా తయారైనాయి. పైనుంచి కింది వరకు వాటిలో లంచగొండితనం సర్వసామాన్యమై పోయింది. అధికార వర్గానికి లంచాల రూపంలోను, కల్లు వ్యాపారస్తులకు దొంగ సారాబట్టీల రూపంలోను లాభాలు సమకూర్చిపెట్టడానికే మద్యనిషేధం ఉపకరిస్తుంది.

ఇంతేకాక, నిషిద్ధవస్తువుపట్ల ఎక్కడైనా, ఎప్పుడైనా ఆకర్షణ పెరుగుతుంది. పూర్వం ఏ కొద్దిమందో చాటుమాటుగా కల్లుపాకలకు, సారాదుకాణాలకు పోయి త్రాగివచ్చేవారు. వారిలో అందరికీ కాకపోయినా, హెచ్చుమందికి తమ ఇరుగు పొరుగువారు ఏమనుకొంటారో అని బిడియమైనా ఉండేది.

నిషేధం తర్వాత ఈ బిడియం మటుమాయమైంది. పూర్వంకంటే అధిక సంఖ్యాకులు నిషిద్ధ పానీయాలకు ఈనాడు అలవాటు పడ్డారు. చాటుమాటుగా కాక, బహిరంగంగానే ఈ వ్యసనానికి వారు దాసులయ్యారు. సరైన పద్ధతులలో తయారైన మద్యాన్ని కాక, హానికరమైన పద్ధతులలో తయారైన విషపానీయాలను సేవించి, ఆరోగ్యానికి, ప్రాణాలకు కూడా ముప్పు తెచ్చుకుంటున్నారు. ఈ విషయాలు డాక్టర్ నయ్యర్ వంటి ఆదర్శవాదులకు తెలియవని అనగలమా? అయినా, వారికి ఆదర్శం మీదనే ఎందుకు మోజు?

మద్యనిషేధాన్ని కొన్ని కొన్ని రాష్ట్రాలు ప్రవేశపెట్టిన కొత్త రోజులలోనే మరి కొన్ని రాష్ట్రాలు దాన్ని వ్యతిరేకించాయి. అప్పటిలో అవి అన్నీ కాంగ్రెసు రాష్ట్రాలే. ఆ తర్వాత తమ వైఫల్యాన్ని గుర్తించి, మొట్టమొదటిగా నిషేధాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్రాలు కూడా కొన్ని దాన్ని రద్దు చేశాయి, లేదా సడలించాయి. వీటిని తిరిగి నిషేధానికి ఒప్పించడం సాధ్యమైనా, ఇప్పుడు కాంగ్రెసేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలు కొన్ని ఉన్నాయి; ఇంకా మున్ముందు మరికొన్ని రావచ్చు. మద్యనిషేధం రాష్ట్ర విషయమైనప్పుడు అన్నింటిని అందుకు ఒప్పించడం సాధ్యమా!

హరిజనాభ్యుదయం

ప్రస్తుతం పనాజీలో జరుగుతున్న అఖిలభారత కాంగ్రెసు మహాసభ నుంచి వస్తున్న వార్తలను బట్టి సంపూర్ణ మద్యనిషేధం పట్లగాని, దానికొక గడువును నిర్ణయించడంపట్ల గాని కాంగ్రెసు కార్యవర్గంలోనే పెక్కుమంది సుముఖులుగా లేరు. కాంగ్రెసు ముఖ్యమంత్రులు, కాంగ్రెసువాదులు పెక్కుమంది దాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఒక తీర్మానం చేసినంత మాత్రాన వీరందరు సంపూర్ణ మద్యనిషేధానికి అనుకూలురైపోతారా? వీరిని బలవంతాన ఒప్పించినంత మాత్రాన మద్యనిషేధాన్ని చిత్తశుద్ధితో అమలుచేయించడం సాధ్యమా? ఈ ఆదర్శాన్ని పట్టుకొని వ్రేలాడుతున్న కాంగ్రెసులోనే ఏకీభావం లేనప్పుడు, కాంగ్రెసేతర రాజకీయ పక్షాలను, వాటి ప్రభుత్వాలను ఇందుకు ఒప్పించడం సాధ్యమా?

గాంధీ ప్రసక్తిని ఈ విషయంలో తీసుకురావడం ఒక ఎత్తుగడ తప్ప మరేమీ కాదు. ఆయన పేరు చెప్పి, వ్యతిరేకులను నిరుత్తరులను చేయగోరడమే ఈ ఎత్తుగడ. మద్యనిషేధ శాసనాలను ఇంకా కొనసాగించడం, లేదా వాటిని దేశ వ్యాప్తం చేయబోవడం గాంధీ స్మృతిని మనం గౌరవించడం కాదు, అగౌరవించడమే; ఆచరణలో తన ఆదర్శానికి తన అనుయాయులే పట్టించిన దుర్గతిని చూచి, ఆయన ఈనాడు సజీవులై వుంటే, ఈ కల్లబొల్లి చట్టాన్ని తుంగలో తొక్కవలసిందిగా చెప్పివుండేవాడు.

"చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా?" అని వేమన అన్నట్లు, అమలు చేయడానికి ఎవరికీ ఆసక్తిలేని మద్యనిషేధాన్ని విస్తృతం చేయడానికి మారుగా దాన్ని ఉపసంహరించడమే ఈనాడు జరగవలసినపని. దానివల్ల ఉపకారం కంటే అపకారం ఎక్కువగా జరుగుతుంది. అది అనృతాన్ని పెంచుతుంది. అక్రమాలకు దారితీస్తుంది. అవినీతిని రెచ్చగొడుతుంది. యథార్థాన్ని కాంగ్రెసు, దాని ప్రభుత్వాలు గుర్తించలేకపోతే, కొన్ని తరాల వరకు అన్ని నైతికపు విలువలు మన దేశంలో భూస్థాపితం కాగలవు!! (ఆంధ్రజ్యోతి 6-11-1968)

(నవ సమాజ నిర్మాణానికి హరిజనాభ్యుదయం ఒక ప్రాతిపదిక అని విశ్లేషణ. హరిజనాభ్యుదయానికి ప్రభుత్వ ఉప సంఘ సూచనలు పాటించాలని వినతి)

"అయ్యా! నేను చెప్పరానివాణ్ని. దారివ్వండి" అనే రోజులు పోలేదు.

"నీచా! రాకు, దూరంబుగా నుండుము" అని ఈనాడు అనేవారింకా ఉన్నారు. "అస్పృశ్యుడు" "అవాచ్యుడు" అనే మాటలు ఈ ప్రజాస్వామిక యుగంలో కూడా ఒక తెగవారికి వర్తించే పదాలుగా వాడుతున్నవారున్నారు.

అడ్డమైన చాకిరి చేయించుకొని, తినడానికి కడుపునిండా తిండిపెట్టక నానాబాధలు పెడుతున్నా వారు భరించి ఊరుకుంటున్నారు. వారి మొర ఆలించేవారు లేరు. ఆ దరిద్రనారాయణులకు దిక్కు దైవంగా ఉండి, వారిలో ఉత్తేజాన్ని కలిగించి, సాంఘికంగా వారికి గల అనర్హతలను తొలగించడానికి తన జీవితాన్ని ధారపోసిన గాంధీమహాత్ముడు పోగానే వారు తండ్రిలేని పిల్లలైనారు. ఈ నాటికీ హరిజనుల దుస్థితిని బాపడానికి తగినంత కృషి జరగలేదని, ఇంకా ఎంతో చేయవలసి ఉన్నదని మద్రాసు అసెంబ్లీలో హరిజనోద్ధరణ విచారణ సంఘ నివేదికపై జరిగిన చర్చ వ్యక్తం చేస్తున్నది. అందు పాల్గొన్న సభ్యులందరు ఏకకంఠంతో ప్రభుత్వం ఉపసంఘపు సలహాలను ఆచరణలో పెట్టవలసిందిగా కోరారు.

హరిజనాభ్యుదయం ఏ విధంగా జరగాలని విచారించడానికి ఒక ఉపసంఘాన్ని నియమించడం, దానిమీద నివేదిక సమర్పించడం, ఆ సలహాల నన్నింటిని ఆచరణలో పెట్టవలసినదిగా భావించడం అన్నీ జరిగినా, ధనాభావంచేత ఏ పనీకూడా జరుగకుండా పోవడం అసంభవం కాదు.

ఇప్పటికీ ఏ గ్రామం పోయి చూచినా, ఊరిబైట గుడిసెమీద గుడిసె వేసుకొని, కదలను మెదలను స్థలం చాలక, అపరిశుభ్ర ప్రాంతాలలో హరిజనులుపడే అవస్థలు చూడవచ్చు. త్రాగడానికి మంచినీళ్ళు దొరకవు. ఊళ్ళో అందరూ మంచినీళ్ళు తెచ్చుకొనే బావి వద్దకు వారిని రానీయరు. కొట్టు దగ్గరకుపోతే దూరంగా వుండి డబ్బులు పడేసి కావలసిన వస్తువులు కొనుక్కోవలసి ఉంటుంది. అందరి పిల్లలతో పాటు బళ్ళోకిపోయి వాళ్ళ పిల్లలు చదువుకోకూడదు. ఇండ్లు వేరు, బావులు వేరు, పాఠశాలలు వేరు, వారి లోకమే వేరుచేసి రాష్ట్రంలో ఐదవవంతు జనసంఖ్యను అతినీచంగా చూచే సంఘం ఏనాటికైనా ఉన్నత స్థానాన్ని పొందగలదా అని ప్రశ్నిస్తే దోషమేమీ లేదు. ఈ 'మాలపల్లి' భావం ఏనాడు పోతుందో ఆనాడు సంఘం బాగుపడుతుంది.

సంఘ సంస్కరణ ప్రభుత్వ శాసనాల ద్వారా కాక సంఘంలో నుంచే మానసిక పరివర్తనతో కలిగే ఎడల మంచిదే. కాని, అది సాధ్యం కానప్పుడు శాసించక తప్పదు. ఆ శాసనాలు మృతాక్షరం కాకుండా ఉంటేనే ఆశించిన ఫలితాలు సమకూరగలవు. ఒక జాతికి, మతానికి చెందిన కారణంగా సంఘంలో ఎట్టి అనర్హతలు ఉండరాదని చట్టమున్నప్పటికీ హరిజనులు సవర్ణ హిందువుల మూలంగా నానా కష్టాలు పడుతున్నారన్నా, దేవాలయ ప్రవేశ చట్టం వేయబడినా ఇంకా ఒకన్ని చోట్ల దేవాలయ ప్రవేశానికి ఆటంకాలు కలుగుతున్నవన్నా ఆ చట్టాలు ఆచరణలో పెట్టడానికి తగినంత శ్రద్ధను ప్రభుత్వం వహించడం లేదని చెప్పవలసి ఉంటుంది. వర్ణ విభేదం లేకుండా అందరు పిల్లలు ఒక బడిలో చదివేటట్టుగా చేయడానికి విద్యాశాఖాధికారికి అధికారం ఉన్నది. గ్రామాలలోని పరిస్థితుల మూలంగా ఈ సంస్కరణ అయినా సాధ్యం కాకపోయి ఉండవచ్చు. కొంతకాలం ప్రత్యేకంగా 'మాలపల్లి' ఏర్పాటు ఉండవలెనని ప్రభుత్వాభిప్రాయమైతే ప్రతి గ్రామంలోను హరిజనుల కేవిధమైన లోపం లేకుండా చేయవలసిన బాధ్యతను ప్రభుత్వం వహించి ఒక కార్యక్రమంతో ఒక ప్రణాళికతో దాన్ని నిర్వర్తించవలసి ఉంటుంది.

పంచవర్ష ప్రణాళికతో హరిజనుల కందరకు వసతి గృహాన్ని ఏర్పాటు చేయగలమని ప్రభుత్వ పక్షాన హరిజన శాఖామంత్రి చేసిన ప్రకటన యుక్తంగానే ఉంది. కాని హరిజనులు సర్వ విధాలా ఆర్థికంగా ఉద్ధరింపబడడానికి కూడా ఒక ప్రణాళిక అవసరం. విద్యతో,

ప్రచారంతో గాని సాధ్యంకాదు. వారికి తగినంత భూవసతి కలుగజేయాలి. వారు ప్రధానంగా కార్మికవృత్తిని, వ్యవసాయ వృత్తిని అవలంబించేవారైనందున అవి వారికి లాభకరంగా ఉండేవిధంగా చేయాలి. ఎప్పుడైతే వారు ఆర్థికంగా ఉన్నతిని పొందుతారో అప్పుడే వారి అభ్యున్నతి సాధ్యమవుతుంది.

ప్రభుత్వం ప్రత్యేకంగా హరిజనాభ్యున్నతిని గురించి పరిశీలించి వారికి కావలసిన సౌకర్యాలను చేయడానికి ఒక శాఖను నెలకొల్పకపోయినా, అన్ని శాఖలు కూడా పాలనలో హరిజనాభ్యు దయాన్ని కర్తవ్యంగా ఎంచి పనిచేసే యెడల ఆ ఉద్దేశం నెరవేరగలదని మా అభిప్రాయం. వ్యవసాయశాఖ, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, సహకార శాఖ ఇతర శాఖలన్నీ కూడా హరిజనుల పురోభివృద్ధికి కలసి పనిచేయవచ్చు. ఇప్పుడు కావలసింది వివిధ శాఖల సమీకరణ కార్యం. హరిజనశాఖా మంత్రి ఈ శాఖలన్నింటితోను సంపర్కం గలిగి ఏ విధంగా అవి హరిజనుల సౌకర్యం కోసం తోడ్పడగలవో సూచనలు చేస్తూ వాటిని సఫలమయ్యే విధంగా కృషి చేస్తేచాలు. ప్రస్తుతానికి ప్రభుత్వం ఉపసంఘం చేసిన సూచనలను ఆచరణలోబెట్టి హరిజనులపట్ల తమ విద్యుక్త ధర్మాన్ని ఏ విధంగా నెరవేర్చగలదనే సభ్యలోకం ఎదురుచూస్తుంది. (ఆంధ్రప్రభ 22-7-1948)

వరకట్నాలు

తల్లికి పిల్లలు బరువు కారనడం పూర్తిగా నిజం కాదు. కనీసం అది వరకట్నాలున్న సంఘంలో నిజం కాదు. ఆడపిల్లలను కన్న తల్లి విషయంలో అసలే నిజం కాదు. కుమార్తెకు పెండ్లిచేసి పంపించగలిగినంతనే “అమ్మయ్యా! ఒక పిల్ల విరగడైంది” అనే మాట ఎందరు తల్లుల నోట మనం వినడం లేదు? “పీడ విరగడైంది" అన్నట్టుగానే "పిల్ల విరగడైంది" అనడాన్నిబట్టే వరకట్నాలు ఎంత పీడాకరంగా పరిణమించాయో మనం సులభంగానే ఊహించుకోవచ్చు. వరకట్నాలను నిషేధించే శాసనాన్ని చేయడం కంటే, దానికి విరుద్ధంగా ప్రజాభిప్రాయాన్ని రూపొందించడం వెయ్యి రెట్లు ముఖ్యం. వరకట్నం కోరేవారిని, దాన్ని చెల్లించి అల్లుని కొని తెచ్చుకొనడానికి సంసిద్ధపడేవారిని సంఘం పూర్తిగా అసహ్యించుకొనే పరిస్థితి రానంతవరకు వరకట్నాల నిషేధానికి ఎంత కఠిన శాసనాన్ని ప్రభుత్వం చేసినా, అది నిష్ప్రయోజనకరమైనదిగానే మిగిలివుంటుంది.

ఈ సందర్భంలో గమనించవలసిన ముఖ్య విషయాలు మరి రెండు కూడా ఉన్నాయి. ఈనాడు హిందూ సంఘంలో వివాహ సంబంధాల నిర్ణయ సందర్భంలో వధూవరులకు కులం ఒక్కటే కావాలి; శాఖాంతరాలు పనికిరావు; జాతకాలు కలవాలి; ఆర్థిక స్థితిగతులు దాదాపు సమానమైనవి కావాలి; ఆచార వ్యవహారాలు రవ్వంతగానైనా భేదించరాదు; అందచందాలు తక్కువ కారాదు; చదువు సంధ్యలలోనైనా ఎక్కువ అంతరాలు తగవు. ఇన్ని గొంతెమ్మ కోర్కెలను కోరితే కట్నాల మార్కెట్టులో వేలంపాటకు సన్నద్ధపడక తప్పదు.

పోతే, రెండవ విషయ మిది; యువతీయువకులు పరస్పరాకర్షణతో పరిణయం చేసుకొనగల స్థితిలో కట్నం ప్రసక్తి రానేరాదు. నికృష్టమైన ధనాపేక్ష కాక, ఉదాత్తమైన ప్రేమే అప్పుడు వారికి అనుబంధాన్ని కూర్చుతుంది. డబ్బును కోరికాక, ప్రేమను కోరి యువతీ యువకులు పెండ్లి చేసుకొనగల పరిస్థితులను మన సంఘం కల్పించనంతవరకు వరకట్న పిశాచం ఏదో ఒక రూపంలో మనపై రాజ్యం చేస్తూనే ఉంటుంది. (ఆంధ్రప్రభ 26-4-1959)

ఆత్మహత్యలు

ఏ పరిస్థితులలోనైనా ఆత్మ హత్య శోచనీయం. అది ప్రకృతికి విరుద్ధం. ప్రతి ప్రాణీ జీవించాలనే కోరుతుంది; వీలైనంతకాలం - వీలైనంత సుఖంగా - జీవించాలని కోరుతుంది; జీవించడానికి పరిస్థితులు ప్రతికూలమైనప్పుడుకూడా జీవించగోరుతుంది; జీవితం బాధాకరమైనప్పుడు కూడా జీవించగోరుతుంది. మొండెంగా నిలపబడిన చెట్టు కొత్త రెమ్మలు, కొమ్మలు వేయడం ఈ జీవితేచ్ఛ కారణంగానే. రెండుగా మధ్యకు నరకబడిన వానపాము రెండు వానపాములు కావడం ఈ జీవితేచ్ఛ కారణంగానే. క్షయను పోలిన ఘోరవ్యాధి ఒక్క అంగుళం ఊపిరితిత్తిని మిగిల్చినప్పటికీ, ప్రాణాలు బొందిన వీడకపోవడం ఈ జీవితేచ్ఛ కారణంగానే. నిజానికి జీవితేచ్ఛ లేకపోతే సృష్టి లేదు; స్థితి లేదు; లయంలేదు. దేవత్వానికి అమరత్వం ఒక ప్రధానలక్షణం అకారణంగా కాలేదు. అమరత్వవాంఛ ప్రతి ప్రాణిలో ఒక మహాశక్తివలె గర్భితమై ఉంటుంది. శారీరకంగా అమరత్వం అసాధ్యవిషయం అయినందునే ప్రతి వ్యక్తీ తన వంశం అంతరించరాదని కోరుకొంటాడు; అందువల్లనే అమరకీర్తి గడించుకోవాలని అతడు ఆరాటపడతాడు.

వంశాన్ని నిలబెట్టుకోవాలన్న ఆవేదన లేనినాడు సంఘాభ్యున్నతి లేదు. అమరకీర్తి సముపార్జనకై ఆరాటం లేనినాడు కవిత్వం లేదు, కళలు లేవు, శాస్త్రాలు లేవు, విజిగీష లేదు. నిస్సందేహంగా ఆత్మహత్య ప్రకృతి విరుద్ధం. ఇంతే కాదు. ఆశపై నిరాశకు, మనోదార్ఢ్యంపై మనోదౌర్బల్యానికి, వివేచనాశక్తిపై తాత్కాలిక మౌఢ్యానికి, జీవచ్ఛక్తిపై జడత్వానికి ఆత్మహత్య కేవలం విజయమే!

ఇట్టి ఆత్మహత్య ఏ పరిస్తితులలోనైనా అతి శోచనీయం కాగా, స్వల్ప కారణాలకు జరిగినప్పుడు అది పూర్తిగా గర్హనీయం. ఇట్టి గర్హనీయమైన ఆత్మహత్య వార్తలే ఇటీవల మన దేశంలో విశేషంగా వినవస్తున్నాయి.

ఉద్యోగం దొరకలేదని ప్రాణం తీసుకొనేవారు కొందరు; ప్రేమించిన పడుచును పెండ్లి చేసుకోలేకపోయినామని ప్రాణం తీసుకొనేవారు కొందరు; పరీక్షలలో తప్పిపోయినామని ప్రాణం తీసుకొనేవారు కొందరు (ఇట్టి ఒక ఆత్మహత్య నిన్ననే బొంబాయిలో జరిగింది); సొంతఖర్చుకు తల్లిదండ్రులు డబ్బులివ్వలేదని ప్రాణం తీసుకొనేవారు కొందరు; భర్త తనను పుట్టింటికి పోనివ్వలేదనో, అత్తమామలు ఈసడించినారనో, జూదంలో డబ్బు పోయిందనో (ఇట్టి ఆత్మహత్య రెండు మూడు రోజులనాడు తిరిగి బొంబాయిలోనే జరిగింది), నీచమైనట్టిదిగా తాను భావిస్తున్న ఉద్యోగాన్ని ఉదరపోషణార్థం చేసుకొంటుండగా పరిచయస్థుల కంటబడవలసి వచ్చిందనో (మొన్న బెజవాడలో ఒక యువకుడు ఇందుకే ఆత్మహత్య చేసుకొన్నాడు), కోరిన నగలు అమరలేదనో ప్రాణాలు తీసుకొనేవారు కొందరు. ఇంతటి స్వల్పకారణాలకు ఆత్మహత్యలు జరగడం, పైగా వాటి సంఖ్య నానాటికి పెరుగుతున్నట్లు కానరావడం అత్యంత గర్హనీయం కాదా?

ఆత్మహత్యల సంఖ్య పెరగడం ఒక జాతి మనోధైర్యాన్ని కోల్పోతున్నదనడానికి, నైతికంగా అది పతనం చెందుతున్నదనడానికి నిదర్శనం. ఆత్మహత్యల సంఖ్య పెరిగిన తర్వాతనే జర్మనీలో నాజీజం ప్రబలింది. ఆత్మహత్యల సంఖ్య ఆది నుంచీ ఎంతో హెచ్చు కనుకనే, జపాన్లో ఏనాడూ ప్రజాస్వామ్యం పాదుకొనలేదు.

ప్రతి ఆత్మహత్యను విధిగా ఖండించనక్కరలేదు. ఉదాహరణకు, ప్రాణరక్షణకంటే మానరక్షణే ముఖ్యమైన పరిస్థితిలో ఆత్మహత్య జరిగితే, దాన్ని ఖండించరాదు. ప్రియునో, ప్రేయసినో కోల్పోయినందువల్ల కలిగిన దుఃఖోద్వేగం ఆత్మహత్యకు కారణమైతే, దాన్ని ఖండించరాదు. చికిత్సలేని దుర్భర వ్యాధిపీడితుడు జీవితాన్ని అంతం చేసుకొంటే, అతడు సానుభూతికే పాత్రుడౌతాడు.

కాని నిరాశ, నిస్పృహ, నిరుద్యోగం, జీవితం అర్ధరహితమైనది కావడం, మానసిక దౌర్బల్యం - ఇట్టివి ఆత్మహత్య కారణాలుగా పరిణమించిన దేశం సాంఘిక వ్యవస్థలోనో, దాని సంస్కృతీ సభ్యతలలోనో ఏదో లోపం కలదని తీర్మానించుకోవలసి ఉంటుంది.

ఇటీవల ఇద్దరు ప్రముఖులు ఆత్మహత్య చేసుకొనేసరికి, తమ సాంఘిక వ్యవస్థలో ఎక్కడ, ఏమి లోపం కలదో తెలుసుకొనడానికి యునైటెడ్ స్టేట్స్ ప్రభుత్వం ఒక విచారణ సంఘాన్ని నియమించాలని ఆలోచిస్తున్నది. ఇట్టి సంఘం మన దేశంలో కూడా అవసరమేమో! (ఆంధ్రప్రభ 10-6-1949)

ఇరవయ్యో శతాబ్దిలో నరబలి

మనది నాగరిక దేశమేనా? మనం జీవిస్తున్నది ఇరవయ్యో శతాబ్దిలోనా?

ఇటీవల దేశంలో జరుగుతున్న కొన్ని అమానుష సంఘటనల తర్వాత ఇట్టి ప్రశ్నలను పదేపదే వేసుకొన వలసివస్తున్నది.

ఇట్టి సంఘటనలలో సరికొత్తదే రాజస్థాన్ లో నరబలి. ఏదో ఒక చెరువు త్రవ్వకాన్ని ప్రారంభించడానికి ముందుగా ఒక కంట్రాక్టరు పన్నెండు సంవత్సరాల బాలుని బలిగా నరకడమో, నరికించడమో జరిగింది.

మతం పేర, ఆచారం పేర ఒక జంతువును బలిచేయడమే సంస్కారులైనవారు, నాగరికులైనవారు ఏవగించు కొనవలసిన చర్య. అయినప్పుడు, నరబలి ఎంత విపరీతం, ఎంతటి ఘోరం, ఎంతగా జుగుప్సాకరం!

ఇట్టి దారుణ సంఘటనలతర్వాత మహావీరుడు మా వాడని, గౌతమ బుద్ధుడు మా వాడని, మోహన్దాస్ కరంచంద్ గాంధి మా వాడని చెప్పుకొనడానికి ఒక జాతిగా మనం సిగ్గుపడవలదా? ఇంతే కాదు. ఇట్టి కర్కోటక సంఘటనల తర్వాత గాంధి శతజయంతి మనం జరుపుకొనడానికి కాని, దాన్ని జరపవలసిందిగా ప్రపంచాన్ని కోరడానికి కాని, మనకు ఎంతవరకు అర్హతగలదన్న ప్రశ్న వేసుకోవలదా?

ఇవి చెదురుమదురు సంఘటనలని మాకు తెలుసు. నూటికి 99.9 మంది వీటిని నిరసిస్తున్నారని కూడా మాకు తెలుసు. అయినా, ఒక జాతిగా మన దృక్పథంలో, మన విశ్వాసాలలో మన జీవితవిధానంలో ఏదో లోపం లేకపోతే, ఎక్కడనో దౌర్బల్యం లేకపోతే, ఏ మూలనో కొంత కర్కశత్వం దాగి ఉండకపోతే, చెదురు మదురుగానైనా ఇట్టి సంఘటనలు నేటికీ జరగగలవా? ఈ విషయమై మనం ఆత్మ సంశోధన చేసుకోవలసిన అగత్యం లేదా?

జరిగిన నరబలికంటె కూడా మరింత హేయమైన విషయం, దాని నుంచి రాజకీయ ప్రయోజనాన్ని సాధించడానికై కొందరు ప్రయత్నించడం! అయినా, ప్రస్తుతం ఇదే జరుగుతున్నది. నరబలికి పాల్పడిన కంట్రాక్టరు ఇదివరలో కాంగ్రెసు వారికి ధారాళంగా విరాళాలిచ్చి ఉన్నందున అతడిని కాపాడ్డానికి కాంగ్రెసు మంత్రులు ప్రయత్నం చేస్తున్నారని ప్రతిపక్షాలకు చెందినవారు ఆరోపిస్తున్నారు.

కాంగ్రెసు మంత్రులపట్ల మాకు ప్రత్యేకాభిమానం లేదు. వారిలో కొందరి ప్రవర్తన మా దృష్టిలో అతి నికృష్టం. అయినా, కాంగ్రెసు మంత్రులు నరబలిని కప్పిపుచ్చడానికి సిద్ధపడే స్థితికి దిగజారినారంటే మేము నమ్మలేకున్నాము. పైగా, ప్రధాని ఇందిరా గాంధి ఈ ఘోరకృత్యానికి పాల్పడినవారిని నిర్దాక్షిణ్యంగా శిక్షింపజేయాలని ప్రకటన చేసిన తర్వాత కూడా ప్రతిపక్షాలవారు తమ ఆరోపణలను చేయడం శోచనీయం.

కాగా, ఈ రాజస్థాన్ సంఘటన, ఇట్టి అమానుషచర్యలలో చిట్టచివరిది కాకపోతే, ఒక నాగరికదేశంగా ఇప్పటికే దెబ్బతిన్న మన ప్రతిష్ఠ మరింత నీరసించి పోతుంది; ప్రగతిశీలశక్తులు, వాటితోపాటు మానవతావాదం మన దేశంలో, పెరగడానికి మారుగా, శుష్కించిపోవడం తటస్తుంది. (ఆంధ్రజ్యోతి 19-9-1968)

అంతులేని దోపిడి(కంట్రోల్స్) 1

దారులు కొట్టేవారే ప్రజలను దోచుకొనే బందిపోటు దొంగలు కారు; వర్తక వ్యాపారాల పేరుతో ప్రజల కడుపుకొట్టేవారు కూడా బందిపోటుదొంగలే. కోరలున్నవారే రాక్షసులు కారు; దొంగలాభాలకోసం ప్రజల రక్తమాంసాలను పిండేవారు కూడా రాక్షసులే.

దారులు కొట్టకుండా ప్రజలను దోచుకొనే బందిపోటు దొంగ లేమి, కోరలులేకపోయినా ప్రజల రక్తమాంసాలను పిండుకు తాగి పొట్టలు పెంచు కొంటున్న రాక్షసు లేమి ఈ నాడు మన దేశంలో పెచ్చు పెరిగినందునే ప్రజాసామాన్యానికి కూడు, గుడ్డల కింతగా కటకట తప్పకపోవడం. కంట్రోల్సు అమలు జరుగుతుండగా కూడా దోపిడి తప్పలేదు: నెత్తురు కూటికై నాలుక చాచడం తప్పలేదు. కాని, అప్పటికీ ఆశ తగ్గలేదు, ఆకలి ఉడగలేదు. అందువల్లనే కంట్రోల్ తొలగింపుకు ఆందోళన చేసి, తమ పట్టుదల నెగ్గించుకొన్నారు. అంతటితో అసలే హద్దు మీరిపోయారు.

దీన్నిచూడగా కడుపు భగభగమండిపోబట్టే, వస్త్ర సమస్య పై మొన్న న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో ప్రధాని నెహ్రూ "రక్తపిపాసులు", "రాక్షసులు" మొదలైన కఠిన పదప్రయోగాలను చేయడానికి అణుమాత్రమైనా సంకోచించలేదు.

కంట్రోల్సు తొలగింపబడిన తర్వాత వస్త్రపారిశ్రామికు లేమి, వ్యాపారస్థులేమి, నూరుకోట్లు రూపాయలు మేరకు దేశాన్ని నిలువు దోపిడి చేశారట. జనవరి, జులై నెలల లోపల అదనపు దొంగలాభాల రూపంలో నూరుకోట్ల రూపాయలను వీరు దోచుకున్నది ఎవరినుంచి? చిరిగిన గుడ్డనైనా పారవేయడానికి చేతులు రాక-కాదు, ఓపికలేక, దాన్ని కుట్టి కుట్టి, కట్టుకునేవారి నుంచి కాదా? కట్టుడు చీర ఆరే లోపల కట్టుకోడానికి మరొక పాతచీర కూడా లేనందున, సగంచీర మొలనుండగా మిగిలిన సగాన్ని ఉతికి ఆరబెట్టుకొనేవారి నుంచి కాదా? "ఛీ! పీనుగు పై కప్పిన గుడ్డ కాదా?" అనే బెరకు సయితం లేకుండా చీకటి మరుగున గోరీలను తవ్వుకొనే వారినుంచి కాదా? చలికాలం మూడు నెలలు జైలుకు పోతే, కడుపుకింత కూడు, కట్టుకోడానికి గుడ్డలే కాకుండా, కప్పుకోడానికి వెచ్చటి కంబళికూడా దొరుకుతుందని కొద్దిశిక్ష పడగల నేరాన్ని దేనినైనా కావాలని చేసేవారినుంచికాదా? మనది పేదదేశం! దీనిలో పట్టెడు మెతుకులకోసం, చారెడు గుడ్డకోసం ఎంతమంది ఎంతగా అల్లాడుతున్నారు! అయినా, కొందరు ఎంతగా దోపిడి చేస్తున్నారు!! ఏమి దోపిడి చేస్తే మాత్రమేమి? ఒక దేవాలయం కట్టిస్తే, రెండు సత్రాలు పెట్టిస్తే, నాలుగు సంతర్పణలు చేస్తే, స్వర్గద్వారాలు తమకై విప్పుకోగలవు గదా ?

వస్త్రవ్యాపారులు గడచిన అయిదారు నెలలలో గడించిన దొంగలాభాలను కక్కిస్తామని మొన్నటి న్యూఢిల్లీ సమావేశంలో పండిట్ నెహ్రూ హెచ్చరించాడు. కాని, న్యాయంగా చెల్లించవలసిన పన్నులనే ఎగవేయగల సమర్థులు తాము దిగమ్రింగినదాన్ని తేలికగా కక్కబోరుగదా?

వస్త్రాల ప్రస్తుతపు విపరీతపు ధరలను తగ్గించడానికి మొన్న ప్రభుత్వం నిర్ణయించిన విధానం అంతగా జయప్రదం కాకపోవచ్చు. వస్త్రాలను సరసమైన నిర్ణీతపు ధరలకు రాష్ట్ర ప్రభుత్వాలు అమ్మించడం -ఇవే కొత్తగా నిర్ణయించిన విధానానికి ప్రధాన ప్రాతిపదికలు.

కొత్తవిధానం జయప్రదం కాకపోవచ్చు నేమో అని మేము శంకించడానికి ఈ ప్రాతిపదికలు శుష్కమైనవనడం కారణం కాదు. ఉన్నంతవరకు ఈ విధానం మంచిదే కావచ్చు. కాని, దొంగలాభాలపై మమకారం ఒక మహాజాడ్యంగా పరిణమించింది. దాన్ని అరికట్టాలంటే, కూడు గుడ్డలకు ప్రజలను కటకట పెట్టి దొంగలాభాలు గడించేవారికి ఉరిశిక్షను - కనీసం ద్వీపాంతరవాస శిక్షను - వేస్తామనడం అవసరం కాదా? (ఆంధ్రప్రభ 24-7-1948)

2

కంట్రోల్స్ ఈనాడు అవినీతికి మరొక పేరు, అన్యాయానికి పర్యాయపదం, కష్టాలకు హేతువు, నైచ్యానికి మూలం. కంట్రోల్స్వల్ల పంటను పండించే రైతు మొదలు, పండిన గింజలను కొనుక్కొని కాలక్షేమం చేసే గృహస్థువరకు అందరిదీ ఈనాడు అబద్ధపు బ్రతుకైపోయింది. పోతేవారు, చీకటి బజారులో పీఠం పెట్టినవారు, చేతిని బల్లకిందికి పోనిస్తున్నవారు మాత్రమే! ఇది కర్కోటకపు కాలమని, ముక్కును సూటిగా పోతే మాడు పగులుతుందని, పండిన పంటలో కొంత రైతు దాచి పెడుతున్నాడని అందరికీ తెలుసు "ఊరు పై ఊరుపడినా కరణంపై కాసు పడదు" కాబట్టి, వీలు చిక్కినప్పుడే నాలుగు డబ్బులు కళ్లజూడాలన్న ఆరాటంతో గ్రామాధికారులు పంటల అంచనాలను సందర్భానుసారంగా సిద్ధపరుస్తారని అందరికీ తెలుసు. రైస్ మిల్లర్లు, వర్తకులు వీరిపై పెత్తనం చెలాయిస్తున్న అధికారులు ఎవ రేమి చేస్తున్నదీ అందరికీ తెలుసు. కొట్టులో బియ్యాన్ని కొన్నమీదటనే కుండను పొయ్యిపైకి ఎక్కించు కొనవలసినవారు రేషన్ మెతుకులతోనే సరిపెట్టుకోవడం లేదనికూడా అందరికీ తెలుసు.

అయినా, ఎవరికి వారే ప్రస్తుతపు పరిస్థితులలో ఏదో ఒక విధంగా సరిపెట్టుకు పోవడం కంట్రోల్స్ రద్దువల్ల మరింతటి ఘోరపరిస్థితులు ఏర్పడగల వేమోనన్న భయసంకోచాలవల్లనే. ఈ భయసంకోచాల కారణంగా కంట్రోల్స్ విధానంలోని దోషాలను సహిస్తూ మిన్నకుండరాదని తీర్మానించగలిగినందునే మద్రాసు ప్రభుత్వపు కొత్త ఆహారవిధానం ధైర్యంతో కూడిందని మేము భావిస్తున్నాము.

తలవనితలంపుగా ఒడుదుడుకు లేర్పడి, చెడ్డ చిక్కులు రాకుండా కొత్త విధానంలో ఎక్కడి కక్కడ పెక్కు రక్షణ లున్నాయి. మొత్తం రాజధానిని ఆరు మండలాలుగా విభజించడం, తరుగు జిల్లాల పోషణబాధ్యతను, మిగులు జిల్లాలలో ఒక దానికో, రెండింటికో అప్పగించడం, మొదటికే మోసంగావున్న చౌక ధాన్యం డిపోలను నడపడం, ఇప్పుడు చేతిలోవున్న సరుకును అత్యవసర పరిస్థితు లేర్పడగలపక్షంలో వాటిని ఎదుర్కొనడానికి అట్టే పెట్టడం- ఇట్టివన్నీ కూడా రక్షణలుగా ఉద్దేశించబడినవే.

ఇన్నిరక్షణలు ఈ కొత్తవిధానంలో కానవస్తున్నా, ఇది జయప్రదం కావడానికి రెండు విషయాలు ముఖ్యం. ఒకటి, ప్రస్తుతం సర్వత్రా విశ్వసించబడుతున్నట్లు, ప్రభుత్వపు అంచనాలలో కనబడుతున్న దానికంటె చాలా హెచ్చుపంట రాష్ట్రంలో కలదనడం నిజం కావాలి. రెండు, - కంట్రోల్స్ పోనేపోయినవి కదా అని దురాశాపూర్వకంగాను, పాపభయరహితంగాను ఎవరికి వారు విచ్చలవిడిగా సంచరించరాదు. ఈ రెండవది నిజానికి చాలా పెద్ద ప్రమాదం. ఇందువల్లనే ఈ విషయమై రాజాజీ ప్రత్యేకించి ఒక విజ్ఞప్తిచేసి, సద్వర్తన, దేశభక్తి, పాపభీతి కొత్త ఆహారవిధానం జయప్రదం కావడానికి ముఖ్యావసరాలని హెచ్చరించాడు.

ఎంత ఎక్కువ కాలం నిల్వవేస్తే, అంత ఎక్కువ ధరకు అమ్ముకొనవచ్చునని రైతులు పాతరలను, గరిసెలను కదల్చకుండా మిగిల్చినా, రవాణాకు ఒడుదుడుకులు కల్పిస్తే, తమకు ఇబ్బడిగా లాభాలు రాగలవని మిల్లర్లు అవకతవకలు చేసినా, తిరిగి ఎప్పటికో ఇంతటి అవకాశమని వర్తకులు దురాశలకు పోయినా, ఎన్నాళ్ల కెన్నాళ్లకు మళ్లీ కోరినన్ని బియ్యమని తలొక ఇద్దుం, పందుం చొప్పున బియ్యం కొని గృహస్థులు నిల్వచేసుకొన్నా, కొత్త ఆహారవిధానం విఫలమై పోవడమూ తప్పదు; కంట్రోల్స్, వాటికి సంబంధించిన అన్ని వికారాల సమేతంగా, తిరిగి రావడమూ తప్పదు. (ఆంధ్రప్రభ 18-6-1952)

మాకు అర్థంకాని విషయాలు



ఉద్యోగాలంటే ప్రభుత్వోద్యోగాలే కావు. అయినా, అట్టి భావం మన దేశంలో ప్రబలంగా ఉండడం మన జాతీయదౌర్భాగ్యం. బ్రిటన్, ఫ్రాన్సులో, జర్మనీలో, జపాన్లో, సర్వతో ముఖాభివృద్ధి చెందిన అన్యదేశాలలో మరొక ఉద్యోగంలో ప్రవేశించగల ప్రజ్ఞాప్రాభవాలు తక్కువైనవారే ప్రభుత్వోద్యోగాలలో చేరతారు. ఒకవేళ తమకు ఇట్టి ప్రజ్ఞాప్రాభవాలున్నా, అన్యరంగాలలో ప్రవేశం లభించకపోతేనే ప్రభుత్వోద్యోగానికి అయిష్టంగా ప్రయత్నిస్తారు. ప్రభుత్వోద్యోగంలో కొంత స్తిమితం ఉండవచ్చు; స్థిరత్వం ఉండవచ్చు. కాని, దానిలో స్వాతంత్ర్యం తక్కువ; మౌలిక చింతనకు, ప్రతిభకు అవకాశం తక్కువ. ఇంతే కాదు, అవినీతికి పాల్పడితే తప్ప, దానిలో సంపాదనకూడా తక్కువే.

మరొక విషయాన్ని కూడా ఈ సందర్భంలో మనం గమనించాలి. మొత్తం ఉద్యోగాలలో ప్రభుత్వోద్యోగాల శాతం ఎంత తక్కువైతే, అంతగా ఏ దేశమైనా అభివృద్ధి చెందిందని, లేదా చెందుతున్నదని తీర్మానించు కొనవలసి ఉంటుంది. ఈనాటికి కూడా మన దేశంలో మొత్తం ఉద్యోగాలలో ప్రభుత్వోద్యోగాల శాతం అధికంగా ఉంటే, మన ఆర్థిక, పారిశ్రామిక, వాణిజ్యాది వ్యవస్థలు త్వరితంగా వృద్ధిచెందడంలేదన్న విషయాన్నే అది సూచిస్తుంది. ఏమైనా ప్రభుత్వోద్యోగాలను పెంచవలసిన మేరకు - ఆ మేరకు దాటిపోయికూడా పెంచివేశారు. "మంది ఎక్కువైతే, మజ్జిగ పలచన" అన్నట్టు, ఆఫీసులలో సిబ్బంది పెరిగినకొద్దీ వారు చేస్తున్నపని పలచబడుతున్నది కూడా.

ఇంతే కాక, ప్రస్తుతం ప్రజలనుంచి ప్రభుత్వం పన్నుల రూపంలో, శిస్తుల రూపంలో, సెస్సుల రూపంలో, సుంకాల రూపంలో, ఇతర రూపాలలో వసూలుచేస్తున్న మొత్తంలో అత్యధిక భాగం ఉద్యోగుల జీతనాతాలకిందనే చెల్లిపోతున్నది; ప్రజావసరాలను తీర్చడానికి మిగులుతున్నది కొన్ని సందర్భాలలో దాదాపు పూజ్యం. కాగా, మరి కొన్నింటిలో బహుస్వల్పం. అందువల్ల ప్రజావసరాలను తీర్చాలంటే ప్రభుత్వం రుణాలను చేయవలసివస్తున్నది. దీనితో నానాటికి మన రుణభారం పెరుగుతున్నది. పాత రుణాలను తీర్చడానికి కొత్త వాటిని చేయవలసివస్తున్నది కూడా.

ఏమైనా, ప్రస్తుత పరిస్థితులలో ప్రభుత్వోద్యోగాలకు అవకాశాలు తక్కువ. మన రాష్ట్రానికి సంబంధించినంతవరకు సాలుకు కొత్త ప్రభుత్వోద్యోగాలు బహుశా వెయ్యింటికి మించవు.

పైగా, వాటిలో దాదాపు సగం, సగానికి ఏపాటిగానో పైగాకూడా, నాల్గవ తరగతి ఉద్యోగాలే! వాటిని "ఉద్యోగా"లనడం కంటే "ఊడిగా"లనడమే ఎక్కువ సమంజసం! ఒక పది పరిశ్రమలను పెడితే, ఒక వెయ్యిమందికి కాక, మూడు నాలుగు వేలమందికైనా

ఉద్యోగాలు దొరుకుతాయి. ప్రభుత్వవ్యవస్థకు వెలుపల ఇట్టి ఉద్యోగాల కల్పనకై ఢిల్లీ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నది కూడా. ఇందుకు సంబంధించిన పథకంకోసం 1973-74వ సంవత్సరానికే ఆరు కోట్ల రూపాయలను అది మంజూరు చేసింది. ఈ సంవత్సరంలోపల దాదాపు 40 వేల మందికి కొత్త ఉద్యోగాలను చూపించడానికి కృషి జరుగుతున్నది. ఇటీవలి ఆందోళనలు, అలజడులు అడ్డురాకపోతే, ఈ పథకం ఈసరికే మరెంతగానో ముందుకు సాగి పోయి ఉండేది. అయితే, అవాంతరాలెన్ని వచ్చినా, ఈ పథకంకింద ఇప్పటికే 400 మందికి సహాయం చేయడం జరిగింది.

అయినా, కేవలం ప్రభుత్వోద్యోగాలకే లేనిపోని ప్రాధాన్యాన్ని ఎందుకిస్తున్నారో మాకు అర్థంకావడం లేదు. ప్రభుత్వోద్యోగాలు లేకపోతే, బ్రతుకే లేనట్టు ఎందుకు అలజడిచేస్తున్నారో మాకు అర్థంకావడం లేదు. వాటి విషయమై పెంచుకొంటున్న ఆవేశకావేషాలతో, రాష్ట్ర సమగ్రతను రక్షించడానికై ఏరాజీ పథకాన్ని సూచించినా, దాన్ని త్రోసిపుచ్చాలని కొందరు ఎందుకు పట్టుదల చూపుతున్నారో మాకు అర్థం కావడంలేదు. వీటికంటె కూడా మేము అర్థం చేసుకొనలేకపోతున్న విషయాలు కొన్ని ఉన్నాయి. రాష్ట్రంలో ప్రజలు లేరా, ప్రజానాయకులు లేరా? వీరుంటే, ఎన్.జి.ఓ. సంఘాలవారిని, ఆ సంఘాల నాయకులను కేవలం తామే రాష్ట్ర ప్రజలైనట్టు, ప్రజానాయకులైనట్టు వ్యవహరించనివ్వడం ఎందుకు జరుగుతున్నది? (ఆంధ్రజ్యోతి 27-9-1973)

ధర్మకర్తృత్వం

సర్వ ప్రపంచం స్వాతంత్ర్య నినాదంతో మార్మోగుతున్న ఇరవదవ శతాబ్దంలో కూడా పాలక, పాలిత జాతులుండడం అనాగరక లక్షణం.

కాని, చారిత్రక హేతువులను బట్టి చిరకాల పరాధీనత పాలైన కొన్ని దేశాలు ఇంకా స్వపరిపాలనకు అర్హతను గడించలేదన్న సాకుతో వాటిని ధర్మకర్తృత్వానికి లోబడ్డ దేశాలుగా, వాటిపై అధికారం చలాయించే పాలకజాతులను ధర్మకర్తలుగా మిత్ర రాజ్యసమితి పరిగణించింది.

ధర్మకర్తృత్వానికి లోనైన పరాధీన జాతుల ఆర్థిక, రాజకీయ, సాంఘిక, విద్యాభివృద్ధులకు తోడ్పడడం, ఆయా పరిస్థితుల కనుగుణమైన స్వపరిపాలనా సంస్థలను ప్రోత్సహించడం, అంతర్జాతీయ శాంతి, భద్రతలకు సాయపడడం ధర్మకర్తల ప్రధాన కర్తవ్యం.

మిత్రసమితి సభ్యత్వం కలిగి పైవిధంగా ధర్మకర్తృత్వాన్ని చలాయించే దేశాలలో బ్రిటన్, ఫ్రాన్సు, ఆస్ట్రేలియా, న్యూజిలెండ్, బెల్జియం, హాలెండ్ అమెరికాలు ముఖ్యమైనవి.

పరాధీన ప్రజల నుద్ధరించి, కడకు వారికి స్వాతంత్ర్యం కట్టబెట్టడమే ధర్మకర్తల పవిత్రాశయంగా పేర్కొనబడినా ఆ దేశాలలో ఇంతవరకు జరిగిన అభివృద్ధి మృగ్యమనే చెప్పవచ్చు.

పాలక వర్గాలు తమ స్వప్రయోజనాలను కప్పిపుచ్చి, ధర్మ కర్తృత్వం పేరుతో పాలిత ప్రజలను యధేష్టంగా కొల్లగొట్టడమే ఈనాటికీ అక్కడ జరుగుతున్నది.

అస్వతంత్ర దేశాల ప్రజలు స్వపరిపాలనార్హతను గడించుకొనడం ఏనాడో నిర్ణయం లేదు సరికదా,

ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో వారి అభివృద్ధి సయితం ఆశావహంగా లేదు. మిత్రసమితి ప్రణాళిక మహోద్దేశాల ననుసరించి పాలితజాతుల సముద్ధరణమే ధర్మకర్తలకర్తవ్యమైన పక్షంలో ధర్మకర్తృత్వ ప్రాంతాలలో జరిగిన అభివృద్ధిని గురించి మిత్రసమితికి నివేదించడానికి ధర్మకర్త రాజ్యాలు వెనుకాడవలసిన అవసరం లేదు.

ఈ నెల 22వ తేది మిత్రసమితి జనరల్ అసెంబ్లీ సమావేశంలో అస్వతంత్ర దేశాలలో జరిగిన స్వపరిపాలనా కృషిని గురించి సమితికి నివేదించడానికి బ్రిటన్, ఫ్రాన్సు, ఆస్ట్రేలియా, హాలెండ్, బెల్జియం వగైరా ధర్మకర్త రాజ్యాలు నిరాకరించాయి.

అంతేకాదు; ధర్మకర్తపరిపాలనకు లోబడిన ప్రజల స్వపరిపాలనకు అర్హతను గడించినారా లేదా అని నిర్ణయించగల అధికారం ధర్మకర్తలకేతప్ప మిత్ర సమితికి ఉండరాదని కూడా అవి వాదించాయి.

అయినప్పటికీ సమితి జనరల్ అసెంబ్లీలో అత్యధిక సంఖ్యాకులు ధర్మకర్త రాజ్యాల వాదాన్ని త్రోసివేసి నిర్ణయాధికారం మిత్రసమితికే కలదని తీర్మానించారనుకోండి. కాని, తీర్మానంపై జరిగిన వోటింగ్ ద్వారా ధర్మకర్త రాజ్యాల చిత్తవృత్తి మాత్రం అసందిగ్ధంగా బయట పడింది. పరాధీన ప్రజల స్వపరిపాలనార్హతను నిర్ణయించే అధికారం పాలక జాతులదేనని అంగీకరించిన పక్షంలో అస్వతంత్రులు స్వతంత్రులు కావడం ఏనాటికీ సంభవించదు. నేటి పాలకవర్గాలు శాశ్వత బ్రహ్మకల్పంగా ధర్మకర్తృత్వాన్ని చలాయించవలసే ఉంటాయి.

అందుచేతనే ధర్మకర్తృత్వ లక్ష్యాన్ని నిర్వచించడమే గాక, అస్వతంత్ర ప్రజలు ఎంత కాలంలో స్వతంత్రులు కాగలరో కాలపరిమితిని నిర్ణయించడం కూడా అత్యవసరమని ధర్మకర్తృత్వ సంఘ సమావేశంలో ఇండియా ప్రతినిధి శ్రీమతి లక్ష్మీమీనన్ స్పష్టపరిచారు.

అలాంటి స్పష్టీకరణ జరగనంతవరకు ధర్మకర్తృత్వం నేతిబీరకాయవలె నామమాత్రమేననీ, స్వార్థపరత్వమే ధర్మకర్తృత్వ సిద్ధాంతానికి అంతరార్థమనీ లోకం భావించక తప్పదు. (ఆంధ్రప్రభ 27-11-1954)

రత్నాల సీమ

(రాయలసీమలో 1951లో క్షామం ఏర్పడినప్పుడు ఆంధ్రప్రభ దినపత్రిక పూనుకొని ప్రజలకు పరిస్థితి వివరించి,

తనవంతు సాయం రామకృష్ణ మిషన్ ద్వారా కరువు బాధితులకు అందించింది.)

కరువు కాటకాలకు ఆటపట్టయిన రాయలసీమను ఉద్ధరించేందుకు రాజకీయ నాయకులు, ప్రభుత్వ మంత్రులు మున్నగు వారు తరుచు చేసే ప్రతిజ్ఞలకు మితి లేదు.

రాయలసీమ ప్రజల కష్టాలను వివరిస్తూ ప్రతివారు గాద్గద్యం వహిస్తారు, కంటతడి పెడతారు, కడవలతో కరుణరసం క్రుమ్మరిస్తారు. మూర్తీభవించిన శోక దేవతను సాక్షాత్కరింపజేస్తారు. కాని, ఆ గాద్గద్యం, ఆ కన్నీరు, ఆ కరుణరసం, అన్నీ రంగం మీద నిలిచినంతవరకే. రంగం వీడి నేపథ్యంలోకి వెళ్ళగానే నటుడు తన పాత్రను మరచి ఏవిధంగా తాను తానవుతాడో, అదేవిధంగా వేదిక దిగడంతోటే పూర్వక్షణంలో మాట్లాడిన విషయం వీరికి మరుపుకు వస్తుంది.

రాయలసీమలో చెరువులు మరమ్మతు చేయిస్తామన్నారు. కాలువలు పూడిక తీయిస్తామన్నారు. భూగర్భంలో నుంచి ఖనిజాలు వెలికి తీస్తామన్నారు. కరువు కాటకాలను దూరంగా తరిమివేస్తామన్నారు - ఒక్కటేమిటి, రాయలసీమ డెవలప్మెంట్ బోర్డు ద్వారా రాళ్ళ సీమను రత్నాల సీమగా మారుస్తామన్నారు?

కాని, నాటికీ నేటికీ రాయలసీమ పరిస్థితిలో మార్పు కనిపించదు. ప్రభుత్వం చేస్తున్న సహాయం ఏ మూలకు చాలడం లేదు. దారిద్ర్యం, నిరుద్యోగం పేదలను బలిగొంటూనే ఉన్నవి.

మా విలేకరులు పంపిన వార్తలనుబట్టి, కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలలో వర్షాభావం వల్ల క్షామ పరిస్థితులు తీవ్రరూపం దాల్చబోతున్నట్టు తెలుస్తుంది.

అనంతపురం జిల్లాలో గడ్డి కరువై ఇప్పటికే పశుగణం విశేషంగా నశించిందనీ, ఇంకెన్నో పశువులు చావుకు సిద్ధంగా ఉన్నవనీ, వర్షాలు లేక చెరువులు వట్టిపోవడం చేత ఆహారోత్పత్తి పూర్తిగా దెబ్బతింటుందనీ జిల్లా ఆహారోత్పత్తి సమావేశంలో పలువురు ప్రకటించారు.

కడప జిల్లాలో రాజంపేట, రాయచోటి, బద్వేలు తాలూకాలలో మెట్టపంటలే గాక, చెరువుల కింద వరిపొలాలు కూడా ఎండిపోతున్నవనీ, బావులలో తగినంత నీరులేక తాగునీటికి సైతం కరువేర్పడుతున్నదనీ వింటున్నాం.

కడప -కర్నూలు కాలవలో చాలినంత నీరు ప్రవహించడం లేదు. దిగువనున్న భూములకు నీరు అందడం లేదట. ఈ కాలవను వెడల్పు చెయ్యాలని, లోతు తియ్యాలని, తలుపులున్న తూములను ఏర్పాటు చెయ్యాలని ఎంతకాలంగానో సాగుతున్న ఆందోళనకు ఇంతవరకు ఆలనాపాలనా లేదు.

ఇక, చిత్తూరు జిల్లా స్థితి ఇదివరకే పాటు తప్పింది. తిండి గింజలు దొరకక ఈ జిల్లాలో పేదలు కలబంద, ఈతగడ్డలు తిని కడుపు నింపుకుంటున్నట్టు వినవస్తుంది.

ఐతే, ఇప్పటికైనా ప్రభుత్వం కొంత చలనం చూపడమేమి, రాయలసీమ సహాయార్థం ఎంత ధనమైనా వెచ్చించి ప్రభుత్వం ప్రజలను రక్షిస్తుందని ప్రకటించి, క్షామనివారణ ప్రణాళికను సిద్ధం చేయవలసిందిగా అనంతపురంలో రెవిన్యూ మంత్రి శ్రీ సీతారామరెడ్డి జిల్లా అధికారులకు ఉత్తరువు లివ్వడమేమి సంతోషించదగ్గ విషయాలు.

చిత్తూరు జిల్లాలో వర్షాభావం చేత పంటలు నష్టపడిన రైతులకు రుణమిచ్చే నిమిత్తం ప్రభుత్వం మూడు లక్షల రూపాయలను మంజూరు చెయ్యడం కూడా ముదావహమే.

ఇదే విధంగా కాటక పరిస్థితులు ఏర్పడిన అన్ని ప్రాంతాలలోను ముందు వెనుకలు చూడకుండా ప్రభుత్వం సర్వవిధాల సాయపడవలసిందిగా కోరుతున్నాం.

గంజి కేంద్రాలు విరివిగా నెలకొల్పడం, పశువుల మేతకు, ప్రజల తిండిగింజలకు డిపోలను స్థాపించడం, చెరువులకు మరమ్మతులు చేయించడం, తక్కావి రుణాలు మొదలైనవాటి ద్వారా రైతులకు సాయపడడం ప్రభుత్వం వెంటనే గైకొనవలసిన కొన్ని ముఖ్యమైన చర్యలివి. క్షామ నివారణకు సాయపడతామని ప్రభుత్వం సానుభూతి చూపితే చాలదు. సకాలంలో తగినంతగా ఆ సహాయం ప్రజకు అందేట్టు చూడడం ప్రధానం. (ఆంధ్రప్రభ 8-11-1951)

"ఆంధ్రప్రభ" క్షామ నివారణ నిధి





"అన్నమో రామచంద్రా!" అనే ఆక్రందనం మీకు వినబడ్డం లేదా? గుంటూరు, నెల్లూరు మెట్ట తాలూకాల వైపు తిరిగి చెవులు రిక్కించండి, ఆ ఘోష మీకు వినిపిస్తుంది. చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల దిశకు తిరగండి ఆ ఆర్తనాదం మీ హృదయాలను కంపింపజేస్తుంది.

లేదా? ఇంకా వినిపించడమే లేదా? కేవలం శ్రవణేంద్రియాలపై ఆధారపడితే వినిపించదు. మీ మెత్తని మనస్సును మరింత మెత్తబడ నివ్వండి; మీ జాలి గుండెను మరింత కరుణార్ద్రం కానివ్వండి - అప్పుడు మీ గుమ్మంలో కేకవలె, మీ సముఖంలో విజ్ఞప్తివలె సర్వం

మీకు వినిపిస్తుంది. అప్పుడు “అయ్యో!” అని మీ నోట అప్రయత్నంగా వెలువడుతుంది; అప్పుడు "ఈ కష్ట సమయంలో నా సోదరులకు నే నేమి చెయ్యగలను?” అనే తపన మిమ్ము దహించివేస్తుంది!

ఆకలి గొన్నవానికి అన్నం పెట్టడం మన రక్తంలో ఉన్నది. "భవతి భిక్షాం దేహి” అనే వానిని రిక్త హస్తాలతో పంపించి వెయ్యడం మన మత ధర్మానికే విరుద్ధం; మన సంస్కృతీ సంప్రదాయాలకు పూర్తిగా వ్యతిరేకం. అందువల్లే ఎవ్వరు కోరుకుండానే, ప్రత్యేకించి అర్థించకుండానే రాయలసీమలోను, గుంటూరు, నెల్లూరు జిల్లాలలో కొన్ని ప్రాంతాలలోను క్షామ సూచనలు ప్రబలినట్టు తెలుసుకున్నంతనే అనేక గ్రామాలలో ధన ధాన్య రూపాలలో విరాళాల సేకరణ ప్రారంభమైంది. “నోరూ వాయీలేని పశుసంతతి గుప్పెడు గడ్డిపరకలకు గతిలేక మలమలమాడి పోవలసిందేనా!" అని పశుగ్రాసం సేకరణ కూడా ప్రారంభమైంది.

ఇంతేకాదు, ఎన్నో సంస్థలవారు కూడా క్షామ నివారణ నిధులను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ సంఘం, కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ ఆంధ్రశాఖ, కృషీకార్ లోక్ పార్టీ ఆంధ్రశాఖ - అన్నీ కూడా ఈ నిధులను ప్రారంభించాయి.

ఇందుకు ఇన్ని నిధులను ప్రారంభించడం కంటే ఈ కృషిని ఏకోన్ముఖం చెయ్యడం మంచిది కాదా అనే అభిప్రాయ మొకటి కలదనుకోండి. కాని, ఒక సత్కార్యం విషయంలో - విశేషించి, అన్నాతురులను ఆపత్సమయంలో ఆదుకొనడం విషయంలో - ఎందరు ఎన్ని విధాల కృషిచేస్తే అంత మంచిది. పోటీ కూడకపోవడం సోదర మానవులకు సేవ చేయడం విషయంలో కాదు. ఈ దృష్టితోనే “ఆంధ్రప్రభ” తరపున క్షామ నివారణ నిధిని ప్రారంభించడానికి మేము నిర్ణయించాము. దీనికి సంబంధించిన ప్రకటనను నేటి సంచికలోనే వేరొక పుటలో చూడవచ్చు.

మా కృషి జయప్రదం కావడానికి ప్రతియొక్కరి సహాయ సహకారాలకు మేము విజ్ఞప్తి చేస్తున్నాము. మీ శక్త్యనుసారం ఈ నిధికి మీ కాన్కలను పంపించండి. వందలు, వేలు ఇవ్వగల ఉదారులు సంతోషంగా ఆ మొత్తాలను ఇస్తారనుకోండి. కాని, దయార్ద్ర హృదయంతో సమర్పించిన మొత్తం ఎంతైనా ఈ సందర్భంలో విలువైందే. అందువల్ల ఎవరి తాహతుకు తగినట్టు వారు, ఇది కొద్ది మొత్తమే అని సంకోచించకుండా, పంపించండి. మీ శక్తికి తగు విరాళాన్ని మీ రివ్వడమే కాకుండా మీ పట్టణాలలో, మీ పల్లెలో వాడవాడకు, గడప గడపకు తిరిగి విరాళాలను సేకరించి పంపించండి. మీరు దైవభక్తులైతే దీన్ని దైవభక్తి కార్యంగా పరిగణించండి; దేశభక్తులైతే, దేశసేవగా భావించండి.

శక్తివంచన లేకుండా జరిగినప్పుడు మీ కృషి - అది పరిమితమైనా - ఒక క్షుధార్తునికి ఒక పూట బాధోపశమనం కలిగించవచ్చు; లేదా, ఒక దాహపీడితునికి ఒకరోజు ఆర్తిని బాపవచ్చు; కానిచో, మృత్యుద్వారంలోనున్న ఏ గోమాత ప్రాణాలనో కాపాడినా కాపాడవచ్చు.

క్షామబాధా నివారణ ప్రధాన బాధ్యత ప్రభుత్వానిదే అనుకోండి. కోట్ల సంఖ్యలో వ్యయం జరగకపోతే, మన క్షామ ప్రాంతాలలో వెనుకటి బెంగాల్ విషాద గాథ తప్పదు. కాని, ప్రభుత్వ కృషికి తోడుగా పౌరులు కూడా ప్రాణోపద్రవంలోనున్న తమ తోటి పౌరులను ఆదుకోవాలి. కాబట్టి, మీ విరాళాలతో ముందుకు రండి. శిబి చక్రవర్తికి మేము వారసులమని చాటుకోండి; గాంధీజీని మరచిపోలేదని నిరూపించుకోండి.

(ఆంధ్రప్రభ 15-3-1952)

వ్యవసాయం: రైతు సమస్యలు

వ్యవసాయం - 1

(దేశంలో మూడొంతుల మంది వ్యవసాయంపై జీవనోపాధి గడుపుతున్నారు. పరిస్థితి నానాటికి దిగజారుతూంది. దీనిపై నార్లవారి స్పందనే ఈ సంపాదకీయ పరంపర.)



మనది వ్యావసాయిక దేశం. మన దేశ ప్రజలలో జీవిత నిర్వహణకు ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని పరిశ్రమలపై ఆధారపడుతున్నవారు నూటికి 10.7 వంతులైతే, వర్తక వ్యాపారాలపై ఆధారపడుతున్నవారు 7.1 వంతులైతే, ఉద్యోగాలపై ఆధార పడుతున్నవారు 1.6 వంతులైతే, ఇతర వృత్తులపై ఆధారపడుతున్నవారు 9.7 వంతులైతే, వ్యవసాయంపై ఆధారపడుతున్నవారు 70.9 వంతులు!

మొత్తం దేశ ప్రజలలో నూటికి దాదాపు 71 వంతులకు వ్యవసాయం తప్ప వేరు జీవనాధారం లేకపోవడమే మన దేశ దారిద్ర్యానికి ఒక ప్రధాన కారణం.

పరిశ్రమల ద్వారా మొత్తం జనాభాలో నూటికి కనీసం నలభై వంతులకైనా బ్రతుకుతెరవు కల్పించడం, ఆ మేరకు వ్యవసాయంపై ఒత్తిడి తగ్గించడం - మన దారిద్ర్య నిర్మూలనకు ఇదే మార్గమనడం నిస్సందేహం.

అయితే, మన దేశంలో ఎంతగా పరిశ్రమలను వృద్ధిచేసుకున్నా, ఇదివరలో వలె - ఇప్పటివలె - ఇక ముందుకూడా మనది వ్యావసాయిక దేశంగా ఉండక తప్పదు.

పంచవర్ష ప్రణాళికల ద్వారా సోవియెట్ రష్యా ప్రపంచ ప్రధాన పారిశ్రామిక రాజ్యమైనప్పటికీ, ఈ ప్రణాళికలకు పూర్వంలోవలె నేడు కూడా సోవియెట్ ప్రజలలో అత్యధిక సంఖ్యాకులకు వ్యవసాయమే జీవనాధారం. ఇంతే మన దేశంలో కూడా జరగగలదనడం తథ్యం.

ఎప్పటికైనా మనకు ప్రధాన జీవనాధారం కాగలదనే కారణం వల్లనే కాకుండా, అన్యకారణాలవల్ల కూడా వ్యవసాయాభివృద్ధిని గురించి అత్యంత శ్రద్ధవహించడం అవసరం.

ప్రస్తుతం మన జనసంఖ్య సాలుకు దాదాపు 50 లక్షల చొప్పున పెరుగుతున్నది. అంచేత 1960 నాటికి మన జనాభా 48 కోట్ల 90 లక్షలు కాగలదు.

ఈ జనాభా హెచ్చుదలకు అనుగుణంగా మన పంట పెరగడం లేదుగదా!

ఈనాడు మన 40 కోట్ల జనాభాకు కావలసిన ఆహారపదార్థాలనే మన దేశంలో పండించుకొన లేక, మనం విదేశాలనుంచి దిగుమతులపై ఆధారపడవలసి వస్తున్నది. ఈ దిగుమతులు చేయడంలో ఏ మాత్రం ఒడుదుడుకులు వచ్చినా, దేశంలోని ఏదో ఒక ప్రాంతంలో క్షామభీతికో, ప్రమాదానికో పాల్పడవలసి వస్తున్నది.

ఈ శోచనీయ పరిస్థితి నివారణకు వ్యవసాయాభివృద్ధే శరణ్యం.

కాగా, మన దేశప్రజలలో పెక్కుమంది కడుపునిండుగా తిండి తినడంలేదు. చాలీ చాలని ఆ తిండి కూడా తగినంత పుష్టికరమైనది కాదు. అందువల్లనే మనదేశంలో ఆయుః పరిమాణం చాలా తక్కువ; శిశు మరణాలు చాలా హెచ్చు. బ్రిటన్లో, యునైటెడ్ స్టేట్స్లో సగటు ఆయుర్దాయం అరవై నాలుగున్నర సంవత్సరాలైతే, మన దేశంలో ఇరవై ఆరున్నర సంవత్సరాలు మాత్రం. ఏడాది వయస్సు లోపలి శిశువుల మరణాల సంఖ్య ప్రతి వెయ్యికి బ్రిటన్లో 53 అయితే, యునైటెడ్ స్టేట్స్లో 48 అయితే, మన దేశంలో 167; పుష్టికరమైన ఆహారం సమృద్ధిగా లభించని కారణాన మనజాతి ఎంతగా నిర్వీర్యమై పోతున్నదో, మన దేశం ఎంతగా మృత్యుదేవతకు విహార స్థలమై పోతున్నదో ఈ అంకెలే నిరూపించడం లేదా?

ఈ దీనావస్థ నుంచి మనం బయటపడాలన్నా, వ్యవసాయాభివృద్ధిని గురించి అత్యంత శ్రద్ధవహించడం అవసరం.

భవితవ్య దృష్ట్యానే కాకుండా, తక్షణావసరాల దృష్ట్యాకూడా వ్యవసాయాభివృద్ధి విషయంలో అణుమాత్రమైనా విలంబన జరగడానికి వీలులేదు.

భారత ప్రభుత్వపు ఆహారశాఖా సభ్యుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఇటీవల హెచ్చరించినట్టు ఈ సంవత్సరం మనదేశంలో పండగల పంటలు పోను మనకు చేరగల దిగుమతులు పోను ముప్పై, నలభై లక్షల టన్నుల ఆహార పదార్థాలు కొరత పడుతున్నాయి.

ఈ కొరతను మనం తక్షణ వ్యావసాయికాభివృద్ధి ద్వారా తీర్చుకొనకపోతే, మనకు తిరిగి క్షామభీతి తప్పదు.

వ్యవసాయాభివృద్ధి జరగవలెనన్న నినాదం కొత్తది కాదు; చిరకాలం నుంచి ఇది జరుగుతున్నది; వంగరాష్ట్ర క్షామం తర్వాత ఈ నినాదం మరింతగా వినవస్తున్నది కూడా.


అయినా, వ్యవసాయంలో ఎన్నదగిన అభివృద్ధి ఎందుకు కానరావడంలేదు? "అధిక ఆహారోత్పత్తి ఉద్యమం" ఎంత ప్రచారం జరిగినా - ఎంత వ్యయం చేసినా - ఎందువల్ల పూర్తిగా సఫలీకృతం కాలేదు?

వ్యవసాయం విషయంలో ఇప్పుడు కానవచ్చే లోపాలేవి? వాటిని ఏ విధంగా తొలగించుకోవచ్చు. ఇవి అన్నీ కూడా తక్షణం మనం ఆలోచించ దగిన ప్రశ్నలే.

బ్రిటిష్ ఇండియా మొత్తంపై దాదాపు 30 కోట్ల ఎకరాల భూమి సాగు అవుతున్నది. బ్రిటిష్ ఇండియా జనాభా కూడా ఇంచుమించు 30 కోట్లు. తలకు ఒక ఎకరం చొప్పున సాగు అవుతున్నదని దీని తాత్పర్యం. అయినా, మనకు ఈ ఆహార సమస్య దేనికి? ఈ అర్థాకలి దేనికి?

(ఆంధ్రప్రభ 22-4-1947)

వ్యవసాయం - 2



మన దేశంలోని సాగు అవుతున్న 30 కోట్ల ఎకరాలలో వరి, గోధుమ మొదలైన ధాన్యాదులే పండనిమాట నిజం. పొగాకు, పసుపు, జనపనార మొదలైన వాణిజ్యపు పంటలు అనేకం పెట్టబడుతున్న మాటకూడా నిజం. అయితే, మన జనాభా 30 కోట్లలో శిశువులున్నారు, బాలబాలికలున్నారు. వీరి సంఖ్య కనీసం అయిదారు కోట్లకు తగ్గదనుకుంటే, వీరికి పెద్దవారికి కావలసినంతటి ఆహారం అవసరం లేదుగనక, వాణిజ్యపు పంటల కింద కొంత సాగుబడి భూమి పోయినప్పటికి మిగిలింది ప్రజలకు కావలసిన ఆహారపదార్థాలను కూర్చలేక పోవడానికి కారణ మేమిటి?

మనం సాగుచేసే ప్రతి ఎకరంనుంచి ఎంత పంటరాలాలో ఇందుకు కారణం ఒక్కటే. అది ఇది దానిలో సగమైనా మనకు రాలడం లేదు.

అమెరికాలో ఎకరానికి పండే వరిపంటలో మనకు పండుతున్నది ఇంచుమించు మూడోవంతు: కెనడాలో ఎకరానికి పండుతున్న గోధుమలో మనకు పండుతున్నది ఇంచు మించు సగం.

మనకు ఇంత తక్కువగా పంట రాలుతున్నందునే దాదాపు 30 కోట్ల ఎకరాలను సాగుచేస్తున్నా, మన ప్రజకు కడుపునిండుగా కూడులేక పోవడం.

అమెరికా, కెనడాలలోని భూమి కొన్ని వందల సంవత్సరాల నుంచే సాగు అవుతున్నది కావచ్చు; మన దేశంలోనిది కొన్ని వేల సంవత్సరాలనుంచి సాగుబడిలో నున్నది కావచ్చు. కాని, ఆ దేశాలకు, మన దేశానికి పంటలో ఇంత హెచ్చుగా వ్యత్యాసం రావడానికి భూసార మొక్కటే కారణం కాదు.

జపానులో భూమి కొన్నివేల సంవత్సరాల నుండి సేద్యం చేయబడుతున్నది. అయినా, మన దేశంలో ఎకరానికి పండే వరిపంటకు జపానులో అయిదురెట్లకు పైగా పండుతున్నది.

జపానురైతు పండిస్తున్న దానిలో అయిదవవంతును మాత్రమే మన రైతు పండించడానికి బలీయమైన ఒక హేతువు ఇరిగేషన్ సౌకర్యాల కొరత.

అదనం వానకురిస్తే పండినట్టు, లేకపోతే ఎండినట్టు ఇదే మన వ్యవసాయం.

ఇందుకు భిన్నం ఏమైనా ఉన్నదంటే, అది అనావృష్టి ఎంత ప్రమాదకరమౌతున్నదో, అతివృష్టి అంతకంటె కూడా పీడాకారం కావడమే.

సాగు - బ్రిటిష్ ఇండియా మొత్తంపై సాగు అవుతున్న 30 కోట్ల ఎకరాలలో 1938-39 నాటి అంచనాల ప్రకారం 5 కోట్ల 40 లక్షల ఎకరాలకే నీటివసరు ఉన్నది. తక్కిన పంట భూమి అవుతున్న దానిలో ప్రతి అయిదు ఎకరాలకు ఇంచుమించు నాలుగు ఎకరాలు వానదేవుని కృపపై ఆధారపడవలసినట్టిదే!

నీటివసరున్న 5 కోట్ల 40 లక్షల ఎకరాల భూమిలో కాల్వలకింద సాగు అవుతున్నది 2 కోట్ల 80 లక్షల ఎకరాలు మాత్రమే. మిగిలిన దానికి నూతులు, చెరువులు మొదలైనవే ఆధారం. భారత దేశంలోని క్షామకారణాలను విచారించడానికి నియమించబడిన ఉడెడ్ కమిషన్ వారి నివేదిక ప్రకారం బ్రిటిష్ ఇండియాలో కాల్వలకింద సాగు అవుతున్న భూమి విస్తీర్ణం 1922-1942 సంవత్సరాల మధ్య 7 కోట్ల 80 లక్షల ఎకరాల మేరకు హెచ్చింది. అయితే, ఈ హెచ్చుదలలో 6 కోట్ల 80 లక్షల ఎకరాలు యు.పి., సింధు, పంజాబ్ రాష్ట్రాలు మూడింటిలోనే.

ఏమైనా 1922-1942 సంవత్సరాల మధ్య కాల్వలకింద సాగు సౌకర్యాలలో అభివృద్ధి నూటికి దాదాపు 25 వంతులు మాత్రం. ఈ అభివృద్ధి ఇదే విధంగా సాగితే మరి నూరేళ్ళ నాటికైనా మన ఆహారసమస్య తీరబోదు!

మన జాతీయ యోగక్షేమాలకు అత్యవసరమైన ఆహారపదార్థాల స్వయం సంపూర్ణత్వాన్ని మనం త్వరలో సాధించాలంటే, రానున్న పది సంవత్సరాలలో మనకు గల ఇరిగేషన్ సౌకర్యాలు రెండు రెట్లు హెచ్చాలి.

ఈ లక్ష్యసాధన మన జాతీయ ప్రభుత్వపు ప్రధాన కర్తవ్యాలలో ఒకటి కావాలి; కాగలదుకూడా. మన మద్రాసు రాజధానికి సంబంధించినంతవరకు 19 కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికై కృషి జరుగుతున్నది. వాటిలో ప్రత్యేకంగా ఎన్నదగినవి రామపాదసాగరం, తుంగభద్ర, గండికోట ప్రాజెక్టులు. ఈ కొత్త ప్రాజెక్టుల ఫలితంగా పాతిక లక్షల ఎకరాలకు నీటివసరు ఏర్పడగలదని అంచనా వేస్తున్నారు.

అయితే, ఈ 19 ప్రాజెక్టులతోనే సంతృప్తిపడితే లాభంలేదు. వీటితోపాటు కొన్ని వందల మైనర్ ప్రాజెక్టులను కూడా కొనసాగించి తీరాలి. ఇంతేకాదు. పాత చెరువులను బావులను బాగుచేయించాలి; కొత్త వాటిని తవ్వించాలి.

కొత్త బావులను చెరువులను తవ్వుకొనడానికేమి, పాతవాటిని మరమ్మతు చేసుకొనడానికేమి మద్రాసు ప్రభుత్వంవారు ప్రస్తుతం రైతులకు కొంత సహాయం చేస్తున్నారు. అయితే ఈ స్కీమువల్ల ప్రయోజనం దీనికి కాగల వ్యయంలో కొంత స్వయంగా భరించుకొనగల రైతులకు మాత్రమే. అసలు శిస్తు చెల్లింపుకే ఒక దారిలేని పేద రైతులు విశేషంగానున్న పరిస్థితిలో ఇప్పటి స్కీము ప్రయోజనం పరిమితం. అంచేత ప్రభుత్వం వారు తామే స్వయంగా వీలైనన్ని నూతులను, చెరువులను తవ్వించడానికి పూనుకొనడం అవసరం.

రైతులకు నీటివసతుల సందర్భంలో జమీందారీలను గురించి చర్చించవలసింది ఎంతైనా కలదు గాని, ఆ విషయాన్ని జమీందారీ విధానాన్ని గురించి ప్రస్తావించేవరకు విడిచి పుచ్చవచ్చు. (ఆంధ్రప్రభ 23-4-1947)

వ్యవసాయం - 3

"ఇది మనకు లాభసాటి బేరమౌనా? కాదా?"

“మన జోక్యం కొన్ని వర్గాలకు క్రోధకారణమైతే, మనం లేనిపోని జోక్యాన్ని ఎందుకు కలిగించు కోవాలి?”

ఇదే విదేశీయ ప్రభుత్వపు మనస్తత్వం.

బ్రిటిష్ వారి "చల్లని పరిపాలన" దాదాపు రెండు వందల సంవత్సరాలు కొనసాగినా మనకు తగినంతగా ఇరిగేషన్ సౌకర్యాలు లభించక పోవడానికి మూలకారణం “ఇది లాభసాటి బేరమౌనా? కాదా?” అనే దృష్టే.

ఏదైనా ఒక ఇరిగేషన్ ప్రాజెక్టును గురించిన ఆలోచన ఆ ప్రాజెక్టుకు పెట్టవలసిన పెట్టుబడికి తగినంత వడ్డీ గిట్టగలదా అనే అంచనాతోనే ప్రారంభమౌతూ వచ్చింది.

అంతేగాని, ఈ ప్రాజెక్టువల్ల ఎన్ని ఎకరాలు కొత్తగా ఆయకట్టులో చేరగలవు? ఎంత ఎక్కువ పంట పండగలదు? అందువల్ల ఎంత మందికి జీవనాధారం ఏర్పడగలదు? - ఇట్టి ప్రశ్నలకు వడ్డీ గిట్టుబాటు అంచనాల కిచ్చిన ప్రాధాన్యంలో శతాంశమైనా ఇచ్చిన పాపాన మన విదేశీయ పరిపాలకులు ఎన్నడు పోలేదు.

బ్రిటిష్ పరిపాలనాకాలంలో అదివర కెన్నడు రానంతటి అధికంగా విస్తృతంగా - క్షామాలు రావడానికి ఈ వడ్డీ గిట్టుబాటు అంచనాయే కారణం.

క్షామాలు వచ్చిన తర్వాత వాటి తీవ్రతను అరికట్టడానికి బ్రిటిష్ వారు తమ పరిపాలనా కాలంలో వినియోగించిన మొత్తాలను పెడితే, మనకు ఇప్పటివాటికి రెండు, మూడు రెట్లు ఇరిగేషన్ సౌకర్యాలు లభించి ఉండేవనడంలో సందేహంలేదు.

ఇదివరలో ఏమి జరిగినా, ఇప్పుడిక బ్రిటిష్ వారి "చల్లని పరిపాలన" తొలగిపోగల సూచనలు కానవస్తున్నందున, వడ్డీ గిట్టుబాటు అయినా, కాకపోయినా, వీలైనన్ని చోట్ల, వీలైనన్ని ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకోవాలి. ఈ సందర్భంలో వ్యయాన్ని కాకుండా, శ్రమనుకూడా ఎంతమాత్రం పాటించరాదు.

పదిపుట్ల గింజలు ఎక్కువ పండితే ఒక కుటుంబానికి క్షుధార్తి నివారణ; దానికి ఆయురారోగ్యాలు; దానికి శాంతి సౌఖ్యాలు - ఇంత కంటే కోరదగిన దేమున్నది?

పైగా, ఈ ప్రయోజనాలు ఈ కాలానికీ, ఈ తరానికీ సిద్ధించేవేకావు; ఎల్లకాలానికీ, ఎల్లవారికీ సమకూడేవి.

కాగా, "మన జోక్యం కొన్ని వర్గాలకు క్రోధకారణమైతే, మనం లేని పోని జోక్యం ఎందుకు కలిగించుకోవాలి" అనే మనస్తత్వాన్ని బ్రిటిష్ వారి పరిపాలనా కాలంలో మన వ్యావసాయిక వ్యవస్థలో వచ్చిన ప్రతి అరిష్టదాయక పరిణామంలోనూ చూడవచ్చు.

స్వార్థాన్ని కోరి బ్రిటిషు వారు భారతీయ పరిశ్రమలను శిధిలంచేసినందువల్ల అంతకంతకు అధిక సంఖ్యాకులకు వ్యవసాయమే జీవనాధారం కాగా, ఒక్కొక్కరైతు ఏ రెండెకరాలతోనో, మూడెకరాలతోనో కాలక్షేపం చేయవలసిన దుర్గతి ఏర్పడింది.

ఇంతే కాదు. మన వారసత్వపు సాంప్రదాయాల కారణంగా నేమి, అన్యకారణాలవల్ల నేమి, ఆ రెండో, మూడెకరాలుకూడా ఒకే కొంద్రగా ఉండక, ఇక్కడొక చెక్కగా, అక్కడొక ముక్కగా చెదిరి పోవడం సంభవించింది కూడా.

వ్యవసాయం సరిగా జరగాలంటే - అది గిట్టుబాటు కావాలన్నాకూడా రైతుకు ఒక జతయెద్దు ఉండాలి. జతయెద్లకు సాలుపొడుగునా తగినంత పని ఉండాలంటే, కనీసం పదెకరాలకు కొంద్రనైనా సాగుచేయవలసి ఉంటుంది. కాని, మన దేశంలో నేడు కానవస్తున్నది, యెద్ల జత లేని వ్యవసాయం; లేదా, యెద్లజతకు తగినంత పనిలేని వ్యవసాయం. ఉదాహరణకు, మన రాష్ట్రంలోని రైతులలో నూటికి 74 మంది సగటున రెండెకరాల నలభై సెంట్లు సాగుచేస్తున్నవారే! ఈ సన్నకారు రైతుల సంఖ్య నానాటికి పెరిగిపోతున్నదేగాని, తరగడంలేదు కూడా. భారత క్షామ కారణాలను విచారించిన ఉడెడ్ కమిటీకి మద్రాసు ప్రభుత్వం వారు అందజేసిన భోగట్టా ప్రకారం గత 20 సంవత్సరాలలో పది రూపాయల కంటే తక్కువ శిస్తు చెల్లించే పట్టాల సంఖ్య నూటికి 69.5 వంతుల నుంచి నూటికి 76.5 వంతులకు పెరిగింది. ఎకరం, కుంట సాగుచేసే వారి సంఖ్య నానాటికి హెచ్చిపోతున్నదని దీని తాత్పర్యం.

కుంటనో, ఎకరాన్నో సాగుచేస్తే ఎలా కడుపునిండుతుంది? కడుపు నిండడం మాట ఏమైనా, వ్యవసాయపు ఖర్చులైనా ఏ విధంగా మళ్ళగలవు?

ఈ దుస్థితిని తొలగించనిదే మన రాష్ట్రానికి గాని, దేశానికిగాని క్షేమంలేదు.

పంట భూమి అంతకంతకు చిన్న చిన్న చెక్కలు కారాదంటే, ప్రతి రైతుకు ఒక జత యెద్లకు పూర్తి పనికలిగించ గలిగినంతటి కొంద్ర ఏర్పడాలంటే కొన్ని ముఖ్య సంస్కరణలను చేయడం అవసరం.

ఇట్టి సంస్కరణలు కొన్ని వర్గాలకు ఆగ్రహకారణం కాగలదని బ్రిటిషు వారు మిన్నకున్నారు గాని, మనం మాత్రం ఈ విషయమై ఔదాసీన్యాన్ని వహించలేము.

ఈ సందర్భంలో జరగదగు సంస్కరణల విషయమై విభిన్నాభిప్రాయాలున్నవి.

మన వారసత్వపు హక్కులను సంస్కరించాలనీ, అయిదెకరాలకు తగ్గే ఆస్తిలో అన్నదమ్ముల పంపకాన్ని నిషేధించాలనీ కొందరి అభిప్రాయం.

ఈ సంస్కరణ అతి తీవ్రమైనది గనుక, పరటాల ఏర్పాటు చేయడం చాలునని మరికొందరి అభిప్రాయం.

వారసత్వపు హక్కులలో మార్పులను చేసినా, చేయకపోయినా, పరటాల ఏర్పాటైనా మన రాష్ట్రంలో వెంటనే జరగాలి. ఈ విషయంలో పంజాబ్ ప్రభుత్వం అప్పుడే ముందడుగు వేసిందికూడా. ఇక్కడ ఒక కుంటను, అక్కడ ఒక సెంటును సాగుచేసేవారు పరటాలద్వారా తమ భూమిని ఏకఖండం చేసుకొనవలెనని పంజాబ్లో శాసనం జరిగింది. ఇట్టి శాసనాన్నే మన రాష్ట్రంలో - రైతు సమస్యకు సంబంధించిన సమగ్ర శాసనాలను చేయించడానికి మన ప్రభుత్వం పూనిక చూపుతున్న ఈ సమయంలో - తప్పక చేయించాలి. పంజాబ్ శాసనం ఫలితాలను పరిశీలించిన మీదట అవి తృప్తికరమైనవి కాకపోతే, చిన్న చిన్న రైతులందరు సహకార సంఘాలను స్థాపించుకొని, సమష్టిగా వ్యవసాయం సాగించుకొనవలెననే నియమాన్ని చేయించడం తగునేమో ఆలోచించాలి కూడా.

(ఆంధ్రప్రభ 24-4-1947)



4

ప్రజాబాహుళ్య క్షేమాన్నే లక్షించడం ప్రజా ప్రభుత్వం మనుగడకే ఎంత అవసరమో, ప్రజాబాహుళ్యాన్ని పీల్చి పిప్పిచేయడం పరప్రభుత్వానికి అంత అవసరం. ఒక జాతిపై మరొకజాతి పరిపాలనకు ఎక్కడైనా, ఎప్పుడైనా, ప్రధాన ప్రాతిపదిక దోపిడి మాత్రమే.

అయితే, ఏ పరప్రభుత్వం - అది ఎంత శక్తివంతమైనదైనా కేవలం స్వీయబలంపైనే ఆధారపడి ఒక జాతికి జాతినే దోచుకొనలేదు. అంచేత తాను దోచుకునే జాతిలో ఒక వర్గానికి అది తన దోపిడిలో కొంత భాగాన్ని పెడుతుంది.

మన దేశంలో మనలో నూటికి 90 మందిని దోచుకొనడంలో బ్రిటిష్ వారు తమ అండకు చేర్చుకున్నట్టి వారు మన రాజులు, మహారాజులు, మన నవాబులు, నవాబ్జాలు, మన జమీందారులు, జాగీర్దారులు, మన పెద్ద భూస్వాములు, గొప్ప భాగ్యవంతులు మొదలైనవారే. మొత్తం దేశాన్ని దోచుకొనడం, ఆ దోపిడిలోనుంచి కొద్ది మందికి భాగాన్ని పెట్టడం బ్రిటిషు వారు అనుసరించిన ఈ విధాన కారణంగానే మన దేశంలో దుర్భర దారిద్ర్యం సరసనే అపార భాగ్యభోగాలు కానవస్తున్నాయి.

సుప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె.టి. షా అంచనా ప్రకారం మన జాతీయాదాయాన్ని మూడుభాగాలు చేస్తే ఆ మూడుభాగాలలో ఒకదాన్ని జనాభాలో నూటికి కేవలం అయిదువంతులమంది అనుభవిస్తున్నారు; రెండవ భాగం జనాభాలో నూటికి 35 వంతులమందికి దక్కుతున్నది; వీరుపోగా మిగిలిన వారందరు - జనాభాలో నూటికి 60 వంతులమంది - ఆ మిగిలిన మూడవ భాగంతో కాలక్షేపం చేయవలసి వస్తున్నది.

కొద్ది మందికి - బహుకొద్ది మందికి - ఈ విధంగా భోగ్యభోగ్యాలను కూర్చి, మిగిలిన కోట్లకొలది ప్రజల రక్తమాంసాలను పిండి వేయడానికి బ్రిటిషు వారు వినియోగించిన విధానాలలో ముఖ్యమైనది వారి పన్నుల పద్ధతే.

ఉద్యోగస్థుడు, వ్యాపారస్థుడు మొదలైనవారు తమ సాలీనా ఆదాయం 2,500 రూపాయలకు మించనంతవరకు ఒక్క దమ్మిడీని కూడా ఆదాయం పన్నుగా చెల్లించ వలసినపని లేదు. ఇక, రైతు అయిన వాడు మొత్తం జనాభాలో మూడింట రెండు వంతులు రైతులే - ఒక్క కుంటను దున్ని, ఒక్క పందుంవడ్లను పండించిన భూమి శిస్తు కట్టవలసిందే.

అన్యవర్గాలతో పోల్చినప్పుడు రైతుకు ఈ విధంగా అన్యాయం చేయడమే కాకుండా, రైతులలో మోతుబరులకు లాభం చేసి, సన్నకారువారిపై విరుచుకుపడ్డం కూడా జరిగింది. ఎకరంవాడు పదిరూపాయల శిస్తు చెల్లిస్తే, నూరెకరాలవాడు వెయ్యి రూపాయల శిస్తు చెల్లించడం న్యాయంవలె స్థూలదృష్టికి కనబడవచ్చు.

కాని, ఎకరంవాని ఆదాయం వంద రూపాయలైతే, నూరెకరాల వాని ఆదాయం పదివేలు, నూరు రూపాయలలో పది పోతే, సంసారం గడవక గిజగిజలాడకతప్పదు. ఇక, పదివేలలో ఒక వెయ్యి పోతే అది అంత లెక్కలోనిది కాదు.

దీన్నిబట్టే బ్రిటిషు వారు అమలుపరచిన పన్నుల విధానం ఎంత అన్యాయమైనదో గ్రహించవచ్చు. ఈ అన్యాయాన్ని తొలగించడం మన ప్రజాప్రభుత్వాల ప్రధమ ధర్మం; ప్రధాన ధర్మం కూడా. తమ ఈ ధర్మాన్ని గుర్తించి, భూమిశిస్తు విధానాన్ని సమగ్రంగా సంస్కరించడానికి మద్రాసు ప్రభుత్వంవారు పూనుకొనడం హృదయపూర్వకంగా అభినందించ దగిన విషయమనడం నిర్వివాదం.

1945-46 సంవత్సరంలో మన రాష్ట్రంలో శిస్తులను సకాలంలో చెల్లించలేదని 21వేల 860 మంది రైతులకు జప్తు నోటీసులను అందజేయవలసివచ్చిందట. వీరిలో 3 వేల 262 మందికి వేలం నోటీసులను సయితం అందజేయ వలసి వచ్చిందట.

ఈ ఒక్క విషయాన్ని బట్టే - రైతు ఏదో బాముకుంటున్నాడని కొందరు అంటున్న ఈ రోజులలో కూడా శిస్తు చెల్లింపు ఎంత కష్ట సాధ్యమౌతున్నదో విదితం కావడం లేదా?

రైతులపై నుంచి మోయనలవికాని ఈ శిస్తు భారాన్ని తొలగించడానికి పూనుకొనే సందర్భంలో ముందుగా ఇప్పటి శిస్తు విధానానికే పూర్తిగా స్వస్తి చెప్పాలి.

దీని స్థానంలో ఎకరానికి ఇంత చొప్పున ఏదో ఒక నామమాత్రపు “క్విట్ రెంట్"ను ఏర్పరచాలి. ఆ “క్విట్ రెంట్” తప్ప మరిదేన్నీ ఏ అయిదో, పదో ఎకరాలకు లోబడిన రైతుల వద్ద నుంచి వసూలు చేయరాదు.

అంతకు మించిన భూస్వాముల వద్ద నుంచి రీతిగా - ఆదాయపు పన్నును రాబట్టాలి. వారి ఆదాయం ఆధిక్యత ప్రకారం హెచ్చుగల ఇట్టి సంస్కరణల వల్ల ల్యాండ్ రివెన్యూ తగ్గిపోవచ్చు. కాని, భూమి శిస్తుల వసూలుకు ఇప్పుడు నియోగించబడుతున్న సిబ్బందిని తగ్గించి వేయడానికి తగు మార్గాన్ని ఆలోచిస్తే, రివెన్యూబోర్డును ఎత్తివేయడానికి పూనుకుంటే, ల్యాండ్ రివెన్యూలో రాగల తగ్గుదలను భర్తీ చేసుకోవచ్చు.

ప్రజా ప్రభుత్వం కుదురు కున్నంతనే తమకు బహుశా స్వస్తి తప్పదని పసికట్టి కాబోలు, రివెన్యూ బోర్డు వారు తాము ప్రకటించిన 1355వ ఫసలీ నివేదికలో రివెన్యూ డిపార్ట్మెంట్ నిమిత్తం 1945-46లో 3 కోట్ల 62 లక్షల 63 వేల రూపాయలు ఖర్చు అయినప్పటికీ, రెవెన్యూ డిపార్ట్మెంట్ కేవలం శిస్తును వసూలు చేయడమే కాకుండా అన్య విధాల కూడా ఎంతో సేవచేస్తున్నదని నిరూపించడానికి యత్నించారు.

రెవెన్యూశాఖ వసూలు చేసే దానిలో రెవెన్యూశాఖకింద ఖర్చు నూటికి 38.14 వంతులు మాత్రమే అని చూపించడానికి సయితం ఈ నివేదికలో ప్రయత్నం జరిగింది. గాని, జమీందారులు చెల్లించే పేష్కస్ మొదలైనవి మినహాయిస్తే, ఈ ఖర్చు నూటికి 30 వంతులుకాక, దాదాపు 50 వంతులు;

ఈ అనవసర వ్యయభారాన్ని తగ్గిస్తే, కొద్దిపాటి రైతులను శిస్తు భారం నుంచి తప్పించడం కష్ట సాధ్యం కానేరదు.

(ఆంధ్రప్రభ 25-4-1947)



5

నేడు మనలను ఎదుర్కొంటున్న ఆహార సమస్యా పరిష్కారానికి కొత్త భూమిని సాగులోనికి తెచ్చుకొనడం మాత్రమే చాలదు; ఇప్పుడు సాగుబడిలో ఉన్నదానినుంచి ఎక్కువ ఫలసాయాన్ని తియ్యడం కూడా ముఖ్యావసరం.

మన దేశం మొత్తం విస్తీర్ణంలో ఇప్పుడు సాగుబడికింద ఉన్నది మూడింట ఒక వంతు మాత్రం. రైళ్లు, రోడ్డు, నదులు, కాల్వలు, కొండలు, అడవులు, గ్రామాలు, పట్టణాలు మొదలైనవాటి కింద పోవలసింది పోగా కూడా, ఇప్పుడు ఎంత భూమి సాగు అవుతున్నదో, మరి అంత సాగులోకి రావడానికి మన దేశంలో అవకాశం లేక పోలేదు.

అయినా, ఉడ్ హెడ్ కమిటీవారు తమ నివేదికలో పదేపదే హెచ్చరించినట్టు; కొత్త భూమిని సాగులోకి తీసుకురావడం ఎంత ముఖ్యమో, పాత దానిలో ఎక్కువ పంటను పండించుకొనడం అంత ముఖ్యం; నిజానికి మొదటిదానికంటే రెండవదే ఎక్కువ ముఖ్యమేమో కూడా!

కాని, ఈనాడు జరుగుతున్న దేమిటి? నానాటి కానాటికి మనకు ఒక గింజకు మరొకటి రాలడానికి బదులు, పంట తగ్గిపోతున్నది.

ఉడెడ్ కమిటీ నివేదికలో సర్ మణిలాల్ బి. నానావతి పేర్కొన్న అంచనాల ప్రకారం 1931-41 సంవత్సరాల మధ్య సగటున ఎకరానికి పండే వరిపంటలో బెంగాల్లో 59 పౌనులు, బీహారులో 62 పౌనులు తగ్గుదల కానవస్తున్నది. గోధుమపంట విషయంలో బొంబాయిలో 34 పౌనులు, సి.పి.లో 76 పౌనులు తరుగుదల కానబడుతున్నది. కేవలం ఈ రాష్ట్రాలలోనే కాకుండా, ఈ పంటల విషయంలోనే కాకుండా, ఈ తగ్గుదల అన్ని రాష్ట్రాలకు, అన్ని పంటలకు తరతమ భేదాలతో వర్తించ గలదనే భావించవచ్చు.

ఎక్కువ పంట పండించుకొనవలసిన పరిస్థితిలో మనకు రాలుబడి తగ్గిపోవడానికి ఒక ముఖ్య కారణం - భూస్వామి ఒకడైతే, దాన్ని సేద్యం చేసేవాడు మరొకడు కావడం అంతకంతకు హెచ్చిపోతూ ఉండడమే.

విదేశీయ పరిపాలన ఫలితంగా మన దేశంలో అనివార్యమైన ఒక విష పరిణామం భాగ్యవంతుడు మరింత భాగ్యవంతుడైపోవడం, పేదవాడు మరింత అధఃపతనం చెందిపోవడం. ఈ పరిణామం 1939-45 సంవత్సరాలమధ్య - ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామపు రోజులలో - మరింత బలీయమైపోయింది.

యుద్ధానికి పూర్వం పేదరైతుల భూమీ, పుట్రా చాలావరకు వడ్డీ వ్యాపారస్థులకు దక్కిపోతుండేది. యుద్ధపు రోజులలోనేమి, తర్వాత ఇప్పుడేమి దాన్ని లంచగొండిదారులు, దొంగ వ్యాపారస్థులు కట్టివేసుకుంటున్నారు.

అన్యాయార్జిత విత్తంతో ఈ విధంగా భూస్థితిని ఏర్పరచుకొనే వారిలో స్వంత వ్యవసాయాన్ని చేసేవారి సంఖ్య తక్కువ. వారికి వ్యవసాయం మీద అభిరుచి ఉండదు. వారు కాయకష్టం చేయగోరనివారు. పైగా, భూమిని కట్టుకొనడంలో వారి ఉద్దేశం కేవలం తాము పెట్టే పెట్టుబడిపై ఏదో ఒక విధంగా తగినంత వడ్డీని గిట్టుబాటు చేసుకొనడమే.

ఇంతేగాక, వంశ పారంపర్యంగా వ్యవసాయదారులైన వారిలో కూడా పాశ్చాత్య సంస్కృతిలోని అనర్థదాయక భాగాలపట్ల వ్యామోహం ప్రబలడం ద్వారా ఒక చిత్ర ప్రవృత్తి ప్రబలుతున్నది. ఇదివరలో ఒక ఏడు గిట్టిన, ఒక ఏడు గిట్టకపోయినా వ్యవసాయదారుడైనవాడు వ్యవసాయం చేయడంపట్ల ప్రేమాభిమానాలను ప్రదర్శించేవారు. ఇక, ఈనాడు అనువంశికంగా వ్యవసాయదారులైనవారు కూడా "ఎడ్లను కొనడానికి ఎంత అవుతుంది? పాలేళ్ళకు ఎంత అవుతుంది? ఆకుమడికి, ఊడ్పుకు, కలుపుకు, కోతకు, కట్టుబడికి, నూర్పిడికి, ఎంత అవుతుంది?" అని లెక్కలు వేస్తున్నారు. ఈ లెక్కల ప్రకారం స్వంత సాగుచేయడంకంటె కట్టుబడికివ్వడమే లాభసాటి గనక, తమ భూములను కట్టుబడి కిచ్చివేస్తున్నారు.

కారణాలు ఏమైనా గాని, స్వంత కమతాలు తగ్గిపోతున్న మాట...కట్టుబడి కిచ్చివేయడం హెచ్చిపోతున్నమాట... నిజం.

స్వంతపొలంకంటె కట్టుబడి పొలంలో పంట తక్కువకాక తప్పదనడం కూడా నిజమే.

వేరే ఆధారంలేనివాడుగాని సర్వసాధారణంగా కట్టుబడి చెయ్యడు. దార్ఢ్యం ఇంతగా తక్కువైన వాడు భూమిని బలంచేయడానికి తగినంత వెచ్చించలేడు.

ఒకవేళ తల తాకట్టు పెట్టి, భూమిని అతడు సత్తువ చేయడానికైనా ఎంతకాలంపాటు అది తనకింద ఉండగలదో అతనికి సర్వసాధారణంగా తెలియదు.

నమ్మి చేతనైనంతవరకు దేవులాడి, పుట్టికి మరొకపుట్టి పండిస్తే, భూమి ఖామందు కట్టుబడిని పెంచమంటాడు.

ఇన్ని భయ సంకోచాలతో కూడిన వ్యవసాయం ఏవిధంగా రాణిస్తుంది? అంచేత భూస్వామికి, కౌలుదారుకు ఎట్టి సంబంధ బాంధవ్యాలుండదగునో నిర్వచించడానికి తగు శాసనాలన్ని తలపెట్టిన మద్రాసు ప్రభుత్వంవారిని సంస్తవనీయులని వేరుగ చెప్పవలసిన పనిలేదు. ఎవరు వ్యవసాయాన్ని చేస్తున్నారో వానిదే భూమి కావాలని, పట్టాదారైన కారణాన భూస్వామి అయిన వానిని పూర్తిగా తొలగించాలని ఈ సందర్భంలో కొందరి అభిప్రాయం.

కాని, ఇంత విప్లవకర సంస్కరణకు దేశం ఈనాడు సంసిద్ధంగానున్నట్టు తోచదు.

అంచేత భూమిని కవులు కిచ్చినప్పుడు అది కనీసం ఏ పది సంవత్సరాలకో కవులుగా ఉండాలని ఒక నియమాన్ని చేయడం అవసరం.

కాగా, కష్టపడినవానికి సగం ఫలితమైనా దక్కడం న్యాయంగనక, అన్ని వ్యవసాయపు ఖర్చులు పోగా, మిగిలిన దానిలో సగంపాటు కట్టుబడిదారుకు పోవాలనే నియమాన్ని పెట్టడంకూడా అవసరం.

ఈ ఆచారం ఇదివరలో "సంగోరు" అనే పేరుతో మన ప్రాంతాలలో అమలులో ఉన్నట్టు కానవస్తుంది కూడా.

ఈ "సంగోరు" పద్ధతిని గాంధీజీ కూడా ఇటీవల సమర్థించి ఉన్నాడు. దీన్నే మద్రాసు ప్రభుత్వం వారు తాము చేయగల శాసనాలు అనుసరించగలరని ఆశిస్తున్నాము.

రామపాదసాగర్

*(సుజలాం సుఫలాం మలయజ శీతలాం, సస్యశ్యామలాం" అని మన రాష్ట్రాన్ని అనుకోకుంటే రామపాదసాగర్ ప్రాజెక్టు నిర్మించాలని **1947**లో శాంతి రామమూర్తిపంతులుగారి సూచనను సమర్థిస్తూ రాసింది.)*

"సుజలాం" అని మహాకవి బంకించంద్రుడు మన దేశాన్ని కీర్తించాడు. దీనిలో అత్యుక్తిలేదు. గంగ, సింధు, యమున, బ్రహ్మపుత్ర, గోదావరి, కృష్ణ, తుంగభద్ర, కావేరి, నర్మద, తపతి మొదలుగాగల మహానదీ నదాలు మన కెన్ని లేవు. అంచేత మన దేశాన్ని "సుజలాం" అని కీర్తించడం ఎంతైనా సముచితం.

అయితే, "సుజలాం" అని కీర్తించదగు భూమి ఎంత "సుఫలాం" కాదగునో, ఎంతగా "సస్యశ్యామలాం" కాదగునో, అంత శోభస్కరంగా మన దేశం లేదు. ఇందుకు కారణం - మన నదీనదాల నుంచి పొందవలసిన ప్రయోజనాలను పూర్తిగా పొందలేకపోవడమే.

ఎన్నో నదులకు ఈనాటికీ ఆనకట్టలు లేవు. కొన్నింటికి ఆనకట్టలున్నా, వాటి ప్రవాహంలో నూటికి ఎనభై, తొంభై వంతులు సముద్రంపాలే. ఈనాడు పూర్తిగా వినియోగంలోకి వచ్చినట్టు చెప్పదగింది బహుశా ఒక్క కావేరి మాత్రమే.

నూరేళ్ళనాడు, రెండు వందల సంవత్సరాలనాడు పెద్ద పెద్ద ఆనకట్టలు లేకపోయినా, ఇరిగేషన్ ప్రాజెక్టులు లేకపోయినా, అది విపరీతం కాదు. నాటికి నేటివలె ఇందుకు సంబంధించిన ఇంజనీరింగ్ వృద్ధి పొందలేదు. నదీ ప్రవాహాన్ని నూటికి నూరుపాళ్ళు వినియోగంలోకి తెచ్చుకోగల శక్తి మానవునికి లభ్యమైంది గడిచిన యాభై, నలభై సంవత్సరాలలోనే.

ఈ సమయంలో మన దేశాన్ని పరిపాలించిన బ్రిటిష్ ప్రభుత్వం మన జాతీయవాంఛలపై యుద్ధం చేయడంతోను, జర్మనీ, ఇటలీ, ఆస్ట్రియా, టర్కీ, జపానులపై యుద్ధం చేయడంతోను పొద్దుపుచ్చిందే గాని, ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయమై తగు శ్రద్ధ పుచ్చుకోలేదు.

విదేశీయ ప్రభుత్వం ప్రదర్శించిన ఈ ఔదాసీన్యం వల్ల ఇరిగేషన్ సౌకర్యాలలో పెంపుదల నిలిచిపోయినా, జనాభా పెంపు ఆగలేదు. గడిచిన అర్ధ శతాబ్దంతో మన జనాభా దాదాపు రెట్టింపు పెరిగిపోయింది.

జనాభా దాదాపు రెట్టింపు కావడం, ఇరిగేషన్ సౌకర్యాలు నిలకడగా నిలిచిపోవడం - ఇందువల్లనే ఈనాడు మనం ఇంతగా ఆహార పదార్థాలకై గిజగిజలాడవలసి వస్తున్నది; ఇంతగా క్షామ ప్రమాదాన్ని ఎదుర్కొనవలసి వస్తున్నది.

"కూటికి లేక చచ్చేవారుంటారా?" అనే జనవాక్యం ప్రబలిన మనదేశం విదేశాలనుంచి ఆహార పదార్థాలకోసం అంగలార్చవలసిన దుస్థితికి దిగజారింది.

సయాంలో బాగా పండితే, మన పొయ్యిలో పిల్లి లేచినట్టు; లేకపోతే, లేనట్టు.

ఈ శోచనీయ పరిస్థితి మనకు తప్పడం రామపాదసాగర్, తుంగభద్ర, సంగమేశ్వరం, వైన్ గంగ, రామగంగ, దామోదర్ వ్యాలీ, మహానది వ్యాలీ, దుదుమ, యమునా హైడ్రో ఎలక్ట్రిక్ మొదలైన ప్రాజెక్టులను మనం పూర్తిచేసుకొనగలిగినప్పుడే.

రామపాదసాగర్ ప్రాజెక్టును పూర్తిచేసిన పక్షంలో - శ్రీ శొంఠి రామమూర్తి పంతులుగారు నేడు తమ అధ్యక్షతను రాజమహేంద్రవరంలో ప్రారంభమైన రామపాదసాగర్ మహాసభలో వివరించినట్టు - పది లక్షల టన్నుల ధాన్యం అదనంగా పండగలదు; రెండు లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి కొత్తగా లభ్యం కాగలదు.

ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి పన్నెండు సంవత్సరాలు పట్టవచ్చు; 86 కోట్ల రూపాయలు ఖర్చుకావచ్చు, కాని, "న్యూ ప్రాజెక్ట్స్ ఫర్ ఇరిగేషన్ అండ్ పవర్" అనే పేరుతో కొత్తగా ప్రచురించబడిన కరపత్రంలో సెంట్రల్ ఇరిగేషన్ బోర్డువారు తెలిపినట్టు, రామపాదసాగర్ కింద ఒక్క సంవత్సరం పండగల అదనపు పంటవల్లనే 24 కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది!

ఇంతటి ఘనఫలితాల నిచ్చే ఈ ప్రాజెక్టు పూర్తి కావడం వల్ల (శ్రీరామమూర్తి పంతులుగారు చెప్పినట్టు) దాని పరిసర ప్రాంతాలే కాకుండా, యావద్భారతమే సౌభాగ్యవంతం కాగలదు. ప్రభుత్వోద్యోగంలో నున్నప్పటివలె దాని నుంచి విరమించిన పిమ్మట కూడా రామపాదసాగర్ విషయమై ఎంతో శ్రద్ధాసక్తులను ప్రదర్శిస్తున్న శ్రీ రామమూర్తి పంతులుగారు ప్రతి భారతీయుని ధన్యవాదాలకు పాత్రులనడం నిస్సందేహం.

"సుజలాం, సుఫలాం, మలయజశీతలాం, సస్యశ్యామలాం" అని మహాకవి బంకించంద్రుడు మాతృదేశాన్ని గురించి మన మనఃఫలకాలపై చిత్రించిన మధుర చిత్రం వాస్తవరూపాన్ని ధరింపజేయడానికి శ్రీ రామమూర్తిపంతులుగారు చేస్తున్న మహాతపస్సు ముక్తాఫలమే, రామపాదసాగర్ ప్రణాళిక.

ఆ ప్రణాళిక సంపూర్తిగా, సత్వరమే సఫలీకృతం కావలెనని ఆశిస్తున్నాము; కాగలదని విశ్వసిస్తున్నాము.

(ఆంధ్రప్రభ 29-8-1947)

భూదాన యజ్ఞం



వినోబాజీ సాధించిన - సాధిస్తున్న విజయం అపూర్వమైనదే! "మీ కడుపునే మరొక కొడుకు పుడితే, అతడికి మీ ఆస్తిలో భాగం పెట్టరా? చెమటోడ్చి, బంగారం పండించడానికి సిద్ధంగా ఉన్నా, చేరెడు నేల లేక మీ పల్లెలోనే ఉసూరుమంటున్న పేదవాడు మీ కడుపునే పుట్టినాడని అనుకోండి. అతడికీ మీ బిడ్డలతోపాటుగా మీ కొంద్రలో భాగం పెట్టండి" అంటూ వినోబాజీ ప్రారంభించిన ప్రచారం దేశవ్యాప్తమైన ఒక మహోద్యమం కాగలదని కాని, అది ఫలితాలను సాధించగలదని కాని ఎక్కువమంది అనుకోలేదు. ఇంతేకాదు, కేవలమొక వెర్రివెంగళప్పకింద వినోబాజీని జమకట్టి, ఆయనను నవ్వినవారు కూడా కొందరు లేకపోలేదు. భూదానోద్యమ ప్రారంభంలో వినోబాజీని నవ్వినవారైనా, ఆయన అపూర్వ విజయాలను సాధిస్తున్నాడని ఈనాడు అంగీకరించక తప్పదు. తాను తలపెట్టిన పవిత్ర యజ్ఞానికి 1953 జూన్ 12వ తేదీనాటికి వివిధ రాష్ట్రాలలో ఆయన సేకరించగలిగిన భూమి 13 లక్షల అరవై వేల ఎకరాలు. ఆయన స్వయంగా పెట్టుకున్న లక్ష్యానికి ఇప్పటికి సేకరించిన ఈ భూవిస్తీర్ణం చాలా తక్కువే అనుకోండి. అయినా, ఇప్పటికే ఆయన ప్రారంభించిన యజ్ఞం తన మహోత్కృష్టతను నిరూపించుకొన్నదనడం మాత్రం నిర్వివాదం. అయితే, ఆచార్య కృపలానీ, శ్రీ జయప్రకాశ్ నారాయణ్ ప్రభృతులు ఉద్ఘాటిస్తున్నట్టు, భారతదేశంలోని భూస్వామ్య సమస్యలన్నింటికి ఇదొక్కటే పరిష్కారమార్గం కాజాలదు. తక్కిన పరిష్కార మార్గాలతో ఇది కూడా ఒకటి. పండిట్ నెహ్రూ కూడా భూదాన యజ్ఞ ప్రసక్తి ఈ మధ్య లండన్లో వచ్చినప్పుడు భూస్వామ్య సమస్యా పరిష్కారానికి వినోబాజీ కృషి “కొంతవరకు తోడ్పడగల” దని మాత్రమే అన్నాడు.

చిత్తసంస్కారంపై, హృదయౌదార్యంపై ఆధారపడింది వినోబాజీ మహోద్యమం. కాని, నిజంగా చిత్తసంస్కారు లైన వారెంతమంది? ఉదారహృదయులెంతమంది? పోనీ, ఈ గుణగణాలు లోపించినా, "వినోబాజీ సలహాను పాటిస్తే, రష్యా, చైనాలలో వచ్చిన రక్తపాత పూరితమైన విప్లవం మన దేశానికి తప్పిపోగలదు" అని గుర్తించగలపాటిగానైనా దూరాలోచన చేయగలవారెంతమంది?

కాబట్టి, చట్టరీత్యా జరగవలసిన భూస్వామ్య సంస్కరణలు జరిగి తీరవలసిందే : అయితే, ఇప్పుడు వినోబాజీ యజ్ఞాన్ని సమర్థించడంవల్ల చట్టరీత్యా జరగవలసిన సంస్కరణలు మరింత సులభంగా జరుగుతాయి.

చట్టరీత్యా సంస్కరణలు జరగకుండానే భూస్వామ్య సమస్య పరిష్కారం కావాలంటే, వినోబాజీ యజ్ఞానికి ఈ సరికి 13 లక్షల అరవై ఎకరాలు కాక, ఒక కోటి 30 లక్షల అరవై వేల ఎకరాల భూమి లభించి ఉండవలసింది!

(ఆంధ్రప్రభ 27-6-1953)

పర్వదినం

(విజయవాడ కృష్ణానదిపై రెగ్యులేటరు, రోడ్డు బ్రిడ్జిని ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకాశం పంతులుగారు శంకుస్థాపన చేసినరోజు. దీన్నే తదుపరి ప్రకాశం బ్యారేజ్ అన్నారు.)

ఆంధ్రావనికి తక్కిన సహజ సంపదలన్నీ ఒక ఎత్తు, ప్రకృతి ప్రసాదించిన మహావరాలు గోదావరి, కృష్ణా, తుంగభద్రలు మూడూ ఒక ఎత్తు.

చరిత్ర కనువిప్పినది మొదలు ప్రాచీనాంధ్రజాతి విజ్ఞాన నాగరికతలు, కళాసాహిత్యాలు, వ్యాపార వాణిజ్యాలు, వేయేల? మహోజ్జ్వలమైన ప్రాచీనాంధ్ర వైభవం సమస్తంపై మూడు జీవనదుల నంటిపెట్టుకుని వర్ధిల్లిందనడం అతిశయోక్తి కాజాలదు.

పడమటి కనుమలలో తనువుదాల్చి, బొంబాయి, హైదరాబాదు రాష్ట్రాలలో పర్యటనసల్పి, తెలుగు మాగాణాన్ని నందనవాటికగాజేసి విజయవాడ సమీపాన సముద్రుని చేరుకుంటున్న కృష్ణవేణమ్మ తల్లి కొత్తసొమ్ములు తొడుగుకొనడం చేత తెలుగువారికి నేడు పర్వదినం.

విజయవాడవద్ద కృష్ణానదిపై రెగ్యులేటర్, రోడ్డు బ్రిడ్జికి ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ప్రకాశం పంతులుగారిచే నేడు శంకుస్థాపన మహోత్సవం జరుగుతున్నది.

1792లో మేజర్ బీట్సన్ కృష్ణ ఆనకట్టను తలపెట్టని పక్షంలో, దక్షిణాదిని కావేరీనదిపై కట్టబడిన ఆనకట్టల అనుభవంతో చాలీచాలని పరికరాలతో ఆ ప్రజ్ఞానిధి విస్తృత పరిశోధనలను కొనసాగించని పక్షంలో, గోదావరినది ఆనకట్ట నిర్మాత సర్ ఆర్థర్ కాటన్ కృష్ణ ఆనకట్ట విషయమై కూడా అప్పటి ప్రభుత్వాన్ని తొందరపెట్టని పక్షంలో, కాటన్ దొర కృషి ఫలితంగా కెప్టెన్ ఆర్ 1852లో ప్రారంభించి 1855లో ఆనకట్ట నిర్మాణం పూర్తిచేయని పక్షంలో, కృష్ణానది నీటిలో ఇప్పటివలె నూటికి ఆరుపాళ్ళయినా ప్రజకు వినియోగం కాకుండా పొయ్యేదే.

కృష్ణాడెల్టాలో ప్రస్తుతం 12 లక్షల ఎకరాల భూమిని సస్యశ్యామలం చేస్తున్న ఈ ఆరుపాళ్ళ నీరైనా, ఆనకట్ట తొలి నిర్మాణం నుంచి గాక, అప్పుడప్పుడు దానికి జరిగిన కూర్పులు చేర్పులవల్ల క్రమంగా వృద్ధిచెందింది.

మరొక సంవత్సరంతో కృష్ణ ఆనకట్టకు నూరేళ్ళ ఆయుర్దాయం నిండుతుంది. అంతేగాక, ఆయకట్టు పెరిగిన కొద్దీ నీటి సరఫరాను పెంచవలసి రావడం, తాత్కాలిక సాధనలద్వారా అధికజలాన్ని వినియోగ పరచుకొనడంలో, ఆనకట్ట క్రమంగా దెబ్బతినడం, అధికారులు శ్రద్ధవహించి సకాలంలో మరమ్మతులు కొనసాగించకపోవడం, వీటన్నిటినీబట్టి ఈనాటికి ఇంత మాత్రంగా, ఆనకట్ట నిలిచి ఉండడమే విశేషం.

అయితే 1952లో ఆనకట్ట మరమ్మతుల నిర్వహణ సందర్భంలో జరిగిన విషాద సంఘటన ప్రభుత్వం దృష్టిని తప్పనిసరిగా ఆకర్షించి రెగ్యులేటర్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణాన్ని అనివార్యం చేసింది.

రెగ్యులేటర్ నిర్మాణంవల్ల మరొక లక్ష ఎకరాల భూమికి నీరు అందజెయ్యడానికి; మొత్తం ఆయకట్టులో దాదాపు సగభాగానికి రెండవ పంటకు నీరు అందించడానికీ సాధ్యం కాగలదు. ఇక రెగ్యులేటర్తో పాటు రోడ్డు బ్రిడ్జిని కూడా నిర్మాణం చెయ్యడం వల్ల ఖర్చు చాలా వరకు కలిసిరావడమేగాగ ప్రజల రాకపోకలకూ, సరుకుల రవాణాకు సౌలభ్యం ఏర్పడి ఆంధ్రుల వాణిజ్య, పరిశ్రమాభివృద్ధికి ఎంతో దోహదకారి కాగలదు.

కృష్ణానది దక్షిణోత్తర ఖండాలను రెంటినీ ఏకం చెయ్యడమేగాకుండా, హైదరాబాదును ఆంధ్రరాష్ట్రానికి మరింత దగ్గరకు తేవడంవల్ల కూడా ఈ వంతెన ఆంధ్రరాష్ట్రానికి అత్యంత ప్రయోజనకారి.

ఈ రెగ్యులేటర్ రోడ్డు బ్రిడ్జీని ఇదివరలో పది పదిహేను సంవత్సరాల క్రిందటనే సూచించినాడు. సాధ్యంగాకున్నా నేటికి తమ నిర్వాహణంలోనే ప్రారంభించజాలిన ఆంధ్రప్రభుత్వ చీఫ్ ఇంజనీర్ శ్రీ యల్. వెంకట కృష్ణయ్యర్ గారినీ, ఈ నిర్మాణానికి సాయపడిన రాష్ట్ర కేంద్రప్రభుత్వాలను అభినందిస్తున్నాము.

తెలుగుదేశపు ప్రకృతి సంపదల సమీకరణకు ఇది తొలిమెట్టు. ఇటు పైని కృష్ణాగోదావరుల పై నిర్మించబడగల ప్రాజెక్టులన్నీ పూర్తి అయిన పిమ్మట తెలుగుతల్లి పైరుపంటలతో పచ్చిక బయళ్ళతో శోభామయం కాగలదు.

(ఆంధ్రప్రభ 13-2-1954)

గోమాత



అత్యధిక సంఖ్యాకులకు ప్రధాన జీవనాధారమైన ఇండియావంటి దేశంలో పశుగణం సంఖ్య హెచ్చుగా ఉండడం సహజమే.

ఇండియాలో ఉన్నన్ని పశువులు మరే దేశంలోనూ లేకపోవడం, ప్రపంచంలో గల మొత్తం పశు సంఖ్యలో దాదాపు నాలుగోవంతు ఇండియాలో ఉండడం కూడా వింతకాదు.

అయితే, మన దేశంలో పశువుల సంఖ్య ఇంత అధికమైనా, వాటి వల్ల మనం పొందుతున్న లాభంమాత్రం ఇతర దేశాలతో పోల్చి చూస్తే స్వల్పాతిస్వల్పం.

మన దేశపు పశుగణంలో ఎక్కువ భాగం ఎత్తుబడి, ఎండిపోయి ఎందుకూ కొరగాకుండా ఉండడమే ఇందుకు ముఖ్యకారణం.

పోనీ, పశు సంతతి మీద మనకు అభిమానం తక్కువా అంటే, ముఖ్యంగా గోజాతిపై మనకు గల భక్తిశ్రద్ధలు, ప్రేమానురాగాలు ప్రపంచంలో మరే దేశంలో, మరే జాతిలో కానరావు.

"గోమాత' అని పిలుస్తూ ఆవును తల్లిగా భావిస్తాము. ఎద్దును 'నంది'గా పూజిస్తాము. ఆవుపాలను అమృతంగా పరిగణిస్తాము.

అయినప్పటికీ ఎన్నో ఆవులు మన కళ్ళ ఎదుట చిక్కిశల్యావశిష్టమై అణగారిపోవడం చూచి సహిస్తాము. చాలినంత మేత లేక, మోయలేని బరువులు మోస్తూ జీవచ్ఛవాలైన ఎడ్లనుచూచి కన్ను చెమ్మగిల్లకుండా కదిలిపోతాము.

పాలు వట్టిపోయి పనికి రాకుండా పోయిన ఆవులు, గేదెలను, బలముడిగిపోయి అక్కరకు మాలిన ఎద్దులు, దున్నలను పరులకు తోలబెట్టి వాటిపట్ల కనికరం లేకుండా ప్రవర్తిస్తాము. ఏడాది పొడుగునా ఆవును ఎండగట్టి, సంవత్సరంలో ఒక్క రోజు పండగ జేసి పూజించినంతమాత్రాన పుణ్యంగాని, పురుషార్థంగాని దక్కబోదు.

అందుచేత, పశుగణంపై మనకు గల భక్త్యనురాగాలను కేవలం మన మనోభావాలకు మాత్రమే పరిమితం కానీక ఆచరణలో కూడా వాటిని ప్రదర్శించడం అవసరం.

అంతేకాదు, పెంచి పోషించలేనన్ని పశువులను ఉంచుకొనడంకంటే, ఉన్న పశువులను రెండు

మూడింటినైనా చక్కగా కాపాడి, వాటి వల్ల తగినంత ప్రయోజనం పొందడం సమంజసం. మేలుజాతి పశువులను తయారు చేయడంవల్ల నేమి, తగిన తిండిపెట్టి వాటిని బలిష్ఠంగా పెంచడంవల్ల నేమి, అంటుజాడ్యాలు వగైరా రాకుండా ముందే తగు జాగ్రత్త వహించడంవల్ల నేమి అమెరికా మొదలైన పాశ్చాత్య దేశాల్లో - మన దేశంలో కంటే పశు గణం సంఖ్య తక్కువైనా మనకంటే కనీసం నాలుగైదు రెట్లు ఎక్కువ ప్రయోజనాన్ని అక్కడి ప్రజలు పొందగలుగుతున్నారు. - -

కాబట్టి మనంకూడా ఆధునిక శాస్త్రీయ పద్ధతుల నవలంబించి పనికిమాలిన పశువులను అనేకం మెడకు చుట్టుకొనడం కంటే తక్కువ సంఖ్య గల పశు సంతతితో ఎక్కువ ప్రయోజనాన్ని పొందడానికి యత్నించడం ఉభయతారకం.

పశుగణాభివృద్ధికి పంచవర్ష ప్రణాళికలో తగిన ప్రాముఖ్యం ఇవ్వబడిన హేతువుచేత దేశ విస్తృతంగా ప్రభుత్వంచే నెలకొల్పబడుతున్న పశుపోషణ గ్రామ కేంద్రాల సహకారాన్ని పొంది ప్రజలు పశుగణాభివృద్ధికి పాటుబడాలి.

తెనుగు దేశపు పశువులు ఇండియాలోనే గాక విదేశాలలో సయితం ఖ్యాతి కెక్కినవి. పశుసంతతిపై తెనుగుజాతికి గల అభిమానం సుప్రసిద్ధం కాబట్టి పశు సంపదాభివృద్ధిని గురించి ఇండియా ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద్, కేంద్ర వ్యవసాయ మంత్రి పంజాబ్ రావ్ దేశముఖ్ గార్లు చేసిన ఉపదేశాలు ఆంధ్రులకు అవశ్యం అనుసరణీయాలు.

(ఆంధ్రప్రభ 6-11-1954)

నాగార్జున సాగర్

(భారత ప్రధాన మంత్రి జవహర్లాల్ నెహ్రూ నాగార్జునసాగర్ డామ్కు 1955లో శంకుస్థాపన చేసిన శుభ తరుణంలో ఆనందోత్సాహాలతో రాసింది.)

అల్లదే! అది నందికొండ! అశేష జనసందోహ మక్కడ చేరింది. ఇసుక వేసినా రాలడం లేదు; నేల ఈనినట్టుగానే తోస్తున్నది. స్త్రీ పురుషులు, పిన్న పెద్దలు, రైతులు, కూలీలు, అధికారులు, అనధికారులు, సచివోత్తములు, సాంకేతిక నిపుణులు ఎందరెందరో అక్కడ చేరారు. నునువెచ్చని యెండలో - అవిగో; - పచ్చని తోరణాలు! అరవిచ్చిన పూలమాలలతో అవిగో - అందరికీ స్వాగత వచనాలు! అహో! ఎంతటి జనసందోహం! ఏమి కోలాహలం! ప్రక్కనున్న కృష్ణానది ప్రవాహమైనా ఈ ప్రజోత్సాహాన్ని మించి పరవళ్ళు త్రొక్కుతున్నదా? పైనున్న భానుమండలమైనా ఈ ప్రజా వదనాలను మించి ప్రదీప్తమై వెలుగొందుతున్నదా?

అదుగో! మన నాయకుడు, మన ప్రధాని, మన నెహ్రూ ప్రజాకోటి జయజయ ధ్వానాల మధ్య ఒక నూతన నిర్మాణానికి - ఒక బృహత్తర పథకానికి - అసంఖ్యాక కర్షక జనుల ఆశాసౌధానికిఆంధ్రజాతి ఎప్పుడెప్పుడంటూ వేయికళ్లతో ఎదురుచూచిన నాగర్జున సాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్నాడు. ఆ శుభముహూర్తాన - ఆ పుణ్యక్షణాన - కృష్ణవేణి పులకాంకితయై ప్రవహించడమే మరచిపోలేదు గదా! ఔను! ఆ తల్లి! తన ప్రవాహ ధర్మాన్ని ఒక్క త్రుటిపాటు - ఒక లిప్తపాటు - మరచిపోయినట్టుగానే ఉన్నది!

నిజమే ఆమె మాత్రం సంతోష సంరంభాలతో ఉప్పొంగిపోదా! తన జలరాశులు - తోయద నిధులు వృథాగా ఉప్పునీటి కడలిలో కలిసిపోకుండా, తెలుగు మాగాణంలో బంగారాన్ని పండించబోతున్నవనీ, వేలాది గ్రామాలను పచ్చతోరణంగా, నిత్యకల్యాణంగా చేయబోతున్నవనీ!

ప్రధాని నెహ్రూకు సమీపంగా వారిద్దరెవరు? బెజవాడ గోపాలరెడ్డి, బూర్గుల రామకృష్ణరావుగార్లు కారుగదా? ఔను! వారే! తాము ఆంధ్ర, హైదరాబాద్ ప్రభుత్వ నాయకులై ఉండగా ఆంధ్ర, తెలంగాణాలలో కొత్తగా ఎంతో ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయగల ఈ బృహన్నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతున్నందుకు పట్టరాని సంతోషంతో వారి ముఖాలెంతగా వికసించి ఉన్నాయి!

ఇంతకంటె కూడా ముఖం విప్పారి ఉన్న ఆ బక్క పలచటి పెద్దమనిషి - కాంతులీనుతున్న కళ్ళతో శంకుస్థాపన మహోత్సవాన్ని తిలకిస్తున్న ఆ వ్యక్తి - ఆయనెవరు? సందేహం దేనికి? ఆయన శ్రీ నీలం సంజీవరెడ్డి, నాగార్జునసాగర్ ప్రాజెక్టు విషయంలో తనపై విమర్శ లెన్ని జరిగి ఉన్నా, ఆంధ్రరాష్ట్రం పబ్లిక్ వర్క్స్ మంత్రిగా నందికొండవద్ద తానే ఈ పునాదిరాయిని వేయిస్తున్న సంగతిని లోకం గుర్తించకపోదన్న సంతృప్తే ఆయన కళ్ళు అంతగా వెలుగు లీనడానికి కారణమై ఉంటుంది!

కాగా, అదృశ్యుడై ఉండి కూడా ఒక కాషాయాంబరధారి ఒక మహా తత్త్వవేత్త - ఒక తేజోనిధి - ఆశీర్వదిస్తున్నట్టు తోస్తున్నది. ఆయనెవరు? ఎవరన్న ప్రశ్న దేనికి? ఆయన నాగార్జునాచార్యుడు. ఆయన సర్వసంగ పరిత్యాగి కావచ్చు. మాధ్యమిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన మహా తత్త్వవేత్త కావచ్చు. అయినా, ఆకలిగొన్నవారికి ఉదరాన్ని ఎలా నింపుకొనవలెనన్న చింత తప్ప అన్య మేదీ ఉండదని ఆయనకు తెలుసు; కటిక దారిద్ర్యం మానవత్వాన్నే చంపివేస్తుందని ఆయనకు తెలుసు. అందువల్లనే అశేష ప్రజానీకానికి దారిద్రబాధను తప్పించి, వారికి సుభిక్ష మివ్వగల, శాంతి సౌఖ్యాల నివ్వగల ఈ బృహన్నిర్మాణాన్ని ఆయన ఆశీర్వదిస్తున్నాడు.

ఒకనాడు తన పేరుతో వెలసిన ప్రాంతం - మధ్యకాలంలో అనామకమైపోయిన ప్రాంతం - తన నిర్మాణాలన్నీ శిథిలాలైపోయిన ప్రాంతం తిరిగి కళకళలాడబోతున్నందుకు సంతుష్టాంతరంగుడౌతున్నాడు.

మరొక రిద్దరు కూడా అదృశ్యులై ఉండి కూడా తమ ఆశీస్సులందిస్తున్నారు. వారిలో మొదటి వ్యక్తి విజయవాడ, ధవళేశ్వరం ఆనకట్టలను కట్టిన కాటన్; రెండవ వ్యక్తి నందికొండ ప్రాజెక్టును కట్టవలెనని ఏనాడో కలలుగన్న నవాబ్ ఆలీ నవాజ్ జంగ్ బహదూర్. 1 నిస్సంశయంగా వీరందరి ఆశీస్సులతో ఆంధ్ర ప్రజల చరిత్రలో నేడు ఒక నవ ఘట్టం, మహోజ్జ్వల ఘట్టం - ప్రారంభమౌతున్నది.

(ఆంధ్రప్రభ 10-12-1955)

భూస్వామ్య సంస్కరణలు

భూస్వామ్య సంస్కరణలు తగునా, తగవా అనేది ఈనాడు చర్చనీయాంశం కానేకాదు. ఆ సంస్కరణల కార్యక్రమం ఇదివరలోనే ప్రారంభమైంది. ఒక్క మన దేశంలోనే కాక, ఫ్యూడల్ యుగం నుంచి ఆధునిక యుగానికి పురోగమించడానికి యత్నిస్తున్న ప్రతి దేశంలో - సాంఘిక న్యాయాన్ని సమకూర్చని రాజకీయ స్వాతంత్ర్యం గుడ్డిగవ్వపాటికూడా చెయ్యదని నమ్ముతున్న ప్రతి దేశంలో - ప్రజా సామాన్యం సహాయసహకారాలతో సమతాస్వాతంత్ర్యాలేమి, శాంతిసుభిక్షాలేమి ప్రాతిపదికలుగా నవసంఘనిర్మాణాన్ని లక్షిస్తున్న ప్రతిదేశంలో - భూస్వామ్య సంస్కరణల కార్యక్రమం కొంతకాలంగా దీక్షతో కొనసాగుతూనే ఉన్నది. అయినా, ఏ సోవియట్ రష్యానో ఒక బూచిగా చూపించి, భూస్వామ్య సంస్కరణలు తగవని ఇప్పుడు ప్రచారాన్ని ప్రారంభించడం చరిత్రగతికి అడ్డుగా నిలవడానికి ప్రయత్నించడమే!

భూస్వామ్య సంస్కరణలు అమలు జరిగింది కమ్యూనిస్టు దేశాలైన రష్యా, చైనాలలోనే కాదు; నాన్ కమ్యూనిస్టు రాజ్యాలైన ఈజిప్టు, బర్మా, థాయ్లాండ్, జపాన్లలో కూడా వాటి అమలు జరిగింది. చివరికి ఫార్మోజాలో సయితం (కమ్యూనిజం వినాశనాన్నే ప్రస్తుతం తన జీవిత లక్ష్యంగా పెట్టుకొన్న మార్షల్ చాంగ్-కైషేక్ పరిపాలనలో ఉన్న ఫార్మోజాలో సయితం) భూస్వామ్య సంస్కరణలను ప్రవేశ పెట్టక తప్పలేదు.

అయినా, భూస్వామ్య సంస్కరణలను ప్రవేశపెట్టడం కమ్యూనిస్టు వ్యవస్థను పరోక్షంగా ప్రతిష్ఠాపించడమే కాగలదని, కర్షకులను బానిసలుగా మార్చడానికే ఆ సంస్కరణలు ఉద్దేశించబడినవని ఎవరైనా ప్రచారం ప్రారంభిస్తే, ప్రపంచ చరిత్రలోని నూతన పరిణామాలకు సంబంధించినంతవరకు వారు కుంభకర్ణనిద్రలో మునిగి ఉన్నారనే మనం తీర్మానించుకొనవలసి వస్తుంది.

భూస్వామ్య సంస్కరణలను అమలుపరచడం కమ్యూనిజాన్ని ఆహ్వానించడం కాదు; సాంఘిక న్యాయాన్ని లక్షించడం. సాంఘిక న్యాయం లేనిచోటన కమ్యూనిజం పాదుకొంటుంది; అక్కడనే అది గట్టిగా వేళ్ళు తన్నుతుంది. అక్కడనే అది చిలువలు పలువలుగా పెరుగుతుంది, అక్కడనే అది చేదుకాయలను కాస్తుంది. ఈ సత్యాన్ని గుర్తించనేరక, సాంఘిక న్యాయ సంస్థాపనే పరమ ప్రయోజనంగాగల భూస్వామ్య సంస్కరణలను నిరసించడం కమ్యూనిజాన్ని ఆహ్వానించడమే కాగలదు, లేదా ఫాసిజాన్ని అభిమానించడమే కాగలదు.

ఏమైనా భూస్వామ్య సంస్కరణల మంచిచెడ్డలను గురించి చర్చలోకి ఇప్పుడు దిగవలసిన అవసరమే లేదు. ఈ సంస్కరణలు కొనసాగాలని నిర్ణయించడమే కాక, వీటిని భారత ప్రభుత్వం అప్పుడే కొంతవరకు అమలుపరచింది. జమీందారీల రద్దు ఈ సంస్కరణలో ఒక భాగం. ఈనాముల రద్దు వీటిలో మరొకభాగం. భూ వసతికి ఒక గరిష్ఠ ప్రమాణాన్ని నిర్ణయించడమేమి, భూస్వాములకు, కట్టుబడిదారులకు ఎట్టి సంబంధ బాంధవ్యాలు తగునో నిర్దేశించడ మేమి చివరి భాగం. ప్రస్తుతం మనం ఈ చివరి ఘట్టంలోనే ఉన్నాము. పెక్కు రాష్ట్రాలలో - ఢిల్లీ, బొంబాయి, పంజాబ్, రాజస్థాన్, హిమాచల ప్రదేశ్, అస్సాం, మధ్యప్రదేశ్, ఒరిస్సా, కచ్, పెప్సూలలో ఈ చివరి ఘట్టానికి సంబంధించిన కార్యక్రమంకూడా కొంతవరకు ముగిసింది. ఆంధ్రప్రదేశ్లో రేపు ఒక భాగం కానున్న తెలంగాణాలో సయితం భూస్వామ్య సంస్కరణలు అమలులోకి వస్తున్నాయి. అయినా, ఆంధ్రరాష్ట్రంలో ఈ విషయమై తాత్సారం జరగడం శోచనీయం.

ఒక దేశంలోవలె మరొకదానిలో గాని, ఒక రాష్ట్రంలోవలె మరొకదానిలో గాని తు.చ. తప్పకుండా ఒకే ఫక్కీని భూస్వామ్య సంస్కరణలు అమలు జరగడానికి వీలు లేదనుకోండి. ఒక చోట ఉన్న పరిస్థితులు మరొక చోట ఉండవు. అందువల్ల ఒకే ప్రాతిపదికపై భిన్న ప్రదేశాల సమస్యలను పరిష్కరించడం సాధ్యం కాదు. అయితే, సమస్య ఒక్కటే అయినప్పుడు, లక్ష్యం కూడా ఒక్కటే అయినప్పుడు, పరిష్కార విధానానికి సంబంధించిన వివరాల విషయమై ఏవో కొన్ని స్వల్ప భేదాలుండవచ్చుగాని, మూలసూత్రాలలోనే భేదాలకు వీలులేదు.

(ఆంధ్రప్రభ 14-7-1956)

కృష్ణా బ్యారేజి

(ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి విజయవాడలో కృష్ణానదిపై నిర్మించిన బ్యారేజిని ప్రారంభించిన సందర్భంలో రాసింది.)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి గారిచే 24వ తేదీ విజయవాడ వద్ద ప్రారంభోత్సవం జరుగనున్న కృష్ణానది బ్యారేజి నిర్మాణంతో తరతరాలుగా ఆంధ్రజాతికి అన్నోదకాలను అందజేస్తున్న కృష్ణవేణమ్మ నూతన శక్తిని సేకరించుకుని కృష్ణాతీర వాసులకు మరికొంత సంపదను ప్రసాదించడం ఆంధ్రులకే కాక, అశేష భారత ప్రజలకు ఆనందదాయకం.

ఆహార విషయంలో దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో, ఆహార స్వయం సమృద్ధికై అవిరళ కృషి జరగవలసిన తరుణంలో, చారెడేసి గింజలను కూడా జాగ్రత్తగా సేకరించి పొదుపుగా వాడుకొనవలసిన రోజులలో, అదివరకే కృష్ణా డెల్టా కిందగల 11 లక్షల ఎకరాల భూములకు పుష్కలంగా నీరు సరఫరా చెయ్యడమే కాకుండా, కొత్తగా లక్ష ఎకరాల సాగుకు నీటిని అందజెయ్యగలగడం స్వల్ప విషయం కాదు.

సర్ ఆర్థర్ కాటనే 1852లో ప్రారంభించబడిన కృష్ణానది ఆనకట్ట సరిగ్గా నూరు సంవత్సరాలకు 1952లో ఆకస్మికంగా సంభవించిన వరదలవల్ల ప్రమాదానికి గురి కావడమేమి, అత్యంత శోచనీయమైన ఆ ప్రమాదమే నేడు ముఖ్యమంత్రిచే ప్రారంభోత్సవం జరగబోతున్న బ్యారేజి నిర్మాణానికి దోహద మివ్వడమేమి చెడుగు నుంచి కూడా ఒక్కొకప్పుడు మేలే చేకూరుతుందన్న న్యాయానికి నిదర్శనం.

కృష్ణానదిపై బ్యారేజి నిర్మాణం ఒక విధంగా 1935 నుంచి కూడా అధికారుల యోచనలో ఉన్నా, 1952లో దురదృష్టకరమైన పై ఉపద్రవం తటస్థించని పక్షంలో, తలవని తలంపుగా సంభవించే వరదలచే మొత్తం ఆనకట్టకు ప్రమాదం వాటిల్ల వచ్చునని ఆనాడు ఇంజనీర్లు శంకించని పక్షంలో బ్యారేజీ నిర్మాణ సంకల్పం ఇంత త్వరలో కార్యరూపం దాల్చి ఉండదేమో! ఏమైతేనేమి, మొత్తం ఇండియాలోకి ఎక్కువ పొడవు కల్గిన ఈ బ్యారేజి, తలపెట్టిన దానికంటె స్వల్ప వ్యవధిలో, మొదటవేసిన అంచనాకంటే తక్కువ ఖర్చుతో ముగించబడడం అత్యంత ముదావహం.

పై నిర్మాణం వల్ల ఆయకట్టు భూములకు నీటి సరఫరా నిరాటంకంగా కొనసాగడం, లక్ష ఎకరాల అదనపు సాగుకు అవకాశాలు ఏర్పడడమే కాక, దెబ్బతిన్న ఆనకట్ట విషయమై ఇక ముందు ఆందోళన చెంద నవసరం లేదు. నదిలో ఎక్కువ నీటిని పట్టి ఉంచి నాట్ల సమయంలో పంట కాల్వలకు హెచ్చు నీటిని వదలడం ద్వారా డెల్టాలో రెండు వారాలకు ముందుగానే నాట్లు పూర్తికావడం, చివర ప్రాంతాల వారికి ఎక్కువ సహాయం చేకూరడం జరుగుతుంది. ఇవికాక, కృష్ణా బ్యారేజి నిర్మాణం మూలంగా సమకూరుతున్న మరొక ముఖ్య ప్రయోజనం

మద్రాసు కలకత్తాల మధ్య జాతీయ రహదారికి గల గొప్ప ఆటంక మొకటి నివారణ కావడం. ఇదివరలో నదిపై ఉన్న రోడ్డు ఏడాదికి ఏడెనిమిది నెలలు రాకపోకలకు యోగ్యం కాదు.

ప్రస్తుతం నిర్మించబడిన వంతెన వల్ల సంవత్సరం పొడుగునా నిరాఘాటమైన ప్రయాణ సౌకర్యం అమరడమే కాక, ఆంధ్రప్రదేశ్లోని 7 జిల్లాలకు అవిచ్ఛిన్న సంబంధం ఏర్పడుతున్నది. ఇన్ని విధాల స్వరాష్ట్రానికి, మొత్తం దేశానికి మిక్కిలి ప్రయోజనకరమైన బ్యారేజి నిర్మాణాన్ని అననుకూల పరిస్థితులలో, అనేక ప్రతిబంధకాల నెదుర్కొని వలసి వచ్చినప్పటికీ, దక్షతతో, చాకచక్యంతో కొనసాగించిన ఇంజనీర్లు శ్రీ ఎల్. వెంకట కృష్ణయ్యర్. శ్రీ జి.ఏ. నరసింహారావుగార్లేమి. వారి సహోద్యోగులేమి, సముత్సాహంతో బ్యారేజి నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న వేలాది కార్మికులేమి అభినందనీయులు.

లోగడ తాము రాష్ట్ర గవర్నర్ పదవిలో ఉండి ఆంధ్రదేశపు ఆర్థికాభ్యుదయం పట్ల శ్రద్ధ వహించిన ప్లానింగ్ మిషన్ సభ్యులు శ్రీ సి.ఎం. త్రివేది తమ సందేశంలో పేర్కొన్నట్టు బ్యారేజి నిర్మాణం వల్ల సాగులోకి రాగల కొత్త భూములకు సత్వరంగా నీరు అందజెయ్యడం విషయమై ప్రభుత్వం తగు చర్యలను పుచ్చుకోగలదని ఆశిస్తున్నాము. (ఆంధ్రప్రభ 24-12-1957)

కాటన్ “పెట్టిన దీపం”

ప్రధాని నెహ్రూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు శంకుస్థాపన చేయడానికి వచ్చినప్పుడు ఒక రైతు ఆయనతో "ఇది మీరు పెట్టిన దీపమే!" అన్నాడు. నాగార్జునసాగర్ నెహ్రూ పెట్టిన దీపం గోదావరి ఆనకట్ట అంతకు నూరేళ్ళకు ముందు సర్ ఆర్థర్ కాటన్ పెట్టిన దీపం. దక్షిణ భారతంలో కాటన్ పెట్టిన పెక్కు దీపాలలో అదొకటి. కాగా, కాటన్ ఆనాడు పెట్టిన దీపం తెలుగుగడ్డకు వెలుగు నిచ్చింది; తెలుగు బిడ్డకు అన్నం పెట్టింది. గంగను స్వర్గం నుంచి భగీరథుడు భూతలానికి తెచ్చినాడన్న పురాణగాథ నిజమో, కాదో గాని, వృథాగా సముద్రం పాలైపోతున్న గోదావరి జలాలను లక్షలాది ఎకరాల పంటపొలాలకు మళ్ళించిన అపర భగీరథుడు మాత్రం నిశ్చయంగా సర్ ఆర్థర్ కాటన్.

ఈనాడు అతి భాగ్యవంతమైన గోదావరి డెల్టా ఒకప్పుడు కరవు కాటకాలకు నిలయమై ఉండే దంటే ఇప్పటివారికి ఆశ్చర్యం కలగవచ్చు. ఔను, 1846వ సంవత్సరానికి ముందు (అప్పటిలో దాన్ని రాజమండ్రి జిల్లా అనేవారు. ఆ ప్రాంతం మద్రాసు ప్రెసిడెన్సీలో

ఎక్కువ వెనుకబడిన ప్రాంతాలలో ఒకటిగా ఉండేది. అంతే కాదు. అక్కడ వరసగా కరవులే, కాటకాలే! అక్కడి నుంచి వరసగా వలసలే!! అక్కడి నుంచి ఎక్కడికో కడుపు చేతపట్టుకొని లేచిపోకపోతే వరసగా చావులే!!

బ్రహ్మాండమైన గోదావరీనది ప్రవహిస్తున్న ఆ ప్రాంతం అంతటి దైన్యావస్థలో పడిపోవడం ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి ఎంతో బాధ కలిగించింది. కరవుకాటకాల నుంచి ఆ ప్రాంతాన్ని సముద్ధరించడానికి మార్గాన్వేషణ జరుగుతుండగా సర్ ఆర్థర్ కాటనక్కు గోదావరిపై ఆనకట్ట నిర్మించడం ఒక్కటే అందుకు తిరుగులేని మార్గమన్న భావం కలిగింది. 1844లో ఆయనకు కలిగిన ఈ భావం మరి రెండేళ్ళకు క్రియారూపం ధరించింది.

గోదావరినదిపై ఆనకట్ట నిర్మాణం 1846లో ధవళేశ్వరం వద్ద ప్రారంభమైంది. 1852 నాటికి అది పూర్తి అయింది. దానికి మొదట వేసిన ఖర్చు అంచనా చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. అది కేవలం 4,75,000 రూపాయలు. పని పూర్తి అయ్యేసరికి ఖర్చు 15,34,000 రూపాయలకు దేకివుండవచ్చు. ఏమైనా, ఈ మొత్తానికి ఈనాడు ఒక మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు కూడా రాదు. ఆనాడు రూపాయి విలువ అంతటిది; ఆనాడు కూలిరేట్లు అంత కారు చౌక.

సర్ ఆర్థర్ కాటన్ ఆనాడు అంత కొద్దిపాటి వ్యయంతో నిర్మించిన గోదావరి ఆనకట్ట బ్రిటిష్ ఇండియాలోనే ఇంజనీరింగ్ నైపుణ్యానికి అత్యద్భుతమైన చిహ్నంగా విశేష ప్రశంసలు పొందింది. నిజానికి దానికి ఎవ్వరూ ప్రత్యేకించి యోగ్యతాపత్రాలివ్వనక్కరలేదు. 1852లో పూర్తి అయిన ఆ నిర్మాణం నూరేళ్ళకు పైగా చెక్కుచెదరకుండా నిలిచి ఉండడమే దానికి తిరుగులేని యోగ్యతాపత్రం. పన్నెండు లక్షల ఎకరాలకు పంటనీటిని అందించడమే కాక, కాకినాడ నుంచి చెన్నపట్నం వరకు పడవలు నడపడానికి వీలుకలిగించడం దానికి అసలైన యోగ్యతాపత్రం.

1846లో రాజమండ్రి జిల్లా జన సంఖ్య 5,61,041 ఉండేది.

1891 నాటికి అది 20 లక్షల 78 వేల ఏడువందల ఎనభై రెండుకు పెరిగింది. 1844లో రాజమండ్రి జిల్లా నుంచి లభించే అన్ని రకాల రెవెన్యూ 17 పదిహేడు లక్షల ఇరవై ఐదువేల 8 వందల నలభై ఒక్క రూపాయలు ఉండేది. 1898 నాటికి ఒక్క ల్యాండ్ రెవెన్యూ మాత్రమే 60 లక్షల 19 వేల రెండువందల ఇరవైనాలుగు రూపాయలకు పెరిగింది. ప్రభుత్వం దృష్టి నుంచి చూచినప్పుడు సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టకు ఇంతకు మించిన యోగ్యతాపత్రం ఏమి కావాలి?

అయితే, సృష్టిలో దేనికీ శాశ్వతత్వం లేదు; మానవుడు నిర్మించినదానికి అసలే లేదు. నూరేళ్ళవరకు చెక్కు చెదరకుండా నిలిచిన ఆనకట్ట ఒక్కొక్క సంవత్సరం గడుస్తున్న కొద్దీ పగుళ్ళు చూపడం మొదలు పెట్టింది. మరమ్మతులకు నానాటికి హెచ్చుగా ఖర్చుచేయవలసి వస్తున్నది. ఏమి మరమ్మతులు చేసినా మరి ఎంతో కాలం అది నిలబడేట్టుగా కనిపించడం లేదు.

ఆనకట్టకు ప్రమాదం సంభవిస్తే, ఉభయ గోదావరి జిల్లాలకే కాదు, మొత్తం రాష్ట్రానికే తీరని నష్టం వాటిల్లుతుంది. 1965లో కేంద్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల బృందం ఆనకట్టకు ఎగువలో బరాజ్ నిర్మించాలని సూచించింది. ఆ సూచన జరిగిన అయిదేళ్ళకు దానికి శంకుస్థాపన జరుగుతున్నది. ఇంజనీరింగ్ శాస్త్రం అంతగా అభివృద్ధి చెందని పరాయి ప్రభుత్వకాలంలోనే కాటన్ నివేదిక అందిన రెండేళ్లలోపలనే, ఆనకట్ట నిర్మాణం ప్రారంభంకాగా, ఇప్పుడు మన ప్రభుత్వానికి బరాజ్ విషయమై ఒక నిర్ణయానికి రావడానికి అయిదేళ్లు పట్టింది! అవాంతరాలను లెక్కచేయక, అపనిందలను లెక్కచేయక, ఆనకట్టను కాటన్ ఆరేళ్లలో పూర్తి

చేయించాడు. ఇప్పుడు బరాజ్కు ఏడేళ్ళు పట్టనున్నదట? అప్పుడు ఆనకట్టకు పదిహేను లక్షల రూపాయల చిల్లర మాత్రమే ఖర్చు కాగా, ఇప్పుడు బరాజ్ కోసం పెట్టుబడి 26 కోట్ల 60 లక్షల రూపాయలు కానున్నదట! ఖర్చు ఎంత అయితేనేమి? బరాజ్ వల్ల ప్రజానీకానికి కలగనున్న ప్రయోజనంతో పోల్చితే అదొక లెక్కలోనిది కాదు. ఆనకట్టకింద ఎనిమిదిన్నర లక్షల టన్నుల బియ్యం, 160 వేల టన్నుల చెరకు, ఇంకా ఎన్నో పంటలు ఇప్పుడు పండుతున్నాయి. ఈ ఉత్పత్తికి భద్రత కల్పించడమే కాక, గోదావరి బరాజ్ దాన్ని మరింతగా పెంచనున్నది. నిర్మాణం పూర్తికావడానికి ఏడేళ్ళు పడుతుందని ఇప్పటి అంచనా, మరి నాగార్జునసాగర్ వలె కాకుండా ఇది అనుకున్న నాటికి పూర్తి కాగలదని ఆశించవచ్చునా? ధనలోపమని, అదని, ఇదని సాకు చెప్పకుండా ప్రభుత్వం ఈ నిర్మాణాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తుందని ఆశించవచ్చునా? మేము ఆశించినట్లుగా జరుగలేదు. బరాజ్ నిర్మాణంలో తాత్సారం చేసినందున, 1976 జులై 8 / 9 రాత్రి ధవళేశ్వరంవద్ద ఆనకట్టకు గండిపడింది.

(ఆంధ్రజ్యోతి 11-4-1970)

అడవులు

అడవుల విషయమై సర్దార్ పటేల్ చేసిన హెచ్చరికను (దీన్ని నిన్న అడవి గోల" మనకు దేనికి లెండి! అని నిర్లక్ష్యం చేస్తే దేశానికి ముప్పు తప్పదు. అడవులను చూచినవారు మనలో బహు కొద్దిమంది. వాటిలో పిచ్చిచెట్లు, యెచ్చిచెట్లు చిక్కురొక్కురుగా పెరిగి ఉంటాయి. వాటిలో దారీ డొంకా ఉండదు. పులులు, సింహాలు, ఎలుగులు, ఏనుగులు, నక్కలు, తోడేళ్లు, కోతులు, కొండముచ్చులు వగైరాలు వాటిలో తిరుగుతూ ఉంటాయి. కోయలు, చెంచులు మొదలైనవారికి అవి నివాసాలు. వారికి పుట్టతేనె, వెదురుబియ్యం, రేగుపళ్లు, నెమలికళ్లు కొల్లలుగా దొరుకుతూ ఉంటాయి - ఇంతే అడవులను గురించి బహుజనాభిప్రాయం ప్రచురించాము)

"ఏదో అడవులను గురించి, వాటి ప్రాముఖ్యాన్ని గురించి అంతగా తెలియనందువల్లనే, మన జనాభా చకచక పెరిగిపోతున్నదని, జనాభాతోపాటు పంటలు పెరగడం లేదని హెచ్చరించినంతనే "కొండలను పిండి చేస్తాము, అడవులను నరికి వేస్తాము. ఇంతకు మరింత సాగుచేస్తాము, మన రైతు మహారాజు బాగుండాలే కాని, మనకు కూడా తక్కువౌతుందా!" అని కొంద రనడం కద్దు.

ఈ మాటలు వింటుంటే వొళ్లు పొంగి, వారికి నివ్వాళి ఎత్తాలని అనిపిస్తుంది. కాని, వారిని తమ ప్రతాపం చూపనిస్తే, ఒక చిన్న చిక్కు వచ్చి పడుతుంది. కొండలను పిండి చేసిన వెనక, అడవులను నరికివేసిన తర్వాత, కోరినంత కొండ్రను సాగుచేసుకోవచ్చుగాని, చల్లినవిత్తు మొలవడానికీ, నాటిన మొక్క బ్రతకడానికీ వానలే కరువౌతాయి. ఇది జరిగిననాడు కొత్తపొలంతోపాటు పాతదికూడా పండేది చవుడు మాత్రమే.

ఇప్పటికే మనకు వానలు అంతంత మాత్రంగా ఉన్నాయి. అయితే అతివృష్టి, లేకపోతే అనావృష్టి, "ఉత్తర చూచి ఎత్తరగంప", "మృగశిర ఉరిమితే, ముసలెద్దు రంకె వేస్తుంది", "మఖలో కురిస్తే, మదురుమీది గింజైనా మొలుస్తుంది". మొదలైన సామెతలు ఈనాడు చాలావరకు అబద్ధాలై పోతున్నాయి. ఇప్పుడున్న అడవులను కూడా కొట్టి వేస్తే, వర్షాకాలం నుంచి వేసవి, శీతాకాలాలు చెరొక రెండు నెలలు పంచివేసుకోగలవు.

రాజులు వేటకు వెళ్లడానికే కాక, వానలు సరిగా కురవడానికి కూడా అడవులు కావాలి. అడవులగుండా వెడుతున్నప్పుడు అవి మన కిచ్చే చల్లదనాన్నే వాటిపైగా వెడుతున్నప్పుడు మబ్బులకు అడవు లిస్తాయి. ఇట్టి చల్లదనం లేకపోతే, వాన చినుకైనా రాలదు. ఇది

నూరేళ్ల ఈలోపల ఒకసారి యునైటెడ్ స్టేట్సుకు పూర్తిగా ఆకళింపుకు వచ్చింది. ఎకరానికి నాలుగెకరాలు సాగు చెయ్యాలని కొన్ని పరగణాలలో పేరుకైనా మిగలకుండా అడవులను తుడిచిపెట్టేసరికి ఆ పరగణాలు ఎడారులై పోయాయి. నేలలో జిగి చప్పగా చచ్చిపోగా, అక్కడ రేగడం మొదలుపెట్టిన దుమ్ముకు తట్టుకోలేక, పల్లెలను విడిచిపెట్టి, కొంపలను పాడుపెట్టి, ఆ పరగణాలనుంచి లేచిపోవలసి వచ్చింది కూడా. అవి తిరిగి నివాసయోగ్యమైంది నదులకు ఆనకట్టలు కట్టి, నేలను నీటితో ముంచెత్తి, ఒండును పేరుకొననిచ్చి, విరివిగా చెట్టుచేమలను నాటి, వాటిని ఏపుగా పెరగనిచ్చినమీదటనే.

చెట్టుచేమలు కేవలం వానలు సరిగా కురవడానికే కాక, వరదల తీవ్రతను ఆపడానికీ, నేల కోసుకుపోకుండా అరికట్టడానికీ ముఖ్యావసరమే. అయినా, మన అడవులు అంతకంతకు తరిగిపోతున్నాయి సరిగదా, పచ్చపచ్చగా ఉండే పల్లెపట్టులు కూడా తమ పచ్చతనాన్ని నెమ్మది నెమ్మదిగా కోల్పోతున్నాయి.

ఇప్పుడు మన దేశంలోగల అడవుల విస్తీర్ణం ఒక లక్షా 71 వేల చదరపు మైళ్ళు మాత్రం. ఇది చాలదు. ఈ విస్తీర్ణం కనీసం 2 లక్షల50 వేల చదరపు మైళ్ల వరకైనా పెరగాలి. ఇందుకు మారుగా ఇప్పటి అడవులనే నరికివేసుకోవడం జరుగుతున్నది. ఇది చేటుతెచ్చే పని.

అడవులను ముట్టుకొనడమే జరగరాదని ఎవ్వరూ చెప్పరు. వెదురు కోసం, కలపకోసం, వంటచెరకు కోసం అడవులను నరకవలసిందే. అడవుల ద్వారా, సంస్థానాలను విడిచిపుచ్చగా, మన రాష్ట్రాలలోనే మనకు ప్రస్తుతం సాలుకు పదిన్నర కోట్ల మేరకు ఆదాయం వస్తున్నది. ఈ ఆదాయాన్ని మనం పోగొట్టుకోరాదు. పైపెచ్చు, మున్ముందు దీన్ని మరింత పెంచుకోవాలి. అయితే, ఒకసారి అడవిని నరికివేసిన తర్వాత అది తిరిగి పెరిగి రావడానికి ఒక తరం పడుతుంది. "ఈ పంట పోతే, మరి మూడు నెలలకో, ఆరు నెలలకో మరొక పంట" అని అడవుల విషయంలో అనుకోడానికి వీలు లేదు. అందువల్ల అడవులను చిత్తం వచ్చినట్టుకాక, క్రమబద్ధంగా వినియోగించుకోవాలి. ఒక మొక్కను నరికితే, దానిస్థానంలో రెండింటిని నాటాలి. సర్దార్ పటేల్ చేసింది ఈ హితబోధనే. ఈ "అడవిగోల"ను మనం పట్టించు కొనకపోతే, జ్యేష్ఠాదేవి మన గోలను తప్పక పట్టించుకొంటుంది.

(ఆంధ్రప్రభ 5-4-1950).

రేపు, రేపటితరం

విశాల జాతీయ దృక్పథమా? సంకుచిత రాష్ట్రీయ దృక్పథమా? ఏది ముఖ్యం? ఏది అవసరం?

తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు కనీసం ఒక సమస్యపై - నదీజలాల పంపకం సమస్యపై - జాతీయ ప్రయోజనాలకు, సమష్టి శ్రేయస్సుకు ప్రాధాన్యమిచ్చాయి. కొంతకాలంగా తమమధ్య నడుస్తున్న వివాదాన్ని స్వచ్ఛందంగా, సామరస్య పూర్వకంగా అవి పరిష్కరించుకొన్నాయి. ఇందుకు ఆ రెండు ప్రభుత్వాలను అభినందించాలి.

నదీజలాల వివాదాలు తమిళ, కేరళ రాష్ట్రాల మధ్యనే కాదు; దేశంలో మరికొన్ని రాష్ట్రాల మధ్య కూడా ఉన్నాయి. ఎన్నేళ్ళు దొర్లిపోతున్నా, ఎన్నికడగళ్ళు తప్పకపోతున్నా, వాటిని తమలో తాము సామరస్యపూర్వకంగా పరిష్కరించు కొనలేక పోతున్న రాష్ట్రాలు ఇకనైనా సిగ్గుతో తలవంచుకోవాలి.

ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్, మైసూర్, మహారాష్ట్రల మధ్య కృష్ణా గోదావరీజలాల పంపకం తీవ్రమైన మనస్పర్థలకు కారణమైంది. మధ్యప్రదేశ్, గుజరాత్ల మధ్య నర్మదానదీ జలాలవివాదం ఆవేశకావేషాలకు మూలమైంది. ఎవరు, ఎంతగా, ఎన్నిసార్లు ప్రయత్నించినా, ఇవి తెగనితగవులై కూర్చున్నందున చివరికి వాటిని కోర్టులముందు పెట్టవలసి వచ్చింది.

నేడు తమిళనాడులో డి.యం.కె. ప్రభుత్వం ఉన్నది; కేరళలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఉన్నది. ఆ రెండు ప్రభుత్వాల మధ్య పార్టీ విభేదాలు, సిద్ధాంత వైరుధ్యాలు, తదితర వ్యత్యాసాలు ఎన్నో ఉన్నాయి. అయినా, అవి పరాంబికులం, ఆలియార్, భవానీనదుల నీటిపంపిణీపై, ప్రాజెక్టులపై, ఒక సమాధానానికి రాగలిగాయి. కాగా, ఆంధ్రప్రదేశ్, మైసూరు, మహారాష్ట్ర, గుజరాత్లలో మొదటినుంచీ ఉన్నవి కాంగ్రెసు ప్రభుత్వాలే. కిందటి జనరల్ ఎన్నికల వరకు మధ్యప్రదేశ్ను అవిచ్ఛిన్నంగా పరిపాలించినట్టిది కాంగ్రెసు ప్రభుత్వమే. ఈ ప్రభుత్వాలు ఒకే కాంగ్రెసుపార్టీ ఆదేశాలకు లోబడి నడుచుకొనేవే. వీటి మధ్య సిద్ధాంతపరంగా గాని, పార్టీ ప్రయోజనాల దృష్ట్యాగాని, ఎట్టి విభేదాలు ఉండడానికి అవకాశం లేదు.

అయినా, ఇవి నదీజలాల విషయంలో ఏకాభిప్రాయానికి రాలేకపోయాయి. ఏ నదీజలం ఎక్కడ వినియోగానికి వచ్చినా, అది దేశసౌభాగ్యానికే దోహదకారి కాగలదన్న ప్రాథమిక సత్యాన్ని విస్మరించి ఒకే పార్టీకి చెందిన ఈ ప్రభుత్వాలు రచ్చకెక్కాయి.

దీన్నిబట్టి ఏమనుకోవాలి? తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు తాము ఏ సమాధానం కుదుర్చుకొన్నా, తమ ప్రజలకు నచ్చ చెప్పగలమన్న ధీమాతో, తమ వెనుక ప్రజల అండదండలు ఉన్నాయనే ఆత్మవిశ్వాసంతో వ్యవహరించాయనే కాదా? ఆంధ్రప్రదేశ్, మైసూర్ మొదలైన రాష్ట్రాలలో కాంగ్రెసు ప్రభుత్వాలకు అట్టి ఆత్మవిశ్వాసం లోపించిందనే కాదా?

ప్రజాభిప్రాయాన్ని సరియైన మార్గంలో నడిపించడం నాయకత్వ లక్షణం. ప్రజలకు ముందు నడవడం నాయకలక్షణం. దీనికి స్వస్తిచెప్పి ప్రజలకు వెనుక నడవడం, ప్రజల ఆవేశాలనుబట్టి నడుచుకోవడం ఏమి నాయకత్వం? కొన్ని సందర్భాలలో ఉదాహరణకు రాష్ట్రాల మధ్య సరిహద్దుతగవులు ఉక్కుఫ్యాక్టరీకి స్థలనిర్ణయం, మొదలైన సందర్భాలతో ప్రజలను స్వయంగా రెచ్చగొట్టి, తమ పలుకుబడిని చాటుమాటునుంచి పెంచుకొనడానికి, తమ పదవిని కాపాడు కొనడానికి ప్రయత్నించిన నాయకులు కూడా ఉన్నారు. ఓట్ల కోసం, తమ పదవుల సుస్థిరత కోసం దొడ్డదారులనైనా పట్టడానికి, గడ్డిగా దరలనైనా కరవడానికి వెనుదీయనివారు నిజమైన నాయకులు కాగలరా?

"పొలిటీషియన్" రేపటిని గురించి మాత్రమే ఆలోచిస్తాడు; "స్టేట్స్మన్" రేపటి తరాన్ని గురించి ఆలోచిస్తాడు. మన దేశంలో "స్టేట్స్ మన్"గా చెప్పదగినవారు అరుదు; "పొలిటీషియన్స్" కోకొల్లలు. రేపటి తరాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రవర్తించేవారు తక్కువ; రేపటిని గురించే ఆలోచించేవారు ఎక్కువ. ఇదే మన దేశానికి ఈనాడు పట్టిన ఒక పెద్ద దౌర్భాగ్యం!

(ఆంధ్రజ్యోతి 12-5-1969)

సోమశిల ప్రాజెక్టు

కృష్ణ, గోదావరి నదులతో పోల్చదగినంత పెద్దది కాదు పెన్నానది. అయినా, ఈ చిన్న నదిలో లభ్యమయ్యే నీటిని కూడా పూర్తిగా వినియోగించుకొనడం ఇంతవరకు జరగలేదు.

సంగం, నెల్లూరుల వద్ద పెన్నకు ఆనకట్ట లున్నాయి. కాని, వీటి ప్రయోజనం పరిమితమైనది. కనుకనే, సమగ్రమైన ప్రాజెక్టు కోసం నెల్లూరు జిల్లా ప్రజలు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. సోమశిల వద్ద ఇటువంటి ప్రాజెక్టును నిర్మించాలన్నది వారి కోర్కె.

దురదృష్టవశాత్తు, ఇది నేటి వరకు కోర్కెగానే మిగిలిపోయింది. సోమశిల వద్ద ఎంత ఎత్తున డామ్ నిర్మించాలన్నది ఒక వివాదాస్పద విషయమైంది. మెట్ట తాలూకా లన్నింటికి ఉపయోగపడాలంటే 380 అడుగుల ఎత్తున నిర్మించాలని కొందరి వాదన. కాని, ఇంత ఎత్తున డామ్ నిర్మించడానికి తగినంత నీరు పెన్నలో లేదని, పైగా కడప జిల్లాలో అపారమైన భూములు మునిగిపోగలవని, వాటికి నష్టపరిహారం చాలా పెద్ద మొత్తంలో చెల్లించ వలసి ఉంటుందని మరికొందరి వాదన, ఈ వాదోపవాదాలవల్ల నైతేనేమి, ప్లానింగ్ కమిషన్ ఇటీవలి వరకు ప్రాజెక్టును మంజూరు చేయకపోవడం వల్లనైతేనేమి, ఎన్ని విజ్ఞప్తులు, ఎన్ని రాయబారాలు, ఎన్ని తీర్మానాలు జరిగినా సోమశిల ప్రాజెక్టు తీరని కోర్కెగానే ఉండిపోయింది.

ఇటీవల ఈ ప్రాజెక్టును అయిదవ ప్రణాళికలో చేర్చడానికి ప్లానింగ్ కమిషన్ అనుమతించడంతో ఇప్పుడిది క్రియారూపం ధరిస్తున్నది. దీనిపై అభిప్రాయ భేదాలు పూర్తిగా సమసి పోయినవని చెప్పలేముగాని, మొత్తంపై ఏదో ఒక రూపంలో ఇది నిర్మాణం దశకు చేరడం నెల్లూరు జిల్లా ప్రజలు సంతోషించవలసిన విషయం.

ఏక ఆంధ్రజాతి

మొన్న ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును రెండు దశలలో నిర్మించనున్నారు. మొదటి దశలో డామ్ ఎత్తు 315 అడుగులు మాత్రమే ఉంటుంది. దీనికి 17 కోట్ల 20 లక్షల ఖర్చు కాగలదట. దీని క్రింద 280 వేల ఎకరాల ప్రస్తుతపు ఆ యకట్టును స్థిరీకరించడం జరుగుతుంది. నిర్మాణం పూర్తి కావడానికి అయిదారేళ్లు పట్టవచ్చునని, ఆ తర్వాత వెంటనే రెండవ దశ నిర్మాణం ప్రారంభిస్తారని ముఖ్యమంత్రి చెప్పారు.

అనుకున్న విధంగా ప్రాజెక్టు పూర్తి అయితే మంచిదే. కాని, రాష్ట్రంలో పెక్కు ప్రాజెక్టులు నిధుల కొరత వల్ల దశాబ్దాలు కడచినా పూర్తికాని స్థితిలో ఉన్నాయి. అందువల్ల, 33 కోట్ల రూపాయల ఖర్చుతో తలపెట్టిన సోమశిల ప్రాజెక్టుకు కూడా ఇదే అవస్థ పట్టవచ్చునని భయాందోళనలు కలగడంలో ఆశ్చర్యం లేదు. రెండు దశలలో నిర్మిస్తున్నందున తొలి దశ పూర్తి అయితే గాని రెండవ దశ ప్రసక్తిరాదు. ఈ కారణం వల్ల ఈ ప్రాజెక్టు ప్రస్తుతపు ఆయకట్టు స్థిరీకరణకే ఉద్దేశించినట్టిదని కొందరు అనుమానం వెల్లడించడంలో కూడా ఆశ్చర్యం లేదు.

కాని, ప్రభుత్వం తన వాగ్దానం ప్రకారం రెండవ దశను కూడా మొదటిదాని తర్వాత వెంటనే చేపట్టగలదని ఆశించాలి. రెండవ దశ వల్ల జిల్లాలోని ఆరు మెట్ట తాలూకాలకు నీటిపారుదల సౌకర్యం లభించగలదని ముఖ్యమంత్రి చెప్పారు. దానితో 115 వేల ఎకరాలు కొత్తగా సాగుకాగలవని అంచనా. చిరకాలంగా జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్టు నిర్మాణం పట్ల ప్రభుత్వం శ్రద్ధ వహించి, ఎప్పటికప్పుడు నిధులను సమకూర్చి, అనుకున్న వ్యవధిలో పూర్తి చేయగలదని ఆశిస్తున్నాము.

(ఆంధ్రజ్యోతి 6-6-1975)

విద్య: గ్రంథాలయాలు

ఏక ఆంధ్రజాతి

(తెలుగు జాతి అందరూ కలసి ఉండేందుకు విద్యాపరంగా ఆంధ్రా యూనివర్సిటీ విధానం గురించి వివరణ.)

"మనది ఏక భాష, ఏక మతం, ఏక సంఘం. చాలా ఒడుదుడుకులతో కూడిన దైనప్పటికీ మనది ఏక చరిత్ర కూడా. వీటివల్ల సహజంగా సిద్ధించవలసిన సమైక్యత నేటికి కూడా ఏకరాష్ట్ర రూపాన్ని, ఏక విశ్వకళాపరిషత్తు రూపాన్ని ఎందుకు ధరించడం లేదో నాకు దురూహ్యం" అని డాక్టర్ సి.ఆర్. రెడ్డిగారు నేడు ఆంధ్ర విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ సందర్భంలో ప్రసంగిస్తూ ఉద్ఘాటించారు.

కాని, మాకు మాత్రం ఇది దురూహ్యమైన విషయంగా తోచడం లేదు.

ప్రత్యేకాంధ్ర రాష్ట్రం మనకు ఈ నాటికీ సిద్ధించ లేదుగాని, ప్రత్యేక ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏనాడో లభ్యమైంది.

అయినా, ఆంధ్ర సంస్కృతికేమి, ఆంధ్ర సమైక్యతకేమి, వీటిద్వారా ఆంధ్ర రాష్ట్ర సంసిద్ధికేమి, ఆంధ్ర విశ్వవిద్యాలయం కూర్చిన దోహదం దాదాపు పూజ్యం.

పై పెచ్చు, ఆంధ్రజాతిలో చీలికలు ఏర్పడ్డానికి ఆంధ్ర విశ్వవిద్యాలయమే ఒక ప్రధాన కారణమైంది.

విశ్వవిద్యాలయ కేంద్రం ఏది కావాలనే వివాదమే (డాక్టర్ రెడ్డిగారి అభిమాన ప్రయోగాలను చెయ్యాలంటే) ప్రాగాంధ్రం నుంచి పశ్చిమాంధ్రం విడిపోవడానికి తొలి కారణమైంది.

విశ్వవిద్యాలయ కేంద్రాన్ని పోనీ విశాఖ పట్టణానికి మార్చినా, కొన్ని ప్రత్యేక కళాశాలలను రాయలసీమలో ప్రారంభించివుంటే, కేంద్రం విషయమై వివాదం క్రమంగా సమసిపోయి ఉండేదేమో!

కాని, అందుకు సైతం జరగవలసిన ప్రయత్నం జరగవలసినంత గట్టిగా జరగలేదు.

విశ్వవిద్యాలయం సందర్భంగా ప్రారంభమైన ఈ వివాదానికి రాజకీయ రంగానికి సంబంధించిన ఇతర విభేదాలు తోడుకాగా, ప్రత్యేకాంధ్ర రాష్ట్ర రాజ్యాంగ విధానంలోనే రాయలసీమకు తగు రక్షణలను చేర్చాలని, లేనిచో, రాయలసీమ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడగలదని ప్రతిపాదించడం వరకు పరిస్థితులు విషమించాయి.

అయితే, గతాన్ని గురించి ఇప్పుడు విమర్శించడంగాని, విచారించడం గాని ప్రయోజన రహితం. భవిష్యత్తును గురించే ఇప్పుడు ఆలోచించుకోవాలి; దానినైనా పదిలం చేసుకొనడానికే ఇప్పుడు కృషి జరపాలి.

ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి వెంటనే పూనుకొన నున్నామని ఇండియా ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ స్పష్టంగా ప్రకటించడం సైతం జరిగింది. ఇకనైనా, మన విభేదాలను మనమే సమయింప జేసుకొనకపోతే, ప్రతి ఆంధ్రుడు (అతడు ప్రాగాంధ్రానికి చెందినవాడైనా, పశ్చిమాంధ్రానికి చెందినవాడైనా) నగుబాట్లపాలు కాక తప్పదు.

మనలో పరస్పర విశ్వాసం, సౌహార్దం నెలకొల్పడానికి ఆంధ్ర విశ్వవిద్యాలయమే ముందంజవేస్తే, అంతకంటే కోరదగిన విషయం ఉండబోదు.

రాయలసీమ తిరిగి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చేరితే, ఆ ప్రాంతానికి ఉన్నత విద్యా సౌకర్యాలను కూర్చడానికి శక్తివంచన లేని కృషి జరపగలమని వాగ్దాన మివ్వడంతో ఆగక, నిర్దిష్టమైన ప్రతిపాదనలను చేసి, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రావతరణకు నాందిగా, విద్యా విషయికంగా ఆంధ్ర జాతి సమైక్యతను డాక్టర్ రెడ్డిగారేమి, ఆంధ్ర విశ్వవిద్యాలయపు ఇతర అధికారులేమి సాధించాలి. ఈ కృషిలో వారిని ప్రతి ఆంధ్రాభిమానీ ప్రోత్సహించగలడు. సమర్థించగలడు; అభినందించ గలడు.

(ఆంధ్రప్రభ 14-12-1947)

జాతీయ విద్యా విధానం

(జాతీయ విద్యా విధానంపై లాలాలజపత్ రాయ్ గ్రంథ పునర్ముద్రణపై విపుల సమీక్ష.)

నిన్ననో, మొన్ననో కాదు; పది, పదిహేను సంవత్సరాలనాడైనా కాదు; 1918లో లాలాలజపత్ రాయ్ భారత జాతీయ విద్యావిధాన సమస్యను గురించి ఒక పుస్తకాన్ని రాశాడు. దాని పేరు "ది ప్రాబ్లెమ్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా" అర్ధ శతాబ్ది తర్వాత కూడా అది పాతగిలలేదు సరిగదా, నేటి మన విద్యా సమస్యలను గురించి నేడు వెలువడిన గ్రంథం వలె అది భాసిస్తున్నది.

ఇందుకు రెండు కారణాలను మనం చెప్పుకోవచ్చు. ఒకటి - లాలాజీ దూరదృష్టి. రెండు. మన విద్యా విధానాన్ని మనమే నిర్ణయించుకొనగల స్వాతంత్ర్యాన్ని 1947లో మనం పొందినా, ఈనాటికి కూడా సరైన విధానాన్ని రూపొందించుకొనడంలో మన వైఫల్యం. కమీషన్, కమిటీల నియామకం జరుగుతున్నది; అవి నివేదికలను సమర్పిస్తున్నాయి; ఒక్కొక్క నివేదిక తర్వాత ఏవో కొన్ని మార్పులను ప్రవేశపెడుతున్నారు; తరచుగా ప్రవేశ పెడుతున్న ఈ మార్పుల వల్ల చిక్కులు, చికాకులు పెరగడం తప్ప, అన్యప్రయోజనం అంతగా కానరావడం లేదు. చిల్లులు పడుతున్న వోటి పాత్రకు మాటిమాటికి మాట్లు వేయడం పద్ధతిలోనే మనం వ్యవహరిస్తున్నాము. ఇంతే తప్ప, ఈ నూతన యుగానికి, దీని నూతనావసరాలకు తగినట్టి ఒక నూతన విధానాన్ని నిర్ణయించుకొనడానికి, దాన్ని సమర్థంగా అమలుపరచడానికి ప్రయత్నించడం లేదు.

పెక్కేండ్లుగా అచ్చులో లేని లాలాజీ పుస్తకం భారత ప్రభుత్వానికి చెందిన పబ్లికేషన్ డివిజన్ వారి పుణ్యమా అని పునర్ముద్రణ పొందింది. దాన్ని చదివితే, వెనకకు తప్ప ముందుకు చూడలేని ప్రబుద్ధుల మాట చెప్పలేముగాని, తక్కిన వారందరు మన ప్రస్తుత విద్యావిధానం ప్రాతిపదికలలోనే ఎన్ని లోపాలున్నవో స్పష్టంగా గ్రహించగలుగుతారు.

రాజ్యాంగ విధానం అమలులోకి వచ్చిన తర్వాత పదేళ్ళ లోపల దేశంలోని ప్రతి బాలునికి, ప్రతి బాలికకు ఉచితంగానే కాక, విధిగా విద్యను గరపడానికి తగు చర్యలను తీసుకోవాలని మన రాజ్యాంగ చట్టం నిర్దేశిస్తున్నది. ఈ విషయంలో మన వైఫల్యం కారణంగానే మన విద్యావిధానం విఫలం చెందలేదు; వైజ్ఞానిక సాంకేతిక, వృత్తి విద్యా విధానాలను పెంపొందించడంలో రాజ్యాంగ చట్టం నిర్దేశాలను పూర్తిగా పాటించకపోయినందువల్లనైనా అది విఫలం చెందలేదు; నవయుగానికి తగు నవ దృక్పథాన్ని పెంపొందించలేక పోవడంలోనే అది ప్రధానంగా విఫలం చెందింది. కాలం ముందుకు నడుస్తుంది, వెనుకకు కాదు. ఒక మనిషి కానివ్వండి, ఒక జాతి కానివ్వండి, కాలంతోపాటు పురోగమించాలంటే నడవవలసింది ముందుకు గాని, వెనుకకు కాదు. ముందుకు నడవాలంటే ముందుకే చూడాలి, ముందుకే అడుగు వేయాలి. దీన్ని మనకు అలవరచ గలిగిందే లాలాజీ దృష్టిలో ఉత్తమమైన జాతీయ విద్యావిధానం.

ఒకనాడు మన దేశం, మన జాతి, ఎంతగానో శోభించినమాట నిజమే. ఈ విషయాన్ని గుర్తించడంలో లాలాజీ ఎవ్వరికీ వెనుదీయడు. కాని, ఇటీవల మనం వెనుకబడిపోగా, తక్కిన ప్రపంచం ముందుకు వెళ్ళలేదా? ముఖ్యంగా వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో అది ఎంతగానో పురోభివృద్ధిని సాధించలేదా? ఈ రంగాలలో పురోభివృద్ధి కారణంగా ప్రపంచ స్వరూపమే చాలా మారిపోలేదా? "నన్ను ముట్టుకోకు, నా మాలకాకి!" అనే ధోరణిలో ఏ దేశమూ, ఏ జాతీ మరి బ్రతుకలేని పరిస్థితులు ఏర్పడలేదా? కలిసి బ్రతకలేకపోతే, కలిసి కాటిలో కలవవలసిన స్థితికి మానవ సంఘం రాలేదా! ఈ ప్రశ్నలు మేము వేస్తున్నవి కావు; అర్ధ శతాబ్దినాడు లాలాజీ వీటిని స్వయంగా వేశాడు. ప్రథమ ప్రపంచ యుద్ధం తుది ఘట్టాలలో తన గ్రంథ రచనను ప్రారంభించిన లాలాజీ "ఈ ప్రపంచ యుద్ధం

తర్వాత కాకపోతే, మరొక యుద్ధం తర్వాతనైనా" అంతర్జాతీయతకు ప్రాధాన్య మివ్వకపోతే, మానవజాతికి స్వరూప నాశన ప్రమాదం కలదని హెచ్చరించాడంటే, ఆయన ఎంతటి దూరదృష్టిగలవాడో మనం ఊహించుకోవచ్చు.

ఇంతటి దూరదృష్టిగల నాయకుడైనందుననే లాలాజీ ఒక జాతిగా మన చిత్తవృత్తిని మార్చడమే, ఒక సంఘంగా మన విశ్వాసాలను మార్చడమే, ఒక దేశంగా మన ఆచార వ్యవహారాలను మార్చడమే మన విద్యావిధానం పరమలక్ష్యం కావాలని ఉద్ఘాటించాడు.

విజాతీయ ప్రభావాలు నానాటికి పెరుగుతున్నవని, జాతీయత మంటగలిసి పోతున్నదని వాపోతున్నవారు లాలాజీ రాసిన ఈ క్రింది వాక్యాలను శ్రద్ధగా మననం చేయాలి : "ప్రాచీనమైన ప్రతిదీ ప్రశస్తమైనదని మనం తీర్మానించుకొనలేము. మన పూర్వీకుల భావాలలో కొన్ని పూర్తిగా భ్రమాజనితమైనవని రుజువు అయింది; వాటిని మనం మార్చుకోవాలి. వారి పద్ధతులు కొన్ని అనుచితమైనవని తేలింది; వాటిని మనం చక్కదిద్దుకోవాలి. వారి వ్యవస్థలలో కొన్ని వారి కాలానికి, నాటి పరిస్థితులకు అనుగుణంగా ఉన్నా, ఇప్పుడు పనికిమాలినవని స్పష్టపడింది; వాటి స్థానంలో కొత్త వ్యవస్థలను మనం నిర్మించుకోవాలి. వారికి కేవలం నకళ్ళు కావాలని మనం కోరడం లేదు; వారికంటే ఉత్తమ స్థితిలో ఉండాలనేదే మన వాంఛ".

ఈ వాంఛ నెరవేరా లంటే, మన ప్రమాణాలనే, మన లక్ష్యాలనే పునఃపరిశీలన చేసుకోవాలని, ఇందుకు మగటిమి (మ్యాన్లీనెస్) కావాలని లాలాజీ పలుకుతున్నాడు. ఈ జగత్తు మాయ అనే విశ్వాసం పోవాలని ఆయన సూచిస్తున్నాడు. "ఎవరి ప్రారబ్ధాన్ని వారు అనుభవించక తప్పు" దన్న గుడ్డి నమ్మకం తొలగిపోవాలని ఆయన ఉదోషిస్తున్నాడు. ఆర్యరుషులు ఎంతటి జ్ఞానులైనా కడిచిన మూడువేల సంవత్సరాలలో ప్రపంచం ఎంతగానో పురోగమించినదన్న విషయాన్ని గుర్తించాలని ఆయన నొక్కి చెబుతున్నాడు. రుషులు చెప్పినదే సత్యమని నమ్మి, వారి మాటనే పట్టుకుని వ్రేలాడితే మనకు అధోగతి తప్పదని ఆయన హెచ్చరిస్తున్నాడు.

ఇంతటితో ఆగక మరింత ముందుకు వెళ్ళి, "అర్థశాస్త్రం", దాని రచన జరిగిన కాలానికి, ఉత్తమమైన రాజనీతిశాస్త్రమా అని లాలాజీ అడుగుతున్నాడు. "లీలావతి", అది వెలువడిన కాలానికి, ప్రథమ శ్రేణి గణితశాస్త్ర గ్రంథం కావచ్చుగాని, ఈనాడు కూడా గణితశాస్త్రం ఆ స్థాయిలోనే మిగిలిందా అని లాలాజీ ప్రశ్నిస్తున్నాడు. ఇదే విధంగా ఆయుర్వేదం, యునానీలు ఒకనాడు ఎంతటి ఉపయోగకరమైన వైద్య విధానాలైనా, పాశ్చాత్య విధానాన్ని త్రోసిపుచ్చడం విజ్ఞత కాగలదా అని లాలాజీ నిగ్గదీస్తున్నాడు. మను, నారద, గౌతమ, ఆపస్తంబాది ధర్మశాస్త్రాలను పట్టుకొని ఈనాడు మనం వ్రేలాడగలమా అని కూడా లాలాజీ పృచ్ఛిస్తున్నాడు.

ఈ ప్రశ్నలను వేయడంలో లాలాజీ ఉద్దేశం - ఒక నూతన చిత్తవృత్తిని, దానితోపాటు నూతన విశ్వాసాలను, నూతనమైన జీవితపు విలువలను మనకు ప్రసాదించగలిగిందే ఉత్తమమైన జాతీయ విద్యావిధానం కాగలదని నచ్చజెప్పడమే! కాని, మన ప్రస్తుత విద్యావిధానం ఈ విషయాలను ఎంతవరకు గుర్తిస్తున్నది, ఎంతవరకు గౌరవిస్తున్నది? మన మతమౌఢ్యాలను త్రుంచడానికి బదులుగా వాటిని అది బలపరచడంలేదా? మనకు నవదృక్పథాన్ని కలిగించడానికి మారుగా, పూర్వాచార పరాయణత్వాన్ని అది సమర్థించడం లేదా? పుక్కిటి పురాణాలను చారిత్రక సత్యాలుగా మన్నన చేయని పాఠ్యగ్రంథాలు నేడు మనకు ఎన్ని ఉన్నాయి? అణుశాస్త్రంలో వేదరుషులు ప్రత్యేక ప్రవీణులన్న వెర్రిమొర్రి వాదాన్ని విని, ముక్కుపై వేలువేసుకొంటున్నవారు మన ఆచార్యవర్యుల్లో ఈనాడు

ఎందరున్నారు?

ఆర్య సమాజం నాయకులలో లాలాజీ ఒక ప్రముఖుడు. ఆర్య సమాజికులకు వేదాలపైన, సంస్కృత భాష పైన గౌరవాభిమానాలు విశేషంగా ఉంటాయి. అయినా, యుగ ధర్మాన్ని గుర్తించగల మహామహుడైనందున లాలాజీ సంస్కృతాన్ని బోధనాభాషగా చేయడం కంటే పిచ్చిపని ఉండబోదని హెచ్చరించాడు. ఇంతేకాదు. భాషా పాండిత్యాన్ని అభిలషించేవారికి తప్ప, చారిత్రక పరిశోధన చేయగోరే వారికి తప్ప, సంస్కృతాన్ని బోధించరాదని ఆయన హెచ్చరించాడు. సంస్కృతంతో పోల్చినప్పుడు అరబిక్, పారశీక భాషలు ఎక్కువ ప్రయోజనకరమైనవని హెచ్చరించాడు. యూరప్లో గ్రీక్, లాటిన్ భాషలకున్న స్థానాన్ని మించింది మన దేశంలో సంస్కృతానికి ఈనాడు లేదని, అంతకుమించి దానికి ప్రాధాన్య మివ్వరాదని హెచ్చరించాడు. అయినా, ఈ విషయాలను మన విద్యావేత్తలు ఎంతవరకు గుర్తిస్తున్నారు, ఏ మేరకు వీటిని గౌరవిస్తున్నారు?

లాలాజీ పుస్తకం పునర్ముద్రణకు పీఠిక వ్రాస్తూ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ వివరించినట్టు, మన దేశం భవిష్యత్తుపట్ల శ్రద్ధాసక్తులున్న వారందరు విధిగా చదవవలసిన గ్రంథ మిది. తక్కినవారికంటె ముఖ్యంగా మన విద్యా మంత్రులు, విద్యాశాఖాధికారులు విధిగా మననం చేయవలసిన పుస్తక మిది.

(ఆంధ్రజ్యోతి 9-7-1968)

విద్య	విజ్ఞానం



మన దేశంలో మాత్రమే కాక, ప్రపంచం మొత్తంపైనే నేటి విద్యావిధానం లోపభూయిష్టమేమో! ఎంతగా దీన్ని మించి నేటి ప్రపంచం దుస్థితికి మరొక కారణం కానరాదు.

విద్యాప్రచారాని కేమి, విజ్ఞానప్రబోధాని కేమి నేడున్న అశేషావకాశాలు ప్రపంచచరిత్రలో మున్నెన్నడు కానరావు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఎన్నెన్ని అన్యవిద్యా కేంద్రాలు నేడు లేవు ? ముద్రణ యంత్రం, వార్తాపత్రిక, గ్రామఫోన్, సినిమా, రేడియో, టెలివిజన్ ఎన్నెన్ని విజ్ఞాన వ్యాపక సాధనాలు నేడు లేవు ?

పది శతాబ్దాల క్రితం వానికి ఈ సాధనసంపత్తి పూర్తిగా ఊహాతీతమైనది కాదా ? ఇట్టిది సంభవం కాగలదని నాడు ఎవరైనా పలికివుంటే, అతడిని పగటి కలలుకంటున్నవానిగా భావించేవారు కాదా ? ఇంతే కాదు. "నీ పగటి కలలు నిజమైతే, మరి స్వర్గాన్ని కోరే వారెవరు?" అని అవహేళన సయితం చేసివుండే వారు కాదా ?

నాటి పగటికలలు నేడు నిజాలైనాయి. అయినా, భూతలం స్వర్గధామం కావడానికి మారుగా, అశాంతితో కళపెళ ఎందుకు ఉడుకుతున్నది?

పోనీ, ఇదివరకటి కంటే ప్రపంచంలో ఈనాడు అధికసంతుష్టి కానరాక పోయినా, అధికానందానుభూతి కానరాకపోయినా, కనీసం పాతకాలపు సంతుష్ట్యానందాలైనా కొరవడుతున్నా యేమి ?

ఏది ఉత్తమోత్తమ నాటకమనే ప్రశ్నించుకునేసరికి గ్రీసులో సోఫోజ్ వరకు, బ్రిటన్లో షేక్స్పియర్వరకు, ఫ్రాన్సులో మోలియర్వరకు, ఇండియాలో కాళిదాసువరకు వెనుకకు పోవలసిన అగత్యం కలుగుతున్నదేమి ?

ఏవి ఉత్తమోత్తమ శిల్ప, చిత్రకళలని వృచ్ఛించుకొనే సరికి ఏథెన్స్, రేమ్, పర్శెపోలిస్, బోరోబదూర్,అంకార్, అమరావతి, నాగార్జునకొండ, అజంతా, ఎల్లోరా మొదలైన కేంద్రాలలోని శిధిలావశేషాలు ముందుగా స్ఫురణకు ఎందుకు వస్తున్నాయి?

గతించిన కాలమే గొప్పదని, ప్రపంచం అంతకంతకు అథోగతి పాలైపోతున్నదని చెప్పడానికి ఇది మా ప్రయత్నం కాదు గాని, గతించిన కాలాన్ని ఆటవికయుగంగా ఎన్నడానికి వలసిన సాధన సంపత్తిని సమకూర్చుకోగలిగి కూడా, ఆధునిక మానవుడు పరిపూర్ణ వికాసాన్ని ఎందుకు పొందలేక పోతున్నాడని ప్రశ్నించుకొనక తప్పదు.

ప్రస్తుతం మనం అభ్యసిస్తున్న విద్య సమగ్రమైనది కాకపోవడం ఇందుకు కారణమా ? అది విషయ పరిజ్ఞానాని కిస్తున్న ప్రాధాన్యాన్ని హృదయపరిపక్వతకివ్వకపోవడం ఇందుకు మరొక కారణమా? సంస్కృతీ విజ్ఞానాల ప్రచారానికై మనకుగల అశేష సాధనసంపత్తిని మనం క్షణికమైన వినోదంకోసం, ఉద్రేకం కోసం దుర్వినియోగం చేయడం ఇందుకు వేరొక కారణమా?

ఇవన్నీ కూడా నిస్సందేహంగా ప్రస్తుత శోచనీయస్థితికి కారణాలే.

ఏది శాశ్వతం, ఏది క్షణికం? ఏది సుందరం, ఏది వికృతం? ఏది శ్రావ్యం, ఏది కర్ణ కఠోరం? ఏది జగత్కళ్యాణం, ఏది లోకకలంకం? తుదకు వ్యక్తిపరంగానైనా, ఏది శుభోదర్కం, ఏది తద్భిన్నం? - ఈ విచక్షణాజ్ఞానాన్ని నేటి విద్య మనకు గరపడం లేదు; నేడు మనకున్న విజ్ఞాన ప్రచారకసాధనాలు ఇందుకోసం వినియోగం కావడంలేదు. ఇందువల్ల ఆధునిక మానవునికి అక్షర జ్ఞానమేకాని, ఆత్మజ్ఞాన మబ్బడంలేదు; అతడు విభిన్న విషయ పరిజ్ఞానవంతుడౌతున్నాడే కాని, సంస్కృతీశోభితుడు కావడం లేదు.

అయినప్పుడు, ఒక ఆనంద కుమారస్వామి, ఒక సింజన్ ఆర్విన్ నేటి విద్యావంతులలోకంటె విద్యావిహీనులైనవారిలోనే అధికంగా సంస్కృతి కలదనడం అబ్బురం కాదుగదా ? స్వార్థంతో, ద్వేషంతో, అహంకృతితో ఆత్మవిధ్వంసన దిశకు శీఘ్రగతిని పురోగమిస్తున్న మానవజాతి రక్షణకు నేడు ప్రధానంగా కావలసింది విశిష్టమైన విద్య, వివేకాన్ని పెంచగల విజ్ఞానం.

ఈ హెచ్చరికనే నేడు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు స్నాతకోత్సవంలో మద్రాసు గవర్నర్, ప్రధాని, ఆర్థికమంత్రి ప్రభృతులు చేయడం ముదావహం. (ఆంధ్రప్రభ 12-12-1948)

వయోజన విద్య

(1948లో మద్రాసు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన విద్యా పథక అమలు సందర్భంలో రాసింది.)

అక్షరజ్ఞానం లేకుండా రామాయణం, మహాభారతం కథలు నేర్చిన వారున్నారు. వారు పురాణాలు కూడా చెప్పగలరు. పెద్ద పెద్ద వ్యవహారాలు చేసే వారున్నారు. ఈ విజ్ఞత ఎక్కడ నుంచి వచ్చిందంటే శ్రవణం చేతనే అని చెప్పక తప్పదు.

ఈ రోజున వయోజన విద్య వ్యాప్తిలోకి రావలెనంటే ముఖ్యంగా శ్రవణానికి అవకాశాలు కలుగజేయాలి. ఒక వయస్సు వచ్చిన పిమ్మట ఏ విషయం చెప్పినా తెలుసుకొనే శక్తి ఏర్పడుతుంది. చిన్నప్పుడు బడిలో చేరి అయిదు తరగతులు చదివి, సెకండరీ, కాలేజి విద్యలు పూర్తి చేసుకున్నా విజ్ఞానం ఎక్కువ కావలెనంటే అది కళాశాల వదలిన పిమ్మట నేర్చేదాని మీదనే ఆధారపడి ఉంటుంది. అందుచేత వయోజన విద్య అంటే విజ్ఞాన సంపాదన అని అర్థం చెప్పవచ్చు.

వ్రాయను చదువను నేర్చినంత మాత్రాన విద్య కానేరదు. అయిదు తరగతులు చదివి మానివేసిన వారెందరో కలరు. వారికి విజ్ఞానమనేది ప్రవర్థం కాలేదు. ఏ పదో ఏటనో చదువు మానివేసిన ఎడల ఆ పిమ్మట నేర్చుకోవలసింది ఎంతో ఉంటుంది. అందుచేత మద్రాసు ప్రభుత్వం వారు వయోజన విద్యా విధానానికి పూనుకొని ఒక కార్యక్రమాన్ని ప్రచురించినందుకు వారి నభినందించెదము. అయితే అది సమగ్రంగా ప్రచురిస్తేగాని దాని మంచిచెడ్డలను విమర్శించడానికి అవకాశం ఉండదు. ప్రస్తుతం స్థూలంగా చూస్తే ఈ విధానంతో ఎంత కాలానికి మన రాష్ట్రంలో నిరక్షరాస్యత పోయి, వయోజనులందరు విజ్ఞానవంతులు కాగలరని సందేహించవలసి వుంటుంది. ఇదంతా ధనంతో కూడినదని చెప్పవచ్చు. అయినా తక్కువ ఖర్చుతో, తక్కువ కాలంలో, విద్యా విజ్ఞానాలు అందరికి అందుబాటులో వుండే విధానాన్ని లక్ష్యంగా పెట్టుకొని పనిజేయడం ముఖ్యమని మా అభిప్రాయం.

నిర్బంధ ప్రాథమిక విద్యకు, వయోజన విద్యకు సంబంధం ఉంది. ఎప్పుడైతే నిర్బంధ ప్రాథమిక విద్య వ్యాప్తమవుతుందో అప్పుడు యేడాది కేడాదికి విద్య నేర్పవలసిన వయోజనుల సంఖ్య తగ్గిపోతుంది. అప్పుడు ముఖ్యంగా చేయవలసిన పని చదువుకున్న చదువు మరిచిపోకుండా చేసి వారి విజ్ఞానం అభివృద్ధి చేయడమే అవుతుంది. అందుకుగాను ప్రభుత్వం వారు స్థాపించదలచిన గ్రామ కళాశాలలు తోడ్పడగలవని విశ్వసిస్తాము. అవి గ్రామాలలో విజ్ఞాన కేంద్రాలుగా వికసించాలి. వాటికి గ్రామాలలోని గ్రంథాలయాలు, రేడియో ఎంతగానో తోడ్పడగలవు. ఈ సందర్భంలో గ్రంథాలయాలున్న చోట్ల వాటి తోడ్పాటును పూర్తిగా తీసుకొని ఆంధ్ర దేశ గ్రంథాలయ సంఘం వారి తోడ్పాటును పొందడం సముచితం.

మద్రాసు ప్రభుత్వ ప్రకటనలో 13 నుంచి 40 ఏండ్ల మధ్య వయోజనులను తాము స్థాపించే పాఠశాలలందు చేర్చుకొనేటట్లు తెలియజేశారు. కాని కొందరు 11 యేండ్ల నాటికే పాఠశాల వదలివేస్తారు. 50 ఏండ్లు దాటనివారిని కూడా చేర్చుకుంటే బాగుంటుంది. అందుచేత 11 సంవత్సరాల వయస్సుగల వారి నుంచి 50 ఏండ్లు వెళ్ళనివారి వరకు ఈ పాఠశాలలలో చేర్చుకోవచ్చు. ఈ పాఠశాలలో కొన్ని పుస్తకాలు చదవడానికి ఒక సంవత్సరం చదువు చెప్పబడుతుందని, ఆ పిమ్మట రెండేండ్ల శిక్షణతో వార్తాపత్రికలు చదివేశక్తి కలుగజేయబడుతుందని ఈ ప్రకటనలో వివరింపబడింది. కాని ఇంతకాలం అనవసరమని తోస్తుంది. రోజుకు ఏ గంటో గంటన్నరో చదువు చెప్పినా ఆరు మాసాలలో రాయడం బాగా పుస్తకం చవడం చేతనవుతుంది. మరి ఆరుమాసాలలో పత్రికలు చదివేటట్లు చేయడం సులభం. అందుచేత ఈ పాఠశాలలో మొత్తం ఏడాదికన్న చదువనక్కర లేకుండా చేస్తే తక్కువకాలంలో ఎక్కువమంది వయోజనులకు విద్య నేర్పవచ్చు.

అయితే ఇదంతా సమర్థులైన ఉపాధ్యాయుల మీద ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వ ప్రకటనలో ఈ విషయం వివరించబడింది. ఇది చాలా ముఖ్యమైన విషయం కూడా. చిన్న పిల్లలకు చదువు చెప్పడం కంటే యుక్తవయస్సు వచ్చినవారికి చెప్పడంలో ఎక్కువ మెలకువ కావాలి. అదివరలో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారికే కాకుండా కొత్తవారికి ముఖ్యంగా అప్పుడే కాలేజి వదలిన యువకులకు శిక్షణనిస్తే వారు ఎక్కువగా ఉపకరిస్తారు. వారికి వేతనాది సౌకర్యాలు కూడా ఎక్కువగా చేయవలసి వుంటుంది. అట్టి ఉపాధ్యాయులు ఉంటేనే ఈ సమస్య పరిష్కార మవుతుంది.

ప్రభుత్వం వయోజన విద్యాభివృద్ధికి ఇప్పుడు తలపెట్టిన కార్యక్రమం మంచిదైనా ఒక ప్రణాళికతో నిది ప్రారంభమైనట్టు కనిపించదు. మన రాష్ట్రంలో ఎందరు వయోజనులు కలరో, వారికీవిధంగా విద్యా శిక్షణల కెంత ఖర్చు కాగలదో, ఎన్ని సంవత్సరాలలో ఈ పని సమగ్రంగా నడువగలదో మున్నగు వివరాలు మా ఎదుటలేవు. అయినా మద్రాసు ప్రభుత్వం ప్రారంభించిన ఈ కార్యక్రమంతో రాష్ట్రంలో నిరక్షరాస్యతపోయి ప్రజలలో విజ్ఞానం వృద్ధి అయ్యేటంత వరకు అది అనుసరింపబడుతుందని ఆశిస్తున్నాము. ఈ సందర్భంలో ప్రభుత్వం అనధికార సంస్థల సహకారాన్ని పొందడానికి ప్రయత్నించడం కూడా అత్యవసరం.

(ఆంధ్రప్రభ 12-5-1948)

గ్రంథ పఠనం

(చెన్నైలో ఫోర్డు ఫౌండేషన్ సహకారంతో ఏర్పడిన దక్షిణ భాషా పుస్తక సంస్థ (Southern Languages Book Trust) ఏర్పడిన సందర్భంలో నార్లవారి ఆకాంక్ష.)

చదువు పెరుగుతున్నది; చదువు తగ్గుతున్నది. పరస్పర వైరుధ్యమున్నట్టు తోస్తున్న ఈ వాక్యంలో నిజానికి అట్టిదేదీ లేదు. "చదువు" అనే పదానికి "శబ్దార్ధ చంద్రిక" క్రియగా "పఠించు" అని, విశేష్యంగా "పఠనము, విద్య" అని అర్థాలను వ్రాస్తున్నది. విశేష్యంగా "చదువు" పదానికున్న రెండు అర్థాలను దృష్టిలో పెట్టుకుంటే, ప్రస్తుతం చదువు పెరగడంతోపాటు, అది తగ్గిపోతున్నదని ఎవరైనా అంగీకరించక తప్పదు. చదువు నేర్చినవారి సంఖ్య నిస్సంశయంగా పెరుగుతున్నది. కాని, ఇందుకు అనుగుణంగా పుస్తక పఠనం పట్ల ఆసక్తి చూపేవారి సంఖ్య పెరగడం లేదు. విద్యావంతులైన వారిలో గ్రంథ పఠనాసక్తి గలవారి శాతం ("పర్సంటేజ్") ఇప్పుడున్నంత తక్కువగా ముందెన్నడు లేదేమో!

చదువు తక్కువైన రోజులలో తామై చదువుకొనలేనివారు ఇతరులు చదువుతుండగా వినడానికి చెవులు కోసుకునేవారు. పురాణాది కాలక్షేపాల వద్ద ఇట్టివారు వేనకు వేలు కనదుతుండేవారు. చదువు పెరిగిన ఈ రోజులలో చదువుకున్న వారిలో హెచ్చుమంది బడిని విడిచిపెట్టిన తర్వాత తిరిగి పుస్తకం చేతబట్టిన పాపాన్ని అంతగా పోవడంలేదు సరిగదా, చదువు రానివారిలో ఇతరులు చదువుతుండగా వినాలన్న ఆసక్తి ఇదివరలో వలె హెచ్చుగా కానరావడంలేదు.

పుస్తకాలను చదువుతున్న వారిలో సయితం పెక్కుమంది ఉబుసుపోకకు పనికివచ్చే వాటి పట్లనే మోజు చూపుతున్నారు తప్ప, మెదడుకు పని పెట్టగల వాటి చాయలకైనా పోవడం లేదు. రైలులో కూర్చున్న కాసేపూ రంజింపజేయగలిగిందే రసవత్తరమైన రచన; బస్సు ప్రయాణం బాధను మరపింప జేయగలిగిందే బహుళ ప్రచారం పొందగల గ్రంథ రాజం. ఇందువల్లనే ప్రణయ కథకు లభిస్తున్న

ప్రజాదరణలో పదవ వంతుకైనా పద్య కావ్యం నోచుకొనడం లేదు; అపరాధ పరిశోధక నవలల అమ్మకంలో అరవయ్యో వంతుకూడా అన్య విధమైన రచనలకు ఉండడం లేదు.


మొత్తంపై విజ్ఞానం కంటె వినోదానికే ప్రస్తుతం ప్రాధాన్య మివ్వబడుతున్నది. కనుకనే విజ్ఞాన ప్రదమైన గ్రంథాలకు మారుగా వినోదకరమైనవి ఆదరించబడుతున్నాయి. కేవలం మన దేశంలోనే కాక, ఇతర దేశాలలో కూడా తరతమ భేదాలతో ఈ దుష్పరిణామం గోచరిస్తున్నది. దీని ఫలితంగా ఆధునిక యుగంలో ఆలోచనే తక్కువై పోతున్నది. ప్రపంచం మొత్తం మీదనే జ్ఞాన తృష్ణ ఈనాడు సమసిపోయినదనడం సత్యదూరం కాగలదు గాని, ఈ తృష్ణ చాలావరకు ప్రకృతి శాస్త్రాలకే పరిమితం. అణుగర్భంలోని రహస్యాలను పెకలించడానికి ఆతురత విశేషంగానే చూపబడుతున్నది; ఆత్మ స్వరూపం తెలుసుకొనవలెనన్న ఆకాంక్షే తక్కువ.

మరొక విషయం : ప్రకృతి వేత్తలు మాత్రమే కాగా, ప్రపంచ ప్రజా బాహుళ్యంలో అసలు ఏ విధమైన జ్ఞానతృష్ణ అంతగా లేకుండా పోతున్నది. నిత్య జీవితావసర వస్తువులను యంత్రాలు సులువుగా, "మెకానికల్"గా చేసి పెడుతున్నట్టే, మెదడుకు కావలసిన మేతను కూడా తామేమీ శ్రమపడనవసరం లేకుండా ఎవరైనా గుళికల రూపంలో అందించితే పుచ్చుకోవాలన్న కాంక్షే జ్ఞానతృష్ణ అయితే మాత్రం, అది ప్రస్తుతం విస్తారంగానే ఉన్నదని చెప్పవచ్చు!

విద్య పెరుగుతున్నా, వైజ్ఞానిక శాస్త్రాలు పెరుగుతున్నా, ప్రపంచంలో విజ్ఞత పెరగక పోవడానికి కారణం - స్వయంగా ఆలోచన చేసుకునే శక్తి క్షీణించి పోవడమే. ఈ లోపం తీరితేనే తప్ప తనను యెదుర్కొంటున్న మహా సమస్యలను ఆధునిక ప్రపంచం సవ్యంగా పరిష్కరించుకొననూ లేదు; ప్రగతిని సాధించనూ లేదు.

ఆలోచనా శక్తిని ప్రోది చేయగలిగింది ఉత్తమ గ్రంథ పఠనం మాత్రమే! ఈ విషయాన్నే నిన్న చెన్నపురిలో "సదర్న్ లాంగ్వేజెస్ బుక్ ట్రస్ట్"కు ప్రారంభోత్సవాన్ని చేస్తూ భారత ప్రధాని హెచ్చరించారు. పుస్తక పఠనంపట్ల ఆసక్తి అంతకంతకు తగ్గిపోతున్నదని, దీన్ని నివారించాలంటే, చౌక ధరణకు మంచి పుస్తకాలను దేశభాషలలో విరివిగా ప్రచురించడం ముఖ్యావసరమని "బుక్ ట్రస్ట్" అధ్యక్షులైన డాక్టర్ ఎస్. గోవిందరాజుల నాయుడుగారు తమ స్వాగతోపన్యాసంలో చెప్పిన మాటలతో పూర్తిగా ఏకీభవిస్తూ, భారత ప్రభుత్వం కూడా దేశ భాషలన్నింటిలోను ఉత్తమ గ్రంథాల బహుళ ప్రచారానికి ఒక విస్తృత కార్యక్రమాన్ని అమలుజరపనున్నట్టు ప్రధాని నెహ్రూ ప్రకటించడం ముదావహం. అందరికీ అందుబాటులో ఉండగల ధరలకు అత్యుత్తమమైన గ్రంథాల ప్రచురణలో భారత ప్రభుత్వం స్థాపించ నుద్దేశిస్తున్న సంస్థకే ఆదర్శప్రాయం కాగల విధంగా, డాక్టర్ గోవిందరాజుల నాయుడుగారి అధ్యక్షతను "బుక్ ట్రస్ట్" శీఘ్ర పురోగతిని పొందగలదని ఆశిస్తున్నాము. (1955)

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా



(భారత ప్రభుత్వం తరపున 1957లో ఏర్పడిన జాతీయ పుస్తక సంస్థ ఏర్పాటైన సందర్భంలో ఉత్తమ, ఉదాత్త గ్రంథాల ప్రచురణను ఆశిస్తూ రాసింది.)

మానవతలోని మహోత్తమ భావసంపత్తి అనూచానంగా గ్రంథస్థమై మనకు సంక్రమిస్తున్నది. "పుస్తకాలు నిలువెత్తు మానవులు. భవిష్యదంతరాళం లోనికి వినిపించునంత గట్టిగా మాటలాడగల సత్త్వం వానికే ఉన్నది" అన్నాడు బ్రౌనింగు.

ఔను! అనాదిగా, అనంతంగా, నిరంతరాయంగా సాగుతున్న మానవ పురోగమన కర్ణధారిత్వం పుస్తకాలదే.

ఇటు నటు కొట్టుమిట్టాడుతున్న మానవాత్మకు, ఎప్పటికప్పుడు లోకకల్యాణ మహాపథం చూపించి పుణ్యం కట్టుకున్నవీ పుస్తకాలే.

నాటికీ, నేటికీ కాదు; రేపటికీ, మాపటికీ కూడా లోకంలోని దానవతను నిర్మూలించడానికి, మానవతలోని దైవత్వాన్ని వెలువరించడానికి సాహిత్యం మనకొక మహాసాధనమై నెలకొన్నది. శాంతికి, సంగ్రామానికి, మహా ప్రళయానికి, పునస్సృష్టికి, చైతన్య స్ఫూర్తికి, జడతా ప్రవృత్తికి నడుమ నిలిచి నిలువెల్లా కంపించిపోతున్న జనతా గతికి బాసట కాగల సమర్థత మహా గ్రంథ గర్భితమై నిలిచి ఉన్నది.

మహాత్ములు, మహా పురుషులు యుగయుగాలా, తరతరాలా జన్మిస్తున్నారు. తమ ఉత్తమ భావ ఝురిని బీటలువారి పోయిన నేలపై పారించి నవనవాంకురములను పొటమరింప జేస్తున్నారు. అయితే, వారు ఒక దేశంలో పుట్టరు; ఒకే తరంలోనూ తల యెత్తరు.

కాని, లోకం నేడొక పెద్ద కుటుంబమై పోతున్నది. జాతులను, రీతులను దాటి, మనిషి మనిషికీ - దేశదేశానికీ - అమృత సందేశ మివ్వగల మహాగ్రంథ సంచయం ఎక్కడ, ఏనాడు వెలువడినా, లోకమంతటికీ చెందిన పవిత్ర ధనమే అవుతుంది.

మొన మొన్న కనుదెరచి నట్లున్న పాశ్చాత్య సంస్కృతులు నాడు నాడునా వెలసిన ఉత్తమ గ్రంథముల నన్నిటినీ తమవిగా చేసుకొని సుపరిపుష్టములైనవి.

క్రమక్రమంగా కడకు మన వేదవేదాంగాదులను కూడా మనలో చాలమంది ఆంగ్లాను వాదాలద్వారా అవగాహనం చేసుకొనవలసినంతగా ఆ స్థితి తేలింది.

ఆంగ్లంలో రాని ఏ ఉత్తమ భాషా కృతీ లేదన్నంతవరకూ వారు కృషిచేసిరి గనుకనే, ఆ భాష అంత సమగ్రమూ, ఆ సాహిత్య మంత సమున్నతమూ కాగలిగినవి.

ఆ పరమాదర్శాన్ని మనమూ అనుసరించవలసిన సమయం ఆసన్నమైనది. దేశం స్వతంత్రమై, ప్రజాసత్తాక ప్రభుత విలసితమై వేయి రేకులుగా మన జాతి వికసిస్తున్న ఈ రోజు, మన భాషా సారస్వత మహాధనాన్ని ఇబ్బడి ముబ్బడి చేసుకొనవలసిన అగత్యం కలిగినది.

భారతజాతి ఏకీకృతమై, సుశిక్షితమై, సుప్రతిష్ఠితమై ముందుకు పురోగమించవలసి ఉన్నది. ఆ పురోగతిలో కేవలం భాషా పండితులేకాక, సామాన్య ప్రజానీకం కూడా అగ్రశ్రేణిలో నిలబడవలసి ఉన్నది.

జనసామాన్యంలో విజ్ఞాన చైతన్యదీప్తి, విభాసించవలెనంటే, వారి మనోగతి మహోన్నతాదర్శ ప్రేరితం కావలెనంటే, వారికి మనం సమర్పించగల సాధనసంపత్తి వారికి తెలిసిన భాషలో, వారు విశ్వవిజ్ఞానం గ్రహించగల అవకాశాన్ని కల్పించాలి.

భాషల హద్దులను, సుద్దులను మరచి జాతులు ఒక త్రాటిపై ముందుకు నడవగల పాటవం సామాన్య ప్రజలకు కలిగించడానికి ప్రపంచ మహోత్తమ గ్రంథ సంచయం వారికి తెలిసిన భాషలలో అందించడం అవసరమన్న రాధాకృష్ణ పండితుని ప్రబోధంలో మహత్తర సత్యం ఇమిడి ఉన్నది.

ఈ ఆశయంతో నిన్న భారత ప్రభుత్వం ఏర్పరచిన "నేషనల్ బుక్ ట్రస్ట్" మనకే కాక, భావితరాలకూ చెరగని - తరగని - వజ్ర ఖనిగా కావలెననీ, కాగలదనీ మేము విశ్వస్తున్నాము. ఏ వ్యక్తులో ఏ కొన్ని సంస్థలో చేయవలసిన పనికాదిది. కావలసినంత అంగబలం, అర్థబలం ఉన్న కేంద్ర ప్రభుత్వం వంటిదే పూనుకొని చేయగల మహత్కార్య మిది.

కావుననే, నేటికైనా సాహిత్యం ఏ కొందటి పండితుల కోసమో, పచ్చగా వెచ్చగా మనుగడ గడపుతున్న వారి కోసమో కాదనీ, ఆ విజ్ఞాన సంచయం మనిషి మనిషికీ అందించవలసి ఉన్నదనీ మనం గ్రహించడం రానున్న సువర్ణ శకానికి నాందీ వాచకం కాగలదని భావిస్తున్నాము.

ప్రపంచంలో అనాదిగా వచ్చిన - వస్తున్న - ఉత్తమ రచనా పరంపర ఏమూల పుట్టినా, లేక, ఏ చాలు మెట్టినా, అందరికీ అనుభవయోగ్యం కాగల రోజు మన భారత దేశంలోనూ ఉదయించగలదన్న భావమే ఎంత అద్భుతమైనది! ఎంత ఆనందకరమైనది!

మన భారత భాషలలోనూ అనాదిగా, అనంతంగా వస్తున్న గ్రంథ సంచయం ఎక్కడికక్కడ గీసుకున్న గీతలలో కూరుకొని పోక, నేల నాలుగు చెరగులా విరిసి విప్పారిననాడు నిజంగా మనదేశం ఏకమూ, ఏకైకమూ అన్న బలీయమైన భావన వేరు తన్నగలదు.

ఈ కృషి ఫలించి మన దేశ భాషలలోని సాహిత్యమూ, ప్రాచ్య పాశ్చాత్య భాషలలోని సాహిత్యమూ మన నుడులలో పొదివికొని మన కుమారులకూ మన కూతులకూ ఇవ్వగలిగితే ఇక మన భాషకూ సాహిత్యానికే కాదు, అది మన జాతికీ మన మనుషులందరికీ చేసుకొన్న - చేసుకొనగల మహోత్తమ సేవకాగలదు.

ఆ రోజున కిది ఉషోదయం మాత్రమే. త్వరలో, అతిత్వరలో ఈ విజ్ఞాన భానుబింబం నడినెత్తికెక్కి చీకటినీ, వేసటనూ పారద్రోలి మన నేలను ప్రకాశవంతం చేయగలదని మనసారా ఆశిస్తున్నాము; కాదు, విశ్వసిస్తున్నాము. (1957)

గ్రంథాలయ సంఘ స్వర్ణోత్సవాలు

(ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం 1964లో స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో రాసింది.)



భారత దేశంలో మొట్టమొదటగా గ్రంథాలయోద్యమానికి ఈ శతాబ్దారంభంలో అంకురార్పణ చేసినవారు నాటి బరోడా మహారాజా అని చెబుతారు. కాగా, గ్రంథాలయాలను స్థాపించడం ఒక ప్రజోద్యమంగా, పవిత్రమైన దేశ సేవా కార్యంగా ప్రారంభమైంది ఆంధ్రదేశంలోనే. గ్రంథాలయాల స్థాపనలో మొత్తం దేశానికే పురోభాగాన నిలబడిన ఖ్యాతి ఆంధ్రులకే దక్కింది. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించినవారిలో శ్రీయుతులు మోచెర్ల రామచంద్రరావు, మాడపాటి హనుమంతరావు, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు మొదలైన ప్రముఖులున్నా, మూలపురుషులుగా ప్రత్యేకించి పేర్కొన వలసింది శ్రీ అయ్యంకి వెంకట రమణయ్యగారినే.

విజయవాడలో 1914లో చిలకమర్తివారి అధ్యక్షతన జరిగిన మహాసభలో అయ్యంకివారి కార్యదర్శిత్వాన ఏర్పడిన ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘం ఈనాడు స్వర్ణోత్సవాలు జరుపుకొంటున్నది. కడచిన అర్ధ శతాబ్దంలో గ్రంథాలయోద్యమ వ్యాప్తికి ఈ సంఘం చేసిన మహత్తర కృషికి ఆంధ్రులెంతగానో రుణపడి ఉన్నారు.

అక్షరాస్యత బొత్తిగా హీనస్థితిలో ఉన్న ఆ రోజులలో గ్రంథాలయాలను స్థాపించవలెననే సంకల్పం కలగడమే ఒక సాహసం. అధికారంలో ఉన్నది పర ప్రభుత్వం కనుక దాని సహాయాన్ని ఆశించే ఆస్కారంకూడా ఉండేది కాదు. ప్రజలలో విద్యాగంధం తక్కువ కావడం వల్ల ప్రజాదరం కూడా తక్కువే. కేవలం విద్యాధికులు, ప్రజాహిత చింతకులు అయిన కొందరి దీక్షా సంకల్పాలే ఏడుగడగా ఉద్యమం వర్ధిల్లవలసి వచ్చింది.

ఆనాటి గ్రంథాలయాలు కేవలం నెలసరి రుసుము పుచ్చుకొని పుస్తకాలు అరువిచ్చే సంస్థలు మాత్రమే కాదు. వైజ్ఞానిక కేంద్రాలుగా, ఉపన్యాస వేదికలుగా, వయోజన విద్యాశాలలుగా, రాజకీయ, సాంఘిక చైతన్య దోహదకారులుగా ఆనాటి ఉద్యమకర్తలు వాటిని తీర్చిదిద్దారు. అవి ప్రజల సర్వతోముఖాభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయి.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతగాని మన దేశంలో గ్రంథాలయాలకు సరియైన ప్రోత్సాహ పురస్కారాలు లభించలేదు. 1950లో మద్రాసు ప్రభుత్వం పౌర గ్రంథాలయాల శాసనం అమలు చేసింది. తర్వాత పదేళ్ళకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలకు వర్తించే విధంగా సమగ్ర శాసనం చేసింది. దీనితో ప్రతి జిల్లాకు లోకల్ లైబ్రరీ అథారిటీలు ఏర్పడ్డం, వాటి ఆధ్వర్యాన విరివిగా గ్రంథాలయాలేర్పడి ఆర్థిక సహాయం పొందడం, ఒక నిర్ణీత పద్ధతిలో గ్రంథాలయాల అభివృద్ధికి అవకాశా లేర్పడం జరిగింది.

ఈ శాసనం నిర్మాణంలోనేమి, రాష్ట్రంలో నేడు గ్రంథాలయాల సంఖ్య మూడు వేలకు పైగా వృద్ధి కావడంలో నేమి ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘం చేసిన కృషి చిరస్మరణీయమైంది.

అయితే, శాసనం వచ్చినంత మాత్రాన, ప్రభుత్వ సహాయం లభించినంత మాత్రాన, గ్రంథాలయాల సంఖ్య పెరిగినంత మాత్రాన చాలదు. శాసనోద్దేశం సరిగా నెరవేరుతున్నదా? ప్రభుత్వ సహాయం సద్వినియోగ మవుతున్నదా? ప్రజా బాహుళ్యంలో విజ్ఞాన వ్యాప్తికి ఉపకరించే గ్రంథాలకు గ్రంథాలయాలలో ఎంతవరకు స్థానం లభిస్తున్నది? ఈ ప్రశ్నలకు సమాధానాలపైనే ఉద్యమ జయాపజయాలు ఆధారపడి ఉన్నాయి.

ఏయే గ్రంథాలను ఎన్నెన్ని కొనాలనే నిర్ణయాన్ని గ్రంథాలయాధికారులకే పూర్తిగా విడిచిపెట్టకుండా, ఒక కేంద్ర సంస్థను స్థాపించి దానిద్వారా మొత్తం రాష్ట్రానికి వర్తించే నిర్ణయాలను చేయడంవల్ల ప్రస్తుత లోపాలు చాలవరకు తొలగవచ్చునని మా సూచన. కేంద్ర సంస్థలో కూడా వైదుష్యానికి, సచ్ఛీలానికి, నిర్మొగమాటానికి పేరుపడిన ప్రముఖ ప్రజా సేవకులనే సభ్యులుగా నియమించడం, వారి నిర్ణయాలను పంచాయతీ, జిల్లా, హైస్కూల్, కాలేజీ గ్రంథాలయా లన్నిటికి వర్తింపజేయడం ప్రయోజనకారి కాగలదు. ఇది గ్రంథాలయాల స్వేచ్ఛకు విరుద్ధమని భావిస్తే, వాటి నిర్ణయాలకు నూటికి ఏ ఇరవై అయిదు వంతుల గ్రంథాల కొనుగోలునో వదలి పెట్టవచ్చు. ఏమైనా ఇటువంటి సంస్కరణమేదో తలపెట్టని పక్షంలో ప్రస్తుతపు అసంతృప్తికర పరిస్థితులు తొలగిపోవు.

(ఆంధ్రజ్యోతి 29-4-1964)

మరిలేని గుంటూరు మునిసిపల్ లైబ్రరీ

(విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీ స్థాపించాలనే ఉద్యమించిన ఆందోళనకారులు 1966 నవంబరు 1 న, గుంటూరులో

ఎంతో ప్రసిద్ధి చెందిన మునిసిపల్ లైబ్రరీని పూర్తిగా దగ్ధం చేశారు. దీనిపై కలత చెంది రాసినది.)

విద్యకు నిజానికీ విలువనిచ్చే ప్రతి వ్యక్తికి సంస్కృతిని, సభ్యతను తులలేనివిగా భావించే ప్రతి వ్యక్తికీ కంటతడి తెప్పించగల శోచనీయ సంఘటన గుంటూరు మునిసిపల్ లైబ్రరీ బూదిపోగు కావడం! ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యమం సందర్భంలో జరిగిన - జరుగుతున్న ఉద్రిక్త చర్యల మంచి చెడ్డలను నేను చర్చించబోవడం లేదు. కాని మునిసిపల్ లైబ్రరీకి నిప్పు పెట్టిన వారు తమ చర్యల వల్ల తమ పట్టణం ఎంతటి మహత్తర సంపదను కోల్పోగలదో ఒక క్షణం పాటు ఆలోచించి ఉంటే పని చేయడానికి వారికి బహుశా చేతులు వచ్చేవి కావు. ఈ మునిసిపల్ లైబ్రరీ ఏమంత పెద్దది కాకపోవచ్చు. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు పుస్తకాలన్నింటిని కలుపుకొని దీనిలో నాలుగైదు వేలకు మించి లేకపోవచ్చు. అయినా వీటిలో కనీసం ఒక వెయ్యి పుస్తకాలు ఈనాడు అచ్చులో లేనట్టివి. ఎంత ధరకైనా లభించనట్టివి. మద్రాసులోని ఏ కన్నెమరా లైబ్రరీలోనో, కలకత్తాలోని నేషనల్ లైబ్రరీలోనో తప్ప చదువుకోడానికి దొరకనట్టివి. మన చరిత్రపట్ల, సంస్కృతిపట్ల భక్తి శ్రద్ధలున్నవారు కన్నులకు అద్దుకోదగినట్టివి. ఈ లైబ్రరీపై దాడిచేసి, దీనికి నిప్పు పెట్టినవారు ఇ.బి. హావెల్, ఆనందకుమారస్వామి పేర్లను విని ఉండకపోవచ్చు. భారతీయచిత్ర, శిల్పకళల సౌందర్యాన్ని, సందేశాన్ని వారు లోకానికి చాటి చెప్పారు. వారు చెప్పక పూర్వం మన కళల అందాన్ని, వాటి అర్థాన్ని, వాటి అమూల్య సందేశాన్ని మనం

గుర్తించలేని స్థితిలో ఉన్నాము. అయినప్పుడు పాశ్చాత్యులు వాటి విషయమై ఇంతకంటె అజ్ఞాన స్థితిని ప్రదర్శించడం ఆశ్చర్యకర విషయం కాదు గదా? ఇట్టి స్థితిలో మన కళలకు పూజారులై, వాటి సేవకే జీవితాన్ని అంకితం చేసి వాటి పట్ల సమస్త ప్రపంచానికి భక్తి గౌరవాలను కల్పించిన ప్రముఖులే హావెల్, ఆనంద కుమారస్వాములు. అచ్చులోలేని వారి రచనలు కనీసం పది, పదిహేను మొన్నటి సంఘటనలో బూదిపాలైనాయి."

శ్రీబెనర్జీ శాస్త్రి సంస్కృతంలో మహాపండితుడు. పాట్నా విశ్వవిద్యాలయ పీఠానికి ఆయన కొంత కాలంపాటు ప్రధానాచార్యులు. వేద వేదాంగాలలో, ప్రత్యేకించి రుగ్వేదంలోనూ, శతపథ బ్రాహ్మణంలోను ఎంత వరకు ప్రాచీన భారత చరిత్రకు సంబంధించిన చారిత్రకాంశాలున్నవో నిర్ణయించడానికై ఆయన ప్రత్యేక పరిశోధనలు చేశారు. తన కృషి ఫలితంగా ఆయన కొన్ని విషయాలను వెలుగులోకి తెచ్చి, కొన్ని కొత్త సిద్ధాంతాలను ప్రతిపాదించారు కూడా. వేదకాలంనాటి సంఘర్షణలలో ఆర్యులు, దస్యులు మాత్రమే కాక, మరొక జాతివారు కూడా పాల్గొన్నారని ఆయన చేసిన ఒక ప్రధాన సిద్ధాంతం. ఆ మూడవది అసుర జాతి అని నిరూపణ చేయడానికి శ్రీ బెనర్జీ శాస్త్రి యత్నించారు. ఈ అసురులు దస్యులకు భిన్నులని, వీరు అసీరియా నుంచి మన దేశానికి వచ్చినవారని, నౌకాయానంలో, నౌకావాణిజ్యంలో వీరు ప్రవీణులని, ఆర్యులకంటె నాగరికులని ఆయన వాదం. విషయాలన్నిటిని పొందుపరుస్తూ 'అసుర ఇండియా' అనే పరిశోధక గ్రంథాన్ని ఆయన దాదాపు అర్ధ శతాబ్ది క్రిందట ప్రచురించారు. ఈనాడు మనదేశం మొత్తం పై ఒక యాభై గ్రంథాలయాలలోనైనా దీని ప్రతి లభిస్తుందో లేదో అనుమానమే. మునిసిపల్ లైబ్రరీ బూదిపోగులో ఈ అమూల్య గ్రంథం ప్రస్తుతం ఒక గుప్పెడు బూడిద. (గమనిక : *ఈ గ్రంథం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాదులో ఉంది).*

మన దేశంలో కొనసాగుతున్న విప్లవోద్యమాలను గురించి విచారించడానికై 1917లో బ్రిటిషు ప్రభుత్వం సర్ సిడ్నీరౌలట్ అధ్యక్షుడుగా ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ నివేదిక సూచనల ప్రకారం జరిగింది కనుకనే 1919లో జరిగిన నిరంకుశ శాసనాన్ని రౌలట్ చట్టం అన్నారు. రౌలట్ కమిటీని తామే నియమించినా అది తమకు సమర్పించిన నివేదికను తమ ముద్రణాలయంలో తామే స్వయంగా ముద్రించినా అది విప్లవోద్యమ చరిత్రను, విప్లవ మద్దతులను సమగ్రంగా వివరిస్తుందని ఆ కారణంగా విప్లవకారులకు పాఠ్య గ్రంథంగా వినియోగిస్తున్నదని బ్రిటీషువారు తమ కమిటీ నివేదిక ప్రచారం కాకుండా తామే చర్య తీసుకున్నారు. ఈ రౌలట్ కమిటీ నివేదిక - దీన్ని 'సెడిసన్ కమిటీ నివేదిక' అని కూడా పేర్కొనడం కద్దు. చాలా చెదురుగా తప్ప ఇప్పుడు దొరకదు. మునిసిపల్ లైబ్రరీ బూదిపోగులో ఈ నివేదిక ప్రతి సయితం ఈనాడు ఒక గుప్పెడు బూడిద!

మచ్చు తునకలుగా ఈ మూడు గ్రంథాలను గురించి మాత్రమే నేను వ్రాశాను. అచ్చులో లేని ఇట్టి పుస్తకాలు అమూల్య మైన ఇట్టి గ్రంథాలు మరెన్నో మునిసిపల్ లైబ్రరీ బూడిద పోగులో నేడు గుప్పెడేసి బూడిదగా ఉన్నాయి. మనకు గౌరవనీయులైన, మనకు పూజనీయులైన దాదాభాయ్ నౌరోజీ, ఫిరోజ్ షా మెహతా, సురేంద్రనాథ్ బెనర్జీ, మదన మోహన మాలవ్య, బాలగంగాధర తిలక్, గోపాలకృష్ణ గోఖలే, బిపిన్ చంద్రపాల్, లాలాలజపత్ రాయ్, అరవిందఘోష్, అనిబిసెంట్, మోహన్దాస్ కరమచంద్ గాంధీ, చిత్తరంజన్ దాస్, జవహర్లాల్ నెహ్రూ, సుభాసు చంద్రబోసు ప్రభృతులు రచనలు ఆ బూదిపోగులో కాస్త కాస్త బూడిదగా మిగిలి ఉన్నాయి. వారి రచనలలో అనేకం ఈనాడు కష్ట సాధ్యంగా గాని లభించడం లేదు. వివరాలలోకి పోకుండా మన మతం, మన సాహిత్యం, మన కళలు, మన విజ్ఞానం, మన సంస్కృతి, మన చరిత్ర, మన సంప్రదాయాలు అన్నీ ఆ బూదిపోగులో కలసి ఉన్నాయంటే సరిపోతుంది. (ఒక ప్రత్యేక విలేఖరి) (ఆంధ్రజ్యోతి 5-11-1966)

(పునరుద్ధరణ: పోయిన గ్రంథాలయం పోగా దానిని మరల పునరుద్ధరించాలని గుంటూరు జిల్లా గ్రంథాలయ సంఘం తరపున త్రిపురమల్లు లక్ష్మయ్య గుప్త, గుడివాడ పుల్లారావు, రాచపూడి లక్ష్మీనరసింహారావు, గరికపాటి రామారావు, అనఘా గురుసుబ్బరాజు

ప్రభుతులు తీవ్రమైన కృషి చేశారు. ఇల్లిల్లూ తిరిగి వందల సంఖ్యలో పుస్తకాలు ప్రోగు చేసి పురపాలక సంఘానికి అప్పగించారు. మరల గాంధీ పార్కులో గ్రంథాలయం వెలిసింది. కాని ఇది నామమాత్రంగా పనిచేస్తున్నది అపూర్వ గ్రంథ సంచయంతో విలసిల్లిన వెనుకటి వైభవాన్ని, ప్రాభవాన్నిఇప్పుడు గల స్థితిని బేరీజు వేస్తే - ఫల పుష్ప భరితమైన మహావృక్షానికి మోడువారిన నిస్సార తరువుకు గల అంతరం అంతరంగం గల వారందరికీ గోచరిస్తుంది! నేడున్నది నామమాత్రపు గ్రంథాలయమే.)

జర్నలిజం

ఆంధ్రప్రభ తొలి దశాబ్దం



(ఆంధ్రప్రభ దినపత్రిక ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో రాసింది.)

ఆగష్టు 15 వ తేదీ భారత స్వాతంత్ర్య దినోత్సవం. ఇదే "ఆంధ్రప్రభ" జన్మదినోత్సవం కూడా. ఈ సంయోగం "ఆంధ్రప్రభ" అదృష్ట భాగ్యం.

పదేళ్ళు నిండి, పదకొండవ సంవత్సరంలో నేడు "ఆంధ్రప్రభ" పాదం పెడుతున్నది.

"ఇది ఒక వ్యక్తి జీవితంలో ముఖ్య సంఘటన కావచ్చుగాని, పత్రిక జీవితంలో దీనికి ప్రత్యేక ప్రాముఖ్యం కలదా?" అనే ప్రశ్న ఈ సందర్భంలో అసమంజసమైనది కానేరదు.

> పత్రిక ఆయుర్దాయానికి ఒక పరిమితి లేదు. నిజాన్ని తప్పకపోతే, నీతిగా నడిస్తే, నిర్భీకంగా ప్రవర్తిస్తే, కాలాన్నిబట్టి పరివర్తనం చెందుతుంటే, నిత్య నూతనత్వాన్ని ప్రదర్శిస్తుంటే, మానవసేవ చేస్తుంటే, అన్నింటినీ మించి, ప్రజాబాహుళ్యం ప్రేమాభిమానాలకు పాత్రమౌతుంటే, అది అమరజీవి.

పైగా, పత్రిక జీవితంలో బాల్య, కౌమార, యౌవన, వృద్ధాప్యాలనే చతుర్విధ దశలు లేవు. పుట్టుకతోనే ప్రౌఢత్వాన్ని ప్రదర్శించే పత్రికలు కొన్ని ఉంటాయి. జనన మందినంతనే జరాభారాన్ని ప్రదర్శించేవి మరికొన్ని ఉంటాయి. ఎన్నేళ్ళు బ్రతికినా, బాల్య చాపల్యాన్ని వీడలేనివి కొన్ని ఉంటాయి. కొన్నేళ్లలో గతించినా, లోకానుభవంలో పండిపోయినవి మరికొన్ని ఉంటాయి.

వ్యక్తిజీవితం పరిమితమైనది కాగా, పత్రిక జీవితం అనంతమైనది కావచ్చు. అన్యవిధాల కూడా ఈ జీవితద్వయ విధానాలలో భేదం కానరావచ్చు. కాని, రెండింటికి సమానంగా వర్తించే ఒక పరమసత్యం కలదు. "పౌరుష జ్ఞానకీర్తుల బరగెనేని, వాని జన్మము ఒక పూటయైన జాలు" అనేది వ్యక్తులకు వలె, పత్రికలకు కూడా సమానంగా వర్తిస్తుంది.

ఈ దృష్టి నుంచి చూస్తే, "ఆంధ్రప్రభ" తొలి దశాబ్దాన్ని గడిపి, ద్వితీయంలో ప్రవేశించడానికి - ఒకసారి ఆత్మ పరిశోధన చేసుకొనడానికి అవకాశంగా వినియోగించడం తప్ప - అన్య ప్రాధాన్యం లేదు.

గడిచిన దశాబ్దం మన దేశచరిత్రలోనేమి, ప్రపంచ చరిత్రలోనేమి అపూర్వమైనదనే చెప్పవచ్చు. ప్రపంచయుద్ధ ప్రారంభం, దాని సమాప్తి ఈ దశాబ్దంలో జరిగింది.

ఒక ప్రపంచ యుద్ధంలో పరాజయం వల్ల మూడు అగ్రరాజ్యాలు (జర్మనీ, ఇటలీ, జపానులు) హతమారి పోవడం, యుద్ధంలో జయించి కూడా రెండు మహారాజ్యాలు (బ్రిటన్, ఫ్రాన్సులు) చితికిపోవడం, ఈ సంఘటన ద్వయం ఫలితంగా ఇతఃపూర్వపు ప్రపంచ వ్యవస్థ పూర్తి పరివర్తనం చెంది, రష్యా, అమెరికాలు రెండు మాత్రమే ప్రపంచ ప్రధాన రాజ్యాలుగా నిలవడం ఈ దశాబ్దంలోనే జరిగింది.

బ్రిటీష్, ఫ్రెంచి, డచ్ సామ్రాజ్యాల శక్తి ఉడిగిపోగా, ప్రాచ్య జాతిలో నూతన శక్తిదీప్తులు వెల్లివిరియగా, ఆసియా ఖండం మొత్తం స్వాతంత్ర్య భాగ్యాన్ని పొందడం, లేదా పొందనుండడం ఈ దశాబ్దంలోనే.

శాంతి, భద్రతల సంరక్షణ మాత్రమే ప్రభుత్వ పోలీసు రాజ్యంగా వ్యవహరించడమే ధర్మం కాదని, ప్రతి పౌరునికి కూడు గుడ్డ నివ్వలేనిది, చదువు సంధ్యలు చెప్పలేనిది, ఒక్క మాటలో, మానవుడు మానవునివలె జీవించడానికి తగు పరిస్థితులను కల్పించలేనిది ప్రభుత్వమనే పేరునకైనా తగదనే భావం పరిఢవిల్లింది ఈ దశాబ్దంలోనే.

ఒక కొత్త శక్తి - ఒక మహాశక్తి - పరమాణుశక్తి అని మా తాత్పర్యం ప్రభవించడమేమి, ప్రపంచ శాంతి, అన్యధా ప్రపంచ విధ్వంసన అనే సమస్య ఉత్పన్నం కావడమేమి ఈ దశాబ్దంలోనే జరిగింది.

హింస విశ్వాంతక రూపాన్ని ధరించిన సమయంలోనే, ప్రపంచ చరిత్రలోనే తొలిసారిగా ఒక దేశం (ఇండియా) కేవలం అహింస ద్వారా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొనడం ఈ దశాబ్దంలోనే. ప్రపంచ చరిత్ర నుంచి దేశచరిత్రను అందుకొనగా, అహింస ద్వారా

స్వాతంత్ర్యాన్ని పొందినా, కలకాలం వరకు మనం సిగ్గిలవలసినంతగా భ్రాతృహత్యలేమి, రక్తపాతమేమి సంభవించడం సైతం ఈ దశాబ్దంలోనే.

ఇంతకంటె ఘోరాతిఘోరమైన సంఘటన, గాంధీజీ దారుణ హత్య కూడా ఈ దశాబ్దంలోనే. కల్లోలాన్ని గడిచి, రక్తపాతాన్ని అధిగమించి, దాదాపు శిథిలాల నుంచి నూతన భారత స్వతంత్ర భారత - సౌధం క్రమంగా ఒక రూపాన్ని ధరించ నారంభించడం ఈ దశాబ్దంలోనే. అది జాతీయరంగమైనా, అంతర్జాతీయ రంగమైనా పాత భావాలెన్నో గతించడం, కొత్తవి ప్రభవించడం, పాత వ్యవస్థలు పునాదులతో కదలడం, కొత్తవి రూపొందడం, ఒక్క మాటలో, పాత శకం పోయి, కొత్తదాని ప్రాంగణంలో మానవుడు నిలవడం ఈ దశాబ్దంలోనే.

అపూర్వమైన ఈ దశాబ్దంలో "ఆంధ్రప్రభ" తనకు సంబంధించినంత వరకు సముచితపాత్రను నిర్వహించ గలిగిందా?

ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరాన్ని ఏ విధంగా చెప్పడం?

ఆంధ్రపత్రికా ప్రపంచంలో "ఆంధ్రప్రభ" ప్రచారం అత్యధికమనడం ఇందుకు ప్రత్యుత్తరమా? 1942 నాటి "క్విట్ ఇండియా" మహోద్యమ సందర్భంలో "ప్రీ సెన్సార్షిప్" నిరంకుశత్వాన్ని సహించనొల్లక తాత్కాలికంగా ప్రచురణను విరమించిన దనడం ఇందుకు ప్రత్యుత్తరమా?

నిజాం, మైసూర్, తిరువాన్కూర్ నిరంకుశ ప్రభుత్వాలచే ఒకప్పుడు నిషేధించబడిందని, నేడు కూడా మొదటి దానిలో నిషేధం కలదనీ చెప్పడం ఇందుకు ప్రత్యుత్తరమా?

నేడు "ఆంధ్రప్రభ కాదు; దివ్యప్రభ" అని ప్రశంసించే రాజకీయ ప్రముఖులే, రేపు స్వార్థచింతను, అనుభవశూన్యతను ఆరోపించడం ఇందుకు ప్రత్యుత్తరమా?

ఏమైనా ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరాన్ని చెప్పవలసింది పాఠక లోకమే. పత్రిక చెప్పగలిగింది తను నమ్మని విషయాన్ని తాను రాయనని మాత్రమే.

ఆంధ్రప్రజకు ఇంతవరకు చూపిన సమధికాదరాభిమానాలకు కృతజ్ఞత తెలుపుతూ, ఇక మీదట మరింతగా పాత్రం కాగలననే ఈ శుభ సమయంలో "ఆంధ్రప్రభ ఆశిస్తున్నది.

"ఆశీర్వదించండి" (ఆంధ్రప్రభ 15-8-1948)

"ఆంధ్రప్రభ"కు జన్మదినం"

ఆగష్టు 15వ తేదీ దేశానికి ఒక పండుగ కాగా, "ఆంధ్రప్రభ"కు రెండు పండుగలు. ఈ రెండు పండుగలలో మొదటిది ఏమిటో మేము ప్రత్యేకించి చెప్పనక్కరలేదు; రెండవదాన్ని మాత్రం మేము విప్పి చెప్పవలెనేమో! ఆగష్టు 15వ తేది "ఆంధ్రప్రభ"కు జన్మదినం.

సరిగా పధ్నాలుగు సంవత్సరాల క్రితం - 1938 ఆగష్టు 15వ తేదిని - "ఆంధ్రప్రభ" (దిన పత్రిక) ప్రభవించింది. ఆంధ్రప్రభ పాఠకుల ఆశీర్వాదం వల్ల, వారి ఆదరాభిమానాలవల్ల దిన దిన ప్రవర్ధమానమౌతూ, వారి సేవాభాగ్యం వల్ల తన జన్మను సార్థకం చేసుకోగలుగుతున్నది. పధ్నాలుగు సంవత్సరాలు నిండి, పదిహేనవ దానిలో పాదం పెడుతున్న ఈ శుభ సమయంలో దాని సేవారంగాన్ని విస్తృతం చేసుకోవాలన్న తలంపుతోనే "ఆంధ్రప్రభ" ఈ "సచిత్ర వారపత్రిక"ను వెలువరిస్తున్నది. దినపత్రిక దైనందిన వార్తలకు విధిగా ప్రాధాన్య మివ్వాలి. దైనందిన వార్తలలో రాజకీయాలదే అగ్రస్థానం. కాని, జీవితం రాజకీయాల కంటే బహు విస్తృతమైంది. ఇందువల్ల దైనిక పత్రికలో మన జీవిత సమగ్ర రూపం ప్రతిబింబితం కావడం కష్టం; దైనిక పత్రిక ద్వారా అన్ని జీవిత రంగాలలో సమానంగా సేవ చేయడం కూడా కష్టమే. అయినా, "ఆదివారం సంచిక" ద్వారా సారస్వతానికి, కళలకు, వైజ్ఞానిక శాస్త్రాలకు, సంఘ సంస్కరణాది విషయాలకు వీలైనంతగా బహుముఖ సేవను చేయడానికే "ఆంధ్రప్రభ" ప్రయత్నిస్తూ వచ్చింది. ఈ కృషి ఇతోధికంగా కొనసాగవలెనన్న ప్రబలాకాంక్ష ఫలితమే ఈ "సచిత్ర వారపత్రిక". రెండు, మూడు నెలల క్రితమే ఈ సచిత్ర వారపత్రిక ప్రారంభానికి నిర్ణయం జరిగింది. అయినా, దేశానికి పర్వదినమైన ఆగష్టు 15వ తేదీ వరకు - "ఆంధ్రప్రభ"కు జన్మదినమైన ఆగష్టు 15 వరకు - వేచివుండడం సముచితమే కాక, శుభోదర్కం కాగలదని తోచింది. ఈ ఆనందోత్సవం నాడు తన సేవను మరొక రూపంలో కూడా - మరికొన్ని రంగాలలో కూడా స్వీకరించీ, తనను ఆశీర్వదించవలసిందిగా "ఆంధ్రప్రభ" ముకుళిత హస్తాలతో ఆంధ్ర మహాజనులను అభ్యర్థిస్తున్నది. (ఆంధ్రప్రభ వారపత్రిక తొలి సంచిక 15-8-1952)

ప్రారంభ సంపాదకీయం

తమసోమా జ్యోతిర్గమయ



ముకుళిత హస్తాలతో, వినమ్రంగా నమస్కరిస్తూ "ఆంధ్రజ్యోతి"

(దిన పత్రిక) ఈనాడు ఆంధ్ర మహాజనుల సమ్ముఖాన నిలుస్తున్నది.

ఆ ముకుళిత హస్తాలు స్వల్పంగా కంపించడం ఆనందాతి రేకంతోనే కాదు; దానిలో అంతర్లీనమైవున్న ఆందోళనతో కూడా. ఇంత ఆదరం, ఇంతగా అభిమానం, ఇంతింతనరాని అనురాగం, ఇందరి ఆశీస్సులు, ఎందరెందరివో అండదండలు తనకు అశేషంగా లభిస్తున్నందుకు ఆనందం వెల్లివిరియడం ఎంత సహజమో, తాను దీనికంతటికీ తగుదునా అనే భయసంకోచాలతో ఆందోళన చెందడం అంత సహజమే.

అయితే, కొన్ని ప్రధానాశయాలతో అవతరించినందున ఎట్టి పరిస్థితులలోనైనా, కర్తవ్య పథం నుంచి చలించబోనన్న గుండె నిబ్బరం సయితం దానికి లేకపోలేదు. అన్ని బలాలను మించినట్టిది ఆశయబలం. ఆ బలం లోపించనంతవరకు "ఆంధ్రజ్యోతి"కి వెనుక చూపు లేదు; అది కొరవడినప్పుడు తక్కిన బలాలేవీ దానికి పుష్టినివ్వలేవు.

ఎక్కువున్నా, ఏ రూపంలోనున్నా పారతంత్ర్యాన్ని ప్రతిఘటించడం; సర్వత్రా, సర్వవిధాల స్వాతంత్ర్యానికి ప్రోదిచేయడం. ఇది "ఆంధ్రజ్యోతి"కి ప్రధానాశయం.

స్వాతంత్ర్యానికి రాజకీయ స్వాతంత్రంగా పరిమితార్థాన్ని చెప్పుకొనక, ఆర్థిక, సాంఘికాది సమస్త జీవిత రంగాలకు పరిపూర్ణంగా దాన్ని విస్తరింపజేయడానికి, కృషి చేయడం - ఇది రెండవ ఆశయం.

వ్యక్తికి, సమిష్టికి విధిగా స్పర్ధలుండనక్కరలేని నవసమాజ నిర్మాణం కోసం జరిగే ప్రతి సత్ ప్రయత్నాన్నీ సమర్థించడం - ఇది మూడవ ఆశయం.

పాతను అది పాతదన్న కారణానే హర్షించక, కొత్తను అది కొత్తదన్న కారణానే నిరసించక, "కొత్త పాతల మేలుకలయిక" ద్వారా నవనవోన్మేషమైన సజీవ సంస్కృతిని రూపొందించడానికి సర్వశక్తులను వినియోగించడం ఇది నాల్గవ ఆశయం.

ఈ విధంగా "ఆంధ్రజ్యోతి" ప్రధానాశయాలన్నింటినీ సంఖ్యాపరంగా వివరించనక్కర లేకుండానే బహుళ జనాభ్యుదయాన్ని అది కాంక్షిస్తుందని, స్వాతంత్ర్య, సమానత్వ, సౌభ్రాత్వాలు దాని దృష్టిలో ఒకదానికొకటి ఎంత మాత్రం తీసిపోని పరమ లక్ష్యాలనీ చెబితే సరిపోతుంది.

ఈ లక్ష్యాల సాధనకై "ఆంధ్రజ్యోతి" నేడు అవతరించడానికి తోడ్పడిన మిత్రుల, హితైషుల సంఖ్య అగ్రణ్యం. వారు విశాలాంధ్రలోని అన్ని ప్రాంతాలకు చెందినవారు; అన్ని మత, కుల, వర్గాలకు చెందినవారు. వారందరికీ "ఆంధ్రజ్యోతి" తన కృతజ్ఞతాపూర్వక నమస్కారాలను అందజేస్తున్నది.

నిఖిలాంధ్ర ప్రజాకోటి సహాయ సహకారాలతో ఆవిర్భవిస్తున్న "ఆంధ్రజ్యోతి" నిఖిలాంధ్ర ప్రజావాణిగా, ప్రజావేదికగా, ప్రజా సంస్థగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నది. ఏ మేరకు ప్రజలతో, వారి ఆశలతో, ఆశయాలతో, ఆవేదనలతో, ఆనందాలతో తాను తాదాత్మ్యం సాధించుకొనగలదో అంతవరకే తనకు సార్థక్యమని అది భావిస్తున్నది. ఆదిలోనే దానికి లభించిన ప్రేమాభిమానాలు ముమ్ముందు మరింత పెంపొందగలవని, ఆ ప్రేమాభిమానాలకు తగు అర్హతను తాను సంపాదించుకొనగలనని అది ఆశిస్తున్నది.

ముక్కోటికి మించిన ఆంధ్ర మహాజనులకు ఇదే మా విన్నపం: ఇది మీ పత్రిక. దీన్ని మీ సేవకు వినియోగించుకొనండి. మీ అభ్యున్నతిని విడిచి, దీనికి అభ్యున్నతిలేదు. మీ ఆశీర్వాదాన్ని కోరుతూ, "ఆంధ్రజ్యోతి" మీకు మరొకసారి నమస్కరిస్తున్నది.

(ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రారంభోత్సవ సంపాదకీయం 2-7-1960)

పత్రికా రచన



వర్తమాన సంఘ వ్యవస్థలో పత్రికల ప్రాముఖ్యాన్ని గుర్తించని వారుండరు. విద్యాధికుడుగాని, కేవల అక్షరజ్ఞుడే గాని, పట్టణవాసిగాని, పల్లెటూరి మనిషిగాని, కార్మికుడుగాని, కృషీవలుడుగాని, ఉద్యోగస్థుడుగాని రాజ్యాంగ వేత్తగాని, విద్యార్థిగాని, వ్యాపారస్థుడుగాని ప్రతివానికి పత్రికతో అక్కరే. అంతెందుకు, ప్రస్తుత కాలంలో పత్రికలు ప్రజలకు కనులు, చెవులు అని చెప్పవచ్చు. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత భారతదేశంలో పత్రికల ప్రాముఖ్యంతోబాటు, పత్రికా నిర్వాహకుల బాధ్యతలు కూడా హెచ్చినవి. అందుకే ఈనాడు ప్రతి దేశనాయకుడు పత్రికల కర్తవ్యాన్ని బోధిస్తున్నాడు. స్వపరిపాలన నెలకొల్పబడడంతో ప్రజలకు, ప్రభుత్వానికి వుండే అంతరం తక్కువైంది. పరిపాలనా విషయాల్లో ప్రజల శ్రద్ధ అతిశయించింది. వయోజన వోటింగు హక్కులతో పాలితులు, పాలకులు మరింత సన్నిహితులు కాక తప్పదు.

ఈ పరిస్థితిలో, ఈ నూతన వ్యవస్థలో, ప్రభుత్వ విధానాలలో ప్రజాభిప్రాయం ప్రతిబింబించేటట్టు, ప్రజల హక్కులను ప్రభుత్వం కాపాడేటట్టు, ప్రజలు తమ హక్కులనేగాక బాధ్యతలను సహా గమనించేటట్టు చేయవలసిన ప్రధాన బాధ్యతతో పత్రికలు నిర్వహించవలసి వుంటుంది. వివిధ శాఖలలో ప్రజాభిరుచులను తీర్చి దిద్దడం సామాన్యమైన పనికాదు. ఇందుకు పత్రికా రచయిత, సర్వజ్ఞుడు కాక పోయినప్పటికీ, వివిధ విషయాలలో కొంతవరకైనా పరిజ్ఞానం కలిగిన వాడు, పౌర బాధ్యతలను చక్కగా గుర్తించినవాడు, పత్రికా రచనలో, నిర్వహణలో అనుభవ, ప్రావీణ్యాలు కలవాడు అయివుండడం అవసరం.

తొలి రోజులలో పత్రికా పఠనం చేసేవారు బహుకొద్దిమంది. వారు కూడా ఏవో కొన్ని వర్గాలకు చెందినవారు. రానురాను పఠితల సంఖ్య ఎక్కువౌటమే గాక, వివిధ వర్గాలలోను పత్రికా పాఠకులు ఏర్పడుతున్నారు. అశిక్షితమైన ఈ పాఠకలోకాన్ని రంజింపచేయవలెనను ఆసక్తితో పత్రికా రచయితలు ప్రజాభిరుచిని సంస్కరించేందుకు బదులు, పామరజన రంజనానికి పూనుకొనడం సంభవిస్తుంది. లేదా, స్వప్రయోజకులకు, సంకుచిత దృష్టి కలవారికి సాధనంగా ఉపకరించడం జరుగుతుంది. జనసామాన్యానికి మార్గదర్శకులుగా ఉండవలసిన పత్రికా రచయితలు, ముఖ్యంగా ఈ భ్రమ, ప్రమాదాలకు లోనుగాకుండా ఉండవలెను.

గత రెండు మూడేండ్లలో తెలుగుదేశంలో వార, పక్ష, మాసపత్రిక లనేకం బయలుదేరినవి. రాజకీయ, వైజ్ఞానిక, కళా సంబంధమైన రకరకాల పత్రికలు ఉత్పన్నమౌతున్నవి. ప్రజలు కూడా ఈ పత్రికలను వెనుకటి కంటే ఎక్కువగా చదువుతున్నారు. ఇది సంతసించవలసిన విషయమే. కాని, ప్రజల ఆసక్తితోబాటు వారి విచక్షణ వృద్ధి చెందలేదు. స్వార్థ పరమైన, బాధ్యతా విరహితమైన, ద్వేషపూరితమైన, అశ్లీలము, అసభ్యము, హానికరము అయిన పత్రికల వ్రాతలను ప్రజలు ప్రోత్సహించరాదని భారత ప్రధాని నెహ్రూ మొన్న కేరళ పర్యటనలో చేసిన ప్రబోధాన్ని ప్రజలందరు ఆలించుతారని మా విశ్వాసం.

పత్రికా రచనకు, నిర్వహణకు ప్రత్యేక శిక్షణ, పరిజ్ఞానాలు అవసరమని పైన పేర్కొన్నాం. పత్రికా కార్యాలయాలలో గడించే అనుభవం మినహా, మద్రాసు విశ్వవిద్యాలయంలో ఉండే పరిమితమైన శిక్షణావకాశం తప్ప. పాశ్చాత్య దేశాలలోవలె పత్రికా రచనకు తయారుచేసే విద్యాసంస్థలు మన దేశంలో లేవు. కొంతకుకొంత ఈ లోటును సవరించుదామనే సదుద్దేశంతో గుంటూరు జిల్లా పత్రికా రచయితల సంఘం తరపున వేటపాలెంలో మే నెల 15వ తేదీ మొదలు పక్షం దినాలు పత్రికా రచనను గురించి వేసంగి పాఠశాలను

స్థాపించి, వివిధ విషయాలపై ఉపన్యాసాలు ఏర్పాటు చేయబడినవి. ఇంతమాత్రంతో విద్యార్థులకు పత్రికారచనకు కావలసిన అనుభవ, పాటవాలు సిద్ధించగలవని సంస్థ నిర్వాహకులైనా భావించి ఉండరు. కాని, తెలుగునాట పత్రికా రచనలో చక్కని శిక్షణ ఇవ్వగల సర్వాంగ సంపన్నమైన సంస్థ నిర్మాణానికి ఈ ప్రయత్నం దోహద మొసగేట్టయితే, నిర్వాహకుల కృషి ఫలించినట్లే. ఆ కారణం చేత, ఈ ప్రయత్నం ఎంత నిరాడంబరమైనా, సదుద్యమంగా భావించి, వేటపాలెం వేసవి పాఠశాల నిర్వాహకులను అభినందిస్తున్నాం.

(ఆంధ్రప్రభ 4-6-1950)

పత్రికా స్వాతంత్ర్యం -1

రాజ్య సాధనకేమి, ప్రజాస్వామ్య వ్యవస్థ స్థాపనకేమి భారతీయ పత్రికలు చేసిన సేవ ఇంత కాదు. వేళ్ళపై లెక్కపెట్టదగ్గపాటి ఆంగ్లో-ఇండియన్ పత్రికలను, వాటి సంఖ్యకు మించని ఇతర పత్రికలు కొన్నింటిని మాత్రం మినహాయిస్తే, తక్కినవన్నీ స్వాతంత్ర్యోద్యమానికి ప్రోదిచేసినవే. ఇంతేకాదు, స్వాతంత్ర్య సముపార్జన కృషికై వాటిలో అనేకం ఎట్టి కష్టనష్టాలకైనా చలించకుండా నిలిచినవి.

లాలా స్వరాజ్యం కోసం, ప్రజాస్వామ్యం కోసం ఇంతగా పాటుపడిన పత్రికలకే జాతీయ ప్రభుత్వం చేతిలో, ప్రజాస్వామ్య రక్షణ పేరుతో మొదట పెద్ద దెబ్బ తగలడం శోచనీయం. దేశబంధు గుప్త అధ్యక్షతన బొంబాయిలో జరిగిన అఖిల భారత పత్రికా సంపాదకుల ప్రత్యేక సమావేశంలోని ప్రసంగాలను చదువుతున్నప్పుడు ఈ సమావేశం 1951 జూన్ లో జరగడం లేదని, 1947 ఆగష్టుకు పూర్వమెప్పుడో జరుగుతున్నదని అనుకోవలసి వచ్చినదనడంలో అత్యుక్తిలేదు.

నేటి భారత ప్రభుత్వ నాయకులు ఈ ప్రసంగాలు అనవసరమైనవని, వీటిలో వ్యక్తమైన భయాందోళనలు నిష్కారణమైనవనీ, భారత రాజ్యాంగం 19వ సూత్రం రెండవ నిబంధనను సవరించడంలో అసలు పత్రికా స్వాతంత్ర్యం ప్రసక్తి లేనేలేదని, ఈ సవరణ ద్వారా మున్ముందు అవసరమైనప్పుడు కొన్ని ప్రత్యేకాధికారాలను ప్రభుత్వం స్వీకరించడానికి సావకాశం కల్పించడం మాత్రమే లక్షించబడిందని చెప్పవచ్చు. ఇందువల్ల, పత్రికలకు వచ్చిన భయమేమీ లేదని హామీ నివ్వవచ్చు.

కాని, ఈనాటి ప్రభుత్వ నాయకులు రేపు కూడా అధికారంలో ఉండగలరని ఎవరు చెప్పగలరు? ప్రజాభిప్రాయాను సారంగా ప్రభుత్వాలు మారడం అసలు ప్రజాస్వామ్య వ్యవస్థ కొక ప్రధాన ప్రాతిపదిక కాదా? ఈ కారణాన నేటి ప్రభుత్వ నాయకులు వ్యక్తిగతంగా ఇచ్చే హామీలకు రేపు (వీరి స్థానంలో కొత్తవారు ప్రభుత్వ నాయకులైతే) విలువ పూజ్యం కాదా? ఎప్పటికైనా వ్యక్తిగతంగా చేసే వాగ్దానాలకు కాదు.

చెల్లుబాటు దేశ శాసనాలకుగాని, దేశనాయకులు ఈ మాట చెప్పేసరికి ప్రభుత్వ నాయకులైనవారు వ్యక్తులకులేని ప్రత్యేకపు హక్కులు పత్రికలకు ఎందుకు కావాలని ఒక వింత వాదం చేస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే రాజ్యాంగం 19వ సూత్రం రెండవ నిబంధన సవరణవల్ల కేవలం పత్రికా స్వాతంత్ర్యానికే ముప్పు వాటిల్లుతుందని అఖిలభారత పత్రికా సంపాదకుల ప్రత్యేక సమావేశం తన తీర్మానంలో స్పష్టపరచింది. ప్రజావాణిగా మాత్రమే చెల్లుబాటు కావాలని కోరుకునే పత్రికలు ప్రజలకులేని స్వేచ్ఛలను కోరరాదు;

కోరడం లేదు. ఇప్పుడు వాటి ఫిర్యాదు పౌర స్వాతంత్ర్యాలను పరిమితం చేయడం ద్వారా తమ స్వేచ్ఛకు భంగం కలిగించబడిందని మాత్రమే.

రాజ్యాంగం 19వ సూత్రం రెండవ నిబంధనకు జరిగిన సవరణ ఉపసంహరణకై పత్రికలు ప్రస్తుతం చేస్తున్న ఆందోళన కేవలం పత్రికలకు సంబంధించిన విషయమన్న భ్రమలో ఈనాడు ప్రజలు పడితే, అందువల్ల వారు తమ చేతులతో తమ గొంతుకు ఉచ్చు బిగించుకున్నవారు కాగలరని మేము హెచ్చరించగోరుతున్నాం. (ఆంధ్రప్రభ 26-6-1951)

పత్రికా స్వాతంత్ర్యం

2

రాజ్యాంగ చట్టానికి సెలెక్టు కమిటీ ఆమోదించిన సవరణలను పార్లమెంటులో ప్రవేశపెట్టుతూ భారత ప్రధాని పండిట్ నెహ్రూ పత్రికా స్వాతంత్ర్యాన్ని గురించి తా నిదివరకు చెప్పిన ప్రతిమాటకు ఇకముందు కూడా బద్ధుడనై ఉంటానని, అధికారం తన చేతిలో ఉండేంతవరకు పత్రికా స్వాతంత్ర్యానికి భంగం రానీయనని నొక్కినొక్కి మరీ వాక్రుచ్చాడు.

భారత ప్రధాని చిత్తశుద్ధిని మేమెన్నడు శంకించలేదు. పౌర స్వాతంత్ర్యాలకై అనేక సంవత్సరాలు అంత దీక్షతో పాటుబడిన శ్రీ జవహర్లాల్ నెహ్రూ తన అధికారాన్ని దుర్వినియోగపరుస్తాడన్న అనుమానం మాకులేదు. కాని కేంద్రంలోను, వివిధ రాష్ట్రాలలోను అధికారంలో ఇప్పుడున్నవారు అందుచేత పత్రికా గాని, ఇకముందు రాగలవారు గాని, అందరూ నెహ్రూలు కారు. స్వాతంత్ర్యాన్ని భంగపుచ్చగల అధికారాన్ని రాజ్యాంగం సవరణ ద్వారా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలచేత బెట్టి "నేనున్నానుకదా, మీకు వచ్చిన ఫరవా ఏమీలేదు" అని పండిట్ నెహ్రూ హామీ ఇచ్చినంత మాత్రాన లాభం లేదు.

వ్యక్తిగతంగా పండిట్ నెహ్రూ పత్రికా స్వాతంత్ర్యాన్ని ఎంత అమూల్యంగా భావిస్తున్నాడో చట్టం కూడా దాని నంత అమూల్యంగా పరిగణించి కట్టుదిట్టం చేసినప్పుడే దానికి రక్షణ ఉంటుంది కాని, ఎంత మహోన్నతులైనా, వ్యక్తుల అభిప్రాయానికి శాసన ముద్రలేంది శాశ్వతత్వం లేదు. ప్రభుత్వం విధించే నిషేధాజ్ఞలు 'సమంజసమైనవిగా' ఉండాలంటూ సెలెక్టు కమిటీ చేసిన మార్పువల్ల ప్రప్రథమంలో ప్రభుత్వ ప్రతివాదన ద్వారా వాటిల్లగల ప్రమాదం కొంతవరకు నివారించబడిన మాట నిజమే.

కాని, ఈ మార్పును ప్రభుత్వం అంగీకరించడాన్ని బట్టే పత్రికా స్వాతంత్ర్యాన్ని సంకుచితపరచడం ఎంత హానికరమన్నది కూడా మరొక విధంగా రుజువౌతున్నది.

కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు నేడున్న అధికారాలు అల్పమైనవి కావనీ, అవి వారిని దుర్వినియోగ పరిచేట్టుంటే శతవిధాల అపకారం జరగవచ్చుననీ భారత ప్రధాని స్వయంగానే అంగీకరిస్తున్నాడు. కాబట్టి, అలాంటి ప్రభుత్వాలకూ అసాధారణమైన ఈ అధికారం అప్పగించడం కంటే పార్లమెంటుకే ఈ శాసనాధికారాన్ని ఉంచాలని సెలెక్టు కమిటీలో శ్రీమతి దుర్గాబాయిగారు చేసిన సూచననైనా ప్రభుత్వం తప్పకుండా ఆమోదించాలి.

(ఆంధ్రప్రభ 31-5-1951)

3

ఆంధ్రప్రదేశ్ విభజన జరగవచ్చు, జరగకపోవచ్చు. కాని ఆంధ్రప్రదేశ్ విభజనోద్యమ సందర్భంలో ప్రజాస్వామ్య జీవితపు విలువలకు కొందరు ప్రమాదాన్ని ఘటిల్లజేయడం మాత్రం నిస్సందేహంగా జరుగుతుంది.

విభజనోద్యమ నాయకులలోనే ఒకరైన శ్రీ సి.వి.కె. రావు మొన్న ఒక ప్రకటనలో "ఉద్యమంలో ఫాసిస్టు పోకడలు ప్రవేశించాయి" అని తమ బాధను వ్యక్తం చేశారు. ఇంతేకాదు, ఏ చర్యలను శ్రీ సి.వి.కె. ఖండించారో వాటిని గురించే ప్రస్తావిస్తూ "ఇవి గర్హనీయం, ఇవి శోచనీయం" అని శ్రీ బి.వి. సుబ్బారెడ్డి తమ తీవ్ర నిరసనను వెల్లడించారు.

వీరిద్దరుగాని, వీరి సహచరులతో ఇతరులుగాని - తమకు దానితో ప్రత్యక్ష సంబంధం లేదని కాబోలు - పత్రికా స్వాతంత్ర్యానికి ప్రస్తుతం కానవస్తున్న ముప్పును గుర్తించి ప్రస్తావించడం లేదు. ప్రజాస్వామ్యానికి ఒక ప్రధాన ప్రాతిపదిక పత్రికా స్వాతంత్ర్యమని వీరికి తెలియదా? ఫాసిస్టు శక్తుల మొట్టమొదటి దాడి ఎల్లప్పుడు పత్రికా స్వాతంత్ర్యం పైనే అని వీరికి తెలియదా? కేవలం మన రాష్ట్రంలోనే కాదు, ఇతర ప్రాంతాలలో కూడా - కేవలం రాష్ట్ర విభజనోద్యమంతో సంబంధం ఉన్నవారేకాదు, ఇతరులు సైతం - ఇటీవల పత్రికలకు సంబంధించినంత వరకు ఒక ప్రమాదకరమైన సూత్రాన్ని ప్రతిపాదిస్తున్నారు. ప్రజాభిప్రాయాన్ని పత్రికలు విధిగా అనుసరించాలన్నదే, బలపరచాలన్నదే ఆ సూత్రం.

ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా పత్రికా సంపాదకులకు గౌరవనీయుడైన, గురుతుల్యుడైన సి.పి.స్కాట్ ఈనాడు మన మధ్యవుంటే, ఈ సూత్రాన్ని ఆయన నిశితంగా ఖండించి ఉండేవాడు; దీన్ని అనుసరించడానికి పూర్తిగా నిరాకరించి ఉండేవాడు.

ఒకానొక సందర్భంలో తన పత్రిక "మాంచెస్టర్ గార్డియన్"లో రాస్తూ, స్కాట్ "Comment is free, but facts are sacred" అని సూత్రీకరించాడు. దీని తాత్పర్యం వార్తలను పవిత్రమైనవిగా భావించాలని వాటిని యథాతథంగా ప్రచురించాలని, వ్యాఖ్యను మాత్రం స్వేచ్ఛగా చేయాలని.

స్కాట్ సూత్రంలోని "ఫ్యాక్ట్స్" అనే ఇంగ్లీషు పదాన్ని ప్రస్తుత సందర్భాన్ని బట్టి "వార్తలుగా" మేము తెనిగించాం. కాని, "ఫ్యాక్ట్"కు సి.పి.బ్రౌన్ చెప్పిన అర్థాలు జరిగిన పని, జరిగిన సంగతి, నడిచినపని, కార్యం, క్రియ, వాస్తవ్యం, యథావహస్థితి, నిజస్థితి" అని. "ఫ్యాక్ట్" కు బ్రౌన్ చెప్పిన అర్థాలను దృష్టిలో పెట్టుకుంటే, పబ్లిక్ లెక్చర్లు, ప్రెస్ స్టేట్మెంట్లు "ఫ్యాక్ట్స్" కావని విదితమౌతుంది. వాటి విషయంలో "పవిత్రత" ఏమీలేదని కూడా విదితమౌతుంది. అట్టివాటిని పత్రికా సంపాదకుడు ప్రకటించడం, ప్రకటించకపోవడం అతడి విచక్షణను అనుసరించి ఉంటుంది. అతడికున్న అవకాశాన్ని బట్టి ఉంటుంది. ముఖ్యమైనవిగా భావిస్తే, వాటిని అతడు ప్రచురిస్తాడు, లేదా విడిచిపెడతాడు.

కాని, ప్రస్తుతం విభజనోద్యమ నిర్వాహకులలో కొందరు సభలలో తమ ప్రసంగాలను, స్వాభిప్రాయాలతో కూడిన తమ ప్రకటనలను పూర్తిగా ప్రచురించాలని పట్టుపడుతున్నారు. వాటిని విడిచిపెట్టినా, తగ్గించినా, "శాస్త్రి" చేస్తామని బెదరిస్తున్నారు. ఇది పత్రికా స్వాతంత్ర్యాన్ని భంగపరచడమే, పత్రికా సంపాదకుడు తన విచక్షణాశక్తిని వినియోగించరాదని చెప్పడమే.

పోతే ఇంతకంటే ప్రమాదకరమైన ప్రతిపాదన - ప్రజాభిప్రాయాన్ని పత్రికా సంపాదకుడు విధిగా ఔదలదాల్చవలెననడం, దాన్ని అతడు విధిగా ప్రతిధ్వనించవలెననడం :

తన ప్రాంతమేకాదు, తన దేశమే కాదు, మొత్తం ప్రపంచమే ఒక విధంగా ఆలోచిస్తున్నా, ఒక మార్గానపోతున్నా, ఆ ఆలోచనతో తాను ఏకీభవించలేకపోతే, ఆ మార్గాన్ని తాను హర్షించలేకపోతే, పత్రికా సంపాదకుడు ఏకాకిగా నిలవడానికి సన్నద్ధపడాలి. లేనిపక్షంలో అతడు పత్రికా సంపాదకుడన్న పేరుకైనా తగడు.

1899 బోయర్ యుద్ధం ప్రారంభమైనప్పుడు దాన్ని బ్రిటన్లో అత్యధిక సంఖ్యాకులు పూర్తిగా సమర్థించినా, దానిలో విజయసాధనపై తమ జాతీయ ప్రతిష్ఠ ఆధారపడి ఉన్నట్టు వారు ప్రగాఢంగా విశ్వసించినా, సి.పి.స్కాట్ దాన్ని ఇంపీరియలిస్టు యుద్ధంగా ఖండించారు. ఇందుకు ఆయనను ప్రజలు నిరసించారు, దూషించారు, బెదరించారు. చంపుతామన్నారు. అయినా, స్కాట్ చలించలేదు; తాను న్యాయమని, ధర్మమని నమ్మినదాన్నే ఆయన రాస్తూ పోయాడు. అటుతర్వాత కొద్దికాలానికే స్కాట్ వైఖరి ఎంత న్యాయమైనదో, ధర్మమైనదో చరిత్ర నిరూపించింది. నైతికపు విలువలకు సంబంధించినంత వరకు స్కాట్ కంటే ఎంతో క్రింది స్థానంలో నిలబెట్టదగినవాడు లార్డ్ నార్త్ క్లిఫ్. అయినా నార్త్ క్లిఫ్ సైతం ప్రథమ ప్రపంచయుద్ధం ప్రారంభ దశలలో ఆనాడు బ్రిటీష్ ప్రజానీకం “మహావీరుడు”గా పూజిస్తున్న యుద్ధమంత్రి లార్డ్ కిచ్నర్ను ఆయన నాయకత్వాన్ని తీవ్రంగా విమర్శించాడు. ముఖ్యంగా ఫిరంగిగుండ్ల ఉత్పత్తిలో యుద్ధ మంత్రిత్వశాఖ లోపాలను ఆయన ఖండించాడు. తాత్కాలికంగా నార్త్ క్లిఫ్ ఎంతగా దూషణ తిరస్కారాలకు లోనుగావలసివచ్చినా, త్వరలో ఆయన విమర్శలు ఎంత సమంజసమైనవో నాటి బ్రిటీష్ ప్రభుత్వమే కాక, ప్రజాబాహుళ్యం సైతం గుర్తించవలసి వచ్చింది.

స్కాట్, నార్త్ క్లిఫ్ లు మాత్రమే కాక, దేశదేశాలలో ఎవరో కొందరు ఉత్తమ సంపాదకులు బహుళ ప్రజాభిప్రాయానికి కాక, తమ ఆత్మప్రబోధానికే ప్రాధాన్యమిచ్చి, తమ ఆత్మప్రబోధం ప్రకారమే రాసిన సన్నివేశాలు మరికొన్ని ఉన్నాయి. అట్టివారి కారణంగానే, వారి స్వేచ్ఛా ప్రవృత్తి కారణంగానే, వారి ధీరోదాత్తత కారణంగానే ప్రపంచంలో ఉత్తమ పత్రికా నిర్వహణ సంప్రదాయాలు నెలకొన్నాయి. ప్రపంచంలో ప్రజాస్వామ్య శక్తులు బలపడినాయి.



4

నిన్నటి సంపాదకీయంలో మేము సి.పి.స్కాట్ ప్రసక్తి తెచ్చాం, బహుళ ప్రజాభిప్రాయానికి భిన్నంగా వీరు నిలిచిన రెండు సన్నివేశాల ప్రసక్తి తెచ్చాం.

కాగా, ఈనాటి సంపాదకీయంలో మరిద్దరు ప్రముఖుల ప్రసక్తిని మేము తీసుకు రాగోరుతున్నాం. వీరు పత్రికా సంపాదకులు కాదు, మహామేధావులు. తమ చింతనతో తమ తరాలను, దేశాలనేకాక, అన్ని తరాలను, అన్ని దేశాలను ప్రభావితం చేసినవారు.

వీరిద్దరిలో మొదటి మేధావి వోల్టేర్. ఒక సందర్భంలో ఈయన "I detest what you say, I will defend to the death your right to say it" అని ఉద్ఘాటించాడు. ఈ పలుకుల తాత్పర్యం "నీవు చెబుతున్న దాన్ని నేను విద్వేషిస్తున్నా, దాన్ని చెప్పడానికి నీకున్న హక్కును కాపాడ్డానికై నా ప్రాణాలొడ్డుతాను" అని.

ఇదే నిజమైన స్వాతంత్ర్య ప్రియుడు, నిజమైన ప్రజాస్వామ్యవాది అనుసరించదగు వైఖరి, పూనవలసిన దీక్ష, సన్నద్ధపడవలసిన త్యాగం! వాక్ స్వాతంత్ర్యం లేనినాడు, పత్రికా స్వాతంత్ర్యం లేనినాడు రాజకీయ స్వాతంత్ర్యం లేదు, ప్రజాస్వామ్యమైనా లేదు. అందువల్ల అన్యుల వైఖరులను, భావాలను మనం హర్షించలేనప్పుడు సైతం ఆ వైఖరులను అవలంబించడానికి, ఆ భావాలను వెల్లడించడానికి వారికున్న హక్కును మనం గౌరవించాలి. ఇంతేకాదు, అవసరమైతే, వారి హక్కును కాపాడ్డానికై ప్రాణాలొడ్డడానికైనా ఆయత్తపడాలి.

వాక్ స్వాతంత్ర్యానికి, పత్రికా స్వాతంత్ర్యానికి ముప్పువచ్చేది ప్రభుత్వం నుంచి మాత్రమే కాదు, సంఘం నుంచి కూడా. కొన్ని కొన్ని సందర్భాలలో ప్రభుత్వం అసహనం కంటె, దాని నిరంకుశత్వం కంటె సంఘం అసహనమే, దాని నిరంకుశత్వమే మరింతగా దుస్సహం! ఈ విషయాన్ని బ్రిటిష్ మేధావి, "లిబరలిజం" వ్యాప్తికి విశేషంగా కృషి చేసిన మహాశయుడు జాన్ స్టూవర్ట్ మిల్ ఎన్నడో స్పష్టంచేశాడు. ఆయన పలుకు లివి :

When society is itself the tyrant... it practices a social tyranny more formidable than many kinds of political oppression, since... it leaves fewer means of escape, penetrating much more deeply into the details of life, and enslaving the soul itself. Protection, therefore, against the tyranny of the magistrate is not enough., there needs protection also against the tyranny of the prevailing opinion and feeling, against the tendency of society... to compel all characters to fashion themselves upon the model of its own.

ఈనాటి మనరాష్ట్ర పరిస్థితులకు ఈ పలుకులు పూర్తిగా వర్తిస్తున్నాయని మేము ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. "మాది బహుళ జనాభిప్రాయం కాబట్టి. దాన్ని మీరు విధిగా సమర్థించా"లని విభజనోద్యమంవారు పత్రికలను నిర్బంధించడం లేదా? "ఇందుకు భిన్నంగా వెడితే, హతమార్చగల" మని బెదరించడంలేదా; తమ బెదరింపులను వీలుచిక్కిన మేరకు నిజం చేయడం లేదా? అప్పుడప్పుడు న్యూస్ పేపర్ పార్సిల్సును తగలబెడుతున్నారు, న్యూస్ పేపరు వ్యాన్సును తగలబెడుతున్నారు. న్యూస్ పేపర్ ప్రెస్సులపై దాడిచేసి, వాటిని నష్టపరుస్తున్నారు; పత్రికా విలేఖరులపై, సంపాదకులపై చేయి చేసుకుంటున్నారు. నేటి వార్తల ప్రకారం కడపలో ఒక పత్రికా విలేఖరి ఇంటికే నిప్పుపెట్టి, దాన్ని కాల్చివేశారు.

మిల్ పలుకులో ఇది "ప్రభుత్వ నిరంకుశత్వంకంటే దారుణమైన సాంఘిక నిరంకుశత్వం", తిరిగి ఆయన పలుకులలో ఇది "ఆత్మనే బానిసతనంలో బంధించగల నిరంకుశత్వం."

అయినా, ఈనాటి వరకు విభజనోద్యమ నాయకులలో ఒక్క ప్రముఖుడైనా ఈ నిరంకుశత్వాన్ని ఖండించలేదు. వాక్ స్వాతంత్ర్యంలో పత్రికా స్వాతంత్ర్యంలో వీరికి నమ్మకంలేదా? ప్రజాస్వామ్యంలో నమ్మకం లేదా? "ఆత్మనే బానిసతనంలో బంధించడం" జరిగినా, వీరి దృష్టిలో అది ప్రత్యేక రాష్ట్ర సాధనకు చెల్లించదగు స్వల్పమూల్యమా?

రాష్ట్ర విభజన జరగవచ్చు, జరగకపోవచ్చు. ఏమైనా, ప్రజాస్వామ్య జీవితపు విలువలను దాని పవిత్రమైన విలువలను - పూడ్చిపెట్టడం మాత్రం విజ్ఞులకు బాధ కలిగిస్తుంది, ఆవేదన కలిగిస్తుంది.

ఇప్పుడు ప్రమాదం సంఘటిల్లుతున్నది కొన్ని పత్రికలకు మాత్రమే కాదు, కొందరు పత్రికా విలేఖరులకు, సంపాదకులకు మాత్రమే కాదు; మిల్టన్, వోల్టేర్, జెఫర్సన్, జాన్ స్టువర్ట్ మిల్ సి.పి. స్కాట్, తిలక్, గాంధి, శిశిర్ కుమార్ ఘోష్, సి.వై. చింతామణి, రామానంద ఛటర్జీ, ముట్నూరి కృష్ణారావు ప్రభృతులు మనకు సంక్రమింపజేసిన అమూల్యమైన వారసత్వానికే ఇది ఘోర ప్రమాదం!

నోటి దురుసుతనాన్నే గడసరితనంగా ఎంచుకొనేవారు కొందరుంటారు. నోరు పారవేసు కొనకపోతే, పేరు ప్రఖ్యాతులు రావని నమ్మేవారు సయితం ఉంటారు. అట్టి వారిని పలకరించడమే పాపం. కుశలప్రశ్న వేసినా, వీరి నుంచి వచ్చేది వంకర జవాబే. నొప్పించగల మేరకే తమమాటకు ఒప్పిదమన్నట్టు వీరు ప్రవర్తిస్తారు. గోష్ఠికి పిలిస్తే, వీరు తూలనాడని వారుండరు. ఉపన్యాసానికి ఆహ్వానిస్తే, వీరు ఉల్లంఘించని సభామర్యాద ఉండదు. సందర్భాసందర్భాలను గుర్తించకపోవడమే వీరి ఘనత; ఉచితానుచితాలను పాటించక పోవడమే వీరి ప్రత్యేకత.

అయినా, ఇట్టి వారికి పెద్దరికమిచ్చే వారుంటే, అది వారి "ఖర్మ" అని సరిపెట్టుకోవచ్చు. కాని, రేడియోను పోలిన ఒక ప్రభుత్వ సంస్థ ఇట్టి వ్యక్తులను ఆహ్వానించి, తమ చిత్తం వచ్చినట్టు వీరు ప్రసంగించడానికి అవకాశమివ్వడం తగునా?

ఆలిండియా రేడియో విజయవాడ కేంద్రం వారు ఇదే చేశారు. ఉగాదికి ప్రత్యేక కార్యక్రమంగా వారు ఏర్పాటు చేసిన రచయితల గోష్ఠిలో "గద్య రచన"పై చర్చ జరగడానికి మారుగా, తెలుగు పత్రికలపై దుమ్మెత్తి పోయడం జరిగింది. గోష్ఠిలో పాల్గొన్న వారందరు ఈ పనిని చేయనిమాట నిజం. కాని, తెలుగు పత్రికా రచయితలను తోటకూర కాడ పురుగుల కంటె కూడా హీనంగా, హేయంగా తీసి పారవేస్తూ కనీస మిద్దరు ప్రబుద్ధులు ప్రసంగించారు. తెలుగు పత్రికలలో పనిచేస్తున్న వారెవ్వరికీ తెలుగు సరిగా రాదట. ఇంగ్లీషులో ఆలోచించి, వీరు తెలుగులో వ్రాస్తారట. ఇంగ్లీషు మాటలకు తెలుగు తెలియకపోతే, ప్రక్కవారి నెవరినైనా అడుగుతారట. వారేదో చెప్పగా వీరేదో వ్రాస్తారట. ఇంగ్లీషు పదాలకు సరైన తెలుగు మాటలు కుదరకపోతే, దాన్ని తెలుగు భాష దౌర్బల్యం కింద జమ కడతారట. ఇంగ్లీషులోకి అనువదించడానికి వీలులేని తెలుగు మాటలు ఎన్నో ఉన్నాయని ఈ మందబుద్ధులకు తెలియదట. మాతృభాషా పరిజ్ఞానం లేని ఈ తెలుగు పత్రికా రచయితల కారణంగాను, వీరు సృష్టిస్తున్న కృతక భాష కారణంగాను ఆంధ్ర సాహిత్యానికే మహాపచారం జరుగుతున్నదట. సరిగా ఈ పలుకులలో కాకపోవచ్చుగాని, ఈ ధోరణిలో నడిచిన ఈ ప్రసంగాలు ఆంధ్రపత్రికా ప్రపంచానికి అవమానకరమైనవనడం నిస్సందేహం. మహోజ్వలమైనది తెలుగు పత్రికల చరిత్ర. దానికి అంకురార్పణ చేసిన వారిలో శ్రీ కందుకూరి వీరేశలింగం వంటి మహామహులున్నారు. దాన్ని బహు ముఖంగా వ్యాపింపజేసిన వారిలో శ్రీయుతులు కాశీనాధుని నాగేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి వంటి ప్రజ్ఞానిధులున్నారు. నేటి పత్రికా రచయితలు ఈ పెద్దలు చూపిన దారివెంటనే చిత్తశుద్ధితో, శక్తివంచన లేకుండా నడవడానికి ప్రయత్నిస్తున్నారు. తిరిగి మనమధ్యకు ఒకసారి వస్తే, ఈ పెద్ద లెవ్వరు తాము విడిచిపెట్టి వెళ్ళిన పత్రికా రంగాన్ని చూచి సిగ్గుపడ వలసింది ఏదీ లేదు. అయినా, మొన్నటి గోష్ఠిలో కొందరికి మాత్రం ఆధునికాంధ్ర పత్రికా రంగంలోని పరిస్థితులు లజ్జాకరమైనవిగా తోచడం చిత్రం కాదా? వీరు ఈ విధంగా ప్రసంగించడానికి విజయవాడ రేడియో అధికారులు అవకాశమివ్వడం కేవలం విడ్డూరమే కాదా?

పత్రికల భాష కృతకమైనదట, దుర్బలమైనదట. స్వాతంత్ర్య సమర రంగాలలోకి ఉరకడానికి వేలాది ఆంధ్రులను ఉత్సహింపజేసిన భాష కృతకమైనదైతే, మరేది జీవద్భాష? వివిధ జాతులకు, విభిన్న సాంఘిక వ్యవస్థలకు సంబంధించిన గంభీర రాజకీయ

విషయాలలో సామాన్యుడైన ఆంధ్రుడు సయితం విశేష పరిజ్ఞానాన్ని ప్రదర్శించగలిగినాడని ఈ మధ్యనే కదా సమస్త ప్రపంచం ప్రస్తుతించింది. ఇట్టి గంభీరవిషయాల ప్రచారానికి తోడ్పడిన భాష దుర్బలమైనదైతే, ఏది శక్తివంతమైన భాష?

పత్రికలపై, పత్రికా రచయితలపై మొన్నటి గోష్ఠిలో నోరు పారవేసుకొన్నవారు కన్ను తెరవకముందే పత్రికలు పుట్టినవని, వీరిని లోకం మరచిపోయిన తర్వాత కూడా పత్రికలు వర్ధిల్లగలవని మేము హెచ్చరించగోరుతున్నాము. ప్రతి పత్రిక ఈ హెచ్చరికను చేయగలదనే మేము విశ్వసిస్తున్నాము. ఇంతే కాదు. తెలుగు పత్రికా ప్రపంచాన్ని నిందించడానికి అవకాశ మిచ్చిన విజయవాడ రేడియో కేంద్రం వారి చర్యను సయితం ప్రతి పత్రిక తీవ్రంగా గర్హించగలదని ఆశిస్తున్నాము. (ఆంధ్రప్రభ 27-3-1955)

"ఆంధ్రజ్యోతి" పై దాడి

(ఆంధ్రజ్యోతి దిన పత్రిక కులతత్వ ధోరణి కలది అని - ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం బ్లాక్ లిస్ట్ లో పెట్టినపుడు రాసినది.)

మత విద్వేషాలను ప్రోత్సహించేవారిని నిరసించవలసిందే, ఖండించవలసిందే, అణచివేయవలసిందే ఈ విషయమై లవలేశంగానైనా సందేహానికి ఆస్కారం లేదు.

మనది వివిధ మతాలున్న దేశం. హిందు, మహమ్మదీయ, క్రైస్తవ మతాలే కాదు; ఇక్కడ శికుమతం ఉన్నది, బౌద్ధ జైనాలున్నాయి; చార్వాక మతమైనా లేకపోలేదు. ఇన్ని మతాలున్న దేశంలో మతసామరస్యం లేకపోతే, జాతికి శాంతి లేదు, భద్రత లేదు. పురోగతి లేదు, భవిష్యత్తు లేదు.

ఈనాడే కాదు, చిరకాలంగా విజ్ఞులైన వారందరు, దూరదృష్టిగలవారందరు - మతాచార్యులే కాదు, సంఘనాయకులే కాదు, రాజకీయదక్షులు కూడా ఈ సత్యాన్ని గుర్తిస్తున్నారు. అన్ని మతాలమధ్య సామరస్య సౌహార్దాలను నెలకొల్పగల మతసిద్ధాంతాలను రూపొందించడానికి అగ్బర్ పాదుషా ప్రయత్నించాడు. "అల్లా, రాముడు ఒక్కడే" అని కబీర్ ఉద్ఘాటించాడు. "అన్నిట పరిపూర్ణు డల్లా మహాత్ముడు" అని ఉద్ఘాటిస్తూ, అల్లాకు, శివునికి భేదం లేదని మన వేమన్న కవి విశదం చేశాడు. ఇదే విధంగా ఆధునిక భారతవర్ష నాయకులలో రాజా రామమోహన్ రాయ్ మొదలుకొని, గాంధీజీ వరకు ప్రముఖ నాయకులందరు మతసామరస్యానికై తపనపడినవారే.

ఈ మహామహుల కృషి పూర్తిగా జయప్రదం కాలేకపోవడం మనదేశ దౌర్భాగ్యమే. అక్బర్ ఒక చక్రవర్తి కాకపోతే, ఆయన ప్రదర్శించిన విశాల దృష్టికి, ఉదారవైఖరికి, ఎవడో ఒక మతోన్మాది ఆయన ప్రాణాలను బలిగొని ఉండేవాడే! ఇటీవలి కాలంలో ఒక స్వామి శ్రద్ధానందు, ఒక గణేశ్ శంకర్ విద్యార్థిని, ఒక గాంధీజీని మతోన్మాదులు పొట్ట బెట్టుకో లేదా?

ఈ మతోన్మాదులు ఏదో ఒక మతానికే చెందినవారు కారు. ఉదాహరణకు, గాంధీజీ హత్యనే చూడండి, ఆ కిరాతక కృత్యానికి పాల్పడిన వ్యక్తి గాంధీజీ మతానికి చెందిన వాడే! అయినా, ఈ పత్రిక, దీని సంపాదకుడు రాష్ట్రంలో మతోన్మాద శక్తులకు, కులవిద్వేష శక్తులకు ప్రోది చేస్తున్నారనడం వింతలలో వింత కాదా? విడ్డూరాలలో విడ్డూరం కాదా?

మత విద్వేషాలవలె కుల వైషమ్యాలు సయితం అతినీచమైనవే, నికృష్టమైనవే, నింద్యమైనవే. నిజానికి కులవ్యవస్థ తొలగనంత వరకు మన దేశంలో ప్రజాస్వామ్యానికి పూర్తిగా ప్రొద్దెదురు. - ఇవి "ఆంధ్రజ్యోతి" దృఢభావాలు మాత్రమే కావు; దాని పరమ విశ్వాసాలు, ఏ మత సూత్రాలపై లేనంత ప్రగాఢ విశ్వాసం ఈ సూత్రాల పట్ల ఈ పత్రికకు ఉన్నది; దీని సంపాదకునికి ఉన్నది. "జాతులెవ్వియైన జన్మమొకటి" అని ఈ సంపాదకుడు ఉద్ఘాటించాడు.

మా మేధాపటిమను శంకిస్తే మాకు బాధ కలిగేది కాదు; మా రాజకీయ విజ్ఞతను ప్రశ్నిస్తే మాకు బాధ కలిగేది కాదు; కాని, మాకు ప్రాణప్రదమైన మా విశ్వాసాలను కాదంటే, మాకు దుస్సహమైన బాధ కలగడం సహజం. పూజనీయులైన కందుకూరి వీరేశలింగం పంతులుగారిని సంఘ సంస్కరణకు విరోధులైనవారు ఎన్ని దుర్భాషలాడినా, ఆయన బాధ పడలేదు కాని, నిర్భీతి తన ప్రత్యేకతగా నమ్మిన ఆ నాయకునికి "పిరికి పంద" అని తనను నిందించడం దుస్సహమైంది. ఇదే విధంగా మత విద్వేషాలను, కుల వైషమ్యాలను మాకు అంటగట్టడం మాకు పూర్తిగా దుస్సహం.

భారత రాజ్యాంగం నిర్దేశిస్తున్న "సెక్యులరిజం" లక్ష్యంలో "ఆంధ్రజ్యోతి"ని మించి ఏ పత్రికకు విశ్వాసం లేదని మేము ఘంటాపథంగా చెప్పగలము. ఆ లక్ష్య సాధనకై "ఆంధ్రజ్యోతి"ని మించి ఏ పత్రిక కృషి చేయడంలేదని కూడా మేము చెప్పగలము. ఇందుకు మా అంతరాత్మ సాక్ష్మి ఇందుకు మా పాఠకలోకం సాక్షి.

అయితే, మరికొన్ని పత్రికలతో పాటు మాపై సయితం మేము మత విద్వేషాలను, కుల వైషమ్యాలను ప్రోత్సహిస్తున్నట్టు నిందవేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయత్తపడింది. తక్కిన పత్రికల విషయమై మేము వ్రాయనక్కరలేదు. తమను సమర్థించుకొనగల శక్తి వాటి కున్నది. కాగా, మాకు సంబంధించి నంతవరకు మాపై వేసిన నింద నిరాధారమైనది మాత్రమే కాక, నీచమైనదని గట్టిగా చెప్పక తప్పదు.

ఈ పత్రికకుగాని, ఈ పత్రిక సంపాదకునికిగాని, అధికారంలోగల మంత్రివర్గాన్ని విమర్శించడం కొత్తకాదు. ఆ విమర్శ వ్యక్తిగతంగా కాదు; సిద్ధాంతాల ప్రాతిపదికపైనే, విధానాల ప్రాతిపదికపైనే; ఎప్పుడో ఒకప్పుడు శ్రీయుత టంగుటూరి ప్రకాశం, బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య మంత్రివర్గాలను ఈ పత్రికా సంపాదకుడు నిశితంగా విమర్శించడం జరిగింది. అయినా వారిలో ఒక్కరైనా, ఈ సంపాదకుని లక్ష్యశుద్ధిని గాని, చిత్తశుద్ధినిగాని శంకించలేదు; మత విద్వేషాలను, కుల వైషమ్యాలను అంటగట్టడం అంతకంటే జరగలేదు. ఈ పని జరిగింది ఇప్పుడే; ఇప్పటి మంత్రివర్గం ద్వారానే!

రాజకీయ సమస్యలకు, ప్రభుత్వ విధానాలకు, లేదా, కాంగ్రెసు వ్యవహారాలకు సంబంధించినంతవరకు మేము చేసిన, చేస్తున్న వ్యాఖ్యల విషయంలో మమ్ము బాహాటంగా, విమర్శించడానికి గాని, మాపై చర్య గైకొనడానికి గాని ప్రస్తుత మంత్రివర్గానికి ఆస్కారంలేదు, రాదు. అందువల్లనే అది మాపై ఒక పెద్ద అభాండాన్ని వేసి, మాపై చాటుగా దెబ్బతీయడానికి ఉద్యమించింది.

మేము రాష్ట్రంలో మత సామరస్యానికి, శాంతి భద్రతలకు భంగకరం కాగల పోకడలను పోతున్నామట. అందువల్ల మరి పద్దెనిమిది పత్రికలతోపాటు మా "ఆంధ్రజ్యోతి"కి కూడా స్థానిక సంస్థలు గాని, ప్రభుత్వ యాజమాన్యంలో పూర్తిగానో, కొంతవరకో ఉన్న సంస్థలు గాని ఎట్టి ప్రకటనలు (ఎడ్వర్టయిజ్మెంట్స్) పంపించరాదట. "అతి గోప్యం, మహా గోప్యం" అంటూ ఈ "సర్క్యులర్" ను జనసంబంధ శాఖవారి ప్రేరణపై ఆయా సంస్థలకు అందజేస్తూ, "ఆంధ్రజ్యోతి" కి తమ పట్టికలో ప్రథమ స్థానమివ్వడం కూడా ప్రత్యేకించి గమనార్హమైన విషయమే! దాదాపు రెండు సంవత్సరాలుగా జన సంబంధ శాఖ వారు తాము స్వయంగా జారీ చేస్తున్న

ప్రకటనలను మాకు చెదురుగా పంపించడమో, లేదా, అసలు పంపించకపోవడమో చేస్తున్నారు. ఇది చాలదన్నట్టు, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తమ యాజమాన్యం క్రింద ఉన్న అన్ని సంస్థల నుంచి మాకు ప్రకటనలు అందకుండా ప్రస్తుతం ఈ రహస్యచర్య గైకొన్నారు.

మంత్రివర్గం కరుణాకటాక్ష వీక్షణాలు లభించినంత మాత్రాన ఏ పత్రిక వర్ధిల్లదు; అది కన్నెర్రజేసినంత మాత్రాన ఏ పత్రిక నిలిచి పోదు. పత్రికలకు ప్రధాన పోషకులు ప్రభుత్వాలు కావు, ప్రజలే, ప్రజలు చల్లని చూపు చూస్తే, ఏ ప్రభుత్వం ఎంతగా కక్ష కట్టినా, పత్రికలు మూడు పువ్వులు ఆరు కాయలుగా శోభిస్తాయి.

అయినా, ఒక విషయాన్ని జనసంబంధ శాఖవారికి, ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గానికి మేము గుర్తుకు తీసుకురాగోరుతున్నాము. ప్రయివేట్ వ్యక్తులు, సంస్థలు తమకు నచ్చినవారికి ప్రకటన లివ్వవచ్చు; నచ్చనివారికి వాటిని తొక్కిపట్టవచ్చు. కాని, ప్రభుత్వం ఈ విధంగా చేయవచ్చునా? ప్రభుత్వం పత్రికా ప్రకటనల కింద వెచ్చించేది ప్రజల ధనం కాదా? అయినప్పుడు దాన్ని వినియోగించడంలో వ్యక్తిగతమైన రాగ విద్వేషాలకు అవకాశమివ్వడం అనుచితం కాదా? అన్యాయం కాదా?

ఇవి మా అభిప్రాయాలు మాత్రమే కావు. భారత ప్రభుత్వం నియమించిన ప్రెస్ కమిషన్ 1954లో తాను సమర్పించిన నివేదికలో ఈ అభిప్రాయాలనే స్పష్టంగా వెల్లడించింది. ఈ సందర్భంలో అది వ్రాసిన వాక్యమిది :

We also hold that the liberty and freedom to place advertisements wherever he likes which a private advertiser enjoys cannot be conceded to government which is a trustee of public funds and, therefore, bound to utilize them, without discrimination, to the best advantage of the public.

ఈ సూత్రానికి రాష్ట్రమంత్రివర్గం చర్య పూర్తిగా విరుద్ధంగా లేదా?

మాకు ప్రభుత్వ ప్రకటనలు రావడం, రాకపోవడం నిజానికి అప్రధానమైన ప్రశ్న. పత్రికలను ఈ విధంగా దెబ్బతీయడం ద్వారా పత్రికా స్వాతంత్ర్యానికి భంగం కలిగించడానికి మంత్రివర్గం చేస్తున్న కుయత్నమే అన్ని విధాల ప్రధానమైన ప్రశ్న. ఏ ప్రజాస్వామ్యానికైనా పెట్టని కోటలు పత్రికలే. వాటి స్వాతంత్ర్యానికి భంగం కలిగించినప్పుడు, బెదరింపుల ద్వారా, బూకరింపుల ద్వారా వాటి నోరునొక్కివేయడానికి ప్రయత్నం జరిగినప్పుడు, ప్రజాస్వామ్యం కుంటుపడుతుంది. ఈ దృష్టితో చూస్తే, మాపై మంత్రివర్గం దాడి ప్రజాస్వామ్యంపై దాడి, ప్రజలపై దాడి. దీనికి ప్రధానంగా జవాబు చెప్పవలసిన వారు ప్రజలే; వారితో సమానంగా ప్రజా ప్రతినిధులైన శాసన సభ్యులే!

మత విద్వేషాలను, కుల వైషమ్యాలను ప్రోత్సహిస్తున్న పత్రికలను అదుపులో పెట్టడానికి కొన్ని ప్రత్యేకాధికారాలు తనకు కావాలని, అందు నిమిత్తం ప్రత్యేక శాసనాన్ని చేయవలసి ఉన్నదని రాష్ట్ర మంత్రివర్గం ఈ మధ్యనే ఒక ప్రకటన చేసింది. తనకు ఇప్పుడున్న అధికారాలనే - లేని వాటిని కూడా - దుర్వినియోగం చేయడానికి అది సన్నద్ధపడుతున్న విధాన్ని చూడగా, మత విద్వేషాలను, కులవైషమ్యాలను అణగద్రొక్కడానికి కాక, పత్రికల స్వాతంత్ర్యాన్ని ఆహరించడానికే అది ప్రత్యేకాధికారాలను కోరుతున్నట్టు అనుమానించవలసి రావడం లేదా?

నిర్లక్ష్యం చేయదగింది కాదు ఈ ప్రమాదం. తమను విమర్శించక పోయినా, సమర్థించక పోవడం, అంతమాత్రమైనా చాలక, తమను ప్రశంసించక పోవడం పత్రికల పట్ల క్షంతవ్యం కాని మహాపరాధమన్న ధోరణిలో ప్రస్తుత మంత్రివర్గం, దాని నాయకుడు వ్యవహరిస్తున్నట్టు కనబడుతున్నది. ఈ ధోరణిని మొగ్గలోనే త్రుంచి వేయకపోతే పత్రికా స్వాతంత్ర్యానికి రక్షణలేదు. ఈ విషయమై ప్రజలుగాని, ప్రజాప్రతినిధులు గాని ఉపేక్ష వహించడం తగదు, తగదు, ముమ్మాటికీ తగదు.

కాగా, నేటికి చివరిమాటగా మరొకదాన్ని చెప్పగోరుతున్నాము. మాపై తమ రహస్యపు "సర్క్యులర్"లో చేసిన నిందారోపణలను రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానంలో రుజువు చేయగలదా? మత విద్వేషాలను, కులవైషమ్యాలను ప్రజాశాంతికి భంగకరంగా రెచ్చగొట్టే పత్రికలను శిక్షింప జేయడానికి నేటి శాసనాలే చాలు. ఆ శాసనాల ప్రకారం మాపై న్యాయ స్థానంలో చర్య గైకొన వలసిందిగా రాష్ట్ర మంత్రివర్గాన్ని మేము సవాలు చేస్తున్నాము.

పత్రికా స్వాతంత్ర్యానికి ప్రమాదం



మాకు ప్రభుత్వ ప్రకటనలు రావడం, రాకపోవడం నిజానికి అప్రధానమైన ప్రశ్న. పత్రికలను ఈ విధంగా దెబ్బ తీయడం ద్వారా పత్రికా స్వాతంత్ర్యానికి భంగం కలిగించడానికి మంత్రివర్గం చేస్తున్న కుయత్నమే అన్ని విధాల ప్రధానమైన ప్రశ్న. ఏ ప్రజాస్వామ్యానికైనా పెట్టని పత్రికలే. వాటి స్వాతంత్ర్యానికి భంగం కలిగించినప్పుడు, బెదరింపుల ద్వారా, బూకరింపుల ద్వారా వాటి నోరు నొక్కివేయడానికి ప్రయత్నం జరిగినప్పుడు, ప్రజాస్వామ్యం కుంటుపడుతుంది. ఈ దృష్టితో చూస్తే, మాపై మంత్రివర్గం దాడి ప్రజాస్వామ్యంపై దాడి, ప్రజలపై దాడి. దీనికి ప్రధానంగా జవాబు చెప్పవలసిన వారు ప్రజలే; వారితో సమానంగా ప్రజాప్రతినిధులైన శాసన సభ్యులే!"

ఇవి జూలై 11వ తేదీ గురువారంనాటి సంచికలో మేము వ్రాసిన వాక్యాలు. పత్రికా స్వాతంత్ర్యాన్ని అరికట్టడానికి రాష్ట్ర మంత్రివర్గం చేస్తున్న కుయత్నాన్ని ప్రజలేమి, ప్రజా ప్రతినిధులేమి సహించబోరన్న దృఢ విశ్వాసంతోనే ఈ వాక్యాలను మేము వ్రాశాము. మా విశ్వాసం సరైన దనడానికి ఈసరికే కానవచ్చిన నిదర్శనాలు కోకొల్లలు.

ల మత విద్వేషాలను రెచ్చగొడుతున్నదనే అభాండాన్ని "ఆంధ్రజ్యోతి"పై రాష్ట్ర మంత్రివర్గం వేసినందుకు తమ ఆశ్చర్య క్రోధాలను వెల్లడిస్తూ పెక్కుమంది మాకు లేఖలు వ్రాస్తున్నారు. లేదా, మాకు టెలిఫోన్ చేస్తున్నారు. కాగా, ప్రజా ప్రతినిధు లైన మన శాసన సభ్యులు పెక్కుమంది ప్రభుత్వచర్యను నిశితంగా ఖండిస్తున్నారు. ప్రభుత్వపక్షం, ప్రతిపక్షాలు అనే విభేదం లేకుండా అన్ని పక్షాలకు చెందిన శాసన సభ్యులు ఈ ఖండనలో పాల్గొనడం ప్రత్యేకించి గమనించదగు విషయం; ప్రత్యేకించి హర్షించదగు విశేషం.

ప్రతిపక్షాలను - ముఖ్యంగా స్వతంత్ర పార్టీని, కమ్యూనిస్టు పార్టీలను - అనేక సందర్భాలలో "ఆంధ్రజ్యోతి" విమర్శించింది. అయినా, ఆ విమర్శను పత్రికా స్వాతంత్ర్యంలో ఒక భాగంగా ఆయా పక్షాల నాయకులు సంభావించారు. ఇది వారి మనౌదార్యానికి తార్కాణం; పత్రికా స్వాతంత్ర్యానికి వారిస్తున్న ప్రాధాన్యానికి తార్కాణం.

తాము ప్రభుత్వపక్షానికి చెందిన వారైనా అన్యాయాన్ని అన్యాయంగా పేర్కొనడానికి అణుమాత్రంగానైనా సంకోచించక, కాంగ్రెసు శాసన సభ్యులలో కొందరు ప్రముఖులు ప్రభుత్వ చర్యను బాహాటంగా ఆక్షేపిస్తున్నారు. పత్రికా స్వాతంత్ర్యాన్ని పోలిన ప్రాథమిక స్వత్వం విషయంలో స్వపక్ష, పరపక్ష విభేదాలకు ఎంత మాత్రం తావులేదని వారు గుర్తిస్తున్నారనడానికి ఇది తార్కాణం.

తిరిగి ప్రజల దృష్టికి, ప్రజాప్రతినిధుల దృష్టికి మరికొన్ని ముఖ్యాంశాలను తీసుకు రావడం కోసమే ఈనాడు మేము తిరిగి ఈ సంపాదకీయాన్ని వ్రాస్తున్నాము. మొన్న మేము సుదీర్ఘంగానే వ్రాసినా దానిలో అన్ని విషయాలను వివరించడం సాధ్యపడలేదు.

బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్సు, అమెరికాలను పోలిన ప్రజాస్వామ్య దేశాలలో పత్రికలకు వ్యాపార ప్రకటనల ద్వారా వచ్చే రాబడిలో ప్రభుత్వ ప్రకటనల ద్వారా వచ్చే దాని శాతం కడుస్వల్పం. వాటిలో వలె మన దేశంలో పరిశ్రమలేమి, వర్తక వాణిజ్యాలేమి పెంపొందలేదు. కాబట్టి, మన పత్రికలరాబడిలో ప్రభుత్వ ప్రకటనల ద్వారా వచ్చే దాని శాతం అధికం. మన దేశం మొత్తాన్నికాక, పారిశ్రామికంగా వెనుకబడి ఉన్న రాష్ట్రాలను, ఆంధ్రప్రదేశ్, అస్సాం, మధ్యప్రదేశ్ ను పోలిన రాష్ట్రాలను తీసుకుంటే, ఈ శాతం మరింత హెచ్చు.

ప్రెస్ కమిషన్ 1954లో ప్రచురించిన నివేదిక ప్రకారం హైదరాబాద్లోని రెండు ఇంగ్లీషు పత్రికలకు ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయంలో ఒకదానికి నూటికి 17 వంతులు, మరొక దానికి 18 వంతులు ప్రభుత్వ ప్రకటన ద్వారానే. ఇక, అస్సాంలోని రెండు పత్రికల విషయంలో ఈ అంకెలు నూటికి 27, నూటికి 36 వంతులు. ఇదే విధంగా భోపాల్లోని ఒక పత్రిక విషయంలో ఈ అంకె నూటికి 14 వంతులు. ఈ పరిస్థితిలో 1954 తర్వాత ఎన్నదగు మార్పు లేదు.

పత్రికల ఆదాయంలో ప్రభుత్వ ప్రకటనలకు మన దేశంలో, అంతకంటే ముఖ్యంగా, పారిశ్రామికంగా వెనుకబడి ఉన్న రాష్ట్రాలలో, ఇంత ప్రాధాన్యం ఉన్నది కాబట్టి, ఆ ప్రకటనలను జారీ చేయడంలో ప్రభుత్వం మరింత న్యాయంగా, మరింత నిష్పాక్షికంగా వ్యవహరించాలి. ఇందుకు పూర్తిగా విరుద్ధంగానే ఇప్పటి మన రాష్ట్ర మంత్రివర్గం వ్యవహరిస్తున్నది. "మన చేతిలో ఒక మంచి ఆయుధం ఉన్నది. దాన్ని మనకు వంత పాడని వారిపై ఎందుకు ప్రయోగించరాదు?" అనే ధోరణిని అది పూర్తిగా ప్రదర్శిస్తున్నది.

ఇందుకు రుజువుగా "ఆంధ్రజ్యోతి"నే చూడండి. 1966వ సంవత్సరంలో మొదటి తొమ్మిది నెలలలో - జనవరి, సెప్టెంబర్ నెలల మధ్య - రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా జారీచేసే "క్లాసిఫైడ్ అడ్వర్టయిజ్మెంట్స్"ను "ఆంధ్రజ్యోతి"కి 3594 సెంటీమీటర్స్ మేరకు పంపించారు. నాటి నుంచి నేటివరకు ఈ తరగతి ప్రకటనలను "ఆంధ్రజ్యోతి"కి దాదాపు పూర్తిగా నిలిపివేశారు. 1966 అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలలో ఈ తరగతి ప్రకటనలు "ఆంధ్రజ్యోతి" కి సున్నకు సున్న, హళ్ళికి హళ్ళి కాగా, మంత్రివర్గం ప్రత్యేకాభిమానానికి పాత్రమౌతున్న పత్రికలకు వాటిని యధాప్రకారం జారీ చేశారు. కాబట్టి మాకు వాటిని ఆపుచేయడం ప్రభుత్వ వ్యయ కర్తనంలో ఒక భాగంగా పరిగణించలేము.

1966 సెప్టెంబర్ ప్రాంతాల ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు ఎలెక్షన్ కమిటీ ఎన్నికల సందర్భంలో ముఖ్యమంత్రి వర్గానికి వ్యతిరేకంగా "ఆంధ్రజ్యోతి" కొన్ని వ్యంగ్య చిత్రాలను ప్రచురించింది. ఈ వ్యంగ్య చిత్రాలను ప్రచురించినా, సంపాదకీయాల ద్వారా అది ఒక వర్గాన్ని సమర్థించలేదు; మరొకదాన్ని ఖండించనైనా లేదు. కాంగ్రెసు రాజకీయాలలో కొంత గగ్గోలు పుట్టించిన సంఘటన సందర్భంలో సంపాదకీయ వ్యాసాల రూపంలో మౌనం వహించడం "ఆంధ్రజ్యోతి" సంయమనానికి నిదర్శనం. అయితే మాత్రమేమి? మహాఘనత వహించిన మంత్రి పుంగవులపై వ్యంగ్యచిత్రాలను ప్రచురించడమా? "ఇంతకంటె మహాపరాధాన్ని ఊహించడమైనా సాధ్యమా?

ఈ మహాపరాధాన్ని చేసిన పత్రికపై దెబ్బ తీయవలసిందే!" ఈ ధోరణిలో ముఖ్యమంత్రి, మంత్రివర్గంలోని ఆయన సన్నిహితులు ఆలోచించినట్టున్నారు. నాటి మొదలు, నేటి వరకు ఇంతకు ముందే మేము వివరించినట్టు "ఆంధ్రజ్యోతి"కి "క్లాసిఫైడ్ అడ్వర్టయిజ్మెంట్స్" దాదాపు పూర్తిగా నిలిపివేశారు.

వ్యంగ్య చిత్రాలను దుస్సహమైనవిగా పరిగణించేవారు నియంతలే తప్ప, ప్రజాస్వామ్య నాయకులు కారు. పైపెచ్చు, ప్రజాస్వామ్య నాయకులు వాటిని చూచి సంబరపడతారు. ఇంతే కాదు. తాము వ్యంగ్య చిత్రాలకు "సబ్జెక్ట్స్" కావడాన్ని ఒక ఘనతగా, ఒక గౌరవంగా భావిస్తారు. పత్రికా సంపాదకులకు వ్రాసి, తమకు సంబంధించిన వ్యంగ్య చిత్రాలను వారు తెప్పించుకుని, వాటిని పదిలపరచు కొనడం తరచు జరుగుతుంది. ముఖ్యంగా చర్చిల్ తనను గురించి అతి క్రూరంగా ఉన్న వ్యంగ్య చిత్రాలను ప్రత్యేకించి మెచ్చుకొనేవాడు. అట్టి చిత్రాలకు "ఫ్రేమ్" కట్టించి, వాటిని ఆయన తన "డ్రాయింగ్ రూమ్"లో పెట్టుకునేవాడు. మన దేశంలోనైనా ఇట్టి "సెన్స్ ఆఫ్ హ్యూమర్" (హాస్యప్రవృత్తి) ప్రదర్శించగల నాయకులు లేకపోలేదు. మా అనుభవంలోనే శ్రీ నీలం సంజీవరెడ్డి తమను గురించిన వ్యంగ్య చిత్రాలను చూచి, "నా ముక్కు కొస కొంత యెత్తుగా ఉంటుంది కాని, ఇంత యెత్తుగా ఉంటుందా?" అని నవ్వుకున్నారే తప్ప ఆగ్రహపడలేదు. శ్రీ పి.వి.జి. రాజు స్వయంగా మా వద్దకు వచ్చి "నన్ను గురించిన వ్యంగ్య చిత్రాల మూలప్రతులను ("ఒరిజినల్స్") దయచేసి నా కివ్వగలరా?" అని అడిగి మరీ పట్టుకువెళ్ళారు.

ఇందుకు భిన్నంగా మన ప్రస్తుతపు ముఖ్యమంత్రి, ఆయన సన్నిహితులు వ్యంగ్య చిత్రాలపట్ల ప్రదర్శిస్తున్న నియంతల వైఖరిని చూచిన మీదట నియంతృత్వ ధోరణిలో వారు పడిపోతున్నారనడం అసమంజసం కాగలదా? తమకు వంత పాడుతున్న పత్రికల పట్ల ప్రత్యేకాభిమానాన్ని ప్రదర్శించడం సయితం నియంతృత్వ ధోరణినే సూచిస్తున్నదని చెప్పడమైనా అసమంజసం కాగలదా?

1966 అక్టోబర్ నుంచి నేటి వరకు ప్రభుత్వ ప్రకటనలను జారీ చేయడాన్ని ఎంత తగ్గించినా, "ఆంధ్రజ్యోతి" రంగం నుంచి నిష్క్రమించలేదన్న కారణాన కాబోలు, ప్రభుత్వ యాజమాన్యంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉన్న సంస్థలు సయితం దానికి ప్రకటన లివ్వరాదని ఇప్పుడు ఒక రహస్యపు సర్క్యులర్ జారీ చేశారు. అన్నట్టు, ముఖ్యమంత్రికి, ఆయన సన్నిహితులకు రాజకీయంగా వ్యతిరేకులైన వారందరు, వారి కంటికి అన్య కులస్థులుగా, అన్య మతస్థులుగా కనబడుతున్నారేమో! అందువల్లనే "ఆంధ్రజ్యోతి" కులమత శక్తులకు ప్రోత్సాహమిస్తున్న పత్రికగా వారి కంటికి కనబడుతున్నదేమో!

ఏమైనా, ప్రస్తుత రాష్ట్రమంత్రివర్గ చర్య ప్రభుత్వ ప్రకటనల విషయమై ప్రెస్ కమిషన్ చేసిన అభిప్రాయాలకు పూర్తిగా విరుద్ధం. ఆ కమిషన్ నివేదికలోని ఒక వాక్యాన్ని మొన్నటి మా సంపాదకీయంలో వివరించాము. నేడు మరి కొన్ని వాక్యాలను ఉదహరించగోరుతున్నాము. పత్రికలకు ప్రకటన లివ్వడంలో ప్రభుత్వం ఈ క్రింది విషయాలను మాత్రమే దృష్టిలో పెట్టుకోవాలని ఆ కమిషన్ వ్రాసింది :

1 పత్రికకున్న ప్రచారం, అది కోరుతున్న ప్రకటన రేట్లు.

2 ఏ ప్రభుత్వ ప్రకటన ఏ విధమైన పాఠకులకు ఉద్దేశించబడిందో, ఆ పాఠకులకు అది చేరగలదా, లేదా అనే దృష్టితో ప్రభుత్వం సొమ్మును పూర్తిగా సద్వినియోగ పరచడం.

ఈ సూచనలను మరింత వివరించిన పిమ్మట ప్రెస్ కమిషన్ కింది విధంగా వ్రాసింది :

Any other method of placing advertisements is likely to carry with it two defects. It would be an unfair use of public funds. It would also render the government open to the charge that the power of placing advertisements is being exercised against papers whose editorial policy is against the government for the time being, or as a patronage to those

papers which support it. Even if. In respect of government's responsibilities for the use of public funds, the legislature, which is its ultimate custodian, taken no objection to such expenditure, the danger involved in the latter is so overwhelming that, from the point of view of maintaining independent journalism, we consider that advertisements should be issued by government only in conformity with the principles enunciated above. We look forward to the adoption of the same principles by private advertisers also.

ప్రెస్ కమిషన్ వారు ఇంత విష్పష్టంగా ప్రకటించిన అభిప్రాయాల ప్రకారం ప్రస్తుత రాష్ట్ర మంత్రివర్గం 1966 అక్టోబర్ లో మాపై ప్రారంభించిన దాడి పత్రికా స్వాతంత్ర్యంపైనే దాడి. అయినా, నేడు కాకపోతే, రేపైనా వివేకోదయం కాక పోతుందా, తన విధానాన్ని మంత్రివర్గం సవరించుకొనక పోతుందా అని మేము మిన్నకున్నాము. కాని, మంత్రివర్గం మరింత ముందుకు వెళ్ళి, మాపై కులమత విద్వేష ప్రచారనిందను మోపి, మాకు అన్ని ప్రకటనలను నిలుపుదల చేయించడానికి చర్య గైకొన్నది.

మేము పదేపదే మనవి చేస్తున్నట్లు ఇది పత్రికా స్వాతంత్ర్యంపైనే దాడి. దీన్ని నిరోధించడం ప్రజల విధి; అంతకంటే ముఖ్యంగా ప్రజా ప్రతినిధుల విధి. (ఆంధ్రజ్యోతి 14-7-1968)

పత్రికలు, రాష్ట్ర ప్రభుత్వం

(పత్రికా స్వాతంత్ర్యంపై తీవ్ర ఆంక్షల విధింపుకు బిల్లు తెచ్చే ప్రయత్నంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉండగా ఆ ప్రయత్నాన్ని నిరశిస్తూ రాసింది.)



ధీమతులైనా కొన్ని కొన్ని సందర్భాలలో తప్పటడుగు వేయడం కద్దు. అయితే ధీమతులైనవారు తాము తప్పటడుగు వేసినట్టు గుర్తించడానికి సంకోచించరు.

మొత్తం పందొమ్మిది పత్రికలను “బ్లాక్ లిస్ట్"లో పెట్టడంలో తాము చేసిన తప్పిదాన్ని "ఇది తప్పిద”మని రాష్ట్ర ప్రజలేమి, ప్రజా నాయకులేమి విస్పష్టంగా చెప్పిన తర్వాతనైనా, రాష్ట్ర ముఖ్యమంత్రి గుర్తించకపోవడం ఎంతైనా శోచనీయం. చేసిన తప్పిదాన్ని తప్పిదంగా ఆయన గుర్తించలేదు సరిగదా, దాన్ని సుదీర్ఘంగా సమర్థించారు.

నిన్న అసెంబ్లీలో చర్చకు వచ్చిన సావధాన తీర్మానానికి ముఖ్యమంత్రి చెప్పిన సమాధానంలో పరస్పర వైరుధ్యాలతో పాటు ప్రమాదకరమైన కొన్ని సూత్రాలు కూడా ఉన్నాయి. వీటి విషయమై పత్రికలు మౌనం వహించినా, ప్రజలేమి, ప్రజా ప్రతినిధులేమి ఉపేక్ష చూపినా, పత్రికా స్వాతంత్ర్యంతో పాటు ప్రజాస్వామ్యానికే ముప్పు తప్పదు.

పత్రికలను “బ్లాక్ లిస్ట్”లో పెట్టే పద్ధతికి స్వస్తి చెప్పడానికి నిన్నటి తమ సమాధానంలో ముఖ్యమంత్రి పూర్తిగా నిరాకరించారు. మాకు తెలిసినంత వరకు ఈ పద్ధతి ఇతర రాష్ట్రాలలో నివేదిక చూచినా, అది ఈ పద్ధతిని వ్యతిరేకించినట్టుగానే కనబడుతుంది. కొన్ని ప్రత్యేక సందర్భాలలో ప్రకటనలను నిలుపుచేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నట్టు ప్రెస్ కమిషన్ అంగీకరించింది, అయితే, ఏ కారణాల వల్ల వాటిని నిలుపుచేయడం జరిగిందో పత్రికలకు తెలియజేయాలని ఆ కమిషన్ సభ్యులిద్దరు - వారిద్దరు విఖ్యాత పత్రికా సంపాదకులు

సూచించారు. పైగా, కమిషన్ తన సూచనగా, పత్రికలు వక్రమార్గాన పోతున్నప్పుడు, వాటికి ప్రభుత్వ ప్రకటనలను త్రొక్కి పట్టడం చట్టరీత్యా వాటిపై చర్యకు (“లీగల్ యాక్షన్"కు) ప్రత్యామ్నాయం కారాదని స్పష్టంగా చెప్పింది. ఈ భాగాలను యథాతథంగా ఈ కింద ఉదహరిస్తున్నాము :

We agree that advertisements cannot be claimed by newspapers as a matter of right. We also agree that Government would be justified in withholding advertisements from papers which habitually indulge in journalism which is obscene, scurrilous - which includes elements of coarseness, abusiveness and vulgarity - gives incitement to violence or endangers the security of the State. Two of our members Sri A.D. Mani and Sri M. Chalapathi Rao feel that the newspapers should on request be informed of the reasons for withholding advertisements. In a case, withdrawal of advertisements cannot be and should not be made a substitute for or alternative to legal action. We also hold that the liberty and freedom to place advertisements wherever he likes which a private advertiser enjoys cannot be conceded to government which is a trustee of public funds and, therefore bound to utilise them. with out discrimination, to the best advantage of the public.

దీన్ని బట్టి తమ ప్రకటనలను నిలపడంలో ప్రభుత్వానికి ఉన్న హక్కు బహుపరిమితమని ప్రెస్ కమిషన్ చెప్పినట్టు స్పష్టం. ఇంతేకాక, వక్రమార్గాన పోతున్న పత్రికలను అదుపులో పెట్టడానికి చట్టరీత్యా చర్య తీసుకొనడానికి మారుగా ప్రకటనలను త్రొక్కిపెట్టడం అనుచితమని అది చెప్పినట్టు కూడా స్పష్టం.

ఇందుకు భిన్నంగా రాష్ట్ర మంత్రివర్గం రహస్యంగా ఒక "బ్లాక్ లిస్ట్"ను తయారు చేసి దాని విషయమై రహస్యంగా "సర్క్యులర్" పంపించింది. పందొమ్మిది పత్రికలను “బ్లాక్స్ట్" చేస్తూ గత ఏప్రిల్ 18వ తేదీని మునిసిపాలిటీలకు, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న పారిశ్రామికాది సంస్థలకు పంపించిన రహస్యపు “సర్క్యులర్” బయటపడలేదనే అనుకోండి. అప్పుడు ప్రభుత్వం దృష్టిలో తాము ఏదో తప్పు చేసినట్టుగాని, అందుకే ప్రభుత్వం పై చర్య గైకొన్నదనిగాని ఆ పత్రికలకు ఎలా తెలిసేది? తప్పుదారిని పోతున్న పత్రికలను సరైన దారికి మరలించడమే ప్రభుత్వోదేశమైతే, బాహాటంగా చర్యగైకొన్నప్పుడు తప్ప ఆ ఉద్దేశం నెరవేరదు గదా? అయినప్పుడు రహస్యపు "సర్క్యులర్"ను ఎందుకు పంపినట్టు? ఒక “పబ్లిక్” ప్రయోజనాన్ని సాధించ గోరినప్పుడు “పబ్లిక్"గా చర్య గైకొనక, తెరచాటు భాగవతాలు దేనికి?

మా “ఆంధ్రజ్యోతి”కి సంబంధించినంత వరకు “కమ్యూనలిజం” శక్తులను ప్రోత్సహిస్తున్నదన్న కారణాల”పై దానిపై చర్య గైకొనలేదని మాపక్షాన ఎవరో కొందరు తమను కలుసుకోగా తాము తెలియజేసినట్టు ముఖ్యమంత్రి నిన్న చెప్పారు. వారెవరో మాకు తెలియదు. కుల మత వైషమ్యాల ప్రోత్సాహనింద మాపై, లేకపోతే, మరి ఏ నిందపై చర్య గైకొనవలసి వచ్చిందో నిన్నటి తమ ప్రసంగంలోనైనా ఆయన స్పష్టం చేయలేదు. వివిధ కారణాలపై విభిన్న పత్రికలపై చర్య గైకొన్నట్టు మాత్రమే చెబితే, ఏ పత్రికకైనా ప్రభుత్వం దృష్టిలో తాను ఏమి తప్పుచేస్తున్నదో ఎలా తెలుస్తుంది? పైగా “కమ్యూనల్” అనే పదానికి ప్రతిపక్ష నాయకులు శ్రీ గౌతు లచ్చన్న నిర్వచనాన్ని కోరగా, ముఖ్యమంత్రి ఎందువల్ల మౌనం వహించారు?

ఇంతేకాదు, కులమత విద్వేషాలను ప్రోత్సహిస్తున్నామన్న నింద మాపై లేనప్పుడు, ఆ కారణాన్ని చెబుతూ మాకు వ్యతిరేకంగా "సర్క్యులర్" పంపించడం న్యాయమా? తాము జారీ చేసిన అసలు ఉత్తరువులో ("జి.వో."లో వివిధ కారణాల ప్రసక్తి ఉన్నదని, తమ రహస్యపు "సర్క్యులర్"లో అనవసరమని వాటిని పేర్కొనలేదని నిన్న ముఖ్యమంత్రి చెప్పారు. తమ "సర్క్యులర్" రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీలతోపాటు ఇతర సంస్థలకు వెళ్ళింది; దాన్ని కొన్ని వందల మంది - కీలక స్థానాలలో ఉన్నవారు - అందుకున్నారు. వారందరికి "కమ్యూనల్" దృక్పథం లేని పత్రికను "కమ్యూనల్" పత్రికగా చిత్రించడం అన్యాయం కాదా? ఏవో కొన్ని పత్రికలు పేరును ఖూనీ ("క్యారెక్టర్ ఎశాసినేషన్") చేస్తున్నట్టు నిన్న ముఖ్యమంత్రి ఆరోపించారు. అయితే, తాము తమ "సర్క్యులర్" ద్వారా చేసింది మా పేరును ఖూనీచేయడమే కాదా? పైగా, మేము 14వ తేదీ ఆదివారం నాటి మా సంపాదకీయంలో పేర్కొన్నట్టు, మాకు రాష్ట్ర ప్రభుత్వం సరాసరిగా జారీచేసే "క్లాసిఫైడ్ అడ్వర్టైజ్మెంట్స్"ను 1966 అక్టోబర్ నుంచి దాదాపు పూర్తిగా నిలుపు చేశారు. అదే సంపాదకీయంలో మేము వివరించినట్టు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు ఎలెక్షన్ కమిటీ ఎన్నికల సందర్భంలో ముఖ్యమంత్రి వర్గాన్ని వ్యతిరేకిస్తూ కొన్ని వ్యంగ్య చిత్రాలను ప్రకటించడమే తడవుగా మంత్రివర్గం ఈ చర్య మాపై గైకొన్నది. దీన్నిబట్టి రాష్ట్ర కాంగ్రెసు వ్యవహారాలలో ముఖ్యమంత్రిని, ఆయన వర్గాన్ని వ్యతిరేకించడం ముఖ్యమంత్రి దృష్టిలో "అనారోగ్యకరమైన ధోరణి" కాగలదని తీర్మానించుకోవాలా? ప్రజాక్షేమానికి, శాంతికి భంగకరంగా వర్తించడమే కాగలదని తీర్మానించుకోవాలా?

ప్రభుత్వ చర్యకు ముఖ్యమంత్రి నిన్న పేర్కొన్న వివిధ కారణాలలో "పార్టిజాన్ ఫ్రిక్షన్" అనేది కూడా ఉన్నది. దీనికి ఆయన నిర్వచనాన్ని చెప్పలేదు. అన్ని రాష్ట్రాలలో వలె మన రాష్ట్రంలో కూడా కాంగ్రెసు సంస్థలో రెండు వర్గాలున్నాయి. వీటిలో ఒక వర్గాన్ని సమర్థించడం "పార్టిజాన్ ఫ్రిక్షన్"కు దోహదం చేయడమే కాగలదా? ఈ దోషం ముఖ్యమంత్రి వర్గాన్ని సమర్థిస్తున్న పత్రికలకు కాక, దాన్ని వ్యతిరేకిస్తున్న పత్రికలకే అంటగలదా? ఇదే నిజమైతే, తమ వర్గ ప్రయోజనాలకు అనుగుణంగా పత్రికలను కంట్రోల్ చేయడానికి ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని అనుకోవలసి రాదా?

ఏమైనా, అసలు ఈ "బ్లాక్ లిస్ట్" పద్ధతే విమర్శనీయం. ప్రజాక్షేమానికి, శాంతికి భంగకరంగా వర్తిస్తున్న పత్రికలపై చట్టరీత్యా చర్యగైకొనాలి. అంతకు తక్కువ చర్యవల్ల ప్రయోజనం శూన్య పైగా, ఇందుకు ప్రస్తుతపు శాసనాలే చాలు. ఇందుకోసం ముఖ్యమంత్రి కోరుతున్నట్టు ప్రత్యేక శాసనాన్ని చేయనక్కరలేదు; ప్రత్యేకాధికారాలను పొందనక్కరలేదు. ఇప్పుడు తమకున్న అధికారాలనే తమకు వంతపాడని పత్రికలపై గొంతు నొక్కడానికి వినియోగిస్తున్నప్పుడు, ప్రత్యేకాధికారాలను పొందితే పత్రికా స్వాతంత్ర్యం దృష్టి నుంచి పరిస్థితులు మరింత విషమమైనవిగా పరిణమించవచ్చు.

ఈ ప్రత్యేకాధికారాల బిల్లును నేడు (మంగళవారంనాడు) అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీని "క్లాజు"లను సూక్ష్మంగా పరిశీలించడానికి ఈనాడు మాకు పూర్తి వ్యవధి లేదుగాని, స్థూలంగా చూచినా రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లు ద్వారా కోరుతున్నవి ప్రత్యేకాధికారాలు కాక, విపరీతాధికారాలన్నట్టు కానవస్తున్నది. "ప్రీ-సెన్సార్ షిప్"ను సయితం ఈ బిల్లులోని ఒక "క్లాజు" ప్రతిపాదిస్తున్నది. బ్రిటిష్ ప్రభుత్వంవారు ద్వితీయ ప్రపంచ యుద్ధం సందర్భంలో "ప్రీ-సెన్సార్షిప్"ను ప్రవేశపెట్టగా, దానికి లొంగడం ఆత్మగౌరవానికి భంగకరంగా భావించి, దేశంలోని అనేక పత్రికలు స్వచ్ఛందంగా ప్రచురణను నిలుపు చేశాయి. అయినప్పుడు స్వతంత్ర భారతంలో ఒక రాష్ట్ర ప్రభుత్వం "ప్రీ-సెన్సార్ షిప్"ను విధించగోరడం ఎంతవరకు భావ్యం? ఈ మధ్య ఆంధ్రప్రదేశ్లో కుల మత వైషమ్యాలు తల ఎత్తడం ఎంతైనా శోచనీయం కాని, కొన్ని ఉత్తరాది రాష్ట్రాలలో కంటే ఈ వైషమ్యాలు ఇక్కడ తీవ్రంగా లేవుగదా? అయినా, ఆ రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరంకాని, ప్రత్యేకాధికారాలు ఈ ప్రభుత్వానికి ఎందుకు అవసరమౌతున్నాయి? "బ్లాక్ లిస్ట్" వ్యవహారంతో జతచేర్చి చూస్తే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పత్రికా స్వాతంత్ర్యాన్ని అన్ని విధాల అరికట్టడానికి నడుం బిగిస్తున్నదనే అభిప్రాయం మరింత బలపడ్డంలేదా? (ఆంధ్రజ్యోతి 17-7-1968)

ప్రెస్ బిల్లు ప్రతిపాదన

కేంద్ర సమాచార శాఖమంత్రి శ్రీ కె.కె. షా మొన్న లోకసభలో పత్రికలకు సంబంధించిన కొన్ని విషయాలు వెల్లడించారు. వీటిలో ఒకటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల కొన్ని పత్రికలను "బ్లాక్ లిస్టు"లో చేర్చడానికి సంబంధించినది.

"బ్లాక్ లిస్టు" నుంచి కొన్ని పత్రికలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలగించిందని చెబుతూ శ్రీ షా "ఆంధ్రజ్యోతి", మరి మూడు పత్రికలను మాత్రం పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఈ వర్తమానం కేంద్ర ప్రభుత్వానికి అంది ఉండవచ్చు. కేంద్ర మంత్రి వెల్లడించిన దాన్నిబట్టి బ్లాక్ లిస్టు నుంచి కొన్ని పత్రికలను తొలగించడం జరిగిందని రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవలసిందే తప్ప రాష్ట్ర ప్రభుత్వం తనకు తానై ఇంతవరకు ఎట్టి ప్రకటన చేయలేదు. ప్రకటన చేయకపోతే మానె, తన రహస్యపు సర్క్యులర్ను తాను మొదట ఏయే ప్రభుత్వశాఖలకు, అనుబంధ సంస్థలకు పంపించిందో వాటికైనా ఈ విషయం తెలియజేసిందా? ఆ విధంగా తెలియజేసినప్పుడే రాష్ట్ర ప్రభుత్వం మొదట తాను చేసిన తప్పిదాన్ని సరిదిద్దుకున్నట్టు కాగలదు.

ఈ విషయమై మేమిదివరలో వ్రాసిన సంపాదకీయాలలో పేర్కొన్నట్టు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "ఆంధ్రజ్యోతి" వంటి కొన్ని పత్రికలను బ్లాక్ లిస్టులో చేర్చడం. ప్రకటనలను నిలుపు చేయడం ప్రధాన ప్రశ్న కానేకాదు "ఆంధ్రజ్యోతి" పై "కమ్యూనల్" అనే ముద్రవేసి గైకొన్న అక్రమ చర్యపై ప్రజలు సందేహానికి తావు లేకుండా తమ తీర్పు చెప్పారు "ఆంధ్రజ్యోతి" ప్రచురించిన పాఠకుల లేఖలు, విభిన్న రాజకీయ పక్షాలకు చెందిన ప్రముఖులు శాసనసభ లోపల, వెలుపల వెల్లడించిన నిరసనే ఇందుకు తార్కాణం. అందుచేత, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన బ్లాక్ లిస్టును ఉపసంహరించుకొనడం చేసిన తప్పును దిద్దుకొనడానికి నిర్వర్తించదగు కనీసపు కర్తవ్యంగానే పరిగణించాలి.

శ్రీ కె.కె. షా లోక్సభలో వెల్లడించిన మరొక విషయం ఇంతకంటే ముఖ్యమైనది. కేంద్ర ప్రభుత్వం కూడా వార్తా పత్రికలలో మతతత్వ రచనలను నిరోధించడానికి ఒక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ఆలోచిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ సందర్భంలో ఆయన ఉపయోగించిన మాట "కమ్యూనల్ రైటింగ్స్" అన్నది ఈ మాటను బిల్లులో ఏ విధంగా నిర్వచిస్తారో, ఏ ధోరణి రచనలను ఆ నిర్వచనం క్రిందికి తీసుకువస్తారో, అసలు ఆ బిల్లులో నిబంధనలు ఏ రీతిగా ఉండబోతున్నాయో తెలియదు కనుక, దానిపై ప్రస్తుతానికి మేము వ్యాఖ్యానించబోము కాని, శ్రీ షా స్థూలంగా చెప్పిన దాన్ని బట్టి కేంద్రం ప్రవేశ పెట్టనున్న బిల్లులో కూడా కొన్ని నిబంధనలు పత్రికా స్వాతంత్ర్యానికి హానికరమైనవి ఉండగలవేమోనన్న అనుమానం కలుగుతున్నది. ముఖ్యంగా బిల్లులో ప్రీ సెన్సార్షిప్కు అవకాశం ఉండగలదని తెలుస్తున్నది. ఇది వార్తా పత్రికలేకాక ప్రజాస్వామ్యంపై అభిమానం కలవారెల్లరు నిస్సందేహంగా ప్రతిఘటించవలసిన నిబంధన.

గత యుద్ధకాలంలో బ్రిటిష్ ప్రభుత్వం పత్రికలపై ప్రీ - సెన్సార్షిప్ ను విధించగా, దాన్ని అంగీకరించడం అవమానంగా భావించి కొన్ని పత్రికలు స్వచ్ఛందంగా ప్రచురణను విరమించుకొన్నాయి. ఒక పత్రిక కొన్నాళ్ళ పాటు సంపాదకీయాలు లేకుండా వెలువడింది. వార్తలకు పెట్టే శీర్షికలను సయితం ప్రభుత్వాధికారి పరిశీలనకు ముందుగా పంపించవలసి రాగా, అసలు శీర్షికలే లేకుండా, ఆ శీర్షికల అభిప్రాయాన్ని స్థూలంగా తెలియజేసే ఫోటోలను మాత్రం ముద్రించి ఆయా వార్తలను వాటి క్రింద ప్రచురించేది.

తిరిగి ఆనాటి పర ప్రభుత్వ నిర్బంధాలను ఈనాటి మన జాతీయ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నదా? ప్రీ. సెన్సార్ షిప్పు ఏ రూపంలో, ఏ ఆశయంతో ప్రవేశపెట్టినా అది పత్రికా స్వాతంత్ర్య సిద్ధాంతాన్నే అపహాస్యం చేస్తుంది. అది మొత్తం పత్రికా ప్రపంచాన్నే దోషిగా భావించి, అవమానిస్తుంది.

పత్రికా స్వాతంత్ర్యం పరిమితులులేనిది కాదన్నమాట నిజమే. భారత రాజ్యాంగం పౌరులకు కొన్ని ప్రాథమిక స్వాతంత్ర్యాలను ప్రసాదిస్తున్నది, వాటిలో అభిప్రాయ ప్రకటన స్వాతంత్ర్యం ఒకటి. దీని క్రిందికి పత్రికా స్వాతంత్ర్యం కూడా వస్తుంది. అయితే, అన్ని స్వాతంత్ర్యాలకు వలెనే దీనికి కూడా కొన్ని పరిమితులున్నాయి కాని, ఆ పరిమితులు అసలు స్వాతంత్ర్యాన్నే హరించేవిగా ఉండరాదు. కాగా ప్రీ-సెన్సార్షిప్ నిబంధన పత్రికా స్వాతంత్ర్యానికే మూలచ్ఛేదమైన పరిమితులను విధించగల ఆంక్ష కాదా?

శ్రీ షా లోక్ సభలో వివరించిన దాన్ని బట్టి కేంద్రం ప్రవేశ పెట్టనున్న బిల్లు ఆంధ్రప్రదేశ్ ప్రెస్ బిల్లుకంటే కొంతైనా ఉదారంగా ఉండగలదన్న భావం కలుగుతున్నది. మత విద్వేషాలను ప్రోత్సహించే పత్రికలపై ఆంక్షలు విధించాలని జూన్ నెలలో శ్రీనగర్ లో జరిగిన జాతీయ సమైక్య మండలి సిఫారసు చేసింది. ఈ సిఫారసును అనుసరించి కేంద్ర ప్రభుత్వం ఒక బిల్లును ప్రవేశ పెట్టదలచింది. దానికి 1951 నాటి పంజాబు ప్రత్యేకాధికారాల చట్టాన్ని నమూనాగా తీసుకోవాలని భావించింది. అయితే, ఈలోగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన ఘనతను చాటుకొనడానికి కాబోలు తొందరపడి ఒక బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లు పంజాబు శాసన నిబంధనలను మించిన ఆంక్షలను, శిక్షలను పత్రికలపై విధించాలని ప్రతిపాదిస్తున్నది. పత్రికల అభిప్రాయాలపై, ఆస్తులపై అన్ని హక్కులను ఆ బిల్లు ప్రభుత్వానికిస్తున్నది. పత్రికకు జరగవలసిన హాని అంతా జరిగిన తర్వాత మాత్రమే న్యాయస్థానాలకు అప్పీలు చేసుకునే హక్కును అది ప్రసాదిస్తున్నది. పంజాబు నమూనాకంటె కఠినతరంగా ఉండకుండా ఆంధ్రప్రదేశ్ బిల్లును రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తాము కోరగలమని శ్రీ షా తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ బిల్లు అనుచితంగా ఉన్నదన్న అభిప్రాయం ఈ వాక్యంలో ధ్వనిస్తున్నది. అయితే, ఈ అనౌచిత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన బిల్లు ముసాయిదాను పరిశీలనకు పంపినప్పుడే కేంద్ర ప్రభుత్వం ఎందుకు గుర్తించలేదు? దాన్ని ప్రవేశపెట్టడానికి హోం శాఖ ఎందుకు అనుమతించింది?

ఏమైనా, వార్తాపత్రికలకు సంబంధించిన ఒక బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడానికి యోచిస్తున్నది. దాని స్వరూప, స్వభావాలు ఏ విధంగా ఉంటాయో మనకు తెలియదు. అయినా, అది మొత్తం దేశానికి వర్తించడానికి ఉద్దేశించినట్టిది. అయినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వేరుగా శాసనం చేయనక్కరలేదు. ఒక వేళ చేయవలసి వస్తే కేంద్ర శాసనం తరువాత దాని విషయం ఆలోచించుకోవచ్చు. బహుశా ఈ ఉద్దేశంతోనే కావచ్చు, మరే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారాల ప్రెస్ బిల్లును తలపెట్టలేదు. ఈలోగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వచ్చిన తొందర ఏమున్నదో, ఇతర రాష్ట్రాలలో కంటే అత్యవసరంగా మత సామరస్యాన్ని, నైతికపు విలువలను కాపాడ్డానికి పత్రికలపై చేయి చేసుకోవలసిన ఆవశ్యకత మన రాష్ట్రంలో ఏమి వచ్చినదో తెలియడం లేదు. అందుచేత తాను తలపెట్టిన బిల్లును అది ఉపసంహరించుకోవడమే యుక్తంగా కనబడుతున్నది.

శ్రీనగర్ మహాసభ మత సామరస్య పరిరక్షణకు కొన్ని సిఫారసులు చేసింది. వాటిలో పత్రికలకు సంబంధించిన ప్రత్యేక శాసనాన్ని చేయాలన్నది ఒకటి. పత్రికలలో మత సామరస్యానికి భంగకరమైన రచనలనే కాదు, ఇతర విధాలుగా అభ్యంతరకరమైన రచనల ప్రచురణను కూడా నిరుత్సాహ పరచడానికి, అప్పటికీ పత్రికలు మితిమీరి ప్రవర్తిస్తే శిక్షించడానికి ఇప్పటికే కొన్ని శాసనాలున్నాయి. వాటిలో 1951నాటి ప్రెస్ (అబ్జక్షనబుల్ మేటర్) యాక్ట్ ఒకటి. దీని క్రింది నిబంధనలలో ఒక వర్గంపట్ల మరొక వర్గానికి ద్వేషం

పురికొల్పే రచనలపై అభిశంసన కూడా ఉన్నది. అసభ్యతను, అశ్లీలాన్ని అభిశంసించే నిబంధనలు కూడా ఉన్నాయి. మొత్తం మీద పత్రికలలో ఎట్టి అభ్యంతరకర ధోరణులను అరికట్టడానికైనా ఈ శాసనం సరిపోతుంది. అయినప్పుడు కొత్తగా మరొక శాసనం తేవలసిన అవసరం ఉన్నదా?

నిశితంగా ఆలోచిస్తే, నిశ్చలంగా పరిశీలిస్తే జీవితంతో సన్నిహిత సంబంధం లేనిది మానవ సంఘంలో, సంస్కృతిలో ఏదీ లేదు. మన సారస్వతం జీవితానికి అర్థకల్పన. మన సంగీతం జీవిత మాధుర్య వ్యక్తీకరణ. మన నృత్యం జీవితానంద ప్రదర్శన. మన చిత్ర, శిల్పకళలు జీవిత సౌందర్యాన్వేషణ, మన వైజ్ఞానిక శాస్త్రాలు జీవితరహస్య పరిశోధన. మన మతాలు జీవితలక్ష్య నిర్దేశం. ఇహాన్ని రోసి పరంకోసం పరితపిస్తున్న వారైనా కోరుతున్నది అశాశ్వతమైన ఈ జీవితం స్థానంలో శాశ్వతమైన మరొక జీవితాన్నే!

తక్కిన వాటికంటె కూడా జీవితానికి సన్నిహితమైంది జర్నలిజం. దైనందిన జీవితానికి దర్పణమే జర్నలిజం. ఈ కారణాన తక్కిన వారికంటే జర్నలిస్టు జీవితంతో మరింతగా సన్నిహిత సంబంధం పెట్టుకోవాలి, మరింతగా దానినుంచి పాఠాలు నేర్చుకోవాలి.

జర్నలిజంలోని ఆనందం



ఈనాటి పరిస్థితులు కొంతవరకు భిన్నంగా వున్నా, రెండు తరాల క్రితం వరకు బ్రిటీషు జర్నలిజంలో ఆక్స్ఫర్డ్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీల పట్టభద్రులకు స్థానం లభించేది కాదు. ఈ పెద్ద చదువులు చదివిన వారికి పుస్తకాలతో వున్నంత పరిచయం బ్రతుకుతో వుండదనీ, వారు నిత్యజీవిత సమస్యలను, వాటి పరిణామాలను సరిగా అర్థం చేసుకోలేరనీ, తమ పాండిత్య ప్రదర్శనకు వారు అనవసర ప్రయత్నం చేస్తారనీ, సామాన్య పాఠకులకు అర్థంకాని పదజాలాన్ని వాడతారనీ వారిని ఫ్లీట్ స్ట్రీట్లో అడుగు పెట్టనిచ్చేవారుకాదు. లండన్లోని ఒక వీధి పేరు "ఫ్లీట్ స్ట్రీట్" అని నేను విడమర్చి చెప్పనక్కర లేదేమో! ముఖ్యమైన పత్రికలన్నీ ఆ వీధి నుంచే, లేదా దాని చుట్టుప్రక్కల నుంచే వెలువడుతున్నాయి కాబట్టి, జర్నలిజానికే "ఫ్లీట్ స్ట్రీట్" ఒక పర్యాయపద మైందనికూడా చెప్పనక్కరలేదేమో! పెక్కుమంది జర్నలిస్టుల దృష్టిలో ఈ ఫ్లీట్ స్ట్రీట్ ఒక కాశీ, ఒక సార్నాథ్, ఒక మక్కా, ఒక జెరుసులెం. అయిదుసార్లు లండన్లో మకాం చేసినప్పుడు 1954-1975 సంవత్సరాల మధ్య ఒక నలభై సార్లైనా ఈ వీధికి నేను తీర్థయాత్ర చేసి వుండాలి.

వెనుకటి పరిస్థితులు కొంతవరకు మారినా, ఇప్పుడైనా ఫ్లీట్ స్ట్రీట్ లోకి ఆక్స్ఫర్డ్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీల పట్టభద్రుల కంటే ఏదైనా ఒక చిన్నబస్తీలో, ఏదైనా ఒక చిన్న పత్రికలో పనిచేసి, ధక్కామొక్కీలు బాగా తిని, రాటుతేలినవారికే తేలికగా ప్రవేశం లభిస్తుంది. ఒక చిన్న బస్తీలో, ఒక చిన్న పత్రికలో పనిచేసే వారు రిపోర్టింగ్ దగ్గరి నుంచి, లీడర్ రైటింగ్ వరకు సమస్తం చేయవలసి వుంటుంది.

ఇందువల్ల జర్నలిజంలో “అ” నుంచి “హ” వరకు సమస్తంలో వారు ప్రవేశాన్ని - ప్రవేశాన్ని మాత్రమే కాదు, ప్రజ్ఞను కూడా సంపాదిస్తారు. ఇంతేకాక మరొక సదవకాశం కూడా వీరికి లభిస్తుంది. ఒక మహానగరంలో కంటే ఒక చిన్న పట్టణంలో ఎక్కువమందితో, ఎక్కువగా పరిచయం కల్పించుకోవడం, మానవ స్వభావాన్ని, సమస్యలను ఎక్కువగా తెలుసుకోవడం సాధ్యపడుతుంది. ఇందువల్ల జీవితానుభవం ఎక్కువగా లభిస్తుంది.

తొలిగానే పెద్ద పదవిలో ప్రవేశిస్తే ఇతర రంగాలలో రాణిస్తారేమోకాని, జర్నలిజంలో కాదు. కింది మెట్టునుంచి పైదానివరకు ఎక్కివెళ్ళేవారే దానిలో ఎక్కువగా రాణిస్తారు. లండన్లో “ఈవినింగ్ న్యూస్” ఆఫీసుకు నేను 1954లో వెళ్ళినప్పుడు ఆ పత్రికలో ఫారెన్ న్యూస్ డిపార్టుమెంటులో పనిచేస్తున్న ఒక సబ్ ఎడిటర్ను ఆ కార్యాలయంలోని వివిధ శాఖలను నాకు చూపించడానికి నియోగించారు. అతడు నూనూగు మీసాల కుర్రవాడు. “ఇంతకుముందు నీవు ఎక్కడ పనిచేశావు? ఏమి పనిచేశావు?" అని నే నతడిని విచారించగా, అదే ఆఫీసులో ఆఫీస్ బోయ్గా చేరినట్టుగా చెప్పాడు. ఇది 1954 నాటిమాట. ఈనాడు ఆ కుర్రవాడు ఏదో ఓ పత్రికకు ఎడిటర్గా ఉన్నాడని వింటే నా మట్టుకు నేను ఆశ్చర్యపడను.

ఆఫీస్ బాయ్ గా కాదుకాని, నా జర్నలిస్టు జీవితం కిందమెట్టులోనే ప్రారంభమైంది. నా తొలి ఉద్యోగం ప్రకాశం పంతులుగారి “స్వరాజ్య”లో. రిపోర్టర్ గా నా జీతం నెలకు పాతిక రూపాయలు; ట్రామ్ ప్యాస్ కోసం మరొక అయిదు. ఈ కొద్దిపాటి జీతమైనా పూర్తిగా ముట్టలేదు. మొత్తం తొమ్మిది నెలలు కాబోలు అక్కడ పని చేశాను. నా చేతికి వచ్చింది మాత్రం పూర్తిగా నాలుగు నెలల జీతమైనా కాదు. అయినా, “స్వరాజ్య”లో పనిచేయడం నా అదృష్టంగానే భావిస్తున్నాను. రిపోర్టర్గా చేరిన వారానికే ఆనాటి “స్వరాజ్య” ఎడిటర్ శ్రీ ఖాసా సుబ్బారావు "ప్రూఫ్ రీడింగ్ చాలా ఘోరంగా వుంటున్నది. ఆ డిపార్టుమెంటులో నాలుగు వారాలు పనిచేయరాదా?” అన్నారు. ఆ నాలుగు వారాలు పనిచేసేసరికి ప్రూఫ్ రీడింగ్లో కొంత ప్రవేశం లభించింది. ఆ తూరి శ్రీ ఖాసా సుబ్బారావు తాము ఎడిటర్ గా చేరిన మూడు నెలలకే ఆ పదవి నుంచి ఏవో కొన్ని కారణాల వల్ల తప్పుకున్నారు. అంతట ఒక సీనియర్ సర్ఎడిటర్ యాక్టింగ్ ఎడిటర్ అయ్యాడు. అతగాడు నన్ను పగలు సబ్ ఎడిటర్ , సాయంత్రం పూట - అదనపు డ్యూటీక్రింద • రిపోర్టర్గా నియోగించాడు. జీతాలు ముట్టడం లేదని మరికొందరు జారుకోగా, తర్వాత నేను నైట్ ఎడిటర్గా పనిచేయవలసి వచ్చింది.

“స్వరాజ్య” కు “మార్నింగ్ ఎడిషన్” అనేది లేదు. అయినా, ఆఫీసుకున్న రెండు లైనోమెషిన్లతో రాత్రిపూట కూడా కంపోజింగ్ చేయించకపోతే మర్నాటి సాయంత్రానికి ఎనిమిది పేజీల పత్రిక బయటికి రాదని రాత్రిపూట కూడా పని చేయించేవారు. ప్రతి రాత్రి మూడు పేజీలకు సరిపడ మేటర్ కంపోజ్ చేయించడం నా పని. తోడుకు మరెవ్వరు లేనందున ఒంటిచేతిపై ఈ పని పూర్తిగా చేయించాలి. టెలిగ్రాములు చాలా కొద్దిగా వచ్చేవి. వాటితోనే సరిపుచ్చితే ఒక పేజీ అయినా పూర్తిగా నిండేది కాదు. అందువల్ల ఎక్చేంజి క్రింద వచ్చే పత్రికలలోని వార్తలను, వ్యాసాలను కత్తిరించి, అవి కత్తిరింపు లన్న సంగతిని దాచడం కోసం ఇటు మార్చి, అటు మార్చి, వాటికి కొత్త రూపం ఇవ్వవలసి వచ్చేది. అవసరమైతే, ఒక్కడినే ఎనిమిది పేజీల దినపత్రికను ఒక్క చేతిపైగానే పూర్తిచేసి బయటికి పంపించగలనన్న గుండెనిబ్బరాన్ని ఈ అనుభవమే నాకు అటుతర్వాత కలిగించింది. “ఇది నా డ్యూటీ. అది కాదు” అని పట్టింపులకు పోకుండా, ఏ పనిని నాకు అప్పగించినా, కొత్త అనుభవాన్ని గడించడానికి ఒక అవకాశంగా దాన్ని భావించి, శక్తివంచన లేకుండా దాన్ని చేయడం వల్లనే, జర్నలిస్టుగా నేను ఇంతో, అంతో రాణించగలిగినట్టు నా నమ్మకం. అన్నట్టు, చేస్తున్న పనిని, అది ఏదైనాసరే, మనసుపెట్టి చక్కగా చేయడంలోనే జీవితానందం సగానికి పైగా వున్నది. తమ వృత్తిధర్మాలను ఈసురోమంటూ నిర్వహించేవారు, తమ జీవితాలను తామే దుస్సహం చేసుకొంటారు.

"స్వరాజ్య" లో నేను క్షుణ్ణంగా నేర్చుకోగలిగింది జర్నలిజం పద్ధతులనే. అటు తర్వాత కొన్నాళ్ళకు ఒక దినపత్రికకు ఎడిటర్ కావడంతో మానవ స్వభావాన్ని గురించి, జీవితాన్ని గురించి ఎన్నెన్నో విషయాలు నేర్చుకోగలిగాను. "పేరు గొప్ప, ఊరు దిబ్బ" - ఈ మాటలు ఎంత నిజమో జర్నలిస్టుకు తెలిసినంతగా ఇతరులకు తెలియడానికి వీలులేదు. గొప్పవారుగా చెల్లుతున్నవారితో జర్నలిస్టుకు అనునిత్యం సంబంధం తప్పదు. ఎంత ప్రయత్నించినా, వారు తమ లోపాలను, దౌర్బల్యాలను జర్నలిస్టు నుంచి దాచిపెట్టలేరు. ఇందువల్లనే జర్నలిస్టులకు మానవ స్వభావంలో విశ్వాసం తగ్గిపోవడం కద్దు; అతడు ఒక "సినిక్"గా తయారుకావడం కద్దు. అయినా, ఈ ప్రమాదం నుంచి అతడు తనను తాను కాపాడుకోడానికి గట్టి ప్రయత్నం చేయాలి. మానవ స్వభావంపై విశ్వాసం చచ్చిపోయిన వానికి తనపై తనకే విశ్వాసం సడలిపోవచ్చు; తన నీడను చూచి తానే భయపడగల స్థితిలో పడిపోవచ్చు. "ఏ పుట్టలో ఏమి పాము వున్నదో! " ఈ సామెత కూడా పూర్తిగా నిజమన్న సంగతి జర్నలిస్టుకు పూర్తిగా ఆకళింపుకు వస్తుంది. అనామకులైనవారే కొన్ని కొన్ని ఘట్టాలలో కీలకవ్యక్తులు కావచ్చు; అప్రధాన విషయాలే కొన్ని కొన్ని సందర్భాలలో కీలక సమస్యలుగా పరిణమించవచ్చు. అందువల్ల జర్నలిస్టు ఎవరినీ, దేన్నీ నిర్లక్ష్యం చేయరాదు. అతడు నిత్య జాగరూకుడై వుండాలి, సర్వసాక్షిగా వ్యవహరించాలి. పదిమంది ఒకచోట గుమికూడితే, ఎందుకు గుమికూడినారో తెలుసుకోడానికి అటు ఒకసారి తొంగిచూడాలి; ఏదైనా ఒకమాట వింటే, దాని వెనక ఏదైనా వార్తావిశేషం అణగి మణగి వున్నదేమో అని పట్టిచూడాలి. ఈ సందర్భంలో స్వానుభవాలను కాక జాన్ డెలేన్ అనుభవాలను చెప్పడం తగునేమో! ఆయన లండన్ "టైమ్స్" ఎడిటర్గా ప్రపంచ ప్రఖ్యాతి పొందినవాడు. ఒకనాడు డెలేన్ ఒక మంగలిషాపుకు వెళ్ళాడు. 'ఆ షాపులో తనకు గడ్డం చేస్తున్న మంగలి మాటలపోగు. అంతకుముందే ఒక లార్డ్ (ఆయన పేరు ఈ క్షణాన నాకు గుర్తుకురావడం లేదు) తమ షాపుకు వచ్చి వెళ్ళాడని, సరిగా అప్పుడే షాపులోవున్న తన డాక్టర్తో జబ్బు నుంచి తేరుకొంటున్న కుమార్తె ఉష్ణదేశం వాతావరణానికి తట్టుకోగలదా అని ఆ లార్డ్ ప్రశ్నించాడని చెప్పాడు. ఆ మాట వినగానే సరిగా అప్పుడు ఇండియాలో వైస్రాయి పదవి ఖాళీ కాబోతున్నదన్న సంగతి డెలేన్కు గుర్తువచ్చింది. మంగలిషాపు నుంచి సరాసరి తన ఆఫీసుకు వెళ్ళి, ఫలానా లార్డ్ను ఇండియాకు వైస్రాయిగా పంపించబోతున్నారన్న వార్తను ప్రచురించాడు. అప్పటివరకు ఆయన నియామకం పరమ రహస్యం. దాన్ని ఎవరు డెలేన్కు బయటపెట్టారని ఆ లార్డ్తో పాటు నాటి బ్రిటీషు ప్రధాని సయితం విస్తుపోయాడు. ఈ సందర్భంలోనే కాక, ఇట్టి అన్య సందర్భాలలోను నిత్యజాగరూకతను, బుద్ధి నైశిత్యాన్ని చూపించిన డెలేన్ వృద్ధాప్యం ప్రవేశించేసరికి యధాలాపం మాటల వెనుక దాగివుండే వార్తా విశేషాలను పసికట్టగల తన శక్తిని కోల్పోయాడు. 1876 సెప్టెంబరు ప్రారంభంలో నాటి బ్రిటీష్ ప్రధాని డెజ్ లీ ఒకనాడు డెలేన్తో ప్రసంగిస్తూ "12వ తేదీన నేను ఆస్బార్న్ వెడుతున్నాను. అక్కడి నుంచి హౌస్ ఆఫ్ కామన్స్కు రాను" అని చెప్పాడు. తాను లార్డ్ బిరుదాన్ని స్వీకరించబోతున్నట్టు, కామన్సు సభ్యత్వాన్ని వదులుకోబోతున్నట్టు ఈ మాటల ద్వారా డెజ్లీ స్పష్టంగా ధ్వనించాడు. దాన్ని డెలేన్ గుర్తించి వుంటే, ఆనాడు "టైమ్స్" పత్రిక ఒక స్కూప్ (ఇతర పత్రికలకు తెలియని వార్త ప్రకటించగలిగేది. ఈ విషయంలో తన అజాగ్రత్తను గుర్తించిన తర్వాతనే మరి తాను ఎడిటర్ గా వుండడం తగదని డెలేన్ తన పదవి నుంచి విరమించాడు.

జర్నలిస్టు ఎంతో మెలుకువగా వుండకపోతే, స్కూప్పు చేజేతులు విడిచిపెట్టుకొనడమేకాక, లేనిపోని తంటాలు, తద్దినాలు కొనితెచ్చుకోగల ప్రమాదం కూడా వున్నది. ఈ విషయమై నా అనుభవం నా జర్నలిస్టు జీవితం ప్రారంభదశలో. నాకు తన తెలుగు వారపత్రికలో అసిస్టెంటు ఎడిటర్ ఉద్యోగమిచ్చి ఆదరించిన ఒక మిత్రుడు చనిపోయిన తర్వాత ఏడాదైనా తిరగకముందే ఆయన భార్యాకూడా కాలధర్మం చెందింది. ఈ వార్తను ఆ మిత్రుని అన్న నాకు టెలిఫోన్లో తెలియజేస్తూ, భర్త గతించిన దుఃఖంకొద్దీ మంచంపట్టి, మతితప్పి ఆమె మరణించినట్టు చెప్పాడు. నిజమే అనుకుని, ఆయన చెప్పిన మాటలను చెప్పినట్టుగా ప్రకటించాను. ఆ తర్వాతగాని, నాకు తెలియలేదు సంతానం లేకుండా చనిపోయిన దంపతుల ఆస్తివిషయమై వారసులు కోర్టు కెక్కబోతున్నారనీ, ఆ దావా సందర్భంలో నేను ప్రచురించిన వార్త (మతి తప్పి ఆమె చచ్చిపోయిందన్న వార్త) సాక్ష్యంగా ఉపయోగపడగలదన్న దురుద్దేశంతో అతడు ముందుగానే జాగ్రత్త పడ్డాడనీ! -

మెలకువగా వుండకపోతే, ఇతర ప్రమాదాలు కూడా కొన్ని వస్తాయి. దురుద్దేశంతో ఎవరో చనిపోయారని, ఆయన ఉత్తమ పురుషుడని, ఆయన నిర్యాణానికి సంతాపం సూచకంగా హర్తాళ్ జరిగిందని కొందరు వ్రాయవచ్చు, లేదా ఏదో సంస్కరణ వివాహం జరిగిందని వ్రాయవచ్చు. వాటిని నమ్మి ప్రచురించి, రెండు, మూడుసార్లు నేను దెబ్బతిన్నాను. ఒక అబద్ధపు మరణవార్త ప్రచురణ తర్వాత అందుకు పత్రికలో క్షమాపణ తెలిపినా, అది తెచ్చిన బెడద పూర్తిగా ఒక సందర్భంలో తీరలేదు. "మీ వార్త వల్ల నాకు కీడు కలుగకుండా నేను మృత్యుంజయ జపాన్ని జరిపించవలసి వచ్చింది. దాని ఖర్చులు పూర్తిగా మీరు చెల్లించాలి" అంటూ అతడు వెంటపడ్డాడు. అ అనుభవాల తర్వాత ఇప్పుడు నా ఆఫీసులో ఒక ప్రధాన సూత్రం, మా పత్రికా విలేకరులు స్వయంగా పంపించినప్పుడు తప్ప వివాహవార్తలు, మరణవార్తలు ప్రచురించరాదని.

జర్నలిజం ముఖ్యంగా దినపత్రికలకు సంబంధించిన జర్నలిజం, అసిధారావ్రతం వంటిది. రాత్రింబవళ్ళు కష్టించి పనిచేస్తేనే తప్ప దానిలో రాణింపుకు రాలేరు. పైగా, గడియారంతో పరుగుపందెం వేస్తూ వుండాలి; త్వరత్వరగా నిర్ణయాలకు వస్తూ వుండాలి; దూషణ భూషణలను పాటించక వార్తలు ప్రచురించాలి; వ్యాఖ్య చేయాలి, న్యాయంగా, నిర్భీకంగా. త్వరగా ఆరోగ్యం చెడిపోగల ప్రమాదం ఈ వృత్తిలో వున్నది. అయినా, దీనిలో ఆనందం కూడా వున్నది. ప్రజలకు తెలియని వార్తలు తెలుసు కోవాలని ప్రజ ఉవ్విళ్లూరే వార్తలు తెలియడం, వాటిని ప్రజలకు తెలియజెయ్యడం - ఇది తెచ్చే ఆనందం కొంత. వార్త పక్షాన వదంతిపై యుద్ధం, స్వాతంత్ర్యం పక్షాన నిరంకుశత్వంపై యుద్ధం, న్యాయంపక్షాన అన్యాయంపై యుద్ధం - ప్రతినిత్యం ఇన్ని యుద్ధాలు చేస్తున్నామన్న ఆనందం మరికొంత. ఈ ఆనందమే లేకపోతే, జర్నలిజం మోయరాని బరువుగానే తోస్తుంది.

(శ్రీ వేగుంట కనకరామబ్రహ్మం అభినందన సంచిక “కానుక”, 1977 నుండి).

చరిత్ర : చరిత్ర పరిశోధన

నాందీ వాచకం



(సాధికార చరిత్ర రచనకు సూచనలు - పరిశోధనలో తీసుకోవలసిన మెలుకువలు

భారత దేశం చరిత్రకు తిరిగి రాయవలసిన పరిస్థితి వివరణ.)

జయీభవ!

విజయీభవ !!

దిగ్విజయీభవ !!!

పెక్కు తరాల తర్వాత తెలుగు రాజ్యమనేది తిరిగి కళ్లకు కనబడబోతున్నది.

కొన్ని శతాబ్దాల తర్వాత ఆంధ్ర ప్రభుత్వమనేది మరల నెలకొన బోతున్నది.

ఏనాటి ఇక్ష్వాకు, చాళుక్య, కాకతీయ రాజ్యాలు ! ఇవన్నీ పద్నాల్గవ శతాబ్దానికి పూర్వానివే. రెడ్డి రాజులు రాజ్యంచేసింది కూడా శతాబ్దాలనాడే.

సంస్థాపకుల విషయం వివాదాంశమైనా, ఆంధ్ర సామ్రాజ్యమని చెప్పుకోదగిన విజయనగర సామాజ్యం తళ్లికోట యుద్ధంతో 1565 లోనే అంతరించి పోయింది.

నాటినుంచి నేటివరకు తెలుగు రాజ్యమనేది లేదు; ఆంధ్ర ప్రభుత్వ మనేది పూజ్యం. అట్టిది తిరిగి ఏర్పడ్డానికి విజయవాడలో నేడు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘం చేసిన తీర్మానం నాందీ వాచకం.

“కాకతి ప్రాభవమ్ము” తెలంగాణంలో నేటికీ “పాడైన పెనుకోటగోడల దీర్ఘ నిద్రల్ వోవు” తున్నది. "కాకతీయుల కదన పాండితి” తెలంగాణాలో ఈ నాటికీ కొసప్రాణాలతో మిగిలేవున్నది. అట్టి తెలంగాణాలేని ఆంధ్రరాష్ట్రం ఆంధ్రరాష్ట్రమా?

“కాదని ఎవరో వాదుకువస్తే, కటకందాకా మనదేరా!” అని కృష్ణదేవరాయల కాలంలో మడివేలే పాట పాడాడట. కటకందాకా మనదైనా, కాకపోయినా, బరంపురమైనా లేని ఆంధ్రరాష్ట్రం ఆంధ్రరాష్ట్రమా ?

ఆ కాని, ఆ సమగ్రరాష్ట్రానికి - ఆ విశాలాంధ్రానికి - ఇప్పుడేర్పడనున్నది కేవలం పునాది మాత్రమే అని ఒక్క త్రుటి పాటైనా మనం విస్మరించరాదు.

కేవలం పన్నెండు జిల్లాలతో కూడిన రాష్ట్రానికి ఇప్పుడు మనం సమ్మతించడం కక్కుర్తికొద్దీ కాదు; కార్యవాదుల మైనందునే; చాల లేక పోయినందున కాదు; రాజనీతి చతురులమైనందునే; ఆశలుడిగిన వారమై నందునకాదు; మహోజ్జ్వల భవితవ్య సాధనకు దీక్షాకంకణ బద్ధులమైనందునే. అయితే, నేటి ఈ ఉత్సాహం పాల పొంగు కారాదు; నేటి ఈ శూరత్వం ఆరంభ శూరత్వం కారాదు.

కాలానికి కట్టువడగలమని నేడు నిరూపించాము; ప్రతికూల పరిస్థితులనైనా అధిగమించి, విశాలాంధ్ర లక్ష్యాన్ని సాధించగలమని రేపు రుజువు చెయ్యాలి. ఒక విశాల లక్ష్యసాధనకు తగు బలాన్ని కూర్చుకొనడానికి పట్టువిడువ గలవారమని నేడు రుజువు చేసుకున్నాము; “ధీరుల్ విఘ్న నిహన్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్" అని రేపు నిరూపించాలి.

ఒక్క మాటలో, ఇప్పటి ఈ ఆంధ్రరాష్ట్ర సాధనతో మన కర్తవ్యం పూర్తికాదు; అది ప్రారంభ మౌతుంది.

నవ్యాంధ్ర కవితకు రూపులు దిద్దిన శ్రీ రాయప్రోలు సుబ్బారావు పలుకులలో ఇకమీదట ఆంధ్ర జాతికి కర్తవ్యమిది -

“జారిన దేశగౌరవముఁ జక్కనదిద్ది, మహాంధ్రమండలీ

భారము శ్లాఘనీయముగఁ బాలనఁజేసి సమాన రాష్ట్రముల్ కూరిమినాసఁజేయ, తెలుగుంబుడమిన్ గయి సేయరయ్య, దీ క్షారతి నాంధ్రపుత్రులు! జగజ్జనధర్మమె దృష్టినిల్పుచున్.” (ఆంధ్రప్రభ 12-11-1949)

ఓ! తెలుగువాడా ...

దెబ్బపై దెబ్బ నీకు తగిలింది;



నీ చేలు ములకవేశాయి; నీ పంటలు పాడైపోయాయి; నీ నోటిదగ్గరికూడు నీళ్లపాలైంది. నీ ఇంటికప్పు ఎగిరిపోయింది; నీ యింటి గోడలు కూలిపోయాయి; చెట్టుపుట్టలను పట్టవలసిన దుర్గతి నీకు పట్టింది.

నీ ఊరు కొసఊపిరితో మిగిలింది; నీ పట్టణం కళ్లలో ప్రాణాలతో నిలిచింది.

అయినా, నీ సహాయానికి వచ్చేవా రేరీ? అంతదూరం దేనికి? "అయ్యో" అని నిన్ను ఓదార్చే పాపాన్నైనా పోయేవారు లేరు.

ఉత్తరాది పత్రికలను చూడు! ఫిలిప్పీన్స్ ఉప్పెనను గురించి ప్రకటించిన పాటిగానైనా వాటిలో నీ ప్రసక్తి లేదు.

దక్షిణాదిలోనే ఆంధ్రేతర భాషా పత్రికలను చూడు. వాటిలో నీగోడు ఏమంత కానరాదు. దేశం మొత్తం మీద ఒక్క

ఆంధ్రేతర ప్రముఖుడైనా నీ కింత కష్టం వచ్చినా, ఈనాటికీ నీ ఊసే యెత్తలేదు.

నీ రాష్ట్రప్రభుత్వం అని నీ వనుకునే దాని అధిపతి నీకు వచ్చిన ఆపదను గురించి నీ నాయకులు కొందరు చేసిన ప్రకటనలను ‘‘అతిశయోక్తుల” కింద జమకట్టివేశాడు.

నీ నాయకులలోనే కొందరు చెన్నపురి ఏమైపోతుందో అని తల్లడిల్లి పోతున్నారే కాని, నువ్వు ఏమైపోతావని ఆందోళన చెందకున్నారు.

“తక్కిన దేశం ఏమైపోతే నా కేమి! నేనూ, నా పిల్లాజెల్లా బాగుంటే సరి” అని నీవు అనుకున్న వాడవైతే, పోనీ ఇప్పుడు నీ పట్ల దేశం చూపుతున్న ఈ నిర్లక్ష్యానికి కొంత అర్థం వుంటుంది. కాని, బీహార్ లో భూకంపంవస్తే, నీ కొంప కూలినట్టే కలవరపడ్డావు.

క్వెట్టా కంపిలితే, మిన్నువిరిగి నీ నెత్తినే పడ్డట్లు తల్లడిల్లావు.

బెంగాల్లో కరువువస్తే, ఆ కష్ట కథను “బుర్రకథ” గా ఊరూర, వాడవాడ చెప్పుకుని, కన్నీరు కార్చావు.

అయినా, నీ కన్నీటిని నువ్వేతుడుచుకోవాలి; నీ గాయాలను నువ్వే మాన్పుకోవాలి. ఇంతగా నీవు అజా పజా లేనివాడివి ఎందుకైనావో తెలుసా? ఇంతగా దిక్కూదివాణం లేనివాడివిగా ఎందుకైనావో ఆలోచించుకున్నావా?

“నాది” అని చెప్పుకోడానికి నీ కొక రాష్ట్రం లేనంతవరకు ఒక ప్రభుత్వం లేనంతవరకు - ఈ అవస్థలే నీకు తప్పవు; ఈ అవమానాలే నీకు తథ్యం.

“ఆంధ్ర రక్తం, ఆంధ్ర వీర్యం, ఆంధ్ర సామ్రాజ్యం” అనే వీరాలాపాలకు ఈసారి చెవి యొగ్గేముందు మొన్నటి రెండు తుపానులలో “నా” అన్నవారు లేనందుకు నువ్వెంత ఖిన్నుడవు కావలసివచ్చిందో ఒక సారి జ్ఞప్తికి తెచ్చుకో!

ఏ వెర్రి మొర్రి రాష్ట్రమో నీది నీ కొకటివుంటే, నీ వింత “దిక్కు మాలిన వాడివి” అయ్యేవాడివేమో ఒకసారి ఆలోచించుకో!

స్థానబలం లేనివానికి వేరే బలం వుండబోదన్న సంగతి మరిచిపోబోకు. అది బీటలువారిన దైనప్పటికీ, ఏదో ఒక “కోటలో పాగా వెయ్యి”. ఆ తర్వాత నిన్ను అడ్డగల వారుంటా రేమో చూడు!

(ఆంధ్రప్రభ 9-11-1949)

మన చరిత్ర

ఒకసారి వెనుదిరిగి చూచుకుంటే, మన తెలుగువారి చరిత్ర, సాఫీగా నడిచిన ఘట్టం కాలంలో దాదాపు లేనట్టే కనబడుతుంది.

అయిదు వందలకు పైగా సంస్థానాలు ఇండియన్ యూనియన్లో ఎట్టి కల్లోలం లేకుండా విలీనంకాగా, రజాకార్ల దురాగతాల తర్వాతగాని, వాటిని అరికట్టడానికి "పోలీసు చర్య" తర్వాతగాని నిజాం సంస్థానం విలీనీకరణ జరగలేదు.

అస్సాం, సింధు, ఒరిస్సాలు భాషా రాష్ట్రాలుగా ఏర్పడిన పెక్కేళ్ళ తర్వాతనే - విస్తృత ప్రజోద్యయం తర్వాతనే - ఆంధ్రరాష్ట్ర నిర్మాణం జరిగింది.

ఆంధ్ర రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి శ్రీ టంగుటూరి ప్రకాశం ప్రభుత్వం కొనసాగింది పదమూడు నెలలు మాత్రమే.

శ్రీ ప్రకాశం తర్వాత ముఖ్యమంత్రి పదవికి వచ్చిన శ్రీ బెజవాడ గోపాలరెడ్డి సయితం త్వరితంగా ఆ పదవిని కోల్పోవడం జరిగింది. 1956లో విశాలాంధ్ర నిర్మాణం జరిగినప్పుడు కాంగ్రెసుపార్టీ నాయకత్వానికి శ్రీ నీలం సంజీవరెడ్డితో పోటీచేసి, దానిలో ఆయన ఓడిపోయారు.

తర్వాత శ్రీ సంజీవరెడ్డి రెండు పర్యాయాలు ముఖ్యమంత్రి కాగా, మొదటిసారి కాంగ్రెసు అధ్యక్ష పదవిని స్వీకరించడం కోసం ఆయన రాజీ అది మానవ నైజము మాత్రమేకాదు. ఆ నైజము ప్రకోపించడానికి అవకాశమిచ్చిన పరిస్థితులు, ఆయా సంస్థలలో లభించే, చెడుకూడ ప్రభుత్వాన్ని స్వీకరించడం వలననే, అవి దౌర్బల్యానికి లోనై దుష్టశక్తుల విజృంభణను అరికట్టలేక పూర్వపు కీర్తిని పోనాడుకొని పతితమైపోయినవి. ప్రపంచ చరిత్ర, ఇతర దేశములలోని మహాసంస్థల మనుగడ మనకు చెప్పేపాఠం ఇదే. (ఆంధ్రప్రభ

దేశ చరిత్ర

నిజమే - కేంద్ర విద్యామంత్రి శ్రీ ఎం. సి. చాగ్లా నిన్న సిమ్లాలో ఉద్ఘాటించినట్లు, భారతచరిత్రను త్రిప్పి వ్రాయవలసిన అగత్యం ఎంతైనా వున్నది. ఆయన ఆశిస్తున్నట్టుగా రానున్న అక్టోబర్ 20వ తేది నుంచి సిమ్లాలోని రాష్ట్రపతి నిలయంలో "ది ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్సుడ్ స్టడీస్" అనే పేరుతో ప్రారంభంకానున్న నూతన పరిశోధనసంస్థ ఈ లక్ష్యసాధనకు తోడ్పడగలదనే విశ్వసిస్తున్నాము.

ఈ కొత్త సంస్థ పాఠ్య ప్రణాళికల నిర్ణయానికై, పట్టభద్రులను ఉత్పత్తి చేయడానికై తన కాలాన్నీ వినియోగించదు, తన నిధులను వెచ్చించదు. ఇది సనదుల నివ్వదు, సన్మానాలను చేయదు. మౌలికమైన ఆలోచన చేయగల ప్రతిభావంతులను, సత్యసంశోధనకై తమ జీవితాలను అంకితం చేయగల పండితులను ఒకచోట చేర్చడం, వారు తమ పరిశోధనలు కొనసాగించడానికి వలసిన సమస్త సదుపాయాలను సమకూర్చడం - ఇవే దీని ప్రధాన లక్ష్యాలు.

కొత్తసంస్థ పాలకవర్గం ప్రథమ సమావేశం నిన్న జరిగినప్పుడు శ్రీ చాగ్లావలె, మన వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జాకీర్ హుస్సేన్ సయితం దానిలో పనిచేసేవారికి, పరిపూర్ణస్వేచ్ఛ నివ్వడం ఎంత ముఖ్యమో వివరించాడు కాబట్టి, ఆ విషయాన్ని గురించి మేము మరొకమారు నొక్కి చెప్పవలసిన అవసరం లేదు. నూతన సంస్థకు చెందిన పండితులు తమ పరిశోధనల సందర్భంలో మన జాతీయ దౌర్బల్యాలను విశదీకరించవలసివస్తే, వారు జాతీయగౌరవానికి కళంకం తెస్తున్నారన్న విమర్శ రారాదు; ఆ నెపంపై వారి నోటిని నొక్కివేసే ప్రయత్నాలు జరగరాదు. ఇంతే జరిగితే, నూతన సంస్థవల్ల ప్రయోజనం సున్నకు సున్న, హళ్ళికి హళ్ళి మాత్రమే కాగలదు !

దేశ చరిత్ర



జాతీయ దృక్పథం నుంచి దేశచరిత్ర రచనకు చర్యలు గైకొనడం మన జాత్యహంకారానికి దోహదకల్పనకోసం కాదు, మనలను అంతర్ముఖులను చేయడంకోసం; ఇదివరలో మన పురోగతికి ఏయే శక్తులు తోడ్పడినవో, ఏవేవి మన పతనానికి దారితీసినవో తెలుసుకొని, మరింత విజ్ఞతాపూర్వకంగా మన భావిచరితను రూపొందించుకొనడంకోసం.

మన పాత చరిత్రను త్రిప్పి వ్రాయడం అనే పేరుతో చరిత్రకే కాదు, జాతికి కూడా అపకారం చేసినవారు, చేస్తున్నవారు నేడు కోకొల్లలుగానే వున్నారు. అతి సంకుచితదృష్టిగల ఈ ప్రబుద్ధులు, జాత్యహంకారపూరితులైన ఈ పండితమ్మన్యులు ప్రధానంగా ఈ కింది ఘోరాపచారాలను చేస్తున్నారు :

1 అది స్వదేశాభిమానమన్న భ్రమతో పాశ్చాత్య పండితుల పరిశోధనలను, రచనలను చులకన చెయ్యడం.

2 హిందూమతాన్ని సర్వోత్కృష్టమైనదాన్నిగా ఆకాశాని కెత్తుతూ, అన్య మతాలపై, పరసంస్కృతులపై నోరు

పారవేసుకొనడం.

3 ప్రాచీనతపై పిచ్చి వ్యామోహంకొద్దీ ఆధునికతను అన్ని సందర్భాలలో అవివేకంగా దుయ్యబట్టడం.

అంతకు పందొమ్మిదవ శతాబ్దిలో కొందరు పాశ్చాత్యపండితులు తమ పరిశోధనల పుణ్యమా అని తెలియజెప్పిన తర్వాతనే మన బ్రాహ్మీలిపిని తిరిగి చదవడం మనకు తెలిసింది. ముందు అది మనకు "బ్రహ్మలిపి"గా పరిణమించింది. "బ్రహ్మలిపి" అంటే "చదువుటకు వీలుకాని వ్రాత" అని మన నిఘంటువులు అర్థం చెప్పడం బ్రాహ్మీలిపిపరిజ్ఞానాన్ని మనం కోల్పోయిన కాలంలోనే జరిగి వుండాలి!

ఇదే విధంగా ఖరోష్ఠిలిపి పరిజ్ఞానాన్ని సయితం మనం కోల్పోయాము. ఈ రెండు లిపులను తిరిగి మనకు చదవడం నేర్పినవారు జేమ్స్ ప్రిన్సెప్, డాక్టర్ హల్ష్ అనే పాశ్చాత్య పండితులే ! ఈ లిపులలోగల ప్రాచీన శాసనాలను వీరు మనకు చెప్పడానికి ముందు మనం మౌర్య, గుప్త, చాళుక్య, పల్లవ వంశాలను గురించిన వివరాలను మరచిపోయాము. అశోకచక్రవర్తి మన దేశంలో పుట్టినట్టు, ఆయన బౌద్ధమతాన్ని స్వీకరించినట్టు, దాన్ని ప్రపంచ మతంగా సుస్థాపితం చేయడానికి ప్రయత్నించినట్లు లీలామాత్రంగా నైనా జ్ఞాపకంలేని ఘోర స్థితిలో పడిపోయాము; అశోకచక్రవర్తికి బిరుదనామమైన "దేవానాంప్రియుడు" అనే దానికి "మూర్ఖుడు" అని మన నిఘంటువులలో అర్థం వ్రాసుకొనడానికి సిద్ధపడిన దుస్థితికి దిగజారిపోయాము. ఎంతో లోతున పూడిపోయిన మన ప్రాచీన చరిత్రను త్రవ్వి, తిరిగి వెలికితెచ్చిన ఇట్టి పాశ్చాత్య పండితులపట్ల కృతజ్ఞత ప్రకటించడానికి మారుగా, వారికి చేయెత్తి నమస్కరించడానికి బదులుగా, మనలో కొందరు ప్రబుద్ధులు మన ప్రాచీనతను గుర్తించడం తమకు, తమ పాశ్చాత్య నాగరికతను తలవంపులు కాగలదన్న దురుద్దేశంతో మౌర్యచంద్రగుప్తుడు అలెగ్జాండర్కు సమకాలికుడన్న అబద్ధాన్ని వారు కల్పించినారన్న అవకతవక వాదాన్ని లేవదీస్తున్నారు. ఇంతే కాదు. ఈ పరమ ఛాందసులు పురాతత్త్వశాస్త్రానికి భిన్నంగా వెళ్ళి, ఇతర శాస్త్రీయాధారాలకు వ్యతిరేకంగా పోయి, కేవలం మన పుక్కిటి పురాణాల పైనే ఆధారపడి, ఆర్యులు మన దేశంనుంచే అన్యప్రాంతాలకు వలస వెళ్లారని, అసలు మానవసృష్టి మన దేశంలోనే జరిగిందని, ఆ మాటకు వస్తే, ప్రాణికోటి మన సరస్వతీనదిలోనే ఆవిర్భవించిందని ఏవేవో వెర్రిమొర్రి వ్రాతలు వ్రాస్తున్నారు. కాగా, మరికొందరు ఛాందసులు హిందూమతంపట్ల తమకున్నభక్తి గౌరవాలను పురస్కరించుకొని గౌతమబుద్ధునితోపాటు అశోకచక్రవర్తిని, శ్రీహర్షుని, బౌద్ధమతాన్ని అభిమానించిన ఇతర సార్వభౌములను నిరసించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నంలో ఒక భాగమే హిందూమత పునరుద్ధరణ జరిగిన గుప్తశకాన్ని మన దేశ చరిత్రలో "స్వర్ణయుగం"గా చిత్రించడానికి జరిగిన, జరుగుతున్న ప్రయత్నం. నిష్పాక్షికంగా చరిత్రను పరిశీలిస్తే మాత్రం మౌర్యులు, శాతవాహనులు, రాష్ట్రకూటులు, పాండ్యులు, చోళులు మొదలైన వారిని మించి గుప్తరాజులు పెద్దగా వెలగబెట్టింది. ఏమీ లేదని తెలుస్తుంది.

అశోకుని, శ్రీహర్షుని చేస్తున్నట్టుగానే సుప్రసిద్ధులైన కొందరు ముస్లిం పరిపాలకులను కూడా దిగదీయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. కొన్నేళ్ళుగా విస్తృతంగా కొనసాగుతున్న ఈ మూర్ఖయత్నానికి తార్కాణంగా "విష్ణుధ్వజ్ ఆర్ కుతుబ్మీనార్ ?" అనే

పేరుతో డి.ఎన్. ద్వివేది వ్రాసిన పుస్తకాన్ని "తాజ్ మహల్ వజ్ ఎ రాజ్పుట్ ప్యాలెస్" అనే పేరుతో పి. ఎన్. ఓక్ ప్రచురించిన గ్రంథాన్ని పేర్కొనవచ్చు.

ఓక్ చేస్తున్న చిత్ర విచిత్ర వాదాల ప్రకారం, ఆదిలో తాజ్మహల్ ఒక రాజపుత్ర ప్రాసాదం. చాలాసార్లు చేతులు మారిన తర్వాత దాన్ని రాజా జయసింగ్ వద్ద నుంచి షాజహాన్ స్వాధీనంచేసుకొని, ముంతాజ్ మహల్ సమాధిగా మార్చివేశాడు. అది ఒక హిందూరాజ ప్రాసాదమనే సంగతిని మభ్యపరచడానికై దాన్ని ఆయన కొంత మార్చికట్టడం జరిగింది.

కేవలం తాజ్మహల్ మాత్రమేకాక, ఢిల్లీలోని ఎర్రకోట, ఆగ్రాలోని కోట మొగల్ నిర్మాణాలు కావట. వాటిని క్రీస్తుశకం నాల్గవ శతాబ్దిలో అనంగ్ పాల్ అనే రాజు నిర్మించాడట. తాజ్ను ఆదిలో నిర్మించినవాడుకూడా బహుశా ఈ అనంగ్పాల్ కావచ్చునట.

తాజ్ నిర్మాణం ప్రారంభాన్ని, దాని ముగింపును తాను తన కళ్ళతో చూచినట్టు షాజోన్ కాలంలో ఇండియాలో పర్యటించిన ఒక పాశ్చాత్యుడు - టావెర్నే వ్రాస్తే మాత్రమేమి? దాన్ని ప్రత్యక్షసాక్షి కథనంగా తీసుకోవాలని ఎక్కడున్నది? ఆగ్రా వైపుకు తొంగిచూడకుండానే అతడు కల్లబొల్లి కథలను వ్రాసివుండవచ్చుగదా? హుమయూన్ సమాధి ఫక్కిలోనే తాజ్మహల్ నిర్మాణం జరిగిందని ఇతరులు వాదిస్తే, అది పసలేని వాదమే ! అసలు హుమయూన్ సమాధి కూడా మరొక రాజపుత్ర ప్రాసాదం! దాన్నికూడా నిరంకుశులైన మొగల్ పాదుషాలు కైవసం చేసుకొని, ఒక సమాధికింద మార్చివేశారు ! ఓక్ కంటికి స్పష్టంగా కనబడుతున్న ఈ గుమ్మడికాయవంటి సత్యాలను ఇతరులు కానలేకపోతే, అది వారి దృష్టి మాంద్యం వల్లనే; వారికున్న పరమత, పరసభ్యతల వ్యామోహంవల్లనే !!

సిమ్లా సంస్థ రాణించాలంటే, అది ఈ విధమైన సంకుచితత్వానికి, దురహంకారానికి దూరంగా వుండాలి. సమగ్రదృష్టితో, సమన్వయ కాంక్షతో సత్య సంశోధన చేయాలి; అవసరమైనప్పుడు అప్రియసత్యాలను వెల్లడించడానికైనా వెనుదీయరాదు. అప్పుడే ఈ కొత్త సంస్థ మన దేశానికి, మన జాతికి నిజమైన సేవ చేయగలుగుతుంది.

(ఆంధ్రజ్యోతి 6-8-1965)

చరిత్ర	సాహిత్య పరిశోధన (గ్రంథ సమీక్ష)



మన భాషకు, మన చరిత్రకు సంబంధించినంతవరకు పరిశోధన చాలా తక్కువ, చరిత్ర పరిశోధకుల సంఖ్య చాలా పరిమితం. అన్యదేశాల సంగతి అటుంచి, మనదేశంలోనే అన్యరాష్ట్రాలతో, వాటి భాషలతో పోల్చితే, పరిశోధనా రంగంలో, ముఖ్యంగా చరిత్ర, సాహిత్యాల పరిశోధనలో, మన మెంతగా వెనుకబడివున్నామో తెలుస్తుంది. బెంగాలీలో, హిందీ, గుజరాతీ భాషలలో వందలాది పరిశోధకులు అగ్రశ్రేణికి చెందినవా రున్నారు. వీరు తమ తమ భాషాప్రాంతాల రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, సాహిత్యచరిత్రలలో విశేషమైన పరిశోధనలు చేశారు; వందలకొలది ఉద్గ్రంథాలను రచించి, ప్రచురించారు, ప్రచురిస్తున్నారు. ఈ గ్రంథాలలో అనేకం ఆయా ప్రాంతీయభాషలలోనే కాక, ఇంగ్లీషులో కూడా లభ్యమౌతున్నాయి. ఇందువల్ల ఆయా ప్రాంతాలను గురించి సమగ్రపరిజ్ఞానం అన్యప్రాంతాలవారికి కూడా కలగడానికి అవకాశం లభిస్తున్నది.

తెలుగులో తెలుగుజాతి చరిత్రను గురించి, దాని సాహిత్య, సాంస్కృతిక చరిత్రలనుగురించి ఎన్నదగు పరిశోధన చేసినవారు పట్టుమని రెండు పదుల వరకైనా వున్నారో, లేదో ! ఎన్నిసార్లు చెప్పుకొన్నా కందుకూరి వీరేశలింగం, కొమర్రాజు లక్ష్మణరావు, చిలుకూరి వీరభద్రరావు, వేటూరి ప్రభాకరశాస్త్రి, భావరాజు వెంకట కృష్ణారావు, రాళ్ళబండి సుబ్బారావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, మారేమండ రామారావు, నేలటూరి వెంకటరమణయ్య, నిడదవోలు వెంకటరావు,రాయప్రోలు సుబ్రహ్మణ్యం, దిగవల్లి వెంకట శివరావు మొదలైన కొద్ది మంది పేర్లుమాత్రం వినవస్తాయి.

తెలుగుజాతి చరిత్రను గురించి, సంస్కృతిని గురించి తెలుగువారికి తెలియజెప్పడానికి ఏ కొద్దిగానైనా కృషి జరిగిందేమో కాని, అన్యభాషలవారికి తెలియజెప్పడానికి ప్రయత్నం దాదాపుగా జరగలేదనే చెప్పాలి. మనలను గురించి మనమే చెప్పుకొనకపోతే, ఇతరులు ఏమి చెప్పుకొంటారు? చెప్పుకొనడానికి వారి కేమి తెలుస్తుంది? ఉదాహరణకు, ఇటీవల శ్రీ తారాచంద్ రచించిన "హిస్టరీ ఆఫ్ ఫ్రీడం మూవ్మెంట్ ఇన్ ఇండియా" రెండవ సంపుటం వెలువడింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ విషయమై వున్నది రెండే రెండు పేరాలు! ఆ రెండు పేరాలలో మూడు తప్పులు !! అవి మూడూ పేర్లకు సంబంధించినట్టివే! వీరేశలింగం, కాశీనాథుని నాగేశ్వరరావు, కొమర్రాజు లక్ష్మణరావు: ఇంత సుప్రసిద్ధమైనవి తప్పుల తడకలుగా ముద్రితమైన ఆ పేర్లు! ఇలాగే అన్యదేశాలలోగాని, మన దేశంలోనే అన్యరాష్ట్రాలలోగాని ఏ సాంఘిక, రాజకీయ, చారిత్రక, సాంస్కృతిక విషయానికి సంబంధించిన ప్రస్తావన వచ్చినా, ఆంధ్రులు అతి ప్రాచీనకాలం నుంచి, ఆధునికకాలం వరకు చేసిన సేవలను పూర్తిగా విస్మరించడమో, నిరాదరించడమో, నూటికో కోటికో వాటిని గుర్తిస్తే, తప్పులు దొర్లడమో జరుగుతున్నది. ఇందుకు పరులను నిందించ నక్కర లేదు, మనల్ని మనమే నిందించుకోవాలి.

ఈ పరిశోధనకృషి న్యాయంగా మన విశ్వవిద్యాలయాలు బృహత్తర స్థాయిలో చేపట్టవలసింది. కలకత్తా యూనివర్సిటీ బెంగాలీ భాషకు, సాహిత్యానికి, చరిత్రకు, సంస్కృతికి సంబంధించిన గ్రంథాలను వందలాదిగా ప్రచురించింది. అన్నామలై యూనివర్శిటీ ఇటీవలిదైనా తమిళ జీవితానికి, సంస్కృతికి సంబంధించిన పెక్కు గ్రంథాలను ప్రకటించింది. ధార్వార్లో కర్నాటక విశ్వవిద్యాలయ స్థాపనజరిగి ఇరవై ఏళ్ళయినా కాలేదు; కర్నాటక ప్రాంత చరిత్రకు సంబంధించిన అనేక గ్రంథాలను అది ఈసరికే వెలువరించింది.

మన ఆంధ్రవిశ్వవిద్యాలయం ఈ విషయమై ఏమి చేసింది? నలభైరెండు సంవత్సరాల క్రిందటనే అది స్థాపితమైంది. ఈ దీర్ఘవ్యవధిలో అది ఎంత ఘన కృషినైనా చేసివుండవచ్చు. ఎంత మౌలికపరిశోధననైనా ప్రోత్సహించివుండవచ్చు, కాని, అది ప్రచురించిన చారిత్రక గ్రంథాలు పట్టుమని పదైనా వున్నవో, లేవో! తిరుపతిలోని వేంకటేశ్వర విశ్వవిద్యాలయం కేవలం హిందూమతసంబంధమైన గ్రంథాల పై తప్ప చారిత్రక గ్రంథాల పైకి తన దృష్టిని పోనివ్వడం లేదు.

మన తెలుగు, హిస్టరీ ప్రొఫెసర్లకు సరైన చారిత్రకదృష్టి వున్నట్టు కనబడదు. తాము స్వయంగా చేసినా, చేయకపోయినా, తమ విద్యార్థులచేతనైనా పరిశోధనను సక్రమ పద్ధతులలో చేయించివుంటే, ఈపాటికి ఎన్నో ఈ అమూల్య విశేషాలతో కూడిన గ్రంథాలు వెలువడి వుండేవి. దురదృష్టవశాత్తు వీరికి తిక్కన శిల్పం, పోతనభక్తి, శ్రీనాథుని శృంగారం, కాకతీయుల పౌరుషం, విజయనగరం చక్రవర్తుల ఆంధ్రత్వం వంటి విషయాలుతప్ప అన్యం స్ఫురించవు.

దేశచరిత్ర, సాహిత్యచరిత్రలే కాదు; పరిశోధన జరగవలసినవి మరెన్నో వున్నాయి. ఉదాహరణకు, దాదాపు నూరేళ్ళకు విస్తరించిన ఆధునిక నాటకచరిత్ర మనకు వున్నది. అయినా, దీన్ని గురించి జరిగిన పరిశోధన బహుస్వల్పం అనే చెప్పాలి. అదే హిందీ, గుజరాతి, బెంగాలీ మొదలైన వాఙ్మయాలను తీసుకొంటే వాటిలో నాటకరంగాన్ని గురించిన పరిశోధన గ్రంథాలెన్నో కనిపిస్తాయి. మనకు నూటయాభై సంవత్సరాల జర్నలిజం వున్నది. అయినా, ఆ రంగంలో తొలిరోజులలో ఏమి కృషి జరిగిందో, దాని “పయనీర్స్”గా చెప్పదగిన మహామహులెవరో మనకు సరిగా, స్పష్టంగా తెలియదు. మేము పైన పేర్కొన్న ఆయా రంగాలలో పరిశోధన బొత్తిగా జరుగలేదని కాదు గాని, జరగవలసినంతగా జరగలేదు. అది కూడా దోషభూయిష్ఠంగా జరిగింది, జరుగుతున్నది.

ఇందుకు మా దృష్టికి ఇటీవలనే వచ్చిన ఒక ఉదాహరణను చెప్పగోరుతున్నాము. వేమనను గురించి మొట్టమొదటగా 1812 లో పేర్కొన్న పాశ్చాత్యపండితుడు యాబీ దూబావా, అయినా, సర్ విలియం జోన్స్ వేమనను "ప్లేటో ఆఫ్ ఇండియా” అని ప్రస్తుతించినట్టు ఇటీవల ఒక తెలుగు చరిత్రపరిశోధకుడు వ్రాశాడు. 1794 లోనే మరణించిన జోన్సుకు వేమనను గురించి తెలియనే తెలియదు. మన తెలుగుపరిశోధకుడు ఈ విధంగా “దూడ” వేయడానికి కారణమేమని పరిశీలించగా, 1829 లో వేమన పద్యావళిని ఆంగ్లానువాదంతో సహా ప్రచురించిన సి.పి. బ్రౌన్ తన ఉపోద్ఘాతంలో వ్రాసిన ఒక వాక్యం మా కంటబడింది. ఆ వాక్య మిది: evidently, in philosophy of the Vedanta school, a disciple "Vemana was of Vyasa, whom Sir William Jones has entitled Plato of India".

ఈ వాక్యంలో “ది ప్లేటో ఆఫ్ ఇండియా” అని జోన్స్ వర్ణించినట్టు బ్రౌన్ పేర్కొన్నది వేమనను కాదు, వ్యాసుడిని. దీన్ని సరిగా బోధపరుచుకొనక వేమననే ప్లేటోతో జోన్స్ పోల్చినట్టు తప్పుగా భావించి, ఇటువంటి తప్పుడు వ్రాతలను చరిత్రపరిశోధనలుగా తెలుగువారిపై రుద్దే శోచనీయస్థితిలో మన చరిత్ర పరిశోధకులలో కొంద రున్నారు. మన ఖర్మం కాలి వీరు పెద్ద పెద్ద బిరుదులు తగిలించుకొంటున్నారు; వీరికి ప్రభుత్వసన్మానాలు జరుగుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించిన “వెర్సెస్ ఆఫ్ వేమన" (బ్రౌన్ ఇంగ్లీషు అనువాదంతో) గ్రంథంపై నేడు ఒక ఆంగ్ల దినపత్రికలో వచ్చిన ఒక సమీక్ష సయితం వేమననే “ప్లేటో ఆఫ్ ఇండియా” అని జోన్స్ వర్ణించినట్టు పేర్కొన్నది. ఈ తప్పుడు వ్రాతకు ఆధారం అంతకు ముందు బ్రౌన్ ఇంగ్లీషు వాక్యానికి తప్పుడు అన్వయంతో చెప్పిన తప్పుడు అర్థమే కావచ్చు. మన చారిత్రక పరిశోధనస్థాయి ఎంత తక్కువగా వుంటున్నదో చెప్పడానికే ఈ ఉదంతాన్ని మేము పేర్కొనవలసివచ్చింది. ఇట్టి అవకతవకలు, అపభ్రంశపు పనులు ఎన్నెన్నో జరుగుతున్నాయి. మనజాతికి చారిత్రక దృష్టి మొదటి నుంచి లేకపోవడంవల్ల మన చరిత్ర ఎంతో

ఖిలమైపోయింది. పాశ్చాత్య పండితుల ధర్మమా అని మనకు కొంతకాలంగా చారిత్రకాసక్తి కలగడం, పరిశోధనాకృషి ప్రారంభం కావడం జరిగింది. అయితే, ఇది సవ్యమైన శాస్త్రీయ పద్ధతులలో జరగాలి; సంకుచిత దృష్టితోగాని, రాగద్వేషాలతోగాని జరగరాదు. దీనిలో అలసత్వం తగదు, అవలీలగా ప్రఖ్యాతి పొందాలన్న తాపత్రయం తగదు. సత్యాన్వేషణదృష్టితో కష్టించి పని చేయాలి. అటు తర్వాత తెలుగు వారికి తమ పరిశోధనా ఫలితాలను తెలియజేయడంతోనైనా సంతృప్తి చెందరాదు; అన్యప్రాంతీయులకు మన విషయమై తెలియజెప్పడానికి, ముఖ్యంగా ఇంగ్లీషులో చెప్పడానికి, ప్రయత్నించాలి. ఈ ప్రయత్నాన్ని ఇప్పటికైనా ప్రారంభించడంకంటె మన చరిత్రపరిశోధకులు తెలుగుదేశానికి చేయగల ఘన సేవ మరి లేదు.

చరిత్ర రచన

(ఆంధ్రప్రభ 10-11-1968)



"చరిత్ర పాఠాన్ని మనను నేర్చుకోమన్నదే చరిత్ర నేర్పేపాఠం" అని హెగెల్ చెప్పిన మాట మన విషయంలో మరింత నిజం. పురాణాలే తప్ప, అయిదారు వందల సంవత్సరాల క్రితంవరకు మనకు చరిత్రలే అసలు లేవు. అంతకు ముందు బాణభట్టు హర్ష చరిత్రను వ్రాసినా, దాన్ని చరిత్ర అనడం కంటె కావ్య మనడమే ఎక్కువ సమంజసం. ఆ తర్వాత వచ్చిన రాజతరంగిణి సగం పురాణం కాగా, సగం మాత్రమే చరిత్ర.

ప్రపంచం మొత్తంపై తొలి చరిత్రకారుడుగా పరిగణించబడుతున్న హెరొడోటస్ రచనలలోనైనా పిట్టకథలను, కట్టుకథలను పోలినవి కొన్ని లేకపోలేదు గాని, కావాలని ఆయన వాటిని చేర్చలేదు. ఆయన పరిఢవిల్లింది క్రీస్తుకు పూర్వం అయిదవ శతాబ్దిలో. ఆ రోజులలో ప్రయాణ సౌకర్యాలు తక్కువ. పైగా,అప్పటిలో ప్రయాణం చేయడం ప్రమాదాన్ని కొని తెచ్చుకొనడం. ఈ పరిస్థితుల్లో కూడా ఆ ప్రాచీన గ్రీక్ చరిత్రకారుడు ఎన్నెన్నో దేశాలలో పర్యటించాడు; తన చరిత్రకు కావలసిన అంశాలను సేకరించాడు. అయినా, పుక్కిట పురాణం కింద జమకట్టవలసిన అంశాలు కొన్ని ఆయన చరిత్రలో కానరావడం, స్వయంగా అన్ని విషయాలను తెలుసుకొనడానికి వీలులేకపోవడం; తెలుసుకో గలిగినవాటి నిజానిజాలను తేల్చుకొనడానికి అవకాశం లేకపోవడం. ఏవో కొన్ని లోపాలు జరిగినా, కూడినంతలో ఐతిహాసిక దృష్టితోనే హెరొడోటస్ తన చరిత్ర వ్రాశాడు.

ఈయన తర్వాత గ్రీసులో, రోమ్ ఎందరెందరో చరిత్ర కారులు తలయెత్తారు. వీరిలో ప్రత్యేకించి యెన్నదగు వారు థుసిడైడ్జ్, జెనోఫన్, లివీ, టాసిటస్లు. ఈ గ్రీక్, రోమన్ చరిత్రకారులతో పోల్చదగు చరిత్రకారులు ప్రాచీన భారతంలో ఒక్కరైనా కానరారు.

ఇదివరలోనే కాక, ఇప్పుడు సయితం ఒక జాతిగా మనకు ఐతిహాసిక దృష్టి తక్కువే! కనుకనే పురాణాలనే చరిత్రలుగా పరిగణించడమేమి, వానిలోని విషయాలను సరిగా పరిశీలించకనే చారిత్రక సత్యాలుగా స్వీకరించడమేమి సంభవిస్తున్నది.

శాస్త్రీయ పద్ధతుల పై చరిత్రను వ్రాస్తున్నామని చెప్పుకొంటున్న వారిలో సయితం పెక్కుమంది తమ రాగవిద్వేషాలకు ప్రాధాన్యమిస్తున్నారు. శ్రీ కె.యం. మున్షీగారి ప్రాపకంలో కొత్తగా వెలువడుతున్న బృహత్తర చరిత్రనే చూడండి కేవలం ఆర్యజాతి దృక్పథం నుంచి దీన్ని వ్రాస్తున్నారు. మరి కొన్నింటిని చూడబోతే, వాటిలో ఏ కులాభిమానమో, ప్రాంతీయాభిమానమో ద్యోతకమౌతూ వుంటుంది!

ఏ జాతి చరిత్రలోనైనా మంచి చెడ్డలుంటాయి; బాగోగులుంటాయి; వెలుగునీడ లుంటాయి. ఈ విషయాన్ని కప్పిపుచ్చేది ఏమైనా కావచ్చుగాని, చరిత్రమాత్రం కాదు. అయినా, మన దేశచరిత్రలు పెక్కింటిలో అహంకారమే హెచ్చుగా కానవస్తుంది. ఆర్యులెక్కడివారు? ఇక్కడి వారే! మన దేశంనుంచే ఇతర దేశాలకు వారు వలస వెళ్ళారు. ఏది ఉత్తమ సంస్కృతి? మనదే! మనమే సమస్త ప్రపంచానికి సంస్కృతి భిక్షను పెట్టాము ఈ ధోరణి మన చరిత్రలలో హెచ్చుగా కానవస్తున్నది.

అనుచితమైన ఈ ధోరణిని ఖండిస్తూ మొన్న హైదరాబాద్లో కేంద్రమంత్రి డాక్టర్ హుమయూన్ కబీర్ చేసిన ప్రసంగం ఎంతైనా హర్షించదగినట్టిది; ఆయన సూచించినట్టు, అన్నిటి చరిత్రల వలెనే భారతదేశ చరిత్ర నిమ్నోన్నతాలతో కూడినట్టిది; ఎన్నెన్నో ప్రభావాలను అంతర్లీనం చేసుకొనడం ద్వారా రూపొందినట్టిది భారతీయ సంస్కృతి. ఈ సత్యాన్ని మరగుపరచితే చరిత్ర నుంచి మనం ఏ పాఠం నేర్చుకొనమన్నదే కాగలదు! (ఆంధ్రజ్యోతి 15-9-1962)

ఆంధ్రుల సాంఘిక చరిత్ర

(గ్రంథ సమీక్ష)



రాజు ఎప్పుడు పాలించాడు ? ఎక్కడ? ఏవిధంగా? అతడు ఎన్ని యుద్ధాలను చేశాడు? ఎవరెవరిని గెలిచాడు? లేదా, ఎవరిచేతిలో ఓడిపోయాడు? అత డెందరిని వివాహ మాడాడు? మరెందరిని ఉంపుడు కత్తెలను చేసుకున్నాడు? బహుభార్యాత్వపు సాధక బాధకాలను ఏవిధంగా ఎదుర్కొన్నాడు ఇదే ఇప్పటి వరకు మన చరిత్ర.

"నా విష్ణుః పృధ్వీపతిః!" అని విశ్వసించబడినంత వరకు రాజుల రాజాస్థానాల కథలే, రాణులు, రాణి వాసాల గాథలే చరిత్ర కావడం ఎవ్వరికీ ఎబ్బెట్టుగా తోచలేదు కూడా.

కాని, రాజు దైవాంశసంభూతుడన్న గుడ్డినమ్మకం రోజులు పోయాయి. చివరికి జపానులో కూడా (మొన్నటి యుద్ధము తర్వాత) హిరోహిటో సయితం సాక్షాత్తు అపరబ్రహ్మ స్వరూపుడన్న మూఢవిశ్వాస ప్రాబల్యం సడలింది.

ఈ రాజుల రోజులు పోయినందున, ప్రజలే రాజులౌతున్నందున, ఇక చరిత్ర స్వరూపమే మారిపోవాలి. ఇక మీదట చరిత్ర కారులు మనకు చెప్పవలసింది ముసలిమగడు రాజరాజ నరేంద్రుని పడుచు పెండ్లాం చిత్రాంగి సవతికుమారుని పై కన్ను వేసిందో, లేదో సంగతి కాదు. ప్రతాపరుద్రుని ఉంపుడుకత్తె (ప్రతాపరుద్రుని ఉంపుడుకత్తె చరిత్రను " ఆడుదురు నాటకంబుగ నవనిలోన" అన్నాడు క్రీడాభిరామ కర్త) విషయమై కాదు. కృష్ణదేవరాయల దేవేరుల విషయమై కాదు; ఆ దేవేరుల మధ్య వివాదాలను గురించి అంతకంటే కాదు.

ఈ ప్రజాయుగంలో వెలువడవలసినవి ప్రజాచరిత్రలు. వీటికే మరొక పేరు "సాంఘిక చరిత్రలు".

నామమాత్రానికి మన దేశం పై ప్రసుత్తం బ్రిటిష్ రాజుకు మిలిగివున్న పెద్దరికం కూడ తొలగిపోనున్న ఈ సమయంలో, కొన్ని శతాబ్దాల తర్వాత ఆంధ్రులకు తిరిగి ఒక ప్రత్యేక ప్రభుత్వం ఏర్పడనున్న ఈ సమయంలో ఇట్టి ఒక చరిత్ర గ్రంథం వెలువడ్డం ఎంతైనా సమయోచితం.

దాదాపు వెయ్యి సంవత్సరాలపాటు (క్రీస్తుశకం 1050 నుంచి 1907 వరకు) తెలుగుజాతి ఏ విధంగా బ్రతికిందో ఈ చరిత్ర కళ్ళకు కట్టినట్లు చిత్రిస్తున్నది. మన తాత, ముత్తాత లెట్టివారై యుండిరో; మన అవ్వలు ఎట్టి సొమ్ములు దాల్చిరో, యెట్టి అలంకరణములతో నుండిరో మన పూర్వులే దేవరలను గొలిచిరో, ఏ విశ్వాసాలు కలిగి యుండిరో, ఏ యాటపాటలతో వినోదించిరో, దొంగలు, దొరలు దోపిడీలు చేసినప్పుడు క్షామా దీతిబాధలు కలిగినప్పుడెటుల రక్షణ చేసికొనిరో; జాడ్యాల కే చికిత్సలు పొందిరో, ఎట్టి కళలందు ప్రీతి కలవారై యుండిరో, ఏయే దేశాలతో వ్యాపారాలు చేసిరో" - ఇట్టి అనేక విషయాలు ఈ చరిత్రలో వర్ణితం.

తప్పెట్లు, కాహళములు, కాలి కొమ్ములు, డమాయిలు, బూరలు, శంఖములు, సన్నాయిలు, డోళ్లు, రుంజలు, చేగంటలు- ఇవి చేరగా ఏర్పడినదే మన పూర్వీకుల మిలిటరీ బ్యాండ్.

తుమ్మెదపదాలు, పర్వతపదాలు, శంకరపదాలు, నివాళిపదాలు, వాలేశుపదాలు, వెన్నెల పదాలు, రోకటి పాటలు, బొమ్మలాటలు, కోలాటం, గొండ్లి, చిందు, జక్కిణి, పేరిణీ, ప్రేంఖణం, ఉప్పెన పట్టెలాట, బొంగరాలాట, కోళ్ళపందెము, పులిజూదం, పచ్చీసు, సిడి - ఇవి మన పూర్వీకుల గాననృత్య క్రీడావినోదాలు.

ముక్కర, నెత్తిబిళ్ళలు, దండెకడెములు వంకీలు, జోమాల దండలు, తాటంకాలు, ముత్యాల కమ్మలు, కాంచీ నూపురకంకణాలు, త్రిసరములు, మొరవంక కడియాలు, వడ్డాణము, ముక్కు నత్తు - ఇవి మన అవ్వలు పెట్టుకొన్న నగలలో కొన్ని మాత్రం.


వెంజావళి, జయరంజి, మంచు పుంజము, మణికట్టు, భూతిలకము, శ్రీవన్నిమ, చీని, మహాచీని, పట్టు పొంబట్టు, నెరపట్టు, వెలిపట్టు, పచ్చని పట్టు, నేత్రంపుపట్టు, సంకుపట్టు, భావజతిలకం, రాయశేఖరం రాయవల్లభం, వాయుమేఘం, గజవాళం, గండవరం, వీణావళి, ఇట్టి వన్నీ ఒకనాడు మన తెలుగునాట వేయబడిన వస్త్రవిశేషాలు.

ఒకనాడు మన తెనుగుసీమలో ప్రతి బ్రాహ్మణ గృహంలో ఒక గ్రంథాలయం వుండేది. ధనికులు తివాసీల పై కూర్చునేవారు. "బురునీసు దుప్పటులు కప్పుకొనేవారు, అప్పులవారిని "పొగడదండల"తో శిక్షించేవారు. దొంగలనుపట్టి "బొండకొయ్యలో" వుంచేవారు; రెండవ భార్యను చేసుకొంటే, ఆమెకు "సవతి కడెము" తొడిగేవారు యుద్ధంలో ఓడినవారు "ధర్మధార" పట్టేవారు; తాంబూలం వేసుకోడానికి "పాన్ దానులు" ఉపయోగించేవారు; రైతులు ఏరువాకను: "వింతటి పండుగను" చేసుకొనేవారు; కరణాలు "వహి" అనే పుస్తకాలలో లెక్కలను వ్రాస్తుండేవారు; పీనుగులను కాల్చిన బూడిద మచ్చు మందుగాని పనిచేస్తుందని దొంగలు నమ్ముతుండేవారు - ఈ రీతిగా శ్రీ ప్రతాప రెడ్డిగారు వ్రాసిన "సాంఘిక చరిత్ర" మన పూర్వీకుల జీవిత విధానాన్ని గురించి చెప్పే విశేషాలకు అంతేలేదు.

ఈ చరిత్ర దాదాపు ఒక జీవిత కాలపు పరిశోధనా ముక్తాఫలం. సాంఘిక చరిత్రకు పనికివచ్చే గ్రంథాల సంఖ్య పరిమితమైనా, ఇందుకు శాసనాల ఉపయోగం నామమాత్రమైనా, ఆచార వ్యవహారాలకు, క్రీడా వినోదాలకు సంబంధించిన అనేక ప్రాంతీయ పదాల విషయంలోను, పారిభాషిక పదాల విషయంలోను నిఘంటుకారులు "ఒక భక్ష్యవిశేషం" "ఒక క్రీడావిశేషం" అని అర్థం చెప్పి, నిరర్థకులవలె వ్యవహరించినా, ఇట్టి ప్రతిబంధకా లన్నింటిని అధిగమించి, ఆంధ్రజాతి చరిత్రను ప్రతిభా పూర్వకంగా చిత్రించిన శ్రీ రెడ్డిగారు సంస్తవనీయులు. ఆంధ్రజాతి గత చరిత్రను తెలుసుకొనడానికి ఉపకరించడమే కాక, ఏయే కారణాలు దాని అభ్యుదయానికి తోడ్పడినవో, మరేవేవి దాని పతనానికి దోహదమిచ్చినవో సందర్భానుసారంగా వివరిస్తున్న ఈ మహద్గ్రంథం ఆంధ్రులకు భావికర్తవ్య పథాన్ని నిర్దేశిస్తున్నది కూడా. "నాకే యీ గ్రంథము తృప్తి నొసగలేదు" అనే విచారం శ్రీ రెడ్డిగారికి కూడదు. సకలాంధ్రావనికి వారి రచన అపారతృప్తి నివ్వగలదు.

అనుబంధం : శ్రీ రాళ్ళపల్లివారి లేఖ 30-10-49

1135, కృష్ణమూర్తిపురం మైసూరు



మహారాజశ్రీ మాన్యులు సురవరం ప్రతాపరెడ్డిగారి సన్నిధికి, మిత్రుడు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ చేయు మనవి:

తాము దయతో పంపిన 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' కృతజ్ఞతతో అందుకొన్నాను. విడిచే బుద్ధి పుట్టక పూర్తిగా చదివితిని. ఇట్లు ఏకధారగా నన్ను చదివించిన గ్రంథము ఈ మధ్యలో ఇదొక్కటే.

చాలా గొప్పపని చేసితిరి. ఇందు సేకరించి మీరు జతపరచిన విషయాలు చాలా అమూల్యములు. ఎన్నోవత్సరాలుగా ఏకాగ్రతతో చదివి సంగ్రహింపనిది ఈ పని నిర్వహింపగల్గుట కాదు. స్వాతంత్ర్యము సిద్ధించిన తరువాత ఆంధ్ర సాహిత్యంలో వెలువడిన అనర్ఘగ్రంథాలు కొన్నింటిలో ఈ గ్రంథము అగ్రగణ్యమని నమ్ముతాను.

చదివినప్పుడు నాకు స్ఫురించిన కొన్ని భావాలను తమ పునరాలోచన కోసము ఇందు సంగ్రహముగా మనవి చేయుదును. ఇది సూచన మాత్రమే; విమర్శ కాదని గ్రహింప వేడితిని.

1 (౧) 'పులి జూదములు, దొమ్మరి ఆటలు తెలుఁగు వారివే' (పీఠిక 7) కాని, కన్నడ దేశమందును ఇవి అంతే వ్యాప్తి గల్గియున్నవి. మొదటిది 'హులికల్లు' అను పేరుతో నున్నది. మరి 'దొమ్మరి' వారిని, డొంబ, దొంబ, అని కన్నడు లంటారు. 'రి' అనునది, ద్రావిడ బహువచన ప్రత్యయము. తెనుగు ప్రకృతికి చేరినదేమోఅమర వ్యాఖ్యాత క్షీర స్వామి (11వ శతకం) స్వపర జాతులలో 'డోంబ' జాతిని చేర్చినాఁడు. డోంబర్ అనేదే దొంబర దొమ్మర - దొమ్మరి - అయి యుండును. **రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ**

ఈ స్థితి మారాలి

(ఆంధ్రప్రభ 22-11-1945)

పత్రికలు, రేడియో, టెలివిజన్, సినిమా మొదలైన ప్రచార సాధనాలన్నీ కలసికట్టుగానే కాక, పట్టుదలగా రెండు పనులను ప్రస్తుతం మన దేశంలో చేస్తున్నాయి : అంధవిశ్వాసాలను పెంచడం, మూఢభక్తిని ప్రోత్సహించడం.

ఇది భేదపడవలసిన విషయమైనా, ఆశ్చర్యపడవలసిన విషయం కాదేమో! ఈనాడు మన సంఘ నాయకులే, ప్రజానాయకులే, ప్రభుత్వ నాయకులే, అంధవిశ్వాసాలకు అగ్రతాంబూలాన్ని పుచ్చుకొంటున్నారు. మూఢభక్తి మార్గం వెంట ముందువరసలో నడుస్తున్నారు. ఏ యోగి కనపడినా, వీరు సాగిలబడతారు; ఏ స్వామి ఎదురైనా వీరు సాష్టాంగ నమస్కారాలు చేస్తారు; పీఠాధిపతుల వద్ద వీరు పడిగాపులు కాస్తారు;

అడుగడుగుకు వీరికి అమ్మలు, అమ్మమ్మలే తారసిల్లుతూ ఉంటారు, అవతార పురుషులే సాక్షాత్కరిస్తూ ఉంటారు. తాము ఎంత ఆస్తికులైనా, తమ చర్యలు తమ లోకేశ్వరునే చౌక చేస్తున్నాయని, తమ ఆరాధ్య దైవాన్నే అపహాస్యంపాలు చేస్తున్నాయని వీరికి పొరపాటుగానైనా తోచటంలేదు.

ఈ శోచనీయ పరిణామాన్ని చూచినప్పుడు రాజా రామమోహన్ రాయ్, దయానంద సరస్వతి, కేశవచంద్రసేన్, మహదేవ్ గోవింద రణడే, వీరేశలింగం కడచిన రెండు వందల సంవత్సరాల లోపల మన దేశంలో పుట్టినారా, ఇక్కడనే మెట్టినారా అని సందేహించవలసి వస్తున్నది. ఇంతేకాదు, ఇది గౌతమబుద్ధుడు, మహావీరుడు, బసవేశ్వరుడు, కబీర్, నానక్, వేమన ప్రభృతుల మాతృదేశమా అని ప్రశ్నించుకోవలసి వస్తున్నది. పోనీ, తక్కినవారిమాట విడిచిపెట్టండి, తాము జవహర్లాల్ నెహ్రూ అనుచరులమని, వారసులమని చెప్పుకొంటున్నవారే ఆయన పెంచగోరిన శాస్త్రీయ దృష్టికి ('సైంటిఫిక్ స్పిరిట్' అనే దానికి ప్రోదిచేయడానికి మారుగా దాని గొంతు నులిమి వేస్తున్నారు!

పోనీ, వీరు శాస్త్రీయదృష్టికి పూర్తిగా విరోధులైతే, పాత సాంఘిక వ్యవస్థను, పురాతన జీవిత విధానాన్ని పునరుద్ధరించగోరుతున్నవారైతే, వీరిని హర్షించలేనివారైనా, కనీసం వీరిని అర్థం చేసుకోగలుగుతారు. కానీ, వీరు మనకు ఆధునిక వైజ్ఞానిక శాస్త్రాలు కావాలంటారు. మనదేశంలో పారిశ్రామిక, సాంకేతిక విప్లవాలు రావాలంటారు. అంధవిశ్వాసాల నిరసన ఆధునిక వైజ్ఞానిక శాస్త్రాలు అభివృద్ధి చెందగలవా? విభూతిలో, ప్రపాదాలతో, రక్షరేకులతో, లక్షవత్తుల నోములతో పారిశ్రామిక, సాంకేతిక విప్లవాలను సాధించగలమా? అమ్మల, అమ్మమ్మల, బాబాల, భగవానుల ఆశీస్సులతో నవసంఘాన్ని నిర్మించగలమా?

ప్రగతికి నిదర్శనాలు ఎక్కువ రోడ్లు, ఎక్కువ వంతెనలు, ఎక్కువ కార్లు, బస్సులు, లారీలు, ఎక్కువ రైళ్లు, విమానాలు, ఎక్కువ స్కూళ్లు కాలేజీలు, యూనివర్సిటీలు-ఇట్టివి మాత్రమే కావు. మన భవిష్యత్తులను పదిలపరచగలిగినవి మరింతగా పంట, మరింతగా పారిశ్రామికోత్పత్తులు మరింతగా జాతీయాదాయం మొదలైనవి మాత్రమేకావు. ఇవి ముఖ్యావసరాలే. కానీ, ఇవి మాత్రమే చాలవు. వీటికంటె మిన్నగా మరొకటి కావాలి అది - మన దృక్పథంలో ప్రాథమికమైన మార్పు, విప్లవాత్మకమైన పరివర్తన.

మన సంస్కృతి, మన నాగరికత హరప్పా, మొహెంజొదారోల కాలం నుంచి దాదాపు క్రీస్తుశకం ఏడెనిమిది శతాబ్దాలవరకు వికాసాన్ని పొందుతూ వచ్చాయి. అటుతర్వాత అవి ఎందుకు క్షీణస్థితిలో పడిపోయాయి? మనలో మౌలికచింతన ఎందుకు నశించింది? వ్యాఖ్యానాల పై వ్యాఖ్యానాలు ఎందుకు ప్రారంభమైనాయి? అటు రోమ్ నుంచి, ఇటు ఫిలిప్పీన్స్ వరకు, ఆపైవరకుకూడా నౌకావ్యాపారాన్ని చేస్తూ వచ్చిన జాతి సముద్రయానాన్ని ఒక మహా పాపంగా పరిగణించే ఘోరస్థితికి ఎందుకు దిగజారింది? గణిత, ఖగోళ, రసాయనిక, వైద్య, ఖనిజాది అనేక శాస్త్రాలలో మానవ విజ్ఞానాన్ని సుసంపన్నం చేసిన జాతి ప్రతిఆంధవిశ్వాసాని కోసం ప్రతి మూఢాచారానికి మారు పేరుగా ఎందుకు మారింది? శూద్రులకోసం ఇతర పామర జనులకోసం సూతులు స్థాపించిన పౌరాణిక మతమే అన్ని వర్గాల మతంగా ఎందుకు స్థిరపడింది? ఈ విధమైన ప్రశ్నలు వేసుకొనక పోతే, వీటికి నిజమయిన సమాధానాలు నిష్కర్షగా తెలుసుకొనడానికి ప్రయత్నం అంతకంటే కూడా అరుదుగా కానవస్తున్నది.

ఏ విప్లవమైనా అది మనస్సులో ప్రారంభం కావాలి. నవచింతన లేనిదే నవసమాజం లేదు. నవజీవనం లేదు. కడచిన నాలుగైదు శతాబ్దాలలో యూరపు మహోజ్వలస్థితికి తెచ్చినవారు ట్రెవిథిక్, జేమ్స్ వాట్, ఆర్రైట్, కార్టెట్లను పోలిన “ఇన్వెంటర్స్” కాదు; ఫ్రాన్సిస్ బేకన్, న్యూటన్, లాక్, హ్యూమ్, బెంథామ్, వాల్టేర్, రూసోలను పోలిన మౌలిక భావుకులే. ఈ రెండవ వర్గంవారే ప్రతిదాన్ని ప్రశ్నించడాన్ని ప్రతిదాన్ని పరిశీలించడాన్ని యూరపక్కు నేర్పారు; వీరే యూరప్ దృక్పథాన్ని మార్చారు; వీరే యూరప్ నేకాక ప్రపంచం మొత్తంలోనే ఆధునిక యుగానికి మూలపురుషులైనారు.

వీరు తెచ్చిన భావవిప్లవాన్ని పోలిందే మనదేశంలో కూడా ప్రారంభం కావాలి. అప్పుడుగాని మతమౌఢ్యాల ప్రాబల్యం తగ్గదు, అప్పుడుగాని కులశాఖాది సంకుచితత్వాలు సడలవు, అప్పుడుగాని సాంఘిక దురాచారాలు సమసిపోవు, అప్పుడుగాని మనకు వెన్నెముక ఏర్పడదు.

నిన్నటి మన జాతీయ విప్లవ సందర్భంలోగాని, ఇప్పటి సోషలిస్టు విప్లవ నినాదాల సందర్భంలోగాని దాదాపు కానరానిది ఈ భావవిప్లవమే. పాతబూజు మన మనస్సులనుంచి వదలడం లేదు; పాత పుంతలనుంచి మన ఆలోచనలు తప్పుకొనడంలేదు. పైగా ఇతర దేశాలకు లేని అధ్యాత్మిక సంపత్తి మనకున్నదన్న భ్రమ మనలను పీడిస్తున్నది. బియ్యంలో రాళ్లు రప్పలను కలపడంలో, మందుమాకులను సయితం కల్తీచేయడంలో, దొంగనిల్వలను చేసి, కరవు కాటకాలను కల్పించడంలో వున్నదేమో ఈ ఆధ్యాత్మిక సంపత్తి!

చదువు సంధ్యలులేనివారు, సంస్కృతిలేనివారు, ఎంత అంధప్రాయంగా, ఎంత మూఢంగా ప్రవర్తించినా, దాన్ని కొంతవరకు అర్థంచేసుకోవచ్చు కాని, యూనివర్శిటీ డిగ్రీలున్న వారిలోనే, సాంఘికంగానో, రాజకీయంగానో మరొకవిధంగానో సంఘానికి నాయకత్వం వహిస్తున్న వారిలోనే నూటికితొంభై తొమ్మిదిమంది అతి సంకుచితంగా ఆలోచిస్తున్నారు. పరమ మూఢులవలె సంచరిస్తున్నారు. అయినప్పుడు, మనం నిజమైన ప్రగతిని సాధించగలమా, మన భవిష్యత్తును గురించి ధైర్యంగా వుండగలమా?

రెండువందల సంవత్సరాల క్రితం రాజా రామమోహన్ రాయ్ మనకు వైజ్ఞానిక దృక్పధం కావాలన్నాడు. ఇటీవల సరిగా ఇదే మాటను జవహర్లాల్ నెహ్రూ పదే పదే చెప్పాడు. ఈ విషయంలో నెహ్రూకంటే కూడా ఎం.ఎన్. రాయ్ ముందుకు వెళ్ళాడు. అయినా యింటికొక అమ్మ, వీధికొక స్వామి, ఊరుకొక బాబా, నాడుకొక అవతార పురుషుడు వెలుస్తున్నారు. వారి అనుగ్రహం కోసం, వారి ఆశీస్సులకోసం వేలాదిగా లక్షల కొలదిగా విద్యాధికులే పడిగాపులు కాస్తున్నారు! నానాటికి మనలో పెంపొందుతున్నది వైజ్ఞానిక దృక్పధం కాదు, మూఢాతి మూఢవిశ్వాసం: ఈ పరిస్థితి ఎప్పటికి మారుతుందో, అసలు మారుతుందో, లేదో తెలియదు. ఇది మారనంతవరకు మనకు నిజమైన ప్రగతి సున్న, మనకు ఉజ్వలమైన భవిష్యత్తు హుళక్కి. (హేతువాది మాసపత్రిక జూన్ 1985)

మేధావుల విధులు

మేధావుల కర్తవ్యం - 1

నిజమే, నేటి రాజకీయరంగంలో మేధావులు నిర్వహించవలసిన పాత్ర ఎంతైనా ఉన్నది. ఇందుకు వారు వెనుకాడరాదని, సమాజంపట్ల తమ కర్తవ్యాన్ని తాము నిర్వర్తించాలని శ్రీ నీలం సంజీవరెడ్డి ప్రభృతులు ఇటీవల విజ్ఞప్తులు చేస్తున్నారు. ఈ విజ్ఞప్తులను మేధావులు పాటించగలరనే ఆశిస్తున్నాము.

మన జాతీయోద్యమం ప్రారంభమైంది మేధావులతోనే. ఆ ఉద్యమం ఆదిలో మత, సంఘ సంస్కరణల రూపాన్ని ధరించింది. నిద్రాణమైన జాతిని ఇట్టి సంస్కరణలద్వారా జాగరితం చేయడానికి రాజా రామమోహన్ రాయ్, దేవేంద్రనాథ్ టాగోర్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, దయానంద సరస్వతి, మహదేవ గోవింద రణడే, కేశవచంద్రసేన్, బి.ఎమ్. మలబారీ, శివనాథశాస్త్రి, కందుకూరి వీరేశలింగంవంటి మహనీయు లెందరో తమ మేధాశక్తిని ధారవోశారు. భారతీయ సమాజంలో వీరు తీసుకువచ్చిన కదిలికను రాజకీయరంగం వైపు మళ్ళించినవారు కూడా మేధావులే. దాదాభాయ్ నౌరోజీ, ఆనంద మోహన్ బోస్, ఫెరోజ్ షా మెహతా, గోపాలకృష్ణ గోఖలే, సురేంద్రనాథ్ బెనర్జీ, బిపిన్ చంద్రపాల్, అరవింద ఘోష్, బాలగంగాధర తిలక్, మదనమోహన మాలవ్యా వంటి మేధావులు దేశ స్వాతంత్ర్యోద్యమానికి తొలిరోజులలో నాయకత్వం వహించారు; ప్రజా హృదయాలలో ఎన్నటికీ ఆరని దేశభక్తి జ్యోతిని వెలిగించారు. గాంధియుగంలో మేధావులకు ప్రాధాన్యం తగ్గినమాట నిజమే. కాని సి.ఆర్. దాస్, మోతీలాల్ నెహ్రూ, రాజగోపాలాచారి, మౌలానా ఆజాద్, పట్టాభి సీతారామయ్యలవలె ఆ యుగంలో సయితం మన స్వాతంత్రోద్యమంలో ప్రముఖపాత్ర వహించిన ధీశాలురు పలువురు లేకపోలేదు. కాని, స్వాతంత్రోద్యమం చివరి ఘట్టాలను చేరుతున్న కొద్దీ ఇట్టివారి సంఖ్య, ప్రాబల్యం కూడా తగ్గుతూ వచ్చింది. స్వాతంత్ర్య సిద్ధి తర్వాత కాలంలో వీరి పాత్ర దాదాపుగా మృగ్యమైపోయింది. ఈనాడు రాజకీయాలను

గురించి మేధావులైనవారు పట్టించు కొనడమే లేదు. అంతేకాదు నేటి రాజకీయాలను వారు అసహ్యించుకొంటున్నారు. వాటికొక నమస్కారం పెట్టి, వీలైనంత దూరంగా ఉండి పోతున్నారు.

ఔను! నేటి రాజకీయరంగం అసహ్యించుకొనదగినట్టిదే. పదవులు సంపాదించడానికి, పర్మిట్లు రాబట్టడానికి, లైసెన్సులు చేజిక్కించుకొనడానికి, కోటాలు తెచ్చుకొనడానికి, డబ్బు మూట కట్టడానికి అది నేడు ముఖ్యరంగమై పోయింది. ప్రజాసేవ అన్న పదానికి నేటి రాజకీయ నిఘంటువులో స్థానం లేదు. అవినీతి, బంధుపక్షపాతం, మతదృష్టి, కులాభిమానం, అధికారవ్యామోహం ఇవే నేటి రాజకీయాలకు మూలకందాలు!

నేటి రాజకీయాలను కేవలం అసహ్యించుకొనడంతో మేధావుల బాధ్యత తీరపోగలదా? తమ పరిసరాలు దుర్గంధ భూయిష్ఠమైనప్పుడు ఎవరైనా ముక్కు మూసుకొనడం సహజమే. కాని, ఎంతకాలం ముక్కుమూసుకొని కూర్చుంటారు? ఆ దుర్గంధానికి కారణమైన మురికి గుంటలను తొలగించాలి కదా?

నేటి మన రాజకీయ రంగంలో ఇట్టి దుర్గంధకూపాలు ఎన్నో ఉన్నాయి. వాటిని అసహ్యించుకొనడంతో, లేదా విమర్శించడంతో సరిపుచ్చక, వాటిని తొలగించడానికి మేధావులు ముందుకు రావాలి. ప్రస్తుతపు రాజకీయ దుర్గంధ కారణాలను నిశితంగా పరిశీలించి, వాటిని అవగాహన చేసుకొని, వాటి నిర్మూలన మార్గాలను అన్వేషించగలిగిన తామే అందుకు సన్నద్ధ పడకపోతే, ఆ పని మరెవరు చేస్తారు?

తమ మాట ఎవరు వింటారని నిస్పృహచెందడం, తమ మాట నెగ్గుతుందా అని నిరాశ చెందడం ధీమంతుల లక్షణం కాదు. ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా మేధావులు అల్పసంఖ్యాకులే!

తమ మాట నెగ్గుతుందా అని రామమోహన్ రాయ్, విద్యాసాగర్, రణడే వంటి మేధావులు నిరాశ చెంది ఉంటే, భారతీయ సమాజాన్ని కొన్ని శతాబ్దాలుగా దుర్బలం చేసిన స్తబ్దత తొలగిపోయి ఉండేదా? సహగమన నిషేధం, స్త్రీ విద్య, వితంతు పునర్వివాహం వంటి సంస్కరణలు సాధ్యమై ఉండేవా?

తాము అల్ప సంఖ్యాకులమన్న నిస్పృహ నుంచి మేధావులు బయటపడాలి. అవసరమైతే ఒంటరిగానైనా నిలబడి, దేశానికి శ్రేయస్కరమైనవని తాము భావిస్తున్న సిద్ధాంతాల పరిరక్షణ కోసం పోరాడాలి. నేటి కలుషిత రాజకీయాలను ప్రక్షాళన చేయడానికి, పతనమైన నైతికపు విలువలను పునరుద్ధరించడానికి, ఒకనాటి మహోన్నతాదర్శాలతో ప్రజలను తిరిగి ఉత్తేజితులను చేయడానికి మేధావులు ముందుకు రావాలి. ఇందుకు ముందుగా తాము స్వయంగా నిరాశా నిస్పృహల నుంచి బయటపడాలి; ముందుగా తమ స్తబ్దతను వదలించుకోవాలి.

(ఆంధ్రజ్యోతి 1-11-1970)

2

మరొక విషయంపైకి మనస్సును పోనీయనంతటి మహత్తర సంఘటన రోదసీ కుహరంలోనికి యూరీ గగారిన్ జరిపివచ్చిన జైత్రయాత్ర. గగారిన్ సోవియట్ పౌరుడు కావచ్చు; ఆయన విజయం సోవియట్ వైజ్ఞానిక శాస్త్రజ్ఞుల విజయం కావచ్చు. కాని, దీన్ని కేవలం సోవియట్ విజయంగా భావించడం ఒక విధంగా సంకుచితవైఖరి మాత్రమే కాగలదు.

మానవ జాతి దౌర్భాగ్యం వల్ల ఆ సంకుచిత వైఖరే నేడు అంతర్జాతీయరంగంలో రాజ్యం చేస్తున్నందున చంద్ర, శుక్ర, అంగారకాది గ్రహాలలోనికి మానవుని ప్రయాణావకాశాలను గురించిన ఆలోచనలు - సౌరకుటుంబాధిపత్యాన్ని గురించిన స్వప్నాలు - ఎంతో ఉత్తేజపరచడానికి మారుగా, రోదసీ గర్భం నుంచి భూతలంపై అణ్వస్త్రాల వర్షాన్ని గురించిన భయాందోళనలే ఎందరెందరినో నేడు కలవరపరుస్తున్నాయి. ఈ కలవరపాటు అకారణమైనదని అనగలిగితే, నేటి ప్రపంచ పరిస్థితులను గురించి విచారాన్ని వెలిబుచ్చవలసిన అగత్యం ఉండదు. అట్టి మాటను అనగల స్థితిలో లేము గనుకనే, అన్యగోళాల ప్రాంగణంలో నిలచిన ఆధునిక మానవునికి ఈ ప్రపంచంలో నూకలు నిండుకొనబోవడం లేదు గదా అని ప్రశ్నించుకోవలసి వస్తున్నది.

ఏ దృష్టి నుంచి చూచినా, యుగసంధిగా చెప్పదగు ప్రస్తుత సమయంలో మానవాళి భవిష్యత్తును కేవలం రాజకీయవేత్తల చేతులలో విడిచిపెట్టడం తగదు. రాజకీయవేత్తలు దూరదృష్టిలేనివారని కాని, సమష్టి ప్రయోజనాలను కాంక్షించనివారని కాని మా తాత్పర్యం కాదు. అయితే, తక్షణ ప్రయోజనాలను వారు పూర్తిగా త్రోసిపుచ్చలేరు. వ్యష్టిని కాదని, సమష్టికే పూర్తి ప్రాధాన్య మివ్వడం అన్ని సందర్భాలలో వారికి సాధ్యం కాదు కూడా!

ఈ సంగతి సందర్భాలన్నింటిని దృష్టిలో పెట్టుకొని, ప్రపంచం భవిష్యత్తును గురించి ప్రపంచ ప్రజలే ఇప్పుడు కొంతవరకైనా స్వయంగా బాధ్యత వహించి తీరాలి. ఇది తమకు, తమ సంతతికీ సంబంధించిన విషయం; పుట్టి ఉన్న వారికే కాక, పుట్టబోయేవారికి సంబంధించిన విషయం. అందువల్ల జీవితంలో ఎవరి అంతస్తు ఏదైనా, ప్రపంచ ప్రజలందరు తమ భవితవ్య పరిరక్షణ విషయమై ఈ యుగసంధిలో ఎంతో కొంత ప్రత్యక్ష బాధ్యత వహించాలి. ప్రత్యేకించి మేధావులు ఇప్పుడు ఎక్కువ భారం వహించాలి. వారు కవులైనా, రచయితలైనా, సంపాదకులైనా, కళాకారులైనా, తత్త్వవేత్తలైనా, వైజ్ఞానిక శాస్త్రజ్ఞులైనా, సాంకేతిక నిపుణులైనా, రాజకీయాల గొడవ తమకు దేనికని ఔదాసీన్యం వహించరాదు. అంతే చేస్తే, మానవాళిపట్లనే వారు మహాపరాధం చేసినవారౌతారు. జవహర్ లాల్ నెహ్రూ హెచ్చరించినట్టు, గగారిన్ విజయం "ప్రపంచ శాంతికి విజయం" కావాలి. దేశదేశాలలోని మేధావులందరు ప్రపంచ శాంతి సాధనకు ఇప్పుడు కంకణధారులు కావాలి. ఇది వారి కనీస ధర్మం, వారి తక్షణ కర్తవ్యం.

(ఆంధ్రజ్యోతి 16-4-1961)

ఏక ఆసియా ఖండం మహాసభలో ఇటీవల ప్రసంగిస్తూ శ్రీమతి ఇందిరాగాంధి భారతీయ మేధావులలో "సినిసిజం" ప్రబలంగా కానవస్తున్నదని, సామాన్య ప్రజలలో వారికి విశ్వాసం లేదని, దైనందిన జీవితంలోని సామాన్యానుభూతుల మాధుర్యాన్ని అనుభవించగల శక్తిని వారు కోల్పోయినారని విమర్శించడం జరిగింది. ఈ విమర్శ సందర్భంలో మాకున్న పెద్ద సందేహంఅసలు మన దేశంలో మేధావులున్నారా అని, అట్టి వారుంటే వారి సంఖ్య అతి స్వల్పం కాదా అని.

“మేధ” కు మన నిఘంటువులు చెబుతున్న రెండు అర్థాలలో మొదటిది "ధారణాశక్తిగల బుద్ధి", రెండవది "యజ్ఞము". కాని ధారణాశక్తి గలవాడు, ఆ శక్తి ఎంత ఘనంగా ఉన్నా, మా దృష్టిలో మేధావి కాడు. పోతే, యజ్ఞం చేసేవాడు మేధావి అసలే కాడు. ఆవేశ రహితంగా ఆలోచించ గలవాడే మేధావి. విశ్వాసానికి కాక, తర్కానికి ప్రాధాన్యమిచ్చేవాడే మేధావి. సత్యాన్వేషణమే ఏకైక మతంగా గలవాడే మేధావి. అలౌకికశక్తులపై, అభూత సంఘటనలపై ఎంతమాత్రం విశ్వాసం లేనివాడే మేధావి. ఒక్క మాటలో, ఏది తర్కానికి భిన్నమైనదో, ఏది హేతువాదానికి విరుద్ధమైనదో దాన్ని తిరస్కరించగలవాడే మేధావి. ఇట్టివారు మన దేశంలో ఎందరున్నారు? వీరి సంఖ్య కొన్ని వందలనైనా మించగలదో, లేదో! “మేధ” కు “ధారణ శక్తి గల బుద్ధి” అని మన నిఘంటువులు అర్థం చెప్పడం అకారణంగా జరగలేదు. మన సంప్రదాయంలో (ముఖ్యంగా హిందూ సంప్రదాయంలో) ఆలోచనాపాటవానికి కాక, జ్ఞాపకశక్తికి ప్రాధాన్యమిచ్చారు. రెండు వేదాలను కంఠస్థం చేసినవాడు ద్వివేది, మూడింటిని కంఠస్థం చేసినవాడు త్రివేది, నాల్గింటిని కంఠస్థం చేసినవాడు చతుర్వేది. వాటి అర్థం అతడికి తెలియకపోవచ్చు; “టేప్ రికార్డింగ్ మెషిన్"కు, అతడికీ నిజానికి ఏమీ భేదం లేకపోవచ్చు.

అయినా, అతడికే గౌరవం, అతడికే మన్నన. కాగా, వేదాల అపౌరుషేయత్వాన్ని ప్రశ్నించడానికి ఎవడైనా సాహసిస్తే అతడు పాషండుడు, సంఘం నుంచి వెలివేయదగినవాడు. ఆలోచనాపాటవానికి కాక, ధారణశక్తికి ఇంతగా మనం అనేక శతాబ్దాలుగా ప్రాధాన్య మిస్తున్నందున, ఆధునిక వైజ్ఞానిక శాస్త్రాలలో పెద్ద డిగ్రీలను పొందినవారిలో సయితం ఆలోచన మొదలే సున్న. ఈనాడు మన దేశంలో "ఫిలాసఫీ" పేర మౌలికచింతన చేయడానికి మారుగా, మూఢవిశ్వాసాలను పెంచుతున్న వారు ఎందరు లేరు? ఈనాడు మన దేశంలో “సైన్సు” పేర నూతన సత్యాలను కనుగొనడానికి మారుగా, పాత అబద్ధాలను ప్రోదిచేస్తున్నవారు ఎందరులేరు? ఈనాడు మన దేశంలో "మోడర్న్ ఎడ్యుకేషన్” పేర జ్ఞానాన్ని పెంచడానికి బదులుగా, భక్తిని వ్యాపింపజేస్తున్నవారు ఎందరు లేరు?

మేధావులుగా ఎన్నదగువారు చెదురుగా తప్ప మనకు లేరు కనుకనే, ఊరు కొక “యోగి”, నాడు కొక “బాబా” ఈనాడు వెలుస్తున్నారు; వారి పాదసేవకై పేరుకు “ఉన్నత విద్య” అభ్యసించిన వారితోపాటు ఉన్నతోన్నతమైన పదవులలో ఉన్నవారు ఎగబడుతున్నారు!! మేధావుల దారిద్ర్యం మనకు ఇంత విశేషంగా కలదు కనుకనే, ఒక జాతిగా మనకు ఆలోచన తక్కువ, ఆవేశం హెచ్చు; ఇందువల్లనే మనకు వివేకం తక్కువ, విశ్వాసం హెచ్చు; ఇందువల్లనే మనకు జ్ఞానం తక్కువ, భక్తి హెచ్చు; ఇందువల్లనే మనం వ్యక్తుల కిచ్చే ప్రాధాన్యాన్ని భావాల కివ్వము; ఇందువల్లనే నినాదాలకు మనం సులభంగా మోసపోతూ ఉంటాము.

(ఆంధ్రజ్యోతి 14-2-1973)

నైతిక పతనం

ఒక సుప్రసిద్ధ వ్యక్తి, ప్రముఖ ప్రజానాయకుడు “వ్యర్థమైన మూడు జీవితాలు" అనే శీర్షిక కింద గత బుధవారంనాడు మేము వ్రాసిన సంపాదకీయం అధికమైన, అకారణమైన నిరాశానిస్పృహలతో నిండి ఉన్నట్టుగా భావిస్తున్నాడు. ఇప్పటికి కూడా దేశంలో ఉన్నతమైన, ఉత్తమమైన జీవితపు విలువలున్నవారు కొందరు లేకపోలేదని ఆయన వ్రాస్తున్నాడు. ఇట్టివారు ఎవరో కొందరు లేకపోలేదు. అయితే, మేము మా సంపాదకీయంలో వివరించినట్టు, వీరు చెదురుగా తప్ప ఈనాడు కానరావడం లేదు. ఇట్టి వారిని కాక, సంఘం మొత్తాన్నే మనం దృష్టిలో పెట్టుకోవాలి.

మొత్తం సంఘం నైతికపు విలువలకు సంబంధించినంతవరకు ప్రస్తుతం ఎంత హీనస్థాయికి - ఎంతటి నైచ్యస్థితికి - మనం దిగజారిపోయామో మన వార్తా పత్రికలు నిత్యం తెలపడం లేదా? పోయిన రెండు, మూడు రోజులలోనే మా కంటబడిన ఈ మూడు వార్తలను మా పాఠకులలో ఎందరు గమనించారో తెలియదు. అందువల్ల వాటిని సంగ్రహంగా పేర్కొంటున్నాము.

కేరళ ప్రభుత్వానికి చెందిన ఇద్దరు మంత్రులు తమ నివాస గృహాలకు అద్దెలను తమ భార్యలకు చెల్లింపజేస్తున్నట్టు అసెంబ్లీలో విమర్శ వచ్చింది. అందుకు వారు చెప్పిన సమాధానం - ఆ గృహాలు తమవి కావని, తమ భార్యలవని; వారిద్దరి చర్యను సమర్థిస్తూ, అది న్యాయ సూత్రాల రీత్యా సమర్థనీయమైనదని ముఖ్యమంత్రి పేర్కొన్నాడు. కావచ్చు. కాని, అది నైతిక సూత్రాల రీత్యా అసమర్థనీయమైనది కాదా? కాని పక్షంలో, తమపై ఒకసారి విమర్శ జరిగినంతనే ఇక మీదట తాము తమ భార్యలకు అద్దె ఇప్పించబోమని ఆ మంత్రు లిద్దరు చెప్పడం ఎందుకు జరిగేది?

పోతే, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ చర్చల సందర్భంలో బూర్లో కేంద్రప్రభుత్వ యాజమాన్యం కింద ఉన్న ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీలో రెండున్నర, మూడువేల రూపాయలను దళారీలకు చెల్లించినవానికి ఉద్యోగం తేలికగా దొరుకుతున్న దన్న ఆరోపణ జరిగింది. ఈ విధంగా "చేయి తడిపి" ఉద్యోగాలు సంపాదించినవారిలో దాదాపు అయిదు వందల మంది హాజరు పట్టీలో చేవ్రాలు చేసి, తమ సొంతపనులు చేసుకొనడానికి వెళ్ళిపోతున్నట్టు ఆరోపణ జరిగింది. ఈ ఆరోపణలు ఎంతవరకు నిజమో మాకు తెలియదు గాని, వీటిని చేసినప్పుడు ప్రభుత్వంవారు మౌనం పాటించారు.

కాగా, ఢిల్లీ పరిపాలక సంస్థకు చెందిన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కథనం ప్రకారం, కొందరు ఉపాధ్యాయులు తమకు ఎంతో కొంత ముడుపు చెల్లించినవారిని పరీక్షలలో ఉత్తీర్ణులను చేస్తున్నారు! ఉపాధ్యాయ వర్గానికి చెందిన వారే ఈ ఘోరస్థితికి దిగజారిన తర్వాత ఇతర వర్గాలవారిలో నీతి ఎలా ఉంటుంది, నిజాయితీ ఎలా ఉంటుంది?

నిజానికి, వార్తాపత్రికలవరకు వెళ్ళడం దేనికి? మన చుట్టుపక్కలలోనే, మన ఎరుకలోనే - ఇట్టి సంఘటనలు ఎన్ని వందలు లేవు, ఎన్ని వేలు లేవు? ఇతరుల ఆరోగ్యం చెడిపోగలదని తెలిసినా, ప్రాణాలే పోవచ్చునని తెలిసినా, లాభాల కోసం కల్లు, సారాలను కల్తీచేయబట్టే కదా కడచిన రెండు, మూడు నెలలలోనే దేశం మొత్తం మీద అయిదారు వందలమందికి పైగా చనిపోవడం సంభవించింది! నిజానికి ఈనాడు చివరికి ఔషధమైనా ఏదో కల్తీలేకుండా దొరకగలదన్న నమ్మకం మనకున్నదా?

కృతయుగ మొకటి కలదన్న, కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలపై నడిచినదన్న అంధ విశ్వాసం మాకు లేదు. ఇప్పుడు "పాడు కలికాలం" వచ్చిపడినదన్న మూఢవిశ్వాసమైనా మాకు సుతరాములేదు. ఎప్పుడైనా, ఎక్కడైనా మానవసంఘంలో ఎంతో కొంత అవినీతి ఉంటుంది, అధర్మం ఉంటుంది. కాగా మా బాధ, మా ఆవేదన, ఈనాడు మన సంఘంలో అవినీతి, అధర్మాలు మితిమీరి పోయినవనే. "మనలో మానవత చచ్చిందా?" అని సందేహించవలసినంతటి మేరకు అవి పెరిగిపోయినవనే!!

(ఆంధ్రజ్యోతి 31-3-1973)

మానసికపు పంజరాలు

మనది స్వతంత్ర దేశం. అయినా, మనం స్వతంత్ర ప్రజలమా?



స్వతంత్ర ప్రజల స్వాతంత్ర్యం వ్యక్తం కావలసింది వారి రాజకీయ వ్యవహారాలలోనే కాదు, వారి ఆర్థిక, సాంఘిక, జీవిత వ్యవస్థలలోనే కాదు, వారి మానసిక జీవితంలో కూడా. మానసిక జీవితానికి సంబంధించినంతవరకు మన దేశం ఇరవయ్యో శతాబ్దిలో లేదు; పదవ శతాబ్దిలోనే ఈనాటికీ అది మిగిలి ఉన్నది. మనలో పెక్కుమంది మానసిక జీవితం పదవ శతాబ్దం వరకైనా పురోగమించలేదు; అది వేదకాలాన్ని దాటి ఒక్క అడుగైనా ముందుకు వేయలేదు. చదువు సాములు లేనివారిలోనే మానసిక వికాసం కానరాకపోతే, విద్యా వ్యాప్తితో ప్రస్తుత దుస్థితి తొలగవచ్చునని ఆశించవచ్చు. కాని, ప్రధాని నెహ్రూ నిన్న జబల్పూర్లో ప్రసంగిస్తూ పేర్కొన్నట్టు, "మేధావులైనవారిలోనే, వైజ్ఞానిక శాస్త్రాలలో, తత్త్వశాస్త్రాలలో, కళలలో పండితులైనవారిలోనే" వారి చదువులకు, వారి నమ్మకాలకు ఏమీ సంబంధం కానరావడం లేదు.

గ్రహణం పట్టి, విడిచినంతనే గంగలో మునిగే ఖగోళ శాస్త్రజ్ఞులు, "జంబూ ద్వీపే, భరత ఖండే..." అనే మంత్రాన్ని పఠించే భూగోళ శాస్త్రజ్ఞులు, బల్లి పలికిందని, నల్లపిల్లి ఎదురువచ్చిందని ప్రయాణాలను ఆపుచేసుకొనే తత్త్వశాస్త్రజ్ఞులు, కుల మత విభేదాలను పాటించే మానవ శాస్త్రజ్ఞులు – ఈ విధంగా ఎందరెందరు మహామేధావులు, ఎందరెందరు మహా మహా పండితులు మనకు లేరు? తెలియని మూర్ఖులనైనా సహించవచ్చు గాని, తెలిసిన ఈ మూర్ఖులను సహించలేము. అయినా, ఇట్టివారి సంఖ్య మన దేశంలో లక్షలలో కాదు, కోట్లలోనే!

ఈనాటి మన సంఘంలో నైతికపు విలువలు తక్కువ కావడానికి మూలకారణాలలో విద్యకు, విశ్వాసాలకు సంబంధం లేకపోవడమే ప్రధానమైంది కావచ్చు. సూర్యచంద్ర గ్రహణాలకు రాహుకేతువులు కారకులు కారని తెలిసి కూడా గ్రహణశాంతికై స్నానాన్ని, జపాన్ని చేసే వ్యక్తి మాటకు, అతని చేతకు సంబంధం లేకపోవడం అబ్బురమా? కుల, మత, వర్గ విభేదాలు కృత్రిమమైనవని తెలిసికూడా వాటిని పాటించే వ్యక్తి రెండు నాల్కల వ్యవహారం చేయడం విడ్డూరమా?

కొన్ని పూర్వాచారాలను మూఢాచారాలుగా తాము గుర్తిస్తున్నా, తమ తల్లిమనస్సును నొప్పించరాదనో, తండ్రికి కినుక తెప్పించరాదనో, భార్య పోరును తప్పించుకొనవలెననో, వాటిని తాము పాటించక తప్పడం లేదని ఈ ప్రబుద్ధులలో కొందరు చెప్పడం కద్దు. తమ వారిని తమ స్థాయికి తీసుకురావడానికి ప్రయత్నం చేయడానికి మారుగా తామే వారి స్థాయికి దిగిపోతే, తమ చదువులు దేనికి, తమ పాండిత్యం దేనికి, తమ డిగ్రీలు దేనికి? తగలబెట్టడానికా?

దేశంలో ఎంతగా విద్య వ్యాపించినా, ఎన్ని వైజ్ఞానిక శాస్త్ర పరిశోధనాగారాలు వెలసినా, ఎందరు ఆధునిక శాస్త్రాలలో ఎంత పెద్దపట్టాలు పుచ్చుకొన్నా, నెహ్రూ పలుకులలో, "మానసికపు పంజరాల నుంచి" మనం బయటపడితేను తప్ప, ఇండియా నిజంగా స్వతంత్ర దేశం కాబోదు! (ఆంధ్రజ్యోతి 13-7-1961)

మేధ, హృదయం

(శ్రీ సి. రాజగోపాలాచారి గవర్నర్ జనరల్ గా పదవీ విరమణ చేసిన సందర్భంలో రాసింది.)

"మీ భావికార్యక్రమ మేమిటి?" : గవర్నర్ - జనరల్ పదవి నుంచి విరమించిన చక్రవర్తి రాజగోపాలాచారిని (1879-1972) ప్రతివారు వేయగోరుతున్న ఈ ప్రశ్ననే నిన్న ఆయన మద్రాసు చేరినంతనే పత్రికా విలేకరులు వేశారు.

జవసత్వాలుడిగినవాడు కాకపోయినా, ఆయన వయోవృద్ధుడు. రాజ్యాంగ చట్టానికి లోబడే కావచ్చు, లాంఛన ప్రాయంగానే కావచ్చు, ఏమైనా రాజ్యాధిపతి ("హెడ్ ఆఫ్ స్టేట్") పదవిని నిర్వహించి, దాని నుంచి విరమించాడు. ఈ పరిస్థితులలో మరొక రుంటే "మరి విశ్రాంతి పుచ్చుకోగలడు" అని తీర్మానించుకొనడమే సహజంగా జరిగేది.

కాని, రాజాజీ మరొకరివంటివాడు కాదు. కోరినా, విశ్రాంతి గైకొనలేనట్టిది ఆయన ప్రవృత్తి. ఇదివరలో రెండు, మూడుసార్లు రాజకీయాలనుంచి విరమిస్తున్నానని ఆయన ప్రకటించాడు. భగవన్నామస్మరణతో జీవితశేషాన్ని గడపనున్నట్టుగా ఆయన సూచించాడు. కాని, ప్రతి ఒక్కసారి ఈ నిర్ణయం సడలిపోవడానికి ఎంతోకాలం పట్టలేదు.

జీవిత సమరాంగణంలో పోరు ముమ్మరంగా సాగుతున్నచోట నిలవలేకపోతే, కొందరికి జీవితమే లేదు. అట్టివారిలో రాజాజీ మిన్నగా ఎన్నదగువాడు. అందువల్లనే ఆయన విషయంలో "మీ భావికార్యక్రమమేమిటి?" అనే ప్రశ్న అందరికీ అప్రయత్నంగా తోస్తున్నది.

ఢిల్లీలో జరిగిన ఒక వీడ్కోలు సభలో ప్రసంగిస్తూ, తన మహోదాత్తత కారణంగా జవహర్లాల్ నెహ్రూ భారత ప్రజలకు ప్రేమపాత్రుడౌతున్నాడని రాజాజీ పేర్కొన్నాడు. తన కార్యదక్షత మూలంగా వల్లభాయ్ పటేల్ విశ్వాసపాత్రుడౌతున్నాడని కూడా రాజాజీ అదే సందర్భంలో వక్కాణించాడు. ఇదే ధోరణిలో చెప్పగోరితే, తన మేధవల్ల రాజాజీ గౌరవ పాత్రుడౌతున్నాడని మనం అనవచ్చు.

మహోదాత్తత హృదయానికి సంబంధించిన విషయం కాని, మేధకు సంబంధించినట్టిది కాదు. రాజాజీ మేధావి, ఆయనకు హృదయం లేదనము. కాని, ప్రతి మేధావంతునివలె ఆయన తన హృదయాన్ని కళ్ళెంలేని గుర్రంవలె త్రుళ్ళింత లాడనివ్వడు. అది మేధకు లోబడవలసిందే, అది చెప్పినట్టు నడవ వలసిందే. మేధ కట్టుదిట్టాలకు ఇంతగా హృదయాన్ని లోబడజేసినందునే కొన్ని కొన్ని ఘట్టాలలో హృదయంలేని వానివలె రాజాజీ కనిపించడం!

మేధ కొరవడిన వ్యక్తి కార్యదక్షుడు కాలేడు. కాని, ప్రతి మేధావి కార్యదక్షుడు కాదు. నిజానికి ఎక్కువ మేధాశక్తి కార్యదక్షతకు అడ్డు వస్తుంది. వేయవలసిన ముందుటెత్తులు కనీసం రెండు, మూడైనా తెలియని వ్యవహర్తగా రాణించడం కష్టం. కాని, అంతకుమించి వెళ్లితే మాత్రం, వ్యవహర్త చూపవలసిన తెగింపు చూపడం సామాన్యంగా జరగదు. అందువల్లనే అత్యధిక మేధాసంపన్నులైనవారు తెగువగా ఏ పనీ చేయలేరు.

మేధా పదునైన కత్తి. ఎంత మెలకువగా వినియోగించినా, అది తగలరానిచోట తగలడం కద్దు. అందువల్ల మేధావి చిరమైత్రిని సాధించడం చాలా చెదురు, స్థిర విశ్వాసాన్ని పొందడం బహు అరుదు.


మేధ ఎక్స్రేను పోలింది కూడా. దాని పరీక్షకు లోనైన వ్యక్తి తన అంతరంగమే నగ్నం చేయబడుతున్నట్టు ఒక విధమైన లజ్జాభయాలకు లోనుగావడం కద్దు. ఇందువల్ల కూడా అశేష మేధావంతుడు సామాన్య శక్తిసంపన్నులను, వారి శక్తియుక్తులకు తగినట్టు, తన కార్యసాధనకై వినియోగించుకొనగలగడం కష్టం.

ఎంత గౌరవ భాజనుడైనా ప్రజల ప్రేమవిశ్వాసాలను విశేషంగా చూరగొనలేనివాడు కనుకనే, రాజాజీ తమిళనాడు నాయకత్వాన్ని కోల్పోయాడు.

ఇందువల్లనే ఆయన మద్రాసు ప్రధానిగా ఆశించినంతగా రాణించలేదు. కాని, బెంగాల్ గవర్నర్గా, ఇండియా గవర్నర్ జనరల్ ఆయన అందరి మన్ననలను పొందగలిగాడు. ఈ రెండు ఉన్నత పదవుల నిర్వహణలో ఆయన వహించిన పాత్ర గాంధి జీవితకాలంలో వహించినట్టిదే. సలహాలు చెప్పి, చిక్కులను విడదీయడమే ఈ పాత్ర. ఇదే మేధావికి తగు పాత్ర.

గవర్నర్ - జనరల్ పదవినుంచి విరమించినా, రాజాజీ సలహాలు తమకు యధాప్రకారం లభించగలవనే జవహర్లాల్ నెహ్రూ ఢిల్లీ వీడ్కోలు సభలో ఆశించాడు. ఇదే మనందరి ఆశ కూడా. (ఆంధ్రప్రభ 29-1-1950)

మనం	మన ప్రవృత్తి



తెలుగు గడ్డపై పుట్టి, ఇతర ప్రాంతాలకు విస్తరించిన ఏ కొత్త మతం, ఏ నూతనోద్యమం దాదాపు కానరాదు. కాని, ఎక్కడ ఏ కొత్త మతం పుట్టినా, ఏ నూతనోద్యమం ప్రారంభమైనా, అతి శీఘ్రంగా, అత్యంత సులభంగా అది తెలుగుగడ్డకు పాకుతుంది. మనకు మౌలికచింతన తక్కువ కావడమే ఇందుకు కారణమా? ఈ ప్రశ్న వేయడమైనా పెక్కుమందికి కోపాన్ని తెప్పించవచ్చు. అయినా, కోపానికి లోనుగాక, ఈ దృష్టినుంచి మన రెండు, మూడు వేల సంవత్సరాల చరిత్రను ఒకసారి సమీక్షచేసుకొనడం ముఖ్యావసరం. ఈ సమీక్షవల్ల మనం కనీసం కొన్ని సందర్భాలలో నైనా మౌలికచింతన చేసినట్టు స్పష్టపడితే, మనం ప్రారంభించిన మతాలు, ఉద్యమాలు దేశంలోని అన్యప్రాంతాలు విస్తరించినట్టు స్పష్టపడితే, మాకంటె సంతోషించగలవారుండరు.

అన్యప్రాంతాలనుంచి ఏదైనా మతాన్ని లేదా ఉద్యమాన్ని స్వీకరించి నపుడు దానిపట్ల భక్తిని, విశ్వాసాన్ని, ఉత్సాహాన్ని, ఉత్కంఠను చూపడంలో మనకు మనమే సాటి. బుద్ధునికాలంనుంచి గాంధికాలంవరకు ఇంతే జరిగింది.

బౌద్ధాన్ని మనం ఎప్పుడు పరిగ్రహించినామో స్పష్టంగా తెలియదు. కొందరు చరిత్రకారులు అశోకుని కాలానికి ముందే అది జరిగినట్టు చెబుతున్నారు; మరికొంద రేమో అశోకుని కాలంలోనే అని వ్రాస్తున్నారు. ఏమైనా, ఉభయ వర్గాలు ఒక విషయమై ఏకీభవిస్తున్నారు. బుద్ధుడు తన నూతన ధర్మ ప్రచారానికి మన ప్రాంతానికి రాలేదు. అయినా, ఆయన నిర్యాణం తర్వాత మనం బౌద్ధాన్ని స్వీకరించడానికి ఎంతో కాలం పట్టలేదు.

బౌద్ధమతాన్ని మనం స్వీకరించిన తర్వాత అనతికాలంలో అది మనమధ్య విశేషవ్యాప్తి పొందింది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం తెలుగు గడ్డపై వెలిసిన వందలాది, వేలాది బౌద్ధక్షేత్రాలే. భూగర్భంలో దాగి ఇప్పటికి కూడా ఎన్ని బౌద్ధక్షేత్రా లున్నవో తెలియదు. కాగా, ఇప్పటికి బయల్పడినవాటిలో సాలిహుండం, శంకరం, రామతీర్థం, కొత్తూరు లింగరాజుపాలెం, నీలావతి, ఆరుగొలను, కొడవలి, ఆదుర్రు, గుంటుపల్లి, కాపవరం, అల్లూరు, గుమ్మడిదుర్రు, గరికపాడు, గుడివాడ, ఘంటసాల, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, కనుపర్తి, విద్యాధరపురం, అమరావతి, పెద గంజాం, చిన గంజాం, బుద్ధాం, వేల్పూరు, రెంటాల, గోలి, నాగార్జునకొండ, మంచికల్లు, ఉప్పుగుండూరు, కొండాపురం, ఫణిగిరి, ఏలేశ్వరం, గాజులబండ, గుత్తి-ఇవి కొన్ని మాత్రమే. వీటిలో అమరావతి ప్రపంచ ప్రసిద్ధికెక్కిన క్షేత్రం. దాని శిల్పరీతి ప్రభావం దేశ దేశాలకు విస్తరించింది. అటు తర్వాత సుప్రసిద్ధమైనట్టిది నాగార్జునకొండ.

ఏదైనా కొత్త మతంపట్ల, లేదా నూతనోద్యమంపట్ల మనం ఎంత త్వరగా, ఎంతటి ప్రగాఢమైన ప్రేమాభిమానాలను ప్రదర్శిస్తూవుంటామో, కొంతకాలం తర్వాత దాన్ని అంత పూర్తిగా ఒక ప్రక్కకు నెట్టివేస్తూ వుంటాము. అందువల్లనే, కొంతకాలంపాటు ప్రపంచదృష్టిని విశేషంగా ఆకర్షించిన మన బౌద్ధక్షేత్రాలే మన దృష్టిలో చివరికి "లంజదిబ్బలు"గా మారిపోయాయి. స్వీకృతిలోవలె తిరస్కృతిలో, ప్రేమలోవలె విద్వేషంలో భూషణలోవలె దూషణలో మన ప్రవృత్తిలో గల ఈ "అతి" కారణంగానే మన దేశచరిత్రలో మనకు తగుపాత్రను మనం పూర్తిగా వహించలేకపోవడం అన్ని కాలాలలో జరుగుతూ వస్తున్నదేమో ఒకసారి మనం గట్టిగా, ప్రశాంతంగా ఆలోచించుకోవాలి. (ఆంధ్రప్రభ 25-4-1973)

మేధావులు,  రాజకీయాలు

నిజమే, ప్రధాని ఇందిరా గాంధి మొన్న ఏదో సందర్భంలో చెప్పినట్టు, మేధావులు నేడు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

అంతేకాదు; వారు రాజకీయాలకు నానాటికి మరింతగా దూరమైపోతున్నారు కూడా. ఇందులో అతిశయోక్తి ఏ మాత్రం లేదు.

అయితే, దీనికి కారకులు ఎవరు? లేదా, కారణం ఏమిటి? శ్రీమతి ఇందిర ఆరోపించినట్టు, దోషం మేధావులదేనా? సరియైన నాయకత్వ సృష్టికి మేధావులు దోహదం చేయడం లేదన్న ప్రధాని ఆరోపణ సమర్థనీయమేనా?

ఆమె చెప్పినట్టు ఒకప్పుడు మన దేశంలో నాయకత్వం మేధావుల చేతిలోనే ఉండేది; సంఘ సంస్కర్తల చేతిలోనే ఉండేది. అయినా, ఈనాడు తిరిగి శ్రీమతి గాంధి తానే చెప్పినట్టు రాజకీయ నాయకత్వం రాజకీయాలే వృత్తిగా గలవారి చేతిలోనికి పోవడానికి కారణం ఏమిటి?

రాజా రామమోహన్ రాయ్ మన దేశ జీవనంలో సర్వతోముఖ చైతన్యం ప్రారంభమైంది. రామమోహన్ రాయ్ నుంచి, ఎం.ఎన్. రాయ్ వరకు మన నాయకులను చూస్తే తరతమ భేదాలతో వారిలో హెచ్చుగా మేధావులే కనిపిస్తారు.

క్రిందటి శతాబ్దంలో మన దేశ పునరుజ్జీవనం మత, సంఘ సంస్కరణాభి ముఖంగా జరిగింది. ఆనాడు మత, సంఘ సంస్కర్తలదే నాయకత్వం. వారందరు, విద్యాధికులు, మేధావులు.

ఆ తర్వాత, క్రిందటి శతాబ్దం చివరి భాగంలో స్వాతంత్ర్యోద్యమం ప్రారంభమైంది. దాని నాయకత్వం కూడా విద్యాధికులదే, మేధావులదే.

మన స్వాతంత్ర్యోద్యమంలో గాంధీయుగం వచ్చిన తర్వాతనే మేధావులకు ప్రాధాన్యం తగ్గి పోవడం ప్రారంభమైంది. రాజకీయ నాయకత్వానికి మేధకంటే త్యాగభావం, నైతిక నైర్మల్యం ప్రధానాలని గాంధీజీ భావించారు.

అయినా, అంతకు పూర్వపు సంప్రదాయ ప్రభావం పూర్తిగా నశించలేదు. గాంధీయుగం తొలిదశలో కూడా మేధావులైనవారే, సచ్ఛీలురైన వారే రాజకీయ నాయకులుగా దేశానికి లభించారు.

కాని, క్రమంగా మేధావులు రాజకీయాలకు దూరంగా ఉండిపోవడం జరిగింది. ముఖ్యంగా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన రాజకీయాలలో మేధావులే కాదు, సచ్ఛీలురు సయితం కరువైనారు.

ప్రజల నుంచి వోట్లను - ఏ విధంగా అన్నది ముఖ్యం కాదు - సంపాదించు కోగలిగినవారిదే రాజకీయ నాయకత్వమైంది. అధికార వ్యామోహం, ధనదాహం, అవినీతి ఇవి మన రాజకీయాలకు పర్యాయపదాలైనాయి. అయినప్పుడు మేధాసంపత్తికి, మేధావులకు స్థాన మెక్కడ? కనీసం మన విశ్వవిద్యాలయాలైనా మేధావులకు నిలయాలై ఉండవలసింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ పద్ధతిలో అవి మన రాజకీయాల స్వరూప నిర్ణయానికి, ఆర్థిక సూత్రాల నిర్వచనానికి దోహదం చేసి ఉండ వలసింది. కాని, అది కూడా జరగలేదు.

నిజానికి, మన విశ్వవిద్యాలయాలు ఈనాడు విశ్వవిద్యాలయాలుగా మిగల లేదు; అవి రాజకీయ నిలయాలైనాయి. వాటిపై మేధావుల ప్రభావం కంటె, రాజకీయ నాయకుల ప్రాబల్యమే ఈనాడు హెచ్చు.

ఈ పరిస్థితులలో మన మేధావులు రాజకీయాలకు ఒక నమస్కారం పెట్టి, దూరంగా ఉండడంలో ఆశ్చర్యం ఉన్నదా? రాజకీయాలపై వారి ప్రభావం లేకపోవడంలో అబ్బురం ఉన్నదా? ప్రజల వోట్లను సంపాదించగలిగిన వారికి మాత్రమే రాజకీయాలలో పెద్ద పీట అయినప్పుడు మన రాజకీయాలలోని మేధా దారిద్ర్యానికి విస్మయం చెందడం దేనికి? రాజకీయ నాయకులు తమకు బాకా ఊదేవారినే అసలైన మేధావులుగా ఆదరిస్తున్నప్పుడు, అసలైన మేధావులు రాజకీయాలను గురించి ఆలోచనైనా చేయడం లేదని వ్యసనపడడం దేనికి?

మేధావులను గౌరవించడానికి వారికి రాజకీయ పదవులనే ఇవ్వనక్కరలేదు; వారిని అందలా లెక్కించి ఊరేగించ నక్కరలేదు. వారి అభిప్రాయాలను - అవి పదవులలో ఉన్నవారికి వ్యతిరేకాభిప్రాయాలైనా సరే - గౌరవిస్తే చాలు. అది కూడా అక్కరలేదు. అట్టి అభిప్రాయాలను వెల్లడించిన వారి చిత్తశుద్ధిని గౌరవిస్తే చాలు. అది కూడా మృగ్యమైన ప్రస్తుత కలుషిత వాతావరణంలో మేధావులు రాజకీయాలపట్ల శ్రద్ధ ఎందుకు వహిస్తారు?

(ఆంధ్రజ్యోతి 20-8-1970)

మానవత్వపు విలువలు



ఎట్టి పరిస్థితులలోనైనా కొన్ని ప్రాథమిక సూత్రాలను, కొన్ని చిరసత్యాలను, మానవతకు సంబంధించిన కొన్ని విలువలను మన ప్రధాని విస్మరించడు. కనుకనే ఆయన నొక మహాపురుషుడు; కనుకనే ఆయ నొక ప్రపంచ నాయకుడు.

విపరీతమైన, విపత్కరమైన పరిస్థితులనే నేడు మనం యెదుర్కొంటున్నాము. నీతి నియమాలు లేని ఒక ప్రబల శత్రువు కల్పించినట్టివి, ఆ పరిస్థితులు; దయాదాక్షిణ్యాలు లేని బలవద్విరోధి కల్పించినట్టివి, ఆ పరిస్థితులు. ఇది కాదనరాని విషయమైనా, నీతి నియమాలను మనం అతిక్రమించరాదు; దయాదాక్షిణ్యాలకు మనం తిలోదకా లివ్వరాదు.

మిత్రద్రోహం చేసి, విశ్వాసఘాతుకత్వానికి దిగి, మన సరిహద్దుల లోపలికి తమ సైన్యాలను నడిపిన చైనా కమ్యూనిస్టు ప్రభుత్వనాయకుల స్వభావాన్ని దృష్టిలో పెట్టుకొనే కావచ్చు, మిస్టర్ ఫ్రాంక్ ఆంథోనీ ఈ కర్కశ శత్రువును జయప్రదంగా ప్రతిఘటించాలంటే, మొత్తం భారత జాతిలో “కసాయితనాన్ని" పెంపొందించాలని లోకసభలో సూచించారు. చైనా కమ్యూనిస్టు నాయకు లంటేనే కరుడు కట్టిన కసాయితనం. ఈ విషయాన్ని సందేహించేవారు మావో రచనలను ఒకసారి పరిశీలించవచ్చు.

"తుపాకి గొట్టంలో నుంచే రాజకీయాధికారం మొలకెత్తడమైనా, పెరగడమైనా, నిజానికి తుపాకి గొట్టంలో నుంచే ఏదైనా సరే యేపుగా పెరగడం!" అని 1938లోనే మావో వ్రాశాడు. తుపాకిపై, దాని గొట్టంపై, ఆ గొట్టం నుంచి వెలువడే తూటాపై ఇంతగా నమ్మకం వున్న “మోటా ఆద్మీ” కనుకనే అవి లేకుండా మాటలాడడమైనా మావోకు చేతకాదు. వాటిని ప్రయోగించే అతడు చైనాలో కమ్యూనిస్టు రాజ్యాన్ని స్థాపించాడు; వాటిని ప్రయోగించే ఆసియాలో చైనీస్ సామ్రాజ్యాన్ని నిర్మించడానికి అతడు ప్రయత్నిస్తున్నాడు.

మావోకు మరపురాని పాఠం చెప్పవలసింది తుపాకితోనే. మరొక విధంగా చెప్పే పాఠం అతడి మనస్సు కెక్కదు. కాని, తుపాకినే మనం ఆరాధించరాదు; తుపాకిని ఆరాధించేవాని కసాయితనాన్ని మనలో ప్రవేశించనీయ రాదు. అంతే చేస్తే, మానవత్వపు విలువలనే మావోవలె మనం మరచిపోగలము!

వీరుడైనవాడు క్రూరుడు కానక్కరలేదు. క్రూరత్వం వీరత్వం కాదు; అది రాక్షసత్వం, మన చరిత్ర ప్రకారం, మన సంస్కృతి ప్రకారం మన సంప్రదాయాల ప్రకారం ధీరోదాత్తుడైనవాడే నిజమైన వీరుడు. అట్టి వీరుడు ఎట్టి పరిస్థితులలోను ఏ ప్రాథమిక సూత్రానికీ, ఏ చిరసత్యానికి విరుద్ధంగా వర్తించాడు. అతడు సంహరించడం రక్తపిపాసతో మాత్రమే, ధర్మసంస్థాపనకు మాత్రమే!

న్యాయరక్షణకు, ధర్మసంస్థాపనకు యుద్ధం చేస్తున్న మనం దాన్ని ధీరోదాత్తంగానే కొనసాగించాలి. మిస్టర్ ఫ్రాంక్ ఆంథోనీ సూచనను ఖండిస్తూ, మన ప్రధాని నిన్న లోకసభలో ఈ హెచ్చరికనే చేశారు. ఇదే సందర్భంలో ఆయన చేసిన మరొక హెచ్చరిక కూడా అతి ముఖ్యమైనదే!

చైనా కమ్యూనిస్టు ప్రభుత్వాధినేతలకు, చైనీస్ ప్రజలకు మధ్య మనం విభేదం చూడాలి. తుపాకిని ఆరాధించేవారు దాని సాయంతో తమ ప్రభుత్వాన్ని నెలకొల్పి, చైనా ప్రజాసామాన్యాన్ని నిరంకుశంగా, నిర్దాక్షిణ్యంగా పరిపాలిస్తున్నారు. ఆ ప్రజానీకం నేడు నిస్సహాయస్థితిలో వున్నది. చైనా ప్రభుత్వాధినేతల దుశ్చర్యలకు, దురాగతాలకు చైనా ప్రజలపై పగపూనడం భావ్యం కాబోదు.



చైనా పరిపాలకవర్గాన్ని “మాన్ దరిన్” వర్గంగా పేర్కొంటారు. నిరంకుశత్వం రక్తంలో జీర్ణించినట్టిది ఈ వర్గం. కమ్యూనిజం సిద్ధాంతాన్ని వరించినా, నేటి చైనా పరిపాలకులు ఈ వర్గానికి చెందినవారే! అందువల్లనే స్వదేశాన్ని నిరంకుశంగా పరిపాలించడంతో పాటు సామ్రాజ్య విస్తరణను వారు కోరుతున్నారు.

చైనా ప్రజలపట్ల మనకు విరోధం లేదని వారికి నచ్చజెప్పడానికి మనం ప్రయత్నించాలి. తమ నీచ, నికృష్ట, నిరంకుశ ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి తాము ప్రయత్నిస్తే, అందుకు మన పూర్తి సానుభూతి లభించగలదని స్పష్టం చేయాలి. మన సరిహద్దుల రక్షణకై మనం చేస్తున్న యుద్ధం కసాయితనం. కరుడుకట్టిన తమ కమ్యూనిస్టు పాలకవర్గం నుంచి తమ విముక్తికి దోహద మివ్వగలదనే ఆశను వారిలో రేకెత్తింపజేయడానికి మనం ప్రయత్నించాలి. (ఆంధ్రజ్యోతి 16-11-1962)

మంచిని పెంచండి



బాల్యంలో నున్న సర్వ సమభావం, విశ్వజనీన దృష్టి క్రమ క్రమంగా నశించి పోతున్నది. అందుకు మనం దోహదం చేయడం కూడా జరుగుతుంది. అందువల్లనే డాక్టర్ రాధాకృష్ణన్ అన్నట్టు కనీసం మన పిల్లలలోని ఆ సద్గుణాన్ని మనం పాడు చేయక పోతే చాలు. అదేమంత సులభం కాదు. సహజంగా మనం మన పిల్లలకు విద్యా బుద్ధులను గరపుతున్నామని, వారి కేవో నీతులను బోధించి పరిపూర్ణ మానవులుగా సిద్ధం చేస్తున్నామని భావిస్తున్నామే కాని, వారిలోని అమాయికతను, మంచిని ఎంతగా కలతపరచి వారిని కలవర పెట్టుతున్నామో గమనించడం లేదు.

మన మేం చేయకపోయినా కేవలం ఆ పిల్లల మనస్తత్త్వాన్ని అర్థంచేసుకొని, వారి నలా సహజంగా వికసింపనిస్తేచాలును, కాని మన మందుకు పరమ విరుద్ధంగా ప్రవర్తించడం జరుగుతున్నది. శిశు మానసం ఒక అద్దుదు కాగితంవంటిదని మనస్తాత్త్వికులంటారు. ప్రక్కనున్న వానిని అప్రయత్నంగా గ్రహించడం అందులోని సహజ సిద్ధమైన గుణం.

అందువల్ల మనం పిల్లల కెంతో పరిశుద్ధ వాతావరణంలో పెరిగే అవకాశ మివ్వనినాడు, వారు మనలోని మాలిన్యాల నన్నిటిని కూడా తమ లోనికి పీల్చివేసుకుంటారు. స్వభావసిద్ధంగా నిర్మలమైన వారి చిత్తం చెడు నడవడులకు ఆకరమవుతుంది.

కుల మతాది విభిన్నతలను వారికి చిన్నతనంనుంచే మనం అదే పనిగా నూరిపోసి, వారిలోని సర్వసమతా దృష్టిని మలినపరుస్తున్నాము. ఇలా చేస్తున్నంతకాలం మన మెంతగా- ఆ ప్రసంగంలోనే రాధాకృష్ణ పండితులు వివరించినట్టు-సమైక్యం,

జాతీయతా భావం అని ఉపన్యాసా లిచ్చినా జరుగవలసిన అడ్డుకోతలు, నిలువు కోతల కార్యక్రమం యథావిధిగా కొనసాగుతూనే వుంటుంది.

సమైక్యాన్ని గూర్చి, కరుణార్ద్రతను గూర్చి, పరోపకార దృష్టిని గూర్చి మనం పసికుర్రలకు ఉపదేశించ నక్కరలేదు. వారిలో నిండి నిబిడీకృతంగా ఉన్న ఆ గుణపరంపరకు విఘాతం కల్గనిరీతిగా వారి నొక విధమైన స్వేచ్ఛా వాతావరణంలో, మామూలు, సామాజిక దుర్బలతలు కనబడనిచోట వుంచి పెంచగలగాలి.

అందుకనే అలనాటి గురుకులాలు, మున్యాశ్రమాలు విద్యా బోధన కనువైన తావులుగా ఉండినవి. నేడైనా అలాంటి వాతావరణం కలవిగా విద్యానికేతనాలను నడప వీలులేక పోలేదు.

ఇందు కెంత చిత్తశుద్ధితో మనం ప్రవర్తిస్తే అంతగా రానున్న తరాల వారినైనా ఈ విభిన్నతా విషదష్టులు కాకుండా కాపాడగలము.

నిజమే, కేవలం మానవతా దృష్టి కాని, విశ్వజనీన భావం కాని మనస్సంజనితమే కాదు. ఆ మనసెంతదైనా పరిసర ప్రభావ సంజుష్టం కాకుండా పెరగలేదు.

ఆ సత్యాన్నే డాక్టర్ రాధాకృష్ణన్ "నేడు ప్రపంచంలో జరుగుతున్న నేరాలన్నింటికి సాంఘిక నిర్బంధాలు, కష్ట పరంపరలు కారణ"మన్నారు.

అలాంటి పరిస్థితులలో పరివర్తనం కల్పించడం కూడా మానవశేవధి కావాలి. లోకంలోని దుఃఖం మనః క్లేశాలు మొదలైనవి ఒక్క మానసిక వేదనలే కావు, వానికి మూలం సాంఘిక వ్యవస్థలో, తన్ను మనిషిగా ఎదగనీని పరిసరాలలో ఎంతో కొంత వేరూని వుంటుంది.

సర్వసమానత భావనా మాత్రం కాదు. అందుకు ఆటంకాలైన సాంఘిక విభిన్నతలు రూపుమాపడం, కలిమిలేముల మధ్య నేడు పెరిగిపోతున్న ఏడు నిలువుల లోతుకందకం చేతనైనంత గబగబా పూడ్చి వేయడం అవసరం.

అటు మానసికంగా, ఇటు సాంఘికంగా మంచిని పెంచితే మనసు మానవతను పూస్తుంది. బాల్యంనుంచి వస్తున్న సద్గుణాలలా పెంపొంది, దుష్టతాదూరమై ఇహంలోనే పరంలోని పరమైత్కృష్టతను పంట వెడుతుంది. అదే నేటి అవసరం.

(ఆంధ్రజ్యోతి 4-8-1950)

ఖద్దరు సంస్కృతి



ఇటీవల నాకు ఖద్దరు సంస్కృతిపట్ల జుగుప్సపుడుతున్నది. అందువల్ల ఖద్దరు ధారణ మరి విరమించవలెనన్న నిర్ణయానికి వచ్చాను.

పండగలకు, పబ్బాలకు కొత్త బట్టలు కట్టుకొనే ఆచారాన్ని నేను పాటించను. నా జన్మదినం నాడైనా కొత్త బట్టలు కొనను, కుట్టుకోను. అయినా నాలుగు నెలల నాడు (డిసెంబరు 1, 1980) నా 73వ జన్మదినం సందర్భంలో కొత్త బట్టలు కొని కట్టుకొన్నాను. నాడు నేను కొన్నవీ, కట్టుకొన్నవీ మిల్లు బట్టలు.

1925 ప్రాంతాలలో అని జ్ఞాపకం - జవహర్లాల్ నెహ్రూ ఖద్దరును "లివరీ ఆఫ్ ఫ్రీడమ్" అని ప్రస్తుతించాడు. అందుకు గాంధీ ఎంతగానో మురిసిపోయాడు. అయితే ఈనాడు ఖద్దరు "లివరీ ఆఫ్ సర్విలిటీ"గా మారింది. ఈనాడు ఖద్దరు అనృతానికి, అక్రమానికి, అధర్మానికి ఆచ్ఛాదం. ఈనాడు ఖద్దరు కపటానికి, కుత్సితానికి, క్రౌర్యానికి కవచం. ఈనాడు ఖద్దరు నైచ్యానికి, స్వార్థానికి, ద్రోహానికి మేలిముసుగు.

ఇది ఒక్కసారి జరిగిన మార్పు కాదు. దాదాపు మూడు, నాలుగు దశాబ్దాలుగా ఇది కొనసాగుతున్నది. గాంధీ జీవిత కాలంలోనే నిజానికి ఇది ప్రారంభమైంది. ఇందిరా గాంధీ పరిపాలనా కాలంలో ఇది తారాస్థాయికి చేరినట్టు చెప్పవచ్చు.

ఖద్దరు వస్త్రధారుల మాట విడిచి పుచ్చండి. "కట్టేవి కాషాయ వస్త్రాలు, దూరేవి దొమ్మర గుడిసెలు" అనే సామెతను జ్ఞాపకం చేయగల విధంగా వారు బాహాటంగానే ప్రవర్తిస్తున్నారు. పోతే, ఖద్దరు ఉద్యమ నాయకులలోనే చెదురుగా తప్ప నిజం లేదు, నీతి లేదు, నిలకడ లేదు. ఖద్దరు ఉత్పత్తి కేంద్రాలలో, విక్రయ కేంద్రాలలో ఎన్నెన్నో దగాకోరు పనులు జరుగుతున్నాయి. తేనెలో బెల్లం పాకం కలపడం, దంపుడు బియ్యంలో రాళ్ళూ రప్పలూ కలపడం వగైరాలు వగైరాలు తరచు జరుగుతున్నాయి. ఈ మధ్యనే ఒక కేంద్రమంత్రి ఖద్దరు డిపో నుంచి సీమ బాదం పప్పు కొనగా, దానిలో ఏవేవో పప్పులు కలిసి ఉన్నవట.

ఇక ఖద్దరు టోపీని పెట్టుకునే వ్యక్తిని చేస్తే హడలిపోవలసి వస్తున్నది. వారిలో నూటికి 99 మంది "టోపీ దాసులు". వారు కాళ్ళకింద గోతిని తేలికగా తీయగలరు. కళ్లల్లో కారాన్ని దండిగా కొట్టగలరు. తిన్న ఇంటి వాసాలు తాపీగా లెక్కపెట్టగలరు. తడి గుడ్డతో గొంతు సునాయాసంగా కోయగలరు.

ఈనాటి మన నైతిక పతనానికి నిందించవలసింది ఒక్క ఖద్దరుధారులను మాత్రమే కాకపోవచ్చు; ఇతరులు వారికంటే తక్కువ నిందార్హులు కాకపోవచ్చు. కాని, ఒక్క విషయం మర్చిపోరాదు. ఈనాటి మన సంఘ నాయకులు, ప్రభుత్వ నాయకులు ఖద్దరుధారులే. అందువల్ల ఈనాటి మన నైతిక పతానవస్థకు ప్రధానంగా బాధ్యత వారిదే!

మట్టి నుంచి మహావీరులను గాంధీజీ సృష్టించినట్టు చెప్పడం కద్దు. అయితే వీరు తిరిగి మట్టిముద్దలుగా ఎన్నడో మారిపోయారు.

నేనిదివరలో ఒకసారి రాసినట్టు, గాంధీకి గోపాలకృష్ణ గోఖలే నైతికపు గురువు, గోఖలేకు మహదేవ గోవింద్ రణడే నైతికపు గురువు. ఒక జాతిగా మన నైతికపు పునరుజ్జీవనకే ఈ ముగ్గురూ అగ్రప్రాధాన్యమిచ్చారు.

ఫలితం మాత్రం - మన పునరుజ్జీవనం కాదు, మన నైతిక పతనం మాత్రమే. ఈ ముగ్గురు నాయకుల జీవితాలు వ్యర్థ జీవితాలుగా పరిణమించినవని చెప్పక తప్పదు.

ఈ విషయంలో గాంధీని ప్రత్యేకించి తప్పుపట్టవలసి ఉంటుంది. మానవ స్వభావంలో బలాలతోపాటు దౌర్బల్యాలు కూడా ఉంటాయి. ఈ దౌర్బల్యాలను దృష్టిలో పెట్టుకొనకుండా నైతిక ప్రమాణాలను నిర్ణయిస్తే, మన ప్రవర్తనలో, మన జీవితంలో కపటం విధిగా ప్రవేశిస్తుంది. ఉదాహరణకు గాంధీ కోరిన మేరకు ఎందరు సత్యాన్ని పాటించగలరు? ఎంతమంది ఆగ్రహాన్ని జయించగలరు? ఎంతమంది త్యాగాలు చేయగలరు? ఎంతమంది బ్రహ్మచర్య వ్రతాన్ని (పైగా, నాతిగల బ్రహ్మచర్యాన్ని అనుసరించగలరు?

మరొక గాంధీకి తప్ప ఆచరణ సాధ్యం కాని అత్యున్నత నైతిక ప్రమాణాలను ప్రజాస్వామ్యం ముందు పెట్టినందువల్లనే మన జాతీయ జీవనంలో కపటం విశేషంగా - కాదు, విపరీతంగాప్రవేశించింది. చివరికి గాంధీ సయితం తన నైతిక ప్రమాణాలను అన్ని సందర్భాలలో పూర్తిగా పాటించగలిగినట్టు నాకు తోచదు.

ఒకవేళ ఈ విషయంలో అభిప్రాయ భేదం ఉన్నా, ఒకటి మాత్రం నిశ్చయం. నేటి ఖద్దరుధారులలో అత్యధిక సంఖ్యాకులు సంఘానికి వేరు పురుగులుగా పరిణమించారు. ఏదో ఒక నడమే వీరికి ప్రధాన వ్యాపకమయింది. అన్నట్టు, వీరు ధరించే ఖద్దరు వస్త్రాల ధరలో ఎన్నదగ్గ భాగాన్ని ప్రజలు సబ్సిడీ రూపంలో భరించవలసి వస్తున్నది. ఏమైనా, నీతి, నిజాయితీల పట్ల ఇప్పటికైనా కొంత గౌరవమున్నవారు ఖద్దరును ధరించడం వెంటనే మానివేయాలి. ఒకప్పుడు విదేశీ వస్త్ర దహనం ఒక ఉద్యమంగా సాగింది. యువకులెవరైనా ఖద్దరు వస్త్ర దహనానికి ఉద్యమం ప్రారంభిస్తే వారికి నైతిక ప్రోత్సాహం పూర్తిగా లభిస్తుంది.

నేను సూచిస్తున్న ఉద్యమం ద్వారా తప్ప ఇప్పటి ఖద్దరు సంస్కృతికి - స్వార్థం, కపటం, నైచ్యం మొదలైన దుష్టగుణాలన్నింటికి ప్రతీకగా నిలుస్తున్న ఖద్దరు సంస్కృతికి - అంత్యక్రియలు

(మిసిమి మాసపత్రిక మార్చి 1991 పునర్ముద్రిత వ్యాసం)

మన పట్నాలు - నగరాలు

1 ప్రాగ్జ్యోతిషపురం
2 విజయనగరం
3 తణుకు
4 మచిలీపట్నము
5. ఏలూరు
6 గుంటూరు
7 విశాఖపట్నం
8 నెల్లూరు
9 విజయవాడ
10 ఓజియాన్ అశ్వశాలలు

ప్రాగ్జ్యోతిషపురం






15
Barpeta Road
Bijni
Howly
Nalbari
Pragjyotishpur
Police Station
Pragjyotishpura
Barpeta
Pragjyotish Nagar
Pragjyotishpur
Jagiroad
27
29
Dudhnoi
17
Hojai
627
Lanka
627
217
127B
Shillong
106
6
Jowai
627
627



పురాణేతిహాసాలలో మాత్రమే మిగిలిన ప్రాగ్జ్యోతిషపురం కళ్ళు నలుముకుంటూ, వొళ్ళు విరుచుకుంటూ, శతాబ్దాల గాఢ సుషుప్తి నుంచి తిరిగి మేల్కొన్నది. 63 ఏనుగుల ఊరేగింపుతో అఖిలభారత కాంగ్రెస్ 63వ మహాసభకు అధ్యక్షత వహించడానికి నిన్న (14వ తేదీ మంగళవారంనాడు) శ్రీ దేబర్ ప్రాగ్జ్యోతిషపురంలో అశేష ప్రజానీకం ఆనందోత్సవాల మధ్య ప్రవేశించడంతో బ్రహ్మపుత్రా నదీతీరంలో కంకాళంగా మాత్రమే నిలిచిన ఆ ప్రాచీన నగరానికి తిరిగి కళాకాంతు లబ్బినవి.


Dah Parbatiya

వేల సంవత్సరాలు వెనుకకు విస్తరిస్తున్న చరిత్రతో కూడుకున్నది ప్రాగ్జ్యోతిషపురం. కురుక్షేత్ర సంగ్రామానికి ఈ పురం నుంచి పాండవుల పక్షాన పోరాడ్డానికి కుమార భాస్కరవర్మ తన సైన్యాలతో బయల్దేరి వెళ్ళాడు. కామరూప రాజ్యానికి రాజధానిగా విలసిల్లిన ఈ పురంలో అతి ప్రాచీన కాలంలో ప్రతిష్ఠించబడిన కామాక్ష్యాదేవి నేటికీ పూజలందుకొంటున్నది. నేటికీ మన గ్రామాలలో వీది నాటక రూపంలో మనం చూస్తున్న "ఉషా పరిణయం" జరిగింది ఈ పురంలోనే. అనిరుద్ధునికి రెండు తరాలకు ముందు ఈ పురం దాటి వెళ్లే అర్జునుడు మణిపురం రాకుమారి చిత్రాంగదను వివాహ మాడాడు. ఈ పుర ప్రాంగణంలోనే అహోంరాజులు తమపై దండెత్తివచ్చిన మొగల్ సేనలను ఓడించారు.

ఆదిలో నరకాసురుడు స్థాపించిన ప్రాగ్జ్యోతిషపురంలో నరజాతి చరిత్ర నిమ్నోన్నతాలను పెక్కింటిని చూచింది. ఈ పూర్వ చరిత్రను ఒకసారి సంస్మరించుకొనడం అఖిలభారత కాంగ్రెసు సంస్థ 63వ సమావేశంలో పాల్గొంటున్న ప్రతి నిధులకు ఎంత అవసరమో, కనీసం మరొక శతాబ్దం వరకైనా దేశ నాయకత్వాన్ని కాంగ్రెసుకు నిలపడానికి తగు విధానాలను నిర్ణయించడం పట్ల శ్రద్ధ వహించడం కూడా అంత ముఖ్యం.

శిథిలమై పోకుండా ప్రాగ్జ్యోతిషపురాన్ని దాని ప్రాచీన వైభవం కాపాడలేదు. అదే విధంగా కాంగ్రెసు సంస్థను దాని ప్రస్తుత ప్రతిష్ఠ కలకాలానికీ కాపాడలేదు. ఎప్పటి కప్పుడు కాలానుగుణమైన లక్ష్యాలద్వారా, ప్రజామోదకరమైన విధానాల ద్వారా, స్వార్థ మెరుగని సేవ ద్వారా నవశక్తిని, నూతనోత్తేజాన్ని సముపార్జించుకున్నప్పుడే ఏ సంస్థకైనా భవిష్యత్తు ఉంటుంది. చైనాలో కోమింగ్‌ంగ్ ఈ నగ్నసత్యాన్ని మరచి పోబట్టే అది నేడు నామమాత్రంగా మిగిలింది. కాంగ్రెసుకు చెందిన వారు ఈ పొరపాటు చేయబోరనే మేము విశ్వసిస్తున్నాము.



నేడు ఏయే సమస్యలు ప్రధానమైనవో, వేటిపై ప్రాగ్జ్యోతిషపుర కాంగ్రెసు మహాసభ తన దృష్టిని కేంద్రీకరించాలో కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ దేబర్ నిన్న సూచించారు. ఆయన సూచన ప్రకారం భూ స్వామ్య సంస్కరణలను త్వరలో అమలు జరపడం, ఆహారోత్పత్తిని అధికం చేయడం - ఇవి నేటి

అతిముఖ్య సమస్యలు. ఇంత ముఖ్యమైనవి కాకపోయినా, అధికార భాషా సమస్య, పారిశ్రామికాభివృద్ధి సమస్య, గ్రామోద్ధరణ సమస్య మొదలైనవి కూడా ప్రధానమైనవే. ఈ సమస్యల విషయంలో - ముఖ్యంగా భూస్వామ్య సంస్కరణల విషయమై ఏకాభిప్రాయ సాధన కష్టమే. వివాదాస్పదమైన ఇలాంటి విషయాలలో ఏకాభిప్రాయాన్ని సాధించగల వరకు వేచి ఉంటే ఏ సంస్కరణ అమలు జరగబోదు.




ప్రజాస్వామ్యబద్ధమైన సోషలిజం తన పరమలక్ష్యంగా ఆవడి మహాసభలో కాంగ్రెసు తీర్మానించింది. ఆవడి తీర్మానంలో అస్పష్టత ఏదైనా ఉంటే, దాన్ని ఇండోర్ కాంగ్రెసు మహాసభ తొలగించింది. ప్రజాస్వామ్య బద్ధమైన సోషలిస్టు సమాజాన్ని నెలకొల్పడానికి అవసరమైన ప్రతి సంస్కరణను - (మైనారిటీ వర్గానికి చెందిన కొందరు వ్యతిరేకించినా సరే) అమలు జరిపినప్పుడే కాంగ్రెసు ప్రతిష్ఠ నిలుస్తుంది; అప్పుడే దానికి భవిష్యత్తు ఉంటుంది. ప్రాగ్జ్యోతిషపురంలో సమావేశమౌతున్న కాంగ్రెసు ప్రతినిధులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే వ్యవహరించగలరని ఆశిస్తున్నాము.

(ఆంధ్రప్రభ 16-1-1958)

విజయనగరం






MIMS
Hospital
YSR Nagar
YSR నగర్
Neelamrajupeta
నీలంరాజుపేట
516E
110
Vizianagaram
విజయనగరం
43
26
Jonnavalasa
జొన్నవలస
117
147
Denkada
డెంకాడ
Sarika
సరిక
Malicherla
మలిచెర్ల
132
Pedathadivada
పెదతడివాడ
143
Ramanarayanam
Nerellavalasa
నేరెల్లవలస
Chintalavalasa
చింతలవలస
37





స్వతంత్ర ప్రవృత్తికి, సాహ సౌదార్యాలకు, సాహిత్యాభిమానానికి, కళాపోషణకు విఖ్యాతినందిన గజపతిరాజులు సంస్థాపించిన నగరమైనందున ఆది నుంచీ విజయనగరం ఆంధ్ర చరిత్రలో, సంస్కృతిలో ప్రముఖ పాత్ర వహిస్తున్నది.

క్రీస్తుశకం 1715 ప్రాంతాల కుమిలి (కుంభిళాపురం) నుంచి విజయనగరానికి తమ రాజధానిని మార్చడానికి నిర్ణయించిన గజపతి రాజులు అంతకు ముందు కనీసం ఒక వెయ్యి సంవత్సరాలుగా ఆంధ్ర జీవితంపై తమ ముద్రను బలంగా వేస్తూ వచ్చినవారే. జనశ్రుతి ప్రకారం వారి మూల పురుషుడు శ్రీ బుద్ధవర్మ. జనశ్రుతిని కాక, చరిత్రనే పరిగణనలోకి తీసుకొంటే, క్రీస్తుశకం 592లో రాజస్తాన్ నుంచి బెజవాడ ప్రాంతాలకు వలస వచ్చిన శ్రీ మాధవవర్మ వారి మూలపురుషుడు. 1540 నాటి "కృష్ణ విజయ" కావ్యం ఇందు కొక ప్రధానాధారం కాగా, పంచతంత్రం మరొకటి.

బెజవాడ కేంద్రంగా శ్రీ మాధవవర్మ క్రీస్తు శకం ఆరవ శతాబ్దిలో సంస్థాపించిన రాజ్యానికి పద్దెనిమిదవ శతాబ్దంలో విజయనగరం ఏ విధంగా రాజధాని నగరమైందో వివరించాలంటే, సహస్రాబ్దాలకు మించిన ఆంధ్రదేశ చరిత్రను సమీక్షించవలసి వస్తుంది. ఆ పెద్ద ప్రయత్నాన్ని మేము చేయబోవడం లేదుగాని, గజపతి రాజవంశానికి సంబంధించిన కొన్ని విశేషాలివి :

బెజవాడ కనకదుర్గ గజపతి రాజులకు కులదేవత.



వీరి పూర్వీకులలో ఒకరైన అమలరాజు కొంతకాలంపాటు పూసపాడు గ్రామాన్ని తన ప్రధాన కేంద్రంగా చేసుకొన్నందున వీరి ఇంటిపేరు “పూసపాటి” అయిందని ప్రతీతి.

పూసపాటివారైన పిదప వీరు ఒరిస్సా రాజు నుంచి ఇప్పటి విశాఖ, శ్రీకాకుళం జిల్లాల ప్రాంతంలో జాగీర్లను పొందినారట. ఆ సందర్భంలోనే బెజవాడ ప్రాంతం నుంచి అక్కడికి వీరి కుటుంబం తరలి వెళ్ళిందట.

మొగల్ పాదుష లేమి, గోల్కొండ నవాబు లేమి గజపతి రాజులు శక్తిసామర్థ్యాలను గుర్తించి “రాజా” “మాన్యసుల్తాన్” “మీర్జా” మొదలైన బిరుదు లిచ్చి సన్మానించారు.

నందపు రాధీశ్వరుడైన గజపతి రాజును జయించిన తర్వాత పూసపాటి వారికి “గజపతి” గౌరవ నామమైందట.

రెండవ రాచరాజు పదహారవ శతాబ్దం ప్రారంభంలో అప్పుడు ఒరిస్సాను పరిపాలిస్తున్న ప్రతాపరుద్ర గజపతి కుమార్తెను వివాహ మాడినాడు. ఈ రాజు పెద్ద కుమార్తెనే కృష్ణదేవరాయలు వివాహమాడినందున వారిద్దరు తోడల్లుళ్ళు.



"ప్రయివేట్ సర్క్యులేషన్ కోసమే" అనే షరతుతో 1917లో ప్రచురించబడిన విజయనగర సంస్థాన చరిత్ర నుంచి కావాలంటే మరెన్ని విశేషాలనైనా పేర్కొనవచ్చుగాని, గజపతిరాజులు ఆంధ్ర చరిత్రలో ఎంత ప్రముఖ పాత్ర వహించారో ఈ సరికే తగినంతగా సూచించ గలిగినామని భావిస్తున్నాము.

"ధర్మ సంస్తానం" గా పేరందినట్టిది విజయనగర సంస్థానం. దీనికి ఈ ప్రఖ్యాతిని కూర్చినవారిలో ప్రముఖంగా పేర్కొనదగువారు మూడవ విజయరామరాజు, ఆయన పిమ్మట రాజ్యానికి వచ్చిన ఆనంద గజపతి. వీరుభయులు పోషించని సదుద్యమంలేదు. ఆనంద గజపతి కవి పండితుల పోషకుడు మాత్రమే కాదు; ఆయన స్వయంగా బహు భాషా కోవిదుడు; కవి, రసజ్ఞుడు. మాక్స్ ముల్లర్ వేదాలను ప్రచురించడానికి ఆర్థిక సహాయాన్ని చేసింది ఆనంద గజపతి. సంస్కృత నిఘంటువు "వాచస్పత్యం" ఆయన ఆదరాభిమానాలతోనే వెలువడింది. "విజయనగరం సంస్కృత గ్రంథమాల" సంస్థాపనకు, పెక్కు అముద్రిత గ్రంథాల ప్రచురణకు ఆయన ప్రోత్సాహమే మూలం. "హిందూ" పత్రిక సంస్థాపనకు సయితం ఆయన విశేషంగా తోడ్పడ్డాడు.


నవ్యాంధ్ర, గజపతి రాజులకు ఎంతగా రుణపడి ఉన్నదో తెలపడానికి శ్రీ గురజాడ అప్పారావు, ప్రొఫెసర్ కోడి రామమూర్తి, ద్వారం వెంకట స్వామినాయుడు మొదలైనవారందరు - వేర్వేరు రంగాలలో ఆంధ్రజాతికి పూజనీయులైన ప్రముఖు లందరు - విజయనగర సంస్థానం పోషణలో నున్నవారేనని చెబితే సరిపోతుంది!


ఈనాటి స్వతంత్ర భారతంలో, ఈ ప్రజాస్వామ్య యుగంలో విజయనగరం తన పూర్వ కీర్తికి, ప్రతిష్టకు తగు మహోన్నత పాత్రను నిర్వహించగలదనే విశ్వాసం మాకున్నది, నేడు ఎన్ని రంగాలలో ఎంతగా అది పురోగతిని సాధిస్తున్నదో ఈనాటి మా ప్రత్యేక సంచిక స్థూలంగా తెలియజేస్తున్నదని మా మనవి. (ఆంధ్రజ్యోతి)



తణుకు




Tripadvisor


Sri Dommeti...
Temporarily closed
Municipal
park tanuku
Sajjapuram Park
Tanuku
తణుకు
NTR Park Tanuku
Municipality
Sri Kodan
Ramalaya
Sree lalitha travels
Srimadkshakari
Kshetram,sbi Road...
157
Andhra Sugars
new park
Sree







తణుకు ప్రాచీన నామం "తారకాపురం" కాగా, దాని ఆధునిక నామం "తళుకు" అని చెప్పవచ్చు. కావడానికి చిన్నదైనా, అది నిజంగా తళుకు బెళుకులున్న పట్టణం; కాలంతోపాటు మారుతున్న పట్టణం; ఆంధ్రప్రదేశ్కు ఒక మాంచెస్టర్గానో, బర్మింగ్ హాంగానో వర్ధిల్లగలదన్న ఆశలను రేకెత్తిస్తున్న పట్టణం.

పౌరాణిక కాలం నుంచి, వర్తమానం వరకు ఆంధ్ర చరిత్రలో తణుకు దొక ప్రముఖ స్థానమే. విశిష్ట స్థానమే. స్థల పురాణం ప్రకారం అది ఒకనాడు తారకాసురునికి రాజధాని. స్థల పురాణానికి చారిత్రకపు విలువ తక్కువని భావించినప్పటికీ, క్రీస్తుశకం పదకొండవ శతాబ్దినాటికే తణుకు సుప్రసిద్ధమైన పట్టణం. శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజు నేటి ప్రత్యేక సంచికలో మేము మరొక పుటలో ప్రచురిస్తున్న తమ వ్యాసంలో వివరించినట్లు, ఈ విషయాన్ని ప్రాచీన శాసనాలేమి, గ్రంథాలేమి పూర్తిగా రుజువు చేస్తున్నాయి.

నన్నయ ఎక్కడ పుట్టినాడో స్పష్టంగా చెప్పలేముగాని, ఆయన తణుకులో మెట్టినాడనడానికి సందేహించ నక్కరలేదు. తణుకు పట్టణానికి కంఠాభరణంగా చెప్పదగు గోస్తనీ నదీ తీరంలో నన్నయ యజ్ఞం చేసినట్లు ఒక ప్రాచీన తాళపత్ర గ్రంథం (శ్రీ పట్టమట్ట సరస్వతి సోమయాజి రచించిన "పృథు చరిత్రము) రుజువు చేస్తున్నది.



ఆదికవితోనే తణుకు పట్టణానికి ఆంధ్ర సాహిత్యంతో ప్రారంభమైన సన్నిహిత సంబంధం అధునాతనకాలం వరకు అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే వస్తున్నది. నవ్యాంధ్ర సాహిత్య నిర్మాతలలో ప్రముఖులైన పెక్కుమంది (శ్రీ పానుగంటి లక్ష్మీ నరసింహారావు, వేంకట పార్వతీశ్వరకవులు, శ్రీ చిలుకూరి వీరభద్రరావు, పండిత సత్యనారాయణరాజు ప్రభృతులు) తమకు కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిన రచనలను తణుకులోనే చేశారు. ఇంతేకాదు "నేటికి తణ్కులోన రమణీయ కవిత్వము చెప్పువారు, వాగ్ధాటి కలట్టివారు, రస తన్మయులై నవనాట్య వైఖరుల్ జాటకలట్టివారు, బుధసత్తము లింకను" ఎంద రెందరో ఉన్నారు.

తణుకు ఇటీవలి చరిత్రలో ఎన్నదగు ముఖ్య పరిణామం, - ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా అది రాణించడం. వ్యవసాయంలో ఇదివరలోనే దానికి పేరు ప్రతిష్ఠలున్నాయి; ఇప్పుడు పరిశ్రమలలో కూడా అది ముందుడుగు వేస్తున్నది.



తణుకు “మెయిన్ రైల్వేలైన్"పై లేదు; అక్కడ ఖనిజ సంపత్తి లభించదు. అయినా, వ్యవసాయ సంపత్తి విశేషం. ఆ పట్టణంలోనే కాక, దాని పరిసర ప్రాంతాలలో కూడా చెరకు విశేషంగా పండుతుంది. ప్రత్తిని కూడా అక్కడ పండించవచ్చు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయోత్పత్తులను ముడి వస్తువులుగా వినియోగించుకొనే పరిశ్రమలను ప్రారంభించబట్టే పారిశ్రామిక రంగంలో అది అనతికాలంలోనే ఎంతో పురోగతిని సాధించగలిగింది.




తణుకును గురించి ప్రస్తావించే సందర్భంలో ముళ్ళపూడివారి కుటుంబాన్ని ఎవరైనా ముఖ్యంగా పేర్కొనవలసి ఉంటుంది. మూడు నాలుగు తరాలుగా ఆ పట్టణం సర్వతోముఖాభివృద్ధికి, కుటుంబంవారు చేసిన - చేస్తున్న సేవ ఇంతంత కాదు. నేడు అక్కడున్న పారిశ్రామిక సంస్థలలో అత్యధిక భాగం వారివే; అక్కడున్న విద్యా సంస్థలలో, ఇతర ప్రజాహిత సంస్థలలో దాదాపు అన్నీ వారు సంస్థాపించినట్టివే. డెట్రాయిట్ పురోభివృద్ధిలో ఫోర్డ్ కుటుంబం పాత్రతో పోల్చదగినట్టిదే తణుకు విషయంలో ముళ్ళపూడి వారి కుటుంబం పాత్ర.

అభ్యుదయ పథంలో ఇప్పటికే ఎంతో ముందుకు సాగిన తణుకు పట్టణం మున్ముందు మరింతగా పురోగమించి, ఒక ప్రధాన నగరంగా విలసిల్ల గలదని ఆశిస్తున్నాము. (ఆంధ్రజ్యోతి 30-12-1961)

మచిలీపట్టణం






Bandar Fort
బందరు కోట
Krishna University
కృష్ణా విశ్వవిద్యాలయం
Machilipatnam Beach
మచిలీపట్నం బీచ్
340
106
Kona
కోన
103
Google







ఒకొక్క నగరానికొకొక్క విశిష్టత ఉంటుంది; ఒకొక్క పట్టణానికొకొక్క విలక్షణత ఉంటుంది. కాని, అలాంటి వనేకం కల పురవరం మచిలీపట్టణం.

అలనాడేనాడో క్రీస్తుశకం తొలి, మలి శతాబ్దులలోనే ప్రసిద్ధ నౌకాశ్రయమై, నౌకా నిర్మాణ కేంద్రమై అలరారినది బందరు.

ఆ రేవునుంచి అన్య దేశాలకు మన రత్న గర్భ సమకూర్చిన సహజ సంపదలతో, మన కళాకారులు, శిల్పులు సమకూర్చిన అపూర్వ వస్తుసంపత్తితో అటు పశ్చిమానికి, ఇటు తూర్పునకు కడలిపై ఓడలలో పయనించి భారతదేశం సర్వ సంపత్సమృద్ధంగా విలసిల్ల జేయుటలో చేయూత నిచ్చిన నౌకా నిర్మాతల కది పేరందిన నాడు.

అలనాడే కాక, పదిహేడవ శతాబ్ది తొలి యేళ్ళలో అడుగిడిన ఆంగ్లేయులకు, పరాసు వారికి, ఒళందులకు కూడ వ్యాపార కేంద్రమై విలసిల్లినది ఆ రేవు పట్టణం.

మజ్లిన్లు, రత్నకంబళ్ళు, అనేక చిత్ర, శిల్ప కళాఖండాలు నేల నాలుగు చెరగులకు వెళ్ళి, ఆంధ్ర కళా గరిమకు లోకం నివాళులర్పించుటకీ పురవరమెంత తోడ్పడినదో!



అప్పుడే కాదు, జాతీయోద్యమ పూర్వ రంగంగా వెల్లివిరిసిన సాంస్కృతిక వికసనోద్యమానికిది పెట్టని కోటయై రాణించినది. జాతీయోద్యమ మహా వటవృక్ష చ్చాయలో ముమ్మూర్తులా తెనుగుదనం నింపుకొని మహోత్తమ ప్రరోహాల నెన్నిటినో వర్ధిల్ల జేసిన దీనగరం.

శ్రీ కోపల్లె హనుమంతరావు, శ్రీ ముట్నూరి కృష్ణారావు వంటి అనేక మహామహుల మనుగడలతో సురభిళమై, సభ్యతా సుగంధబంధురతను తెనుగులకు సమకూర్చి పెట్టిన తావిది. శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడువంటి వారి విజ్ఞాన చంద్రిక లిక్కడ చలువలు వెదజల్లినవి.

శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యవంటి భారత జాతీయ నాయక మేధావుల కిది పుట్టినిల్లు. ఆధునిక కవిత్వ పునరుజ్జీవన ప్రపితామహుల వంటి చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి కవితకు రంగస్థల మిది.



జాతీయ కళాశాలవంటి విద్యా, విజ్ఞాన, కళాకేంద్రాలకు నిలయమై ఆంధ్ర కళాప్రతిభకు పూత పట్టించిన పుణ్యభూమి ఇది. ఆంధ్ర నాటక రంగస్థలం అపూర్వ వికాస మందుటకు ఆలవాలమైన గడ్డ ఇది. తొలు దొల్తవెలసిన ఆధునిక విద్యా సంస్థలకు నోచుకున్న నేల ఇది.



తెనుగు మనసులోని మంచిని పెంచిన ఈ తావు ఆనాటికి, ఈనాటికి కూడా సాహిత్య, కళా కేంద్రమే.

అంతేకాదు, ఆధునిక నగరాలతోపాటు అభ్యుదయ పథ ప్రస్థానం చేసి అపార పారిశ్రామిక కేంద్రం కాగల అన్ని హంగులున్న పట్టణం.

కేంద్రం చిన్నచూపు చూడక, చిన్న రేవుల అభివృద్ధి పథకంలో తగిన తావిచ్చి అభివృద్ధి పరిస్తే తిరిగి ఇదొక రేపుగా, తన విశిష్టత వెలార్చే పడవల నిర్మాణ కేంద్రంగా రూపొందగలదు.


ఇపుడిపుడే రూపొందుతున్న పారిశ్రామిక వాటికా నిర్మాణ ప్రయత్నం గబగబా సాగితే, అక్కడి తివాచీ, కలంకారీ పరిశ్రమల వంటివి పెంపొందితే అన్నిటా సర్వసమగ్రత నందుకొని ఆధునిక నగరం కాగలదు.




అందుకు తగిన వాతావరణ మేర్పడినది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకార సానుభూతులు అక్కడి ప్రజల సంకల్పబలం తోడై త్వరత్వరగా ఈ దారిని కృషి కొనసాగి, ఆధునిక మహాంధ్ర నగరాలలో ఇదొక విశిష్ట విలక్షణ పుర ప్రముఖమై వెలుగొందగలదని మా సంపూర్ణ విశ్వాసం.

(ఆంధ్రజ్యోతి 29-10-1996)

ఏలూరు






NETAJI NAGAR
NNR Kalyana Mandapam
Sanivarapupeta
శనివారపుపేట
Lemon market eluru
Sri Surya Convention Hall
Saradhi Grand Function Hall
D Mart Eluru
POWERPET
Hearing Solutions Eluru
Eluru
ఏలూరు
New Sri Durga Lodge
Hotel N
AK PLAZA
CMR Shopping Mall
Kaikalur Rd
SOUTHEN STREET
VENNA VALLI VARI PETA
HANUMAN NAGAR
VENKATAPURAM
SAI NAGAR
Madepalli Bus Stop
80
258
79
260







ఎక్కడి క్రీస్తుశకం నాల్గవశతాబ్ది! ఎప్పటి శాలంకాయనులు! ఎక్కడి వేంగిరాజ్యం. ఎప్పటి వేంగినగరం!

ఏలూరు పట్టణ ప్రాచీనతను తలపోసుకొన్న కొలది ఎంతదూరం వెనుకకు వెడిపోతున్నామని! హేలాపురికి అంచుపొంచుల నున్నదే వేంగి. నేటికది పెదవేగి, చినవేగి అనే చిన్న పల్లెలరూపంలో శిథిలావశిష్టమైనా ఆ పదిహేను, పదహారు శతాబ్దులకు ముందు మహా వైభవోపేతమై, శాలంకాయన పాలకుల ఏలుబడిలో ఆంధ్ర మహారాజ్యానికి రాజధానిగా పేరందిన పట్టణం.

పదవ శతాబ్దం ప్రారంభంలో మొదటి అమ్మరాజ విష్ణువర్ధనుని కాలంలో తూర్పు చాళుక్యరాజులు తమ ఆంధ్రరాజధానిని రాజమహేంద్రవరానికి మార్చుకునే దాకావేగి ఎంత వైభవ ప్రాభవాలతో వెలిగిపోయినదో!



ఆ చుట్టుపట్టనున్న బౌద్ధారామంలోనే దిజ్నాగునివంటి మహోత్తమకవి శేఖరుడు కుందమాలతో అందాలుచిందించిన లలితాతి లలిత పదోల్లసిత కవితా ప్రాభవుడు తన తుదిరోజులు గడపెనన్న ప్రథ ఆ ప్రాంతసాహితీ ప్రగతి, ప్రాచీనతలకు తార్కాణం కదా?

అపురూపమైన చేతి పనితనంలో మధ్యాసియా ప్రాంతం నుంచి వచ్చి నిలిచిపోయిన తివాచీల పరిశ్రమ పదిహేనవ శతాబ్దినాటికే ఏలూరులో ఎమ్మెలు వోయినది. తరతరాలుగా మురువులు సూపుతున్న ఉన్ని తివాచీల నవనవోన్మేష హస్తకౌశల ప్రావీణ్యం నాటికి, నేటికి అక్కడి సౌందర్య రసపిపాసకు పరాకాష్ఠగా పరువము సూపుతున్నది.




సంయమం, విగ్రహం, అపార దేశభక్తి, అసాధారణ ప్రతిభా సంపత్తి, ఆంధ్ర విశిష్టతా ముద్రపై అనూనాను రక్తిగల శ్రీ మోచర్ల రామచంద్రరావు వంటి మహానాయకులీ నగరం మొగసాలలో కొలువుదీరి నాటి అభ్యుదయ సాధనలో నవ నవోత్సాహంతో పాల్గొని ఈ పట్టణానికి అఖిలభారత ఖ్యాతి నార్జించి పెట్టినారు. నాటినుండి ఆ సంప్రదాయలా అక్కడి రాచరికపు పోకడలలో విగ్రహానికి, సంయమానికి ఒక విధమైన విచక్షణ తోడి విలక్షణతకు ఆలవాలమై నెగడుతున్నది. అలనాటినుండి నేటి దనుక అటు సాంఘిక పునరుజ్జీవనంలో, సాహిత్య వికసన పునరున్మేషంలో, కవితా శుకపిక కలకూజిత ప్రకాశనంలో అదొక విశిష్టతగల పురప్రముఖంగా, తెనుగునాడునకు తిలకాయమానంగా వర్ధిల్లుతున్నది. అది హేలాపురి.



అభినవ భారత ప్రగతి పథప్రయాణంలో తన పాత్రను తను నిర్వర్తింప నిశ్చితమనస్కయై ఆ నగరం. నేడు పారిశ్రామిక వాటికలతో, పరిశ్రమలకు కాణాచి కాగల దారిలో పడి ముందు కదుగిడుతున్నది.

తగినంత అర్థబలం, అంగబలం చేకూర్చుకొనడంలో ప్రభుత్వ సహాయ సహకారాలను సమకూర్చుకొని త్వరత్వరగా అదొక ఆధునిక మహానగరంగా విలసిల్లనున్నది.





అందుకు తగిన అపార సదుపాయ సంపత్తి కలది కనుకనే, మరింత దోహదం సముపార్జించుకొన, మరింత వేగంతో అభ్యుదయ పథంలో నడిచి రెక్కలు విప్పుకొని మరింత విస్తరించ గలదని మా విశ్వాసం. సాహితీ, కవితా, రంగస్థల ప్రశస్తితో మరింత కళావిదగ్ధ తను నలుమూలలా గుబాళింపజేయగలదని మా ఆశ.

(ఆంధ్రజ్యోతి 7-9-1961)

గుంటూరు







కంతేరు
16
Lam
లామ్
49
1
48
28
143
Pedakakani
పెదకాకాని
Perecherla
పేరేచర్ల
47
196
Guntur
గుంటూరు
105
Uppalapadu
ఉప్పలపాడు
Nallapadu
నల్లపాడు
255
16
Etukuru
ఏటుకూరు
Budampadu
బుడంపాడు
7
Pulladigunta
పుల్లడిగుంట
40
Vadlamudi
వడ్లమూడి
Narakoduru
నారాకోడూరు
141
155
Chebrolu





ఎంతటి ప్రాచీనమైనది గుంటూరు! అయినా, ఎంతటి అధునాతన నగరమది! మధ్య మధ్య కొన్ని ఘట్టాలలో అరాజకానికి, అల్లకల్లోలానికి లోనైనా, 1823 లో ఒకసారి అగ్ని ప్రమాదానికిలోనై, దాదాపు పూర్తిగా భస్మీపటలమై పోయినా, మొత్తంపై నిరంతరాయంగా అది పురోగమిస్తున్నది; కాలానుగుణంగా అది పరివర్తనం చెందుతున్నది.

మహాకవిగా మహోజ్వలకీర్తి నార్జించింది మరొక స్థలంలోనైనా, గుంటూరురో పుట్టి, గుంటూరులో పెరిగిన తిక్కన సోమయాజి ఈనాటి గుంటూరు బాహ్యాకృతిని చూచి, దాన్ని తన జన్మస్థానంగా గుర్తించలేకపోవచ్చు. కాని, అక్కడి వాతావరణం ముఖ్యంగా ఆ వాతావరణంలోని విద్యాగంధం, దానిలోని వైజ్ఞానిక కాంతిపుంజం “ఇది నా వూరు” అని నేటికీ ఆయనచే సగర్వంగా పలికించి గలదనడంలో మాత్రం సందేహంలేదు.

తిక్కనతో ప్రారంభమైన హరిహరనాథ మతం మొదలుకొని, ఎన్నెన్ని మహోద్యమాలకు గుంటూరు కీలక కేంద్రమైనదో లెక్కలేదు. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగా రుద్ఘాటించినట్టు "సకలోద్యమ వ్యాప్తి కకలంక నిలయమై, శరణిచ్చుపురము గుంటూరు పురము" నేటి ప్రత్యేక సంచికలో ఒక వ్యాసం వివరిస్తున్నట్టు, ఆంధ్రోద్యమానికి అంకురార్పణ జరిగింది గుంటూరులోనే. ఎన్నో



మహోద్యమాలవలె, ఎందరెందరో మహానాయకులు కూడా గుంటూరలో తలయెత్తారు. నవయుగానికి సంబంధించినంత వరకు ఈ మహా నాయకులలో ప్రత్యేకించి సంస్మరించదగినవారు - దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారు. ఈయన మూర్తి గభీరమైనదికాదు; ఈయన వాక్కుస్ఫుటమైనదైనా కాదు. చూపులకు అతి సామాన్యునివలె కానవచ్చేవారు. కాని, ఎంతటి చిత్తశుద్ధి! ఎంతటి కార్యదీక్ష! తాను నమ్మిన దానికై ఎంతగా ఆత్మార్పణ! సహజంగా ఈయన శాంత స్వభావుడు. కాని, ధర్మవేశం కలిగినప్పుడు ఈయన నిప్పులు చెరిగే అగ్ని పర్వతం! ఇంతలో కన్నుల నీరు నించడం, ఇంతలో కళ్ళవెంట నిప్పులు కురిపించడం ఈయనకే చెల్లేది!





ఆంధ్రోద్యం మొదలు, స్వరాజ్య సాధనోద్యమం వరకు వెంకటప్పయ్య పంతులుగారు పాల్గొనని ప్రజోద్యమంలేదు. ఒక విధంగా ఆయన జీవితమే ఆధునిక యుగంలో గుంటూరు చరిత్ర; అదే నవ్యాంధ్ర చరిత్ర కూడా.

గుంటూరును గురించి మనం చెప్పుకోదగినవి కేవలం పాత గొప్పలే కాదు; స్వతంత్ర భారతంలో కూడా, నవ్యాంధ్రలో కూడా అది తన గత చరిత్రకు తగు సముజ్జ్వలపాత్రను నిర్వహిస్తున్నది. తక్కిన రంగాలోనైనా గుంటూరు పాత్ర సామాన్యమైనది కాదు గాని, విద్యారంగానికి సంబంధించినంత వరకు ఆంధ్రప్రదేశ్లో దానికి అదేసాటి. ఈ సారి ఆంధ్రప్రదేశ్లో నెలకొనగల విశ్వ విద్యాలయానికి అదే కేంద్రంకావాలి.





నాగార్జున విశ్వ విద్యాలయాన్ని ప్రారంభించే సంకల్పం తమకు కలదని ఆంధ్రప్రదేశ్ విద్యామంత్రి ఈ మధ్య ఎక్కడనో ప్రకటించినట్టు మాకు జ్ఞాపకం. నాగార్జునాచార్యుని పేరు పెట్టినా, మరొకరి పేరుపెట్టినా, ఈ కొత్త విశ్వవిద్యాలయానికి తగు కేంద్రం గుంటూరు నగరమే!






వర్తక వాణిజ్యాలలో ఇప్పుడే ప్రముఖ స్థానాన్ని వహిస్తున్న గుంటూరు - ముఖ్యంగా వాణిజ్యపు పంటల ఎగుమతుల విషయంలో భారతదేశం మొత్తం మీదనే ఎన్నికకు రాగల గుంటూరుఅచిరకాలంలోనే పారిశ్రామికంగా కూడా పురోభివృద్ధి చెందగలదని ఆశిస్తున్నాము. ఈ శుభపరిణామానికి ఈ మధ్యనే అక్కడ నెలకొన్న పారిశ్రామిక వాటిక. అక్కడ ప్రారంభమైన సాంకేతిక విద్యా సంస్థ ఎంతైనా తోడ్పడగలనని విశ్వసిస్తున్నాము. (ఆంధ్రజ్యోతి 2-8-1961)


విశాఖ పట్నం






పెద నరవ
DWARAKA
NAGAR
ద్వారకా
నగర్
16
110
Visakhapatnam
విశాఖపట్నం
Palem
16
157
157
Gajuwaka part
గాజువాక
పార్ట్
112
120








గభీర సాగర తీరంలో, గిరిదరీ వనాంతర ప్రాంతంలో వెలసిన నగరాల దొక వింతసోయగం సీమాంత రేఖలోనున్న ప్రదేశాల దొక విశిష్ట సంస్కృతి. ఈ రెండు గుణాలు విశాఖపట్టణాని కొక విలక్షణతను చేకూర్చి పెట్టినవి.

ఆ నాడేనాడో ఇక్కడి ప్రకృతి రామణీయకం, ఇక్కడి నౌకాయాన సౌకర్యం గమనించి ఏ ఆంధ్రరాజో విశాఖస్వామి ఆలయ మొకటి ప్రతిష్ఠించెనట అది కాలగర్భంలో, ఆ సాగర గర్భంలో విలీనమైపోయినా ఆ పేర వెలసిన విశాఖపట్టణం ద్వారాచిరము, స్థిరము అయినది.

ఆ చుట్టుపట్ల జైన బౌద్ధ సంస్కృతులు మూడు పూవులు ఆరుకాయలుగా ఒకప్పుడు వర్ధిల్లినవని ఎన్నెన్ని శిథిలాలో వాకొంటున్నవి.




ఈ పట్నం ఎన్ని రాజ్యాల చేతుల మారినదో! ఎందరు రాజన్యుల ఏలుబడిలో ఎమ్మెలు పోయినదో! ఎన్ని భీకర సంగ్రామాలీ నగరం చూచినదో! ఎన్ని ఆవేదనలను, ఎన్ని ఆనందాలను, ఎన్ని కష్ట విఘ్నరాలను, ఎన్ని సుఖ సౌభాగ్యాలను కడుపున దాచుకున్నదో!

బ్రిటిష్ వారి బలగాన్నెదిరించిన గోల్గొండ పోరాటం, రంప పితూరీ లీప్రాంత సహజ పూర్వ స్వేచ్ఛా ప్రియతకు విదర్శనాలు.

ఆ తర్వాత పరవస్తు రంగాచార్యులుగారు, మారేపల్లి రామచంద్ర కవిగారు, సెట్టి లక్ష్మీనరసింహం గారి వంటి మహాపురుషు లిక్కడ సాహిత్య వ్యాసంగానికి పునరుజ్జీవనం కల్పించినారు. అడిదము.

సూరకవివంటి వారు నాటిన అంకురాన్ని పెంచిపోషించారు. ఆ సంప్రదాయ మీనాడు మొగ్గ తొడిగి 'వేయారు పువ్వులు పూస్తున్నది.

ఇక్కడి విశ్వవిద్యాలయం సాహిత్య క్షేత్రమే కాదు, కళాక్షేత్రం; రంగస్థల ప్రయోగశాల; వైజ్ఞానిక పరిశోధనా రంగం; అణు విజ్ఞానంలో కృషి సాగిస్తున్న సుక్షేత్రం. తెలుగు నేల నాలుగు చెరగులకు తావులు వెదజల్లుతున్న విద్యావన మది.





యావద్భారతంలో ఏకైకమైన నౌకా నిర్మాణ కేంద్ర మీ నగరాని కొక ఆధునికతను సంతరించినది. ఇక్కడి కాల్టెక్సు రిఫైనరీ దాని కొక పారిశ్రామిక ప్రసిద్ధినందించినది.

మొన మొన్న ఈనగరానికి పారిశుధ్య ప్రయత్నాలకు కేంద్రం సాయమివ్వ సంసిద్ధమైనట్లు ప్రకటించినది. త్వరత్వరలో ఆధునిక మహానగరం కాగల వన్నె చిన్నెలున్న పురు ప్రముఖమిది. సాంస్కృతికంగా, సాహిత్యకంగా పునర్వికసనం చెందడమే కాక, వైజ్ఞానికంగా, కళాత్మకంగా కొత్త సొరులు దిద్దుకొనడమే కాక, పారిశ్రామికంగా, ఆధునికాంధ్ర జీవననాడీ కేంద్రంగా వర్ధిల్లగలదని విశ్వసిస్తున్నాము.






అడవులు, బీళ్ళతోనిండిన ఈ ప్రాంతం ససశ్యామమై సంసత్ సమృద్ధమై నెగడిన కొలది ఈ పట్నం పెంపొందగల దన్నమాట మరువరాదు. అందుకే ఈ ప్రాంత పురోభివృద్ధికై జరిగే కృషి సఫలీకృతమై ఆంధ్రప్రదేశ్ నగరాలలో ఉజ్జ్వలంగా ఇప్పటికే వెలుగొందుతున్న ఈ పట్నం మహోజ్జ్వలంగా త్వరలో భాసిల్లగలదని నమ్ముతున్నాము.

(ఆంధ్రజ్యోతి 12-10-1961)

నెల్లూరు







67
Sri Thalpagiri
Ranganadha Swamy...
351
Sri Radhakrishna
Swimming Pool
16
BABUGIRIJANA
COLONY
Hearing
Solutions Nellore
Allipura
67
Nellore
నెల్లూరు
AL-HUDA
POLYTECHNIC...
D Mart
Narayana Medical
College And Hospital
Hotel VR Grand IN
TEL RESHMA
UM BIRIYANI
Dhanalakshmi









తెలుగునాడున నెలకొన్న నగరాలలో కొన్ని సంస్కృతికి, సాహిత్యానికి పెట్టని కోటలైతే మరి కొన్ని సకల సంపదలకు నిలయాలు. కాని, నెల్లూరు మాత్రం అటు లక్ష్మీ సదనంగా, ఇటు సరస్వతీ సంస్థానంగా కూడా వర్ధిల్లినది. అది దాని విశిష్టత.

సింహపుర ప్రాంతం అలనాడేనాడో, చరిత్ర కందని రోజు లలోనే, దేశ దేశాలలో బేరసారాలు నడిపినదని అక్కడ దొరికిన రోమన్ మాడల వంటివే నాకొన్నవి. తరువాత తరువాత సరే, అవక్ర విక్రమోపేతులైన ఖడ్గ తిక్కనలకు, అశేష శేముషీధురంధరులైన కవిబ్రహ్మతిక్కనలకు పుట్టినిల్లై తెనుగుల కత్తికి, కలానికి గల పదనునకు పర్యాయపదమైనది.






నెల్లూరనగానే అది ధాన్య లక్ష్మీ నివాసస్థానమని తెలుస్తునే వున్నది. మరి కాకిబంగార మక్కడ బంగారు పొగలకు మూలమయినది. అందువల్లనే అది ధన ధాన్య లక్ష్ములకు, భుజ మేధా సంపపత్తికి కాణాచి అంటున్నాము. ఎప్పటిమాటో కాదు, మొన మొన్న అభినవ మల్లినాథులకు అభినవ తిక్కనలకు, విమర్శక శిఖామణులకు, కవి కోకిలలకు తావలమై తావులు విరజిమ్మిన పట్టణ మది.

అముద్రిత గ్రంథ చింతామణివంటి సాహిత్య పత్రికలతో ఆరంభమై నేటివరకు అక్కడ ఎన్నెన్ని పత్రికలు వర్ధిల్లుట లేదు! ఎంద రెందరు కవులు, విమర్శకులు, ఉద్దండ పండితులు నేటికిని తెలుగు నేల రత్నగర్భ అని చాటుటలేదు?

నాటక రంగంగా ఆ నగర మెన్నడో పేరు మోసినది. ఆనాటి కబీరును తెలియని వారికి మరొక కబీరును ప్రసాదించినదా పురవరం.

రాజకీయ సాంస్కృతిక రంగాలలో ఎన్నెన్ని సువర్ణ ఘట్టాలనో చూచి పులకించినదది. వర్తక వాణిజ్య రంగాలలో దేశదేశాలకు ప్రాకినపేరది. నెల్లూరు నెరజాణలన్ననుడికారాన్ని తెనుగున కిచ్చిన పట్నమిది.






ఆధునికంగా ఆ నగర మొలతో రాణించినది. కాని ఇంకను పెంపొందుటకు తగిన ఆనుకూల్యా లెన్నో వున్న వక్కడ అభ్రకం గనులతో పాటు అందుకు అనుబంధంగా అనేక పరిశ్రమలు వెలుగొందవలసినతావది.

కొన్ని ప్రాజెక్టులు, అభివృద్ధి ప్రణాళికలు సరిగా కొనసాగితే ఆ ప్రాంతంలోని కరవు కాటకాల కిరవైనతావులు కూడా ధాన్యాగారాలు కాగలవు.






నెల్లూరు పట్టణం తగినంత దోహద ముంటే నవీన నగరాలలో తలమానికమై విలసిల్లగలదు; నవ్య నందనమై వెలుగొందగలదు; అభినవ పారిశ్రామిక కేంద్రమై రాణించగలదు. అభ్యుదయ పథంలో సయనిస్తున్న ఈ పట్టణం అనితర సాధ్య శరవేగంతో ముందున కురికి, తెనుగునాడున తన శతాబ్దులనాటి విలక్షణ తను, విశిష్టతను అలాగే నిల్పుకొని, మరింత విరిసి విప్పారగలదని ఆశిస్తున్నాము. నవనవోన్మేషమై విరాజిల్లగలదని విశ్వసిస్తున్నాము.

(ఆంధ్రజ్యోతి 2-11-1961)


విజయవాడ






236
Gunadalamaatha Shrine
గుణదలమాత ష్రైన్
Ramavarappadu Ring
రామవరప్పాడు రింగ్
DMart
డి మార్ట్
75
Vijayawada
విజయవాడ
65
16
Poranki Rural
పోరంకి రూరల్
128
TADEPALLE
తాడేపల్లి
PORANKI
పోరంకి
Penamaluru
పెనమలూరు
Pedapulipaka
పెదపులిపాక
Vaddeswaram
వడ్డేశ్వరం
151
18





విజయవాడ వచ్చిన ప్రతివారికి - గవర్నర్ కానివ్వండి, ఇతరులు కానివ్వండి - దాని పారిశుద్ధ్య పరిస్థితే కొట్టవచ్చినట్టు కానవస్తుంది, ఇరుకు సందులు, మురికి గొందులు, ఈగలు, దోమలు ముసురుతున్న చెత్తకుప్పలు, గోతులు పడిన రోడ్డు - విజయవాడ వచ్చిన ఎవరికైనా ముందుగా స్వాగతమిచ్చేవి ఇవే.

విజయవాడ అభివృద్ధి ప్రణాళికాబద్ధంగా సాగలేదు. పట్టణంలోని గృహనిర్మాణం నిర్ణీత పథకం ప్రకారం జరగలేదు. పట్టణం దాని ఇష్టం వచ్చినట్టు పెరిగిపోయింది. అందువల్లనే అందాల పట్టణంగా తీర్చిదిద్దడానికి వుండవలసిన హంగులన్నీ వున్నా, ఆంధ్ర రాష్ట్రం మొదటి గవర్నర్ శ్రీ త్రివేది పలుకులలో ఇది "మురికివాడ"గానే మిగిలిపోయింది.

ప్రక్కనే ప్రవహిస్తున్న కృష్ణానది; పట్టణం మధ్యలో కొండలు; ఎక్కడ చూచినా కాల్వలుఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి ఇన్ని హంగులున్నా, పారిశుద్ధ్యం విషయంలో మాత్రం ఇది ముందడుగు వేయలేపోతున్నది.

ఒక్క విజయవాడ మాత్రమే ఇలా వున్నదని మా అభిప్రాయం కాదు; ఆంధ్రప్రదేశ్లోని తక్కిన పట్టణాల పరిస్థితి దానికంటే భిన్నంగా వున్నదని మా ఉద్దేశం కాదు. అయితే, ఆంధ్ర దేశానికి నడిబొడ్డులో వున్న పట్టణం పారిశుద్ధ్యం పరిస్థితి కొన్ని జిల్లాలకు పట్టణం పరిస్థితి - తక్కిన పట్టణాలకంటే భిన్నంగా వుండవలదా !

పట్టణాన్ని అభివృద్ధిచేయాలని విజయవాడ పురపాలక సంఘం చాలాకాలంగా కృషి చేస్తూనే వున్నది; ఇందుకు ఏవేవో పథకాలను అమలు జరుపుతూనే వున్నది. 1960-62 సంవత్సరాల మధ్య స్పెషలాఫీసర్ పరిపాలనలో పట్టణాభివృద్ధికి కొన్ని పునాదులు పడకపోలేదు కూడా. కాని, ఆ తరువాత తిరిగి యథాస్థితి ఏర్పడింది.

కడచిన పదిహేను సంవత్సరాలుగా రాజకీయాలు కారణంగా విజయవాడలో మునిసిపల్ కౌన్సిల్ పూర్తికాలం - అయిదు సంవత్సరాలు - అధికారంలో వుండడం జరగలేదు. రెండు, మూడు సంవత్సరాలు కాగానే వర్గ రాజకీయాల కారణంగా పురపాలక ఏర్పడడం సాధారణ విషయమైపోయింది. ఇటీవలి కాలంలో విజయవాడ అభివృద్ధి కుంటువడడానికి ఇదొక కారణమని చెప్పవచ్చు. మొన్న తనకు విజయవాడ పురపాలక సంఘం చేసిన పౌర సన్మానంలో గవర్నర్ శ్రీ ఖందూభాయ్ దేశాయ్ చెప్పినట్టు, పురపాలక సంఘం వార్షికాదాయం 95 లక్షలలో సగభాగం సిబ్బంది నిర్వహణకు వ్యయం కావడం కాగా, ఆదాయం పెంపుదలకు గవర్నర్ చేసిన ఆక్ట్రాయ్ పన్ను విధింపు వంటి సూచనలలోని సాదక బాధకాలను పరిశీలించి, ఈ విషయంలో పురపాలక సంఘం ఒక నిర్ణయానికి రావలసి వుంటుంది.




పోతే, ఈ సందర్భంలోనే గవర్నర్ చేసిన మరొక సూచన ఆలోచించదగినట్టిది. విజయవాడ పెద్ద వ్యాపార కేంద్రం. ఈ పట్టణం నుంచి అమ్మకం పన్ను రూపేణా ప్రభుత్వానికి పెద్ద ఆదాయమే వస్తున్నది. గవర్నర్ సూచించినట్టు, ఈ ఆదాయంలో కొంత భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధికి కేటాయించవచ్చు. ఈ విషయాన్ని అటు రాష్ట్రప్రభుత్వం, ఇటు పురపాలక సంఘం కూడా పరిశీలించవలసివుంటుంది.

విజయవాడ పట్టణాభివృద్ధికి ఒక బృహత్ ప్రణాళికను ఏనాడో రూపొందించడం జరిగింది. దీని అమలుజరిగితే, పట్టణం రూపురేఖలు కొంతవరకు మారవచ్చు. అయితే, గవర్నర్ శ్రీ దేశాయ్ తిరిగి హెచ్చరించినట్టు నేడు నాలుగు లక్షలు మాత్రమేవున్న విజయవాడ జనాభా మరొక దశాబ్దం గడిచేసరికి రెట్టింపున్నర కావచ్చు. బృహత్ ప్రణాళికారచయితలు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొనగలరనే విశ్వసిస్తున్నాము.

డ్రెయినేజి స్కీమువలె సంవత్సరాల తరబడి కాలయాపన జరగకుండా సాధ్యమైనంత త్వరలోనే విజయవాడ అభివృద్ధికి తలపెట్టిన బృహత్ ప్రణాళిక అమలుజరగగలదని ఆశిస్తున్నాము. (ఆంధ్రజ్యోతి 10-8-1970)

ఓజియాన్ అశ్వశాలలు



ఓజియాన్ గ్రీక్ పురాణాలలో ఒక రాజు. ఈలియాన్ అనే రాజ్యాన్ని పాలిస్తూండేవాడు. ముప్పది సంవత్సరాలపాటు ఆయన అశ్వశాలను శుభ్రం చేసినవారు లేరట. నాటి నుంచి - బయల్దేరిన దుర్గంధం స్వర్గలోకంలోనివారి నాసికా పుటాలనే బ్రద్దలు గొట్టిందట. ఆ శాలలను శుభ్రం చేయడానికి పూనుకొన్న గ్రీక్ పౌరాణిక నాయకుడు, మహాబలుడు హెర్క్యులెస్ రెండు జీవనదులను వాటిలోకి మళ్ళించవలసి వచ్చిందట.





ఓజియాన్ అశ్వశాలల కంటే అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్లోని పట్టణాలు ముప్పది సంవత్సరాల నుంచి కాక, మూడు శతాబ్దాలకు పైగా వీటిని శుభ్రం చేసిన నాథుడు లేడనే చెప్పవచ్చు. రాజధాని నగరాన్ని, మరొకటి, రెండింటిని విడిచిపుచ్చితే, వీటి నుంచి వెలువడే దుర్గంధం ఇంద్రలోకాన్ని దాటి, బ్రహ్మలోకాన్ని దాటి కైలాసాన్ని దాటి, వైకుంఠం వరకు వెళ్ళి, క్షీరసాగరంలో పన్నగశాయినే బాధ పెడుతున్నదని అనుకోవచ్చు.

ఈ ఓజియాన్ గుర్రపుశాలలు శుభ్రపరచడానికి ఆంధ్రప్రదేశ్లో నదుల కొరతలేదు. గోదావరి ఉన్నది; కృష్ణ ఉన్నది; తుంగభద్ర ఉన్నది; పెన్నా నది ఉన్నది; వంశధార ఉన్నది. కాగా, కావలసింది హెర్క్యులెస్ మాత్రమే! ఆ గ్రీక్ పౌరాణిక వీరుని మహాశక్తిని, దక్షతను మన పురపాలక సంఘాల మంత్రి శ్రీ ఆలపాటి వెంకట్రామయ్య చూపించగలరా? అంత పని ఆలపాటివారు చేయగలిగితే మాత్రం ఆంధ్ర చరిత్రలో ఒక హెర్క్యులెస్ గా ఆయన మిగలడం తథ్యం. (ఆంధ్రజ్యోతి 23-7-1964)